**ఓం గణేశాయ నమః**

# బ్రహ్మసూత్ర హృదయము.

**(అధికరణవిషయములు, వైయాసికన్యాయమాలా, దాని అర్థము, భారతీ తీర్థులవారి వ్యాఖ్య, సూత్రములు, సుత్రార్థములు, సూత్రముల వ్యాఖ్య)**


**సంకలనకర్త**

**స్వామీ మేధానంద పురీ**

**కైలాసాశ్రమము, హృషీకేశ్.**

# ఆకూతము.

అతి గంభీరము సాగరమువలే నున్న భాష్యమును మంథన చేసి విద్యారణ్యులకు గురువులైన శ్రీభారతీ తీర్థ స్వాములు వైయాసిక న్యాయమాల మరియు దానితో బాటు అధికరణములకు సంక్షేప వ్యాఖ్యానము వ్రాసిరి. వ్యాకరణము, తర్కశాస్త్రము, మీమాంసాదులు చదవని వారికి, చదవలేని వారికి తేలికగా అర్థమవుటకు బ్రహ్మసూత్రములు వ్రాయుచున్నానని శ్రీభారతీ తీర్థస్వాములనిరి. ఈ మధ్య కోటగిరిలో 2-6-11 నుండ 25-6-11 వరకు దగ్గర దగ్గర రోజుకి 5 1/2 గంటల చొప్పున కొంతమంది సాధువులకు నేను బ్రహ్మసూత్రములు చెప్పినాను. వారికి చెప్పిన పద్ధతి ఏదనగా - మొదట అధికరణ విషయములు :- సంగతి, విషయము, సంశయము, పూర్వపక్షము, సిద్ధాన్తము తరువాత వైయాసిక న్యాయమాల దానికి భారతీ తీర్థస్వాములు వ్రాసిన టీకా, ఆ తరువాత నా విద్యాగురువులలో ఒకరైన మ.మం.శ్రీమత్ స్వామి విద్యానందగిరి గారు వ్రాసిన వృత్తి సహాయముతో సూత్రము, సూత్రార్థము, హిందీలోనున్న వృత్తి సంక్షేపముగా తెలుగులో అనువదించినాను. అధికరణ విషయములు, వైయాసిక న్యాయమాల, దాని టీకా మరియు దాని సూత్రములకు వృత్తి చెప్పుట వలన ఒకే విషయము నాలుగుసార్లు ఆవృత్తి గావించబడి వారికి బాగుగా అర్థమయినదని అన్నారు. అంతేగాక ఆ వినువారిలో ముఖ్యులైన స్వామి సత్యాత్మానంద గారు ఇలాగే దీనిని గ్రంథరూపములో వ్రాయమని కోరితిరి.

గత 32 సంవత్సరములుగా హృషీకేశములో ఉండి అధ్యయన, అధ్యాపనములను హిందీ భాషలో చెప్పుచూ గడుపుట వలన మా తెలుగు భాష కొంచెము కుంటుబడినది. అందులకే ఉపనిషత్తుల ఉద్ధరణముల అనువాదమునకు కొన్నిచోట్ల పెన్నెలకంటి సుందరరామ శర్మగారు వ్రాసిన బ్రహ్మసూత్రమును ఆధారముగా చేసుకుని ఆ ఉపనిషత్తుల ఉద్ధరణములు వ్రాసితిని.

అధికరణ విషయములకు విద్యానంద స్వామి వారు సదాశివ బ్రహ్మేంద్ర గారు వ్రాసిన బ్రహ్మతత్త్వప్రకాశిక అనువృత్తి మరియు వాచస్పతి గారు వ్రాసిన భామతి మరియు దాని టీకా కల్పతరు వ్యాఖ్యాన సహాయము తీసుకొనిరి. వారు హిందీలో వ్రాసిన దానిని నేను తెలుగులో వ్రాసితిని. సూత్రార్థము వ్రాయుటకు హిందీ బోలేబాబా వారి వ్యాఖ్యానము యొక్క సహాయము తీసుకొనినాను. ఇంతమంది నుండి స్వీకరించిన విషయాలను ఇచ్చట సమావేశపరచుటచే దానిని సంకలనమందురు. సత్యాత్మానంద గారు అన్నట్లు దీనికి 'బ్రహ్మసూత్ర హృదయము' అను పేరు సబబుగా ఉండును. మేము వర్డ్‌లో టైపు చేసిన దానిని అర్థము చేసుకుంటూ చక్కగా తిరిగి యూనికోడ్లో టైపు చేసి దానిని సరియైన పేజిరూపములో తీసుకు వచ్చిన స్వామి పరమానంద గారికి ధన్యవాదములు. వీరితో పాటు 72వ సూత్రమువరకు చేతితోవ్రాసిన స్వామి దేవానంద గారికి గూడ ధన్యవాదములు. ముందు ప్రచురణ అయిన దానికి సహాయము చేయు వారికి ఆశీర్వాదములు. దీనిని చదివిన ఒక్కరైనను శ్రవణ మననాదులు చేసిన నా ఈ కృషి సఫలమైనదని తలుస్తాను.

5-8-13

శ్రావణశుక్ల షష్ఠీ

భవదీయ

స్వామి మేధానంద పురీ

కైలాసాశ్రమము, ప్రధానాచార్యులు

మునికిరేతి, హృషీకేశ్- 249137.

# ఉపోద్ఘాతము

శ్రీ శంకర భగవత్పాదులు అభ్యుదయ నిశ్రేయసములకు హేతువు ధర్మమని చెబుతో ఆ ధర్మము వేదోక్తమని చెప్పుటవలన ధర్మార్థకామమొక్షములు అను నాలుగు పురుషార్థములు వేదప్రతిపాద్యములే అగును. అర్థకామరూపమైన అభ్యుదయహేతువును ప్రవృత్తి ధర్మము మనియు మోక్షరూపమైన నిశ్శ్రేయసమునకు నివృత్తి ధర్మమని పేర్లు.

మొక్షమనబడే నిశ్శ్రేయసమునకు మార్గములుగా షడ్దర్శనములు గలవు. అవి న్యాయవైశేషికములు సాంఖ్యయోగములు మరియు పూర్వమీమాంసా వేదాన్తములు. క్రమముగా వీనిపై సూత్రములు రచించినవారు గౌతముఢు, కాణాదుడు, కపిలుడు, పతంజలి,జైమిని, వేదవ్యాసులు. వీనిలో వేదాంతవాక్యాలను పూర్తిగా ప్రమాణంగా స్వీకరించేవి మిమాంసా వేదాంతదర్శనాలు రెండే. మిగిలిన నాలుగు దర్శనములు వేదప్రమాణ్యాన్ని అంగీకరించినా వారి వారి స్వతంత్ర చింతనయే అందులో విశేషముగా కనబడును.

వేద ప్రమాణ్యాన్ని పూర్తిగా అంగికరించిన మీమాంస వేదవిహితమైన యజ్ఞాది కర్మలే ముఖ్యమని కర్మని విధించని లేక కర్మకు సంబంధించని వేదవాక్యములన్నింటి ప్రయోజనము అర్థవాదమేనని (స్తుతిపరములే) నమ్ముతుంది. దానికి ప్రసిద్ధఉదాహరణము కఠోపనిషత్తు శ్రాద్ధసమయములోనే చదువలయుననుట. మీమాంసలో ఉపనిషత్తులన్నీ ఇలాంటి అర్థవాదమే అనుచున్నవని చెప్పుచూ జైమిని మహర్షి ఈ సూత్రమును చెప్పెను. “ఆమ్నాయస్య క్రియార్థత్వాత్ ఆనార్థక్యం అతదర్థానామ్”.

శ్రీశంకరభగవత్పాదులు వేదతాత్పర్యము ముఖ్యముగా ఉపనిషత్ ప్రతిపాద్యమైన బ్రహ్మమేననిరి. సంహితా, బ్రాహ్మణ, ఆరణ్యకములలో చెప్పబడిన కర్మములు ఉపాసనములు అన్నియు ఈశ్వరార్పణబుద్ధితో అనుష్టించిన చిత్తశుద్ధి కలిగి తద్వారా బ్రహ్మవిచారమునకు యోగ్యత కలగించును. ఈ విధముగా చెప్పి తన వేదాంత దర్శనమును బ్రహ్మసూత్రభాష్యంగా ప్రదర్శిస్తారు. “ఆత్మైకత్వ విద్యా ప్రతిపత్తయే సర్వేవేదాన్తాః ఆరభ్యంతే. యథా చ అయమర్థః సర్వేషాం వేదాంతానాం తథా వయమస్యాం శారీరిక మీమాంసాయాం ( ఈ బ్రహ్మ సూత్రములలో) ప్రదర్శయిష్యామః”. ‘ఆత్మ బ్రహ్మల ఏకత్వము కొరకు అన్ని వేదాంతములు ఆరంభించిరి. ఏలాగున ఈ ఎకత్వ భోధ కలుగునో ఆలాగుననే అన్ని వేదాంత వాక్యముల విచారము ఈ శారీరిక మీమాంసాలో చూపించెదము.

ఈ బ్రహ్మ సూత్రముల పరిచయము ప్రశ్నోత్తరరూపముగా నున్న విషయము స్పష్టముగా ఉండును మరియు గ్రాహ్యముగానుండును.

1) ప్రశ్న:- ఈ బ్రహ్మ సూత్రములు ఎందుకు వ్రాసిరి?

వ్యాసులు వారు ఎందుకు వ్రాసిరో చెప్పుట కష్టము. ఎందుకనగా ఈసూత్రములపై ప్రసిద్ధిలో పదివరకూ భాష్యములున్నవి. అందరికీ తెలిసినవి శంకర, రామానుజ, మధ్వభాష్యాలే కాక వల్లభాచార్యులు, భాస్కరులు, నింబార్కులూ, బలదేవుడూ మొదలైన వారు వారి వారి సిద్ధాంతాలను ప్రతిపాదిస్తూ భాష్యాలు వ్రాసారు. సూత్రాముల సంఖ్య, వాటి స్వరూపమూ, పూర్వపక్షము, సిద్ధాంతము, ఒకటిగానుండవు. అన్నీ వేదాంతముకన్నా భిన్నములే. భగవత్పాదుల ప్రకారము సూత్రములు వేదాలలోనున్న కర్మప్రాధాన్యాని తొలగించి జ్ఞానప్రధాన్యాని స్థాపించడానికి ఉద్దేశింపబడినవి. ఆవిధముగానే వారు వారి భాష్యములో ప్రదర్శిస్తారు.

2 ) ప్రశ్న:- విచారణీయ విషయము వేదాంతము, అంటే ఉపనిషత్తులు. వ్రాయబోయే విషయము బ్రహ్మ విచారము. (అథాతో బ్రహ్మ జ్ఞిజ్ఞాసా.) ప్రారంభమేమో అధ్యాసగురించి. ఈ మూడింటికి పొంతన ఎక్కడ?

బంధనము మిథ్య, భ్రాంతి అయిననే ఈ మూడింటికికీ పొంతన కుదురును. ఆభ్రాంతికే అధ్యాస అని అవిద్య అని, అజ్ఞానమని కూడ వ్యవహరింతురు. 'తత్ త్వమసి' అని ఛాంద్యోగ్యోపనిషత్తు ఉపదేశము. 'అహం బ్రహ్మాస్మి' అని బృహదారణ్యకములో అనుభవము. జన్మించి మరణించు శరీరముగానీ, ఆకలిదప్పులు గల ప్రాణముగానీ, సుఖదుఃఖాలు అనుభవించేమనస్సునీ, అవమాన సన్మానములు అనుభవించు అహంకారం గానీ నేను కాదు. వీనికన్నింటికీ అతీతమైన బ్రహ్మమునే నేను అనుజ్ఞానము వలన మొక్షము కలుగును. శరీరాదులేనేను అను భ్రాంతి అవిద్య అది ఉన్నంతకాలం జన్మ మృత్యువుల రూపమైన సంసారచక్రంలో పరిభ్రమిస్తూనే ఉండాలి.

ఆ శరీరాది భ్రాంతి తొలగించుకొనుటకు బ్రహ్మవిచారము. ఆ బ్రహ్మ విచారానికి విషయము ఉపనిషద్వాక్యాలు. ఆభ్రాంతి స్వరూపనిరూపాణానికి అధ్యాస్యభాష్యము.

3) ఈ అధ్యాస బ్రహ్మవిచారంలో ఎన్ని రకాలుగా చెప్పబడును?

దర్శనప్రస్థానమైన ఈ బ్రహ్మసూత్రములను అర్ధము చేసుకొనుటకు ముందు అధ్యాసము గురించి చక్కని అవగాహన ఉండవలయును. "యుష్మత్ అస్మత్ ప్రత్యయగోచరయోః" అనుభాష్యములో పరాగధ్యాసను ప్రత్యగధ్యాసను భాష్యంలోనే భాష్యకారులే ప్రదర్శిస్తారు. ఉన్నది బ్రహ్మచైతన్యము ఒకటే. అయినా శరీరంనుంచి అహంకారమువరకు ఆబ్రహ్మచైతన్యముమీద ఆరోపించి నేను అని వ్యవహారము చేయుటనే ప్రత్యగధ్యాస అందురు.

(వీనిలో మొదటిది ప్రత్యగధ్యాసము. జడచేతనముల తాదాత్మ్యముల ద్వారా ఏర్పడు అహం బుద్ధిని పత్యగధ్యాసమందురు.) ఈ నేను కన్న భిన్నమైనవన్నీ ఆబ్రహ్మచైతన్యముమీద ఆరోపింపబడి పరాగధ్యాసక జరుగుచున్నది. అంతేగాక ఈనేను అను అహంకారము శరీరము వరకేగాక పుత్రమిత్రకళత్రక్షేత్రాదుల వరకు వ్యాపించుచున్నది గనుక పరాగధ్యాసకు అంతగా ప్రాముఖ్యముండదు. పుత్రాదుల దుఖఃమును తనమీదనే ఆరోపించుకొనును. తరువాతది జ్ఞానాధ్యాసము, సర్ప జ్ఞానమును జ్ఞానాధ్యాసమందురు. .

జ్ఞానాధ్యాసము, కనిపించిన పాము ద్వార కలుగు జ్ఞానమును జ్ఞానాధ్యాస మందురు.అనిర్వచనీయ సర్పమును అర్థాధ్యాసమందురు. ఆత్మయందు అనాత్మను అధ్యసించిన అచట స్వరూపాధ్యాసము మరియు సంసర్గాధ్యాసము కలదు.(ఇదం రజతం) .కాని అనాత్మ బుద్ధ్యాదుల యందు ఆత్మను అధ్యసించిన సంసర్గాధ్యాసమే కలదు గాని స్వరూపాధ్యాసము లేదు.(రజతమిదం). అందువల్లే సాక్షి ఆత్మయందు ఆరోపించిన శరీర బుద్ధ్యాదులు అనిత్యమైనను, అనాత్మమైన బుద్ధ్యాదుల యందు ఆత్మను ఆరోపించినను ఆత్మ అనిత్యముగాదు. ఆపైన ధర్మాధ్యాసము, ధర్మి అధ్యాసము. ఇనుప గుండును అగ్నిలో వేసిన అది ఎర్రగా మారును. అనగా అగ్ని ధర్మమును ఇనుపగుండు స్వీకరించెను. ఇనుపగుండు ధర్మమును అగ్ని స్వీకరించెను గుండ్రముగా

కానవచ్చుటను ధర్మి అధ్యాసమందురు. అగ్నియందు గల దాహక శక్తి అను ధర్మము ఇనుములో కనుపించును. దీనిని ధర్మాధ్యాసమందురు. ధర్మము గల దానిని ధర్మియని అందురు. ఇచ్చట ధర్మి ధర్మములు ఇనుము యందు అగ్నివి కనిపించుచున్నవి. అట్లే ఇనుము యొక్క ధర్మము అగ్నియందు కనిపించుచున్నది. ఇదే విధముగా మొత్తము ప్రపంచమునందు ఉన్నవి జడచేతనములు రెండే అయినను ఇతరేతర అధ్యాసము వలన సర్వానర్థములు కలుగుచున్నవి. ఆఖరిది సోపాధికాధ్యాసము నిరుపాధిక అధ్యాసము. పరీక్షద్వారా త్రాడు అనే జ్ఞానం కలుగగానే పాము అనే భ్రాంతి పూర్తిగా తొలగినట్లు వేదాంతవిచారము ద్వారా జీవుడు తాను బ్రహ్మమని తెలిసికొనును. ఇచట త్రాడుకు పామునకుగాని, జీవబ్రహ్మములకుగాని మధ్యలో ఉపాధి లేకపోవుటవలన దీనిని నిరుపాధికాధ్యసమందురు. అంతఃకరణమనే ఉపాధి ఉన్నంతవరకు బ్రహ్మ జ్ఞానము కలిగినా జీవజగత్తుల భోధ తొలగదని చెప్పుటకు ఈసొపాధికాధ్యాసమును చెప్పదురు. ఉదాహరణకు ఎడారిలో ఎండమావులు కనబడుచున్నవి. మొదట అచట నీరు కలదని భ్రమ పడెదము కాని తరువాత అది ఎండమావి అని గుర్తించినను మధ్యహ్న సూర్యుని ప్రతాపమున్నవరకు ఎండమావులు కనబడుచునే యుండును. ఇచట ఎడారిలోని ఎండ ఉపాధి. అలాగుననే చెరువుగట్టున ఉన్న రావి చెట్టు చెరువు నీటిలో తలక్రిందులుగా ప్రతిఫలించును. ఆచెట్టు తలక్రిందులుగా ఉన్నదను భ్రాంతి కలిగిననూ గట్టుమీది చెట్టును చూడగనే చెట్టు తలక్రిందులుగా ఉన్నదను భ్రాంతి తొలగును. అయినా చెరువులో నీరు ఉన్నంతకాలము ఆ చెట్టు తలక్రిందులుగా కనబడుచునే యుండును. ఈభ్రాంతికి చెరువు నీరు ఉపాధి. ఇది సొపాధిక అధ్యాసము. అవిద్యాలేశము, ప్రారబ్ధశేషము, మొదలైనవి చెప్పి జీవన్ముక్తిని నిరూపించుటకు ఈ సొపాధికాధ్యాసమునుపయోగింతురు. ఈఅధ్యాసములలో ఏది దేనిమీద ఆరోపించుచున్నాము అను విపేచన చేయుట సాధకులకు ఉపకారి. సోపాధిక అధ్యాసమునకు ఇంకొక ఉదాహరణ. స్పటికములో ఎర్రమందార పువ్వు ప్రతిబింబించి స్పటికము ఎర్రగా కనిపించును. దీనిని సోపాధికాధ్యాసమందురు. ఆత్మ, మనస్సులు వేరైనను దగ్గరగా ఉండుట వలన పువ్వు స్థానములో ఉన్న ఆత్మలో మనస్సు ఆరోపింపబడుచున్నది. కర్తృత్వ, భోక్తృ త్వములు మనస్సువే గాని ఆత్మవి గావని చెప్పుటకు మరియు మనస్సుతో పోల్చినస్పటికమను ఉపాధి ఉన్న వరకు జ్ఞానికి జీవ జగత్తుల భోధ తొలగదని చెప్పుటకు ఈ అధ్యాసము చెప్పబడినది. ఎందులకనగా ఆత్మ అసంగము గనుక.

5 ) జీవుధు అహంకారము ఈరెండింటికి ఏమి సంబంధము?

రెండు శబ్దాలు నేను బ్రహ్మముకన్నా వేరు అనే ఉద్దేశముతోనే ప్రయోగంలోకి వస్తాయి. అహం అంటే నేను అని అర్థము. దానికి భావ వాచకము అహంకారము, అహంత, అస్మిత, అని సూక్ష్మఅర్థభేధముతో వేరే వేరే శబ్దాలు. బ్రహ్మము ఒకటే చైతన్యమవుటవలన ఆబ్రహ్మము తప్ప వేరొకటి వాస్తవముగా లేకపోవుటచేత ఈఅహంకారాది శబ్దాలన్నీ బ్రహ్మభిన్నమునే సూచించు చున్నందున ఇవి జడవిభాగంలోకి వస్తాయి. జీవుడు చైతన్యమగుటవలననూ నిజముగా బ్రహ్మమే అగుటవలననూ భ్రాంతివల్ల జీవునిగా వ్యవహరించుచున్నాడు. కాన జీవుడు అహంకారము ఒకటే అర్థమును సూచించుచున్నవి. దానిలో చైతన్యాంశమును ప్రధానముగా ఉద్దేశించినపుడు జీవుడనియూ జడాంశమును ప్రధానముగా ఉద్దేశించినపుడు అహంకారమని చెప్పుతున్నటుల సష్టమగుచున్నది. వేరొకవిధముగా చూచిన కర్తృత్వ భోక్తృత్వాలు జీవునికి అహంకారానికి సామాన్య ధర్మములు. కాన ఈరెండు శబ్దములకూ ధర్మి ఒకటే అని తేటతెల్లమగుచున్నది.

5 )ఈ అధ్యాస జ్ఞానాన్ని బ్రహ్మజ్ఞానాన్ని నిత్యజీవితములో అభ్యసించుట ఎట్లు?

వేదాంత వాక్యముల విచారము చేయవలయును. దానికి వివేక వైరాగ్యములు అవసరము. అవి చిత్తశుద్ధి లేనిచో ధృఢపడవు. చిత్తశుద్ధి కొరకు ఉపాసనచేయవలయును మరియు నిష్కామకర్మయోగము చేయవలయును. దానికి స్వధర్మాచరణము ముఖ్యము. తురీయాశ్రమమను స్వికరించలేనివారు వారు చేయు కర్మలను ఈశ్వరార్పణ బుద్ధితో చేసిననూ చిత్తశుద్ధి కలుగును. ఈశ్వరార్పణ బుద్ధి, నిరహంకారతా, కర్మఫలత్యాగము, సుఖదుఃఖములయందు సమత్వ భావము మరియు శాస్త్రములయందు పూర్ణ విశ్వాసము ఈ ఐదు నియమములు కర్మయోగనునకు అత్యావశ్యకములు.

ఈ అధ్యాసమే గాక ఆత్మ, పరమాత్మలు ఏకమైనను ఐదు రకముల భ్రమ కలుగుచున్నది. ఈశ్వరజీవ భేదము, జీవ జీవభేదము, జీవ జడభేదము, ఈశ్వర జడ భేదము, జడజడభేదము

1. ఈశ్వర జీవ భిన్నత్వము నివృత్తికై బింబప్రతిబింబ దృష్టాంతము యుక్తి యుక్తము. ఈశ్వర ప్రతిబింబమే జీవుడు గాని, ఆ పరమేశ్వర చైతన్యము కన్న ఆత్మ చైతన్యము వేరుగాదు.

2. జీవ జీవ భేద నివృత్తికి ఘటాకాశ మఠాకాశ దృష్టాంతము యుక్తి యుక్తము.

3. జీవ జడ భేదము, జడ జడ భేదము, ఈశ్వర జడ భేద నివృత్తికై స్వప్న ద ష్టాంతము యుక్తి యుక్తము.

సోపాధిక ద ష్టాంతమును చెప్పిన తరువాత నిరుపాధిక దృష్టాంతమేదని ప్రశ్నరాగా దానికుత్తరము త్రాటి యందు పాము భ్రమ. ఈ విధముగా దగ్గర దగ్గర పది రకముల అధ్యాసము చెప్పబడనది. మూలాజ్ఞానము నివారణకై శ్రవణ మనన నిదిధ్యాసనములు చేసి జ్ఞానము (మోక్షము) సంపాదించవలయును. శ్రవణమనగా

శ్లో|| శృతిలింగాది న్యాయ శబ్ధ శక్తి వివేక కృత్

త్రైః వేదాంతానాం బ్రహ్మాత్మని తాత్పర్య నిర్ణయః (శ్రవణము)

శృతి లింగాది న్యాయమనగా షడ్విధ తాత్పర్య గ్రాహక లింగముల ద్వారా ఆత్మ బ్రహ్మల ఏకత్వ నిర్ణయము.

శ్లో|| ఉపక్రమోపసంహార అభ్యాసాపూర్వతా ఫలమ్| అర్థవాదోపపత్తిశ్చేతి షడ్విధ తాత్పర్య గ్రాహక లింగాణి||

ఈ ఆరు లింగముల ద్వారా వేదవాక్యముల శబ్ధశక్తి అద్వైత బ్రహ్మములోనే కలదని నిశ్చయము శ్రవణము. ఈ శ్రవణము అపరోక్ష జ్ఞానమునకు ప్రమాణ విషయము. కనుక దీనిని అంగి అందురు.

నిర్వచనము : వేదాంతేన ప్రతిపాద్యో యోఽర్థః బ్రహ్మాత్మా తస్య యుక్తిభిః సంభావనా మననం|

ఇది ప్రమేయ విషయము. శృతి మతానుసారము తర్కములను గ్రహించి జగత్ మిథ్యాత్వము నిర్ణయించుకుని పరబ్రహ్మమునే ఏకధారగా చింతన చేయుటయే మననము.

నిర్వచనము: శ్రవణమననే శమాది యుక్తే కృత్వా స్థిరస్య వాక్యార్థః జ్ఞానాంతరాయ రహితస్య అనాయాసేన యో వాక్యార్థ బోధో జాయతే సైవ నిదిధ్యాసనమ్॥

శ్రవణ మననముల తరువాత ఇంద్రియ మనస్సులను నిగ్రహించుకొని మహావాక్యార్థమును అంతరాయ రహితముగా చింతన చేయుచు ఏ వాక్యార్థము అనుభవములోనికి వచ్చునో దానిసే నిదిధ్యాసనమందురు.

( అంతరాయః అంటే ప్రతిబంధము.) అది అజ్ఞాన సంశయ, విపర్యయ భేదముల కన్న పేరైనది. స్వ స్వరూపానుభవము అనగా అజ్ఞానము, సంశయము, విపరీత భావనలేని శుద్ధ బ్రహ్మాత్మ జ్ఞానము అని అర్థము.

జ్ఞానయోగము :

జ్ఞానమునకు నిర్వచనము - 'జ్ఞానం శాస్త్రతః ఆచర్యతశ్చ ఆత్మాదిపదార్థానాం అవగమః, అవగతానాం ఇంద్రియాద్యుపసంహారేణ ఏకాగ్రతయా స్వాత్మసంవేద్యతాపాదనం యోగః || గీ.భాష్యం -16.1

శాస్త్రము మరియు గురువుల ద్వారా ఆత్మాది పదార్థములను తెలుసుకొనుటను జ్ఞానమందురు. తెలుసుకున్న ఆత్మ, బ్రహ్మ, జగత్తు, మాయ వాని సంబంధములు విచారించి ఇంద్రియముల నిగ్రహము ద్వారా మనస్సుని ఏకాగ్రము గావించుకుని బ్రహ్మాత్మైక్యమును అపరోక్షానురూపముగా అనుభవించుటను జ్ఞానయోగమందురు. ఆత్మ విచారము చేయునపుడు మనస్సు నిదురలో లీనము కారాదు, మరియు విషయాకారమును గూడ పొందకూడదు. అప్పుడే బ్రహ్మ చింతనమగును. దానికే శ్రవణ, మనన, నిదిధ్యాసనములు. శ్రవణాదుల వల్ల మనస్సు స్వాభావిక ప్రవృత్తి నుండి విముఖమగును. అద్దము ముందు ఒక వస్తువునుంచిన అది దానిలో ప్రతిబింబించును. అదే అద్దమునందు ఏ వస్తువు లేనిచో వ్యాపకమైన ఆకాశము ప్రతిబింబించును. అట్లే అనేక జన్మల సంస్కారములతో కూడిన ఈ మనస్సు ఏ విషయాకారమును పొందనిచో బ్రహ్మ వ్యాపకమగును.

సంశయము :

జ్ఞాన ఆత్మలు రెండున్నూ నిరాకారమైన భావనా నిష్ఠ ఎట్లు కలుగును? గీ.భాష్యం (18.50)

జవాబు :

అత్యంత నిర్మలత్వము, స్వచ్ఛత్వము, సూక్ష్మత్వము ఆత్మ బుద్ధులకు యుక్తి సంగతంమగుట వలన, ఈ బుద్ధి ఆత్మ సమమైన నిర్మలత్వము పొందుట వలనను, ఆత్మ చైతన్యాకార భాసత్వము మనసులో కలుగును. ఈ జ్ఞానమునకు "బాహ్యకార భేద బుద్ధి నివృత్తిరేవ ఆత్మ స్వరూపాలంబన కారణమ్". "జ్ఞానే యత్నో న కర్తవ్యః కింతు అనాత్మ బుద్ధి నివృత్తౌ ఏవ, తస్మాద్ జ్ఞాననిష్ఠా సుసంపాద్యా" ప్రయత్నము చేయనవసరము లేదు కాని అనాత్మ బుద్ధిని నివారించవలయును. అందులకే జ్ఞాన నిష్ఠ సుసంపాద్యము అనిరి. "అనాది రనన్తో నైసర్గికోఽధ్యాసో మిథ్యా ప్రత్యయరూపః కర్తృత్వ, భోక్తృత్వ, ప్రవర్తకః సర్వలోక ప్రత్యక్షః అస్య అనర్థ హేతోః ప్రహాణాయ ఆత్మైకత్వ విద్యాప్రతిపత్తయే సర్వే వేదాన్తాః ఆరభ్యన్తే" "బ్రహ్మసూత్ర.అధ్యాస భాష్యం."

ప్రవాహరూపములో అనాదిగా వచ్చు ఈ అధ్యాసము స్వాభావికము. ఈ అధ్యాసము తత్వజ్ఞానము వల్లనే నశించును. దేని స్వరూపము మాయవల్ల కనుపించుచున్నదో అదే ఈ కార్యప్రపంచము దానిసే మిథ్య అందురు. అదే ఈ కర్తృత్వ, భోక్తృత్వములకు ప్రవర్తకము. గాఢనిద్రలో ప్రతివారు ఆత్మానుభవమును అనుభవించుచున్నారు గాని ప్రపంచ భావము లేదు. అందుకని మాండూక్యకారికలో "జాగ్రతవస్థా మిథ్యా

దృశ్యత్వాత్ స్వప్నవత్" అను తర్కమును చెప్పిరి. ఏ విధముగా స్వప్నమును చూచుచు అది లేదు అని జాగ్రత్తలో చెప్పునో చూడబడునది లేదు అని. అదే విధముగా ఈ జాగ్రత్తును చూచు దృక్ స్వరూపుడవు నువ్వు దృశ్యప్రపంచము లేదు.ఇది సర్వలోక ప్రత్యక్షము. ఈ కర్తృత్వాది అధ్యాసమే అనర్థకారణము. ఈ అనర్థకారణమును నివారించుటకు, ఆత్మైక్య జ్ఞానమును పొందుటకు, వేదాంతమును ఉపనిషత్ వాక్యముల ద్వారా శ్రవణ, మనన, నిదిధ్యాసనములు చేయుటకు, ఈ బ్రహ్మ సూత్రములు ఆరంభించిరి. శ్రవణముతో కూడిన విచారము ఐక్యబోధకు తోడ్పడును.

నిజముగా చెప్పవలయుననిన ప్రతి ఒక్కరు ప్రతిరోజు బ్రహ్మలో ప్రవేశించుచున్నారు. అందుకనే శృతిలో "అహరహః బ్రహ్మ గమయతి" అనిరి. గాఢ నిద్రలో ఆత్మానందమును అనుభవించి నిద్రలేవగానే పూర్వవాసనల అనుసారము ప్రాపంచిక వ్యావహారములో చిక్కుకొనుచున్నారు. దీనికి మూడు ఉదాహరణములు చెప్పవచ్చును. మొదటిది ఉన్నది ఒక్కటే బ్రహ్మరూపమైన ఆత్మ అని చెప్పుటకు. సాధారణంగా త్రోవలో మనము గుంటలు చూసెదము. దాని యందు వ్యాపకమైన ఆకాశము గలదు. వర్షము నీరు వానిలో చేరును. ఆ నీటిలో మరల ఆకాశము ప్రతిబింబించును. అట్లే ఒకే ఆత్మలో కర్మల వల్ల మనస్సు ఏర్పడుచున్నది. ఏర్పడిన మనస్సులో మరల ఆ ఆత్మే ప్రతిబింబించుచున్నది. ఇచ్చట శాస్త్ర దృష్టిలో చూచిన గాఢ నిద్రయందు మూడు వస్తువులను ఒప్పుకొనవలయును. మొదటిది అధిష్ఠాన రూపములో నున్న ఆత్మ చైతన్యము. రెండవది ప్రాతిభాసిక చైతన్యము అనగా ప్రతిబింబించిన చైతన్యము. మూడవది అజ్ఞాన వృత్తి. నిద్రలో ఉపనిషత్తులో చెప్పినట్లు "సతా సోమ్య తదా సంపన్నో భవతి" సదాత్మతో ఒక్కటైనను జాగ్రత్తలో అనుభవమునకు వచ్చుటలేదు. దానికి ఉదాహరణము దీపము. దీపము వెలిగించి దాని మీద చిమ్ని ఉంచి దీపము దగ్గర కూర్చొనిన దీపము యొక్క వెలుతురు, వేడి అనుభవములోకి వచ్చును, గాని దీపశిఖను ముట్టుకొనలేము. అట్లే చిమ్ని స్థానములోనున్న అజ్ఞానవృత్తి బ్రహ్మనుండి  జీవచైతన్యమును వేరుచేయుచున్నది.

మరొక ఉదాహరణ :

పెద్దపాత్రలో చల్లని నీరు తీసుకుని దానిలో వేడి  నీరు పోసిన సీసా దారముతో కట్టి వదిలిన సీసాలో ఉన్న నీరు చల్లబడునే గాని, సీసాలోని నీరు పాత్రలోకి కాని, పాత్రలో నీరు సీసాలోకి రావు. దారముతో సీసాను వేరు చేయవచ్చును. ఈ దారమే ఇచ్ఛా, కోరికలు, తృష్ణా లాంటిది. దీనినే కామమందురు. నిద్రలో శరీర, ఇంద్రియ, మనస్సులు పని చేయకపోయినను, సుఖానుభవము ఆత్మ ద్వారా  కలుగుచున్నది. కాని జాగ్రత్తలో ఆత్మానుభవము కుంటుబడి, శరీర, ఇంద్రియమనస్సుల అనుభవమే సుఖ దుఃఖ రూపముగా పొందుచున్నారు.. అందుకనే ప్రతివారు పరమాత్మను చూడలేదని చెప్పుదురు. అది సరికాదు. ఆత్మ రూపములో నున్న పరమాత్మను ప్రతిరోజు అనుభవించుచున్నారు. ఇంకా స్పష్టముగా అంధకారములో నిదురించిన వ్యక్తి స్వప్నములో ప్రకాశము చూచుచున్నాడు. అది ఆత్మ ప్రకాశమే వేరుకాదు. మనస్సును ఏకాగ్రము చేసుకుని వేదాంత వాక్యముల ద్వార  బ్రహ్మ విచారము చేయుటయే జ్ఞాన మార్గము. ఈ జ్ఞానమునకు అంతరంగ సాధనములు, శ్రద్ధ, శమదమాదులు మరియు శ్రవణ, మనన, నిదిధ్యాసనములు.

సంస్కృ త భాష రాని వారికి, మరియు శాస్త్రాంగములైన వ్యాకరణ న్యాయా(తర్కము)దులలో ప్రవేశము లేని వారికి విద్యారణ్యగురువులైన భారతీ తీర్థస్వాముల వారు తేలిక భాషలో వైయాసిక న్యాయమాల రచించిరి.

దానిని గూడ చదివి అవగాహన చేసుకొనలేని వారికి తెలుగు అనువాదమును ప్రారంభించితిని. దానితో బాటు సూత్రార్థములు మరియు అధికరణ విషయములైన విషయము, సంగతి, సంశయము, పూర్వపక్షము, సిద్ధాంతము అనునవి గూడ జోడించితిమి. సూత్రార్థములు మరియు అధికరణ విషయములు బ్రహ్మవిద్యా పీఠము యొక్క పదవ పీఠాధిపతులైన స్వామి విద్యానందగిరి వారి బ్రహ్మసూత్రముల హిందీ అనువాదము నుండి గ్రహించడమైనది.

స్వామి మేధానందపురి

కైలాసాశ్రమము,హృషికేశ్

*******

# బ్రహ్మసూత్ర వృత్తితోసహ్ వైయాసికన్యాయమాలా

వేదవ్యాస భగవానుల ద్వారా రచించబడిన వేదాన్త వాక్యార్థములు నిర్ణయించు అధికరణములకు వైయాసిక న్యాయములందురు. ఆ న్యాయములను క్రమబద్ధముగా నుంచుటచే అది ఒక మాల రూపము ధరించినది. అందువల్ల ఈ గ్రంధమును వైయాసిక న్యాయమాలందురు.

వ్రాయదలచిన గ్రంథము అవిఘ్నముగా పూర్తి చేయుటకు మరియు ప్రసిద్ధి చెందుటకు దానితో పాటు శిష్టుల ఆచరించుటకు విశేషమైన ఇష్టదేవత రూప తత్త్వమైన ఉపాధి రూపములో నున్న గురుమూర్తికి నమస్కరించి గ్రంధ విషయమును ప్రతిజ్ఞచేసి చెప్పుచున్నారు.

1. శ్లో|| ప్రణమ్య పరమాత్మానం శ్రీవిద్యాతీర్థ రూపిణమ్।

వైయాసికన్యాయమాలా శ్లోకైః సంగృహ్యతే స్ఫుటమ్ ॥

వ్యాసుల వారి ద్వార చెప్పబడిన దానిని 'వైయాసికీ' అందురు. వేదాన్త వ్యాక్యములను నిర్ణయించు అధికరణములను న్యాయములందురు. వానిని క్రమముగా కూర్చుటను మాల అందురు. సూత్రకారులు, భాష్యకారులు (ఆది శంకరులు) విస్తారముగా చెప్పినను సూత్రాదులు, వ్యాకరణాదులు చదివిన విద్వాంసులకే భోదపడును గనుక మందబుద్ధిగల వారిని అనుగ్రహించుటకు (వ్యాకరణ, న్యాయ, మీమాంసలు చదువని వారికై) శ్లోకముల ద్వారా ఈ మాలను స్పష్టముగా సంక్షేపముగా చెప్పుచున్నారు. (భారతీ తీర్థ స్వాముల వచనమిది.)

2. శ్లో|| ఏకో విషయ సందేహ పూర్వ పక్షావభాసకః|

శ్లోకోఽపరస్తు సిద్ధాన్త వాదీ సంగతయః స్ఫుటా||

ఒక్కొక్క అధికరణములో ఐదు అవయవములు గలవు. విషయము, సందేహము, సంగతి, పూర్వపక్షము మరియు సిద్ధాంతము అనునవి. వాని యొక్క సంక్షేప రూపము చెప్పుచున్నారు.

ప్రత్యేక అధికరణ సంగ్రహమునకు రెండు రెండు శ్లోకములు చెప్పెదరు. ప్రథమ శ్లోకములోని పూర్వార్ధము ద్వారా విషయము మరియు సంశయము అను రెండు అధికరణ అంశములు చెప్పబడినవి. ఉత్తరార్ధము ద్వారా ఒక అంశము చెప్పిరి అది పూర్వపక్షము. రెండవ శ్లోకములో సిద్ధాంతపక్ష నిరూపణము. సంగతి అను ఒక అవయవము మిగులును. దాని నిరూపణము వైయాసిక న్యాయమాలలో విడిగా చెప్పలేదు. విద్వాంసులు స్వయముగా సంగతిని కల్పన చేసి కొనగలరు. ఒక్కొక్కసారి సంగతిని గ్రంధకర్త (భారతీ తీర్థస్వాములు) సూచించెదరు.

3. శ్లో|| శా స్త్రేఽఅధ్యాయే తథాపాదే న్యాయ సంగతయస్త్రిధా|

శాస్త్రాది విషయే జ్ఞాతే తత్తత్సంగతి రూహ్యతామ్||

సంగతి యొక్క విభాగములను ప్రతిపాదించుచున్నారు. శాస్త్రసంగతి అధ్యాయ సంగతి, పాదమునకు సంబంధించిన న్యాయ సంగతి అని మూడు రకముల సంగతులు. శాస్త్రాదుల జ్ఞానముండిన సంగతి కల్పన పాఠకులు స్వయముగా చేసికొనగలరు. శాస్త్రము ద్వారా ప్రతిపాద్య సంగతి, అధ్యాయము ద్వారా ప్రతిపాద్య సంగతి మరియు పాద ప్రతిపాద్య సంగతి. ఈ విధముగా మూడు సంగతులను వ్యుత్పన్న పాఠకులు కల్పన గావించగలరు. వ్యుత్పన్నులనగా శాస్త్రజ్ఞులు.

4. శ్లో|| శాస్త్రం బ్రహ్మ విచారాఖ్యమధ్యాయాః స్యుశ్చతుర్విధాః

సమన్వయ విరోధౌద్వౌ సాధనం చ ఫలం తథా||

శాస్త్ర ప్రతిపాద్యము మరియు అధ్యాయ ప్రతిపాద్యములను చెప్పుచున్నారు. వేదాన్త విచార రూపమైనది ఈ శాస్త్రము. సమన్వయ నామక ప్రథమాధ్యాయములో అన్ని వేదాన్త వాక్యముల యొక్క తాత్పర్యము అద్వయ బ్రహ్మమందే సమన్వయ మగుచున్నవనిరి. ద్వితీయ అధ్యాయములో సంభావిత విరోధములకు పరిహారము గావించిరి. బ్రహ్మ విద్యకు కావలసిన సాధనముల నిర్ణయము తృతీయ అధ్యాయములో కావించిరి. జ్ఞాన ఫలము యొక్క నిర్ణయము చతుర్థ అధ్యాయములో చెప్పిరి. ఇదే నాలుగు అధ్యాయముల అర్థము.

5. శ్లో|| సమన్వయే స్పష్టలింగమస్పష్టత్వేఽప్యుపాస్యగమ్

జ్ఞేయగం పదమాత్రం చ చిన్త్యం పాదేష్వనుక్రమాత్||

అచట ప్రథమాధ్యాయములో నున్న పదార్థములను విభజించుచున్నారు. ప్రథమపాదములో స్పష్ట బ్రహ్మలింగ వాక్యముల సమన్వయము బ్రహ్మమందు చెప్పిరి. ఎట్లనగా "అన్తస్తద్ధర్మోపదేశాత్:" (బ్ర.సూ.న1-1.20) అను సూత్రములో సర్వజ్ఞత్వము, సర్వతాదాత్మ్యము సర్వపాప రహితత్వము అను అద్వయ బ్రహ్మ అసాధారణ ధర్మములను స్పష్ట చిహ్నములుగా చెప్పిరి. ఏఏ వాక్యములలో బ్రహ్మ చిహ్నములు స్పష్టముగా లేవో అవి ఉపాస్య బ్రహ్మమును చెప్పుచున్నవని రెండవ పాదములో చెప్పిరి. ఉదాహరణకు ఛాందోగ్యములోని శాండిల్య విద్యలో "సర్వం ఖల్విదం బ్రహ్మ" ఇదంతయూ నిశ్చయముగా బ్రహ్మమే అని మొదలిడి (ఛాం. 3-4-1,2) మనోమయత్వము, ప్రాణ శరీరత్వము అను ధర్మములు సగుణబ్రహ్మకు జీవునికి సమానముగా ఉన్నవని చెప్పుట వలన అస్పష్ట బ్రహ్మలింగములు ( చిహ్నములు స్పష్టముగా లేవు.) ఉదాహరణకు మొదటి అధికరణములో

ముండక శ్రుతిలోని వాక్యము బ్రహ్మతత్వమును చెప్పుచున్నది. స్వర్గము, భూలోకము మరియు అంతరిక్షలోకములు సూత్రాత్మలోను పరబ్రహ్మములోను సాధారణముగా ఓతప్రోతమైయున్నవి. అందువల్ల దీనిలో బ్రహ్మలింగము స్పష్టముగాదు. అట్లయినను ద్వితీయ పాదములో కఠోపనిషత్తులోనున్న బ్రహ్మతత్వ బోధక వాక్యములను విచారించిరి. అట్లే మూడవ పాదములో దహరోపాసనను చెప్పు వాక్యమును విచారించిరి. (దహరమనగా శరీరములో గల హృదయాకాశమని) దీనికి అంతరంగికము అని చెప్పుచు, ఆ రెండు పాదములకు సాంకర్యము లేదనుచున్నారు. ఈ విధముగా వాక్యముల విచారము మూడు పాదములలో జరిగినది. నాల్గవ పాదములో 'అవ్యక్త' పదము 'అజ' పదములాంటి సందిగ్ధ పదములు విచారము చేసిరి.

6. శ్లో|| ద్వితీయే స్మృతి తర్కాభ్యామవిరోధోఽన్య దుష్టతా

భూత భోక్తృ శ్రుతే ర్లింగ శ్రుతే రస్య విరుద్ధతా ||

ద్వితీయ అధ్యాయములో గల విషయములను చెప్పుచున్నారు. మొదటి స్మృతి పాదము ద్వారా సమన్వయమునకు అవరోధమును చెప్పిరి. రెండవదైన తర్కపాదము ద్వారా సాంఖ్యాది ఇతర పక్షముల దుష్టత్వమును చెప్పిరి. భూతముల మరియు భోక్త జీవునికి సంబంధించిన శ్రుతుల విరోధములను చెప్పు శ్రుతుల పరిహారము గావించిరి. ద్వితీయ అధ్యాయములోని ప్రధమ పాదములో సాంఖ్య, యోగ, కాణాద (వైశేషక)స్మృతులు మరియు వారి తర్కముల ద్వారా వేదాంత సమన్వయమునకు కలిగిన విరోధములను (ఖండించిరి) పరిహరించిరి. ద్వితీయ పాదములో సాంఖ్యాది మతములు దోషయుక్తములని చెప్పిరి. తృతీయ పాదములో పూర్వార్ధము ద్వారా పంచమహాభూతములను చెప్పు శ్రుతుల పరస్పర విరోధము పరిహరింపబడినది. ఉత్తరా ర్ధము ద్వారా జీవునికి సంబంధించిన శ్రుతులలో గల విరోధమును పరిహరించిరి. చతుర్ధ పాదములో సూక్ష్మ శరీరమును చెప్పు శ్రుతులలో గల విరోధములను దూరము కావించిరి.

7 శ్లో తృతీయే విరతిస్తత్వం పదార్ధ పరిశోధనమ్

గుణోపసంహృతి జ్ఞాన బహిరంగాది సాధనమ్.

మూడవ అధ్యాయములో వరుసగా వైరాగ్యము, తత్, త్వం పదార్ధముల శోధన, గుణోపసంహారము, జ్ఞాన బహిరంగ సాధనములు చెప్పబడనవి.

ప్రధమ పాదములో వైరాగ్య నిరూపణ కొరకు జీవుని పరలోక గమనాగమనములు విచారించిరి. రెండవ పాదములో పూర్వ భాగము ద్వారా "త్వం" పదార్ధ శోధన మరియు ఉత్తరభాగమున "తత్" పదార్ధ శోధన చెప్పిరి. మూడవ పాదములో సగుణ ఉపాసనలలో గుణోప సంహారమును మరియు నిర్గుణ బ్రహ్మములో పునరుక్తి కాని పదములు ఉపసంహారము చెప్పిరి. నాల్గవ పాదములో నిర్గుణ విద్యకు కావలసిన బహిరంగ సాధనములు, యజ్ఞాదులను మరియు అంతరంగ సాధనములగు శమ, దమ, నిదిధ్యాసనాదులు నిరూపించిరి.

8. శ్లో|| చతుర్థే జీవతోముక్తి రుత్ క్రాంతిర్గతి రుత్తరా

బ్రహ్మ ప్రాప్తి బ్రహ్మలోకావితి పదార్ధ సంగ్రహః||

నాలుగవ అధ్యాయములోని విషయములు విభజించుచున్నారు. మొదటి పాదములో శ్రవణాదుల ఆవృత్తి వలన నిర్గుణ బ్రహ్మ సాక్షాత్కారము లేక ఉపాసన ద్వారా సగుణ బ్రహ్మను సాక్షాత్కరించుకుని పుణ్యపాపలేపము (సంస్పర్శ) నాశనము చేసుకుని ముక్తి నొందుట చెప్పబడెను. రెండవ పాదములో మరణాసన్న వ్యక్తి యొక్క ఉత్క్రాంన్తి చెప్పబడెను. స్థూల శరీరము నుండి సూక్ష్మ శరీరము వేఱై ఎట్లు మార్గములో ప్రవేశించును అను దానిని ఉత్క్రాంన్తి అందురు. 3వ పాదములో సగుణోపాసకులు మృతినొంది ఉత్తర మార్గమున పోవుటను చెప్పిరి. నాల్గవ పాదములో బ్రహ్మవేత్తల విదేహ కైవల్యము పూర్వభాగములో చెప్పిరి. ఉత్తరభాగములో సగుణ బ్రహ్మవేత్తల బ్రహ్మలోక స్థితి నిరూపించిరి. ఇది పదార్థముల సంగ్రహము.

9. శ్లో|| ఊహిత్వా సంగతీస్తిస్రస్తథాఽవాన్తర సంగతీః।

ఊహేదాక్షేపదృష్టాంత ప్రత్యుదాహరణాదికాః॥

శాస్త్ర సంగతి, అధ్యాయ సంగతి, పాద సంగతులను ఊహించిన లాభమేమనునది చెప్పుచున్నారు. ఈక్షత్యధికరణములో "తదైక్షత" అన్నచోట ఆ వాక్యము బ్రహ్మ పరమా లేక ప్రధాన పరమా అను సందేహము కలిగినపుడు విచారము బ్రహ్మ గురించి జరుగుచున్నందువలన బ్రహ్మ విచారము శాస్త్రసంగతి యని నిర్ణయించిరి. అన్ని శృతివాక్యములు బ్రహ్మమునే తాత్పర్యముగా చెప్పుట వలన సమన్వయము, అధ్యాయ సంగతి. ఈక్షణమనగా సంకల్ప క్రియ, అది చైతన్య బ్రహ్మమందు అసాధారణ హేతువు అగుటవలన ప్రథమపాద సంగతి. ఈ విధముగనే అన్నీ అధికరణముల యందు ఈ మూడు సంగతులను కల్పన చేసుకొనవలయును. అవాంతర సంగతులనేకములు. ఆక్షేపసంగతి, దృష్టాంతసంగతి, ప్రత్యుదాహరణసంగతి మరియు ప్రాసంగిక సంగతి. ఈ అవాంతర సంగతులను బుద్ధిమంతులు స్వయముగా కల్పన చేసుకొనగలరు. కాని పాఠకుల సౌలభ్యార్థము ప్రతి అధికరణము ముందు ఈ అవాంతర సంగతులను వీలైనంత వరకు ఉల్లేఖించినాము.

10. శ్లో||పూర్వన్యాయస్య సిద్ధాంతయుక్తిం వీక్ష్య పరే నయే।

పూర్వపక్షస్య యుక్తిం చ తత్ర ఽఽక్షేపాది యోజయేత్||

పూర్వాధికరణములో చెప్పిన సిద్ధాంతపక్షమును, తర్కమును దృష్టిలో నుంచుకుని ఉత్తర అధికరణమునందలి పూర్వ పక్షయుక్తిని దృష్టిలో ఉంచుకుని, అధికరణమునకు ముందు ఆక్షేపాది సంగతులను తెలుసుకొనగలరు. ఏ విధముగా ననిన, మొదటి అధికరణములో బ్రహ్మవిచారశాస్త్రము ఆరంభించవలయునని సిద్ధాంతీకరించిరి. దానికి యుక్తి ఏమనగా బ్రహ్మ సందిగ్ధమైనది, కనుక బ్రహ్మవిచారము చేయవలయును. ద్వితీయ అధికరణములో పూర్వపక్షి జగజ్జన్మాది బ్రహ్మలక్షణము కానేరదు, ఎందుకనగా జన్మస్థితిలయములు జగన్నిష్టములు గనుక, లక్షణములేని బ్రహ్మవిచారము యోగ్యము కాదనెను. ఈ రెండు పక్షములను చూసి ఇచ్చట ఆక్షేపసంగతిని తెలుసుకొనవలయును. జన్మాదులు జగన్నిష్టములగుటవలన బ్రహ్మలక్షణములేనందున, బ్రహ్మమే లేదు మరి సందిగ్ధత్వకారణము వలన విచారత్వముల గురించి ఎట్లు చెప్పగలరు. జన్మాదులు జగత్తునందు గలవు గనుక బ్రహ్మకు లక్షణము లేదనుట దృష్టాంతసంగతి, విచారము చేయుటకు కారణమున్నను బ్రహ్మకు లక్షణము లేదని చెప్పుటకు కారణము లేదనుట ప్రత్యుదాహరణ సంగతి. దృష్టాంత సంగతి మరియు ప్రత్యుదాహరణ సంగతి. సర్వత్ర సులభముగా తెలుసుకొనవచ్చును. పూర్వాధికరణ సిద్ధాంతములో

ఉత్తరాధికరణము యొక్క పూర్వపక్షహేతువును మరియు ఉత్తరాధికరణ సిద్ధాంతములో పూర్వపక్ష హేతువు లేదను వైలక్షణ్యమును మందబుద్ధిగలవారు గూడ గ్రహించగలరు. ఈ ప్రకారము యథాయోగ్యము ఆక్షేపసంగతిని తెలుసుకొనుట సులభము. ఇపుడు ప్రాసంగికసంగతిని గూర్చి చెప్పుచున్నారు. సమన్వయాధ్యాయ మూడవ పాదములో అధికారి విచారము చేయునపుడు దేవతాధికరణములో దేవతల అధికార సంగతి లేకపోయినను బుద్ధిలో నున్న అవాంతర సంగతి ఉండనేయున్నది. బ్రహ్మవిద్యలో దేవతలకు అధికారము ఉన్నదా లేదా అని అధికారము నిర్ణయించునపుడు అవాంతర సంగతిని గురించి చెప్పుచూ పూర్వాధికరణములో నున్న (అంగుష్టమాత్ర) వాక్యము బ్రహ్మ పరమగుట వలన బ్రహ్మ అంగుష్ట పరిమాణము గలవాడని తేలినది. మనుష్యుల హృదయము అంగుష్టమాత్ర పరిమాణమగుట వలన బ్రహ్మవిద్య యందు మనుష్యులకు, శాస్త్రము అధికారము గలదనినది. మనుష్యులకు అధికారమున్నదన్న, దేవతలకు అధికారము కలదా లేదా అను ప్రశ్న బుద్ధిస్థమగుట వలన దీనిని ప్రాసంగిక సంగతి అందురు. ఈ విధముగా అధికరణముల సంగతి చెప్పిరి. ప్రతి అధికరణమునకు రెండు శ్లోకములు చెప్పిరి. వానిలో ముందు చెప్పిన నాలుగు విషయములు అనగా విషయము, సంశయము, పూర్వ పక్షము, సిద్ధాంతము సంగ్రహముగా నుండును.

# 1. జిజ్ఞాసాధికరణము.

అథాతో బ్రహ్మ జిజ్ఞాసా (1.1.1)

సూత్రార్ధము : *సాధన చతుష్టయ సంపన్నానంతరము కర్మఫలము అనిత్యమగుట వలన మోక్షాభిలాషులు బ్రహ్మజ్ఞానమునకు వేదాంతవాక్యముల విచారము చేయవలయును.

శ్లో|| విషయోవిశయశ్చైవ పూర్వ పక్షస్తథోత్తరమ్| సంగతిశ్చేతి పంచాంగం శాస్త్రే అధికరణం స్మృతమ్||

సంగతి : ముందు అధికరణము లేనందున సంగతి లేదు.

విషయము : విచారించవలసిన విషయము వేదాంత శాస్త్రము

సంశయము : బ్రహ్మ విచారణీయమా? కాదా?

పూర్వపక్షము : అధ్యాసము నిరూపణ కానందువలన సందేహము మరియు ఫలము కనిపించుటలేదు. అందువల్ల బ్రహ్మ విచారణీయ విషయుమ కాదు.

సిద్ధాంతి : అహం బుద్ధియందు అధ్యాసము నిశ్చయము మరియు శ్రుతి బ్రహ్మను అసంగమని వర్ణించెను. కాన బ్రహ్మ విషయములో సందేహము కలదు. బ్రహ్మజ్ఞానము ద్వార మోక్షము కలుగును. అందువల్ల శ్రుతులను ఆధారము చేసుకుని బ్రహ్మవిచారము చేయవలయును.

ప్రత్యేక అధికరణములోని నాలుగు విషయములను శ్లోకముల ద్వార సంగ్రహముగా చెప్పుచున్నారు.

సూత్ర నిర్వచనము-

శ్లో. అల్పాక్షరమసందిగ్ధం సారవద్విశ్వతోముఖమ్| అస్తోభమనవద్యం చ సూత్రం సూత్రవిదో విదుః||

శ్లోకార్థము-- పదములు చాలా తక్కువగా నుండి స్పష్టార్థముండి అన్ని స్థలములలో అర్థముచెప్పుచూ ఉచ్చారణ యందు వ్యవధానము లేక నిర్దోషముగానున్నదానిని సూత్ర మందురు.

శ్లో-అవిచార్యం విచార్యం వా బ్రహ్మాధ్యాసాఽనిరూపణాత్ అసందేహాఽఫలత్వాభ్యాం న విచార్యం తద్ అర్హతి॥

12. శ్లో:- అధ్యాసోఽహంబుద్ధిసిద్ధోఽసంగం బ్రహ్మ శ్రుతీరితమ్। సందేహాన్ముక్తిభావాచ్చ విచార్యం బ్రహ్మ వేదతః॥

*ఫ్రుట్‌నోట్స్) : నిత్యానిత్య వస్తు వివేకము, ఇహాముత్రార్థ ఫల విరాగము, శమాది షట్క సంపత్తి, ముముక్షుత్వము దీనిని సాధన చతుష్టయములందురు.

శ్లోకార్థం 11 :

బ్రహ్మ విచార రూపమైన ఈ శాస్త్రము అధ్యాస నిరూపణ కానందున ఆరంభించుటకు యోగ్యము గాదు. బ్రహ్మాత్మలందు సందేహము లేనందున ముక్తిరూప ఫలము గోచరము కానందున శాస్త్రము ఆరంభయోగ్యముగాదు.అను పూర్వపక్షమునకు సిద్ధాన్తి సమాధానము.

అహంబుద్ధి ద్వార అధ్యాసము సిద్ధము. బ్రహ్మ అసంగమని శ్రుతిలో చెప్పిరి. దేహాదులు ఆత్మయని సందేహముండుట వలన, శ్రుతుల ద్వారా ముక్తి ఉన్నదని చెప్పుట వలనను, ముముక్షువులు బ్రహ్మ జ్ఞానము కొరకు వేదాంత విచా రము చేయవలయును. (12)

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

"ఆత్మా వా అరే! ద్రష్టవ్యః శ్రోతవ్యః మంతవ్యో నిదిధ్యాసితవ్యః" (బృ 2.4.5) పరబ్రహ్మమును గూర్చి శ్రవణము చేయవలయును. వినిన అర్థమును యుక్తుల ద్వార (విచారము చేయవలయును) పిదప నేను బ్రహ్మమని ధ్యానింపవలయును. ఇదియే పరమ పురుషార్థము. ఇచ్చట ఆత్మ దర్శన ఫలమునుద్దేశించి దానికి సాధన రూపములో శ్రవణమును విధించుచున్నారు. వేదాంత వాక్యముల తాత్పర్యము బ్రహ్మమునందే అని నిర్ణయించుటకు అనుకూలమైన తర్క విచారమును శ్రవణమందురు. ఈ విచారమును విధించు వాక్యము విషయము. ఈ విషయము పై రెండు శ్లోకములలో సంగ్రహించలేదని సంశయము వలదు. సంక్షేపముగా సంశయము చెప్పుట ద్వార దాని అర్థము వలననే విషయము గ్రహింపవలయును. బ్రహ్మ విచారాత్మకము, న్యాయ నిర్ణయాత్మకమగు శాస్త్రము ఆరంభించవలయునా? లేదా? అని సందేహము. పూర్వపక్ష సిద్ధాంతపక్ష యుక్తుల ద్వారా అన్ని చోట్ల సందేహ కారణము గ్రహించవలయును. ఆరంభించరాదు అనునది పూర్వపక్షము ఎందులకనగా ఈ శాస్త్రము యొక్క విషయ ప్రయోజనములు లేవు గనుక. సందిగ్ధ విషయమునే విచారించెదరు. బ్రహ్మము అసందిగ్ధము మరి బ్రహ్మరూపములో సందేహమా? లేక ఆత్మరూపములోనా? ప్రథమ రూపము వికల్పముగాదు. ఎందులకనగా "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" (తై.2.1) అను వాక్యము ద్వారా బ్రహ్మలక్షణము నిశ్చయము. రెండవ వికల్పము కానేరదు. అహమను జ్ఞానము ద్వారా ఆత్మజ్ఞానము గూడ నిశ్చయమే. అహం జ్ఞానము అధ్యస్థ ఆత్మ విషయమనిన అదియు సరిగాదు. ఎందుకనగా ఇంత వరకు అధ్యాసము నిరూపింపబడలేదు. విరుద్ధ స్వభావము గల అంధకారము వెలుతురు వలె జడదేహము చైతన్యఆత్మల యొక్క

అధ్యాసము, ఆలచిప్పయందు వెండి వలె కానవచ్చు, అన్యోన్యఅధ్యాసము నిరూపించుటకు శక్యము గాదు. భ్రాంతిహీనమైన శ్రుతి అహం జ్ఞానము ద్వారా  నిశ్చయమైనది. శ్రుతి అసందిగ్ధ మగుటవలనను బ్రహ్మ విచారమునకు విషయము లేదు. అంతేకాక ప్రయోజనము కనబడుట లేదు. అందువల్ల బ్రహ్మ విచారము అయోగ్యము అనర్థము గాన శాస్త్రము ఆరంభించునవసరము లేదు. ఇంతవరకు పూర్వపక్షము.

సిద్ధాంతి ఇచ్చట సమాధానము చెప్పుచున్నారు. శాస్త్రము ఆరంభించవలయును. ఎందులకనగా విషయ ప్రయోజనములున్నందువలన శ్రుతిలో చెప్పినదానికి అహమను జ్ఞానమునకు అనేక విరుద్ధ విచారమతములుండుట వలననూ బ్రహ్మాత్మ విషయములు సందిగ్ధ విషయములగుట వలననూ శాస్త్రము ఆరంభింపవలయును. "అయమాత్మా బ్రహ్మ" (బృ.  2.5.10) అను శృతి  అసంగబ్రహ్మమును ఆత్మరూపముగా నిరూపించుచున్నది. "అహం మనుష్యః" అను అహం బుద్ధి ఆత్మ దేహాల తాదాత్మ్యముల ద్వారా  ఆత్మను గ్రహించుచున్నది. అధ్యాసమును నిరూపించలేదనుట వేదాంతులకు అలంకారము. వస్తు విషయము సందిగ్ధము, ముక్తి ప్రయోజనము శ్రుతులలో చెప్పుట వలననూ, జ్ఞానులయందు ముక్తి ఆనందము అనుభవ గమ్యమగుట వలననూ ప్రయోజనము సునిశ్చితము. అందువల్ల వేదాంతవాక్యముల విచారము ద్వారా బ్రహ్మము విచారా-ధీనమగుట వలన శాస్త్రము ఆరంభనీయమని సిద్ధాంతము.

పూర్వపక్షము : బ్రహ్మమును గురించి వినిన వారిలో గూడ పూర్వమువలే సంసారము గోచరమగు చున్నదనిన, దానికి సిద్ధాంతి జవాబు : "తరతి శోకమాత్మవిత్" "బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి" "అశరీరం వావ సంతం న ప్రియాప్రియే స్పృశతః (ఛాం. 8.12.1) శరీరా భిమానరహితులకు ప్రియా ప్రియములు అంటుట లేదు. ఈ శ్రుతి వాక్యముల ద్వారా  వేదప్రమాణ జన్యమైన బ్రహ్మాత్మైక జ్ఞానము ద్వారా, అజ్ఞాన నివృత్తి పూర్వక దేహాభిమాన నివృత్తి కలుగుట వలన దుఃఖాదులు ఉండవు. కాన బ్రహ్మను గురించి విని అనుభవించువారిలో సంసారము గోచరము గాదు.

తెలుసుకొనవలయునను ఇచ్ఛకు విషయమైన బ్రహ్మయొక్క స్వరూపము "జన్మాద్యస్యయతః" అను సూత్రము ద్వారా చెప్పెదరు.

ఇచ్చట బ్రహ్మ ప్రధానము. జిజ్ఞాస కర్మకు ప్రధానమైన బ్రహ్మను గ్రహించిన తదాశ్రిత ప్రమాణాదులు వాటంతటవే గ్రహింపబడును. రాజు వెళ్ళుచున్నాడనిన పరివారజనులతో, సేన , అమాత్యాదులతో అని అర్థము. "జ్ఞా"ధాతువు (ద్వారా) అజహత్ లక్షణము ద్వారా బ్రహ్మ అపరోక్షజ్ఞానము లక్షితము. సన్ ప్రత్యయము (ద్వారా) జహత్ లక్షణము ద్వారా ఇచ్ఛాసాధ్యమైన విచారము లక్షితము. అతః పదమునకు అర్థము. "తద్ యథా ఇహ కర్మచితో లోకః క్షీయతే ఏవమేవ అముత్ర పుణ్య కృతో లోకః క్షీయతే" ఏవిధముగా ఇచ్చట కర్మము ద్వారా నిర్వహించబడు వ్యవసాయాదులు క్షీణించునో అట్లే యాగాదుల ద్వారా పొందు స్వర్గాదులు నశించును అని తెలుసుకుని బ్రహ్మవిచారము చేయవలయును. అనగా బ్రహ్మజ్ఞానమునకు వేదాంత వాక్యముల విచారము చేసి తీరవలయును.

బ్రహ్మ విచారణీయమని చెప్పబడనది. బ్రహ్మలక్షణమేదనే సందేహమునకు వ్యాస భగవానుల వారు రెండవ సూత్రమును రచించిరి.

# 2. జన్మాద్యధికరణము.

సూత్రము---జన్మాద్యస్యయతః (1-1-2)

అస్య జగతః = ఈ ప్రపంచమునకు

జన్మాది = సృష్టి, స్థితి, లయములు

యతః = దేని నుంచి జనించుచున్నదో అది బ్రహ్మము

సంగతి : విచారణీయ బ్రహ్మ లక్షణము సిద్ధము కానపుడు బ్రహ్మ స్వరూపమెట్లు సిద్ధమగును. సిద్ధము కాని బ్రహ్మ విచారణీయ మెట్లగును అను ఆక్షేపసంగతి ఇచట చెప్పబడినది.

విషయము : ఈ అధికరణములో బ్రహ్మ లక్షణము విచారించిరి.

సంశయము : బ్రహ్మకు లక్షణము కలదా? లేదా?

పూర్వపక్షము : జన్మస్థితిలయములు జగన్నిష్ఠములు సత్యం జ్ఞానమనంతమను పదములకు అర్థప్రసిద్ధి లేదు కనుక బ్రహ్మ లక్షణము అసంభవము.

సిద్ధాంతి : బ్రహ్మ జగజ్జన్మాదులకు కారణము. జగజ్జన్మాది కారణత్వము బ్రహ్మమునందు గలదు. ఎట్లనగా త్రాడుపై కనపడు సర్పమునకు కారణము త్రాడు. అట్లే జగత్ యొక్క జన్మాది కారణమునకు అధిష్ఠానము బ్రహ్మ. లౌకిక వాక్యముల రీతిగా సత్యం జ్ఞానమనంతమను వాక్యము లాక్షణికముగా బ్రహ్మబోధ కలిగించును. ఏది వెండియో అదియే ముత్యపు చిప్ప అనునట్లు, ఏది జగత్ కారణమో అదియే బ్రహ్మ. కల్పిత కారణత్వము బ్రహ్మకు తటస్థ లక్షణము. "బ్రహ్మాది స్తంభ పర్యంతము భూతములు ఏ పరబ్రహ్మము నుండి పుట్టుచున్నవో" (తై. 3.1.) "యతో వా ఇమాని భూతా ని జాయంతే" అను వాక్యముల ద్వారా శ్రుతి అనుమానమును గూడ అంగీకరించును. ఉదాహరణకు మేధావి పండితుడు దొంగల ద్వార అరణ్యములో విడువబడి తర్కసహాయముతో తన స్వగ్రామమునకు చేరునట్లు.

వైయాసికన్యాయమాలా:

13. శ్లో||లక్షణం బ్రహ్మణో నాస్తి కింవాఽస్తి, నహి విద్యతే| జన్మాదేరన్యనిష్టత్వాత్ సత్యాదేశ్చాప్రసిద్ధితః ||

14. శ్లో||బ్రహ్మనిష్ఠం కారణత్వం స్యాల్లక్ష్యం స్రగ్ భుజంగవత్| లౌకికాన్యేవ సత్యాదీన్యఖండం లక్షయన్తి హి||

శ్లోకార్థము :

బ్రహ్మయొక్క లక్షణము కలదా? లేదా? బ్రహ్మ లక్షణము లేదు. జన్మస్థితి భంగములు జగన్నిష్ఠములగుట వలననూ, సత్యం జ్ఞానమనంతం అను బ్రహ్మలక్షణము లోకములో ప్రసిద్ధము గానందున.

జన్మాదులు జగత్తునకు ఐనను జగత్ కారణము బ్రహ్మ, ఏది పామో అదే మాల అను బాధసామానా-ధికరణము ద్వారా బ్రహ్మ తటస్థ లక్షణము సిద్ధమగును. సత్యజ్ఞానాదులు భిన్నార్థకములైనను బ్రహ్మమునందే

పర్యవసానములగుచున్నవి. పెద్ద నీలకమలము సుగంధము గలది, ఇచట నాలుగు పదములూ వేరైన అర్థము గలిగినను ఒకే వస్తువును చెప్పునట్లు సత్యజ్ఞానాదులు భిన్నార్థములైనను బ్రహ్మమునేచెప్పు చున్నవి, కనుక బ్రహ్మ స్వరూప లక్షణము సిద్ధమగుచున్నది. అనగా పరమాత్మ ఈ జగత్తుకు అభిన్న నిమిత్త ఉపాదానకారణము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

"యతో వా ఇమాని భూతాని జాయంతే, యేన జాతాని జీవన్తి యత్ ప్రయంత్యభిసంవిశంతి, తద్విజిజ్ఞాసస్వ తద్ బ్రహ్మ" ఈ భూతములు దేని నుండి జన్మించుచున్నవో, ఎచ్చట నిలిచి ఉన్నవో, నాశనమయిన తరువాత దేనిలో చేరుచున్నవో, అదియే బ్రహ్మము దానిని విచారము చేసి తెలుసుకొనుము. "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" (తై. 2.1) ఏది సత్యమో, జ్ఞాన స్వరూపమో, అనంతమో, అదియే బ్రహ్మము. ఈ రెండు వాక్యములు, ఈ అధికరణమునకు విషయములు. పై రెండు వాక్యములలో చెప్పిన బ్రహ్మలక్షణము సంభవమా? కాదా? అని సంశయము. సంభవము కాదు. జన్మాదులు బ్రహ్మ లక్షణములా? లేక సత్యాదులు బ్రహ్మలక్షణములా? జన్మాదులు కానేరవు. ఎందులకనగా అవి జగన్నిష్ఠములు మరియు బ్రహ్మతో సంబంధము లేదు. సత్యజ్ఞానాదులు లోక ప్రసిద్ధములని వానిని స్వీకరించిన భిన్నమైన అర్థములు అగుట వలన అఖండ బ్రహ్మము సిద్ధముగాదు. అప్రసిద్ధమైన సత్యాదులు లక్షణములుగా చెప్పుట యుక్తియుక్తము గాదు. అందువల్ల బ్రహ్మకు తటస్థలక్షణము గాని, స్వరూపలక్షణము గాని లేదు అని పూర్వపక్షి వాదించగా దానికి సిద్ధాంతి సమాధానము.

ఏ లక్షణములో రూపములు అంతర్భూతములు గావో మరియు సత్య పదార్థమును వ్యవస్థితముగా చెప్పుటకు కారణమో, అది తటస్థలక్షణము. "కాకవద్ దేవదత్తస్య గృహమ్" అనినపుడు దేవదత్తుని ఇంటిపై వాలిన కాకి ఎగిరిపోయినను సత్యమైన దేవదత్తుని ఇల్లు చూపించును. ఇల్లును చూపించుటకు కాకి హేతువు. అట్లే జన్మాదులు అన్యమైన జగన్నిష్టములైనను దాని ఉత్పత్తి కారణము కల్పన ద్వారా సంబంధము కలదని చెప్పుటచే తటస్థలక్షణము బ్రహ్మమునందు కలదని చెప్పుట సంభవము. "యే భుజంగః సా స్రక్" అనగా ఏది పామో అదే మాల, అన్నట్లు "ఏది జగత్ కారణమో అదే బ్రహ్మము" "యద్ జగత్ కారణం తద్ బ్రహ్మ" అని కల్పిత వస్తువు ద్వారా వాస్తవమైన వస్తువును ఉపలక్షణముగా చెప్పగలము. తండ్రి , కొడుకు, అన్న అల్లుడు అను భిన్నార్థములు ఒకే దేవదత్తుని యందు అంతమొందినను విరోధము లేదు. ఒకే దేవదత్త పిండమును కొడుకు తండ్రియని, తండ్రి తనయుడని, తమ్ముడు అన్నయని, మామ అల్లుడని సంబోధించెదరు. అయిననూ విరోధము లేదు. ఆ విధముగానే లోకములో ప్రసిద్ధములైన భిన్నార్థములైన సత్యాది శబ్దములు అఖండ బ్రహ్మమునందు లీనమగుట వలన స్వరూప లక్షణము సిద్ధమగుచున్నది. ఈ విధముగా రెండు లక్షణములు బ్రహ్మకు గలవు.

తత్వజ్ఞానము వస్తుతంత్రము. అస్థిత్వము గల బ్రహ్మజ్ఞానము వస్తుతంత్రము. బ్రహ్మ ఇంద్రియ అగ్రాహ్యము. అందువల్ల శ్రుతుల ద్వారానే బ్రహ్మను తెలుసుకొనగలము. నామ రూపాదులతో గూడ వ్యక్తమైన ప్రత్యక్షాది ప్రమాణములకు ఆలవాలమై ఈ జగత్తు యొక్క సృష్టి స్థితి భంగములు,మనస్సు ద్వారా చింతింపలేని రచనాశక్తి గల ఆ సర్వజ్ఞుడు సర్వశక్తి సంపన్నుడైన కారణము నుండి యగును. అదే బ్రహ్మము.

# 3. శాస్త్రయోనిత్వాధికరణము.

జగత్ కారణమైన బ్రహ్మ సర్వజ్ఞుడని సిద్ధమైనది. దానినే ఈ అధికరణములో దృఢపరచుచున్నారు. సూత్రములో ఒకటికంటె ఎక్కువ అంశములు వివరించిన ఒక్కొక్క అంశ వివరణమును ఒక్కొక్క వర్ణములో చెప్పబడుతుంది.

### 3. శాస్త్రయోనిత్వాత్ (1.1.3)

1. ఋగ్వేదాది శాస్త్రములకు కారణమగుట వలన బ్రహ్మ సర్వజ్ఞుడు.(ప్రథమ వర్ణకము.)

2. వేద శాస్త్రము ద్వారా గమ్యమగుట వలన బ్రహ్మ ఇతర ప్రమాణముల ద్వారా అగమ్యము.(ద్వితీయము)

ప్రటమవర్ణకము.

సంగతి : సంపూర్ణ జగత్ కారణము బ్రహ్మ సర్వజ్ఞుడనుట సరికాదు, వేదము నిత్యమగుట వలన. జగదంతర్గతమైన వేదము బ్రహ్మ సర్వజ్ఞుడనునది నిరాకరించగా ఈ అధికరణము ఆరంభింపబడనది. ఇచ్చట ఆక్షేపసంగతి.

విషయము : వేదకర్త బ్రహ్మమనునది విచారణీయము

సంశయము : వేదకర్త బ్రహ్మమా? కాదా?

పూర్వపక్షము : "వాచాది రూప నిత్యయా" ఈ వేదవాక్యములో వేదము నిత్యమని చెప్పబడనది. దానికి కర్త ఎవరూ కాజాలరు. అందువల్ల వేదకర్త బ్రహ్మము కాదు.

సిద్ధాంతము : వేదకర్త బ్రహ్మమే. వేదము పరమేశ్వరుని శ్వాస నిశ్వాసముల ద్వారా వెలువడనది. వేదముల నిత్యత్వము కల్పములను చూచి చెప్పబడనది. వేదములతో బాటు అన్ని భూతముల కర్త బ్రహ్మమగుటచే అతడు సర్వజ్ఞుడు.

2. ద్వితీయ వర్ణకము

సంగతి : జగత్ కారణుడైన బ్రహ్మ ఇతర ప్రమాణముల ద్వారా గ్రహింపగలడు అను శంక కలుగవచ్చును. లక్షణ ప్రమాణముల ద్వారా బ్రహ్మ నిర్ణయింపబడును. పూర్వాధికరణముతో ఈ అధికరణమునకు ఏక విషయత్వమనునది సంగతి. పూర్వాధికరణములో బ్రహ్మ లక్షణము చెప్పబడనది. దీనిలో ప్రమాణము నిర్ణయించబడినది.

విషయము : బ్రహ్మ సంబంధమైన ప్రమాణములు విచారింపబడనవి.

సంశయము : సిద్ధ బ్రహ్మశాస్త్రగమ్యమా లేక అన్య ప్రమాణ గమ్యమా?

పూర్వ పక్షము : కుండవలె సిద్ధవస్తువైనందున బ్రహ్మ అన్యప్రమాణగమ్యము.

సిద్ధాంతము : రూపము, ధర్మ బోధక చిహ్నము అనబడు హేతువు లేనందున బ్రహ్మ వేద భిన్నములైన ప్రమాణములతో తెలియదు. "తం త్వోపనిషదం పురుషం పృచ్ఛామి" అనుశృతి వాక్యములో వేదైక గమ్యము చెప్పబడ నది. వేద భిన్నమైన ఏ ప్రమాణము ద్వారానూ బ్రహ్మను తెలుసుకొనజాలము.

ప్రథమ వర్ణకము వ్యాఖ్యానము : ఋగ్వేదాది శాస్త్రములకు కారణమగుట వలన బ్రహ్మ సర్వజ్ఞుడు "శాస్త్రస్య యోనిః" వేదము అపౌరుషేయము సృష్టికి ఆదిలో పరమేశ్వరుడు పూర్వ సృష్టియందు సిద్ధమైయున్న వేదమును ఆనుపూర్వికముగా (పూర్వానుసారముగా) విరచించెను. పూర్వ సిద్ధమునకు విజాతీయము గాదు. మహాభారతాదులు, పూర్వ కల్ప సృష్టి యందున్న దానికంటే విపరీతముగా ఈ సర్గములో అనగా ఈ సృష్టిలో వ్రాసిరి. దానిని పౌరుషేయమందురు. "సజాతీయ ఉచ్చారణ అనపేక్ష ఉచ్చారణ విషయత్వం పౌరుషేయమ్" దానికి విపరీతముగా వేదములలో పూర్వ కల్పము వలే ఈ కల్పములో శబ్దజాలము గలదు. అది మారదు, అందువల్ల అది అపౌరుషేయము.

1. "వాచా విరూప నిత్యయా" శ్రుతి

2. "అనాది నిధనా నిత్యా వాగుత్సృష్టా స్వయంభువా! అదౌ వేదమయీ దివ్యా యతః సర్వా ప్రవృత్తయః|| స్మృతి

1. విరూపుడను పేరుగల ఓ దేవత! నీవు శాశ్వతమైన వేద వాక్కులచే నాద్వారా స్తోత్రము చేయించుకొనుము.

2. ఉత్పత్తి వినాశములు లేనట్టియు, శాశ్వతమైనట్టియు, వేద రూపమగు వాక్కును బ్రహ్మదేవుడు మొట్టమొదట లోకమునకు తెలిపెను. దాని ద్వారా సర్వ వ్యవహారములు ప్రచలితములు. "తస్మాత్ యజ్ఞాత్ సర్వహుతః ఋచః సామాని జజ్ఞిరే" బ్రహ్మము నుండి ఋక్కులు, సామ మంత్రములు జనించెను. (శుక్ల. యజు. సం.21.7)

ద్వితీయ వర్ణకము వ్యాఖ్యానము : "శాస్త్రం యోనిః యస్య సః" వేద శాస్త్రముల ద్వారా గమ్యమగుట వలన బ్రహ్మ ఇతర ప్రమాణముల ద్వారా అగమ్యము.

"న వేదవిన్మనుతే తం బృహంతం, నాబ్రహ్మవిత్ పరమం ప్రైతి ధామ, విష్ణుక్రాంతం వాసుదేవం విజానన్ విప్రో విప్రత్వం గచ్ఛేత్ తత్వదర్శీ (శాట్యాయనోప. 4)

వేదవేత్త కాని వాడు పరమాత్మను మననము చేయలేడు. బ్రహ్మవేత్త కాని వాడు పరమపదమును పొందలేడు. విష్ణుక్రాంతమైన వాసుదేవుని తెలుసుకున్నవాడై (వ్యాపక పరమాత్మను అనుభవించినవాడై) విప్రుడు తత్వ దర్శియై విప్రత్వము నొందును. ఋగ్వేదాదులకు కారణము మరియు ప్రమాణము బ్రహ్మ.దానిని యధాతథ్యముగా తెలుసుకొనుటకు వేదములే ఆధారము. శ్రుతుల ద్వారా బ్రహ్మ తెలుసుకున్న తరువాత, బ్రహ్మకు వాని అనువాదరూపముగా అనుమానము, అనుభవము అంగీకరించబడును. కాన బ్రహ్మ వేదైక గమ్యము.

వైయాసికన్యాయమాలా: (ప్రథమ వర్ణక వ్యాఖ్యానము)

15. "న కర్తృ బ్రహ్మ వేదస్య, కిం వా కర్తృ, న కర్తృ తత్| విరూపనిత్యయా వాచేత్యేవం నిత్యత్వవర్ణనాత్||

16. కర్తృ నిఃశ్వసితాద్యుక్తేర్ నిత్యత్వం పూర్వసామ్యతః| సర్వావభాసి వేదస్య కర్తృత్వాత్ సర్వవిద్ భవేత్||

పూర్వపక్ష శ్లో|| బ్రహ్మ వేదము యొక్క కర్తయా? కాదా? బ్రహ్మ వేద కర్తకాదు. ఎందులకనగా "విరూపుడను పేరుగల ఓ దేవత! నీవు శాశ్వతమగు వేదవాక్కుచే నాచే స్తోత్రము చేయించుకొనుము" అను వాక్యములో వేదము నిత్యమని వినబడుచున్నది.

సిద్ధాంత శ్లో|| వేదకర్త బ్రహ్మమే, ఎందులకనగా వేదము బ్రహ్మ యొక్క శ్వాస, నిఃశ్వాస రూపము. పూర్వకల్పముతో సమానమగుట వలన వేదము యొక్క నిత్యత్వము చెప్పబడెను. అన్నింటిని ప్రకాశింపజేయు వేదకర్త బ్రహ్మమగుట వలననే వానిని సర్వజ్ఞుడందురు.

భారతీతీర్థులవారి వ్యాఖ్య:-

"అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతదృగ్వేదో, యజుర్వేదః సామవేదః" ఈ పరమాత్మ యొక్క నిఃశ్వాస (నిట్టూర్పు) రూపముగా ఋగ్, యజు స్సామవేదములు ఉత్పన్నమైనవి. (బృ ఉ. 4.8.10) అను ఈ వాక్యము ఈ అధికరణమునకు విషయము. ఋగ్వేదాదులు నిత్య సిద్ధమైన బ్రహ్మ యొక్క నిఃశ్వాసమువలే అప్రయత్నముగా వెలువడెను. బ్రహ్మ వేదకర్తయా? కాదా? అనునది సందేహము. బ్రహ్మ వేదకర్త గాడు. వేదము నిత్యము గనుక "వాచా విరూప నిత్యయా". విరూపుడను పేరుగల ఓ దేవత ! నీవు నిత్యమగు వేదము ద్వారా నాచే స్తోత్రము చేయించుకొనుము. నిత్యమైనది వేదవాణియే "అనాది నిధనా నిత్యా వాగుత్సృష్టా స్వయంభువా ఆదౌ వేదమయీ దివ్యా యతః సర్వా ప్రవృత్తయః "ఉత్పత్తి వినాశములు లేనట్టియు, శాశ్వతమైనట్టియు వేదరూపమగు వాక్కును బ్రహ్మ మొట్టమొదట లోకమునకు తెలిపెను. దాని ద్వారా సర్వలోక వ్యవహారములు ప్రచలితమయినవి. అని స్మృతిలో చెప్పినందున వేదకర్త బ్రహ్మ కాదు. ఈ పూర్వ పక్షములకు సిద్ధాంతి ఉత్తరము. బ్రహ్మ వేదకర్త అనుటకు అర్హుడు. ఏలననగా అప్రయత్నముగా, అనాయాసముగా, నిఃశ్వాసరూపముగా వేదము బ్రహ్మ నుండి వెలువడినది గనుక. "తస్మాత్ యజ్ఞాత్సర్వహుతః ఋచః సామాని జజ్ఞిరే (శుక్ల యజు, సం. 21.7) "యజ్ఞ స్వరూపుడైన బ్రహ్మము నుండి ఋగ్వేదమంత్రములు సామవేద మంత్రములు జనించెను. అన్ని యజ్ఞముల ద్వారా హవనమునకు యోగ్యమగుట ద్వారా యజ్ఞశబ్ద వాచ్యమైన బ్రహ్మ మందు స్పష్టముగా వేదముల ఉత్పత్తి శ్రుతులలో వినబడుచున్నది. అప్రయత్నముగా జనించిననూ అర్థము తెలుసుకుని రచించెను. కాళిదాసాదుల ద్వారా రచించిన వాక్యముల కంటే విలక్షణమైనందున అపౌరుషేయము. ప్రతికల్పమందు పూర్వమున ఎట్లున్నదో అట్లే తదనురూపముగా మంత్ర, పద, వర్ణములు మరియు స్వరములుండుట వలన ప్రవాహము వలె నిత్యము. వేదము సంపూర్ణ జగత్తు యొక్క వ్యవస్థను చూపించుట వలన, దాని కర్త బ్రహ్మమగుట వలనను, వాని యందు సర్వజ్ఞత్వము నిరూపించబడినది.

వైయాసికన్యాయమాలా: (ద్వితీయ వర్ణక వ్యాఖ్యానము)

17. "అస్త్యన్య మేయతాఽప్యస్య కింవా వేదైకమేయతా| ఘటవత్సిద్ధవస్తుత్వాద్ బ్రహ్మాన్యేనాపి మీయతే||

18. రూపలింగాదిరాహిత్యాన్నాస్య మాన్తరయోగ్యా ।తం త్వౌపనిషదేత్యాదౌ ప్రోక్తా వేదైకమేయతా||

శ్లోకార్థము:- బ్రహ్మను తెలుపుటకు వేదము ప్రమాణమా? లేక అన్యప్రమాణము కలదా? కుండవలె సిద్ధవస్తువగుట వలన అన్య ప్రమాణముల ద్వారా గూడ బ్రహ్మ అవగాహ్యామే.

రూపము, హేతువు మొదలుగునవి (జాతి, గుణ, కర్మ, శూన్యము) లేనందున వేదభిన్న ప్రమాణము ద్వారా బ్రహ్మ తెలుసుకొనలేము. "నేను మిమ్ము ఉపనిషత్తులలో నున్న పురుషుని గురించి అడుగుచున్నాను. "తం త్వౌపనిషదం పురుషం పృ చ్ఛామి" అను వాక్యములో వేదమొక్కటే ప్రమాణమని చెప్పబడినది.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

"తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి" (బృ.ఉ. 3.9.26) అను శ్రుతి వాక్యము శాకల్యుని యాజ్ఞవల్క్యుడడిగినది. ఈ వాక్యములో పరబ్రహ్మరూపమైన పురుషుని ఉపనిషత్తుల ద్వారానే తెలుసుకొనబడుననునది స్పష్టమగుచున్నది. ఇది విషయ వాక్యము. బ్రహ్మము ప్రత్యక్షాది ప్రమాణముల ద్వారా గమ్యమా? కాదా? అనునది సంశయము. పూర్వపక్షము స్పష్టమే.

రూపరసాదులు బ్రహ్మమందు లేనందువలన ఇంద్రియముల ద్వారా తెలుసుకొనబడదు. హేతువు గాని హేతుసాదృశ్యము గాని లేనందున అనుమానము ద్వారా అగమ్యము. ఉపనిషత్తుల ద్వారానే తెలుసుకొనబడును. వేద జ్ఞానము లేని వాని ద్వారా ఆ పూర్ణ బ్రహ్మము మనన యోగ్యము గాదు. బ్రహ్మవేత్త గాని వాడు పరమధామము చేరలేడు. వ్యాపకమైన విష్ణువును విష్ణుక్రాంతుడందురు. ఆ వాసుదేవుని తెలుసుకోని తత్త్వదర్శియై విప్రత్వము పొందును. తత్త్వజ్ఞాని కాని విప్రుని యందు విప్రత్వము లేదు. శాట్యాయన ఉపనిషత్తులో ఈ విషయము 4వ మంత్రములో చెప్పబడినది. ఈ మంత్రములో వేదముల ద్వారానే బ్రహ్మ తెలియునని చెప్పుచూ అన్య ప్రమాణ గమ్యమును నిషేధించిరి. జన్మాది సూత్రములో భాష్యకారులీవిధముగా చెప్పిరి. "శ్రుత్యాదయో అనుభవాదయశ్చ యథా సంభవం ఇహ ప్రమాణమ్". శ్రుత్యాదులు, అనుభవాదులు యథా సంభవము బ్రహ్మ జ్ఞానమునకు ప్రమాణములు. ఈ వాక్యములో ఆది పదము ద్వారా అన్య ప్రమాణములు భాష్యకారులు అంగీకరించిరనిన సరియే గాని ప్రథమములో శ్రుతులే ప్రమాణములు. శ్రుతుల ద్వార ప్రమాణము గావించిన తదుపరి అనువాద రూపముగా అనుమానానుభవములను అంగీకరించిరి. గాన బ్రహ్మను చెప్పుటకు వేదములే ప్రమాణములు.

# 4. సమన్వయాధికరణము

సూత్రము : తత్తు సమన్వయాత్ (1.1.4)

సూత్రార్థము : వేదాంత వాక్యములు స్వతంత్రముగనే బ్రహ్మను బోధించుచున్నవి. కర్త మరియు దేవతల ద్వార ఉపాసనాంగములు కావు.

ప్రథమ వర్ణకము

సంగతి : బ్రహ్మను గూర్చి చెప్పుటలో మీరు ఎట్లు శాస్త్ర ప్రమాణము గలదని చెప్పుచున్నారు. వేద వాక్యములు కర్మను ప్రతిపాదించుచున్నవి. అట్లు కర్మను ప్రతిపాదించని వాక్యములు అనర్థకములు. "ఆమ్నాయస్య క్రియార్థత్వాత్ ఆనర్థక్యం అతదర్థానామ్"|| (జై.సూ.1.21) ఈ జైమిని మహర్షి వాక్యములో కర్మ పరకములు వేదాంత వాక్యములని చెప్పబడనవి. ఇచట ఆక్షేప సంగతి :

విషయము : ఈ అధికరణములో అన్ని వేదాంత వాక్యములు విచారణీయములు.

సంశయము : వేదాంత వాక్యములు కర్మ మరియు దేవతలను ప్రతిపాదించుట వలన కర్మాంగములా? లేక బ్రహ్మను ప్రతిపాదించుట వలన బ్రహ్మ పరకములా? అని సంశయము.

పూర్వపక్షము : కర్మానుష్ఠానము నందు ఉపయోగపడుట వలన వేదాంత వాక్యములు కర్త మరియు దేవతలను ప్రతిపాదించుచున్నవి.

సిద్ధాంతము : వేదాంతమనగా ఉపనిషత్తులు. కర్మను గూర్చి చెప్పుటలేదు. కర్మ కన్న భిన్నమైన ప్రకరణము కాన అవి కర్మ శేషములు కావు. కాని బ్రహ్మను బోధించుచున్నవి. తాత్పర్యమును నిర్ణయించు షడ్విధ తాత్పర్యలింగములనగా ఆయా హేతువులు. వాని ద్వారా గూడ వేదాంత వాక్యములు బ్రహ్మతత్వమునే బోధించుచున్నవి. అనర్థమగు అజ్ఞానమును నశింపచేయు స్వతంత్ర ప్రయోజనము గల వేదాంత వాక్యములను కర్మాంగములనుట సరికాదు.

వైయాసికన్యాయమాలా:

19 వేదాంతాః కర్తృ దేవాదిపరా బ్రహ్మపరా ఉత| అనుష్ఠానోపయోగిత్వాత్ కర్త్రాదిప్రతిపాదకాః ||

20. భిన్నప్రకరణాల్లింగషట్కాచ్చ బ్రహ్మబోధకాః| సతి ప్రయోజనేఽనర్థహానేఽనుష్ఠానతోఽత్ర కిమ్||

శ్లోకార్థము:-

వేదాంత వాక్యములు కర్త మరియు దేవతాది పరకములా, లేక అనుష్ఠానము నందు ఉపయోగపడుట వలన కర్తృ పరకములా?

వేదాంత వాక్యములు కర్మకాండ కన్న భిన్న ప్రకరణములు కనుక బ్రహ్మ బోధకములు. తాత్పర్య-నిర్ణాయకములైన షడ్విధ చిహ్నముల ద్వారా వేదాంత వాక్యములు బ్రహ్మ తత్త్వమును బోధించుచున్నవి. అనర్థ కారణమైన అజ్ఞానమును తొలగించుట యను స్వతంత్ర ప్రయోజనముండుట వలన కర్మ శేషము లెట్లగును?

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

విషయ, సంశయములు స్పష్టములే. జీవుని గురించిన వాక్యములు కర్త పరములు. బ్రహ్మను గురించి చెప్పు వాక్యములు సాధనపరములు. ఈ విధముగ వేదాంత వాక్యములు అనుష్ఠానమునకు వచ్చుచున్నవి. వేదాంత వాక్యములు బ్రహ్మపరములైన అనుష్ఠానము నందు ఉపయోగమునకు రావు. అందుచే నిష్ప్రయోజనములు కావు. వేదాంత వాక్యములు కర్త దేవత సాధన పరములు.

ఈ సంశయమునకు సమాధానము వేదాంత వాక్యములు బ్రహ్మమునే ప్రతిపాదించుచున్నవి. ఎందులకనగా కర్మ కన్న భిన్న ప్రకరణమైన జ్ఞాన కాండను ప్రతిపాదించుచున్నవి. అవి కర్తను గురించి గాని, కర్మ శేషత్వమును గురించి గాని బోధించుట లేదు. షడ్విధ తాత్పర్య లింగముల ద్వారా బ్రహ్మపరత్వమని చెప్పుటయే సంభవము. తాత్పర్య గ్రాహక షడ్విధ లింగములను పూర్వాచార్యులీవిధముగా చెప్పిరి.

శ్లో|| ఉపక్రమోపసంహారావభ్యాసోఽపూర్వతా ఫలమ్| అర్థవాదోపపత్తీ చ లింగం తాత్పర్యనిశ్చయే ||

ఉపక్రమ ఉపసంహారములు, అభ్యాసము, అపూర్వత , ఫలము, అర్థవాదము, ఉపపత్తి (యుక్తి) అను ఆరు తాత్పర్యము నిశ్చయించుటకు హేతువులు (చిహ్నములు). "సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్" (ఛా.ఉ.. 6.2.1) ఉపక్రమము. హే సోమ్యుడా! సృష్టికి ముందు సదాఖ్య పరబ్రహ్మమే యుండెను. "ఐతదాత్మ్యమిదం సర్వం తత్ సత్యం స ఆత్మా తత్త్వమసి" (ఛా.ఉ. 6.16.3) ఈ చరాచరాత్మక సర్వము ఆత్మస్వరూపమే. అదే సత్యము, అదే ఆత్మ, అదే నువ్వు. ఇది ఉపసంహారము. ఉపక్రమ ఉపసంహారములు రెండు కలిసి ఒక చిహ్నము. ఎందులకనగా బ్రహ్మ విషయకమైన ఏక వాక్యత ఉండుట వలన. అనేక సార్లు "తత్త్వమసి" అని చెప్పుట అభ్యాసము. నిర్గుణ, నిర కార, అవిషయమైన బ్రహ్మము పేద ప్రమాణము ద్వారానే గమ్యము ఇతర ప్రమాణముల ద్వారా కాదు అనునది అపూర్వత. బ్రహ్మమను, ఒక పదార్ధ జ్ఞానము ద్వారా సర్వ జ్ఞానము ఫలము. ఉత్పత్తి, స్థితి, ప్రలయము, ప్రవేశము, నియమనము అను ఐదు అర్ధవాదములు. అనగా స్తుతి పరములు. మృత్తి కాది దృ ష్టాంతములు యుక్తులు. ఈ హేతువుల ద్వారా వేదాంత వాక్యములు బ్రహ్మ పరములనియే నిశ్చయింపవలయును. వేదాంత వాక్యములందు అనుష్ఠానము లేనిచో ప్రయోజనము లేదనుట సరిగాదు. "రజ్జు రియం నాయం సర్పః" ఇది త్రాడు పాము కాదు" అను హేయోపాది శూన్యమైన సిద్ధవస్తువైనను దాని స్వరూపోపదేశము ద్వారా బోధ కలుగును. అట్టి స్వరూప బోధ నిరర్థకము గాదు. పైగా ఆ బోధ ద్వారా అజ్ఞానాదులైన అనర్థముల నివృత్తి సంభవము.

వైయాసికన్యాయమాలా: (ద్వితీయ వర్ణకము)

శ్లో||21 ప్రతిపత్తిం విధిత్సన్తి బ్రహ్మణ్యవసితా ఉత | శాస్త్రత్వాత్తే విధాతారో మననాదేశ్చ కీర్తనాత్||

శ్లో||22 నాకర్తృతంత్రేఽస్తి విధిః శాస్త్రత్వం శంసనాదపి। మననాదిః పురా బోధాత్బ్రహ్మణ్యవసితాస్తతః ॥

శ్లోకార్థము:-

శాస్త్రము ప్రవృత్త్యాది విధులను బోధించుచున్నదా? లేక సిద్ధవస్తువు బ్రహ్మను ప్రతిపాదించుచున్నదా? శాసించుట వలన శాస్త్రమనబడును. శాస్త్రము విధి శేషమును బోధించుచున్నది. శ్రవణము తరువాత మననాదులను విధించుట వలన, విధి విషయములను బోధించుచూ వేదాంత శాస్త్రము బ్రహ్మసంబంధము చెప్పుచున్నది.

సిద్ధ వస్తువునందు విధి ప్రవృత్తి లేదు. హితమునుపదేశించుట వలన గూడ శాస్త్రమందురు. మననాదులు సాక్షాత్కారమునకు ముందు చెప్పబడనవి. అందువలన వేదాంత వాక్యములు బ్రహ్మము నందే పర్యవసించుచున్నవి.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఏకదేశిమతము : వేదాంత వాక్యములు బ్రహ్మ పరములైనను బ్రహ్మము నందే పర్యవసానమగుటలేదు. ఎట్లనగా? బ్రహ్మతత్త్వమును పరోక్ష రూపముగా చెప్పిన తరువాత అపరోక్షముగా పొందుటకు మననాదులను విధించుచున్నది. ఆ విధముగా శాసించుట వలన వేదాంతములను శాస్త్రమను చున్నారు. "శ్రోతవ్యః" అని శబ్దజ్ఞానాత్మకమైన శ్రవణమును విధించిన పిమ్మట మనన, నిధిధ్యాసములను అనుభవ జ్ఞానాత్మక-స్వరూపములైన వానిని విధించిరి. కనుక వేదాంత వాక్యములు విధిశేషములు అని చెప్పగా, సమాధానము.

వేదాంత వాక్యములు విధి శేషములు కానేరవు. ఈ వేదాంత వాక్యములు చేయుటకు, చేయకుండుటకు, విపరీతముగా చేయుటకు కర్మలవలె శక్యము గాదు. ఇవి వస్తు తంత్రములు పురుషాధీనములు గావు. అనుష్ఠేయములని చెప్పుట, అనుష్ఠేయములని శాసించుట మాత్రముచే శాస్త్రములని చెప్పు నియమము లేదు. సిద్ధ వస్తువులైన ఆత్మ, పరమాత్మలను చెప్పునది గూడ శాస్త్రమని చెప్పబడును. శబ్దము ద్వారా జ్ఞానము కలిగిన తరువాత అనుభవమునకై మననాదులు విధించిరనుట యుక్తము గాదు. "దశమః త్వమసి" నీవు పదవవాడవు అన్నట్లు శబ్దము ద్వారానే అపరోక్ష అనుభవ జ్ఞానము గలుగుచున్నది. అసంభావనా విపరీతభావనాదులను తొలగించుటకు వ్యాపారరూపమైన కర్త్రాధీనమైన మననాదులను శాబ్దబోధమునకు ముందు విధించిరి. అందులకే "తత్వమసి" అను మహా వాక్యములు బ్రహ్మను బోధించుట యందే సమాప్తమగుచున్నవి.

సూత్రార్థము : తు = పూర్వ పక్ష నిరాకరణము

తత్ : బ్రహ్మ సర్వజ్ఞము, సంపూర్ణ జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములకు కారణము

సమన్వయాత్ : చక్కగా, తాత్పర్యము ద్వారా, బ్రహ్మములోనే అన్ని వేదాంత వాక్యముల అన్వయము.

ఈ వేదాంత వాక్యములను కర్మ, ఉపాసనల పరముగా చెప్పిన శ్రుతహాని అశ్రుత కల్పనా దోషముల ప్రసంగము వచ్చును. "బ్రహ్మన కర్తృ పరత్వం" బ్రహ్మ కర్తాధీనము గాదు. "తత్ కేన కం పశ్యేద్". సర్వము ఆత్మ రూపమే అని తెలిసికొనిన ఏ పదార్థమును ఏ సాధనచే ఏ కర్త కనుగొనగలడు. పై శ్రుతిలో క్రియాకర్త ఫలములను నిరాకరించిరి.

శబ్దజ్ఞానము తరువాత అనుభవాత్మకమైన మనన నిదిధ్యాసలు విధించిరి. "దశమస్త్వమసి" అను వాక్యము ద్వారా అపరోక్ష జ్ఞానము. బ్రహ్మోపాసన ద్వారా మోక్షమనిన అది సరిగాదు. బ్రహ్మజ్ఞానము ద్వారా మోక్షము. సిద్ధ వస్తువునందు ప్రవృత్తి లేదు. శబ్దశక్తి ద్వారా గ్రహించలేము అనిన సరికాదు. "పుత్ర స్తే జాతః" అను హర్ష సూచకమును పదచిహ్నముల బట్ట చూచి భాషరాని మధ్యముడు తెలుసుకొనును. "కన్యాతే గర్భవతి" అను దుఃఖ సూచకమును గూడ శబ్దశక్తి ద్వారా గ్రహించగలరు.

# 5. ఈక్షత్యధికరణము

క్రిందటి నాలుగు సూత్రములలో ఎవరికి బ్రహ్మాత్మైక్య జ్ఞానము పురుషార్థమో వారికి కర్మకాండ ప్రసక్తి లేకయే వేదాంత వాక్యములు బ్రహ్మను బోధించుచున్నవనియు, బ్రహ్మము నందు సమన్వయమును పొందుచున్నవనియు చెప్పబడెను. ఆ బ్రహ్మమే సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడనియు, ఈ జగత్తునకు సృష్టి, స్థితి లయ కారకుడనియు చెప్పబడినది.

సంగతి : బ్రహ్మము కూటస్థమగుట వలన విక్రియారహితము. బ్రహ్మమందు క్రియాశక్తియే లేదు. క్రియాశక్తి లేని బ్రహ్మము జగత్కారణమెట్లగును. ఈ విధమైన ఆక్షేపము కలిగినందున ఈ అధికరణమారంభించిరి. పూర్వాధికరణముతో దీనికి ఆక్షేపసంగతి.

విషయము : "సదేవసోమ్య ఇదమగ్రే ఆసీత్" ఏకమేవాద్వితీయమ్" ఛా.ఉ. (6.2.1) సృష్టికి ముందు ఒక అద్వితీయమగు సద్ బ్రహ్మము మాత్రమే ఉండెను. అనుశ్రుతి వాక్యము విచారణీయ విషయము.

సంశయము : "తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి, తత్తేజో అస్సృజత (ఛా.ఉ. 6.2.3) "అది సంకల్పించెను, నేను ప్రజలను సృష్టించెదను" అని. ఈ వాక్యము ద్వారా సాంఖ్యుల ప్రధానము చర్చించబడినదా? లేక బ్రహ్మమా? అని సంశయము.

పూర్వపక్షము : జ్ఞానము మరియు క్రియాశక్తితో కూడిన జడవస్తువైన ప్రధానమే అన్నింటికి కారణము. సత్ శబ్దవాచ్యమీ ప్రధానమే.

సిద్ధాంతము : జగత్తు సృష్టించువానిని సంకల్పక్రియకు కర్తగా చెప్పిరి. సంకల్పక్రియ చేయువాడు చైతన్య ధర్మము గలవాడై ఉండవలయును. కాన సత్శబ్ధవాచ్యము బ్రహ్మమే. ఈ చైతన్యముతో తాదాత్మ్యము చెందిన వారికి మోక్షము చెప్పిరి. ఈ విషయములు ప్రధానపక్షములకు విరోధములు.

5. ఈక్షతేర్నా ఽశబ్ధమ్ 1.1.5

బ్రహ్మమందు వికారము అసంభవము బ్రహ్మ శరీర రహితము. ఏకాత్మ రూపము. కనుక బ్రహ్మ జగత్కారణము కాజాలదు. అందువలన ఈ సూత్రము చెప్పిరి.

సూత్రార్థము : ఈక్షతేః = "తదైక్షత" అను శ్రుతి వాక్యములో జగత్ సృష్టికర్త యందు ఈక్షితృత్వము వినబడుచున్నది. ఈక్షితృత్వమనగా సంకల్పము. సంకల్పపూర్వకసృష్టి హేతుగర్భ విశేషణము. న అశబ్దమ్ = ప్రధానము జగత్ కారణము కాదు. అది వేద బాహ్యము. దానిని శ్రుతి ద్వార ప్రతిపాదించలేదు గనుక.

వైయాసికన్యాయమాల

23. తదైక్షతేతివాక్యేన ప్రధానం బ్రహ్మ వోచ్యతే | జ్ఞాన క్రియాశక్తిమత్త్వాత్ ప్రధానం సర్వకరణమ్ ||

24. ఈక్షణాత్ చేతనం బ్రహ్మ క్రియాజ్ఞానే తు మాయయా| ఆత్మశబ్దాత్మతదాత్మ్యే ప్రధానస్య విరోధినో||

"తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి తత్తేజో అస్సృజత" "సత్ శబ్దవాచ్యమైనది. బహుభవనమునకై సంకల్పించెను. అది అగ్నిని సృజించెను". ఈ వాక్యములో సృష్టికర్త ప్రధానమా? లేక బ్రహ్మమా? జ్ఞానశక్తి, క్రియాశక్తి కలిగిన ప్రధానము సృష్టి కారణమగును.

చైతన్యధర్మము గలిగి సంకల్పము చేయగలిగిన బ్రహ్మమే జగత్స్రష్టా. క్రియాశక్తి జ్ఞానశక్తి దానియందు మాయ ద్వారా సంభవములు. సత్శబ్దవాచ్యతత్వమును ఆత్మశబ్దముతో చెప్పిరి. దానితో తాదాత్మ్యము చెందిన మోక్షప్రాప్తి చెప్పిరి. చైతన్యము, మోక్షప్రాప్తి, సంకల్పము, సత్ శబ్దము, సత్ శబ్దమును ఆత్మయనుట ఇవన్నియు, ప్రధానము జడమగుట వలన దానికి విరోధములు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఛాంద్యోగ్యోపనిషత్తులో "సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్" (6.21) " హేప్రియదర్శన సృష్టికి ముందు ఈ నామరూపాత్మకప్రపంచము సజాతీయ విజాతీయ స్వగత బేధశూన్యమైన కేవలసద్రూపమై ఉండెను" అని మొదలిడ , "తదైక్షత బ్రహు స్యాం ప్రజాయేయ"( 6.2.3) సద్రూపమైన వస్తువు నేను అనేక రూపములుగా ఉత్పన్నమవుతానని సంకల్పించెను. ఇచట సాంఖ్యులీవిధముగా చెప్పుచున్నారు జగత్కారణము బ్రహ్మ కానేరదు. ఆ ప్రధానములో రజోగుణము ఎక్కువగుట వలన క్రియాశక్తి మత్వము మరియు సత్వగుణము ఎక్కువైన సర్వజ్ఞత్వము సంభవమగును. నిర్గుణకూటస్థబ్రహ్మమునందు జ్ఞానశక్తి, క్రియాశక్తి అసంభవము. గనుక సృష్టికి కారణము కాజాలదు.

ఇచ్చట సిద్ధాంతి చెప్పునదేమనగా, సంకల్పపూర్వక సృష్టి వినబడుటచే చైతన్యమైన బ్రహ్మమే సత్ శబ్ద వాచ్యమైన సృష్టికర్త. అచేతనము జడమైన ప్రధానము నందు సంకల్పశక్తి అసంభవము మాయద్వార బ్రహ్మమందు జ్ఞానశక్తి క్రియాశక్తి సంభవములు. "అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి" (ఛా. ఉ. 6.3.2) "ప్రాణమును ధరించిన శరీరాధ్యక్షుడైన జీవాత్మరూపముతో లోపల ప్రవేశించి నామరూపములను సృష్టించెదను". నామరూపములను ఉత్పత్తి చేయు కర్తను, జగత్ కారణ దేవతను, స్వవాచకమైన ఆత్మశబ్దము ద్వారా చైతన్యమైన జీవుని ఉపదేశించిరి. అంతేగాక "తత్వమసి" అని చెప్పుచూ చైతన్యవంతుడైన శ్వేతకేతువును, జగత్ కారణముతో తాదాత్మ్యము గురువు ఉపదేశించెను. ఆత్మశబ్ద ప్రయోగము, కారణ తాదాత్మ్యము ఈ రెండు విషయములు జడమైన ప్రధానము జగత్కారణమైన సంభవము కానేరవు. అందువల్ల చైతన్యమైన బ్రహ్మమే సత్శబ్దవాచ్యము.

ప్రధానైక్య సంపదుపాసన ఫలము పూర్వపక్షము. బ్రహ్మాత్మైక్య జ్ఞానము జ్ఞేయమని సిద్ధాంతపక్షము ప్రధానమందు ఉన్నవని చెప్పిన గుణములు, జ్ఞానశక్తి, క్రియాశక్తి బ్రహ్మయందు మాయద్వారా సంభవములు. ప్రధానము సృష్టికర్త కాదనుటకు సిద్ధాంతి తర్కమును చెప్పుచున్నాడు. సత్వ గుణోత్కర్షవల్ల ప్రధానమందు జ్ఞానశక్తి సర్వజ్ఞత్వము చెప్పినందువలన రజోగుణ తమోగుణ ఉత్కర్షవల్ల ఆ ప్రధానమందు అల్పజ్ఞత్వము కల్గునని చెప్పవలయును. కాన ఆ ప్రధానము సృష్టికారణము కాజాలదు.

"తత్తేజో అస్పృజత" తా ఆపః ఐక్ష్యంత" "అగ్ని సృష్టించెను", "జలములు సంకల్పించెను" అను శ్రుతి వాక్యము ఉండుట వలన అగ్ని, జలము అను జడపదార్థములు సృష్టించెను అను శ్రుతివాక్యముల వల్ల జడప్రధానము యొక్క సంకల్పము గౌణమని చెప్పవచ్చును గదా. దానికి సూత్రము.

6. గౌణశ్చేన్నాత్మ శబ్దాత్ 1.1.6.

సూత్రార్థము : శ్రుతిలో చెప్పిన ఈక్షణ శబ్దము గౌణమని చెప్పజాలము. ఎందులకనగా శ్రుతిలో జగత్కారణ కర్తయందు ఆత్మశబ్దము ప్రయోగించబడెను. జగత్కారణము చైతన్యము, ఈక్షణము ముఖ్యమే గాని గౌణము గాదు. "సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్ ఏకమేవాద్వితీయమ్". "తదైక్షత బహుస్యాం ప్రజాయేయ" తత్తేజో అస్పృజత" ఛాం. ఉ.6/2/1-3) ఓ సౌమ్యుడా; సృష్టికి ముందు ఈ జగత్తు సత్పదార్థమై యుండెను. అతడు సంకల్పించెను. అతడు అగ్నిని సృష్టించెను. సత్శబ్ద వాచ్యమైన జగత్కారణమునందు ఆత్మశబ్ద ప్రయోగము వల్ల

"తద్దైక్షత" అనుచోట తద్ అనునది సర్వనామ శబ్దము. సర్వము బ్రహ్మము, దాని నామము తద్ అని, దాని భావమే తత్త్వమ్. అది బ్రహ్మ యొక్క యథాత్మ్యమ్. దానినే చూచు స్వభావము గలవారు తత్వదర్శులు.

ఈక్షణ చేసి అగ్ని, జలము, భూములను సృష్టించిన ఆ సృష్టికర్తను దేవత శబ్దముతో పరామర్శించి, శ్రుతిలో "అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య నామ రూపే వ్యాకరవాణి" అని చెప్పిరి. (ఛాం.ఉ, 6.3.2) ఇచ్చట కూడ జగత్కారణము ఆత్మశబ్దము వినబడుచున్నది. ప్రధానము సృష్టికర్తయైన దేవత శబ్దముతో పరామర్శించి యుండవలయును. కాని "జీవాత్మనా" అనిరి. జీవుడనగా (చైతన్యము) ప్రాణము ధరించిన శరీరాధ్యక్షుడని అర్ధము. అచేతనమైన ప్రధానము ఆత్మశబ్ధార్ధము కానేరదు.

ఆత్మకార్యములన్నీ చేయు అచేతన ప్రధానమందు ఆత్మ శబ్ద ప్రయోగము గావించిరనవచ్చును గదా. ఎట్లనిన రాజగారు తన కార్యములన్నీ చేయు భద్రసేనుడు అను సేవకుని యందు "మమాత్మా భద్రసేనః" భద్రసేనుడు నా ఆత్మయే అని ప్రయోగించినట్లు, ప్రధానము ఆత్మయొక్క (పురుషుని) భోగ, మోక్షముల కార్యము నిర్వహించుననిన ప్రశ్నకు ఈ సూత్రమును చెప్పిరి.

7. తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్ 1.1.7

సూత్రార్ధము : జగత్కారణమైన బ్రహ్మయొక్క ఐక్యజ్ఞానము వలన పురుషునికి మోక్షపదేశము శ్రుతి ఉపదేశించుచున్నది. అచేతన ప్రధానైక్య జ్ఞానము వలన మోక్షము దొరకదు. ప్రధానము సృష్టి కారణము గాదు అని చెప్పుటకు 'న' కారము పూర్వ సూత్రము నుండి అనువర్తించును "స ఆత్మా" "అది ఆత్మ" అని సూక్ష్మ ఆత్మ తత్వమును గైకొని, ఓ శ్వేతకేతు "తత్వమసి" అదే నువ్వు, అనువాక్యము ద్వారా ముముక్షువైన శ్వేతకేతువునకు ఆత్మనిష్ఠను ఉపదేశించిరి. ఆచరణవంతులైన పురుషులు ఆ బ్రహ్మను తెలుసుకుందురు. "ఆ జ్ఞానికి కైవల్య ప్రాప్తికి ప్రారబ్ద పరిసమాప్తి అవధి" (ఛాం.ఉ. 6.14.2) అని మోక్షోపదేశము. చేతనమైన ముముక్షువునకు జడప్రధాన నిష్ఠ అసంభవము. అట్టి అనర్ధ ఉపదేశముచే సాంఖ్యశాస్త్రము అప్రమాణము. కాన ఆత్మ శబ్దము చైతన్యపరము.

8. హేయత్వావచనాచ్చ (1.1.8)

సూత్రార్ధము : న కారము అనువర్తించును. ప్రధానము జగత్కారణము కాజాలదని చెప్పుటకు. ఈ ఆత్మోపదేశము స్థూల అరుంధతీ న్యాయము ద్వారా ప్రధానమనిన అది సరిగాదు. స్థూల అరుంధతీ న్యాయము ద్వారా ప్రధానము నిషేధించలేదు. అందువల్ల ప్రధానము సత్‌శబ్ద వాచ్యము గాదు.

"స ఆత్మా తత్వమసి" అన్నచోట సత్‌శబ్ద వాచ్యము ప్రధానమనిన, ప్రధానమును ఉపదేశించవలయును. ముఖ్య ఆత్మను ఉపదేశించుటకు శాస్త్రము స్థూల అరుంధతీ న్యాయము ద్వార ఆత్మను ఉపదేశించిన ప్రధానమును పరిత్యజించ మని చెప్పలేదు. సత్‌మాత్రమైన ఆత్మజ్ఞానము మరియు దానియందు నిష్ఠ చెప్పి ఆరవ అధ్యాయము ముగించిరి. కారణ జ్ఞానము ద్వారా అన్ని కార్యజ్ఞానములు కలుగునని ప్రతిజ్ఞ చేసిరి. అనగా ఆత్మజ్ఞానము ద్వారా సర్వజ్ఞానము. ప్రధానమును త్యజించమని చెప్పిన ఈ ప్రతిజ్ఞకు విరోధము కలుగును. అందువలన ప్రధానము సత్ శబ్ద వాచ్యము గాదు.

పై నాలుగు సూత్రములలో ప్రధానమునకు 'ఈక్షణ' క్రియను నిరసించి, అది జగత్కారణము కాదని ఖండించిరి. ఇపుడు స్వతంత్ర హేతువుల ద్వారా ప్రధానమును జగత్కారణముగా నిరసించుటకు (అగ్రిమ) ముందు మూడు సూత్రములను చెప్పుచున్నారు.

9. స్వాప్యయాత్ (1.1.9)

సూత్రార్ధము : "న" అనువర్తించును. ప్రకృత సత్ శబ్ద వాచ్యమైన ఆత్మయందు నిద్రలో ఈ జీవుడు ఒకటౌచున్నాడు. "సతా సోమ్య తదా సంపన్నోభవతి" "స్వమపీతోభవతి" (ఛాం. 6.8.1) ఇచ్చట లయము వినిపించుచున్నది. మరియు స్వశబ్దముతో ఆత్మనే చెప్పుచున్నారు. "అపీతః" అనగా లయమని అర్థము స్థూల, సూక్ష్మ ఉపాదులు ఉపరమము కాగా సుషుప్తిలో అజ్ఞానము తప్ప ఉపాధి విశేషము లేనందున, ఆ ఆత్మచైతన్యములో అన్ని ప్రాణులు విలయమగుచున్నవి. ఆ చైతన్యమునే సత్ శబ్దముతో, జగత్కారణముగా చెప్పిరి, కాని ప్రధానము కాదు.

10. గతి సామాన్యాత్ (1.1.10)

సూత్రార్ధము : అన్ని వేదాంత వాక్యములలో చెప్పు జ్ఞానము సామాన్యము. అన్ని ఉపనిషత్తులలో జగత్కారణము "చైతన్యమనే చెప్పబడినది. జడ ప్రధానము కారణము కాదు. "న" అనువర్తించును. "ఆత్మనః ఆకాశః సంభూతః" (త్తై.27) "ఆత్మన ఏ వేదం సర్వం" (ఛాం. 7.26.1) "ఆత్మనః ఏష ప్రాణో జాయతే" (ప్రశ్న. 3.3) అనగా "ఆత్మ నుండి ఆకాశము ఉత్పన్నమైనది". "ఆత్మ నుండి ఈ సంపూర్ణ సంసారముత్పన్నము" "ఆత్మ నుండి ఈ ప్రాణము పుట్టెను". ఇలాంటి అన్ని వేదాంత వాక్యములు చైతన్యమును జగత్కారణముగా ప్రతిపాదించుచున్నవి. ఈ గతి సామాన్యము వలన సర్వజ్ఞ బ్రహ్మమే జగత్కారణము.

11. శ్రుతత్వాచ్చ (1.1.11)

సూత్రార్ధము : "స కారణం కరణాధిపాధిపో నచాస్య కశ్చిజ్జనితా న చాధిపః" (శ్వే. 6.9) అను శ్రుతిలో జగత్కారణము సర్వజ్ఞ బ్రహ్మమని చెప్పబడినది. అందువల్ల బ్రహ్మమే జగత్కారణము. ప్రధానము గాదు. ప్రధానమునందు వేదాంత వాక్యముల సమన్వయము కానేరదు. ఎందువల్లననగా 'శ్రుతత్వాచ్చ'. పైన చెప్పిన శ్వేతాశ్వతర వాక్యములో సర్వజ్ఞ ఈశ్వరుని ప్రసంగము చెప్పుచు "ఆ ఈశ్వరుడే జగత్కారణము, ఇంద్రియములకు అధిపతి, జీవులకు అధిపతి, వానిని శాసించువారు గాని, వాని జన్మకు కారణము గాని వేరొకరు లేరు" కనుక సర్వజ్ఞ ఈశ్వరుడే జగత్కారణము. ప్రధానము కాదు.

# 6. ఆనందమయాధికరణము

ఇంతవరకు బ్రహ్మ విచారమునకు ఉపనిషత్తులే ప్రమాణములనియు, అవన్నియు ఆ పరమేశ్వరుని గూర్చి చెప్పుచున్నవనియు సిద్ధాంతము చేయబడినది. ఉపనిషద్వాక్యములు నిర్విశేష బ్రహ్మ పరములు.

ఏకదేశిమతము :-

సంగతి : క్రిందటి అధికరణములో ఈక్షణము గౌణమని చెప్పబడినది. అట్లే "ఆత్మాఽఽనందమయః" (త్రై. 2.5) అను వాక్యములో మయట్ ప్రత్యయము వికారార్థమగుటచే తత్వ నిర్ణయము గాదని చెప్పుచు ప్రత్యుదాహరణ సంగతి కలదనిరి.

విషయము "ఆత్మాఽఽనందమయః" "ఆనంద వికారమగు ఆత్మ జీవుడు" అను తైత్తిరీయ వాక్యము విచారణీయము.

సంశయము : "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అను వాక్యములో మొదలు పెట్టిన ప్రకరణములో గల ఆనందమయః అను శబ్దము ద్వారా బ్రహ్మము చెప్పబడినదా? లేక వేరొక పదార్థము ఆనందమయ వాచ్యముగా చెప్పబడినదా?

పూర్వపక్షము : వికారార్థమైన మయట్ ప్రత్యయము వల్ల బ్రహ్మ విభిన్నమైన వేరొక పదార్థము చెప్పబడినది దానికి ప్రియ మోద ప్రమోదములు అవయవములు.

సిద్ధాంతము : పునరావృత్తి మరియు ఉపక్రమములను దృష్టిలో ఉంచుకుని చూసిన, ఆనందమయమను పదమునకు బ్రహ్మమనియే అర్థము. ఇచ్చట ప్రయోగించిన మయట్ ప్రత్యయము ప్రాచుర్యార్థములో గాని వికారా-ర్థములో గాదు. నిరవయవ విశుద్ధ బ్రహ్మము నందు ప్రియాది అవయవములు ఆరోపింపబడినవి. అవి పరమార్థ దృష్టిలో లేవు.

వైయాసికన్యాయమాలా:

25. సంసారీ బ్రహ్మ వా ఆనందమయః సంసార్యయం భవేత్ | వికారార్థమయట్ శబ్దా త్ప్రియాద్యవయవోక్తితః||

26. అభ్యాసోపక్రమాదిభ్యో బ్రహ్మాఽఽనన్దమయో భవేత్| ప్రాచుర్యార్థో మయట్ శబ్దః ప్రియద్యాఃస్యురూపాధిగాః||
"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ అనువాక్యము ద్వారా ఉపక్రమించిన బ్రహ్మమే ఆనందమయ శబ్దవా చ్యమా? లేక సంసారి జీవుడా? వికారార్థమైన మయట్ శబ్ద ప్రయోగము వలనను ప్రియమోద ప్రమోదములు చెప్పుటవలనను బ్రహ్మభిన్నమైన సంసారి జీవుడని పూర్వపక్ష నిర్ణయము.

పునరావృ త్తి ఉపక్రమాదులను పర్యవేక్షించిన ఆనందమయ మనుపదమునకు బ్రహ్మమనియే అర్థము చెప్పవలయును. 'మయట్' ప్రత్యయమిచట (వికారార్థములో కాదు) ప్రాచుర్యార్థములో చెప్పిరి. విశుద్ధ నిరవయవ బ్రహ్మమందు ప్రియాది అవయవములు ఔపాధికమని ఏకాదేశిమతము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఈ ఆరవ అధికరణము ముందు ఏకదేశిమతాను సారము చెప్పిరి. త్రైత్తిరీయోపనిషత్తులో దేహ, ప్రాణ మన, బుద్ధి, ఆనందరూపములను, అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయమను పేర్లతో పంచకోశములను క్రమముగా ఒకదానిలోపల వేరొకటి చెప్పిరి. అన్నింటికన్న లోపలనున్న ఆనందమయ కోశము సంసారి జీవుడా లేక పరమాత్మయా అని సందేహము.

సంసారి జీవుడే ఆనందమయము. ఎందులకనగా, ఆనందము యొక్క వికారమే ఆనందమయము. వికారార్థము సంసారి యందు సంభవము అవికారమైన పరమాత్మ యందు సంభవము కాదు. ఆ ఆనందమయమునకు ప్రియము శిరము, మోదము దక్షిణ పక్షము (రెక్క). ప్రమోదము ఉత్తర పక్షము, ఆనందము శరీర మధ్య భాగమైన ఆత్మ. బ్రహ్మ పుచ్ఛము (తోక అనగా ఆధారము) (త్రై.2.5) ఇట్లు ఆనందమయమునకు ఐదు అవయవములు చెప్పిరి. కోరుకున్న ఆవశ్యకమైన వస్తువును చూచుట ద్వార వచ్చు సుఖమును ప్రియమందురు. అది దొరికిన వచ్చు సుఖమును మోదమందురు. దానిని అనుభవించుటచే వచ్చు సుఖమును ప్రమోదమందురు. అజ్ఞానోపాధి ద్వారా సుషుప్త్యాదులలో కలుగు సుఖమును ఆనందమందురు. నిరుపాధిక సుఖము బ్రహ్మము. ప్రియాది ఐదు అవయవములను తల ఱెక్కలు తోకలతో పోల్చుట ఉపాసన సౌలభ్యమునకు. పక్షి రూపముగా చెప్పిన ఆనందమయమునకు తల ఱెక్కలు మూడవయవములు. ఆత్మ శబ్దము ద్వార శరీర మధ్యభాగము నాలుగవ అవయవముగా చెప్పిరి. ఆధారము పాదములు అదే ఐదవ అవయవము. కాని అంశములేని పరమాత్మయందు అవయవములు కల్పించుట యుక్తము కాదు. అందువల్ల ఆనందమయము ఆ సంసారియే ఈ విధముగా చెప్పినదానికి సమాధానము. ఆనందమయము పరమాత్మయే ఎందులకనగా అనేకసార్లు పునరావృత్తి చెప్పుట వలన. "సైషా ఆనందస్య మీమాంసా భవతి" ఈ విధముగా ఆనందము యొక్క పూజ్య విచారము జరుగును. "ఏతమానందమయమాత్మానముపసంక్రామతి" 'ఈ ఆనందమయ ఆత్మను జీవుడు పొందుచున్నాడు'. ఈ విధముగా ఆనందమయము యొక్క పునరావృత్తి చెప్పబడెను. వేదాంత వాక్యముల తాత్పర్యము బ్రహ్మమందే అని చెప్పియుంటిమి. "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అని ఉపక్రమములో బ్రహ్మను చెప్పి, "ఇదం సర్వ మసృజత" ఈ దృశ్యమాన సంపూర్ణ జగత్తును సృష్టించెను. సర్వమూ సృష్టించుట వలన కూడ ఆనందమయము బ్రహ్మ. "మయట్" (వికారార్థము) ప్రత్యయము బ్రహ్మమునందు యుక్తియుక్తము గాదు. ప్రాచుర్యార్థము సంభవము. ప్రియాది అవయవములు కూడ విషయ దర్శనము ద్వారా ఉపాధి ఉన్న తత్వమునకే కలుగును. అందువల్ల ఆనందమయము పరమాత్మయే అని ఏకదేశిమతము.

<u>**వృత్తికారమతానుసారము సూత్రముల వ్యాఖ్యానము :-**</u>

12. ఆనందమయో అభ్యాసాత్ (1.1.12)

సూత్రార్థము : ఆనందమయ శబ్దమునకు అర్థము పరమాత్మయే. ఎందులకనగా పరమాత్మయందు ఆనందశబ్దము బ్రహ్మ అర్థములో అనేకసార్లు ఆవృత్తి గావించిరి గనుక. ఈ అధికరణములో ఆనందమయ రూపముగా జీవుని ఉపాసన అని పూర్వపక్షమైన, నిర్విశేష బ్రహ్మను అభేద రూపముగా సాక్షాత్కరించుకొనుట అని సిద్ధాంతము.

తైత్తిరీయోపనిషత్తులో అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములు క్రమముగ చెప్పిరి. "అన్యోన్తరాత్మా ఆనందమయః" ఆ తరువాత విజ్ఞానమయ కోశమునకు లోపల దానికన్న భిన్నమైన ఆత్మ ఆనందమయ కోశము గలదనిరి. "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అను ప్రకృత పరబ్రహ్మమును ఆనందమయ శబ్దముతో చెప్పుచున్నారా? లేక బ్రహ్మ భిన్నమైన అముఖ్య ఆత్మను చెప్పుచున్నారా ? అని సంశయము.

ఎందులకనగా అన్నమయాది అముఖ్య ఆత్మ ప్రవాహములో ఆనందమయ శబ్దము వచ్చినది గనుక బ్రహ్మ భిన్నవస్తువుని చెప్పిరని పూర్వపక్షము.

సిద్ధాంతి పరమాత్మయే ఆనందమయ శబ్దార్థమనెను. ఎందులకనగా పరమాత్మయందే ఆనందమయ శబ్దమును అనేకసార్లు ప్రయోగించిరి. ఆనందమయ ప్రసంగములో "రసం హ్యేవాయం లబ్ధ్వా ఆనందీ భవతి" ఈ జీవుడు రసమును పొంది ఆనందించుచున్నాడు. "యదేష ఆకాశ ఆనందో నస్యాత్" "ఈ సుఖస్వరూపుడైన పరమాత్మ హృదయాకాశములో లేనిచో ఈ జీవుడు ఎట్లు ఆనందమును పొందును". "ఏష హ్యేవానందయాతి" "ఈ పరమాత్మయే లోకమును సుఖపెట్టుచున్నాడు." (తై 2.7) "సైషానందస్య మీమాంసా" ఆనందవిచారమిదియే. "ఏతమానందమయమాత్మానముపసంక్రామతి" జ్ఞాని ఈ ఆనందమయమాత్మను దాటును. అనగా దానితో తాదాత్మ్యమును వదలివేయును (తై 2.8)

ఇట్లు అనేక వాక్యములలో ఆనందశబ్దము బ్రహ్మ పరముగా చెప్పిరి. అందువల్ల ఆనందమయాత్మ బ్రహ్మమే. అముఖ్య ఆత్మ ప్రవాహములో చెప్పుట వల్ల ఆనందమయము ముఖ్యము గాదనిన? అది సరిగాదు. అన్నమయాదులలో అంతరాత్మగా ఆనందమయమున్నది స్థూల అరుంధతీ న్యాయయముతో అన్నమయాదులకు సర్వాంతరము గనుక ఆనందమయము పరమాత్మయే.

ఆనందమయములో 'మయట్' ప్రత్యయార్థము వికారము.

13. వికారశబ్దాన్నేతి చేన్న ప్రాచుర్యాత్ 1.1.13

సూత్రార్థము : 'మయట్' ప్రత్యయము వికారార్థములో గనుక ఆనందమయ శబ్దమునకు అర్థము బ్రహ్మము కాదనిన అట్లనుట సరిగాదు. ఎందులకనగా ప్రాచుర్యార్థములో 'మయట్' ప్రత్యయ విధానము గలదు. అందువలన ఆనందమయ శబ్దము పరబ్రహ్మమే.

నిర్వికార బ్రహ్మమునందు వికారము లేదనిన అన్నవికారము అన్నమయ శరీరమువలె చెప్పవచ్చును గదా. 'తత్ ప్రకృతవచనే మయట్' ప్రాచుర్యార్థములో పాణిని మహర్షి 'మయట్' ప్రత్యయము చెప్పిరి. 'తస్య వికారః' సూత్రము ద్వార ఇచ్చట వికార ర్థము గాదు. "అన్నమయో యజ్ఞః" అన్నచోట అన్న ప్రచురతవలె. ప్రచురమనుష్యానందము నుండి ప్రారంభించి వందరెట్లు, వందరెట్లు ఆనందమును ఎక్కువగా చెప్పుచు నిరతిశయ ఆనందము బ్రహ్మానందమనిరి. అందు వలన ప్రాచుర్యార్థములో 'మయట్' అనిరి.

'మయట్' ప్రత్యయము ప్రాచుర్యార్థములో చెప్పుటకు కారణాంతరము.

14. తద్ధేతు వ్యపదేశాచ్చ (1.1.14)

సూత్రార్థము : "ఏష హ్యేవానందయాతి" ఈ ఆనందమయ బ్రహ్మమే పరిపూర్ణ విశ్వమునకు ఆనందమును ఇచ్చుచున్నది. అందరి ఆనందమునకు బ్రహ్మమే కారణము. అందువల్ల ఆనందమయ శబ్దార్థము

పరబ్రహ్మయే. అందరి ఆనందమునకు బ్రహ్మ కారణమని చెప్పుటవల్ల ప్రాచుర్యార్థములోనే మయట్ ప్రత్యయము. ఆనందమున్న వాడే వేరొకరికి ఆనందమీయగలడు, ఎట్లనగా డబ్బున్నవాడే పంచగలడు.

15. మాంత్రవర్ణికమేవ చగీయతే (1.1.15)

సూత్రార్థము : "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" (త్రై.2.1) ఈ మంత్రవాక్యములో నిర్ణయించిన బ్రహ్మమే "అన్యోన్తరాత్మాఽఽనందమయః" అను బ్రాహ్మణ వాక్యములో చెప్పిరి. అదే ప్రాప్తము. అందువల్ల ఆనందమయ శబ్దార్థము బ్రహ్మమే.

"బ్రహ్మవిదాప్నోతి పరమ్" "బ్రహ్మను అనుభవించిన వాడు బ్రహ్మమునే పొందుచున్నాడు". అని ఉపక్రమించి (బ్రహ్మము సత్యమును జ్ఞానమును అనంతమునై యున్నది) తై.2.1 అని విశేషణములతో నిర్ణయించిరి. ఇది మంత్రవాక్యము. దీనినే బ్రాహ్మణ వాక్యములో "అన్యోంతరాత్మాఽఽనందమయః"వేరొక ఆత్మ ఆనందమయములోపల నున్నదనిరి. మంత్ర బ్రాహ్మణులకు ఏక వాక్యత్వములేనిచో శ్రుతహాని అశ్రుత కల్పన దోషము కల్గును గనుక ఆనందమయము పరమాత్మయే.

16. నేతరోనుపపత్తేః (1.1.16)

సూత్రార్థము : ఆనందమయము జీవుడు గాదు (నేతరః) ఎందులకనగా 'సో కామయత'అను శ్రుతి-వాక్యములో పరమాత్మ యొక్క సృష్టి సంకల్పము వినిపించుచున్నది. అది జీవునికి అసంభవము. అందువల్ల ఆనందమయము పరమాత్మయే.

జీవుడు ఎందులకు ఆనందమయము కాదు అనిన యుక్తి సంగతము గాదు గనుక (అనుపపత్తేః) ప్రకృత ఆనందమయ ప్రసంగమునకు విరోధము వచ్చును. ఆనందమయ ప్రసంగము వదలిపెట్టి ఆ పరమాత్మ సంకల్పించెను. "నేను అనేక రూపములలో ప్రజలుగా రూపొందుదును గాక"సృ ష్టికి పూర్వము సృష్టించవలసిన వికారములు సృష్టికర్తకు అభిన్నము. మరియు కామ సంకల్పమునకు జీవుడనిన విరోధము కలుగును. అందువల్ల సర్వవికారముల సృష్టి పరమాత్మకన్న భిన్నమైన వానిలో చెప్పిన యుక్తి సంగతము కానేరదు.

17. భేద వ్యవదేశాచ్చ (1.1.17)

సూత్రార్థము : "రసం హ్యేవాయం" అనుశ్రుతిలో ఆనందమయము జీవునికన్న భిన్నమైన పరమాత్మలో చెప్పబడెను.

ఆనందమయము జీవుడు గాదు. "రసో వై సః। రసం హ్యేవాయం లబ్ధ్వాఽఽనందీ భవతి" పరమాత్మ రస స్వరూపుడు. ఆ రస స్వరూపమైన ఆనందమును పొంది ఈ జీవుడు ఆనందితుడగుచున్నాడు. ఇచట ఆనందము పొందువాడు జీవుడు, ఆనందమయము పరమాత్మ పొందబడేది అని భేదరూపముగా ఉపదేశించిరి. ఎచ్చటనూ పొందువాడు, పొందబడేదిగా కానరాదు. అచ్చట కూడ ఉపాధి భేదముననుసరించి "భేదవ్యపదేశాచ్చ" అనిరి. అందువల్ల పారమార్థిక భేదము (భిన్నత్వము) శంకింపరాదు. అట్లనిన ఆనందమయము శబ్దము ద్వారా సాంఖ్యుల ప్రధానమని చెప్పిన.

18. కామాచ్చ నానుమానాపేక్షా (1.1.18)

సూత్రార్థము : "సోకామయత" అను శ్రుతివాక్యములో ఆనందమయమును సంకల్పము చేయువాడనిరి. కాన అనుమానము ద్వారా నిశ్చయించు సాంఖ్యుల ప్రధానము ఆనందమయము కానేరదు.

అంతేగాక "ఈక్షతేర్నా శబ్దమ్" అను సూత్రములో ప్రధాన కారణవాదము నిరాకరించిరి. మరల దాని ప్రసంగము సరికాదనుట సరిగాదు. ఎందులకనగా కామనా కర్తృత్వాదుల శ్రవణమువల్ల ఈ ప్రసంగములో మరల ప్రధానము నిరాకరించుట దోషముగాదు.

19. అస్మిన్నస్యచ తద్యోగం శాస్తి (1.1.19)

| | | |
|---|---|---|
| సూత్రార్థము:- అస్మిన్ | = | ఆనందమయములో |
| అస్య | = | ముముక్షువు యొక్క చిత్తము |
| తద్యోగం | = | ముక్తితో అభేదము |
| శాస్తి | = | చెప్పుచున్నది |

ఇందువల్ల గూడ ఆనందమయ శబ్దార్థము జీవ, ప్రధానములు కానేరవు. ఆనందమయమును తెలుసుకున్న జీవునికి దానితో ఏకత్వము శ్రుతి చెప్పుచున్నది. జడ ప్రధానము చైతన్యముతో ఏకీభవించలేదు.

"యదా హ్యేవైష ఏతస్మిన్ అదృశ్యే అనాత్మ్యే అనిరుక్తే అనిలయనే అభయం ప్రతిష్ఠాం విన్దతే" (తై 2.7) ఎప్పుడు ఇంద్రియ అగోచరము. అసంగము, వాణికి అవిషయము మరియు అవినాశియైన ఆత్మయందు ఈ జీవుడు ప్రతిష్ఠితమగునో అప్పుడు ఆనందమయ స్వరూపుడైన పరమాత్మలో లేశమైనను భిన్నత్వము చూడడు. అభయమును పొందును. సంసారము నుండి ముక్తుడగునని శాస్త్రము. "తదాత్మన యోగః తద్యోగః తద్ భావా పత్తిః = ముక్తిః" ఆత్మతో ఏకత్వం తద్యోగమనిరి. దానినే ముక్తి అందురు. ఆ ముక్తి పరమాత్మను గ్రహించుటవలననే సరి, కాని ప్రధాన జీవులను గ్రహించుట వలన గాదు. అందువల్ల ఆనందమయమే పరమాత్మయని ఏకదేశిమతము.

<u>భగవద్పాదుల సైద్ధాంతిక మతము:-</u>

సంగతి : అగ్ని జలముల ఈక్షణము గౌణమనియు ముఖ్య ఈక్షణ కర్త బ్రహ్మమనియు నిర్ణయింపబడ నది. పుచ్ఛ శబ్దము అవయవార్థమైనను నిశ్చయార్థ నిర్ణాయకము కాజాలదు. ఈ విధముగా పూర్వాధికరణముతో ఈ అధికరణమునకు ప్రత్యుదాహరణ సంగతి.

విషయము : సిద్ధాంత పక్షములో 'బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా" అను వాక్యము (తై. 2.5) విచారణీయము.

సంశయము : ఆనందమయ కోశమునకు తోక రూపములో చెప్పిన ఈ శ్రుతివాక్యము ప్రధానముగా బ్రహ్మమును ఉపదేశించుచున్నదా? లేక వేరొక దానికి అంగరూపముతో చెప్పుచున్నదా?

పూర్వపక్షము : బ్రహ్మము ఆనందమయకోశమునకు అంగము. ఎందులకనగా తోక అంగరూపములో ప్రసిద్ధము.

సిద్ధాంతము : నిరవయవ బ్రహ్మము నందు పుచ్చము సంభవము గాదు. పుచ్ఛ శబ్దమునకు 'ఆధారము' అని లక్షణార్థము గావింపవలయును. ఆనందమయ శబ్దమునకు జీవమని అర్థము. అది బ్రహ్మను ఆశ్రయించియున్నది. కనుక పుచ్ఛ వాక్యములో బ్రహ్మ ప్రధానముగనే చెప్పిరి.

వైయాసికన్యాయమాలా:

27 అన్యాఙ్గం స్వప్రధానం వా బ్రహ్మ పుచ్ఛమితి శ్రుతమ్। స్యాదానందమయస్యాగం పుచ్ఛే అంగత్వ ప్రసిద్ధితః॥

28. లాంగూలాసంభవాదత్ర పుచ్ఛేనాఽఽధారలక్షణా| ఆనందమయజీవోఽస్మిన్ ఆశ్రితోఽతః ప్రధానతా ||

బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా అనుచోట వినబడు బ్రహ్మ ఆనందమయమునకు అంగముగా నిర్దేశించిరా? లేక బ్రహ్మమునే ప్రాధాన్యముగా ప్రతిపాదించిరా? అని సంశయము. బ్రహ్మ ఆనందమయమునకు అంగము. అంగముగా ప్రసిద్ధము గనుక పుచ్ఛమనగా తోక.

నిరవయవ బ్రహ్మమందు పుచ్ఛత్వము సంభవము గాదు. అందువల్ల పుచ్ఛ శబ్దమునకు లాక్షణికముగా ఆధారార్థము చెప్పవలయును. ఆనందమయ శబ్దమునకర్థము జీవుడు ఈ జీవుడు బ్రహ్మాశ్రితుడు. అందువల్ల పుచ్ఛవాక్యము నందు బ్రహ్మమునే ప్రధానముగా చెప్పిరి.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

సిద్ధాంతి తనమతానుసారము అధికరణమును చెప్పుచున్నారు. "బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా" అను వాక్యములో వినబడు బ్రహ్మ శబ్దమును ఆనందమయమునకు అంగముగా నిర్దేశించిరా? లేక బ్రహ్మను ప్రధానముగా ప్రతిపాదించిరా? అని సంశయము. ఆనందమయమునకు అవయవరూపము చెప్పినందువల్ల లోకములో పుచ్ఛ శబ్దము అవయవరూపములో ప్రసిద్ధము గనుక బ్రహ్మ ఆనందమయమునకు అంగము. దానికి సిద్ధాంతి సమాధానము. పుచ్ఛ శబ్దము అవయవము గాదు. కాని లాంగూల వాచి అనగా తోక. ఆనందమయమునకు తోక సంభవము గాదు. ఒకవేళ సంబవమనినను యోగ్యతను బట్టి ఆధారమని లక్షణార్థము చెప్పవలయును. జీవుని యొక్క ఆనందమయ కోశమునకు బ్రహ్మము ఆధారము. జీవకల్పనకు బ్రహ్మమే ఆధారము గనుక ఆనందమయకోశము పరమాత్మగాదు. "మయట్" ప్రత్యయమునకు ప్రాచుర్యార్థము చెప్పుట గూడ కుదరదు. ఎందులకనగా ఆనందప్రచురత అనిన అల్ప దుఃఖము గలదని అర్థము గనుక. అందువల్ల జీవుని కాధారమైన బ్రహ్మమును ప్రాధాన్యముగా ప్రతిపాదించిరి. మరియు 'అసన్నేవ స భవతి, అసద్ బ్ర హ్మేతి వేదచేత్, అస్తి బ్రహ్మేతి చేద్వేద సన్తమేనం తతోవిదుః (తై.2.6) బ్రహ్మ యొక్క అస్థిత్వము లేదు అనువారి అస్థిత్వము సమసిపోవును. బ్రహ్మ యొక్క అస్థిత్వమున్నదనువారు సన్మార్గములో ప్రవర్తించెదరు. వారిని సాధుమార్గములో నున్నారని బ్రహ్మవేత్తలు చెప్పుదురు. ఈ వాక్యములో బ్రహ్మయొక్క పునరావృత్తి అనగా అభ్యాసము చెప్పబడినది. అప్పుడు "బ్రహ్మ విదాప్నోతి పరమ్" బ్రహ్మజ్ఞానిని, బ్రహ్మయొక్క పునరావృత్తి అనగా అభ్యాసము చెప్పబడినది. అప్పుడు "బ్రహ్మ విదాప్నోతి పరమ్" బ్రహ్మ జ్ఞాని పరతత్వమును పొందును" అను ఉపక్రమమును బ్రహ్మమునే ప్రధానముగా చెప్పుచున్నారనుదానికి అనుకూలమగును.

నామరూప వికార భేదములు గల ఉపాధితో కూడుకొనినది సగుణబ్రహ్మము ఉపాస్యము మరియు జ్ఞేయమని వేదాంత వాక్యములలో చెప్పిరి. దీనికి విపరీతమైన నిర్గుణ బ్రహ్మము ఉపాధి రహితమైనది. ఈ విధముగా రెండు రూపములు గల బ్రహ్మను వేదాంతములో చెప్పిరి. సగుణ బ్రహ్మ నిరూపణము ఉపాసన విధి ద్వారా నిర్విశేష బ్రహ్మ నిరూపమునందే తాత్పర్యము. ఇప్పుడు నిర్విశేష బ్రహ్మ ప్రతిపాదక విచారము ఆరంభించుటకు ఈ అధికరణము.

12. ఆనందమయో2భ్యాసాత్ (1.1.12)

సూత్రార్ధము : "ఆనందమయో2భ్యాసాత్" అను ఆనందమయ ప్రసంగములో బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా అని స్వప్రధానముగనే ఇచ్చట బ్రహ్మోపదేశము. కాని ఆనందమయ కోశము యొక్క అవయవరూపముగా బ్రహ్మోపదేశము గాదు. "ఆసన్నేవ స భవతి అసద్ బ్రహ్మేతి వేదచేత్" ఆ బ్రహ్మ అస్తిత్వము స్వీకరించిన వాని ఉనికి ఉండును, స్వీకరించని వాని యొక్క అస్తిత్వము సమసిపోవును. బ్రహ్మపదమును పలు మారులు ప్రయోగించిరి. గాన ఆనందమయ శబ్దము ద్వార స్వతంత్రముగా బ్రహ్మను చెప్పిరి.

13. వికారశబ్దాన్నేతి చేన్న ప్రాచుర్యాత్ (1.1.13)

పుచ్ఛ శబ్దమునకు అర్ధము అవయవము. అట్లైన స్వతంత్రముగా బ్రహ్మోపదేశమెట్లనిన అవయవ ప్రసంగములో పఠించినప్పటికిన్నూ పుచ్ఛ శబ్ధము అవయవార్ధముగాదు. బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా అన్నచోట అవయవముతో పాటు ప్రతిష్ఠా శబ్దము ఆధారము అర్ధము గలదనిగూడ వినిపించుచున్నది. పుచ్ఛ శబ్దమునకు అర్ధము ఆధారము. ఇచ్చట సర్వాధారమైన బ్రహ్మను ఉపదేశించిరి.

14. తద్ధేతువ్యపదేశాచ్చ (1.1.14)

తద్ధేతు వ్యపదేశము వల్ల గూడ పుచ్ఛశబ్దమునకు అర్ధము ఆధారము తస్య = బ్రహ్మణః, హేతు = వికారములన్నిటికి కారణముగా, వ్యద్ధేపదేశాత్ = ఉపదేశించిరి "ఇదం సర్వమసృజత" (తై 2.6) ఆ పరమాత్మ పరిపూర్ణ సంసారమునకు కారణము. ఆనందమయము వికారము. ఆనందమయముతో పాటు సంపూర్ణ జగత్తునకు కారణము బ్రహ్మమే.

15. మాంత్రవర్ణికమేవ చ గీయతే (1.1.15)

పుచ్ఛవాక్యములో ప్రధానముగా బ్రహ్మమునే చెప్పిరి. కానీ ఆనందమయ కోశావయవముగా కాదు. "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" అను మంత్ర వాక్యములో ఏ బ్రహ్మను ప్రతిపాదించిరో దానినే బ్రహ్మపుచ్ఛం అను బ్రాహ్మణ వాక్యములో స్వతంత్రముగా బ్రహ్మను చెప్పిరి. మంత్ర బ్రాహ్మణులకు ఏకార్ధత్వము చెప్పుదురు గనుక.

16. నేతరో2నుపపత్తేః (1.1.16)

పుచ్ఛవాక్యములో ప్రధానముగా ఆనందమయమును ఎందుకు చెప్పుటలేదనిన, నేతరః = న జీవః, అనుపపత్తే : = యుక్తి సంగతము గాదు, న ఇతరః = ఆనందమయకోశము గల జీవుని ఇచ్చట ప్రతిపాదించుట

లేదు, ఎందులకనగా "తస్య ప్రియమేవ శిరః" ప్రియమోద ప్రమోదములు. అవయవములుగా గలవాడు సృష్టికర్త ఎట్లగును? కాన ఇచ్చట స్వతంత్రముగా బ్రహ్మోపదేశమే.

17. భేదవ్యపదేశాచ్చ (1.1.17)

భేద వ్యపదేశము వలన ఇచ్చట ఆనందమయ కోశము నిరూపితము గాదు. "రసం హ్యేవాయం లబ్ధ్వానందీ భవతి" ఇచట ఆనందమయుడు పొందేవాడు, పొందబడేది బ్రహ్మ అను భేద ఉపదేశము వల్ల ఆనందమయమును స్వతంత్రముగా చెప్పలేదు కాని బ్రహ్మోపదేశము చేసిరి.

18. కామాచ్చ నానుమానాపేక్షా (1.1.18)

"ఆనందో బ్రహ్మేతివ్యజానాత్" అన్నచోట ఏవిధముగా ఆనందమునకు బ్రహ్మత్వమును చెప్పిరో, అట్లే ఆనందమయత్వములో గూడ బ్రహ్మత్వమును అనుమానించవచ్చు గదా అనిన కామ్యతే ఇతి కామః = ఆనందః, ఆనందః, అనిన చోట మయట్ ప్రత్యయము వినబడుట లేదు. అట్లే ప్రియమోద ప్రమోదములు వినబడుట లేదు. ఆనందము బ్రహ్మమనిన ఆనందమయమును బ్రహ్మమని అనుమానము ద్వారా చెప్పనవసరము లేదు. ఆనందమయములో వికారార్థముగల 'మయట్' ప్రత్యయమునుపయోగించిరి. గనుక ఆనందమయము బ్రహ్మము గాదు.

19. అస్మిన్నస్య చ తద్యోగం శాస్తి (1.1.19)

పుచ్ఛ వాక్యము ద్వారా చెప్పబడిన బ్రహ్మమును బాగుగా తెలిసికొనిన ఈ ఆనందమయ జీవుడు బ్రహ్మమును పొందును అని శాస్త్రములో చెప్పిరి. 'యదా హ్యేవైష ఏతస్మిన్నదృశ్యేఽన త్మ్యేఽనిరుక్తేఽనిలయనేఽభయం ప్రతిష్ఠాం విందతే "ఏ జీవుడు అదృశ్యత్వము మొదలగు లక్షణములు గల ఆ ఆత్మలో అభేద జ్ఞానము పొందునో అట్టి వానికి భయము లేదు. (తై. 2.7) శాస్త్రములో బ్రహ్మను తెలిసికొనిన వారికి బ్రహ్మభావాపత్తి చెప్పిరి. దీని ద్వారా ఆనందమయము ప్రతిపాద్యము కాదనినది నిశ్చయము. కాని ఆ ఆనందమయమునకు ఆధారమైన నిర్విశేష బ్రహ్మము ప్రధానము. కాన ఆనందమయమునకు బ్రహ్మము అవయవము కాదు.

# 7. అంతరధికరణము.

సంగతి : పూర్వాధికరణములో ఆనందమయము మరియు ఆనంద అభ్యాసము అనుపదములను చూసి అనేక ప్రమాణములుండుట వల్ల వీని అర్థము నిర్విశేష బ్రహ్మమనియే నిర్ణయింపబడినది. అట్లే రూపమువంటి అనేక ప్రమాణములు చూచుచూ హిరణ్మయ పురుషుడు సంసారి అని పూర్వపక్షి చెప్పుచున్నాడు. అందువల్ల పూర్వాధికరణముతో ఈ అధికరణమునకు దృష్టాంత సంగతి.

విషయము : "అథ య ఏషో అంతరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే" అను ఛాందోగ్యోపనిషత్ వాక్యము ఈ అధికరణమునకు విషయము.

సంశయము : సూర్యమండలాంతర్గత హిరణ్మయపురుషుడు కర్మ ఉపాసనల అనుష్ఠానము ద్వారా పొందు ఉత్కర్ష స్థాన దేవతయా? లేక పరమేశ్వరుడా? హిరణ్మయ పురుషుడు మరియు నేత్రస్థ పురుషుడు దేవతా స్వరూపమా? లేక పరమేశ్వరుడా?

పూర్వపక్షము : లోక మర్యాదలను ధరించుట ఆధారము మరియు రూపము యొక్క వర్ణనము ఉండుట వల్ల పై రెండు స్థానములలో నున్న ఉపాస్యము దేవతయే, ఈశ్వరుడు కాదు.

సిద్ధాంతి : సర్వాత్మ మరియు సంపూర్ణ పాపరహితమైన పురుషుని వర్ణన రెండు స్థానములలో చేయబడ నది. అది ఈశ్వరునియందే సంభవము. మాయ యొక్క మహిమ వలన లోక సంగ్రహార్థము వానిలో రూపవర్ణన ఉపాసన కొరకు సంభవము. మర్యదా మరియు ఆధారము పరమేశ్వరుని యొక్క ఉపాధులు, అందువల్ల ఆదిత్యమండలములో, నేత్రములో గల ఉపాస్య పురుషుడు పరమాత్మయే.

వైయాసికన్యాయమాలా:

29 హిరణ్యయో దేవతాత్మా కిం వాసౌ పరమేశ్వరః। మర్యాదాధార రూపోక్తేః దేవతాత్మైవ నేశ్వరః॥

30 సార్వాత్మ్యాత్సర్వదురితరా హిత్యాచ్చేశ్వరో మతః।మర్యాదాద్యాఉపాస్త్యర్థమీశేఽపిస్యురుపాధిగాః॥

ఆదిత్యునిలో ఉన్న హిరణ్మయ పురుషుడు దేవతాత్మయా లేక పరమేశ్వరుడా? మర్యాదా ఆధారము మరియు రూపముల వర్ణనము చేయుట వలన దేవతనే ఉపాస్యుడని చెప్పిరి ఈశ్వరుని గాదు.

సర్వాత్మా తథా సంపూర్ణ పాపర హిత్యము గల పురుషుని వివాదస్థలములలో చెప్పినందువలననూ ఆ లక్షణములు ఈశ్వరునియందే సంభవము అగుట వల్ల హిరణ్మయపురుషుని యందు గలవాడు ఈశ్వరుడే అని చెప్పగలము. మాయా మహిమవలననూ లోకానుగ్రహార్థమున్నూ ఆ ఈశ్వరుని యందు రూపము చెప్పబడెను. ఉపాసన కొరకు అది సంభవము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఛాందోగ్యోపనిషత్తునందలి ప్రథమ అధ్యాయములో నున్న ఉద్గీత ఉపన్యాసములను చెప్పి ప్రధానోపాసనము చెప్పుటకు ఈ వాక్యము చెప్పిరి. "అథ య ఏషో అంతరాదిత్యే హిరణ్మయ పురుషః దృశ్యతే" . (ఛాం.1.6.6) "ఆదిత్య మండలములో కనబడు హిరణ్మయపురుషుని గడ్డము మీసములు బంగారు వన్నెగలవి". అచట కర్మోపాసనముల అతిశయము వలన ఎవడో ఒక జీవుడు ఆదిత్య మండలములోని దేవతాత్మత్వము పొంది జగత్తులో అధికారము సాధించుచున్నాడు. ఈశ్వరుడు సర్వ వ్యాపకుడగుట వలన ఆదిత్య మండలములో గూడ ఉన్నాడు. ఇచట హిరణ్మయ పురుషుడు దేవతాత్మయా లేక ఈశ్వరుడా అని సంశయము కలుగుచున్నది.

హిరణ్మయపురుషుడు దేవతాత్మయే, ఎందులకనగా? మర్యాద, ఆధారము, రూపము చెప్పుట వలన "యే చాముష్మాత్పరాంచో లోకాః తేషాం చేష్టే దేవకామానా చ " "అతని పైనున్న లోకములలో గల దేవతల ఇచ్ఛలను ఆదిత్య మండలములో నున్న పురుషుడు శాసించును". (ఛాం. 1.7.6) ఈ వాక్యములో అతని ఐశ్వర్యము మరియు మర్యాద చెప్పబడినది. "అంతరాదిత్యే" "ఆదిత్యుని లోపల" అనుచు ఆధారము చెప్పిరి. "హిరణ్మయః" "బంగారు వన్నెగల" అని రూపము చెప్పిరి. సర్వేశ్వరుడు, సర్వాధారుడు, రూపరహితుడైన పరమేశ్వరునియందు

ఐశ్వర్య, మర్యాద, ఆధార, రూపములు అసంభవము. అందువల్ల హిరణ్మయ పురుషుడు దేవతాత్మయే. అను పూర్వపక్షమునకు ఉత్తరము చెప్పుచున్నారు. హిరణ్మయపురుషుడు పరమేశ్వరుడు. ఎందులకనగా సర్వాత్మత్వము వినబడుట వలన "సైవ ఋక్, తత్సామ, తదుక్తం, తద్యజుః తద్బ్రహ్మ" ఏది ఋక్ మంత్రమో అదే సామము, అదే యజుర్ మంత్రము, అదే బ్రహ్మము" (ఛాం 1.5.7) మంత్రములోనున్న తత్ శబ్దము ద్వారా ప్రకృత సందర్భములో నున్న హిరణ్మయపురుషుని సంబంధమును చెప్పుచూ దానినే ఋక్ సామాది సంపూర్ణ జగత్ స్వరూపముగా ఉపదేశించిరి. అద్వితీయ పరమేశ్వరుని యందే అట్లు చెప్పుట యుక్తి యుక్తము కాని దేవతయందు సరిగాదు. మరియు "స ఏష సర్వేభ్యః పాప్మభ్యః ఉదితః" (ఛాం. 1.6.7) "ఆ పరమేశ్వరుడు అన్ని పాపములు మరియు వాని కార్యముల నుండి ముక్తుడు". సర్వ పాపముల రాహిత్యము బ్రహ్మ యొక్క అసాధారణ ధర్మము. దేవతల యందు పాపములు లేవు, ఎందులకనగా కర్మల యందు అధికారము లేదు గనుక. కాని రాక్షసుల ద్వారా కలుగు దుఃఖముండుట వలన జన్మాంతరములలో చేసిన సంచిత పాప కర్మ ఉండనే ఉన్నది. మర్యాద, ఆధార, రూపములు (లోకానుగ్రహార్థము రూప గ్రహణమ్) మొదలగు ఉపాధి ధర్మములుండుట వలన పరమాత్మను ఉపాసన చేయగలరు. అందువల్ల హిరణ్మయపురుషుడు ఈశ్వరుడే.

## 20. అంతస్తద్ధర్మోపదేశాత్ 1.1.20

సూత్రార్థము : "అథ యేషో అంతరాదిత్యే" అను శ్రుతి వాక్యములో సూర్యమండలాంతర్గత వర్తి పురుషుడు సూర్యుడు గాదు. "తద్ధర్మోపదేశాత్" ఎందులకనగా పాపశూన్యత్వాది బ్రహ్మయొక్క ధర్మములు చెప్పబడినవి. అవి సూర్యునిలో లేవు అందువల్ల సూర్యమండలాంతర్వర్తి పరమేశ్వరుడే.

"యేషో అంతరాదిత్యే" "యేషో అంతరక్షిణి" అని వినబడు శ్రుత్యుక్త పురుషుడు అంతరాత్మ పరమేశ్వరుడే సంసారి కాదు. ఎందులకనగా పరమేశ్వరుని ధర్మములు ఉపదేశించిరి గనుక. సంపూర్ణ పాపరాహిత్యము మొదలుగా గల అనేక ధర్మములు ఉపదేశించిరి. "తస్యోదితినామ" ఆదిత్య మండలస్థ పురుషుని పేరు 'ఉత్' అని చెప్పి " స ఎష సర్వేభ్యః పాప్మభ్యః ఉదితః" ఈ వాక్యములో సంపూర్ణ పాపరహితుడు అని చెప్పిరి. అందువల్ల ఆదిత్యాన్తర్గత పురుషుడు పరమాత్మయే. సూర్యునిలో బంగారు వన్నెగల గడ్డము, మీసము, వెంట్రుకలు అని వినబడుచున్నది గదా! అని అనిన అది సరిగాదు. ఆ పరమేశ్వరుడు స్వేచ్ఛగా అనంతశక్తి గల మాయ ద్వారా ఉపాసన కొరకు మరియు లోకానుగ్రహార్థము అనేక రూపములు గలవాడుగా మారును. ఆధారము యొక్క ఉపదేశము కూడ ఉపాసన కొరకే. పరమేశ్వరుడు వ్యాపకమైనను ఉపాసన విశేషస్థలములలో చేసెదరు. కాన ఆధార ఉపదేశము విరుద్ధముగాదు. నేత్రములలో మరియు ఆదిత్యునిలో గల పురుషుడు పరమేశ్వరుడే.

## 21. భేదవ్యపదేశాచ్చాన్యః 1.1.21

'అంతర్' అను శబ్దము పూర్వ సూత్రము నుండి అనువర్తించును. కన్నులలో మరియు ఆదిత్యునిలో వినుపించు పురుషుడు ఆదిత్యాది శరీరముల కన్న భిన్నాభిమాని, జీవుని కన్న భిన్నము అతడు అంతర్యామి ఈశ్వరుడు. ఎందులకనగా భేద ఉపదేశమువల్ల "య ఆదిత్యే తిష్ఠన్ ఆదిత్యాదన్తరో యం ఆదిత్యో నవేద" (బృ . 3.7.9) ఎవడు ఆదిత్యునిలో నున్నాడో వానిని ఆదిత్యుడు ఎఱుంగడు. వాని శరీరము ఆదిత్యుని శరీరమే. ఈ శ్రుతిలో తెలుసుకునే

వాడు తెలిసికొనబడేది అనే భేద వ్యపదేశము గలదు. "య ఏషో అంతరాదిత్యే" అన్నచోట అంతర్ శబ్దము శ్రుతిలో వినబడుచున్నది. దాని ప్రత్యభిజ్ఞ వల్ల (తత్తా ఇదంతా అవగాహి జ్ఞానము - అదే ఇదనుజ్ఞానము) ఆదిత్యునిలోని పురుషుడు ఆ ఆదిత్యునికన్న భిన్నమని చెప్పుట వల్ల ఆదిత్యునిలోని పురుషుడు పరమేశ్వరుడే.

# 8. ఆకాశాధికరణము.

పూర్వాధికరణములో సర్వపాపరాహిత్యము మొదలుగా గల హేతువుల ద్వారా , సువర్ణ గడ్డము వంటి రూపమున్ననూ, అవ్యభిచరిత అసాధారణ కారణము వల్ల ఆదిత్యునిలోని పురుషుడు బ్రహ్మ అని చెప్పిరి. ఈ అధికరణములో ఆకాశ శబ్దమునకు భూతాకాశమే చెప్పవలయును. హేతుకారణముకన్ననూ శ్రుతి ప్రమాణము బలీయము కనుక ఇచట ప్రత్యుదాహరణ సంగతి.

సంగతి : పూర్వాధికరణములో ఆదిత్యునిలోని పురుషుడు బ్రహ్మమని చెప్పిరి. అదే విధముగా ఆకాశశ్రుతిని బ్రహ్మకన్న భిన్నముగా చెప్పలేము. లింగ ప్రమాణము ( హేతువు) కన్ననూ శ్రుతి ప్రమాణము బలమైనది. అందువల్ల పూర్వాధికరణముతో దీనికి ప్రత్యుదాహరణ సంగతి.

విషయము : "అస్య లోకస్య కా గతిరితి ఆకాశ ఇతి హోవాచ" (ఛాం. 1.9.1) అను ఛాందోగ్యోపనిషత్తు వాక్యము ఈ అధికరణములో విచారణీయ విషయము.

సంశయము : ఆకాశ శబ్దము పరబ్రహ్మోపదేశమా? లేక భూత కాశార్ధమా?

పూర్వపక్షము : లోక ప్రసిద్ధిని చూచుచు ఆకాశ శబ్దమునకు భూతాకాశమని అర్థము చెప్పవలయును. బ్రహ్మమను అర్థములో సాదృశ్యముననుసరించి బ్రహ్మ బదులు ఆకాశ శబ్దమును అక్కడక్కడ ప్రయోగించిరి. వాయువ్వాది క్రమముననుసరించి ఆకాశము కూడ జగత్తునకు కారణ స్రష్ట అనగలము.

సిద్ధాంతి : ఆకాశముతో బాటు సంపూర్ణ జగతుత్పత్తి కారణము బ్రహ్మమగుట వలన, లోక రూఢి కన్ననూ శ్రుతి వాక్యము బలవత్తరమగుటచే, ఆకాశ శబ్ద ప్రయోగము చేసినను దాని అర్థము బ్రహ్మమనియే చెప్పవలయును అన్యము గాదు. "సర్వాణి హ వా ఇమాని భూతని ఆకాశదేవ సముత్పద్యంతే" అను వాక్యములో ప్రయోగించిన "ఏవ శబ్దము వల్ల గూడ ఆకాశ శబ్దమునకు బ్రహ్మమనియే అర్థము."

వైయాసికన్యాయమాలా:

31 ఆకాశ ఇతి హోవాచేత్యత్ర ఖం బ్రహ్మ వాఽఽత్ర ఖమ్|శబ్దస్య తత్ర రూఢత్వాద్వాయ్వాదేః సర్జనాదపి||

32 సాకాశజగదుత్పత్తి హేతుత్వాచ్ఛ్రౌ తరూఢితః|ఏవకారాదినా చాత్ర బ్రహ్మైవాఽఽకాశశబ్దితమ్||

"ఆకాశ ఇతి హోవాచ" అనుశ్రుతి వాక్యములో ఆకాశపదము బ్రహ్మను చెప్పుచున్నదా లేక భూత కాశమునా ? ఆకాశపదము భూత కాశమనుటలోనే ప్రసిద్ధము మరియు వాయువు మొదలగువానికి ఉత్పత్తికి కారణము. అందువలన ఆకాశపదమునకు భూతాకాశమని అర్థము.

శ్రుతులలో ఆకాశపదము బ్రహ్మబోధకము మరియు శ్రుతిలో ఆకాశము అన్ని భూతములకు కారణమని చెప్పబడినవి. అన్ని భూతములలో ఆకాశము కూడ అంతర్గతమై ఉన్నది. "ఆకాశాదేవ" అన్నచోట ఏవ పదము వేరు కారణములను నిరాకరించుచున్నది. ఇచట ఆకాశపదము బ్రహ్మ వాచకము

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-.

పూర్వము చెప్పిన హిరణ్మయ వాక్యానంతరము సర్వలోకాధారమును శాలావత్య ఋషి అడుగగా రాజు ప్రవాహణుడు ఈ విధముగా సమాధానము చెప్పెను. "ఆకాశ ఇతి హోవాచ సర్వాణిహ వా ఇమాని భూతా-న్యాకాశాదేవ సముద్యంతే, ఆకాశం ప్రత్యస్తం యన్తి, ఆకాశో హ్యేవైభ్యో జ్యాయానఆకాశః పరాయణమ్" (ఛాం. 1.9.1)

"ఆకాశమే ఈ లోకమునకు ఆధారము. ఈ సమస్త భూతములు ఆకాశము నుండే పుట్టుచున్నవి. దానియందే లయమునొందుచున్నవి. అది అన్నిటికంటే నధికమైనది, సర్వమునకు ఆకాశము ఆశ్రయమైనది.". ఈపై శ్రుతి వాక్యములో వచ్చిన ఆకాశ శబ్దార్థము ఆకాశమనియా? లేక బ్రహ్మమా? అని సందేహము.

పూర్వపక్షము : ఆకాశ శబ్దము భూతాకాశములో రూఢము గనుక భూత కాశమని అర్థము అన్ని భూతములకుత్పత్తి లయములకు కారణము ఆకాశము కాగలదు. "ఆకాశాద్వాయుః వాయో రగ్నిః" (తై. 2.1) ఆకాశము నుండి వాయువు ఉత్పన్నమయ్యెను. వాయువు నుండి అగ్ని ఉత్పన్నమైనది. ఈ శ్రుతులలో అన్ని భూతములకు ఆకాశము కారణమని చెప్పబడెను.

సిద్ధాంతి సమాధానము : బ్రహ్మమే ఆకాశబ్దార్థము. "సర్వాణి హవై" ఇచట సంకోచము లేని సర్వ శబ్దము ద్వారా ఆకాశముతో బాటు అన్ని భూతముల ఉత్పత్తి వినబడుచున్నది. ఆకాశము ఆకాశోత్పత్తికి కారణము కాజాలదు. రూఢత్వము లౌకిక ఆకాశము వరకే సీమితము. శ్రుతులలో బ్రహ్మకు పేరు లేకపోయిననూ "ఆకాశో వై నామ నామరూపయోర్నిర్వహితా " (ఛాం. 8.14) ప్రసిద్ధమైన నామరూపములను వ్యక్తము చేయునది (బ్రహ్మ) ఈ ఆకాశమే అని ప్రయోగించిరి కాని "ఆకాశాదేవ' అన్నచోట 'ఏవ' కారము కారణాంతరములను తొలగించుచున్నది. ఇది ఆకాశ పక్షములో సంభవము గాదు. ఘటాదులలో ఆకాశము కన్న అతిరిక్తమైన మృదాది కారణములు కానవచ్చుచున్నవి. బ్రహ్మ పక్షములో సద్రూపమైన బ్రహ్మ అన్నింటికి భిన్నముగా నుండి కారణాంతరములను తొలగించుచున్నది. జాయస్త్వ పరాయణత్వములు ఇంకొక శ్రుతిలో బ్రహ్మ యొక్క గుణములు వినబడుచున్నవి. పృథ్వికన్న పెద్దది, అంతరిక్షమున్న అధికమైనది. "జ్యాయాన్ పృ థివ్యాః , జ్యాయాన్ అంతరిక్షాత్" (ఛాం. 3.14.3) "విజ్ఞానమానందం బ్రహ్మ రాతిర్దాతుః పరాయణమ్". (బ -3.9.28) "విజ్ఞానము ఆనందస్వరూపమైన బ్రహ్మ కర్మ ఫలమిచ్చుటకు సమర్థము. మరియు పరమాశ్రయము" అందువల్ల ఆకాశశబ్దముతో బ్రహ్మమే వివక్షితము.

22. ఆకాశస్తల్లింగాత్ (1.1.22)

సూత్రార్థము : "ఆకాశ" ఇతి హోవాచ అనుశ్రుతివాక్యములో చెప్పిన ఆకాశపదము పరబ్రహ్మపరమే కాని భూత కాశము కాదు. బ్రహ్మము నుండి అన్ని భూతములు ఉత్పత్తి చెందుచున్నవి. దానిలో లీనమగుచున్నవి. ఉత్పత్తి లయములు బ్రహ్మమునకు చిహ్నము లేక అనుమానగమ్యము.

"సర్వాణి హవా ఇమాని భూతాన్యాకాశాదేవ సముద్పద్యస్తే ఆకాశం ప్రత్యస్తం యాన్త్యాకాశో హ్యేవైభ్యో జ్యాయాన్" (ఛాం. 2.9.1) అను వాక్యములో సమస్త భూత సృష్టి లయములకు కారణము ( హేతువు) అగుట వలన బ్రహ్మమే ఆకాశ శబ్దార్థము. లింగము ( హేతువు) కన్న శ్రుతి బలీయమని చెప్పిన అట్లనుట సరికాదు. అనేక బ్రహ్మ బోధక లింగములు వినబడుచున్నందున ఒక చోట చెప్పు ఆకాశ శ్రుతివాక్యము బాధితమైన దోషము లేదు. ఆకాశార్థము గ్రహించిన "ఆకాశదేవ" అను నిశ్చయార్థకమైన 'ఏవ' శబ్ద ప్రయోగము యుక్తి సంగతము కాదు. "సర్వాణి" అన్నచోట భూత కాశము గూడ అంతర్గతమగుట వలన ఆకాశము నుండి ఆకాశోత్పత్తి చెప్పుట సరిగాదు. అంతేగాక అన్నిటికన్న పెద్దది, చైతన్యము అన్నింటికి ఆశ్రయము అను విశేషణములు బ్రహ్మమందే సంభవము. ఇన్ని కారణముల వల్ల ఆకాశ ప్రసిద్ధార్థము నిష్ప్రయోజనము (అకించిత్ కరము), ఎందులకనగా బ్రహ్మమునందు ముఖ్యముగా అనేకచోట్ల ప్రయోగించిరి. గనుక ఉద్గీత వాక్యములోగల ఆకాశ శబ్ద వాచ్యము బ్రహ్మమనియే ఉపాసన చేయవలయును. "త్యజేదేకం కులస్యార్థే" అను నీతి వాక్యానుసారము ఒక శ్రుతిలో చెప్పిన ఆకాశ శబ్దము త్యజించిన దోషము లేదు. ఎందులకనగా అనేక బ్రహ్మ లింగ వాక్యముల విరోధము కానవచ్చుచున్నందువల్ల.

# 9. ప్రాణాధికరణము

ఆకాశమునకు చెప్పిన న్యాయమువలనే ఇచట అతిదేశము గావించుచున్నారు.

సంగతి : అతిదేశమనగా ఒకచోట చెప్పబడిన సామ్యమును బట్టి మరియొక చోట ఉపయోగించుట అతిదేశమందురు. అతిదేశమగుట వల్ల ఇచట గూడ ప్రత్యుదాహరణ సంగతియే.

విషయము : "కతమా సా దేవత "? "ప్రాణః ఇతి హోవ చ" (ఛాం. 1.11.4) ఈ ఛాందోగ్యశ్రుతి వాక్యము ఇచట విచారణీయ శ్రుతి వాక్యము.

సంశయము : చాక్రాయణుడు అను ఋషి ధనాభిలాషతో యజ్ఞము చేయుచున్న రాజు వద్దకు పోయెను. సామవేదము చెప్పుచు దేవతలను స్తోత్రము చేయువారిని ప్రస్తోతా, ఉద్గాతా. ప్రతిహర్తా అందురు. ఆ ప్రస్తోతతో చాక్రాయణుడిట్లనెను. - ఈ సామవేద భాగమైన ప్రస్తావమునందు స్తోత్రము చేయదగిన దేవత ఏది? దానిని నెరుంగుది వేని సరియే, కానిచో నా ఎదుట ఆ దేవత స్తోత్రము చేసిన నీతల తెగిపోవును అనెను. విద్వాంసుల ముందు వారి ఆజ్ఞతో కర్మ చేయవలయునని నియమము. వారి ఆజ్ఞ లేనిచో అనిష్టము వాటిల్లును. ప్రస్తోత భయము నొంది మునిని ఈ విధముగా ప్రశ్నించెను. ఆ దేవత ఏది? దానికి ముని "ప్రస్తోత దేవత ప్రాణమనెను. ఈ ప్రాణమునందే బ్రహ్మ లక్షణములు చెప్పుట వలన సంశయము కలుగుచున్నది. ప్రస్తోత దేవత ప్రాణమా? లేక బ్రహ్మమా? అని.

పూర్వపక్షము : ప్రస్తోత దేవత రూపముగా ఇచ్చట ప్రాణమును చెప్పుటయే ఉచితము. ఎందులకనగా సుషుప్తి దశలో పంచభూతముల సారమైన ఇంద్రియములు ప్రాణముల యందు లయమగుట ప్రత్యక్ష సిద్ధము. మరియు ఆ అవస్థలో ప్రాణము వ్యాపారములో కూడినదై ఉన్నది. ఈ విధముగా ప్రాణ జాగరణ గూడ ప్రసిద్ధమే. అందువల్లనే ప్రస్తోత దేవత ప్రాణమనుట ఉచితము.

సిద్ధాంతము : ఇచ్చట ప్రాణవాయువునకు అర్థము ప్రాణమని చెప్పిన, సర్వభూత లయ కారణము బ్రహ్మమని చెప్పు అర్థమునకు సంకోచము కావించవలయును. సంపూర్ణ జగదుత్పత్తి స్థితిలయ కారణమని చెప్పుటచే పూర్వాధికరణములో ఆకాశ శబ్దమునకు బ్రహ్మమని చెప్పినట్లు ఇచట ప్రాణ శబ్దము బ్రహ్మవాచకమని అర్థము చెప్పుటయే ఉచితము.

వైయాసికన్యాయమాలా:

33. ముఖస్థో వాయు రీశో వా ప్రాణః ప్రస్తావదేవత।వాయుర్భవేత్ తత్ర సుప్తౌ భూతసారేంద్రియక్షయాత్||

34 సంకోచోఽక్షరపరత్వే స్యాత్సర్వభూత లయశ్రుతేః|ఆకాశశబ్దవత్ప్రాణశబ్ద స్తేనేశ వాచకః||

"ప్రాణ ఇతి హో వాచ" అనుశ్రుతిలో చెప్పిన ప్రాణము వాయు వికారమా లేక బ్రహ్మమా? సుషుప్తిలో అన్ని భూతముల సారభూతమైన ఇంద్రియములు ప్రాణవాయువులో లీనమగుచున్నవి. అందువల్ల ఈ ప్రాణము వాయువికారమే.

సుషుప్తిలో కేవలము ఇంద్రియములు ప్రాణవాయువులో లీనమగును. ఇచ్చట అన్ని భూతముల లయము చెప్పబడెను. ఈ శ్రుతిలో ప్రాణమును వాయువికారముగా చెప్పిన "సర్వాణి హ వ" అను శ్రుతిలో నున్న సర్వ శబ్దార్థమును సంకోచించవలయును. ఆకాశ శబ్దము వలె ప్రాణ శబ్దము గూడ శ్రుతిరూఢి ద్వారా బ్రహ్మ వాచకమే. ప్రాణమేవ అన్న చోట 'ఏవ' కారప్రయోగము వల్ల గూడ ప్రాణము బ్రహ్మమనునది సిద్ధము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

( ప్రస్తోత అనగా సామవేదము చెప్పుచూ దేవతలను స్తోత్రము చేయువారు) ఆకాశము తరువాత వాక్యములో ప్రస్తావమను సామవేదము యొక్క దేవతను స్తుతించు ప్రస్తోత అడిగినదానికి ఉషస్తి చాక్రాయణుడు సమాధానమిచ్చెను. ఆ ప్రసంగమును లోని వాక్యమిది. "ప్రాణ ఇతి హోవ చ సర్వాణి హ వా ఇమాని భూతాని ప్రాణమేవ అభిసంవిశంతి ప్రాణమభ్యుజ్జిహతే । సైషా దేవత ప్రస్తావమన్వాయత్తా" ( ఛాం.1.11.5) ప్రస్తావమున ధ్యానింపదగిన దేవత ప్రాణము. ఈ సర్వభూతములును ప్రళయావస్థయందు ఆ ప్రాణము నందే లీనమగును. ఉత్పత్తి అవస్థయందు మరల దాని నుండియే జనించును. ఆ దేవత ప్రస్తావసంబంధమైనది. ఈ వాక్యములో వచ్చిన ప్రాణ శబ్దమునకు ముఖబిలాంతరవర్తి వాయువని అర్థమా? లేక బ్రహ్మమనియా?

ముఖ బిలాంతరవర్తి వాయువే అగును. అన్ని భూతముల లయము అచట సులభముగా అగును. సుషుప్తిలో అన్ని భూతముల సారమగు ఇంద్రియములు ప్రాణవాయువులో లీనమగుచున్నవి గదా అనిన -

"సర్వాణి హ వై" అన్న శ్రుతిలో ఇంద్రియముల లయము మాత్రమే చెప్పిన, శ్రుతిలోని సర్వ శబ్దమునకు సంకుచితార్థమగును. శ్రుతిరూఢి వల్ల 'ఏవ' కారము శబ్దము వల్ల ఆకాశ శబ్దమువలె ప్రాణ శబ్దము బ్రహ్మ వాచకము. ప్రాణ శబ్దము బ్రహ్మమనునది శ్రుతి రూఢి లో గలదు. "ప్రాణస్య ప్రాణమ్" (బ .దా. 4.4.18) "ప్రాణమునకు ప్రాణమన్నచోట బ్రహ్మను చెప్పుటకే ద్వితీయ ప్రాణ శబ్దమును ప్రయోగించిరి. కనుక ప్రాణ శబ్దార్థము ఈశ్వరుడే".

23. అత ఏవ ప్రాణః 1.1.23

సూత్రార్థము : ప్రాణ శబ్దము బ్రహ్మ పరము. ఎందులకనగా పూర్వ సూత్రములో చెప్పిన హేతువు వలనే.

కేవలము ఇంద్రియముల లయము ప్రత్యక్ష శ్రుతి ద్వారా చెప్పినను, సంపూర్ణ భూతముల లయమునకు ఆధారము బ్రహ్మమనునది, బ్రహ్మ యొక్క అసాధారణ హేతువు. అట్టి అవ్యభిచరిత బ్రహ్మలింగమును చూచుచు ప్రాణ శబ్దార్థము బ్రహ్మమనియే చెప్పవలయును. "యథా సుప్తః న కంచన స్వప్నం పశ్యతి। అథాస్మిన్ ప్రాణే ఏవైకధా భవతి" (కౌ. 3.3) నిద్రించుచున్న వ్యక్తి కలలు చూచుట లేదు. ఆ అవస్థలో ప్రాణములో ఏకీభవించుచున్నాడు. ఈ కౌశీతకీ శ్రుతి ద్వారా సర్వప్రపంచ లయస్థానము బ్రహ్మ మనియే తెలియుచున్నది. వాక్య ప్రమాణముకన్న సన్నిధి ప్రమాణము దుర్బలమగుట వలన లోక ప్రసిద్ధి అకించిత్ కరము (ప్రయోనము లేనిది). "ప్రాణస్య ప్రాణః" (బ . 4.4.18) "ప్రాణమునకు ప్రాణము" ఇచట మొదటి ప్రాణ శబ్దము వాయు పరము రెండవది బ్రహ్మపరమనుటలో సందేహము లేదు. ప్రాణ శబ్దము బ్రహ్మమే.

# 10. జ్యోతిశ్చరణాధికరణము.

బ్రహ్మకారణముండుట వలన ప్రాణశబ్దమునకు బ్రహ్మమనినట్లు, ఇచట బ్రహ్మ హేతువు లేనందున బ్రహ్మపరము కాదని ప్రత్యుదాహరణ సంగతితో చెప్పిరి.

సంగతి : ఏ కారణము ద్వారా జ్యోతిః శబ్దమునకు బ్రహ్మమని చెప్పుటకు వీలగునో అట్టి చిహ్నమిచట లేనందున పూర్వాధికరణముతో దీనికి ప్రత్యుదాహరణ సంగతి.

విషయము : "అథ యదతః పరో దివో జ్యోతిర్దీప్యతే" (ఛాం. 3.11.7) ఇది మొదలుగా గల వాక్యము విచారణీయము.

సంశయము : ఈ జ్యోతిః శబ్దము ఆదిత్యాదులకు వాచకమా? లేక బ్రహ్మవాచకమా?

పూర్వపక్షము : బ్రహ్మము యొక్క సన్నిధి లేనందున కార్యరూపమైన ఆదిత్యాదులను జ్యోతిః శబ్దమని చెప్పవలయును. వాక్యప్రమాణమున కన్న లింగ ప్రమాణము బలవత్తరమైనది. లింగ ప్రమాణము ద్వారా జ్యోతిః శబ్దమునకు కార్యజ్యోతులైన ఆదిత్యాదులు చెప్పవలయును. "శ్రుతి, లింగ, వాక్య, ప్రకరణ, స్థాన సమాఖ్యానాం సమవాయే పారదౌర్బల్యమర్థవిప్రకర్షాత్" అను పూర్వ మీమాంసా సూత్రానుసారము (3.3.14) లింగ ప్రమాణము బలవత్తరమైనది. ఇచట శ్రుతిప్రమాణము స్వతంత్రము. లింగము మొదట శ్రుతిని కల్పన చేసి ఆ తరువాత కల్పితశ్రుతి ద్వారా అర్థము చెప్పును. గనుక అర్థము చెప్పుటకు విలంబమగును. అట్లే వాక్యాదులు అర్థము చెప్పుటలో ఒకదాని తరువాత ఒకటి దూరమగుచున్నవి. పూర్వపక్షి ఇచట వాక్య ప్రమాణమున కన్న లింగ ప్రమాణము బలవంతమని చెప్పెను. ఎందులకనగా వాక్యము లింగ కల్పన చేసి, లింగము శ్రుతి కల్పన చేసి అర్థము చెప్పవలయును గనుక.

సిద్ధాంతము : జ్యోతి శబ్దమునకు పరబ్రహ్మమని అర్థము చెప్పుట ఉచితము. "పాదో అస్య సర్వా భూతని" అను వాక్యములో బ్రహ్మమునకు నాలుగు పాదములు చెప్పబడినవి. ప్రకాశమునకు చాలాచోట్ల జ్యోతిః శబ్దము చెప్పెదరు. నాలుగు పాదములు గల ప్రకరణగత బ్రహ్మకొరకే 'యత్' శబ్దము ప్రయోగించిరి. విశేష ప్రదేశములో

బ్రహ్మమున్నదని చెప్పిన అది తప్పక ఔపాదిక మగును. ఆధారము లేక అధికరణము నిర్దేశించుట ఉపాసనకొరకు ఉచితమే. అందువల్ల జ్యోతిః దీప్యతే అను వాక్యములో సుస్పష్టముగా బ్రహ్మ ఉల్లేఖించబడినవి.

వైయాసికన్యాయమాలా:

35. కార్యం జ్యోతిరుత బ్రహ్మ జ్యోతిర్దీప్యత ఇత్యతః। బ్రహ్మణోఽసంనిధేః కార్యం తేజోలింగబలాదపి||

36. చతుష్పాత్ ప్రకృతం బ్రహ్మ యచ్ఛబ్దేనా నువర్త్యతే। జ్యోతిః స్యాద్భాసకం బ్రహ్మ లింగంతూపాధియోగతః ॥

"అథ యదథః పరో దివో జ్యోతిర్దీప్యతే" అను శ్రుతిలోని జ్యోతిః శబ్దమునకు అర్థము కార్యజ్యోతియా లేక బ్రహ్మమా? బ్రహ్మప్రకరణము కానందువల్ల మరియు "ఇదం వావ తద్యదిదమస్మిన్నంతః పురుషే జ్యోతిః" అను వాక్యములో జఠరాగ్నితో అభేదరూపమైన జ్యోతిఃలింగము ప్రతీతమగుచున్నది. అందువల్ల ఈ శ్రుతిలో కార్యజ్యోతిని చెప్పిరి.

"పాదో అస్య సర్వా భూతాని త్రిపాదస్యామృతం దివి" అని వెనుకటి శ్రుతిలో చెప్పిన నాలుగు పాదముల బ్రహ్మము ప్రకృతము. "యదతః" అన్నచోట ఆ బ్రహ్మమును ఇచట యత్ శబ్దముతో అనువృ త్తి గావించిరి. జ్యోతిః శబ్దమునకు అర్థము ప్రకాశించుచున్నది అని. బ్రహ్మ జగత్తును ప్రకాశింపజేయుచున్నది. తేజోలింగము ఉపాధితో కూడిన బ్రహ్మము నందు కల్పన గావించవచ్చు. కనుక చెప్పిన శ్రుతిలో జ్యోతి శబ్దమునకు బ్రహ్మమని అర్థము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఛాందోగ్యపనిషత్తు తృతీయాధ్యాయములో గాయత్రీ విద్యలో హృదయచ్ఛిద్రోపాసన చెప్పిన తరువాత ఈ విధముగా చెప్పిరి. "అథ యదతః పరో దివో జ్యోతిర్దీప్యతే." ఈ స్వర్గలోకమునకు మీద అన్ని లోకములకు పైన ఏ జ్యోతి ప్రకాశించుచున్నదో (ఛాం. 3.13.7). అచట ద్యులోకమునకు పైన ప్రకాశించుచున్నది, నేత్రములను గ్రహించు కార్యరూప తేజమా? లేక బ్రహ్మమా? అని సంశయము. బ్రహ్మ అసన్నిహితమగుట వలన కార్యమును పొందుట వలననూ ఈ జ్యోతి బ్రహ్మపరకము కానేరదు. గుర్తులుండుట వలన కార్యరూపమైన జ్యోతియనుట యుక్తి యుక్తము "ఇదం వావ తద్యదిదమస్మిన్నంతః పురుషే జ్యోతిః" "ఇదే పురుషుని లోపలనున్న జ్యోతి" ఈ వాక్యము జఠరాగ్ని అభిన్నమైన జ్యోతి చిహ్నము చెప్పుచున్నది.

సమాధానము : అసన్నిధిః అసిద్ధము. పూర్వపు గాయత్రీ ఖండములో "పాదో అస్య సర్వాభూతాని త్రిపాదస్యా మృతం దివి"(ఛాం. 3.13.7) బ్రహ్మమునకు నాలుగు పాదములు. ఈ ప్రపంచమునందలి సర్వభూతములు ఒక్క పాదము తక్కిన మూడు పాదములు ద్యులోకమున నున్నవి. నాలుగు పాదములు గల బ్రహ్మ ప్రసంగము ప్రస్తుతము. "యదతః" అనుచోట 'యత్' శబ్దముతో ఆ బ్రహ్మమే ప్రస్తావింపబడినవి. ఆ బ్రహ్మమునకు సర్వభూతములు ఏకపాదము. మిగిలిన మూడు పాదములలో లక్షితమైన అనంతస్వరూపము ద్యులోకమనిన 'స్వస్మిన్నేవావ తిష్ఠతే" తన స్వరూపములో ఉన్నాడని అర్థము. జ్యోతిః శబ్దము బ్రహ్మకే చెప్పలేదనుట సరిగాదు. జ్యోతియనగా ప్రకాశింపజేయునది అని అర్థము. బ్రహ్మ జగత్తును ప్రకాశింపజేయుచున్నది. ఉపాధి గల బ్రహ్మమందు తేజోలింగము కల్పింపబడినవి. కనుక జ్యోతి శబ్దార్థము బ్రహ్మమే.

24. జ్యోతిశ్చరణాభిధాన త్ 1.1.24

సూత్రార్ధము : "అధ యదతః పరోదివో జ్యోతిర్దీప్యతే" అను శ్రుతిలో జ్యోతిశబ్దము ద్వారా పరమాత్మయే చెప్పబడినది. సూర్య చంద్రాదుల జ్యోతి చెప్పలేదు. ఎందులకనగా "పాదో అస్య సర్వా భూతాని త్రిపాదస్యామృతం దివి" అను పూర్వ వాక్యములో బ్రహ్మమునకు నాలుగు పాదములు చెప్పబడినవి. ఇచ్చట జ్యోతిర్ వాక్యములో స్వర్గ సంబంధము ద్వారా ఆ బ్రహ్మ యొక్క ప్రత్యభిజ్ఞ యగును". "తత్తా ఇదంతా అవగాహి జ్ఞానమును ప్రత్యభిజ్ఞ యందురు". అనగా దాని భావము మరియు ధర్మము, దీని భావ ధర్మములను విషయీకరించు నిశ్చయ జ్ఞానమును పత్యభిజ్ఞా యందురు. ఉదాహరణమునకు 'సో అయం దేవదత్తః'

"తావానస్య మహిమా తతో జ్యాయాంశ్చ పూరుషః పాదో అస్య సర్వా భూతాని త్రిపాదస్యామృతం దివి" (ఛాం. 3.12.6) ఆ పరమాత్మ యొక్క ఒక పాదములో సంపూర్ణ సృ ష్టి కలదు. వాని మహిమను చెప్పుచున్నారు. కాని వాని మూడు పాదములు స్వర్గమునకు పైన అమృతమయముగానున్నవి. ఇచట బ్రహ్మకు నాలుగు పాదములు అనగా చరణములు చెప్పిరి. దేనిని ప్రకాశింపజేసిననూ దానిలో జ్యోతిః శబ్ద ప్రయోగము కనుపించుచున్నది. అందువల్ల బ్రహ్మలో జ్యోతి శబ్ద ప్రయోగము అవిరుద్ధము. సర్వవ్యాపకమైనను బ్రహ్మ ఉపాధి విశేషముననుసరించి ఔపాధికరూపముతో నిర్దేశము చెప్పవచ్చును. అధికరణమనగా ఆధార నిర్దేశము. ఉపాసన కొరకు చెప్పబడినవి. ప్రతీకరూపము, అన్యత్ర అన్య దృ ష్ట్యాలంబనమును ప్రతీకమందురు. నామాది ప్రతీకములను బ్రహ్మముగా ఉపాసించుచున్నట్లు ఉదరస్థ జ్యోతిని ప్రతీకముగా భావించి దానిలో బ్రహ్మోపాసన చేసినను దోషము లేదు. అందువల్ల చాందోగ్యపనిషత్తు వాక్యములోని జ్యోతిః శబ్దము బ్రహ్మ పరము.

25. ఛందో అభిధాన న్నేతి చేన్న తథా చేతో అర్పణ నిగదాత్తథాహి దర్శనం (1.1.25)

సూత్రార్ధము : ఛందోభిధానాత్ = "గాయత్రీ వా ఇదం సర్వం భూతం" అను శ్రుతివాక్యములో గాయత్రీ ఛందస్సు ఉపక్రమము చేయుట వల్ల బ్రహ్మ గురించి కాదు అనిన, న = అట్లనుట సరిగాదు.

తథా చేతో అర్పణ నిగదాత్ = గాయత్రీ ఛందస్సు ద్వారా గాయత్రిలో నున్న బ్రహ్మమునందు చిత్తము ఏకాగ్రము చేయవలెనని ఉపదేశము.

తథాహి దర్శనమ్ = అట్లే "ఏతం హ్యేవ బహ్వృచా మహత్యుక్తే మీమాంసన్తే" అను వాక్యములో వికారి కార్యబ్రహ్మము ద్వారా కారణ బ్రహ్మము యొక్క ఉపాసన కనబడుచున్నదని ఉదాహరణము. గాయత్రీ ఛందస్సు పూర్వ వాక్యములో చెప్పబడినందువల్ల జ్యోతిః శబ్దము బ్రహ్మపరము గాదు అనిన అట్లనిన సరిగాదు. ఎందువల్ల? అక్షరములను కూర్చి చెప్పిన గాయత్రీ ఛందస్సు సర్వాత్మక స్వరూపము కానేరదు. ఛందస్సు ద్వారా దానియందున్న బ్రహ్మములో చిత్తమునేకాగ్రము చేయుట చెప్పిరి. దృష్టాంతము "ఏతం హ్యేవ బహ్వృచా మహత్యుక్తే మీమాంసన్తే" ఐతరేయ అరణ్యకములోని (3-2-3-12) వాక్యము. ఇదే బ్రహ్మమును మహా ఉక్థములో (చాటు వాక్యములలో) ఋగ్వేదము చదువు వారు మీమాంస చేయుదురు. ఈ పూర్వ వాక్యములో గూడ బ్రహ్మ ఉపాస్యముగా కనబడుచున్నది. ఛందస్సు గాదు.

26. భూతాదిపాదవ్యపదేశోపపత్తేశ్చైవమ్ (1.1.26)

సూత్రార్ధము : భూతాదులను గాయత్రి పాదములుగ చెప్పుట వలన ఇచట బ్రహ్మ ప్రసంగమే. 'చ'కారము ద్వారా బ్రహ్మపరముగా పురుష సూక్తములో చెప్పుట వలన కూడ ఇచట బ్రహ్మ ప్రసంగమే. "సైషా చతుష్పదా గాయత్రీ" ఇదంతయు బ్రహ్మమే అని చెప్పి, గాయత్రి ఛందస్సును నిర్దేశించిరి. పై శ్రుతిలో నాలుగు పాదముల గాయత్రి అని చెప్పి ఈ శ్రుతి ద్వార భూత సమూహము, భూమి, శరీరము, హృదయము, ప్రాణములు చెప్పినందున బ్రహ్మమందు గాయత్రీ శబ్ద ప్రయోగము ఉచితమే. అక్షర సమూహమైన గాయత్రీ ఛందస్సునందు భూతాదుల పాద ఉపదేశము యుక్తి సంగతము గాదు. అందువల్ల గాయత్రీ వాక్యములో బ్రహ్మమునే ప్రతిపాదించిరి. అదే బ్రహ్మమును జ్యోతిర్ వాక్యములో స్వర్గాది సంబంధముగా ప్రత్యభిజ్ఞ గావించుట వలన బ్రహ్మోపదేశమే. భూతాదులను పాదములుగా నిర్దేశించుట. "తావనస్య మహిమ" అది బ్రహ్మ యొక్క మహిమ అను శ్రుతి "విష్ట భ్యాహమిదం" (గీత : 10.42) సంపూర్ణ జగత్తును ఒక అంశముతో వ్యాపింపజేసి యున్నాను అను గీతా వాక్యము "యద్వై తద్ బ్రహ్మ" (చాం. 3.12.7) "ఏది గాయత్రీ ద్వారా చెప్పిన త్రిపాద అమృత స్వరూపమో అది బ్రహ్మము" అను ఛాందోగ్య శ్రుతి ద్వారా ముఖ్య బ్రహ్మ నిర్దేశము వలన జ్యోతి శబ్దము ద్వారా బ్రహ్మోపదేశమే.

27. ఉపదేశభేదాన్నేతి చేన్నోభయస్మిన్నప్యవిరోధాత్ (1-1-27)

సూత్రార్ధము : ఉపదేశ భేదాత్ = దివి అని సప్తమి విభక్తి అని ఒక చోట "అథ పరో దివి" అని పంచమీ విభక్తి వేరొకచోట చెప్పుట వలన, న ఇతిచేత్ = దానినే ఇచట ప్రత్యభిజ్ఞానము ద్వారా చెప్పుట లేదు అనిన

న = అట్లనుట సరిగాదు

ఉభయస్మిన్నపి = రెండురకములుగా చెప్పినను

అవిరోధాత్ = విరోధము లేదు

"దివః పరమ్" అనుచోట పంచమీ విభక్తి ద్వార స్వర్గలోక మర్యాద వినబడుచున్నది. "దివి" అన్నచోట స్వర్గము ఆధారముగా సప్తమి వినబడుచున్నది. విభక్తి భిన్నమగుట వలన ఉపదేశము భేదమగుట వలన ప్రత్యభిజ్ఞ లేదని చెప్పిన అట్లనుట సరిగాదు. రెండు రకములుగా చెప్పినను విరోధము లేదు. విభక్తి వేరైనను ప్రాతిపదికార్ధము (విభక్తి చేర్చుటకు ముందున్న శబ్ద భాగము)ను ప్రత్యభిజ్ఞ గావించిరనిన విరోధముండదు. వృక్షాగ్రమున నున్న గ్రద్దను వృక్షాగ్రమున గ్రద్ద లేక వృక్షాగ్రముపైన గ్రద్ద అని చెప్పిన తేడా లేదు. అట్లే స్వర్గమునకు పైనున్న బ్రహ్మ, స్వర్గములో బ్రహ్మ అని చెప్పిన భేదము లేదు. అందువల్ల పూర్వము చెప్పిన బ్రహ్మ యొక్క ప్రత్యభిజ్ఞ గలదు. జ్యోతిః శబ్ద వాచ్యము బ్రహ్మమే.

# 11. ప్రతర్ధనాధికరణము.

సంగతి : పూర్వ జ్యోతిరధికరణములో త్రిపాద బ్రహ్మ వివేచన సందర్భములో 'యత్' శబ్దముతో సామానా-ధికరణమగుట వలన జ్యోతి శబ్దమున కర్ధము బ్రహ్మమని చెప్పబడినది. కాని ఈ అధికరణము నందు 'ప్రాణోస్మి ప్రజ్ఞాత్మ" అను వాక్యములో జీవ ప్రాణలింగములుండుట వలననూ అసాధారణ బ్రహ్మలింగము లేనందువల్లన ప్రాణ శబ్దమునకర్ధము బ్రహ్మమని చెప్పుటకు వీలు లేదు. ఈ విధముగా ఇచట ప్రత్యుదాహరణ సంగతి.

విషయము : "సాహోవాచ ప్రాణోస్మి ప్రజ్ఞాత్మ తం మామాయురమృత ముపాస్స్వ" నేను జ్ఞాన రూపమగు ప్రాణమే స్వరూపముగా కలవాడను. అట్టి నన్ను ఆయుస్స్వరూపునిగాను మోక్ష స్వరూపునిగాను ఉపాసించుము అని ఇంద్రుడు ప్రతర్దనునికి ఉపదేశించెను. ఈ కౌశీతకీ ఉపనిషత్ వాక్యమిచట విచారణీయ విషయము.

సంశయము : పై వాక్యములో ప్రాణ శబ్దము ద్వారా వాయువునా, ఇంద్రదేవతనా, జీవునా, లేక పరబ్రహ్మమునా ఉపదేశించిరి అని సంశయము.

పూర్వపక్షము : పై చెప్పిన నాలుగు అర్థముల చిహ్నములుండగా ఒకే బ్రహ్మము యొక్క అర్థము చెప్పుట ఉచితము గాదు.

సిద్ధాంతము : ప్రాణ శబ్దమునకు అర్థము బ్రహ్మమనియే చెప్పవలయును. అనేక చిహ్నములు బ్రహ్మమందు మాత్రమే అవ్యభిచరిత రూపముగా సిద్ధమగుచున్నవి. బ్రహ్మ భిన్న అర్థములో ఆ చిహ్నములు నిరుపయోగము. కనుక ప్రాణ శబ్దమునకు అర్థము బ్రహ్మమనియే స్వీకరింపవలయును.

వైయాసికన్యాయమాలా:

37. ప్రాణోస్మీత్యత్ర వాయువ్యింద్ర జీవబ్రహ్మసుసంశయః। చతుర్ణాం లింగసద్భావాత్పూర్వపక్షస్త్వనిర్ణయః||

38. బ్రహ్మణో అనేక లింగాణి తాని సిద్ధాన్యనన్యథా। అన్యేషామన్యథాసిద్ధేర్వ్యుత్పాపద్యంబ్రహ్మనేతరత్||

"ప్రాణోస్మి ప్రజ్ఞాత్మా తం మామాయురమృతమిత్యుపాస్స్వ" ఈ శ్రుతిలో ప్రాణశబ్దము వాయువా లేక ఇంద్రుడా లేక జీవుడా కాక బ్రహ్మ వాచకమా? చెప్పిన శ్రుతిలో నాల్గింటి చిహ్నములున్నవి. అందువల్ల నిశ్చయముగా ప్రాణశబ్దమునకు అర్థము చెప్పలేము.

ఇచట బ్రహ్మకు అనేక చిహ్నములున్నవి. అవి అన్నీ సరైనవే, అనవసరములు గావు. ప్రబలమైనవి.ఆ చిహ్నములు ప్రాణ, ఇంద్ర, జీవుల పక్షములో సమన్వయించవు. కాని దీనికి విపరీతముగా ప్రాణ, ఇంద్ర,జీవ, చిహ్నములు బ్రహ్మలో సమన్వయములగునని చెప్పిన శ్రుతిలో ప్రాణశబ్దముతో బ్రహ్మబోధ కలుగుచున్నది, వాయువు కాదు.

భారతీ తీర్థుల వారి వ్యాఖ్య:-

కౌశీతకీ ఉపనిషత్తునందలి ఇంద్ర ప్రతర్దన కథలో ఇంద్రుడు ప్రతర్దనునితో చెప్పెను. "ప్రాణోస్మి ప్రజ్ఞాత్మా తం మామాయురమమృతమిత్యుపాస్స్వ" 'నేను జ్ఞానరూపమగు ప్రాణమే స్వరూపముగా గలవాడను. అట్టి నన్ను ఆయుస్స్వరూపునిగాను, మోక్ష స్వరూపునిగాను ఉపాసించుము. అచట నాలుగు రకముల చిహ్నములుండుట వలన నాలుగు ప్రకారముల సంశయము. "ఇదం శరీరం పరిగృహ్యోత్థాపయతి" (కౌ. 3.3) ఈ ప్రాణము శరీరమును గ్రహించి నడుపుచున్నది అనునది ప్రాణవాయువు చిహ్నము. అస్మి అనునది ఉపదేశకుడైన ఇంద్రుడి అహంకారవాదము. ఇంద్రుడి చిహ్నము. "వక్తారం విద్యాత్" (కౌ. 3.8) "చెప్పువానిని తెలుసుకొనుము" అన్నచోట వక్తృత్వము జీవ చిహ్నము. "ఆనందో అజరో అమృతః" "ఆనంద స్వరూపము, వృద్ధాప్య రహితము, ఆమరణ

ధర్మము" అనునవి బ్రహ్మ చిహ్నములు. ఇచట ప్రబల దుర్బల వివేకములేనందున నిర్ణయము కాలేదని పూర్వపక్షము.

సిద్ధాంతము : బ్రహ్మ చిహ్నములనేకములున్నవి. "త్వమేవ మే వృణీష్వ యం త్వం మనుష్యాయ హితతమం మన్య సే" (కౌ. 3.1) "మనుష్యులకు పరమ పురుషార్థ మన్నదేదియో దానిని నీవే విచారించి నాకు అనుగ్రహింపుము". అనునది "హితతమత్వము పరమపురుషార్థ సాధనము ఒక చిహ్నము" "యో మాం విజానీయాత్ నాస్య కేనచ కర్మణా లోకో మీయతే న మాతృవధేన న పితృ వధేన" (కౌ.3.1) 'నా యదార్థ స్వరూపమెవడెరుంగునో అట్టి వాని మోక్ష గతికి ఏ కర్మములును విఘ్న కారణము కానేరవు. మాతృ హత్య గాని పితృ హత్య కాని భంగము కలిగింపనేరవు'. జ్ఞాన మాత్రముచే మహాపాతకములు స్పృశించవు. అనునది వేరొక బ్రహ్మ చిహ్నము. అట్లే అన్య ఉదాహరణములు కూడ చెప్పవచ్చును. ఈ చిహ్నములు ప్రాణ, ఇంద్ర, జీవ పక్షములలో చెప్పుటకు వీలు గాదు. కాని ప్రాణాది చిహ్నములు బ్రహ్మకు చెప్పవచ్చును. ప్రాణాదులు బ్రహ్మ బోధకు ద్వార భూతములు. అట్లు బ్రహ్మ చిహ్నములు అనేక ముండుట వలన అవి కారణములు గాదని చెప్పనలవి కానందున బ్రహ్మ ప్రాభల్యము. ఇచట బ్రహ్మమే ప్రతిపాదింపబడినది. ప్రాణాదులు కావు.

28. ప్రాణస్తథాऽనుగమాత్ 1.1.28

సూత్రార్థము : ప్రాణ శబ్దము బ్రహ్మ వాచకమే అగును. ఎందులకనగా అదే అర్థములో మిగిలిన శ్రుతులు అనుసరించుట వలన ప్రాణ శబ్ద వాచ్యము బ్రహ్మమనే తెలుసుకొనవలయును.

ఎందులకనగా పూర్వాపర పర్యాలోచన ద్వారా బ్రహ్మ విషయములోనే శబ్దార్థము సమన్వయమగుచున్నవి. అట్లే "త్వమేవ మే వరం వృణీష్వ యం త్వం మనుష్యాయ హితతమం మన్య సే" నాకు నువ్వే స్వయముగా వరదానము నిమ్ము. ఏది నువ్వు మనుష్యులకు పురుషార్థ సాధనమని విచారించితివో దానినే ఇమ్ము. హితతమము మనుష్యులకు బ్రహ్మ జ్ఞానముకన్న వేరుగాదు. అందువల్ల బ్రహ్మమే ప్రాణ శబ్దము. "యోం మాం వేద నహవై తస్య కేనచన కర్మణా" ఎవరు నన్ను తెలుసుకొందురో వారికి కర్మ లేపము లేదు. వారు అజరామరులు. కర్మ ద్వారా వారిలో ఎచ్చుతగ్గులు రావు. ఈ శ్రుతిలో కర్మ అసంబంధము మరియు అమరత్వము కర్మద్వారా వారికి వృద్ధిహ్రాసములు లేవని చెప్పిరి. ఇవన్నియు బ్రహ్మ పరముగా చెప్పుట వలననే సరియగును. అందువల్ల ఇచట ప్రాణ శబ్దము బ్రహ్మపరమే.

"మామేవ విజానీహి" నన్నే తెలుసుకొనుము. అని ఉపక్రమించి, "ప్రాణోస్మి ప్రజ్ఞాత్మ" నేను ప్రజ్ఞాత్మ ప్రాణమును అను అహంకార వాద చిహ్నము ద్వారా ఇంద్రదేవతను చెప్పిరి అనిన -

29. న వక్తురాత్మోపదేశాదితి చేదధ్యాత్మసంబంధభూమా హ్యస్మిన్ 1.1.29

సూత్రార్థము : ఇంద్రుడు ప్రతర్దనునికి "నువ్వు నన్నే తెలుసుకో అని ఆత్మ విశిష్టమైన శరీరమును జ్ఞేయముగా చెప్పెను". అందువల్ల ప్రాణోస్మి ప్రజ్ఞాత్మ అనుశ్రుతిలో ఇంద్రుడే ఉపాస్యుడనిన అది సరిగాదు. ఇదే వాక్యములో బ్రహ్మకు ఆనందత్వము అమృతత్వము ఆదిగా గల అనేక ధర్మములు చెప్పబడెను. అందువల్ల బ్రహ్మమే ఉపాస్యము.

పరబ్రహ్మ వాచకము ప్రాణ శబ్దము గాదు. ఎందులకనగా నన్నే తెలుసుకొనుము. అని ఉపదేశకుడైన ఇంద్రుడు చెప్పినందువల్ల "అవాగమన " (బృ. 3.8.8) దానిలో మనో వాక్కులు లేవు అనుశ్రుతిలో బ్రహ్మము ఉపదేశ యోగ్యముకాదు. "ప్రాణో వై బలం" ఈ శ్రుతిలో ప్రాణమును బలరూపముగా చెప్పిరి. బలమునకు దేవత ఇంద్రుడు వానినే ప్రాణ శబ్దముతో చెప్పిన విరోధము లేదు. ఇంద్రుని జ్ఞానము అప్రతిహతము కనుక ప్రజ్ఞాత్మ అని ఇంద్రుని చెప్పవచ్చును. ఈ విధముగా చెప్పిన పూర్వ పక్షమునకు సిద్ధాంతి చెప్పు సమాధానము. "అధ్యాత్మ సంబంధ భూమా హ్యస్మిన్" ఎందులకనగా ఈ అధ్యాయములో ప్రత్యగాత్మకు సంబంధించిన ఉపదేశములు అనేకములు గలవు.

ఉపదేశికుని ఆత్మోపదేశమెట్లు? "నన్నే ప్రాణముగా తెలుసుకొనుము" అని ఇంద్రుడు ఉపదేశించెను గదా. అది ఎట్లు యుక్తి సంగతమగును?

30. శాస్త్రదృష్ట్యా తూపదేశో వామదేవవత్ 1.1.30

సూత్రార్థము : వామదేవ శుకదేవులవలె ఇంద్రుడు గూడ బ్రహ్మ జ్ఞాని అనగా ఇంద్రుడికి నేను పరబ్రహ్మననే జ్ఞానము కలదు. ఆ బ్రహ్మ దృష్టితోనే "మామేవ విజానీహి" "నన్నే తెలుసుకొనుము" అని ప్రతర్దనునికి ఉపదేశించెను.

అందువల్ల 'ప్రాణోస్మి' అన్నచోట ప్రాణము బ్రహ్మమే. ఉపదేశకుడైన ఇంద్రుడు "నన్నే తెలిసికొనుము" అనునది "అహమేవ పరం బ్రహ్మేతి శాస్త్ర దృష్ట్యా బ్రహ్మాత్మానం పశ్యన్నేవోక్తమ్" నేనే పరబ్రహ్మనని శాస్త్ర దృష్టితో తననే బ్రహ్మ దృష్టితో చూచుచు ఉపదేశించెను. ఎట్లనగా వామదేవ ఋషి శాస్త్ర దృష్టితో "నేనే మనువును, నేను సూర్యుని" అని సర్వాత్మను అనుభవించుచు చెప్పెను. ఆ విధముగనే ఇచట ఇంద్రుడు చెప్పెను. అందువల్ల ఈ ఉపదేశము బ్రహ్మపరమే.

ఆధ్యాత్మ సంబంధము కనపడిననూ దేవాత్మయైన బ్రహ్మోపదేశము గోచరించుట లేదు గనుక ఈ వాక్యము పరబ్రహ్మను గురించి చెప్పుట లేదనిన -

31. జీవముఖ్యప్రాణలింగన్నేతి చేన్నోపాసాత్రైవిధ్యాదాశ్రితత్వాదిహ తద్యోగాత్ (1.1.31)

సూత్రార్థము : జీవ ముఖ్య ప్రాణ హేతువులు కనబడుట వలన "ప్రాణోస్మి ప్రజ్ఞాత్మ" అను ఉపదేశము బ్రహ్మపరముగాదనిన అట్లనుట సరిగాదు. మూడు రకముల ఉపాసన స్వీకరింపవలయును. బ్రహ్మ లింగము వల్ల ప్రాణ శబ్దమును బ్రహ్మలింగముగా అంగీకరించుట వలన పరమ పురుషార్థము ఈ శ్రుతిలో చెప్పుట యుక్తి సంగతము.

---

"వక్తారం విద్యాత్" ఉపదేశికుని తెలుసుకొనుము జీవలింగము. "ఇదం శరీరం పరి గృహ్యోత్థాపయతి" ఈ శరీరమును పట్టుకొని లేవనెత్తుచున్నది. ఇది ముఖ్య ప్రాణలింగము. ఈ రెంటిని లేక ఏదో ఒక దానిని అనగా జీవుని లేక ప్రాణమును గ్రహించవలయును కాని బ్రహ్మమును గాదు అనిన అది సరిగాదు. ఎందులకు? జీవోపాసన, ప్రాణోపాసన, బ్రహ్మోపాసన అని త్రివిధోపాసనల ప్రసంగము వచ్చును, అది అభీష్టము గాదు. "మా మేవ విజానీహి" నన్నే తెలుసుకొనుము అని ప్రారంభించి "ప్రాణోస్మి" నేను ప్రాణమును అని చెప్పి "సః ఏష ప్రాణేవ

ప్రజ్ఞాత్మ ఆనందో అజరో అమృతః" అది ప్రాణము ప్రజ్ఞాత్మ, ఆనంద స్వరూపము, అజరము, అమరణ ధర్మము. ఇచట ఆనంద స్వరూపము అజర వృద్ధాప్యము లేకుండుట, ఆమరణధర్మము మొదలగునవి పరమాత్మ లక్షణములు. ఈ శ్రుతిలో ఉపక్రమ ఉపసంహారముల ఏకవాక్యత బ్రహ్మ పరము చెప్పినట్లైననే సరియగును.

అన్యత్ర బ్రహ్మలింగముండుట వలన ప్రాణ శబ్దమునకు బ్రహ్మమని అర్థము చెప్పిరి. అట్లే ఇచట హితతమత్వాది అసాధారణ బ్రహ్మలింగ సంబంధము ద్వారా బ్రహ్మోపదేశమే గాని అన్యార్థము గాదు. ఇది అతి స్పష్టము.

బ్రహ్మసూత్ర హృదయము నందు ప్రథమాధ్యాయములోని ప్రథమపాద సంకలనము సమాప్తము.

## <u>ప్రథమాధ్యాయస్య ప్రథమపాదః సమాప్తః.</u>

## <u>ప్రథమాధ్యాయే ద్వితీయపాదః.</u>

అస్పష్ట బ్రహ్మలింగములతో కూడిన శ్రుతివాక్యములను మరియు ఉపాస్య బ్రహ్మవాక్యముల సమన్వయ మీపాదములో విచారించెదరు. క్రిందటి పాదములో స్పష్ట బ్రహ్మ చిహ్నములు గల వాక్యములను సందిగ్ధమైన కొన్ని వాక్యములను బ్రహ్మమందు సమన్వయము చేసిరి. ఆ వాక్యములందు బ్రహ్మ విషయమైన హేతువులు కలవు. స్పష్ట హేతువులు లేని వాక్యములను సమన్వయ పరచుటకు ద్వితీయ, తృతీయ పాదములు ఆరంభించుచున్నారు. సంపూర్ణ జగత్ కారణత్వము వ్యాపకత్వము నిత్యత్వము మొదలగు బ్రహ్మధర్మములు వెనుకటి పాదములో ప్రసిద్ధములు. వానిని ఆధారముగా చేసుకుని ముందు రెండు పాదములు ఆరంభించిరి. అందువల్ల పూర్వ పాదముతో ఈ రెండు పాదములకు హేతుహేతుమద్భావ సంగతులని తెలుసుకొనవలయును.

# 12. సర్వత్ర ప్రసిద్ధ్యధికరణము

సంగతి : ఇచట "మనోమయః ప్రాణశరీరో భారూపః (ఛాం.3.14.3) అను శ్రుతి వాక్యములో స్పష్ట బ్రహ్మమును బోధించు చిహ్నములు లేవు. స్పష్ట బ్రహ్మలింగమున్న బ్రహ్మ పరకముగా చెప్పగలము. పూర్వాధికరణముతో ఈ అధికరణమునకు ప్రత్యుదాహరణ సంగతి.

విషయము : ఛాందోగ్యపనిషత్తులోని శాండిల్య విద్యయందు 'స క్రతుం కుర్వీత' "మనోమయః ప్రాణశరీరో భారూపః" దుష్టసంకల్పమును విడిచెదను అని సంకల్పించెను. పరబ్రహ్మమునకు మనస్సే స్వరూపము. జ్ఞానశక్తి, క్రియాశక్తి (ప్రాణము) అనువానితో కూడిన సూక్ష్మ శరీరమే శరీముగా గలవాడు. ఈ శ్రుతి వాక్యమిచట విచారణీయము.

సంశయము:- మనోమయము జీవాత్మయా? పరమాత్మాయా అని సంశయము.

పూర్వపక్షము : ప్రాణము మనస్సు జీవునికి గలవు. హృదయములో గల జీవుని ధర్మము సూక్ష్మత్వము. మనోమయత్వాది ధర్మములు గల జీవుని ఇచట ఉపాసించవలయును.

సిద్ధాంతము : "సర్వం ఖల్విదం బ్రహ్మ ఇతి శాంత ఉపాసీత" ఇదంతయు బ్రహ్మమే అని నిశ్చయించుకుని శమదమాదులను అవలంబించి శాంతముగా ఉపాసన చేయుము. ఈ వాక్యములో బ్రహ్మ ఉపాసన ద్వారా జీవుని

హితము చెప్పబడినవి. ఈ ఉపాసనే శాండిల్య విద్యయందు చెప్పిరి. వేదాంతములో ప్రసిద్ధమైన జగత్ కారణమైన బ్రహ్మను "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను వాక్యముతో చెప్పి మరల దానినే మనోమయత్వాది ధర్మ విశేషములతో ఉపాసన కొరకు ఉపదేశించిరి. ప్రాణాదులతో సంబంధము ఉపాసన కొరకు చెప్పిరి అనిన ప్రసంగమును వదలవలసిన పనిలేదు. మరియు అప్రాసంగికము కూడ గాదు. అందువల్ల ఈ శాండిల్య విద్యలో మనోమయత్వాది విశిష్టగుణములతో బ్రహ్మమే ఉపాస్యమని చెప్పిరి.

వైయాసికన్యాయమాలా:

39 మనోమయో యం శారీర ఈశోవా ప్రాణమనసే। హృదయస్థిత్యణీయస్త్వే జీవే స్యు స్తేన జీవగాః॥

40 శమవాక్యగతం బ్రహ్మ తద్ధితాదిరపేక్షతే। ప్రాణాదియోగశ్చింతార్థాశ్చిన్త్యం బ్రహ్మ ప్రసిద్ధితః॥

ఇచట చెప్పిన మనోమయము జీవుడా? పరమేశ్వరుడా? ప్రాణ మనస్సులతో సంబంధముండుట, హృదయములో నుండుట మరియు అతి సూక్ష్మమగుట వలన జీవునిలోనే సంభవము. మనో మయత్వాది ధర్మముల సమన్వయమగుట వలన మనోమయము జీవుడే.

మనోమయపదములో నున్న 'మయట్' తద్ధితపదము. ప్రాణశరీర పదము బహువ్రీహి సమాసమగుట వలన '"సర్వం ఖల్విదం బ్రహ్మ" అను ప్రాసంగిక శమ వాక్యములో నున్న బ్రహ్మనపేక్షించును. బ్రహ్మమందు ప్రాణ మనస్సుల సంబంధము ఉపాసన కొరకు చెప్పిరి. అన్ని వేదాంత వాక్యములలో ఉపాస్యరూపముగా ప్రసిద్ధమైన బ్రహ్మమునే గ్రహించుట ఉచితము. అందువలన మనోమయము బ్రహ్మమే.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఛాందోగ్య తృతీయాధ్యాయము నందలి శాండిల్యవిద్యయందు ఈ విధముగా చెప్పిరి. "మనోమయః ప్రాణశరీరో భారూపః" (ఛాం. 3.14.3) చెప్పిరి. ఇచట జీవుడా? ఈశ్వరుడా? అని సందేహము.

మనస్సుతో సంబంధము జీవునిలో సుసంపాద్యము కనుక జీవుడనాలి. మనస్సు యొక్క వికారము మనోమయము. ఇది మనో సంబంధము. "ప్రాణః శరీరమస్య' ' అని ప్రాణ సంబంధము. ఈ రెండు ఈశ్వరునిలో సుసంపాద్యములు గావు. "అప్రాణోహ్యమనాః శుభ్రః"(ముం. 2.1.3) "ఆ పరమేశ్వరునకు సూక్ష్మ శరీరము లేదు, మనస్సు లేదు, ఆయన నిర్మలుడు". అని ఈశ్వరుని యందు మనస్సు నిషేధించిరి. మరియు "ఏష మే ఆత్మా అన్తర్ హృదయే అణీయాన్" (ఛాం. 3.14.3) ఈనా ఆత్మ హృదయము లోపల ధాన్య కణము కన్న యవల కణము కన్న చిన్నదై యున్నది. ఈ శ్రుతిలో వినబడు హృదయములోపల ఉన్నది, అణుమాత్రమై యున్నది అను ధర్మములు నిరాధారములు, సర్వగతమైన ఈశ్వరుని యందు ఏ విధముగను యుక్తి సంగతుములు గావు. అందువలన మనోమయము జీవుడు. ఈపూర్వపక్షమునకు సిద్ధాంతి సమాధానము - "సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలాని ఇతి శాంత ఉపాసీత" (ఛాం. 3.13.1) నిశ్చయముగా ఇదంతయు బ్రహ్మమే. ఎందులకనగా ఈ జగత్తు వానినుండే ఉత్పన్నమైనది.వానిలో లీనమగుచున్నది. వానిలోనే స్థితి కాలములో చేష్ట కలిగియున్నది. అందువల్ల బ్రహ్మోపాసకుడు శమాదుల నాచరించి శాంతించవలయును. ఈ వాక్యములో శమవిధిపరముగా వినవచ్చు

బ్రహ్మమునే తరువాత చెప్పిన మనోమయాది శ్రుతి ద్వారా విశేషముగా చెప్పబడినది. అనగా "మనోమయః ప్రాణ-శరీరః" అను తద్ధిత బహువ్రీహిల ద్వార విశేషముగా చెప్పిరి. శమ వాక్యమునకు అర్థము- ఎందువల్ల ఇదంతయు బ్రహ్మమో దేని నుండి జగదుత్పత్తి స్థితి లయములు కల్గుచున్నవో ఆ సర్వాత్మ బ్రహ్మమందు రాగద్వేష విషయములు సంభవములు గావు గనుక ఉపాసన కాలములో శాంతుడవై ఉండుము. ఈ వాక్యము బ్రహ్మపరము గనుక విశేషణత్వముగా చెప్పిన మనోమయత్వాదులు గూడ బ్రహ్మపరములగును. బ్రహ్మమందు మనో ప్రాణ సంబంధము యుక్తము గాదని చెప్పతివి గదా దానికి సమాధానము వినుము - నిరుపాధిక బ్రహ్మము నందు అవి యుక్తి యుక్తములు గావు గాని ఉపాస్యమైన సోపాధికమందు అవి యుక్తి యుక్తములే. అందువల్ల అన్ని వేదాంత వాక్యములలో ఏ బ్రహ్మము ప్రసిద్ధమో దానినే ఇచట కూడ ఉపాసించవలయును. వేదాంత వాక్యములలో జీవుని ఉపాస్యముగా ఎచటను చెప్పలేదు. అందువల్ల మనోమయత్వాది బ్రహ్మమే.

32. సర్వత్ర ప్రసిద్ధోపదేశాత్ (1.2.1)

సూత్రార్థము : పరబ్రహ్మమునే జగత్కారణముగా అన్ని వేదాంత వాక్యములలో ఉపాస్యముగా చెప్పిరి. మనోమయత్వాది విశేషగుణముల ద్వారా ఆ బ్రహ్మమే ఉపాస్యము, జీవుడు కాదు.

అన్ని వేదాంత వాక్యములలో జగత్కారణముగా ప్రసిద్ధి చెందిన బ్రహ్మమునే "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను ఉపక్రమ వాక్యములో చెప్పి మరల దానినే మనోమయత్వాది విశేష గుణములతో చెప్పినందువల్ల బ్రహ్మమే ఉపాస్యము. ఇట్లు చెప్పిన ప్రకృతహాని అప్రకృత ఉపాదేయము కాదు. వాక్యోపక్రమములో శమాదులను విధించినను సన్నిహితముగా ఉండుట వలన బ్రహ్మమే ఉపాస్యము. జీవుని సన్నిహితముగా చెప్పలేదు. మరియు బ్రహ్మముతో సమానముగా జీవుని చెప్పు వాచక శబ్దములు లేవు. కనుక మనోమయత్వాది ధర్మ విశేషములతో బ్రహ్మోపాసనమే చెప్పబడినది. అంతయు బ్రహ్మ వికారమే గనుక.

33. వివక్షితగుణోపపత్తేశ్చ 1.2.2

సూత్రార్థము : ఉపాసన కొరకు ఉపదేశింపబడిన సత్య సంకల్పత్వము భారూపత్వము మొదలుగా గల గుణములు బ్రహ్మమందే సమన్వయించును. అందువల్ల మనోమయము బ్రహ్మమే.

మనోమయత్వాది వాక్యములో చేసినది బ్రహ్మోపదేశమే. ఎందులకనగా "భారూపః సత్య సంకల్పః" సత్య సంకల్పుడు, ప్రకాశ స్వరూపుడు అను గుణములతో ఉపాసన కొరకు బ్రహ్మమునే ఉపదేశించిరి. సత్య సంకల్పము అనగా సృష్ట్యాదులలో అప్రతిబంధ శక్తి సంపన్నుడు అనునది పరమాత్మ యందే యుక్తి యుక్తము. "మనోమయత్వము ప్రాణ శరీరము" అను జీవలక్షణములు పరమాత్మయందు చెప్పుట సరికాదు అనిన అట్లనుట సరిగాదు. మనోమయత్వాది జీవుని అసాధారణ ధర్మమైనను సత్య సంకల్పాది బ్రహ్మను చెప్పు హేతువుల ద్వారా మరియు సర్వాత్మకత్వము వల్లను బ్రహ్మమునే మనోమయత్వాదుల ద్వారా చెప్పవలయును. సర్వాత్మత్వము అనగా అందరిలో సమానముగా ఉన్న చైతన్య స్వరూపుడు అది జీవునికి సంభవము గాదు. సర్వాత్మము శ్వేతా-శ్వతరోపనిషత్తులో ఈ విధముగా చెప్పిరి. "త్వం స్త్రీ త్వం పుమానసి" (శ్వేత . 4.3) నీవే స్త్రీవి, నీవే పురుషుడవు, నీవే బాలుడవు, నీవే బాలికవి "సర్వతః పాణి పాదం" (గీత. 13.13) ఆ బ్రహ్మమునకు చేతులు, కాళ్ళు, కన్నులు,

తలలు, ముఖములు అనునవి అనంతముగా ఉన్నవి. ఈ సర్వాత్మత్వము గీతలో కూడ ప్రసిద్ధము. మనోమయత్వాది గుణముల ద్వారా బ్రహ్మమే ఉపాస్యము.

34. అనుపపత్తేస్తు న శారీరః (1.2.3)

సూత్రార్థము : సత్య సంకల్పత్వాది గుణములు జీవునిలో సంభవము గావు. శారీరః = జీవః = సత్య సంకల్పత్వాది గుణముల ద్వారా ఉపాస్యుడు గాడు. బ్రహ్మమే ఉపాస్యము.

సూత్రములో నున్న 'తు' శబ్దము నిశ్చయార్థము. మనోమయత్వాది గుణములు గలవాడు బ్రహ్మమే, జీవుడు గాదు. ఎందులకనగా "సత్య సంకల్పః ఆకాశ ఆత్మ" (ఛాం 3.14.2) 'అవాకీ అనాదరః" (ఛాం. 3.14.4) "జ్యాయాన్ పృథివ్యాః" (ఛాం.3.14.3) సత్య సంకల్పుడు, ఆకాశముతో సమానమైన స్వరూపము కలవాడు. పరమాత్మ ఇంద్రియ రహితుడు, ఆగ్రహ రహితుడు అనగా కోరికలు లేనివాడు. పృథివీకన్న శ్రేష్ఠుడు. ఈ గుణములు జీవునిలో సంభవము గావు. కాన మనోమయత్వాది ధర్మములు బ్రహ్మమునకే చెప్పిరి.

35. కర్మకర్తృవ్యపదేశాచ్చ (1.2.4)

సూత్రార్థము : "ఏతమితః ప్రేత్యాభిసంభవితాస్మి" అను శ్రుతిలో ఏతం శబ్దముతో చెప్పిన ప్రకృత బ్రహ్మము పొందబడేది - కర్మ. 'అభిసంభవితాస్మి' అని జీవుడు పొందేటివంటి కర్త అని ఉపదేశించిరి. మనోమయత్వాది గుణములతో బ్రహ్మమే ఉపాస్యము జీవుడు గాదు.

కర్మ కర్తృ భేద ఉపదేశము వల్ల ఉపాస్యము జీవుడు గాదు. "ఏతమితః పేత్యాభిసంభవితాస్మి" (ఛాం. 3.14.4) ఏతం పదము ద్వారా మనో మయత్వాది ఉపాస్య గుణముల ద్వారా బ్రహ్మము కర్మగా చెప్పబడినది. "అభిసంభవితాస్మి" అనగా పొందుతాను అని జీవుని కర్తగా చెప్పిరి.

36. శబ్దవిశేషాత్ (1.2.5)

సూత్రార్థము : "అంతరాత్మన్ పురుషో హిరణ్మయః" (శత.బ్రా. 10.6.3.2) ఈ శ్రుతిలో జీవ పరమాత్మలను చెప్పు సప్తమీ విభక్తి మరియు ప్రథమా విభక్తి శబ్దమునకు భేదముండుట వలన జీవుడు ఉపాస్యుడు గాడు. "అంతరాత్మన్" సప్తమీ విభక్తి, పురుషః ప్రథమా విభక్తి.

శబ్ద భేదము వల్ల గూడ జీవుని కన్న భిన్నము మనోమయత్వాది గుణములు గల పరమాత్మ. ఇలాంటి ప్రకరణములోనే వేరొక శ్రుతిలో "అంతరాత్మన్ పురుషో హిరణ్మయః" అనుచోట జీవ వాచకము అంతరాత్మన్ అను శబ్దము సప్తమ్యంతము. దానికన్న భిన్నము పురుష శబ్దము ప్రథమాంతము. మనోమయత్వాది విశిష్ట గుణములు గలది పరమాత్మ, ఉపాస్వ స్వరూపముగా చెప్పబడినది. కనుక బ్రహ్మమే ఉపాస్యము.

37. స్మృతేశ్చ (1.2.6)

సూత్రార్థము : "ఈశ్వరః సర్వ భూతానామ్" అను గీత వాక్యములో భేద స్మరణము వల్ల జీవుడు ఉపాస్యుడు గాడు. (గీత. 18.61)

"ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽ ర్జున తిష్ఠతి" (గీత 18.61) సంపూర్ణ భూతముల హృదయ దేశములో ఈశ్వరుడు ఉండి మాయ ద్వారా ఈ భూతములను త్రిప్పుచున్నాడు. ఇలాంటి స్మృతులలో జీవ పరమాత్మల భేద స్మరణము వల్ల బ్రహ్మ కన్న భిన్నుడైన జీవుడు ఉపాస్యుడు గాడు. కల్పింపబడిన భేదము వల్ల గూడ జీవుడు ఉపాస్యుడు గాడని చెప్పిరి. ఆకాశము అపరిచ్చిన్నము వ్యాపకమైనను కల్పించిన ఘటాదుల భిన్నత్వము వల్ల ఉపాధి భేదము ననుసరించి వ్యవహరింతురు. అట్లే జీవోపాధి వల్ల భేదము స్వీకరించిరి. ఇంతవరకు జీవుడు ఉపాస్యుడు కాదని నిర్ణయించి ఇపుడు పరమాత్మ ఉపాస్యత్వము శంకించుచున్నాడు.

38. అర్భకౌకస్త్వాత్త ద్వ్యపదేశాచ్చ నేతి చేన్న, నిచాయ్యత్వాదేవం వ్యోమవచ్చ (1.2.7)

సూత్రార్థము : అర్భకౌకస్త్వాత్ = అల్ప స్థానములో నుండుట వలన, తద్వ్యపదేశాత్ = శ్రుతి స్వశబ్దము ద్వారా అనీయాన్ అని చెప్పుట వలన జీవుడే ఉపాస్యుడు. న = పరమాత్మ గాదు. ఇతి చేన్న ఏవం = అర్భకౌకము మరియు అణీయస్త్వము మొదలగు విశేషరూపములు చెప్పినందున జీవుడనిన సరికాదు. నిచాయ్యత్వాత్ = పరమాత్మ సాక్షాత్కరించుకొనవలయుననినందున. వ్యోమవచ్చ = సర్వవ్యాపకమైన ఆకాశమును సూదిలో ఉన్న సూచ్యాకాశమని నట్లు, బ్రహ్మకు అణీయస్త్వము ఉపదేశించిరి. అందువల్ల బ్రహ్మమే ఉపాస్యము.

శ్రుతి స్వశబ్దముతో అల్ప స్థానములో నున్న ఆత్మను అణీయాన్ అని ఉపదేశించుట వల్ల జీవుడే ఉపాస్యుడు అనిన అట్లనుట సరిగాదు. అల్పస్థానములోనున్న పరమాత్మయే ఉపాస్యము. సూదిలోనున్న ఆకాశమును సూచ్యాకాశమన్నట్లు, వ్యాపకమైనను అణీయస్త్వ ఉపదేశము ఉపాధి సంసర్గము వల్ల బ్రహ్మోపదేశమే. అర్భకౌకము = అల్ప స్థానము దేనికి కలదో అది. దాని భావము అర్భకౌకస్త్యము "ఏషమే ఆత్మ అంతర్ హృదయే" ఈ నా ఆత్మ హృదయములో నున్నది. "అణీయాన్ వ్రీహేర్వా యవాద్వా". వడ్ల గింజకంటెను యవ బీజము కంటెను సూక్ష్మమైనది. (ఛాం 3.14.3) అన్నచోట శ్రుతి స్వశబ్దము ద్వారా సూక్ష్మదేశ ఉపదేశము చెప్పెను. "ఆరాగ్రమాత్రోజీవ ఇహోపాస్యత్వేన ఉపదిశ్యతే" ఆరాగ్రమాత్రమనిన ఇనుప చీల యొక్క (గుఱ్ఱపు బండి తోలువాని చేతిలో నున్న కఱ్ఱ మొదలు యందుండు ఇనుప చీల అగ్రభాగము) కొనను మంత్రము నందు ఆరాగ్రమాత్రమనిరి. ఆరాగ్రమాత్రముగ జీవుని ఉపదేశించిరి. సర్వ వ్యాపకమైన పరమాత్మను ఇచట ఉపదేశించలేదనిన, అట్లనుట సరిగాదు. హృదయ దేశములో సాక్షాత్కరించును గనుక అర్భకౌకస్త్వము అణీయస్త్వ గుణములతో చెప్పిరి. అణీయస్త్వాది గుణములతో హృదయ దేశములో అనుభవించవలయునని ఉపదేశము. ఏవిధముగా శాలగ్రామ శిలలో విష్ణు దృ ష్టి నుంచి పూజించెదరో అట్లే, సర్వ వ్యాపకుడైనను ఆ హృదయములో ఉపాసించిన ప్రసన్నుడగును. గనుక అణీయస్త్వాది గుణోపదేశము విరుద్ధము గాదు. అందువల్ల వాని సర్వవ్యాపకత్వమునకు హాని కలుగదు. ఆకాశమువలె సంభవము గనుక సర్వ వ్యాపకమైనను ఆకాశమును సూదిలో నున్న ఆకాశము, కుండలో నున్న ఆకాశమువలె సూక్ష్మదేశములో చెప్పిన విధముగా ఉపాసన చేసి సాక్షాత్కరించు ఉద్దేశ్యముతో అర్భకౌకస్త్వము, అణీయస్త్వమును చెప్పిరి గాని పరమార్థ దృష్టితో గాదు.

పరబ్రహ్మము సర్వవ్యాపకుడనిన అన్ని ప్రాణుల హృదయములో సంబంధముండుట వలన ఆ ప్రాణుల సుఖ దుఃఖములు బ్రహ్మకు కూడ కలుగుననిన, ఈ సందేహము ముందు సూత్రము ద్వారా పరిహరించు చున్నారు.

39. సంభోగప్రాప్తిరితి చేన్న వైశేష్యాత్ (1.2.8)

సూత్రార్థము : సంభోగప్రాప్తిః = పరమాత్మ సర్వగతుడు గనుక అవిశేష చైతన్యము వలన సర్వ ప్రాణుల సుఖ దుఃఖముల సంస్పర్శ వానికి గలుగును. ఇతి చేన్న = అట్లనిన అది సరిగాదు. వైశేష్యాత్ = జీవ బ్రహ్మలలో భోక్తృత్వ అభోక్తృత్వ విశేషముండుట వలన మనోమయత్వాది గుణములతో పరమాత్మనే ఉపాసించవలయును.

పరమాత్మ సర్వ వ్యాపకుడగుట వలన చైతన్య స్వరూపుడగుట వలన జీవుని వలె సుఖ దుఃఖములనుభవించుననిన, అట్లనుట సరిగాదు. జీవుడు భోక్త, పరమేశ్వరుడు భోక్త కాడు. ఈ భేదము వలన వ్యవహారదశలో జీవ బ్రహ్మలు వేరు. అందువల్ల జీవ భోగమువల్ల పరమాత్మయందు భోగము లేదు.

ఆకాశము వలె బ్రహ్మ వ్యాపకుడైన అన్ని జీవుల హృదయములలో సంబంధముండుట వలన జీవుని వలె బ్రహ్మ సుఖ దుఃఖములు అనుభవించుననిన అది సరిగాదు. జీవుని యందు గల భోక్త త్వము బ్రహ్మ యందు లేదు గనుక. జీవుని భోగము ద్వారా పరమాత్మకు సుఖ దుఃఖములుండవు. "నాన్యతో అస్తి ద్రష్టా" వానికన్న భిన్నమైన వేరొక ద్రష్ట లేడు (బృ. 3.7.23) "తత్త్వమసి" ఇత్యాది శ్రుతుల ద్వారా జీవబ్రహ్మల ఏకత్వము తెలియుచున్నది. కాన జీవుని దుఃఖము బ్రహ్మకు కల్గును అని చెప్పుటకు గూడ వీలు లేదు. మిథ్యా జ్ఞానము ద్వారా కల్పింపబడిన సుఖ దుఃఖములు సమ్యక్ జ్ఞానమునకు విషయమైన బ్రహ్మమందులేవు. అజ్ఞానులు ఆకాశమునందు మలినత్వము, బోర్లించిన మూకుడ వలె కనుపించును అను ధర్మములు ఆరోపించినను వాస్తవముగా ఆధర్మములతో ఆకాశమునకు సంబంధము లేదు. మిథ్యా జ్ఞానము ద్వారా కల్పింపబడిన భోగములు గాని, వాని గంధలేశము గాని ఈశ్వరుని యందు కల్పింప శక్యము గాదు. ఈ మనోమయత్వాది గుణముల ద్వారా ఈశ్వరుడే ఉపాస్యుడు.

# 13. అత్త్రధికరణము

సంగతి : పూర్వాధికరణములో బ్రహ్మమందు భోక్తృత్వము సంభవము కాదని చెప్పిరి. ఈ అధికరణములో బ్రహ్మమందు కర్తృత్వము గూడ లేదని చెప్పుచున్నారు. కాన ఇచట ప్రత్యుదాహరణ సంగతి.

విషయము : "యస్య బ్రహ్మ చ క్షత్రం చోభే భవత ఓదనః" "ఎవనికి సర్వలోక స్థితి కారకులగు బ్రాహ్మణ క్షత్రియ కులములు (ఆహారము) అన్న స్థానీయములో" (కఠ. 1.2.24) అను కఠ శ్రుతిలో భుజించువాడు వినబడుచున్నాడు . అదియే ఇచట విచారణీయము.

సంశయము : ఈ శ్రుతిలో భుజించువాడు జీవుడా, అగ్నియా లేక ఈశ్వరుడా? అని సంశయము.

పూర్వపక్షము : అన్నము జీవునికి ఇష్టము. మరియు 'స్వాదత్తి' రుచికరమైనవి తినును అని శ్రుతిలో గూడ చెప్పిరి. అందువల్ల భుజించువాడు జీవాత్మయని చెప్పవలయును. లేక అగ్నిని భుజించువాడు అని చెప్పవలయును. ఎందులకనగా "అగ్నిరన్నాదః" "అగ్ని సంపూర్ణ అన్నమును తినువాడు" (బృ. 1.4.6) అనుశ్రుతిలో అగ్నిని అన్నాదః అని చెప్పిరి గనుక.

సిద్ధాంతము : బ్రాహ్మణ క్షత్రియ కులములు మరియు పూర్తిగా జగత్తు ఎవరికి భోజ్యములో అలాంటి ఈశ్వరుడే భోక్త కాగలడు. ఈశ్వరుడి విషయములో ప్రశ్నోత్తరములు నచికేత యమరాజులకు జరుగుచున్నవి. అంతేగాక అత్తృత్వ మనగా ఇచట సంహారార్థము అని చెప్పుటయే ఉచితము. గాన పరమాత్మయే భోక్త రూపముగా చెప్పబడెను. భోక్త ఇచట పరమాత్మయే.

వైయాసికన్యాయమాలా:

41. జీవోఽగ్ని రీశోఽవాత్తా స్వాదోదసే జీవ ఇష్యతా మ్। "స్వాద్వత్తీతి" శ్రుతేర్వహ్నిర్వాగ్ని రన్నాదః ఇత్యతః||

42. బ్రహ్మ క్షత్రాది జగతో భోజ్యత్వత్స్యదిహేశ్వరః। ఈశప్రశ్నోత్తరత్వాచ్చ సంహారస్తస్య చాత్తృతా ||

"యస్య బ్రహ్మచ క్షత్రంచ" ఈ మంత్రములో కనబడు "అత్తా" (భోక్తా) జీవుడా అగ్నియా, లేక పరమేశ్వరుడా? భోక్తా జీవుడే, ఎందులకనగా "తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి" ఆ రెంటిలో ఒకటి మధుర కర్మఫలం అనుభవించును. అని జీవుని భోక్తగా చెప్పిరి. లేక అగ్ని భోక్త అనవచ్చును. ఎందువలననగా "అగ్ని రన్నాదః" అగ్ని అన్న భక్షకుడన్న శ్రుతిలో అగ్నిని భోక్తగా చెప్పిరి.

శ్రుతిలో బ్రహ్మ, క్షత్ర పదములు సంపూర్ణ జగత్తునకు ఉపలక్షణములు. సంపూర్ణ జగత్తును భక్షించుట (సంహరించుట) వలన ఇచట భోక్త ఈశ్వరుడే. రెండవ మాట - పై చెప్పిన శ్రుతి ఈశ్వర విషయ ప్రశ్నకు సమాధానముగ చెప్పబడినది. కనుక ఇచట అత్తా ఈశ్వరుడే. అత్తా అనగా సంహార కర్త. జగత్తును ఈశ్వరుడే సంహరించగలడు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

కఠోపనిషత్తులో రెండవవల్లిలో చెప్పబడినది. "యస్య బ్రహ్మచ క్షత్రంచ ఉభే భవత ఓదనః, మృత్యుర్ యస్యోప సేచనం క ఇత్థా వేద యత్ర సః" (కఠో 1.2.24) "బ్రాహ్మణ క్షత్రియ జాతి ఎవరికి అన్న స్థానీయమో మృత్యువు కూర స్థానీయమో, ఆ పురుషుడు ఉండు స్థానము "ఇదమిత్థం" "ఇది ఈ ప్రకారమని ఎవరు తెలుసుకోగలరు?" ఎవరు తెలుసుకొనలేరని అర్థము. ఇచట అన్నము, కూరలు అనే శబ్దము వలన ఎవరో భక్షకులున్నారని తెలియుచున్నది. అతడు జీవుడా, అగ్నియా, ఈశ్వరుడా అని సంశయము.

జీవుడనే చెప్పవలయును. ఎందులకనగా "ఆ రెండిలో ఒకటి మధుర కర్మ ఫలము అనుభవించుచున్నది" అని జీవుని భక్షకునిగా చెప్పిరి గనుక. లేదా అగ్ని అన్న భక్షకుడనుట వలన అగ్నిని భక్షకుడని చెప్పగలము. ఈ పూర్వ పక్షమునకు సమాధానము. బ్రాహ్మణ క్షత్రియ జాతులు ఉపలక్షణముగ చెప్పుచు సంపూర్ణ జగత్తునిచట భోజ్యముగ చెప్పిరి. అటువంటి భోజ్యమును భుజించువాడు ఈశ్వరుని కన్న అన్యుడు గాలేడు. మరియు ధర్మాధర్మముల కన్న ఆవలనున్నది. కృతాకృతముల కన్న వేరైనది, భూత భవిష్యత్తుల కన్న భిన్నమైన తత్త్వమును నీవనుభవించుదానిని గురించి చెప్పుము అని నచికేతుడు యమధర్మ రాజునడిగెను. ధర్మాధర్మములకతీతము కార్యకారణాతీతము త్రికాలతీతమైన పరమేశ్వరుని గురించి నచికేతుడడుగగా "యస్య బ్రహ్మచ" అను వాక్యము ద్వారా యముడు సమాధానమిచ్చెను. అందువల్ల ఇచట ఈశ్వరుడే ప్రతిపాద్యుడు. "అనశ్నన్నన్యో అభిచాకశీతి" "రెండవ వాడు దేనిని భుజించక ఊరకుండును". అని

ఈశ్వరుని యందు భోక్తృత్వము నిషేధించిరి. ఇచట భుజించుట అత్తృత్వము అనగా సంహార కర్తృత్వము దానిని నిషేధించలేదు. సంహార కర్తృత్వము అన్ని వేదాంతములలో ప్రసిద్ధమే.

40. అత్తా చరాచరగ్రహణాత్ (1.2.9)

సూత్రార్థము : భుజించువాడు అనగా సంహారకర్త. పరమాత్మయే లాక్షణికముగ స్థావర జంగములను సంహరించువాడు అని చెప్పుట వలన సర్వ సంహార కర్తృత్వము పరమాత్మయందే ఒప్పును. జీవుని యందు అగ్నియందు కాదు.

భోక్త (భుజించువాడు) ఇచట పరమాత్మయే, స్థావర జంగములను భుజించువాడు అనుట వలన భుజించువాడు అనగా సంహారకర్త. సంపూర్ణ సంసారము బ్రాహ్మణ క్షత్రియుల ద్వార ఉపలక్షితమైనది. దానిని సంహరించువాడు పరమాత్మయే కాని ఏ దేవదానవుల ద్వారా సంభవము గాదు. అందరిని సంహరించు మృత్యుదేవత వానికి ఉపసేచనము (కూర లేక ఊరగాయ) అని చెప్పుట వలన సంపూర్ణ ప్రాణులు అన్న స్థానీయులు గాన సంపూర్ణ జగత్తును లయము చేయువాడు పరమాత్మయే. మరి "అనశ్నన్ అన్యో అభిచాకశీతి" అనగా ఒక పక్షి భోక్తా రెండవది దానిని ప్రకాశింపచేయునని చెప్పినందువల్ల ముండక శ్రుతిలో, పరమాత్మ భుజించువాడు అనుట సరిగాదు. ఎందులకనగా పై ముండక శ్రుతిలో పరమాత్మయందు కర్మఫల భోక్తృత్వము నిషధించిరే కాని వికారరూపమైన సంహారమును నిషేధించలేదు. అందువల్ల పరమాత్మయే "అత్తా" సంహారకర్తా.

41. ప్రకరణాచ్చ (1.2.10)

సూత్రార్థము:- కఠ శ్రుతిలో పరమాత్మ ప్రకరణ ప్రసంగము వల్ల పరమాత్మయే అత్తా.

సూత్రములోని 'చ' కారము ద్వారా "క ఇత్థా వేద యత్ర సః" "వానిని ఎవరు గ్రహించగలరు" పరమాత్మయే సంహాకర్త వేరెవరు గాదు."న జాయతే మ్రియతే వా విపశ్చిత్". "చైతన్య ఆత్మను అనుభవించు జ్ఞానికి చావు పుట్టుకలు లేవు" (కఠ. 1.2.18) అని పరమాత్మ ప్రసంగము ప్రకృత విషయ ప్రకరణము. సూత్రములోని చకారము ద్వారా వానిని ఎవరు తెలిసికొనగలరు అను శ్రుతిలో గ్రహించిరి. పరమాత్మను తెలుసుకొనుట చాలా కష్టము అను అసాధారణ హేతువు గూడ పరమాత్మనే అత్తా అనుచున్నది.

# 14. గుహాధికరణము

సంగతి : పూర్వాధికరణములో బ్రాహ్మణ క్షత్రియుల సమీపమున మృత్యుపదముండుట వలన సంపూర్ణ జగత్తు అనిత్యమని చెప్పి దానిని సంహరించువాడు పరమాత్మయనిరి. అట్లే ఇచట 'పిబత్' శబ్దమునకు సమీపమున 'గుహ' ప్రవేశ శబ్దము గలదు. గుహ ప్రవేశకులు బుద్ధి జీవులని పూర్వ పక్షము చేసినందున ఈ అధికరణము మొదలైనది. ఇచట దృష్టాంత సంగతి.

విషయము : 'ఋతం పిబంతౌ సుక తస్య లోకే గుహాం ప్రతిష్టౌ పరమే పరార్ధే" కర్మ ఫలముననుభవించుచు హృదయాకాశ గుహయందు నీడ, ఎండవలె పరస్పర భిన్న స్వభావముతో ఇరువురు కర్మ గోచరులై ఉన్నారు. (కఠ 1.3.1) అను శ్రుతి విచారణీయ విషయము.

సంశయము : ఈ శ్రుతిలో గుహలో ప్రవేశించిన వారు బుద్ధి జీవులా? లేక జీవాత్మ పరమాత్మలా అని సంశయము.

పూర్వపక్షము : ఎండ నీడల వలె భిన్న లక్షణములు గల జడ బుద్ధి చైతన్య జీవాత్మయే గుహలో ప్రవేశించిరని చెప్పవలయును.

సిద్ధాంతము : జీవాత్మ పరమాత్మలనే చెప్పవలయును. "పిబంతౌ" అను ద్వివచన ప్రయోగము వలన ఒకడు జీవ చైతన్యమైన వేరొకడు ఈశ్వర చైతన్యమనుటయే ఉచితము. పరమాత్మ హృదయములో ప్రకటమగును గనుక హృదయస్థమనిరి. ఉపాధి వల్ల జీవేశ్వరులకు విలక్షణము చెప్పుట సంభవము. సర్వ వ్యాపక బ్రహ్మను సాక్షాత్కరించుకొనుటకు దేశ విశేషము చెప్పుట విరుద్ధము గాదు. గాన గుహలో ప్రవేశించిన వారు జీవేశ్వరులు.

వైయాసికన్యాయమాలా:

43. గుహాం ప్రవిష్టౌ ధీజీవౌ జీవేశౌ వా హృదిస్థితౌ। ఛాయాతపాఖ్య దృష్టాన్తాద్ ధీజీవౌ స్తో విలక్షణౌ॥

44. పిబన్తావితి చైతన్యద్వయం జీవేశ్వరౌ తతః। హృత్ స్థానముపలబ్ధ్యై స్యాద్వైలక్షణ్యముపాధితః॥

"ఋతం పిబన్తౌ" ఈ శ్రుతిలో చెప్పిన ప్రవేశకర్తలు బుద్ధి మరియు జీవుడా? లేక జీవుడు మరియు పరమేశ్వరుడా? హృదయములో నున్నారని చెప్పిరి. ఎండ నీడ దృష్టాంతముగా చెప్పబడుట వల్ల ప్రవేశకర్తలు విలక్షణమైన బుద్ధి మరియు జీవుడు.

"పిబన్తౌ" అన్నచోట ద్వివచనము తెలియుచున్నది. అందువల్ల రెండు చైతన్యములే కాన, ప్రవేశకర్తలు జీవేశ్వరులు. హృదయ స్థానము ఉపాసన కొరకు చెప్పిరి. జీవుడు సోపాధికుడు గాన ఛాయ వంటి వాడు. మరియు ఈశ్వరుడు నిరుపాధికుడు గాన ఎండ వంటి వాడు. ఈ ప్రకారము ఇద్దరిలో వైలక్షణ్యము గలదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

మూడవ కఠవల్లిలో మొదలులో వినవచ్చుచున్నది. 'ఋతం పిబన్తౌ సుకృతస్యలోకే గుహాం ప్రవిష్టౌ పరమే పరార్ధే ఛాయాతపౌ బ్రహ్మ విదో వదన్తి పఞ్చాగ్నయో యే చ త్రినాచికేతః" అవశ్య భోక్తవ్యమగు కర్మఫలమనుభవించుచు సర్వోత్తమంబును పరతత్వమునకు నివాసనంబును అగు హృదయమున ఆకాశమను గుహయందు నిలచి నీడయు ఎండయును వలె పరస్పర భిన్న స్వభావముతో ఇరువురు కర్మ గోచరులైయున్నారు. ఈ విషయమును బ్రహ్మవేత్తలును కర్మ పరాయనులు నాచికేతాగ్ని చయనము చేసిన వారు గూడ చెప్పెదరు. సుకృత కర్మఫలరూపమైన బ్రాహ్మణాది శరీరములు పరబ్రహ్మ ఉపలబ్ది కొరకు, అవి జ్ఞానాధికార కారణమైన శమాదులతో కూడుకొనినవి. అటువంటి శరీర మధ్యలో నున్న హృదయ గుహయందు ప్రవేశించిరి. లేక ఋతమనగా కర్మ ఫలమనుభవించుచు ఎండనీడల వలె విరుద్ధ స్వభావము గలవారు హృదయగుహలో ప్రవేశించిరి. ఆ ప్రవేశించిన వారు బుద్ధి జీవులా లేక జీవేశ్వరులా? అని సంశయము.

బుద్ధి జీవులని పూర్వ పక్షము. వీరు గుహయందు ప్రవేశించగలరు. ఎండ నీడలులాగ వీరిలో జడ చేతనములు అను వైలక్షణ్యము కూడ గలదు.

సమాధానము : ''పిబన్తౌ'' అను ద్వివచన విభక్తి ప్రయోగము ద్వారా ఇద్దరూ చైతన్యవంతులేనని ప్రతీతి అగుచున్నది. అందువల్ల చైతన్యములైన జీవేశ్వరులిచట ప్రవేశించిరి. సర్వ వ్యాపకమైన ఈశ్వరుని ఉపలబ్ధి కొరకు హృదయ స్థానము వర్ణించిరి. ఇద్దరూ చైతన్యవంతులైనను సోపాధిక నిరుపాధికముల ద్వారా వైలక్ష్యణ్యము కలదు.

### 42. గుహాం ప్రవిష్టావాత్మానౌ హి తద్దర్శనాత్ (1-2-11)

సూత్రార్థము : 'ఋతం పిబన్తౌ' అను మంత్రములో జీవ పరమాత్మలే గుహయందు ప్రవేశించిరి. ఇచట సంఖ్య వినబడుట వలన రెండవది మూడవది అని చెప్పినట్లు దానికి సజాతీయ వస్తువును గ్రహించుట ప్రశస్తి. 'పిబన్తౌ' త్రాగుచున్నారు అని సిద్ధమైన జీవాత్మతో పరమాత్మయే తోటి వాడగును. ఎందులకనగా ఇద్దరూ చైతన్యవంతులు. బుద్ధి జడము గనుక తోటిది గాలేదు.

జీవ పరమాత్మలనే ఇచట గ్రహించవలయును. ఎందులకనగా 'ఆత్మానౌ' అనుట వలన చైతన్యములనే గ్రహించవలయును. 'ఋతౌ పిబన్తౌ' అని ఫల ఉపభోగము జీవాత్మకు వినబడుచున్నది. కాన రెండవది గూడ ఆత్మయే అనుటయే న్యాయము. సంఖ్య వినినప్పుడు రెండవది గూడ సమాన స్వభావములైనవే అని గ్రహించుట లోక ప్రసిద్ధము. ఈ ఎద్దు జతను తెమ్ము అనిన రెండవ ఎద్దును తెచ్చును గాని గుఱ్ఱమునో మనిషినో తీసుకుని రారు. కర్మ ఫల భోగము వలన నిశ్చయమైన జీవాత్మ జతను చెప్పుటకు పరమాత్మయే యుక్తి సమ్మతము. పరమాత్మయందు కర్మఫల భోగము వలన నిశ్చయమైన జీవాత్మ జతను చెప్పుటకు పరమాత్మయే యుక్తి సమ్మతము. పరమాత్మయందు కర్మఫల భోగము లేకపోయినను ఛత్రి న్యాయము ద్వారా ఇచట పరమాత్మనే చెప్పిరి. గొడుగు గలవారు పోవు చున్నారనిన వారితో గొడుగు లేని వారు గూడ ఉండుటనే ఛత్రి న్యాయమందురు. 'గుహాహితం గుహ్వరేష్ఠం పురాణమ్' (కఠ 1.2.2) 'యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్' (తై.2.1) 'విషమ స్థానము లేక గహన స్థానములో నున్న చిరంతన పురాణ పురుషుడు శరీర రూప గుహలో ప్రవేశించెను''. హృదయ గుహాకాశములోనున్న పరమాత్మను తెలిసికొన్న వారు' అన్న ఈ శ్రుతులలో పరమాత్మ బుద్ధి రూపమైన గుహలో ఉన్నాడని చెప్పుట వలన ఇచట గూడ 'గుహ హితత్వ దర్శనము' గుహలో ఉన్నాడని చెప్పిన విరుద్ధము గాదు. పరమాత్మ సర్వ వ్యాపకుడైనను ఉపలబ్ధి కొరకు దేశ విశేషము చెప్పిన విరుద్ధము గాదు అందువల్ల జీవపరమాత్మలే గుహలో ప్రవేశించిరనుట ఉచితమే.

### 43. విశేషణాచ్చ (1.2.12)

సూత్రార్థము : జీవపరమాత్మలను గమన కర్త గంతవ్యముగను మనన కర్త మంతవ్యముగను శ్రుతులలో విశేషణము చెప్పిరి. సూత్రములో నున్న 'చ' కారము పరమాత్మ ప్రకరణము సూచించుచున్నది. సూత్రవ్యాఖ్య జీవ పరమాత్మలే గుహలో ప్రవేశించిరి. ఎందుకు? ''ఆత్మానం రథినం విద్ధి, శరీరం రథమేవతు' (కఠ 1.3.3)

''సోఽధ్వనః పరమాప్నోతి తద్విష్ణో పరమం పదం'' (కఠ 1.39) ''అధ్యాత్మ యోగాధిగమేన దేవం మత్వా ధీరో హర్షశోకౌ జహాతి' (కఠ 1.2.12)

"ఆత్మను రథ స్వామిగను శరీరము రథముగను తెలిసికొనుము". "ఆ సాధకుడు మార్గ అవధులను దాటి విష్ణువు యొక్క పరమధామమును చేరును. అనగా జీవుడు ఇంద్రియాదులను నిగ్రహించునేని పరబ్రహ్మ రూపమగు స్థానమును తనలోనే పొందును."

"స్వప్రకాశరూపుని వేదాంత జ్ఞానముచే నెరింగిన ధైర్యశాలి హర్షశోకములను పొందడు." పై శ్రుతులలో జీవుని చేరువాడుగను పరమాత్మను గంతవ్యరూపముగను మరియు జీవుని మననము చేయువానిగను పరమాత్మను మనన యోగ్యముగను స్పష్ట భేదము చెప్పిరి. సూత్రములోనున్న 'చ' కారముద్వారా పరమాత్మ ప్రసంగము నడుచుచున్నదని చెప్పిరి. అందువలన ఇచట జీవ పరమాత్మలనే గ్రహించువలయును.

# 15. అంతరాధికరణము

సంగతి : పూర్వాధికరణములో 'పిబన్తౌ' అను పదము ద్వారా ద్విత్వ సంఖ్య వినబడుటచే చైతన్యవంతములైన జీవ పరమాత్మలే బుద్ధి రూప గుహయందు ప్రవేశించిరనిరి. అట్లే ఇచట శ్రుతిలో మొదట దృశ్యతే అనియు, ఆఖరిలో అమృతత్వాది గుణములు చెప్పినను, ప్రత్యక్ష కథనము ద్వారా నేత్రములో ప్రతిబింబించుట వలనను, ఆఖరి శ్రుతిని స్తుతిపరముగా చెప్పవలయునని దృష్టాంత సంగతి.

విషయము : ఛాందోగ్యోపనిషత్తులోని ఉపకోశల విద్యలో నున్న ఈ శ్రుతి “య ఏషో అక్షిణి పురుషో దృశ్యతే ఏష ఆత్మేతి హోవాచ ఏతదమృతమభయమేతద్ బ్ర హ్మేతి" (4.15.1) విచ రణీయ విషయము.

సంశయము : కంటి యందు ప్రసిద్ధముగా కానవచ్చుచున్న ప్రతిబింబ పురుషుని లేక ఛాయాపురుషుని గూర్చి చెప్పిరా లేక బ్రహ్మను గురించి చెప్పిరా? అని సంశయము.

పూర్వపక్షము : ఆధారము మరియు 'దృశ్యతే' అను క్రియ చెప్పినందువలన ఈశ్వరుని వదిలి ఛాయా జీవాత్మలు లేక దేవాత్మ ఈ మూడింటిలో ఒకడు అక్షిస్థ పురుషుడు.

సిద్ధాంతము : "కం బ్రహ్మ ఖం బ్రహ్మ" సుఖ స్వరూపము బ్రహ్మము. ఆకాశమువలె వ్యాపకతత్వము బ్రహ్మము ఈ విధముగా మొదట ఉపదేశించిన బ్రహ్మమునే నేత్రములో నున్నాడని చెప్పుచు 'వామనీత్వం-కామప్రాపకత్వము' మొదలగు గుణములతో ఉపాస్యమని చెప్పబడినది. పరమేశ్వరుని వదిలి నీవు చెప్పిన మిగిలిన మూడింటిలో అమృతత్వాది ధర్మములు లేవు. అందువల్ల పరమాత్మే అక్షిస్థ పురుషుడు.

వైయాసికన్యాయమాలా:

45. ఛాయాజీవౌ దేవతేశౌ వాఽసౌ యోఽక్షిణి దృశ్యతే।ఆధారదృశ్యతోక్త్యేశాదన్యేషు త్రిషు కశ్చన॥

46. కం ఖం బ్రహ్మ యదుక్తం ప్రాక్తదేవాక్షిణ్యుపాస్యతే। వామనీత్వాదినాఽన్యేషు నామృతత్వాది సంభవః॥

'య ఏషో అక్షిణి పురుషో దృశ్యతే' అను శ్రుతిలో ప్రతిపాదిత పురుషుడు ఛాయాత్మా లేక జీవుడా లేక దేవత లేక పరమాత్మా? ఆ పురుషుని నేత్రరూప ఆధారము చెప్పబడినది. మరియు వనిని దృశ్యమనిరి. కాన పరమాత్మకన్న భిన్నమైన ముగ్గురిలో ఒకరిని ఛాయాత్మ అని చెప్పవచ్చును.

కం బ్రహ్మమని పూర్వ వాక్యములో చెప్పిన బ్రహ్మనే ప్రస్తుత వాక్యములో అన్ని ఫలములనిచ్చు వామనీత్వ గుణములతో ఉపాసించమనిరి. ఛాయాత్మ అని మూడింటిలో అమృతత్వాది ధర్మములు సంభవము గావు. కావున వాటి ఆదేశము ఇచట లేదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఛాందోగ్య చతుర్థాధ్యాయము నందు ఉపకోశల విద్యలోని వాక్యము శిష్యుడైన ఉపకోశలునికి గురువైన సత్యకాముడు చెప్పిన వాక్యమిది. "య ఏషో అక్షణి పురుషో దృశ్యతే ఏష ఆత్మేతి హోవాచ ఏతదమృతమభయమే - తద్బ్రహ్మ (ఛాం. 4.25) కంటియందు సర్వలోక ప్రసిద్ధుడై కానవచ్చు పురుషుడెవడు గలడో అతడే ఆత్మ. మనన రహితుడు. అతడే నాశశూన్యుడగుటచే భయరహితుడు. అతడే బ్రహ్మము. ఇచట నాలుగు ప్రకారములుగా సంశయము. "అక్షణి సర్వేదృశ్యమాన ఛా యా" కన్నులలో అందరూ చూచు ఛాయా పురుషుడని చెప్పవచ్చును. కన్నుల ఆధారము, దృశ్యత్వము చెప్పవచ్చును. రూపము చూచు సమయములో ఆ జీవుడు కన్నులలో ఉండుట వలన, అన్వయ వ్యతిరేకముల ద్వారా రూపము చూచుట వలన జీవుడు అనవచ్చును. లేక దేవత అనవచ్చును. "ఆదిత్యుడు కన్నులలో దృష్టి రూపములో ప్రవేశించెను" అనిరి గనుక. ఎటుల చూచినను పరమేశ్వరుడు గాడు. ఛాయా జీవ దేవతలలో ఎవరో ఒకరు అనవచ్చును. ఈ పూర్వ పక్షమునకు సమాధానము "కం బ్రహ్మ ఖం బ్రహ్మ" బ్రహ్మ ఆనంద స్వరూపము ఆకాశము వలె పరిపూర్ణమని పూర్వ వాక్యములో చెప్పిరి. దానినే "య ఏషో అక్షిణి" అని ప్రకృత వాచకమైన 'తత్' శబ్దముతో చెప్పి, చక్షువులలో ఉపాస్యమును ఉపదేశించి, వామనీత్వ భామనీత్వ, సంయద్ వామత్వ గుణములను ఉపాసన కొరకు చెప్పిరి. వామనీత్వమనగా కామములను ప్రాప్తింప జేయునది. భామనీత్వమనగా జగత్తును ప్రకాశింపజేయునది. సంయద్వామనీత్వమనగా అన్నీ కామనలను పొందినవాడని అర్థము. ఈ గుణములతో ఉపాసన చేయు బ్రహ్మము సోపాధికమగుట వలన చక్షువులకు ఆధారమని చెప్పుట, చూచుచున్నాడని చెప్పుట శాస్త్ర దృష్టితో విరోధముగాదు. ఛాయా పురుషుడు జీవుడు దేవతలయందు అమృ-తత్వము మరియు అభయత్వము అనుగుణములు సంభవములు గావు. అందువల్ల ఇచట ఈశ్వరుడే ఉపాస్యుడు.

## 44. అన్తర ఉపపత్తేః (1.2.13)

సూత్రార్థము : అక్షిస్థ పురుషుడు పరమాత్మయే. ఇచట చెప్పిన ఆత్మత్వాఽమృతత్వాఽభయత్వాది ధర్మములు పరమాత్మయందే యుక్తి యుక్తములు ఛాయాత్మాదులందు కాదు.

'కన్నుల లోపలలో నున్న పురుషుడు పరమాత్మయే. ఎందులకనగా యుక్తియుక్తము గనుక. ఆత్మత్వము, అమృతత్వము, అభయత్వము, మొదలుగాగల ధర్మములు పరమాత్మ యందే ఒప్పును. అచట ఓ శ్వేతకేతో! ఆ ఆత్మ ఉన్నది అదే నీవు. "స ఆత్మ తత్వమసి" అను శ్రుతి ద్వారా ఆత్మత్వము ముఖ్యముగా పరమాత్మయందే యుక్తము. అమృతత్వము, అభయత్వము అనేకమార్లు శ్రుతిలో వినవచ్చుచున్నది. మరి కన్నులలోని పురుషుడు అనునది సర్వ దోష రహిత స్థానము గనుక ఉపదేశించిరి. "ఏతం సంయద్వామ ఇత్యాచక్షతే' 'ఏతం హి సర్వాణి వామాన్యభిసంయన్తి'(ఛాం. 4.15.2)

వానిని సంయద్వామ అని అందురు. అనగా కర్మలకు ఉచిత కర్మఫలములు పుట్టించుట మరియు కర్మఫలములు అందచేయుట. (ఛాం. 4-15. 2,3) ఈ పై శ్రుతులలో నిర్దేశించిన సంయద్వామాది గుణములు పరమాత్మ యందే యుక్తములు. వేరొక చోట గాదు. అందువల్ల కన్నులలో ఉన్న పురుషుడు పరమాత్మే.

45. స్థానాదివ్యపదేశాచ్చ (1.2.14)

సూత్రార్థము : "యః చక్షుషి తిష్ఠన్" ఎవరు కన్నులలో ఉండిన వానికి 'తస్యోదితి' 'ఉత్' నామము. 'హిరణ్యశ్మశ్రుః' వానికి బంగారమువలె ప్రకాశవంతమైన మీసము కలదు. ఈ ప్రకారము శ్రుతులలో స్థానము, నామము మరియు రూపము చెప్పిరి. అందువల్ల కన్నులలో నున్న పరమాత్మయే ఉపాస్యము.

ఆకాశమువలె సర్వవ్యాపకమైన పరమాత్మకు ఎట్లు కన్నులలో స్థానము చెప్పెదరు? అనిన సమాధానము. 'యః పృథివ్యాం తిష్ఠన్' ఎవడు భూమిలో ఉండి భూమిని నడి పించుచున్నాడో, కాని భూదేవికి వాని ని జ్ఞానము లేదు. వానికి భూమియే శరీరము. భూమిని నియమించువాడు. వాడే నీ ఆత్మ. అంతర్యామి అమృ తుడు (బృ . 3.7.3) ఈ వాక్యము ద్వారా పృథివ్యాది స్థానములలో ఆ పరమాత్మ నిర్దేశింపబడినాడు. 'యః చక్షుషి తిష్టన్' ఎవడు నేత్రములో స్థితుడో, నేత్రములోపల నున్నాడో, ఎవనిని నేత్రము తెలుసుకొనలేదో, నేత్రమే వానికి శరీరమై యున్నదో, వాడే నీ ఆత్మ అంతర్యామి అమృతుడు అని కన్నులు పరమాత్మకు స్థానమని చెప్పిరి. అంతేగాక 'తస్యోదితి నామ' వానికి నామము 'ఉత్' అని కూడ చెప్పిరి. 'హిరణ్యశ్మశ్రుః' (ఛాం. 1.6.6.7) వాని రూపము బంగారువన్నెగల మీసములున్నవాడనిరి. మిగిలిన చోట్ల స్థానము, నామము, రూపములు ఉపాసన కొరకు చెప్పినట్లు ఇచట కూడ సర్వ వ్యాపకమైన పరమాత్మకు అక్షిస్థాన నిర్దేశము ఉపలబ్ది కొరకు చెప్పిరి. ఎట్లనగా సాలగ్రామమునందు విష్ణుదృ ష్టి చెప్పినట్లు.

46. సుఖవిశిష్ఠాభిధానదేవ చ (1.2.15)

సూత్రార్ధము : 'ప్రాణో బ్రహ్మ కం బ్రహ్మ ఖం బ్రహ్మ' (ఛాం. 4.10.5) 'ప్రాణము బ్రహ్మము, సుఖము బ్రహ్మము, ఆకాశము బ్రహ్మము'. అను ఉపక్రమ వాక్యములో సుఖ విశిష్టమైన బ్రహ్మను చెప్పిరి. తరువాత అక్షిస్థాన పురుషుడు పరబ్రహ్మమేనని చెప్పిరి.

ఇచట ఏకవాక్య నిర్వాహకమైన బ్రహ్మమునే ఇచట అక్షి స్థానములో చెప్పుట వలన ప్రకృ త ప్రకరణము బ్రహ్మముదే. 'శ్రుతిలింగ వాక్య ప్రకరణ స్థాన సమాఖ్యానాం సమవాయే పారదౌర్బల్యం అర్ధ విప్రకర్షాత్' వెనుకటి వానికంటె ముందున్నవి తాత్పర్య నిర్ణయమున ప్రబలములు. లింగ చిహ్నము ముందున్నది. ప్రకరణము తరువాతది. కనుక దుర్బలమనిన దానికి సమాధానము. అక్షి స్థానము లింగ ప్రమాణము. ప్రాణము బ్రహ్మమనునది ప్రకరణ ప్రమాణము. కాని ఇచట ఏక వాక్య నిర్వాహకమైన ప్రకరణము లింగము కన్న బలమైనది. ప్రకృత ప్రసంగగత బ్రహ్మమునకు అక్షిస్థానము చెప్పి సంయద్వామత్వాది గుణములు చెప్పుట వలనను మరియు ముందు గురువు శిష్యునకు అర్చిరాది ఉత్తరాయణ మార్గమును ఉపదేశించుట వలనను, ఈ వాక్యములో 'యః ఏషో అక్షిణి పురుషో దృశ్యతే' అనునది బ్రహ్మోపదేశమే.

47. శ్రుతోపనిషత్కగత్యభిధానాచ్చ (1.2.16)

సూత్రార్థము : ఉపనిషద్ రహస్యములను అనుష్టించు సగుణోపాసకుడు పోవు దేవయాన మార్గము శ్రుతి స్మృతులలో ప్రతిపాదించబడినది. దానినే ఇచట అక్షిస్థ పురుషోపాసకునికి చెప్పిరి.

లింగ ప్రమాణము ద్వారా కూడ బ్రహ్మత్వము చెప్పుచున్నారు. లింగమనగా హేతువు లేక కారణమని చెప్పవచ్చును. బ్రహ్మ విషయమైన రహస్యములు వేదములో, ఉపనిషత్తులలో, వేదాంతములో చెప్పబడినవి. అటువంటి రహస్యమైన బ్రహ్మను తెలుసుకొనిన వానికి దేవయాన మార్గమును ప్రశ్నోపనిషత్తులో చెప్పిరి. 'అథోత్తరేణ తపసా బ్రహ్మచర్యేణ' (ప్రశ్న 1.10). బ్రహ్మచర్యము మరియు తపస్సు ద్వారా ఉత్తరాయణ మార్గమున పయనించి బ్రహ్మలోకమును చేరును. స్మృతిలో 'అగ్నిర్జ్యోతి రహశ్శుక్లః' (గీత. 8.24) 'తేజోభిమాన దేవత, జ్యోతిరభిమాన దేవత, దినాభిమాన దేవత, శుక్లపక్షాభిమాన దేవత మొదలగు దేవతల ద్వారా ఉత్తరాయణ మార్గములో తీసుకోపోబడినవాడు తిరిగిరాడు' అని చెప్పబడినది. ఆ గతిని ఇచట ఛాందోగ్యోపనిషత్తులో ''ఆదిత్యాత్ చంద్రమసం చంద్రమసో విద్యుతమ్'' (ఛాం. 4.15.5) అని చెప్పిరి. ఆదిత్యలోకము నుండి చంద్రలోకమునకు, అచట నుండి విద్యుత్ లోకమునకు ఆయా లోకాభిమానదేవతలు ఆ జీవుని బ్రహ్మ లోకమునకు గొంపోవుదురు. ఈ విధముగా సగుణోపాసకుని బ్రహ్మలోక ప్రాప్తి చెప్పుట వలన అక్షిస్థ పురుషుడు బ్రహ్మమేనని నిశ్చయమగుచున్నది.

48. అనవస్థితేరసంభావాసచ్చ నేతరః (1.2.17)

సూత్రార్థము : ఉపాసకుని కంటిలో ఛాయా లేక ప్రతిబింబము పడునట్లు చేయు వేరొక పురుషుడు ఉపాసకుని ముందు కూర్చొనుట అసంభవము. అమృతత్వము అభయత్వము మొదలుగా గల గుణములు ఛాయాత్మమందు అసంభవము. అందువల్ల బ్రహ్మభిన్నమైన అక్షిస్థ పురుషుని ఉపదేశించుట లేదు.

ఛాయాత్మగాని, జీవాత్మగాని, దేవాత్మగాని కన్నులలో ఉన్న పురుషుడనిన అట్లనుట సరిగాదు. ఉపాసకుని కన్నులలో ప్రతిబింబము కొరకు ఎల్లప్పుడు బింబభూతమైన వేరొక పురుషుడు ఎదురుగా నుండుట కుదరదు. దీనినే సూత్రస్థ 'అనవస్థానాత్' అను పదముతో చెప్పిరి. అమృతత్వాది గుణములు ఛాయాత్మనందు ఉండుట అసంభవము. దీనినే సూత్రములో 'అసంభవాద్' అని చెప్పిరి. అట్లే జీవాత్మ యందు అమృ తత్వాది గుణములు అసంభవము. దేవాత్మను గూడ స్వీకరించలేము వారు బహిర్ముఖులు - 'పరాగ్రూపత్వాత్'. అంతేగాక దేవతల ఉత్పత్తి లయములు చెప్పబడినవి. దేవతల అమరత్వము చిరకాలము స్వర్గములో ఉందురు గనుక చెప్పిరి. వారి ఐశ్వర్యము పరమేశ్వరాధీనము స్వతంత్రము గాదు, స్వాభావికము గాదు. అందువల్ల అక్షిస్థ పురుషుడు పరమేశ్వరుడనే గ్రహించవలయును.

# 16. అంతర్యామ్యధికరణము

సంగతి : పూర్వ అధికరణములో 'యః పృథివ్యాం తిష్టన్' (బృ . 3.7.2) అను అంతర్యామి బ్రాహ్మణములో నున్న 'యః చక్షుషి తిష్టన్' అను వాక్యమును ఉదాహరణముగా చెప్పి 'స్థానాది వ్యపదేశాచ్చ' అను సూత్రములో అంతర్యమిణి బ్రహ్మమని చెప్పిరి. దానికి ఆక్షేపమును చెప్పి సమాధానము చెప్పుట వలన ఆక్షేపసంగతి.

విషయము : బృహదారణ్యకములోని అంతర్యామి బ్రాహ్మణములో 'యః పృథివ్యాం తిష్ఠన్ పృథివ్యా అంతరో య పృథివీ న వేద యస్య పృథివ్యా శరీరం యః పృథివీమన్తరో యమయత్యేష తే ఆత్మాఽన్తర్యామ్యమృతః" (బృ. 3.7.2) "ఎవ్వడు భూమి యందున్నాడో భూమికి లోపల ఉన్నాడో ఇట్లున్ననూ ఆ భూదేవి ఎవ్వని ఎరుంగలేదో ఎవనికి ఆ భూదేవియో శరీరమో ఎవడు ఆ భూమికి లోపలనుండి నియమించుచున్నాడో వాడే నీ ఆత్మ అతడే అంతర్యామి, అతడే జరామరణ శూన్యుడు" అను ఈ వాక్యమిచట విచరణీయ విషయము.

సంశయము : ఇచట చెప్పిన అంతర్యామి సాంఖ్యుల ప్రధానమా? లేక అణిమాది ఐశ్వర్యములు పొందిన యోగి పురుషుడా?

పూర్వపక్షము : జగత్కారణమగుటచే ప్రధానము నియామకము కాగలదు. లేక కర్మ ప్రధానమగుటచే జీవాత్మ గూడ జగన్నియామకము కాగలదు.

సిద్ధాంతము : జీవునితో ఏకత్వము మరియు అమరణాది అంతర్యామి ధర్మములు చెప్పినందువలన జగన్నియామకము ఈశ్వరునియందే సంభవము. 'ద్రష్టుత్వాది' ' అచేతనము జడమైన ప్రధాన ధర్మము కానేరదు. జీవుడు నియమింపబడువాడు గనుక నియామకుడు కాజాలడు. జీవుడు తన్నుతానే నియమించుకొనలేడు. అందువల్ల ఇచట పరమాత్మయే అంతర్యామి రూపముగా ఉపాస్యుడు.

వైయాసికన్యాయమాలా:

47. ప్రధానం జీవ ఈశో వా కోఽఅంతర్యామి జగత్ప్రతి। కారణత్వాత్ ప్రధానం స్యాజ్జీవో వా కర్మణో ముఖాత్॥

48. జీవైకత్వామృత త్వాదేరన్తర్యామీ పరేశ్వర। ద్రష్టృత్వాదేర్న ప్రధానమ్ న జీవోఽపినియమ్యతః॥

"యః పృథివ్యాం అంతరో యమయతి" ఈ శ్రుతిలో పృథివ్యాదులలో జగత్తు యొక్క అంతర్యామిని చెప్పిరి. అది ప్రధానమా? లేక జీవుడా? లేక పరమేశ్వరుడా? సర్వజగత్తునకు ఉపాదానమగుట వలన ప్రధానము అంతర్యామి.

"ఏష తే ఆత్మా అంతర్యామి అమృ తః" ఈ శ్రుతిలో జీవునికన్న అభిన్నముగా మరియు అమృతత్వాది ధర్మములు పరమేశ్వరుని యందే ఉన్నవి. అంతర్యామిని ద్రష్టా, శ్రోతా అనిరి. అందువల్ల జడ ప్రధానము అంతర్యామి కాజాలదు. జీవుడు నియమింపబడువాడుగాన అంతర్యామి గాజాలడు. అందువల్ల పరమేశ్వరుడే అంతర్యామి.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

బృహదారణ్యకము 5వ అధ్యాయములో యాజ్ఞవల్క్యుడు ఉద్దాలకునికి చెప్పినది. "ఎవడు ఈ భూమిని లోపల నుండి నడిపించుచున్నాడో వాడే నీకు నాకును ఆత్మ. అతడే అంతర్యామి జరా మరణ శూన్యుడు."

భూమ్యాదుల నుండి సంపూర్ణ జగత్తు యొక్క అంతర్యామి యందు మూడు విధముల సంశయము. అంతర్యామి ప్రధానమని పూర్వపక్షి చెప్పుచున్నాడు. ఆ ప్రధానము సంపూర్ణ జగత్తునకు ఉపాదానకారణమై తన కార్యమైన నియామకమునకు సమర్థమైయున్నది. లేక ధర్మాధర్మరూపమైన కర్మానుష్ఠానము వల్ల జీవుడు అంతర్యామి. జీవునకు కర్మ ఫలమునిచ్చుటకు ఫలభోగ సాధనమైన జగత్తును సృ ష్టించెను. కర్మ ద్వారా

జగత్తును సృష్టించుట వలన జీవుడు అంతర్యామి. అనగా సిద్ధాంతి సమాధానము 'ఈ నీ ఆత్మ అంతర్యామి అమృతము' 'ఏష తే ఆత్మ అంతర్యా అమృతః' అంతర్యామిని జీవతాదాత్మ్యముగను అమృతత్వముగను చెప్పిరి. అట్లే భూమి నుండి అంతరిక్షము వరకు అన్ని వస్తువులలో అంతర్యామి ఉపదేశము వల్ల సర్వ వ్యాపిత్వము ప్రతీతమగుచున్నది. ఈ రెండు కారణముల వల్ల అంతర్యామి పరమేశ్వరుడు. ప్రధానమందు అంతర్యామిత్వము సంభవము గాదు. 'అదృష్టో ద్రష్టా అశ్రుతః శ్రోతా' ఆ అంతర్యామి పరులచే చూడబడక సర్వమును చూచువాడు, సర్వమును వినువాడు. ఇచట వినబడు ద్రష్టుత్వ శ్రోతృత్వములు అచేతన ప్రధానమందు అసంభవములు. అంతర్యామి జీవుడు గూడ గానేరడు. 'య ఆత్మానం అంతరో యమయతి' 'ఎవడు జీవుని లోపల నుండి నియమించుచున్నాడో' అన్నచోట జీవుడు నియమింపబడువాడు, అందువల్ల అంతర్యామి పరమేశ్వరుడే.

### 49. అంతర్యామ్యధిదైవాదిషు తద్ధర్మవ్యపదేశాత్ (1.2.18)

సూత్రార్థము : "యః పృథివ్యా" మొదలుగా గల శ్రుతులలో చెప్పిన శాసనకర్త అంతర్యామి పరమాత్మయే. ఎందులకనగా శ్రుతులలో ఆత్మత్వ, అమృతత్వాది పరమాత్మ ధర్మములు చెప్పుట వలన.

అధిదైవాదులలో వినబడు అంతర్యామి పరమాత్మయే వేరొకడు గాడు. ఎందులకనగా ఆ పరమాత్మ ధర్మములు చెప్పుట వలన ఆ పరమాత్మ యొక్క సర్వాంతర్యామిత్వము, అమృతత్వము, ఆత్మత్వము అను అసాధారణ ధర్మములను ఇచట ఉపదేశించుచున్నారు. భూమి అదిగా గల సర్వ వికారముల లోపల స్థితుడై వాటిని శాసించుచున్నాడు. ఇది పరమాత్మ యొక్క శాసన ధర్మము. ఈ నీ ఆత్మ అంతర్యామి ఆమరణ ధర్మము గలది. 'ఏష తే ఆత్మ అంతర్యామి అమృతః' అను వాక్యములో ఆత్మత్వ అమృ తత్వాదులు ముఖ్యముగా పరమాత్మయందే యుక్తి సంగతములు. అందువల్ల పరమాత్మయే అంతర్యామి.

"అదృష్టో అశ్రుతః" అను శ్రుతి ఉపదేశము ద్వారా రూపాది హీనమైన పరమాత్మవలె సాంఖ్యశ్రుతిలో కల్పింప బడిన ప్రధానములో కూడ ఈ ధర్మములుండుట వలన ప్రధానము అంతర్యామి అనిన ఈ సూత్రమును చెప్పుచున్నారు.

### 50. న చ స్మార్తమతద్ధర్మాభిలాపాత్ (1.2.19)

సూత్రార్థము:- ప్రధానము అంతర్యామి కాజాలదు. ఎందులకనగా ప్రధానము కన్న భిన్నమైన చైతన్యములో ఉన్న ద్రష్టుత్వ, శ్రోతృత్వాది ధర్మములు చెప్పుట వలన.

సాంఖ్యస్మృ తిలో కల్పింపబడిన ప్రధానము అంతర్యామి పదమునకు అర్థము గాదు. ప్రధానము కన్న భిన్నమైన పరమాత్మ కొరకు ఈ ధర్మములు అనగా అదృష్టో ద్రష్టా అశ్రుతః శ్రోతా "ఆ అంతర్యామి ఇతరులచే చూడబడడు అందరినీ చూచువాడు. ఇతరులచే వినబడక సర్వమును వినువాడు" అని వాక్య శేషములో చెప్పుట వలన.

### 51. శారీరశ్చోభయేఽపి హి భేదేనైనమధీయతే (1.2.20)

'నకారము పూర్వ సూత్రము నుండి అనువర్తించును.'

సూత్రార్థము : జీవుడు గూడ అంతర్యామి గాడు. బృహదారణ్యకములోని రెండు శాఖలు, కాణ్వశాఖయు మరియు మాధ్యందినశాఖయు గూడ అంతర్యామి ద్వారా  జీవుడు నియమింపబడు వాడగుటచే అంతర్యామి కన్న జీవుని భిన్నముగా చెప్పుచున్నవి. అధిదైవాది శ్రుతులలో చెప్పిన అంతర్యామి పరమాత్మ అని సిద్ధమగుచున్నది.

"యో విజ్ఞానే తిష్టన్" జీవుని లోపల నుండి వానిని నియమించుచు అను కాణ్వశాఖలో "య ఆత్మని తిష్టన్" ఎవడు ఈ ఆత్మలో స్థితమైయుండి దానిని నడిపించునో అని మాధ్యందిన శాఖలో గూడ అంతర్యామి కన్న భిన్నముగా జీవుని చెప్పుచున్నవి. భూమి మొదలగు వానివలె జీవుని ఆధారముగను నియమింపబడు వానిగను చెప్పుచున్నవి. ఒకే దేహములో ఇద్దరు ద్రష్టలు ఉండరని చెప్పరాదు. అసంభవము గాదు. ఇద్దరు ద్రష్టలుండుట సంభవము. అవిద్య వలన సంభవించిన కార్యకారణ రూపమయిన ఉపాధి ద్వారా ద్రష్టలందు భిన్నత్వమును పారమార్థిక దృష్టిలో ద్రష్టల ఏకత్వమును చెప్పిరి. పరమాత్మ ఒక్కడే అయినను ఘటాకాశ మహాకాశము వలె ఉపాదుల ద్వారా భేద వ్యవహారము కలదు. అట్లే “యత్ర ద్వైతమివ భవతి”. ఎచట దైవత్వమును ఆశ్రయించి సర్వ వ్యవహారము ఉండును. “యత్ర  త్వస్వ సర్వమాత్మైవాభూత్ తత్ కేన కం పశ్యేత్” ‘జ్ఞాన స్థితి యందు పురుషునికి సర్వము ఆత్మయే యగును. అప్పుడు ఎవడు ఎవనిని చూచును’. ఈ శ్రుతులలో భేదాభేద వ్యవహారము కనుపించుచున్నది. అందువల్ల అధి దైవాదులలో పరమాత్మనే అంతర్యామిగా చెప్పిరి.

# 17. అదృశ్యత్వాధికరణము.

సంగతిః- పుర్వాధికరణములో ''యఃపృథివ్యాం తిష్ఠన్'' (బృ.ఉ.3-7-2.) అను అంతర్యామిబ్రాహ్మణములో "యః చక్షుషి తిష్ఠన్" అను వాక్యమును ఉదాహరణరూపముగాతీసుకొని స్థానాదివ్యపదేశాచ్చ అను సూత్రములో అంతర్యామిని బ్రహ్మమని చెప్పిరి. ఇప్పుడు దానిపై ఆక్షేపము చేసి సమాధానము చెప్పుటకు ఈ అధికరణము ఆరంభమయినది. నిమిత్తకారణము మాత్రమే. ఇచ్చట చెప్పుచున్నారు.

విషయము:– "యత్తదద్రేశ్యమగ్రాహ్యమగోత్రమవర్ణమచక్షుశ్రోత్రం తదపాణిపాదం నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం తదవ్యయం యద్ భూయోనిం పరిపశ్యంతి దీరాః". (ముం.1.1.6.) జ్ఞానేంద్రియములకు అగోచరంబును, నామరహితంబును, జాతిశూన్యంబును, జ్ఞానేంద్రియ కర్మేంద్రియ రహితంబును, శాశ్వతంబును, సర్వశక్తియు సర్వవ్యాపకంబును, అతిసూక్ష్మంబును సర్వప్రపంచకారణంబును ధీరులు తెలిసికోనుచున్నారు, ఈ వాక్యమిచట విచారణీయ విషయము.

సంశయము:-భూతయోని ప్రధనమా? జీవాత్మయా లేక పరమాత్మయా? - అనిసంశయము.

పూర్వపక్షము: - భూతయోని ఉపాదానకారణమగుటవలన ప్రధానమనవచ్చును. నిమిత్తకారణమగుటవలన జీవాత్మగూడ భూతయోనికాగలడు. ఈరెంటిలోఏదో ఒకటి తీసుకొనవచ్చును.

సిద్ధాంతము: - సర్వజ్ఞత్వాది ధర్మములు చెప్పుటవలన భూతయోనికి పరమాత్మ అర్థముచెప్పుటయే ఉచితము. ''దివ్యోహ్యమూర్త పురుషః''. పురుషుడు దివ్యుడు మరియు ఆకారరహితుడు. ఇట్లు దివ్యత్వాదిగుణములు చెప్పుటవలన జీవుడు భూతయోనికాదు. ''అక్షరాత్ పరతః పురుషః''. అక్షరమనగా అవ్యాకృతమనుపేరుగల సర్వవికారములకు ఆశ్రయమైన పరమేశ్వరుని అవలంబించి వానికే ఆవరణమైయున్న భూతసూక్షమే. ఏట్లనగా ఉత్పత్తికిముందు బీజమునందు అంకురమువలే పరమేశ్వరునియందున్న పంచభూతములే అక్షరములనబడును. ఇవి వినాశము లేనివి. ఈఅక్షరమునకన్న పరమైనవాడే పరమేశ్వరుడు అని చెప్పగా ప్రధానముకన్న భిన్నము భూతయోని అని స్పష్టమగుచున్నది. కనుక ప్రధానము గూడ భూతయోని గాదు. అందువలన పరమాత్మనే అంతర్యామిరూపములో ఉపాస్యమని చెప్పబడినది.

వైయాసికన్యాయమాలా –

49. భూతయోనిః ప్రధానం వా జీవో వా యది వేశ్వరః| ఆద్యౌ పక్షావుపాదాననిమిత్తత్వాభిధానతః||

50. ఈశ్వరో భూతయోనిః స్యాత్సర్వజ్ఞత్వాది కీర్తనాత్| దివ్యాద్యుక్తైర్న జీవః స్యాన్న ప్రధానం భిదోక్తితః॥

"తదవ్యయం యద్ భూతయోనిం పరిపశ్యంన్తి ధీరాః" ఈ శ్రుతిలో చెప్పిన భూతయోని ప్రధానమా? జీవుడా? లేక ఈశ్వరుడా? యోని శబ్దమునకు అర్థము ఉపాదానకారణము, మరియు నిమిత్తకారణము. అందువల్ల జగత్రూపములో పరిణామము చెందు ప్రధానము జగత్తునకు ఉపాదానకారణము అగుటవల్ల భూతయోని లేక ధర్మాధర్మముల ద్వారా జగాత్తు ఉత్పత్తిచేయు జీవుడు ఉపాదానకారణము. ఈపూర్వపక్షమునకు సమాధానము. "య సర్వజ్ఞః సర్వవిత్" అను శ్రుతిలో సర్వజ్ఞత్వము సర్వవేత్తృత్వము మొదలుగాగల బ్రహ్మ చిహ్నములు చెప్పబడినవి. అందువల్ల పరమేశ్వరుడే భూతయోని. భూతయోని దివ్యము సర్వవ్యాపకము మరియు జన్మరహితమని చెప్పబడనది. అందువల్ల పరిఛ్చిన్నము మరియు జన్మాదులుగల జీవుడు భూతయోని కానేరడు. "అక్షరాత్పరతః పరః" అనుశ్రుతిలో అక్షరశబ్దవాచ్యమైన ప్రధానముకన్న భిన్నము భూతయోని అనిరి. అందువల్ల ప్రధానము భూతయోని కాదు.బ్రహ్మము సంపూర్ణ జగత్తునకు ఉపాదానకాణము మరియు నిమిత్తకారణము. అందువల్ల ఈశ్వరుడే భూతయోని అనునది సిద్ధమగుచున్నది.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ముండకోపనిషత్తులో చెప్పిరి ''తదవ్యయం యద్ భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః''

ఆ అవ్యయమును సర్వప్రపంచకారణమును అగు ఏ అక్షరంబును వివేకవంతులు చూచుచున్నారో అనిరి. అచట మూడురకముల సంశయము కలుగును. ప్రధానమా జీవుడా అను పక్షద్వయము ప్రాప్తము. యోని శబ్దము ఉపాదాన నిమిత్త కారణవాచకము. ప్రధానము విశ్వరూపముగా పరిణమించుటవలన ఈవిశ్వమునకు ఉపాదానకారణముమాత్రమే. జీవుడు ధర్మాధర్మములద్వారా నిమిత్త కారణము మాత్రమే అను పూర్వపక్షమునకు ఇక్కడ సిద్ధాన్త సమాధానము చెప్పుచున్నారు. ''యః సర్వజ్ఞః సర్వవిత్ యస్య జ్ఞానమయం తపః'' (ముం.1-1-6.) ఆ బ్రహ్మము సర్వజ్ఞము మరియు సర్వవిత్. సామాన్య రూపముగా అన్నియు తెలిసినవాడు కనుక సర్వజ్ఞత్వము కలవాడందురు. విశేషముగా అన్నియు తెలిసినవాడుకనుక సర్వవిత్ అందురు. అంతేగాక విచారరూపమయిన తపస్సు కలవాడు. ఈ విధమయిన బ్రహ్మచిహ్నములు చెప్పబడినందువలన భూతయోని పరమేశ్వరుడే. కాని జీవుడు భూతములకు కారణముగాజాలడు. 'దివ్యోహ్యమూర్తః పురుషః సబాహ్యాభ్యంతరో హ్యజః'' (ముం.2-1-2.) ఆ జగాత్కారణపురుషుడు సర్వప్రకాశస్వరూపుడు, నిరాకారుడు, అంతేగాక లోపల బయట వ్యాపించి ఉన్నవాడు జన్మలేనివాడు. ఈ విధముగా లోపల బయట వ్యాపించి ఉండుట మరియు జన్మరాహిత్యము వినబడుటవలన పరిఛ్చిన్నమైన జన్మాదులుగల జీవుడు భూతయోని కాజాలడు. ప్రధానము భూతయోని అని చెప్పుట యుక్తియుక్తము కాదు. "అక్షరాత్ పరతః పరః" (ముం.2-1-2. ) అని అక్షరశబ్దవాచ్యమైన ప్రధానముకన్నభిన్నముగా భూతయోనిని చెప్పిరి. అందువల్ల భూతయోని ఈశ్వరుడే.

52. అదృశ్యత్వాదిగుణకో ధర్మోక్తేః. (1.2.21)

సూత్రార్థము- ''యత్తదద్రేశ్యమ్'' (ముం.1.1.6.) అను శ్రుతిలో అదృశ్యత్వాది గుణములు కలవాడు పరమాత్మయే. భూతములకు కారణము ప్రధానము లేక జీవుడు కాదు. ఎందులకనగా "యః సర్వజ్ఞః సర్వవిత్" (ముం.1.1.9) సకల పదార్థముల సామాన్య జ్ఞానము మరియు విశేష జ్ఞానము గలవాడు అనుశ్రుతిలో భూతయోని సర్వజ్ఞత్వాదులు గల పరమేశ్వరుని గుణములు నిర్దేశింపబడినవి. ప్రధానములోగాని జీవునిలోగాని ఆగుణములు లేవు.

ఇచట పూర్వపక్షములో ప్రధానము లేక జీవుని ధ్యానము. సిద్ధాంతములో నిర్విశేషబ్రహ్మజ్ఞానము అని ఫలభేధము. "యత్తదద్రేశ్యమ్"అనుశ్రుతిలో అదృశ్యత్వాదిగుణములుగల పరామాత్మయే భూతయోని వేరొకరు కాదు. ఎందులకనగా ఆ పరమాత్మ ధర్మములే చెప్పబడుటవలన "యః సర్వజ్ఞః సర్వవిత్" (ముం.1.1.9.) ఎవడు సకల పదార్థముల జ్ఞానసంపన్నుడో సామాన్యముగా వానిని సర్వజ్ఞుడందురు. అదేజ్ఞానము విశేషముగా నున్న సర్వవిత్ అందురు.

పరమాత్మ అన్నింటి యొక్క సామాన్య విశేష జ్ఞానములు కలవాడు. అందువల్ల వానిని సర్వజ్ఞః సర్వవిత్ అనిరిః అచేతనమైన ప్రధానమందు గాని పరిచ్ఛిన్నమైన జీవుని యందు గాని సర్వజ్ఞత్వము సర్వవిదత్వములు సంభవము కాదు. జడప్రధానమునందు, అంతఃకరణమను పరిచ్ఛిన్న ఉపాధిగల జీవుని యందు సర్వజ్ఞత్వాది గుణముల సంభవమే లేనప్పుడు భూతకారణము వానియందు ఎట్లుసంభవము. "యథోర్ణనాభిః సృజతే గృహ్ణాతే చ యథా పృథివ్యామోషదయః సంభవన్తి, యథా సతః పరుషాత్ కేశలోమాని తథాక్షరాత్సంభవతీహ విశ్వమ్" (ముం.1.1.7) సాలె పురుగు తనదేహమునుండి తానే దారమును సృజించి మరల తనయందే ఇముడ్చుకొనునట్లు భూమినుండి ఒషధివనస్పతులు పుట్టినట్లు, జీవించి యున్న పురుషుని నుండి తలమీద కేశములు, దేహముపై రోమములు పుట్టునట్లు, ఆ అక్షరతత్వము నుండి సంపూర్ణ విశ్వము ఉత్పన్నమగు చున్నది. సాలెపురుగు దృష్టాంతము చూచిన ద్రాష్టాంతము జడమని తోచుచున్నది. ఎందులకనగా సాలెపురుగు జడదేహమునుండి దారము ఉత్పన్నమగుచున్నదని చెప్పుట సరికాదు. దృష్టాంత ద్రాష్టాంతములయందు అత్యంతసామ్యముండవలయునను నియమములేదు. సామ్యమున్న దృష్టాంత ద్రాష్టాంతిక భావమే ఉండదు. చంద్రముఖీ అన్నప్పుడు చంద్రబింబములో కన్నులు ముక్కు కనబడుటలేదు కదా! దృష్టాంతము నందలి అనుకూలవిషయములందే సమత్వము చెప్పుట లోకప్రసిద్ధము. అందువల్ల దృష్యత్వాది గుణములుగల పరమేశ్వరుడే భూతములకు కారణము.

### 53.విశేషణభేదవ్యపదేశాభ్యామ్ చ నేతరౌ. (1.2.22)

సూత్రార్థము:- "దివ్యోహ్యమూర్తః" అనుశ్రుతిలో దివ్యత్వము అపరిచ్ఛిన్నత్వము, సర్వవ్యాపకత్వము, మొదలగు విశేషగుణములు భూతయోనికి చెప్పినారు. జీవునియందు ఈగుణములు లేనందువల్ల జీవుడు భూతయోని కాడు. "అక్షరాత్ పరతః పరః" అను శ్రుతిలో అక్షరతత్వమునకు పరమాత్మకు భేదము చెప్పుట వలన ప్రధానము భూతయోని కాదు. పరమాత్మయే భూతములకు కారణము.

విశేషము గుణములు మరియు భేధము చెప్పుటవలన పరమేశ్వరుడే భూతయోని కాని జీవ ప్రధానములు కావు. ''దివ్యో హ్యమూర్తః పురుషః.''(ముం.2-1-2.) పరుషుడుదివ్యస్వరూపుడు మరియు ఆకారరహితుడు. ఇచట జీవునికన్న విలక్షణముగా భూతయోని చెప్పిరి. "అక్షరాత్ పరతః" (ముం.2.1.2.) అను శ్రుతిలో భూతయోనిని ప్రధానముకన్న భిన్నముగా చెప్పిరి. జీవుని కన్న విలక్షణమైన అవ్యాకృతమను నామరూపముల బీజావస్థరూపమైన అక్షరముకన్నపరమైనవాడు పరమాత్మ. అందువల్ల భూతయోని పరమాత్మయే.

### 54. రూపోపన్యాసాచ్చ (1.2.23)

సూత్రార్థము:- "అగ్నిర్మూర్ధా చక్షుషీ చంద్రసూర్యౌ" ద్యులోకము శిరస్సు చంద్రసూర్యులు కన్నులు.(ముం.2.1.4) అను శ్రుతిలో భూతయోని యొక్క సర్వాత్మత్వమును చెప్పుట వలన గూడ భూతయోని పరమాత్మయే.

''ఏతస్మాజ్జాయతే ప్రాణః మనః సర్వేంద్రియాణి చ ఖం వాయుర్జ్యోతిరాపః పృథివీ''(ముం.2.1.3.) ఈశ్రుతిద్వారా ప్రాణము,మనస్సు, అన్ని ఇంద్రియములు, ఆకాశము, వాయువు,అగ్ని, జలము, భూమి ఉత్పన్నమైనవి. ప్రాణాదులనుండి పృథివి వరకు సృష్టిని చెప్పి ''అగ్నిర్మూర్ధా చక్షుషీ చన్ద్రసూర్యౌ'' ద్యులోకము శిరస్సు, చంద్రసూర్యులు కన్నులు అను శ్రుతిలో సర్వవికారాత్మకమైన భూతయోని యొక్క రూపోపన్యాసము కావించుట వలన పరమాత్మయే భూతయోని అని వృత్తికార మతము. కాని భగవత్పాద మతములో ఇది భూతయోని యొక్క రూపోపన్యాసము కాదు, ఏలనన ముందుగూడ వికారమాత్ర ఉత్పత్తి చెప్పుట వలన. అతః "పురుష ఏవేదం విశ్వం కర్మ" ఈ సంపూర్ణ సంసారము పురుషరూపమే పరుషునికన్న భిన్నమైన విశ్వములేదు అని ముండక శ్రుతిలో చెప్పుటవలన సర్వాత్మకరూపోపన్యాసమువల్ల పరమాత్మయే భూతయోని. ఇచట శ్రుతిలో రూపోపన్యాసమును ఒప్పుకొనక సర్వరూపము వర్ణించుట వలన పరమాత్మయందే భూతయోనిత్వము చెప్పిరి.

## 18. వైశ్వానరాధికరణము.

సంగతి:— పూర్వాధికరణములో ప్రారంభములో అదృశ్యత్వాది సాధారణధర్మములను వాక్యశేషములోగల సర్వజ్ఞత్వాది హేతువుల ఆధారముపై బ్రహ్మపరకముగా చెప్పినారు. అట్లే ఇచట ఉపక్రమములోనున్న వైశ్వానర శబ్దమునకు వాక్యశేషములోగల హోమాధికరణ హేతువు ఆధారముగా జాఠరాగ్ని పరకముగా చెప్పవలయును. ఈ విధముగా దృష్టాంతసంగతి కారణమువల్ల వైశ్వనరాధికరణము రచించిరి.

విషయము:— వైశ్వానరతత్వము ఈఅధికరణములో విచారణీయ విషయము.

సంశయము:— ఛాందోగ్యఉపనిషత్తులో గల వైశ్వానరవిద్యయందు చెప్పిన "ద్యుమూర్ధాది" అనగా స్వర్గము ఆవైశ్వానరునికి శిరస్సు అని వైశ్వానరుని తత్వము చెప్పబడినది.అది జాఠరాగ్నియా,భూతాగ్నియా, ఆదిత్యాది దేవతయా, జీవాత్మయా లేక పరమాత్మయా అని సంశయము.

పూర్వపక్షము:— వైశ్వానరడు మరియు ఆత్మ శబ్దముల ప్రయోగము వల్ల ఈశ్వరునికన్న భిన్నమైన పదార్థము గ్రహించ వచ్చును.

సిద్ధాంతము:— "మూర్ధత్వాది" శ్రుతిని చూచుచు మరియు బ్రహ్మశబ్ద ప్రయోగమువల్లను పరమేశ్వరుడే వైశ్వానర శబ్దమునకు అర్థము అని చెప్పుటయే ఉచితము. ఈశ్వరునికి శాస్త్రములో వైశ్వానరుడనియు ఆత్మ అనియు శబ్దముల ప్రయోగము బహుధా కనిపించుచున్నది

వైయాసికన్యాయమాల

51. వైశ్వానరః కౌక్షభూతదేవజీవేశ్వరేషు కః| వైస్వానరాత్మశబ్దాభ్యామీశ్వరాన్యేషు కశ్చన.||

52. ద్యుమూర్ధత్వాదితో బ్రహ్మశబ్దాచ్చేశ్వర ఇష్యతే| వైశ్వానరాత్మశబ్దౌ తావీశ్వరస్యాపి వాచకౌ||

"ఆత్మానం వైశ్వానరముపాస్తే" అను శ్రుతిలో చెప్పిన వైశ్వానరుడూ జఠరాగ్నియా, భూతాగ్నియా, దేవతయా, జీవుడా లేక పరమేశ్వరుడా? వైశ్వానర శబ్దము జాఠారాగ్నిలో,భూతాగ్నలో, మరియు దేవతయందు రూఢము, మరియు ఆత్మ శబ్దము జీవవాచకము. అందువల్ల ఈశ్వరునికన్నభిన్నమైన చెప్పిన నాలుగులో ఏదో ఒకటి వైశ్వానర శబ్దమని చెప్పవచ్చును. అను పూర్వపక్షమునకు సిద్ధాంతి సమాధానము. "ద్యులోకము వాని శిరస్సు" అనురీతిగా వైశ్వానరుని అవయవముల వర్ణన ఉన్నది. మరియు "కో న ఆత్మా కిం బ్రహ్మ" "మాఆత్మ ఏది బ్రహ్మ మేది" ఈప్రకారము ఉపక్రమమైనది. అందువల్ల వైశ్వానరము బ్రహ్మమే. వైశ్వానరశబ్దము యోగవృత్తి ద్వారా బ్రహ్మమందే సమన్వయమగుచున్నది. ఆత్మశబ్దము ముఖ్యవృత్తిద్వారా బ్రహ్మవాచకము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఛాందోగ్యపనిషత్తులోని పంచమ అధ్యాయములో వైశ్వానరవిద్యలో "ఆత్మానం వైశ్వానరముపస్తే" అనిరి.అనగా విశ్వాత్మవైశ్వానరుని ఉపాసన చేయుచున్నము. (ఛాం.5-18-1). ఈ వైశ్వానరుడు జఠరాగ్నియా, భూతాగ్నియా, ఆదిత్యదేవతయా, జీవాత్మయా లేక పరమాత్మయా అని సంశయము. అచట వైశ్వానరశబ్దమువల్ల మొదటి మూడు పక్షములు ప్రాప్తము అనగా జాఠరాగ్ని, భూతాగ్ని, ఆదిత్యదేవతలని పూర్వపక్షము. "అయమగ్నిర్వైశ్వానరో యోఽయమన్తః పురుషే యేనేదమన్నం పచ్యతే" తినబడిన దానిని జీర్ణింపచేసే ఏ వైశ్వానరాగ్ని లోపలఉన్నదో, (బృ.ఉ.5-9-1) అను శ్రుతిలో వైశ్వానరాగ్ని శబ్దము జాఠరాగ్ని యందు ప్రయోగించిరి. "విశ్వస్మా అగ్ని భువనాయ దేవా

వైశ్వానరమ్"  దేవతలు సమస్త లోకాలకు పగటికి చిహ్నముగా వైశ్వానరాగ్నిని సూర్యరూపములో చేసారు. (ఋ.సం10-88-12). అనుచోట వైశ్వానర శబ్దము బయటనున్న భూతాగ్నియందు ప్రయోగించిరి " వైశ్వానరస్య సుమతౌ స్యామ్" వైశ్వానరుని మంచిమనస్సులో ఉందుముగాక.( ఋ.సం.1-98-1). అన్నచోట వైశ్వానర శబ్దము దేవతయందు ప్రయోగించిరి. అందువల్ల పక్షత్రయము ప్రాప్తము. ఆత్మశబ్దము జీవునియందు రూఢియగుట వలన జీవుని వైశ్వానరుడనవచ్చును. ఈశ్వరుడనుట యుక్తము కాదు వాని చిహ్నములు లేనందువలన అను పూర్వపక్షమునకు సమాధానము ఇచ్చుచున్నారు.

వైశ్వానరశబ్దమునకు బ్రహ్మమని అర్థము చెప్పుటయే ఉచితము. ద్యుమూర్ధవాయ్వాకాశవారిపృథివీనాం శ్రవణాత్. "తస్య హ వా ఏతస్య ఆత్మనో వైశ్వానరస్య మూర్ధైవ సుతేజాః"(ఛాం.ఉ.5-18-2.) ఆవైశ్వానర ఆత్మకు స్వర్గము శిరస్సు. ఈశ్రుతిలో స్వర్గాదులతో కూడిన సంపూర్ణ జగత్తు వైశ్వానరుని అవయవములుగా వినబడుచున్నది. ఇది ఈశ్వరుని కన్న భిన్నమైనవారిలో సంభవము కాదు. మరియు "కో న ఆత్మా, కిం బ్రహ్మ" (ఛా.ఉ. 5-11-1) మా ఆత్మ ఏది? బ్రహ్మ మెవరు? అను ప్రశ్నలో బ్ర హ్మ శబ్దము ఈశ్వరునియందు ముఖ్యముగా ప్రయోగించిరి, వైశ్వానరశబ్దము యోగరీత్యా బ్రహ్మమందు గలదు. "విశ్వశ్చాసౌ నరశ్చ విశ్వానరః" ఏవరు విశ్వరూపులో మరియు నరులో వారే విశ్వానరులు లేక సంపూర్ణ జగత్తుస్వరూప మెవరో వారినే వైశ్వానరుడందురు.అది పరమాత్మకే చెల్లును. వైశ్వానరుడు అనగా సర్వాత్మపురుషుడని అర్థము విశ్వానరుడే వైశ్వానరుడు. ఆత్మ శబ్దము జీవ బ్రహ్మలలో ఉపయోగింతురు. అందువల్ల వైశ్వానరుడు పరమేశ్వరుడే.

### 55. వైశ్వానరః సాధారణశబ్దవిశేషాత్  (1.2.24)

సూత్రార్థము:-  " యస్త్వేతమేవం ప్రాదేశమాత్రమభివిమానమాత్మానం  వైశ్వానరముపాస్తే" ఛాం (5.18.2) ద్యులోకాదులచే గల్పింపబడిన పరిమితి గలిగినట్టియూ, ప్రత్యగాత్మరూపముతో నెఱుంగబడునట్టియు స్వస్వరూప భూతుడైనట్టియు ఆవైశ్వానరునెవ్వడుపాసించునో వానికి అన్నిభోగములు లభించును.

ఈ వైశ్వానరశబ్దము జాఠరాగ్ని, భూతాగ్ని, ఆదిత్యాది దేవతలయందు సాధరణరూపముగను మరియు జీవాత్మ పరమాత్మలయందు ఈ  శబ్దము సాధరణముగను ఉపయోగింతురు. అట్లు సాధరణముగా ప్రయోగించిన వైశ్వానర ఆత్మ శబ్దములను పరమాత్మయందు విశేషముగా ప్రయోగించుట కనబడుచున్నది. "తస్య హ వా ఏతస్యాత్మనో వైశ్వానరస్య మూర్ధైవ సుతేజా శ్చక్షు ర్విశ్వరూపః ప్రాణః పృథగ్వర్త్మా త్మా సందేహో బహులో బస్తిరేవ రయిః పృథివ్యేవ పాదౌ" "ఆత్మరూపుడగు ఆ వైశ్వానరునకు ద్యులోకము శిరస్సు, సూర్యుడు కన్నులు, వాయుదేవత ప్రాణము, శిరస్సునుండి నడుము వరకు గల దేహమే ఆకాశము,  జలము నాభ్యధోభాగము, భూమిపాదములు" (ఛాం.5.18.2)  ఈ శ్రుతి ముందుచెప్పిన  ద్యులోకము శిరస్సు అను విశేషణములు సర్వవ్యాపకమైన పరమాత్మ అర్థమును భోధించు చున్నది. ఉపక్రమములో  "కోన ఆత్మా కిం బ్రహ్మ" (ఛాం.5.11.1 ) "మా ఆత్మ ఏది, బ్రహ్మ మేది" ఈ శ్రుతి ద్వారా ఆత్మ బ్రహ్మ

శబ్దముల ప్రయోగము పరమేశ్వరుడే వైశ్వానరుడని చెప్పుటకు  చిహ్నము లేక హేతువు. అందువల్ల వైశ్వానరుడు పరమాత్మయే.

56. స్మర్యమాణమనుమానం స్యాదితి. (1.2. 25.)

సూత్రార్థము:- “యస్యాగ్నిరాస్యం” “ఎవనికి అగ్ని ముఖమో ద్యులోకము శిరస్సో” అనుస్మృతి ద్వారా ప్రతిపాదించిన త్రిలోకీ ఆత్మకు మూలభూతమైన శ్రుతిని అనుమానము ద్వారా చెప్పుచూ పరమాత్మను నిర్ణయించు చున్నది. వైస్మృతులకు మూలభూతమగు శ్రుతులు ప్రమాణములు అని అనుమానము ద్వారా నిశ్చయమగుచున్నది.

ఇందువల్ల గూడ పరమాత్మయే వైశ్వానరుడు. మహాభారతము శాంతిపర్వముల 47-68 లో “యస్యాగ్నిరాస్యం ద్యౌర్మూర్ధా ఖంనాభిశ్చరణౌ క్షితిః। సూర్యశ్చక్షుర్దిశః శ్రోత్రం తస్మై లోకాత్మనే నమః॥” ఎవనికి అగ్ని ముఖమో, ద్యులోకము శిరమో, ఆకాశము నాభి, పృథివి పాదములో, సూర్యుడు నేత్రమో, దిశలు శ్రోత్రములో అటువంటి సంపూర్ణ త్రైలోక్యరూపమునువర్ణించు స్మృతి వైశ్వానరశబ్దమునకు పరమేశ్వరుడని అర్థము చెప్పుచూ శ్రుతిని కల్పించుచున్నది మరియు వైశ్వానర శబ్దమునకు పరమాత్మ అని అర్థము జ్ఞాపకము గావించు చున్నది. సూత్రములో నున్న ఇతి శబ్దము హేత్వర్థకము.

ఇంకొక ప్రకారము ఆక్షేపము గావించిన దానికి సమాధానము చెప్పుచూ సిద్ధాన్తము ప్రతిపాదించు చున్నారు.

57. శబ్దాదిభ్యోఽన్తఃప్రతిష్ఠానాచ్చ నేతి చేన్న, తథా దృష్ట్యుపదేశాదసంభవాత్ పురుషమపి చైనమధీయతే. (1.2.26.)

సూత్రార్థము:- జఠరాగ్న్యాద్యగ్నులలో వైశ్వానర శబ్దము రూఢము. ఆ అగ్నికి “హృదయమ్ గార్హపత్యః” అని మూడు ప్రకారముల అగ్నులు కల్పన చేయబడినవి. “తద్యద్భక్తం ప్రథమమాగచ్ఛేత్తద్ధోమీయం”(ఛాం.5.10.1.) ఈ శ్రుతి ద్వారా ప్రాణాహుతి ఆ అగ్నులను ప్రాణాహుతికి ఆధారమని చెప్పిరి మరియు శరీరములోపల ఉన్నదనిరి. ఈ కారణమువల్ల వైశ్వానరుడు  కానేరడుఅనిన అట్లనుటసరికాదు. ఎందులకనగా జఠరాగ్నియందు పరమాత్మా దృష్టి ఉపదేశముగనుక. జఠరాగ్నికి స్వర్గము శిరస్సు, సూర్యడు నేత్రము కానేరదు. వాజసనేయశాఖవారు వైశ్వానరుని పురుషుడు అనుచున్నారు. జఠరాగ్ని పురుషుడు గాదు.అందువల్ల పరమాత్మయే వైశ్వానరుడు.

వైశ్వానరశబ్దము పరమాత్మ కానేరదు.అది జఠరాదులందు రూఢి కనుక. అంతేగాక‘‘ హృదయమ్ గార్హపత్యః’’( ఛాం. ఉ.5-18-2) అని అగ్నిని మూడువిధములుగా కల్పించుటవలనను మరియు‘‘తద్యద్భక్తం ప్రథమమాగచ్ఛేత్తద్ధోమీయం’’(ఛాం.ఉ.5-10-1) భుజించుటకు ముందు వచ్చిన అన్నాదుల ద్వారా ప్రాణాగ్నులకు హోమము చేయవలయును. ఈపైన చెప్పిన శ్రుతి (ఛాం5.10.1) కారణముల వల్ల ప్రాణాహుతి అధికరణమని గ్రహించవలయును. ఈ హేతువుల ద్వారా వైశ్వానరుని జాఠరాగ్ని అనవచ్చును. మరియు “అన్తః ప్రతిష్ఠానాత్ పురుషేఽన్తః ప్రతిష్ఠితం వేద’’´ ఈ వైశ్వానరుడు పురుషుని అనగా జీవుని లోపల ప్రతిష్ఠితమై యున్నాడు అని

వినబడుటవలన వైశ్వానరుని జాఠరాగ్ని అనవలయును.పరమేశ్వరుడు కాదు అనిన. అట్లు అనుట సరికాదు. ''మనో బ్రహ్మేత్యుపాసీత'' మనస్సు బ్రహ్మమని ఉ పాసనచేయుము( ఛాం. ఉ. 3-18-1) '' మనోమయః ప్రాణశరీరో భారూపః'' (ఛాం.ఉ. 3-14-2) " ఆ బ్రహ్మము మనోమయము, ప్రాణశరీరము మరియు ప్రకాశస్వరూపము" మనోమయమనగా మనఃప్రాయము, ప్రాణశరీరమనగా సూక్ష్మశరీరము, భారూపమనగా చైతన్య లక్షణరూపము. ఇత్యాది శ్రుతుల ద్వారా జఠరాగ్నిని పరమేశ్వరుని దృష్టితో ఉపాసన చేయుటకు ఉపదేసించిరి. జఠరాగ్నిలోనే వైశ్వానర శబ్దము ముఖ్యముగా ప్రయోగించిరని చెప్పుటకు వీలులేదు. ఏలనన ద్యులోకము శిరస్సు, పృథివీ పాదములు అను విశేష ప్రయోగము అసంభవమగుటవలన. ఇంతేగాక పూర్ణపురుషుని వైశ్వానరునిగా వాజసనేయశాఖవారు అధ్యయనము గావించుచున్నారు. ''స ఏషోఽగ్నిర్వైశ్వానరో యత్పురుషః సః యో హైతమేవమగ్నిం వైశ్వానరం పురుషం పురుషేఽన్తః ప్రతిష్ఠితం వేద''(శ.బ్రా.10-6-1-11) ఈ వైశ్వానర అగ్నియే పురుషుడు, ఏ పురుషుడు ఆ వైశశ్వానరుని తన అన్తఃకరణములో ప్రతిష్టితుడై యున్నాడని తెలిసికొనునో, అను వాక్యములో వైశ్వానరుని పురుష శబ్దముతో చెప్పిరి. ఆ పరమేశ్వరుడు సర్వవ్యాపకుడగుట వలన పరుషత్వము మరియు పురుషుని లోపల ఉండుటయు అను ధర్మములు యుక్తియుక్తములు. అందువల్ల వైశ్వానరుడు పరమాత్మయే.

### 58. అత ఏవ న దేవతా భూతం చ. (1-2-27.)

సూత్రార్థము:-భూతాగ్నికాని అగ్ని అభిమానదేవత కాని వైశ్వానరశబ్దవాచ్యము కాదు. ద్యులోకము శిరస్సు అనునవి వీనిలోగూడ అసంభవము. జాఠరాగ్ని ఉపాధిలో నున్న పరమాత్మయే వైశ్వానరుడు.

పైచెప్పిన కారణములవలననే భూతాగ్ని కాని అభిమానదేవతకాని వైశ్వానరుడు కానేరడు. భూతాగ్నిలో ఉష్ణత్వము మరియు ప్రకాశత్వమను గుణములు మాత్రమే గలవు గాని దానియందు స్వర్గము శిరస్సు అను కల్పన కుదరదు. ద్యులోకము, భూతాగ్నివికారూపమయిన కార్యములు. ఒకకార్యము నుండి వేరొకకార్యముత్పన్నము గానేరదు. స్వర్గము శిరస్సు అని చెప్పుటవలన వైశ్వానరుడు జాఠరాగ్ని కాకపోయినను దేవత అనవచ్చును కదా అన్న దానికి పై సూత్రము చెప్పినారు. దేవతయందుగల ఐశ్వర్యమువల్ల గూడ ద్యుమూర్ధత్వాదుల సంభవము కాదు. దేవతలు స్వర్గాదులకు కారణము కాజాలరు. అంతేగాక దేవత ఐశ్వర్యము పరమేశ్వరాధీనము. అందువల్ల నిరంకుశ ఐశ్వర్యముగల సర్వాత్మమైన పరమేశ్వరుడే వైశ్వానరుడు.

జాఠరాగ్ని ఉపాధిగాగల పరమాత్మ ఉపాస్య మనియు శరీరములోపల ప్రతిష్టితుడైయున్నాడని వైశ్వానరుడు పరమాత్మయని ఇంతవరకు నిర్ణయించిరి. ఇప్పుడు ప్రతీకము లేక ఉపాధి కల్పన లేకుండగనే సాక్షాత్తుగా పరమాత్మ ఉపాసనచెప్పుటవలన విరోధము లేదని జైమిని ఆచార్యులు చెప్పుచున్నారు.

### 59. సాక్షాదప్యవిరోధం జైమినిః (1.2.28.)

సూత్రార్థము:- జైమిని మహర్షి చెప్పునదేమనగా బ్రహ్మమునందు జఠరాగ్ని ఉపాధి లేకయే వైశ్వానరశబ్దమునకు బ్రహ్మవాచకమని చెప్పుటలో విరోధము లేదు. పూర్వాపరములను ఆలోచించుటవలన వైశ్యానరశబ్దము బ్రహ్మవాచి అనునది సునిశ్చయము.

వైశ్వానరశబ్దమునకు రెండు రకములుగా అర్థము చెప్పవచ్చును "విశ్వశ్చాసౌ నరశ్చ" ఎవడు విశ్వరూపముగా నుండి నరుడో లేక "విశ్వేషాం వాఽయం నరః" విశ్వమునకు నరుడో, "విశ్వో వా నర అస్యేతి" సంపూర్ణ విశ్వము ఎవనికి నరుడో ఆతడు సర్వాత్మరూపుడగుటచే పరమాత్మయే వైశ్వానరుడు. విశ్వానర శబ్దమునకు స్వార్థములో రాక్షసవాయసాదులవలే తద్ధిత ప్రత్యయమగుటచే వైశ్వానరుడగును. పూర్వపదమునకు "నరే సంజ్ఞాయామ్" అను సూత్రముద్వారా దీర్ఘమయినది. ఈవిధముగా యౌగికార్థము చూసినను బ్రహ్మపరముగా తెలిసికొనవలయును. "అగ్రే నయతి" ముందుండి నడిపించువాడు. అందరికి నేత అగ్ని సర్వాత్మ అగుటవలన గార్హపత్యాగ్ని కల్పన, ప్రాణాహుతి, అధికరణము పరమేశ్వరునియందు యుక్తమే. ఇంతకుముందు జాఠరాగ్నిలో పరమాత్మ ఉపాసన చెప్పిరి. ఇప్పుడు ప్రతీక ఉపాధి లేకయే సాక్షాత్తుగా పారమాత్మ ఉపాసన చెప్పినను విరోధము లేదని జైమిని ఆచార్యులు చెప్పు చున్నారు. ఈ సూత్రములో.పూర్వాపర ఆలోచనద్వారా వైశ్వానర శబ్దమునకు పరమాత్మ అని నిశ్చయముగా చెప్ప వచ్చును. పరమాత్మకు చెప్పిన సీమిత ప్రదేశత్వ శ్రుతిని వ్యాఖ్యానము చేయుచున్నారు.

### 60. అభివ్యక్తేరిత్యాశ్మరథ్యః (1.2.29.)

సూత్రార్థము:-జ్ఞానుల హృదయములో అనుభవమునకు వచ్చుట వలన ప్రాదేశమాత్ర శ్రుతి యుక్తి సంగతము. లేనిచో ఉపాసకులను అనుగ్రహించుటకు హృదయాది పరిమాణము పరమేశ్వరునికి చెప్పిరి. ఆ హృదయమునందు పరమేశ్వరుడు ప్రకటమగునని ఆశ్మరథ్యాచార్యులు చెప్పుచున్నారు.

హృదయాములో అభివ్యక్తమగుటవలన సర్వగత పరమాత్మను సీమిత ప్రదేశములో చెప్పుట యుక్తమే. ఏలనన హృదయములో "అభివ్యక్తేః" అభివ్యక్తి లేక ప్రకటమగుటవలన. హృదయదేశములో అనుభవమునకు వచ్చుటచే ఆశ్మరథ్యాచార్యులు ఈవిధముగా అనిరి. ఉపాసకుల సౌకర్యమునకు అట్లు చెప్పిరి, మరియు ఉపాసకులను అనుగ్రహించుటకై వారి హృదయదేశములో ప్రకటమగును.

### 61. అనుస్మృతేర్బాదరిః (1.2.30.)

సూత్రర్థము:- బాదరి ఆచార్యల మతమేమనగా ప్రాదేశమాత్రముగల మనస్సులో నున్న పరమాత్మను మనస్సు ద్వారా ధ్యానము చేయు కారణముచే పరమేశ్వరునిగూడ ప్రాదేశమాత్రము(విస్తృత అంగుష్ఠ తర్జనీ మధ్య భాగము ప్రాదేశమాత్రము లేక దానినే లుడితెడు అందురు.)గల వాడందురు.

ప్రాదేశమాత్రమైన హృదయ స్థానములో ప్రతిష్ఠితుడై ఉన్నందువలనను మనస్సు ద్వారా స్మరణ ధ్యానాదుల వలనను వ్యాపకుడైనను ప్రాదేశమాత్రమని గౌణప్రయోగము గావించిరని బాదరి ఆచార్యులు అనుచున్నారు. ఏవిధముగా ఒక శేరుతోకొలచిన ధాన్యమును శేరుధాన్యము అందురు అదేరీతిగా ప్రాదేశమాత్రత్వము శ్రుతిలో అనిరి.

62. సంపత్తేరితి జైమినిస్తథా హి దర్శయతి. (1.2.31.)

సూత్రార్థము:-శిరస్సు నుండి చుబుకము వరకు ప్రాదేశమాత్రస్థానములో సంపత్తి ద్వారా (సమాన ప్రకరణములో చెప్పిన ధ్యానవిధి సంపాదన) వైశ్వానరుని ఉపాసించుట వలన వ్యాపకపరమేశ్వరుని ప్రదేశమాత్రుడని చెప్పినారు. జైమిని ఆచార్యుల మతమిది. వాజసనేయ బ్రాహ్మణముగూడ శిరస్సునుండి గడ్డము వరకు గల స్థానములో వైశ్వానరుని ఉపాసన చెప్పిరి.

తలనుండి గడ్డమువరకు దేహావయవములలో అనగా ప్రాదేశమాత్రములో వైశ్వానరుని ఉపాస్యము ప్రతిపాదించుటవలన పరమేశ్వరునికి పరిచ్ఛిన్న పరిమాణము ప్రాప్తమయినది.దానినే శ్రుతి ప్రాదేశమాత్రమనినది అని జైమిని ఆచార్యులు అనుచున్నారు. వేరొకశ్రుతిలో –"ప్రాదేశమాత్రమివ హ వై దేవాః సువిదితా అభిసంపన్నాః" "మొదలులో దేవతలు అపరిచ్ఛిన్నమైన ఈశ్వరుని సంపత్తి ఉపాసన ద్వారా ప్రాదేశమాత్రుడని తెలిసికొని సంపన్నులైరి." పైనుదాహరించిన వాజసనేయ బ్రాహ్మణమునందు స్వర్గమునుండి పృథివీవరకు ఉన్న వైశ్వానరావయవములను మూర్ధ అనగా తల పైభాగమునుండి చుబుకము అనగా గడ్డము వరకు గల అవయవములలో త్రిలోకి వైశ్వానరుని చెప్పిరి. అనగా త్రైలోక్యాత్మ వైశ్వానరుని ప్రాదేశమాత్రత్వమును చెప్పిరి.

63. ఆమనన్తి చైనమస్మిన్. (1.2.32.)

సూత్రార్థము:-జాబాల శ్రుతి శిరస్సునుండి గడ్డము వరకుగల మధ్యభాగములో పరమేశ్వరుని ఉపసించవలెనని చెప్పుచున్నది. శిరస్సునుండి గడ్డమువరకుగల ప్రాదేశమాత్రస్థానములో పరమేశ్వరుని చెప్పుచున్న జాబాల శ్రుతిలో ఈదేశమాత్రమునుగురించి ''య ఏషోఽనన్తోఽవ్యక్త ఆత్మా సోఽవిముక్తే ప్రతిష్ఠితః । వరణాయాం నాస్యాంచ మధ్యే ప్రతిష్ఠితః'' ॥ (జా.1) అనంతుడై స్పష్టముగానెఱుంగరని వాడై యుండు పరమేశ్వరుడు అవిముక్తమున(బద్ధుడైన జీవుని యందు) నున్నాడు. అవిముక్తమెచట నున్నది? వరణకును నాసిక మధ్యలో ఆత్మ ప్రతిష్ఠితమైనది. (పౌరాణికులు అందువల్ల అంతర వారణాసి కనుబొమ్మల మధ్యస్థానము అనిరి) జీవ పరమేశ్వరుల భేధము కల్పితము గనుక జీవునియందు ఉన్నవాడు పరమేశ్వరుడే. అందువల్ల పరమేశ్వరుని చెప్పుటకు ప్రాదేశమాత్ర శ్రుతి యుక్తియుక్తము. సర్వాత్మస్వరూపుడైన పరమాత్మయే వైశ్వానరుడనునది సిద్ధమయినది.

బ్రహ్మసూత్రహృదయము నందు ప్రథమాధ్యాయములోని ద్వితీయపాద సంకలనము సమాప్తము.

## ప్రథమాధ్యాయస్య ద్వితీయపాదః సమాప్తః.

## ప్రథమాధ్యాయే తృతీయపాదః.

ఈ పాదమునందు అస్పష్ట బ్రహ్మ చిహ్నములుగల జ్ఞేయబ్రహ్మవిషయముల (నిర్గుణ బ్రహ్మ) విచారము బాహుళ్యముగా చెప్పిరి. అస్పష్టబ్రహ్మ చిహ్నములున్న వేదాంత వాక్యములందుగల ఉపాస్య బ్రహ్మవిషయములను బ్రహ్మమందు సమన్వయమగుటను ఈపాదములో ప్రతిపాదంచిరి. జ్ఞేయబ్రహ్మమందు సమన్వయము భోధించుటకు ఈ పాదము నారంభించిరి.

# 19.ద్యుభ్వాద్యధికరణము.

సంగతి:- క్రిందటి అధికరణములో మూడులోకములలో వ్యాప్తమైన( త్రైలోక్యాత్మ) వైశ్వానరుని పరమాత్మ అనిరి. అపుడు మూడు లోకముల ఆయతనము లేక ఆధారము పరమాత్మ కన్న భిన్నమగును అను ఆక్షేపమునకు సమాధానముగా ఈ అధికరణము ప్రారంభమగు చున్నది. అందువల్ల పూర్వ అధికరకణముతో ఈ అధికరణమునకు ఆక్షేప సంగతి.

విషయము:- "యస్మిన్ద్యౌః పృథివీ చాన్తరిక్షమోతం మనః సహ ప్రాణైశ్చ సర్వైః I తమేవైకం జానథ ఆత్మానమన్యా వాచో విముంచథామృతస్యైష సేతుః" II (ముం.2-2-5). దేనిలో ద్యులోకము, పృథివీ, అన్తరిక్షము, మరియు సంపూర్ణ ఇన్ద్రియములతో పాటు మనస్సు గూడ ఓతప్రోతమో ఆఒక్క ఆత్మనే తెలిసికొనుము, అన్య అనాత్మవిషయముల చిన్త వదిలిపేయుము, ఇదియే సంసారమును దాటించి అమృతత్వము పొందుటకు సేతువు. ఈ వాక్యము ఈ అధికరణమునకు విచారణీయ విషయము.

సంశయము:-ద్యులోకాదుల ఆధారము ప్రధానమా, జీవుడా లేక పరమాత్మయా? అనునది సంశయము.

పూర్వపక్షము:- స్మృతిలో ప్రసిద్ధమైన ప్రధానము జగత్తుకి కారణమైనందున అన్నింటికీ ఆధారమని చెప్పిరి. లేనిచో భోక్త అయినందున భోగ్య ప్రపంచమునకు ఆధారము జీవుడన వచ్చును.

సిద్ధాన్తము:- ద్యులోక భూలోకాదుల ఆధారము పరమాత్మయే, ప్రధానము కాని జీవుడు కాని కాజాలరు. ఎందులకనగా పరమాత్మను చెప్పు ఆత్మ శబ్ద ప్రయోగము వల్ల. ముక్తపురుషుల గన్తవ్య స్థానము జీవుడు కాని ప్రధానము గాని కాదు. బ్రహ్మ యొక్క ప్రకారణము జరుగు చున్నది, ఆ బ్రహ్మమునకు సర్వజ్ఞము, సర్వశక్తిమత్వము కలదనిరి. దానివల్ల ద్యులోకాదుల ఆధారము పరమాత్మయే, అన్యము కాజాలదు.

53. సూత్రం ప్రధానం భోక్తేశో ద్యుభ్వాద్యాయతనం భవేత్ । శ్రుతి స్మృతిప్రసిద్ధిభ్యాం భోక్తృత్వాచ్చేశ్వరేతరః .॥

54. నాఽఽద్యౌ పక్షావాత్మశబ్దాన్న భోక్తా ముక్తగమ్యతః । బ్రహ్మప్రకారణాదీశః సర్వజ్ఞత్వాదితస్తథా॥

"యస్మిన్ ద్యౌః పృథివీ" అను శ్రుతిలో ద్యులోకము భూలోకాదులకు ఆధారము సూత్రాత్మ (హిరణ్యగర్భుడు) లేక ప్రధానమా, జీవుడా కాక ఈశ్వరుడా అని సంశయము రాగా పూర్వపక్షి శ్రుతి స్మృతులలో ప్రసిద్ధమైనది మరియు ఆత్మశబ్మము ద్వారా తెలియుచున్నందున భోక్తృత్వము వినబడుటవలనను ఈశ్వరుడు గాక సూత్రాత్మ, ప్రధానము లేక జీవుడు సర్వలోక ఆధారమనును. ద్యులోకాదులకు ఆధారము పరమాత్మయే సూత్రాత్మ గాని ప్రధానముగాని జీవుడుకాని కాదు అని సిద్ధాన్తము. ఎందులకనగా ఆత్మ శబ్దప్రయోగమువలన. అంతేగాక ముక్తపురుషుడు ప్రధానమును గాని జీవుని గాని జేరడు ఈశ్వరునే జేరును. సర్వజ్ఞత్వాది గుణములు గల బ్రహ్మ ప్రకరణము నడచుచున్నది గావున ఈశ్వరుడే ద్యులోకాదులకు ఆధారము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ముండకోపనిషత్తులో ఈవిదముగా చెప్పబడినది "యస్మిన్ద్యౌః పృథివీ చాన్తరిక్షమోతం మనః సహ ప్రాణైశ్చసర్వైః। తమేవైకం జానథ ఆత్మానమన్యావాచో విముఞ్చథామృతస్యైష సేతుః ॥" (ముం.2.2.5) ఏ అక్షర పురుషునియందు ద్యులోకము, భూమి, ఆకాశము, మనస్సు ప్రాణములు సర్వేంద్రియములు ప్రతిష్ఠింపబడియున్నవో ఆతడే ఆత్మ. అతడే ఏకస్వరూపుడు. కాన ప్రాపంచిక విషయాలోచన వీడుము. ఇదియే అమృతత్వమునకు మార్గము.

పైన చూపినరీతిగా ముండక శ్రుతిలో ద్యులోక భూలోకాదులు గల సంపూర్ణ జగత్తునకు ఆత్మయే ఆధారము. ఆ ఆధారమునే తన ఆత్మరూపముగా తెలిసికొనుము కాని ఆశ్రయించియున్న ద్యుభూలోకాదులను కాదు. దీనికైన వేరైన అనాత్మను ప్రతిపాదించు తర్క శాస్త్రాదివచనములను వదిలివేయుము, ఏలనన అవి పురుషార్థ సాధనములు గావు. ఇచట సంశయము. ద్యుభ్వాది (స్వర్గ భూములకు) ఆధారము సూత్రాత్మయా, ప్రధానమా, భోక్తజీవుడా లేక ఈశ్వరుడా. సూత్రాత్మహిరణ్యగర్భుడు కావచ్చును.''వాయునా వై గౌతమ సూత్రేణాయం చ లోకః పరశ్చ లోకః సర్వాణి చ భూతాని సంద్బృబ్ధాని భవన్తి'' (బృ.3.7.2) హే, గౌతముడా! వాయువు గొప్పత్రాడు దానిచే ఈ లోకములన్నియు పరలోకములన్నియు మరియు భూతములన్నియు వాయువను సూత్రములో (చేర్చికట్ట బడి) గుచ్చబడి యున్నవి.(బృ.ఉ.3-7-2.) అను శ్రుతి ప్రసిద్ధి ద్వారా వాయువు సూత్రాత్మ ద్యుభ్వాద్యాయతనము అని తెలియు చున్నది. ప్రధానము కావచ్చును ఏలనన దానిని సాంఖ్యస్మృతిలో సర్వాధారముగా ప్రసిద్ధమను చున్నారు గాన. భోక్త జీవుడన వచ్చును ఏలనన ''తమేవైకం జానథఽఽత్మానమ్ '' భూమ్యాదులకు ఏ పదార్థమాధారమో దానినొక్కదానినే

తెలిసికొనుము. అని ఆత్మ శబ్ద ప్రయోగము వల్ల. ఈ పూర్వపక్షి సంశయమునకు సిద్ధాన్తి సమాధానము. సూత్రాత్మ, ప్రధానములను మొదటి రెండు పక్షముల సంభవమే లేదు ఏలనన ఇవి స్వర్గభూములకు ఆధారము కానేరవు.

ఆత్మశబ్దము నకు భోక్త జీవుడనిన ఆతడుగూడ స్వర్గభూములకు ఆధారము కానేరడు. "యదా పశ్యః పశ్యతే రుక్మవర్ణం కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిం । తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ నిరంజనః పరమమ్ సామ్యముపైతి" ॥(ముం.ఉ. 3-1-3.) "ఎపుడు తత్వదర్శి స్వయంజ్యోతిస్వరూపడైన సువర్ణమైన, బ్రహ్మఉత్పత్తి స్థానమైన జగన్నిర్మాత పరమేశ్వరుని, పూర్ణపురుషుని, తెలిసికొనునో (అనుభవించునో) అపుడు పుణ్యపాపములను దహించి నిరంజనుడై అద్వైతరూపమయిన సమానత్వమును పొందును." ద్యుభ్వాద్యాయతనమును ముక్తపురుషులు పొందుదురు అని వినిపించుచున్నందున భోక్త అయిన జీవుడు సర్వాధారము కాజాలడు. "కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి" (ముం.1.1.3) దేనిని తెలిసికొనిన సర్వము తెలియునో, అని ఒక విజ్ఞానముద్వారా సర్వవిజ్ఞానముతో విషయము ఉపక్రమించిరి. "బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి" (ముం.3.2.9) బ్రహ్మమును తెలిసికొనిన వాడు బ్రహ్మరూపమే అగును, అని ఉపసంహారము గావించిరి. బ్రహ్మ ప్రకరణమగుట వలన సర్వజ్ఞత్వాదులు చెప్పుట వలన భూతములకు కారణము, ఆధారము చెప్పుటవలన ద్యుభ్వాద్యాయతనము బ్రహ్మమే.

### 64. ద్యుభ్వాద్యాయతనం స్వశబ్దాత్. (1-3-1).

సూత్రార్థము:-"యస్మిన్ ద్యౌః పృథివీ చాన్తరిక్షమొతమ్" "దేనియందు దేవలోకము, భూలోకము, అంతరిక్షలోకము మొదలగునవి కల్పితములో" అను శ్రుతియందు ద్యులోకాదులకు ఆశ్రయము పరబ్రహ్మమే ఎందులకనగా బ్రహ్మవాచకము ఆత్మశబ్దము శ్రుతిలో గలదు.

ఇచట పూర్వపక్షములో ప్రధానాదుల ఉపాసన. సిద్ధాన్తములో బ్రహ్మజ్ఞానమని ఫలభేదము. "ద్యౌశ్చ భూశ్చ ద్యుభువౌ, ద్యుభువావాదీ యశ్చ జగతః తద్యుభ్వాది" స్వర్గము భూలోకము దేనిలో ప్రధానములో అట్టి సర్వలోకాధారము పరబ్రహ్మమే అగును. దేనికంటే "స్వ శబ్దాత్". పరబ్రహ్మ స్వరూపము చెప్పుటకే ఆత్మశబ్దప్రయేగము గావించిరి. "తమేవైకం జానథ ఆత్మానం" (ముం.2.2.5.) ఆ ఆత్మనొకదానిసే తెలిసికొనుము. అనుచోట ఆత్మశబ్దము పరమాత్మ విషములోసే సంభవము అన్యత్ర కాదు. ఉపాధివిశిష్టమైన జీవాత్మయందుకూడ ఆత్మశబ్దము ప్రయోగింతురుకదా అనుటకు వీలులేదు. "తమేవైకం జానథ" అను శ్రుతిలో "ఏవ" శబ్దము (నిశ్చయార్థకము)మరియు " ఆత్మ" శబ్ద ప్రయొగము వల్ల కార్యరూపమయిన విశిష్టచైతన్యము గ్రహణము కాదు కాని నిరుపాధిక నిర్గుణ నిరాకార పరబ్రహ్మమే విజ్ఞేయము అని అర్థము. దేనిమీద దేవదత్తుడు కూర్చున్నాడో దానిని తీసుకురమ్ము అనిన కూర్చున్న ఆసనమునే తీసుకొనివచ్చుదురు కాని దేవదత్తుని కాదు.అట్లే ఏకరస ఆత్మ అన్నింటికీ ఆయతనము, అదే విజ్ఞేయము అని ఉపదేశించిరి.అందువల్ల ఉపక్రమములో నున్న ఆయతనత్వమును గౌణ సేతుత్వ హేతువుగా భావించి ప్రథమ ఆత్మశబ్దము వినబడుటవలన (ప్రయోగమువల్ల) పరబ్ర హ్మమునే ఆయతనముగా భావించవలయును.

65. ముక్తోపసృప్యవ్యపదేశాత్. (1.3.2.)

సూత్రార్థము:-"బ్రహ్మజ్ఞాని నామరూపములనుండి ముక్తుడై అనగా అజ్ఞానము దాని యొక్క కార్యములనుండి విడివడి పరాత్పరమైన సర్వోత్కృష్ట దివ్యపురుషునితో ఏకీభవించును". అను ఈశ్రుతివాక్యములో ముక్త పురుషుల ద్వారా పరబ్రహ్మ ప్రాప్యమని చెప్పబడినది, గనుక దేవలోక భూమ్యాదులకు ఆధారము పరబ్రహ్మమే.

పరబ్రహ్మమే ద్యులోక భూమ్యాదులకు ఆయతనము, ఏలనన ముక్తపురుషులు ప్రాప్తిచెందునది ఈపరబ్రహ్మమే అని "ముక్తోపసృప్య" అనుపదము ద్వారా ఉపదేశించుటవలన. ముక్తోపసృప్య పదమునకు ముక్తోపసృప్యతా అని అర్థము. అనగా అవిద్యవలన దేహాదులందు ఆత్మబుద్ధి ఉండుటవలన దేహపూజాదులందు రాగమును, మరియు దేహాదుల అనాదరము వలన ద్వేషము చూడబడుచున్నది. అవిద్య నశించుటవలన దానికి విపరీతముగా రాగాది దోషములనుండి ముక్తులై ద్యుభూములకు ఆధారమయిన బ్రహ్మముతో ఐక్యము అని అర్థము. "తథా విద్వాన్నామరూపాద్విముక్తః పరాత్పరం పురుషముపైతి దివ్యమ్" తత్వవేత్త నామరూపాదులనుండి విముక్తుడై సర్వోత్కృష్ట దివ్యపురుషుని ప్రాప్తి పొందును, అని ముండకోపనిషత్తు (3-28 వ శ్లోకము) లో ఉపదేశించిరి. ప్రధానాదులలో ముక్తపురుషుడు జేరునని ఏశ్రుతిలోనూ ఏశాస్త్రములోను ఉపదేశించలేదు. అందువల్ల ద్యులోకాదులకు ఆయతనము పరబ్రహ్మమే.

66. నానుమానమతచ్ఛబ్దాత్ (1.3.3.)

సూత్రార్థము:- సాంఖ్యుల ద్వారా పరికల్పితమైన ప్రధానము ద్యులోకాదులకు ఆశ్రయము కానేరదు. ఎందులకనగా "యస్మిన్ ద్యౌః" అనువాక్యములో ప్రధాన వాచక శబ్దము లేదు.

అనుమీయతే ఇతి అనుమానం, సాంఖ్యులు కల్పన చేయు ప్రధానము ఇచట ద్యుభ్వాద్యాయతనము కానేరదు. ఎందులకనగా ఈ అచేతన ప్రధానము యొక్క ప్రతిపాదనము చేయు శబ్దము లేనందువలన దానిసే సూత్రములో అతచ్ఛబ్దాత్ అనిరి. "యః సర్వజ్ఞః సర్వవిత్" సామాన్యముగా విశేషముగా అన్నియు తెలిసినవాడు అని శ్రుతిలో జడమునకు విపరీతమైన చైతన్యమును ప్రతిపాదించు శబ్దములు గలవు గాన సాంఖ్యులద్వారా పరికల్పితమైన ప్రధానము ద్యులోకాదులకు ఆశ్రయము కానేరదు.

67.ప్రాణభృచ్చ (1.3.4.)

సూత్రార్థము:- జీవుడు గూడ స్వర్గభూములకు ఆశ్రయము కాజాలడు. ఎందులకనగా వానిని ప్రతిపదించు శబ్దములు లేవు.

సూత్రములోని చ శబ్దము పూర్వసూత్రములోని ద్యుభ్వాద్యాయతనము మరియు, అతచ్ఛబ్దాత్ అను పదముల యొక్క అనువర్తనము సూచించును. ప్రధానమువలే ద్యు భూలోకముల ఆయతనము జీవుడు, అను శబ్దముగూడ శ్రుతులలో

కానరాదు. జీవునిలో ఆత్మత్వము చైతన్యత్వము ఉన్నను ఉపాధి పరిచ్ఛిన్నుడైనుండుట వలన సర్వజ్ఞత్వాది గుణములు లేవు. అందువల్లగూడ జీవుడు ద్యు భ్వాదుల ఆయతనము కాజాలడు. జీవుని ఆయతనత్వము ఖండిచిన తరువాత ముందు మూడు సూత్రములద్వారా అన్య హేతువులు చెప్పుచున్నారు.

68. భేదవ్యపదేశాత్. (1.3.5.)

సూత్రార్థము:- ఆ ఒకే ఆత్మను తెలిసికొనుము. అని శ్రుతిలో జ్ఞాత జ్ఞేయరూపములుగా జీవపరమాత్మల భేధము చెప్పుట వలన జీవుడు భూమ్యాదుల ఆశ్రయము కానేరడు.

ద్యు భ్వాద్యాయతనము మరియు ప్రాణభృచ్చ అను పదములు ముందు మూడు సూత్రములలో అనువర్తించును. ''తమేవైకం జానథ ఆత్మానం'' ముండకోపనిషత్తులో ఆ ఆత్మనే తెలిసికొనుము అని ప్రాణము ధరించిన ముముక్షువును జ్ఞాత తెలిసికొనువానిగా, ఆత్మశబ్దవాచ్యమైన బ్రహ్మమునే జ్ఞేయమని తెలిసికోవలసిన బ్రహ్మముగను భేధోపదేశము అనగా భిన్నములుగా ఉపదేశించుట వలన జీవుడు ద్యుభ్వాద్యాయతనము గాజాలడు.

66. ప్రకరణాత్. (1.3.6.)

సూత్రార్థము:- "దేనిని తెలిసికొనిన ఇదంతయూ తెలిసకొబడునో" అని ప్రకరణము ఆరంభించిరి. ఇది బ్రహ్మ ప్రకరణము. కాన జీవుడు భూమ్యాదుల ఆశ్రయము కానేరడు.

''కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి'' హే భగవన్ దేనిని తెలిసికొనిన ఈ సంపూర్ణ సంసారము తెలిసికోబడును.(ముం.1-1-3). ఒకవిజ్ఞానము ద్వార సర్వవిజ్ఞానము యొక్క ప్రసంగము కాన వచ్చుచున్నది. అది బ్రహ్మజ్ఞానము ద్వారానే సంభవము. సంపూర్ణ సంసారమునకు అధిష్ఠానము బ్రహ్మ, వానిని తెలిసికొనిన వానిలొ కల్పిత సంపూర్ణ సంసార జ్ఞానము కలుగును. బ్రహ్మప్రకరణములో జీవుడు ద్యుభ్వాద్యాయతనము కానేరడు.

67. స్థిత్యదనాభ్యాం చ. (1.3.7.)

సూత్రర్థము:- "ద్వా సుపర్ణా" అనుమంత్రములో ఔదాసీన్య పూర్వక స్థితి, కర్మఫలభోగము, పరమాత్మ, క్షేత్రజ్ఞుల భేద నిర్దేశము ఉన్నందువల్ల జీవుడు భూమ్యాదుల ఆశ్రయము కానేరడు.

"ద్వా సుపర్ణా" అను మంత్రములో ఒకే వృక్షముపై సమాన స్వభావముగల రెండు పక్షులు గలవు. "తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి" వానిలో ఒకటి కర్మఫలరూపమైన తీపి చేదు పండ్లను ఆరగించును, "అనస్నన్ అన్యో అభిచాకసీతి" రెండవది కేవలము దానికి సాక్షియై యుండును.(ముం.3-1-1) అని ఉదాసీన భావము నిర్దేశించిరి. దీనికి అర్థము శరీరరూపమయిన వృక్షముపై కర్మఫలములను అనుభవించు జీవాత్మరూపమయిన పక్షియు మరియు ఉదాసీన భావముతో నుండి పరబ్రహ్మరూమయిన పక్షి ఆజీవునకు ప్రకాశము నిచ్చుచుండు నని అర్థము. ఒకనిని

ఉదాసీనునిగను వేరొకనిని కర్మఫల భోక్తగను అనిన కారణముగా జీవుడు ద్యుభ్వాద్యాయతనము కాలేడు గాని పరబ్రహ్మమే సర్వాయతనమని సిద్ధము.

## 20. భూమాధికరణము.

సంగతి- క్రిందటి అధికరణములో ఆత్మశబ్దప్రయోగమువల్ల ద్యులోకాదుల ఆయతనము పరమాత్మఅనిరి, అట్లనుట సరికాదు. ఏలనన "తరతి శోకమాత్మవిత్" (ఛాం.ఉ.7-1-3.) "ఆత్మవేత్త శోకమును దాటును" ఈ ప్రకరణములో ప్రశ్నోత్తరముల పరంపర ప్రాణముకన్న ముందు కానబడుట లేదు,అందువల్ల ప్రాణములో ఆత్మశబ్దప్రయోగము సంభవము. ఈవిధముగా ఆక్షేపము కలుగుటవలన ఈఅధికరణము ప్రారంభమయినది. గాన పూర్వాధికారణముతో దీనికి ఆక్షేపసంగతి.

విషయము- "భూమా త్వేవ విజిజ్ఞాసితవ్యః" ''భూమానం భగవో విజిజ్ఞాస'' ''యత్ర నాన్యత్ పశ్యతి నాన్యత్ శ్రుణోతి నాన్యత్ విజానాతి స భూమా'' (ఛాం.ఉ.7-23, 24.) భూమాతత్వమునే ఉపాసించవలయును. సనత్కుమారుని ఈ ఉపదేశమును విని నారదుడు మీ ఉపదేశాను సారము భూమాతత్వమునే ఉపాసింతును గానా భూమాతత్వమును తెలియజేయుడు, అనిన ఏ స్థితిలో సాధకుడు తనకన్న భిన్నవస్తువును చూడడో, వినడో, తెలిసికొనడో దానినే భూమా తత్వమందురు. ఈశ్రుతి వాక్యము ఈ అధికరణమలో విచారణీయ విషయము.

సంశయము-భూమా శబ్దమునకు అర్థము ప్రాణమా లేక పరమాత్మయా? అని సంశయము.

పూర్వపక్షము- నారద సనత్కుమార ప్రసంగములో నామము నుండి ఆశ వరకు ప్రశ్నోత్తరములు కానవచ్చు చున్నవి దానిముందు ప్రశ్నోత్తరములు కాన వచ్చుట లేదు. అందువల్ల అనుగతమైన అతివాదిత్వ శబ్దము భూమాపరముగా చెప్పుట వలన భూమాశబ్దార్థము వాయువు అనవలయును.

సిద్ధాంతము- ''ఏష తు వా అతివదతి యః సత్యేనాతివదతి'' అతివాది అగువాడు సత్యముద్వారానే అతివాది అగుచున్నడు (ఛాం ఉ. 7-16.) 'తు' అను శబ్దముద్వారా ప్రాణప్రకరణము వేరుచేసి సత్యము యొక్క ప్రసంగము ప్రారంభమయినది. అందువల్ల భూమా పదమునకు అర్థము పరమాత్మయే. మహాఉపక్రమము గూడ పరమాత్మదే. సమస్త ద్వైతాభావము (ద్వైతము యొక్క అభావము) గూడ పరమాత్మనందే, గాన భూమాపదము యొక్క అర్థము పరమాత్మఅనియే నిశ్చయమయినది.

వైయాసికన్యాయమాలా

55. భూమా ప్రాణః పరేశో వా ప్రశ్నప్రత్యుక్తివర్జనాత్ । అనువర్త్యాతివాదిత్వం భూమోక్తేశ్చాసురేవ సః॥

56. విచ్ఛిద్యైష త్విత ప్రాణం సత్యస్యోపక్రమాత్తథా । మహోపక్రమ ఆత్మోక్తేరీశోఽయం ద్వైతవారణాత్॥

నారదసనత్కుమారుల ప్రసంగములో “యత్ర నాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి” ఇత్యాది వాక్యములో వచ్చిన భూమాశబ్దము ప్రాణమా లేక ఈశ్వరుడా అను సంశయమునకు పూర్వపక్షి ప్రణోపదేశాన్తరము ప్రశ్నోత్తరములు లేవు మరియు అతివాదిత్వము అనువర్తించుట వలన భూమా శబ్దార్థము ప్రాణమే అనును. సిద్ధాంన్తి సమాధానము. “ఏష తు అతివదతి” అను వాక్యములో ‘తు’ శబ్దముద్వారా ప్రాణ ప్రసంగమును వేరుచేసి “యః సత్యేనాతివదతి” అను వాక్యములో సత్యశబ్దము ద్వారా ముందున్న అవాన్తర (రెండిటి మధ్య) ప్రకరణము ఆరంభించిరి. ప్రకరణము మొదలునుంచి ఆత్మశబ్ద ప్రయొగము గలదు. మరియు “యత్ర నాన్యత్పశ్యతి” అని ద్వైతనిషేధము గావింరి. అందువల్ల భూమాశ బ్దమునకు అర్థము ఈశ్వరుడే.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఛాందోగ్యములోని సప్తమాధ్యాయములో నారదునుకి సనత్కుమరులు నామముతో ఆరంభించి ముందుముందు అనేకతత్వములను ఉపదేశించి ఆఖరిలో అతిశయరాహిత్యమయిన భూమాతత్వమును ఉపదేశించిరి..‘‘యత్ర నాన్యత్ పశ్యతి నాన్యత్ చ్ఛృణోతి నాన్యద్విజానాతి స భుమా’’ (ఛాం.ఉ.7-24-1). ఈ శ్రుతికి అర్థము ‘ఏ స్థితిలో అన్యము చూడడో, అన్యము వినడో, అన్యము తెలిసికొనడో అదే భూమాతత్వము’.అచట భూమా శబ్ద వాచ్యములో రెండురకముల సందేహముగలదు. ప్రశ్నప్రత్యుత్తరములు లేకపోవుటవలన భూమాశబ్దార్థము ప్రాణమని ప్రాప్తము. పూర్వము నామాదితత్వములలో ‘‘అస్తి భగవో భూయః’’ (చాం.ఉ. 7-1-5.)”దీనికన్న పెద్దది కలదా” అని నారదుడు మాటి మాటికి అడిగిన ‘కలదు’ ‘అస్తి’ అని సనత్కుమారులు జవాబిచ్చేడివారు. ఈ విధముగా ప్రశ్నప్రతివచనములద్వారా నామాది మొదలు ప్రాణము వరకు తత్వమును ఉపదేశించి ప్రాణముతరువాత ప్రశ్నసమాధానములు లేకనే భూమాతత్వమును ఉపదేశించిరి. కాన ప్రాణ భూమాదుల మధ్య విఛ్ఛేదకశబ్దము లేకపోవుటచే భూమాశబ్దార్థము ప్రాణమే. కాని ప్రాణతత్వమునుపదేసించి ప్రాణమే ఉపాస్యమని అతివాదిత్వమను పేరుగల ఉత్కర్షమును చెప్పి ప్రాణవిఛ్ఛేదక సందేహ నివృత్తి కొరకు ఆ అతివాదిత్వమును అనువృత్తిచేసి భూమాతత్వమునుపదేశించి ప్రాణ భూమాశబ్దముల అభేధము సూచించిరి, కనుక ప్రాణమే భూమాశబ్దార్థము.

అను పూర్వపక్షమునకు సమాధానము ఇచ్చుచున్నారు. ఈ భూమాతత్వము పరమేశ్వరుడే. ఏలనన ‘‘ఏష వా అతివదతి యః సత్యేన అతివదతి’’ (ఛాం.ఉ.7-16-1). ఎవడు సత్యతత్వమును ఆత్మగా అనుభవించి అది సర్వాతీతమని చెప్పునో ఆతడే యథార్థముగా అతివాది (సర్వాతీతమునెఱింగి పలుకువాడు) ఇచట అతివాదిత్వ కారణము ప్రాణమను దానిని ‘తు’ శబ్దముద్వారా తొలగించి ముఖ్య అతివాదిత్వ కారణము బ్రహ్మమనుటకు ‘సత్య’ శబ్దముద్వారా పేరుగా ప్రారంభించిరి. అంతేగాక పరమో పక్రమములో ‘‘తరతి శోకమాత్మవిత్ ’’ (ఛాం.ఉ.7-1-3) ఆత్మవేత్త శోకసాగరరూపమైన ఈ సంసారమును దాటును. అని వేద్య తత్వము పరామాత్మ అనిరి. మరియు ‘‘యత్ర నాన్యత్ పశ్యతి’’ ఏ స్తితిలో రెండవ

తత్వమును చూడడో అని ద్వైతనిషేధముద్వారా భూమాతత్వము యొక్క లక్షణము చెప్పిరి, గాన అద్వైత పరమాత్మతత్వమే భూమార్థము.

### 71. భూమా సమ్ప్రసాదాదధ్యుపదేశాత్. (1.3.8.)

సూత్రార్థము:- "భూమాత్వేవ" భూమాతత్వమే తెలిసికొనుటకు యోగ్యమైనది, అను శ్రుతిలో చెప్పిన భూమాతత్వము పరమాత్మయే ఎందులకనగా ప్రాణోపదేశము తరువాత భూమా ఉపదేశము గావించిరి.

పూర్వపక్షి భూమాతత్వముద్వారా ప్రాణోపదేశమనును, సిద్ధాన్తి బ్రహ్మజ్ఞానోపదేశమనును. ఛాందోగ్యములో ఏడవ అధ్యాయములో "భూమాతత్వమునే ఉపాసన చేయువలయునని" సనత్కుమారుడు నారదునికి చెప్పెను. నారదుడు భూమాతత్వమును తెలియజేయుమనెను. ఏస్థితియందు సాధకుడు తనకన్న భిన్న వస్తువును చూడడో, వినడో, తెలిసికొనడో ఆస్థితినే భూమా అందురు. ఈవాక్యము ఇచట విచారణీయము. ప్రాణము ఆశకన్న గొప్పది అని సనత్కుమారుడు చెప్పిన తరువాత నారద సనత్కుమారుల పశ్నోత్తర పరంపర లేదు. ప్రాణమే భూమాతత్వమని పూర్వపక్షము. ఎందులకనగా ప్రాణవేత్తను అతివాది అనిరి అనును.

భూమాతత్వము పరమేశ్వరుడే. ఏలనన "సమ్ప్రసాదాదధ్యుపదేశాత్" ఏ అవస్థలో జీవుడు సంపూర్ణముగా ప్రసన్నుడవుతాడో ఆనిద్రా అవస్థను సంప్రసాదమందురు. అదే సుషుప్తి. ఆ సంప్రసాద అవస్థలో ప్రాణములు జాగరూకములైయుండును. సంప్రసాద శబ్దముద్వారా ప్రాణమునందురు. ఆప్రాణమునకన్న పైన ఉపదేశము గలదు. "ప్రాణాదధి" ప్రాణోపదేశము తరువాత భూమాతత్వమును ఉపదేశించిరి. ప్రాణోపదేశము తరువాత ప్రశ్న సమాధానములు లేవనుట సరికాదు. ప్రాణ ఉపదేశమువిని ఊరుకొనిన అకృతార్థుడైన నారదులవారికి సనత్కుమారులే స్వయముగా ప్రాణభిన్న మైన భూమాతత్వమును ఉపదేశించిరి. అతివాదిత్వము ప్రాణవిషయమే ననుట సరికాదు. "ఏష తు వా అతివదతి యః సత్యేనాతివదతి" ఎవడు సత్యమైన ఆత్మనెఱింగి చెప్పునో వాడే యథార్థముగా అతివాది అగును. ఈ శ్రుతిలో 'తు' శబ్దము ద్వారా ప్రాణము యొక్క అతివాదిత్వము తొలగించి సత్య పదవాచ్య పరమాత్మవాదమును అతివాదిత్వమని చెప్పుచు ప్రాణభిన్నమైన భూమాతత్వమును ఉపదేశించిరి. మరియు 'తరతి శోకమాత్మవిత్' అను శ్రుతి వాక్యములో శోకపద వాచ్యమయిన అవిద్యాకార్యమయిన సంసారమును ఆత్మజ్ఞానముద్వారా దాటుట చెప్పుటచే భూమాతత్వము పరమాత్మ అనియే అనుకొనవలయును.

### 72. ధర్మోపపత్తేశ్చ (1.3.9.)

సూత్రార్థము:- "యత్ర నాన్యత్పశ్యతి" "ఏ అవస్థలో ఇతరులను చూడడో అది భూమా" అనుశ్రుతిలో చూచుట వినుట తెలిసికొనుట అను సర్వవ్యవహారాభావము అనగా వ్యవహారము లేకుండుట భూమాధర్మమైన పరమాత్మ యందే యుక్తియుక్తము. అందువల్ల గూడ భూమా తత్వము పరమాత్మయే.

భూమా తత్వము పరమాత్మయే. ఏలనన 'యత్ర నాన్యత్ పశ్యతి' అనుశ్రుతిలో దర్శనాదుల వ్యవహారాభావము భూమాతత్వములో అనిరి. అంతేగాక 'యో వై భూమా తత్ సుఖం' 'యోవై భూమా తదమృతమ్' నిశ్చయముగా భూమాతత్వము సుఖస్వరూపము మరియు అమృతస్వరూపము. ఈ రెండు ధర్మములు పరమాత్మయందే యుక్తము. అందువల్ల భుమాతత్వమునకు అర్థము పరమాత్మయే.

## 21. అక్షరాధికరణము.

క్రిందటి అధికరణములో సత్య శబ్దము బ్రహ్మమందు రూఢమయినందున భూమాశబ్దమునకు అర్థము బ్రహ్మమనిరి.అట్లే అక్షరశబ్దము వర్ణార్థమునందు రూఢమయినందున అక్షరార్థము వర్ణమే అగును. అను దృష్టాంన్త సంగతి వలన ఈ అధికారణము మొదలయినది.

విషయము:- 'స హోవాచైతద్వై తదక్షరం గార్గి బ్రాహ్మణా అభివదన్త్యస్థూలమితి' (బృ.3-8-7/8.) హే! గార్గి ఆకాశము అక్షరములో ఓతప్రోతము, దానిని బ్రహ్మవేత్తలు స్థూలత్వ, అణుత్వ ధర్మముల రహితము అందురు. ఈవాక్యము ఇచట విచారణీయ విషయము.

సంశయము:- అక్షర శబ్దము వర్ణమా, లేకపరమాత్మయా అని సంశయము.

పూర్వపక్షము:- అక్షర శబ్దము వర్ణములో ప్రసిద్ధము. అదువల్ల ఇవట అక్షరశబ్దమునకు అర్థము ప్రణవాక్షరమనవలయును.

సిద్ధాన్తము:- పృథివీనుండి అవ్యాకృత పర్యంతము సంపూర్ణ జగత్తునకు ఆధారమగుటవలనను, ఏ ధర్మములు లేకుంటవలనను,శాసనకర్త అగుటవలనను, ద్రష్టృత్వాది చైతన్య ధర్మములను చూచుచు అక్షరశబ్దమునకు అర్థము బ్రహ్మమనుటయే ఉచితము.

వైయాసికన్యాయమాల.

57. అక్షరం ప్రణవః కింవా బ్రహ్మ లోకేఽక్షరాభిదా । వర్ణే ప్రసిద్ధా తేనాత్ర ప్రణవః స్యాదుపాస్తయే. ॥

58. అవ్యాకృతాధారతోక్తేః సర్వ ధర్మ నిషేధతః। శాసనాదద్రష్టృతాదేశ్చ బ్రహ్మైవాక్షరముచ్యతే. ॥

"ఏతద్వై తదక్షరం గార్గి బ్రాహ్మణా అభివదంన్తి అస్థూలమనణ్వహ్రస్వమ్" అను వాక్యములో నున్న అక్షరము పదము ప్రణవమా లేక బ్రహ్మమా అనిన లోకములో అక్షర శబ్దము వర్ణములో ప్రసిద్ధమగుట వలన ప్రణవాక్షరము ఉపాసనకు చెప్పిరనవలయును. 'అక్షరము' అవ్యాకృతము ఆకాశమునకు ఆధారమగుటవలనను, దానిలో అన్ని రకముల

ధర్మములు నిషేధించుటవలనను , అదే సంపూర్ణ జగత్తునకు శాసనకర్త అగుటవలనను, ఇంద్రియములకు అగోచరమగుటవలనను మరియు దానిసే ద్రష్ట అనుట వలనను బ్రహ్మమే అక్షర శబ్దార్థము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

బృహదారణ్యకోపనిషత్తులోని మూడవ అధ్యాయములో యాజ్ఞవల్క్యుడు గార్గికి చెప్పెను "ఏతద్వై తదక్షరం గార్గి! బ్రాహ్మణా అభివదన్తి అస్థూలమనణ్వహ్రస్వమ్" (బ్ర.3.8.8.) బృహదారణ్యకోపనిషత్తులో మూడవ అధ్యాయములో గార్గికి యాజ్ఞవల్క్యుడు ఇచ్చిన సమాధానములోనిదీవాక్యము. "హే గార్గి, ఆ అక్షరమును గురించి బ్రహ్మవేత్తలు ఈవిధముగా చెప్పుచున్నారు స్థూలత్వము అణుత్వము హ్రస్వత్వము మొదలుగాగల ధర్మములు లేనిది." ఇచట అక్షరశబ్దముద్వారా ప్రణవము లేక బ్రహ్మమును చెప్పుచున్నరా అని సందేహము. ప్రణవమని పూర్వపక్షము. ఏలనన ''యేనాక్షర సమామ్నాయమధిగమ్య'' అనుచోట అక్షర శబ్దము వర్ణములో రూఢమయినందున ప్రణావక్షరమును ఇచట ఉపాశ్యముగా చెప్పవలయును.

దీనికి సిద్ధాన్తి సమాధానము- అక్షరశబ్ద వాచ్యము బ్రహ్మమే. ఏలనన 'అంబరాన్తధృతేః' పృథివ్యాది ఆకాశపర్యన్తము గల వికారములను ధరించుట వలన. ''ఏతస్మిన్ ఖల్వక్షరే గార్గ్యాకాశ ఓతశ్చ ప్రోతశ్చ'' "హే, గార్గి, ఈఅక్షరములోనే ఆకాశము ఓతప్రోతము.(పడుగు పేకవలే) (బృ.ఉ.3-8-11). ఆకాశశబ్ద వాచ్యమయిన అవ్యాకృతమునకుగూడ ఆధారము అక్షరమే, గాని ప్రణవమునకు అది అసంభవము. ఇంకా 'అస్థూలమనణ్వహ్రస్వమ్' ఆఅక్షరమునందు స్థూలత్వ అణుత్వ హ్రస్వత్వాది ధర్మములు లేవు అనుచు సంపూర్ణ సంసారధర్మములను నిషేదించిరి.మరియు ''ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచంద్రమసౌ విధృతౌ తిష్ఠతః'' ఈ అక్షరము యొక్క శాసనములోనే సూర్యచంద్రులున్నారు. (బృ.ఉ. 3-8-9). అని ఈ అక్షరము ద్వారా సంపూర్ణ జగత్తుయొక్క శాసనమువినిపించుచున్నది. అంతేగాక ''తద్వా ఏతదక్షరం గార్గి అదృష్టం ద్రష్టృ అశ్రుతం శ్రోతృ'' హే, గార్గి, ఈఅక్షరము చూడబడదు కాని అందరికి అదే ద్రష్ట దానిని వినలేముగాని అందరిలోనుండి అదే వినుచున్నది. (బృ. 3-8-11). ఈ శ్రుతిలో ద్రష్టృత్వాదులకు అనగా చూచుట అను ప్రామాణములకు అది విషయము కాదు అనిరి. ఇవన్నియు ప్రణవ పక్షములో కల్పించలేము. అందువల్ల బ్రహ్మమే అక్షర శబ్దార్థము.

## 73. అక్షరమమ్బరాన్తధృతేః (1.3.10.)

సూత్రార్థము:- "ఏ తద్వై తదక్షరం హే గార్గి! ఇది అదే అక్షరము స్థూలము కాదు, అణువుకాదు. ఈ శ్రుతిలో అక్షరశబ్దార్థము బ్రహ్మమే. అదే భూమి నుండి ఆకాశము వరకు అన్ని వికారములను ధరించుచున్నది. అక్షరశబ్దము వర్ణమందు రూఢి అగుటవలన 'ఓంకార ఏవేదం సర్వం' అన్నచోట ఓంకారమును సర్వాత్మరూపముగా ఉపాసించవలయుననుట అక్షరశబ్దము వర్ణమందే అర్థమని పూర్వపక్షము. సిద్ధాన్తములో 'న క్షరతి ఏవం అశ్నుతే ఇతి అక్షరః' ఏది నశించదో మరియు వ్యాపకమో దానిసే అక్షరమందురు. అందువల్ల నిత్యము వ్యాపకము అను ధర్మముల

ద్వారా అక్షరము పరమాత్మయే. ఏలనన 'అమ్బరాన్తధృతేః' ఆకాశము పర్యంతము సంపూర్ణ జగత్తునకు ధారణము కలిగియుండుట పరబ్రహ్మము కన్న వేరైనదానికి సంభవముకాదు. "ఏతస్మిన్ను ఖల్వక్షరే గార్గ్యాకాశఓతస్చ ప్రోతశ్చ" (బృ.ఉ.3-8-11). 'హే! గార్గి, ఈఅక్షరములో ఆకాశము ఓతప్రోతము'. ఈశ్రుతిలో పృథివీ మొదలు ఆకాశము వరకు వికారజాతములైనసంపూర్ణ జగత్తు ఈఅక్షరములో ఓతప్రోతమై యున్నది. బ్రహ్మ కన్న భిన్నమైనదానిలో ఈ ఆధారత్వము సంభవము కాదు. ''ఓంకార ఏవేదం సర్వమ్'' ఇదంతా ఓంకారమే, ఇలాంటి వాక్యములు బ్రహ్మ ప్రాప్తికి సాధనరూపముగా చెప్పుచూ ఓంకార స్తుతి చేసిరి.

కాని కార్యము కారణాధీనము గాన ఆకాశము వరకు ధారణ ప్రధానమునకు గూడ సంభవము అను ఆశంకకు సమాధానము.

### 74. సా చ ప్రశాసనాత్. (1.3.11.)

సూత్రార్థము:- ఆకాశాది భూతముల ధారణ పరమేశ్వరుని కర్మమే, కాని అచేతనమైన ప్రధానాదులదికాదు. ఎందులకనగా ఈఅక్షరుని శాసనములో సూర్యచంద్రులు విశేషరూపముగా స్థితులైయున్నరు అను ఈశ్రుతిలో ప్రాశాసనము చెప్పబడినది.

ఆకాశమువరకు అన్నింటినీ ధరించుట పరమేశ్వరుని కర్మయే. ఏలనన 'ప్రశాసనాత్'´ అన్నింటిని శాసించుటవలన. "ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచంద్రమసౌ విధృతౌ తిష్ఠతః" ఈ అక్షర ప్రశాసనములో సూర్యచంద్రులు ధరింపబడి యున్నారు (బృ.3.8.9). పరమేశ్వరుని శాసన కర్మ వినబడుచున్నది. అచేతనప్రధానములో జగత్తును శాసించు శక్తి లేదు. మట్టి కుండ శాసించుట చూడబడుట లేదు గదా.

### 75. అన్యభావవ్యావృత్తేశ్చ. (1.3.12.)

సూత్రార్థము:- అక్షర శబ్దార్థమైన బ్రహ్మములో అచేతనమైన ప్రధానాదుల ధర్మము లేదు. అందువల్ల గూడ అక్షరార్థము బ్రహ్మమే గాని ప్రధానము కాదు.

"తద్వా ఏతదక్షరం గార్గ్యదృష్టం ద్రష్టృ" (బృ.3.8.11). " హే గార్గి!అదే ఈ అక్షరము పరుని చే చూడబడదు తాను చూచును." ఇచట చెప్పబడిన ద్రష్టుత్వాది ధర్మములు ప్రధానమునందు సర్వధా అసంభవము. అందువల్ల పరబ్రహ్మమే అక్షరపదవాచ్యము, వర్ణము కాదు.

# 22.ఈక్షతికర్మవ్యపదేశాధికరణము.

సంగతి:- వెనుకటి అధికరణములో వర్ణములో రూఢమైన అక్షరశబ్దమునకు గూడ బ్రహ్మమని అర్థము చెప్పిరి. ఎందులకనగా ఆకాశాదిభూతములకు సంపూర్ణ జగత్తునకు సర్వాధారమను అసాధారణహేతువు వలన మరియు 'న క్షరతి అశ్నుతేవా' నాశనము లేనిది, వ్యాపకమైనది అను వ్యుత్పత్తి ద్వారా అక్షరము బ్రహ్మమని చెప్పబడినది. సమముగా అదేరీతిగా ఇచట 'దేశపరిచ్ఛిన్నము, ఫలశ్రుతి' అను హేతువులద్వారా 'పర' శబ్దమును హిరణ్యగర్భపరముగా తీసికొనవలయును. ఇచట దృష్టాన్త సంగతి. "ఏ" పురుషుడు మూడు మాత్రలతో గూడిన పరిపూర్ణోంకారము నాలంబుగ గైకొని పరమేశ్వరునుపాసించునో" అను ఈవాక్యము విచారణీయము.

సంశయము:- ఈశ్రుతిలో పరబ్రహ్మ ధ్యేయమా లేక అపరబ్రహ్మమైన హిరణ్యగర్భుడు ధ్యేయమా? అని సంశయము.

పూర్వపక్షము:- "స సామభిరున్నీయతే బ్రహ్మలోకమ్" (ప్ర.5.5) ఈ విధమైన దేశపరిచ్ఛిన్నఫలము చెప్పుట వలన అపర బ్రహ్మమే ధ్యేయమని చెప్పవలయును.

సిద్ధాన్తము:- ధ్యాతవ్యరూపములో ఇచట పరబ్రహ్మమునే ఉపదేశించిరి. అది జీవఘనపరము. ధ్యానమునకు కర్మమగు విషయము భూతపదార్థము కావచ్చును కాని సమ్యగ్దర్శనమునకు విషయభూతము పరబ్రహ్మమే. పురుష పర శబ్దములద్వారా అదే ధ్యేయము యొక్క ప్రత్యభిజ్ఞ అగును. పరిచ్ఛిన్నఫలము క్రమముక్తి నపేక్షించి చెప్పిరి గాన విరోధము లేదు.

వైయాసికన్యాయమాల:

59. త్రిమాత్రప్రణవే ధ్యేయమపరం బ్రహ్మ వాపరమ్। బ్రహ్మలోకఫలోక్త్యాదేరపరం బ్రహ్మ గమ్యతే॥

60. ఈక్షితవ్యో జీవఘనాత్పరస్తాత్ప్రత్యభిజ్ఞతా । భవేద్ధ్యేయం పరం బ్రహ్మ క్రమముక్తిః ఫలిష్యతి ॥

. "యః పునరేతం త్రిమాత్రేణోమిత్యేతేనైవాక్షరేణ పరం పురుషమభిధ్యాయీత"(ప్ర.5.5) అనుశ్రుతిలో మూడు మాత్రలతో గూడిన ఓంకారమును అపర బ్రహ్మముగా ధ్యానించవలయునా లేక పరబ్రహ్మముగానా? బ్రహ్మలోక గమనమను సీమితఫలము చెప్పటవలన ఇచట అపర బ్రహ్మము ధ్యేయము అను పూర్వపక్షమునకు సమాధానము. వాక్యాన్తములో సర్వోత్కృష్ట విరాట్రూప, హిరణ్యగర్భములకన్న ఉత్కృష్టమైనది సాక్షాత్కరిచుకొనవలయుననిరి. 'పరము' మరియు 'పురుష' శబ్దముల ద్వారా పరబ్రహ్మ ప్రత్యభిజ్ఞ అగుచున్నది. బ్రహ్మధ్యానమునకు బ్రహ్మలోకప్రాప్తి ఫలము కాదు కాని ఆఖరిలో ముక్తి. అందువల్ల బ్రహ్మమే ధ్యేయమని సిద్ధమగుచున్నది.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ప్రశ్నోపనిషత్తులో వినబడుచున్నది "యః పునరేతం త్రిమాత్రేణోమిత్యేతేనైవాక్షరేణ పరం పురుషమభిధ్యాయీత" 'ఏ పురుషుడు మూడు మాత్రలతో గూడిన పరిపూర్ణోంకారము నాలంబుగా గైకొని పరమేశ్వరునుపాసించునో' అను శ్రుతిలో ధ్యేయవస్తువు హిరణ్యగర్భమగు అపర బ్రహ్మమా లేక పరబ్రహ్మమా? అని సంశయము. అపరబ్రహ్మమని పూర్వపక్షి అభిప్రాయము. ఎందులకనగా "స సామభిరున్నీయతే బ్రహ్మలోకమ్" (ప్ర.5.5) తృతీయ మాత్రారూపములగు సామమంత్రములచే బ్రహ్మలోకమునకు గొనిపోబడును. (మంత్రములకు రూపము కలదని మీమాంసకుల అబిప్రాయము) అని కమలాసనలోకప్రాప్తి వినబడుచున్నది. అంతమాత్రముచే పరబ్రహ్మధ్యానముయొక్క పరమపురుషార్థమను ఫలము కలుగదు. ' పరం పురుషం' అనుపర శబ్దవిశేషణము అపరబ్రహ్మమందుగూడ వినియోగింతురు. దేహాదులనపేక్షించి పరముగాన అపరబ్రహ్మమును పరమనవచ్చును గాన అపరబ్రహ్మమే ధ్యేయమని పూర్వపక్షము.

దీనికి సిద్ధాన్తి సమాధానము. పరబ్రహ్మమే ధ్యేయము. ధ్యేయత్వముద్వారా తెలిసికొనవలసిన పరబ్రహ్మము యొక్క ప్రత్యభిజ్ఞ శ్రుతిలో చెప్పిరి. "స ఏతస్మాజ్జీవఘనాత్పరాత్పరం పురుష మీక్షతే"(ప్ర.5.5) ఆసాధకుడు జీవసమూహమైన హిరణ్యగర్భునికన్న వేరైన శ్రేష్టపురుషుని అనగా అందరిహృదయములోనున్న పరమాత్మను చూచును. ఉపాసనద్వారా బ్రహ్మలోకము జేరిన సాధకుడు పైవిధముగా పరబ్రహ్మమును చూచును. అచట చూడవలసిన పరమాత్మనే వాక్యోపక్రమములో ధ్యానవిషయముగా చెప్పిరి. పర పురుష శబ్దముల ద్వారా పరబ్రహ్మముయొక్క ప్రత్యభిజ్ఞ చేసిరి. కేవలము బ్రహ్మలోక ప్రాప్తియే ఫలము కాదు. క్రమముక్తి సంభవమగుటవలన పరబ్రహ్మమే ధ్యేయము.

### 76. ఈక్షతికర్మవ్యపదేశాత్సః. (1.3.13.)

సూత్రార్థము:- "యః పునరేతం త్రిమాత్రేణ" 'ఎవడు మూడు మాత్రలుగల ఓంకారమును పురుషరూపునిగా ధ్యానించునో' అను శ్రుతిలో ధ్యేయము పరబ్రహ్మమని ఉపదేశించిరి. అపరబ్రహ్మముకాదు. ఎందులకనగా 'పరాత్పరం' "హిరణ్యగర్భుని కన్న పరమైన అందరిశరీరములో ప్రవేశించిన" అని వాక్యశేషము కనబడుచున్నది. దీనిలో ధ్యేయమైన దర్శన విషయము చెప్పిరి. కల్పితపధార్థము దృష్టిగోచరముకాదు.

" స సామభిరున్నీయతే బ్రహ్మలోకమ్" 'తృతీయామాత్ర రూపులైన సామమంత్రములచే బ్రహ్మలోకమునకు గొనిపోబడును'. ఇచట దేశపరిచ్ఛిన్నమైన ఫలము వినబడుటచే అపరబ్రహ్మ ధ్యేయమని పూర్వపక్షము.

సమాధానము:- ధ్యేయము పరబ్రహ్మమే. "ఈక్షతికర్మవ్యపదేశాత్సః" ఎందులకనగా చూచుట అను అనుభవ జ్ఞానమునకు కర్మగా పరబ్రహ్మను పైసూత్రములో ఉపదేశించుట వలన. "స ఏతస్మాజ్జీవఘనాత్పరాత్ పరం పురిశయం పురుషమీక్షతే" (ప్ర.5.5) 'ఆ సాధకుడు ఈ జీవసమూహ హిరణ్యగర్భునికాన్న వేరైన శ్రేష్ఠ పురుషుని

అందరి హృదయములో నున్న పరమాత్మగా చూచును'. ఈవిధముగా వాక్యశేషములో ఉపదేశించుటవలన ధ్యేయము పరబ్రహ్మమే. ధ్యాన కర్మవిషయము అతథాభూత మవ్వవచ్చును కాని ఈక్షణకర్మవిషయము (చూచుట) తథాభూతమే అగును. పరబ్రహ్మమే సమ్యక్దర్శన విషయము, దానినే ఈక్షణకర్మ విషయముగా చెప్పిరి. అదే ఇచట 'పర పరుష' శబ్దములద్వారా ధ్యేయరూపమై ప్రత్యభిజ్ఞ అగుచున్నది. దేశ సీమిత ఫలము చెప్పుచుండగా పరబ్రహ్మ ధ్యేయమని చెప్పలేము అనిన అట్లనుట సరిగాదు. త్రిమాత్ర ఓంకారాలంబము ద్వారా బ్రహ్మలోక ప్రాప్తి తరువాత సమ్యక్దర్శనము ఉత్పన్నమగును. ఈ విధముగా క్రమముక్తి అభిప్రాయముతో చెప్పిన విరోధములేదు.

## 23. దహరాధికరణము.

సంగతి:- పూర్వాధికరణములో పర పురుష శబ్దములు బ్రహ్మ అర్థములో రూఢమగుటవలన బ్రహ్మ ఉపాస్యమనిరి. ఇచట ఆకాశశబ్దము భూతాకాశములో రూఢమగుటవలన అదే ఉపాశ్యమని ఎందుకు చెప్పరాదు? అను ఆక్షేపసంగతి.

విషయము:-"అథ యదిదదమస్మిన్బ్రహ్మపురే దహరం పుండరీకం వేస్మ దహరోఽస్మిన్నన్తరాకాశ-స్తస్మిన్యదన్తస్తదన్వేష్టవ్యమ్" (ఛా.8.1.1). 'ప్రత్యక్షముగా ఏది కానవచ్చుచున్నదో అది బ్రహ్మపురము. దానియందు అల్పమగు హృదయకమలమను గృహముకలదు. అందు దానికంటే అల్పమగు ఆకాశము ఉన్నది. ఆ హృదయకమలమునగల ఆకాశమునే తెలిసికొనుము. దానిని శ్రవానాదులచే వెతుకవలయును'. ఈ వాక్యము ఇచట విచారణీయము.

సంశయము:- 'దహరం పుండరీకం' అనుచోట చెప్పిన ఆకాశము భూతాకాశమా? లేక పరమాత్మయా? అను సందేహము కలుగుచున్నది.

పూర్వపక్షము:- దహరపదవాచ్యము భూతాకాశమనవలయును. ఆకాశశబ్దము భూతాకాశములో రూఢము గనుక. ఉపాధి ద్వారా పరిచ్ఛిన్నమైనందున దహరపదవాచ్యము జీవుడనవచ్చును.

సిద్ధాన్తము:- బాహ్యాకాశము యొక్క ఉపమా దహరాకాశము కొరకు చెప్పిరి. మరియు దానినే సర్వ భూతములకు ఆధారమని గూడ చెప్పిరి. అపహత పాప్మత్వము, సేతుత్వము అను విశేషములు గూడ చెప్పిరి. అందువల్ల దహరాకాశమునకు సునిశ్చితమైన అర్థము పరమాత్మయే.

వైయాసికన్యాయమాలా

61. దహరః కో వియజ్జీవో బ్రహ్మ వాఽఽకాశశబ్దతః। వియత్స్యాదథవాఽల్పత్వశ్రుతేర్జీవో భవిష్యతి. ॥

62. భహ్యాకాశోపమానేన ద్యుభూమ్యాదిసమాహితేః। ఆత్మాఽపహతపాప్మత్వాద్సేతుత్వాచ్చ పరేశ్వరః॥

"అథ యదిదమస్మిన్బ్రహ్మపురే దహరం పుడరీకం వేశ్మ" ఈ శ్రుతిలో దహర శబ్దార్థము భూతాకాశమా? జీవుడా? లేక బ్రహ్మమా? దహర శబ్దార్థము భూతాకాశమనవచ్చును. ఆకాశశబ్దము భూతాకాశమందు రూఢి గనుక, లేక పరిచ్ఛిన్నమైన జీవుడు దహర శబ్దార్థము కావచ్చును. శ్రుతిలో జీవని అల్పుడనిరి. దీనికి సమాధానము. బాహ్యాకాశముతో ఉపమా చెప్పటవలన, ద్యుభూమ్యాదుల ఆధారమగుటవలన, ఆత్మత్వ, పాపరాహిత్యాది ధర్మములుండుట వలన, లోకమర్యాద స్థాపకుడగుటవలననూ దహరాకాశము పరమేశ్వరుడే.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఛాందోగ్యోపనిషత్తులోని అష్టమాధ్యాయములో "అథ యదిదమస్మిన్బ్రహ్మపురే దహరం పుండరీకం వేశ్మ, దహరోఽస్మిన్నంతరాకాశః తస్మిన్యదన్తః, తదన్వేష్టవ్యమ్, తద్వావ విజిజ్ఞాసితవ్యమ్" (ఛాం.8.1.1) 'ఈ శరీరమే బ్రహ్మపురము. దానియందు అల్పమగు హృదయకమలమను గృహము కలదు. అందు దానికంటె అల్పమగు నాకాశమున్నది. ఆ హృదయకమలమునందున్న ఆకాశమునే తెలిసికొనవలయును. దానినే శ్రవణ మననములచే వెతుకవలయును'. బ్రహ్మయొక్క ఉపలబ్ధిస్థానమగుటచే శరీరము బ్రహ్మపురము. ఆ హృదకమలమందుగల ఆకాశమున మూడు సంశయములు గలవు. 'వియత్' శబ్దము ఆకాశములో రూఢమగుటవలన 'వియత్' అనిగాని, దహర శబ్దముద్వారా అల్పత్వముచెప్పుటచే పరిచ్ఛిన్నజీవుడు గాని అగును. బ్రహ్మము కానేరదు. అన్న సంశయమునకు సిద్ధాన్తము. ఆకాశశబ్దవాచ్యము బ్రహ్మమే. "యవాన్వా అయమాకాశస్తావానేషోఽన్తర్హృదయ ఆకాశః."( ఛాం.8.3.1) "ఈ బహిరాకాశము ఎంతపెద్దదో, అంతే పెద్దది హృదయాకాశము". ఈ ప్రసిద్ధ శ్రుతివలన హృదయాకాశమును బహిరాకాశముతో పోల్చిరి. ఆకాశమునకు ఆకాశమే ఉపమా కాజాలదు. అల్పమైన జీవుని వ్యాపక ఆకాశముతో పోల్చలేము. లోకరూఢీ శ్రుతిరూఢముద్వారా భాధితమగును. మరియు "ఉభే అస్మిన్ద్యావా పృథివీ అన్తరేవ సమాహితే" (ఛాం.8.1.3 ) "స్వర్గ భూములు ఈఆకాశములోనే స్థితమై యున్నవి". ఈ విధముగా స్వర్గ భూమ్యాదుల సంపూర్ణ జగత్తునకు ఆధారము ఈ దహరాకాశము అని వినబడుచున్నది. "అథైష ఆత్మాఽపహతపాప్మా" (ఛాం.8.1.5 ) "ఈదహరకాశమే సర్వకర్మ సంభదములేని ఆత్మ" ఇచట ఆత్మత్వము, మరియు పాపరహిత్యము వినబడు చున్నది. "య ఆత్మా స సేతుర్విధృతిః" (ఛాం.8.4.1) 'ఆత్మయని చెప్పబడిన ఈదహరాకాశమే సర్వలోకములను క్రమముగా నడుపునట్టి సేతువు, మరియు ధరించునట్టి వస్తువు'. జగత్తు యొక్కమర్యాద సమ్మిశ్రణము కాకుండ సేతువువలే ఈ ఆత్మ అందరినీ ధరించి యున్నది. ఈ పైహేతువుల వలన దహరాకాశము పరమాత్మయే.

### 77. దహర ఉత్తరేభ్యః. (1.3.14)

సూత్రార్థము:- "శరీరరూపి బ్రహ్మపురములో నున్న అల్పహృదయకమలమునందు లోపల దహరాకాశము కలదు". దీనిలో చెప్పిన దహరాకాశము పరమాత్మయే. ఎందులకనగా ఉపసంహారములో ఆకాశముతో పోల్చుట,

స్వర్గ భూములకు ఆశ్రయమని చెప్పుట, ఆత్మతత్త్వమనుట, సకలపాపరాహిత్యము మొదలగు ధర్మములు బ్రహ్మ చిహ్నములు.

ఆకాశ శబ్దము భూతాకాశములో రూఢమగుటవలన "దహర పుండరీకములో వినబడు దహరాకాశము" భూతాకాశమా? జీవుడా లేక పరమాత్మయా? అని సంశయము. రూఢివల్ల దహరాకాశము భూతాకాశమనవచ్చును లేక మనోపాధి వలన జీవుడనవచ్చును. అను ఈ పూర్వపక్షమునకు సిద్ధాన్తము. దహరాకాశము పరమాత్మయే."యావాన్వా అయమాకాశ స్తావానేషో౽న్తర్హృదయే ఆకాశ ఉభే అస్మిన్ద్యావా పృథివీ అన్తరేవ సమాహితే" (ఛాం.8.1.3-4) బయటి ఆకాశము ఎంతపెద్దదో అంతే పెద్దది హృదయకాశము. స్వర్గ భూములు ఈ ఆకాశములోనే స్థితమైయున్నవి' "ఏష ఆత్మా అపహతపాప్మా విజరో విమృత్యుర్విశోకః" 'ఈ ఆత్మ పాపరహితము, జరామరణరహితము మరియు శోకరహితము' (ఛాం.8.1.3-4) ఈ శ్రుతిలో ఆకాశ ఉపమానత్వము, స్వర్గభూముల ఆశ్రయత్వము, ఆత్మత్వము, అపహతపాప్మత్వము మొదలగు ధర్మముల ఉపదేశమువలన దహరాకాశము భూతకాశముగాని, జీవుడుగానికాదు.

రూఢివల్ల భూతాకాశమనుటకు వీలులేదు. ఒకేదానియందు ఉపమాన ఉపమేయత్వ భావము చెప్పుట సరికాదు. ఒకే ఆకాశములో బయట లోపల కల్పిత భేధము ద్వారా ఉపమాన ఉపమేయము చెప్పవచ్చుననుట కుదరదు. అగత్యా కాల్పనిక భేధము స్వీకరింతురు. మరి జీవునిలో ఆత్మశబ్ద ప్రయోగమువల్ల బ్రహ్మ అభేదవివక్షముతో సర్వగతత్వాదులు దహారశబ్ద వాచ్యమైన జీవునిలో సంభవము గదా అనిన అది సరికాదు. ముందుచెప్పిన కారణములవలన బ్రహ్మమందు అన్ని ధర్మములు యుక్తి సంగతములు. ఎట్లు చూచిననూ జీవునిలో బ్రహ్మ ధర్మములు సంభవముకాదు. అందువల్ల పరమాత్మయే దహరశబ్దార్థము.

దహరాకాశము బ్రహ్మ పరమనుటకు కారణాంతరములు చెప్పుచున్నారు.

### 78. గతిశబ్దాభ్యాం తథాహి దృష్టం లింగం చ. (1.3.15.)

సూత్రార్థము:- జీవులందరూ హృదయాకాశరూపమైన బ్రహ్మలోకములో ప్రతిదినము ప్రవేశించుచున్నారు. ఈ వాక్యశేషములో ప్రతిదినగమనము బ్రహ్మ లోకశబ్దముద్వారా జీవుడు బ్రహ్మములో ప్రవేశించుచున్నాడని తెలియుచున్నది.

ఈ ప్రకారము అన్యశ్రుతులు గూడ జీవగమ్యము బ్రహ్మమని చెప్పుచున్నవి. 'బ్రహ్మైవ లోకః బ్రహ్మ లోకః' 'బ్రహ్మమే లోకము' అని సమానాధికరణము ద్వారా చెప్పుటవలన దహరాకాశము బ్రహ్మమే. ప్రతిదినము జీవుడు హిర్ణగర్భ లోకమునకు పోజాలడు. అందవల్లగూడ దహరాకాశము బ్రహ్మమే.

"ఇమాః సర్వాః ప్రజా అహరహర్గచ్ఛన్త్యః ఏవం బ్రహ్మలోకం న విన్దంతి" 'ఈజీవులందరూ ప్రతిదినము దహరాకాశరూపము అగు బ్రహ్మలోకమునకు సుషుప్తిలో పోవుచున్ననూ దానిని తెలిసికొనలేకున్నారు' (ఛాం.8.2.2) ఇచట దహరశబ్దమును బ్రహ్మముగా చెప్పి ఆ బ్రహ్మవిషయ గమనము చెప్పిరి. ప్రజా శబ్దవాచ్యమైన

జీవులను  ప్రతిరోజు దహరబ్రహ్మము పొందుచున్నారనుచు గతి, బ్రహ్మ శబ్దములద్వారా దహరకాశము బ్రహ్మమనిరి. అట్లే "సతా సోమ్య! తదా సంపన్నో భవతి" (ఛాం.6.8.1.) 'జీవులు సుషుప్త్యావస్థలో బ్రహ్మమును చెందుచున్నారు. ప్రతిరోజు బ్రహ్మవిషయమైన గమనము చూడబడుచున్నది. 'బ్రహ్మమే లోకము'  బ్రహ్మలోకము. కర్మధారయ సమాసము ద్వారా సామానాధికరణము (అభేధాన్వయ బోధకత్వము) స్వీకరించుట  దహరాకాశము బ్రహ్మమనుటకు హేతువు. ప్రతిరోజు సుషుప్తిలో జీవులు హిరణ్యగర్భలోకము పోవుట సంభవముగాదు.

79. ధృతేశ్చ మహిమ్నోఽస్యాస్మిన్నుపలబ్ధేః (1.3.16.)

సూత్రార్థము:- ఆత్మసేతువు అన్నింటినీ ధరించునది. "అథ య ఆత్మా" అనుశ్రుతిలో ధారణకారణమువల్ల గూడ దహరాకాశము పరమాత్మయే. "ఏష భూతపాలః" పరమాత్మభూతములను పాలించు సేతువు. అందరినీ ధరించువాడు. లోకములను ధరించువాడు అను మహిమ పైశ్రుతిలో చెప్పిరి. 'ధృతి' ధరించుట పరమాత్మదే.

దహరాకాశమును నిర్దేశించి  "స సేతుర్విధృతిరేషాం లోకానామసంభేధాయ" అనిరి. (ఛాం8.4.11) 'ఈ దహరాకాశమే సర్వలోకములను క్రమముగా నడుపునట్టి సేతువు అనగా ధరించునట్టి చైతన్యము' ఈశ్రుతిలో ధృతికారణమువల్ల బ్రహ్మమే దహరాకాశము. "ఏష పరమేశ్వర, ఏష భూతాధిపతిరేష భూతపాల ఏషసేతుర్విధరణ ఏషాం లోకానామసంభేదాయ"  'ఈ పరమేశ్వరుడే సర్వనియామకుడు, సర్వభూతములకు నధిపతి, సర్వభుతములను పరిపాలించువాడు, సర్వలోకములను క్రమముగా నడుపునట్టి సేతువు, సర్వమును ధరించువాడు' అనుకారణముల వలన దహరాకాశము బ్రహ్మమే.

80. ప్రసిద్ధేశ్చ (1.3.17.)

సూత్రార్థము:- 'ప్రసిద్ధ ఆకాశమే నామరూపముల నిర్మాణము చేయునది'  ఈశ్రుతిలో ఆకాశబ్దము పరమాత్మయందే రూఢి. అందువల్ల దహరాకాశము పరమాత్మయే.
లోకరూఢిని అపేక్షించి శ్రౌతరూఢి బలీయము. "ఆకాశో వై నామ నామరూపయోర్నిర్వహితా" (ఛాం8.1.4) 'శ్రుతులలో ప్రసిద్ధమైన ఆకాశము పేరుగల ఆత్మ నామరూపములను  నిర్మాణము చేయుచున్నది'. "సర్వాణి హ వా ఇమాని భూతాని ఆకాశాదేవ సముత్పద్యన్తే" (ఛాం.1.9.1) 'ఈ భూతములన్నియూ  ఆకాశమునుండియే ఉత్పన్నమైనవి' ఈ పైరెండు శ్రుతులలో మరియు ఇత్యాది శ్రుతులలో శ్రౌతరూడి బలవత్తరమైనందున దహరాకాశము పరమాత్మయందే ప్రసిద్ధము. కాన పరమాత్మయే దహరాకాశము భూతాకాశము కాదని సిద్ధమైనది.
దహరాకాశము భూతాకాశము కానిచో ప్రత్యగాత్మ అనిచెప్పుటకు వీలగునుకదా? అనిన

81. ఇతరపరామర్శాత్స ఇతిచేన్నాసమ్భవాత్. (1.3.18.)

సూత్రార్థము:- "ఏషసంప్రసాదః" అను శ్రుతిద్వారా జీవపరామర్శ చేయుచున్నారు. కాన జీవుడు దహరాకాశ శబ్దార్థము, అనిచెప్పుట సరికాదు. ఆకాశములో దహరశబ్దమును తులనాత్మకముగా చెప్పుట, పాపరాహిత్యము అను ధర్మములు జీవునిలో సంభవములుగావు.

వాక్య శేషబలముద్వారా దహరాకాశము పరమాత్మయని చెప్పినట్లే ఈ క్రింది శ్రుతిలో వాక్యశేషము ద్వారా జీవుని చెప్పవచ్చునుగదా. "అథ ఏష సంప్రసాదో అస్మాచ్ఛరిరాత్సముత్థాయ" (ఛాం.8.3.4) 'ఈ శరిరాభిమానము వదిలి అనగా ఈశరిరమునుండి పైకి లేచి సుషుప్తిలో సంప్రసాద (సమ్యక్ ప్రసీదతి ఇతి సంప్రసాదః) యుక్త మగును. సుషుప్తిలో ఆనందమును అనుభవించును. ఈసంప్రసాద శబ్దమువల్ల జీవుడు దహరాకాశమనిన అట్లనుట సరికాదు. అసంభవము. జీవునిలో ఆకాశ ఉపమాత్వము, పాపరిహిత్యము మొదలగు ధర్మములు అసంభవము. అందువల్ల దహరాకాశము పరబ్రహ్మమే. చెప్పిన అసంభవహేతువు అసిద్ధమను శంకకు సమాధానము ఈముందు సూత్రము.

82. ఉత్తరాచ్చేదావిర్భూతస్వరూపస్తు. (1.3.19.)

సూత్రార్థము:- కన్నులలో కనిపించు పురుషుడు ఆత్మ అని ప్రజాపతి ఉపదేశము. జీవునిలో పాపరాహిత్య ధర్మము చెప్పబడినది. అందువల్ల దహరాకాశము జీవుడే అనిన, అది సరికాదు. బ్రహ్మభూతమైన జీవునియొక్క పరమార్థ-స్వరూపము వాక్య శేషములో చెప్పెదనెను కాని జీవధర్మములు గల జీవుని చెప్పదలంచలేదు ప్రజాపతి. కాన దహరాకాశము జీవుడు కాదు కాని బ్రహ్మమే.

"య ఆత్మా అపహతపాప్మ" 'ఈ ఆత్మపాపరహితము అని ప్రతిజ్ఞచేసి ప్రజాపతి' "య ఏషో అక్షిణి పురుషో దృష్యతే ఏష ఆత్మా" (ఛాం.8.7.4) 'నేత్రములలో కనిపించు పురుషుడు ఆత్మ' అని జాగ్రదవస్థలో జీవుని పాపరాహిత్యాది ధర్మములు సంభవమగుటవలన జీవుడే దహరాకాశ పద వాచ్యమనిన? దానికి సమాధానము.

"ఆవిర్భూతస్వరూపస్తు" శ్రవణాదులద్వారా హృదయములో ఆవిర్భూత స్వరుపమే జీవపద వాచ్యము. సూత్రములో నున్న 'తు' శబ్దము జీవుని యొక్క ఆశంక తొలగించుటకు. జీవునిలో పారమార్థికమైన పరమార్థలక్షణముగల స్వరూపము ఆవిర్భూతమగుటవలన జీవుని చెప్పవచ్చును, కాని జీవత్వరూపముతో జీవుని చెప్పుట అభీష్టముకాదు. "పరం జ్యోతిరుపసంపద్య స్వేనరూపేణాభినిష్పద్వతే" (ఛాం.8.12.2) 'పరంజ్యోతిని పొంది తనస్వరూపముతో అభివ్యక్తమగును' అని ఉపసంహారము కానవచ్చు చున్నది. వివేకము, విజ్ఞానము లేనప్పుడు అనభివ్యక్త స్వరూపము కాని వివేకము, విజ్ఞానము కలిగినప్పుడు అభివ్యక్త స్వరూపముగల జీవుని బ్రహ్మత్వముగా చెప్పుటచే అపహతపాప్మత్వాది సంభవమైనను జీవత్వమున్నప్పుడు అపహతపాప్మత్వాది బ్రహ్మ లక్షణములు సంభవము గావు గనుక పూర్వసూత్రములో చెప్పిన హేతువులు (ఆకాశ ఉపమాత్వము, పాపరాహిత్యము) అసంభవము గాదు లేక అసిద్ధముగాదు కాన దహరాకాశము పరమాత్మయే.

83. అన్వార్థశ్చ పరామర్శః. (1.3.20.)

సూత్రార్థము:- “య ఏష సంప్రసాదః” అను దహర వాక్య శేషములో జీవపరామర్శ వ్యర్థమగును అనిన దానికి ఈసూత్రము ద్వారా సమాధానము చెప్పిరి.

“స్వేన రూపేణాభినిష్పద్యతే” తన యొక్క నిజరూపముతో జీవుడు దేనిని పొందుదుడో అది పరమాత్మయే. పాపరహితుడు, పరమాత్మను పొదుటచే బ్రహ్మవేత్తలు జీవపరామర్శ చెప్పిరి. పూర్వ పరామర్శ ఉపాసనకొరకు శ్రుతిలో చెప్పిరి, కాని జీవుని అర్థము ప్రతిపాదించుటకుకాదు. కాన దహరాకాశము పరమాత్మయే.

84. అల్పశ్రుతేరితి చేత్తదుక్తమ్. (1.3.21.)

సూత్రార్థము:- “దహరో అస్మిన్” ఈ హృదయములోపల చిన్న అకాశమున్నది.అందువల్ల దహరాకాశము పరమాత్మ కాదు, కాని జీవుడు. అట్లనుట సరికాదు. దానికి సమాధానము ‘అర్భకౌకస్త్వాత్’(1.2.7) అను సూత్రములో చెప్పితిమి. అందువల్ల దహరాకాశము పరమాత్మయే.

“దహరోఽస్మిన్నన్తరాకాశః” ఇచట ‘హృదయము లోపల చిన్న ఆకాశమున్నది’ అని అల్పాకాశము వినబడుచున్నది. అది పరమేశ్వరునియందు యుక్తి యుక్తముకాదు. ఇనుప చీల కొన భాగము ఆరాగ్రమందురు. జీవుని ఆరాగ్ర మాత్రత్వ ఉపదేశము వల్ల అల్పత్వము జీవుని యందు సంభవము. అందువల్ల దహరాకాశము జీవుడే పరమేశ్వరుడు కాదు అనిన దీనికి సమాధానము “అర్భకౌకస్త్వాత్తద్వ్యపదేశాచ్చ నేతి చేన్న, నిచాయ్యత్వాదేవం వ్యోమవచ్చ” (1.2.7) అను సూత్రములో చెప్పితిమి. అందువల్ల దహరాకాశము పరమాత్మయే.

# 24. ప్రాజాపత్యవిద్యాధికరణము

Note:- This following one is Extra Adhikaranam found only in the publication of kailash ashrama but not in other publications, that is why no sutras in this adhikarana.

సంగతి:- పూర్వాధికరణములో చెప్పిన కారణము అసంభవమను ఆక్షేపమును చెప్పి ఈ అధికరణములో దానికి సమాధానము చెప్పిరి. కావున ప్రసంగ సంగతి.

విషయము:- “య ఆత్మాఽపహతపాప్మ” (ఛాం. 8.7.1.) ‘ఈ ఆత్మ పాపరహితము’. ప్రజాపతి యొక్క ఈ వాక్యమే ఈ అధికరణమునకు విచారణీయ విషయము.

సంశయము:- జగ్రదాది అవస్థలలో నున్న జీవుని పాపరహితుడని చెప్పిరా లేక బ్రహ్మను చెప్పిరా? అని సంశయము.

పూర్వపక్షము:-జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు గల జీవుని నిరూపించిరనుటయే ఉచితము.

సిద్ధాన్తము:- “య ఆత్మా అపహతాపాప్మా” ఈప్రసంగములో ఆఖరిలో “స ఉత్తమః పురుషః” అనిరి. అందువల్ల

ఈశ్వరుడే ఈ ప్రసంగములో ప్రతిపాద్య విషయమని నిశ్చయమగుచున్నది. జీవుని యొక్క నిజస్వరూపమును బోధించుటకు జాగ్రదాది అవస్థల వర్ణన చేయబడినది.

వైయాసికన్యాయమాల:

యః ప్రజాపతివిద్యాయాం స కిం జీవోఽథవేశ్వరః। జాగ్రత్స్వప్నసుషుప్త్యోక్తేస్తద్వాన్జీవ ఇహోచితః॥

ఆత్మాఽఽపహతపాప్మేతి ప్రక్రమ్యాన్తే స ఉత్తమః। పుమానిత్యుక్త ఈశోఽత్ర జాగ్రదాద్యవబుద్ధయే॥

ఇంద్ర వీరోచనులకు ప్రజాపతి చేసిన ఉపదేశములో జీవుని గురించి చెప్పిరా? లేక ఈశ్వరుని ఉపదేశమా? జీవుని యొక్క జాగ్రత్స్వప్న సుషుప్తి అవస్థలు చెప్పుట వలన జీవుని ఉపదేశమనుట ఉచితము. దానికి సమాధానము. "ఆత్మాఽపహతపాప్మా" అని ఉపక్రమించి, ఉపసంహారములో "ఉత్తమ పురుషః" అని చెప్పుటవలన ఉపదేశము ఈశ్వరునిదే. జాగ్రదాద్యవస్థలు శాఖాచంద్రన్యాయము ద్వారా పరమాత్మ బోధకు ఉపయోగములు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

దహరవిద్య తరువాత ప్రజాపతివిద్యలో ఇంద్ర విరోచన ప్రజాపతుల సంవాదము వినబడు చున్నది. "య ఏషో అక్షిణి పురుషో దృష్యతే ఏష ఆత్మేతి హోవాచ" 'ఈ కన్నులలో నున్న పురుషుడే ఆత్మ' అనుచోట జీవాత్మను చెప్పిరి. ఎందులకనగా, అవస్థాత్రయములు చెప్పుటవలన. "అక్షిణి పురుషః" అన్నచోట 'జాగరణోపన్యాశము' "య ఏష స్వప్నే మహిమానశ్చరతి" (ఛాం. 8.10.1) అను శ్రుతిలో 'స్వప్నావస్థలో మహిమలు అనుభవించు చున్నాడు'. "సుప్తః సమస్తః సంప్రసన్నః స్వప్నం న విజానాతి" అనగా 'నిద్రలో సంపూర్ణముగా ప్రసన్నుడై స్వప్నములు తెలిసికొనుటలేదు'. అని సషుప్తి అవస్థను వర్ణించిరి. ఈ విధముగా అవస్థాత్రయములు చెప్పుటచే ఈ అవస్థలుగల జీవుని ఉపదేశమని చెప్పుట ఉచితము. ఈశ్వరునుయందు అవస్థలు లేవుగదా.

దీనికి సమాధానము. ప్రజాపతి ఈశ్వరునే ఉపదేశించెనని చెప్పవలయును. ఎందులకనగా "య ఆత్మా అపహతాపాప్మా విజరో విమృత్యుః" అన్నచోట 'ఈ ఆత్మ పాపరహితము, జరామృత్యువులు లేనిది' అని పరమాత్మ ఉపదేశము ఉపక్రమించి "స ఉత్తమః పురుషః" అతడు ఉత్తమపురుషుడు అని పరమాత్మతో ఉపదేశము ఉపసంహారము గావించిరి.

ఈ విధముగా చెప్పిన జీవుని జాగ్రదాది అవస్థల వర్ణణ వ్యర్థమగుననిన సరికాదు, శఖాచంద్రునిన్యాయము ద్వారా పరమాత్మ బోధ చేయుటకు ఉపయోగముగాన ఈశ్వరోపదేశమే ప్రజాపాతి విద్య.

## 25. అనుకృత్యధికరణము.

సంగతి:- వెనుకటి అధికారణములో "పరం జ్యోతిరుపసంపద్య" అనగా 'పరమజ్యోతిని పొంది' అను వాక్య శేషములో దహరాకాశార్థము బ్రహ్మమని చెప్పిరి. జ్యోతిప్రసంగమువల్ల "న తత్ర సూర్యో భాతి న చంద్రతారకం నేమా విద్యుతో భాన్తి కుతోఽయమగ్నిః" 'అచటసూర్యుడుకాని,చంద్రుడుకాని, నక్షత్రములుకాని, మెఱుపులుగాని,

అగ్నికానిప్రకాశింపదు' (ముం.2.2.10). ఈ వాక్యము విచరణీయమగును. ఇచట ప్రసంగ సంగతి.

విషయము:- పైన చెప్పిన ముండక వాక్యము విచారణీయము.

సంశయము:- సూర్యాది సంపూర్ణ జగత్తును ప్రకాశింపజేయు తేజస్సు ఏదో ఒక ధాతు విశేషమా? పరమాత్మయా? అని సంశయము.

పూర్వపక్షము:- అధికమగు తేజస్సుద్వారా అల్పములగు తేజస్సులు తిరస్కరింపబడుట లోకములో చూడబడు చున్నది. కాన తేజస్సు అను శబ్దము ద్వారా ఏదో ఒక ధాతు విశేషము చెప్పిరి.

సిద్ధాన్తము:- జగత్తుని ప్రకాశింపజేయు సూర్యదుల తేజస్సు బ్రహ్మమే. ఎందులకనగా దాని అనుకరణము మిగిలిన అన్ని తేజస్సులు చేయుచున్నవి. బ్రహ్మాతిరిక్తము, సూర్యనితో సమానమైన మరియొక తేజస్సు ఏదీ ప్రసిద్ధము గాదు.

ఒకవేళ ప్రసిద్ధమైన అది సూర్యాదులను ప్రకాశించును అనుకొన వచ్చును. అందువల్ల చైతన్య ఆత్మయే సూర్యదులకు ప్రకాశమిచ్చునది, కాని సూర్యాదులు దానిని ప్రకాశింపజేయలేరు. ఆబ్రహ్మ తేజస్సు ద్వారానే సూర్యదులు ప్రకాశించుచున్నవి. "తస్య భాసా సర్వమిదం విభాతి" (క.2.2.15) ఆ బ్రహ్మ ప్రకాశమువల్ల ఇదంతయూ ప్రకాశించుచున్నది. ప్రకాశాప్రకాశరూపమైన సంపూర్ణజగత్తును ప్రకాశింపజేయుట చైతన్య ధర్మమే. "యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్" (గీత.15.12) 'ఆదిత్యునిలో నున్న తేజస్సు సంపూర్ణజగత్తును ప్రకాశింపజేయు చున్నది. ఈ స్మృతి వాక్యము ద్వారా గూడా సూర్యాది సమస్తతేజస్సులకు తేజస్సు బ్రహ్మచైతన్యమని సిద్ధమగు చున్నది.

వైయాసికన్యాయమాల:

63. న తత్ర సూర్యో భాతీతి తేజోఽన్తరముతాత్ర చిత్। తేజోఽభిభావకత్వేన తేజన్తరమిదం మహత్॥

64. చిత్స్యాత్సూర్యాది భాస్యత్వాత్తాదృక్తేజోఽప్రసిద్ధితః। సర్వస్మాత్పురతో భానత్తద్భాసా చాన్యభాసనాత్॥

"న తత్ర సూర్యో భాతి న చన్ద్రతారకం" ఈశ్రుతిలో చెప్పిన జగద్భాసకత్వము సూర్యదులకన్న భిన్నమైన తేజోపదార్థమా లేక బ్రహ్మమా? సూర్యాది తేజస్సులు మందగించుటచే ఆతేజస్సు సూర్యాదులకన్న భిన్నమైన విపులతేజస్సు అని తెలియుచున్నది. దీనికి సమాధానము. సూర్యాదులద్వారా ప్రకాశించకపోవుటచే సూర్యుని తేజస్సును మందగించు వేరొక తేజస్సు ప్రసిద్ధము కాకపోవుటవలన, అందరికన్నా ముందు ప్రకాశించి, అన్నింటినీ తన ప్రకాశముచే ప్రకాశింపజేయు కారణమువల్ల చెప్పిన శ్రుతిలో జగత్తును ప్రకాశింపజేయునది చైతన్య స్వరూపమైన బ్రహ్మమే.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ముండకోపనిషత్తులో వినిపించుచున్నది. "న తత్ర సూర్యో భాతి న చన్ద్రతారకం నేమా విద్యుతో భాన్తి కుతోఽయమగ్నిః। తమేవ భాన్తమనుభాతి సర్వం తస్య భాసా సర్వమిదం విభాతి" (ము.2.2.10) 'అచట

సూర్యుడుకాని, చంద్రుడుకాని, నక్షత్రములుకాని, మెఱుపులుకాని, అగ్నికాని, ప్రకాశింపదు, ఆతడు ప్రకాశించుచుండ నతనితోగూడియే సర్వ పదార్థములు ప్రకాశించును. ఆతని ప్రకాశముచేతనే ఈ కానవచ్చు సమస్తంబును ప్రకాశించును' పూర్వము చెప్పిన జ్యోతులకు జ్యోతిని ప్రకాశింపజేయలేరు. కాని దాని ప్రకాశమును అనుసరించి సంపూర్ణజగత్తు ప్రకాశించుచున్నది. ప్రకాశించు సమయమున జగత్తు స్వతంత్రముగా ప్రకాశించలేదు. మరి ఏవిధముగా అనిన ప్రకాశింపజేయు పదార్థముద్వారా ఇదంతయు ప్రకాశించును. ఈ వాక్యములో వినబడు జగత్తును ప్రకాశింపజేయునది సూర్యాదుల సదృశమైన అన్య తేజస్సా లేక చైతన్యమా అని సంశయము. 'తేజోన్తరమ్' అని పూర్వపక్షము. ఎందులకనగా సూర్యదుల తేజస్సును తిరస్కరించుటవలన లేక తక్కువ చేయుటవలన. లోకమున అధిక తేజస్సు అల్పమగు తేజస్సును తిరస్కరించు చున్నది. ఉదాహరణమునకు సూర్యుని సన్నిధలో దీపము. సూర్యాదులను తిరస్కరించునది సూర్యాదులకన్నా గొప్పతేజస్సు అయి ఉండవలెను.

దానికి సమాధానము. సూర్యాదులను ప్రకాశింపజేయునది చైతన్యమే. ఎందులకు? సూర్యాదుల తేజస్సును తిరస్కరించు వేరొక గొప్పతేజస్స అప్రసిద్ధమగుటవలన. కాని "తమేవ భాన్తం అనుభాతి సర్వమ్" సర్వతేజస్సులు ఈ శ్రుత్యుక్త వస్తువునను సరించి ప్రకాశించుచున్నవి. అన్నింటి వెనుకనుండి ప్రకాశింపజేయునది చైతన్య ధర్మమే. ఆలాగుననే "తస్య భసా సర్వమిదం విభాతి" అని ప్రకాశమువల్ల ఇదంతయూ ప్రకాశించుచున్నది. ప్రకాశములేని సర్వ జగత్తుని ప్రకాశింపజేయునది ప్రకాశముతో గూడిన చైతన్య ధర్మమే. ఈ వాక్యములో చైతన్యమునే ప్రతిపాదించిరి.

## 85. అనుకృతేస్తస్య చ. (1.3.22.)

సూత్రార్థము: "న తత్ర సూర్యో భాతి" ఇత్యాది శ్రుతులలో చెప్పిన వస్తువు తేజో విశేషముకాదు కాని బ్రహ్మమే ఎందులకనగా శ్రుతులలో దాని ప్రకాశమునే అన్నీ అనుకరించుచున్నవి, మరియు దాని ప్రకాశము ద్వారానే సంపూర్ణ జగత్తు ప్రకాశించుచున్నది అని వినబడు చున్నది.

ప్రబలమైన తేజస్సు ద్వారా దుర్బలమైన తేజస్సు తిరస్కరించబడుటచే 'విశేషమైన తేజోధాతువు' అని పూర్వపక్షము. సిద్ధాన్తి సూర్యాదుల సంపూర్ణ జగత్తును ప్రకాశింపజేయునది బ్రహ్మచైతన్యమే అనును. ఎందులకు? అనుకరణమువలన "తమేవ భాన్తమనుభాతి సర్వమ్" (ము.2.2.10) పరమాత్మ తేజస్సునను సరించి సూర్యాదులు సర్వము ప్రకాశించుచున్నవి. ఆవిధముగనే "భారూపః సత్యసంకల్పః" 'ప్రకాశస్వరూపుడు సత్యసంకల్పుడు' అను ఛాందోగ్యశ్రుతిలోగూడ చైతన్య ఆత్మనే ప్రకాశస్వరూపినిగా చెప్పిరి. ఆచైతన్య ఆత్మను సూర్యాదులు అనుకరణము గావించుచున్నవి కాని విశేష తేజోధాతువును కాదు. దీపము వేరొక దీపమును ప్రకాశించుట కానవచ్చుటలేదు. అట్లనిన సూర్యాదులు స్వయముగా ప్రకాశించుచున్నవి అను మతిని తొలగించుచున్నది శ్రుతి "తస్య భసా సర్వమిదం విభాతి" 'దాని ప్రకాశమువల్ల సర్వము ప్రకాశించుచున్నది' అని

భోధించుచూ. ప్రబల తేజస్సుద్వారా అని చెప్పుట అసంభవము, ఏలనన ప్రబల తేజస్సు దుర్బల తేజస్సును తిరస్కరించినదని చెప్పిన దుర్బలమైన సూర్యదుల ప్రకాశము గోచరముకాదు. అదే మంత్రములో చెప్పిన 'తత్ర' పదము ద్వారా దేనిని స్వర్గ భూమ్యాదులకు ఆధారమనిరో దానిని ప్రకృత ప్రసంగములోనున్న బ్రహ్మమును పరామర్శించిరి. దానియొక్క సత్తా స్ఫూర్తి వల్లనే నామరూపక్రియాకారక ఫలజాతములు అభివ్యక్తమగుచున్నవి. అందువల్ల చైతన్య స్వయంజ్యోతి సూర్యదులను ప్రకాశింపజేయుచున్నది.కాని లౌకిక తేజస్సుకాదనునది సిద్ధమైనది.

86. అపి చ స్మర్యతే. (1.3.23.)

సూత్రార్థము:- "న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః" (గీతా.15.6) 'ఓ అర్జునా! నా దివ్యతేజమును సూర్యచన్ద్రాగ్నులు ప్రకాశింపజాలరు'. "యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్" 'సూర్యచన్ద్రాగ్నుల యందు నిలిచి యే తేజస్సు సర్వప్రపంచమును ప్రకాశింపజేయుచున్నదో' అని భగవద్గీతలో గూడ చెప్పిన రూపము బ్రహ్మరూపమే.
చైతన్య ఆత్మయే సూర్యదులను ప్రకాశింపజేయుచున్నది కాని సూర్యాదులు దానిని ప్రకాశింపజేయజాలరు అను విషయము గీతలో గూడ చెప్పిరి.

# 26. ప్రమితాధికరణము.

సంగతి:- పూర్వాధికరణములో నిర్ణయించిన విషయమును దృష్టాన్తముగాచేసి ఈ అధికరణము యొక్కఉత్థాపన చేసినందున దీనికి దృష్టాన్తసంగతి.
విషయము:- "అంగుష్ఠమాత్రః పురుషో మధ్యే ఆత్మని తిష్ఠతి" "అంగుష్ఠమాత్ర పురుషో జ్యోతిరివాధూమకః। ఈశానో భూతభవ్యస్య స ఏవాద్య స ఉ శ్వః" (క.2.4.12-13) 'అంగుష్ఠమాత్రుడగు పురుషుడు ఆత్మ మధ్యమున నున్నాడు'.
'అంగుష్ఠ మాత్ర పురుషుడు పొగలేని మంటవలే ప్రకాశించు చున్నాడు. అతడే భూతభవిష్యత్తులకు అధిపతియై యిప్పటికిని రేపటికిని (సర్వకాలములందు) ఏకరూపములోనున్నాడు'. అను వాక్యము ఈఅధికరణములోని విచరణీయ విషయము.
సంశయము:- అంగుష్టమాత్ర పురుషుడు జీవుడా లేక ఈశ్వరుడా అని సంశయము.
పూర్వ పక్షము:- అల్ప ప్రమాణము శరీరమధ్యలో నుండుటనుచూసి అంగుష్ఠమాత్ర పురుషుడు జీవుడనవలెను.
సిద్ధాన్తము:- భూత, భవిష్యత్, వర్తమానకాలములకు శాశకుడు జీవుడు కాలేడు. కాని ఈశ్వరుడే అగును. శరీరమునకు మధ్యలో హృదయమందు గూడ ఈశ్వరునియొక్క ఉపలబ్ధి కలుగును. ఉపలబ్ధిని దృష్టిలోనుంచుకొని

ఈశ్వరునికి అల్ప పరిణామము చెప్పిరి, శరీరమునకు మధ్యలోనున్న హృదయమను గుహలో ఆ ఈశ్వరుని భావించవచ్చును.

వైయాసికన్యాయమాల:

65. అంగుష్టమాత్రో జీవః స్యాదీశో వాఽల్పప్రమాణతః। దేహమధ్యే స్థితశ్చైవ జీవో భవితుమర్హతి॥

66. భుతభవ్యేశతా జీవే నాస్త్యతోఽసావిహేశ్వరః। స్థితిప్రమాణే ఈశేఽపి స్తో హృద్యస్యోపలబ్ధితః॥

"అంగుష్ఠమాత్ర పురుషో మధ్య ఆత్మని తిష్ఠతి" ఈశ్రుతిలో అంగుష్ఠమాత్ర పురుషుడు జీవుడా లేక ఈశ్వరుడా? అంగుష్ఠమువలే చిన్నప్రమాణము గలవాడగుటచే మరియు దేహమధ్యములో నుండుటచే చెప్పిన పురుషుడు జీవుడే అగును. అనుట సరిగాదు. భూతభవిష్యత్తులకు జీవుడు శాశకుడుగాజాలడు. అందువల్ల శాశకుడు ఈశ్వరుడే. హృదయ దేశములో ఈశ్వరిని ఉపలబ్ధి అగును గాన హృదయములో స్థితి, అంగుష్ఠప్రమాణము ఈశ్వరునిలో సంభవము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

పై శ్రుతివాక్యములో ఈశ్వరునే చెప్పిరి. "అంగుష్ఠమాత్రః పురుషో మధ్య ఆత్మని తిష్ఠతి। ఈశానో భూతభవ్యస్య న తతో విజుగుప్సతే" (క.2.4.2) 'అంగుష్ఠమాత్ర పురుషుడు ఆత్మ (శరీరము)మధ్యమున నున్నాడు. భూతభవిష్యత్తులను శాశించువాడు. తత్వజ్ఞాని దానిని తెలిసికొని తన సురక్ష చింతన చేయడు'.

అంగుష్ఠప్రమాణము గలవాడు జీవుడు, ఎందులకనగా అల్ప ప్రమాణము చెప్పుటవలననూ "మధ్య ఆత్మని తిష్ఠతి" అని దేహ మధ్యదేశ స్థితి చెప్పుటవలననూ. అను పూర్వపక్షమునకు జవాబు. పరమాత్మయే అంగుష్ఠమాత్రుడు, ఏలనన "ఈశానో భూతభవ్యస్య" భూతభవిష్యత్తులను శాశించువాడు. శాశకత్వము జీవుని యందు లేదు. జీవుడు శాశించబడువాడు. అల్ప ప్రమాణము, దేహ మధ్యస్థితి పరమాత్మకు గూడ సంభవము. హృదయపుండరీకములో పరమాత్మ ఉపలబ్ధి అనగా అనుభవము అగుటవలన. దానినపేక్షించియే అల్ప ప్రమాణము, దేహమధ్యస్థితి చెప్పిరి. అందువల్ల పరమేశ్వరుడే అంగుష్ఠమాత్రుడు.

### 87. శబ్దాదేవప్రమితః. (1.3.24.)

సూత్రార్థము:- "అంగుష్ఠమాత్రః" అనుశ్రుతిలో అంగుష్ఠమాత్ర పురుషుడు జీవ భిన్నమైన పరమాత్మయే. ఏలనన శ్రుతిలో అందరిని శాశించువాడు అను శబ్దము వచ్చుటవలన.

ఉపాధి ఉండుటవలన అంగుష్ఠ మాత్రుడు జీవుడని పూర్వపక్షము. సిద్ధాన్తి అనునది అంగుష్ఠమాత్ర పరిమాణము ఉన్నవాడు పరమాత్మయే. ఎందులకనగా 'శబ్దాత్' అనగా శ్రుతి ఉపదేశమువల్ల. శ్రుతిలో "ఈశానో భూతభవ్యస్య" భూత భవిష్యత్ వర్తమానములకు శాశకుడనిరి. నిరంకుశ ఐశ్వర్యము వినబడుటవలన. అంగుష్ఠమాత్రమను జీవచిహ్నమను హేతువు ఉందనిన అది సరికాదు. హేతు, శ్రుతులలో శ్రుతియే బలమైనది. అంగుష్ఠమాత్రమున్న

జీవుని అనువదించి బ్రహ్మభోధ కొరకు పరమాత్మను గూడ అంగుష్ఠమాత్రమని చెప్పుట యుక్తియుక్తమే. "అన్యత్ర ధర్మాదన్యత్రాఽధర్మాదన్యత్రాఽస్మాత్కృతాకృతాత్" 'ఏది ధర్మ అధర్మములకు, కార్య కారణములకు అతీతమో' అని ప్రకృత ప్రసంగము బ్రహ్మను చెప్పుచూ దానినే అంగుష్ఠమాత్రమని చెప్పిరి. మరియు 'ఏతద్వైతత్' ఇది అదే తత్వము దేనిని గురించి నీవు అడిగితివో. ఈశ్రుతులను విచారించిననూ పరమాత్మ ప్రసంగమేనని తెలియుచున్నది. పరమార్థ దృష్టిలో జీవుడు సర్వవ్యాపకమైన బ్రహ్మ స్వరూపుడైన వానిని అంగుష్ఠమాత్రమని ఎట్లు చెప్పగలరను సంశయమునకు ఈ క్రింది సూత్రముద్వారా సమాధానముచెప్పిరి.

88. హృద్యపేక్షయా తు మనుష్యాధికారత్వాత్. (1.3.25.)

సూత్రార్థము:- శాస్త్రమందు మనుష్యునికే అధికారము గలదు. మనుష్యుల హృదయదేశము అంగుష్ఠమాత్ర పరిణామముకలది. ఆహృదయములో నుండుటవలన హృదయాకాశమును అపేక్షించి పరమేశ్వరుని అంగుష్ఠమాత్రమని చెప్పిరి.
సర్వవ్యాపకుడైనను పరమాత్మ హృదయస్థానమునపేక్షించి అంగుష్ఠమాత్రమని చెప్పుట ఉచితము. బొంగు గడలోని పర్వములలో నుండు ఆకాశమును 'అరత్ని' పరిమాణమాకాశమని చెప్పినట్లు. ఇచట పర్వమనగా వేణ్వాది గ్రంధిః. అరత్ని అనగా చాచిన చిటికెన వ్రేలుగల పిడికిలితో గూడిన మూర. అంగుష్ఠమాత్ర పరిమాణము మనుష్యాధికారము వలన చెప్పబడినది. పరబ్రహ్మ అంగుష్ఠమాత్రమనిన అవిరుద్ధము మరియు పరమాత్మను చెప్పువాక్యమిది.

## 27. దేవతాధికరణము.

సంగతి:- పూర్వాధికరణములో బ్రహ్మవిద్యయందు మనుష్యులకు అధికారము కలదని చెప్పిరి. మనుష్యులకైన వేరైన దేవతలకు ఆ విద్యలో అధికారము లేదని చెప్పవచ్చును. ఈ విధముగా ఇచట ఆక్షేప సంగతి. అధికారప్రసంగములో మనుష్యులవలే దేవతలకు అధికారము వున్నదని చెప్పుటవలన ఇచట ప్రసంగసంగతి అనిగూడ చెప్పవచ్చును.
విషయము:- "ఇంద్రో హ వై దేవానామభిప్రవవ్రాజ" (ఛాం.8.7.2) "తద్యో యో దేవానాం ప్రత్యబుధ్యత స ఏవ తదభవత్" (బృ.1.4.10) 'దేవతలలో ఇంద్రుడు బ్రహ్మ విద్య కొరకు ప్రజాపతి వద్దకు వెళ్ళెను' 'దేవతలలో ఎవరెవరు బ్రహ్మను తెలిసికొనిరో వారు బ్రహ్మ స్వరూపులే అయిరి'. ఈప్రకారముగాగల వాక్యములు ఇచట విచారణీయములు.

సంశయము:- దేవతలకు బ్రహ్మ విద్య యందు అధికారము కలదా? లేదా? అని సంశయము.
పూర్వపక్షము:- దేవతలు శరీరధారులు గారు కనుక వారికి శక్తి లేదు. అందువల్ల దేవతలకు బ్రహ్మవిద్యలో అధికారములేదు.
సిద్ధాన్తము:- విరోధములేని అర్థవాదమంత్రములద్వారా దేవతలు శరీరధారులని నిశ్చయమగు చున్నది.

మూలకారణముతో దుఃఖములను తొలగించుకొనుటకు మరియు పరమానంద ప్రాప్తికి ఇచ్ఛ దేవతలకు గూడ సులభమే. శరీరము సామర్థ్యము సిద్ధమగుట వలన దేవతలకు గూడ బ్రహ్మవిద్య యందు అధికారము కలదు.

వైయసికన్యాయమాలా:

67. నాధిక్రియస్తే విద్యాయాం దేవాః కింవాఽధికారిణః। విదేహత్వేన సామర్థ్యహానేర్నైషామధిక్రియా॥

68. అవిరుద్ధార్థవాదాది మంత్రాదేర్దేహసత్వతః। అర్థిత్వాదేశ్చ సౌలభ్యాద్దేవాద్యా అధికారిణః॥

బ్రహ్మవిద్యయందు దేవతలకధికారమున్నదా? లేదా? శరీరము సామర్థ్యము లేనందున దేవతలకు బ్రహ్మవిద్య-యందు అధికారములేదు అను పూర్వపక్షమునకు సమాధానము. పరోక్షప్రమాణముద్వారా విరోధములేని స్తుతి వాక్యములద్వారా మరియు మంత్రాదులద్వారా దేవతలు శరీరధారులని తెలియుచున్నది. జ్ఞాన జిజ్ఞాస గూడ సులభమే. అందువల్ల దేవతలకు బ్రహ్మవిద్యలో అధికారము కలదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

బృహదారణ్యకోపనిషత్తులోని మూడవ అధ్యాయములో నున్న శ్రుతి "తద్యో యో దేవానాం ప్రత్యబుధ్యత స ఏవ తదభవత్, తథర్షీణామ్" 'దేవతలలో ఎవరెవరు బ్రహ్మమును తెలిసికొనిరో వారు బ్రహ్మ స్వరూపులే అయిరి, ఋషులలోగూడ అదేవిధముగా బ్రహ్మమును తెలిసికొనినవారు బ్రహ్మస్వరూపులైరి' (బృ.1.4.10). అచట దేవతలలో జ్ఞానార్థిత్వము లేదని పూర్వ పక్షము. ఏలనన "అర్థీ, సమర్థో, విద్వాన్శాస్త్రేణాపర్యదస్తః అధిక్రియతే" జ్ఞానపిపాసా, సామర్థ్యము, విద్వత్తా మరియు శాస్త్రముద్వారా నిషేధింపకుడుట అను లక్షణములు ఉన్నవారే జ్ఞానార్థులు. దేవతలకు శరీరము లేనందున పైన చెప్పిన అర్థిత్వాదులు లేనందున వారికి జ్ఞానాధికారము లేదు. అర్థవాదము, మంత్రములద్వారాదేవతలకు శరీరము కలదు కదా అనిన విధులతో ఏకవాక్యత్వమును పొందిన మంత్రాదులందు స్వార్థ తాత్పర్యము లేదు. ఈపూర్వపక్షమునకు సమాధానము.

అర్థవాదము మూడురకములు. గుణవాదము, అనువాదము, భూతార్థవాదము. "ఆదిత్యుడు యూపస్తంభము" "ధర్భముష్టి యజమానుడు" అనుచోట ప్రత్యక్ష విరోధమువలన ఆదిత్యునివలే యాగము నిర్వహించుటకు ఆదిత్యాది శబ్దములద్వారా గుణవాదము ఉపలక్షితము. "అగ్ని చలికి ఔషధము" వాయువు త్వరగావీచు దేవత" ఈ వాక్యములో ప్రమాణాంతరముద్వారా సిద్ధార్థమును అనువదించుటవలన అనువాదము. ఈ పైరెడింటిలో స్వార్థములో తాత్పర్యము లేకపోయిన లేక పోవుగాక. "ఇంద్రో వృత్రాయ వజ్రముదయచ్ఛత్" 'ఇంద్రుడు వృత్రాసురుని వజ్రముతో చంపెను'. ఇత్యాది వాక్యములలో ప్రత్యక్షాది ప్రమాణముద్వారా విరోధములేనందున అనువాదముకానందున భూతార్థవాద స్తుతిప్రమాణముద్వారా స్వార్థమును చెప్పు తాత్పర్యమును నిరాకరించుటకు శక్యముకాదు. భూతార్థవాదము పదైకవాక్యముల ద్వారా స్వార్థములో అవాన్తర తాత్పర్యమునుచెప్పి వాక్యైకవాక్యముల ద్వారా విధిలోమహత్తాత్పర్యమును ప్రతిపాదించును. మంత్రములలో గూడ ఇదేన్యాయము చెప్పవలయును. మంత్రార్థవాదముల బలముతో దేవతలకు శరీరమున్నదని నిర్ణయించుట వలన

శ్రవణాదులందు వారికి సామర్థ్యమున్నదనిగూడ నిశ్చయమయినది. అర్థితత్వము లేక జ్ఞాన జిజ్ఞాస ఐశ్వర్యము క్షీణించుట వలన మొక్షమునకు సాధనమైన బ్రహ్మ విద్యలోగూడ వారికి ప్రవృత్తి కలుగును.
శాస్త్ర జ్ఞానము ఉపనయనము లేకపోయినను స్వయంభాత వేదత్వము దేవతలకు కలదు. అందువల్ల దేవతలకు బ్రహ్మవిద్యాధికారము నివారించలేము. ఆదిత్యత్వాది విద్యాఫలము ప్రాప్తము. కనుక ఆదిత్యాది సగుణ ఉపాసనలో అధికారము లేకపోయినను నిర్గుణ బ్రహ్మవిద్యలో దేవతలకు అధికారముండనే ఉంది. గాన బ్రహ్మవిద్యలో దేవతలకు అధికారము గలదు.

89. తదుపర్యపి బాదరాయణః సంభవాత్ (1.3.26)

సూత్రార్ధము:- మనుష్యులకన్న శ్రేష్ఠమైన దేవతాదులయొక్క అధికారమువలన అర్థిత్వము సామర్థ్యము సంభవము. అందువల్ల వారు గూడ బ్రహ్మవిద్యకు అధికారులని అని బాదరాయణాచార్యుల మతము.

దేవాదులకు బ్రహ్మవిద్యలో అధికారములేదని పూర్వపక్షము. సిద్ధాన్తములో దేవాదులకు అధకారము బ్రహ్మవిద్యలో కలదని బాదరాయణాచార్యుల అభిప్రాయము. ఎందులకనిన సంభవముగనుక. మొక్షేచ్ఛ (అర్థిత్వము) దేవతాదులలో సంభవము. అర్థిత్వము వారిలో అనిత్యత్వ ఆలోచనవలన కలుగును. సామర్థ్యము వారిలో ఉండనే ఉంది. మంత్ర, అర్ధవాద, ఇతిహాస, పురాణ, లోకములద్వారా వారికి శరీరము కలదని వినిపించుచున్నది. పూర్వనుభవముద్వారా కలిగిన సంస్కారములవలన స్వయముగా సంపూర్ణ వేదార్థము వారికి ప్రకటమగును. బ్రహ్మవిద్యను పొందుటకు “ఏకశతం హ వై వర్షాణి మఘవన్ ప్రజాపతౌ బ్రహ్మచర్యమువాస” (ఛాం. 8.11.3) ‘నూటఒకటి సంవత్సరములు ఇంద్రుడు ప్రజాపతివద్దనండి బ్రహ్మచర్యము పాలించెను’. బ్రహ్మచర్యాశ్రమ పాలన దర్శనమువలన ఉపనయనము లేక పోయినను విద్యాధికారము తొలగదు. అంగుష్ఠమాత్రశ్రుతి స్వ స్వ అంగుష్ఠమునపేక్షించి చెప్పిరి. అందులకై దేవతలకు బ్రహ్మవిద్యలో అధికారమున్నది.

90. విరోధః కర్మణీతి చేన్నానేకప్రతిపత్తేర్దర్శనాత్. (1.3.27.)

సూత్రార్ధము:- దేవతలకు శరీరమున్న ఒక శరీరముగల దేవతకు అనేక స్థలములలో జరుగుచున్న కర్మములలో ఒకేసారి ఉపస్థితి ఆవశ్యకము. అది అసంభవము. యజ్ఞాది కర్మలు అసంభవము అను ప్రశ్నకు సమాధానము. “ఆ దేవత ఒకరూపము, మూడు రూపములు, ఐదు రూపములు మరియు అనేకరూపములు దాల్చును”. ఈ శ్రుతిలో ఒకే సమయములో ఒకే దేవత అనేక శరీరములు ధరించుట చూడబడుచున్నది. లేనిచో యాగము దేవతనుద్దేశించి అనేకులు ఒకేసమయములో ద్రవ్యత్యాగము చేయుటగూడ కలదు. అందువలన దేవతలకు శరీరమున్ననూ కర్మములలో విరోధము రాదు.

దేవతలు శరీరధారులైనను బ్రహ్మవిద్యలో అధికారముకలదనిరి. శరీరముండుటవలన ఋత్విక్కులవలే యాగసమయములో వారి ఉపస్థితి అనివార్యము. అపుడు కర్మలలో విరోధముకలుగును. అనేకస్థలములలో ఒకేసారి జరుగు యాగములలో ఇంద్రాదుల ఉపస్థితి, ఇద్రాదుల సన్నిధి అసంభవముకదా యనిన దానికి సిద్ధాంతి సమధానము. 'అనేకప్రతిపత్తేర్దర్శనాత్' అనగా ఒకే దేవత అనేక రూపములు ఒకేసారి ఒకేసమయములో ధరించుట చూడబడుచున్నది 'ఎందరు దేవతలు' అని ఉపక్రమించి 'మూడువేల మూడువందల ముగ్గురు దేవతలనిరి'. తరువాత 'వారు ఎవరు' అని అడుగగా 'ఇదంతా వారి మహిమ వాస్తవమునకు ముప్పైముగ్గురు దేవతలనిరి'. (బృ.3.9.1-2) ఈశ్రుతులలో ఒకేదేవతకు అనేకరూపములు చెప్పి క్రముముగా మరల అందరి అంతర్భావము ఒకప్రాణదేవతలోనే చెప్పిరి. ఈ విధముగా అనేకరూపములలో ప్రత్యేకదేవత యొక్క ఉపాసన కలదు. మరియు ఒకే దేవత అనేకరూపములలో విభక్తమై ఒకేసమయములో అనేకయాగములలో ఉపస్థితికాగలదు. లేనిచో ఒకేదేవత గురించి అనేకులు అనేకచోట్ల ఒకేయాగము గావించినను వ్యాసపీఠులైనవారు అనేకుల నమస్కారము ఒకేసారి స్వీకరించినట్లు ఒకేదేవత అందరియాగమును ఒకేసారి స్వీకరించును. ఎంగులకనగా ఆ దేవతలకు అంతర్ధాన శక్తి మరియు అనేకరూపములు పొందు ఐశ్వర్యముకలదు గనుక. అందువలన దేవతలు శరీరధారులైనను కర్మములలో విరోధములేదు.

91. శబ్ద ఇతి చేన్నాతః ప్రభవాత్ప్రత్యక్షానుమానాభ్యామ్. (1.3.29.)

సూత్రార్థము:- వేదవాక్యములలో విరోధముకలుగుననిన అదిసరికాదు. ఎందులకనగా వేదశబ్దములనుండియే దేవతలతోగూడిన సంపూర్ణజగత్తు ఉత్పత్తి అయినది. 'ఏతే' అను పదమునుచ్చరించి దేవతలను స్మరించి ప్రజాపతి దేవతలను సృష్టించెను. సృష్టికి మొదలులో పరమేశ్వరుడు వేదశబ్దములద్వారా భూతములను నామరూపకర్మలు ఉత్పత్తి గావించెను.

ఈ విషయము శ్రుతి స్మ్రతులలో స్పష్టము. దేవతలకు శరీరముండుటవలన కర్మలలో విరీధము లేక పోవుగాక, కాని వేదవాక్యములలో విరోధము వచ్చును. మనుష్యులవలే అనిత్య శరీరముగల దేవతలతో నిత్య వైదికశబ్దముల సంబంధము కుదరదు. నిత్యానిత్యములు విరుద్ధములు. వైదికశబ్దములు వాని అర్థములు మరియు వాని సంబంధము నిత్యమని వైదికవాక్యములద్వారా ప్రమాణత స్థిరపడినది. నిత్యప్రమాణములైన వేదములందు శరీరముగల దేవతలను అంగీకరించుటవలన విరోధము కలుగును. అను పూర్వపక్షి సంశయమునకు సమాధానము. "అతః ప్రభవాత్" వైదికశబ్దముల ద్వారానే సంపూర్ణ జగత్తు ఉత్పత్తి చెందుచున్నది. "జన్మాద్యస్య యతః" (బ్ర.సూ.1.1.2) అన్నసూత్రములో బ్రహ్మ నుండి జగదుత్పత్తి చెప్పిరి. ఇప్పుడు వేదశబ్దములనుండి జగదుత్పత్తి ఎట్లు చెప్పుచున్నారు. వేదశబ్దములద్వారా జగదుత్పత్తి చెప్పినను వస్వాది దేవతల ఉత్పత్తిని స్వికరించిన వారిలో అనిత్యత్వము వాటిల్లును. ఆ వస్వాది దేవతల ఉత్పత్తి చెప్పు వైదికశబ్దములలో గూడ అనిత్యత్వము వచ్చును. ఈస్థితిలో మొదట చెప్పిన వేదశబ్దములలోని విరోధము యథాతథము. అట్లనుట

సరికాదు. ఏలనన ఇంద్రాదిదేవతల శరీరములు అనిత్యమైనను వారి ఆకృతుల (ఆకారముల) సంబంధము శబ్దములద్వారా స్వీకరించుట వలన ఆకృతులు నిత్యము. ఆకృతులద్వారానే వైదికశబ్దముల నిత్యసంబధము చెప్పుట ఉచితము. వ్యక్తులు అనేకులు గనుక అందరితో శబ్ద సంబంధగ్రహణము యుక్తియుక్తము కాదు. ఆవు మొదలైన వ్యక్తులు ఉత్పత్తి అయినప్పటికిన్ను వాని ఆకృతి ఉత్పత్తి కాదు. అందువలన ఆవ్యక్తులతో వానిని చెప్పు ఆకృతి శబ్దముల నిత్యత్వము స్వీకరించిన నీవు చెప్పిన వైదికశబ్దముల విరోధము తొలగిపోవును. శబ్దముల ద్వారా జగదుత్పత్తి బ్రహ్మనుండి ఉత్పత్తివలేకాదు. జగదుత్పత్తికి బ్రహ్మమే ఉపాదానకారణము. కాని శబ్దమునుండి ఉత్పత్తి అట్లుకాదు. మరి ఏవిధముగాఅనిన నిత్య శబ్దము దాని అర్థము ఆరెండిటికి సంబంధము ఉండుటవలన. వ్యవహారమునకు యోగ్యమైన వస్తువిశేషము శబ్దముద్వారా అభివ్యక్తమగుటచే శబ్దమునుండి జగదుత్పత్తి చెప్పు అభిప్రాయము.

దేవాదుల ఉత్పత్తి శబ్దమునుండి అని ఎట్లు తెలిసికొనగలము? "ప్రత్యక్షానుమానాభ్యామ్" ప్రత్యక్షమనగా శ్రుతివాక్యములు, "నిరపేక్ష రవః శ్రుతిః" అను శ్రుతి వాక్యముద్వారా ఆశ్రుతి వాక్యములకు వేరు ప్రమాణముల ఆవశ్యకము లేదు. అనుమానమనగా స్మృతులు. వాని ప్రమాణములకు శ్రుతుల అపేక్ష గలదు. 'ఏతే' అను శబ్దముద్వారా ప్రజాపతి దేవతలను స్మరించి వారిని సృష్టించెను. "అనాదినిధనా నిత్యా వాగుత్సృష్టా స్వయంభువా। ఆదౌ వేదమయీ నిత్యా యతః సర్వా ప్రవృత్తయః"॥ (మ.భా.శా.233-4) 'స్వయంభూ పరమాత్మా సృష్టికి ఆరంభములో ఆద్యంతరహితములైన నిత్యము, దివ్యమైన వేదవాణిని సృష్టించెను. దానిద్వారా అన్ని రకముల వ్యవహారములు ప్రారంభమయినవి'. ఇచట 'శబ్ద సృష్టి' అనగా గురుశిష్యుల సంప్రదాయ ప్రవృత్తి అని అర్థము. మనుస్మృతిలో గూడ "వేద శబ్దేభ్యః ఏవాదౌ నిర్మమే స మహేశ్వరః" (మను.1.21). పరమాత్మ సృష్టికి ఆరంభములో వైదిక శబ్దముల నుండియే జగదుత్పత్తి గావించెను. అందువలన దేవాది వ్యక్తుల ఉత్పత్తి వేదశబ్దములద్వారానే అని తెలియుచున్నది. వారి ఆకృతులకు శబ్దములతోపాటు నిత్యసంబంధముండుటవలన దేవతలు శరీరధారులైనను వేదశబ్దములతో ఏవిధమైన విరోధము లేదనునది సిద్ధమైనది. వేదములకు స్వతంత్ర కర్తలేడు. అందువలన వేదముల నిత్యత్వము ధృఢీకరించుటకు పూర్వసూత్రములో 'అతః ప్రభవాత్' అని దేవతల ఉత్పత్తి వేదముద్వారా చెప్పిరి. అపుడు దేవతలను ఉత్పత్తిచేయు వేదమునకు గూడా ఉత్పత్తి ప్రసంగము వచ్చును కదా అను శంకకు సమాధానముగా ఈసూత్రము ద్వారా చెప్పుచున్నారు.

### 92. అత ఏవ చ నిత్యత్వాత్. (1.3.26.)

సూత్రార్థము:- దేవతలు మరియు సంపూర్ణ జగత్తు వేదశబ్దములద్వారానే ఉత్పన్నమగు చున్నవి. అందువలననే వేదములు నిత్యమని తెలిసికొనవలయును.

నిత్యమైన ఆకృతి గల దేవతలు మరియు ఈసంపూర్ణ జగత్తు నిత్యమైన వేదశబ్దములద్వారా ఉత్పన్నమగుటచే వేద శబ్దములలో నిత్యత్వము అంగీకరించవలయును. మహాప్రళయములో మూడులోకములు నాశనమగుటవలన ఆకృతులు గూడ నాశనమగుచున్నవి. శబ్దార్థము వాని సంబంధము అనిత్యమని చెప్పిన వేద శబ్దముల విరోధము అటులనే ఉన్నది, అని ప్రశ్నించిన ఆ ప్రశ్నకు సమాధానముగా ఈ సూత్రము చెప్పుచున్నారు.

93. సమాననామరూపత్వాచ్చావృత్తావప్యవిరోధో దర్శనాత్స్మృతేశ్చ. (1.3.30.)

సుత్రార్థము:- సృష్టిప్రళయముల ప్రవాహము జరుగుటచే తరువాతి కల్పములో సమాననామరూపములు ఉండుటవలన శబ్దార్థసంబంధముల నిత్యత్వము సిద్ధమగుచున్నది. సృష్టి సమాన నామరూపములుగలది. పూర్వకల్పములో సూర్యచంద్రాదుల జగత్తు ఎటులఉన్నదో అటులనే ఉత్తర కల్పములో పరమేశ్వరుడు సృష్టించును. ఈ అర్థమునే 'ధాతా యథా' అను శ్రుతిలో చెప్పిరి. ఆవిధముగనే 'యథా ఋతుషు ఋతులింగాని' ఆయా ఋతువులలో కనబడు నవపల్లవములు మొదలగు ఋతుచిహ్నములు, ఋతువుల పునారావృత్తి కానవచ్చుచున్నది. అటులనే పూర్వకల్పమునకు సమానముగా పదార్థములు ఉత్తరోత్తరసృష్టిలో కనబడు చున్నవి అని స్మృతిలో కూడ చెప్పినారు.

జాగ్రత్త సుషుప్తులవలే అనాది సంసారములో ఉత్పత్తి ప్రళయముల ఆవృత్తి స్వీకరించిరి. మహాప్రళయము ఉన్నను ఆకారములు లేక ఆకృతులు గూడ ఉండుననునది నిశ్చయము. ప్రళయములో సంస్కార రూపములో ఈ ప్రపంచము తనయొక్క ఉపాదానకారణమైన అజ్ఞానమునందు ఉండును. అందువలన పూర్వకల్పమువలే ప్రపంచమునకు నామ, రూప, ఆకృతులు నిత్యమగుటవలన శబ్దార్థసంబధములు అనిత్యమను శంకకు తావులేదు, లేక అనిత్యమని శంకింపరాదు. సమానమగు నామరూపములు పూర్వకల్పమువలనే ఉన్నవని చెప్పుటకు శ్రుతులు, స్మృతులు కలవు. "సూర్యాచంద్రమసౌ ధాతా యథా పూర్వమకల్పయత్" (ఋ.సం.10.160.3.) అను శ్రుతియొక్క అర్థము సూర్యచంద్రాదులు మొదలుగాగల ఈప్రపంచము నంతయును బ్రహ్మదేవుడు పూర్వకల్పములోవలెనే సృజించెను. "యథర్తుష్వృతులింగాని నామరూపాని పర్యయే। దృష్యతే తాని తాన్యేవ తథా భావా యుగాదిషు" || వసంతాది భిన్న భిన్న ఋతువులలో భిన్న భిన్నమైన ఋతుచిహ్నములు కనబడును. ఆవిధముగనే వాని నామములు, రూపములు క్రమముగా వచ్చుట చూడబడుచున్నది. ఆలాగుననే యుగమునకు మొదలులో నామములు మరియు పదార్థములు కనబడుచున్నవి. ఈ విధమైన స్మృతి ప్రమాణములు కలవు. దేవతలకు బ్రహ్మవిద్యలో అధికారము కలదని చెప్పిన విషయములో పూర్వవాది ఆక్షేపము క్రిందిసూత్రము ద్వారా ప్రకటించుచున్నారు.

94. మధ్వాదిష్వసంభవాదనధికారంజైమినిః. (1.3.31)

సూత్రార్థము:- “అసౌవావ ఆదిత్యో దేవ మధు” (ఛాం.3.1.1.) ‘ఈ సూర్యుడు దేవతలకు మధువు’ అనగా తేనె వలె ఆనందము నిచ్చువాడు. “ఆదిత్యో బ్రహ్మేత్యాదేశః” ‘ఆదిత్యుడు బ్రహ్మ అనునది ఉపదేశము’ ఈశ్రుతి వాక్యములలో మధువు (తేనె) మరియు బ్రహ్మాధ్యాసము ద్వారా విహితమైన సూర్యోపాసనలో ఆదిత్యాదులకు అధికారము లేదు. అందువల్ల జైమిని ఆచార్యులు బ్రహ్మవిద్యలో దేవతలకు అధికారములేదను చున్నారు.
అధికారము ఎందుకులేదనిన “మధ్వాదిష్వసంభవాత్” మధువిద్యలో ఆదిత్యునికి అధికారములేదు. “అసౌ వావ ఆదిత్యో దేవమధు” నిశ్చయముగా ఆదేవతలందరికీ ఈ సూర్యడు తేనెవలె ఆనందము నిచ్చువాడు.

“ఆదిత్యో బ్రహ్మేత్యాదేశః” (ఛాం.3.1.1) “వాయుర్వావ సంవర్గః” (ఛాం.4.3.1.) ‘ఆదిత్యుడు బ్రహ్మమని ఉపదేశము’ ‘నిశ్చయముగా వాయువు సంవర్గము’ అనుదేవతల ఉపాసనలో ఆయాదేవతలకు అధికారము సంభవముకాదు. కాని మనుష్యులకు ఆయావిద్యలలో అధికారమున్నది. ఎందులకనగా ఉపాసనకొరకు, ఉపాస్యము ఉపాసకుడు అను భేధము అత్యావశ్యకము. ఒకే దేవత ఉపాస్యము ఉపాసకుడు కాజాలడు. గాన బ్రహ్మవిద్యలో దేవతలకధికారము లేదని జైమిని ఋషి మతము. ఏవిధముగా మధ్వాది విద్యలలో దేవతలకధికారము లేదో అట్లే విద్యాత్వము సమానమగుటవలన బ్రహ్మవిద్యలో ఆదిత్యాది దేవతలకు అధికారములేదు.

### 95. జ్యోతిషి భావాచ్చ. (1.3.32.)

సూత్రర్థము:- కానవచ్చు జ్యోతిర్మండలములో ఆదిత్య శబ్దప్రయోగము మరియు ఆదిత్యుని ప్రతీతి కలదు. ఆమండలము అచేతనము దానికన్న భిన్నమైన శరీరాదులతో కూడిన చైతన్యము ప్రత్యక్షాది ప్రమాణములద్వారా తెలియబడుటలేదు. ఆదిత్యాదుల శరీరమును చెప్పు మంత్రాదుల అర్థము అన్యపరకము (వేరు అర్థము చెప్పుచున్నవి) ఆమంత్రములకు స్వార్థములో ప్రమాణములేదు. అందువలన దేవతాదుల శరీరమున్నదని సిద్ధముకానందువలన వారికి బ్రహ్మవిద్యలో అధికారములేదు.
ముందు సూత్రము నుండి అనధికారము అనగా అధికారములేదు అను పదము ఈ సూత్రములో కూడ అనువర్తించును. అంతరిక్షములో నుండి రాత్రి పగలు తిరుగుచు జగత్తును ప్రకాశింపజేయు జ్యోతిర్మండలము లోక ప్రసిద్ధము. దానినే ఆదిత్యదేవత అని కూడ అందురు. లోకప్రసిద్ధివలన వ్యాక్యశేషబలముచే జ్యోతిర్మండలములో ఆదిత్యదేవత శబ్దప్రయోగము కానవచ్చుచున్నది. మృత్తికవలే ఆ జ్యోతిర్మండలము జడముగా ప్రతీతమడుటవలన మరియు ప్రత్యక్షాది ప్రమాణములద్వారా శరీరధారులనునది చూడబడుటలేదు. అందువల్ల విద్యాగ్రహణశక్తి మొక్షాకంక్ష సంభవముకాదు. ఇంతేగాక దేవతల శరీరములను ప్రతిపాదించు మంత్రములు, స్తుతులు, ఇతిహాస-పురాణములు మొదలగువాని యొక్క అర్థము వేరుగానుండి అన్యార్థము చెప్పుటలో తాత్పర్యముండుటవలన దేవతాదులకు బ్రహ్మవిద్యలో అధికారము లేదని సిద్ధమగుచున్నది.

### 96. భావం తు బాదరాయణోఽస్థి హి. (1.3.33.)

సూత్రార్థము:- బాదారయణ ఆచార్యులు దేవతలకు నిర్గుణ బ్రహ్మవిద్యలో అధికారముందనుచున్నారు. ఏలనన దేవతల శరీరములను ప్రతిపాదించు మంత్రాదులకు అన్యప్రణామములద్వారా విరోధములేనందున మరియు ఆమంత్రములకు స్వార్థములోనున్న అర్థము ప్రమాణమగుటవలనను వారిలో జ్ఞానపిపాస ఉండుటవలనను వారికి బ్రహ్మవిద్యలో అధికారము కలదు.

సూత్రమునందుగల 'తు' శబ్దము ద్వారా ముందుచెప్పిన రెండు సూత్రములలోనున్న పూర్వపక్షియొక్క శంకలను ఖండిచుచున్నారు. బాదరాయణ ఆచార్యులు మధువిద్యలో దేవతలకు అధికారము లేకపోయినను వారు శరీరధారులగుటవలన బ్రహ్మవిద్యయందు అధికారమున్నదని భావించుచున్నారు. ఎందులకనగా వారిలో మొక్షార్థిత్వము విద్యాసామర్థ్యము బ్రహ్మవిద్యాధికారము కలవు గనుక. జాతిద్వారా బ్రాహ్మణునికి రాజసూయ యాగములో అధికారములేకపోయినను బృహస్పతి యాగమునందు అధికారముగలదు. దేవతలకు శరీరములేదనుట సర్వథా అనుచితము. దేవతల విగ్రహత్వము చెప్పుమంత్రములకు ఏప్రమాణముద్వారాను విరోధములేదు. అందువలన మంత్రములద్వారా విగ్రహత్వము ఉన్నందువలన మరియు వారిలో అర్థిత్వము సామర్థ్యము సంభవమగుటవలన దేవతలకు బ్రహ్మవిద్యలో అధికారమున్నదని సిద్ధమగుచున్నది.

## 28. అపశూద్రాధికరణము.

సంగతి:- శ్రుతులలో దేవతల శబ్దము వినబడుటవలన వారికి బ్రహ్మవిద్యలో అధికారమున్నదని చెప్పినారు. అలాగుననే శూద్రశబ్దము వేదములలో వినబడుటవలన వారికి కూడా బ్రహ్మవిద్యలో అధికారమున్నదని చెప్పవలయును. పూర్వాధికరణములో నిర్ణయించిన విషయమును దృష్టాంతముగా చెప్పి ఈ అధికరణమును మొదలిడినారు గనుక పూర్వాధికరణముతో ఈ అధికరణమునకు దృష్టాంన్త సంగతి.

విషయము:- "అహహారే త్వా శూద్ర తవైవ సహగోభిరస్తు" (ఛాం.4.2.3). ఈ వాక్యము ఈ అధికరణములో విచారణీయ విషయము.

సంశయము:- వేదవిద్యలో శూద్రులకు అధికారమున్నదా లేదా అనిసంశయము.

పూర్వపక్షము:- త్రైవర్ణికులకన్న భిన్నమైన దేవతలకు బ్రహ్మవిద్యలో అధికారమున్నదని చెప్పినరీతిగనే శూద్రులకు గూడ అధికామున్నదని చెప్పవలయును.

సిద్ధంతము:- దేవాదులకు వేదకజ్ఞానము జన్మసిద్ధము, మరియు జ్ఞానఫలముగూడ వారికి అభీష్టము. అందువల్ల వారు బ్రహ్మవిద్యకు అధికారులనిరి. కాని వేదాధ్యయనము శూద్రులకు నిషిద్ధముగాన జ్ఞానఫలము అభీష్టమైనను వేదజ్ఞానములో వారికి అధికారములేదు. శృతి స్మృతులలో శూద్రుల వేదాధ్యయనము నిషేధించిరి.

వైయాసికన్యాయమాల:-

69. శూద్రోఽధిక్రియతే వేద విద్యాయామథవా న హి। అత్రైవర్ణికదేవాద్యా ఇవ శూద్రోఽధికారవాన్॥

70. దేవాః స్వయంభాతవేదాః శూద్రోఽధ్యయన వర్జనాత్। నాధికారోశ్రుతౌ స్మార్తేత్వధికారో న వార్యతే॥

వేదవిద్యలో శూద్రులకు అధికారమున్నదా లేదా? ద్విజాతులైన బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకన్నభిన్నమైన దేవతలకు అధికారమున్నదని చెప్పినారు. ఆలాగుననే శూద్రులకు గూడ అధికారముండనవచ్చునుకదా. అనిన పూర్వపక్షమునకు సమాధానము. దేవతలు పుట్టుకతోనే వేదజ్ఞానము కలిగివుండెదరు. మరి శూద్రులకు వేదాధ్యయనము నిషేధమనిరిగాన శూద్రులకు వేదాధ్యయనములో అధికారములేదు. స్మృతుల ద్వారాగలుగు బ్రహ్మజ్ఞానమునకు వారికధికారమున్నది.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఛాందోగ్యములోని నాలుగవ అధ్యాయములో సంవర్గవిద్యలో ఈ విధముగా చెప్పిరి. "ఆజహారేమాః శూద్ర అనేనైవ ముఖేనఽఽలాపయిష్యథాః" అనగా జానశ్రుతి అను పేరుగల శిష్యుడు వెయ్యి ఆవులు తన కుమార్తెను ముత్యాలహారమును రథము కొన్నిగ్రామములను కానుకగా తీసుకొని గురువులైన రైక్వుని వద్దకు వెళ్ళగా ఆ రైక్వుని వచనమిది "ఓ శూద్రుడైన జానశ్రుతి వెయ్యి ఆవులు దక్షినగా మరియు నీ కన్యను కూడ సమర్పించు చున్నావు. ఈమెద్వారా నా చిత్తము ప్రసన్నమైనది గాన నీకు సంవర్గ విద్యనుపదేసించెదను" అనెను.ఈ సందర్భములో శూద్రుడైనను వేదవిద్యయందు అధికారము సంభవముకదా. ఈపూర్వపక్షమునకు సమాధానము. దేవతలతోబాటు శూద్రులను పోల్చలేము. ఉపనయనాధ్యయనములు లేక పోయినను దేవతలకు స్వయముగనే పూర్వజన్మ పుణ్యమువలన వేదజ్ఞానము కలుగును. అటువంటి పుణ్యమును వారు పూర్వజన్మలో సంపాదించిరి. శూద్రునకు అటువంటి పుణ్యములేనందువలన స్వయముగా వారికి వేదజ్ఞానము కలుగదు. అంతేగాక వారికి ఉపనయన విధిలో అధికారము లేనందున వేదాధ్యయమునకు అర్హులుకారు. వేదజ్ఞానము లేనందువలన శ్రౌతవిద్యలో శ్రూద్రులకు అధికారములేదు. మరి ముందుచెప్పిన వాక్యములో జానశ్రుతి అను రాజును శ్రూద్రుడని సంభోధించినారుకదా అనిన దానికి సమాధానము. అచట క్షత్రియుడైన రాజును శ్రూద్రుడని సంభోధించుట యౌగిక అర్థమేగాని రూఢి అర్థము కాదు. "విద్యారాహిత్యజనితయా శుచా దుద్రావ ఇతి శూద్రః" విద్య లేదను దుఃఖముతో గురుని వద్దకు పరుగెత్తెను కనుక శూద్రుడనిరి. రూఢిద్వారా యౌగిక అర్థము ఖండిప బడదు. ఎందులకనగా ఇచట రూఢి అర్థము అసంభవమగుటవలన. ఈ ఉపాఖ్యానమలో సారథిని పంపుట ఆదిగా గల ఐశ్వర్యమును చెప్పుటవలన జానశ్రుతి క్షత్రియుడన్నది నిశ్చయమగుచున్నది. శూద్రునికి వేదవిద్యలో అధికారము లేక పోయినను మొక్షేచ్ఛ ఉన్నప్పుడు మొక్షముకలుగదని చెప్పుటకు వీలులేదు. స్మృతులు పురాణముల ద్వారా జ్ఞానప్రాప్తి కలిగిన ముక్తి కలుగును. అందువలన శూద్రులకు వేదవిద్యలో అధికారములేదు.

97. శుగస్య తదనాదరశ్రణాత్తదాద్రవణాత్ సూచ్యతే హి. (1.3.34.)

సూత్రార్థము:- జానశ్రుతి తనయొక్క అనాదరము హంసలద్వారా వినినప్పుడు వానిలో శోకముత్పన్నమైనది. అది ఇచట శూద్రశబ్దముతో సూచించిరి. మరియు శోకముతో జానశ్రుతి రైక్వుని వద్దకు పోయినందున వానిని శూద్రుడనిరి. (జానశ్రుతి రాజు తన రాజ్యములో అన్నిచోట్ల పూర్తిగా యాత్రికులకు ఉండుటకు వసతులు మరియు భోజనాదులకు అన్నక్షేత్రములు నిర్మించెను. తాను తలచిన కర్మయోగము పూర్తి అయినందునవలన సంతోషముతో మేడమీద విశ్రమించుచుండగా వానికర్మకు సంతుష్టులైన కొందరు ఋషులు హంస రూపములో వానిపై ఎగురుచు ఆరాజు వినునట్లు సంభాషించుకొనుచుండిరి. వెనకాలనున్న హంస భల్లాక్ష! అని ముందువున్నహంసను సంభోదించుచు ఇచట జానశ్రుతి రాజుయొక్క తేజస్సు స్వర్గము వరకు వ్యాప్తము అది నిన్ను భస్మము చేయును. దానికి ముందువున్నహంస అరే! ఈ రాజు విద్యాహీనుడు. వీనిని నీవు బండితో నున్న రైక్వునికి ప్రయోగించు వచనములను ప్రయోగించు చున్నావు. బ్రహ్మజ్ఞాని రైక్వుని తేజస్సు దురతిక్రమము. ఆత్మజ్ఞానరహిత జానశ్రుతి తేజస్సు అట్లుకాదు. అని చెప్పి వెనుక హంస నోరు కట్టివేసెను. కర్మ తరువాత చేయ వలసినది ఉపాసన. రైక్వుడు చేయు సంవర్గ ఉపాసనద్వారా వానికి ఆచుట్టుప్రక్కల ఉన్నవారి పుణ్యము లభించును. అందుకే రైక్వుడు నా కన్నగొప్పవాడు అని విని రాజునకు శోకముద్భవించెను.) ఇచట జాత్యా శూద్రునికి వేదవిద్యలో అధికారము కలదని పూర్వవాది అభిప్రాయము. సిద్ధాంతములో వారికి అధికారములేదని ఫలభేదము. సంవర్గ విద్య మరియు వేద విద్యలో శూద్రులకు అధికారము లేదు. ఎందులకనగా క్షత్రియుడైన జానశ్రుతికి శోకము కలిగెను. ఆశోకమునకు కారణము తన యొక్క అనాదరమును వినుటయే. "కమ్వర ఏనమేతత్సన్తం సయుగ్వానమివ రైక్వమాత్థ" (ఛాం.4.1.3) అనగా 'ఏరా ఆరాజు ఎవడు వానిని శ్రేష్టమైనటువంటి బండిగల రైక్వుడు అనుమహాత్మునకు సరితూగగలడనుచున్నవా'. ఈవిధముగా హంసలనుండి తన అనాదరమును విని క్షత్రియుడైన ఆ జానశ్రుతి పౌత్రాయణునికి చాలా శోకము కలిగెను. ఆశోకమునే రైక్వ మహర్షి తనయొక్క సర్వజ్ఞత్వమును సూచించుటకు శూద్ర శబ్దముతో చెప్పెను. యౌగిక వృత్తి ద్వారా కూడ శూద్ర శబ్దమునకు క్షత్రియ పరకముగా అర్థము చెప్పవచ్చును. ఎందులకనగా 'తదాద్రవణాత్' ఈపదములో గల 'తత్' శబ్దము శోకము, జానశ్రుతి, రైక్వుడు అను మూడు అర్థములను చెప్పును. ఎట్లనగా జానశ్రుతి శోకము పొందెను, జానశ్రుతి శోకగ్రస్తుడయ్యెను లేక జానశ్రుతి శోకపీడుతుడై రైక్వుని వద్దకు వెళ్లెను. మూడు అర్థములగుట వలన వానిని సూత్రములో గల 'తదాద్రవణాత్' అను పదము ద్వారా సూచించిరి. శూద్రునిలో జ్ఞానాకాంక్ష సంభవమైనను ఉపనయన పూర్వక అధ్యయనము లేనందువలన వేదవిద్యలో అధికారములేదు. "శూద్రో యజ్ఞేనఽనవక్లప్తః" యజ్ఞములో శూద్రుడు అసమర్థుడు అను సాధారణ న్యాయముద్వారా బ్రహ్మవిద్యలో శూద్రుని అసామర్థ్యమును బోధించును.

98. క్షత్రియత్వగతేశ్చోత్తరత్ర చైత్రరథేన లింగాత్. (1.3.35.)

సూత్రార్థము:- జానశ్రుతి క్షత్రియుడని శ్రుతి ద్వారా తెలియు చున్నది. అది ఎట్లు తెలిసికొనగలము అనగా ముందు ఇదే సంవర్గవిద్య అంతములో చిత్రరథుడను క్షత్రియరాజు వంశములో ఉత్పన్నుడైన అభిప్రతారీ అను పేరుగల క్షత్రియునితోపాటు జానశ్రుతి కలిసి ఉండుట శ్రుతిలో చెప్పిరి.

ఇందువలనగూడా జానశ్రుతి జాత్యా శూద్రుడుకాదు. ఎందులకనగా సంవర్గవిద్య వాక్యశేషములో చైత్రరథుని వంశములోనున్న అభిప్రతారీణుడను రాజుతో జానశ్రుతిరాజు వర్ణన గలదు. సామాన్యముగా సమానవంశీయులే ఒకరితోనొకరు కలిసి ఉందురు. అందుకని క్షత్రియుడైన అభిప్రతారీణునితో జానశ్రతి యొక్క వర్ణన కలదు. సమానజాతీయులలోనే పంక్తి భోజనము శ్రాద్ధాది కర్మలు సహచారము చూడబడుచున్నది, గాన క్షత్రియుడైన జానశ్రుతికి బ్రహ్మవిద్యలో అధికారమున్నట్లు శూద్రులకు లేదు.

99. సంస్కారపరామర్శాత్తదభావాభిలాపాచ్చ. (1.3.36.)

సుత్రార్థము:- "తంహోపనిన్యే" 'వానికి ఉపనయనము గావించెను'. "అధీహి భగవ ఇతి హోపసాద" 'ఓ భగవంతుడా! నాకు విద్యోపదేశము చేయుమని నారదుడు సనత్కుమారుని వద్దకు వెళ్ళెను. ఈ విధమైన విద్యాప్రకరణ వాక్యములో ఉపనయనాది సంస్కారముల వివేచనము కలదు. "న శ్రూద్రే పాతకం కించ్చిన్న చ సంస్కారమర్హతి" 'శూద్రునికి పాపములేదు మరియు వాడు సంస్కారమునకు యోగ్యుడుకాదు.' ఈవాక్యము ద్వారా శూద్రునకు ఉపనయనాది సంస్కరములు నిషేధించుటవలన శూద్రులకు విద్యలో అధికారములేదు.
విద్య చెప్పు స్థలములలో "తం హోపనిన్యే" (శ.బ్రా. 11.5.3.13) అనగా వానికి గురువులు ఉపనయనము గావించిరి. "అధీహి భగవ ఇతి హోపససాద" (ఛాం.7.1.1.) అనగా 'ఓ భగవంతుడా! నాకు విద్య చెప్పుము'. "తే హ సమిత్పాణయో భగవన్తం పిప్పలాదముపసన్నాః" (ప్ర.1.1.) 'వారు చేతినిండా సమిధలతో గురువులైన పిప్పలాద భగవంతుని వద్దకు పోయిరి'. ఈ పైచెప్పిన శాస్త్రవాక్యములలో ఉపనయానాది సంస్కారముల వివేచనము కలదు. శూద్రునికి గూడ ఉపనయనము నందు అధికారము కల్పన చేయవచ్చునుకదా అని వాదించిన అది సరికాదు. ఉపనయనాది సంస్కారములో శూద్రుని అనదికారము స్పష్ఠముగా శాస్త్రములో చెప్పిరి. "న శూద్రే పాతకం కిఙ్చిన్న చ సంస్కారమర్హతి" 'శూద్రునికి ఏవిధమైన పాపములేదు మరియు సంస్కారము లేదు'. అనగా అభక్ష్య భక్షణమువలన వచ్చు పాపము శూద్రునికి అంటదు. మిగిలిన పాపకర్మలు అనుభవించవలెను. ఈ వాక్యములో గూడ శూద్రునికి ఉపనయానాది సంస్కారముల అభావము స్పష్టముగా చెప్పిరి. (మను.10.12.6.) అందువలన గూడ శూద్రునికి వేదాధ్యనములో అధికారము లేదు.

100. తదభావనిర్ధారణే చ ప్రవృత్తేః. (1.3.37.)

సూత్రార్థము:- సత్యమునే పలుకు చున్నాడు కనుక ఈ సత్యకామ జాబాలుడు బ్రాహ్మణుడేకాని శూద్రుడుకాడని నిశ్చయించుకొనిన తరువాతనే ఆ గౌతముడు జాబాలునికి విద్యోపదేశము చేయుటకు ప్రవృత్తుడయ్యెను. దీనివలన

గూడ శూద్రునకు వేదవిద్యలో అధికారము లేదని తెలియుచున్నది.

(తండ్రి లేని సత్యకాముడు తన తల్లిని గోత్రమేమని అడిగెను. దానికి తల్లి భర్తసేవలో తల్లీనమై ఉండుటవలన నేను నీ తండ్రిని గోత్రమేమని అడుగలేదు. నా పేరు జాబాల నీ పేరు సత్యకాముడని మాత్రమే తెలుసు. గురువుగారైన గౌతముడు నీ గోత్రమేమని అడిగినపుడు సత్యకాముడు తల్లి చెప్పినట్లుగానే గురువుగారికి చెప్పెను. సత్యకాముని సత్యవచనములద్వారా గురువు ఈతడు బ్రాహ్మణుడని నిశ్చయించి వానికి ఉపనయనము చేసి విద్యాభ్యాసము మొదలిడెను.)

గోత్రమడిగిన గురువుగారికి జాబాలుడు ఈ విధముగా చెప్పెను. "సాऽహమేతన్నవేద యద్గోత్రస్త్వమసి, జాబాలా తు నామాహమస్మి సత్యకామొ నామ త్వమసి, స సత్యకామ ఏవ జాబాలో బ్రువీథా ఇతి" (ఛాం.4.4.5) అనగా 'నాకు గూడ నీగోత్రము తెలియదు. నాకు తెలిసినదింతే. నాపేరు జాబాల నీపేరు సత్యకాముడు. అందువలన నేను సత్యకామ జాబాలుడనని గురువుగారితో చెప్పుము'. సత్యకాముడు తల్లి మాటలనే పొల్లుపోకుండా గురువుగారికి చెప్పెను. వాని నిశ్చలమైన వచనములు విని గౌతమ మహర్షి "నైతదబ్రాహ్మణో వివక్తుమర్హతి" (ఛాం. 4.4.5) అనగా 'వీడు శూద్రడు కాదు. బ్రాహ్మనేతరుడు ఈ విధముగా స్పష్టమైన నిశ్చలభావముతో పలకడు'. అని సత్యకాముని బ్రాహ్మణజాతి వాడని నిశ్చయించుకొని వానికి ఉపనయనము గావించి విద్యనుపదేశించుటకు ఉద్యుక్తుడయ్యెను. అందువలన గూడ శూద్రునికి వేదాధ్యయనములో అధికారములేదని తెలియుచున్నది.

101. శ్రవణాధ్యయనార్థప్రతిషేధాత్ స్మృతేశ్చ. (1.3.38.)

సూత్రార్థము:- శ్రవాణాధ్యయనములు నిషేధించుటవలన శూద్రునికి వేదాధ్యయనములో అధికారములేదు. స్మృతులలో శూద్రులకు వేదశ్రవణము, అధ్యయనము మరియు వేదార్థజ్ఞానపూర్వక అనుష్ఠానము నిషేధించిరి. మరి విదురుడు ధర్మవ్యాధుడు మొదలగువారికి జ్ఞానమెట్లు కలిగెను అనిన పూర్వజన్మ సంస్కారమువలన వారికి జ్ఞానము కలిగినదని సమాధానము. కాని ఈజన్మలో చేసిన శ్రవణాదులవలన కాదు. సంస్కారము వలన కలుగు జ్ఞానఫలప్రాప్తిని నిషేధింప శక్యముకాదు. పురాణ ఇతిహాసాదుల శ్రవణములో నాలుగు వర్ణములవారికి అధికారముకలదు. "శ్రావయేచ్చతురో వర్ణాన్ కృత్వా బ్రాహ్మణమగ్రతః" బ్రాహ్మణుని నిమిత్తముగావించి నాలుగు వర్ణములవారికి పురాణేతిహాసములు వినిపించవచ్చును. అందువలన సస్వర వేదాధ్యయనము శూద్రులకు కూడదనిరి.

# 29. కమ్పనాధికారణము.

సంగతి:- ముందుచెప్పిన ప్రమితాధికరణములో బ్రహ్మజ్ఞానమునకై జీవుని అనువాదము చెప్పిరి. అలాగుననే ఇచట ప్రణానువాదము చెప్పుట సరికాదు. ఎందులకనగా అది కల్పితము. అందువలన దానిని బ్రహ్మతో

అభిన్నమని చెప్పలేము. కాన ఇచట ఈ అధికరణములో ప్రత్యుదహరణ సంగతి.

విషయము:- కఠోపనిషత్తునందు "యదిదం కిఞ్చజగత్సర్వం ప్రాణ ఏజతి నిస్సృతం మహద్భయం వజ్రముద్యతం య ఏతద్విదురమృతాస్తే భవంతి" (కఠ.2.6.2) అనగా 'ఈ సంపూర్ణజగత్తు ప్రాణమునుండియే ఉత్పన్నమగుచున్నది. ఆప్రాణముద్వారానే ప్రేరేపింపబడి ఈ జగత్తులో అన్ని చేష్టలు జరుగు చున్నవి. ఆప్రాణము అన్నింటికి భయకారణమగుటవలన కొట్టుటకు తయారై ఎత్తిపట్టుకున్న వజ్రహస్తునివలె నున్నది. ఈప్రాణము పేరుగాగల నిర్విశేషబ్రహ్మమును తెలిసికొనినవారు ముక్తులగుదురు. ఈ శృతివాక్యము ఈ అధికరణమునలో విచారణీయ విషయము.

సంశయము:- ఈ జగత్తును కంపింపజేయు ప్రాణవాచ్యము వాయువా, విద్యుత్తా లేక ఈశ్వరుడా?

పూర్వపక్షము:- భయమునకు కారణము గనుక విద్యుత్తు అన వచ్చును లేక దేహమును చలింపజేయు వాయువును ప్రాణపదవాచ్యమన వచ్చును కదా?

సిద్ధాంతము:- దేని జ్ఞానముద్వారా ముక్తి పొందెదరని చెప్పిరో ఏది అంతర్యామి రూపములో అందరిని లోపల నుండి శాసించుచున్నందువలన భయమునకు కారణమో మరియు సర్వశక్తి సంపన్నుడగుటవలన అందరిని ప్రేరేపించుచున్నాడో అట్టి గుణములు శక్తికలవాడు ఈశ్వరుడే. వానినే ప్రాణశబ్దముద్వారా చెప్పుచున్నారని నిశ్చయమయినది. కాని విద్యుత్తు వాయు వికారములను కాదు.

వైయాసిక న్యాయమాల:

71. జగత్కమ్పనకృత్ప్రాణోऽశనిర్వాయురుతేశ్వరః। అశనిర్భయహేతుత్వాద్వాయుర్వా దేహచాలనాత్॥

72. వేదనాదమృతత్వోక్తేరీశోऽన్తర్యామిరూపతః। భయహేతుశ్చాలనం తు సర్వశక్తియుతత్వతః॥

"యదిదం కిఞ్చ జగత్సర్వం ప్రాణ ఎజతి నిఃసృతం" అను శ్రుతిలో జగత్తును కంపింపజేయు ప్రాణము వజ్రమా లేక వాయువా లేక ఈశ్వరుడా. భయమునకు కారణమగుటవలన ఆప్రాణమును వజ్రమనవచ్చును లేక దేహాదుల సంచాలకమగుటవలన వాయువనవచ్చును. అను ఈ పూర్వపక్షమునకు సిద్ధాంన్తి సమాధానము- ప్రాణజ్ఞానము వలన మొక్షము రాదు. కావున కమ్పనము చేయునది ఈశ్వరుడే. ఆ ఈశ్వరుడు అంతర్యామి అగుటవలన భయకారకుడనవచ్చును. మరియు సర్వశక్తిసంపన్నుడగుటచే సంచాలకుడనిగూడ అనవచ్చును.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

"యదిదం కిఞ్చ జగత్సర్వం ప్రాణఏజతి నిఃసృతం మహద్భయంవజ్రముద్యతం య ఏతద్విదురమృతాస్తే భవంతి" అనగా 'ఈ సంపూర్ణజగత్తు ప్రాణమునండి ఉత్పన్నమైనది. ప్రాణముద్వారా కమ్పించు చున్నది. ఆ ప్రాణశబ్దవాచ్యమైన వస్తువు ఎత్తిపట్టిన వజ్రహస్తునివలె భయకారణము. ఈ ప్రాణశబ్దవాచ్యమైన దానిని ఎవరు తెలిసికొని అనుభవింతురో వారు మరణరహితులగు చున్నారు'. అచట జగత్కారణము మరియు కమ్పనాదులకు కారణమైన ప్రాణమునందు మూడువిధముల సందేహము కలదు. మొదటిది 'అశనిః' అనగా 'పిడుగు'

అనవచ్చును. ఎందులకనగా భయమునకు కారణముగా వినబడుటవలన. రెండవది 'వాయువు' అన వచ్చును. 'ప్రాణ ఏజతి' ప్రాణము దేహ సంచాలమునకు కర్త అగుట వలన 'వాయువు' అనవచ్చును. మూడవది 'ఈశ్వరుడు' అనవచ్చును.

ఈపూర్వపక్షమునకు సమాధానము:- ప్రాణశబ్దవాచ్యమును ఈశ్వరుడే అనవలయును. "య ఏతద్విదురమృతాస్తే భవంతి" 'ఆతత్వమును తెలిసికున్నవారికి అమరత్వ ప్రాప్తము' అనిరి గనుక. అంతర్యామి రూపములో ఆ ఈశ్వరునే భయమునకు కారణమని చెప్పవచ్చును. "భీషాఽస్మాద్వాతః పవతే" ఆపరమాత్మ భయమువల్లనే ఈవాయువు వీచు చున్నదని తైత్తిరీయోపనిషత్తులో (8.1) తెల్పిరి. దేహాది కమ్పనత్వము సర్వశక్తిమంతుడైన ఈశ్వరుని వలన  కలుగును. అందువలన ప్రాణశబ్దవాచ్యము ఈశ్వరుడే.

102. కమ్పనాత్. (1.3.39.)

సూత్రార్థము:- ఇచట ప్రాణశబ్దముద్వారా పరమాత్మని చెప్పుచున్నారు. వాయువికారము కాదు. ఎందులకనగా వాయువుతో కూడిన సంపూర్ణప్రపంచము బ్రహ్మ ఆజ్ఞ ద్వారా కంపించుచున్నది.
"తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే తస్మిన్ లోకాః శ్రితాః సర్వే తదు నాత్యేతి కశ్చన" (కఠ.2.6.3) "న ప్రాణేన నాపానేన మర్త్యో జీవతి కశ్చన ఇతరేణతు జీవన్తి యస్మిన్నేతావుపాశ్రితౌ:" (కఠ.2.5.5) అనగా 'అదే శుద్ధమైన బ్రహ్మము. దానినే అమృతమందురు. దానిలోనే అన్ని లోకములు ఆశ్రితమై యున్నవి. దానినెవరు అతిక్రమించలేరు'. 'మనుజుడు ప్రాణముచేతగాని, అపానముచేతగాని జీవించుటలేదు. ఈ రెండిటికీ అధారమైన వేరొక పదార్థముచేతనే జీవించుచున్నాడు'.
ఇటువంటి శ్రుతుల పర్యాలోచనవలన పరమాత్మయందే సర్వలోక జీవనము సంభవముకాని వాయువికారము-నందు కాదు. "భయాదగ్నిస్తపతి" (కఠ.2.3.3) "మహద్భయం వజ్రముద్యతం" "తమేవ విదిత్వాతిమృత్యుమేతి" అనగా 'పరమాత్మ భయమువలన అగ్ని తపించుచున్నది'. ' ఆప్రాణము అన్నింటికి భయకారణము అగుటవలన ఎత్తిపట్టుకున్న వజ్రహస్తునివలె నున్నది'. 'ఆ పరమాత్మని తెలిసికొనుటద్వారానే మృత్యుముఖమునుండి బయట పడగలరు'. ఈ శ్రుతులలో పరమాత్మ భయమునకు కారణమనియు, సానిధ్యమువలన భయకారణమునకు ప్రత్య-భిజ్ఞయు మరియు ఆపరమాత్మతో ఏకత్వ అనుభవమే మృత్యువాత నుండి తప్పించుననియు చెప్పుచున్నవి. అంతేగాక బ్రహ్మవిజ్ఞానమువలననే అమృతత్వ ఫలము వినిపించుచున్నందువలన  వాయువిజ్ఞానముద్వారా వినిపించు అమృతత్వ ఫలము ఆపేక్షిక ఫలమని తెలిసికొనవలయును.

# 30. జ్యోతిరధికరణము.

సంగతి:- క్రిందటి అధికరణములో సర్వశబ్ద శ్రుతిని సంకోచముచేయుట అసంగతమను కారణమువలన ప్రకరణము ద్వారా ప్రాణశబ్దమునకు అర్థము బ్రహ్మమనిరి. ఆలాగుననే సంప్రసాద వాక్యములో ప్రకరణ అనుగ్రాహక ప్రమాణము లేనందున జ్యోతిశబ్ద వాచ్యార్థము బ్రహ్మ మనవచ్చును. అందువలన ఇచట ప్రత్యుదాహరణ సంగతి.

విషయము:- "ఏష సంప్రసాదోఽస్మాచ్ఛరీరాత్సముత్థాయ పరం జ్యోతిరుపసంపద్య స్వేన రూపేణఽభినిష్పద్యతే" (ఛాం.8.12.3.) సుషుప్తి అవస్థలో ఈ జీవుడు స్థూల సూక్ష శరీరములనుండి పైకి లేచి పరమ జ్యోతిని పొంది బ్రహ్మ భావముతో అభివ్యక్తమగును. ఈవాక్యము ఈ అధికరణమనకు విచారణీయ విషయము.

సంశయము:- పై విషయ వాక్యములో గల జ్యోతిశబ్ద వాచ్యము ఆదిత్యాదుల తేజస్సా లేక పరబ్రహ్మమా?

పూర్వపక్షము:- ఆదిత్యాది తేజస్సులలో ఈ జ్యోతిశబ్దము రూఢ మగుటవలన జ్యోతిశబ్దముద్వారా సూర్యమండలాంతర్గత జ్యోతి అనియే చెప్పవలయును. 'సముత్థాయోపసంపద్య' అను యుక్తి కూడా కలదు.

సిద్ధాంతము:- సముత్థాన పదమునకు 'త్వం' పదార్థ శోధనమని అర్థము. మహావాక్యార్థ భోధము 'సంపత్తి' పదమునకు అర్థము. అందువలన ఇచట జ్యోతి శబ్దమునకు సునిశ్చితార్థము బ్రహ్మమే. ఎందులకనగా ఆ బ్రహ్మమే ఉత్తమ పురుషుడు మరియు వాడే నేత్రములకు సాక్షి.

వైయాసిక న్యాయమాలా:-

73. పరం జ్యోతిస్తు సూర్యస్య మణ్డలం బ్రహ్మ వా భవేత్। సముత్థాయోపసంపద్యేత్యుక్త్యా స్యాద్రవిమణ్డలమ్॥

74. సముత్థానం త్వంపదార్థశుద్ధిర్వాక్యార్థభోధనమ్। సంపత్తిరుత్తమత్వోక్తేర్బ్రహ్మ స్యాదస్యసాక్షితః॥

"ఏష సంప్రసాదోఽస్మాచ్ఛరీరాత్సముత్థాయ పరంజ్యోతిరుపసంపద్య స్వేన రూపేణాభినిష్పద్యతే స ఉత్తమః పురుషః" ఈ వాక్యములో 'పరంజ్యోతిః' పదము సూర్యమండలవాచకమా లేక బ్రహ్మ వాచకమా? శరీరమునుంచి బయట పడి జ్యోతిని పొందును అనుటవలన పరంజ్యోతి సూర్యమణ్డలమే అగును అనుపూర్వ పక్షమునకు సిద్ధాన్తి సమాధానము. ఇచట సముత్థానమనకు అర్థము బయటకు వచ్చుట కాదు మరియు సంపత్తికి అర్థము ప్రాప్తి కాదు. కాని త్వం పదార్థమైన జీవుని శుద్ధి స్థూల, సూక్ష్మ, కారణ శరీరముల వివేకము సముత్థానము. అనగా త్వం పదార్థ లక్ష్యార్థము చైతన్యమే కాని పై మూడు శరీరములు కాదు.ఈ విధముగా శుద్ధి చేసిన జీవచైతన్యమే బ్రహ్మమను జ్ఞానము సంపత్తి. శ్రుతులలో 'ఉత్తమః పురుషః'అని చెప్పుట వలననూ మరియు సర్వసాక్షి అనుట వలనను పరంజ్యోతి శబ్దార్థము పరబ్రహ్మమే.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఛాందోగ్యములోని "ఏషసంప్రసాదోఽస్మాచ్ఛరీరాత్సముత్థాయ పరంజ్యోతిరుపసంపద్య స్వేన రుపేణాఽభినిష్పద్యతే" (ఛాం.8.12.3) అనుశ్రుతికి అర్థము ఏ అవస్థలో జీవుడు మిక్కిలి ప్రసన్నుడై ఉంటాడో దానిని సంప్రసాదమందురు, అనగా సుషుప్తావస్థ. జీవుడు శరీరమునుండి వెలువడి తన స్వరూపముతో అభివ్యక్తమై పరమజ్యోతిని పొందుచున్నాడు. ఇచట జ్యోతి శబ్దమునకు అర్థము సందేహాస్పదము. అది సుర్యమణ్డలమా లేక బ్రహ్మమా?

పూర్వపక్షి ఆజ్యోతిని సూర్యమణ్డలమే అనును. ఎందులకనగా శరీరమునుండి బయటపడి పరంజ్యోతిని పొందుచున్నాడు అనిరి గనుక. బ్రహ్మ ప్రాప్తిలో నిర్గమనములేదు. ప్రాపకుడు మరియు ప్రాప్తవ్యమునకు భేదము లేదు. పొందువాడు పొందబడునది ఒకటే. అందువలన బయటకు వచ్చి జ్యోతిని పొందు చున్నాడనినపుడు సూర్య-మణ్డల ప్రాప్తియేనని పూర్వవాది మతము. సిద్ధాన్తి జ్యోతిశబ్దము బ్రహ్మ ప్రతిపాదకమనుచున్నాడు. ఏలనన శ్రుతిలో ఉత్తమపురుషుని చెప్పిరి వానికి సూర్య మణ్డలముతో సంబంధము లేదు.

"యో వేద- ఇదం జిఘ్రాణి- ఇతి, స ఆత్మా। యో వేద- ఇదం శృణ్వాని- ఇతి, స ఆత్మా" (ఛాం.8.12.4) 'ఎవడు తెలిసికొనుచున్నడో నేను దేనిద్వారా వాసన చూచుచున్నానో అది ఆత్మ అని, మరియు దేని ద్వారా విను చున్నానో అది ఆత్మా' ఈ శ్రుతుల ద్వారా ఘ్రాతృ ఘ్రాణ, ఘ్రేయములు మరియు శ్రోతృ, శ్రవణ, శ్రోతవ్యములకు సాక్షి ఆత్మ అని వినబడుచున్నది. చెప్పిన శ్రుతితో ఏకవాక్యత్వము చెప్పుటకు జ్యోతి శబ్దమును బ్రహ్మమని చెప్ప-వలయును. శరీరమునుండి బయటపడి జ్యోతిని పొందుటవలన బ్రహ్మకాదనిన అట్లనుట సరికాదు. ఇచట 'సముత్థానమునకు' అర్థము బయటపడుట కాదు, కాని 'త్వం' పదార్థ శుద్ధి అనగా ఆజీవ చైతన్యము స్థూల సూక్ష కారణ శరీరములకతీతమను వివేకము. ఉపసంపత్తి కర్థము ప్రాప్తి కాదు, కాని శోధించిన 'త్వం' పదార్థము బ్రహ్మ రూపమే అను జ్ఞానము. దీనిద్వారా జ్యోతిపద వాచ్యము బ్రహ్మమని సిద్ధమైనది.

103. జ్యోతిర్దర్శనాత్. (1.3.40.)

సూత్రార్థము:- "ఏష సంప్రసాదో" అను శ్రుతి వాక్యమునకు 'జీవుడు' శరీరమునుండి పైకి వచ్చి తన స్వరూపములో అభివ్యక్తమై పరజ్యోతిని పొందుచున్నాడు అని అర్థము. ఇచట జ్యోతి శబ్దముద్వారా ప్రతిపాద్యము బ్రహ్మమే. ఏలనన ఈ ఆత్మ పాపరహితమని చెప్పు ఉపక్రమ వాక్యముయొక్క విచారణ ద్వారా బ్రహ్మయొక్క వ్యాఖ్యానమే అనువృత్తిగా కానవచ్చు చున్నది అని చెప్పటవలన.

పరబ్రహ్మమే ఇచట జ్యోతి శబ్దార్థము. ఎందులకు? 'దర్శనాత్' అనగా చూడబడుటవలన. "య ఆత్మాఽపహహతపాప్మా" (ఛాం.8.7.1) 'ఈ ఆత్మా నిష్పాపరూపమని అర్థము'. ఈ పాపరహిత గుణముగల ఆత్మను ప్రకరణమునకు ఆదిలో అన్వేష్యము మరియు జిజ్ఞాసకు విషయరూపముగా ప్రతిజ్ఞ గావించిరి. ఇదే రూపములో అనువృత్తి గూడా చూడబడుచున్నది. "ఏ తం త్వేవ తే భూయోఽనువ్యాఖ్యాస్యామి" (ఛాం.8.9.6) 'దానినే మరల నీకు ఉపదేశము గావించెదను'. ఈ విధముగా అనుసంధానము చూడ బడుచున్నది. 'పరం జ్యోతిః స ఉత్తమః పురుషః' అను విషేషణములుగల జ్యోతి స్వరూపము పరబ్రహ్మమే. ఆదిత్యాదుల తేజస్సు కాదు.

## 31. అర్థాన్తరత్వాదివ్యపదేశాధికరణము.

సంగతి:- ఉపక్రమాదులను చూసి వెనుకటి అధికరణములో 'జ్యోతి' శబ్దము అర్థాంతరములో ప్రసిద్ధమైనను దానికి అర్థము బ్రహ్మ మనిరి. ఆలాగుననే ఆకాశ శబ్దముతో ఉపక్రమమైనందువలన ఆప్రసంగములో వచ్చిన బ్రహ్మాది శబ్దములకు వేరు అర్థము చెప్పవలయును. ఇట్టి దృష్టాంత సంగతి వలన ఈఅధికరణము ఆరంభమైనది.

విషయము:- "ఆకాశో వైనామ నామరూపయోర్నిర్వహితా తే యదన్తరా తద్బ్రహ్మ తదమృతం స ఆత్మా" (ఛాం.8.14.1) దీని అర్థము 'ఆకాశము నామరూపములను నిర్వహించుచున్నది (సృష్టిచేయుచున్నది). ఆ నామరూపములు దేనియందు వున్నవో అదియే బ్రహ్మము, అదియే అమరణధర్మము కలది, అదియే ఆత్మ. ఈ వాక్యము ఈ అధికరణములో విచారణీయ విషయము.

సంశయము:- ఇచట ఆకాశశబ్దము భూతాకాశమనియా లేక పరబ్రహ్మమనియా సంశయము.

పూర్వపక్షము:- సంపూర్ణజగత్తునకు అవకాశమిచ్చు ఆకాశము నిర్వాహక ధర్మము కలది గనుక భూతాకాశమే ఆకాశశబ్దార్థము.

సిద్ధాన్తము:- నిర్వాహకత్వము మరియు నియామకత్వము అనునవి చైతన్యము యొక్క ధర్మములు. అంతేగాక వాక్యశేషములో 'బ్రహ్మాత్మ' అను శబ్దము గూడ ఉపలబ్దమగుచున్నది. ఈ కారణములవలన ఆకాశ శబ్దమునకు సునిశ్చితమైన అర్థము 'బ్రహ్మ' మనియే తేలు చున్నది.

వైయాసిక న్యాయమాలా:-

75. వియద్వా బ్రహ్మ వాఽఽకాశో వై నామేతి శ్రుతం వియత్। అవకాశప్రదానేన సర్వనిర్వాహకత్వతః॥

76. నిర్వోఢృత్వం నియన్తృత్వం చైతన్యస్యైవ తత్త్వతః। బ్రహ్మ స్యాద్వాక్యశేషే చ బ్రహ్మాత్మేత్యాదిశబ్దతః॥

"ఆకాశో వైనామ..." ఈ శ్రుతిలో వచ్చిన 'ఆకాశ' పదమునకు అర్థము భూతాకాశమా లేక బ్రహ్మమా? సంపూర్ణ జగత్తునకు అవకాశమిచ్చి నిర్వాహకము గావించుటవలన ఆకాశపదమునకు భూతాకాశమని అర్థము చెప్పవచ్చును. ఈ పూర్వవాదమునకు సిద్ధాన్తము. నిర్వాహకత్వ నియంతృత్వములు చైతన్యమైన పరబ్రహ్మ లక్షణములు మరియు వాక్యశేషములో బ్రహ్మ, ఆత్మ ఆది శబ్దములు ఉన్నందువలన ఆకాశపదమునకు అర్థము పరబ్రహ్మమని చెప్పితీరవలయును.

ఛాందోగ్యములోని అష్టమాధ్యాయములో ఈ శ్రుతి వినబడుచున్నది. "ఆకాశో వై నామ నామరూపయోర్నిర్వహితా, తే యదన్తరా తద్బ్రహ్మ, తదమృతమ్, స ఆత్మా". (ఛాం.8.14.1) ఈ శ్రుత్యర్థము ఆకాశమను పేరుగల ఏదోపదార్థము గలదు. అది జగత్స్వరూపమైన నామరూపములకు నిర్వాహకము. ఈ నామరూపములు ఆ ఆకాశముకన్న భిన్నమైనవి లేక ఆకాశములోపల గలవు. ఆ ఆకాశము మరణరహితమైన బ్రహ్మమే. అదే ప్రత్యగాత్మ. ఈశ్రుతిలో వినబడు 'ఆకాశ' శబ్దమునకు భుతాకాశమని పూర్వవాది యనుచున్నాడు. ఎందులకనగా 'నామరూపయోనిర్వహితా' అని నిర్వాహకత్వము అనగా ఉండుటకు అవకాశమిచ్చునది గాన. అది భూతాకాశములోనే సంభవము. అందువలన ఆకాశ శబ్దమునకు భూతాకాశమని పూర్వవాది మతము. దానికి సిద్ధాన్తి ఇచ్చు సమాధానము. ఇచట నిర్వాహకత్వమనగా కేవలము అవకాశప్రదానమేకాదు కాని

నియామకత్వముగూడా.  అన్ని ప్రకారముల నిర్వాహకత్వము నియామకుని అధీనము. 'తే యదంతరా' అనువాక్య భాగముచే నామరూప భిన్నమగు మరియొకపదార్థము నియామకునిగా చెప్పబడినది. ఈనియామకత్వము లేక నియంతృత్వము చైతన్యమైన బ్రహ్మమందే యుక్తము. వేరొక శ్రుతిలో ఈవిధముగా వినబడు చున్నది. "అనేన జీవేనఽఽత్మనాఽనుప్రవిశ్య నామరుపే వ్యాకరవాణి". ఈ జీవునిలో ప్రవేశించి నామరూపములను  అభివ్యక్తము గావింతును. నియమింపబడు పదార్థముల  జ్ఞానము అచేతనమైన భూతాకాశమునకు సంభవముకాదు. అందువలన శ్రుతిలో వచ్చిన 'ఆకాశ' పదము బ్రహ్మ వాచకము. 'తద్బ్రహ్మ, తదమృతం, స ఆత్మా' అనువాక్య శేషములో బ్రహ్మత్వము, అమృతత్వము మరియు ఆత్మత్వము అను ధర్మములు చెప్పుటవలన. ఆ ధర్మములు భూతాకాశములో సంభవముకావు గనుక 'ఆకాశ' శబ్దమునకు అర్థము బ్రహ్మమనియే సిద్ధమగుచున్నది.

104. ఆకాశోఽర్థాన్తరత్వాదివ్యపదేశాత్. (1.3.41.)

సూత్రార్థము:- "ఆకాశో వై నామ నామరూపయోర్నిర్వహితా" ఈ శ్రుతిలో ఆకాశమునకు అర్థము పరమాత్మయే. ఎందులకు? ఆకాశమునకు భూతాకాశముకన్నా భిన్నరూపముగా ఉపదేశమున్నందువలన. "తే యదన్తరా" నామ రూపములు మధ్యలోగల చైతన్యము లేక నామరూపములు దేనిలో నున్నవో లేక ఆనామరూపములకన్న భిన్నమైనది బ్రహ్మము అను ఉపదేశమువలన. అది అమరణధర్మము. అదే ఆత్మ. ఈ విధముగా ఉపదేశము ఉన్నందువలన ఇచట ఆకాశమునకు బ్రహ్మమని అర్థము.

ఆకాశ శబ్దార్థము పరబ్రహ్మమే. ఎందులకనగా 'అర్థాన్తరత్వాదివ్యపదేశత్' అనగా నామరూపములలోగల చైతన్యమే బ్రహ్మము. ఇచట నామరూపముల నిర్వాహకము భూతాకాశముకన్న భిన్నమైన పరమాత్మదేనని ఉపదేశము. "అర్థాన్తరత్వాది" పదమునకు అర్థముచెప్పి 'ఆది' శబ్దమునకు వ్యాఖ్యానము గావించుచున్నరు. ఆది శబ్దముద్వారా 'తద్బ్రహ్మ, తదమృతం, స ఆత్మా' (ఛాం.8.14.1) అదేబ్రహ్మము, అది అమరణధర్మము గలది, అదే ఆత్మ. అను శ్రుతిని చెప్పి ఆ శ్రుతిద్వారా బ్రహ్మ చిహ్నములు చెప్పుటవలన పరమాత్మయే ఆకాశశబ్దార్థము. భూతాకాశములో ఆకాశ శబ్దము లోకరూఢి అనిన ఆలోక రూఢిత్వము అకించిత్కరము(అనగా వ్యర్థము). నామరూపముల నిర్వాహకత్వము నిరంకుశముగా బ్రహ్మ భిన్నమైన దానిలో సంభవముకాదు. అంతేగాక ఇచట బ్రహ్మ చిహ్నములైన సృష్ట్యాదులు కూడ చెప్పబడినవి.  ఈ కారణముల వలన ఆకాశ శబ్దార్థము బ్రహ్మమే.

# 32. సుషుప్త్యుత్క్రాన్త్యధికరణము.

సంగతి:- వెనుకటి అధికరణములో ఆకాశ శబ్దమునకు అర్థము బ్రహ్మ మనిరి. కాని ప్రాజ్ఞ ఆత్మతో (అను బ్రహ్మముతో) జీవుని సంపరిష్వక్తము అగుట వలన అభిన్నమైనను గౌణభేదమని చెప్పవచ్చునుకదా. అను

ఆక్షేపమునకు సమాధానమిచ్చుటవలన ఇచట ఆక్షేపసంగతి.

విషయము:- "యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు హృద్యన్తర్జ్యోతిః పురుషః" (బృ.4.3.7) ప్రాణముల మధ్యలో విజ్ఞానమయ మనగా లింగశరీరము, అనగా స్థూలదేహ భిన్నమని సిద్ధమగుచున్నది, ప్రాణవాయువులలో అనగా చక్షురాది ఇంద్రియములలో, మరియు 'హృది' అనగా హృదయములో అని ఆధారత్వ నిర్దేశము వలన ఆధేయమైనటువంటి పురుషుడు ఇంద్రియప్రాణములకతీతమని సిద్ధమైనది. ఈ శ్రుతి వాక్యము ఇచట విచారణీయము.

సంశయము:- ఈ పై శ్రుతి వాక్యము జీవానువాద పరకమా లేక జీవుని అనువాదము చేసి సంసారధర్మమునకు అతీతమైన బ్రహ్మస్వరూప పరకమా? అను సంశయము ఇచట కలుగు చున్నది.

పూర్వపక్షము:- ఉపక్రమోపసంహారములు చూచిన విజ్ఞానమయ శబ్దమునకు 'సంసారి జీవుడని' అర్థము కలుగుచున్నది.

సిద్ధాన్తి:- ప్రాణాదులు ఉపాధిగాగల జీవాత్మ లోకప్రసిద్ధము. వానిని వేరు చేసి ఈశ్రుతిద్వారా బ్రహ్మను ప్రతిపాదించుచున్నారు. అన్య ప్రమాణములద్వారా తెలిసికోలేని (వేదైక గమ్యము) బ్రహ్మమే విజ్ఞానమయ శబ్దమునకు సునిశ్చితార్థము.

వైయాసికన్యాయమాలా:-

77. స్యాద్విజ్ఞానమయో జీవో బ్రహ్మ వా జీవో ఇష్యతే। ఆదిమధ్యావసానేషు సంసారప్రతిపదానాత్॥

78. వివిచ్య లోకసంసిద్ధం జీవం ప్రాణాద్యుపాధితః। బ్రహ్మత్వమన్యతోఽప్రాప్తం బోధ్యతే బ్రహ్మ నేతరత్॥

"యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు హృద్యన్తర్జ్యోతిః పురుషః స సమానః సన్నుభౌ లోకావనుసంచరన్తి" అను శ్రుతిలో గల విజ్ఞానమయ శబ్దమునకు అర్థము జీవుడా లేక బ్రహ్మమా? ఆదిమధ్యాంతములలో జీవుని ప్రతిపాదించుటవలన విజ్ఞానమయ శబ్దార్థము జీవుడే అను పూర్వపక్షమునకు సిద్ధాన్తి సమాధానము. వేద మాత లోకసిద్ధమైన జీవుని ప్రాణాది ఉపాధులనుండి వేరుచేసి వానిలో బ్రహ్మత్వబోధ గావించుచున్నది. అందువలన అన్యప్రమాణములద్వారా తెలిసికొనలేని బ్రహ్మమే శ్రుతిలో ప్రతిపాద్యము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

బృహదారణ్యకములో షష్టాధ్యాయములోనిదీ శ్రుతివాక్యము. "యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు హృద్యన్తర్జ్యోతిః పురుషః స సమానః సన్నుబౌ లోకావనుసంచరన్తి" ( అనగా స్థూల దేహము, ఇంద్రియములు, ప్రాణాది వాయువులు, అంతఃకరణము మరియు దానిలో గల కామ సంకాల్పాది వృత్తులనుండి భిన్నమై దానికే సాక్షియై ఉన్న జ్యోతిస్వరూప పురుషుడు లింగశరీరముతో అబేధాధ్యాసము కావించుకొని లింగశరీర సమానుడై ఈ లోక పరలోకములలో సంచరించును.) ఈ శ్రుతికి అర్థము 'విజ్ఞానమయము' అనగా లింగశరీరమయము, స్థూల దేహముకన్న ఈలింగ శరీరము భిన్నమని సిద్ధమైనది. 'ప్రాణేషు' చక్షురాది ఇంద్రియములలో లేక ప్రాణాది

వాయువులలో అని అర్థము. 'హృది' అనగా అంతఃకరణములో అనినపుడు ఆధారము చెప్పుటవలన అందులోగల ఆధేయపురుషుడు ప్రాణేంద్రియమనోబుద్ధులకు అతిరిక్తమని సిద్ధము. 'అంతః' శబ్దముద్వారా కామ సంకల్పాది మనోవృత్తులకన్న భిన్నమని అర్థము. మనోపరిణామములైన ఈ వృత్తులు జడములు మరియు చైతన్య ఆత్మ కన్న బయట గలవు. ఈ విధముగా స్థూలదేహము, ఇంద్రియములు, ప్రాణవాయువులు, అంతఃకరణవృత్తులకన్న వేరై వానికి సాక్షిరూపములోనున్న చైతన్య జ్యోతిస్వరూప పురుషుడని అర్థము. ఆ పురుషుడు లింగశరీరముతో తాదాత్మ్యమును పొంది లింగశరీరముతో సమానమై ఇహలోక పరలోకములందు సంచరించును.

ఈ శ్రుతివాక్యయమును చూసి పూర్వపక్షి చెప్పుచున్నాడు. విజ్ఞానమయుడు అనుదానికి అర్థము జీవుడనవలయును. జ్యోతిర్బ్రాహ్మణము, శారీరబ్రాహ్మణము ఈ రెండిటిలో ఆదిమధ్యావసానములందు సంసారమునే విస్తారముగా చెప్పుటవలన విజ్ఞానమయుడు జీవుడు. ఆదిలో 'ఉభౌలోకావనుసంచరతి' అని సంసారకథనము స్పష్టము. మధ్యలో సుషుప్తి, స్వప్నాంతము, బుద్ధాంతము చెప్పు కండికల ద్వారా జీవుని అవస్థా త్రయములు విస్తారముగా చెప్పిరి. అంతములో ' స వా అయమాత్మా బ్రహ్మ విజ్ఞానమయో మనోమయః ప్రాణమయః' ఈ ఆత్మ బ్రహ్మము, విజ్ఞానమయము మనోమయము మరియు ప్రాణమయమని ఉపాధితో కూడిన జీవుని వర్ణన చెప్పుటవలన సంసారమునే చెప్పు చున్నారు. అందువలన పైశ్రుతిలో జీవుని గురించే చెప్పుచున్నారు. ఈపూర్వపక్షమునకు సిద్ధాంతి చెప్పు సమాధానము. పైశ్రుతిలో జీవుని ప్రతిపాదించుటలేదు. ఏలనన నేను అను జ్ఞానమునకు విషయమగుటవలన. అదిలోక ప్రసిద్ధము. మరి మొదటిలో జీవుని ఎందుకు ప్రతిపాదించిరి అనిన ప్రాణాదుల ఉపాధులనుండి ఆ జీవుని భిన్నమని తెలుసుకొనుటకు. మధ్యలో మూడు అవస్థలనుండి సంసార రాహిత్యమని చెప్పుటకు అవస్థల వర్ణన కావించబడినది. అంతములో జీవుని స్వరూపము అనువదించి వానినే బ్రహ్మగా బోధగావించుచున్నారు. ఈ బ్రహ్మత్వము శ్రుతి తప్ప వేరు ప్రమాణముల ద్వారా ప్రతిపాద్యము కాదు. అందుకని పై చెప్పన శ్రుతిలో బ్రహ్మమే ప్రతిపాద్యము కాని జీవుడు కాదనుట సిద్ధమైనది.

### 105. సుషుప్త్యుత్క్రాన్త్యోర్భేదేన. (1.3.42.)

సూత్రార్థము:- "యోఽయం విజ్ఞానమయః" అనగా ప్రాణములకన్న భిన్నమైన జీవుడు (విజ్ఞానమయుడు) మరియు హృదయములోగల స్వయంజ్యోతి పురుషుడు ఆత్మయే.

ఈ శ్రుతిలో చెప్పు పురుషుడు పరమాత్మయే. ఏలనన "ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తః" ప్రాజ్ఞాత్మతో కలిసి ఏకీభూతమైన జీవుడు బాహ్యాంతర పదార్థములను తెలుసుకోడు. "అయం శారీరఆత్మా ప్రాజ్ఞేనఆత్మానాన్వారూఢ ఉత్సర్జన్యాతి" (బృ. 4.3.35). అనగా ఈ జీవుడు ప్రాజ్ఞాత్మతో అధిష్టితుడై ఘోరముగా శబ్దములు కావించుచు ఉత్క్రాంతుడగును (మరణించును). ఈ ప్రకారము సుషుప్తి ఉత్క్రాంతులలో జీవుని కన్న భిన్నమైన పరమాత్మను ప్రాజ్ఞ శబ్దముతో చెప్పిరి. ''ధ్యాయతీవ లేలాయతీవ" అనగా ధ్యానము మరియు చింతన చేయుచున్నవాని వలే

ప్రతీతమగుచున్నది. ఈ శ్రుతిలో ఉత్క్రమణము  లేక మరణము చెప్పచూ జీవుని అనువాదము చెప్పి బ్రహ్మతో ఐక్యము చెప్పుటే అభీష్టము. అంతేగాక ఈ వాక్యములో జీవుని ధర్మముల నిరాకరణము కూడా చూడబడుచున్నది. "స ఏష మహానజ ఆత్మా" అని ఉపసంహారములో ప్రాణములలో లక్షితమైన జీవాత్మనే 'మహానజ ఆత్మా' అనుపదముతో చెప్పి పరమేశ్వర స్వరూపముగా ప్రతిపాదించిరి. గాన విషయ వాక్య గతమైన విజ్ఞానమయ పదమునకు పరమేశ్వరుడని అర్థము.

106. పత్యాదిశబ్దేభ్యః. (1.3.43.)

సూత్రార్థము:- "యోఽయం విజ్ఞానమయః" (బృ.4.3.7) అను పూర్వ వాక్యములో నున్న "సర్వస్య వశీ సర్వస్యేశానః సర్వస్యాధిపతిః" అనగా అందరినీ వశములో నుంచుకొనువాడు, అందరినీ శాసించువాడు, అందరికీ అధిపతి. అనువాక్యములో గల 'పతి' ఆది శబ్దములు అసంసారి పరమాత్మను ప్రతిపాదించు చున్నవి.

మరియు "స న సాధునా కర్మణా భూయాన్నో ఏవాసాధునా కనీయాన్" అనగా ఆ ఆత్మ మంచికర్మలద్వారా అభివృద్ధి నొందదు, పాప కర్మలద్వారా క్షీణించదు. ఈ శ్రుతివాక్యము ద్వారా పరమేశ్వరునిలో సంసారిత్వము నిషేధించబడినది. అందులకే విషయవాక్యములో 'అసంసారి బ్రహ్మరూపమైన ఆత్మనే ప్రతిపాదించిరని స్పష్టముగా తెలియు చున్నది.

## బ్రహ్మసూత్రహృదయమునందు ప్రథమాధ్యాయములోని తృతీయపాద సంకలనము సమాప్తము.

## ప్రథమాధ్యాయము-చతుర్థపాదము.

ఈ పాదములో సందేహాస్పదములగు 'అవ్యక్తము' 'అజాది' పదముల విచారము గావించిరి, ఏలనన ఈ శబ్దముల ప్రయోగము సాంఖ్యస్మృతిలో గల ప్రధాన విషయములోగూడ కానవచ్చు చున్నవి. సందేహము కలుగుట వలన వీని విచారము అత్యావశ్యకము.

ఈక్షత్యధికరణములో సాంఖ్యస్మృతి కల్పిత ప్రధానమును ప్రతిపాదించు శ్రుతివాక్యము లేదని ప్రతిజ్ఞ గావించిరి. మరియు సామాన్యరూపముగా అన్ని శ్రుతి వాక్యములు చైతన్యమే జగత్కారణమని చెప్పు చున్నవి. వెనుకటి మూడు పాదములలో శ్రుతి వాక్యములు బ్రహ్మమునందే సమన్వయము మరియు తాత్పర్యములనిరి. ఈ పాదములో ప్రధానము వేదబాహ్యమని (అశబ్దము) ప్రతిజ్ఞాతార్థముపై ఆక్షేపము గావించి సమాధానము చెప్పుటవలన ఈ పాదముతో పూర్వ గ్రంథమునకు  ఆక్షేపసంగతి అనవలయును.

దీనికి పూర్వాధికరణములో జీవుని ప్రతిపాదించు ప్రసిద్ధవాక్యములుగూడ అప్రసిద్ధ బ్రహ్మపరకములని చెప్పిరి.

ఆలాగుననే శ్రుతిలో అప్రసిద్ధప్రధానమునకు 'మహతః పరమవ్యక్తమ్' అను కాఠకవాక్యములోని శబ్దములను చెప్పవలయును. ఇచట దృష్టాంతసంగతి.

# 33. ఆనుమానాధికరణము.

సంగతి:- "మహతః పరమవ్యక్తమవ్యాక్తాత్పురుషః పరః" అను కాఠక వాక్యము అప్రసిద్ధప్రధానము చెప్పుచున్న దనుటవలన ఇచట దృష్టాంత సంగతి.

విషయము:- పైచెప్పిన సంగతిలో నున్న కాఠక వాక్యము ఈ అధికరణమునకు విచారణీయ విషయము.

సంశయము:- 'అవ్యక్త' పదముతో ప్రధానము చెప్పిరా లేక శరీరమా?

పూర్వపక్షి:- సాంఖ్యస్మృతిలో మహత్, అవ్యక్తము మరియు పురుషుడు అను పదములు వాని క్రమము ప్రసిద్ధము. వాని ప్రత్యభిజ్ఞ (అదే ఇదను భోదించు జ్ఞానము) కఠ శ్రుతిలో చెప్పిరిగాన అవ్యక్త పదమునకు ప్రధానమను అర్థము చెప్పవచ్చును.

సిద్ధాన్తము:- ముందు ఏఏ అర్థములు వినిపించినవో వానిని అన్నింటినీ ఆయా నామములతో చెప్పిన ప్రత్యభిజ్ఞ అగును. కాని మొదట 'శరీర' శబ్దముతో చెప్పి దానినే పరిశేష న్యాయముద్వారా అవ్యక్త పదమని చెప్పుచున్నారు. స్థూలశరీరము అవ్యక్త పద వాచ్యము కాక పోవచ్చును. కాని ఈస్థూల శరీరమును ఆరంభించునవి భూతసూక్ష్మములగుటచే ఆ కారణావస్థను అవ్యక్తమనినారు. ఏవిధముగాననిన "గోభిః శ్రీణీత మత్సరమ్" (ఋ.సం. 9.4.6.4.7) అనగా గోవికారమైన పాలతో సోమరసము కలుపవలెనని అర్థము. ఇచట గో శబ్ద ప్రయోగము దాని వికారములో ప్రయోగించిరి. ఆలగుననే సూక్ష్మభూతముల కార్యమైన స్థూల శరీరమును అవ్యక్త పదముతో చెప్పుట విరోధముకాదు.

వైయసికన్యాయమాలా:-

79. మహతః పరమవ్యక్తం ప్రధానమథవా వపుః। ప్రధానం సాంఖ్య శాస్త్రోక్తతత్త్వానాం ప్రత్యభిజ్ఞయా॥

80. శ్రుతార్థప్రత్యభిజ్ఞానాత్పరిశేషాచ్చ తద్వపుః। సూక్ష్మత్వాత్కారణావస్థమవ్యక్తాఖ్యాం తదర్హతి॥

విషయ వాక్యములో చెప్పిన శ్రుతిలో గల 'అవ్యక్త' శబ్దము ప్రధానమా లేక శరీరమా. సాంఖ్యశాస్త్రములో చెప్పిన క్రమములాగునే కఠోపనిషత్తులో 'మహదవ్యక్త పురుష' శబ్దముల క్రమము ప్రత్యభిజ్ఞ అగుటవలన అవ్యక్త పదము ప్రధానమును ప్రతిపాదించుచున్నదని చెప్పిన పూర్వపక్షమునకు మాధానము. కఠోపనిషత్తులో పూర్వ వాక్యములో (1.3.4) చెప్పిన శరీరము యొక్క ప్రత్యభిజ్ఞ ఉత్తర వాక్యములో (1.3.10-11) గల అవ్యక్త శబ్దముతో చెప్పుట వలన పరిశేషన్యాయము ద్వారా సూక్ష్మశరీరమును అవ్యక్త శబ్దముతో చెప్పిరి.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

" మహతః పరమవ్యక్తం అవ్యక్తాత్పురుషః పరః"(కఠ. 1.3.11) ఈ శ్రుతి వాక్యములోగల అవ్యక్త శబ్దముద్వారా

ప్రధానము చెప్పుచున్నారు. ఎందులకనగా ప్రత్యభిజ్ఞ వలన. మహదవ్యక్త పురుష శబ్దములు సాంఖ్య శాస్త్రములో ఏక్రమములో ప్రసిద్ధములో ఆలాగుననే శ్రుతులు చెప్పినందున అవ్యక్త శబ్దవాచ్యము ప్రధానము. ఈ పూర్వపక్షమునకు సిద్ధాన్తి చెప్పుచున్న సమాధానము. అవ్యక్త శబ్దార్థము శరీరమగును. పూర్వవాక్యములో చెప్పిన శరీరమును ఇచట ప్రత్యభిజ్ఞ గావించుట వలన, పూర్వ వాక్యములో శరీరాదులను రథాదుల కల్పన ద్వారా చెప్పిరి. "ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు। బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ। ఇంద్రియాణి హయానాహుర్విషయాంస్తేషు గోచరాన్.... సోఽధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమంపదమ్" (కఠ.1.3.3-4) జీవుడు రథికుడు. శరీరము రథము. బుద్ధి సారథి. మనస్సు పగ్గములు. ఇంద్రియములు గుఱ్ఱములు. శబ్దస్పర్శరూపరసగంధములు మార్గములు. ఏ రథికుడు గుఱ్ఱములను స్వాధీనములను చేసికొనగల సారథిని కలిగియున్నడో అట్టివాడు సుఖముగ నామార్గమునతిక్రమించి దానికంతమున నున్న విష్ణురూప మొక్షపదమును పొందును.

పూర్వవాక్యములో చెప్పిన పదార్థములను ఈ చెప్పబోవు శ్రుతిలో ప్రత్యభిజ్ఞ కావించుచున్నారు.
"ఇంద్రియేభ్యః పరా హ్యర్థా అర్థేభ్యశ్చ పరం మనః। మనసస్తు పరా బుద్ధిర్బుద్ధేరాత్మా మహాన్పరః। మహతః పరమవ్యక్తమవ్యక్తాత్పురుషః పరః పురుషాన్న పరం కించిత్సా కాష్ఠా సా పరా గతిః"॥ (కఠ.1.3.10-11)
'ఇంద్రియముల కంటె శబ్దాది విషయములును వానికంటె మనస్సును దాని కంటె బుద్ధియు నంతకంటె నవ్యక్తంబును అంతకంటె సర్వవ్యాపకుడగు పరమేశ్వరుడును శ్రేష్టులు. ఆయనకంటె శ్రేష్టులు లేరు. అయనయే సర్వమునకు అంతము మరియు ఆయనయే పరమగతి.'
సన్నిహిత మగుటవలన సాంఖ్యస్మృతి ప్రత్యభిజ్ఞకంటె కఠశ్రుతి ప్రత్యభిజ్ఞ ప్రబలము. శ్రుతిలో అనేక శబ్దముల ప్రత్యభిజ్ఞ కనబడుచున్నను కేవలము శరీరము అను శబ్దమునకు ప్రత్యభిజ్ఞ కానవచ్చుటలేదు. ఈ స్థితిలో అవ్యక్త శబ్దార్థము శరీరమేనని మీరు ఎట్లు నిర్ణయించగలరు? అనగా పరిశేషన్యాయముద్వారా అని చెప్పెదము. పూర్వ వాక్యములో చెప్పిన ఇంద్రియములు, విషయములు, మనోబుద్ధులు మొదలగుగాగల శబ్దములతో నిర్దేశించిన పదార్థములనే ఉత్తరవాక్యములో అనేకశబ్దములతో చెప్పిరి. పూర్వవాక్యములో చెప్పిన ఆత్మ శబ్దమునకు ఉత్తరవాక్యములో పురుష శబ్దముతో చెప్పిరి. ఉత్తర వాక్యములో మహత్ శబ్దముతో చెప్పిన దానిని పూర్వ వాక్యములో బుద్ధి శబ్దముద్వారా చెప్పిరి. బుద్ధి రెండు రకములు మ్నుష్యుల బుద్ధి ఒకటి దానికి కారణమైన హిరణ్యగర్భుని బుద్ధి మహత్ శబ్ద వాచ్యము రెండవది. ఈ రెండు బుద్ధులను పూర్వ వాక్యములో ఒకటిగా చెప్పిరి. కాని తరువాతి వాక్యములో వానిని భిన్నముగా చెప్పిరి. ఇట్లు చెప్పిన పూర్వవాక్యములో కేవలము శరీర శబ్దము ఉత్తర వాక్యములో అవ్యక్త శబ్దము మిగులు చున్నవి. ఈ విధముగా పరిశేషము గావించినను, శరీరము స్పష్టముగా కనిపించుటవలన వ్యక్తము అని అర్థము. మరి వ్యక్తమగు శరీరమును అవ్యక్తమని ఎట్లు చెప్పగలరు. అనగా కారణావస్థను పొందిన శరీరము సూక్ష్మభూతములతో తయారగుటవలన స్పష్టముగా కనిపించదు. అందుకని ఆ సూక్ష్మశరీరమును అవ్యక్త శబ్దముతో చెప్పుచున్నారు. అంతేకాని ప్రధానము కాదు.

107.ఆనుమానికమప్యేకేషమితి చేన్న శరీరరూపకవిన్యస్తగృహీతేర్దర్శయతి చ. (1.4.1.)

సూత్రార్థము:- కొన్ని శాఖలవారు "మహతః పరమవ్యక్తమ్" అనగా మహత్తు కన్నా అవ్యక్తము శ్రేష్టము అవ్యక్తము కన్నా పురుషుడు శ్రేష్టము. ఈ శ్రుతిలో ప్రధానమునే చెప్పుదురు. అపుడు ప్రధానములో అశబ్దత్వము సిద్ధముకాదు అనిన ఆవిధముగా చెప్పుట సరికాదు. ఏలనన ఇంతకు పూర్వము చెప్పిన వాక్యములో నున్న రథరూప కల్పనలో చెప్పిన శరీరమునే ఇచట అవ్యక్త శబ్దముతో గ్రహించు చున్నారు. ఇది పూర్వాపరములు మరియు సందర్భముయొక్క పర్యాలోచన ద్వారా సిద్ధమగును.

వేదాంత వాక్యముల యొక్క సమన్వయములో నియమములు లేవు అని పూర్వపక్ష అనిన, సిద్ధాంతి సమన్వయములోనే నియమములు గలవనును. అవ్యక్త పద వాక్యము ప్రధానము కాదు. ఎందులకనగా 'శరీర రూపకవిన్యస్తగృహీతే' అనగా పూర్వ వాక్యములో శరీరమును రథరూపముగా కల్పింపబడిన దానినే గ్రహించుటచే అవ్యక్త శబ్దమునకు శరీరమనే అర్థము. ఏలనన ప్రకరణమువలన మరియు పరిశేషన్యాయము వలన కూడా. ప్రకరణములో ఆత్మ శరీరాదుల రథి రథాది రూపముల కల్పన చెప్పిరి. 'ఆత్మానం రథినం విద్ధి' అనుశ్రుతి ద్వారా. అసంయమిత ఇంద్రియములద్వారా జీవుని సంసారప్రాప్తి మరియు సంయమిత ఇంద్రియములద్వారా జీవుని విష్ణుపద ప్రాప్తిగూడా శ్రుతి చెప్పుచున్నది. ఆతరువాత 'ఇంద్రియేభ్యః పరాహ్యర్థా' అనుశ్రుతి ద్వారా పురుషునికన్న భిన్నమైనది లేదు అదే చరమగతి యని చెప్పిరి. తరువాత చెప్పిన శ్రుతిలో (1.3.10) రథాది రూపముగా కల్పింపబడిన ఇంద్రియములను సమానరూపముగా గ్రహించినను ప్రతిపాదిత విషయములో శరీరమే మిగులు చున్నది. ఆశరీరమును అవ్యక్త పదముతో చెప్పిరి కాని ప్రధానము కాదు. అందువలన పూర్వాపరముల పర్యలోచన ద్వారా సాంఖ్యశాస్త్రములో కల్పితమైన ప్రధానము గ్రహించుట ఈప్రసంగములో కుదరదు. మరి ఆ ప్రధానమును అవ్యక్త శబ్దముతో ఎట్లుచెప్పుచున్నారు అను ప్రశ్నకు సమాధానముగా తరువాతి సూత్రము చెప్పుచున్నారు.

108. సూక్ష్మంతు తదర్హత్వాత్. (1.4.2)

సూత్రార్థము:- స్థూల శరీరము నారంభించు సూక్ష్మభూతముల భాగమునే సూక్షశరీరమందురు. ఆ సూక్ష్మశరీరము అవ్యక్త శబ్దముతో గ్రహించుచున్నారు. సూక్ష్మభూతములు కానరావు, గనుక అవ్యక్త శబ్దయోగ్యము. అనగా అవ్యక్త శబ్ద వాచ్యము.

సూత్రములో చెప్పిన 'తు' శబ్దము శంకనివారించుటకు. సూక్షభూతములకార్యము స్థూలశరీరము. ఈస్థూలభూతములకు కారణము సూక్ష్మభూతములు లేక స్థూలశరీరమునకు కారణము సూక్ష్మశరీరము. ఆసూక్ష్మశరీరమునే అవ్యక్త పదముతో చెప్పుట అభీష్టము. ఎందులకనగా శరీరమును ఆరంభించు సూక్ష్మభూతములను అవ్యక్త శబ్దముతో చెప్పవచ్చును. కార్య కారణములు అభిన్నము. అందువలన

కారణశబ్దమును దాని వికారములో వాడుట చూడబడు చున్నది. దాని ఉదాహరణము ఋగ్వేద సంహితలో గల ఈ వాక్యము "గోభిః శ్రీణీత మత్సరమ్" (9.46.4) అనగా గోవికారమైన పాలతో సోమరసము కలుపవలయునని అర్థము. వికారార్థములో ప్రకృత పదము ఉపయోగించిరి. కార్యము (పాలు) చెప్పుటకు కారణమైన ఆవు శబ్దమును వేదములో చెప్పిరి. ఆవుతో సోమరసము కలుపలేము గనుక దాని వికారమైన పాలను గ్రహించవలయును. అట్లే ఇచట శరీరముకార్యము లేక వికృతి. దానికి కారణము సూక్ష్మభూతములు ప్రకృతి. కార్యమును చెప్పుటకు కారణపదము అవ్యక్త పదమునుపయోగించిరి. అనగా ప్రకృతి వాచకమైన అవ్యక్త పదమును దాని కారణమైన శరీరములో ప్రయోగించుట విరోధముకాదు.

శరీరమును ఆరంభించుటకు కారణమైన సూక్ష్మభూతములను 'అవ్యక్త' పదముతో చెప్పిన దానినే సాంఖ్యశాస్త్రములో ప్రధానరూపముగా స్వీకరించిరి గనుక మీవేదాంతమతములోగూడ సాంఖ్యసిద్ధాంతము స్వీకరించిరను ప్రసంగము వచ్చును. ఈప్రశ్నకు సమాధానముగా రాబోవు సూత్రము చెప్పిరి.

### 109. తదధీనత్వాదర్థవత్. (1.4.3.)

సూత్రర్థము:- అవ్యక్తము ఈశ్వరాధీనమే గాని స్వతంత్రము కాదు. అవ్యక్త మనగా మాయ. ఆ అవ్యక్త పద వాచ్యమైన మాయ సృష్టిలో ఈశ్వరునికి సహాయము. ఆవిధముగనే దాని సార్థకతా.

శ్రుతి మాత్రైక శరణుడగు వేదాంతి స్వతంత్ర ప్రధాన కారణ వాదమును అంగీకరించట లేదు. అనగా త్రిగుణాత్మకమగు ప్రధానము స్వతంత్రముగా జగత్ సృష్టి చేయలేదు. ఎందులకనగా "తదధీనత్వాత్" పరమేశ్వరుని అధీనములోనుండి అవ్యక్తము జగత్ సృష్టి చేయుటలో పరాధీనము. ఈశ్వరుని జగత్ సృష్టికారణమని వప్పుకొనిన ప్రకృతి లేక మాయ యొక్క ఆవశ్యకత లేదని చెప్పవచ్చునుకదా అనిన అట్లనుట సరికాదు. ఏలనన శ్వేతాశ్వతరోపనిషత్తులో "మాయాం తు ప్రకృతిం విద్ధి మాయినంతు మహేశ్వరమ్" (శ్వే.4.10) అనగా "మాయ జగత్తునకు ప్రకృతి మరియు మహేశ్వరుడు మాయావి అని తెలిసికొనుము", ఈ విధముగా చెప్పుటవలన ఈ మాయనే అవ్యక్త మందురు. దాని సార్థకత పరమేశ్వరునికి సహకారి రూపములోనే. అందువలన పరమేశ్వరుడే మాయ సహాయముతో జగత్తును సృష్టించును గాని స్వతంత్రముగా మాయ కాదు.

### 110. జ్ఞేయత్వావచనాచ్చ. (1.4.4.)

సుత్రార్థము:- ఈ ప్రకరణములో అవ్యక్తమును జ్ఞేయమని తెలుపలేదు. గాన అవ్యక్త శబ్దము ప్రధాన వాచ్యార్థము గాదని విషయగతమైన శ్రుతిద్వారా స్పష్టమగు చున్నది.

అవ్యక్తము ప్రధానము గాదని కారణాంతరము ద్వారా చెప్పు చున్నారు. ప్రధాన పరుషుల వివేకజ్ఞానము ద్వారా ముక్తి కలుగునని చెప్పు సాంఖ్యవాదులు ప్రధానమును జ్ఞేయమనిరి. కాని శ్రుతులలో ప్రధానము జ్ఞేయమని ఎచ్చటను చెప్పలేదు. అవ్యక్త పదము వినబడినదనిన మాత్రముననే ప్రధానమును జ్ఞేయమను ఉపదేశము

లేనందున సాంఖ్య శ్రుతిలో కల్పితమైన ప్రధానమును ఇచట అవ్యక్త పదముతో చెప్పుట సరికాదు. కాని శరీరాదులను రథరూపముగా కల్పన చేయుట మరియు విష్ణువును పరమపద మని చెప్పటయే శ్రుతి ముఖ్యార్థము అనిన ఏదోషము లేదు.

111. వదతీతి చేన్న, ప్రాజ్ఞో హి ప్రకరణాత్. (1.4.5.)

సూత్రార్థము:- "మహతః పరమ్" అనగా 'మహత్తు కన్న ఉత్కృష్టమైన అవినాశి తత్వమును తెలిసికొని' అను ఈవాక్యములో ప్రధానమే జ్ఞేయమనిన అది సరికాదు. ఏలనన "పురుషాన్న పరం కించిత్" అనగా ' ఆపురుషుని కన్న శ్రేష్టమైనదేదియు లేదు'. పరమాత్మనే తెలుసుకొనవలయునని చెప్పుటవలనను మరియు ప్రకరణములో ఆత్మను వర్ణించుట వలనను పరమాత్మయే చెప్పిన విషయవాక్యములో జ్ఞేయము.
ప్రధానము జ్ఞేయము కాదని చెప్పిన కారణము అసిద్ధము. ఎందులకనగా కఠ శ్రుతిలో "అశబ్దమస్పర్శమరూమవ్యయం తథాऽరసం నిత్యమగన్ధవచ్చయత్। అనాద్యనంన్తం మహతః పరం ధ్రువం నిచాయ్య తం మృత్యు ముఖాత్ ప్రముచ్యతే" అనగా 'శబ్దస్పర్శరూపరసగంధాదులగు భౌతికగుణముల ద్వారా శూన్యము (ఈ గుణములు దానిలో లేవు) అనాదియు మరి అనంతము సమిష్టి బుద్ధి హిరణ్యగర్భుని కన్న పరము నిత్యము అవ్యక్తమగు తత్వమును అనుభవించి మృత్యువాత నుండి బయటపడును'. ఇచట శ్రుతిలో "మహతః పరమవ్యక్తం" అను శబ్దార్థము శబ్దాది హీనమైన ప్రధానము చెప్పుచున్నారు అనిన సరికాదు. ఎందులకనగా ప్రకరణ ప్రమాణముద్వారా ప్రాజ్ఞ పరమాత్మనే "నిచాయ్యత్వేన" జ్ఞేయముగా ఉపదేశించుటవలన. ఇచట ప్రధాన ఉపదేశము కాదు. ఎందులకనగా "పురుషాన్నపరం కిఞ్చిత్" అన్నచోట ప్రాజ్ఞ పరమాత్మయొక్క ప్రకరణముండుట వలన. అంతేగాక జ్ఞానముచే మోక్షమని సాంఖ్యవాదులు ఒప్పుకొనుట లేదు. కాని వేదాన్తములో చైతన్య ఆత్మజ్ఞానము ద్వారానే మృత్యవును దాటుట చెప్పిరి. అందువలన జ్ఞేయము, అవ్యక్త పదముల అర్థము ప్రధానమనుటకు వీలులేదు. ప్రధానము జ్ఞేయము కాదు మరియు అవ్యక్త శబ్దముద్వారా దానిని నిర్దేశించ లేదు, గాన జ్ఞేయత్వ అవచనము అని ప్రధానమును చెప్పిన హేతువు సిద్ధమే.

112. త్రయాణామేవ చైవముపన్యాసః ప్రశ్నశ్చ. (1.4.6.)

సూత్రార్థము:- పూర్వాపర పర్యలోచనద్వారా కఠోపనిషత్తులో అగ్ని, జీవుడు, పరమాత్మలనే చెప్పమనుటయు వానికి మాత్రమే యమధర్మరాజు సమాధానమిచ్చుట వలనను మధ్యలో అప్రసిద్ధమైన నీ ప్రధానము అవ్యక్త శబ్దముతో చెప్పిరని ఎట్లు చెప్పగలవు? గాన అవ్యక్త శబ్దము ప్రధానార్థముకాదు.
అగ్ని, జీవపరమాత్మల ప్రశ్న ప్రతివచనములు ఈ కఠోపనిషత్తులో కనబడు చున్నవి. ఈ మూడు విషయములనే యమాచార్యుడు వర ప్రధాన సామర్థ్యమువలన చెప్పెనని ప్రసంగము ఈగ్రంధములో కలదు. ప్రశ్నలుగూడా ఈ మూడింటి విషయములోనే అచట కనబడు చున్నవి. దీనికన్న భిన్నవిషయములో ప్రశ్న గాని సమాధానముగాని

లేదు. అందువలన అవ్యక్త శబ్దము ప్రధానార్థముకాదు. నచకేతుడు అగ్ని విషయమైన ప్రశ్న అడుగుచూ యమాచార్యునితో ఇట్లనెను. "స త్వమగ్నిం స్వర్గమధ్యేషి మృత్యో ప్రబ్రూహి తం శ్రద్ధదానాయ మహ్యామ్" (కఠ.1.1.3) అనగా ఓ మృత్యువా స్వర్గమునకు సాధనభూతమైన అగ్ని విద్య తెలిసినవాడవు, అందువలన శ్రద్ధాళువైన నాకు దానిని ఉపదేశము గావింపుము. ఇది అగ్నిసంబంధమైన ప్రశ్న.

"యే యం ప్రేతే విచికిత్సా మనుష్యేఽస్తీత్యేకే నాయ మస్తీతి చైకే ఏతద్విద్యా మనిషిష్ట స్త్వయాహం వరాణామేష వర స్తృతీయః" అనగా చనిపోయిన మనిషి గురించి ఈ సంశయము కల్గుచున్నది. కొందరు మృత్యువు తరువాత శరీరాదులకన్న భిన్నమైన జీవుడు ఉన్నాడు అనుచున్నారు, కొందరు లేడనుచున్నారు. నీ ఉపదేశము ద్వారా ఈ రహశ్యము తెలుసు కొన గోరుచున్నాను. వరములలో మూడవ వరము. ఈ మూడవ వరము ద్వారా జీవ సంబంధమైన ప్రశ్న నచికేతుడడిగెను. "అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాదన్యత్రకృతాకృతాత్। అన్యత్ర భూతాశ్చ భవ్యాశ్చ యత్తత్పశ్యసి తద్వద"॥ 'అనగా పుణ్యపాపముల కన్న భిన్నమైనది, కార్యకారణములకన్న భిన్నమైనది, భూతభవిష్యత్ వర్తమానములకన్న భిన్నమైనది ఏ తత్వమును చూచుచున్నావో దానిని గురించి చెప్పుము. ఇచట పరమాత్మ విషయమైన ప్రశ్న. ఈ అగ్ని జీవ పరమాత్మల ప్రశ్నలకు సమాధానము.

"లోకాదిమగ్నిం తమువాచ తస్మై యా ఇష్టకా యావ తీర్వా యథావా" దీనికి అర్థము 'లోకములకు కారణమైన ఆ అగ్నిని మృత్యుదేవత నచకేతునకుపదేశించెను. మరియు చేయు విధానము, ఇటికల సంఖ్య, అగ్ని స్వరూపము గూడ చెప్పెను. ఇది అగ్ని విషయమైన సమాధానము.

"హన్త త ఇదం ప్రవక్ష్యామి గుహ్యం బ్రహ్మ సనాతనమ్। యథా చ మరణం ప్రాప్య ఆత్మాభవతి గౌతమ॥
యోనిమన్యే ప్రపద్యన్తే శరీరత్వాయ దేహినః। స్థాణు మన్యేఽనుసంయన్తి యథా కర్మ యథా శ్రుతమ్॥
'నేను నీకు గుహ్యము, సనాతనము అగు బ్రహ్మ గురించి మరల చెప్పెదను. దాని అజ్ఞానము ద్వారా మరణించిన తరువాత ఆజీవుడు మరల సంసారమునే పొందును. ఓ గౌతముడా దానిని వినుము. కర్మోపాసనములకు అనుగుణముగా కొందరు జీవులు శరీరమును పొందుదురు. కొందరు స్థావర ములగుదురు అను జీవ సంబధమైన సమాధానము.

"న జాయతే మ్రియతే వా విపశ్చిత్" అనగా జ్ఞానికి జనన మరణములు లేవు.(కఠ.1.2.18) ఈ శ్రుతుల ద్వారా పారమాత్మ విషయము విస్తారముగా చెప్పిరి. పైన చెప్పిన రీతిగా అగ్ని, జీవ, పరమాత్మల ప్రశ్న ప్రతివచనములే కనిపించుచున్నవి. కాని ప్రధానమునకు సంబంధించిన ప్రశ్న లేదు. అడగని దానిని చెప్పుట అప్రాసంగికము. అందువలన అవ్యక్త శబ్దార్థము ప్రధానముగాదు.

## 113. మహద్వచ్చ. (1.4.7.)

సూత్రార్థము:- "బుద్ధేరాత్మా మహాన్పరః" (కఠ.1.3.10) 'బుద్ధి కన్నా మహతత్వము శ్రేష్టము' ఈశ్రుతిలో చెప్పిన మహత్తత్వము సాంఖ్యుల అభిమతమైన రెండవ తత్వము కాదు. అట్లే వైదిక 'అవ్యక్త' శబ్దము ప్రధానార్థము కాదు.

శ్రుతిలో చెప్పిన అవ్యక్త శబ్దము సాంఖ్యాభిమతమైన (మొదట ఉత్పన్నమైనది) ప్రథమజము కాదు. ఇచట ఈ విధముగా అనుమానము చెప్పవచ్చును. శ్రుతిలో చెప్పిన అవ్యక్త శబ్దము (పక్షము), సాంఖ్యాభిమతమైన మొదట ఉత్పన్నమైన అస్థిత్వ వాచకము కాదు (సాధ్యము), వైదికశబ్దమగుట వలన (హేతువు), మహత్ శబ్దమువలే (దృష్టాంతము). ఈలాగుననే సాంఖ్యులు సత్తామాత్రమైన (కేవలము అస్థిత్వముగల) మొదట ఉత్పన్నమైన వస్తువులో మహత్ శబ్దమును ప్రయోగింతురు. కాని వైదికులు ఈ మహత్ శబ్దమును ఆ అర్థములో ఉపయోగించరు. “బుద్ధేరాత్మా మహాన్పరః” బుద్ధికన్న మహతత్వము శ్రేష్టమని చెప్పుటవలనను మరియు “మహాన్తమ్ విభుమాత్మానమ్ మత్వా ధీరో న శోచతి” (కఠ.1.2.22) గొప్ప వ్యాపమైన ఆత్మను తెలిసికొని ధీర పురుషుడు శోకించడు. ఈ మొదలుగాగల శ్రుతి వాక్యములో ఆత్మ శబ్దముండుట వలన సాంఖ్యులు ప్రయోగించిన అర్థములో వైదికులు మహత్ శబ్దమునుపయోగించరు. శ్రుతులలో బుద్ధికి పరమైన మహత్తత్వము జగత్కారణమైన ఆత్మగా చెప్పిరి. ఆలాగుననే వైదికులు అవ్యక్త శబ్దమును ప్రధానార్థములో చెప్పరు. అనుమానము ద్వారా కల్పింపబడిన సాంఖ్యుల ప్రధానము గురించి చర్చించు శ్రుతులు లేనే లేవు.

# 34. చమసాధికరణము.

సంగతి:- క్రిందటి అధికరణములో అవ్యక్త శబ్దమాత్రముండుటవలన ప్రధానము యొక్క ప్రత్యభిజ్ఞ స్వీకరించకపోయినను, ఇచట శ్వేతాశ్వర శ్రుతిలో త్రిగుణాత్మకములు గల అజా శబ్దముద్వారా ప్రధానప్రత్యభిజ్ఞ అని చెప్ప వచ్చును. ఈలాగున ప్రత్యుదాహరణ సంగతి కారణముగా ఈ అధికరణము ప్రారంభిచబడినది.

విషయము:- "అజామేకాం లోహితశుక్లకృష్ణామ్" (శ్వే.4.5) అను వాక్యము ఈఅధికరణము నకు విచారణీయ విషయము.

సంశయము:-'అజా' శబ్దము ప్రధాన వాచకమా లేక అగ్ని జలభూమిరూపమైన అవాంతర పకృతియా.

పూర్వపక్షము:- లోహితశబ్దము అనగా ఎఱ్ఱరంగు రజోగుణాదులకు లక్ష్యార్థము. రజోగుణాదులుగల త్రిగుణాత్మక పకృతిని సాంఖ్య శాస్త్రములో ప్రధాన మందురు. దానినే అజా శబ్దముతో చెప్పిరి.

సిద్ధాంతము:- లోహితాదుల ప్రత్యభిజ్ఞ ఛాందోగ్యములో అగ్ని, జలము, పృథివీ రూపమైన అవాంతర ప్రకృతిలోనే భోధించు చున్నవి. ఎట్లనిన మధువిద్యలో మధువు (తేనె) కన్న భిన్నమైన ఆదిత్యునిలో 'మధు' శబ్దము ప్రయోగించిరి. ఆ విధముగనే శ్రుతిలో అగ్న్యాది అవాంతర ప్రకృతులకు 'అజా' శబ్దమును చెప్పిరి.

వైయాసికన్యాయమాలా:-

81. అజేహ సాంఖ్యప్రకృతిస్తేజోబన్నాత్మికాఽథవా। రజఆదౌ లోహితాదిలక్ష్యేఽసౌ సాంఖ్యశాస్త్రగా॥

82. లోహితాదిప్రత్యభిజ్ఞా తేజోబన్నాదిలక్షణమ్। ప్రకృతిం గమయేచ్ఛ్రౌతీమజాక్ఌప్తిర్మధుత్వవత్॥

"అజామేకాం లోహితశుక్లకృష్ణామ్" (శ్వే.4.5) ఈ శ్రుతిలో నున్న 'అజా శబ్దము' సాంఖ్యశాస్త్రములో చెప్పిన ప్రధాన వాచకమా లేక ఛాందోగ్యములోచెప్పిన అగ్ని, జల, పృథివీరూప ప్రకృతియా. తెలుపు, ఎఱుపు, నలుపు అను శబ్దములు సత్వ, రజస్తమోగుణములను లక్షితము గావించుట వలన సాంఖ్య శాస్త్రములో చెప్పిన ప్రధానమే 'అజా' శబ్దార్థమనవలయునని పూర్వవాది అనగా సిద్ధాంతి ఇచ్చు జవాబు. ఛాందోగ్యములో ఎరుపు, తెలుపు, నలుపు రంగులను అగ్ని, జలము మరియు అన్నము (పృథివీ) ధర్మములుగా చెప్పిరి. ఇచట కూడ ఆ అన్నాదుల ప్రత్యభిజ్ఞయే అగుచున్నది. అందువలన ఆ ధర్మములతో కూడిన అగ్ని, జల, పృథ్విల ప్రకృతినే శ్రుతిలో 'అజా' శబ్దముతో చెప్పిరి. అగ్న్యాది ప్రకృతులలో అజత్వ కల్పన ఆదిత్యునిలో మధుత్వ కల్పనవలె చేయ వలయును.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

శ్వేతాశ్వతరోపనిషత్తులోని నాల్గవ అధ్యాయములో "అజామేకాం లోహితశుక్లకృష్ణామ్" అని వినబడుచున్నది. ఇచట సాంఖ్యశాస్త్రములో చెప్పిన ప్రధాన శబ్దవాచ్యమైన పకృతిని చెప్పిరా లేక ఛాందోగ్యశ్రుతిలోచెప్పిన అగ్ని, జల,

అన్నరూపములైన ప్రకృతిని చెప్పిరా అని సందేహము వచ్చిన పూర్వవాది 'ప్రధాన' మనును. ఎందులకనగా సత్త్వరజతమో గుణములు చెప్పబడుట వలన. కేవలము ఎరుపు, తెలుపు,నలుపు వర్ణములు మాత్రమే వినబడుచున్నప్పటికిన్ను, గుణములు వినబడుటలేదు. అయినను ఎరుపు మొదలగు వర్ణములద్వారా గుణములే లక్షితమగు చున్నవి. అచట ఎరుపు వర్ణముద్వారా రంజింపజేయు గుణసామ్యము వలన రజోగుణము ఉపలక్షితము. తెలుపు వర్ణముద్వారా స్వచ్ఛత్వసామ్యమువలన సత్త్వగుణము ఉపలక్షితము. నలుపు వర్ణముద్వారా ఆవరణాత్మక సామ్యమువలన తమోగుణము ఉపలక్షితము. ఇట్లు చెప్పిన సాంఖ్యశాస్త్రములో చెప్పిన ప్రధానము శ్రుతిద్వారా అనుగృహీతమగును. అందువల్ల ఈ శ్రుతిలో 'ప్రధానము'ను చెప్పిరి అనిన నీ ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాము.

"యదగ్నేః రోహితం రూపం తేజసస్తద్రూపమ్, యచ్ఛుక్లం తదపామ్, యత్ కృష్ణం తదన్నస్య" (ఛాం.6.4.1) అని ఛాందోగ్యోపనిషత్తులో అగ్నిజలాన్నముల కారణములుగా చెప్పిన ఎరుపు తెలుపు నలుపు రంగులను ఇచట ప్రత్యభిజ్ఞ గావించుచున్నారు. అచట శ్రౌత (శ్రుతిలో చెప్పిన) ప్రత్యభిజ్ఞయొక్క ప్రాబల్యముద్వారా లోహితాది శబ్దములకు ముఖ్యార్థము సంభవమగుట వలన తేజోబన్నాదుల కారణమును 'అజా' శబ్దముతో చెప్పిరి. ఈ అజా శబ్దము లోకములో మేక అను అర్థములో రూఢి అయినను కారణములో వాడుకలో లేదు. 'న జాయతే ఇతి అజః' పుట్టుక లేనిది అజమని యౌగికార్థము గూడ సంభవము కాదు. తేజోబన్నాదులు పరమాత్మనుండి ఉద్భవించినప్పటికీ మేక కల్పన, కారణమును తేలికగా తెలిసికొనుటకు చెప్పిరి. "అసౌ వా ఆదిత్యో దేవమధుః" (ఛాం.3.1.1.) అను శ్రుతిలో ఆదిత్యుడు మధువు కాకపోయినను వానిలో మధుత్వకల్పన చేసినట్లే ఇచట కారణమును చెప్పుటకు మూడు రంగులు గల మేకపిల్లల కల్పన గావించిరి. అందువల్ల తేజోబన్నాత్మకమైన ప్రకృతిని అజా అనిరి.

## 114. చమసవదవిశేషాత్. (1.4.8.)

సూత్రార్థము:- దేనిలో అధోభాగము బిలము వలెను ఊర్ధ్వభాగము గుండ్రముగను ఉండునో దానిని 'చమస' మందురు. "అర్వాగ్బిలశ్చమసః" అను మంత్రములో నున్న 'చమసము' ఇదేనని విశేషముగా ఏ పదార్థమునూ నిశ్చయించి చెప్పలేము. ఈవిధముగా సాధారణ ధర్మములు గలవి అనేక వస్తువులు గలవు గనుక. ఆవిధముగనే 'అజామేకామ్' అను మంత్రములో అజాత్వ ధర్మము సామాన్యమగుట వలన ప్రధానమును ఈ అజా శబ్దముతోనే చెప్పిరి అని నిశ్చయించలేము, గాన ప్రధానము శ్రుతి ప్రతిపాదితముగాదు.

ఇచట పూర్వపక్షి బ్రహ్మములో సమన్వయము అసిద్ధమనును. సిద్ధాన్తములో సమన్వయసిద్ధియే సరి అనునది ఫలభేదము. "అజామేకాం లోహితశుక్లకృష్ణామ్" అను మంత్రముద్వారా సాంఖ్యసిద్ధాన్తము శ్రుతి సమ్మతమని చెప్పుటకు వీలులేదు. ఈవిధముగా అజాత్వ కల్పన సర్వత్ర సులభము. 'న జాయతే ఇతి అజః' అని అజా శబ్దమును సాధరణముగా అన్యస్థలములలో గూడ ప్రయోగించవచ్చును గాన నిశ్చయాభావము చెప్పుటకు

'చమస' దృష్టాన్తమును చెప్పిరి. "అర్వాగ్బిలశ్చమస ఊర్ధ్వబుధ్నః" (బృ.2.2.3 ) అను మంత్రములో నున్న 'చమస' ము ఇదేనని స్వతంత్రముగా నిశ్చయించలేము ఏలనన క్రింద బిలము (రంధ్రము) పైన గుండ్రముగా నున్న వస్తువులు అంతటా లభించును గాన. ఆలాగుననే ఇచట 'అజామేకామ్' అను మంత్రములో ప్రధానమునే అజా శబ్దముతో చెప్పుచున్నారని నిశ్చయించుట కఠినము.

"ఇదం తచ్ఛిరః ఎష హ్యర్వాగ్బిలశ్చమస ఊర్ధ్వబుధ్నః" అను వాక్యశేషములో చమసపాత్ర (యజ్ఞపాత్ర విశేషము)యొక్క విశేష బోధ కలుగు చున్నదికదా. కాని ఇచట ఏది అజము అను ఆశంకా నివృత్తి కొరకు ముందు సూత్రము చెప్పు చున్నారు.

115. జ్యోతిరుపక్రమా తు తథాహ్యధీయత ఏకే. (1.4.9.)

సూత్రార్థము:- తేజస్సుతో అరంభించి అదే తేజోబన్నరూపముల ప్రకృతిగా అజా శబ్దమును నిశ్చయించవలయును గాని ప్రధానముతోగాదు, ఎందులకనగా ఛాందోగ్యములో తేజోబన్నరూపమైన ప్రకృతులకు రోహితాది రూపములుగా కొన్ని శాఖలవారు అధ్యయనము గావించు చున్నారు గాన. .

'తు' శబ్దము నిశ్చయార్థము. తేజస్సు జలము పృథివీ రూపమైన కారణములు ఆరంభించుటకు బ్రహ్మజ్యోతి యొక్క ఆరంభము గావించిరి. అదే బ్రహ్మతేజస్సును ఉపక్రమ వాక్యములో నిశ్చయించవలయును గాని ప్రధానమును గాదు. ఎందులకనగా కొన్ని శాఖలవారు అగ్ని జలము మరియు పృథివీల ఉత్పత్తి పరమేశ్వరు నుండియే అని చెప్పి మరల దానికే ఎఱుపు మొదలగు వర్ణములను అధ్యయనము గావించుచున్నారు. "యదగ్నే రోహితం రూపం తేజసస్తద్రూపం" అనగా 'అగ్నిలోని ఎఱుపు రంగు ఆ తేజస్సుదే' అని ఈ విధముగా అధ్యయనము గావించుచున్నారు. వానినే ఇచట రక్తాది (ఎఱుపు రంగు) శబ్ద సామాన్యమువలన తేజము, జలము మరియు పృథివీల ప్రత్యభిజ్ఞ అగుచున్నది మరియు రక్తాది శబ్దములను రూపవిశేషములోనే ముఖ్యముగా ప్రయోగింతురు. ఈ రంగులను గుణములలో గౌణరూపముగా ప్రయోగింతురు. సందేహము లేని పదార్థముల ద్వారా సంధిగ్ధార్థమును నిశ్చయించవలయును. పైన చెప్పిన శాఖల అధ్యయనము ద్వారా 'అజా' శబ్దము తేజస్సు, జలము మరియు పృథివీ వాచకమే గాని ప్రధానార్థము కాజాలదు.

కాని తేజస్సు, జలము మరియు పృథివీ అను మూడురూపములుగలదానిని 'అజా' శబ్దముతో చెప్పిరనుట తెలిసికొనుట కఠినము. ఎందులకనగా 'అజా' శబ్దముయొక్క అవృత్తి (మరల మరల చెప్పుట) లేదు మరియు దాని జన్మ గూడ వినిపించుచున్నది. ఈ ప్రశ్నకు జవాబు తరువాతి సూత్రములో చెప్పుచున్నారు.

116. కల్పనోపదేశాచ్చ మధ్వాదివదవిరోధః. (1.4.10.)

సూత్రార్థము:- ప్రకృతితో సమానత్వమును చూపించుటకు తేజోబన్నాదుల కల్పనద్వారా అజాత్వమును ఉపదేశించిరి. ఎట్లనిన మధు భిన్నమైన ఆదిత్యునిలో మధుత్వ ఉపదేశము గావించినట్లు. ఆలాగుననే అజాభిన్నమైన ప్రకృతిలో అజాత్వ ఉపదేశము గావించుట విరోధముగాదు. ఈ విధముగా చెప్పుట వలన ప్రధానము శ్రుతి ప్రతిపాదితముగాదు.

సూత్రములోని 'చ' శబ్దము ప్రశ్నను తొలగించుటకు. తేజస్సు,జలము మరియు పృథవీలలో అజాశబ్దము అజాకృతి నిమిత్తముద్వారా చేయలేదు. 'న జాయతే ఇతి అజః' అను యౌగికార్థము గూడా చెప్పనలవి కాదు. కాని కల్పనా ఉపదేశముద్వారా తేజోబన్నాదుల కారణములో ఈ అజాశబ్దము ప్రయోగించిరి. ఎట్లనిన లోకములో మేక స్వాభావికముగనే ఎఱుపు తెలుపు నలుపు రంగు గలదై అటువంటి పిల్లలనే పుట్టించును. దానిని భోగించుటకు ఒక మేక దాని వెనుక పడ వచ్చును వేరొక మేక అనుభవించిన మేకను వదిలి వేయ వచ్చును. అట్లే అగ్ని జలము మరియు పృథివీ భూతముల కారణము మూడు రంగులు కలది. అది సమానవర్ణములు గల అనేక వికారములను ఉత్పత్తి చేయును. వానిని అజ్ఞాని జీవుడు ఎల్లప్పుడూ భోగించుచుండును, కాని జ్ఞాని వానిని పరిత్యాగము గావించును.

జ్ఞాని అజ్ఞాని అని జీవ భేదము గావించిననూ ఆ భేదము పారమార్థికము గాదు కాని లోకప్రసిద్ధమైన జీవుల అనువాదము గావించి ఉపాధిగతమైన భేదము చెప్పుచూ జీవుల బన్ధ-మొక్షముల వ్యవస్థను ప్రతిపాదించుటలోనే శాస్త్రతాత్పర్యము. మధు భిన్నమైన మధువులో అనిన ఆదిత్యునిలో మధుత్వ ఉపదేశము-"అసౌ వాదిత్యో దేవమధు" అని. ఆవిధముగనే వాణి ధేనువు కాదు గాని ఆ వాణిలో ధేనుత్వోపదేశము శ్రుతిలో చెప్పిరి. ఆ విధముగనే అజా కాని దానిలో అజోపదేశము విరోధముకాదు. గాన అజా శబ్దము ద్వారా ప్రధానమును గ్రహించకపోవుట వలన ప్రధానము నందు అశబ్దత్వము సిద్ధమే.

# 35. సంఖ్యోపసంగ్రహాధికరణమ్.

సంగతి:- పూర్వాధికరణములో ఆధ్యాత్మికాధికారముండుటవలన అజా శబ్దమునకు ప్రసిద్ధమైన మేక అర్థమును వదిలి అగ్న్యాదిరూపములైన అవాన్తర ప్రకృతిని చెప్పిరి. ఆలాగుననే ఇచట "యస్మిన్ పఞ్చ పఞ్చజనాః" పఞ్చజన శబ్దము ద్వారా మనుష్యాదుల గ్రహణము ఉచితము కానందువలన సాంఖ్యశాస్త్రాభిమతమైన ఇరవైఐదు తత్త్వములను గ్రహించుట ఉచితము. ఈవిధమైన దృష్టాన్త సంగతికారణమువల్ల ఈ అధికరణము మొదలిడిరి.
విషయము:- "యస్మిన్ పఞ్చ పఞ్చజనా ఆకాశశ్చ ప్రతిష్ఠితాః। తమేవ మన్య ఆత్మానం విద్వాన్బ్రహ్మ-మృతోఽమృతమ్" (బృ.4.4.7 ) అనగా ' ప్రాణము, కన్నులు, చెవులు, అన్నము మరియు మనస్సు ఈ ఐదింటిని పఞ్చజన అందురు.వీనిలో అన్నమనగా విరాట్ మిగిలిన నాలుగు సూత్రాత్మయని అర్థము. వీనికి కారణము అవ్యాకృతము అనగా ఆకాశమునకు ఆధారమైన ఆత్మ. ఆ ఆత్మ అమృతము దానిని తెలిసికొనుట వలన నేను

అమృతస్వరూపుడను అని మన్త్రద్రష్టయొక్క వచనము'. ఈ వాక్యము ఈ అధికరణమునకు విచారణీయ విషయము.

సంశయము:- పఞ్చజన శబ్దముద్వారా సాంఖ్య శాస్త్రములో ప్రసిద్ధమైన మూలప్రకృత్యాది ఇరవైఐదు తత్త్వములను చెప్పిరా లేక శ్రుతివాక్య శేషములోనున్న ప్రాణాదులను చెప్పిరా అని సంశయము.

పూర్వపక్షము:- పఞ్చ శబ్దము రెండు సార్లు ఉచ్చరించుటవలన (గుణించగా) సాంఖ్యశాస్త్రప్రసిద్ధమైన ఇరవైఐదు తత్త్వములను 'పఞ్చ పఞ్చజనా' శబ్దముతో గ్రహించవచ్చును.

సిద్ధాన్తము:- చెప్పిన శ్రుతిలో ఆత్మ మరియు ఆకాశము అతిరిక్తముగా వినబడు చున్నవి, కేవలము ఇరవైఐదు మాత్రమే తత్త్వములు గావు. ఈస్థితిలో పఞ్చజన శబ్దము ప్రాణాది ఐదుతత్త్వముల వాచకము (ప్రాణము, కన్నులు, చెవులు, అన్నము మరియు మనస్సు) వీనిని పఞ్చజన శబ్దముతో గ్రహించ వలయును. ఎందులకనగా దగ్గరగానున్న వాక్యశేషములో వానినే గ్రహించిరిగాన.

వైయాసికన్యాయమాలా:-

83. పఞ్చ పఞ్చజనాః సాంఖ్యతత్త్వాన్యాహో శ్రుతీరితాః। ప్రాణాద్యాః సాంఖ్యతత్త్వాని పఞ్చవింశతిభాసనాత్॥

84. న పఞ్చవింశతేర్భానమాత్మాకాశాతిరేకతః। సంజ్ఞా పఞ్చ జనేత్యేషా, ప్రాణాద్యాః సంజ్ఞినః శ్రుతాః॥

"యస్మిన్ పఞ్చ పఞ్చజనా" అను శ్రుతిలో సాంఖ్యాభిమతమైన తత్త్వములను చెప్పిరా లేక ప్రాణాది పఞ్చకములను చెప్పిరా? పైనచెప్పిన శ్రుతి సాంఖ్యుల ఇరవైఐదు తత్త్వములనే చెప్పుచన్నదను ప్రశ్నకు సమాధాము. చెప్పిన శ్రుతిలో కేవలము ఇరవైఐదు తత్త్వములేగాక ఆత్మ మరియు ఆకాశము అతిరిక్తముగా చెప్పబడినవి. పఞ్చజన అనునది సంజ్ఞా (నామధేయము) ప్రాణాదులు సంజ్ఞి అనగా నామము గలవి. అందువలన శ్రుతిలో చెప్పిన ప్రాణాదులనే చెప్ప వలయును.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

బృహదారణ్యక ఆరవ అధ్యాయములో "యస్మిన్ పఞ్చ పఞ్చజనా ఆకాశశ్చ ప్రతిష్ఠితః। తమేవ మన్య ఆత్మానం విద్వాన్బ్రహ్మామృతోఽమృతమ్"॥ అనగా పఞ్చ పఞ్చజన ఆకాశములు దేనిలో ఆశ్రితమైయున్నవో ఆ ఆశ్రయమైన ఆత్మను నేను తెలిసికొనుట వలన అమృతస్వరూపడనైతిని. ఇచట 'పఞ్చ పఞ్చజన' శబ్దము ద్వారా సాంఖ్యశాస్త్రోక్త తత్త్వములను చెప్పిరా లేక శ్రుతిలో వచ్చిన ప్రాణము, కన్నులు, చెవులు, మనస్సు మరియు అన్నమా? పూర్వవాది సాంఖ్యతత్త్వములేనను. ఎందులకనగా సాంఖ్య శాస్త్రములో ప్రసిద్ధమైన తత్త్వములు ఇచట ప్రతీతమగు చున్నవి. ఇచట పఞ్చ పఞ్చ అని రెండు శబ్దములు గలవు. ఒక పఞ్చ శబ్దము ద్వారా సాంఖ్య-తత్త్వములోని పఞ్చ సంఖ్యను చెప్పిరి. రెండవ పఞ్చ శబ్దముద్వారా పఞ్చసంఖ్యావిషయములను చెప్పిరి. అందువలన 'పఞ్చసంఖ్యావిశిష్టాని తత్త్వపఞ్చకాని' పఞ్చతత్త్వములతో గూడిన తత్త్వపఞ్చకములు అని అర్థము. ఈ ప్రకారము ఇరవైఐదు సంఖ్య ప్రతీతమగుటవలన సాంఖ్యశాస్త్ర ప్రతిపాదిత తత్త్వములనే చెప్పిరి అనిన,

సిద్ధాన్తి చెప్పునదేమనగా పఞ్చ శబ్దము రెండు సార్లు వినబడినను ఇరవైఐదు తత్వములు కానేరవు. ఎందులకనగా ఈతత్వములకాధారముగా ఆత్మను చెప్పిరి. ఆ ఆత్మ పఞ్చవింశతి తత్వములలో అంతర్భూతముకాదు. మరి ఆత్మ ఆతత్వములలో అంతర్భూతమనిన ఒకే వస్తువులో ఆధార ఆధేయ భావమగుట వలన విరోధమగును. వీనికి భిన్నమైన ఆకాశము గూడ వినిపించుచున్నది. అదిగూడ పఞ్చవింశతి అన్తర్గతము కాదు ఏలనన 'ఆకాశశ్చ' మరియు ఆకాశమును వేరుగా చెప్పి ఒకేచోట సమావేశము (సముచ్చయము) గూడ చెప్పిరి. ఆకాశము మరియు ఆత్మను జేర్చి ఇరవైఏడు తత్వములగు చున్నందువలన సాంఖ్యతత్వములనలేము. అపుడు వాక్యర్థమేమగుననిన పఞ్చజన శబ్దము నామధేయమగును. 'దిక్సంఖ్యే సంజ్ఞాయామ్' (అనగా దిశలు మరియు సంఖ్యా వాచక శబ్దములకు నామధేయార్థములో సుబన్త ఉత్తరపదముతో సమాసమగును.) ద్వారా సమాసవిధానమగు చున్నది. పఞ్చజన నామధేయముగల పదార్థములు ఐదు గలవు. ఆ పదార్థములను వాక్య శేషములో ప్రాణాదులని తెలిసికొనవలయును. వాక్య శేషము "ప్రాణస్య ప్రాణముత చక్షుషశ్చక్షురుత శ్రోత్రస్య శ్రోత్రముతాన్నస్యాన్నం మనసో యే మనో విదుః". ప్రాణము, కన్నులు, చెవులు, అన్నము మరియు మనస్సునకు సాక్షి చిదాత్మను రెండవప్రాణాదుల శబ్దముల ద్వారా చెప్పిరి. అందువల్ల వాక్య శేషము ద్వారా శ్రుతిలో నున్న ప్రాణాదులే పఞ్చజన శబ్దార్థమని సిద్ధమగుచున్నది.

117. న సంఖ్యోపసంగ్రహాదపి నానాభావదతిరేకాచ్చ. (1.4.11)

సూత్రార్థము:- 'యస్మిన్ పఞ్చ' అను మంత్రములో సంఖ్యావాచక శబ్దము వినబడుటవలన సాంఖ్యుల ఇరవై ఐదు తత్వములను గ్రహించినను ప్రధానము శ్రుతి ప్రతిపాద్యము కాజాలదు. నానా భావాత్ అనగా పఞ్చవింశతి తత్వాలు అనేకములు లేక వేరు వేరుగా చెప్పిరి. వీనిలో సాధరణ ధర్మము లేదు. అంతేగాక ఆకాశము మరియు ఆత్మా విడిగా చెప్పిరి అందువల్ల ఇరవై ఏడు తత్వములగును. ఆలాగున స్వీకరించిన మీ సాంఖ్యము మతము అపసిద్ధాంతమగును. అందువల్ల ప్రధానాదులను గ్రహించుట ఉచితముకాదు.

ఇరవై ఐదు తత్వములు అనేకము గలవు. ఈ పఞ్చ పఞ్చ అను వానిలో ఏవిధమైన సాధారణ ధర్మము లేదు. ఉన్నచో దాని ద్వారా పఞ్చ పఞ్చ సమూహములు అనుకొని ఇరవై ఐదు తత్వములు చెప్పుటకు వీలగును. ఇంతేగాక రెండవ పఞ్చ శబ్దము జన శబ్దముతో కలిసి సమాసమైనది. 'పఞ్చజన' శబ్దము స్వరము ద్వారా ఒకే పదమని నిశ్చయమగుట వలన పఞ్చ పఞ్చ అని ఇచట వీప్స (ఒకదాని వెనుక వేరొకటి వ్యాపింపనిచ్చ) గూడా స్వీపకరింపనలవిగాదు. 'పఞ్చ-పఞ్చజనా' అని శ్రుతి వాక్యాభిప్రాయము ఇరవై ఐదు తత్వములను ప్రతిపాదించుటలో కాదు. ఇరవై ఐదు తత్వములని చెప్పిననూ ఇంకనూ రెండు తత్వములు ఆకాశము మరియు ఆత్మ అధికముగా వినిపించుచున్నవి. వీనికన్న భిన్నము ఆకాశము మరియు అన్నింటికీ ఆధారము ఆత్మ వినబడుటవలన ఇరవైఏడు తత్వములగుచున్నవి. వీనిని స్వీకరించిన సాంఖ్య శాస్త్రవిరుద్ధమగును. అందువల్ల

సాంఖ్యుల ప్రసిద్ధమైన ఇరవైఐదు తత్వములను ఈ మంత్రములో గ్రహించుట ఉచితముగాదు. అయిన ఈ 'పఞ్చజన' శబ్దార్థ మేమి? ఈప్రశ్నకు ముందు సూత్రములో సమాధానము చెప్పుచున్నారు.

118. ప్రాణాదయో వాక్యశేషాత్. (1.4.12.)

సూత్రార్థము:- ముందు చెప్పిన శ్రుతిలో పఞ్చజన శబ్దముద్వారా ప్రాణము, చక్షువు, శ్రోత్రము, అన్నము మరియు మనస్సు చెప్పబడినవి. ఎందులకనగా 'ప్రాణస్య ప్రాణం' ప్రాణమునకు ప్రాణము, కన్నులకు కన్ను మొదలగు వాక్యము అంతములో (శేషములో) నున్నందువలన ప్రాణ శబ్దము మొదలులో వేనికి గలదో వానిని ప్రాణాదులందురు. అవి ప్రాణము, కన్ను, చెవి, అన్నము మరియు మనస్సు. ఈ ప్రాణాదులను 'పఞ్చజన' శబ్దము ద్వారా గ్రహించవలయును. ఏలనన వాక్యశేషము వలన. ముందు వాక్య శేషములో "ప్రాణస్య ప్రాణముత చక్షుషశ్చక్షురుతశ్రోత్రస్య శ్రోత్రమన్నస్యాన్నం మనసో యో మనో విదుః" (బృ.4.4.18) సన్నిహిత వాక్య శేషములో ఈ ఐదు ప్రాణదులను గ్రహించిరనుట స్పష్టము. అయిన ప్రాణాదులందు 'జన' శబ్ద ప్రయోగము ఎట్లు చేసిరి? అనిన అట్లనుట సరిగాదు. ఏ విధముగా సాంఖ్య శాస్త్రములో ఇరవైఐదు తత్వములకు జన శబ్ద ప్రయోగము ప్రసిద్ధి కాదో అట్లే ప్రాణాదులలో గూడ ప్రసిద్ధి కాదు. అనగా ప్రసిద్ధిని అతిక్రమించుట అనునది రెండు పక్షములలో సమానమైనను వాక్య శేషము ద్వారా మరియు జన శబ్దసంబన్ధము వలన ఈవిధముగా నిశ్చయించబడినది. దేవతలు, పితరులు, గంధర్వులు, అసురులు (అసుషు రమన్తే ఇతి అసురాః అనగా ఇంద్రియలోలురు) రాక్షసులను (రక్ష ఏవ రాక్షసః అనగా స్వార్థపరులు) లేక నిషాదులతో కలిపి నాలుగు వర్ణములవారిని పఞ్చజన శబ్దముతో గ్రహించినను విరోధములేదు కాని ఎట్టి పరిస్థితిలోను సాంఖ్యుల ఇరవైఐదు తత్వములను గ్రహించుట కుదరదని అచార్యులవారి తాత్పర్యము.

119. జ్యోతిషైకేషామసత్యన్నే. (1.4.13.)

సూత్రార్థము:- కాణ్వశాఖ పాఠములో ముందు చెప్పిన ప్రాణాది పంచకములలో 'అన్న' శబ్దము లేనందువలన "తద్దేవా జ్యోతిషాం జ్యోతిః" అను పూర్వోక్త మంత్రములోనున్న జ్యోతి శబ్దముతో పఞ్చసంఖ్య పూరింపవలయును.

మాధ్యన్దిన శాఖవారు ప్రణాదులలో అన్న శబ్దముద్వారా పఞ్చసంఖ్యను పూరించుచున్నారు. కాని కాణ్వశాఖలో అన్న శబ్దము లేనందున వారు ఎట్లు పఞ్చ సంఖ్యను పూరించుచున్నారు అనిన వారు పూర్వ మంత్రములో చెప్పిన జ్యోతి శబ్దముద్వారా పఞ్చసంఖ్యను పూరించుచున్నారు అనుటవల్ల

విరోధములేదు. పూర్వ మంత్రములో "తద్దేవా జ్యోతిషాంజ్యోతిః" అనగా జ్యోతులకు జ్యోతి అయిన పరమాత్మను చెప్పిరి. మంత్రములు సమానమైనను జ్యోతులలో భేదముండుటవలన ఒకచోట జ్యోతి శబ్దమును గ్రహించిరి వేరొకచోట గ్రహించకపోయిననూ విరోధము లేదు.

# 36. కారణత్వాధికరణము.

సంగతి:- వెనుకటి అధికరణములో ప్రధానములో అశబ్దత్వమును చెప్పి వేదాన్తవాక్యముల సమన్వయము బ్రహ్మమందే అని చెప్పిరి. ఇపుడు వేదాన్తవాక్యములలో పరస్పర విరుద్ధార్థము ప్రతీతమగుటవలన ఏ నిర్ణయము తీసుకొననలవికాదు. అందువల్ల సాంఖ్యశాస్త్రాభిమతమైన ప్రధాన పరముగా సమన్వయము చెప్పవలయునని ఆక్షేపము కలుగుటవలన ఇచట ఆక్షేప సంగతి.
విషయము:- ఈ అధికరణములో విచారణీయ విషయము సమన్వయము.
సంశయము:- జగజ్జన్మాదులను చెప్పు వేదాన్తవాక్యము బ్రహ్మమందు ప్రమాణమా కాదా? అని సంశయము.
పూర్వపక్షము:- వేదాన్తవాక్యములలో పరస్పర విరుద్ధముండుటవలన కారణ బ్రహ్మములో శ్రుతుల సమన్వయము చెప్పుట సరికాదు.
సిద్ధాన్తము:- సృష్టి క్రమములో వివాదమున్ననూ సృష్టించు కారణ బ్రహ్మములో వివాదములేదు. అందువల్ల జగత్తు యొక్క సృష్టి కర్త బ్రహ్మమందు 'అవ్యాకృతము' మరియు 'అసత్' శబ్దముల ప్రయోగము సముచితమే. కారణవిషయములైన శ్రుతులలో గల విరోధములను సూత్రకారులు వియత్ పాదములో పరిహరించెదరు. అందువల్ల జగత్కారణత్వమును చెప్పు వేదాన్తవాక్యముల సమన్వయము బ్రహ్మ మందు చెప్పుటలో విరోధములేదు.
వైయాసికన్యాయమాలా:-
85. సమన్వయో జగద్యోనౌ న యుక్తో యుజ్యతేఽథవా।న యుక్తో వేదవాక్యేషు పరస్పరవిరోధతః॥
86. సర్గక్రమవిరోధేఽపి నాసౌ స్రష్టరి విద్యతే । అవ్యాకృతమసత్ప్రోక్తం యుక్తోఽసౌ కారణే తతః॥

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

వేదాన్తవాక్యముల సమన్వయము జగత్కారణవిషములో వెనుకటి మూడున్నర పాదములలో ప్రతిపాదిచింన దానిని ఆక్షేపించి సమాధానపరుచుటకు ఈ అధికరణము ఆరంభించిరి. వేదాన్త వాక్యములలో సమన్వయము యుక్తి సంగతము కాదనును పూర్వవాది. ఎందులకనగా వేదాన్త వాక్యములలో విరోధము కానవచ్చుటవలన ప్రమాణ్యము దుఃసమ్పాద్యము. ఏవిధముగాననిన "ఆత్మనః ఆకాశః సమ్భూతః" ఆత్మ

నుండి ఆకాశముత్పన్న మైనది అని తైత్తిరీయములో ఆకాశదులను సృష్టికర్త అనిరి. ఛాందోగ్యములో "తత్తేజోఽసృజత" ఆ బ్రహ్మము తేజస్సును సృష్టించెను అని తేజాదుల సృష్టికర్త అనిరి. ఐత్తిరీయములో "స ఇమాల్లోనసృజత" ఆబ్రహ్మము ఈలోకములను సృజించెను అనుచు లోకముల సృజనకర్తగా చెప్పిరి. ముండకములో "ఎతస్మాజ్జాయతే ప్రాణః" వాని నుండి ప్రాణదులుత్పన్నమైనవని చెప్పుచూ ఆబ్రహ్మమును ప్రాణాదుల సృష్టికర్తగా చెప్పిరి. కేవలము కార్య సృష్టి చెప్పు వాక్యములలోనేగాక కారణస్వరూపమును చెప్పు శ్రుతులలో గూడ విరోధము గలదు. "సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్" హే ప్రియదర్శనుడా! ఈ సంపూర్ణ జగత్తు ఉత్పత్తికి పూర్వము సద్రూపమై యుండెను. ఈ ఛాందోగ్యశ్రుతిలో జగత్కారణము సద్రూపమని చెప్పబడినది. తైత్తిరీయములో "అసద్వా ఇదమగ్ర ఆసీత్" ఇదంతయూ మొదలులో అసద్రూపమై యుండెను. ఇచట కారణము అసద్రూపమనిరి. ఐతిరేయములో "ఆత్మా వా ఇదమేక ఎవాగ్ర ఆసీత్" ఇదంతయూ సృష్టకి ముందు ఆత్మరూపమై యుండెను. ఈ ప్రకారము ఆత్మరూపకారణము చెప్పిరి. పరస్పర విరోధముండుటవలన వేదాన్త వాక్యముల సమన్వయము కానేరదు. సిద్ధాంతి చెప్పు చున్నారు. ఉత్పన్నమైన ఆకాశాదులలో సృష్టి క్రమములో వివాదమున్ననూ వేదాన్త వాక్యముల తాత్పర్యము ఆకాశదులలో లేదు. ఆకాశాదుల ఉత్పత్తి బ్రహ్మ బోధకొరకు చెప్పిరి. వేదాన్త వాక్యములకు తాత్పర్యమైన జగత్స్రష్టయైన బ్రహ్మములో ఎచటనూ విరోధములేదు. ఒకచోట 'సద్' శబ్దముతో చెప్పిన బ్రహ్మను వేరొకచోట అందరిజీవుల స్వరూపము చెప్పుటకు ఆత్మరూపమనిరి. అవ్యాకృతము (నామరూపములు అభివ్యక్తముకాని స్వరూపము) చెప్పుటకు 'అసద్' శబ్ద ప్రయోగముగావించిరి. అసద్ నుండి సద్ ఎట్లు జనించును "కథమసతః సజ్జాయేత" అని రెండవ శ్రుతిలో అభావమునందు కారణత్వమును నిషేదించిరి. అందువల్ల ఏకవాక్యత్వము సుసంపాద్యమగుటవలన జగత్కారణములో వేదాన్త వాక్యముల సమన్వయము యుక్తిసంగతము.

## 120. కారణత్వేన చాకాశదిషు యథావ్యపదిష్టోక్తేః. (1.4.14)

సూత్రార్థము:- సృష్టికర్త బ్రహ్మమని చెప్పు శ్రుతులలో విరోధములేదు, ఎందులకనగా సృజింపబడు ఆకాశాది విషయములో ఏవిధమైన ఈశ్వరుని ఒకశ్రుతిలో కారణరూపముగా చెప్పిరో అదేవిధమైన సృష్టికర్త వర్ణన అన్య శ్రుతులలో కారణరూపముగ ఈశ్వరుని గురించి కలదు.

సృజింపబడిన కార్యములలో వివాదమున్నను కారణమైన సృష్టికర్త పరమాత్మను చెప్పు శ్రుతులలో ఏవిధమైన విరోధములేదు. ఎందులకనగా 'యథావ్యపదిష్టోక్తేః' ఏవిధముగా ఒకవేదాన్త వాక్యములో ఈశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వేశ్వరుడు, సర్వాత్మరూపుడు, అద్వితీయుడు జగత్కారణమని చెప్పినట్లు ఇతర వేదాన్తవాక్యములలోనూ అదేవిధముగా జగత్కారణ రూపముగా ఈశ్వరుని ఉపదేశించిరి. అట్లే "ఇదం

సర్వమసృజత । యదిదం కిఞ్చ" (తై.2.6) 'ఈప్రపంచమునంతయూ పరమేశ్వరుడు కల్పించెను' "సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవద్వితీయమ్" (ఛాం.6.2.1) 'హే సోమ్య! సృష్టికిముందు ఒకే అద్వితీయ సత్ పదార్థముండెను' "ఆత్మా వా ఇదమేక ఎవాగ్ర ఆసీన్నాన్యత్కిఞ్చనమిషత్" (ఐ.4.1.1) 'నిశ్చయముగా సృష్టికి ముందు ఒకే ఆత్మ ఉండెను, దానికన్నభిన్నము ఏదియూలేదు' ఈ విధమైన అనేక శ్రుతుల పర్యాలోచన చేసిన వాని తాత్పర్యార్థములో ఎచ్చటనూ విరోధము కానరాదు. "న వియదశ్రుతేః" (బ్ర.సూ.2.3.1) 'ఆకాశముత్పత్తిని చెప్పు శ్రుతులలో విరోధము లేదు' ఈవిధముగ కార్యవిషయమైన శ్రుతుల విరోధమును ముందు సూత్రకారులు స్వయముగనే పరిహరించుదురు. కార్యవిషయముల శ్రుతులలో విరోధము స్వీకరించిననూ అవి ప్రతిపాద్యములు కావు. కార్య శ్రుతులలో విరోధమున్ననూ ప్రతిపాద్యమైన అద్వైత బ్రహ్మమందు విరోధము లేనందున ఏమాత్రమూ దోషము లేదు. దీనినే సంప్రదాయాచార్యులయిన గౌడపాదులవారు ఈవిధముగ చెప్పిరి. "మృల్లోహవిస్ఫులిఙ్గాద్యైః సృష్టిర్యా చోదితాన్యథా।ఉపాయః సోఽవతారాయనాస్తి భేదః కథఞ్చన॥" 'మట్టి దృష్టాన్తముతో, కొన్నిచోట్ల ఇనుము దృష్టాన్తముతో, కొన్నిచోట్ల విస్ఫులిఙ్గ(మిడుగురులు)దృష్టాన్తముతో శ్రుతులలో చెప్పిన సృష్టి క్రమము కేవలము అద్వైత తత్త్వమును బుద్ధి గ్రాహ్యము గావించుటకు ఉపాయము మాత్రమే'. అందువల్ల శ్రుతిప్రతిపాద్యమైన అద్వితీయబ్రహ్మ విషయములు చెప్పు వేదాన్త వాక్యములలో విరోధము లేదు.

### 121. సమాకర్షాత్. (1.4.15.)

సూత్రార్థము:- 'అసదేవేదమగ్ర ఆసీత్' ఈ సంపూర్ణ జగత్తు సృష్టికి ముందు అసద్రూపముగా నుండెను. ఈశ్రుతిలో నామ రూపములు అభివ్యక్తము కాలేదని ప్రతిపాదించు 'అసద్' శబ్దము ద్వారా 'సత్' శబ్దముయొక్క ఆకర్షణమగు చున్నది. అందువల్ల శ్రుతులలో జగత్కారణము అసద్ శబ్దముతో చెప్పిరను శంకకు అవకాశము లేదు.

తైత్తిరీయ ఉపనిషత్తులో చెప్పిరి "అసద్వా ఇదమగ్ర ఆసీత్" (తై.2.7) ఈనామరూపాత్మక జగత్తు ఉత్పత్తికి ముందు అసద్ రూపములో నుండెని. ఛాందోగ్యములో "అసదేవేదమగ్ర ఆసీత్" (ఛాం.3.16.1) హే ప్రియదర్శనుడా! ఈ నామరూపాత్మక జగత్తు సృష్టికి ముందు అసద్ రూపముగా నుండెను. కొన్ని చోట్ల జగత్ సృష్టి అసద్ నుండి చెప్పిరి మరికొన్ని చోట్ల సద్ నుండి చెప్పిరి. అదే ఛాందోగ్యములో "సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్" (6.2.1) హే ప్రియదర్శనుడా! ఈనామరూపాత్మక జగత్తు సృష్టికి ముందు సద్ రూపముగా నుండెను. అందువల్ల సృష్టి కారణములో విపరీత మతము వినిపించు చున్నది అనిన సమాధానము. నామరూపములు అభివ్యక్తము కాని స్థితిని అసద్ శబ్దముతో చెప్పిరి. విభిన్న స్థలములలో చెప్పిన అప్రకట నామరూపవాచక అసద్ శబ్దము నుండే సద్ కారణ శబ్దము ఆకర్షించబడు చున్నది. ఏ వస్తువు యొక్క నామరూపములు స్పష్టములో వాని విషయములోనే సద్ శబ్దము ప్రయోగింతురు.

నామరూపములు ప్రకటము కానప్పుడు సద్ బ్రహ్మమే అసద్ సమముగానుండెనని గౌణ ప్రయోగము గావించిరి, అంతేగాని అసద్ శబ్దము ద్వారా కారణము అసలు లేదని అనుకొనరాదు. గాన జగత్ కారణమును స్వీకరించు వేదాన్త వాక్యములకు బ్రహ్మ మందు సమన్వయము చెప్పుటలో విరోధములేదు.

# 37. బాలాక్యధికరణము.

సంగతి:- సమానవాక్యములో నుండుటవలన అసద్ శబ్దమును సద్బ్రహ్మ వాచకమని క్రిందటి అధికరణములో చెప్పిరి. కాని కౌషీతకి బ్రాహ్మణములో 'బ్రహ్మ తే బ్రవాణి' ఈ బాలాకి వాక్యములోనున్న బ్రహ్మ శబ్దమువల్ల ప్రాణాది శబ్దములకు బ్రహ్మ అర్థము చెప్పలేము. ఇట్లు ప్రత్యుదాహరణ సంగతి వల్ల ఈ అధికరణము మొదలిడిరి.

విషయము:- "యో వై బాలాక, యేతేషాం పూరుషానాం కర్తా యస్య వైతత్కర్మ స వై వేదితవ్యః" (కౌ.బ్రా. 4.28) ఇత్యాది వాక్యములు ఈ అధికరణమునకు విచారణీయ విషయములు.

సంశయము:- పురుషుల యొక్క కర్త తెలిసికోదగిన పదార్థము ప్రాణమా, జీవుడా, లేక బ్రహ్మమా? అని సంశయము.

పూర్వపక్షము:- "యస్య వైతత్కర్మ" అనుశ్రుతిలో చలనాత్మక మగు కర్మ ప్రాణాశ్రిత మగుటవలన ముఖ్య ప్రాణార్థము చెప్పవలయును. లేక కర్మార్థము అపూర్వమని చెప్పిన జీవుని తెలిసికోదగిన పురుషుని కర్తగా అనవచ్చును.

సిద్ధాన్తము:- కర్మ శబ్దము జగత్వాచకము. పురుషమాత్రార్థమునకు వాచకము కాదు. కాన ఆ జీవుని యొక్క కర్త పరమాత్మ అనియే సునిశ్చితార్థము. ఇట్లు చెప్పిన శ్రుతిలో మృషావాదిత్వ దోషమూ లేదు.

వైయాసికన్యాయమాల:-

87. పురుషాణాం తు కః కర్తా ప్రాణజీవపరాత్మసు। కర్మేతి చలనే ప్రాణో జీవోఽపూర్వే వివక్షితే॥

88. జగద్వాచీ కర్మశబ్దః పుంమాత్ర వినివృత్తయే। తత్కర్తా పరమాత్మైవ న మృషావాదితా తతః॥

కర్మ శబ్దముద్వారా చలనాత్మక క్రియ చెప్పబడినది అందువల్ల ప్రాణము పురుషులకు కర్త లేనిచో కర్మ శబ్దము అపూర్వవాచకమని చెప్పిన జీవుడు ఆ పురుషులకు కర్త అగును. దీనికి సమాధానము. ఇచట కర్మ శబ్దము జగత్వాచకము. ఆపరమాత్మ కేవలము పురుషులకు కర్త అను శంకను దూరము గావించుటకు 'యస్య వై తత్కర్మ' అని చెప్పిరి. సంపూర్ణ జగత్కర్త పరమాత్మయే గదా అందు వల్ల రాజులో అసత్యభాషణ దోషము లేదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

కౌషీతకి బ్రాహ్మణోపనిషత్తులో బాలాకి పేరుగల బ్రాహ్మణునిద్వారా ఆదిత్యాదిగాగల షోడశ (16)

పురుషులలో బ్రహ్మత్వమును చెప్పగా రాజు వానిని నిరాకరించి స్వయముగా ఈ విధముగా చెప్పెను. "యో వై బాలాకే, ఏతేషాం పురుషానాం కార్తా, యస్య వై తత్కర్మ, స వై వేదితవ్యః" (కౌ. 4.18) 'నీవు చెప్పిన పురుషులందరికీ ఎవడు కర్తయో, ఈ సర్వ ప్రపంచము ఎవనికర్మయో వానినే తెలిసికొనవలయును'. ఇచట మూడు రకముల సంశయము కలుగు చున్నది. 'ప్రాణః' ప్రాణము ఎందులకనగా కర్మ శబ్దము చలన వాచకము. దేహాదులను చలింపజేయునది ప్రాణము గాన. లేనిచో పురుషుల కర్త జీవుడన వచ్చును. ఏలనన కర్మ శబ్దము అపూర్వ వాచకముగాన. జీవుడు అపూర్వమునకు స్వామి గాన. ఎట్టి పరిస్థితిలోను పరమాత్మ ఆపురుషులకు కర్త గానేరడు. ఈ ప్రశ్నలకు జవాబు.

ఇచట కర్మ శబ్దము చలనార్థములో గాని అపూర్వార్థములోగాని కాదు. కాని ఈ కర్మ శబ్దము జగత్వాచకము. 'క్రియతే ఇతి కర్మ' చేయబడిన కార్యము అనగా జగత్వాచకము. కర్మ శబ్దము జగత్వాచకమైన 'కేవలము పురుషుల కర్త' అను శంకను దూరముగావించి సార్థకమగును. అందువల్ల శ్రుతిలోగల పదములకు ఈ విధముగ అర్థము చెప్పవలయును. 'ఓ బాలకీ! నీవు చెప్పిన పదహారుమంది పురుషులకు ఎవరు కర్తయో,వాని యొక్క జ్ఞానమునే పొందవలయును, కాని పదహారుమంది పురుషులది కాదు. లేనిచో ఆ పరమాత్మ ఈ పదహారుమందికి కర్త అని చెప్పుచూ సంకోచార్థము చెప్పుటకన్న ఈ సంపూర్ణ జగత్తు వాని నుండే ఉత్పన్నమైనది, వాని జ్ఞానమునే పొందవలయును, ఏలనన సంపూర్ణ జగత్కర్త పరమాత్మయేగాన ప్రాణ, జీవులు జగత్కర్త కాజాలరు. పారమాత్మ జ్ఞానమునే పొందవలయునని చెప్పిన రాజునందు మిథ్యావాదిత్వదోషము కలుగదు. "బ్రహ్మ తే బ్రవాణి" (కౌ.4.1) 'నేను నీకు బ్రహ్మను వర్ణించెదను' అని ప్రతిజ్ఞ గావించి షోడశ పురుషులని చెప్పినందున బాలాకియందు "మృషా వై కిల" 'నీవు చెప్పనది మిథ్యా భాషణము' అని మిథ్యవాదిత్వమునారోపించి స్వయముగా రాజు బ్రహ్మను చెప్పు ఇచ్చతో ప్రాణ జీవులను బ్రహ్మ మని చెప్పినచో రాజునందు బాలాకివలే మిథ్యావాదిత్వ దోషము కలుగును. అది అనుచితము. అందువల్ల శ్రుతి వాక్యము ద్వారా పరమాత్మయే జగత్కర్తయని సిద్ధమగుచున్నది.

### 122. జగద్వాచిత్వాత్. (1.4.16)

సూత్రర్థము:- "యో హ వై బాలాకే" అను మంత్రార్థము హే బాలకి! ఈ పురుషులకు కర్త ఎవరో మరియు ఈ జగత్తంతయు ఎవని కార్యమో ఆతడు తెలిసి కొనుటకు యోగ్యుడు. ఈ శ్రుతిలో కర్మశబ్దము సంపూర్ణ జగత్వాచకము అగుటవలన కారణ కర్త పరమాత్మయే.

ఈ పురుషులకు కర్త పరమాత్మయే. ఎందులకనగా "బ్రహ్మ తే బ్రవాణి" అని పరమాత్మ ప్రసంగము ఉపక్రమించుటవలన. పేరు అర్థము చెప్పిన ఉపక్రమము బాధితమగును. "న చ యస్య వైతత్కర్మ" 'ఎవనికి ఈ జగత్తు కర్మమో' అనుచోట శ్రుతిలోని కర్మ పదము ద్వారా పరిస్పందన రూపమైన కర్మ గాని లేక ధర్మాధర్మ రూపమైన కర్మ గాని పరమాత్మ యందు అసంభవము కాదని శంకించుట సరికాదు. ఎందులకనగా ఇచట జీవ ముఖ్య ప్రాణముల ప్రంగముకాదు అంతేగాక ఆ అర్థమును చెప్పు శబ్దము గూడ లేదు. "ఏతత్కర్మ" ఈవాక్యములో కర్మ అనగా చేయబడునది, మరియు ఏతద్ శబ్దము సర్వనామము. దానికి సన్నిహితముగా నున్న జగత్కర్మమునే సర్వనామశబ్దముతో గ్రహించుట ఉచితము. ఏతద్కర్మ శబ్దము ప్రత్యక్షాది ప్రమాణములద్వారా జగదర్థవాచకమగుటవలన ఇచట కర్తపదము ద్వారా పరమాత్మనే గ్రహించుట ఉచితము. జగత్తు లోపల నున్న పురుషులకుగూడ కర్త పరమాత్మయే అని సిద్ధమైన 'ఏతద్' అను విశేషమును విడిగా ఎందులకు గ్రహించిరి అని ప్రశ్నించుట ఉచితముగాదు. ఎందులకనగా బాలకి బ్రహ్మరూపములో గ్రహించిన పురుషులలో (బ్రహ్మత్వము లేదని) అబ్రహ్మత్వము చెప్పుటకు గ్రహించిరి, బ్రాహ్మణపరివ్రాజక న్యాయముద్వారా. (బ్రాహ్మణులకు భోజనము గావింపుడు మరియు పరివ్రాజకులకు గూడ భోజనము గావింపుడు అనిన బ్రాహ్మణ శబ్దము పరివ్రాజకుల కన్న భిన్నము.) అట్లే కర్మ శబ్దము పురుషులకన్న భిన్నమైన జగత్వాచకము. సామాన్య విశేషరూపములుగా జగత్కర్త పరమేశ్వరుడేనని ఉపదేశము గావించిరి. ఈవిషయమునే విడిగా ఏతద్ విశేషణము ద్వారాచెప్పిరి.

123. జీవముఖ్యప్రాణలిఙ్గాన్నేతి చేత్తద్వ్యాఖ్యాతమ్. (1.4.17)

సూత్రర్థము:- పూర్వము చెప్పిన శ్రుతిలో జీవుని మరియు ప్రాణవాయువుల లిఙ్గము (హేతువు లేక కారణము) ఉన్నందున ఆశ్రుతి బ్రహ్మ పరము కాదనిన దానికి జవాబు ప్రతర్దనాధికరణములో 'ఉపాసాత్రైవిధ్యాదాశ్రితత్వాదిహ తద్యోగాత్' (బ్ర.సూ.1.1.31) అను సూత్రభాగము ద్వారా జవాబు చెప్పబడినది.

కౌషీతకి బ్రహ్మణ ఉపనిషత్తులో "యదా సుప్తః స్వప్నం న కఞ్చన పశ్యత్యథాస్మిన్ప్రాణ ఎవైకధా భవతి" (కౌ.బ్రా. 4.16) అనగా 'నిద్రించు జీవుడు స్వప్నములు చూడని సమయములో ప్రాణముతో బాటు ఏకీభవించును'.ఈ వాక్యాన్తములో ముఖ్యప్రాణార్థ వాచకమైన ప్రాణ శబ్దము కానవచ్చుచున్నది. ఆలాగుననే "యద్యథా శ్రేష్ఠీ స్వైర్భుఙ్క్తే ఎవమేవ ప్రాజ్ఞాత్మైతైరాత్మభిర్భుఙ్క్తే" (కౌ.బ్రా.4.20) అనగ 'ఏవిధముగా శ్రేష్ఠీ (ప్రధానః) తన సేవకులు మరియు బంధువులద్వారా భోగములనభవించునో అదేవిధముగా జీవుడు బాలాకి చెప్పిన ఆదిత్యాదులిచ్చు భోగోపకరణములైన ప్రకాశాదులద్వారా భోగములనభవించును. ఆలాగుననే ఆ ఆదిత్యాదులుజీవుని ద్వారా పొందిన హవిస్సులు గ్రహించి జీవుని పాలించుచున్నారు. ఈ వాక్యములో

జీవవాచక ప్రాజ్ఞాత్మ శబ్దము చూడబడు చున్నది. వాక్యాన్తములో జీవప్రాణముల హేతువులు ఉండుటవలన వీనిలో ఏదో ఒకదానిని గ్రహించుట న్యాయము గాని పరమేశ్వరునిగాదు. అట్లనిన దానికి సమాధానము ప్రతర్దనాధికరణములో మూడు ప్రకారముల ఉపాసన ప్రసక్తి కలుగునని చెప్పబడినది. అందువల్ల అచట అన్యార్థములను త్యజించి బ్రహ్మార్థమునే గ్రహించిరి. ఆలాగుననే ఇచట పూర్వోక్త వాక్య శేషమును గ్రహించిన జీవోపాసన, ముఖ్యప్రాణోపాసన మరియు బ్రహ్మోపాసన అను మూడు రకముల ఉపాసనా ప్రసంగము వచ్చును. ఈవిధముగా చెప్పిన ఉపక్రమ ఉపసంహారములలో చెప్పిన బ్రహ్మ విషయము న్యాయవిరుద్ధమగును. కౌషీతకి బ్రాహ్మణములో "బ్రహ్మ తే బ్రవాణి" (కౌ.బ్రా.4.1) 'నేను నీకు బ్రహ్మోపదేశము గావింతును' అను ఉపక్రమము గావించి ఉపసంహారములో "సర్వాన్పాప్మనోఽపహత్య సర్వేషాం భూతానాం శ్రైష్ఠం స్వారాజ్యమాధిపత్యం పర్యేతి య ఏవం వేద" (కౌ.బ్రా. 4.20) ' ఎవరు బ్రహ్మను ఆత్మరూపముగా ఉపాసించి అనుభవింతురో వారు సంపూర్ణ పాపములను నాశనము గావించి భూతములలో శ్రేష్టత్వము, స్వారాజ్యము మరియు ఆధిపత్యము పొందుదురు'. ఈ వాక్యములు ఉపక్రమ ఉపసంహారముద్వారా బ్రహ్మనే చెప్పు చున్నవి. ఆ ప్రతర్దనాధికరణ వాక్యము ద్వారా ఇచటి వాక్యముయొక్క నిర్ణయమగునిన ఆలాగుననిర్ణయించుట సరికాదు. ఆ అధికరణములో "యస్య వైతత్ కర్మ" 'ఈ సంపూర్ణ జగత్తు ఎవని కర్మయో' అను వాక్యములో బ్రహ్మ నిర్ణయము గావింపబడలేదు.కాని ఈ అధికరణములో మూఖ్యరూపముగా ఈ వాక్య విచారమే గావించిరి. అందువల్ల ఈ అధికరణమారంభిచిరి.

124. అన్యార్థం తు జైమినిఃప్రశ్నవ్యాఖ్యానాభ్యామపి చైవమేకే. (1.4.18)

సూత్రార్థము:- జైమిని ఆచార్యులు ప్రశ్నోత్తరములద్వారా జీవుని విచారము బ్రహ్మజ్ఞానము కొరకు అనును. ప్రశ్న "హే బాలాకి! ఈపురుషుడు ఎచట నిదురించుచుండెను, ఆ నిదుర స్థానమేది" జవాబు "నిదురించి వ్యక్తి కలలు చూడని సమయములో ప్రాణరూపమైన పరమాత్మతో ఏకీభవించును. వాజసనేయ శాఖవారు ఈ విజ్ఞానమయ పురుషుడు సుషుప్తి సమయములో ఎచటనుండును, అన్య అవస్థలోకి ఎచటనుండి వచ్చును. ఈ ప్రశ్నకు జవాబు ఈ జీవుడు హృదయాకాశములో నిదురించును అనిరి. ఈ జవాబు ద్వారా విజ్ఞానమయ పురుషుడు పరమాత్మ కన్నభిన్నమని సిద్ధము.

ఈ ప్రకరణములో జీవుని విచారము వాని స్వరూప బోధకు గాదు కాని బ్రహ్మతత్వ బోధకొరకు. (సూత్రములో నున్న జైమిని పూర్వ మీమాంసకుడు గాదు కాని వేదాన్తి) అందువల్ల ఈ వాక్యము బ్రహ్మ ప్రధానమే గాని జీవ ప్రధానముగాదు అని జైమిని ఆచార్యుల మతము. ఎందులకనగా ప్రశ్నోత్తరములద్వారా ఆ విధముగనే నిశ్చయమగు చున్నది. కౌషీతకిలో నిదురించు పురుషుని మేలుకొలుపు నెపముతో ప్రాణదులకన్న భిన్నమైన తత్వమును(జీవునిగా గాక) చెప్పి జీవని కన్న భిన్నవిషయమైన ప్రశ్న

గావింపబడినది. "క్వైష ఎతద్బాలకే! పురుషోఽశయిష్ట, క్వ వా ఎతదభూత్ కుత ఎతదాగాద్" (కౌ.4.16). అనగా 'హే బాలాకి! సుషుప్తి సమయములో ఈ పురుషుడు ఏ తత్వములోకి పోయి నిదిరించు చున్నాడు, ఈతడు ఆసమయములో ఎచట నుండెను, మరియు మేలుకొనిన తరువాత ఎచట నుండి వచ్చెను'. ఈప్రశ్నకు జవాబు ఈలాగున చెప్పిరి. "యదా సుప్తః స్వప్నం న కఞ్చనపశ్యత్యథాస్మిన్ప్రాణే ఎవైకధా భవతి" 'కలలు చూడకుండా నిదురించు పురుషుడు ఈప్రాణశబ్ద వాచ్యమగు పరబ్రహ్మముతో ఏకీభవించును'. సుషుప్తిలో పరమాత్మలోనే జీవుడు నిదురించును మరియు వాని నుండే మేలుకొనుననునది సిద్ధమైనది. ఈప్రసంగములో పరమాత్మయే తెలిసికొనవలయునని చెప్పబడినది. బాలాకి అజాతశత్రు సంవాదములో ఇవిధముగా ఒకశాఖలో వినబడు చున్నది. "య ఏష విజ్ఞానమయః పురుషః క్వైష తదాభూత్కుత ఎతదాగాత్" (బృ. 2.1.16) ఈ విజ్ఞానమయః పురుషుడనగా జీవుడు సుషుప్తి సమయములో ఎచట నుండెను మరియు జాగ్రదవస్థలోకి ఎచటనుండి వచ్చెను. ఈప్రశ్నకు జవాబు "య ఎషోఽన్తర్హృదయ ఆకాశస్తస్మిఞ్ఛేతే" (బృ.2.1.17) హృదయాకాశములో ఈ విజ్ఞానమయ పురుషుడు నిదురించును. అనుచోట ఆకాశ శబ్దము ద్వారా పరమాత్మను చెప్పిరి. దానిలోనే జీవుడు నిదురించును. "సర్వే ఎతే ఆత్మనో వ్యుచ్చరన్తి" (బృ. 2.1.20) ఆత్మనుండియే ఇదంతయూ ఉద్భవించెను. ఈ వాక్యము ద్వారా జీవుల అభివ్యక్తి ఆపరమాత్మనుండియే అని చెప్పుచూ వానినే జగత్కారణముగా వాజసనేయశాఖవారు బోధించు చున్నారు. అందువల్ల కౌషీతకి వాక్యము గూడ పరమాత్మనే జగత్కారణముగా చెప్పుటవలన ఆపరమాత్మలోనే సమన్వయము సిద్ధము.

# 38. వాక్యాన్వయాధికరణము.

సంగతి:- "బ్రహ్మ తే బ్రవాణి" ఈ ఉపక్రమవాక్య బలముతో సంధిగ్ధ వాక్యమును బ్రహ్మపరముగా చెప్పిరి. ఈస్థితిలో "న వా అరే పత్యుః" (బృ.4.5.6) అను శ్రుతి వాక్యములో జీవోపక్రమబలముద్వారా మైత్రేయి బ్రాహ్మణ వాక్యము జీవపరముగా చెప్పవచ్చును అను దృష్టాన్త సంగతి వలన ఈ అధికరణమారబ్ధము.
విషయము:- "ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః" (బృ.4.5.6) ఈ వాక్యము ఈ అధికరణములో విచారణీయ విషయము.
సంశయము:-ఈ శ్రుతిలో ద్రష్టవ్యత్వాదుల ద్వారా జీవుని ఉపదేశమా లేక పరమాత్మోపదేశమా? అని సంశయము.
పూర్వపక్షము:- పతి, భార్యాది భోగవస్తువుల ప్రతీతివలన సంసారి జీవుని ఇచట ద్రష్టవ్యమనవలెను.
సిద్ధాన్తి:- "యేనాహం నామృతా స్యాం కిమహం తేన కుర్యాం యదేవ భగవాన్ వేద తదేవ మే బ్రూహి" (బృ.2.4.3) 'దేని ద్వారా నేను అమరత్వాన్ని పొందలేనో దానిని తీసికొని నేను ఏమి చేసెదను? అందువల్ల

మీరు ఏ అమృతత్వమును అనుభవించుచున్నరో దాని సాధనయే నాకు చెప్పుడు' ఈశ్రుతి ద్వారా అమృతత్వము ఉపక్రమమైనది ఆలాగుననే అమృతత్వమునే ఉపసంహరించిరి. అందువల్ల సంసారి జీవుని అనువదించి పరమార్థ తత్వమును ద్రష్టవ్యత్వాది రూపముగా శ్రుతి చెప్పుచున్నది.

వైయాసికన్యాయమాలా:-

89. ఆత్మా ద్రష్టవ్య ఇత్యుక్తః సంసారీ వా పరేశ్వరః ।సంసారీ పతిజాయాదిభోగప్రీత్యాఽస్య సూచనత్॥

90. అమృతత్వముపక్రమ్య తదన్తేఽప్యుపసంహృతమ్। సంసారిణమనూద్యాతః పరేశత్వం విధీయతే॥

"ఆత్మా వా అరే ద్రష్టవ్యః" అను శ్రుతిలో ద్రష్టవ్యము ఆత్మా, జీవుడా లేక బ్రహ్మమా"? శ్రుతిలోని ఆత్మపదము జీవుని చెప్పు చున్నది, ఎందులకనగా శ్రుతిలో భర్త భార్యాది భోగ్య పదార్థముల ప్రీతిద్వారా వానితో సంబధమున్న జీవుని చెప్పుటవలన. దీనికి జవాబు- ఉపక్రమములో అమృతత్వమును చెప్పిరి. ఉపసంహారములో గూడ అమృతత్వమునే చెప్పిరి. అందువల్ల సంసారి జీవును అనువదించి దానిలో బ్రహ్మత్వ విధానము గావించిరి. గాన శ్రుతిలో చెప్పిన ఆత్మ బ్రహ్మమే.

భారతీ తీర్థ స్వాములవారి వ్యాఖ్య:-

బృహదారణ్యక చతుర్థాధ్యాయములో తన భార్యయైన మైత్రేయికి యాజ్ఞవల్క్యమహాముని ఉపదేశము "ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః" (బృ.2.4.5) అనగా 'ఆత్మ దర్శనము చేయవలయును దానికై శ్రవణ మనన నిదిధ్యాసనములు గావించవలయును'. ఇచట చెప్పిన ఆత్మ జీవుడా లేక బ్రహ్మమా అని సందేహము. పూర్వపక్షి జీవుడనును. ఏలనన "న వా అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవతి, ఆత్మనస్తు కామాయ పతిః ప్రియో భవతి" (బృ.2.4.5) ఈ వాక్యార్థము భర్తను ప్రేమించు స్త్రీ భర్త సుఖము కొరకు ప్రేమించుట లేదు గాని తన సుఖము కొరకు ప్రేమించు చున్నది. ఆలాగుననే పుత్రుడు తన సుఖము కొరకు ఇతరులను ప్రేమించును. ఇటువంటి ప్రేమ అసంగుడైన ఈశ్వరుని యందు యుక్తముగాదు. ఇత్యాది వాక్యములలో భోగ్య పదార్థములలో ప్రీతి గల జీవాత్మ ద్రష్టవ్యమనిరి గాన "ఆత్మా వా అరే"అను వాక్యములోని ఆత్మ శబ్దమునకు జీవిడని అర్థము. సిద్ధాన్తి చెప్పునదేమనగా పై వాక్య ఉపక్రమములో మైత్రేయి విత్తసాధ్య కర్మద్వారా నాకు అమృతత్వము లభించునా? అని ప్రశ్నించగా అపుడు యాజ్ఞవల్క్యుడు 'విత్తసాధ్య కర్మ ద్వారా అమృతత్వమును పొందు ఆశ లేదు' అని జవాబిచ్చెను. ఈ బ్రాహ్మణమునకు అంతములో (ఉపసంహారములో) "ఏతావదరే ఖల్వమృతత్వమ్" 'హే మైత్రేయి ఇదే అమృతత్వము' అనిరి. గాన ఉపక్రమోపసంహారముల బలమువలన ఇచట ఆత్మజ్ఞానము అమృతత్వ సాధమని ప్రతిపాదించిరి. జీవాత్మ జ్ఞానము అమృతత్వ సాధనము గాదు. అందువల్ల భోగ ప్రీతి గల జీవుని అనువదించి దానిలో బ్రహ్మత్వమును ప్రతిపాదించిరి. అందుచే చెప్పిన ద్రష్టవ్యాత్మ బ్రహ్మమే.

125. వాక్యాన్వయాత్. (1.4.19)

సూత్రార్థము:- “ఆత్మా వా అరే” అనగా ఆత్మ దర్శనము చేయవలయును దానికై శ్రవణాదులు గావించవలయును. ఈ శ్రుతిలో ద్రష్టవ్యాది రూపములోనుపదేశించిన ఆత్మ పరమాత్మయే ఎందులకనగా ఉపక్రమోపసంహారముల పర్యలోచనద్వారా బ్రహ్మమందే వాక్య తాత్పర్యమని నిశ్చయమగుచున్నది.

పరమాత్మయే ఇచట ద్రష్టవ్యత్వాది రూపములో ఉపదేశించిరి. ఎందులకనగా ఉపక్రమోపసంహారాదుల పర్యాలోచనద్వారా ఈవాక్యముల సంబన్ధము పరమాత్మయందే సిద్ధమగు చున్నది. “యేనాహం నామృతా స్యాం కిమహం తేన కుర్యాం యదేవ భగవాన్ వేద తదేవ మే బ్రూహి” (బృ.2.4.3) ‘ ముక్తి నివ్వలేని ధనముతో నాకేమి లాభము గాన ముక్తినిచ్చు సాధనము దేనిని మీరెరుంగుదురో దానిసే నాకుపదేశింపుడు’ ఈ విధముగ మైత్రేయి అమృతత్వ సాధనమడుగగా యాజ్ఞవల్క్యమహర్షి పరమాత్మ తత్వమునామెకుపదేశించెను. “నాన్యః పన్థా” ‘మొక్షమునకు జ్ఞానముకన్న వేరు సాధనలేదు’ “న కర్మణా” ‘కర్మ, ధనము, ప్రజల ద్వారా ఏవ్యక్తీ గూడా అమరత్వము వొందలేడు’ ఈశ్రుతులద్వారా మరియు “జ్ఞానాదేవ తు కైవల్యమ్” ‘కేవలము జ్ఞానము ద్వారానే మొక్షము కలుగును’ అను స్మృతిద్వారా అమృతత్వ సాధనము ఆత్మవిజ్ఞానమునుపదేశించిరి. ఆత్మవిజ్ఞానము ద్వారా సర్వవిజ్ఞానమునుపదేశించి “బ్రహ్మ తం పరాదాద్యోఽన్యత్రాత్మనో బ్రహ్మ వేద” ‘ఆత్మకన్న భిన్నముగా బ్రాహ్మణజాతిని తెలిసికొనువానిని బ్రహ్మ కల్యాణమార్గమునుండి భ్రష్టుని చేయును’ ఈ వాక్యముద్వారా బృహదారణ్యకములో ఆత్మవిజ్ఞానమే ప్రతిపాదించిరి. మరల ఈ ప్రంగములోనే ఇట్లు చెప్పిరి. “దున్దుభేర్హన్యమానస్య” (బృ.2.4.7) అనగా ‘దున్దుభి (భేరి వాద్యము),శంఖము మరియు వీణ వీని సామాన్య జ్ఞానముద్వారా కలుగు అవాన్తర వీశేష శబ్ద జ్ఞానము సామాన్య శబ్దములో కల్పితములు’. ఈ దృష్టాన్తములద్వారా అభిన్న ఆత్మనే దృఢపరిచిరి. ఋగ్వేదాదులు ఆపరమాత్మయొక్క నిఃశ్వాస రూపములు అను చెప్పుచూ శ్రుతిద్వారా ఋగ్వేదాది నామములు తదనుసారము రూపములు ఇష్టాది కర్మలు గల ఈప్రపఞ్చమునకు కారణము ఆపరమాత్మయేనని చెప్పిరి. అంతేగాక ఏకాయన ప్రక్రియాద్వారా గూడా పరమాత్మనే చెప్పిరి. ఏకాయనమనగా విలయస్థానము. అన్ని నదులకు విలయ స్థానము సముద్రము, శబ్దాదులకు విలయస్థానము త్వగాది ఇంద్రియములు. అందువల్ల పరమత్మయే ద్రష్టవ్యాదులద్వారా ఉపదేశింపబడినది.

126. ప్రతిజ్ఞాసిద్ధేర్లిఙ్గమాశ్మరథ్యః. (1.4.20)

సూత్రర్థము:- ఆత్మ విజ్ఞానముద్వారా సంపూర్ణ ప్రప్రంచ విజ్ఞానమగునని ప్రతిజ్ఞ గావించబడినది. ఆ ప్రతిజ్ఞ సిద్ధికొరకు సూచకహేతువు జీవబ్రహ్మల అభేదాంశమును తీసికొని జీవుని గురించి ఉపక్రమము గావించుట, అని ఆశ్మరథ్య ఆచార్యుల మతము.
ప్రియ శబ్దము ద్వారా సూచించబడిన ఆత్మ ‘దర్శన యోగ్యము’ అని చెప్పుట యుక్తి సంగతమెట్లగును.

దీనికి సమాధానము. "ఆత్మని విజ్ఞాతే సర్వం విజ్ఞాతం భవతి" (బృ.2.4.6) 'ఆత్మను తెలిసికొనిన సర్వము తెలిసికొనగలము". ఈశ్రుతిలో చెప్పిన ప్రతిజ్ఞా సిద్ధికొరకు ఆత్మ దర్శనము అసాధారణ హేతువు అని ఆశ్మరథ్య ఆచార్యుల మతము ఈ అధికరణ భారతీ తీర్థులవారి వ్యాఖ్యనందు చెప్పిన బృహదారణ్యక శ్రుతి 2.4.5 లో గల ప్రియ శబ్దము ద్వారా సూచించబడిన జీవాత్మనే ద్రష్టవ్యాదిరూపములో చెప్పిరి. జీవాత్మ పరమాత్మలు అత్యన్త భిన్నములైన పరమాత్మా జ్ఞానము ద్వారా జీవాత్మ జ్ఞానము కలుగదు, అపుడు ఒకజ్ఞానము ద్వారా సర్వజ్ఞానము కలుగునని చెప్పిన ప్రతిజ్ఞ నష్ట మగును. అందువల్ల ప్రతిజ్ఞా సిద్ధికొరకు జీవాత్మ పరమాత్మలలోగల అభేదాంశమును గ్రహించి ముందు చెప్పినరీతిగా ఉపక్రమము గావించిరి.

127. ఉత్క్రమిష్యత ఎవంభావాదిత్యౌడులోమిః. (1.4.21)

సూత్రార్థము:- "అహం బ్రహ్మాస్మి" అను వాక్యబోధ కలిగిన తరువాత దేహేన్ద్రియ అభిమానము త్యజించి పరమాత్మతో ఏకమగును. ఈ భవిష్యత్ అభేదమును స్వీకరించి జీవుని ఉపక్రమము గావించిరని ఔడులోమి ఆచార్యుల మతము.
అజ్ఞానావస్థలో దేహాదులతో గూడిన జీవుడు బ్రహ్మ కన్న భిన్నముగా స్వీకరింతురు. ఛాందోగ్యోపనిషత్తులో "ఏష సంప్రసాదోఽస్మాత్ఛరీరాత్సముత్థాయ పరం జ్యోతిరుపసంపద్య స్వేనరూపేణాభినిష్పద్యతే" (ఛాం.8.12.3) అనగా ఈ జీవుడు సుషుప్తిలో ఈ శరీరాభిమానము వదలి పరమజ్యోతిని పొంది తనయొుక్క స్వస్వరూపములో నిలుచును. జ్ఞానాదులతో శుద్ధుడై కార్య-కరణసంఘాతమును (స్థూల, సూక్ష దేహములు) పరిత్యజించి ముక్తుడై పరమాత్మతో ఏకీభవించును అను భవిష్యత్తు కాలీన అభేద అంశమును స్వీకరించి, జీవుని భిన్నముగా చెప్పుటకు ఉపక్రమించిరని ఔడులోమి ఆచార్యుల మతము.

కార్య కారణ భావమువల్ల జీవ పరమాత్మల అభేదము ఆశ్మరథ్య ఆచార్యుల మతానుసారము చెప్పిరి. సంసార దశలో జీవుని భిన్నముగను మోక్ష దశలో అభిన్నముగను ఔడులోమి ఆచార్యుల పక్షములో చెప్పిరి. ఒకవేల జీవపరమాత్మల భేదము పొరపాటున ఈ రెండు పక్షములలో స్వీకరించిన పారమార్థిక అబేధము చెప్పుట అసంగతమగును. గాన అంతిమ సమాధానము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

128. అవస్థితేరితి కాశకృత్స్నః (1.4.22)

సూత్రర్థము:- అవిద్యా కల్పిత భేదము ద్వారా బ్రహ్మమే జీవరూపముగా నున్నదని జీవునితో ఉపక్రమము గావించిరని కాశకృత్స్నాచార్యుల అభిప్రాయము.
విశుద్ధమైన బ్రహ్మమే అవిద్యకారణమువల్ల కల్పింబడిన జీవుని రూపములో నున్నది. పారమార్థికముగా జీవబ్రహ్మలు అభిన్నులగుటవలన ఇచట జీవునితో ఉపక్రమము యుక్తి సంగతము. ఈవిధముగా శ్రుతి

తాత్పర్యమునెరింగిన కాశకృత్స్నాచార్యులు చెప్పుచున్నారు. అందువల్ల అనుభవించుటకు యోగ్యమైన బ్రహ్మమునందే మైత్రేయి బ్రాహ్మణము సమన్వయమని సిద్ధమగు చున్నది.

# 39. ప్రకృత్యధికరణము.

సంగతి:- ముందు జన్మాద్యధికరణములో జగత్కారణము బ్రహ్మమని చెప్పబడినది. లోకములో ఘటాదులకు మట్టి ఉపాదానకారణము మరయు కుమ్మరి నిమిత్తకారణము అట్లే బ్రహ్మ జగత్తునకు ఉపాదానకారణమా? లేక నిమిత్త కారణమా? లేక ఉభయకారణమా? ఈవిధమైన విశేష విచారము గావించుటకు సామాన్య జ్ఞానము కారణమగుటవలన పూర్వాధికరణముతో ఈ అధికరణమునకు హేతుహేతుమద్భావ సంగతి.

విషయము:- బ్రహ్మ యొక్క జగత్కారణత్వము ఈ అధికరణములో విచారణీయ విషయము.

సంశయము:- కేవలము బ్రహ్మ జగత్తుయొక్క నిమిత్త కారణమా లేక ఉపాదాన కారణము గూడయా అని సంశయము.

పూర్వపక్షము:- "స ఈక్షాంచక్రే" (ప్ర. 6.3) "స ప్రాణమసృజత" (ప్ర. 6.4) 'ఆ పరమేశ్వరుడు సంకల్పించెను' ' ప్రాణమునాతడు సృజించెను.' ఈ శ్రుతులలో సంకల్ప పూర్వక జగత్కర్తృత్వము వినిపించు చున్నది. ఈ విధముగనే కుమ్మరిలో నిమిత్త కారణము చూడబడుచున్నది. అందువల్ల ఆపరమేశ్వరుడు ఈ జగత్తునకు కేవలము నిమిత్త కారణమే గాని కుండకు మట్టివలే ఉపాదానకారణము గాడు.

సిద్ధాన్తము:- "బహుస్యాం" అనేకరూపములు పొందుదును. ఈ శ్రుతి ద్వారా సంకల్పించు వానిలో ఉపాదానము గూడ వినిపించు చున్నది. దీనితో బాటు ఒక జ్ఞానము ద్వారా సర్వ జ్ఞానము యొక్క ప్రతిజ్ఞ కూడ చేయబడినది. ఈ కారణములు చూచుచు బ్రహ్మ జగత్తునకు ఉభయ కారణమనుటయటయే ఉచితము.

వైయాసికన్యాయమాలా:-

91. నిమిత్తమేవ బ్రహ్మ స్యాదుపాదానం చ వీక్షణాత్। కులాలవన్నిమిత్తం తన్నోపాదానం మృదాదివత్॥

92. బహు స్యామిత్యుపాదానభవోఽపి శ్రుత ఈక్షితుః। ఏకబుద్ధ్యా సర్వధీశ్చ తస్మాద్బ్రహ్మోభయాత్మకమ్॥

బ్రహ్మ జగత్తునకు నిమిత్తకారణమేనా లేక ఉపాదానకారణము గూడానా అను సందేహము రాగా పూర్వవాది సృష్టింబోవు పదార్థముల ఈక్షణ లేక సంకల్పము చెప్పినందున కుమ్మరి మొదలగువారిలా బ్రహ్మ జగత్తునకు కేవలము నిమిత్తకారణమే గాని ఉపాదానకారణము గాజాలదు. సిద్ధాన్తి సమాధానము. ఈక్షణకర్త (బహుస్యామ్) నేను అనేకరూపములు పొందుదును అనుట వలన ఉపాదానకారణముగూడ చెప్పబడినది. అంతేగాక శ్రుతిలో చెప్పిన ఏకవిజ్ఞానము ద్వారా సర్వ విజ్ఞానము అను ప్రతిజ్ఞ వలన గూడ

ఉపాదానకారణము అగుటవలననే సర్వవిజ్ఞానము కలుగును. అందువల్ల బ్రహ్మ జగత్తునకు నిమిత్త కారణము మరియు ఉపాదానకారణము గూడా.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఈ అధికరణమునకు విషయము జగత్తుయొక్క కారణమును చెప్పు అన్ని శ్రుతులు. వానిలో సంశయము కలుగు చున్నది. బ్రహ్మము కేవలము నిమిత్తకారణమా? లేక ఉపాదానకారణము గూడానా? ఎందులకనగా "తదైక్షత" (ఛాం.3.2.6) అని సృష్టింపబడు కార్యముల పర్యాలోచన చేసినందువలన. ఆలోచన శక్తి నిమిత్తకారణము మగు కుమ్మరి మొదలగు వానిలో చూడబడుచున్నదే గాని ఉపాదాన కారణమైన మృత్తికాదులలో కానరాదు. గాన బ్రహ్మము నిమిత్త కారణమేగాని ఉపదనకారణము గాదని పూర్వపక్షి మతము. దానికి సిద్ధాన్తి చెప్పెను. "తదైక్షత బహు స్యాం ప్రజాయేయ" ఈ విధముగా సంకల్ప కర్తయే బహురూపములు పొందుట శ్రుతిలో వినబడుటవలన బ్రహ్మమే ఉపాదనకారణము గూడా. మరియు "యేనాశ్రుతం శ్రుతం భవతి" దేనిని తెలిసి కొనిన విననిది విననగును అని ఒకే బ్రహ్మ జ్ఞానముద్వారా వినని జగత్తు వినినట్లగును. ఒకే బ్రహ్మ జ్ఞానము కలిగిన సర్వవిజ్ఞానము కలుగునని ప్రతిపాదించిరి, ఆ విజ్ఞానము బ్రహ్మము సర్వమునకు ఉపాదానకారణమై బ్రహ్మకన్న వేరు కార్యము లేనిచో సిద్ధమగును. బ్రహ్మము కేవలము నిమిత్తకారణమైనచో అన్ని కార్యములు బ్రహ్మ కన్న భిన్నమగుటవలన ఒకవిజ్ఞానముద్వారా సర్వవిజ్ఞానము ప్రతిపాదించుట సంభవము కాదు. అందువలన బ్రహ్మము నిమిత్త కారణము మరియు ఉపాదాన కారణము గూడా.

### 129. ప్రకృతిశ్చ ప్రతిజ్ఞాదృష్టాన్తానుపరోధాత్. (1.4.23)

సూత్రార్థము:- బ్రహ్మము ఉపాదానకారణము మరియు నిమిత్తకారణము గూడాను, ఎందులకనగా ("యేనాశ్రుతం..") 'దేని జ్ఞానముద్వారా విననిది వినినట్లగునో' అను శ్రుతి వాక్యముద్వారా మరియు ఒక విజ్ఞానముద్వారా సర్వవిజ్ఞానమను ప్రతిజ్ఞ ఇంకను ("యథా సోమ్యైకేన...") 'హే సౌమ్యుడా! ఒక మట్టిపిండము జ్ఞానముద్వారా అన్ని మట్టి వికారముల జ్ఞానము కలుగును' అను శ్రుతి వాక్యము వలనను అభిన్ననిమిత్తోపాదాన కారణము సిద్ధమగు చున్నది. పైన చెప్పిన ప్రతిజ్ఞ మరియు శ్రుతిలో చెప్పిన దృష్టాన్తముల వలన అభిన్న నిమిత్తోపాదానకారణము సిద్ధమగుచున్నది.

ప్రకృతిశ్చ అను పదములో నున్న ప్రకృతి పదము ఉపాదానకారణము చెప్పును, 'చ' కారము నిమిత్త కారణమని చెప్పిన శ్రుతిలో చెప్పిన ప్రతిజ్ఞాధృష్టాన్తముల నిర్వాహము సిద్ధమగును. "యేనాశ్రుతం శ్రుతం భవత్యమతం మతమవిజ్ఞాతం విజ్ఞాతం" 'దేనిని వినిన విననిది వినినట్లగును, మననము చేయనిది చేసినట్లగును, మరియు అవిజ్ఞాతము విజ్ఞాతమగును' (ఛాం.6.1.2) ముండకములో "కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి" 'భగవన్! దేనిని తెలిసికొనిన ఇదంతయు తెలియునో' (ముం.1.1.2)

బృహదారణ్యకములో “ఆత్మని ఖల్వరే దృష్టే శ్రుతే మతే విజ్ఞాతే ఇదం సర్వం విదితమ్” ‘ఆత్మను చూసిన వినిన మరియు తెలిసికొనిన ఇదంతయు తెలియును’ (బృ.4.5.6). ఇదే విధముగా అనేక శ్రుతులలో ఒక ఆత్మ జ్ఞానముద్వారా సర్వవిజ్ఞాన ప్రతిజ్ఞ కనబడు చున్నది. దృష్టాన్తములు “యథా సోమ్యైకేన మృత్పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాద్వాచారమ్భణం” ‘ఓ ప్రియదర్శనుడా! ఏ విధముగా ఒకమట్టి పిండమును తెలిసికొనిన అన్ని మట్టి వికారములు తెలోయునో, ఎందులకనగా కార్యమంతయు కేవలము నోటితో పలుకుటకు మాత్రమేగాని వాస్తవమునకు కారణము మాత్రమే గలదు కాని కార్యము లేదు’ (ఛాం.6.1.4) “యథా పృథివ్యామోషధయః సమ్భవన్తి” ‘ఏలాగున భూమినుండి ఓషధులు ఉత్పన్నమగుచున్నవో ఆలాగుననే బ్రహ్మమునుండి సంపూర్ణవిశ్వము ఉత్పన్నమైనది’. (ముం.1.1.7) “స యథా దున్దుభేర్హన్యమానస్య న బహ్యాఞ్ఛబ్దాన్ఛక్నుయాత్” ‘ఏవిధముగా భేరి (దున్దభిః) వాయిద్యమునుండి వచ్చు శబ్దములను పట్టుకొనుటకు ఎవరికీ వీలుకాదో, గాని వాద్యమును గ్రహించిన శబ్దము స్వయముగా గ్రహింప బడును’. ఈ ప్రతిజ్ఞా దృష్టాన్తములద్వారా బ్రహ్మమే జగదుపాదాణకారణమని శ్రుతులు ఉద్ఘోషించుచున్నవి. ఉపాదానకారణమును తెలిసికొననిచో ఎన్నటికిన్నూ సర్వ కార్యముల విజ్ఞానము సంభవముగాదు, దానికి విపరీతముగా ఉపాదానకారణజ్ఞానమువలన సర్వకార్యముల విజ్ఞానము కలుగును. అందువల్ల కార్యము ఉపాదానకారణముకన్న భిన్నము గాదు. ఈవిధమైన శ్రుతుల ప్రతిజ్ఞా దృష్టాన్తములవలన అభిన్న నిమిత్తోపాదానకారణము బ్రహ్మములోనే సిద్ధమగు చున్నది.

### 130. అభిధ్యోపదేశాచ్చ. (1.4.24)

సూత్రార్థము:- శ్రుతులలో ‘సోఽకామయత’ ‘ఆతడు సంకల్పించెను’ ఈ ప్రకారము ధ్యానోపదేశమువలన ఆత్మ కర్త అనగా నిమిత్తకారణము. ‘బహు స్యాం’ నేను అనేకరూపలుగా అగుదును’ ఈవిధమమైన ధ్యానోపదేశమువలన గూడ బ్రహ్మమే ప్రకృతి అనగా ఉపాదానకారణము.

మరియు “సోఽకామయత” “తదైక్షత” ‘ఆతడు కోరెను’ ‘వాడు సంకల్పించెను’ అను శ్రుతులలో సృష్టికి ముందు ధ్యానోపదేశమువలన ఆ బ్రహ్మమునందు ఉభయకారణత్వము అనగా ఉపాదానకారణము మరియు నిమిత్తకారణము తెలియు చున్నది. అచట కామనా శ్రవణమువలన కర్తృత్వము ద్వారా నిమిత్తకారణత్వము మరియు “బహు స్యాం” అనుచోట అంతరాత్మలో అనేకరూపములుగా అగుదునను ధ్యానము ద్వారా ఉపాదాన కారణము ప్రతీత మగుచున్నదని రెండు కారణముల వివేకము చేయవలయును. ఉపాదాన కారణమని చెప్పుటకు మరియొక హేతువును ముందు సూత్రములో చూపెదరు.

### 131. సాక్షాచ్చోభయామ్నానాత్. (1.4.25)

సూత్రార్థము:- ("సర్వాణి హ వా ఇమాని") ఈ భూతములన్నియు ఆకాశమునుండియే ఉత్పన్న మగుచున్నవి, ఆ ఆకాశములోనే లీనమగుచున్నవి. ఈ ప్రకారము శ్రుతిలో ఆకాశ శబ్దతో బ్రహ్మను గ్రహించి సాక్షాత్తుగా జగత్తుయొక్క ఉత్పత్తి మరియు ప్రళయములు చెప్పబడినవి. అందువల్ల బ్రహ్మమే జగదుపాదాన కారణము మరియు నిమిత్త కారణము.

ఇందువలన గూడ బ్రహ్మము జగత్తు యొక్క ఉపాదానకారణము. ఎందువలననగా ఛాందోగ్యోపనిషత్తులో "సర్వణి హ వా ఇమాని భూతాన్యాకాశాదేవ సముత్పద్యన్తే ఆకాశం ప్రత్యస్తం యన్తి" (ఛాం.1.9.1) "సర్వము భూతాకాశమునుండియే ఉత్పన్నమగుచున్నవి మరియు ఆ ఆకాశములోనే లీనమగుచున్నవి" అని చెప్పబడినది. దేనినుండి ఉత్పన్నమగుచున్నవో దేనిలో లీనమగుచున్నవో అది ఉపాదానకారణమని లోకములో ప్రసిద్ధము. ఏవిధముగా గోధుమాదులు భూమినుండి ఉత్పన్నమగుచున్నవి మరియు ఆ భూమిలోనే లీనమగుచున్నవి. అందువల్ల భూమి గోధుమాదులకు ఉపాదాన కారణము. ఆవిధముగనే ఆకాశశబ్ద వాచ్యమైన బ్రహ్మమునుండి ఉత్పన్నమై దానిలోనే లీనమగు భూతములకు ఉపాదానకారణము బ్రహ్మమే. అందువల్ల శ్రుతి బ్రహ్మమునే సాక్షాత్తుగా జగత్తుయొక్క ఉపాదానకారణము మరియు నిమిత్త కారణమని చెప్పు చున్నది.

### 132. ఆత్మకృతేః పరిణామాత్. (1.4.26)

సూత్రర్థము:- "తదాత్మానం స్వయమకురుత" (తై.2.7) 'తనకు తానే స్వయముగా సృష్టిరూపముగా నిర్మించుకొనెను' ఈశ్రుతిలో ఆత్మసంబన్ధమైన కర్తృత్వము చెప్పబడినది. అందువల్ల బ్రహ్మమే జగత్తునకు అభిన్న నిమిత్తోపాదానకారణము. సిద్ధ వస్తువుగూడా వివర్తరూపముగా సాధ్యవస్తువు కాగలదు. అందువల్ల బ్రహ్మమే కర్మత్వ కర్మకు విషయమగును.

సూత్రములో వచ్చిన పరిణామ పదమునకు వివర్తమని అర్థము. "తదాత్మనం స్వయమకురుత" తనకు తానే సృష్టిరూపములో మారెను" ఈ శ్రుతిలో 'ఆత్మానం' అను ద్వితాయా విభక్తి వల్ల కర్మత్వము చెప్పబడు చున్నది మరియు 'స్వయమకురుత' అను పదముద్వారా కర్తృత్వము చెప్పుటవలన బ్రహ్మమే జగదుపాదానకారణము. శ్రుతిద్వారా ప్రతిపాదించినందువలన ఒకే బ్రహ్మములో కర్తృత్వము మరియు కర్మత్వము విరుద్ధము కాదు. పూర్వ సిద్ధమైన కర్తరూపమైన పదార్థములో నిర్మింపబడు కర్మత్వము చెప్పుట సంభవముకాదు అనగా కర్త మొదటనే ఉండును తరువాత కృతిసాధ్యమైన కర్మమేర్పడును, రెండు ఒకనిలో ఎట్లుండ గలవు? అని ప్రశ్నింపగా అది సరిగాదు. ఇచట కర్మత్వ పదముద్వారా పరిణామము అనగా వివర్తమని చెప్పబడినది. పరిణామమనగా ఉపాదానముకన్న భిన్నాస్తిత్వప్రతిరూపముగా కనబడుటనే వివర్తమందురు. అది కారణముతో సమానమైన అస్తిత్వములేనిది. పూర్వ సిద్ధమైన అలచిప్ప అజ్ఞానమువలన వెండి వలే కనబడుటనే వివర్త మందురు. అదేవిధముగా అనాది సిద్ధమైన పరమాత్మ

మాయారూపమైన అవిద్యా కారణమువల్ల జగత్తు రూపముగా కనబడుటనే వివర్త మందురు. వివర్త రూపముగా సాధ్యమగుటవలన పూర్వ సిద్ధమైన కారణరూపమైన పరమాత్మయందే కర్మత్వము సంభవమే.

133. యోనిశ్చ హి గీయతే. (1.4.27)

సూత్రార్థము:- "యద్భూతయోనిం పరిపశ్యంన్తి ధీరాః" (ముం.1.1.6) 'భూతములకు కారణమును ధీర పురుషులు చూచుదురు లేక తెలిసికొందురు' ఈ శ్రుతిలో పకృతివాచకమైన (ఉపాదానకారణమైన) యోని శబ్దముద్వారా ఆత్మను చెప్పిరి. అందువలన బ్రహ్మమే ఉపాదానకారణము.

"యద్భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః" "కర్తారమీశం పురుషం బ్రహ్మ యోనిమ్" 'జ్ఞానులు సంపూర్ణ భూతముల కారణమును పరబ్రహ్మముగా తెలిసికొందురు'. (ముం.3.1.3) 'సృష్టికర్తను, నియామకుడైన ఈశ్వరుని, పురుషుని, బ్రహ్మమును (హిరణ్యగర్భునకు కారణమును) మరియు భూతములయోనిని జ్ఞానులు తెలిసి కొందురు.' ఇచట యోని శబ్దము పకృతివాచకము అనగా ఉపాదానకారణమని లోక-వేదములలో ప్రసిద్ధము. ఉపాదాన కారణవాచకమైన యోని శబ్దముద్వారా ఆత్మకన్న అభిన్నమైన పరబ్రహ్మమునే చెప్పిరి. అందువల్ల బ్రహ్మమే పకృతి అనగా ఉపాదానకారణము మరియు కర్త అనగా నిమిత్తకారణము.

# 40. సర్వవ్యాఖ్యానాధికరణము.

సంగతి:- 'ఈక్షతేర్నా శబ్దమ్' అను సూత్రముద్వారా ప్రసంగము ప్రారంభించి మరల మరల అశబ్దాది హేతుబోధకములైన సూత్రములద్వారా ప్రధానకారణవాదము నిరాకరించిరి. ఆవిధముగా పరమాణు కారణవాదము నిరాకరించలేదు. శ్రుతులలో ఆపరమాణవులు గూడ కారణమని వినబడుచున్నదని పూర్వ-పక్షి చెప్పుటవలన ఇచట ప్రత్యుదాహరణసంగతి.

విషయము:- సామాన్యరూపముగా అన్ని వేదాన్త వాక్యములు ఈ అధికరణమునకు విచారణీయ విషయములు.

సంశయము:- ఏ విధముగా బ్రహ్మము జగత్కారణమని వినబడు చున్నదో ఆలాగుననే పరమాణువులు, శూన్యము మొదలగునవి గూడ అచట అచట జగత్కారణములుగా చెప్పబడినవా? లేవా?

పూర్వపక్షము:- 'ఓ సౌమ్యుడా! ఏ సూక్ష్మపదార్థమును తెలిసి కొనలేకపోవు చున్నవో ఆసూక్ష్మ వటబీజములోనే ఈ మహావటవృక్షము ఉన్నది'. ఇంకను "అసదేవేదమగ్ర ఆసీత్" (ఛాం.6.2.1) అను శ్రుతి గలదు. ఈ శ్రుతుల ప్రమాణము వలన పరమాణువు మరియు శూన్యము జగత్కారణమని చెప్పవచ్చునుగదా?

సిద్ధాన్తము:- పరమాణువు మరియు శూన్యమును జగత్కారణముగా చెప్పిన ఒకదాని జ్ఞానముద్వారా సర్వజ్ఞానముకలుగునను ప్రతిజ్ఞ సిద్ధముగాదు. బ్రహ్మములో అసద్వ్యద్భము వలన 'నామరూపములు సృష్టికాని స్థితి అనియు' శూన్యము (సూక్ష్మము )అనగా 'దృష్టిగోచరము కాజాలదనియు' అర్థము. అందువల్ల సంపూర్ణ జగత్కారణము బ్రహ్మమే గాని పరమాణువు గాని శూన్యము గాని గాదు.

వైయాసికన్యాయమాల:-

93. అణ్వాదేరపి హేతుత్వం శ్రుతం బ్రహ్మణ ఏవ వా। వటధానాదిదృష్టాన్తాదణ్వాదేరపి తచ్ఛ్రుతమ్॥

94. శూన్యాణ్వాదిష్వేకబుద్ధ్యా సర్వబుద్ధిర్న యుజ్యతే। స్యుర్బ్రహ్మణ్యపి ధానాద్యాస్తతో బ్రహ్మైవ కారణమ్॥

శ్రుతులలో జగత్కారణము అణువు శూన్యాదులను చెప్పిరా లేక కేవలము బ్రహ్మమునే చెప్పిరా అనిన పూర్వవాది శ్రుతులలో వటబీజాదులు కారణముగా చెప్పిరి గాన అణువు మరియు శూన్యము జగత్కారమనును. దానికి సిద్ధాన్తి సమాధానము. ఒక విజ్ఞానము ద్వారా సర్వ విజ్ఞానము శూన్యవాదముద్వారా మరియు అణువాదముద్వారా ఉత్పన్నము గాజాలదు. వటబీజాదుల దృష్టాన్తము బ్రహ్మములో గూడ సంభవము గాన బ్రహ్మమే జగత్కారణము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఈ అధికరణమునకు విషయము వేదాన్త వాక్యములు. శ్రుతివాక్యములలో సంశయము కలుగుచున్నది. బ్రహ్మవలే పరమాణువాదము మరియు శూన్యవాదము జగత్కారణములో శ్రుతిసమ్మతములా? లేక కేవలము బ్రహ్మమే జగత్కారణమా? పూర్వపక్షి చెప్పునదేమనగా అణువాదమును గూడ జగత్కారణ మనునది శ్రుతిసమ్మతము ఎందలకనగా వటబీజముయొక్క దృష్టాన్తము శ్రుతులలో వినబడు చున్నది. ఛాందోగ్యములోని ఆరవ ఆధ్యాయములో శ్వేతకేతువనకు ఉద్దాలకఋషి ఉపదేశించుచూ సూక్ష్మతత్వములో స్థూలజగత్తుయొక్క అన్తర్భావము ప్రతిపాదించుటకు మహావృక్షగర్భితములైన వటబీజములను దృష్టాన్తముగా చెప్పిరి. మహావటవృక్షము అణురూపములోనున్న వటబీజమునందు దాగియున్నట్లు ప్రపంచ మంతయు సూక్ష్మాణువులందు ఇమిడియున్నది. అందువల్ల మహాకార్యగర్భిత పరమాణువులు దార్ష్టాన్తికరూపములో శ్రుతిలో చెప్పబడినవి. "అసద్వా ఇదమగ్ర ఆసీత్" అనగా 'ఈ సంపూర్ణ జగత్తు సృష్టికి పూర్వము అసద్రూపములో నుండెను'. ఈ శ్రుతి శూన్యమునే సాక్షాత్తుగా జగత్కారణమని చెప్పుచున్నది. "స్వభావేకే కవయో వదన్తి, కాలం తథాఽన్యే" (శ్వే.6.2) 'కొందరు స్వాభావికముగనే జగత్తుత్పత్తి అగుచున్నదనుచు స్వభావమునే జగత్కారమనుచున్నారు, మరికొందరు సమయము లేక కాలము జగత్కారణమనుచున్నారు'. అందువల్ల పరమాణువు మొదలైన వానిలో జగత్కారణత్వము శ్రుతి సిద్ధము. ఈ విధమైన పూర్వపక్షి ప్రశ్నలకు సిద్ధాన్తి సమాధానము. ఒక విజ్ఞానము ద్వారా సర్వవిజ్ఞానము శూన్యాదిమతములద్వారా యుక్తిసంగతము కాదు. ఎందులకనగా బ్రహ్మము శూన్యాదులనుండి ఉత్పన్నము కాలేదు గాన శూన్యముయొక్క జ్ఞానముద్వారా బ్రహ్మజ్ఞానము కలుగదు. వటబీజ దృష్టాన్తము

బ్రహ్మము ఇంద్రియగోచరము గానందువలనను, సూక్ష్మమగుటవలనను బ్రహ్మవిషయము కాగలదు. ఇక 'అసద్' శబ్దార్థము నామరూపములు ప్రకటముగాని స్థితియని ఈపాదములోని నాల్గవ అధికరణములో చెప్పియుంటిమి. శ్రుతులలో స్వభావపక్షము మరియు కాలపక్షము పూర్వపక్షి మతమని చెప్పబడినది. దీనిద్వారా శ్రుతులలో బ్రహ్మమే జగత్కారణమనియు పరమాణువు అణువువాదులు కాదని సిద్ధమగుచున్నది.

134. ఎతేన సర్వే వ్యాఖ్యాతా వ్యాఖ్యాతాః (1.4.28)

సూత్రార్థము:- ప్రధానకారణవాదము యొక్క నిరాకరణముద్వారా అణువాదము, శూన్యవాదము, స్వభావవాదము, కాలవాదము మొదలైనవన్నియూ జగత్కారణములు గావని తెలిసికొనవలయును. 'వ్యాఖ్యాతాః' అను పదాభ్యాసము (రెండుమారులు ప్రయోగించుట) అధ్యాయసమాప్తి కొరకు చెప్పిరి.

ప్రధానకారణవాదమును ఖండించుసమయమున చెప్పిన హేతువులద్వారా ఈ పరమాణ్వాది జగత్కారణవాదములు ఖండించ బడినవని తెలిసికొనవలయును. ఆ కారణములు అశబ్దత్వము, అచేతనత్వము మరియు ఒక విజ్ఞానముద్వారా సర్వవిజ్ఞాన ప్రతిజ్ఞ అసిద్ధత్వము మొదలైనవి. ఈ కారణములు అణ్వాది కారణ వాదములలో సమానముగానున్నవి. పరమాణ్వాదులను జగత్కారణముగా స్వీకరించనిచో శబ్దప్రమాణము విరోధమగుననిన? అట్లనుట సరిగాదు. ఆత్మసూక్ష్మమని చెప్పుటకు 'అణు' శబ్ద ప్రయోగము మరియు ప్రకటముగాని నామరూపముల స్థితిని చెప్పుటకు 'అసద్' శబ్ద ప్రయోగము శ్రుతులలో చెప్పిరి. ఈసూత్రములోని 'వ్యాఖ్యాతాః' పదము యొక్క పునారావృత్తి అధ్యాయ సమాప్తి కొరకు చెప్పిరి. అందువల్ల జగత్కారణము సర్వజ్ఞ పరమాత్మయందే అన్ని శ్రుతివాక్యముల సమన్వయము గాని పరమాణ్వాదులందు కాదనునది సిద్ధమైనది.

## బ్రహ్మసూత్ర హృదయములో ప్రథమాధ్యాయములోని

## చతుర్థపాదముయొక్క సంకలనము సమాప్తము.

---------

# బ్రహ్మసూత్రములు.ద్వితీయాఽధ్యాయము.

## స్మృతిపాదము.

## 41. స్మృత్యధికరణము.

సంగతి:- ఈ అవిరోధాఖ్య ద్వితీయధ్యాయములో ప్రథమపాదమునందు సాంఖ్య, వైశేషిక, యోగ, కాణాదాది స్మృతులు మరియు వాని ద్వారా చెప్పిన తర్కములతో వేదాన్త సమన్వయనకు కలిగిన విరోధపరిహారము గావించిరి. ప్రథమాధ్యాయములో అన్ని శ్రుతుల యొక్క సమన్వయము అద్వైత బ్రహ్మమునందే అని చెప్పబడినది. ఆ సమన్వయమే ఇచట విషయము. ఆవిషయమునకు సాంఖ్యాది స్మృతులు మరియు వాని తర్కములద్వారా విరోధము కలిగినందువలన వాని పరిహారము ఈ ద్వితీయాధ్యాయములో గావించిరి. అందువల్ల ప్రథమాధ్యాయముతో ఈ ద్వితీయాధ్యాయమునకు విషయ-విషయీ భావ అధ్యాయ సంగతి. ఈ అధ్యాయమయనకు విరోధపరిహారాధ్యాయమని నామము. సాంఖ్యుల ప్రధానాదులందు వైదికప్రమాణము లేకపోయినను కపిలాదుల స్మృతిరూపమైన శబ్దప్రమాణము ఉండనే ఉన్నది. ఈ విధముగా ఆక్షేపము కలుగగా ఈ అధికరణము ప్రారంభించుటవలన పూర్వధికరణముతో దీనికి ఆక్షేప సంగతి.

విషయము:-ఈ అధికరణములో విచారణీయ విషయము సమన్వయము యొక్క అవిరోధము.

సంశయము:- వేదాన్త వాక్యముల సమన్వయములో సాంఖ్యస్మృతి ద్వారా సంకోచము వచ్చునా? రాదా? అని సంశయము.

పూర్వపక్షము:- వేదాన్త సమన్వయము బ్రహ్మములోనే అని చెప్పిన, సర్వజ్ఞులైన కపిలాది ఋషులద్వారా రచింపబడినదియు మరియు విద్వాంసులద్వారా ఆదరము పొందినదియు ప్రధానకారణవాదమును చెప్పు సాంఖ్యస్మృతుల సంకోచము లేక నిరర్థకత కలుగునుగాన ఈసాంఖ్యస్మృతిలో ప్రసిద్ధమైన ప్రధానాదుల ననుసరించియే శ్రుతుల అర్థము చెప్పవలయును.

సిద్ధాన్తము:- మన్వాది స్మృతులకు శ్రుతులే మూలము మరియు ఆధారము, అందువల్ల శ్రుతులను ఆధారముగా స్వీకరించని కాపిల సాంఖ్యస్మృతి బాధితమగును. గాన సాంఖ్య స్మృతి ద్వారా వేదాన్త సమన్వయమునకు ఏ విధమైన విరోధము లేదు.

వైయసికన్యాయమాలా:-

95. సాంఖ్యస్మృత్యాఽస్తి సంకోచో న వా వేదసమన్వయే। ధర్మే వేదః సావకాశః సంకోచోఽనవకాశయా॥

96. ప్రత్యక్షశ్రుతిమూలాభిర్మన్వాదిస్మృతిభిః స్మృతిః। అమూలా కాపిలీ బాధ్యా, న సంకోచోఽనయా తతః॥

వేదసమన్వయమునకు సాంఖ్యస్మృతి ద్వారా సంకోచము కలదా? లేదా? అని సందేహము కలుగగా పూర్వవాది వేదమునకు ధర్మములో అవాకాశమున్నందువలన నిరవకాశ సాంఖ్యస్మృతి ద్వారా వేదమునకు సంకోచము

గావించుట యుక్తమనిన సిద్ధాన్తి జవాబు. ప్రత్యక్ష శ్రుతి మూలకములైన మన్వాదిస్మృతులద్వారా మూలశ్రుతి రహితములైన కాపిల సాంఖ్యస్మృతి బాధితమగుచున్నది. అందువల్ల సాంఖ్యస్మృతి ద్వారా వేదసంకోచము యుక్తము గాదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఈ పాదములో నున్న అన్ని అధికరణములకు పూర్వాధ్యాయములో వర్ణించిన సమన్వయమే విషయము. వేదసమన్వయమునకు సాంఖ్యస్మృతి ద్వారా సంకోచము ఉన్నదా లేదా అని ఇచట సందేహము. పూర్వవాది సంకోచము స్వీకరించవలయుననును. ఏలనన సాంఖ్య స్మృతికి అనవకాశమనునది ప్రబలకారణము. సాంఖ్యస్మృతి కేవలము వస్తు తత్వములను నిరూపించుటకే ప్రవృత్త మైనది గాని అనుష్ఠేయ ధర్మములను నిరూపించుటకు గాదు. ఈ సాంఖ్య శాస్త్రము ఆ వస్తుతత్వ నిరూపణములోగూడ బాధితమైన అవకాశ రాహిత్యమగును. వేదము ధర్మమును మరియు బ్రహ్మమును ప్రతిపాదించుచున్నది. బ్రహ్మ విషయములో బాధితమైనను ఆ వేదమునకు ధర్మ విషయములో అవకాశము ఉండనే ఉన్నది. అందువల్ల నిరవకాశ సాంఖ్య స్మృతి ద్వారా సావకాశముగల వేదమునకు సంకోచము గావించుట ఉచితమే. ఈ విధమైన పూర్వ పక్షమునకు సమాధానము సిద్ధాన్తి ఇచ్చు చున్నారు. సాంఖ్య స్మృతి ద్వారా వేదసంకోచము ఉచితముగాదు. ఎందులకనగా బ్రహ్మమును జగత్కారణముగా చెప్పు మన్వాది స్మృతులద్వారా ఈ సాంఖ్య స్మృతి బాధితమగు చున్నది. మన్వాది స్మృతులు ప్రత్యక్షముగా వేదమూలకములగుట వలన ప్రబలములు. ప్రధానమును జగత్కారణముగా చెప్పు ఏశ్రుతియూ కానవచ్చుటలేదు అంతేగాక దృష్యమాన శ్రుతులన్నియూ బ్రహ్మ పరకములని ముందే నిర్ణయించబడినది. అందువల్ల సాంఖ్య స్మృతి ద్వారా వేదసంకోచముచితముగాదు

135. స్మృత్యనవకాశదోషప్రసంగ ఇతి చేన్నాన్యస్మృత్యనవకాశదోషప్రసంగాత్. (2.1.1)

సూత్రార్థము:- కపిల మహర్షి ప్రణీతమైన ప్రధానమును జగత్కారణమని చెప్పు సాంఖ్య స్మృతి వ్యర్థమగును గాన బ్రహ్మములో సమన్వయము చెప్పు వేదాన్తవాక్యముల సమన్వయము సరికాదనినచో దానిని నిరాకరించి సిద్ధాన్తి వేదాన్త వాక్యముల సమన్వయములో ఏవిధమైన విరోధము లేదనును. ఎందులకనగా అచేతన ప్రధానమును జగత్కారణమనిన చైతన్యమును జగత్కారణముగా చెప్పు మన్వాది స్మృతులు నిరర్థకములగును. శ్రుతి మూలకములైన స్మృతులతో విరోధముకలుగుటవలన సాంఖ్య స్మృతి అప్రమాణము.

స్మృతి అనుకూల స్మృతులనుదారించుచున్నారు. “యత్తత్సూక్ష్మమవిజ్ఞేయమ్” ‘ఏది సూక్ష్మమే జ్ఞానగోచరము కాకున్నదో’ అను ఈ పరబ్రహ్మ ప్రసంగములో “స హ్యన్తరాత్మా భూతానాం క్షేత్రజ్ఞశ్చేతి కథ్యతే” ‘ఆపరమేశ్వరుడే అంతర్యామి యనియు జీవుడనియు చెప్పబడు చున్నాడు’ అని జీవేశ్వరుల అభేధము వర్ణించి “తస్మాదవ్యక్తము-త్పన్నం త్రిగుణం ద్విజసత్తమ” ‘ఓ బ్రాహ్మణోత్తమా! ఆపరమేశ్వరునుండియే సత్వాది గుణయుక్త అవ్యక్తము

జనించినది' అని చెప్పి మరల ప్రళయ ప్రసంగములో "అవ్యక్తం పురుషే బ్రహ్మనిర్గుణే సంప్రలీయతే" 'ఓ బ్రాహ్మణుడా! నిర్గుణ పురుషునిలో అవ్యక్తము లీనమగును' మరియు గీతలో " అహం కృత్స్న స్య జగతః ప్రభవః ప్రలయస్తథా" 'నేను సంపూర్ణ జగత్తునకు నిర్మాతను మరియు సంహారకర్తను' (భ.గీ.7.3) ఇత్యాది ఈశ్వరకారణవాది స్మృతులకు అనవకాశ దోషము ప్రాప్తించును. రెండు స్మృతులకు విరోధము కలిగిన వానిలో ఏదోఒకటి ప్రమాణమని నిశ్చయమెట్లగును? ఆలాగున ప్రశ్నించుట సరికాదు, ఏలనన జైమిని సూత్రములో ఈ ప్రశ్నను నిర్ణయించిరి. "విరోధేత్వనపేక్షం స్యాదసతి హ్యనుమానం" అనగా 'శ్రుతితో విరోధము కలిగిన స్మృతి ప్రమాణముగాదు, గాని శ్రుతితో విరోధము లేని స్మృతులను ప్రమాణమని ఊహింతురు' (జై.1.3.3) ఈనియమానుసారము శ్రుతులకు విరోధముగాని ఈశ్వరకారణవాది మన్వాది స్మృతులను ప్రమాణముగా స్వీకరించిరి. అందువల్ల అప్రామాణిక సాంఖ్య స్మృతి ద్వారా సమన్వయమునకు విరోధము లేదు. ముందు చెప్పబోవు సూత్రముగూడ సాంఖ్య స్మృతి అనవకాశ ప్రసంగము దోషము కాదని చెప్పుచున్నది.

136. ఇతరేషాం చానుపలబ్ధేః (2.1.12)

సూత్రార్థము:- సాంఖ్యస్మృతిలో ప్రసిద్ధమైన ప్రధానము కన్న భిన్నమైన మహదాది తత్వములు లోకవేదములలో ప్రసిద్ధము కానందువలన సాంఖ్య స్మృతిని అప్రమాణమని చెప్పిన దోషము కాదు.

సూత్రములో వచ్చిన ఇతరేషాం అను పదమునకు సాంఖ్య స్మృతిలో ప్రసిద్ధమైన ప్రధానముకన్న వేరైన మహదాది తత్వములు లోకవేదములలో ఎచ్చటను ఉపలబ్ధి అగుటలేదు. ఉపలబ్ధము కానందువలన సాంఖ్య స్మృత్యాదులు ప్రమాణములు గావు. ఆ సాంఖ్య స్మృతిలో భూతములు మరియు ఇంద్రియములు లోకవేదములలో ప్రసిద్ధమైనను మిగిలిన మహదాదులు లోకవేదప్రసిద్ధములు గానందువలన వానిని ప్రతిపాదించు స్మృతులయందు అనవకాశదోష ప్రసంగము చెప్పుట యుక్తిసంగతమనగా సాంఖ్యస్మృతి నిరర్థకమని చెప్పుట ఒకదోషము కాదు.

# 42. యోగప్రత్యుక్త్యధికరణము.

సంగతి:- పుర్వాధికరణములో చెప్పిన న్యాయమునే ఈ అధికరణములో అతిదేశము గావించుటవలన క్రొత్త సంగతి అక్కఱలేదు.

విషయము:- ఈ అధికరణమునకు గూడ సమన్వయమే విచారణీయ విషయము.

సంశయము:- ముందు చెప్పిన వేదాన్త సమన్వయము యోగస్మృతి విరుద్ధమా? కాదా?

పూర్వపక్షము:- యోగము తత్వజ్ఞానమునకు ఉపయోగము దానితో విరోధము కలిగినందువలన వేదాన్తసమన్వయములో సంకోచము చేయవలయును.

సిద్ధాన్తము:- యోగస్మృతి ఒకపక్షమున (అంశము) ప్రమాణము మరియొక అంశమున ప్రమాణముగాదు. శ్రుతితో

విరోధములేని అష్టాంగయోగసాధనలో యోగశాస్త్రము ప్రమాణమని స్వీకరించిరి. గాని శ్రుతి విరోధమైన స్వతంత్ర-ప్రధానకారణవాదము మరియు మహదాది కార్య విషయములలో అప్రమాణము. ఒక అంశములో యోగస్మృతి తత్త్వజ్ఞానమునకు ఉపకారకమనినను వేదాన్తములో చెప్పిన మహావాక్యముల ద్వారానే తత్త్వజ్ఞానము సంభవము గాన యోగస్మృతి ద్వారా సమన్వయములో ఏవిధమైన సంకోచమురాదు.

వైయాసికన్యాయమాలా:-

97. యోగస్మృత్యాఽస్తి సంకోచో న వా? యోగో హి వైదికః। తత్త్వజ్ఞానోపయుక్తశ్చ, తతః సంకుచ్యతే తయా॥

98. ప్రమాఽపి యోగే తాత్పర్యాదతాత్పర్యాన్న సా ప్రమా। అవైదికే ప్రధానాదావసంకోచస్తయాఽస్యతః॥

వేదాన్తసమన్వయమునకు యోగస్మృతిద్వారా సంకోచము కలుగునా? లేదా? అను సందేహమునకు పూర్వపక్షి యోగము శ్రుతి ప్రతిపాదితము మరియు తత్త్వజ్ఞానమునకు ఉపయోగి అగుటవలన ఈయోగ శాస్త్రముద్వారా వేదములకు సంకోచమగుట యుక్తము. దానికి సిద్ధాంన్తి యోగ స్మృతి అష్టాంగయోగములో తాత్పర్యము చెప్పుట వలన ఆ విషయములో ప్రమాణమయినను అవైదిక ప్రధానాదులందు తాత్పర్యము కానందువలన అప్రమాణము. ఏ గ్రంథమయినను తాత్పర్యభూతమయిన విషయములో అప్రమాణమగునేని సంపూర్ణముగా అప్రమాణమగును. అందువల్ల యోగస్మృతి ద్వారా వేదసంకోచము యుక్తము కాదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

పతంజలి ముని ప్రణీతమయున యోగశాస్త్రమునందలి అష్టాంగయోగము ప్రత్యక్షముగా వేదములలో ఉపలబ్ధము. శ్వేతాశ్వతరాది ఉపనిషత్తులలో యోగస్మృతి వర్ణన విస్తారముగానున్నది. యోగము తత్త్వజ్ఞానమునకు ఉపయోగము. "దృశ్యతే త్వగ్ర్యయా బుధ్యా" (క.1.3.12) అనగా 'ఏకాగ్ర బుద్ధి ద్వారా చూచును లేక ఆత్మననుభవించును' ఈ విధమయిన శ్రుతిలో యోగము ద్వారా సాధ్యమగు చిత్తైకాగ్రత బ్రహ్మసాక్షాత్కారమునకు కారణమని చెప్పిరి. ఈ యోగ శాస్త్రము ప్రధానమును జగత్కారమనును. అందువల్ల యోగ శాస్త్రము ద్వారా వేదసంకోచము యుక్తమని పూర్వవాది మతము. సిద్ధాన్తిమతము. యోగశాస్త్రము అష్టాంయోగములో తాత్పర్యము చెప్పుటవలన ప్రమాణమయిను అవైదిక ప్రధానాదులను చెప్పుటలో ప్రమాణముగాదు, ఏలనన యోగశాస్త్ర తాత్పర్యము ప్రధానమును ప్రతిపాదించుటలో కాదు. యోగశాస్త్రములో "అథ యోగానుశాసనమ్" ' యోగ శాసనమారంభమగు చున్నది' అని ప్రతిజ్ఞ గావించి "యోగశ్చిత్తవృత్తినిరోధః" 'చిత్తమునందలి వృత్తులను నిరోధించు అవస్థావిశేషమును యోగ మందురు'. అని యోగ లక్షణమును చెప్పి ఆయోగమునే సంపూర్ణ శాస్త్రములో ప్రతిపాదించిరి. అందువల్ల అది యోగములో ప్రమాణము. ప్రధానాదుల ప్రతిపాదనలో ప్రతిజ్ఞ లేదు, కాని యమ నియమాదులను ప్రతిపాదించు ద్వితీయ పాదములో త్యాజ్యము త్యాజ్యకారణము మరియు దుఃఖము దుఃఖమునకు కారణము ప్రతిపాదించునపుడు ప్రసంగవశమున సాంఖ్యస్మృతిలో ప్రసిద్ధమైన ప్రధానాదులను చెప్పిరి, అందువల్ల ప్రధానాదుల ప్రతిపాదనలో యోగశాస్త్రముయొక్క తాత్పర్యము లేదు. గాన యోగస్మృతి ద్వారా వేదసంకోచము యుక్తముకాదు.

137. ఏతేన యోగః ప్రత్యుక్తః (2.1.3)

సుత్రార్థము:- సాంఖ్యస్మృతిని నిరాకరించుటద్వారానే యోగస్మృతి గూడ నిరాకరించబడినదని గ్రహించవలయును.

పూర్వాధికరణములో చెప్పిన సాంఖ్యదర్శన ఖండనముద్వారా యోగస్మృతి ఖండనగూడ గావింపబడినదని అతిదేశము ఈసూత్రముద్వారా చేసిరి. యొగదర్శనములో చెప్పిన అష్టాంగయోగమునకు శ్రుతితో విరోధములేందున దానిలో ఈ యోగము ప్రమాణమని స్వీకరించినను శ్రుతి విరుద్ధ స్వతంత్ర ప్రధాన కారణవాదాంశములో మరియు మహదాది కార్యాంశములో శ్రుతులకు తాత్పర్యము లేనందువలనను యోగదర్శనము నందప్రామాణికత ఉండనే యున్నది. ఈ ప్రకారము అన్యస్మృతులు ఏదో ఒకవిధముగా తత్త్వజ్ఞానమునకు ఉపకారకములైనను వేదములోని మహావాక్యములద్వారానే తత్త్వజ్ఞానము సంభవము గాన పూర్వాధికరణములో చెప్పిన తర్కముద్వారానే అన్య స్మృతులు ఖండింపబడినవి.

# 43. విలక్షణత్వాధికరణము.

సంగతి:- శ్రుతి విరుద్ధమైన సాంఖ్యస్మృతిలో వేదమూలము లేనందున అప్రమాణమనిరి. కాని వ్యాప్తి, పక్షధర్మతాదిమూలకమగు తర్కము లోకప్రసిద్ధము దాని ద్వారా వేద సమన్వయమునకు విరోధము ఉన్నది అను ప్రత్యుదాహరణ సంగతి వల్ల ఈ అధికరణమారంభమయినది.

విషయము:- ఇచట గూడ పూర్వధ్యాయములో చెప్పిన సమన్వయమే విచారణీయ విషయము.

సంశయము:- కారణము చైతన్యము, కార్యము జడము అగుటవలన వైలక్షణ్యమను తర్కముద్వారా వేద సమన్వయము బాధితమగునా? కాదా?

పూర్వపక్షము:- కార్య కారణములందు సమానత అను నియమము కలదు. అచేతనమైన కార్య జగత్తునకు చేతనమైన బ్రహ్మకారణమగుటవలన ఈరెండింటిలో కార్యకారణ భావము బాధితమగు చున్నది.

సిద్ధాన్తము:- మృద్ఘటాదులలో కార్యకారణభావము సమానమైనను కార్యములైన తలవెంట్రుకలు మరియు వృశ్చికాదులందు (తేల్లు) కార్యభిన్నమైన కారణము గానవచ్చుచున్నది. అచేతనమైన పేడ నుండి వృశ్చికాదులు ఉత్పన్నమగుచున్నవి మరియు చైతన్యవంతుడైన పురుషుని నుండి అచేతన జడములైన వెంట్రుకలు గోళ్లు ఉత్పన్నమగు చున్నవి. ఈవైషమ్యమును చూచుచు మీ తర్కాభాసము వేద ప్రతిపాదమైన కార్య-కారణ భావమునకు బాధకము గాజాలదు.

వైయాసికన్యాయమాలా:-

99. వైలక్షణ్యాఖ్యతర్కేణ బాధ్యతేఽథ న బాధ్యతే। బాధ్యతే సామ్యనియమాత్కార్యకారణవస్తునోః॥

100. మృద్ఘటాదౌ సమత్వేఽపి దృష్టం వృశ్చికకేశయోః। స్వకారణేన వైషమ్యం తర్కాభాసో న బాధకః॥

వేదాన్త వాక్యములకు తర్కముద్వారా విరోధమా? కాదా? కార్య కారణములకు సమానత ఉండవలెను అది వేదాన్తములో లేనందున సమన్వయము బాధితమని పూర్వవాది అనును. ఘటకార్యము కారణమైన మృత్తిక యందు కానవచ్చినను, వృశ్చికకేశ రూపములలో కారణము కన్న విషమత చూడబడుటవలన తర్కాభాసము సమన్వయమునకు విరోధముకాదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

బ్రహ్మములో వేదవాక్యముల సమన్వయము చెప్పిరి, అది తర్కముద్వారా బాధితమనును పూర్వవాది. అచేతనమైన జగత్తు చైతన్యమయిన బ్రహ్మమునుండి ఉత్పన్నముకాజాలదు, ఏలనన జగత్తు బ్రహ్మమునకన్న విలక్షణముగాన. ఏది దేనినుండి విలక్షణమో దాని నుండి అది ఉత్పన్నము కాజాలదు. ఆవు నుండి గేదె ఉత్పన్నము కాదు అను తర్కముద్వారా సమన్వయము బాధితము. ఈపూర్వవాదికి సిద్ధాన్తి జవాబు. కార్యకారణములు సమానస్వరూపుములుగానుండునను వ్యాప్తి వృశ్చికకేశాదులందు వ్యభిచరించుచున్నది. అచేతనమైన గోమయము (పేడ) నుండి చేతనవంతములైన వృశ్చికములు ఉత్పన్నమగుచున్నవి మరియు చైతన్యవంతుడైన మనుష్యునినుండి కేశములు గోళ్లు ఉత్పన్నమగుచున్నవి. అందువల్ల వేదనిరపేక్షమైన శుష్క తర్కమునకు ఎచటను ప్రతిష్ఠలేదు. "యత్నేనానుమితోఽప్యర్థః కుశలైరనుమాతృభిః అభియుక్తతరైరన్యైరన్యథైవో- పపాద్యతే" అర్థాత్ అనుమానమును జెప్పు కుశలపురుషులద్వారా ప్రతిపాదించిన తర్కమును వారికన్న తీక్ష్ణబుద్ధి కలవారు ఆ తర్కమును అన్యథా గావించుచున్నారు. గాన వైలక్షణమని చెప్పు హేతువు తర్కాభాసమగుట వలన దాని ద్వారా వేదాన్త సమన్వయము బాధితముగాదు.

138. న విలక్షణత్వాదస్య తథాత్వం చ శబ్దాత్. (2.1.4)

సూత్రార్థము:- ఈ జగత్తునకు చైతన్యము ఉపాదానకారణమని చెప్పుట సరికాదు, ఎందులకనగా అచేతన జగత్తు చైతన్య బ్రహ్మమునకన్న విలక్షణము గాన. "విజ్ఞానం చ అవిజ్ఞానంచ" (తై.2.6.) 'చేతనము మరియు అచేతనము' అను శ్రుతి ద్వారా బ్రహ్మజగత్తుల వైలక్షణ్యము తెలియు చున్నది.

'ఆకాశాదికం న చేతనోపాధికమం, కార్యత్వాత్ ఘటవత్' ఆకాశాది ప్రపంచమునకు చైతన్యము కారణము కానేరదు, ఆకాశాదులు కార్యములగుటవలన, ఘటాది కార్యములందు ఉపాదానకారణమైన మృత్తిక జడముగాన. ఈ తర్కమునకు విరోధము కలుగుటవలన వేదాన్త సమన్వయము అసిద్ధమనును పూర్వపక్షి, సమన్వయమునకు విరోధము లేదనును సిద్ధాన్తి ఇదే ఇద్దరికీగల ఫల భేదము. సంపూర్ణ జగత్తునకు చైతన్యము ఉపాదాన కారణ మనుట సరికాదు. వికార రూపములో నున్న జగత్తు తన కారణము బ్రహ్మకన్న విలక్షణము. బ్రహ్మము కార్యరూప జగత్తుకన్న విలక్షణముగా చైతన్యము మరియు శుద్ధమని వినబడుచున్నది. కార్య కారణ వైలక్షణ్యమును స్వీకరించిన ప్రకృతి వికార భావముండదు. లోకములో తంతువులకన్న (దారపు పోగులు)విలక్షణమగు కుండ తంతువులకార్యముగా కనబడుటలేదు గాని మృత్తిక కార్యముగా చూడబడుచున్నది. గాన అచేతనత్వాది

గుణములున్న జగత్తు అచేతనత్వాది గుణములుగల ప్రకృతి (కారణము) యొక్క కార్యమనియే స్వీకరించవలయును. బ్రహ్మ కన్న జగత్తువిలక్షణమని స్వీకరించుటలో ప్రమాణమేమనిన ప్రశ్నకు సమాధానము "తథాత్వం చ శబ్దాత్" అను సూత్రముద్వారా సూత్రకారులు చెప్పిరి. శబ్దప్రమాణము ద్వారాగూడ జగత్ కారణము విలక్షణమనియే తెలియు చున్నది. "విజ్ఞానం చావిజ్ఞానం చ" కార్య జగత్తు చైతన్యముగా మరియు అచైతన్యముగా ఉభయ రూపములై యున్నది. (తై.2.6.) ఈ వాక్యము కార్యాంశము అచేతనమని చెప్పి చేతన బ్రహ్మ కన్న అచేతన జగత్తు విలక్షణమనిగూడ చెప్పుచున్నది.

"మృదబ్రవీత్" 'మృత్తిక చెప్పెను' "ఆపోఽబ్రువన్" 'జలములు చెప్పెను' (శ.ప.బ్రా.6-1-3-2,4) "తత్తేజో ఐక్షత" "తా ఆపః ఐక్షన్త" ' ఆ తేజస్సు సంకల్పించెను' ' జలములు సంకల్పించెను' (ఛాం.6-2-3,4) "తే ఇమే ప్రాణా అహం-శ్రేయసే వివదమానా బ్రహ్మ జగ్ముః" ' ఈ ప్రాణేంద్రియములు 'మనలో అధికు లెవ్వరు' అని వివాదము చేసికొనుచు పరమేశ్వరునికడకు పోయిరి' (బృ. 6.1.7) ఈ శ్రుతుల ద్వారా భూతములు మరియు బౌతిక ఇంద్రియములు చైతన్య వంతములుగా ప్రతీతమగు చున్నవి. అందువల్ల జగత్తుగూడ బ్రహ్మతో సమానముగా చైతన్యమే విలక్షణము కాదుగదా? అనిన జవాబు అగ్రిమ సూత్రములో చెప్పుచున్నారు.

139. అభిమానివ్యపదేశస్తు విశేషానుగతిభ్యామ్. (2.1.5)

సూత్రార్థము:- "తే ఇమే ప్రాణాః...." ఈ ప్రాణేంద్రియములు తమ తమ శ్రేష్ఠత కొరకు వివాదము కావించుచూ బ్రహ్మ వద్దకు పోయిరి. ఈ శ్రుతిలో కేవలము ప్రాణేంద్రియముల కథనమే కాదు కాని ప్రాణాది అభిమానదేవతల కథనము గూడ కలదు. "ఏతా హ వై దేవతా అహం శ్రేయసే వివదమానాః" 'ఈ దేవతలు తమ తమ శ్రేష్ఠతకు వివాదించుచూ..' ఈ ప్రకారము చేతనవాచక దేవతాశబ్దములద్వారా ప్రాణాదుల విశేషణమున్నది మరియు "అగ్నిర్వాగ్భూత్వా" 'అగ్ని వాగ్రూపముదాల్చి ముఖములో ప్రవేశించెను' ఇత్యాది మంత్రములు మరియు అర్థవాదములలో అన్ని స్థానములలో ప్రాణాది అభిమానదేవతలను చెప్పిరి. దీని ద్వారా ప్రతీతమగు చున్నదేమనగా అచేతనమైన జగత్తు చైతన్యము కన్న (భిన్నమగుటవలన) విలక్షణమగుటవలన చైతన్యము కానేరదు గాన చేతన్యవంతుడైన పరమేశ్వరుడు ఈ జగత్తనకు ఉపాదానకారణము గాజాలడు.

సూత్రములో వచ్చిన 'తు' శబ్దము ముందు చెప్పిన శంకనివారణమునకు. ముందు చెప్పిన శ్రుతులను చూచుచు భూతములు మరియు ఇంద్రియములు చైతన్యవంతములని భావించుట సరికాదు. ఎందులకనగా (అచటచట) కొన్నిచోట్ల మృదాది అభిమాని దేవతలలో చైతన్య యోగ్యమయిన వ్యవహారమును చెప్పిరి. అభిమాని దేవతలను చెప్పు ఉద్దేశ్యముతో ఆ మృదాది జడ భూతములను చైతన్యములనిరి. నిజమునకు భూతేంద్రియములు జడములు వానిలో చైతన్యము లేదు. "విజ్ఞానం చావిజ్ఞానం చ" 'విజ్ఞానము మరియు అవిజ్ఞానము అను ఉభయరూపములు గలది ఈ జగత్తు' ఈశ్రుతిలో భోక్తయందు చైతన్యము మరియు భూతేంద్రియములలో అచేతనత్వ విభాగము విశేషముగా చెప్పిరి. ఈ విశేష విభాగము సంపూర్ణ జగత్తును చైతన్యవంతముగా భావించిన

సిద్ధముగాదు. అంతేగాక “తా వా ఎతా సర్వా దేవతా ప్రాణే నిఃశ్రేయసం విదిత్వా” (కౌ.2.14) ‘ఈ ఇంద్రియాదిష్ఠాన దేవతలందరు అ ముఖ్య ప్రాణామే శ్రేష్ఠమని తెలిసికొని’. ఈ విధముగా కౌషీతకి ఉపనిషత్తులో ప్రాణసంవాదమునందు చైతన్యార్థవాచక దేవతా శబ్దములను ప్రాణమునకు విశేషణముగా చెప్పిరి. ఆలాగుననే “అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్” (ఐ.ఆ.2.4) ‘అగ్ని దేవత వాణీరూపముదాల్చి ముఖమునందు ప్రవేశించెను’. ఈ విధముగా ఇంద్రియములను అనుగ్రహించుట మరియు ఆ ఇంద్రియములలో అనుగతమైన దేవతలను చెప్పుచున్నవి. మంత్రములు, అర్థవాదములు, ఇతిహాసము మరియు పురాణాదులందు దేవతల అనుగతి లేక అధిష్ఠించియున్న దేవతలను గురించి చెప్పుటవలన ఆయా స్థానములలో వచ్చిన చేతన శబ్దము ద్వారా ఆ భూతేంద్రియముల అభిమానిదేవతనే గ్రహించిరి. అచేతనమైన జగత్తు బ్రహ్మ కన్న విలక్షణమైనదనిన కారణమువల్ల చేతన బ్రహ్మము జగత్కారణము గాజాలదని ఈ పూర్వపక్ష సూత్రార్థము. ముందు సూత్రముద్వారా సిద్ధాన్తి జవాబు చెప్పబడుచున్నది.

### 140. దృష్యతే తు. (2.1.6)

సూత్రార్థము:- చైతన్యమునుండి చేతనవిలక్షణమై అచేతనపదార్థముల ఉత్పత్తి మరియు అచేతనమునుండి తద్విలక్షణమైన చైతన్య పదార్థముల ఉత్పత్తి కానవచ్చుచున్నందువలన అచేతనమైన జగత్తునకు చైతన్య కారణము కాగలదు.

సూత్రములో నున్న ‘తు’ శబ్దము చైతన్య బ్రహ్మ జగత్కారణము కాజాలదను పూర్వపక్షి శంకను ఖండించుటకు చెప్పిరి. జడ జగత్తుకన్న విలక్షణమగుటవలన చైతన్యమైన బ్రహ్మము జగదుపాదానకారణము కాజాలదు అను పూర్వవాది మతము సరికాదు. ఎందులకనగా లోకములో చైతన్యవంతులైన పురుషులనుండి విలక్షణమైన కేశనఖాదులుత్పన్నమగు చున్నవి మరియు జడము అచేతనమని ప్రసిద్ధమైన గోమయాదులనుండి వానికన్న భిన్నమైన వృశ్చికాదులుత్పన్నమగు చున్నవి. చెప్పిన ఉదాహరణములలో కార్య-కారణములందు సాదృశ్యము లేనందున కార్య- కారణభావము లేదనిన అట్లనుట సరికాదు. ఎందులకనగా అత్యంతము సాదృశ్యము కల వానిలో గూడ కార్య-కారణభావముత్పన్నముకాదు. కార్య-కారణభావములో కొంచెము సాదృశ్యముండవలయు-ననిన అదిసరి. పురుషుడు ఏవం గోమయాదులలోనున్న పార్థివత్వము కేశనఖాదులలో మరియు వృశ్చికాదులలో అనువృత్తిగా కానవచ్చు చున్నందువలన కొంచెము సాదృశ్యమున్నది. ఆలాగుననే అస్తిత్వరూపమైన లేక సత్తారూపమైన బ్రహ్మ స్వభావము ఆకాశాదులలో అనువృత్తిగా నుండుటవలన కొంచెము సాదృశ్యమున్నది అనగా కారణ బ్రహ్మము మరియు కార్య జగత్తులో (అస్తిత్వ) సత్తారూప సాదృశ్యమున్నది. బ్రహ్మయొక్క అనంతలక్షణముల అనువృత్తి కార్య జగత్తులో ఎచటనూ కానరాదు, ఒకవేల అవి కానవచ్చిన కార్య-కారణ భావముచ్చేదమగును. అచేతనమైన జగత్తు చైతన్యమైన బ్రహ్మమునుండి ఉత్పన్నమగు చున్నదనుట నిశ్చయము.

ముందు సూత్రములో అసత్కార్యవాదమును చూపి దాని ఖండన చేయుచున్నారు. జగత్కారణము శూన్యమని చెప్పుట అసత్కార్యవాదము. సృష్టికి ముందు కార్యము కారణరూపములోనున్నదనుట సత్కార్యవాదము.

141. అసదితి చేన్న, ప్రతిషేధమాత్రత్వాత్. (2.1.7)

సూత్రార్థము:- ఉత్పత్తికి ముందు జగత్తు అసద్రూపమగుననుట సరికాదు ఏలనన 'అసద్ స్యాత్' అని శబ్దరూపముతో చెప్పు ప్రతిషేధమాత్రము అనగా ప్రతిషేధ్యములేదు (సాధింపబడు కార్యము లేదు). ఏలనన కార్యసత్తా కారణసత్తాకన్న భిన్నముగాదు, అందువల్ల స్తితి కాలమువలే ఉత్పత్తికి ముందు ఈ సంపూర్ణజగత్తు బ్రహ్మరూపమేగాని అసద్రూపముగాదు.

చైతన్య బ్రహ్మము శబ్దాదివిహీనుడు మరియు నిత్యశుద్ధుడు అటువంటి బ్రహ్మము అశుద్ధము, జడము మరియు శబ్దాది గుణములతో గూడిన జగత్తుయొక్క ఉపాదానకారణమయిన అసత్కార్యవాద ప్రసంగము మీవేదాన్తులకు కలుగును. ఈ విధముగా చెప్పు పూర్వవాది వాదము సరికాదు. ఏలనన ఉత్పత్తికి ముందు కార్యము అసద్రూపమనుట ప్రతిషేధ మాత్రమే. ఆ ప్రతిషేధమునకు ప్రతిషేధ్యరూప విషయము లేదు. ఈ ప్రతిషేధము ఉత్పత్తికిముందు కార్యాము యొక్క అస్థిత్వమును ప్రతిషేదించలేదు. ఈ స్థితికాలములో జగత్కార్యము కారణరూపమైన బ్రహ్మయొక్క సత్తాస్ఫూర్తి కలిగియున్నది ఆలాగుననే ఉత్పత్తికిముందు కార్యము కారణరూపమేగదా. ఆవిధముగనే వేదములలో స్వీకరించిరి. "సర్వం తం పరాదాద్యోఽన్యత్రాత్మనః సర్వం వేద" (బృ. 2.4.6) "ఎవ్వడు ఆత్మకంటే (పరమేశ్వరునికంటే) సర్వప్రపంచమును భిన్నముగా జూచునో, వాని నా ప్రపంచము ముక్తికి దూరము గావించును". ఈ శ్రుతి మరియు అనుభవము ద్వారా కార్య-కారణముల అస్తిత్వము అభిన్నమని స్వీకారించడమైనది. అందువల్ల అసత్కార్యవాద ప్రసక్తి మా వేదాన్తులకు లేదు.

142. అపీతౌ తద్వత్ప్రసఙ్గాదసమఞ్జసమ్. (2.1.8)

సూత్రార్థము:- శుద్ధత్వాది గుణములుగల బ్రహ్మ జగత్కారణము కాజాలదు, అది యుక్తిసంగతముకాదు, ఏలనన ప్రళయకాలములో కార్యమునకు సమాన కారణమైన బ్రహ్మము అశుద్ధత్వాది ధర్మములు గలదగును.

జగత్తు మరియు బ్రహ్మములో చెప్పిన కార్య-కారణ భావముపై ముందు సూత్రముద్వారా పూర్వపక్షము చేయుచున్నారు. ఈ జగత్తు స్థూలత్వాది ధర్మములు గలది మరి బ్రహ్మమో సూక్ష్మాతిసూక్ష్మ ధర్మము గలదని చెప్పిరి. బ్రహ్మస్థూలత్వాది ధర్మముగల జగత్తు యొక్క ఉపాదానకారణమని చెప్పిన ఉపనిషద్ దర్శనమసంగ-మగును కాదా? ఎందులకనగా ప్రలయకాలములోబ్రహ్మములో లీనమగు కార్యజగత్తు తన ధర్మముద్వారా కారణమగు బ్రహ్మమును గూడ దూషితము గావించును. ఆ స్తితిలో కారణబ్రహ్మమునందు గూడ కార్యమునకు సమానమగు అశుద్ధత్వాది దోషములు వచ్చును. అంతేగాక బ్రహ్మములో లీన మగు సంపూర్ణ కార్య ప్రపంచము మరల ఉత్పత్తి చెందుటలో నియమము లేనందున భోక్తా-భోగ్యాది విభాగముండదు. గాన బ్రహ్మమును

జగత్కారణమని చెప్పు వేదాన్తుల ఔపనిషద్దర్శనము  అసంగతమగును. ఈ విధముగా పుర్వపక్షములో అనేకములైన దోషముల కల్పన గావింపబడినగి. దీనికి సమాధానము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

143. న తు దృష్టాన్తభవాత్. (2.1.9)

సూత్రార్ధము:- పూర్వము చెప్పిన అసామఞ్జసము లేక అసంగతమను దోషములు మా వేదాన్తములో లేవు. ఎందులకనగా కారణములో లీన మగు కార్యము తన దోషములద్వారా కారణమును దూషితము చేయలేదు. ఈ విషయములో అనేకములైన చక్కని దృష్టాన్తములు గలవు.

సూత్రములోనున్న 'తు' శబ్దము నిశ్చయార్థకము. కారణములో లీన మగు కార్యజగత్తు తన యొక్క స్థూలత్వాది ధర్మములద్వారా కారణబ్రహ్మమును దూషితము గావించునను అసంగత దోషము మా వేదాన్తములో లేదు. ఎందులకనగా ఈవిషయమును చెప్పు అనేక దృష్టాన్తములు గలవు. కార్యమైన కుండ తనకారణమగు మృత్తికాదులలో లీనమగునపుడు తన ధర్మముతో మట్టిని దూషితము గావించుటలేదు. సువర్ణముతో చేసిన ఆభరణములు తమ కారణమైన బంగారములో లినమగునపుడు తమ దోషముద్వారా ఆ సువర్ణమును దూషితము గావిచుటలేదు. ఈవిధముగా అనేక దృష్టాన్తములు గలవు. విశేషమేమి చెప్పెడిది కారణములో లీన మగు కార్యమునందు తన ధర్మముల ఉన్నచో ప్రళయమే కాదు కదా. కార్యకారణములు అభిన్నమైనను, కార్యము కారణరూపమైనను, కారణము కార్య రూపముకాజాలదు అని ఆరంభనాదికరణములో చెప్పబడినది. ఈ విధముగా పూర్వపక్షి చెప్పిన దోషములను వేదాన్తి తనపక్షములో నివారించి అవే దోషములను పూర్వపక్షిపై ఆరోపించు చున్నారు.

144. స్వపక్షదోషాచ్చ. (2.1.10)

సూత్రార్థము:- సాంఖ్యమతమువారు ఆరోపించిన దోషములు వారి మతములో గూడ నున్నవి. అందువల్ల దోషము వాని పరిహారోపాయము రెండుమతములలో సమానము.

బ్రహ్మ కన్న విలక్షణమైనందువల్ల ఈ జగత్తు బ్రహ్మోపాదానకారణము కాదనిరి. శబ్దాది హీనమైన ప్రధానము ద్వారా శబ్దాదిగుణములు గల జగదుత్పత్తి అను దోషము వారిలో గూడ సమానమే. విలక్షణ కార్యోత్పత్తిని స్వీకరించిన ఉత్పత్తికి ముందు అసత్కార్యవాదమను దోష ప్రసంగము మరియు ప్రళయములో కార్య-కారణ అవిభాగమును స్వీకరించిన కారణములో కార్యములోనున్న దోషప్రసక్తి ప్రధాన కార్యవాదులైన సాంఖ్యుల పక్షములో గూడ సమానమే. అసలు సంగతి చెప్పవలయుననిన ప్రపంచమును సత్యమని స్వీకరించు సాంఖ్యపక్షములోనే ఈ దోషములు వచ్చును. అనిర్వచనీయవాదమును స్వీకరించు వేదాన్తుల మతములో ఈదోషములు లేవు. ఎందులకనగా మా వేదాన్తుల మతములో ఏవిధముగా సృష్టికాలములో కార్యముద్వారా కారణము దూషితముగాదో ఆలాగుననే ప్రళయకాలములోగూడ కారణము నిర్దుష్టమని చెప్పబడినది.

145. తర్కాऽప్రతిష్ఠానాదప్యన్యథాऽనుమేయమితి చేదేవమప్యనిర్మోక్షప్రసఙ్గః. (2.1.11)

సూత్రార్థము:- కేవల తర్కమునకు ప్రతిష్ఠలేకుండుటవలన గూడ బ్రహ్మమును ప్రతిపాదించు వేదాన్తవాక్యముల సమన్వయమునకు ఏవిధమైన విరోధము లేదు. ఒక తర్కము అప్రతిష్ఠితమైన వేరొక రీతిగా ప్రతిష్ఠితమైన తర్కముద్వారా వేదాన్తసమన్వయము యొక్క విరోధము చెప్పవలయుననిన, కొన్ని తర్కములు ప్రతిష్ఠితమైనంతమాత్రమున ప్రకృత విషయములో (వేదాన్తవాక్యముల సమన్వయములో) తర్కములు అప్రతిష్ఠితములను దోషములనుండి తర్కవాదులు ముక్తులు గారు. కపిల కాణాదుల విరోధతర్కములవలన తత్త్వనిర్ణయమే కాజాలదు అందువల్ల వారికి సంసారమునుండి ముక్తిలేదు.
వేదాన్తశాస్త్రగమ్యమైన అర్థములో కేవలము తర్కములను ప్రయోగించి ప్రశ్నించుటకు వీలులేదు. వేదమూలకములుగాని సిద్ధాన్తములు, పురుషబుద్ధిద్వారా చూపబడు తర్కములు మరియు నిరంకుశ తర్కములకు ప్రతిష్ఠ లేదు. ఎందులకనగా ఒక తార్కికునిద్వారా చూపబడిన అనుమానసిద్ధార్థమును వానికన్న ఎక్కువ బుద్ధిగల తార్కికుడు అసంగతమని నిరూపించును. అందువల్ల అప్రతిష్ఠిత (నిలకడలేని) తర్కముల ద్వారా సమన్వయ విరోధశంక పనికిరాదు అనిన మరల ప్రశ్న వేయుచున్నారు. అప్రతిష్ఠ తర్కములను వదిలి ప్రతిష్ఠిత తర్కములద్వారా వేదాన్త సమన్వయమునకు విరోధము చెప్పవచ్చునుకదా? ఆ విధముగా ప్రశ్నించుట గూడ సరికాదు ఏలనన తర్కత్వము అన్ని తర్కములకు సమానమగుటవలన. కొన్నితర్కములను అప్రతిష్ఠితమని చూచిన మిగిలిన తర్కములుగూడ అప్రతిష్ఠితములను కల్పన కలుగును. అన్యత్ర తర్కములు ప్రతిష్ఠితములని భావించినను లిఙ్గాదులులేని (చిహ్నములు లేక గుర్తులులేని) నిర్విశేష బ్రహ్మమును ప్రతిపాదించుటలో తర్కములకు ప్రతిష్ఠితలేనందువలన తర్కవాదుల మొక్షాభావము అటులనే యుండును. వేదము నిత్యము మరియు విజ్ఞానోత్పత్తికారణమగుటవలన ఆ వేద శాస్త్రము ద్వారానే తెలియబడు సచ్చిదానన్ద బ్రహ్మము దానికన్న భిన్న ప్రమాణముద్వారా నిరూపింపబడదు. బ్రహ్మము రూపాది హీనము, గాన ప్రత్యక్షప్రమాణ విషయము గాదు. ఆలాగుననే లిఙ్గాదిహీన మగుటవలన అనుమానప్రమాణమునకు విషయము గాజాలదు. ఆగమవిరోధమైన తర్కము ప్రమాణము కానందువలన ఆ తర్కములద్వారా సమన్వయ విరోధము కాజాలదు. అందువల్ల అగమము మరియు తదనుకూల తర్కములద్వారా జగత్తు యొక్క ఉపాదానకారణము మరియు నిమిత్త కారణము చైతన్య బ్రహ్మ మనియే సిద్ధమగుచున్నది.

# 44.శిష్టాపరిగ్రహాధికరణము.

సంగతి:- పూర్వాధికరణములో చెప్పిన న్యాయమునే ఇచట అతిదేశము గావించిరి. గాన వేరొక సంగతి చెప్పనవసరములేదు. ఎందులకనగా ప్రధానమల్లనిర్వహణన్యాయము అనగా ప్రధానమల్లుడయిన సాంఖ్యుని ఏ న్యాయము ద్వారా ఓడించిరో ఆ న్యాయమునే ఇచట అతిదేశము గావించు చున్నారు. (ప్రత్యుదాహరణ సంగతి).

విషయము:- ఇచట గూడ సమన్వయవిరోధమే విచారణీయ విషయము.

సంశయము:- బ్రహ్మ ఉపాదానకారణమని చెప్పు సమన్వయమునకు వైశేషికాది సమస్త తర్కముల ద్వారా విరోధము కలుగునా లేదా అని సంశయము.

పూర్వపక్షము:- వస్త్రాది కార్యములు వాని కంటె న్యూనమైన తంతువుల ద్వారా ఉత్పన్నమగుట చూచుచున్నాము. అందువల్ల వైశేషికుల తర్కములద్వారా బ్రహ్మకారణవాదమునకు విరోధము కలదు.

సిద్ధాన్తము:- ఏదో కొద్ది అంశములో మన్వాదిశిష్టులు స్వీకరించిన న్యాయ స్మృతి బాధితమైనపుడు అన్ని అంశములలో శిష్టపురుషులు పరిత్యజించిన వైశేషికమతము ఏల బాధితముకాదు. గాన బ్రహ్మకారణవాదము వైశేషికుల తర్కములద్వారా బాధితముకాదు. పరమాణువులద్వారా సృష్టిని చెప్పు అరంభవాదులైన నైయ్యాయకుల మతములో కారణమున కన్న కార్యము యొక్క పరిమాణము అధికము, కారణము అల్పపరిమాణములో నుండును. కాని వేదాన్తుల వివర్తవాదములో ఈ నియమము లేదు. గాన సమన్వయమునకు విరోధములేదు.

వైయాసికన్యాయమాలా:-

101. బాధోఽస్తి పరమాణ్వాదిమతైర్నో వా యతః పటః। న్యూనతన్తుభిరారబ్ధో దృష్టోఽతో బాధ్యతే మతైః॥

102. శిష్టేష్టాఽపి స్మృతిస్త్యక్తా శిష్టత్యక్తమతం కిము। నాతో బాధో; వివర్తే తు న్యూనాత్వనియమో న హి॥

కాణాదాది మతములద్వారా వేదాన్త సమన్వయమునకు విరోధము కలదా లేదా? వస్త్రము తన కన్న తక్కువ పరిమాణముగల దారములద్వారా ఉత్పన్నమగుట లోక ప్రసిద్ధము, అందువల్ల పరమమహత్పపరిమాణముగల బ్రహ్మము ఏ కార్య ద్రవ్యమునకు కారణము గాజాలదు. గాన కాణాదాది మతములద్వారా వేదసమన్వయము బాధకు గురి అగుచున్నది అని పూర్వపక్షి చెప్పిన సిద్ధాన్తి జవాబు. సత్పరుషులద్వారా సమ్మత మైన స్మృతియో నిరాకరింబడిన ఆసత్పరుషులచే వర్జితమైన మతవిషయములో చెప్పుటకేమున్నది. మహాపురుషులాదరము కొంచెమైనను లేకపోవుటచే వీనికి ధ్వంసకారణము. కార్యము కన్న కారణము అల్పపరిమాణముగా నుండవలయునను నియమము వివర్తవాదములో లేదు. గనుక కాణాదాది మతములద్వారా అద్వైతబ్రహ్మములో వేదసమన్వయమునకు బాధరాదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

సాంఖ్య యోగ స్మృతులద్వారా మరియు వారి తర్కములద్వారా వేదసమన్వయమయనకు బాధలేకపోవుగాక గాని కాణాదాది స్మృతులు మరియు వారి తర్కములద్వారా సమన్వయమునకు విరోధముండవలయును. ఏలనన కాణాద మహర్షి పరమాణువులు జగత్కారణమని చెప్పును. వారి తర్కము "ద్వ్యణుకము (రెండు పరమాణువులు కలిసి ద్వ్యణుకమగును) దాని కన్న తక్కువ పరిమాణముగల పరమాణువుద్వారా ఉత్పన్న మైనది, కార్య ద్రవ్యమగుటవలన, తంతువుల (దారముల) ద్వారా ఉత్పన్నమైన వస్త్రమువలే. బుద్ధభగవానులు విష్ణువుయొక్క అవతారము. వారు అభావమును జగత్కారణమనిరి. తన మతమును పుష్టికావించుటకు "భావరూపమైన జగత్తు అభావమునుండి ఉత్పన్నమైనది, భావరూపమైనందున, సుషుప్తిపూర్వక స్వప్నప్రపంచమువలే" అను యుక్తులు గూడ చెప్పెదరు. అందువల్ల ప్రబలమైన కాణాది బౌద్ధుల మతము ద్వారా వేదసమన్వయమునకు బాధ కలుగుచున్నది. ఇంతవరుకు పూర్వపక్షి వాదము దీనికి సిద్ధాన్తి సమాధానము చెప్పు చున్నారు.

వైదికశిరోమణి పురాణకర్తలద్వారా ప్రసంగవశమున అచ్చటచ్చట ఉదాహరింపబడిన సాంఖ్యయోగస్మృతులు ప్రతిపాదించు పకృతి పురుషుల జగత్కారణత్వము దుర్బలమని త్యజించిరి. సత్పురుషులందరిద్వారా ఉపేక్షితమైన కాణాది మతములు ఖండించబడినవని వేరే చెప్పవలయునా? బ్రహ్మపురాణము మరియు పద్మపురాణములో ఎచ్చటనూ ప్రసంగవశమున ద్వ్యణకాదుల మాటే లేదు. కాని దీనికి విపరీతముగా 'హేతుకాన్ బకవృత్తీంశ్చ వాఙ్మాత్రేనాపి నార్చయేత్' అనగా 'హేతువాదులను కపటవృత్తిగలవారిని కేవలము నోటితోగూడ అర్చించరాదు' అను నిందావచనములుగూడ అనేకములు గానవచ్చుచున్నవి. కార్య ద్రవ్యముల కన్న తక్కువ పరిమాణముగల కారణద్రవ్యములనుండి కార్యములు ఉత్పన్నమగునను నియమము వివర్తవాదములో లేదు, ఎందులకనగా పర్వతముయొక్క అగ్రభాగములోనున్న వృక్షములు దూరములోనున్న వానికి దూర్వాగ్రభాగములను (గడ్డిపోచల అగ్ర భాగమువలే) భ్రమ కలుగుచున్నది. అభావమునుండి జగదుత్పత్తిని చెప్పు అనుమానములోగల దృష్టాన్తములో సాధ్యమేలేదు, ఎందులకనగా సుషుప్తి ఒక అవస్థావిశేషము అవస్థలలో అనుగతమగు సద్రూపమైన ఆత్మను స్వీకరించుటవలన, అందువలననే స్వప్నముగూడ అభావపూర్వకముగాదు. గాన కాణాదాదుల మతముద్వారా వేదసమన్వయమునకు బాధ కలుగలేదు.

### 146. ఎతేన శిష్టాపరిగ్రహా అపి వ్యాఖ్యాతాః. (2.1.12)

సూత్రార్థము:- దేవలుడు మెదలుగాగల శిష్టులద్వారా కొన్ని అంశములలో స్వీకరించిన ప్రధానకారణవాదము గూడ నిరాకరించబడినది. ఆ నిరాకరణముద్వారానే శిష్టులు ఏ అంశములోను స్వీకరించని అణ్వాది కారణవాదములుగూడ నిరాకరించబడినవనే తెలిసికొనవలయును.

మన్వాది సత్పురుషుల ద్వారా కొన్ని అంశములలో స్వీకరించిన ప్రధానకారణవాదము నిరాకరింపబడగా ఆ మన్వాది సత్పరుషులద్వారా ఏ అంశములోను స్వీకరింపబడని పరమాణువుల కారణవాదము నిరాకరించ-బడినదని వేరే చెప్పనవసరములేదు. సత్పురుషులు స్వీకరించలేదను కారణము రెండు ప్రదేశములలో

సమానమగుటవలన. ఇచటగూడ అతి గంభీరమైన జగత్కారణము తర్కముద్వారా బోధపడదు, తర్కములకు ప్రతిష్ఠ లేదు. వేరుగా అనుమానము గావించిన అనిర్మోక్షప్రసంగము మరియు ఆగమవిరోధము మెదలైన నిరాకరణ దోషములు కలుగును, గాన తర్కముల ద్వారా శ్రుతిసమన్వయ విరోధము కలుగదనునది సిద్ధము.

# 45. భోక్త్రాపత్త్యధికరణము.

సంగతి:- బ్రహ్మవిషయములో తర్కమునకు ప్రతిష్ఠ (నిలకడ) లేదని స్వీకరించినను వీడు భోక్త ఇది భోగ్యము అని జగత్తులో ప్రత్యక్షముగా స్వీకరించుటవలన ప్రథమాధ్యాయములో చెప్పిన సమన్వయమునకు విరోధము కలుగుచున్నదను ప్రత్యుదాహరణ సంగతివలన ఈ అధికరణము మొదలైనది.
విషయము:- ఈ అధికరణములో సమన్వయమునకు ప్రత్యక్ష విరోధము కలదను విషయమును విచారించిరి.
సంశయము:- అద్వయ బ్రహ్మమునుండి జగత్సృష్టిని చెప్పు వేదాన్త సమన్వయమునకు విరోధము కలదా లేదా? అని సంశయము.
పూర్వపక్షము:- అద్వితీయ బ్రహ్మమును జగత్తుయొక్క ఉపాదానకారణముగా స్వీకరించిన భోక్త-భోగ్యాదులు గల ప్రపంచము బ్రహ్మ కన్న అభిన్నమగును. అపుడు భోక్తయే భోగ్యము భోగ్యమే భోక్త అగుటవలన వీడు భోక్త ఇది భోగ్యమను విభాగమే లేకపోవును. ఇది ప్రత్యక్షమునకు విరోధమగుటవలన పరస్పర విభాగము అస్త-వ్యస్త మగును.
సిద్ధాన్తము:- అద్వితీయ బ్రహ్మమును జగదుపాదానకారణముగా స్వీకరించినను ప్రత్యక్ష ప్రమాణముద్వారా సిద్ధమగు భోక్తా-భోగ్యాదుల వ్యవస్థ సుస్థిరముగా నుండును. ఏవిధముగా సముద్రవికారములైన వీచి-తరంగాదులు సముద్రరూపములో అభేధమైనను తరంగాది రూపములలో చూచిన పరస్పర బేధము కానవచ్చును ఆలాగుననే భోక్తా-భోగ్యాది ప్రపంచములో కల్పిత భేధము స్వీకరించిననూ అద్వయబ్రహ్మమును చెప్పు అద్వైత సిద్ధాంతమునకు బాధరాదు.
వైయసికన్యాయమాలా:-
103. అద్వైతం బాధ్యతే నో వా భోక్తృభోగ్యవిభేదతః। ప్రత్యక్షాదిప్రమాసిద్ధో భేదోఽసావన్యబాధకః॥
104. తరఙ్గఫేనభేదేఽపి సముద్రేఽభేద ఇష్యతే। భోక్తృభోగ్యవిభేదేఽపి బ్రహ్మాద్వైతం తథాఽస్తు తత్॥
భోక్తా మరియు భోగ్యము అను భేదముద్వారా అద్వైతము బాధితమగునా కాదా? ప్రత్యక్షాది ప్రమాణముల ద్వారా సిద్ధమైన భేదము అద్వైతమునకు బాధకమగును. ఈపూర్వపక్షమునకు సిద్ధాన్తి చెప్పిన సమాధానము. ఏ విధముగా తరంగములు నురుగు మొదలైనవాని ద్వారా భేదము కానవచ్చినను వానితో కలిపి సముద్రమును చూచిన భేదము కనిపించదు. ఆ విధముగనే భోక్త మరియు భోగ్యాదులలో పరస్పర భేదమున్నను వానితోపాటు

బ్రహ్మములో భేదము లేదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

పూర్వపక్షి చెప్పునదేమనగా వేదాన్త సమన్వయముద్వారా కనబడు అద్వైతమునకు ప్రత్యక్ష, అనుమాన ప్రమాణముద్వారా సిద్ధమగు భోక్త మరియు భోగ్యముద్వారా కానవచ్చు భేదమువలన విరోధమున్నది. సిద్ధాన్తి జవాబు, ఒకే జలముద్వారా ఏర్పడు తరంగములు నురుగుల వలన భేదము ప్రతీతమయినను సముద్రరూపముగా అభేదము కానవచ్చుచున్నది. అందువలన భేదాభేదములకువిరోధము లేదు. భేదాభేదముల విరోధ వ్యవహారము ఆకారభేదరహితమైన ఒకే వస్తువులోనే సంభవము. గాన బ్రహ్మ రూపముగా అద్వైతము మరియు భోక్తా భోగ్యరూపములుగా ద్వైతము. ఈవిధమైన ఆకారభేదమువల్ల వ్యవస్థ సంభవముగాన ప్రత్యక్షాది ప్రమాణముల ద్వారా సమన్వయమునకు విరోధములేదు.

147. భోక్త్రాపత్తేరవిభాగశ్చేత్స్యాల్లోకవత్. (2.1.13)

సూత్రార్థము:- తరంగము నురుగు మొదలగువానిలో పరస్పర భేదమున్నను వానితోనున్న సముద్రములో భేదమును స్వీకరించనటుల భోక్తా భోగ్యాదులలో పరస్పరము భేదమున్నను వానితో నున్న బ్రహ్మములో భేదములేదు.

అద్వైతబ్రహ్మము జగత్తుయొక్క ఉపాదానకారణమని చెప్పిన భోక్తా-భోగ్యరూపములోనున్న ప్రపంచము బ్రహ్మముతో అభిన్నమగును. ఆ స్థితిలో భోక్త భోగ్యముగను భోగ్యము భోక్తగను అగును. ప్రత్యక్షముగా వీనిలో పరస్పర విరోధము కానవచ్చుటవలన అద్వైత సమన్వయమునకు విరోధము వచ్చును. అంతేగాక అద్వైతములో భోక్త-భోగ్యముల విభాగము కానరాదు. అద్వైతబ్రహ్మమును జగత్తుయొక్క ఉపాదాన కారణముగా స్వీకరించినను భోక్త-భోగ్యముల విభాగము అటులనే ఉండునని సిద్ధాన్తి చెప్పుచున్నాడు. సముద్రమునుండి జనించిన నురుగు తరంగాదుల సముద్రరూపములో అభిన్నమయునను, నురుగు తరంగాదుల రూపములో భిన్నముగా నున్నవి. అలాగుననే భోక్తా-భోగ్యాదులు కల్పితమైనందున కల్పిత భేదమున్నను ప్రత్యక్షమునకు విరోధములేదు. ఈవిధముగా సమన్వయమునకు ప్రత్యక్షప్రమాణముద్వారా కలిగిన విరోధమును పరహరించిరి.

# 46. ఆరమ్భణాధికరణము.

సంగతి:- పూర్వాధికరణములో పరిణామవాదపక్షములో 'స్యాల్లోకవత్'(బ్ర.సూ.2.1.13 ) అను వాక్యముద్వారా సామన్యముగా సమాధానము చెప్పిరి. ఇపుడు వివర్తవాదమునాశ్రయించి ముఖ్య సమాధానము చెప్పెదరు. గాన పూర్వాధికరణముతో ఈ అధికరణమునకు ఎకఫలత్వసంగతి.

విషయము:- ఈ అధికరణములోగూడ సమన్వయమునకు ప్రత్యక్ష విరోధమే విచారణీయ విషయము.

సంశయము:- అద్వైతబ్రహ్మమును చెప్పు సమన్వయము భేధమును చెప్పు ప్రత్యక్ష ప్రమాణమునకు విరుద్ధమా కాదా? అనగా భేదాభేదము తాత్వికమా లేక వ్యావహారికమా?

పూర్వపక్షము:- ఏవిధముగా సముద్రములో తాత్విక భేదాభేదమును స్వీకరించినను విరోధములేదో ఆలాగుననే అద్వయబ్రహ్మములో తాత్విక భేధమును స్వీకరించవలయును.

సిద్ధాన్తము:- శ్రుతి మరియు యుక్తుల ద్వారా భాధితమగుటవలన వానిలో వ్యావహారిక భేధమును స్వీకరించినను తాత్వికభేధములేదు. కార్య ప్రపంచము దాని కారణముతో అభేదమనిన అద్వయ బ్రహ్మమే తాత్వికమని సిద్ధమగుచున్నది. అందువలన వ్యావహారిక భేదము, తాత్విక అభేదమనిన విరోధము లేదు.

వైయాసికన్యాయమాలా:-

105. భేదాభేదౌ తాత్వికౌ స్తో యది వా వ్యావహారికౌ। సముద్రాదావివ తయోర్బాధాభావేన తాత్వికౌ॥

106. భాదితౌ శ్రుతియుక్తిభ్యాం తావేతౌ వ్యావహారికౌ। కార్యస్య కారణాభేదాదద్వైతం బ్రహ్మ తాత్వికమ్॥

కార్యకారణములలో గల భేదము తాత్వికమా లేక వ్యావహారికమా? అను సందేహమునకు పూర్వపక్షి చెప్పునదేమనగా-ఏవిధముగా సముద్రము మరియు తరంగములలో భేదము అభేదమున్నను పరస్పరము ఏ విరోధము లేదు. వానికి విరోధములేనందున అవి తాత్వికమైనరీతిగనే అద్వయ బ్రహ్మములో భేదము తాత్వికమనియే చెప్పవలయును. సిద్ధాన్తి సమాధానము. శ్రుతియుక్తులద్వారా భేదాభేదములు బాధితమగు చున్నవి. భేదాభేదములు వ్యావహారికములు. కార్యము కారణముకన్న భిన్నముగాదు అద్వితీయబ్రహ్మమే పారమార్థికము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

లోకవ్యవహారములో దేనికి బాధ కలుగదో ఆ వస్తువును పారమార్థికమందురు. ఒకే వస్తువు బ్రహ్మ రూపముగా అభేదము మరియు భోక్తా-భోగ్యములుగా భేదమయినను పరస్పర విరోధములేదు. ఒకే వస్తువులో భేదాభేదములు రెండు సంభవము అవి భాదితములు కావు గాన పారమార్థికములేనని పూర్వపక్షి చెప్పిన దానికి సిద్ధాన్తి సమాధానము. “నేహ నానాఽస్తి కిఞ్చన” ‘బ్రహ్మములో ఏమాత్రము భేదములేదు’.

ఈశ్రుతి వాక్యముద్వారా బ్రహ్మములో చెప్పిన భేదము బాధితమగు చున్నది. పరస్పర విరోధముగల భేదాభేదములు ఒకచోట నుండజాలవు, యుక్తి యుక్తముగాదు. ఎందులకనగా ఒకే చంద్రుడు రెండు కాలేవు. పూర్వాధికరణములో ఆకారభేదమువలన భేదము ఉండవచ్చునని చెప్పినదిగూడ యుక్తముగాదు, ఎందులకనగా అద్వితీయవస్తువులో ఆకారభేదమును స్వీకరించలేదు. సముద్రాదులలో భేదాభేదములు రెండు చూడబడుచున్నవి “న హి దృష్టేఽనుపపన్నం నామ” అను న్యాయముద్వారా రెంటిని స్వీకరించిరి అలాగుననే అద్వితీయ వస్తువులో బ్రహ్మాకారము మరియు జగదాకారము చూడబడుచున్నవనిన అది సరికాదు. బ్రహ్మము శాస్త్రైకవేద్యముగాని ప్రత్యక్ష దృష్టము కాదు. భేదాభేదములు శ్రుతి యుక్తులద్వారా బాధితమగుటవలన

పారమార్థికములుగావు గాని వ్యావహారికములు. అపుడు తత్త్వ మేమి? అద్వైతమే తత్త్వము ఏలనన కార్యము కారణముకన్న భిన్నముగాదు అందువలన కేవలము కారణమే పారమార్థిక సత్యము. "యథా సోమ్యైకేన మృత్పిణ్డేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాద్వాచారమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యం, ఏవం సోమ్య స ఆదేశః" అనగా 'విచారించిచూచిన మృద్వికారములన్నియు మృణ్మాత్రములే యనియు, కుండ మూకుడు అను మొదలగునవి నామమాత్రములేగాని మఱియేమియు కావనియు, అచ్చటనున్నది మృత్తిక ఒక్కటియే యనియు ఆఘటాదులు నామమాత్రములగుటచే ఊఱక కానవచ్చునేగాని వాస్తవముగా మృద్భిన్నముగావు. అందువలననే నామరూపాత్మకమగు నీప్రపంచముగూడ కారణమగు బ్రహ్మముకన్న భిన్నముగాదని సిద్ధాన్తము'. మృత్తికాది దృష్టాన్తముద్వారా కారణమే సత్యమని చెప్పబడినది. పైన చెప్పిన శ్రుతివాక్యమునకు అర్థము ఈవిధముగా నున్నది. మృత్పిండము కారణము కుండ మూకుడు మొదలగునవి ఆ మట్టి యొక్క వికారములు. ఇచట మృత్తిక పేరనియు కుండ మొదలగునవి పేరనియు తార్కికుల మతము. ఘటాదులు వేరు పదార్థములు కావని చెప్పుటకే శ్రుతిలో వికార శబ్దముద్వారా వానిని ఉదాహరించెను. ఘటాదులు మృత్తిక యొక్క ఆకార విశేషములేగాని మృత్తకకన్న భిన్నముగాదు. ఏవిధముగా దేవదత్తుని బాల్య, యౌవన, వార్ధక్యములు వాని అవస్థా విశేషములే కాని దేవదత్తుడు భిన్నముగాదు. ఈస్థితిలో ఘటాదులు ఆకారవిశేషముగా ప్రతీతమయినను కేవలము మృత్తికయే స్వతంత్ర పదార్థము. అందువలననే మృత్తికయొక్క జ్ఞానముకలిగిన దాని వికారములైన ఘటాదుల పారమార్థికస్వరూపము జ్ఞాతమగును. మరి అపుడు ఆకారవిశేషముయొక్క జ్ఞానము కలుగదు కదా అనిన కలుగకపోయిన నష్టమేమి? ఆకారము ఏ పదార్థమునకు లేదు దాని జిజ్ఞాస చేయుట సరికాదు. వికారములు కన్నులద్వారా చూడబడినను మృత్తికాతిరిక్తముదానికి ఏ స్వరూపము లేదుకాదా. ఇది కుండ ఇది మూకుడు అని కేవలము వాగింద్రియముద్వారా ఉచ్చరించు నామ (వాగ్ నిష్ఠ నామధేయములు) మాత్రమే. ఏది వాస్తవిక స్వరూపముకాదో మరియు ఉపలబ్ధమగుచున్నదో దానిని మిథ్యాపదార్థ మందురు. ఈ లక్షణము వికారములలోగూడ కలదు గాన వికారములు మిథ్య అని తేలినది. మృత్తికకు వికారము లేక పోయినను స్వరూపము కలదు గాన అది సత్యము. ఈవిధముగనే బ్రహ్మ విషయములో గూడ తెలిసికొనవలయును. ఎందులకనగా మృత్తిక న్యాయము బ్రహ్మములో ఘటాదులన్యాయము జగత్తులో (చెప్పుట) యోజనగావించుట తేలిక. అంతేగాక ఈజగత్తు బ్రహ్మముకన్న భిన్నము కానందున కారణమయిన అద్వితీయ బ్రహ్మమే పారమార్థికము. ఈలాగున విచారించలేని వారికి సాధారణ దృష్టిద్వారా వేదములలో ప్రతిపాదించిన బ్రహ్మజ్ఞానము కలుగును, ప్రత్యక్షాది ప్రమాణములద్వారా భేదము తెలియును, గాన సముద్రతరంగ న్యాయము ద్వారా భేదము మరియు అభేదము రెండు కానవచ్చుచున్నవి ఆకానవచ్చు భేదము కేవలము వ్యావహారికము.

148. తదనన్యత్వమారమ్భణశబ్దాదిభ్యః. (2.1.14)

సూత్రార్థము:- కారణబ్రహ్మమునకన్న కార్య జగత్తుయొక్క అస్తిత్వము వేరుకాదు. ఎందులకనగా "వాచారమ్-భణం వికారో ..." అనగా 'వికారములు కేవలము నోటితో చెప్పుటకు మాత్రమే మృత్తికయే సత్యము అనగా కారణమే సత్యము' "ఐతదాత్మ్యంమిదం సర్వం" అనగా 'ఇదంతయు సద్రూపమే, ఆ సద్రూపమే సత్యము, అదే ఆత్మ' "బ్రహ్మైవేదం.." అనగా 'ఇదంతయూ బ్రహ్మమే' ఈ శ్రుతి వాక్యములద్వారా పైన చెప్పిన కార్య జగత్తు కారణబ్రహ్మమునకన్న వేరు కాదని తెలియు చున్నది.

కార్యము ఆకాశాదులు, కారణము పరబ్రహ్మము అందువలన కారణముకన్న కార్యము పారమార్థికదృష్టిలో అనన్యమని తెలియు చున్నది. ఎందులకనగా ఆరంభణశబ్దములను అనేక హేతువులవలన చెప్పిన కార్య కారణములకు పారమార్థిక అభేదమని చెప్పెదరు. ఒకే విజ్ఞానముద్వారా సర్వవిజ్ఞానమను ప్రతిజ్ఞను చెప్పుచూ ఉదాహరణమునకు ఛాందోగ్యశ్రుతిని చెప్పిరి. "యథా సోమ్యైకేన మృత్పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాద్వాచారమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్" (ఛాం.6.1.1) 'ఓ సౌమ్యుడా! విచారించిన మృత్పిండముద్వారా సంపూర్ణ మృద్వికారములు తెలియును, ఎందులకనగా వికారము కేవలము నోటితో చెప్పు నామమాత్రమే. వాస్తవమునకు మట్టి మాత్రమే సత్యము.' "ఐతదాత్మ్యమిందం సర్వం తత్సత్యం స ఆత్మా తత్త్వమసి" (ఛాం.6.8.7) 'ఇదంతయూ ఆత్మ కన్న అభిన్నము, అదే సత్యము, అదే ఆత్మా మరియు అదే నువ్వు' "ఇదం సర్వం యదయమాత్మా" (బృ.2.4.6) 'ఈ కనిపించు చున్నదంతయు ఆత్మయే' "బ్రహ్మైవేదం సర్వం" (ము.2.2.11) 'ఇదంతయూ బ్రహ్మమే'.ఈ పై శ్రుతులలో ఆత్మైకత్వమును చెప్పిరి. ఆత్మ ఒకటి కానిచో ఒక విజ్ఞానముద్వారా సర్వవిజ్ఞానము సంపన్నముగాదు. ఏవిధముగా ఘటాకాశము మఠాకాశము మహాకాశముతో అభిన్నమో ఆలాగుననే భోక్తృ భోగ్యాదులు సంపూర్ణ జగత్తు బ్రహ్మతో అభిన్నముగా చూడవలయును. వృక్షమునకు వృక్షత్వముతో అన్ని శాఖలు ఒకటయినను శాఖాత్వమువలన నానాత్వముకలుగినటుల బ్రహ్మములో నానాత్వము జగత్తుద్వారా కలుగుననెదవేమో అట్లనుట సరికాదు. ఎందులకనగా దృష్టాన్తములో కారణములో సత్యత్వము నిశ్చయించి సంపూర్ణ కార్య జగత్తును (వికారమును) అసత్యమని నిశ్చయించిరి. అవిధముగనే దార్ష్టాన్తములో కారణము సత్యమనియు కార్యము మిథ్యా అని చెప్పుటయే ఉచితము.

149. భావే చోపలబ్ధేః. (2.1.15)

సూత్రార్థము:- కారణముండిననే కార్యము ఉపలబ్ధమగుచున్నది, దానివలనగూడ కార్యము కారణముకన్న భిన్నముకాదనునది సిద్ధమగు చున్నది.

కార్య కారణములు అభిన్నములు ఏలనన మట్టి ఉండిననే కుండ ఉపలబ్ధమగును. ఆలాగుననే కారణ బ్రహ్మమున్ననే కార్య జగత్తు ఉపలబ్ధమగు చున్నది. 'మృత్సత్త్వే ఘటసత్త్వం మృదభావే ఘటాభావః' మట్టి ఉన్న ఘటమున్నది మట్టి లేనిచో ఘటము లేదు ఈ అన్వయ వ్యతిరేకముద్వారా మట్టి కన్న భిన్నమైన ఘటమనునది

లేదు. అందువలన కారణము కన్న భిన్నముగా కార్యము యొక్క అస్థిత్వము లేనందువలన కారణ బ్రహ్మముతో కార్య జగత్తు అభిన్నమని సిద్ధమైనది. ఈవిధముగా శాబ్దప్రమాణము ప్రత్యక్షప్రమాణములద్వారా జగత్తు బహ్మమునకన్న అభిన్నమని సాధించిన విషయమునే శ్రుతార్థాపత్తిప్రమాణముద్వారా సాధించుచున్నారు.

150. సత్త్వాచ్చావరస్య. (2.1.16)

సూత్రార్థము:- "బ్రహ్మ వా ఇదమగ్ర ఆసీత్" అనగా 'ఈ సంపూర్ణ జగత్తు ఉత్పత్తికిముందు బ్రహ్మ రూపమై యుండెను'. ఈలాంటి శ్రుతులద్వారా తెలియుచున్నదేమనగా ఉత్పత్తికిముందు కార్యము యొక్క అస్థిత్వ-ముండెను, గాన సిద్ధమగుచున్నదేమనగా కార్యముయొక్క (అవరస్య) అస్థిత్వము కారణముకన్న వేరు కాదు. ఇందువలనగూడ కారణముకన్న కార్యము వేరు కాదు. ఎందులకనగా "సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్" సృష్టికి ముందు ఈ కనిపించు నామరూపాత్మకమగు జగత్తు సత్ స్వరూపమైయుండెను. (ఛాం.6.2.1) ఈ శ్రుతి వాక్యముద్వారా ఉత్పత్తికి పూర్వము కార్యాస్థిత్వము ఆ ఆత్మయందే ఉండి తీరవలయును. అనగా కారణాస్థిత్వము కన్న కార్యము వేరు కాదు. ఉత్పత్తికి ముందు కార్యము కన్న కారణము వేరుకాదనునది, కార్య కారణములు అభిన్నమని శ్రుతిలో వినబడుటవలన సృష్టి తరువాత గూడ కార్య కారణములు అభిన్నమని సిద్ధమైనది. ఉత్పత్తికిముందు కార్యము కారణమురూపములో నుండునని చెప్పిన విషయముపై ఆక్షేపము గావించి సమాధానము చెప్పుచున్నారు.

151. అసద్వ్యపదేసాన్నేతి చేన్న; ధర్మాన్తరేణ వాక్యశేషాత్. (2.1.17)

సూత్రార్థము:- 'అసద్వా..' అను శ్రుతి వాక్యముద్వారా ఉత్పత్తికి ముందు ఈ జగత్తు 'అసద్' రూపమై యుండెను. అందువలన కార్య స్వరూపము కారణముద్వారా కాదు అనిన అట్లనుట సరికాదు. శ్రుతిలో నున్న అసద్ శబ్దమునకు అర్థము నామరూపములు ప్రకటము కాని అవ్యాకృత తత్త్వమను ధర్మమని చెప్పిరి. ఎందులకనగా వాక్యశేషములో 'తత్సదాసీత్' అని జగత్తు ఉత్పత్తికి ముందు సద్ రూపమై యుండెను అనిరి. గాన కార్యము యొక్క అస్థిత్వము కారణమునకన్న భిన్నము కాదు.

ఆక్షేపము:- "అసద్వా ఇదమగ్ర ఆసీత్" 'ఉత్పత్తికి ముందు ఈజగత్తు నిశ్చయముగా అసద్రూపమై యుండెను'. (తై.2.7.1). "అసదేవేదమగ్రే ఆసీత్" 'ఉత్పత్తకి ముందు నామారూపాత్మక మగు జగత్తు అసద్ రూపముగనే యుండెను' (ఛాం.3.19.1). ఈలాంటి శ్రుతులలో ఉత్పత్తికి ముందు కార్యమును అసద్రూపముగా ఉపదేశించుట వలన ఉత్పత్తికి ముందు కార్యము కారణరూపముగా విద్యమానమైయున్నదని చెప్పుట సరికాదు. అటులనుట సరికాదు. ఎందులకనగా ఈ పై శ్రుతులలో అత్యన్త అసత్వాభిప్రాయముతో ఉత్పత్తికి పూర్వము కార్యము అసత్వమని చెప్పలేదు కాని వ్యాకృత నామరూపముల ధర్మమును అపేక్షించి చెప్పిరి. నామరూపాత్మక

మైన కార్యజగత్తు ప్రలయకాలములో ధర్మాన్తరముగా నుంటవలన అసద్రూపమనిరి. అంతేగాక ప్రారంభములో 'అసద్' శబ్దముతో చెప్పిన తత్వమునే 'అది సద్ రూపముగా నుండెను' అను వాక్యములో తత్ శబ్దముతో పరామర్శముగావించి దానినే 'సత్' శబ్దముతో చెప్పిరి. గాన వాక్యశేషముద్వారా ఈ విషయమే తెలియుచున్నది. అవ్యాకృత (ప్రకటముగాని) నామరూపాత్మకమగు ధర్మాంతరముతో నుండుటవలన సృష్టికి ముందు కార్యమును అసద్ శబ్దముతో ఉపదేశించిరి అను విషయము వాక్యశేషముద్వారా తెలియుచున్నది. గనుక ఉత్పత్తికి ముందు కార్యకారణములు అభేదమని సిద్ధమగుచున్నది.

152.యుక్తేః శబ్దాన్తరాచ్చ. (2.1.18)

సూత్రార్థము:- ఉత్పత్తికి పూర్వము కుండ మట్టి రూపములో లేనిచో కుండ చేయువాడు మట్టినే ఏల గ్రహించును? వేరు పదార్థములను ఏల గ్రహించడు. కుండ అస్తిత్వము ఉత్పత్తికి ముందు మట్టిలో లేనిచో మట్టికి వేరు పదార్థములకు తేడా ఉండదు. ఈ యుక్తిద్వారా కారణములోనే కార్యముకలదని సిద్ధమైనది. 'సదేవ...' హే! ప్రియదర్శనుడా, ఈ జగత్తు ఉత్పత్తికి ముందు సద్ రూపమైయుంను. అను శ్రుతులలో నున్న 'సద్' శబ్దముద్వారా గూడ కారణములోనే కార్యము కలదనయు కారణమునకన్న కార్యము వేరు కాదనియు సిద్ధమగు చున్నది. ఉత్పత్తికి ముందుగూడ కార్యము కారణములోనే యున్నది.

ఉత్పత్తికి పూర్వము కారణములో కార్యము లేక పోయిన పెరుగు కావలయుననిన పాలను మరియు కుండ కావలయుననిన మట్టిని నియమముగా కారణముగా గ్రహించుట దానికి విపరీతముగా గ్రహించకుండుట కుదరదుగదా? ఎందులకనగా కార్యము తమ కారణములగు పాలు మరియు మట్టిలో అసద్రూపములో నున్నవి. ఆ రెండు పదార్థములలో ఏదో ఒకదానిని పెరుగు లేక కుండ కావలసినవారు గ్రహించ వచ్చును గదా గాని వారు నియముముగా గ్రహించుటకు యుక్తి ఛాందోగ్యోపనిషత్తులో చెప్పిరి. హే సౌమ్యుడా! ఉత్పత్తికి పూర్వము ఈ నామరూపత్మక జగత్తు సద్రూపమై యుండెను. ఇచట అసదర్థవాచక అసద్ శబ్దముద్వారా ఛాందోగ్య శ్రుతి సద్ అర్థమునే చెప్పుచున్నది. గాన యుక్తి మరియు శబ్దప్రమాణమువలన కారణములన్న కార్యము అభిన్నమనియు రెండింటిలో అస్తిత్వమున్నదనియు సిద్ధమగుచున్నది.
మన్ను మరియు కుండ పరస్పరము భిన్నములు. ఇది మట్టి ఇది కుండ అని భిన్న విషయములుగా ప్రతీతమగు చున్నవి. దీనిలో చెప్పిన హేతువునందు వ్యభిచారమును చూపుటకు ముందు సూత్రమును చెప్పుచున్నారు.

153. పటవచ్చ. (2.1.19)

సూత్రార్థము:- ఒకే వస్త్రమును మడిచి ఉంచిననూ పరచిననూ ఆ యాసమయములలో విలక్షణముగా కానవచ్చిననూ వస్త్రములో భిన్నత లేదు ఆలాగుననే మట్టిలోనూ కుండలోను భేదములేదు.

విలక్షణముగా కనబడినను వస్తువు వేరుకాదు. ఏవిధముగా మడిచి ఉంచిన వస్త్రమును చూచిన ఇది వస్త్రమా లేక మరొక వస్తువా అనునది స్పష్టముగా తెలియదు. అదే వస్త్రమును పరచిన స్పష్టముగా అభివ్యక్తమగును. అపుడు ఇది వస్త్రమేగాని వేరొక వస్తువు కాదనునది నిశ్చయమగును. ఏవిధముగా మడిచిన లేక పరచిన వస్త్రము వేరుగా కనిపించిననూ రెండు అవస్థలలో అది బట్టయే భిన్నవస్తువు కాదు అట్లే మట్టి మరియు కుండ భిన్న భిన్న ప్రతీతి విషయములైనను ఆ రేరండింటిలో భేదము లేదని గ్రహించవలయును. ఈ పట న్యాయముద్వారా కార్య-కారణములు అభిన్నమని సిద్ధమగుచున్నది.

154. యథా చ ప్రాణాదిః. (2.1.20)

సూత్రార్థము:- ఏ విధముగా ప్రణాయామాదుల ద్వారా నిరోధింపబడిన ప్రాణము అపానము మొదలగునవి కేవలము జీవన కార్యమును సంపన్నము గావించును. అదే ప్రాణము నిరోధింపబడని సమయములో ఆకుఞ్చన ప్రసారణాది కార్యములను సంపన్నము గావించును గాని ప్రాణములో తేడాలేదు. ఆలాగుననే కార్యములో భేధమున్నను కారణములో నున్న ఏకతకు విరోధము లేదు.

కార్య-కారణములలో భిన్నత్వమును స్వీకరించు వారు చేయు అనుమానము. 'కార్యము కారణమునకన్న భిన్నము ఏలనన రెండింటి ద్వారా భిన్న భిన్న ప్రయోజనములను సిద్ధింపజేయు సాధకములగుటవలన, ఉదాహరణమునకు దారము మరియు బట్ట. ఈ అనుమానములో నున్న హేతువునందు వ్యభిచారము జూపుటకు ఈ సూత్రమును చెప్పిరి. ప్రాణాయామము ద్వారా నిరోధించిన ప్రాణము వ్యానాపానాదులను విశేష ప్రాణము ద్వారా జీవన ధారణమను విశేష కార్యమును చేయును. అదే ప్రాణము వ్యుత్థాన కాలములో జీవన ధారణకన్న అధికమైన ఆకుఞ్చన ప్రసారణాదులను కార్యము గూడ జేయును. అంతమాత్రమున ఆప్రాణదులలో బిన్నత్వమును స్వీకరించరు ఏలనన చలన స్వభావము రెంటిలోనూ కలదు. గాన కార్య-కారణములలో భిన్నత్వము కాన-వచ్చినను సంపూర్ణ జగత్తు బ్రహ్మ కార్య మగుటవలన ఒక బ్రహ్మ విజ్ఞానముద్వారా సర్వ విజ్ఞానము కలుగునను శ్రుతి ప్రతిజ్ఞ సిద్ధము.

# 47. ఇతరవ్యపదేశాధికరణము.

సంగతి:- ముందు ఒక విజ్ఞానముద్వారా సర్వ విజ్ఞానమను ప్రతిజ్ఞను సిద్ధిపరచుటకు కార్య- కారణములు వేరు కాదను యుక్తి ద్వారా ప్రతిజ్ఞను నిరూపించిరి. అదే యుక్తి ద్వారా జీవ-బ్రహ్మములు ఒకటే అగుటవలన జీవుని హితాకరణాది జీవధర్మము బ్రహ్మములో వచ్చును. అనగా జీవుడు తనకు హితముగాని జనన మరణాది అనర్థములను సృజించడు. ఈవిధమైన ఆక్షేపసంగతి ఈ అధికరణములకు విషయము.

విషయము:- జగత్తు యొక్క జన్మాది కారణమైన బ్రహ్మ యొక్క విచారము ఈ అధికరణ విషయము.

సంశయము:- జీవుని కన్న అభిన్నమైన బ్రహ్మమును జగత్స్రష్టాగాను శాసకునిగాను స్వీకరించిన హితాకరణాది దోషములు బ్రహ్మమునకు ఆపాదింపబడునా లేదా?

పూర్వపక్షము:- జీవునితో అభిన్నమైన బ్రహ్మమును జగత్సృష్టికర్తగను శాసకునిగను ఒప్పుకొనిన హితాకరణాది దోషములు కలుగును. అది ఉచితముకాదు అందువల్ల విరోధము స్పష్టము.

సిద్ధాన్తము:- జీవునిలో సంసారము కల్పితము, వాస్తవముకాదు. ఈ విధముగా తత్త్వ దృష్టితో తెలిసికొన్న వారికి బ్రహ్మమునందు హితాకరణాది దోషములు కానరావు. ఎందులకనగా స్వయంప్రకాశమైన బ్రహ్మములో జీవగతమైన హితాకరణాది దోషముల సంబన్ధము లేదు.

వైయాసికన్యాయమాలా:-

107. హితాక్రియాది స్యాన్నో వా జీవాభేదం ప్రపశ్యతః। జీవాహితాక్రియా స్వార్థా స్యాదేషా నహి యుజ్యతే॥

108. అవస్తు జీవసంసారస్తేన నాస్తిమమ క్షతిః। ఇతి పశ్యత ఈశస్య న హితాహితభాగితా॥

తనలో జీవులయందు అభేదము చూచు ఈశ్వరునియందు హితాకరణ, అహితాకరణాది దోషములు గలవా లేవా? అను సందేహమునకు పూర్వపక్షి జీవుడు తన యొక్క అహితమును చేసికొనుచూ హితమును చేసికొనుటలేదు ఆజీవుడు ఈశ్వరునితో అభిన్నమగుటవలన హితాకరణాది దోషములు ఈశ్వరునిలో నున్నవని చెప్పవలయును. దానికి సిద్ధాన్తి సమాధానము. జీవుని సంసారము మిథ్యా, దానివల్ల నాకు ఏవిధమైన హాని లేదు ఆవిధముగా తెలిసికొన్న ఈశ్వరునియందు హితాకరణాది దోషములు రావు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

పరమేశ్వరుడు సంసారములో ఆసక్తి కలిగిన జీవులలో వైరాగ్యమును పెంచుట లేదు మరియు నరకమునకు హేతువగు అధర్మాదుల నిర్మాణము గావించుచున్నాడనును పూర్వపక్షి. అంతేగాక అధర్మాదులను నిర్మించుచున్ననూ సర్వజ్ఞుడగుటవలన జీవులను తనకన్న అభిన్నముగా చూచుచు ఆ ఈశ్వరుడు తన యొక్క హితమును చేసికోనుటలేదు మరియు అహితమును పొందుచున్నాడు. ఇది ఉచితము కాదు. తనకు హితమును చేసికొనక అహితమును కోరుకును బుద్ధిమంతులు లేరుకదా? అందువల్ల పరమేశ్వరునిలో హితాకరణాది దోషములున్నవి. దీనికి సిద్ధాన్తి చెప్పు జవాబు. ఈశ్వరుడు సర్వజ్ఞుడు. జీవుని సంసారము మిథ్య అంతేగాక ఆ జీవుడు స్వయముగా నిర్లిప్తుడు. ఈవిషయము ఈశ్వరునికి బాగుగా తెలుసును. అందువల్ల ఈశ్వరునిలో హితాకరణాది దోషములు లేవు.

## 155. ఇతరవ్యపదేశాద్ధితాకరణాదిదోషప్రసక్తిః. (2.1.21)

సూత్రార్థము:- శ్రుతులలో 'తత్త్వమసి' ఆది వాక్యములద్వారా జీవుని బ్రహ్మమని చెప్పిరి. లేక 'అనేన జీవేన ఆత్మనా' అను వాక్యములో ఆ బ్రహ్మమే జీవరూపముగా ఆత్మలో ప్రవేశించి నామ రూపములను అభివ్యక్తము గావింతుననెను. అందువల్ల

బ్రహ్మ స్రష్ట అయిన జీవుడుగూడ సృష్టించువాడు అవును. దీని ద్వారా బ్రహ్మము తన యొక్క అహితము అనగా జరా మరణాది అనేక అనర్థ దోషముల ప్రసక్తికి కారణమగు చున్నాడు. గాన బ్రహ్మ జగత్తునకు కారణము గాదు.

జీవాభిన్నమైన బ్రహ్మము ద్వారా సృష్టి అని చెప్పుటవలన అహితకరణాది దోష ప్రసక్తి వచ్చును. 'హితాకరణాది' అను పదములో నఞ్ పద వ్యత్యాసము చేసిన అహితకరణాది అర్థమగును. జన్మ-జరా- మరణాది జీవునకు అహితములు. ఈ విధముగా అనేక అనర్థదోషములు జీవ-బ్రహ్మల అభేద పక్షములో వచ్చును. స్వతంత్ర కర్త అగుటవలన జీవుడు తనకు హితకరములు మరియు సుఖప్రదములగు కార్యములనే చేపట్టును. జన్మ జరా మరణాది అనేక అనర్థజాలములతో వ్యాప్త మయిన  అహితము కోరడు ఏలనన అటులనే లోకములో చూడబడు చున్నది. అతః అభ్రాన్త చైతన్యము మరియు జీవాభిన్న బ్రహ్మము అనిష్టమైన జగత్తు యొక్క సృష్టికర్తగా స్వీకరించుట బొత్తిగా అసంగతము. గాన పూర్వములో చెప్పిన సమన్వయమునకు విరోధము వచ్చెనని పూర్వపక్షి ఈ సూత్రములో చెప్పెను. దానికి సిద్ధాన్తి ముందు సూత్రములో జవాబు ఇచ్చు చున్నారు.

156. అధికం తు భేదనిర్దేశాత్. (2.1.22)

సూత్రార్థము:- జీవుని కన్న భిన్నమైన సర్వజ్ఞ సర్వశక్తిమంతుడైన బ్రహ్మమును మేము జగత్ స్రష్టగా చెప్పుచున్నాము. అందువల్ల వానిలో హితాకరణాది దోషములు రావు. జీవ బ్రహ్మముల భేదము ఏ ప్రమాణముద్వారా అనిన శ్రుతి ప్రమాణముద్వారా. 'ఆత్మా వా అరె ద్రష్టవ్యః' ఈ శ్రుతి అర్థము 'ఓ మైత్రేయి! ఆత్మ దర్శనము చేయవలయును. దానికి శ్రవణము, మననము మరియు నిదిధ్యాసనము చేయవలయును'. ఈ శ్రుతులద్వారా కల్పిత భేదము చెప్పబడినది. నిత్యముక్త బ్రహ్మమునకు ఏ పదార్థము హితము గాని అహితముగాని కానేరదు.

సూత్రములో నున్న 'తు' శబ్దము పుర్వపక్షమును ఖండించుటకు చెప్పిరి, ఎందులకనగా సర్వజ్ఞుడు సర్వశక్తిమంతుడు, నిత్యశుద్ధస్వరూపుడు, జ్ఞానస్వరూపుడు, ముక్త స్వభావుడైన బ్రహ్మము జీవునికన్న అధికశక్తగలవాడు మరియు భిన్నావస్థలోనుండి ఈ జగత్తునకు ఉపాదానకారణము మరియు స్రష్ట అగుచున్నాడు అని మా సిద్ధాన్తుల మతము. ఈ విధముగా చెప్పిన మాపక్షములో  అహితకరణాది దోషములు రావు. 'తత్త్వమసి' నువ్వేబ్రహ్మము. 'ఆత్మా వా అరే ద్రష్టవ్యః' (బృ. 2.4.5.) 'సోఽన్వేష్టవ్యః స విజిజ్ఞాసితవ్యః' (ఛాం.8.7.1) 'ఆత్మానే చూడవలయును, నిశ్చయముగా దానినే శ్రవణ మనన నిదిధ్యాసనలు చేయవలయును'. 'ఆ ఆత్మయే అన్వేషణకు మరియు జిజ్ఞాసకు యోగ్యము' ఈ ఉదహరించిన -శ్రుతి వాక్యముల ద్వారా జీవ బ్రహ్మములలో కల్పిత కర్తా కర్మాది భేదము గోచరించుచున్నది. ఈకల్పిత భేదము అజ్ఞానావస్థలోనే గాని పరామార్థికముగా గాదు. కాని పారమార్థిక దశలో 'తత్త్వమసి' అను మహావాక్యముద్వారా అభేదనిర్దేశము చూపబడినది. ఈ విధముగా స్వీకరించిన జీవునిలో సంసారిత్వము బ్రహ్మములో సృష్టి కర్తృత్వము సులభ సాధ్యము. ఎందులకనగా మిథ్యాజ్ఞాన విలాసిత సమస్త భేద వ్యవహారము సమ్యక్ జ్ఞానముద్వారా బాధితమగు చున్నది. ఇది మా సిద్ధాన్తము. అభేదము పారమార్థికము మరియు భేదము కల్పితము అనిన అహితకరణాది సంపూర్ణ దోషముల నివృత్తి కలుగును.

157. అశ్మాదివచ్చ తదనుపపత్తిః. (2.1.23)

సూత్రార్థము:- ఒకే భూమినుండి ఉత్పన్నమైన రాళ్లలో విచిత్రమైన వజ్ర, వైడూర్యముల భేదము కలుగునట్లు బ్రహ్మ యొక్క కార్యములలో స్వరూప వైచిత్ర్యము యుక్తి సంగతమే. అందువల్ల ఇతరులద్వారా కల్పిత దోషముల ప్రసక్తి లేదు.

ఏవిధముగా పృథివీత్వ సమాన్యముతో నుండినను రాళ్లలో విచిత్రమైన వజ్ర వైఢూర్యాది భేదములున్నట్లున్ను, మరియు భూమినాశ్రయించిన గంధము వృక్షములో ఆకులు, పుష్పములు, ఫలముల వైచిత్ర్యమున్ను, కనబడును. ఒకే అన్నకార్యము రక్తము, వెంట్రుకలు, గోళ్ళు మొదలగు విచిత్రములైనవి కానవచ్చుచున్నవి. అ విధముగనే బ్రహ్మ కార్యములు విచిత్రములైనవి. గాన ప్రతివాది ద్వారా కల్పింపబడిన బ్రహ్మ విచిత్ర కార్య జనకత్వమునందలి హితాకరణాది సంపూర్ణ దోషములు అసిద్ధమగుచున్నవి.

# 48. ఉపసంహారదర్శనాధికరణము.

సంగతి:- పూర్వాధికరణములో జీవ బ్రహ్మల ఔపాధిక భేదమును స్వీకరించి బ్రహ్మమును జగత్స్రష్టగా భావించినను వానిలో హితాకరణాది దోషములు లేవని నిశ్చయమయినది. ఇపుడు బ్రహ్మములో ఔపాధిక కరణాదులు భావించుటగూడ తగదు ఏలనన బ్రహ్మములో నానాత్వము లేదు. ఈవిధమైన ప్రత్యుదాహరణ సంగతి వల్ల ఈ అధికరణము ఆరంభమైనది.

విషయము:- జగత్తు యొక్క అభిన్న నిమిత్త ఉపాదానకారణము చైతన్య బ్రహ్మమను విషయముపై ఈ అధికరణములో విచారము గావింతురు.

సంశయము:- కరణాదుల (ఇంద్రియాదుల) సహాయములేని బ్రహ్మము ఈ జగత్తునకు సృష్టికర్త కాగలదా? లేదా?

పూర్వపక్షము:- కుండను చేయు కుమ్మరి అనేక సాధనల సహకారముతో కుండను చేయుట చూచు చున్నాము. ఒకే బ్రహ్మము నానావిధమైన కార్యములు ఏ సహాయము లేక క్రమముముగా ఉత్పత్తి గావింపజాలడు.

సిద్ధాన్తము:- తాత్విక దృష్టిలో బ్రహ్మము అద్వయము, వాని సహకారిణి అవిద్య. అందువల్ల అవిద్యా శక్తి ద్వారా అద్వయ బ్రహ్మము విచిత్ర కార్యములు క్రమముగా ఉత్పత్తి గావించుచున్నది. లోకములో పాలు స్వయముగనే పెరుగుగా మారుట కానబడు చున్నది, దేవాదులు ఏ సహాయము లేకనే అనేక శరీరములు నిర్మించు చున్నారు. ఆ విధముగనే అవిద్యా సహాయమువలన అద్వయ బ్రహ్మము అన్య సాధనములు లేకున్నను జగత్తును సృష్టి గావించు చున్నాడు అనుటలో ఏవిధమైన దోషము లేదు.

వైయాసికన్యాయమాలా:-

109. న సంభవేత్సంవేద్వా సృష్టిరేకాద్వితీయతః । నానాజాతీయ కార్యాణాం క్రమాత్ జన్మ న సంభవతి॥

110. అద్వైతం తత్త్వతో బ్రహ్మ తచ్చావిద్యాసహాయాత్ । నానాకార్యకరం; కార్యక్రమోఽవిద్యాస్థశక్తిభ్యః॥

ఒకే అద్వైత బ్రహ్మము ద్వారా సృష్టివ్యవస్థ జరుగునా లేక జరగదా? విచిత్ర కార్యముల ఉత్పత్తి ఒకే కారణము ద్వారా జరగదని పూర్వ పక్షి. సిద్ధాన్తి సమాధానము. పారమార్థికముగా బ్రహ్మము ఒకటే అయిననూ అవిద్య యొక్క సహాయము ద్వారా విచిత్ర మైన అనేక కార్యములు ఉత్పన్నము చేయగలదు. మరియు ఆ అవిద్య యొక్క శక్తి ద్వారానే కార్యముల యొక్క క్రమోత్పత్తి వ్యవస్థ జరుగుచున్నది.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

'ఏకమేవాద్వితీయమ్' అను శ్రుతిలో బ్రహ్మము సజాతీయ, విజాతీయ, స్వగత భేద శూన్యమని చెప్పబడినందు వలననూ, సృష్టింపబోవు ఆకాశ వాయు అగ్ని ఆది భూతములు విచిత్రములగుటవలననూ, కారణము విచిత్రము గానిచో కార్యము విచిత్రమగుట సంభవము కానందువలననూ, ఒకే పాలనుండి పెరుగు నూనే మొదలగు అనేక విచిత్ర కార్యముల ఉత్పత్తి లేనందువలననూ, శ్రుతులలో ఆకాశాది భూతముల సృష్టియందు క్రమము ప్రతీత

మగుట వలననూ, క్రమోత్పత్తికి వ్యవస్థాపకము ఏదియూ లేనందువలనూ, అనేక కార్యముల ఉత్పత్తి కానవచ్చుట వలననూ ఒకే అద్వైత బ్రహ్మము క్రమోత్పత్తి చేయజాలదని పూర్వపక్షి మతము.
సిద్ధాన్తి చెప్పు సమాధానము. వాస్తవమునకు బ్రహ్మము ఒకటే అయిననూ వానికి సహాయము అవిద్య కలదు. "మాయాం తు ప్రకృతిం విద్యాన్ మాయినం తు మహేశ్వరం" అనగా 'మాయను పకృతిగా తెలిసి కొనుము మరియు మహేశ్వరుని మాయావిగా తెలిసి కొనుము' మొదలుగా గల శ్రుతి, యుక్తి, అనుమానములద్వారా ఆ పరమేశ్వరునికి మాయ సహాయమని తెలియు చున్నది. ఇచట మాయను అంగీకరించుటవలన ద్వైతము సంభవించునను ఆశంక పనికిరాదు ఎందులకనగా బ్రహ్మకన్న ద్వితీయమేదియూ లేదు.(ఒకే బ్రహ్మములోమాయ సూర్యుడు అతని కిరణములవలె నున్నది, గాన బ్రహ్మము ఒకటే ) అందువల్ల బ్రహ్మము ఒకటే అయుననూ అవిద్యా సహాయమువలన అనేక విచిత్ర కార్యములు చేయగలదు. వ్యవస్థాపకుడు లేడను సందేహము వలదు ఏలనన అవిద్యా శక్తియే విచిత్ర కార్యక్రమములు చేయు వ్యవస్థాపికా. అందువల్ల అవిద్య వలన అనేక విచిత్ర కార్యముల సృష్టి అద్వయ బ్రహ్మములో సంభవమని తేలినది.

158. ఉపసంహారదర్శనాన్నేతి చేన్న క్షీరవద్ధి. (2.1.24)

సూత్రార్థము:- లోకములో కుండాది కార్యములు చేయు కుమ్మరి దణ్డము, చక్రము మొదలుగా గల అనేక సమాగ్రి కూడ గట్టును, అందువల్ల అసహాయ బ్రహ్మము జగత్తునకు ఉపాదానము లేక నిమిత్త కారణము కాజాలదు అని చెప్పుట సరికాదు. ఎందులకనగా పాలు అన్య పదార్థముల అపేక్ష లేకయే పెరుగుగా మారును. ఆలాగుననే బ్రహ్మము అన్యసాధనములు లేకయే జగత్తు యొక్క సృష్టి చేయుచున్నాడు.

కుండ చేయుటకు ఉపాదాన కారణము మృత్తిక, దానికన్న భిన్నమైన కుమ్మరి నిమిత్త కారణము. కుమ్మరి అనేక సాధనముల సహాయము తీసికొనుట లోకములో చూడబడు చున్నది. అభిన్న నిమిత్త ఉపాదాన కారణమైన బ్రహ్మము ఏ సాధనాన్తరముల సహాయము లేకయే జగత్ కర్త ఎట్లగును? కానేరదు, అందువల్ల పూర్వోక్త సమన్వయమునకు విరోధము కలుగుచున్నది. ఈ పూర్వపక్షమునకు సిద్ధాన్తి చెప్పు సమాధానము. పూర్వోక్త దోషము సమన్వయ వాదములో లేదు. ఎందులకనగా లోకములో పాలు ఏ బాహ్య సాధనముల అపేక్ష లేకయే స్వయముగా పెరుగుగా మారును. అట్లే నీరు మంచుగా మారు చున్నది. ఆలాగుననే బ్రహ్మము బాహ్య సాధనల సహాయము లేకయే జగద్రూపముగా మారును. ఒకవేళ పెరుగుగా మారుటకు నియమితమైన ఉష్ణాదుల ఆవశ్యకము ఉన్ననూ పరిపూర్ణ శక్తివంతమైన బ్రహ్మము సృష్టిని రచించుటకు ఏసాధనముయొక్క అపేక్ష లేదు. "న తస్య కార్యం కరణం చ విద్యతే" 'బ్రహ్మమునకు శరీరముగాని ఇంద్రియములుగాని లేవు' (శ్వే.6.9) ఈ శ్వేతాశ్వతర శ్రుతి గూడ అసహాయ బ్రహ్మమును సంపూర్ణ జగత్కార్యమునకు కర్తగా చెప్పుచున్నది. అందువల్ల ఒకే బ్రహ్మము

విచిత్ర శక్తి వల్ల దుగ్ధాదులవలే (పాలవలే) మరియు దేవతాదులవలే విచిత్రమైన జగత్ నిర్మాణమునకు కారణమగు చున్నాడు.

"న బ్రహ్మ ఉపాదానం కర్తృవా జగతో భవితుమర్హతి, చేతనత్వే సతి అసహాయత్వాత్ సమ్మతవత్" అను తర్కమునకు అర్థము 'జగత్తు యొక్క ఉపాదానకారణము మరియు నిమిత్త కారణము బ్రహ్మము కాజాలదు ఏలనన ఆ బ్రహ్మము చైతన్య మయిననూ సహాయము లేనిది, లోకములో చైతన్య వంతుడయిన కుమ్మరి సహాయము తీసికొనుచున్నాడు గాన' అను తర్కము ద్వారా వేసిన ప్రశ్నకు సమాధానము వేరొక దృష్టాన్తము ద్వారా చెప్పుచూ వారి తర్కములో వ్యభిచార దోషమును చూపుచున్నారు.

159. దేవదివదపి లోకే. (2.1.25)

సూత్రార్థము:- ఏ విధముగా మంత్రములు, అర్థవాదములు, ఇతిహాసాదులలో దేవతలు, పితృగణములు, ఋషులు మొదలగువారు భాహ్య సాధనల సహాయము లేకయే సంకల్పమాత్రముచే అనేకవిధ కార్యములు నెరవేర్చు చున్నారు మరియు అనేక రూపములు దాల్చు చున్నారు అని చెప్పబడినది. ఆ ప్రకారముగనే బ్రహ్మము గూడ సహాయము లేకయే ఈ సంపూర్ణ జగత్తునకు అభిన్న నిమిత్తోపాదాన కారణమగుచున్నాడు.
మంత్ర అర్థవాదాది శాస్త్రములను మరియు వృద్ధుల వ్యవహారమును లోక శబ్దముతో చెప్పుటకు కారణము వీని ద్వారానే శాస్త్రీయము మరియు లౌకిక వ్యవహారముల అర్థము చూడబడుచున్నది. ఆమంత్రాదులలో ఏవిధముగా దేవతలు పితరులు మరియు ఋషులు మొదలగువారు మహాప్రభావశాలురై చైతన్యవంతులైననూ ఏ విధమైన భాహ్య సాధనలు లేకయే ఐశ్వర్య విశేష యోగము ద్వారానూ మరియూ సంకల్ప మాత్రము ద్వారానూ అనేక అవయవములు గల శరీరములు భవనములు మరియు రథాదులను నిర్మించుట చూడబడు చున్నది. దీనికి మంత్రార్థవాదములు ప్రమాణము. ఊర్ణనాభి (సాలెపురుగు)భాహ్య సాధనలు లేకుండగనే సాలెగూడును నిర్మించు చున్నది. కొంగ వీర్యము లేకనే (పురుష సంబన్ధము లేకుండగనే) గర్భ ధారణము గావించుచున్నది ('గర్భం బలాకా దధతేఽమ్బుయోగా న్నాకే నిబద్ధావళయః సమంతాత్) "స్వాతికొంగలు వర్షాకాలమున నాకాశమునందంతటను బారులు తీరి పోవుచు మేఘమునుండి స్రవించుజలమువలన గర్భమును దాల్చును".
ఈ విధముగనే బ్రహ్మము గూడ భాహ్య సాధనలు లేకుండగనే స్వయముగా ప్రపంచరచన గావించు చున్నాడనిన దోష మేమి? కుమ్మరి దేవతాదులు చైతన్యవంతులైననూ కుమ్మరికి కుండ చేయుటకు మృత్తికాది భాహ్య సాధనల ఆవశ్యకము కలదు గాని దేవతలకు కార్యమారంభించుటకు భాహ్య సాధనల ఆవశ్యకము లేదు. ఇచట కుమ్మరి వాని దృష్టాన్తమేగాని చైతన్యవంతులైన వారికందరికి సాధనలు కావలయునను నియమము లేదు.
బ్రహ్మమునందు సాన్నిధ్యమాత్ర సాధ్య కర్తృత్వమేగాని సాధనసాధ్య కర్తృత్వముగాదు.

# 49. కృత్స్నప్రసక్త్యధికరణము.

సంగతి:- పూర్వాధికరణములో భ్రమను ఉత్పత్తిచేయు కారణము గలదు గాని ఈ అధికరణములో కార్య విచారము చేయుటవలన  ఈ రెండు అధికరణములకు కార్య-కారణ భావ సంగతి.

విషయము:- నిరవయవ బ్రహ్మ నుండి జగత్ సృష్టిని చెప్పు సమన్వయము ఈ అధికరణములో విచారణీయ విషయము.

సంశయము:- నిరాకార బ్రహ్మము యొక్క పరిణామము ఈ జగత్ అగునా కాదా?

పూర్వపక్షము:- నిరకార బ్రహ్మమునుండి జగత్ సృష్టి చెప్పినచో బ్రహ్మము జగత్ రూపముగా మారినదని చెప్పవలయును అపుడు బ్రహ్మములో నిత్యత్వముండదు.  బ్రహ్మ యొక్క ఒక అంశము జగత్తు అనిన బ్రహ్మ యొక్క పరిణామము జగత్ అని చెప్పవలయును. అట్లు చెప్పిన బ్రహ్మములో సావయవత్వము వచ్చును. గాన బ్రహ్మనుండి జగత్సృష్టిని చెప్పు సమన్వయమునకు విరోధము వచ్చును.

సిద్ధాన్తము:- మాయ ద్వారా బ్రహ్మము అనేక రూపములు ధరించును. అందువల్ల కృత్స్న ప్రసక్తిదోషము మరియు సంపూర్ణముగా బ్రహ్మము జగత్తుగా మారెనను దోషములు రావు. బ్రహ్మములో మేము సావయవత్వము స్వీకరించుటయే లేదు, అందువల్ల బ్రహ్మ యొక్క ఒక అంశము పరిణామము చెందినదని చెప్పుటకునూ వీలు లేదు. నిరవయవమైన బ్రహ్మ యొక్క వివర్తము ఈ జగత్తు, గాని పరిణామముగాదు. ఏ విధముగానననిన స్వప్న ద్రష్టలో స్వప్న దృష్యము కల్పితము ఆలాగుననే అద్వయ బ్రహ్మములో ఈ జగత్తు కల్పితము. గాన స్వరూపములో మార్పు లేకయే బ్రహ్మము జగత్తుగా భాసించుచున్నది.

వైయాసికన్యాయమాలా:-

111. న యుక్తో యుజ్యతే వాఽస్య పరిణామో న యుజ్యతే। కార్త్స్న్యాద్ బ్రహ్మనిత్యతాప్తేరంశాత్సావయవం భవేత్॥

112. మాయాభిర్బహురూపత్వం న కార్త్స్న్యాన్నాపి భాగతః। యుక్తోఽనవయవస్యాపి పరిణామోఽత్ర మాయికః॥

బ్రహ్మమందు పరిణామము కలదా లేదా? బ్రహ్మము సంపూర్ణముగా పరిణామము చెందినదనిన బ్రహ్మములో అనిత్య దోషము వచ్చును. అట్లుగాక బ్రహ్మముయొక్క ఒక  అంశము పరిణామము చెందినదనిన బ్రహ్మములో సావయవత్వము వచ్చును. గాన బ్రహ్మయందు పరిణామము లేదు. అను పూర్వపక్షమునకు సిద్ధాన్తి చెప్పు సమాధానము. బ్రహ్మము మాయ ద్వారా అనేకరూపములు పొందు చున్నది గాని సంపూర్ణముగా గాని అంశముగా గాని గాదు. మాయ ద్వారా బ్రహ్మయొక్క  కల్పిత పరిణామము యుక్తి సంగతమే.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

పూర్వపక్షి చెప్పునదేమనగా ఆరమ్భణాధికరణములో కార్య-కారణముల అభేదము ప్రతిపాదించిరి. దీనిద్వారా వైశేషికులవలే బ్రహ్మవాదులు ఆరమ్భవాదమును స్వీకరించుటలేదు కాని క్షీరదధిన్యాయముద్వారా పరిణామవాదమును స్వీకరించు చున్నారు. బ్రహ్మము సంపూర్ణముగా పరిణామము చెందిన అది పాలవలే అనిత్య మగును. కాని ఆ బ్రహ్మము యొక్క ఒక భాగము పరిణామము పొందినదనిన దానిలో సావయవత్వ దోషము వచ్చును. గాన బ్రహ్మమునందు పరిణామమున్నదనుట యుక్తి సంగతముగాదు. ఈపూర్వపక్షమునకు సిద్ధాన్తి ఇచ్చు సమాధానము. "ఇన్ద్రో మాయాభిః పురురూప ఈయతే" అనగా 'పరమేశ్వరుడు మాయా శక్తిద్వారా అనేక రూపములు గలవాడగు చున్నాడు'. (బృ.2.5.19) ఈ శ్రుతిలో మాయాశక్తి ద్వారా అనాయాసముగనే బ్రహ్మము జగద్రూపముగా పరిణామము పొందుచున్నాడు అనిరి. ఈ పరిణామము వాస్తవము గానందున సంపూర్ణముగా

పరిణామము పొందుచున్నాడా లేక ఏకదేశములో పరిణామము పొందుచున్నాడా అను వికల్పమునకు అవసరమే లేదు. ఈ విధమైన పరిణామము బ్రహ్మములో యుక్తియుక్తమే.

### 160. కృత్స్నప్రసక్తిర్నిరవయవత్వశబ్దకోపో వా. (2.1.26)

సూత్రార్థము:- నిరవయవ బ్రహ్మము పరణామము పొందినదనిన సంపూర్ణబ్రహ్మము కార్య రూపముగా పరిణామము చెందినదనవలయును. కాని ఒక అంశము పరిణామము చెందినదనిన బ్రహ్మములో సావయవత్వ దోషము మరియు "నిష్కలం నిష్క్రియం శాన్తం నిరవద్యం నిరంజనమ్" అను శ్రుతి విరోధము కలుగును ఏలనన ఈ శ్రుతిలో 'బ్రహ్మము అవయవరహితము, క్రియాశూన్యము, శాన్తము, దోషరహితము నిరఞ్జనము' అని చెప్పబడినది. ఈ రెండు విధములగనూ బ్రహ్మము అనిత్యమగును అందువల్ల బ్రహ్మము ఈ జగత్తునకు ఉపాదానకారణము గాదు.

"బ్రహ్మ జగదాకారేణ న పరిణమతే, నిరవయవత్వాద్, సావయవస్యైవ నానాకారేణ పరిణమదర్శనాచ్చ" అనగా బ్రహ్మము జగద్రూపముగా పరిణామము గాజాలదు, ఏలనన నిరవయవముగాన, సావయవ వస్తువే లోకములో నానాకార రూపములుగా పరిణామము పొందుట చూడబడు చున్నది. ఈ తర్కమునకు విరోధము కలుగుటవలన పూర్వపక్షి సమన్వయము అసిద్ధ మనును. పూర్వపక్షి సిద్ధాన్తినడుగునదేమనగా నిరవయవ బ్రహ్మము జగద్రూపముగా పరిణామము చెందుచున్నదా లేక సావయవ బ్రహ్మము పరిణామము చెందుచున్నదా? మొదటి పక్షములో సంపూర్ణబ్రహ్మము కార్య రూపముగా పరిణత నొందుననవలయును ఏలనన నిరవయవ వస్తువు యొక్క ఒకభాగము పరిణామము చెందుట సంభవముగాదు. సంపూర్ణముగా పరిణామము చెందిన మూల ఉచ్ఛేదము సంభవించును. ద్వితీయ పక్షములో పూర్వము చెప్పిన దోషము లేకపోయిననూ ఒక అంశము పరిణామము పొందును వేరొక అంశము స్థిరముగా నుండునన వలయును అపుడు "బ్రహ్మ నిష్కలం నిష్క్రియం శాన్తం నిరవద్యం నిరఞ్జనం" (శ్వే.6.19) అనగా 'బ్రహ్మము అవయవరహితము, క్రియాశూన్యము, శాన్తము, - దోషరహితము నిరఞ్జనము' అను శ్రుతియు మరియు "దివ్యో హ్యమూర్తః పురుషః సబాహ్యాభ్యన్తరో హ్యజః" (ము.2.1.2) అనగా 'ఈ అక్షర పురుషుడు దివ్యుడు, మూర్తిరహితుడు, లోపల బయటవ్యాపకుడు మరియు జన్మరహితుడు' అని నిరవయవత్వమును ప్రతిపాదించు శ్రుతి వాక్యములకు విరోధము కలుగును. సావయవత్వము గలదని చెప్పిన బ్రహ్మములో అనిత్యత్వ ప్రసంగము వచ్చును. అందువల్ల బ్రహ్మము ఈ జగత్తునకు ఉపాదానకారణమని చెప్పు వేదాన్తవాదుల పక్షములో చెప్పిన సమన్వయమునకు విరోధము కలిగెను. ఈవిధముగా పూర్వపక్షి సూత్రము గావించగా దానికి సమాధానముగా సిద్ధాన్తి ఈ క్రింది సూత్రముద్వారా చెప్పిరి.

### 161. శ్రుతేస్తు శబ్దమూలత్వాత్. (2.1.27)

సూత్రార్థము:- సూత్రములోనున్న 'తు' శబ్దము పూర్వపక్షమును ఖండించుటకు. శ్రుతిలో బ్రహ్మమును జగత్తునకు ఉపాదానకారణమని చెప్పిరి. "తావానస్య మహిమా తతో...." అనగా ' గాయత్రీ సంజ్ఞగల బ్రహ్మమునకు అంత మహిమ గలదు, పురుషుడు దీనికన్న ఎక్కువ మహిమ గలవాడు, ఈ సంపూర్ణ జగత్తు వాని ఒకపాదములో నున్నది దానియొక్క నిర్వికారమైన మూడు పాదములు స్వప్రకాశస్వరూపములో నున్నవి'. ఇత్యాది శ్రుతులలో బ్రహ్మయొక్క అస్తిత్వము కార్య జగత్తుకన్న భిన్నముగా చెప్పబడినది. గాన బ్రహ్మము సంపూర్ణముగా

కార్యరూపము దాల్చుట లేదు. పూర్వము చెప్పిన యుక్తులద్వారా శ్రుతి బాధితముగాదు. ఎందులకనగా బ్రహ్మము శ్రుతి మూలకము గాన, శ్రుత్యనుసారము బ్రహ్మము జగత్తునకు ఉపాదానకారణమగుట మరియు జగత్తుకన్న భిన్నముగా నుండుట అవిరుద్ధము.

సూత్రమునందు వచ్చిన 'తు' శబ్దము పూర్వపక్ష నిరాకరణము గావించుటకు. అనగా సంపూర్ణ బ్రహ్మము జగద్రూపముగా పరిణామము పొందునని పూర్వపక్షి చెప్పిన దోషము మాపక్షములో లేదు. ఏలనన "తావానస్య మహిమా తతో జ్యాయాంశ్చ పురుషః। పాదోఽస్య సర్వా భూతాని త్రిపాదస్యామృతందివి" (ఛాం.3.12.6) ఈ శ్రుత్యర్థము 'సంపూర్ణ సంసారము ఆ పరమేశ్వరుని మహిమ. పరమాత్మ వీని కన్నగూడ ఎక్కువ మహిమగలవాడు. ఆపరమేశ్వరుని ఒకపాదము అనగా చతుర్థాంశములో ఈ భూతములన్నియు ఉన్నవి మిగిలిన మూడు పాదములు ద్యులోకములో శుద్ధ స్వప్రకాశస్వరూపములో నున్నవి' అని శ్రుతిలో చెప్పుటవలన. ఆలాగుననే బ్రహ్మము జగత్ స్రష్ట అని స్వీకరించిననూ బ్రహ్మము నిరవయవమని చెప్పు శ్రుతులలో గూడ దోషములేదు. ఎందులకనగా పైనుదహరించిన శ్రుతిలో బ్రహ్మము నిరవయవమని గూడ స్వీకరించుటవలన. బ్రహ్మము నిరవయవము మరియు సంపూర్ణ బ్రహ్మము జగద్రూపముగా మారుటలేదు అను ఈ రెండు విషయములు ఒకచోట సంభవము గాదు అనిన అట్లనుట సరిగాదు. ఏలనన బ్రహ్మము శబ్దప్రమాణగమ్యమే గాని ఇంద్రియ ప్రమాణగమ్యము గాదు. శబ్దప్రమాణమైన శ్రుతి ఆ బ్రహ్మమును నిరవయవము మరియు సంపూర్ణముగా జగద్రూపముగా పరిణామ భావము చెప్పుచున్నది. విరుద్ధార్థము శబ్దముద్వారా చెప్పలేదనదవేమో అట్లనటయూ సరిగాదు. ఎందులకనగా అవిద్యద్వారా కల్పిత భేద విశేషము స్వీకరించబడినది. ఆ చైతన్య బ్రహ్మములో అవిద్యద్వారా కల్పిత నామరూప పరిమణామము సర్వ వ్యవహారములకు ఆధారము అయిననూ పారమార్థిక దృష్టిలో బ్రహ్మము సంపూర్ణ వ్యవహారాతీతము అనునది యుక్తిసంగతము. అసలు సత్యమేమనగా ఈ జగత్తు బ్రహ్మయొక్క వివర్తమేగాని పరిణామముగాదు. అందువల్ల బ్రహ్మ వాదములో ఏ విధమైన దోషము లేదు. వేదములలో చెప్పిన శబ్దప్రమాణముద్వారా బ్రహ్మము జగత్తునకు ఉపాదానకారణమనియూ మరియు కార్యజగత్తుకన్న బ్రహ్మయొక్క అస్తిత్వము (సత్తా) వేరుగా నున్నదని చెప్పిననూ దోషమేమియూలేదు.

ప్రపంచము బ్రహ్మ యొక్క వివర్తమని స్వీకరించిన స్వప్నప్రపంచమువలే ఈ జగత్తులో మాయికత్వముండుటవలన బ్రహ్మము ఉపాదానకారణమని చెప్పిననూ స్వప్న ద్రష్టవలే కృత్స్న ప్రసక్తి దోషము (నిరవయవ బ్రహ్మమునందు ఏకదేశ పరిణామము అసంభవముగాన సంపూర్ణపరిణామము పొందిన మూల ఉచ్ఛేద ప్రసంగము) రాదు అని చెప్పుటకు అగ్రిమ సూత్రము.

### 162. ఆత్మని చైవం విచిత్రాశ్చ హి. (2.1.28)

సూత్రార్థము:- "న తత్ర రథా న రథయోగాః" అనగా ' స్వప్నములో రథములుగాని గుఱ్ఱములు గాని లేవు' ఈ శ్రుతిలో స్వప్నద్రష్ట యొక్క ఒకే ఆత్మలో అనేక ప్రకారముల సృష్టి చెప్పబడినది. లోకములో ఒకే ఇంద్రజాలికునిలో వాని స్వరూపము నాశము కాకుండగనే ఏనుగు, గుఱ్ఱము మొదలుగాగల అనేక విచిత్ర వస్తువుల సృష్టి చూడబడుచున్నది, అదేవిధముగా ఒకే బ్రహ్మములో వివిధమైన సృష్టి కాగలదు.

ఒకే స్వప్న ద్రష్టయొక్క నిరవయవ ఆత్మలో దాని స్వరూపము నాశము కాకుండగనే అనేరకముల సృష్టి శ్రుతుల ద్వారా చెప్పబడినది. "న తత్ర రథాః న రథయోగా న పన్థానో భవన్త్యథ రథాన్ రథయోగాన్ పథః సృజతే" ఈ శ్రుత్యర్థము 'స్వప్నములో రథములు గుఱ్ఱములు మరియు మార్గము లేవు, గాని వాని సృష్టి జీవుడు స్వయముగా గావించు చున్నాడు'. లోకములో దేవతలు మరియు మాయావి మొదలగువారు వారి స్వరూపమును నాశనము గావింపకనే విచిత్రమైన ఏనుగు గుఱ్ఱము రథాదులు మొదలగువానిని సృష్టి గావించుచున్నారు. ఆలాగుననే ఒకే బ్రహ్మము తన స్వరూపముయొక్క హాని గావింకుండగనే వివిధ రకములైన సృష్టి చేయుచున్నాడని స్వీకరించిన విరోధము లేదు.

163. స్వపక్షదోషాచ్చ. (2.1.29)

సూత్రార్థము:- సాంఖ్యాది మతములలో గూడ ఈ దోషము వచ్చును, అందువల్ల మాపై ఈ దోషమునారోపించుట తగదు. "యశ్చోభయోః సమో దోషః" అను న్యాయముననుసరించిన రెండుపక్షములలోగల దోషమును ఒక పక్షములో చూపుట తగదు. రెండు పక్షములలోను దోషము సమానమైన మరియు వాని పరిహారముగూడ సమానమైన ఆ దోషమును ఒక పక్షములో చూపుట సరికాదు. ఈ న్యాయాను సారము నిరవయవము, వ్యాపకము, శబ్దాదిహీనమయిన ప్రధానము సావయవము, పరిఛిన్నము, శబ్దాదియుక్తమైన జగత్తునకు కారణమని చెప్పు సాంఖ్యుల పక్షములో గూడ కృత్స్న ప్రసక్తి మొదలుగాగల పూర్వోక్త దోషములు సమానమేగదా? మరియు సత్వ రజ తమోగుణములు ప్రధానావయవములని స్వీకరించిన దానిలో సావయవత్వము మరియు అనిత్యత్వమను దోషములు రానే వచ్చును. వైశేషికుల పరమాణువాదములో రెండు పరమాణువుల సంయోగమువలన ద్వయణుకాది (ద్వ్యణుక) క్రమములో సృష్టిని స్వీకరించిన ప్రత్యక్షమునకు విరోధము కలుగును. ఎందులకనగా సంయోగము అవ్యాప్యవృత్తి అనగా రెండు అణువుల సంయోగము ఏకదేశములోనుండునుగాని అంతట ఉండదు. అవ్యాప్యవృత్తిని స్వీకరించిన సావయవత్వ దోషముకలుగును గాని వారు పరమాణువును నిరవయవ మను చున్నారు కాదా? అందువలన అనాది అనిర్వచనీయమాయా శక్తి యోగము వలన నిరవయవ బ్రహ్మమునుండి సావయవ ప్రపంచము సృష్టి గావించబడుచున్నది. గాన బ్రహ్మము జగత్తునకు ఉపాదానకారణమని చెప్పిన బ్రహ్మ వాదములో ఏ దోషము లేదు. గాన బ్రహ్మ కారణవాదము యుక్తి సంగతము.

# 50. సర్వోపేతాధికరణము.

సంగతి:- క్రిందటి అధికరణములో బ్రహ్మలో విచిత్రమాయాశక్తియోగము గురించి చెప్పిరి దాని సమర్థనము ఈ అధికరణము ద్వారా చేసెదరు గాన ఈ రెండు అధికరణములకు విషయ-విషయీభావ సంగతి అనవలయును.
విషయము:- బ్రహ్మములో గల మాయాశక్తియుక్తత్వమును ఈ అధికరణములో విచారించిరి.
సంశయము:- నిరాకార బ్రహ్మమునాశ్రయించి మాయ ఉండగలదా? లేదా? అని సంశయము.
పూర్వపక్షము:- లోకములో అందరు ఇంద్రజాలికులు శరీరధారులై యుండుట కాన వచ్చు చున్నది. అందువల్ల అశరీరి అయిన బ్రహ్మములో మాయ ఉనికి తగదు.

సిద్ధాన్తము:- బాహ్య కరణములు (ఇంద్రియాదులు) లేకయే మాయ ద్వారా బ్రహ్మ జగత్కారణమని క్రిందటి అధికరణములో చెప్పితిమి. అలాగుననే శరీరము లేకున్నను మాయ ఉండగలదని శ్రుతులద్వారా సిద్ధము.

వైయాసికన్యాయమాలా:

113. నాశరీరస్య మాయాఽస్తి యది వాఽస్తి? న విద్యతే। యే హి మాయావినో లోకే తే సర్వేఽపి శరీరిణః॥

114. బాహ్యహేతుమృతే యద్వన్మాయయా కార్యకారితా । ఋతేఽపి దేహం మాయైవం బ్రహ్మణ్యస్తు ప్రమాణతః॥

శరీరరహితమైన బ్రహ్మములో మాయ కలదా? లేదా? లోకములో గల ఐంద్రజాలికులందరూ శరీరధారులే. గాన శరీరరహితమైన బ్రహ్మములో మాయ ఉండుట తగదు. ఈపూర్వపక్షి ప్రశ్నకు సిద్ధాన్తి సమాధానము. బాహ్య సాధనములు లేకుండగనే ఐంద్రజాలికుడు మాయ ద్వారా అనేక పదార్థములు నిర్మించును. "మాయినం తు మహేశ్వరమ్" అనగా 'పరబ్రహ్మ పరమాత్మ మాయశక్తియుక్తుడు' ఈ శ్రుతి ప్రమాణముద్వారా శరీరము లేకపోయిననూ బ్రహ్మములో మాయ ఉండగలదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

పూర్వపక్షి చెప్పునదేమనగా ఐంద్రజాలికుడు మొదలగువారిని శరీరధారులుగా లోకములో చూచు చున్నాము గాన శరీరరహితమైన బ్రహ్మములో మాయ ఉండుట యుక్తి సంగతముగాదు. దీనికి సిద్ధాన్తి ఇచ్చు సమాధానము. లోకములో గృహము నిర్మించు వానికతిరిక్తముగా మన్ను, కలప, ఇనుము, ఇటికలు మొదలుగాగల సాధనముల అపేక్ష గలదు. గాని ఐంద్రజాలికుడు ఏ సాధనములు లేకుండగనే గృహాదులను నిర్మించుట చూచుచున్నాము. లోకములో ఇంద్రజాలికునకు శరీరాపేక్షయుండిననూ బ్రహ్మములో మాయ సిద్ధి కొరకు శరీరము యొక్క అపేక్ష లేదు. ఐంద్రజాలికునకు బాహ్య వస్తువుల అపేక్ష లేకుండగనే గృహాదులు నిర్మించుట ప్రత్యక్షముగా చూచుచున్నామనదపేమో అలాగుననే బ్రహ్మములో శరీరాపేక్షలేకుండగనే మాయ ఉండగలదు. దానికి ఈ శ్రుతి ఉదాహరణముగూడ కలదు. "మాయినం తు మహేశ్వరమ్" 'పరమేశ్వరుడు మాయాశక్తితో కూడియున్నవాడు.

## 164. సర్వోపేతా చ తద్దర్శనాత్. (2.1.30)

సూత్రార్థము:- మరియు ఆ పరదేవత సర్వశక్తియుక్తము ఏలనన శ్రుతిలో "సర్వకర్మా సర్వకామః" అనగా 'ఆ పరమాత్మ సంపూర్ణ విశ్వమునకు కర్త మరియు వాని మనోరథములన్నియూ నిర్దోషములు' అనిరి గాన.

పరమాత్మలో మాయా శక్తియోగాభావము వలన విచిత్ర ప్రపంచము ఉత్పన్నముగావింపజాలడు. గాన సమన్వయమసిద్ధమనును పూర్వవాది. సిద్ధాన్తి చెప్పిన శక్తి యోగముండుటవలన సమన్వయము సిద్ధమనును. 'అశరీరస్య న మాయా' అను న్యాయముద్వారా 'శరీరము లేని వానికి మాయ ఉండదు' అను న్యాయమును అనుసరించి మాయ శకిత్తో గూడిన పరమేశ్వరుడు సృష్టిగావించునని చెప్పు వేదాన్తములో సమన్వయము సిద్ధమా అసిద్ధమా? అనుప్రశ్నకు పూర్వవాది సమన్వయము అసిద్ధమనును. సిద్ధాన్తములో చెప్పినదేమనగా పరమేశ్వరునియందు అన్ని శక్తులుగలవని స్వీకరించవలయును. ఎందులకనగా "సర్వకర్మా సర్వకామః సర్వగన్ధః సర్వరసః సర్వమిదమభ్యాత్తోఽవాక్యనాదరః" అనగా 'ఈ సంపూర్ణ విశ్వము ఎవనికి కర్మయో, ఎవని మనోరథములు నిర్దోషములో, అన్ని రకముల గంధములు ఎవనికి ప్రీతికరములో, ఎవనికి అన్నిరసములు సుఖకరములో, ఎవడు సంపూర్ణజగత్తును వ్యాపించి యున్నాడో, వాగింద్రియ రహితుడో మరియు నిష్కాముడో" (ఛాం.3.14.4) ఈ

ఛాందోగ్య శ్రుతి ద్వారా శరీరేంద్రియ రహితుడైనను ఆ పరమేశ్వరునిలో సర్వ శక్తులు గలవని వినబడుచున్నది. అంతేగాక "ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచన్ద్రమసౌ విధృతౌ తిష్ఠతః" (బృ.3.8.9) అనగా 'హే గార్గి, ఈ నాశరహిత బ్రహ్మయొక్క ఆజ్ఞద్వారా సూర్యుడు మరియు చంద్రుడు ధరింపబడియున్నాడు'. ఈ శ్రుతి గూడ పరమేశ్వరును యందు సర్వశక్తులు గలవని చెప్పుచున్నది. గాన సమన్వయము సిద్ధము.

165. వికారణత్వాన్నేతి చేత్తదుక్తమ్. (2.1.31)

సూత్రార్థము:- "అచక్షుష్కమశ్రోత్రమవాగమనః" ఈ శ్రుతిలో 'ఆపరమేశ్వరుడు నేత్ర రహితుడు, కర్ణరహితుడు, వాణీ-రహితుడు మరియు మనోరహితుడు" (బృ.3.9.8) అని చెప్పిరిగాన బ్రహ్మ సృష్టికర్త గాజాలడు అనెదవేమో దాని సమాధానము వినుము. 'దేవాదివదపి లోకే' అని క్రిందటి సూత్రములో సమాధానమీయబడినది.

సంపూర్ణ శక్తిగల దేవాదులు స్థూల సూక్ష్మశరీరములతో గూడినవారై ఆయా కార్యముల సామర్థ్యము కలిగి యున్నారని తెలియు చున్నది గాని ఆపరమేశ్వరునిలో చక్షువులు శ్రోత్రములు వాణి మరియు మనస్సు లేదని బృహదారణ్యక శ్రుతి చెప్పుచున్నది. అటివంటి బ్రహ్మములో జగత్కర్తృత్వము సంభవముగాదు. ఈపూర్వపక్షి ప్రశ్నకు సమాధానము ఇదివరకే "న విలక్షణత్వాత్" మరియు "దేవదివదపి లోకే" అను సూత్రములద్వారా ఈయబడినది. ఈబ్రహ్మమును ఏకమాత్రము శ్రుతులద్వారానే తెలిసికొనగలము అది తర్కాగమ్యము అనగా తర్కము ద్వారా దానిని గ్రహించలేము. సర్వవిశేషరహితమైన బ్రహ్మములో సర్వశక్తియోగము ఎట్లు సంభవమనదవేమో? అట్లనుట సరిగాదు. ఎందులకనగా అవిద్యద్వారా కల్పిత బేధము శ్రుతులలో చెప్పబడినది గాన విరోధములేదు. "అపాణిపాదో జవనో గ్రహీతా పశ్యత్యచక్షుః స శ్రుణోత్యకర్ణః" 'అపరమేశ్వరునికి చేతులు లేకపోయిననూ సర్వగ్రాహీ, పాదములు లేకపోయిననూ దూరగామి, కన్నులు లేకపోయిననూ సర్వద్రష్ట, కర్ణములు లేకపోయిననూ వినగలడు' (శ్వే.3.19) ఈ శ్రుతిలో ఇంద్రియ రహితుడైన పరబ్రహ్మ మాయ ద్వారాకల్పిత శక్తివలన సర్వ సమర్థుడు.

# 51. న ప్రయోజనత్వాధికరణము.

సంగతి:- క్రిందటి అధికరణములో శ్రుతుల ఆధారముపై సర్వశక్తివిశిష్టమైన పరమేశ్వరుని జగత్కర్తయనునది సిద్ధమైనది. ఇపుడు దానిపై అక్షేపించగా దానికి సమాధానము చెప్పెదరు. గాన పూర్వాధికరణముతో దీనికి ఆక్షేపసంగతి.

విషయము:- పూర్ణకాముడై తృప్తి పొందిన పరమేశ్వరుని జగత్స్రష్టగా స్వీకరించిన సమన్వయవిరోధము అను విషయము ఇచట విచారణీయము.

సంశయము:- ఆప్తకాముడైన పరమేశ్వరుడు జగత్తును సృష్టింగలడా? లేడా? అని సంశయము.

పూర్వపక్షము:- ఫలాకాంక్షకలిగిన బ్రహ్మ అతృప్తుడని స్వీకరించవలసి వచ్చును మరియు సృష్టి రచనేచ్ఛ కలిగి జగత్కర్త అనిన వాని ప్రవృత్తి ఉన్మత్త పురుషునితో సమమగును. అందువల్ల ఆప్తకాముడైన బ్రహ్మమును జగత్కర్తగా స్వీకరించుట సరిగాదు.

సిద్ధాన్తము:- ఏ ఉద్దేశ్యము లేకుండగనే సర్వసమృద్ధికలిగి నిశ్చింతులైన ప్రభువులు కేవలము విలాసార్థము అనేక

కార్యముల నాచరించుట లోకములో ప్రత్యక్ష సిద్ధము. అందువల్ల ఆప్తకాముడైన పరమేశ్వరుడుగూడ ఏ ప్రయోజనము లేకయో లీలామాత్రముగా జగత్తు యొక్క రచనారూప ప్రవృత్తి గలవాడగును, దీనిలో ఏ ఆక్షేపములేదు.

వైయాసికన్యాయమాలా:-
115. తృప్తోఽస్రష్టాఽథవా స్రష్టా? న స్రష్టా, ఫలవాఞ్ఛనే। అతృప్తః స్యాదవాఞ్ఛాయామున్మత్తనరతుల్యతా॥
116. లీలాశ్వాసవృథాచేష్టా అనుద్దిశ్య ఫలం యతః। అనున్మత్తైర్విరచ్యన్తే తస్మాత్తృప్తస్తథా సృజ్యతే॥
నిత్యతృప్త బ్రహ్మ సృష్టికర్తయా గాదా? బ్రహ్మ సృష్టికర్త గాడు, ఎందులకనగా ఫలమునకు ఇచ్ఛయున్న "పరమేశ్వరుడు నిత్యతృప్తుడు" అని చెప్పు శ్రుతులకు విరోధముకలుగును. ఫలాకాంక్ష లేదనిన వానిలో ఉన్మత్త నరతుల్యత (పిచ్చివాని సమమను దోషము) వచ్చును. సిద్ధాన్తి జవాబు. ఏ విధముగా లోకములో లీలకై కొన్ని చేష్టలు చేయుట మరియు శ్వాసప్రశ్వాసాది చేష్టలు ఫలాకాంక్ష లేకయే వివేకవంతులు చేయుట చూడబడు చున్నది. ఆవిధముగనే నిత్యతృప్తుడైన పరమేశ్వరుడు ఫలేచ్ఛా రహితుడై సృష్టి గావించుచున్నాడు.
భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-
"ఆనన్దో బ్రహ్మ" 'బ్రహ్మ ఆనన్ద స్వరూపుడు' అను శ్రుతి మరియు యుక్తుల ద్వారా పరమేశ్వరుడు నిత్యతృప్తుడు అనిరి. ఆ నిత్యతృప్తుడైన పరమేశ్వరునియందు సృష్టి విషయమైన ఇచ్ఛను స్వీకరించిన నిత్యతృప్తిని చెప్పు శ్రుతులకు విరోధము వచ్చును. ఆ పరమేశ్వరునిలో ఏ విధమైన కోరిక లేదనిన అబుద్ధిపూర్వక సృష్టి పిచ్చివాని వలే చేయుచున్నాడనవలయును, అందువలన సమన్వయ విరోధము కలుగునని పూర్వపక్షి ప్రశ్న. దానికి సిద్ధాన్తి జవాబు. ఏ విధముగా వివేకవంతులైన రాజాదులందు ప్రయోజనము లేకయే స్వేచ్ఛగా (ఊరకనే) క్రీడార్థము వేట జూదమాడుట మొదలగు ప్రవృత్తి లోకములో చూడబడు చున్నది. బాలకులలో వ్యర్థ చేష్టలు అధికముగా చూబడుచున్నవి. శ్వాస-ప్రశ్వాసలు ఏ బాహ్య ప్రయోజనము లేకయో స్వాభవికముగా జరుగుచున్నవి. ఆవిధముగనే నిత్యతృప్తుడైన పరమేశ్వరుడు ఏ ప్రయోజనము లేకుండగనే వివేకముతో సకల జగత్తు యొక్క సృష్టి గావించుచున్నాడు.

166. న ప్రయోజనవత్త్వాత్. (2.1.32)

సూత్రార్థము:- బ్రహ్మము జగత్తును సృష్టించుట సంభవముకాదు, ఏలనన బ్రహ్మము నిత్య తృప్తము గాన ప్రయోజనాపేక్షలేదు. వివేకుల ప్రవృత్తి ప్రయోజనముతో కూడినదై యుండును. గాన బ్రహ్మద్వారా జగత్ సృష్టిని ప్రతిపాదించు వేదాన్తములో సమన్వయమునకు విరోధము కలుగు చున్నది.
మందబుద్ధిగల వ్యక్తి గూడ ప్రయోజనము లేకున్న ఏ కార్యమునందునూ ప్రవృత్తి గాడు. ఈ నియమానుసారము ఆత్మకాముడు సర్వజ్ఞుడైన బ్రహ్మము నుండి జగత్తు యొక్క సృష్టిని స్వీకరించిన పూర్వము నందు జెప్పిన సమన్వయమునకు విరోధము వచ్చునా రాదా? ఇది సంశయము. దీనికి పూర్వపక్షి చెప్పునదేమనగా బ్రహ్మము-నందు జగత్ కర్తృత్వము సంభవము గాదు ఎందులకనగా లోకములో బుద్ధిమంతుల పవృత్తి ప్రయోజనము నుద్దేసించియే నుండును. విచారశీలుడైన వ్యక్తియందు నిష్ప్రయోజన ప్రవృత్తి గానరాదు. నిత్య ఆప్తకాముడైన పరమేశ్వరునియందు ప్రపంచమును సృష్టి గావించుటలో ఏ ప్రయోజనములేదు. లోకములో చిన్న చిన్న

కార్యములు గూడ ఆత్మప్రయోజనము లేకుండగనూ స్వార్థము లేకుండగనూ చేయువారులేరు. ఆ స్థితిలో బహుప్రయాససాధ్యమైన ప్రపంచరచనా కార్యము పరమేశ్వరుడు నిష్ప్రయోజనముగా నెట్లు చేయును? అంతేగాక పరమేశ్వరునిలో స్వప్రయోజనము యొక్క కల్పనగూడ జేయలేము, ఏలనన ఆతడు నిత్యాప్తకాముడని శ్రుతిలో చెప్పిరిగాన. అందువలన చైతన్యమయిన బ్రహ్మమునుండి సృష్టిని జెప్పిన సమన్వయ విరోధము తప్పక కలుగును. ఈ పూర్వపక్షమునకు సమాధానము అగ్రిమ సూత్రముద్వారా చెప్పుచున్నారు.

167. లోకవత్తు లీలాకైవల్యమ్. (2.1.33)

సూత్రార్థము:- లోకములో రాజు మరియు అమాత్యాదులు విశేషఫలాకాంక్ష లేకున్ననూ వేట, జూదము మొదలగు క్రీడలలో వారి ప్రవృత్తి గాన వచ్చుచున్నది. మరియు శ్వాస ప్రశ్వాసలు స్వాభావికముగనే జరుగుచున్నవి. అలాగుననే బ్రహ్మము యొక్క విచిత్రకార్యరచన లీలామాత్రము. దానికి ఫలితము లేదు గాన సమన్వయమునకు విరోధము గాదు.

సూత్రములోని 'తు' శబ్దము పూర్వపక్షమును ఖండించుటకు. లోకములో ఆప్తకాములైన రాజులాంటివారు లేక అమాత్యదులు (లీలకొరకు) కేవలము విలాసార్థము మాత్రమే ఏప్రయోజనము లేకయే వేట జూదము మొదలగు వాని యందు ప్రవృత్తి కలిగియున్నారు. శ్వాస నిశ్వాసాది ప్రవృత్తిబాహ్య ప్రయోజనము లేకయో స్వాభావికముగా జరుగుచున్నది.

ఆలాగుననే విచిత్ర జగత్కార్యము ప్రయోజనము లేకయే బ్రహ్మము లీలగా గావించుచున్నది. జనులకు ఈ జగత్రచనారూపకార్యము బహుప్రయాససాధ్యమని తోచిననూ పరమేశ్వరునికి కేవలము లీలామాత్రము. గాని లోకములో లీలయందు గూడ కొంచెము సూక్ష్మప్రయోజనము గానవచ్చిననూ పరమేశ్వరునియందు ఆ సూక్ష్మప్రయోజనము గూడ కానరాదు ఎందులకనగా శ్రుతి వానిని పూర్ణకాముడని చెప్పుచున్నది. సృష్టిని ప్రతిపాదించు శ్రుతులు అవిద్యద్వారాకల్పిత నామరూపాత్మక వ్యావహారికజగత్తును గురించి చెప్పుచున్నవే గాని సృష్టిశ్రుతి పారమార్థకవిషయిణీ కాదు, ఈమాటను ఎన్నడూ మరువరాదు. అంతేగాక స్వప్న సృష్టివలే ఈ సృష్టి మాయామాత్రము మరియు బ్రహ్మాత్మభావన ప్రతిపాదనకొరకు.

# 52. వైషమ్యనైర్ఘృణ్యాధికరణము.

సంగతి:- క్రిందటి అధికరణముద్వారా మాయాశక్తితోకూడిన బ్రహ్మము లీలగా సృష్టి గావించునని చెప్పిరి.

విషయము:- నిర్దోషబ్రహ్మముద్వారా జగత్సృష్టిని చెప్పు సమన్వయము ఈ అధికరణమునకు విచారణీయ విషయము.

సంశయము:- సర్వసముడగు పరమేశ్వరునినుండి జగత్సృష్టిని స్వీకరించిన వానిలో వైషమ్యదోషము వచ్చునా, రాదా?

పూర్వపక్షము:- అన్ని ప్రాణులకు సుఖ-దుఃఖములు విధించు ఈశ్వరునియందు వైషమ్యదోషము వచ్చును. అంతేగాక జీవుల దుఃఖములను విధించుట అన్నిప్రాణులను సంహరించుట మొదలుగాగల దుఃఖకార్యములు చేయుటవలన ఆ ఈశ్వరునిలో నైర్ఘృణ్యదోషము గూడ వచ్చును, గాన సమన్వయమునకు విరోధము కలదు.

సిద్ధాన్తము:- సృజింపబోవు ప్రాణుల ధర్మాధర్మముల నపేక్షించియే పరమేశ్వరుడు జగత్తుయొక్క సృష్టి స్థితి సంహారములందు ప్రవృత్తుడగు చున్నాడు. గాన వానిలో వైషమ్య-నైర్ఘృణ్యదోషములు లేవు అంతేగాక సంసారము ప్రవాహరూపముగా నున్నది దీనికి ప్రమాణముగా శ్రుతి స్మృతులు విద్యమానములైయున్నవి.

వైయాసికన్యాయమాలా:-

117. వైషమ్యాద్యాపతేన్నో వా? సుఖదుఃఖే నృభేదతః। సృజన్విషమ ఈశః స్యాన్నిర్ఘృణశ్చోపసంహరన్॥

118. ప్రాణ్యనుష్ఠితధర్మాదిమపేక్ష్యేశః ప్రవర్తతే। నాతో వైషమ్యనైర్ఘృణ్యే సంసారస్తు న చాఽఽదిమాన్॥

బ్రహ్మములో వైషమ్యాది దోషములు సంభవమా, కాదా? మనుష్యాదుల భేధముననుసరించి సుఖ-దుఃఖాదుల సృష్టినిజేయు ఈశ్వరునియందు విషమత గలదు మరియు అందరిని సంహరించుటవలన వానిలో నైర్ఘృణ్యమూ గలదు. దీనికి సిద్ధాన్తి జవాబు. ప్రాణులద్వారా అనుష్ఠింపబడిన ధర్మాదుల నపేక్షించి ఈశ్వరునిలో ప్రవృత్తి గానబడుచున్నది. అందువల్ల వానిలో వైషమ్య-నైర్ఘృణ్య దోషములు లేవు అంతేగాక సంసారము అనాది.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఈశ్వరుడు ఇంద్రాది దేవతలను మహాభాగ్యసంపన్నులూ మరియు సుఖవంతులుగానూ, పశువులు మొదలగువానిని అత్యన్త దుఃఖవంతములగనూ, మనుష్యులను సుఖ-దుఃఖ సామాన్యవంతులగనూ సృష్టించుచున్నాడు. ఈ విధముగా ప్రాణులలో తారతమ్యములను సుఖ-దుఃఖములను సృజించు ఈశ్వరునియందు విషమత ఏలరాదు అంతేగాక నీచులకుగూడ అత్యన్త జుగుప్సితమును గొల్పు దేవ మనుష్య పశ్వాదుల సంపూర్ణ జగత్సంహారము జేయువానియందు నైర్ఘృణ్యదోషము ఏలరాదు? ఆ ఈశ్వరునియందు వైషమ్య-నైర్ఘృణ్యదోషములున్నవని పూర్వపక్షి కథనము. దానికి సిద్ధాన్తి సమాధానము.

ఈశ్వరునియందు వైశమ్య దోషములేదు ఎందులకనగా ప్రాణుల ఉత్తమ, మధ్యమ, అధమరూపమైన కర్మయే ఈవైశమ్యమునకు కారణము. అందువల్ల ఈశ్వరుని స్వతంత్రత నష్టము కాదు ఏలనన ఆతడు అంతర్యామి అగుటవలన కేవలము కర్మాధ్యక్షుడు మాత్రమే. ఈశ్వరుని యందు వైశమ్యమును స్వీకరించిన 'ఘట్టకుటీ ప్రభాత న్యాయము' ( పన్ను చెల్లించకుండుటకు రాత్రి అంతయు అడవిలో తిరిగి ప్రాతఃకాలమున పన్నుచెల్లించు ప్రదేశమునే చేరుట) వచ్చును. ఏలనన ఈశ్వరునిలో వైశమ్యమును తొలగించుటకు వానిని కర్మముల వైశమ్య కారకుడని చెప్పి మరల వాని స్వతంత్రతకై కర్మ నియామకుడని చెప్పిన ఈశ్వరునియందే వైశమ్య దోషము వచ్చునుగదా అనిన ఇది దోషముకాదు. నియామకమనిన ఆయా వస్తువుల శక్తుల అవ్యస్థతను పరిహరించుట మాత్రమే. శక్తులు మాయ యొక్కశరీరభూతములే గాని వానిని ఈశ్వరుడు ఉత్పత్తి చేయలేదు. వాని వాని శక్తుల ద్వారా కర్మములో వైశమ్యము వచ్చిననూ వాని వ్యవస్థాపకునిలో వైశమ్య ప్రసంగము రాదు. సంహారము సుషుప్తివలే దుఃఖ కారణముగాదు కాని దానికి విపరీతముగా అన్ని క్లేశములను నివారించుటవలన ఈశ్వరుడు దయాలుడు. అవాన్తర సృష్టిలో పూర్వపూర్వ కర్మల అపేక్షనుంచి సృష్టిచేయుటవలన వైశమ్యము రాకపోయిననూ ప్రథమ సృష్టిలో పూర్వకర్మ సంభవములేనందున వైశమ్య దోషము ఉండనే ఉన్నదనిన అట్లనుట సరికాదు ఎందులకనగా సృష్టి పరంపర అనాది గాన. దీనికి ప్రమాణము "నాన్తో న చాదిః" 'ఈ సృష్టికి అది అన్తములు లేవు'. అను స్మృతి. గాన ఈశ్వరునిలో ఏ దొషములేదు.

168. వైషమ్యనేర్ఘృణ్యే న సాపేక్షత్వాత్తథాహి దర్శయతి. (2.1.34)

సూత్రార్థము:- బ్రహ్మమునందు విషమతా మరియు నిర్దయత్వమను దోషములు లేవు. ఏలనన వారి వారి కర్మములనపేక్షించి కొందరిని దుఃఖితులగాను కొందరిని సుఖ-దుఃఖమిశ్రితులగాను కొందరిని అతి సుఖవంతులుగాను చేయుచున్నాడు. బ్రహ్మము కర్మలకనుసారము సుఖ దుఃఖములిచ్చు చున్నాడనుటకు శ్రుతి ప్రమాణము. "ఏషహ్యేవ సాధు కర్మ కారయతి" అనగా 'ఈతడే సాధు కర్మలు చేయించుచున్నాడు'.

జీవుల కర్మ సాపేక్షికముగా సృష్టిగావించుచున్నాడా పరమేశ్వరుడు? లేక కర్మల అపేక్ష లేకయే సృష్టి చేయుచున్నాడా? ప్రథమ పక్షములో జీవుల కర్మానుసారము సృష్టించుచున్నాడనిన సృష్టి కర్తలో అనీశ్వరత్వ ప్రసంగము వచ్చును. ద్వితీయ పక్షములో విషమతా మరియు క్రూరతా (నిర్ఘృణతా) దోషములు వచ్చును. దీనిసే స్పష్టము చేయు చున్నాడు పూర్వవాది. బ్రహ్మము ప్రాణుల కర్మాపేక్షలేకుండగనే కొంతమంది దేవతలను అత్యన్త సుఖవంతులగను, కొన్ని జంతువులను దుఃఖము గలవానిగను, కొంతమంది మనుష్యులను మధ్యమ భోగముగలవారిగను సృష్టించుచున్నాడు. ఇదియే బ్రహ్మమునందు గల విషమతా. అకారణముగా దుఃఖితులను జేయుట మరియు అందరు ప్రజలను ప్రళయ కాలములో ఉపసంహరించుట. ఈసంహారము దుష్టజనుల ద్వారాగూడ నిన్దితము. అట్టి నిన్దితకర్మలు చేయు పరమేశ్వరునిలో నిర్ఘృణతా దోషము వచ్చును. చెప్పిన రీతిగా పరమేశ్వరునిలో దోషము వచ్చుటవలన నిర్దుష్టబ్రహ్మమును జగత్కర్తగా చెప్పుట సరిగాదు. ఈవిధముగా చెప్పిన పూర్వపక్షికి సిద్ధాన్తి సమాధానము. ఈశ్వరుని యందు విషమతా మరియు నిర్ఘృణతా దోషములు లేవు ఎందులకనగా ప్రాణుల ధర్మాధర్మములనపేక్షించి పరమేశ్వరుడు జగత్తును సృష్టించు చున్నాడు. ఏవిధముగా యవాది ధాన్యములు మరియు ఔషధుల ఉత్పత్తికి మేఘమునుండి వచ్చు వర్షమును సాధారణ కారణము మరియు ఆయాధాన్యపు విత్తనములలోగల అసాధారణ సామర్థ్యమే విషమతకు కారణము. ఆ విధముగనే దేవతలు మరియు మనుష్యుల సృష్టిలో ఈశ్వరుడు సాధారణకారణము మరియు వారిలోనున్న అసాధారణకర్మయే వారి వారి విషమతకు కారణము. అందువల్ల జగత్ కర్త పరమేశ్వరునియందు వైషమ్య-నైర్ఘృణ్య దోషము లేదు.

జీవుల మరియు దేవతల కర్మ సాపేక్షననుసరించి ఈశ్వరుడు సృష్టి గావించుచున్నాడనిన వానిలో అనీశ్వరత్వము వచ్చును గదా అనిన అట్లనుట సరిగాదు. భృత్యాదులు చేయు సేవనపేక్షించి విషమ ఫలమునిచ్చు రాజులో రాజత్వము చూడబడు చున్నది. అలాగుననే ఈశ్వరునియందు అనీశ్వరత్వము రాదు. ప్రాణుల కర్మ సాపేక్షముననుసరించి జగత్తును సృష్టిచేయుచున్నాడని చెప్పిననూ వానిలో అనీశ్వరత్వము రాదు. ప్రాణుల కర్మ సాపేక్షమువలన పరమేశ్వరుడు విషమ సృష్టి చేయుచున్నాడని మీరు ఎట్లు భావించిరి? ఈ ప్రశ్నకు సమాధానము సూత్రములోనున్న "తథా హి దర్శయతి" అను శబ్దములద్వారా ఇచ్చుచున్నారు. "ఏష హ్యేవ సాధు కర్మ కారయతి తం, యమేభ్యో లోకేభ్యః ఉన్నినీయతే ఏష ఉ ఏవాసాధు కర్మ కారయతి తం యమధోనినీషతే" అనగా ' ఎవరిని ఈ లోకములో ఉత్తమగతికి తీసుకొని వెళ్ళవలయునో వారిచే ఈశ్వరుడు సాధు కర్మలు చేయించును, ఎవరిని అధో-గతికి తీసుకొని వెళ్ళవలయునో వారిచే అసాధు కర్మలు చేయించును' (కౌ.బ్రా.3.8.) "పుణ్యో వై పుణ్యేన కర్మణా భవతి పాపః పాపేన" అనగా ' పుణ్యకర్మలద్వారా పుణ్యశాలి మరియు పాపకర్మద్వారా పాపి అగుచున్నాడు' (బృ.3.2.13) అని శ్రుతిలో చూపి ఇపుడు స్మృతిలో చూపుచున్నారు సమాధానము. "యే యథా మాం ప్రపద్యతే తాం స్తథైవ భజామ్యహమ్" అనగా ' ఓ అర్జునా! ఎవ్వ డెవ్వడు నన్ను ఎట్లెట్లు సేవించునో వానివానికి అట్లట్లే ప్రతి-ఫలము నొసంగుదును' (గీ.4.11) అని.

## 169. న కర్మావిభాగాదితి చేన్నానాదిత్వాత్. (2.1.35)

సూత్రార్థము:- "సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్" అనగా 'హే సోమ్య! సృష్టికి పూర్వము ఈ జగత్తు ఒకే అద్వితీయ సత్స్వరూపమై యుండెను' (ఛాం.6.2.1) అను శ్రుతులలో సృష్టికి ముందు భిన్నత్వము యొక్క అభావము చెప్పిరి. ఆసమయములో కర్మ లేదు గాన కర్మాపేక్ష ద్వారా విషమ సృష్టి అని చెప్పుట అసంగతమని చెప్పుట తగదు ఏలనన సంసారము అనాది అగుటవలన సృష్టి మరియు కర్మ బీజాంకురములవలే సమాన కార్య కారణ భావములు గలవి. అందువల్ల కర్మాపేక్షద్వారా సృష్టి విషమమని సిద్ధమగుచున్నది.
'హే సౌమ్యుడా! సృష్టికి ముందు ఈ నామరూపాత్మక జగత్తు ఒకే అద్వితీయ సద్ రూపముగా నుండెను'. ఇత్యాది శ్రుతులద్వారా సృష్టి బ్రహ్మతో అవిభాగముగా నుండెనని నిశ్చయమగు చున్నది. ఆ సమయములో దేని అపేక్షతో విషమ సృష్టి చెప్పటకు వీలుకలుగనో ఆ ప్రాణుల కర్మ ఏదియూ లేకుండెను. అందువల్ల బ్రహ్మ జగత్తుల విభాగమునకు పూర్వము విచిత్రతకు నిమిత్తమగు ప్రాణుల కర్మాభావము తుల్యమేగదా అని చెప్పుటకు వీలు లేదు ఎందులకనగా సంసారము అనాది. గాన బీజాంకురములవలే కర్మయు సంసారంబును అనాదులై పరస్పరకారణములై యున్నవి. పూర్వకల్పాంతమున నాచరింపబడి జీవులతోగూడ పరమేశ్వరుని యందు ప్రళయకాలములో సూక్ష్మావస్థలో నడగి యున్న కర్మలు ఉత్తరకల్ప సృష్టికి కారణములగుచున్నవి. గాన హేతుహేతమద్భావము ద్వారా కర్మమును అన్ని విషమ ప్రకృతులకు కారణముగా స్వీకరించిన విశేష విరోధముండదు. ఈ సంసారము అనాది అని ఎట్లు తెలిసికొనగలము? దీనికి ముందు సూత్రముద్వారా సమాధానము చెప్పిరి.

## 170. ఉపపద్యతే చాప్యుపలభ్యతే చ. (2.1.36)

సూత్రార్థము:- సంసారము అనాది యనునది యుక్తిసంగతము. సృష్టిని అనాదియని స్వీకరించక అకస్మాత్తుగా సృష్టిజరిగెనని చెప్పిన ముక్తపురుషుల పునర్జన్మ కలుగవలసి వచ్చును మరియు పూర్వసృష్టితో సాదృష్యముండదు. శ్రుతులలో మరియు స్మృతులలో సంసారము అనాది అని వినిపించుచున్నది. "ధాతా యథాపూర్వమకల్పయత్" 'అనగా బ్రహ్మ పూర్వానుసారమే జగత్తుని సృష్టించెను'. అని శ్రుతిలో చెప్పిరి. స్మృతిలో "న రూపమస్యేహ తథోపలభ్యతే నాన్తో న చాదిర్న చ సమ్ప్రతిష్ఠా" అనగా 'ఈ కల్పిత జగత్తుయొక్క పారమార్థిక అధిష్ఠాన బ్రహ్మమును ప్రాకృత పురుషుడు ఘట పటాదులవలే చూడలేడు. ఈ జగత్తునకు ఆది అన్త మధ్యములు లేవు' అని చెప్పిరి.

సంసారమనాది యని స్వీకరించుట యుక్తిసంగతమే, లేనిచో సంసారము యొక్క ఉత్పత్తి అకస్మాత్తుగా వచ్చెనని స్వీకరించవలయును, అట్లు స్వీకరించిన ముక్తపురుషుల పునర్జన్మ ప్రసంగము వచ్చును. మరియు అకృతాభ్యాగమ దోషము గూడ వచ్చును. అకస్మాత్తుగా సృష్టిని స్వీకరించిన దానిలో జీవులు పుణ్య-పాప కర్మములు చేయకనే సుఖ-దుఃఖములు అనుభవించవలసి వచ్చును దీనినే అకృతాభ్యాగమ దోషమందురు. ఈశ్వరుని లేక కేవలము అవిద్యను సుఖ-దుఃఖాదుల వైషమ్య కారణమని చెప్పుట అసంగతము ఏలనన ఈ రెంటిలో అనగా (అవిద్యేశ్వరులలో) వైషమ్యము లేదు. శ్రుతి స్మృతులలో సంసారము అనాది అని చెప్పబడినది. 'పరమేశ్వరుడు చంద్ర సూర్యాదులను పూర్వకల్ప సదృశ్యముగా సృష్టించెను' ఈ శ్రుతి ద్వారా పూర్వకల్పము

యొక్క సద్ భావము గూడ చెప్పిరి. 'సంసారము యొక్క స్వరూపము ఇచట కనిపించు చున్న రీతిగా లేదు దీని ఆది అన్త మధ్యములు లేవు'. గాన శ్రుతి స్మృతులలో సంసారము యొక్క అనాదిత్వము ఉపలబ్ధమగు చున్నది. అతీత అనాగత కల్పములో సంసారముయొక్క పరిణామము లేదని అనగా అనాదియని పురాణేతిహాసములలో గూడ ప్రతిష్ఠాపితము గావించిరి.

# 53. సర్వధర్మోపపత్త్యధికరణము.

సంగతి:- పూర్వాధికరణములో జగత్తుయొక్క నిమిత్తకారణము బ్రహ్మమని సిద్ధిగావించిరి. గాని బ్రహ్మములో ఉపాదానత్వప్రయోజక గుణములు లేవుగాన బ్రహ్మము నిర్గుణముగాన జగత్తునకు ఉపాదానకారణము గాజాలదు. ఈ విధమగు ప్రత్యుదహరణ సంగతి వల్ల ఈ అధికరణము మొదలిడిరి.
విషయము:- బ్రహ్మమునందు జగత్తుయొక్క ఉపాదానకారణత్వము గుఱించి ఈ అధికరణములో విచారింతురు.
సంశయము:- నిర్గుణ బ్రహ్మము జగదుపాదాన కారణమగుట సంభవమా గాదా?
పూర్వపక్షము:- సగుణములగు మృదాదులందు మాత్రమే ఉపాదానత్వము లోకములో జూడబడు చున్నది.
సిద్ధాన్తము:- జగత్కారణత్వమునకు గావలసిన సర్వజ్ఞత్వాది కారణధర్మములు బ్రహ్మములో నున్నవి. అందువల్ల నిర్గుణ బ్రహ్మమే సంపూర్ణ జగత్తునకు ఉపాదానకారణము, గాని ఆ బ్రహ్మము వివర్త ఉపాదానకారణమేగాని పరిణామి ఉపాదానకారణముగాదు.
వైయాసికన్యాయమాలా:-
119. నాస్తి ప్రకృతికా యద్వా నిర్గుణస్యాస్తి నాస్తి సా। మృదాదేః సగుణస్యైవ ప్రకృతిత్వోపలమ్భనాత్॥
120. భ్రమాధిష్ఠానతాఽస్మాభిః ప్రకృతిత్వముపేయతే। నిర్గుణేఽప్యస్తి జాత్యాదౌ సా బ్రహ్మ ప్రకృతితః॥
నిర్గుణ బ్రహ్మము జగత్తుయొక్క ఉపాదానకారణ మగునా? కాదా? ఈ సంశయమునకు పూర్వపక్షి చెప్పునది ఏమనగా లోకములో మృత్తికాదులు సగుణమైలైయున్నవి అవియే ఉపదానకారణములుగా చూడబడు చున్నవి. అందువలన నిర్గుణ బ్రహ్మము ఉపాదానకారణము గాజాలదు. దానికి సిద్ధాన్తి చెప్పు జవాబు. అద్వైత వేదాన్తులమగు మేము భ్రమాధిష్ఠానమునకు ప్రకృతి అనెదము. నిర్గుణ జాత్యాదులు గూడ పకృతియే గాన బ్రహ్మము ప్రకృతి కాగలదు.
భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-
పూర్వపక్షి చెప్పునదేమనగా కార్య రూపముగా పరిణత చెందు వికృతి వస్తువును పకృతి అందురు. లోకములో సగుణాదులైన మృత్తికాదులే ప్రకృతిగా కానవచ్చు చున్నవి గాన నిర్గుణ బ్రహ్మము ప్రకృతి కాజాలదు. దీనికి సిద్ధాన్తి ఇచ్చు జవాబు. "ప్రక్రియతే విక్రియతేఽనయేతి ప్రకృతిః" అనగా ఈ వ్యుత్పత్తి ద్వారా 'కార్య రూపములో పరిణతచెందు వస్తువును ప్రకృతి అందురు'. అయినప్పటికిన్నీ పరిణామము చెందుట రెండు ప్రకారములుగా సంభవము. పాలు పెరుగుగా మారుట ఒక పరిణామము. త్రాడు మొదలగునవి పాము మొదలగువానిగా మారు భ్రమకు అధిష్ఠానములగుట రెండవ పరిణామము. నిర్గుణ బ్రహ్మము పరిణామి గాకపోయిననూ భ్రమకు అధిష్ఠానము కాగలదు. నిర్గుణములగు జాత్యదులలో భ్రమాద్ధిష్ఠానము చూడబడు చున్నది. ఏలాగుననగా మలిన

బ్రాహ్మణుని చూచి 'ఈతడు శూద్రుడు' అను భ్రమ కలుగు చున్నది. అందుచే నిర్గుణ బ్రహ్మముగూడ ప్రపంచమును సృష్టించుటకు ప్రకృతి అనగా ఉపాదానకారణమని సిద్ధమగు చున్నది.

171. సర్వధర్మోపపత్తేశ్చ. (2.1.37)

సూత్రార్థము:- జగత్కారణత్వమునకు ఆవశ్యకమైన సర్వజ్ఞత్వాది కారణ ధర్మములన్నియూ ముందు చెప్పిన రీతిగా బ్రహ్మమునందు యుక్తి సంగతములుగాన నిర్గుణ బ్రహ్మము జగత్కారణము కాగలదు.
బ్రహ్మము జగదుపాదానకారణము గాజాలదు, నిర్గుణమగుటవలన, గంధ రూపాదులవలే అను తర్కము లేక న్యాయానుసారము నిర్గుణబ్రహ్మముద్వారా జగత్సృష్టిని ప్రతిపాదించు సమన్వయ శ్రుతులకు విరోధమా? కాదా? విరోధమని పూర్వపక్షి చెప్పగా విరోధము లేదనును సిద్ధాన్తి. జగత్సృష్టికి కావలసిన సర్వజ్ఞత్వాది ధర్మములు ఆ పరమేశ్వరునియందు గలవు గాన బ్రహ్మమే సంపూర్ణ జగత్తునకు ఉపాదానకారణము. ఈ ధర్మములన్నియు బ్రహ్మమునందు గలవని పూర్వమే నిరూపించితిమి. ఒకవేల నిర్గుబ్రహ్మమును ప్రధానమువలే పరిణామి ఉపాదానకారణమని చెప్పకపోయిననూ వివర్త ఉపాదానకారణమని స్వీకరించిన పైనచెప్పిన న్యాయమునకు ఏ విధమైన విరోధము కలుగదు. బ్రహ్మము సర్వజ్ఞము, సర్వశక్తివంతము మరియు మహామాయ యుక్తమగుట-వలన దానిలో ఏవిధమైన దోషములు లేవు అని ఇంతకు పూర్వము గూడ నిశ్చయించబడినది. గనుక ఉపనిషద్ దర్శనములో అధిక సంశములు కలుగుట అధిక శంకలు చేయుట సరికాదు.

## బ్రహ్మసూత్ర హృదయములో ద్వితీయాధ్యాయములోని ప్రథమపాదముయొక్క సంకలనము సమాప్తము.

## ద్వితీయాధ్యాయము-ద్వితీయపాదము.

**ఈ పాదములో సాంఖ్యాది మతములలో గల దోషములను వారి యుక్తులను ఖండించుచున్నారు.**

ఈ పాదములోముముక్షువుల హృదయములలో సమ్యక్ జ్ఞానము ఉత్పన్నము గావించుటకు వేదాన్త వాక్యముల సమన్వయములో ప్రతివాది సాంఖ్యాదుల ద్వారాచూపించిన దోషములను ఖండించి వేదాన్త సమన్వయమును స్థాపన గావించిరి. దానిద్వారా ముమక్షువులకు నిర్దుష్ట బ్రహ్మాత్మైక్య జ్ఞానమునందు నిసందిగ్ధ ప్రవృత్తి కలుగునని ఈపాదమును ప్రారంభము గావించిరి. ఈ పాదములో సాంఖ్యాదుల మతమును ఖండించుట అనునదే ప్రధాన విషయము. ముముక్షువుల మొక్ష సాధనకొరకు సమ్యక్ జ్ఞానమును ప్రతిపాదించు వేదాన్తమును చెప్పుటయే సరియైననూ పరపక్ష ఖండనము పరద్వేషముద్వారా వారికి ఏమి లాభము? ఏమీ లాభము లేదు. అయిననూ మందబుద్ధులైన కొందరు పెద్ద పెద్ద మహర్షులద్వారా రచించిన న్యాయ, సాంఖ్య, బౌద్ధ, పఞ్చరాత్ర దర్శనములు గూడ సమ్యక్ జ్ఞానము కలుగజేయునని వానిలో ప్రవృత్తి కలిగి యుందురు. ఆమతములలో గూడ ప్రౌఢమైన యుక్తులు కానవచ్చు చున్నవి, మరియు వానిని రచించినవారు సర్వజ్ఞకల్పఋషులేగదా. అందువల్ల మందబుద్ధులకు వారిపై శ్రద్ధ కలుగును ఆశ్రద్ధ వారిని మొక్షమునకు దూరము గావించును. ఆ మతములందు సారము లేదని చూపించుటకు పరపక్షఖండన అత్యావశ్యకము. ద్వితీయాధ్యాయములోని ప్రథమ పాదముద్వారా

సమన్వయ విరోధపక్షములను ఖండించి స్వపక్షస్థాపన గావించబడినది. ఈ ద్వితీయ పాదముద్వారా వేదాన్త సమన్వయమునకు విరోధము చెప్పు సాంఖ్యాదుల మతములను ముఖ్యముగా ఖండించవలయును. గాన పూర్వపాదముతో బాటు ఈ పాదమునకు ఉపజీవ్య-ఉపజీవక భావ సంగతి. (ఉపజీవ్యమనగా నొకదానిని ఆశ్రయించి బ్రతుకునది. ఉపజీవక మనగా నొకదానికి ఆశ్రయమిచ్చునది.)

# 54. రచనానుపపత్త్యధికరణము.

సంగతి:- పూర్వాధికరణములో బ్రహ్మమునందు జగత్కారణత్వము, సర్వజ్ఞత్వాది ధర్మములు యుక్తి సంగతముగా నిర్ణయించబడినవి. ఆ సర్వజ్ఞత్వాది ధర్మములు సాంఖ్యుల ప్రధానమునందు గూడ ఉన్నవని స్వీకరించవచ్చును గదా. ఈవిధమైన ఆక్షేపమును చెప్పి ఈ అధికరణముద్వారా సమాధాన మీయబడినది. గాన పుర్వాధికరణముతో దీనికి ఆక్షేప సంగతి.

విషయము:- సాంఖ్యుల సిద్ధాన్తము ఈ అధికరణములో విచారణీయ విషయము.

సంశయము:- సాంఖ్యుల సిద్ధాన్తము ప్రమాణమూలకమా? లేక భ్రాన్తిమూలకమా? అనగా ప్రధానము జగత్కారణమగునా కాదా?

పూర్వపక్షము:- సంపూర్ణ ప్రపంచములో ఘటాదులతోసహ సుఖము దుఃఖము మరియు మోహము అనునవి కానవచ్చు చున్నవి. కనుక సుఖ-దుఃఖ మోహాత్మకమగు ప్రధానమే ఈ జగత్కారణము కాగలదు.

సిద్ధాన్తము:- సాంఖ్యదర్శనముద్వారా చెప్పబడి అనుమానముద్వారా సిద్ధమగు ప్రధానము జగత్కారణము గాజాలదు. స్రష్టవ్య అనగా సృష్టికావించబోవు ప్రపంచముయొక్క జ్ఞానశూన్యమగుటవలననూ మరియు అచేతనమగుటవలననూ ప్రధానముద్వారా అనేకవిచిత్రమైన రచన సంభవముకాదు. సుఖాదులు అన్తముచెందు పదార్థములు అవి ఘటాది విషయములలో ఎట్లుండగలవు.

వైయాసికన్యాయమాలా:-

121. ప్రధానం జగతో హేతుర్న వా సర్వే ఘటాదయః। అన్వితాః సుఖదుఃఖాద్యైర్యతో హేతురతో భవేత్॥

122. న హేతుర్యోగ్యరచనాప్రవృత్త్యాదేరసంభవాత్ । సుఖాద్యా ఆన్తరా బాహ్యా ఘటాద్యాస్తు కుతోఽన్వయః॥

ప్రధానము జగత్కరణమా కాదా? ఘట పటాది పదార్థములన్నియూ సుఖము, దుఃఖము మరియు మోహములతో కూడినవై యున్నవి. అందువలన సుఖ-దుఃఖ మోహాత్మకమగు ప్రధానము జగత్కారణమనును పూర్వావాది. దానికి సిద్ధాన్తి సమాధానము. విచిత్ర జగత్తుయొక్క రచనా మరియు దాని యందు ప్రవృత్తి అచేనమగు ప్రధానములో సంభవము కానందున ప్రధానము జగత్కారణము కాజాలదు. సుఖ-దుఃఖాదులు ఆన్తరములు అనగా లోపల మనస్సులో గలవు, మరియు ఘటపటాదులు బాహ్య వస్తువులు గాన ఘట-పటాదులందు సుఖ-దుఃఖ మొహములను గుణములెట్లుండ గలవు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

సుఖ-దుఃఖ మోహాత్మకమగు ప్రధానము జగత్కారణమందురు సాంఖ్యులు ఎందులకనగా జగత్తులో అన్ని పదార్థములందు సుఖ-దుఃఖములు కానవచ్చుచున్నవి. ఘట-పటాది పదార్థములు ప్రాప్తమయిున వానికి సుఖము కలుగుచున్నది ఏలనన నీళ్ళు తెచ్చుట మరియు శరీరమును కప్పుకొనుట అను కార్యముల

నిర్వాహమువలన. ఘట-పటాదులు దొంగిలించబడిన వానికి దుఃఖము కలుగుచున్నది. నీళ్ళు తెచ్చుకొనుట మొదలగు కార్యముల అపేక్షలేని వానికి ఆ ఘటాదులు సుఖ-దుఃఖాదుల నిచ్చుటలేదు కాని ఉదాసీన భావముతో నుండును. ఉదాసీన భావవిషయమునే మోహ మందురు. 'ముహ' ధాతువునకు 'వైచిత్యే' అని అర్థము. ఈధాతువునుండి మోహ శబ్దముత్పన్న మైనది. గాన ఉదాసీన భావముగల వస్తువుల చిత్తవృత్తి ఏర్పడదు. ఈ సుఖ-దుఃఖ మోహముల అన్వయము (కారణమును అనుసరించుట) ప్రధానములో కానవచ్చు చున్నందువలన ప్రధానము జగత్కారణము. ఈ విధముగా చెప్పిన పూర్వవాదికి సిద్ధాన్తి చెప్పు సమాధానము.
ప్రధానము జగత్కారణము కాజాలదు ఏలనన దేహము ఇంద్రియములు పర్వతము మొదలగుగాగల అసాధారణ అవయవ సంగరనతో గూడిన జగద్రచన గావించుటకు అచేతనమైన ప్రధానమునందు యోగ్యతయో లేదు. లోకములో సుందరమైన భవన నిర్మాణము అత్యన్త నిపుణులైన శిల్పుల ద్వారానే చేయబడుచున్నది. జగద్ నిర్మాణము మట్లుంనీయుము. ఆ నిర్మాణ సిద్ధికి జడము అనగా అచేనమైన ప్రధానము యొక్క ప్రవృత్తి గూడ కాజాలదు. ఎందులకనగా లోకములో చైతన్యముద్వారా అనధిష్టితమైన వాహనాదుల ప్రవృత్తి చూడబడుటలేదు. (అనగా సారథి లేని రథము నడువజాలదు.) ఒకవేళ చైతన్యవంతుడైన పురుషుని ప్రధానమునకు అధిష్ఠానమనిన మీ సాంఖ్యములో చెప్పు పురుషుని అసంగతకు హాని కలుగును, దానితో మీ సిద్ధాన్తమే మట్టి కొట్టుకు పోవును. ఘట-పటాదులు సుఖ-దుఃఖ మోహాత్మకము లనుటయూ సరిగాదు ఎందులకనగా సుఖ-దుఃఖాదులు లోపల మనస్సులో గలవు మరియు ఘటాదులు బయట గలవు, గాన వాని సమన్వయము కాజాలదు. దీని ద్వారా ప్రధానము జగత్కారణము గాజాలదనునది సిద్ధమైనది.

172. రచనానుపపత్తేశ్చ నానుమానమ్. (2.2.1)

సూత్రార్థము:- ఈ జగత్తు సుఖ-దుఃఖ మోహాత్మకమగుటవలన వీనితోనున్న ప్రధానము జగత్కారణ మనవలయును ఏలననగా మట్టితో చేసిన కుండ మట్టిమయ మగుచున్నది ఆలాగుననే అనుమానము ద్వారా సిద్ధమగు ప్రధానము జగత్కారణమనును పూర్వపక్షి. అది సరికాదనును సిద్ధాన్తి. సృష్టి చేయవలసిన పదార్థముల జ్ఞానములేని జడప్రధానము ద్వారా వివిధములైన విచిత్రములైన వస్తువుల రచన సంభవముగాదు.
రెండవ మాట సుఖ-దుఃఖాదులు మనసులోనివి, వానిని భాహ్య జగత్తునకు అన్వయించుననుట అసిద్ధము గాన సాంఖ్యసిద్ధాన్తము ప్రామాణికము గాదు.

సంపూర్ణ సంసారము సుఖ-దుఃఖ మోహరూపము గాన దాని ఉపాదానకారణము గూడ సుఖ-దుఃఖ మోహ రూపమైన ప్రధానమే అగును. ఏవిధముగాననిన మట్టితో చేయబడిన కుండ మట్టిరూపమైయుండుట లోకములో చూచుచున్నాము. ఆలాగుననే సంపూర్ణముగా బాహ్య వస్తువులు మరియు ఆధ్యాత్మిక వస్తువులుగల ఈ కార్య జగత్తు సుఖ-దుఃఖ మోహరూపమై యుండవలయును గాన ఈ జగత్తుకు కారణము సుఖ-దుఃఖ మోహరూమైన ప్రధానమగునని పూర్వపక్షి చెప్పగా దానికి జవాబు సిద్ధాన్తి చెప్పుచున్నాడు. సాంఖ్య శాస్త్రములో చెప్పుఅనుమాన ప్రమాణముద్వారా సిద్ధమగు ప్రధానము జగదుపాదానకారణము గాజాలదు ఎందులకనగా జడ ప్రధానముద్వారా సృష్టి జరుగదు. దానితో బాటు బాహ్య జగత్తులో సుఖ-దుఃఖాదుల సంబన్ధము కానరాదు. ప్రధానము జడమగుట వలన సృష్టిచేయబోవు పదార్థముల జ్ఞానముదానికిలేదు. ఆ జడ ప్రధానము అనేక ప్రకారములతో గూడిన విచిత్ర

జగత్తును ఎట్లు సృష్టించగలదు? లోకములో భవనములు, ఆసనాదులు మొదలగునవి బుద్ధిమంతులైన శిల్పులద్వారానే నిర్మింపబడుచున్నవి. మరియు తెలివిగలవారు ఋతువులకు అనుకూలమగు పదార్ధములను గ్రహించి సుఖప్రాప్తిని మరియు దుఃఖనివృత్తిని పొందుచున్నారు. కస్తూరి శీతాకాలములో మరియు చందనము వేసవికాలములో సుఖము నిచ్చుచున్నవి ఆలాగుననే ఋతువులకు అనుకూలమగు భవనములు గూడ నిర్మించు చున్నారు. సుఖ-దుఃఖాది ధర్మములు అన్తఃకరణలో నుండును గాని బాహ్య జగత్తులో లేవు. శబ్దాదులందు బాహ్యత్వము స్పష్టరూపముగా ప్రతీతమగు చున్నది. ఒకే శబ్దభావనా ఒకరికి ఆనందము నిచ్చును వేరొకరికి దుఃఖము నిచ్చును. ఆ స్థితిలో సుఖ-దుఃఖాదులకు కారణమైన శబ్దమును స్వీకరించక ఆంతరిక భావనా విశేషమునే స్వీకరించవలయును. అచేతనమైన ప్రధానము ద్వారా జగత్ రచన సంభవముకానందువలననూ మరియు సుఖాదులు బాహ్య జగత్తులో లేనందువలనూ దాని ద్వారా జగత్ సృష్టిని చెప్పు సాంఖ్య శాస్త్రము అప్రమాణికమని సిద్ధమైనది.

సాంఖ్య శాస్త్రములో చెప్పునదేమనగా మహతత్వమునుండి పృథివీ పర్యన్తము సంపూర్ణ విశేషములకు మూల కారణము త్రిగుణాత్మకమగు ప్రధానమే, ఎందులకనగా ఆప్రధానమునందే ఆ విశేషముల పరిణామము మరియు సమన్వయము చూడబడు చున్నది. మరియు శక్తి-విశిష్ట కారణము ద్వారా కార్య పవృత్తి గూడ ఈ ప్రధానములో చూడ బడుచున్నది. కార్యకారణ విభాగము మృద్ఘటాదులందు చూడ బడుచున్నది. మహదాది జగత్ యొక్క సృష్టి చేయు శక్తి ప్రధానములో గలదు గాన మహదాది రూపముగా పరిణత చెందుటకు ప్రధానము ప్రవృత్తి అగు చున్నది. ఇట్టి సంశయము కలుగగా సిద్ధాన్తి ఇచ్చిన సమాధానము ముందు సూత్రములో చెప్పబడు చున్నది.

### 173. ప్రవృత్తేశ్చ. (2.2.2)

సూత్రార్థము:- అచేతన మగు ప్రధానము మూడు గుణములు సమముగానున్న సామ్యావస్థనుండి మారి ప్రవృత్తి కలుగుటకు చైతన్యాధారము లేక సంభవముకాదు గాన ప్రధానము జగత్కారణము గాజాలదు.

పూర్వ సూత్రము నుండి ' నానుమానమనుపపత్తేశ్చ' అను పదము ఈ సూత్రములోకిగూడ తీసుకు రావలయును. అనగా అనుమానము ద్వారా సిద్ధమగు ప్రధానము జగత్కారణము కాజాలదు. ప్రధానము అచేతనము మరియు త్రిగుణముల సామ్యావస్థరూపము ఆ అవస్థనుండి మారి జగద్రూపముగా పరణామముచెందుట చైతన్యము యొక్క ప్రేరణము లేక జరుగదు గాన జగత్కారణముగా ప్రధానమును అనుమానము గావించజాలము. దీనికి కారణము లోకములో జడ రథాదుల ప్రవృత్తి చైతన్యాధీనముగనే కానవచ్చు చున్నది. వేదాన్తమతములోగూడ కేవలము చైతన్యము ప్రవర్తకముకాదు గాని దేహేన్ద్రియాదులతోగూడిన చైతన్యమే ప్రవర్తకము, ఆ విధముగనే రథాదులందు చూడబడుచున్నది. గనుక అచేతన దేహాదులే రథాదుల ప్రవర్తకములని స్వీకరించవలయుననును పూర్వవాది. అట్లనుట సరిగాదనును సిద్ధాన్తి. కేవలము అగ్ని ఇన్ధనము లేక కాల్చలేదు మరియు ప్రకాశము నీయజాలదు కాని ఇన్ధనముతోగూడి అగ్ని దహించగలదు మరియు ప్రకాశమునిచ్చును, అయిననూ అగ్నినే దాహాదులకుకారణమని చెప్పుదురు. ఆ విధముగనే దేహాదులతో గూడిన చైతన్యమునందు ప్రవృత్తి కానవచ్చిననూ చైతన్యమునే ప్రవర్తకమందురు. ఆవిధముగనే దేహాదులతోగూడిన చైతన్యమునందు ప్రవర్తకత్వము గానవచ్చిననూ అన్వయ-వ్యతిరేకముద్వారా రథాదుల ప్రవర్తకము చైతన్యమనియే స్వీకరింతురు కాని దేహాదులనుకాదు. ఈ దృష్టాన్తముద్వారా జడ ప్రధానము జగత్కారణము కాజాలదు. దేహాదులతోగూడిన ఆత్మస్వరూపము కేవలము

ప్రవర్తకమని మనిగూడ చెప్పజాలమనిన అది సరికాదు, ఎందులకనగా అయస్కాంతమణి స్వయముగా క్రియా రహితమైననూ లోహాదులలో క్రియా ఉత్పాదకత్వము చూడబడుచున్నది. ఆలాగుననే రూపరసాది విషయములు ప్రవృత్తి శూన్యమయిననూ పురుషునిలో వానిద్వారా ప్రవృత్తి చూడబడుచున్నది. ఒకే అద్వితీయ బ్రహ్మములో ప్రవర్తక కర్త మరియు ప్రవర్తక విషయ భావము సంభవము కాదు అనిన అది గూడ సరికాదు, ఏలనన వేదాన్త మతానుసారము ఒకే బ్రహ్మము అవిద్యద్వారా ఉత్పన్నమయిన నామ-రూపాత్మక జగత్తునకు ప్రవర్తకమని సిద్ధి గావించబడినది. అందువలన సర్వజ్ఞ పరమేశ్వరుని జగత్కారణమని స్వీకరించిన ప్రవర్తకము దానంతటదే సిద్ధమగును, గాని అచేతన ప్రధానమును జగత్కారణమని స్వీకరించిన ప్రవృత్తి ఏవిధముగనూ సిద్ధముగాదు. సాంఖ్య కారికలో చెప్పినదేమనగా దూడ పెరుగుటకు అచేతనమైన పాలు ఆవశ్యకము ఆలాగుననే పురుషుని భోగ-మోక్షములకు అచేతనమైన ప్రధాన ప్రవృత్తి జరుగునను పూర్వవాది సందేహమునకు ముందు సూత్రముద్వారా సమాధానము ఇచ్చుచున్నారు.

174. పయోఽమ్బువచ్చేత్తత్రాపి. (2.2.4)

సూత్రార్థము:- ఏవిధముగా పాలు దూడ పోషకణకై స్వయముగనే ప్రవృత్తమగునో ఆలాగుననే నీరు స్వయముగనే ప్రవహించును. ఈవిధముగనే ప్రధానముగూడ స్వయముగా ప్రవృత్తమగుచున్నది అనిన ఆ విధముగా చెప్పుటకు వీలులేదు. ఎందులకనగా "యోఽప్సు తిష్ఠన్" 'ఏది నీటలో ఉన్నదో' అని శ్రుతిద్వారా జలాదులకు పరమాత్మయో ప్రేరకమని ప్రతీతమగు చున్నది గాన ప్రధానము జగత్కారణము గాజాలదు.

"వత్సవివృద్ధినిమిత్తం క్షీరస్య యథా ప్రవృత్తిరజ్ఞస్య। పురుషవిమోక్షనిమిత్తం తథా ప్రవృత్తిః ప్రధానస్య" (సాం.కా. 59)

సాంఖ్య కారికలో చెప్పినదేమనగా దూడ పెరుగుటకు అచేతనమైన పాలు ఆవశ్యకము ఆలాగుననే పురుషుని భోగ-మోక్షములకు అచేతనమైన ప్రధాన ప్రవృత్తి జరుగును అనిరి. గాన అచేతనప్రధానములో ప్రవృత్తిలేదని చెప్పుట తగదు. ఆలాగుననే అచేతనమైన జలము లోకోపకారమునకై నదుల రూపములో ప్రవహించుచున్నది. ఈప్రకారముగనే అచేతనమైన ప్రధానముగూడ పురుషుల భోగ-మోక్షముల సిద్ధికొరకు స్వయముగా మహతత్త్వము, అహంకారము, పంచసూక్ష్మభూతములు (పంచతన్మాత్రలు), ఏకాదశ ఇన్ద్రియములు మరియు పంచ మహాభూతములుగా ప్రవృత్తమగు చున్నదనిన అటుల చెప్పుట సరిగాదు. ఎందులకనగా పాలు జలాదులకుగూడ ప్రేరకము పరమాత్మయే. బృహదారణ్యకములో తృతీయాధ్యాయములోని సప్తమ అన్తర్యామి బ్రాహ్మణములో చెప్పబడినది. "యోఽప్సు తిష్ఠన్ యోఽపోఽన్తరో యమయతి" (3.7.4) 'ఆ పరమాత్మ నీటిలోపలనుండి ఆ నీటిని ప్రేరేపించు చున్నాడు, కాని ఆపరమాత్మ జ్ఞానము జలమునకు లేదు, జలమే వాని శరీరము ఆ నీటిలో నున్నది అన్తర్యామి పరమాత్మయే. మరియు ఆతడు అభయ స్వరూపుడు మరియు మరణరాహిత్యుడు'. ఆలాగుననే ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ఆదిదైవిక మరియు ఆదిభౌతిక జగత్తును నియమించువాడు పరమేశ్వరుడనియే శ్రుతులు చెప్పుచున్నవి. పూర్వవాదులైన మీకు సిద్ధాన్తులమైన మాకు మన ఇద్దరికి సహమతమేమనగా కేవలము అచేతనము ద్వారా రథాదుల ప్రవృత్తి ఎచటనూ చూడబడుటలేదు అని. అందువల్ల నీరు మరియు పాలలోపల చైతన్య ఆత్మయే అధిష్ఠాన రూపముగా నున్నది. ఈ పరమాత్మ అధిష్ఠానము జలాదుల ప్రవృత్తికి కారణమని నిశ్చమయిన ఏ దోషము ఉండదు. పాలు జడమయుననూ

చైతన్యవంత మయిన ఆవు దూడమీద గల ప్రేమవలన పాలను స్రవింపజేయును. దూడ ఆవు స్థనములను చప్పరించినపుడు పాలు స్రవించును. ఆ విధముగనే నీరు నిమ్న భూమినపేక్షించి ప్రవహించును. గాన అచేతన ప్రవృత్తిలో చైతన్యమునే నియామకమని స్వీకరించవలయును.
మహదాది రూపములలో ప్రధానప్రవృత్తికి చైతన్యముయొక్క ఆవశ్యకము లేకపోయిననూ ధర్మాధర్మముల ననుసరించియే ప్రధానము మహదాదిరూపములుగా మారును గదా అను ప్రశ్నకు సమాధానము ముందు సూత్రముద్వారా ఇచ్చుచున్నారు.

175. వ్యతిరేకానవస్థితేశ్చానపేక్షత్వాత్. (2.2.4)

సూత్రార్థము:- సాంఖ్యమతములో సత్వరజస్తమోగుణములు సమానస్థితిలో నుండుటనే ప్రధానమందురు. ఆ గుణములకన్న వేరైన కర్మాదులుకాని ఏ విధమైన సహకారములుగాని లేకుండుట మరియు పురుషుడు అసంగ ఉదాసీనుడనియు చెప్పుటవలననూ ప్రవృత్తి నివృత్తులను స్వీకరించకుండుటవలననూ అచేతనమైన ప్రధానము జగత్కారణము కాజాలదు.
సాంఖ్యమతములో త్రిగుణముల సమానరూపమునే ప్రధానమందురు. ఆ ప్రధానమునే వేదాన్తులు మాయ అందురు. ఆ గుణముల కన్న వేరుగా ఆ ప్రధానములో ప్రవృత్తి నివృత్తులకు అన్య సహకారికారణము లేనందున ప్రధానము జగద్రచనకు ప్రవృత్తికాజాలదు. ఆ ప్రధానమున కన్న వేరైన పురుషుని వారు స్వీకరించిననూ ఆపురుషుడు అసంగము మరియు ఉదాసీనుడగుటవలన ప్రధానము యొక్క ప్రవృత్తి నివృత్తులలో పురుషుని అపేక్షలేదు (ప్రమేయము లేదు). గాని సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, మహామాయా శక్తితో గూడిన చైతన్య స్వరూడైన ఈశ్వరుని ప్రధానముయొక్క ప్రవృత్తి-నివృత్తులకు కారణమని స్వీకరించిన ఏ విధమైన విరోధము ఉండదు. అందువలన అచేతనమైన ప్రధానము స్వతంత్రముగా జగద్రచనకు కారణము గాజాలదు.
ఆవు తిను తృణాదులు సహకారి కారణము లేకున్ననూ ఏ విధముగా దాని శరీరములో పాలుగా మారుచున్నవో ఆ విధముగనే మహదాది రూపములో ప్రధానము పరిణామము చెందుచున్నది అనిన అదిసరికాదనుటకు ఈసూత్రము చెప్పుచున్నారు.

176. అన్యత్రాభావాచ్చ న తృణాదివత్. (2.2.5)

సూత్రార్థము:- ఆవు శరీరములో తృణాదులు ఇతర నిమిత్తముల అపేక్ష లేకయే పాలుగా మారు చున్నవి ఆలాగుననే ఏ నిమిత్తముల అపేక్ష లేకయే ప్రధానము గూడ మహదాది రూపములో పరిణామము చెందుచున్నది అని చెప్పనలవికాదు ఎందులకనగా ఆవుకన్న వేరైన ఎద్దు మొదలగువానిలో పాలుగా మారుట చూడబడుటలేదు గాన క్షీరాదులుగా మారుటకు నిమిత్తము తప్పక గలదు.
ఆవు శరీరములో తృణాదులు క్షీరాదులుగా మారుచున్నందున దానికి నిమిత్తములేదని చెప్పలేము. ఏలనన ఆవుగాక ఎద్దు శరీరములో ఆ తృణాదులు దుగ్ధాదిరూపముగా పరిణామము చెందుట చూడబడుటలేదు. ఆవు మొదలగు స్త్రీజంతువుల శరీరము నపక్షించియే తృణాదులు పాలుగా మారు చున్నవి కాని ఏ అపేక్షలేకయేనని చెప్పజాలము. కావున సర్వజ్ఞుడయిన పరమేశ్వరుడు సర్వపదార్థములను ఆయా కార్యములయందు ప్రవర్తింజేయుచున్నాడు. లేనిచో ఆ తృణాదులే ఎద్దు శరీరములో పాలుగా మారు ప్రసంగము వచ్చును. గాన

తృణాదుల దృష్టాన్తముద్వారా ప్రధానము మహదాది రూపములుగా స్వాభావికముగనే పరిణామము చెందుచున్నదని చెప్పజాలము.

ఒకవేళ ప్రధానము స్వాభావికముగనే పరిణామము చెందుచున్నదనిననూ దోషము గలదు, దానిని ముందు సూత్రముద్వారా చెప్పుచున్నారు.

177. అభ్యుపగమేఽప్యర్థాభావాత్. (2.2.6)

సూత్రార్థము:- ప్రధానము స్వయముగనే సృష్టికి ప్రవృత్తమగును అని స్వీకరించిననూ ఏ ప్రయోజనము లేనందున దోషము అలాగుననే యుండును.
ప్రధానము బాహ్యవస్తువునపేక్షించకయే స్వయముగా ప్రవృత్తమగుచున్నదనిననూ పురుషునికి ఏ ప్రయోజనము సిద్ధము గాజాలదు. మాకు అది స్వీకార్యమేనని చెప్పజాలరు. ఎందులకనగా అచేతనమైన ప్రధానము పురుషుని యొక్క భోగమునకు మరియు మోక్షమునకు మహదాది రూపములో పరిణామము చెందుచున్నదని మీ సిద్ధాన్తము. ఈ పురుషుని ప్రయోజనాభావమును, మాకు అబీష్టమనిన మీ సిద్ధాన్తమునకు విరోధము వచ్చును. సహకారి కారణము లేకయే ప్రధాన ప్రవృత్తి యందు పురుషుని భోగ-మోక్షముల ప్రయోజనమున్నదనిన అది సరికాదు. ఎందులకనగా ప్రధాన ప్రవృత్తి పురుషుని ప్రయోజనమునందు స్పష్టముగా నిమిత్తమని చెప్పజాలవు. మీ సాంఖ్య శాస్త్రములో పురుషుని అసంగుడు మరియు నిర్వికారుడని స్వీకరించిరి. ఆపురుషుని భోగమునకై ప్రధాన ప్రవృత్తిని నిమిత్తమనిన పురుషుడు మోక్షమునుండి వంచితుడగును. అసంగుడయిన పురుషుని మోక్షము ప్రధాన ప్రవృత్తికి పూర్వమేయున్నదని చెప్పిన ఆపురుషుని మోక్షమునకై ప్రధానయొక్క ప్రవృత్తి

అనర్థకమగును. భోగ-మోక్షములను ఉభయ ప్రయోజనమునకై ప్రధానము యొక్క ప్రవృత్తి అనిన పురుషుని మోక్షాభావము అటులనే యుండును ఎలనన ప్రధానము అచేతనము మరి పురుషుడో నిర్మలుడు మరియు అవయవరహితుడు. నిర్మలుడు మరియు అవయవరహితుడైన పురుషుని ఏ ప్రయోజనమునకై ప్రధానము ప్రవృత్తమగును?
సాంఖ్యకారికలో "పురుషస్య దర్శనార్థం కైవల్యార్థం తథా ప్రధానస్య।పంగ్వంధవదుభయోరపి సంయోగస్తత్కృతః సర్గః"॥ 'పురుషుడు ప్రవృత్తి శక్తి యుక్తుడు, మరియు ప్రధానము దృక్శక్తి విహీనము ఈ రెండిటి సంయోగము (గ్రుడ్డి వాని భుజములపై కుంటివాడు కూర్చొని త్రోవచూపుటవంటిది) గ్రుడ్డివాడు మరియు కుంటివాని సంయోగమువలన మహాదాది రూపమైన జగత్తు సృష్టించబడు చున్నది. ఈ రెండిటి సంయోగముయొక్క ప్రయోజనము దర్శనము మరియు మోక్షము. పురుష- ప్రధానముల వాస్తవికరూపమును తెలిసికొనిన పురుషునికి ప్రధానము మోక్షమునిచ్చును. ఈ రెండిటి సంయోగము సర్గాదులకు నిమిత్తము' (సాం.కా.21) గాన పఙ్గవన్ధ న్యాయముద్వారా పురుషుడు స్వయముగా ప్రవృత్తి గాక పోయిననూ ప్రధానము యొక్క ప్రవర్తకుడగును కదా? అను ఈ సంశయమునకు సమాధానము ముందు సూత్రముద్వారా చెప్పుచున్నారు.

178. పురుషాశ్మవదితి చేత్తథాపి. (2.2.7)

సూత్రార్థము:- కుంటివాడు స్వయముగా నడువజాలడు గాని గమనశక్తి కలిగిన గ్రుడ్డివాని భుజములపై నెక్కి గమ్యము జేరగలడు. అయస్కాంతమణి సామీప్యము మాత్రముచే ఇనుమునందు ప్రవృత్తి కలగజేయును. ఆ విధముగనే పురుషుడు ప్రధానమునకు ప్రవర్తకుడు అనిన ప్రధానమునందు స్వతంత్రత యుండదు మరియు పురుషుని అసంగతకు హాని కలుగును. ఈ దోషములను సాంఖ్యులు తొలగింపజాలరు.

లోకములో ప్రవృత్తి శూన్యము మరియు దర్శనశక్తి కలిగినవానిని కుంటివాడందురు. దర్శనశక్తి లేక ప్రవృత్తి శక్తికలిగినవానిని గ్రుడ్డివాడందురు. గ్రుడ్డివాని భుజములపై కుంటివాడు కూర్చొని తనలో ప్రవృత్తి లేకపోయిననూ అంధునియందు ప్రవృత్తి కలుగజేయగలడు. లేక అయస్కాంతమణిలో స్వయముగా ప్రవృత్తి లేకపోయిననూ తన సంపర్కమాత్రముచే ఇనుమునందు ప్రవృత్తికలగజేయును. ఆ విధముగనే పురుషుడు ప్రధానమునకు ప్రవర్తకుడు ఏలకాజాలడు? ఆలాగున ప్రశ్నించుట తగదు. ఏలనన ప్రధానము పురుషుని ద్వారా ప్రేరేపించబడుచున్నదనిన మీ సిద్ధాన్తమునకు విరోధము వచ్చును. మీరు ప్రధాన ప్రవృత్తికి పురుషుని అపేక్షలేదని స్వీకరించి ప్రధానము స్వతంత్ర మను చున్నారు. ఒకవేళ ప్రధాన ప్రవృత్తికి పురుషుడు సహకరించునని ఒప్పుకొన్ననూ పురుషునియందు కూటస్థత్వము, ఉదాసీనత్వములకు హాని కలుగును. ఈ రెండింటి నిషేధము మీకు సంభవమేగాదు. అంతేగాక ప్రధానము అచేతనము మరియు పురుషుడు ఉదాసీనుడు ఈరెండింటికన్న భిన్నమై ఈ రెండింటికి సంబన్ధము కలుగజేయువారు ఎవరూ కానవచ్చుటలేదు. సంబన్ధము వీరికి స్వభావమేనని పురుషునికి ముక్తి దొరకదు. మరి పరమాత్మను మాయయొక్క ప్రవర్తకుడని స్వీకరించిన ఈ దోషము మీ వేదాన్తులకు గూడ వచ్చుననిన అది సరికాదు. ఎందులకనగా పరమాత్మ స్వయముగా పారమార్థికముగా ఉదాసీనుడు, వ్యావహారికముగా వ్యాపారంబును మాయాప్రవర్తకత్వంబును స్వీకరించిన, భ్రాన్తివలన కలుగు వ్యాపారములు యథార్థరూపమునకు హాని జేయజాలవు, ఏ దోషము ఉండదు. మరియు సాంఖ్యవాదములో వేరొక దోషము కలదు. అది ముందు సూత్రములో చెప్పుచున్నారు.

179. అంగిత్వానుపపత్తేశ్చ. (2.2.8)

సూత్రార్థము:- ఒకదానితో వేరొకదాని సంబన్ధము లేని త్రిగుణముల సామ్యావస్థను ప్రధానమందురు. ఈ సమానావస్థ నాశనములేక ప్రధానములో అంగ-అంగి భావము కలుగదు, అంగ-అంగి భావములేనిచో ప్రధానములో ప్రవృత్తి కలుగజాలదు.

మూడు గుణముల సమానాస్థను సాంఖ్యులు ప్రధానమందురు. వీనిలో ఒకటి ప్రధానము మగిలిన రెండు గౌణములను అంగ-అంగిభావమను వైషమ్యము కలగనంతవరకు మహదాదిరూపములో ప్రధానముయొక్క ప్రవృత్తికలుగదు. ఈ వైషమ్యమును కలుగజేయు ప్రయోజకమేదియు కానవచ్చుటలేదు. ఈ సామ్యావస్థనుండి ప్రచ్యుతిరూపమయిన న్యూనాధికభావము కలుగనంతవరకు అంగ-అంగిభావము రాదు. ఈ అంగ-అంగి భావము లేక ప్రధానములో మహాదాది కార్యరూపముల సృష్టి సంభవముగాదు.

మూడు గుణములు పరస్పరము నిరపేక్ష స్వభావము కలిగినవి, గాన సామ్యావస్థనుండి ప్రచ్యుతి జరుగదు. ఈ ప్రకారము అసిద్ధి దోషమును చూపించి ముందు సూత్రముద్వారా సమాధాన మిచ్చుచున్నారు.

180. అన్యథానుమితౌ చ జ్ఞశక్తివియోగాత్. (2.2.9)

సూత్రార్థము:- సాంఖ్యవాది చెప్పునదేమనగా మేము అనపేక్ష గుణములను అనుమానము గావించుటలేదు గాని ప్రకారాన్తరము పరస్పరము సాపేక్ష గుణములను అనుమానము గావించు చున్నాము. ఆలాగునచెప్పిననూ ముందు చూపిన దోషము రాదు అనుట గూడ సరికాదు. ఏలనన గుణములందు జ్ఞశక్తి అభావమువలన వానంతటఅవే సామ్యవస్థనుండి చ్యుతిగాలేవు. అపుడు వానిలో అంగ-అంగి భావము కలుగదు. గాన కార్యోత్పత్తి గానేరదు, దానివలన పూర్వోక్త దోషము ఆవిధముగనే యుండును.

గుణములందు పరస్పర నిరపేక్షతా మరియు కూటస్థత్వము అనుమానము గావించుటలేదు ఏలనన అటుల అనుమానముగావించుటకు ప్రమాణములేదు. సత్వాది గుణముములు నిర్వికారములుగావు గాని ఎట్టి స్వభావము కలిగియుండిన సృష్టికి వీలగునో అటుల గుణములుండుననియూ వాని వృత్తులు చంచలమనియు అంగీకరింతురు సాంఖ్యులు. అంతేగాక సామ్యావస్థలో వైషమ్య ప్రాప్తికి యోగ్యమయిన గుణములు వారు ప్రధానములో చెప్పుచున్నారు. ఈ విధమయిన అనుమానముద్వారా దోషముండదని వారి అభిప్రాయము. అటులచెప్పుట గూడ సరికాదు ఎందులకనగా ఆగుణములందు జ్ఞానశక్తి లేనేలేదు. జ్ఞానశక్తి అభావమువలన సృష్టి రచన జరుగదు. ఒకవేల ప్రధానమునందు జ్ఞానశక్తి వారు ఒప్పుకొనిన వారు ప్రతివాదులుగా నిలువరు మరియు వారికి బ్రహ్మవాద ప్రసంగము వచ్చును.

ఈ ముందు చెప్పబోవు కారణమువలన గూడ సాంఖ్య వాదము అసంగతము అనగా వారి మతములో వేరొక దోషము చూపుచున్నారు.

181. విప్రతిషేధాచ్చాసమఞ్జసమ్. (2.2.10)

సూత్రార్థము:- సాంఖ్యులు ఒకచోట మహతత్వమునుండి పఞ్చతన్మాత్రలసృష్టి చెప్పెదరు వేరొకచోట అహంకారమునుండి పఞ్చతన్మాత్రల సృష్టి చెప్పెదరు. ఒకచోట జ్ఞానేంద్రియములు త్వగింద్రియాన్తర్భావమని ఇంద్రియములు ఏడు అని చెప్పెదరు వేరొకచోట ఏకాదశ ఇంద్రియములని ప్రతిజ్ఞ గావింతురు. ఈ ప్రకారము విరోధముండుటవలన సాంఖ్యమతము యుక్తిసంగతముగాదు, అంతేగాక వీరి మతము భ్రాన్తిమూలకమని సిద్ధమగు చున్నది.

సాంఖ్యులు త్వఙ్మాత్రము ఒకే జ్ఞానేంద్రియము అనేకములైన రూపాదులను గ్రహించునది,కర్మేంద్రియములు ఐదు, మనస్సు ఒకటి మొత్తము ఏడు ఇంద్రియములందురు. వేరొకచోట ఇంద్రియములు పదకండు అందురు. ఒకచోట మహతత్వమునుండి తన్మాత్రల సృష్టి చెప్పెదరు, వేరొకచోట అహంకారమునుండి తన్మాత్రల సృష్టిచెప్పెదరు. ఒకచోట అన్తఃకరణములు మూడు అందురు, వేరొకచోట బుద్ధి ఒకటే అన్తఃకరణమందురు. ఈవిధమైన విరోధవాక్యములు చెప్పుటవలన సాంఖ్యమతము భ్రాన్తిమూలకము. ఈశ్వరుడు జగత్కారణమని చెప్పు శ్రుతి స్మృతలతో వీరి విరోధము ప్రసిద్ధమే. అందువల్ల సాంఖ్యమతము భ్రాన్తిమూలకమగుటవలన ముముక్షువులద్వారా దీని ఉపేక్షయే యుక్తియుక్తము.

# 55.మహద్దీర్ఘాధికరణము.

సంగతి:- చేతనత్వాది బ్రహ్మ గుణములు ప్రపంచములో చూడబడుటలేదు కనుక ప్రధానమువలే బ్రహ్మము గూడ జగదుపాదానకారణము కాజాలదు. ఈ విధమైన దృష్టాన్త సంగతి వలన ఈ అధికరణము ప్రారంభించిరి.
విషయము:- చైతన్య బ్రహ్మమునుండి జగత్సృష్టిని చెప్పిన సమన్వయమునకు వచ్చు విరోధము ఈ అధికరణమునకు విషయము.
సంశయము:- తెల్లని దారమునుండి తెల్ల వస్త్రము ఉత్పన్నమగును గాని దానికి విరోధము కాదు ఆలాగుననే చైతన్య బ్రహ్మము జగత్కారణమనిన జగత్తులోగూడ చైతన్యమే గానరావలయును. గాన జడ జగత్తునకు చైతన్య బ్రహ్మము కారణము గాజాలదు. ఈతర్కముద్వారా సమన్వయమునకు విరోధము కలదా లేదా?
పూర్వపక్షము:- తెల్లని దారము ద్వారా తెల్లని వస్త్రమే ఉత్పన్నమగుటచే కారణముకన్న భిన్నప్రకారమైన కార్యము  ఉత్పన్నమగుటలో దృష్టాన్తము చూడబడుటలేదు గాన ముందు చెప్పిన సమన్వయమునకు విరోధము గలదు.
సిద్ధాన్తము:- నిరవయవమై పారిమాండల్యప్రమాణము గల పరమాణువులనుండి ద్వ్యణుకము జనించు చున్నది. పారిమాండల్యమనగా పొడవు గాని వెడల్పు గాని లేక ఒకప్రదేశమును మాత్రమాక్రమించి యుండుట, అతి సూక్ష్మ మని భావము. కాని ద్వ్యణుకమునందు ఆ నిరవయవత్వముగాని పారిమాండల్యప్రమాణము గాని లేదు. ఆలాగుననే అణుపరిమాణము గల ద్వ్యణుకమునుండి జనించిన త్ర్యణుకాదులలో దీర్ఘపరిణామము స్థూలపరిమాణముగలవు గాని అణుపరిణామలో లేదు. ఇచట కార్య-కారణములలో సమానపరిమాణరూపమైన ధర్మము లేదు. ఆవిధముగనే చైతన్యమైన బ్రహ్మమునుండి అచేతన జగత్తు యొక్క ఉత్పత్తిని స్వీకరించిన దృష్టాన్తములుండుటవలన సమన్వయమునకు ఏవిధమైన విరోధములేదు.
వైయాసికన్యాయమాలా:-
123. నాస్తి కాణాదదృష్టాన్తః కింవాఽస్త్యసదృశోద్భవే। నాస్తి శుక్లపటః శుక్లాత్తన్తోరేవహి జాయతే॥
124. అణు ద్వ్యణుకముత్పన్నమనణోః పరిమణ్డలాత్। అదీర్ఘాద్-ద్వ్యణుకాద్దీర్ఘం త్ర్యణుకం తన్నిదర్శనాత్॥
కాణాదమతములో సాదృశ్యములేని ఉత్పత్తిలో సిద్ధమైన దృష్టాన్తములు కలవా లేవా? లేవు. ఎందులకనగా తెల్ల వస్త్రము తెల్లని దారములనుండియే ఉత్పన్నమగును అని పూర్వపక్షిమతము. సిద్ధాన్తి ఇచ్చిన జవాబు. పారిమాణ్డల్య పరిమాణముగల అనగా అణుపరిమాణువు కన్న సూక్ష్మపరిమాణముగల పరమాణువులనుండి అణుపరిమాణముగల ద్వ్యణుకము ఉత్పన్నమగుచున్నది, మరియు అణుపరిమాణముగల ద్వ్యణుకమునుండి మహత్పరిమాణముగల త్ర్యణుకముత్పన్నమగుచున్నది. గాన కాణాదమతములో అసాదృశ్యమైన ఉత్పత్తికి సిద్ధమైన దృష్టాన్తములు గలవు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

చైతన్య బ్రహ్మమునుండి విలక్షణమైన అచేతనజగత్తు ఉత్పన్నమగుచున్నదని పూర్వపాదములో చెప్పిరి. ఈ విషయములో సాంఖ్యులకు జడమగు పేడనుండి చైతన్యముగల త్రేళ్ళు ఉత్పన్నమగుచున్నవని చెప్పిరి. ఆ దృష్టాన్తము ద్వారానే సాంఖ్యులు చేసిన ఆక్షేపము పరిహారమైననూ స్వపక్ష సాధనకొరకు మరియు పరపక్ష దూషణ కొరకు ఈపాదమును ప్రారంభించి పూర్వాధికరణములో సాంఖ్యులమతములో దోషములు చూపిరి. తదనంతరము వైశేషికమతము దూషించుచున్నారు. వైశేషికమతములో ప్రక్రియ బహుల మగుటవలన ఆ వాసనలతో నున్న పురుషుడు వారి ప్రక్రియద్వారా సిద్ధమైన అసమాన ఉత్పత్తి యొక్క దృష్టాన్తమును వదిలి బ్రహ్మవాదమును ఆదరించలేడు. అందువల్ల భిన్నమైన ఉత్పత్తియొక్క దృష్టాన్తము కాణాదమతములో గలదా లేదా అను విచారము గావించుచున్నారు.

ఇచట పూర్వపక్షి చెప్పునదేమనగా తెల్లని దారము నుండి తెల్లవస్త్రము ఉత్పన్నమగునుగాని ఎఱ్ఱ వస్త్రము గాదు. భిన్నమైన లేక అసమాన ఉత్పత్తిని చెప్పుటకు సిద్ధమైన దృష్టాన్తము కాణాద మతములో లేదు.

సిద్ధాన్తి చెప్పునదేమనగా భిన్నమైన ఉత్పత్తిని చెప్పు దృష్టాన్తములు కాణాదుల మతములో గలవు. ఎందులకనగా పరమాణువు పారిమాణ్డల్య పరిమాణము కలది కాని అణుపరిమాణము కలది కాదు. పారిమాణ్డల్యమనగా పొడవుగాని వెడల్పుగాని లేక ఒకప్రదేశము నాక్రమించి యుండుట. అతి సూక్ష్మమని భావము. అణుపరిమాణము లేని రెండు పరమాణువులు అణుపరిమాణముగల ద్వ్యణుకమును ఉత్పత్తి చేయును. ఇది అసమాన ఉత్పత్తికి ఒక దృష్టాన్తము. ద్వ్యణుకము హ్రస్వపరిమాణము గలది గాని దానిలో దీర్ఘపరిమాణములేదు. అటువంటి మూడు ద్వ్యణుకములు కలిసి దీర్ఘపరిమాణముగల త్ర్యణుకమును ఉత్పత్తి చేయును, ఇది రెండవ దృష్టాన్తము. ఇదే ప్రకారము వైశేషికుల ప్రక్రియలో సిద్ధమైన వేరు దృష్టాన్తములను చూపించవలయును.

### 182. మహద్దీర్ఘవద్వా హ్రస్వపరిమాణ్డలాభ్యామ్. (2.2.11)

సూత్రార్థము:- వైశేషికులమతములో సూక్ష్మము మరియు అణు పరిమాణము గల ద్వ్యణుకము నుండి మహత్పరిమాణము మరియు దీర్ఘత్వముగల త్ర్యణుకము ఉత్పన్నమగుచున్నది. ద్వ్యణుకములోగల హ్రస్వత్వము మరియు అణుత్వము త్ర్యణుకములో స్వసమానజతీయములైన హ్రస్వత్వము మరియు అణుత్వమును ఆరంభించుటలేదు, గాని ద్వ్యణుకములోగల త్రిత్వసంఖ్య త్ర్యణుకములో మహత్త్వాదులను ఆరంభించుచున్నది. అదేవిధముగా పరిమాణ్డల్యపరిమాణముగల పరమాణువులనుండి ద్వ్యణుకము ఉత్పన్నమగుచున్నది. పరమాణువులోగల పారిమాణ్డల్యపరిమాణము ద్వ్యణుకములో స్వసమానజాతీయమైన పరిమాణ్డల్యమును ఆరంభించుటలేదు, కాని పరమాణువుల దిత్వసంఖ్య ద్వ్యణుకములో హ్రస్వత్వాదులకు కారణమగుచున్నది. ఇది వారి ప్రక్రియ. "కారణగుణములు కార్యములో స్వసమానజాతీయ గుణములను ఆరంభించును" అను న్యాయాభాసమును చెప్పు వైశేషికులకు పైనుదహరించిన ప్రక్రియ చెప్పినపుడు ఎందులకు

సిగ్గు వచ్చుటలేదు. ఏలనన వారి ప్రక్రియలో వ్యభిచారము స్పష్టము. ఈవిధమైన న్యాయాభాసమును చెప్పు వైశేషికులమతముద్వారా వేదాన్త సమన్వయమునకు ఏ విధమైన విరోధము లేదు.

ఈ సూత్రములో వైశేషికులమతమునకు విరోధముండుటవలన ప్రథమాధ్యాయములో చెప్పిన సమన్వయమునకు విరోధముగలదని పూర్వపక్షిమతము. విరోధములేదనును సిద్ధాన్తి. కారణమేమనగా హ్రస్వత్వ అణుత్వ పరిమాణములు గల ద్వ్యణుకమునుండి త్ర్యణుకము ఉత్పన్నమగుచున్నది ఆ త్ర్యణుకములో హ్రస్వత్వ అణుత్వములు లేవు గాని ద్వ్యణుకములలో గల త్రిత్వసంఖ్యవలన మహత్వ దీర్ఘత్వాది గుణములు ఆరంభమయినవి. అలాగుననే పారిమాణ్డల్య విశిష్ట గుణముగల పరమాణువులనుండి ద్వ్యణుకము ఉత్పన్నమగుచున్నది. ద్వ్యణుకములో పారిమాణ్డల్య గుణములేదుగాని పరమాణువులలోగల దిత్వ సంఖ్య వలన దానిలో అణుత్వము మరియు హ్రస్వత్వపరిమాణము ఉత్పన్నమయినవి. ఈవిధమయిన ప్రక్రియను చూపు వైశేషికులు "కారణగుణాః స్వకార్యే స్వసమానజాతీయ గుణార్భకా భవన్తి" అను న్యాయాభాసమును చెప్పుచూ ఏల సిగ్గు బడుటలేదు. కారణములోగల గుణములు కార్యములో తమసమానజాతీయ గుణములను ఉత్పన్నము గావించునని వారి తర్కము. గాని పైన చూపిన వారి ప్రక్రియలో ఈ తర్కమునకు విరోధము గలుగుటవలన వారిది తర్కాభాసము. అట్టి తర్కాభాసమును చెప్పు వైశేషికులు ఏల సిగ్గు బడుటలేదు అని వేదాన్తి అడుగు చున్నారు. అంతేగాక న్యాయమునకు వ్యభిచారమును చెప్పుచూ వారు ఇతరుల సిద్ధాన్తమును ఎట్లు నియమించగలరు. గాన సమన్వయమునకు విరోధము లేదు. ఇంతకు ముందు గూడ ద్వితీయాధ్యాయములోని ప్రథమపాదములో అతిదేశముద్వారా "ఏతేన శిష్టాపరిగ్రహా అపి వ్యాఖ్యాతాః" అను సూత్రముద్వారా వైశేషికిలను ఖండిచిననూ ఇచట సంక్షేపముగా చెప్పినదానిని విస్తారముగా చెప్పిన అది పౌనరుక్త్యము గాదు అని తెలిసికొనవలయును.

# 56. పరమాణుజగత్కారణత్వాధికరణము.

సంగతి:- అచేతన ప్రధానము జగత్కారణము కాకపోయిన కాకపోవుగాక. గాని నిత్యజ్ఞానాదిగుణములతోనున్న ఈశ్వరుని ద్వారా అధిష్టితమైన పరమాణువులు జగత్కారణము కాగలవు అను ప్రత్యుదాహరణ సంగతి వల్ల ఈ అధికరణము మొదలిడిరి.

విషయము:- వైశేషికుల పరమాణువాదము ఈ అధికరణమునకు విషయము.

సంశయము:- సంయుక్త పరమాణువులు జగత్తును ఉత్పత్తి చేయగలవా లేవా?

పూర్వపక్షము:- సృష్టికి మొదలులో పరమాణువులలో క్రియోత్పత్తికి కారణము అదృష్టము, దానిద్వారా రెండు పరమాణువుల సంయోగముగలిగి ద్వ్యణుకాది క్రమములో జగత్తు ఉత్పత్తి అగుచున్నది.

సిద్ధాన్తము:- సర్గారంభములో క్రియా ఉత్పత్తికి నిమిత్తము స్వీకరించిననూ స్వీకరించకపోయిననూ రెండు దశలలో పరమాణువులద్వారా జగదుత్పత్తి కానేరదు. గాన వైశేషిక మతము ద్వారా వేదాన్తసమన్వయమునకు ఏ విధమైన

విరోధము లేదు.

వైయాసికన్యాయమాలా:-

125. జనయన్తి జగన్నో వా సంయుక్తాః పరమాణవః। ఆద్యకర్మసంయోగాద్ద్వ్యణుకాదిక్రమాజ్జనిః॥

126. సనిమిత్తానిమిత్తాదివికల్పేష్వాద్యకర్మణః। అసంభవాదసంయోగే జనయన్తి న తే జగత్॥

సంయుక్త పరమాణువులు జగత్తును ఉత్పత్తి జేయగలవా లేవా? సృష్టికి పూర్వము కర్మజన్య సంయోగమువలన దగ్గరజేరిన పరమాణువుల సంయోగముద్వారా ద్వ్యణుకాది క్రమములో జగత్తు ఉత్పత్తి చెందును. అని పూర్వవాది మతము. అపుడు సిద్ధాన్తి చెప్పు సమాధానము. ఆ సంయోగకర్మకు నిమిత్తముగలదా నిమిత్తములేదా అను వికల్పమునకు జవాబు. ఆది కర్మ అసంభవమగుటవలన పరమాణువుల సంయోగము కలుగదు గాన జగత్తు ఉత్పత్తిగాజాలదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

పూర్వమున్న జగత్తు లీనమైన తరువాత మరల భగవంతుడు సృష్టి చేయదలచినపుడు ప్రాణుల కర్మవలన సంపూర్ణ పరమాణువులలో ఆది కర్మ ఉత్పన్నమగును. ఆ కర్మవలన ఒకపరమాణువు వేరొక పరమాణువుతో కలిసి ద్వ్యణుకమును ఉత్పన్నము గావించును. మూడు ద్వ్యణుకములు కలిసి ఒక త్ర్యణుకమును ఉత్పత్తి గావించును. ఈ క్రమములో జగత్తు ఉత్పత్తి అగుటలో ఏవిధమైన ఆటంకములేనందున సంయుక్త పరమాణువులు జగదుత్పతి గావించగలవు అని పూర్వపక్షి మతము. సిద్ధాన్తి సమాధానము. మీరు చెప్పు ఆది కర్మ సనిమిత్తమా? లేక నిర్నిమిత్తమా? నిర్నిమిత్తకమైన నియామకములేనందున ఎల్లప్పుడు కర్మ ఉత్పత్తి అగుచుండుటవలన ప్రళయములోగూడ జగదుత్పత్తి ప్రసంగము వచ్చును. నిమిత్తము కలదనిన ఆనిమిత్తము దృష్టమా? లేక అదృష్టమా? దృష్ట నిమిత్తము కాజాలదు, ఏలనన ప్రయత్నము లేక ఒక అణువుతో వేరొక అణువు కలయుట శరీరోత్పత్తికి ముందు సంభవముకాదు. ఈశ్వరుని ప్రయత్నము నిత్యము గాన ఎప్పుడో ఒకప్పుడు జరుగు ఆది కర్మకు ఆ ఈశ్వరుని ప్రయత్నము నియామకము కాజాలదు. అదృష్టము గూడ ఆది కర్మకు నిమిత్తము కాజాలదు ఏలనన ఆత్మలో సమవాయ సంభన్ధముతో నున్న అదృష్టమునకు పరమాణువులతో సంభన్ధము కుదరదు. ఈ రకములైన వికల్పములు కలుగుటవలన ఆది కర్మ సంభవము గాదు గాన పరమాణువుల సంయోగము గానేరదు. దీని ద్వారా సిద్ధమైన దేమనగా 'పరమాణువుల కలయికవలన జగత్తు ఉత్పత్తి అగును' అను మతము బొత్తిగా యుక్తి సంగతముగాదు.

183. ఉభయథాపి న కర్మాతస్తదభావః. (2.2.12)

సూత్రార్థము:- వైశేషికుల సృష్టి క్రమమములో సృష్టకి ముందు నిశ్చలముగానున్న పరమాణువులలో కర్మ ద్వారా సంయోగము కలిగి ద్వ్యణుకాదుల ఉత్పత్తి కలుగునని చెప్పెదరు. ఈ కర్మకు నిమిత్తము ఉన్నదా లేదా? నిమిత్తము ఉన్నదనిన జీవుల ప్రయత్నముద్వారా జన్యమైన అభిఘాతమును (అనగా ఒక ద్రవ్యముతో వేరొక

ద్రవ్యము కలయుట) మొదలైనవానిని స్వీకరించవలయును. ఆ అభిఘాతాదులు సంభవముకాదు. అవి సృష్టి అనంతరమే అగును. రెండవ  వికల్పము నిమిత్తము లేదనిన కర్మ ఉత్పత్తి కాదు గాన రెండు విధములుగా పరమాణువులలో చేష్ట కలుగదు. అంతేగాక అదృష్టము అచేతనముగాన స్వయముగా కర్మకై ప్రవృత్తిగాలేదు. కర్మ లేనందున ద్వ్యణుకాది క్రమములో సృష్టి కానేరదు.

పరమాణుకారణవాదము ప్రమాణమూలకమనును పూర్వపక్షి. లోకములో సావయవములైన ఘటాదులు కారణములైన కపాలముద్వారా, మరియు తంతువుల సంయోగరూపమగు సహకారి కారణమువలన పటాదుల కార్యము చూడబడుచున్నది. ఈ సామాన్య నియమానుసారము  అన్ని సావయవ కార్యములకు కారణములో నున్న సంయోగాదుల సంస్కారమువలన కార్యములు ఆరంభమగునని స్వీకరించవలయును. పృథ్వి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, కాలము, దిశలు, ఆత్మ మరియు మనస్సు ఈ తొమ్మిది ద్రవ్యములలో మొదటి నాలుగు ద్రవ్యములు సావయవములు. వీని అంతిమ అవయవము నాలుగు రకముల పరమాణువులని వైశేషికులు అందురు. ప్రళయకాలములో సావయవ ద్రవ్యములు విభాగ మవుతు  అవుతూ అత్యన్త చిన్నవియైన పరమాణువులు మిగులును. వైశేషికులు ఈ పరమాణువులు ఖండితములగునని ఒప్పుకొనరు. సృష్టికి ఆరంభములో ఈ పరమాణువులలో ప్రాణుల అదృష్టమువలన క్రియ ఉత్పన్నమగును. ఆ ప్రక్రియ వలన పార్థివ, జలీయ, తైజస, వాయవీయ పరమాణువులకు సంయోగము కలిగి ద్వ్యణుకము, త్ర్యణుకము మరియు చతురణకము మొదలగు క్రమము ద్వారా పృథివీ మొదలగు మహాభూతములు ఉత్పన్నమగు చున్నవి. ఆ తరువాత తంతువులద్వారా వస్త్రము ఉత్పన్నమగునట్లు దారములోనున్న రంగు వస్త్రములో వచ్చును, అదేవిధముగా పరమాణువులలోగల రూపాదుల వల్ల ద్వ్యణుకాదులలో రూపాదులు ఉత్పన్నమగును. ఈ విధముగా కాణాదుల మతము ప్రమాణికము.

వేదాన్త దర్శనానుసారము వైశేషిక పరమాణు కారణవాదము సర్వథా భ్రాన్తిమూలము, ఎందులకనగా పరమాణువులు ప్రళయములోపూర్తిగా నిశ్చలములై యుండగా వానిలో సంయోగము కలిగించు క్రియ అకస్మాత్తుగా ఎట్లు కలుగును? పరమాణువులలో కలుగు క్రియకు నిమిత్తము కలదా లేదా? నిమిత్తము ఉన్న జీవుని ప్రయత్నము మరియు ఆఘాతాదులు (ఒక ద్రవ్యముతో వేరొక ద్రవ్యము కలయుట) పరమాణువులలో సంయోగజనక కర్మ ఉత్పత్తికి నిమిత్తమా లేక జీవుల అదృష్టము చెప్పిన కర్మకు నిమిత్తమా? రెండు పక్షములలో కర్మజరగుట అసంభవము. సృష్టికి ముందు జీవప్రయత్నము అభిఘాతాదులు సర్వథా అసంభవములు ఏలనన శరీరము ఉండిననే జీవ ప్రయత్నము జరుగును. శరీరము లేనిచో ప్రయత్నము జరుగుట అసంభవము. శరీరములో మనస్సు ప్రతిష్టితమైన తరువాతనే  ఆశరీరములోనున్న ఆత్మతో మనసునకు సంయోగము కలిగి మొదట జ్ఞానముత్పన్నమగును. ఆ తరువాత ఆ ఆత్మలో ఇచ్ఛ మరియు ప్రయత్నము ఉత్పన్నమగును. జీవుని శరీరమే ఉత్పన్నముగానపుడు సృష్టికి మొదలులో ఆ సృష్టికి అనుకూలమగు క్రియ శరీరము నపేక్షించి ఎట్లు జరుగును? జీవుని శరీరములేనందున అభిఘాతాది దృష్ట కారణములు సృష్టి ఉత్పత్తికి కారణములని

చెప్పుటగూడ తగదు ఎందులకనగా సృష్టికి తరువాత జరుగునవి గాన. జీవుని అదృష్టము స్వయముగా జడము గాన స్వయముగా కర్మాభిముఖము గాజాలదు. ఇంతవరకు పరమాణువుల సంయోగమునకు నిమిత్తమును ఖండించి ఇప్పుడు నిమిత్తము లేని పక్షమును ఖండించుచున్నారు. నిమిత్తములేనిచోపరమాణువుల సంయోగమునుత్పత్తిచేయు క్రియ లేనందున సృష్టి అభావము కలుగును. అనగా కర్మాభావమువలన ద్వ్యణుకాదుల క్రమములో సృష్టి ఉత్పత్తి కాజాలదు. అందువల్ల వైశేషికుల పరమాణువాదము భ్రాంతిమూలము.

184. సమవాయాభ్యుగమాచ్చ సామ్యాదనవస్థితేః. (2.2.13)

సూత్రార్థము:- అణువాదములో ద్వ్యణుకము పరమాణువుల కన్న భిన్నము. ఆలాగుననే సమవాయము పరమాణువులకన్న భిన్నము. రెండు పరమాణువులు సమవాయసంబన్ధము ద్వారా కలిసి ద్వ్యణుకము ఉత్పన్నమగుచున్నది. సమవాయము ఒక పదార్థము. ఆ సమవాయ పదార్థము అత్యన్త భిన్నములగు పరమాణువులను పదార్థములతో కలియునప్పుడు వేరొక సమవాయము కావలెను ఏలనన అత్యన్త భిన్నత్వము ఈ రెండింటిలో సమానము. ఈ స్థితిలో ఆయా సమవాయ సంబన్ధమునకు అన్యాన్యమయిన సమవాయముల కల్పన చేయవలసి వచ్చును. ఈ ప్రకారము అనవస్థాదోషము వలన ద్వ్యణుకాదుల సృష్టి కానేరదు. పూర్వ సూత్రమునుండి "తదభావః" అను పదమును అనువృత్తి కావించు కొనవలయును. ద్వ్యణుకాదుల సృష్టి యొక్క అభావము కలుగును, ఎందులకనగా వైశేషికులు సమవాయమును గూడ సృష్టియొక్క ఉత్పత్తిలో పరంపరముగా కారణముగా స్వీకరించిరి. రెండు పరమాణువులద్వారా ఉత్పన్నమగు ద్వ్యణుకము ఆపరమాణువులకన్న సర్వథా భిన్నము మరియు సమవాయ సంబన్ధముద్వారా పరమాణువులలో ద్వ్యణుకము ఉన్నది. ఈ విధముగా చెప్పు వైశేషికులు ఆఖరికి పరమాణువాదమును సమర్థము గావించలేరు ఏలనన తనతో సంబన్ధముగల పరమాణ్వాదులలో ఈ సమవాయముయొక్క సంబన్ధము కుదరదు. రెండు పరమాణువులకన్న అత్యన్తము భిన్నమైన ద్వ్యణుకము తన కారణమైన పరమాణువులలో సమావాయ సంబన్ధముతో నుండును. ఈ సమవాయము పరమాణువులు మరియు ద్వ్యణుకము కన్న అత్యన్త భిన్నము. ఈ సమవాయము తనతో సంబన్ధము కలుగు సమవాయిరూపములోనున్న పరమాణువులతో సంబన్ధము కొరకు వేరొక సమవాయ కల్పన స్వీకరించవలయును. మరల ఆ సంబన్ధము కొరకు ఇంకొక సమవాయ కల్పన స్వీకరించవలయును. ఈ ప్రకారము అనవస్థా దోషము వాటిల్లును. ఏ ఒక సమవాయము సిద్ధికాకున్నచో అన్నింటి సిద్ధి ఖండితమగును. అర్థాత్ రెండు పరమాణువులు ద్వ్యణుకముగా ఉత్పత్తి కాజాలవు. అందువల్ల పరమాణువాదము సర్వథా అసంగతము.

185. నిత్యమేవ చ భావాత్. (2.2.14)

సూత్రార్థము:- పరమాణువుల ప్రవృత్తి స్వాభావికమనిన, ఆ ప్రవృత్తి నిత్యమగుటవలన ప్రళయాభావ ప్రసంగము కలుగును. పరమాణువులు నివృత్తి స్వభావము కలవనిన ఆ నివృత్తి నిత్య మగుటవలన సృష్టి అభావ ప్రసంగము

వచ్చును. గాన పరమాణుకారణవాదము అసంగతము.
పరమాణువులు ప్రవృత్తి స్వభావము కలవనిన ద్వ్యణుకాదుల ఉత్పత్తి జరుగుచునే ఉండును గాన ప్రళయాభావ ప్రసంగము వచ్చును. పరమాణువులను నివృత్తి స్వభావము కలవానిగా స్వీకరించిన ఎప్పటికీ సృష్టి జరుగదు. ప్రవృత్తి మరియు నివృత్తి స్వభావము కలవానిగా స్వీకరించిన పరస్పరము విరోధమువలన అసంగతమగును. ఉభయ స్వభావ శూన్యములు పరమాణువులనిన ద్వ్యణుకాదుల ఉత్పత్తికి పరమాణువుల ప్రవృత్తిని లేక నివృత్తిని ఏదో ఒక దానిని నిమిత్తమని స్వీకరించవలయును. ఒకవేల అదృష్టమును ఆ పరమాణువుల ప్రవృత్తికి కారణమనిన ఆ అదృష్టాదులు పరమాణువులో నిత్యము సన్నిహితములా? లేక అసన్నిహితములా? ప్రథమ పక్షములో ఎల్లప్పుడు సృష్టి ప్రసంగము వచ్చును. రెండవ పక్షములో ఎల్లప్పుడు సృష్టి అభావ ప్రసంగము వచ్చును. అందువల్ల ఉభయ పక్షములలో దోషము వచ్చుటవలన పరమాణువాదము అసంగతము.

186. రూపాదిమత్త్వాచ్చ విపర్యయో దర్శనాత్. (2.2.15)

సూత్రార్థము:- వైశేషికులు పరమాణువులలో రూపాదులు కలవని స్వీకరింతురు. ఆలాగున స్వీకరించిన ఆపరమాణువులలో నిరవయవత్వము, నిత్యత్వము మరియు అణుత్వమునకు విపరీతమైన సావయవత్వము మొదలగు ధర్మములను స్వీకరించవలసి వచ్చును ఏలనన లోకములో రూపాదులతోనున్న ఘటాదులందు ఈ సావయవత్వాదులు గానవచ్చుచున్నవి.
పరమాణువులు జగత్తునకు కారణము గాజాలవు అంతేగాక ఆపరమాణువులు నిరవయవములుగూడ కాదు. వైశేషికుల మతములో సావయవ ద్రవ్యములు విభాగమవుతో అవుతో ఆఖరికి అన్తిమ అవయము పరమాణువు అను పేరుతో పిలవబడునందురు. ఆ పరమాణువు గూడ రూప రస గన్ధ స్పర్శములు గలవందురు. ఈ లోకములో ఘటాదులు సావయవములుగా కనబడు చున్నవి. అదేవిధముగా రూపరసాదులగల పరమాణువులు గూడ నిరవయవమునకు విపరీతముగా సావయవములు గావలెను. ఆలాగుననే సావయవమగు రూపరసాదులుగల ఘటపటాదులలో మహత్వము, అనిత్యము గూడ చూడబడు చున్నవి. గాన పరమాణువులలో గూడ అణుత్వము మరియు నిత్యత్వమునకు విపరీతముగా మహత్వము అనిత్యత్వము స్వీకరించుట ఉచితము. గాన వైశేషికుల మతములో తమ అభిప్రేతార్థమునకు విపరీత ప్రసంగము వచ్చుటవలన పరమాణుకారణవాదము అసంగతము.

187. ఉభయథా చ దోషాత్. (2.2.16)

సూత్రార్థము:- పృథివీ ఆది పరమాణువులు అధిక గుణములు గలవి మరియు మిగిలినవి తక్కువ గుణములు గలవని స్వీకరింతురా లేదా? మొదటి పక్షములో అణుత్వమునకు హాని కలుగును ఎందులకనగా ఎక్కువ మరియు తక్కువ గుణములుగల పృథివి మొదలగు వాని స్వరూపమునకు ఉపచయము లేక అధికత్వము చూడబడు చున్నది. రెండవ పక్షములో పరమాణువులద్వారా ఉత్పన్నమైన పృథివీ మొదలగు వానిలో

రూపాదుల అభావ ప్రసంగము వచ్చును. ఈ ప్రకారము రెండు పక్షములలో పరమాణువాదము యుక్తియుక్తము గాదు.

పృథివీ, జలము, తేజస్సు మరియు వాయువు మొదలగు నాలుగు భూతములలో గల పరమాణువులలో ఎక్కువ మరియు తక్కువ గుణములు గలవని వైశేషికులు అంగీకరింతురా లేదా? ఎక్కువ తక్కువ గుణములను అంగీకరించిన ఈ నాలుగు భూతములలో గల పరమాణువులు చిన్నవి పెద్దవి అని గూడ ఒప్పుకొనవలయును. ఏ పరమాణువులో ఎక్కువ గుణములని ఒప్పుకొనిన దానిలో అణుత్వము లేదని గూడ చెప్పవలయును. లోకములో పృథవీ యొక్క స్వరూపము కఠినము మరియు అధికమని చూడబడు చున్నది. దానిలో ఎవరి కాళ్ళు త్వరగా దిగబడవు. దాని కన్న జలము కోమలము మరియు తక్కువ గుణములు కలది. దానిలో కాళ్ళు తేలికగా దిగబడును. జలము కన్న అగ్ని మరియు వాయువు ఇంకా సూక్ష్మములు. తరువాత తరువాత సూక్ష్మత్వము వచ్చుటవలన ఏదో ఒక పరమాణువులో అణుత్వమునకు వ్యతిరేకము సంభవించును. పరమాణువులలో గుణములు అంగీకరించనిచో పృథివీ ఆది అన్ని పరమాణువులలో ఒక్క ఒక్క గుణమును మాత్రమే స్వీకరించిరనవలయును దాని వల్ల పృథివ్యాదులలో రూపాదిహీన ప్రసంగము వచ్చును. ఉభయ పక్షములలో దోషముండుట వలన పరమాణుకారణవాదము అసంగతము.

188. అపరిగ్రహాచ్చాత్యన్తమనపేక్షా. (2.2.17)

సూత్రార్థము:- మన్వాది శిష్టులద్వారా ఏ అంశములోను పరమాణువాదమును అంగీకరించలేనందున దానిలో మోక్షార్థులు అత్యన్తము హేయ బుద్ధి కలిగి యుండవలెను.

వైదిక సిద్ధాన్తవాదులైన మన్వాది మహర్షులు సత్కార్యత్వాది అంశములో ప్రధానకారణవాదమును స్వీకరించిరి కాని ఈ పరమాణుకారణవాదమును శిష్టపురుషులు ఏ అంశములోను స్వీకరించలేదు. గనుక మోక్షకాములగు వేదవాదులకు పరమాణుకారణవాదము అత్యన్తము అనాదరణీయము. అందుచే వైశేషిక సిద్ధాన్తము సర్వథా అప్రమాణికము.

ఇచట స్మరణయోగ్యమైన వాక్యములు కొన్ని గలవు, వారు భావము అభావము అను భేదముద్వారా పదార్థములు రెండు రకములందురు. వీనిలో ద్రవ్యము, గుణము, కర్మ, సామాన్యము, విశేషము మరియు సమవాయము అనునవి అరు భావ పదార్థములు. గోవు, మహిషము, కుందేలు, ఘటపటాదులవలే ఈ ఆరు పదార్థములు భిన్నములని అంగీకరించిననూ గుణము, కర్మ,సామాన్యము ద్రవ్యాధీనమందురు. వైశేషికులు ఈ విధముగా అంగీంకరించుట సర్వథా అనుచితము ఏలనన ఘటపటాదులు అత్యన్తము భిన్నపదార్థములు వానిలో ఒకటి రెండవదాని మీద ఆశ్రయించి ఉండుట లోకములో చూడ బడుట లేదు. ఆలాగుననే ద్రవ్యాదులు భిన్నమైన, గుణాదులు ద్రవ్యాశ్రితములై లేక ద్రవ్యాధీనములై ఎందుకు ఉండవలయును? కావున ద్రవ్యమొక్కటియే గుణాది రూపములతో తాదాత్మ్యసంబంధమున నున్నదనియు దానికే నామ భేదములు కలిగెనని అంగీకరించిన

సరిపడును గాని, లేనిచో మీ వైశేషికుల సిద్ధాన్తము యుక్తి యుక్తము కాదు. గుణాదులు ద్రవ్యరూపములనియే అంగీకరించ వలయును. దానికి వైశేషికులు చెప్పనదేమనగా ఏవిధముగా అగ్ని మరియు పొగ సర్వథా భిన్నములైననూ పొగ యొక్క ఉత్పత్తి మరియు ఉనికి అగ్ని అధీనము. ఆవిధముగనే గుణాదులు ద్రవ్యాధీనము అనిననూ ఏ దోషములేదు అనిన అట్లనుట సరికాదు. ఏలనన "ఇది తెల్ల గుడ్డ ఇది నల్ల గుడ్డ" అని వ్యవహారములను విమర్శించి చూచిన ద్రవ్యమొక్కటియే రూపభేదములతో నున్నట్లు స్పష్టముగా తెలియ వచ్చుచున్నది. అగ్ని మరియు పొగ ఒకదానిలో వేరొకటి ఆశ్రితమై యున్నట్లు ద్రవ్య గుణములు అత్యన్తము భిన్నమని చెప్పుట సర్వథా దుష్కరము. గుణము ద్రవ్యములో ఆశ్రితమని చెప్పిన దోషము లేదు. అందువల్ల నిస్సార తర్కము నుండి ముక్తి పొందుటకు, ఈశ్వరుని కారణమని చెప్పు శ్రుతులను విరోధించుటవలననూ మరియు శ్రుతుల తాత్పర్యమును తెలిసికొనుటలో పటుత్వము కలిగిన మన్వాది శిష్టుల ద్వారా ఏ అంశములోనూ వైశేషికమతము నంగీకరింపబడక పోవుటచే ఈ వైశేషుకుల పరమాణుకారణవాదము అత్యన్తము ఉపేక్షణీయము.

# 57. సముదాయాధికరణము.

సంగతి:- వైశేషికులు ద్రవ్యాదిపదార్థషట్కము నంగీకరించి వానిలో కొన్ని సత్యములనియు మఱికొన్ని అసత్యములనియు యుక్తి శూన్యముగా చెప్పుదురు. ఈకారణమువలన వారు అర్ధవైనాశికులు అనగా కొన్నిటియందు మాత్రము వినాశము నంగీరించువారు. వారి మతమును ఖండించి వైనాశికత్వ సామ్యమువలన బుద్ధిలోనున్న సర్వవైనాశిక సిద్ధాన్తమును నిరాకరింపబడుటవలన అవాన్తర సంగతి వల్ల ఈ అధికరణము మొదలిడిరి.

విషయము:- బుద్ధుని అనుయాయులలో బాహ్యాస్తిత్వవాదమును చెప్పువారు సౌత్రాన్తికులు-వైభాషికులు. వారి మతమును విచారించెదరు.

సంశయము:- బాహ్యాస్తిత్వవాదము ప్రమాణమూలకమా కాదా? అని సంశయము.

పూర్వపక్షము:- పరమాణువులు కారణమైన బాహ్య పృథివ్యాది భూతచతుష్టయములు మరియు రూపస్కంధము, విజ్ఞానస్కంధము, వేదనాస్కంధము, సంజ్ఞాస్కంధము, సంస్కారస్కంధము అను పంచస్కంధహేతుకము ఆధ్యాత్మిక సముదాయమని బాహ్యాస్తిత్వవాదమును చెప్పు బౌద్ధుల మతము ప్రమాణమూలకము.

సిద్ధాన్తము:- కారణస్వరూపము అచేతనము మరియు స్థిరచైతన్య రహితముగూడ, అందువల్ల స్కంధములు మరియు పరమాణువుల సముదాయముద్వారా బాహ్యాస్తిత్వవాదుల మతములో సృష్టి కానేరదు.

వైయాసికన్యాయమాలా:-

127. సముదాయావుభౌ యుక్తావయుక్తౌ వాఽణు హేతుకః। ఏకోఽపరః స్కన్ధహేతురిత్యేవం యుజ్యతే ద్వయమ్॥

128. స్థిరచేతనరాహిత్యాత్స్వయం చాఽచేతనత్వతః। న స్కన్ధానామణూనాం వా సముదయోఽత్ర యుజ్యతే॥

బాహ్యము మరియు లోపల ఈ రెండు సముదాయములు కలుగునా కలగవా? అను సంశయమునకు పూర్వవాది చెప్పునది. బాహ్య సముదాయము పరమాణుజన్యము మరియు ఆన్తర సముదాయము స్కన్ధహేతుకము ఈ విధముగా రెండు సముదాయములు సంభవము. సిద్ధాన్తి సమాధానము. సంఘాతము ఉత్పత్తియగుటకు నిమిత్తభూతము స్థాయిచైతన్యము అది లేనిచో స్వయముగా అచేతనములగునవి స్కన్ధముల మరియు పరమాణువుల సముదాయములు కాజాలవు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

బాహ్యాస్తిత్వవాది బౌద్ధులు రెండు సముదాయములు అంగీకరింతురు. ఒకటి బాహ్య సముదాయము రెండవది ఆన్తర సముదాయము. వానిలో బాహ్య సముదాయము పృథివీ, నదీ, సముద్రాదులు. ఆన్తర సముదాయములు చిత్తరూపము (జ్ఞానము) మరియు చైత్యరూపము (చిత్త కార్యము సుఖాదులు). ఈ రెండు సముదాయములే సంపూర్ణ జగత్తు. బాహ్య సముదాయమునకు కారణము పరమాణువులు. ఆ పరమాణువులు నాలుగు రకములు. వానిలో కఠినాకారములు గలవి పృథివీ పరమాణువులు. స్నిగ్ధత్వము లేక స్నేహము అనగా చూర్ణము ముద్ద యగుటకు అనుకూలమగు గుణము గలవి జలీయ పరమాణువులు. ఉష్ణము గలవి తైజస పరమాణువులు. చలనాత్మకములు వాయవీయ పరమాణువులు. ఒకే సమయములో సమూహముగా నున్న నాలుగు రకముల పరమాణువులలో బాహ్య సముదాయము ఉత్పన్నమగును. ఆన్తర సముదాయమునకు కారణము 1) రూపస్కన్ధము, 2) విజ్ఞానస్కన్ధము, 3) వేదనాస్కన్ధము, 4) సంజ్ఞాస్కన్ధము మరియు 5) సంస్కారస్కన్ధము ఈ ఐదు స్కన్ధములు. అందు శబ్దస్పర్శాదులును వానిని గ్రహించు నింద్రియములును కలిసి రూపస్కన్ధము. ఇంద్రియములు భౌతికములగుటచే బాహ్యపదార్థములందే చేర్పబడవలసినవి ఐనను శరీరముతోను నాత్మతోను సంబంధము కలవి కావున ఆంతరపదార్థములలో చేర్పబడెను. 'నేను నేను' అని ఎడతెగక లోలోన ఉదయించు జ్ఞానము విజ్ఞానస్కన్ధము. వారి మతములో ఇదియే ఆత్మ ఇదియే చిత్తము. సుఖదుఃఖములు కలిగినపుడు చిత్తమునందు జనించు వికారములు వేదనాస్కన్ధము. దేవదత్తుడు, యజ్ఞదత్తుడు అను మొదలగు నామభేదములచే కలుగు సవికల్పజ్ఞానములు సంజ్ఞాస్కన్ధము. రాగద్వేషాదులును ధర్మాదర్మములును వాని వాసనలు సంస్కారస్కన్ధములు. చెప్పిన ఐదు స్కన్ధముల సమూహముద్వారా ఆన్తర సముదాయము ఉత్పన్నమయినది. ఈవిధముగా రెండు సముదాయములు ఏర్పడ గలవు. ఇచట సిద్ధాన్తి చెప్పునది. అణువుల మరియు స్కన్ధముల సంఘాతోత్పత్తికి అన్య చేతనము నిమిత్తమా? లేక అవి స్వయముగనే సంఘీభూతములగు చున్నవా? ప్రథమ పక్షములో ఆ చేతనము స్థిరమా? లేక క్షణికమా? ఆ చేతనము స్థిరమనిన మీ సిధాన్తమునకు విరోధము కలుగును. ఆ చేతనము క్షణికమనిన స్వయముగా ముందు ఆత్మలాభమును పొంది తరువాత ఉత్పత్తి జేయునని చెప్పలేరు. స్వయముగా సంఘీభూతములగునను రెండవ పక్షములో అచేతనము జడము స్కన్ధములకు పరమాణువులకు ఏవిధముగనూ నియామకము కాజాలదు. చైతన్యము యొక్క సహాయము లేక

జడము ప్రతి నియత ఆకారముగా ఏర్పడుటకు ఏ ప్రకారము సంఘీభూతములగును? గాన ఈ రెండు సముదాయములు ఏర్పడజాలవు.

189. సముదాయ ఉభయహేతుకేఽపి తదప్రాప్తిః. (2.2.18)

సూత్రార్థము:- పరమాణువుల సముదాయమువలన బాహ్య పదార్థములును స్కన్ధసముదాయములవలన ఆధ్యాత్మిక పదార్థములు వాని ఉత్పత్తి సంభవముకాదు. ఎందులకనగా అచేతన పరమాణువులు స్కన్ధములు స్వయముగా వానంతట అవే సముదాయముగా కాజాలవు ఎందులకనగా వేరొక స్థిర చేతనమైన సంఘాతకర్త అభావమువలన. గాన సౌత్రాన్తికుల మరియు వైభాషికుల మతము భ్రాన్తి మూలకము.
ఇచట పూర్వపక్షములో సుగత మతమునకు విరోధము వచ్చుటవలన సమన్వయము అసిద్ధమనును. సిద్ధాన్తములో సమన్వయము సిద్ధమనును ఇదే ఫలభేదము. బుద్ధునకు ప్రధానముగా నలుగురు శిష్యులు గలరు. వీరిలో సౌత్రాన్తికులు మరియు వైభాషికులు బాహ్య పదార్థముల అస్థిత్వమును స్వీకరింతురు. ఈ సమానతను చూచుచు ఈ ఇద్దరిని బాహ్యాస్థిత్వవాదులందురు. మూడవవారైన యోగాచారులు క్షణిక విజ్ఞానవాదులు ఈ క్షణికముకన్న భిన్నమైన స్థూల భౌతిక పదార్థములను, చిత్త చైత్య పదార్థములను, బాహ్యాభ్యన్తరముల పదార్థములయొక్క అస్థిత్వమును స్వీకరించరు. నాలుగవవారు మాధ్యమికులు సర్వము శూన్యమని చెప్పువారు వీరు బాహ్యపదార్థములవలే క్షణిక విజ్ఞానము యొక్క అస్థిత్వమును గూడ స్వీకరించరు. వీరి మతములో శూన్యమే పరమార్థతత్వము మరియు మిగిలిన వస్తువులన్నియూ త్రాడు మీద పాము వలే కల్పితములు. సర్వ శూన్యము యొక్క జ్ఞానముచే నిర్వాణ పదము పొందును. చెప్పిన మూడు మతములలో మొదట బాహ్యాస్తిత్వ-వాదము యొక్క విచారము చేయవలయును.
ఇచట సందేహమేమనగా ఈ బాహ్యాస్తిత్వవాదము ప్రమాణమూలకమా లేక భ్రాన్తిమూలకమా? పూర్వపక్షి దీనిని ప్రమాణమూలకమనును. ఆతడు చెప్పునదేమనగా బాహ్యాస్తిత్వవాది మతములో పృథివీ, జలము, అగ్ని మరియు వాయువు అని నాలుగు భూతములు. వీనిలో పృథివీ కఠినస్వభావము గల పార్థివ పరమాణువుల నుండి ఉత్పన్నమైనది. స్నేహస్వభావము గల జలీయ పరమాణువుల నుండి జలము ఉత్పన్నమయినది. ఉష్ణస్వభావముగల తైజస పరమాణువుల నుండి అగ్ని ఉత్పన్న మయినది. బాహ్యమున గల పృథివ్యాదులలో సముదాయము వలన వానిలో పరమాణువులు మాత్రమే గలవు. ఆధ్యాత్మిక రూపాది సముదాయములకు రూపస్కన్ధము, విజ్ఞానస్కన్ధము, వేదనాస్కన్ధము, సంజ్ఞాస్కన్ధము మరియు సంస్కారస్కన్ధము అను పేరుగల పఞ్చస్కన్ధములు కారణములని స్వీకరింతురు. అందువల్ల బాహ్యాస్తిత్వవాదము ప్రమాణమూలకమనును పూర్వపక్షి. ఈసూత్రము ద్వారా సిద్ధాన్తపక్షమును చెప్పుచున్నారు. పరమాణువుల వలన కలుగు బాహ్యసముదాయము పఞ్చస్కన్ధములవలన కలుగు ఆధ్యాత్మిక సముదాయము అంగీకరించిననూ సముదాయము సిద్ధికానేరదు. పరమాణువులు మరియు స్కన్ధములు అచేతనములగుట వలన స్వయముగా

సముదాయరూపముగా గాజాలవు. వీనికి భిన్నమైన ఏ చైతన్య భోక్తను లేక స్థిర ప్రశాసకుని సముదాయమునకు కర్తగా వారు అంగీకరించుటలేదు. పరమాణువులలో నిరపేక్ష ప్రవృత్తిని స్వీకరించిన ఎల్లప్పుడూ ప్రవృత్తి ఉండుటవలన సృష్టి లయము కానేరదు. అనగా సృష్టి జరుగుచునే ఉండును గాన ప్రళయ ప్రసంగమే రాదు. సముదాయము సిద్ధికానందువలన పరాశ్రిత సంపూర్ణ లోకయాత్ర లుప్తమగును. గాన బౌద్ధుల మతము భ్రాన్తి మూలకము.

190. ఇతరేతరప్రత్యయత్వాదితి చేన్నోత్పత్తిమాత్రనిమిత్తత్వాత్. (2.2.19)

సూత్రార్థము:- అవిద్యాదులవలన సంఘాతమేర్పడును ఆ అవిద్యాదులే పరస్పరము కార్యకారణ మగుట వలన ఘటీయన్త్రమువలే ఆ అవిద్యాదులు ఎల్లప్పుడు తిరుగుచుండును, దానివలన సముదాయాదులు ఉత్పత్తి చెందును. ఇటుల చెప్పుట సరికాదు. ఆ అవిద్యాదులు పరస్పరము సంఘాతాదుల ఉత్పత్తికి కారణమయిన మీ అభిమతము నెరవేరదు. కారణాధీనము మరియు కారణసముదాయములకు అధీనమయి అవిద్య కార్య సంఘాతాదుల ఉత్పత్తి గావింపజాలదు. ఎందులకనగా మీ మతములో సంఘాతకర్త స్థాయి చేతనమని అంగీకరించుటలేదు గనుక.

సంఘాతముల నిర్మాణకర్తా మరియు భోక్తా ఏదోఒక చైతన్యము కాక పోయిన కాక పోవుగాక. అయినప్పటికి అవిద్యా, సంసస్కారము, విజ్ఞానము అనునవి అహర్నిశము భ్రమణము చేయుచు ఒకటి వేరొకదానికి కారణ మగుననియు, మరియు వాని ఆవృత్తివలననే అనాయాసముగా సంఘాతములేర్పడునందురు, ఆ దశలో లోకయాత్ర యొక్కసిద్ధి దానంతట అదే జరుగునని చెప్పుట సరికాదు. ఏలనన ఈ అవిద్యాదులు సంఘాతముల ఉత్పత్తికి మాత్రమే కారణముగాన. అనగా ముందున్న అవిద్య తరువాత అవిద్యఉత్పత్తికి నిమిత్త కారణము కాగలదు. ఆ విధముగనే సంస్కారము మరియు విజ్ఞానము స్వజాతీయ సంస్కార విజ్ఞానముల ఉత్పత్తికి కారణము కాగలవు గాని సంఘాతోత్పత్తికి కారణము గాజాలవు. అపుడు భోగము భోగము కొరకేగాని భోక్తకు గాదు అనవలయును, మొక్షము మొక్షము కొరకేగాని ముముక్షువునకు గాదు అనవలయును ఏలనన మీమతములో భోక్త మరియు ముముక్షువు స్థిరము గాదు గాన. భోగ మొక్ష కాలములో వానిని స్థిరమని చెప్పిన మీ క్షణికత్వ సిద్ధాన్తమునకు విరోధము కలుగును.

191. ఉత్తరోత్పాదే చ పూర్వనిరోధాత్. (2.2.20)

సూత్రార్థము:- ముందు కార్యముత్పత్తి అగు క్షణములో పూర్వకారణక్షణము నాశనమగునని అంగీకరించుటవలన సుగతుని మతములో కారణమధీనమయి కార్యముత్పన్నము కాజాలదు.

ఇంతకు ముందు సూత్రములో అవిద్యాదులకు ఉత్తరకాలీన అవిద్యాదులయొక్క ఉత్పత్తిమాత్రమునకై నిమిత్తకారణ

మని చెప్పిరి అయిననూ సంఘాతము యొక్క సిద్ధి కాలేదు. ఇపుడు ఆ సంఘాతాదుల ఉత్పత్తికి నిమిత్త కారణము గూడ అసంభవమని చెప్పుచుచున్నారు. క్షణికవాదుల మతములో ఉత్తర పరమాణువు ఉత్పత్తిఅగు క్షణములో పూర్వపరమాణువు నాశనమగుచున్నది. ఈ విధముగా స్వీకరించు క్షణభంగవాదుల మతములో పూర్వోత్తర క్షణములలో కార్యకారణ భావము నెట్లు నిరూపించగలరు? లోకములో కార్య కాలములో మన్ను, చక్రము మొదలగునవి ఘటాదుల కార్యమునకు కారణములుగా చూడబడుచున్నవి. నాశనమునొందిన మృత్తికాదులు ఘటాదుల కార్యముగా చూడబడుటలేదు. గాన కారణము నాశనముమయినది లేదా నాశనమగుచున్నది. ఈ రెండు పక్షములలో పూర్వక్షణము అభావగ్రస్త మగుటవలన ఉత్తరక్షణములోనున్న కార్యమునకు హేతువు గాజాలదు. గాన బౌద్ధుల మతము అత్యన్తము అసంగతము.

192. అసతి ప్రతిజ్ఞోపరోధో యౌగపద్యమన్యథా. (2.2.21)

సూత్రార్థము:- కారణము లేకపోయిననూ కార్యముత్పత్తియగునని ప్రతిజ్ఞ గావించిన, జ్ఞానము, చక్షువు, ప్రకాశము మరియు విషయము అను ఈ నాలుగు హేతువులు విద్యమానమై యుండగా కార్యము అనగా నీలాది జ్ఞానము కలుగును అని చెప్పిన పూర్వము చెప్పిన ప్రతిజ్ఞకు బాధ కలుగును. కార్యము సహేతుకమని స్వీకరించి, కార్యముత్పన్నమగు వరకు కారణము యొక్క స్థితి అని స్వీకరించిన, కార్య కారణములు ఒకే కాలములో నుండునని నిశ్చయమగుటవలన క్షణికత్వ ప్రతిజ్ఞకు హాని కలుగును.

కారణములేకున్నను లేక నష్టమయినను కార్యముత్పన్నమగునని చెప్పిన సర్వము క్షణికమను ప్రతిజ్ఞకు హాని కలుగును ఎందులకనగా జ్ఞానము, నేత్రము, ప్రకాశము మరియు విషయము అను నాలుగు కారణములను ఆశ్రయించి చిత్తమను జ్ఞానము, చైత్యమను సుఖాదులను పదార్థములు ఉత్పన్నమగుననునది మీ ప్రతిజ్ఞ. కారణము నష్టమయిన తరువాత కార్యముత్పన్న మగుననిన చెప్పిన ప్రతిజ్ఞయే నష్టమగును. దీనికి విపరీతముగా కార్యముత్పన్నమగువరకు కారణముండుననిన కార్య-కారణములు రెండున్నూ ఏకకాలములో కలిసి ఉండునని చెప్పవలయును. అపుడు అన్ని సంస్కారములు క్షణికములను ప్రతిజ్ఞ నష్టమగును. ఈ పై రెండు ప్రకారములుగా ప్రతిజ్ఞనాశ ప్రసంగము వచ్చుటవలన మీమతము అసంగతము.

193. ప్రతిసంఖ్యాప్రతిసంఖ్యానిరోధాప్రాప్తిరవిచ్ఛేదాత్. (2.2.22)

సూత్రార్థము:- సంతానము, సంతానము కలవానిలో బుద్ధిపూర్వకనాశము మరియు అబుద్ధిపూర్వకనాశము సంభవముకాదు, ఎందులకనగా సంతానము, సంతానము కలవానిలో విచ్ఛేదము కలుగదు. అందువల్ల నాశద్వయమునకు ఉత్పత్తి కలుగదు.
క్షణభంగవాదులు కల్పన చేయునదేమనగా బుద్ధిగమ్యమైన వస్తువులు, ఉత్పాద్యములు మరియు క్షణికములు

కింద చెప్పబొవు మూడు పదార్థములకన్న వేరందురు. ఆ మూడు పదార్థములు ప్రతిసంఖ్యానిరోధము, అప్రతిసంఖ్యానిరోధము మరియు ఆకాశమందురు. 'ఈ పదార్థమును నేను నాశనము చేయుదును' అను సంకల్పముతో చేయబడు- నాశము ప్రతిసంఖ్యా నిరోధము(నాశము). ఇట్లుగాక స్వయముగనే కలుగు నాశము అప్రతిసంఖ్యా నిరోధము (నాశము). ఈ రెండును ఆకాశము అనునవి మూడును వ్యవహారమాత్రములే గాని బుద్ధికి గోచరములగునవి కావు. ఈ మూడును అభావములే. వీనికంటె భిన్నమగు పదార్థములు అన్నియూ క్షణికములు. అన్ని పదార్థములు వీనితో సంబంధము కలిగి యుండును. వీనిలో ఆకాశము ఆవరణాభావరూపము. ఆకాశము యొక్క ఖండన ముందు సూత్రములలో గావించెదరు. ఇపుడు ప్రతిసంఖ్యానిరోధము మరియు అప్రతిసంఖ్యానిరోధమును ఖండించెదరు. ఈ రెండు నిరోధములు సంతానగోచరములా? లేక భావగోచరములా? ఈ రెండు నిరోధములు ఏ పదార్థమునకుగాని సంభవించుటకు వీలులేదు. ఏలనన వానికి విచ్ఛేదము లేదు. ఆ నిరోధముల పరంపరయని ఒక పదార్థమువలన వేరొకపదార్థము జనించుచుండు ననియు అట్లే అవిచ్ఛిన్నముగా పదార్థ పరంపర వచ్చు చుండునని నయు వారు చెప్పెదరు. సంతానము గోచరమని చెప్పనలవికాదు. సంతానమనగా కార్య-కారణభావములతో గూడిన పదార్థముల ప్రవాహము. సంతానముగలవి సంతాని అందురు. సంతానములో సంతాని అవిచ్ఛిన్నరూపముగా కార్య-కారణ భావముగా నుండుటవలన సంతానమునకు విచ్ఛేదము లేదు. గాన నిరోధములు సంతానగోచరములని చెప్పలేము. భావగోచరములు గాలేవు. ఏలనన భావపదార్థములలో ఆత్యన్తిక వినాశము లేదు. ఘటకపాలచూర్ణా దులకు ఆత్యన్తిక వినాశము లేదు. అంతేగాక క్షణికమనగా రెండవక్షణములో వస్తువు దానంతటదే నాశనమగును. గాన సుగతుడు చెప్పు రెండు రకముల నిరోధముల సిద్ధికాజాలదు లేక యుక్తిసంగతము గాదు.

### 194. ఉభయథా చ దోషాత్. (2.2.23)

సూత్రార్థము:- అవిద్యయొక్క నాశము దాని యథార్థ జ్ఞానముద్వారా కలుగునా, లేక దానంతటదే నశించునా? మొదటి పక్షములో నిర్హేతుకనాశము స్వీకరించిన వారి సిద్ధాన్తమునకే విరోధము వచ్చును. రెండవ పక్షములో జ్ఞానోపదేశము వ్యర్థమగును. రెండు పక్షములలో దోషముండుటవలన సౌగత మతము అసంగతము.
ఏ పదార్థములకు నాశము మనకు తెలియకుండగనే జరుగునో లేక మన అజ్ఞాత దశలో కలుగునో వానిని అబుద్ధి-పూర్వక నాశమందురు. గాని వేనిని జ్ఞానపూర్వకముగా సాధనలవలన నాశము గావించు కొందుమో వానిని బుద్ధిపూర్వక నాశములందురు. అన్ని పదార్థములు ఈ రెండు విధములుగనే నాశనమగునని సౌగతులు స్వీకరించిరి. బుద్ధిపూర్వక నాశనములో సౌగతులు కల్పిత పదార్థములను, మరియు క్షణిక వస్తువులలో స్థాయిత్వరూప అజ్ఞాన నాశము యమనియముల సాధనములద్వారాకలుగు యథార్థ జ్ఞానము ద్వారా కలుగునని అంగీకరింతురు. అందువలన అకారణముగా అన్ని వస్తువుల నాశనము అను నిర్హేతుక వినాశ రూప సిధాన్తమునకు హాని ప్రసంగము వచ్చును. లేనిచో స్వయముగనే అన్నీ వస్తువులు నాశనమగునని స్వీకరించిన

సాధనములు లేకయే అవిద్యాదుల నాశము కలుగును. మరి 'సర్వము క్షణికము' 'సర్వము దుఃఖము' అను మార్గమును ఉపదేశించుట అనర్థకమే గదా! గాన రెండు విధములుగా దోషము వచ్చుట వలన ఈ సౌగత మతము అసంగతము.

## 195. ఆకాశే చావిశేషాత్. (2.2.24)

సూత్రర్థము:- 'ఆత్మన ఆకాశః సంభూతః' ఆత్మనుండి ఆకాశము ఉత్పన్నమగు చున్నది.(తై.2.1) ఈ శ్రుతి ద్వారా మరియు శబ్దగుణకమాకాశము అని చెప్పుటవలనను పృథివ్యాదులవలే వస్తుత్వము అనునది సిద్ధమగు చున్నది. అందువల్ల ఆకాశము అభావరూపముకాదు.

పైన చెప్పిన రీతిగా ప్రతిసంఖ్యానిరోధము మరియు అప్రతిసంఖ్యానిరోధమును ఖండించిరి. ఇపుడు ఆకాశము అభావరూపమనుదానిని ఖండించుచున్నారు. సౌగతును మతములో "బుద్ధిపూర్వక వినాశము మరియు అబుద్ధిపూర్వక వినాశము అభావరూపములని అంగీకరించిరి. ఆవిధముగనే ఆకాశమును గూడ అభావరూపమని స్వీకరించిరి". అట్లు చెప్పుట సరికాదు. బుద్ధిపూర్వక నాశము మరియు అబుద్ధిపూర్వక నాశము ఈరెండింటిలో ఏవిధముగా వస్తుత్వ జ్ఞానము కలుగుచున్నదో అలాగుననే ఆకాశమునందు గూడ వస్తుత్వ జ్ఞానము కలుగు చున్నది. ఆకాశము వస్తువని చెప్పుటకు శ్రుతి మరియు అనుమానము ఈ రెండు ప్రమాణములు. తైత్తిరీయ శ్రుతిలో ' ఆత్మనః ఆకాశ సంభూతః' 'ఆత్మనుండి ఆకాశము ఉత్పన్న'మని చెప్పిరి. శబ్దరూప గుణమువలన ఆకాశమును అనుమేయమనిరి. పృథివీలో వస్తుత్వమున్న రీతిగనే శబ్దగుణాశ్రయము ఆకాశములో గూడ వస్తుత్వమున్నది. సుగతుని మతములో 'వాయుః కిం సంనిశ్రయః' 'వాయువు దేనిలో ఆశ్రితమనగా' దానికి జవాబుగా 'వాయువు ఆకాశములో ఆశ్రితమనిరి'. ఈ విధముగా సుగతును మతములో వాయువునకు ఆశ్రయరూపముగా ఆకాశమును ప్రతిపాదించిరి. అందువల్లదానిలో ఆవరణాభావమాత్రత్వము మరియు అవస్తుత్వము చెప్పుట సరిగాదు. అంతేగాక చెప్పిన మూడు వస్తవులలో నిత్యత్వము అభావత్వము చెప్పుట పరస్పర విరుద్ధము. అవస్తువులో (వస్తువు కాని దానిలో) నిత్యత్వము ఉండుట సంభవముగాదు. ఆలాగుననే ధర్మ-ధర్మి భావము చెప్పిన ఘటాదులవలే మూడింటిలో వస్తుత్వము ఉండును కాని వాని అభావము సిద్ధముగాదు.

## 196. అనుస్మృతేశ్చ. (2.2.25)

సూత్రార్థము:- అనుభవానన్తరము ఉత్పన్నమగు స్మరణమును అనుస్మృతి అందురు. ఈ అనుభవబలము వలన గూడ అనుభవించువాడగు ఆత్మ క్షణికము కాదు అనునది సిద్ధమగుచున్నది.

క్షణభంగవాదులు సర్వము క్షణికమని అంగీకరించుచూ ఆత్మను గూడ క్షణికమని అంగీకరించిరి. దానినే ఇచట అనుస్మృతిశబ్దము ద్వారా చెప్పిరి. ఈ అనుస్మృతి ద్వారా అత్మలో క్షణికత్వము చెప్పుట అసంగతము. ఏ వ్యక్తి ఒక

విషయమును అనుభవించుచున్నాడో దాని స్మరణము ఆవ్యక్తికే అగును కాని వేరొకనికి గాదు. అనుభవము మరియు స్మరణ కర్త ఒకడేనని లోకానుభవము. మొదట చూచిన వానినే ఇపుడు చూచు చున్నాను అను ప్రత్యభిజ్ఞ ఆత్మ క్షణికముగాదనుటకు ప్రమాణము. అంతేగాక స్వపక్షసిద్ధి పరపక్ష ఖండనము ఆత్మ క్షణికత్వపక్షములో సిద్ధిగావు. గాన వైనాశిక సిద్ధాన్తము సంపూర్ణముగా అసంగతము.

197. నాసతోఽదృష్టత్వాద్. (2.2.26)

సూత్రార్థము:- అభావమునుండి కార్యము ఉత్పత్తి కాజాలదు ఎందులకనగా కుందేలు కొమ్ము, నరవిషాణము మొదలగువానినుండి కార్యోత్పత్తి చూడబడుటలేదు.

సుగతుని మతములో 'నానుపమృద్య ప్రాదుర్భావాత్' "విత్తనము నశించిన పిదపగాని చెట్టు పుట్టుటలేదు, పాలు నశించినపిదప గాని పెరుగు ఉత్పన్నమగుటలేదు, మట్టి ముద్ద నశించినపిదపగాని ఘటము జనించుటలేదు" అభావము లేక నిర్వికార కారణమునుండి కార్యము యొక్క ఉత్పత్తి చూడబడుటలేదు. "తద్భావే తద్భావః అన్వయః, తదభావే తదభావః వ్యతిరేకః" బీజమున్న వృక్షము ఉండును అనునది అన్వయము. బీజములేనిచో వృక్షము లేదు అనునది వ్యతిరేకము. ఈ అన్వయ-వ్యతిరేకము ద్వారా అభావమునుండి కార్యముత్పన్నమగునని సుగతుని మతము. ఈ సిద్ధాన్తము సరికాదు, ఎందులకనగా అభావస్వరూపమైన నరవిషాణమునుండి ఎచ్చటనూ కార్యోత్పత్తి చూడబడలేదు. కాని దానికి విపరీతముగా విద్యమానమైన మట్టి పిండమునుంచి ఘటాదుల కార్యోత్పత్తి చూడబడు చున్నది. కార్యములో ఎల్లప్పుడు కారణము అనుస్యూతమయి ఉండును. కటక-కుండలాదులలో బంగారము అన్వయము, మరియు ఘటాది కార్యములలో మట్టి అన్వయము అని సర్వత్ర చూడబడుచున్నది. గాన అసత్తు నుండి కార్యముత్పన్నమగునని చెప్పు క్షణభంగవాదుల సిద్ధాన్తము పూర్తిగా అనుచితము.

198. ఉదాసీనానామపి చైవం సిద్ధిః. (2.2.27)

సూత్రార్థము:- అభావమునుండి భావ పదార్థ ఉత్పత్తి అనిన ఆ యా కార్యముల సిద్ధికి ప్రవృత్తికాని వారికి గూడ, లోకములో వారి వారి అభీష్టసిద్ధి కలుగును. దీని వల్ల సిద్ధమగునచున్నదేమనగా వైభాషికుల మరియు సౌత్రాన్తికుల మతము భ్రాన్తి మూలమనునది.

అభావమునుండి భావపదార్థముత్పన్నమని అంగీకరించిన ప్రయత్న శూన్య వ్యక్తికి గూడ తన యొక్క అభిమత కార్య సిద్ధి కలుగును ఏలనన అన్ని రకముల అభావము అన్ని చోట్ల సులభ సాధ్యము. అంతేగాక లౌకికములు మరియు శాస్త్రీయ కర్మలన్నీయూ ప్రయత్నములేకయే కార్యసిద్ధి కలుగు ప్రసంగము వచ్చును. గాన సౌత్రాన్తిక మతము మరియు వైభాషికుల మతము భ్రాన్తిమూలమగుటవలన అత్యన్త ఉపేక్షణీయము.

# 58. అభావాధికరణము.

సంగతి:- బాహ్యార్థవాది మతమును క్రిందటి అధికరణములో ఖండించిరి. దానిని ఇపుడు ఉపజీవ్యము (ఆశ్రయము) గావించుకొని క్షణికవిజ్ఞానవాదీ యోగాచారుని మతము ఉపస్థితి అగు చున్నది. గాన పూర్వాధికరణముతో దీనికి ఉపజీవ్య-ఉపజీవకభావ సంగతి.

విషయము:- విజ్ఞానవాదీ యోగాచారుని సిద్ధాన్తము ఈ అధికరణానికి విచారణీయ విషయము.

సంశయము:- బాహ్య పదార్థముల అస్థిత్వము అంగీకరించక విజ్ఞానస్కందములు మాత్రమే జగత్స్వరూపమని స్వీకరించు యోగాచారుని మతము యుక్తిసంగతమా? కాదా?

పూర్వపక్షము:- స్వప్న దృష్టాన్తమును చూచుచు విజ్ఞానవాది సిద్ధాన్తము యుక్తిసంగతమని సిద్ధమగు చున్నది. క్షణిక బుద్ధియే వ్యవహారదృష్టిలో స్వప్నమువలే బాహ్యమున గోచరిచుచున్నది.

సిద్ధాన్తము:- స్వప్నదృష్టాన్తములో వైషమ్యమను దోషముకలదు. బాహ్య వస్తువుల ఉపలబ్ధి కలుగు చున్నది. వానికి భాధ కలుగుటలేదు. నీవు చెప్పు "బహిర్వదవభాసతే" అను యుక్తి సరికాదు. అందువల్ల బుద్ధియే ఘట-పటాదుల బాహ్యరూపములో కానవచ్చుచున్నది అను ఈ యోగాచారుని మతము భ్రాంతిమూలకము.

వైయాసికన్యాయమాలా:

129. విజ్ఞానస్కన్ధమాత్రత్వం యుజ్యతే వా న యుజ్యతే। యుజ్యతే స్వప్నదృష్టాన్తాద్బుద్ధ్యైవ వ్యవహారతః॥

130. అబాధాత్స్వప్నవైషమ్యం బాహ్యార్థస్థూపలభ్యతే। బహిర్వదితి తేఽప్యుక్తిర్నాతో ధీరర్థరూపభాక్॥

విజ్ఞానస్కన్ధమాత్రత్వము యుక్తి యుక్తమా కాదా? అనగా కేవలము విజ్ఞానమే ఉన్నది బాహ్యపదార్థములు లేవు అని చెప్పు బౌద్ధుల మతము యుక్తి యుక్తమా కాదా? అను పూర్వపక్షమునకు సిద్ధాన్తి చెప్పు సమాధానము. స్వప్న దృష్టాన్తము సరికాదు ఎందులకనగా జాగ్రత్ వ్యవహారము భాధితముగుటలేదు. అంతేగాక బాహ్య వస్తువులు ఉపలబ్ధమగు చున్నవి. "బహిర్వత్" అని నువ్వు యుక్తి గూడ చెప్పుచున్నావు, గాన బుద్ధి పదార్థరూపము గాదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

కొంతమంది బౌద్ధుని అనుయాయులు బాహ్య వస్తువులు ఉపలబ్దములు కావని చెప్పుచు విజ్ఞానమాత్రమే తత్త్వమని అంగీకరింతురు. అచట వ్యవహారము యుక్తిసంగతము కాదని చెప్పటకుగూడ వీలులేదు. ఎందులకనగా స్వప్నములో భాహ్యవస్తువులు లేకపోయిననూ కేవలము బుద్ధిద్వారా వ్యవహారము కానవచ్చుచున్నది, అదేవిధముగా జాగ్రత్ వ్యవహారము యుక్తిసంగతము. దీనిద్వారా విజ్ఞానస్కన్ధమాత్రత్వమే యుక్తము అనునది పూర్వపక్షము. సిద్ధాన్తి చెప్పునది. స్వప్న దృష్టాన్తము విరుద్ధము. ఎందులకనగా జాగ్రత్ అవస్థలో స్వప్నవ్యవహారము భాదితమగుచున్నది. జాగ్రదవస్థ ఎట్టి పరిస్థితిలోను భాధితమగుటలేదు. బాహ్యవస్తువులు

లేవని చెప్పుటకు వీలులేదు ఏలనన వాని ఉపలబ్ధియే వానికి ప్రమాణము. ఘటాదులు బాహ్యమున ఉపలబ్ధ మగుచున్నవి. బుధ్యాదులే ఘటాదులవలే కనబడుచున్నవి. లోపలి జ్ఞేయ తత్వమే బయట కనబడుచున్నది. ఈ విధముగా చెప్పు నీ యుక్తియే బయట వస్తువు వున్నదనుటకు ప్రమాణము. బయట వస్తువు లేనిచో ఎచ్చటనూ దాని ఉనికి చెప్పుటకు "బహిర్వత్" అను ఉపమానము చెప్పుట కుదరదు. బహ్య వస్తువుల సద్భావముపలన (అవి ఉండుటవలన) వానిని విజ్ఞానమాత్రమని చెప్పుట యుక్తి సంగతము గాదు.

199. నాభావ ఉపలబ్దేః. (2.2.28)

సూత్రార్ధము:- క్షణికమగు విజ్ఞానముకన్న ఇతరపదార్ధములు లేవని చెప్పుట సరికాదు ఎందులకనగా విజ్ఞానముకన్న పదార్ధములు "ఇది కుండ" "ఇది వస్త్రము" అను అనుభవముద్వారా బాహ్య వస్తువులు సిద్ధమగుచున్నవి.

క్షణిక విజ్ఞానముకన్న భిన్నమైన బాహ్యవస్తువుల అభావము నిశ్చయించుట సరికాదు ఎందులకనగా ఇది కుండ ఇది బట్ట అను ప్రత్యేక వస్తువు యొక్క అనుభవము ద్వారా బాహ్యవస్తువుల ఉపలబ్ధి అగుచున్నది. జ్ఞానము ద్వారా అనుభవమునకు వచ్చు వస్తువును లేదని ఎట్లు చెప్పగలరు? ఉపలబ్దికన్న భిన్నరూపముగా వస్తువు అభావము మాకు అంగీకారమనిన అట్లనుటగూడ సరికాదు, ఎందులకనగా విషయవస్తువు గ్రాహ్యము మరియు జ్ఞానము గ్రాహకము (గ్రహించునది). ఈ రెండు భిన్నమైనవి అని అందరి అనుభవము. ఒకే వస్తువులో ఒకే సమయములో గ్రాహ్య-గ్రాహక భావము ఎచ్చటనూ చూడబడుటలేదు. అందువలన విజ్ఞాన కన్న భిన్నముగా వస్తువులు ఉండుటవలన యోగాచార్యుని మతము అసంగతము.

200. వైధర్మ్యాచ్చ న స్వప్నాదివత్. (2.2.29)

సూత్రార్ధము:- జాగ్రత్తలో కలుగు విషయజ్ఞానము భాధింపబడదు కాని స్వప్నములో కలుగు జ్ఞానము భాధితమగు చున్నది అను విపరీత ధర్మము ఉండుటవలన స్వప్న దృష్టాన్తముద్వారా జాగ్రత్ జ్ఞానము నిరాధారమనుటకు వీలులేదు.

"నను జాగరణకాలే జాయమానాః సర్వే ఘటపటాదివిషయాః ప్రత్యయా నిరాలమ్బనాః ప్రత్యయవత్వాత్ స్వప్నాది ప్రత్యయవత్" 'జాగ్రదవస్థలో ఉత్పన్నమగు ఘటపటాదుల విషయ జ్ఞానము విషయము లేకుండగనే ఉత్పన్నమగుటవలన ఆ జ్ఞానములకు ఆలంబనము లేదు ఎందులకనగా వానిలో స్వప్నజ్ఞానమువలే జ్ఞానత్వము కలదు'. స్వప్నదృష్టాన్తములో జ్ఞానత్వము హేతువు, నిరాలమ్బనత్వము సాధ్యము. ఈ విధముగా దృష్టాన్తములో "ఎచట ఎచట స్వప్నముగలదో అచట అచట నిరాలమ్బనత్వము గలదు" అను వ్యాప్తి జ్ఞానము కలుగుటవలన పక్షమగు జాగ్రత్తలో జ్ఞానము నిరాలమ్బనమని పూర్వవాది మతము. పూర్వవాది మతము సరికాదు అని సిద్ధాన్తి మతము. ఎందులకనగా స్వప్న పదార్ధములు జాగ్రత్తలో బాధితమగుచున్నవి అందువల్ల

స్వప్నజ్ఞానములో బాధితవిషయత్వము కలదు. జాగ్రదవస్థలో వస్తువులు బాధితమగుటలేదు, అందువల్ల వానిలో బాధిత విషయత్వము లేదు. ఈవిధముగా స్వప్నజ్ఞానములో బాధితవిషయత్వము  మరియు జాగ్రత్తిలోని జ్ఞానములో  అబాధితవిషయత్వము అను వైషమ్యకారణమువలన స్వప్నజ్ఞాన దృష్టాన్తముద్వారా జాగ్రత్ కాలీన జ్ఞానము నిరాలమ్బనమనునది సిద్ధముగాదు. ఇది ఒక దోషము. అంతేగాక మీ అనుమానములో మరియొక దోషము గూడ గలదు. మేము స్వప్నమును గూడ ప్రాతిభాసిక సత్తాగా స్వీకరింతుము. స్వప్నావస్థయందు క్షణిక విజ్ఞానముకన్న వేరు వస్తువులేదనిన ఘటజ్ఞానము పటజ్ఞానము అను విచిత్రత కానరాదు. స్వప్న జ్ఞానము నిరాలమ్బనము అనునది గూడ దోషమే.

ప్రశ్న:- స్వప్నావస్థలో విషయముయొక్క సత్తా స్వీకరించవలసిన పనిలేదు. వాసనల వైచిత్రతవలన జ్ఞానములో వైచిత్రత వచ్చును. ఈ శంకకు సమాధానముగా ముందు సూత్రము చెప్పుచున్నారు.

201. నా భావోఽనుపలబ్ధేః. (2.2.30)

సూత్రార్థము:- (క్షణికవిజ్ఞానవాది మతములో)  బాహ్యార్థవాది మతానుసారము వాసనల సద్భావము కలుగజాలదు, ఎందులకనగా మీ మతములో బాహ్య పదార్థముల ఉపలబ్ధి లేదు. బాహ్య పదార్థముల జ్ఞానము వాసనలకు కారణము. కారణాభావమువలన కార్యాభావము కలుగును.

పై ప్రశ్నకు జవాబు చెప్పుచు బాహ్య వస్తువు లేదనిన దాని జ్ఞానముకలుగదు, జ్ఞానములేక వాసనా ఎట్లు కలుగును. మీ పక్షములో బాహ్యపదార్థము యొక్క ఉపలబ్ధి కలుగుటలేదు కాని వాసనలకు బాహ్యార్థజ్ఞానమే కారణమని స్వికరించిరి. కారణము లేనిచో కార్యము జరుగదు అనునది సర్వలోక ప్రసిద్ధము. అంతేగాక విషయవాసన లేకున్ననూ విషయభావము స్వికరించిన  దానిజ్ఞానము కలుగగలదు గాని విషయజ్ఞానము లేకున్న విషయవాసన కలుగనేరదు. వాసన యొక్క వేరొక పేరు సంస్కారము. ఆ సంస్కారము ఆశ్రయము లేకుండ నిలువజాలదు. లోకములో ఎచ్చటనూ వాసనా లేక సంస్కారము ఆశ్రయమురహితముగా కానవచ్చుట లేదు. మీమతములో ప్రత్యక్షాది ప్రమాణముల ఉపలబ్ధి లేని కారణమువలన సంస్కారమునకు ఏ ఆశ్రయము లేదు. గనుక క్షణికవిజ్ఞానవాదుల మతము అసంగతము.

202. క్షణికత్వాచ్చ. (2.2.31)

సూత్రార్థము:- "అహం అహం" అనునది ఆలయ విజ్ఞానము ఈ ఆలయ విజ్ఞానము క్షణికమని స్వీకరించుటవలన అదిగూడ వాసనలకు ఆశ్రయము కాజాలదు.

పూర్వ సూత్రమునుండి 'న' కారము  ఈ సూత్రమలో అనువర్తించును అనగా సూత్రము 'న క్షణికత్వాచ్చ' అగును. అహం అను ఆలయవిజ్ఞానము వాసనలకు ఆశ్రయమని కల్పన గావించుట సరిగాదు. ఎందులకనగా ఈ ఆలయవిజ్ఞానము గూడ మీమతములో క్షణికము గాన. ఏది మీ మతములో స్వయముగా క్షణికము మరియు

అస్థిరమో అది వాసనాశ్రయము ఎట్లగును. ఏది భూత వర్తమాన భవిష్యకాలములతో సంబన్ధిత పదార్థమగునో అదే దేనికైననూ ఆశ్రయముకాగలదు. ఒకే ఆలయవిజ్ఞానమును కాలత్రయసంబన్ధీ అని స్వీకరించనిచో దేశ కాల నిమిత్తాపేక్షములవలన వాసనలద్వారా ఉత్పన్నమగు స్మృతి ఎట్లు కలుగును? ఆ ఆలయవిజ్ఞానమును మీరు స్థిరమని స్వీకరించినచో మీ సిద్ధాన్తమునకు హాని కలుగును. ఇంతేగాక క్షణికబాహ్యార్థ వాదమునకు సమానముగా క్షణికవిజ్ఞానవాదములోగూడ "ఉత్తరోత్పాదే చ పూర్వనిరోధాత్" అను సూత్రములో చెప్పిన దోషములను స్మరణము గావించకొనవలయును. ఈ ప్రకారముగా క్షణికబాహ్యార్థవాదము క్షణికవిజ్ఞానవాదము అను వైనాశికుల పక్షముల ఖండన సూత్రకారులు శబ్దములతో (కంఠతః) చేసిరి. కాని సర్వప్రమాణములకు విరుద్ధమగుటవలన శూన్యవాద ఖండనకు సూత్రకారులు విడిగా సూత్రముల రచన గావింపలేదు. సూత్రకారుల అభిప్రాయమేమనగా అభావాదికరణములో చెప్పిన సూత్రములను ఆవశ్యకతానుసారము శూన్యవాదఖండనలో గూడ గావించు కొనవలయును.

203. సర్వథానుపపత్తేశ్చ. (2.2.32)

సూత్రార్థము:- బౌద్ధుల గ్రంథములు మరియు వారు చెప్పు అర్థములు అసంగతమగుట వలన మొక్షకాములగు పురుషులు వారు చెప్పు భ్రాన్తిమూలకమగు ఈ మతముపై శ్రద్ధ బొత్తిగా వహించరాదు.
ఈ బౌద్ధమతమున కొంచెమైనను సారము కలదేమోనని విమర్శింపబోయిన అడుగడుగునకును ఇసుక యందు త్రవ్వబడు బావివలే విరిగిపడుచునే యున్నది. ఈ సిద్ధాన్తములో కొంచెమయినను యుక్తి చూచుటకు కానవచ్చుట లేదు. అంతేగాక సుగతుడు ఒకచోట బాహ్యార్థవాదము, మరికచోట విజ్ఞానవాదము, ఇంకొకచోట శూన్యవాదము ఈవిధముగా పరస్పరము విరుద్ధమైన ఉపదేశము గావించుటవలన తనయొక్క అసమ్బద్ధ-ప్రలాపమును చెప్పినాడని తోచుచున్నది. గాన అన్నిరకములుగా యుక్తివిరుద్ధమగుటవలన భ్రాన్తి మూలకమగుటవలనను సుగత సిద్ధాన్తమును ముముక్షువులు ద్వారా ఆదరించ తగదు.

# 59. ఏకస్మిన్నసమ్భవాధికరణమ్.

సంగతి:- పూర్వాధికరణములో బౌద్ధులమతము నిరాకరించబడినది. ఇపుడు బుద్ధిలోనున్న జైనమతమును నిరాకరించవలయును. అతః క్రిందటి అధికరణముతో ఈ అధికరణమునకు బుద్ధిసన్నిధిలక్షణ సంగతి.
విషయము:- సమన్వయమునకు విరుద్ధమైన జైనుల సిద్ధాన్తము ఈ అధికరణమునకు విషయము.
సంశయము:- అన్నిచోట్ల సప్తభఙ్గీన్యాయము ద్వారా సప్త పదార్థముల సిద్ధి కలుగునా? కలగదా?
పూర్వపక్షము:- సప్త పదార్థములను సిద్ధిచేయు న్యాయముండగా వాని సిద్ధి కలుగునని చెప్పుటలో ఆశ్చర్యమేమున్నది.

సిద్ధాన్తము:- స్యాదస్తి, స్యాన్నాస్తి, స్యాదస్తి చ నాస్తి చ, స్యాదవక్తవ్యః, స్యాదస్తి చావక్తవ్యశ్చ, స్యాన్నాస్తి చావక్తవ్యశ్చ, స్యాదస్తి చ నాస్తి చావక్తవ్యశ్చ, ఈ విధముగా విరుద్ధమైన సదసత్వాది ధర్మములను ఒకే పదార్థములో ప్రతిపాదించుచున్నారు గాన జైనుల సప్తభఙ్గీన్యాయము దుర్న్యాయము (దుర్ -న్యాయయ). దానితోబాటు జీవునిలో సమవాయమును గూడ స్వీకరించిరి, అది యుక్తివిరుద్ధము. గాన సప్తభఙ్గీన్యాయము భ్రాన్తిమూలకమగుటవలన దానిద్వారా సమన్వయమునకు ఏ విధమైన విరోధము లేదు.

వైయాసికన్యాయమాలా:-

131. సిద్ధిః సప్తపదార్థానాం సప్తభఙ్గీనయాన్న వా। సాధకన్యాయసద్భావాత్తేషాం సిద్ధౌకిమద్భుతమ్॥

132. ఏకస్మిన్సదసత్త్వాదివిరుద్ధప్రతిపాదనాత్ ।అపన్యాయః సప్తభఙ్గీ, న చ జీవస్య సాంశతా॥

సప్తభఙ్గీరూప న్యాయము ద్వారా సప్త పదార్థములకు సిద్ధి కలుగునా లేదా అను సందేహమునకు పూర్వ వాది సప్తపదార్థములను సాదించుటకు న్యాయముండుటవలన సప్త పదార్థముల సిద్ధిలో ఆశ్చర్యమేమున్నది అనును.

దానికి సిద్ధాన్తి ఒకే వస్తువులో సత్త్వము (విద్యమానతా) అసత్త్వము అను విరుద్ధ ధర్మములు ప్రతిపాదించు సప్తభంఙ్గీన్యాయము సరికాదు గాని న్యాయాభాసమనును. అంతేగాక జీవునిలో సమవాయతా ఉండనేరదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఆర్హతమతములో జీవుడు జీవభిన్నము అని రెండు పదార్థములుగలవు. వానిలో జీవుడు చైతన్యము, శరీరపరిమాణముగలవాడు మరియు సావయవములు గలవాడు. అజీవుడు (జీవభిన్నము) ఆరు ప్రకారములు. వారికి అనుభవ యోగ్యములగు సర్వజడపదార్థములును అజీవులనబడును. ఇది మొదటిది. మిగిలిన ఐదు ఆశ్రమము, సంవరము, నిర్జరము, బంధము, మోక్షము.1) జీవుని దేహమునందు నిలిపి విషయములపై వానికి అభిమానము కలిగించు ఇంద్రియవృత్తులు ఆశ్రయ మనబడును.2) యమనియమాదులచే కలిగిన ఇంద్రియనివృత్తి సంవరము. 3)సర్వపాపంబులును నశించుటకై ఉపయోగింపవలయునని వారిమతమున కాలిన రాతిపైనెక్కుట, తలవెంట్రుకలు చేతితో ఉడబెరకుట మొదలగు కొన్ని వ్రతములు చెప్పబడియున్నవి, ఇవియే నిర్జరములు.4) జ్ఞానావరణీయము, దర్శానావరణీయము, మోహనీయము, అంతరాయము అను నాలుగు ఘాతికర్మలు మరియు వేదనీయము, నామికము, గోత్రికము, ఆయుష్కము అను నాలుగు అఘాతికర్మలు. ఈఎనిమిది కర్మలద్వారా ప్రాప్తమయిన జన్మమరణపరంపర బంధము. 5) పాపవిశేషరూపములైన నాలుగ ఘాతికర్మలు మరియు పుణ్యవిశేషరూపములైన నాలుగు అఘాతి కర్మలు. వారి శాస్త్రములో చెప్పిన ఉపాయములతో పైన చెప్పిన ఎనిమిది కర్మలనుండి నిర్ముక్తుడైన జీవునికి ఎల్లప్పుడూ ఊర్ధ్వగమనమును మోక్షము. పైన చెప్పిన ఏడు పదార్థములు సప్తభఙ్గీన్యాయముద్వారా వ్యవస్థాపితమగుచున్నవి. ఆ సప్తభఙ్గీన్యాయము-స్యాదస్తి, స్యాన్నాస్తి,

స్యాదస్తి చ నాస్తి చ, స్యాదవక్తవ్యః, స్యాదస్తి చావక్తవ్యశ్చ, స్యాన్నాస్తి చావక్తవ్యశ్చ, స్యాదస్తి చ నాస్తి చావక్తవ్యశ్చ (ఏ పదార్థములకైననూ అస్తిత్వము స్థాపింపవలయుననిన ఏదోవిధముగా స్థాపించవచ్చును, వాని లేమిని ఏదోవిధముగా స్థాపించవచ్చును, ఒకదానియందే కలుగుట లేకుండుట (కలిమి లేములు) రెంటిని స్థాపించ వచ్చును, ఒకేదానియందు రెండు ధర్మములు లేవనియూ చెప్పవచ్చును, ఉన్నదనియే చెప్పి కూడ అనిర్వచనీయ మనవచ్చును, లేదని చెప్పియూ అనిర్వచనీయమని చెప్పవచ్చును, ఉన్నదనియూ లేదనియూ చెప్పియూ అనిర్వచనీయమని చెప్పవచ్చును.) ఈ విధముగా ఏడూ రకములు. అభిప్రాయమేనగా 'స్యాత్' నిపాత శబ్దమునకు అర్థము 'ఏదియో ఒక విధముగా' అని. ప్రతివాదులు నాలుగు రకములు- సద్వాదీ, అసద్వాదీ, సదసద్వాదీ, అనిర్వచనీయవాదీ మరియు అనిర్వచనీయముతో సమ్బన్ధము కలిగినవారు సదాది మతావలంబులు ముగ్గురు. ఈ ఏడు రకముల వాదులకు విరోధముగా సప్తవిధ న్యాయములను ఉపయోగింతురు. ఉదాహరణకు ఆర్హతునితో విపక్షుడు మీ మతములో మొక్షము కలదా అని ప్రశ్నించిన దానికి జైన మతావలంబి 'స్యాదస్తి' అని జవాబు ఇచ్చును. ఇదే విధముగా అన్యవాదులతో గూడ వ్యవహారము చేయుదురు. అందువల్ల వాదించువారు దుఃఖితులై ఉత్తరము ఈయజాలరు. గాన సప్తభంగీన్యాయముద్వారా సప్త పదార్థములు సిద్ధమగుచున్నవనిన ఆశ్చర్యమేమి? అని పూర్వవాది తర్కము. దానికి సిద్ధాన్తి జవాబు. సప్తభంగీన్యాయము వస్తుతః న్యాయము కాదు కాని అపన్యాయము లేక విరుద్ధ న్యాయము. ఎందులకనగా సద్వాది అగు ఒకజీవునికి సద్రూపమని చెప్పుట అసద్వాది అగు వేరొకజీవినికి అసద్రూపమని చెప్పుట విరుద్ధము. ఇంకనూ జీవుని సావయవమని చెప్పుట బొత్తిగా తప్పు, ఎందులకనగా సావయవమనిన జీవునిలో అనిత్యత్వము వాటిల్లును. 'కథఞ్చిత్' అనగా ఏదియో ఒక విధముగా అని స్వీకరించిన మొక్షరూపి పురుషార్థము ఎవరికి కలుగును? గాన జీవాది పదార్థముల సిద్ధి సప్తభంగీన్యాయము ద్వారా ఎప్పటికిన్నూ కాజాలదు.

204. నైకస్మిన్నసమ్భవాత్. (2.2.32)

సూత్రార్థము: ఒకే పరమార్థ వస్తువులో విరుద్ధ ధర్మములు సంభవము కావు అందువల్ల వస్తువునకు అనేకరూపములుండ జాలవు.

ఇచట పూర్వపక్షములో ముక్తాంబరుల మతమునకు విరోధము వచ్చుటవలన వేదాన్తుల సమన్వయము అసిద్ధము. సిద్ధన్తములో విరోధములేనందున సమన్వయము సిద్ధము. ఏ వస్తువు వున్నదో అది నిత్యము మరియు ఉండనే ఉన్నది కాని అనిత్యముకాదు. ఏది లేదో అది అనిత్యము. ఒకే వస్తువులోను విరుద్ధ ధర్మములు ఉండుట అసంభవము. దాని నిశ్చయము మరియు నిర్ధారిత స్వరూప జ్ఞానము కలుగదు మరియు సంశయ జ్ఞానమువలే అది అప్రమాణము. ఇచట ప్రశ్న పత్యేక వస్తువు దాని రూపములో నుండును కాని అన్యరూపములో నుండజాలదు. కుండ తన రూపుములో ఉన్నది అని చెప్పవచ్చును మరియు వస్త్రరూపములో లేదు

అనవచ్చును. ఈవిధమైన నియమము లేదని చెప్పలేము ఎందులకనగా ఈ స్థితిలో ఎచటను ప్రవృత్తి కాజాలదు. ఎటులనగా ఒక వ్యక్తికి కుండ కావలయుననిన ఆతడు సప్తభఙ్గీన్యాయముననుసరించి అస్తి నాస్తి అని అనేకాత్మరూపములలో నిశ్చయము గావించిన కుండ గలదు అని నిశ్చయమునకు రాజాలడు. కుండ గలదని నిశ్చయించుకొనిన తరువాత కుండ కావసిన వ్యక్తికి సప్తభఙ్గీన్యాయము ద్వారా నిఃసన్దిగ్ధ ప్రవృత్తి ఎటుల వానిలో కలుగును. లోకములో సర్వథా నియమానుసారముగా ఒక వస్తువు కలదని నిశ్చయించుకొని దాని ప్రాప్తికై సాధనానుష్ఠానములో నిఃసన్దిగ్ధ ప్రవృత్తి కాలవాడగుచున్నాడు. అందువల్ల అనిశ్చితార్థమైన శాస్త్రమును ప్రతిపాదించు విషయములను రచించిన తీర్థంకరుడు పిచ్చివానివలే అశ్రద్ధేయ వచనములు పలుకు చున్నాడు. ఇంతేగాక వస్త్రహీనుల జైనమతములో జీవ చైతన్యము శరీర పరిమాణముగలదని స్వీకరించిరి దానిని ముందు సూత్రముద్వారా దూషించుచున్నారు.

205. ఏవం చాత్మాఽకార్త్స్న్యమ్. (2.2.34)

సూత్రార్థము:- ఏవిధముగా జైనమతములో ఒక వస్తువులో విరుద్ధ ధర్మముల అసంభవమను దోషము చెప్పిరో అటులనే జీవుని పరిచ్ఛిన్నత్వరూపము చెప్పుచున్నందువలన రెండవ దోషము గూడ గలదు. జీవుడు పరిచ్ఛిన్నమయిన ఆత్మ ఘటాదులవలే అనిత్య మగును.

జైనులమతములో జీవ శరీరము పరిచ్ఛిన్నమనిన అది పరిమాణముగలదని చెప్పవలయును అపుడు చైతన్యము అనిత్యమగును. అన్ని శరీరములలోగల పరిమాణము మారు చుండును. చీమ మరియు ఏనుగులో గల పరిమాణము అత్యన్త భిన్నము. ఒక మనిషి కర్మఫలము అనుభవించుటకు ఒకవేళ ఏనుగు శరీరములో జన్మించిన మనుష్యుని శరీరమున కన్న ఏనుగు శరీరము పెద్దదగుటవలన మనుష్యశరీరపరిమాణము గల జీవుడు పూర్తిగా ఏనుగు శరీరములో వ్యాప్తము గాజాలడు. ఆలాగుననే చీమ శరీరములో సంకీర్ణ స్టానముండుట వలన మనుష్య శరీరము గల జీవుడు దానిలో ప్రవేశించజాలడు. ఇంతయేల ఒకే జన్మములో కౌమారము, యౌవనము మరియు వార్ధక్యావస్థలలో జీవుడు ప్రవేశింపజాలదు. అనేక దోషకారణముల వలననూ యుక్తిశూన్య మగుట వలనను జైనమతము సర్వథా త్యాజ్యము.

206. న చ పర్యాయాదప్యవిరోధో వికారాదిభ్యః. (2.2.35)

సూత్రార్థము:- క్రమముగా అవయవములు తగ్గుట మరియు పెరుగుటవలన ఆ యా స్థూల శరీరములలో మరియు సూక్ష్మశరీరములలో ఏవిధమైన విరోధములేదని చెప్పు జైనుల సిద్ధాన్తము సరికాదు. ఎందులకనగా ఆత్మ సావయవమని స్వీకరించిన హెచ్చు తగ్గులు గూడ ఆత్మలో స్వీకరించవలయును. అపుడు ఆత్మయందు అనిత్యత్వము వాటిల్లును దానివల్ల బన్ధ-మొక్షములు బాధితములగును.

జైనులు చెప్పునదేమనగా జీవాత్మను మేము సావయవమని స్వీకరించితిమి అందువల్ల స్థూలము మరియు

సూక్షశరీరరములో జీవాత్మయొక్క అవయవములు క్రమముగా ప్రవేశించుచున్నవి మరియు బైటకు వచ్చుచున్నవి అనిన ముందు మీరు చెప్పిన విరోధము పరిహరింపబడును గదా? అట్లు చెప్పుట సరికాదు ఎందులకనగా వికారాది దోషములు జీవాత్మ యందు వచ్చును. అత్మ సావయవమగుటవలన జీవుడు భిన్న భిన్న శరీరములను పొందు కాలములో అవయవముల హెచ్చు తగ్గులు కలిగి ఆత్మ వికారి అగును. చర్మాది ధాతువులవలే ఆత్మలో అనిత్యత్వముగూడ వచ్చును. నీటిలో అదిమిపెట్టిన నిలువక పైకివచ్చు సొరకాయ బుఱ్ఱవలే ఈ జీవుడు సంసార సముద్రమునుండి పైకి వచ్చుటకు ప్రయత్నించుచుండును. అయినను ఎనిమిది విధములైన కర్మలువానిని బంధించి బలాత్కరముగా బరువు కట్టిన సొరకాయిబుఱ్ఱవలే సంసారసముద్రమున ముంచివేయు చున్నది. (బన్ధాఖ్య కర్మాష్టకములు- 1. జ్ఞానావరణీయం, జ్ఞానము ఆవరించబడినదను విశ్వాసము. 2. దర్శనావరణీయం, జైనుల ద్వారా ఇచ్చిన ఉపదేశము ముక్తినివ్వదు అనువిశ్వాసము. 3. మోహనీయమ్, జైనులది విశేషముక్తిమార్గము కాదనుట. 4. ఆన్తర్యమ్, ముక్తిమార్గములో ఆటంకములున్నవను అభిప్రాయము అనగా అవరోధములు ఈ నాలుగు ఘాతికర్మలు.) (1. వేదనీయము, నేను తత్త్వము తెలిసికొందునను విశ్వాసము 2. నామికము, నాది ఈ పేరు. 3. గోత్రికము, అర్హత శిష్యత్వమును స్వీకరించుట. 4. ఆయుష్కము, శరీరమును రక్షించుటకు చేయు కర్మలు. ఈ నాలుగు అఘాతి కర్మలు.) ఈ కర్మాష్టకములను త్రుంచివేసిన మోక్షమును పొందునని వారి మతము. వీరి ఈ మోక్షము పుర్వము చెప్పిన దోషకారణమువలన బాధితమగుచున్నది.

207. అన్త్యావస్థితేశ్చోభయనిత్యత్వాదవిశేషః. (2.2.36)

సూత్రార్థము:- మోక్షావస్థలో జీవుని పరిణామము నిత్యమగుటవలన దానిపూర్వములో నున్న ఆది మధ్య అన్తిమ పరిమాణములను గూడ నిత్యమని స్వీకరించవలయును. గాన బౌద్ధుల వలే జైనుల మతము గూడ అప్రమాణికము.

మోక్షావస్థలో కలుగు అన్తిమ పరమాణమును జీవుని యొక్క నిత్యము మరియు స్థిర పరిమాణమని స్వీకరించెద మందురు జైనులు. అన్తిమ పరిమాణమువలే ఆది మధ్యమ పరమాణములలో గూడ నిత్యత్వ ప్రసంగము వచ్చుట వలన జీవుడు ఏ దేహములోకి పోయినను ఒకే రూపముతో ఉండవలసినవాడగును. జీవుని అన్తిమ పరమాణము స్థిరమని స్వీకరించిన పూర్వావస్థలోనున్న జీవునిగూడ స్థిరమని స్వీకరించవలయును. అపుడు జీవుని (సదా) ఎల్లప్పుడూ అణు పరిమాణము గల వానినిగానో లేక మహత్పరిమాణము గలవానినిగానో స్వీకరించవలయును గాని శరీరపరిమాణము గలవాడని స్వీకరించలేరు. గనుక బౌద్ధులవలే జైనులమతము గూడ అసంగతమని సిద్ధమగుచున్నది.

# 60. పత్యధికరణము

సంగతి:- సదసత్త్వాది పరస్పర విరుద్ధమైన ధర్మము అసంభవమగుటవలన క్రిందటి అధికరణములో జైనుల మతము ఖండించిరి. ఆలాగుననే ఒకే ఈశ్వరునిలో సంపూర్ణ జగత్తునకు ఉపాదానకారణత్వము మరియు కర్తృత్వము అను విరుద్ధ ధర్మములు అసంభవములు. గాన పూర్వాధికరణముతో దీనికి దృష్టాన్త సంగతి.

విషయము:- తటస్థ ఈశ్వరకారణవాదమను మాహేశ్వర సిద్ధాన్తము ఈ అధికరణములో విచారణీయ విషయము.

సంశయము:- ఈశ్వరుడు కేవలము జగత్తునకు అధిష్ఠానము, గాని ఉపాదానకారణము కాజాలడు, అని చెప్పు మాహేశ్వర సిద్ధాన్తము ప్రమాణ మూలకమా లేక భ్రాన్తి మూలకమా అని సంశయము.

పూర్వపక్షము:- ఘటాది కార్యములకు కుమ్మరి నిమిత్త కారణము ఆలాగుననే ఈశ్వరుని జగత్తునకు కేవలము నిమిత్త కారణుడని చెప్పుట ఉచితము.

సిద్ధాన్తము:- వేదప్రతిపాదితమైన ఈశ్వరుని కేవలము నిమిత్త కారణమని చెప్పిన వానిలో వైషమ్యనైర్ఘృణ్యదోషము వచ్చును. అందువల్ల శ్రుతి విరోధమగుటవలన తటస్థ ఈశ్వరకారణవాదమును త్యజించుట ఉచితము మరియు యుక్తియుక్తము.

వైయాసికన్యాయమాలా:-

133. తటస్థేశ్వరవాదోఽయం స యుక్తోఽథ న యుజ్యతే । యుక్తః కులాలదృష్టాన్తాన్నియన్తృత్వస్య సంభవాత్॥

134. న యుక్తో విషమత్వాదిదోషాద్వైదిక ఈశ్వరే । అభ్యుపేతే తటస్థత్వం త్యాజ్యం శ్రుతివిరోధతః ॥

తటస్థ ఈశ్వరవాదము యుక్తియుక్తమా కాదా? కుమ్మరి దృష్టాన్తమువలన ఈశ్వరునిలో నియన్తృత్వము సంభవమగుటవలన తటస్థ ఈశ్వరవాదము యుక్తియుక్త మనును పూర్వవాది. సిద్ధాన్తి సమాధానము. ఈశ్వరునియందు విషమతాది దోషములవలన తటస్థ ఈశ్వరకారణవాదము యుక్తి సంగతము కాదు.

భారతీ తీర్థుల వారి వ్యాఖ్య :-

పూర్వాధికరణములో శాస్త్రప్రమాణముద్వారా విస్తారముగా అభిన్న నిమిత్తోపాదానకారణము ఈశ్వరునియందు ప్రతిపాదనము(బోధ) గావించిరి. ఈ మతము సహించలేని కారణము వలన తార్కికులు ఈశ్వరుడు కేవలము నిమిత్తకారణమని వాదించుచున్నారు. దానికి తర్కముగూడ చెప్పుచున్నారు. ఏ విధముగా కుమ్మరి మట్టివలే ఉపాదానకారణము కాకుండగనే కుండ మొదలగువానిని చేయుచున్నాడో ఆవిధముగనే ఈశ్వరుడు నిమిత్తకారణుడై ఉపాదానకారణము గాకుండగనే జగత్కర్త అగుచున్నాడు.

ఈ పూర్వవాది తర్కమునకు సిద్ధాన్తి చెప్పు జవాబు. ఈశ్వరునిలో కేవలము నిమిత్తకారణమును స్వీకరించిన వైషమ్య నైర్ఘృణ్య దోషములు వానిలో పరిహరించుట అసంభవమగును. వానిలో వచ్చు దోషములను నీవు ఎట్లు పరిహరించెదవు అని పూర్వవాదిని ప్రశ్నించిన దానికి జవాబు చెప్పుచున్నారు. ప్రాణుల కర్మనపేక్షించి సృష్టి గావించిన వానిలో దోషములు సంభవములు కావు. శాస్త్రములో దీనికి ప్రమాణము దొరుకుచున్నది.

పూర్వవాదివయిన నువ్వు మా  శాస్త్రమును ఒప్పుకొనిన మీ మతములోనున్న ఈశ్వరతటస్థవాదమును వదిలి వేయవలసి వచ్చును. “బహు స్యాం ప్రజాయేయ” ‘నేను అనేకరూపములుగా అగుదును’ అని ఈశ్వరుని ఉపాదానకారణముగా చెప్పు శ్రుతి వాక్యములతో మీ మతవిరోధము స్పష్టము. గాన తటస్థ ఈశ్వరకారణవాదము యుక్తి సంగతముగాదు.

208. పత్యురసామఞ్జస్యాత్. (2.2.37.)

సూత్రార్థము:- ఈశ్వరుడు ప్రధానాది ఉపాదానకారణములకు ప్రేరకుడగుటవలన జగత్తు యొక్క నిమిత్తకారణము గాజాలడు, ఎందులకనగా ఈశ్వరుడు విషమ సృష్టి చేయుటకు ప్రవృత్తుడయిన వానిలో రాగ ద్వేషాదుల ప్రాప్తి కలుగును అది యుక్తి సంగతముగాదు (అసామఞ్జస్యము).

ఈశ్వరుని  జీవ ప్రధానాదులకు అధిష్ఠాతగా స్వీకరించిన  వానిలో జగత్కారణత్వము యుక్తిసంగతము గాదు, ఏలనన మధ్యమ, ఉత్తమ భేదముగల భిన్నభిన్నప్రాణులకు కర్త అగుటవలన, వానిలో తటస్థత్వము స్వీకరించిన మనుష్యులవలే వానిలో రాగాది దోషములు మరియు అనిత్యత్వము వచ్చును. అది యుక్తి యుక్తము గాదు. లోకములో అందరి ప్రవృత్తి రాగాదులవలననే అని  చూడబడు చున్నది. ప్రాణుల ధర్మాధర్మములను కర్మలనాశ్రయించి ఈశ్వరుని ప్రవృత్తి కలుగుచున్నది, గాన హీన, మధ్యమ మరియు ఉత్తమరూప వైషమ్యమునకు ప్రాణులకర్మమే కారణము ఈశ్వరుడు కాదు అనుటయూ సరికాదు. ఎందులకనగా కర్మము మరియు ఈశ్వరునిలో పవర్త్య- పవర్తక-భావము వలన అన్యోన్యాశ్రయ దోషము(పరస్పర సాపేక్షత్వమను దోషము) వచ్చును. ఇచట కర్మ ప్రవర్త్యము మరియు ఈశ్వరుడు ప్రవర్తకుడు. కర్మ ఈశ్వరునికి ప్రవర్తకమా? లేక ఈశ్వరుడు కర్మ ప్రవర్తకుడా? ఇది నిశ్చయము కానందువలన అన్యోన్యాశ్రయ దోషము రానే వచ్చును. ఈశ్వరుని ద్వారా ప్రేరితమై కర్మ ప్రాణుల విషమతకు కారణమా? లేక కర్మనపేక్షించి విషమ జగత్తును రచించుచున్నాడా అనువానిలో ఏదో ఒక పక్షము నిశ్చయము కానందువలన అన్యోన్యాశ్రయ దోషము కలుగుచున్నది.

209. సమ్బన్ధానుపపత్తేశ్చ. (2.2.38.)

సూత్రార్థము:-  మరియు ప్రధానకారణ వాదములో దోషము కలదు. ప్రధానమునకు ఈశ్వరునితో సమ్బన్ధము లేనందున ఈశ్వరునిద్వారా ప్రేరితముగాజాలదు. అందువలన ఈశ్వరునిద్వారా ప్రధానము ప్రేరేబింపబడుననునది యుక్తి సంగతముకాదు.

ప్రధాన పురుషులకన్న భిన్నమైన ఈశ్వరుని వానికి ప్రేరకుడనిన ఆ ప్రధాన పురుషులకు ఈశ్వరునితో గల సమ్బన్ధమును గూడ చెప్పవలసి వచ్చును. సమ్బన్ధము లేకున్న వానిలో ప్రేరకత్వము సిద్ధముగాదు, ఎందులకనగా చెప్పిన మూడు వస్తువులు నిరవయవములు మరియు వ్యాపకత్వము గలవి. సమ్బన్ధములేని

పదార్థముల సమ్బన్ధమును సమవాయమందురు. సగము కుండను కపాలమందురు. కుండ కపాలముల సమబన్ధమును సమవాయ మందురు, ఎందులకనగా కుండ ఉత్పత్తికి ముందు, నష్టమైన తరువాత ఆ సమవాయము కపాలముల నాశ్రయించి ఉండును. కుండ ఉత్పత్తికాగానే ఆకపాలముల సమ్బన్ధము సమవాయముగా మారును. కాని కుండ మరియు వస్త్రము స్వతంత్ర అస్తిత్వము గలవాని రెండు ద్రవ్యముల సమ్బన్ధమును సంయోగ మందురు, కాని సమవాయము కాదు. ఈప్రకారము ముందు చెప్పిన ప్రధానము, పురుషుడు మరియు ఈశ్వరుడు స్వతంత్ర తత్వములని సిద్ధమగుచున్నది. వాని సమ్బధమును సమవాయమన జాలము. అలాగుననే వ్యాపకము మరియు నిరవయవము అగుటవలన వీని సంయోగ సమ్బన్ధము గూడ కలుగుదు. మా వేదాన్త మతములో ఈ జగత్తు కల్పిత తాదాత్మ్య సమ్బన్ధముతో నున్నదని చెప్పినందువలన ఈశ్వరుడు అవిద్యా (మాయ) ప్రేరకుడనునది సిద్ధమగుచున్నది. తటస్థ ఈశ్వరకారణవాదము చెప్పుటవలన సమ్బన్ధము సిద్ధముగాదు.

### 210. అధిష్ఠానానుపపత్తేశ్చ. (2.2.39.)

సూత్రార్థము:- ఇంకను ప్రధానకారణవాదములో దోషము కలదు. రూపాదిహీనము మరియు అప్రత్యక్ష మయిన ప్రధానమునకు ఈశ్వరుడు ప్రేరకుడు మరియు అధిష్ఠానము గాజాలడు.

లోకములో కుమ్మరి మృదాదులకు ప్రేరకునిగా చూడబడిననూ ఈశ్వరునిలో ప్రధానాదుల ప్రేరకత్వము గలదని చెప్పుట ఉచితముగాదు, ఎందులకనగా ప్రధానము రూపరహితము. రూపములేని వానిని ప్రేరేపించుట సంభవముగాదు. రూపములేని ప్రధానము ప్రత్యక్షము గాదు గాన ప్రేరేపించుటకు వీలిగాదు. మృదాదులకన్న దీనిలో విలక్షణత్వమున్నది. మా వేదాన్తము కేవలము వేదైకశరణ్యమగుట వలన ఉదాహరణావశ్యకము లేదు మరియు దోషము లేదు.

### 211. కరణవచ్చేన్న భోగాదిభ్యః. (2.2.40.)

సూత్రార్థము:- అప్రత్యక్షమైననూ ఏవిధముగా ఇంద్రియములు జీవును ద్వారా ప్రేరితములగుచున్నవో ఆవిధముగనే అప్రత్యక్ష ప్రధానము ఈశ్వరునిద్వారా ప్రేరితమగుననిన అట్లనుట సరిగాదు, ఎందులకనగా ఏవిధముగా జీవుడు భోగమునకై ఇంద్రియములను ప్రేరేపించునో అదేవిధముగా ఈశ్వరుని ప్రేరకుడనిన వానిలో గూడ భోగాదుల దోషము వచ్చును.

నేత్రాది ఇంద్రియములు ప్రత్యక్షములుగావు మరియు వానికి రూపముగూడ లేదు. వాని ప్రేరకుడు జీవుడు, అలాగుననే అప్రత్యక్ష ప్రధానమునకు ఈశ్వరుడు ప్రేరకుడనిన జీవుని వలే ఈశ్వరునిలోగూడ భోగాదుల దోషము వచ్చును. జీవుని సుఖ దుఃఖరూపములైన భోగములకు నేత్రాది కరణముల ప్రేరకునిగా చూచుచున్నాము.

అటులనే ఈశ్వరుని యందు ఇంద్రియముల సముదాయము మరియు జగత్ ప్రేరకత్వమును స్వీకరించిన వానిలో గూడ భోగాది దోషప్రసంగము వచ్చును.

212. అన్తవత్త్వమసర్వజ్ఞతా వా. (2.2.41.)

సూత్రార్థము:- ప్రధాన జీవేశ్వరులను వాని సంఖ్యను మరియు వాని పరిమాణములను ఈశ్వరుడు నిర్ణయించునా లేదా? ప్రథమ పక్షములో పరిమిత సంఖ్య పరిమిత పరిమాణము అని చెప్పిన ప్రధాన జీవేశ్వరులు నశించువారగుదురు. రెండవ పక్షములో ఈశ్వరునియందు ఆ ప్రధానాదుల సంఖ్య జ్ఞానము లేదనిన వానిలో అసర్వజ్ఞత్వ దోషము కలుగును. అందువల్ల మాహేశ్వర సిద్ధాన్తము భ్రాన్తిమూలకము.
తటస్థ ఈశ్వరును చెప్పు మాహేశ్వర సిద్ధాన్తములో ప్రకృతి, జీవులు మరియు ఈశ్వరుడు అనన్తతము మరియు పరస్పర భిన్నములందురు. అపుడు ప్రశ్న ఉత్పన్నమగును. ఈశ్వరునికి ప్రధాన పురుషుల తనయొక్క సంఖ్య లేక పరమాణము తెలియునా లేదా? వాని సంఖ్య తెలిసినచో అవి పరిచ్ఛిన్నమగుటవలన అన్తమగునవి అగును లేక అనన్తములుకావు. లోకములో పరిచ్ఛిన్నమయిన ఘటాదులు నశించునవిగా కానవచ్చుచున్నవి. అట్లుగాక ఈశ్వరునుకి ప్రధానాదుల సంఖ్య మరియు పరిమాణము యొక్క జ్ఞానములేదనిన ఆ ఈశ్వరునిలో అసర్వజ్ఞత్వమను దోషము వచ్చును. అందువల్ల ఈ మాహేశ్వర సిద్ధాన్తము భ్రాన్తిమూలకము.

# 61. ఉత్పత్త్యసమ్భవాధికరణము.

సంగతి:- క్రిందటి అధికరణములో తటస్థఈశ్వరకారణవాదమును నిరాకరించిరి. ఇపుడు అభిన్ననిమిత్తోపాదానకారణమును చెప్పు భాగవత మతము పై విచారించెదరు. గాన పూర్వాధికరణముతోబాటు ఈ అధికరణమునకు ప్రత్యుధాహరణ సంగతి.
విషయము:- పాఞ్చరాత్ర సిద్ధాన్తము ఈ అధికరణములో విచారణీయ విషయము.
సంశయము:- ఒకే భగవంతుడు వాసుదేవుడు ఈ జగత్తునకు అధిష్ఠానము మరియు ఉపాదనకారణము. వాని నుండి సంకర్ష-నుడను జీవుడు ఉత్పన్నమగును. ఆ జీవుని నుండి ప్రద్యుమ్నుడను మనస్సు జనించెను. ఆ మనస్సునుండి అనిరుద్ధుడను అహంకారముత్పన్న మగును. ఈ విధముగా చెప్పు భాగవతమతము ప్రామాణికమా కాదా?
పూర్వపక్షము:- 'స ఏకధా భవతి త్రిధా భవతి' (ఛాం. 7.26.2) ఈ శ్రుతి ద్వారా ఒకే పరమాత్మా అనేకరూపములుగా మారుట తెలియుచున్నది. ఆపరమాత్మను అనన్యభావముతో ఆరాధించుటవలన భగవత్ప్రాప్తి సాధన గూడ చెప్పిరి గాన భాగవత సిద్ధాన్తము ప్రామాణికము.
సిద్ధాన్తము:- భాగవతమతమును వేద అవిరుద్ధాంశములో ప్రమాణికమనిననూ, జీవోత్పత్తి అంశములో వేద

విరుద్ధమగుట వలన ప్రమాణికముగాదు. ఎందుకనగా ఉత్పన్నమైన పదార్థము నశించును. జీవుని ఉత్పత్తి వినాశములు స్వీకరించిన కృత- విప్రనాశము అకృతాభ్యాగమమను దోషములు వచ్చును అందువల్ల పంచరాత్రాగమము (భాగవత మతము) ప్రామాణికముగాదు.

వైయసిక న్యాయమాలా:-

135. జీవోత్పత్త్యాదికం పాఞ్చరాత్రోక్తం యుజ్యతే న వా । యుక్తం నారాయణవ్యూహతత్సమారాధనాదివత్॥

136. యుజ్యతామవిరుద్ధాంఽశో జీవోత్పత్తిర్న యుజ్యతే। ఉత్పన్నస్య వినాశిత్వే కృతనాశాదిదోషతః ॥

పాఞ్చరాత్రమతములో చెప్పిన జీవుని ఉత్పత్త్యాదులు యుక్తి సంగతమా కాదా? ఏవిధముగా భగవంతుడగు వాసుదేవుడు మరియు వాని ఆరాధన ఆవిధముగనే జీవుని ఉత్పత్తి మొదలగునవి స్వీకరించుటవలన ఈ మతము యుక్తి సంగతమే అనును పూర్వవాది. సిద్ధాన్తి సమాధానము. శ్రుతికి విరోధము కానందువలన కారణమైన వాసుదేవుడు మరియు వాని ఉపాసన స్వీకరించిననూ జీవోత్పత్తిని స్వీకరించుటలేదు, ఎందులకనగా జీవుని ఉత్పత్తి మరియు వినాశము స్వీకరించిన
శ్రుతితో విరోధము మరియు కృతనాశము, అకృతాభ్యాగమములను దోషములు వచ్చును.

భారతీ తీర్థుల వారి వ్యాఖ్య.

భాగవత సంప్రదాయుల పాఞ్చరాత్రాగమసిద్ధాన్తములో భగవంతుడగు వాసుదేవుడు ఒకడు ఆతడే అభిన్ననిమిత్తోపాదాన కారణుడని స్వీకరింతురు. సంసార బన్ధనము వాని ఉపాసనమువలన నాశనమగును. ఆ వాసుదేవును నుండి సంకర్షణుడను జీవుడు ఉత్పన్న మయ్యెను. జీవిని నుండి ప్రద్యుమ్నుడను మనస్సు మరియు దానినుండి అనిరుద్ధుడను అహంకారము జనించెను.ఈ వాసుదేవుడు మొదలుగాగల నాలుగు ప్రకారముల వ్యూహముల (సమూహముల) ద్వారా సర్వ ప్రపంచము వ్యాప్తము. దీనికి సిద్ధాన్త సమధానము. వాసుదేవుడు మరియు వాని ఆరాధన శ్రుతి సమ్మతమగుట వలన అది మేముగూడ స్వీకరింతుము కాని జీవుని ఉత్పత్తిని మేము స్వీకరించము. అటుల స్వీకరించిన చేసిన ధర్మాదుల వినాశము మరియు చేయని ధర్మాదుల ప్రాప్తియు కలుగును. పూర్వ సృష్టిలో గల జీవుని ఉత్పత్తిని స్వీకరించిన "ఉత్పత్తి చెందినది నశించును" అను న్యాయానుసారము ప్రళయములో జీవుని నాశనము స్వీకరించవలసి వచ్చును. జీవుడు నశించిన వానిలో గల ధర్మాదులు ఫలమునీయకనే నశించు ప్రసంగము వచ్చును. ఈ విధముగా (కృత హాని) చేసిన కర్మల నాశము కలుగును మరియు కొత్తగా జనించిన జీవునికి పూర్వానుష్ఠానము లేకయే సుఖ-దుఃఖములు కలుగును దీనిని (అకృతాభ్యాగమము) చెయని కర్మల ప్రాప్తి అందురు. ఈవిధమైన జీవోత్పత్తి యుక్తి-యుక్తము కాదు.

## 213. ఉత్పత్త్యసంభవాత్. (2.2.42.)

సూత్రార్థము:- వాసుదేవును నుండి జీవోత్పత్తి కలుగజాలదు. జీవుని ఉత్పత్తిని స్వీకరించిన కుండ వలే ఆ జీవుని వినాశమును స్వీకరించవలసి వచ్చును అపుడు కుండ వలే జీవుడు గూడ అనిత్యమగుట వలన భగవత్ప్రాప్తి

యను మొక్షమును పొందజాలడు. ఈవిధముగా చెప్పు వైష్ణవుల మొక్షము ఎవరికి కలుగును? గాన భాగవత సిద్ధాన్తము భ్రాన్తిమూలకము.

భాగవతసిద్ధాన్తము వేదమునకు అవిరుద్ధమైన అంశములో ప్రమాణికమని చెప్పిననూ వేదమునకు విరుద్ధమైన జీవోత్పత్తి అంశములో ప్రామాణికముగాదు. ఎందులకనగా వాసుదేవుడను పేరుగల పరమాత్మనుండి సంకర్షణుడను పేరుగల జీవుని ఉత్పత్తిని స్వీకరించిన వానిలో అనిత్యత్వమను దోషము వచ్చును. లోకములో ఉత్పత్తి చెందిన ఘటాదుల అనిత్యత్వము చూడబడు చున్నది. ఆలాగుననే ఉత్పత్తినొందిన జీవునిలో అనిత్యత్వ ప్రసంగమును నివారింపలేము. అపుడు వారి అభిప్రేతమైన మొక్షము ఎవరికి లభించును? గాన భాగవత సీద్ధాన్తము అప్రామాణికము.

214. న చ కర్తుః కరణమ్. (2.2.43.)

సూత్రార్థము:- దేవదత్తుడు మొదలుగాగల కర్తలనుండి గొడ్డలి మొదలుగాగల పనిముట్ల ఉత్పత్తిని లోకములో చూచుటలేదు.
అందువల్ల జీవుని నుండి మనస్సుయొక్క ఉత్పత్తిని చెప్పుట అసంగతము.
వ్యావహారిక జగత్తులో ఎచ్చటనూ దేవదత్తాది కర్తలనుండి గొడ్డలి మొదలగు పరికరణముల ఉత్పత్తి చూడబడుటలేదు. అందువల్ల సంకర్షణుడను కర్తయగు జీవుని నుండి ప్రద్యుమ్నుడను మనోరూపమైన కరణము ఉత్పత్తియగునని చెప్పు సిద్ధాన్తమునకు శ్రుతుల ప్రమాణము లేనందు వలన భాగవత సిద్ధాన్తము యుక్తి శూన్యము.

215. విజ్ఞానాదిభావే వా తదప్రతిషేధః. (2.2.44.)

సూత్రార్థము:- సంకర్షణాదుల ముగ్గిరిలో వాసుదేవునివలే విజ్ఞానము, ఐశ్వర్యము, శక్తి, బలము, వీర్యము మరియు తేజస్సు సమానముగా నున్నదని చెప్పిననూ ఉత్పత్తి అసంభవము.

సంకర్షణాదులను మేము జీవాదుల రూపాముగా స్వీకరించుటలేదు కాని ఈశ్వరుని ధర్మములైన జ్ఞాన ఐశ్వర్యాదులు గలవారిగా చెప్పుచున్నాము. అందువలన ఉత్పత్తి అసంభవమను దోషము రాదు అనిన అట్లనుట సరికాదు. ఎందులకనగా వాసుదేవాది నలుగురిని ఈశ్వర ధర్మములు గలవారిగా స్వీకరించిన అనేక ఈశ్వరుల నిష్ప్రయోజన కల్పన గావించవలసి వచ్చును. మరియు ఒకే వాసుదేవుడను ఈశ్వరుని ద్వారా కార్య సిద్ధి కలుగుచుండగా అనేక ఈశ్వరులను స్వీకరించిన వాసుదేవడు ఒకడే అను సిద్ధాన్తము నశించును. ఒకే వాసుదేవును వ్యూహములు సంకర్షనాదులనిన ఆవిధముగా చెప్పనలవికాదు ఏలనన కార్య కారణములలో భేదము లేనిచో ఉత్పత్తి అసంభవమను దోషము పూర్వము వలే నుండును.

ఈ దోషమునకు భంగము లేదు. 'బ్రహ్మాది స్తమ్బపర్యంతము సంపూర్ణ సంసారము భగవంతును వ్యూహమనిన' ఈ ప్రపంచము పరమేశ్వరరూపమైయుండగా ఈ నలుగురు మాత్రమే ఆయనరూపములని చెప్పుట తక్కినవి కావని చెప్పుట యెట్లు సంభవము? కావున సర్వవిధముల పాంచరాత్రాగమ సిద్ధాన్తము అప్రమాణము.

216. విప్రతిషేధాచ్చ. (2.2.45.)

సూత్రార్థము:- కొన్ని స్థలములలో వాసుదేవునికి విజ్ఞానము, ఐశ్వర్యము కలదందురు మరికొన్నిచోట్ల గుణములే వాసుదేవుడందురు ఈ విధముగా గుణములుకలవారిని మరియు గుణములను భేదాభేద వర్ణన చేయుట విరోధమగుటవలన భాగవతమతము ప్రామాణికము గాదు.

జ్ఞాన, ఐశ్వర్య, శక్తి, బల, వీర్యము మరియు తేజస్సు మొదలగునవి వాసుదేవుని గుణములుగా వర్ణించిరి మరికొన్నిచోట్ల గుణములనే వాసుదేవునిగా వర్ణించగా పరస్పరము విరోధము కలుగుటవలన భాగవతమతము అప్రామాణికము. 'శాండిల్యుడను ఋషి నాలుగు వేదములలోను మొక్షమార్గమును కనుగోనలేక ఈ మతమును పొందెనను' వాక్యములు గలవు. ఈ వాక్యములద్వారా పాఞ్చరాత్రములో వేద నింద గానవచ్చుచున్నది. గాన పైనుదహరించిన గుణ గుణి కల్పన అసంగతము. అందులకే సాంఖ్య, వైశేషిక, బౌద్ధ, జైన, మాహేశ్వర, శాండుల్యుని భాగవతము మొదలగునవన్నియూ భ్రాన్తి మూలకములు. వీని ద్వారా అద్వైత సిద్ధాన్తము దూషితము గాదు. ఈ కారణమువల్లనే బ్రహ్మమునుండి జగత్తు యొక్క ఉత్పత్తిని చెప్పు ప్రథమాధ్యాయములోని సమన్వయమునకు విరుద్ధము లేదని సిద్ధాన్తీ కరించబడినది.

## బ్రహ్మసూత్ర హృదయములో ద్వితీయాధ్యాయములోని ద్వితీయపాద సంకలనము సమాప్తము.

## ద్వితీయాధ్యాయే తృతీయపాదః.

## 62. వియదధికరణము.

సంగతి:-పాదము మారుట వలన ఇచట సంగతి చెప్పనవసరములేదు.

విషయము:- సృష్టినిచెప్పు శ్రుతులలో విరోధములేదనిచెప్పుటకు మొదటిలో ఈ అధికరణములో ఆకాశపదముపై విచారము గావింతురు.

సంశయము:- ఆకాశము ఉత్పన్నమగునా లేక నిత్యమా?

పూర్వపక్షము:- సమవాయి, అసమవాయి మరియు నిమిత్త కారణము లేనందున ఆకాశము ఉత్పన్నమగుట లేదు. ఆకాశము యొక్క ఉత్పత్తిని చెప్పు శ్రుతి గౌణము. గనుక ఆకాశము నిత్యము.

సిద్ధాన్తము:- ఒక జ్ఞానము ద్వారా సర్వ జ్ఞానమును చెప్పు శ్రుతిప్రతిజ్ఞ, కార్య జగత్తు యొక్క విభాగము మరియు ఆకాశముయొక్క ఉత్పత్తిని చెప్పు శ్రుతిని స్వీకరించుటయే ఉచితము. కాని ఆకాశము నిత్యమని చెప్పుట సరికాదు. అంతేగాక శ్రుతులలో చెప్పు వివర్తవాదములో సమవాయి, అసమవాయి మరియు నిమిత్త కారణముల అపేక్ష లేనే లేదు. అచట ఒకే కారణముద్వారా సంపూర్ణ జగత్కార్యము ఉత్పన్నమగుచున్నదని చెప్పు ట సిద్ధాన్తసమ్మతము.

వైయాసికన్యాయమాలా:-

137. వ్యోమ నిత్యం జాయతే వా హేతుత్రయవివర్జనాత్ । జనిశ్రుతేశ్చ గౌణత్వాన్నిత్యం వ్యోమ న జాయతే॥

138. ఏకజ్ఞానాత్సర్వబుద్ధేర్విభక్తత్వాజ్జనిశ్రుతేః । వివర్తే కారణైకత్వాద్బ్రహ్మణో వ్యోమ జాయతే ॥

ఆకాశము నిత్యమా లేక ఉత్పన్నమగునా అని సందేహమునకు పూర్వపక్షి ఆకాశముఉత్పత్తియగునని చెప్పు శ్రుతి గౌణమగుటవలననూ, కారణత్రయమునకు అభావముండుటవలననూ ఆకాశము నిత్యము అది ఉత్పన్నమగుటలేదు అనును అపుడు సిద్ధాన్తి ఆకాశము ఉత్పన్నమగుచున్నదనును. ఏక విజ్ఞానముద్వారా సర్వవిజ్ఞానము, కార్య జగాత్తులో విభక్తత్వము, ఉత్పత్తిని చెప్పు శ్రుతి మరియు వివర్తవాదములో కారణత్రయముయొక్క అనపేక్షత్వము అనునవి సిద్ధమగుచున్నందువలన ఆకాశముత్పన్నమగుచున్నది.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య

“తస్మాద్వా ఎతస్మాదాత్మన ఆకాశస్సంభూతః” అనుశ్రుతిలో ఆకాశము యొక్క ఉత్పత్తి వినవచ్చిననూ అది యుక్తి యుక్తము కాదు. ఎందులకనగా కార్యమునకు సమవాయికారణము, అసమవాయికారణము మరియు నిమిత్త కారణముల అపేక్ష కలదు కాని ఎంత అన్వేషించిననూ ఆకాశముయొక్క ఉత్పత్తిలో ఈ మూడు కారణములు కనబడుటలేదు, అందువలన వేరొకమార్గము లేక పైనుదహరించిన శ్రుతిని గౌణమని చెప్పవలయును. “ఆకాశస్సంభూతః” అను శ్రుతిలో గల స్సంభూత శబ్దమునకు సాత్తాశ్రయరూపమైన ఆకాశపదార్థము గుణముతో సంభన్ధము గలదని చెప్పవచ్చును. ఈవిధముగా చెప్పిన పూర్వపక్షమునకు సిద్ధాన్తి చెప్పు సమాధానము.

ఒక విజ్ఞానముద్వారా సంపూర్ణ వస్తువుల జ్ఞానము కలుగునని అన్ని వేదాన్తముల డిండిమఘోష. ఒక విజ్ఞానముద్వారా సర్వ విజ్ఞానము యొక్క ఉపపత్తి (యుక్తి) ఆకాశము బ్రహ్మకార్యమని ఒప్పుకొనినచో సరియగును. ఏవిధముగా మృత్తిక జ్ఞానముకలిగిన మట్టితోచేసిన పాత్రలన్నిటి జ్ఞానము కలుగును, లేనిచో ఈ విషయము యుక్తి సంగతముగాదు. ఆకాశము ఉత్పన్నమగుచున్నది, విభక్తమగుటవలన కుండవలె అనునది ఇచట అనుమానము. ఆకాశములో వాయువ్వాదుల వైలక్షణ్యము ప్రసిద్ధము కాన హేతువు అసిద్ధముకాదు. బ్రహ్మ సర్వాత్మకము అందువల్ల దానిలో అవయవములు లేవు. అందువల్ల ఆకాశము యొక్క ఉత్పత్తిని చెప్పు అనుమానములో దోషములేదు. ఉత్పత్తిని చెప్పు శ్రుతిగూడ చెప్పిన అనుమానమునకు ప్రమాణము.

నయ్యాయకుల ఆరంభవాదములో మూడు కారణముల అపేక్ష ఉన్ననూ వివర్తవాదములో వాని అపేక్ష లేదు. కారణత్రయముల అప్రసిద్ధనిబన్ధనము అను దోషము సిద్ధాన్తములో లేదు.

217. న వియదశ్రుతేః. (2.3.1)

సూత్రార్థము.- ఆకాశము ఉత్పన్నమగుటలేదు ఎందులకనగా ఆకాశము యొక్క ఉత్పత్తిని చెప్పు శ్రుతులు లేవు,

ఇచట పూర్వపక్షములో శ్రుతులలో విరోధముండుటవలన అవి అప్రమాణములు కాని సిద్ధాన్తములో విరోధము లేనందున శ్రుతులు ప్రమాణములు. సృష్టిప్రతిపాదించు శ్రుతులలో అవిరోధము చెప్పుటకు మొదట ఆకాశమునాశ్రయించి విచారము గావించు చున్నారు. ఆకాశము యొక్క ఉత్పత్తి కలదా లేదా అని సంశయము కలుగగా ఆకాశము యొక్క ఉత్పత్తిని ఒప్పుకొనినచో ఛాన్దోగ్యములో సత్ శబ్దవాచ్యమైన బ్రహ్మ ప్రసంగములో ఆకాశ వాయువుల ఉత్పత్తి చెప్పకనే “తత్ తేజోఽసృజత” అని అగ్ని యొక్క ఉత్పత్తి సర్వ ప్రథమములో ఎట్లు చెప్పిరి. ఆకాశము ఉత్పత్తి అగుటలేదనిన తైత్తిరీయోపనిషత్తులో “ఆత్మ నుండి ఆకాశము ఉత్పత్తి అగుచున్నది అని ఎట్లు చెప్పిరి”? అందువల్ల ఈ రెండు శ్రుతులకు పరస్పర విరోధము చెప్ప వలయును. ఈ విధముగా చెప్పిన పూర్వ పక్షమునకు సిద్ధాన్తి ఎకదేశమతము నందు ఈ సూత్రము చెప్పబడినది. జగత్తు ఉత్పత్తి ప్రసంగములో ఆకాశము యొక్క ఉత్పత్తి శ్రుతిని చెప్పు వాక్యము వినబడుటలేదు కావున ఆకాశము యొక్క ఉత్పత్తి అగుటలేదు. అతీన్ద్రియ జ్ఞానార్థము యొక్క ఉత్పత్తిని చెప్పుటలో మనకు శ్రుతులే ప్రమాణములు. ఉత్పత్తి శ్రుతి వినబడుటలేదు గాన ఆకాశము ఉత్పత్తియగుటలేదు.

218. అస్తి తు. (2.3.2.)

సూత్రార్థము.- ఛాందోగ్యములో ఆకాశము యొక్క ఉత్పత్తిని ప్రతిపాదించు శ్రుతి లేక పోయిననూ తైత్తిరీయ శ్రుతిలో ఉన్ననూ విరోధము అటులనే ఉన్నది.

సూత్రములో వచ్చిన “తు” శబ్దము అన్య పక్షమును గ్రహించుటకు. ఛాందోగ్యములో ఆకాశము యొక్క ఉత్పత్తి శ్రవణము లేక పోయిననూ తైత్తిరీయములో ఉన్నదిగదా. “సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ” అను ప్రసంగములో “ఈ ఆత్మనుండి ఆకాశము ఉత్పన్నమయినది” అని చెప్పిరి. ఇదే విధముగా కొన్నిచోట్ల అగ్ని నుండి సృష్టి చెప్పబడినది, వేరొక చోట ఆకాశము నుండి. అందువల్ల శ్రుతులలో విరోధము ఆలాగుననే యున్నది.

219. గౌణ్యసంభవాత్. (2.3.3.)

సూత్రార్థము.- ఆకాశము యొక్క ఉత్పత్తిని బోధించు శ్రుతి గౌణము, ముఖ్యము కాదు. ఎందులకనగా ఆకాశము యొక్క ఉత్పత్తిలో సమవాయికారణము మరియు సామాగ్రి లేవు. ఆకాశము వ్యాపకము గాన దాని నిత్యత్వము యొక్క అనుమానము సంభవము. గనుక ఆకాశము యొక్క ఉత్పత్తి స్థితి విరుద్ధమే.

పూర్వములో చెప్పిన ఆకాశము యొక్క ఉత్పత్తి శ్రుతి గౌణమే గాని ముఖ్యము కాదు ఎందులకనగా పరస్పరము విరోధ శ్రుతులుంటవలన అని ఏకదేశి తన మతమును చెప్పు చున్నాడు. ఆకాశోత్పత్తికి కాణాదాదులు చెప్పు సమవాయి, అసమవాయి మరియు నిమిత్త కారణములు లేనందున ఆకాశము యొక్క ఉత్పత్తిని చెప్పుట అసంభవము. ఉత్పత్తిని చెందు అన్ని పదార్థములు పైకారణముల ద్వారానే ఉత్పన్నమగును. ఇచట ఆకాశము యొక్క ఉత్పత్తిలో సమవాయాది కారణములు లేవు అందువల్ల దాని ఉత్పత్తిని చెప్పుట సంభవముకాదు. "ఆకాశము నిత్యము, వ్యాపకము మగుటవలన, ఆత్మవలే" అను అనుమానము ద్వారా ఆకాశములో నిత్యత్వము సిద్ధమగుట వలన దాని ఉత్పత్తిని చెప్పుశ్రుతి గౌణము.

221. శబ్దాచ్చ. (2.3.4.)

సూత్రార్థము : - అంతేగాక "వాయుశ్చాన్తరిక్షం చైతదమృతమ్" వాయువు ఆకాశము గూడ అమృతస్వరూప మైనది. ఈ శ్రుతిలో ఆకాశమును చెప్పుటకు అమృత శబ్దమును ప్రయోగించిరి. అందువలన ఆకాశము ఉత్పత్తియగుటలేదని తెలియవచ్చు చున్నది.

కేవలము అనుమానముద్వారా ఆకాశములో నిత్యత్వము సిద్ధమగుచున్నదనియే కాదు కాని శబ్దముద్వారా గూడా ఆకాశములో నిత్యత్వము సిద్ధమగుచున్నది. "వాయుశ్చాన్తరిక్షం చైతదమృతమ్" (బృ.2.3.3.) వాయువు మరియు ఆకాశము అమృతస్వరూపములని స్వయముగా శ్రుతి చెప్పుచున్నది. "ఆకాశవత్సర్వగతశ్చ నిత్యః" పరమేశ్వరుడు ఆకాశమువలే సర్వవ్యాపకుడు, నిత్యుడు అని ఆకాశమును పరమేశ్వరునికుపమానముగా శ్రుతి చెప్పుచున్నది. ఈ విధముగా శ్రుతులలో ఆకాశమునకు నిత్యత్వము మరియు ఉపమానము వినబడుటవలన ఆకాశము ఉత్పన్నమగుటలేదని స్వీకరించుటయే సరి.

"తస్మాద్వా ఎతస్మాదాత్మన ఆకాశస్సంభూతః ఆకాశాద్వాయుర్వాయోరగ్నిః" ఆ ఆత్మనుండి ఆకాశము ఉత్పన్నమయినది. ఆకాశమునుండి వాయువు మరియు వాయువు నుండి అగ్ని ఉత్పన్నమయినవి.

ఈ అధికరణములో సంభూత శబ్దము ద్వారా అగ్ని మొదలగు వాని ఉత్పత్తిని మాత్రము ముఖ్యముగా అంగీకరించుచున్నారు. అట్లే ఆకాశములో గూడ సంభూత శబ్దార్థము ముఖ్యముగా స్వీకరిచువలయునుగాని గౌణముగా ఎట్లు స్వీకరించుచున్నారు? అది ఎట్లు యుక్తి సంగతమగును? ఈ ప్రశ్నకు సమాధానము ముందు సూత్రముద్వారచెప్పుచున్నారు.

221. స్యాచ్చైకస్య బ్రహ్మశబ్దవత్. (2.3.5.)

సూత్రార్థము:- ఒకే ప్రకరణములో విషయభేధముద్వారా గౌణార్థము మరియు ముఖ్యార్థము చెప్పవచ్చును. 'అన్నం బ్రహ్మ' అను చోట బ్రహ్మ శబ్దము గౌణము మరియు 'ఆనన్దో బ్రహ్మ' అను చోట బ్రహ్మ శబ్దార్థము ముఖ్యము. ఆలాగుననే విషయ భేధము ద్వారా సంభూత శబ్దము గౌణము మరియు ముఖ్యార్థము కాగలదు.

ఒకే సంభూత శబ్దము సమాన ప్రకరణములో విషయ భేధము ద్వారా గౌణార్థము మరియు ముఖ్యార్థము కాగలదు. ఏవిధముగా ఒకేప్రకరణములో ఒకే బ్రహ్మ శబ్దము 'తపో బ్రహ్మ' (తై.3.2.) అన్నచోట అన్నాదులలో గౌణముగనూ ఆనందాదులలో ముఖ్యముగనూ ప్రయోగించిరి. అట్లే సంభూతి శబ్ద విషములోగూడ తెలిసికొన వలయును. ఒకే ప్రకరణములో ఒకే బ్రహ్మ శబ్దమును "తపస్సు ద్వారా బ్రహ్మను తెలిసికొనుము, తపస్సే బ్రహ్మము" అని బ్రహ్మశబ్దమును తపస్సు అను అర్థములో ప్రయోగించిరి. ఇచట బ్రహ్మ శబ్దమును గౌణార్థములో ప్రయోగించిరి, మరియు "ఆనందో బ్రహ్మ" అనుచోట ఆనందార్థములో బ్రహ్మ శబ్దమును ముఖ్యార్థములో ప్రయోగించిరి. ఆలాగుననే "సమ్భూత" శబ్ద విషయములో గూడ తెలిసికొనవలయును. ఈలాగుననే బ్రహ్మ మరియు ఆకాశము పాలు మరియు జలము వలే పరస్పర సంబన్ధము గలవి. మరియు ఆకాశములో వ్యాపకత్వము, అమూర్తతత్వము అను సామాన్య ధర్మముల వలన అభేదము స్వీకరించిరి. అందువల్ల ఒక విజ్ఞానముద్వారా సర్వవిజ్ఞానముఅను ప్రతిజ్ఞ గూడ భంగముకాదు. గాన ఆకాశము యొక్క ఉత్పత్తిని చెప్పు శ్రుతి గౌణము.

ఈ ఏకదేశి మతము ఖండన గావించుచూ సిద్ధాన్తి క్రింది సూత్రమును చెప్పెను.

222. ప్రతిజ్ఞాఽహానిరవ్యతిరేకాచ్ఛబ్దేభ్యః. (2.3.6.)

సూత్రార్థము:- ఉపనిషత్తులలో ప్రతిపాదించిన బ్రహ్మముద్వారా సంపూర్ణ వస్తువులకు అభేదముండుటవలన ఒక విజ్ఞానముద్వారా సర్వవిజ్ఞానము కలుగునను ప్రతిజ్ఞకు హాని కలుగదు. కాని ఆకాశముయొక్క ఉత్పత్తిని స్వీకరించనిచో చెప్పిన ప్రతిజ్ఞకు హాని కలుగును. కనుక చెప్పిన ప్రతిజ్ఞ సిద్ధికొరకు ఆకాశము యొక్క ఉత్పత్తిని స్వీకరించవలయును. మరియు కార్య కారణములు అభేదమని ప్రతిపాదించు శ్రుతుల ద్వారా గూడ ప్రతిజ్ఞా సిద్ధియే తెలియుచున్నది. ఆ శ్రుతులు "సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్" అనగా "సోమ్య! సృష్టికి పూర్వము ఇదంతయూ కేవలము సద్రూపమై యుండెను"(ఛాం.6.2.1.), "ఐతదాత్మ్యమిదం సర్వమ్" (ఛాం.6.8.7) "ఇదంతయూ ఆత్మరూపమై యున్నది".

సిద్ధాన్తి ఏకదేశిమతమును ఖండించుచూ అన్ని వస్తువులు వేదాన్తముద్వారా తెలిసికొనబడు బ్రహ్మకంటే వేరుకాదు అనగా అభిన్నములు. "కస్మిన్ను భగవో విజ్ఞాతే సార్వమిదం విజ్ఞాతం భవతి" "ఓ భగవంతుడా! దేనిని తెలిసికొనిన ఇదంతయూ తెలిసికొనబడునో" (ముం.1.1.3) "యేనాశ్రుతం శ్రుతం భవత్యమతం మతమ్" "దేని శ్రవణముద్వారా

అశ్రుతము శ్రుతమగునో తెలియనిది తెలియబడునో" (ఛాం.6.1.1.) "ఆత్మని ఖల్వరే దృష్టే శ్రుతే మతే విజ్ఞాతే ఇదం సర్వం విదితమ్" "ఓ మైత్రేయీ! ఆత్మనెరింగితివేని సాక్షాత్కరించితివేని విచారింశతివేని ఈసర్వమునూ తెలిసికొనబడినట్లే అగును" (బృ.4.5.6.) ఇత్యాది వేదాన్త వాక్యములలో ఒక విజ్ఞానముద్వారా సర్వవిజ్ఞానము యొక్క ప్రతిజ్ఞ భంగముకాదు. అట్లు కాని పక్షములో బ్రహ్మమునుండి ఆకాశముయొక్క ఉత్పత్తిని స్వీకరిచనిచో పూర్వము చెప్పిన ప్రతిజ్ఞ నష్ట మగును అంతేగాక బ్రహ్మ జ్ఞానముద్వారా ఆకాశజ్ఞానము కలుగదు. చెప్పిన శ్రుతి ప్రతిజ్ఞ సిద్ధికొరకు ఆకాశముయొక్క ఉత్పత్తిని స్వీకరించవలయును. శ్రుతి శబ్దములద్వారా మరియు కార్య-కారణముల అభిన్న న్యాయముద్వారా ప్రతిజ్ఞయొక్క సిద్ధిగావించబడినది. "దేని శ్రవణసద్వారా అశ్రుతము శ్రుతమగునో" అను ప్రతిజ్ఞ మరియు కార్య-కారణముల అభిన్నత్వమును ప్రతిపాదించు మృదాది దృష్టాంతములు పైనచెప్పిన సర్వవిజ్ఞాన ప్రతిజ్ఞను సమర్థనము గావించుచున్నవి. దాని సిద్ధికొరకు మరల "హే సోమ్యుడా! సృష్టికి పూర్వము కేవలము సత్ మాత్రమే యుండెను" "ఇదంతయూ ఆత్మయై యుండెను" అని మొదలిడి ఈ ప్రపాఠకము అంతమువరకు అభేద అర్థమును చెప్పు శబ్దములే కానవచ్చుచున్నవి. అందువలన అగ్ని మొదలగువానివలే ఆకాశముగూడ ఉత్పన్నమగుచున్నది. ఆకాశము యొక్క ఉత్పత్తిను స్వీకరించిన ఛాందోగ్య శ్రుతికి కలిగిన విరోధము అట్లే యుండుననుట సరికాదు. ఎందులకనగా "ఆత్మనుండి ఆకాశము ఉత్పన్న మగు చున్నది" అను తైత్తిరీయ శ్రుతి అనురోధమువలన "ఆకాశము మరియు వాయువును సృష్టికావించి ఆ ఆత్మ తేజస్సును సృష్టికావించినది" అని ఛాన్దోగ్య శ్రుతిలో విపరిణామమును స్వీకరించిన విరోధముండదు. శ్రుతిగమ్యమైన బ్రహ్మమే ఆకాశోత్పత్తికి సామాగ్రి అందువల్ల సమవాయి, అసమవాయి, నిమిత్త కారణముల అభావము చెప్పుట సబటే.

223. యావద్వికారం తు విభాగో లోకవత్. (2.3.7.)

సూత్రార్థము:- వికారము గల వస్తువులు ఉదాహరణకు కుండ, మూకుడు మొదలగునవి ఎన్ని కానవచ్చు చున్నవో అవి అన్నియూ పరస్పరవిభాగము కలిగినవి. అందువల్ల భూమ్యాదుల నుండి వేరగుటవలన ఆకాశము బ్రహ్మజన్య మనుటలో ఏ వివాదము లేదు.

సూత్రములో వచ్చిన "తు" శబ్దము ఆకాశముయొక్క ఉత్పత్తి అసంభవమను ఆశంకను దూరము గావించిటకు. ఆకాశముయొక్క ఉత్పత్తి అసంభవమని చెప్పరాదు, ఏలనన ఎన్ని కార్యములు ఘటాదులు కలవో అవి అన్నియూ పరస్పరవిభాగములవలే లోకములో చూడబడుచున్నవి కాని నిర్వికార బ్రహ్మములో భిన్నత్వము లేదు. లోకములో ఘటాది కార్యములందే విభాగము చూడబడుచున్నది. ఇట్లయిన ఆత్మయూ ఏదియో ఒక పదార్థమునకు వికారమే కావలసివచ్చును. ఆ ఆత్మ ఆకాశాదులనుండి విభక్తమయ్యేయున్నది కదా, అందువల్ల ఆత్మ అనిత్యమే అగును కదా ననదవేమో? దానికి సమాధానము వినుము. ఈవిధమైన ఆశంక సరికాదు

ఎందులకనగా ఆత్మను వికారమని స్వీకరించిన ఆకాశాదులలో నిరాత్మకత్వమువల్ల శూన్యవాద ప్రసంగము వచ్చును అంతేగాక ఆత్మకన్న భిన్నపదార్థమును ఆకాశాదుల కారణముగా శ్రుతులలో చెప్పలేదు. ఆకాశములో అమృతత్వ శబ్ద ప్రయోగము ఆపేక్షికము మరియు దాని ఉత్పత్తిగూడ చెప్పియుంటిమి. ఆకాశమునకు సమానముగా ఆత్మ వ్యాపకము మరియు నిత్యమని చెప్పినది ఆకాశమునందు గల ప్రసిద్ధ మహత్వగుణము ద్వారా బ్రహ్మమునందు నిరతిశయ మహత్వగుణము ప్రతిపాదించుటకు ఉపమానరూపముగా అభీష్టమేగాని ఆకాశముతో సాదృశ్యమును చెప్పుటకుగాదు. ఎట్లు అన్నాదులలో ఆత్మ శబ్దమును గౌణముగా చెప్పిరో ముఖ్యముగాదో అట్లే ఆకాశములో జన్మశ్రుతి గౌణమేగాని ముఖ్యముగాదు. అందువల్ల అన్నాదులలో బ్రహ్మశబ్ద ప్రయోగమువలే ఆకాశజన్మశ్రుతి గౌణముగా స్వీకరిచవలయునేగాని ముఖ్యముగా కాదు. ఈ విధముగా ఆకాశముయొక్క ఉత్పత్తిని చెప్పు సంభావనా, శ్రుతి మరియు అనుమానముద్వారా ఖండిపబడినదని తెలిసికొనవలయును. గాన ఆకాశము బ్రహ్మ కార్యమని సిద్ధమైనది.

## 63. మాతరిశ్వాధికరణము.

సంగతి:- పూర్వోక్త న్యాయమును ఈ సూత్రములో అతిదేశము (అన్యధర్మస్యాన్యత్ర ఆరోపకణం) గావించినందువలన పూర్వధికరణముతో ఈ అధికరణమునకు అతిదేశ సంగతి.

విషయము:- వాయువు ఉత్పత్తిని చెప్పు శ్రుతి ఈ అధికరణమునకు విషయము.

సంశయము:- వాయువు ఉత్పన్నమగు చున్నదా లేక నిత్యమా?

పూర్వపక్షము:- ఛాన్దోగ్య శ్రుతిలోవాయువు యొక్క ఉత్పత్తి లేనికారణమున వాయువు నిత్యము. అంతేగాక "సైవాఽనస్తమితా దేవతా యద్వాయుః" అనగా "ఈ వాయువు అవినాశీ దేవతా" (బృ. 1.5.22). ఈ బృహదారణ్యక శ్రుతిలో వాయువుయొక్క అస్తమయము నిషేదించిరి గాన వాయువు నిత్యము.

సిద్ధాన్తము:- తైత్తిరీయశ్రుతియొక్క ఉపసంహారమును చూచుచూ అనస్తమయశ్రుతిని గౌణముగా భావించవలయును. గనుక ఆకాశమువలే వాయువుగూడ ఉత్పన్నమగుచున్నది. దానికి కారణము ఉపహిత బ్రహ్మ చైతన్యము.

వైయాసికన్యాయమాలా.

139. వాయుర్నిత్యో జాయతే వా ఛాన్దోగ్యేఽజన్మ కీర్తనాత్ | సైషాఽనస్తమితా దేవతేత్యుక్తేశ్చ న జాయతే ||

140. శ్రుత్యన్తరోపసంహారాద్గౌణ్యనస్తమయః శ్రుతిః | వియద్వజ్జాయతే వాయుః స్వరూపం బ్రహ్మ కారణమ్ ||

వాయువు నిత్యమా లేక ఉత్పన్నమగునా? ఛాన్దోగ్య ఉపనిషత్తులో వాయువుయొక్క ఉత్పత్తి చెప్పక పోవుటవలన మరియు బృహదారణ్యకములో "సైషా ఽనస్తమితా దైఽవతా" అనగా "వాయువు అవినాశీ దేవతా" అని చెప్పుటవలన వాయువు ఉత్పన్నమగుటలేదని ప్రతీతమగుచున్నది. అను పూర్వపక్ష ప్రశ్నకు సిద్ధాన్తి

సమాధానము. తైత్తిరీయ శ్రుతివాక్యమును ఛాన్దోగ్యములో ఉపసంహారము చేయుటవలన అనస్తమయ శ్రుతి ముఖ్యముకాదు. ఆకాశమువలే వాయువు ఉత్పన్నమగును. ఆకాశరూపమును పొందిన బ్రహ్మము వాయువునకు కారణము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

తైత్తిరీయములో "ఆకాశాద్ వాయుః" అని వాయువుయొక్క ఉత్పత్తిని ప్రతిపాదించు శ్రుతి గౌణము ఎందులకనగా ఛాన్దోగ్యములో సృష్టిప్రకరణములో తేజస్సు,జలము మరియూ అన్నము (పృథ్వీ) ల ఉత్పత్తిమాత్రమే చెప్పబడినది. "ఒకచోట వినని శ్రుతి వేరొకచోట వినిన శ్రుతిని వారించలేదు". ఈ న్యాయముద్వారా తైత్తిరీయ శ్రుతి గౌణమెట్లగును? దీనికి సమాధానముగా "అన్య శ్రుతితో విరోధము వచ్చుటవలన" అనిన మరి బృహదారణ్యకములో "వాయువు అవినాశీ దేవతా" అనిరిగదా. వాయువు ఉత్పత్తి చెందుననిన బృహదారణ్యకశ్రుతి వాయువును అవినాశీ అని చెప్పుట కుదరదుగదా? దీని వల్ల వాయువు ఉత్పన్నమగుటలేదను జ్ఞానము కలుగుచున్నది. దీనికి సిద్ధాన్తి ఇచ్చిన సమాధానము. ఛాన్దోగ్యములో వాయువు జన్మ వినిపించక పోయిననూ గుణోపసంహారన్యాయముద్వారా ( పై అధికరణములో చెప్పిన గుణములను మరియు విశేషణములను ఈ అధికరణములో [ఉపసంహరిచుట] నికి తీసుకొని వచ్చుట). తైత్తిరీయ వాక్యమును ఛాన్దోగ్యములో ఉపసంహారము గావించిన వాయువుయొక్క ఉత్పత్తి వినిపించును.

వాయువును అవినాశీ అని చెప్పు శ్రుతి ముఖ్యముగాదు ఎందులకనగా ఉపాసన ప్రకరణములో చెప్పబడుట వలన అది స్తుత్యర్థము. ఆకాశముయొక్క ఉత్పత్తిలో ఎన్ని కారణములు గలవో వానిని ఇచ్చట అనుసంధానము చేయవలయును. వాయువు ఆకాశజన్యము గాన అది బ్రహ్మములో అన్తర్భావముగాదు. అందువల్ల బ్రహ్మజ్ఞానముద్వారా వాయుజ్ఞానము కలుగదని శంకించరాదు. పూర్వ పూర్వ కార్యవిశిష్ట బ్రహ్మము ఉత్తరోత్తర కార్యమునకు హేతువు అనునది ముందు వివరించెదము. దీనిద్వారా ఆకాశరూపము పొందిన బ్రహ్మము వాయువునకు కారణము గనుక వాయువు ఉత్పన్నమగుచున్నది.

### 224. ఏతేన మాతరిశ్వా వ్యాఖ్యాతః. (2.3.8.)

సూత్రార్థము:- ఆకాశము యొక్క ఉత్పత్తి చెప్పబడినది. ఈ కథనముద్వారా గూడ ఆకాశావచ్ఛిన్న మనగా ఆకాశభావము పొందిన బ్రహ్మమునుండి వాయువుగూడ ఉత్పన్నమగుచున్నదని చెప్పబడినది.

క్రిందటి అధికరణములో చెప్పిన న్యాయమును ఇచట అతిదేశము గావించుటవలన ఆకాశముయొక్క ఉత్పత్తి వ్యాఖ్యానముద్వారా వాయువు ఆకాశావచ్ఛిన్న బ్రహ్మచైతన్యమునుండి ఉత్పన్నమగుచున్నదను వ్యాఖ్యానము గూడ అయినది. వాయువు అనస్తమయ దేవతయని చెప్పినది అపరవిద్య అనగా ఉపాసన విషయము. లోకములో అగ్ని మొదలగు భూతములవలే వాయువుయొక్క అస్తమయము చూడబడుటలేదు.

పూర్వాధికరణములోలాగ వాయువు ఉత్పత్తిని స్వీకరించనిచో ఒకవిజ్ఞానముద్వారా సర్వ విజ్ఞాన ప్రతిజ్ఞకు హాని కలుగును. ఆకాశమువలే వాయువుయొక్క ఉత్పత్తిని సమర్థించుటకు మరియు ఈ విషయములో వచ్చు ఆశంకలను దూరముగావించుట ఈ అధికరణముయొక్క ముఖ్య ఉద్దేశ్యమయిన మరల వేరొక అధికరణము మొదలిడుట నిరర్థకమగునుకాదా? అనిన అట్లనుట సరిగాదు. ఎందులకనగా సంవర్గవిద్యాదులలో వాయువును ఉపాస్యముగా చెప్పిరి. అస్తమయ ప్రతిషేధముద్వారా ఆ వాయువులో నిత్యత్వ ఆశంక కలుగును దానిని దూరముగావించుటకు ఈ అధికరణము ఆవశ్యకము.

## 64. అసంభవాధికరణము.

ఇంతకు పూర్వధికరణములో వాయు, ఆకాశముల ఉత్పత్తి అంభవమనబడిననూ శ్రుతులద్వారా వాని ఉత్పత్తిని సమర్ధన గావించిరి. ఆలాగుననే శ్రుతుల బలముతో వేరొక బ్రహ్మమునండి ఈబ్రహ్మముయొక్క ఉత్పత్తిని స్వీకరించవలయును అను దృష్టాన్త సంగతి వలన ఈ అధికరణము ప్రారంభమయినది.
సంగతి:- ఆకాశము మరియు వాయువు యొక్క ఉత్పత్తి అసంభవమయుననూ ఉత్పత్తిని చెప్పు శ్రుతులను ఆధారముగావించుకొని వాని ఉత్పత్తిని పూర్వాధికరణములో సమర్థన గావించిరి. ఆలాగుననే అన్య బ్రహ్మనుండి అన్యబ్రహ్మ ఉత్పత్తిని స్వీకరించవలయును అను దృష్టాన్త సంగతివలన ఈ అధికరణము ప్రారంభమయునది.
విషయము:- బ్రహ్మయొక్క ఉత్పత్తి ఈ అధికరణమునకు విచారణీయ విషయము.

సంశయము:- సద్ బ్రహ్మము ఉత్పన్నమగునా లేక నిత్యమా?
పూర్వపక్షము:- కారణమగుటవలన బ్రహ్మ ఉత్పన్నమగుచున్నది. ఎందులకనగా ఏది కారణమొ దాని ఉత్పత్తి చూడబడుచున్నది ఆకాశము మరియు వాయువు వలే.
సిద్ధాన్తము:- బ్రహ్మకన్న వేరొక కారణము లేదు ఎందులకనగా బ్రహ్మకన్న భిన్నమైన సద్ మరియు అసద్ పదార్థములు కల్పితములు. వానిలో అసద్ పదార్థము (కుందేలు కొమ్ము)దేనికీ ఉపాదానకారణము కానే కాజాలదు మరియు సద్ పదార్థమునుండి ఆకాశాదుల ఉత్పత్తి వినబడుచున్నది. అంతేగాక బ్రహ్మము అజము, నిత్యము, శాశ్వతము అని చెప్పుటవలన “యద్యత్కారణం తత్తద్ ఉత్పత్తిశీలం” (ఏది ఏది కారణమో అది అది ఉత్పత్తి స్వభావము కలది) అను వ్యాప్తి బాధిత మగు చున్నది. గాన సద్ బ్రహ్మ ఉత్పన్నముగాదు.
వైయాసికన్యాయమాలా:-
141. సద్బ్రహ్మ జాయతే నో వా కారణత్వేన జాయతే |యత్కారణం జాయతే తద్వియద్వాయ్వాదయో యథా||
142. అసతోఽకారణత్వేన ఖాదినాం సత ఉద్భవాత్ | వ్యాప్తేరజాదివాక్యేన బాధాత్సన్నైవ జాయతే ||
సద్రూప బ్రహ్మము ఉత్పన్నమగుచున్నదా లేదా? సద్రూప బ్రహ్మము కారణమగుటవలన ఉత్పన్నమగు చున్నది,

ఎందులకనగా ఏది కారణమో అది ఉత్పన్నమగుచున్నది ఆకాశ వాయువులవలే. దీనికి సిధాన్తి సమాధానము. సద్రూప బ్రహ్మము  ఉత్పన్నమగుటలేదు ఎందులకనగా అసద్ వస్తువు సద్ వస్తువునకు కారణముగాజాలదు. ఆకాశాదులు సద్ వస్తువునుండి ఉత్పన్నమగుచున్నవి. మరియు ఏది కారణమో అది ఉత్పన్నమగుచున్నదను వ్యాప్తి ఈ చేప్ప బోవు శ్రుతి ద్వారా బాధితమగు చున్నది. “స వా ఏష మహానజః” “ఆ మహాశక్తి గల ఆత్మ జన్మరహితమగుట వలన నిత్యము”.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఛాన్దోగ్యములో “సదేవ సోమ్యేదమగ్ర.” హే సౌమ్యుడా! సృష్టికి పూర్వము ఈ జగత్తు సద్రూపముగ అవ్యాకృత-నామరూపములతో (ప్రకటముగాని నామరూపములతో) నుండెను” అని శ్రుతి మరియు సద్రూప బ్రహ్మము జన్మగలది, కారణమగుటవలన, ఆకాశమువలే, ఈ అనుమానముద్వారా బ్రహ్మము ఉత్పత్తిగలదనును పూర్వపక్షి. సిద్ధాన్తి సమాధానము. సద్రూప బ్రహ్మము ఉత్పత్తికాదు, ఎందులకనగా ఉత్పత్తి కారణము నిరూపింప శక్యముగాదు. అసద్ వస్తువు బ్రహ్మకు కారణముగాజాలదు,  ఏలనన “కథమసతః సజ్జాయతే” “అసద్ వస్తువునుండి సద్బ్రహ్మము ఎట్లు ఉత్పన్నమగును”. ఈప్రకారము నిషేధము కలదు మరియు సద్ వస్తువు సద్ వస్తువునకు కారణము కాజాలదు కారణమేమనగా ఆత్మాశ్రయ దోషము వచ్చును. ఆకాశాదులు సద్వస్తువునకు కారణముకాజాలవు ఎందులకనగా ఆకాశాదులు సద్వస్తువునుండి ఉత్పన్నమయినవి. ఏవి ఏవి కారణములో అవి ఉత్పన్నమగుచున్నవి  అను వ్యాప్తి “స వా ఏష మహానజ ఆత్మా” “ఈ మహా ఆత్మ జన్మరహితము” అను శ్రుతి ద్వారా బాధితమగు చున్నది. దీనిద్వారా సిద్ధమగుచున్నదేమనగా సద్రూప బ్రహ్మము ఉత్పన్నముగాదు.

### 225. అసంభవస్తు సతోఽనుపపత్తేః. (2.3.9.)

సూత్రార్థము:- సత్స్వరూప బ్రహ్మ యొక్క ఉత్పత్తి అసంభవము ఎందులకనగా సత్ సామాన్యమునుండి సత్ సామాన్యము యొక్క ఉత్పత్తి యుక్తి యుక్తముకాదు. విశేషఘటాదుల ఉత్పత్తి మృత్తికాసామాన్యమునుండి ఉత్పన్నమగుట చూడ బడుచున్నది.

ఇచట శ్రుతిద్వారా బ్రహ్మయొక్క ఉత్పత్తి పూర్వపక్షి చెప్పెను. సిద్ధాన్తములో బ్రహ్మఉత్పత్తి శ్రుతి ఔపాధికమగుట వలన బ్రహ్మము నిత్యమని చెప్పబడినది. “న చాస్య కశ్చిజ్జనితా న చాధిపః” “ఆ పరమేశ్వరునికి ఉత్పత్తి కారణము లేదు, మరియు ఆయనకు అధిపతియూ లేడు” (శ్వే.6.9.) “త్వం జాతో భవసి విశ్వతోముఖః” “నీవు ఉత్పన్నమయినావు మరియు అన్నివేపులా ముఖము కలవాడవు” శ్వేతాశ్వతర ఉపనిషత్తులో బ్రహ్మ యొక్క నిత్యత్వము ప్రతిపాదించిరి దానికి వ్యతిరేకముగా వేరొక శ్రుతిలో బ్రహ్మ యొక్క ఉత్పత్తిని చెప్పిరి అను  ఈ సందేహమునకు పూర్వపక్షి విరోధము కలదనును. దానికి సిద్ధాన్తి విరోధములేదనును. సద్రూపబ్రహ్మముయొక్క

ఉత్పత్తిని శంకించరాదు ఎందులకనగా సద్సామాన్యనుండి సద్సామాన్యముయొక్క ఉత్పత్తి అసంభవము. ఘటాది విశేషముల ఉత్పత్తి సామాన్యమైన మృత్తికనుండి కానవచ్చుచున్నది. విశేషమునుండీ సామాన్యముయొక్క ఉత్పత్తి కాజాలదు ఏలనన లోకములో అట్లు కానవచ్చుటలేదు. అనగా మృత్తికనుండి మృత్తికగాని కుండ నుండి మట్టి గాని ఉత్పత్తి యగుటలేదు. కాని మట్టి నుండి కుండ ఉత్పత్తి లోకములో చూడబడుచున్నది. అసద్ వస్తువునుండి బ్రహ్మ ఉత్పత్తి శంక సర్వదా నిర్మూలము ఎందులకనగా ఆ స్థితిలో శూన్యవాద ప్రసంగము వచ్చును. ఈలాగున ఆకాశాది సమస్త జగదుత్పత్తి కారణము సద్బ్రహ్మమును స్వీకరించనిచో అనవస్థాదోషము (అప్రమాణికానన్త-ప్రవాహమూలక ప్రసంగము) వచ్చును. ఏది అన్నింటికీ మూలకారణమో మరియు దేనికి కారణములేదో అదే మా వేదాన్త మతములో నిత్యబ్రహ్మముగా స్వీకరించిరి గాన ఏవిధమైన విరోధము లేదు.

## 65. తేజోఽధికరణము.

సంగతి:- సామాన్యమునుండి సామాన్యముయొక్క ఉత్పత్తి కాకపోయినూ సామాన్య బ్రహ్మమునుండి తేజస్సు యొక్క విశేష ఉత్పత్తి అగునుకదా? ఈప్రకారము పూర్వాధికరణముతో ఈ అధికరణమునకు ప్రత్యుదాహరణ సంగతి వల్ల ఈ అధికరణము మొదలయినది.

విషయము:- తేజస్సుయొక్క ఉత్పత్తిని చెప్పు శ్రుతి ఈ అధికరణములో విచారణీయ విషయము.

సంశయము:- బ్రహ్మమునుండి అగ్ని ఉత్పన్నమగుచున్నదా లేక బ్రహ్మరుపాపన్న వాయువునుండి అగ్ని ఉత్పన్నమగు చున్నదా?

పూర్వపక్షము:- "తత్తేజోఽసృజత" "ఆ బ్రహ్మము అగ్నిని సృష్టించెను" (ఛాం. 6.2.3.) ఈ శ్రుతి ఆధారమువల్ల బ్రహ్మమునుండియే అగ్ని ఉత్పన్నమయినదని స్వీకరించవలయును.

సిద్ధాన్తము:- "వాయోరగ్నిః" ( తై.2.1.) ఈ తైత్తిరీయ శ్రుతితో ఛాన్దోగ్యశ్రుతి యొక్క ఏకవాక్యతను స్వీకరించిన వాయురూపాపన్న బ్రహ్మమునుండి అగ్ని ఉత్పన్నమయినదనియే స్వీకరించవలయును.

వైయాసికన్యాయమాలా:-

143. బ్రహ్మణో జాయతే వహ్నిర్వాయోర్వా బ్రహ్మసంయుతాత్|తత్తేజోఽసృజతేత్యుక్తేర్బ్రహ్మణో జాయతేఽనలః||

144. వాయోరగ్నిరితి శ్రుత్యా పూర్వశ్రుత్యేకవాక్యతః |బ్రహ్మణో వాయురూపత్వమాపన్నాదగ్నిసంభవః ||

అగ్ని బ్రహ్మనుండి ఉత్పన్నమగుచున్నదా లేక వాయురుపాపన్న బ్రహ్మనుండి ఉత్పన్నమగునా?

"తత్తేజోఽసృజత" "ఆ బ్రహ్మము తేజస్సును ఉత్పత్తి గావించెను" ఈ శ్రుతి ద్వారా అగ్ని బ్రహ్మనుండి ఉత్పన్నమయినదని పూర్వపక్షి కథనము. సిద్ధాన్తి సమాధానము. "వాయోరగ్నిః" "వాయురూపాపన్న బ్రహ్మమునుండి అగ్ని ఉత్పన్నమయినది" ఈ శ్రుతితో పూర్వశ్రుతికి ఏకవాక్యత అనగా విశిష్ట ఏకార్థప్రతిపాదకత్వము కలుగుటవలన వాయురూపమును పొందిన బ్రహ్మమునుండి అగ్ని ఉత్పన్నమయినది.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

పూర్వపక్షి చెప్పునదేమనగా ఛాన్దోగ్య ఉపనిషత్తు "తత్తేజోఽసృజత" "ఆ బ్రహ్మము తేజస్సును ఉత్పత్తి చేసెను" అను వాక్యముద్వారా అగ్ని బ్రహ్మమునుండి ఉత్పన్నమయినదని ప్రతిపాదించుచున్నది. మరియు తైత్తిరీయములో "వాయోరగ్నిః" "వాయువునుండి అగ్ని ఉత్పన్నమయినదని" ప్రతీతమగు చున్నది. గాన తైత్తిరీయములో వినబడు పఞ్చమీ 'వాయోః' అను విభక్తికి ఆనన్తర్యమనిగూడ అర్థము చెప్పవచ్చును అందువల్ల అగ్ని బ్రహ్మజన్యమని చెప్పవలయును. సిద్ధాన్తి ఇచ్చు సమాధానము. అనుసరించుచున్న 'స్సంభూత' శబ్దముతో కలిసిన 'వాయోః' అను శబ్దమునకు ఉపాదానరూపమైన అర్థము ముఖ్యము. ఛాన్దోగ్య తైత్తరీయ శ్రుతుల రెండిటి యొక్క ఏకవాక్యత్వమును స్వీకరించిన వాయురూపమును పొందిన బ్రహ్మమునుండి అగ్ని ఉత్పన్నమయునదని తెలియుచున్నది.

226. తేజోఽతస్తథా హ్యాహ. (2.3.10.)

సూత్రార్థము:- అగ్ని వాయువునుండి ఉత్పన్నమగును ఎందులకనగా అగ్ని వాయువునుండి ఉత్పన్నమగుచున్నదని 'వాయోరగ్నిః' 'వాయువునుండి అగ్ని ఉత్పన్నమయునది' ఈ శ్రుతి చెప్పుచున్నది.

"తత్తేజోఽసృజత" (ఛా.6.2.3.) 'ఆ బ్రహ్మము అగ్నిని ఉత్పత్తిగావించెను'. "వాయోరగ్నిః" (తై.3.2.) 'వాయువునుండి అగ్ని ఉత్పన్నమయినది'. ఈ రెండు శ్రుతులకు విరోధముకలదా లేదా? అను సంశయమునకు పూర్వపక్షి విరోధముకలదనగా సిద్ధాన్తి లేదనును. ఎందులకనగా తైత్తిరీయ శ్రుతి వాయువునుండి అగ్ని ఉత్పన్నమయినది చెప్పుచున్నది. అగ్ని వాయువునుండి జన్యముకాదనిన 'వాయోరగ్నిః' అను శ్రుతి పీడితమగును. అప్పుడు అగ్ని బ్రహ్మ జన్యమని చెప్పు ఛాన్దోగ్య శ్రుతితో తైత్తిరీయ శ్రుతి విరోధము ఆలాగుననే ఉండిపోవును. ఈ విధముగా చెప్పుట సరిగాదు ఎందులకనగా ఆకాశ వాయువులను సృష్టిగావించిన తరువాత వాయువురూపములోనున్న బ్రహ్మము అగ్నిని సృష్టిగావించెను. ఈ క్రమముగా అగ్నిని బ్రహ్మజన్యమని చెప్పిన ఏ విరోధముండదు. ఏలాగున ఆవునుండి పాలు, ఆవునుండి పెరుగు, ఆవునుండి నెయ్యి అని చెప్పిన పాలు సాక్షాత్తుగాను పెరుగు మొదలగునవి పరంపరగాను ఆవు కార్యములని తెలియుచున్నది. అలాగుననే అగ్ని విషయములోగూడ తెలిసికొనవలయును. దీనిద్వారా క్రమము చెప్పని శ్రుతుల వ్యాఖ్యానముగూడ యుక్తమే కాని క్రమసృష్టిని చెప్పు శ్రుతులు యుక్తి సంగతములుగావు. అందువల్ల సంపూర్ణ జగత్తు సద్ బ్రహ్మమునుండి ఉత్పన్నమయినదనుటయే అపేక్షితము. ఈ ప్రకారము అన్ని స్థలములలోగల విరోధము పరిహరింపబడును.

## 66. అబధికరణము.

సంగతి:- వాయువునుండి అగ్ని ఉత్పన్నమయినది అని చెప్పగా తరువాత జలము మరియు భూమి బుద్ధిస్థమయినది. అందువల్ల బుద్ధిసన్నిధానరూప సంగతి వలన ముందు రెండు అధికరణములు ప్రారంభించుచున్నారు.

విషయము:- జలముయొక్క ఉత్పత్తి శ్రుతి ఈ అధికరణమునకు విచారణీయ విషయము.

సంశయము:- బ్రహ్మనుండి జలము ఉత్పన్నమగుచున్నదా లేక అగ్నినుండియా?

పూర్వపక్షము:- జలము మరియు అగ్నికి పరస్పర విరోధమువలన వాని కార్య-కారణ భావము స్వీకరించుట ఉచితము కాదు. అందువలన సర్వకారణమయిన బ్రహ్మనుండియే జలముయొక్క ఉత్పత్తిని చెప్పుట ఉచితము. 'అగ్నేరాపః' (తై.2.1.) ఈ శ్రుతిద్వారా అగ్ని ఉపాధిగాగల బ్రహ్మచైతన్యమునుండి జలము ఉత్పన్నమయునదని చెప్పవలయును.

సిద్ధాన్తము:- స్థూల అగ్నికి మరియు జలమునకు విరోధముగలదు కాని వీని సూక్ష్మభూతములకు విరోధము లేదు. అందువల్ల సూక్ష్మవహ్నినుండి జలము ఉత్పన్నమయినదని చెప్పిన విరోధములేదు.

వైయాసికన్యాయమాలా:

145. బ్రహ్మణోఽపాం జన్మ, కిం వా వహ్నేర్నాగ్నేర్జలోద్భవః| విరుద్ధత్వాన్నీరజన్మ బ్రహ్మణః సర్వకారణాత్ ||

146. అగ్నేరాప ఇతి శ్రుత్యా బ్రహ్మణో వహ్న్యుపాధికాత్ | అపాం జనిర్విరోధస్తు సూక్ష్మయోర్నాగ్నినీరయోః ||

జలముయొక్క జన్మ బ్రహ్మమునుండియా లేక అగ్నినుండియా? అగ్నినుండి జలముయొక్క ఉత్పత్తికాజాలదు ఎందులకనగా పరస్పర విరోధమువలన. కనుకనే సర్వకారణమగు బ్రహ్మనుండి జలము ఉత్పత్తి అయ్యెను. ఈ పూర్వపక్షమునకు సిద్ధాన్తి ఇచ్చిన జవాబు. 'అగ్నేరాపః' అనగా అగ్నినుండి జలము ఉత్పత్తి అగును. మరియు సూక్ష్మ అపఞ్చీకృత అగ్ని జలములకు విరోధము లేదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

జలము అగ్ని నుండి ఉత్పన్నమగుచున్నదని ఈ శ్రుతులలో ఈ క్రింది విధముగా చెప్పబడినది. 'తదపోఽసృజత' 'అది జలమును సృష్టించెను' అని ఛాన్దోగ్యములో మరియు 'అగ్నేరాపః' 'అగ్నినుండి జలముత్పన్నమయినది' అని తైత్తిరీయములో చెప్పినప్పటికిన్నీ అది యుక్తి యుక్తముకాదు. ఎందులకనగా అగ్ని జలములకు పరస్పర విరోధము మరియు నాశ్య నాశక భావముండుట వలన అగ్ని జలములకు కార్య-కారణ భావము అనగా జలము అగ్ని నుండి ఉత్పన్నమయినది చెప్పజాలము. ఈ పూర్వపక్షమునకు సిద్ధాన్తి సమాధానము. కనిపించు పంచీకృత అగ్ని జలములకు పరస్పర నాశ్యనశ్యకరూపమైన విరోధమున్ననూ అపంచీకృతము మరియు కేవలము శ్రుతిద్వారా తెలియబడు అగ్ని జలముల విరోధముయొక్క కల్పన సంభవము కాదు. అంతేగాక ఎక్కువ ఎండ వేడికి చమట పట్టుట మరియు వర్షము కురుయుట చూడబడుచునే యున్నది. పైన చెప్పిన రెండు శ్రుతులద్వారా అగ్నిరూపము పొందిన బ్రహ్మముండి జలముత్పన్నమయినది.

227. ఆపః. (2.3.11.)

సూత్రార్థము:- జలము అగ్నినుండి ఉత్పన్నమగుచున్నది ఎందులకనగా 'అగ్నేరాపః' అనగా 'అగ్నినుండి జలము ఉత్పన్నమయినది'. ఈ శ్రుతి జలము తేజస్సునుండి ఉత్పన్నమని ప్రతిపాదించుచున్నది.

'అగ్ననుండి జలము ఉత్పన్నమయినది' అను శ్రుత్యర్థమునకు 'బ్రహ్మనుండి జలము ఉత్పన్నమయినది' అను శ్రుత్యర్థమునకు విరోధమున్నదని చెప్పు పూర్వపక్షి సంశయము సరికాదు. ఎందులకనగా సిద్ధాన్తి 'అగ్నేరాపః' అనగా అగ్నినుండి జలము ఉత్పన్నమయునది అను శ్రుతి ద్వారా జలము తేజోజన్యమనును. మరి అగ్నిద్వారా జలము దగ్ధమగుచుండగా జలము అగ్నిజన్యమని ఎట్లు చెప్పగలరు? ఈ ప్రశ్న సరికాదు. ఏలనన పంచీకృత భూతములవలే అపంచీకృత భూతములలో దాహ్యదాహక భావము అసంభవము. అపంచీకృత భూతములలో విరోధములేదు గాన పూర్వమువలే తేజోరూపమును పొందిన బ్రహ్మజన్యము జలము అంతేగాక వచనముండగా సంశయము పనికి రాదు.

## 67. పృథివ్యధికరము.

సంగతి:- పూర్వాధికరణముద్వారా నిరూపితము.

విషయము:- పృథ్వీ ఉత్పత్తిని చెప్పు శ్రుతి ఈ అధికరణమునకు విచారణీయ విషయము.

సంశయము:- "తా అన్నమసృజత" అనగా 'ఆ జలము అన్నము సృజించెను' (ఛాం.6.2.4.) ఈ శ్రుతిలో యవాది అన్నములయొక్క ఉత్పత్తి చెప్పబడినదా లేక పృథ్వీ ఉత్పత్తి చెప్పబడినదా?

పూర్వపక్షము:- లోకములో అన్న శబ్దము యవాది అర్థములో ప్రసిద్ధము. అందువల్ల జలము నుండి యవాదుల ఉత్పత్తిని స్వీకరించవలయును కాని పృథ్వీ కాదు.

సిద్ధాన్తము:- భూతములయొక్క ఉత్పత్తి ప్రసంగమగుటవలన మరియు నలుపు రూపము వినబడుటవలనగూడ జలమునుండి పృథ్వీ ఉత్పత్తిని స్వీకరించవలయును. అన్నమునకు కారణమగుటవలన పృథ్వీనిగూడ అన్న శబ్దముతో చెప్పిరి. అందువల్ల "అద్భ్యః పృథ్వీ" అనగా 'జలమునుండి పృథ్వీ ఉత్పన్నమయినది' మరియు "తా అన్నమసృజత" 'ఆజలము అన్నము సృజించెను' ఈరెండు శ్రుతులు సమానార్థకములు. ఈరెండిటికి ఏకవాక్యత ఉండుటవలన వీనికి విరోధములేదు.

వైయాసికన్యాయమాలా:

147. తా అన్నమసృజన్తేతి శ్రుతమన్నం యవాదికమ్ | పృథివీ వా యవాద్యేవ లోకేఽన్నత్వ ప్రసిద్ధితః ||

148. భూతాదికారాత్కృష్ణస్య రూపస్య శ్రవణాదపి | తథాఽద్భ్యః పృథివీత్యుక్తేరన్నం పృథ్వ్యన్నహేతుతః ||

"తా అన్నమసృజన్త" అనగా 'ఆ జలము అన్నము సృజించెను' ఈ శ్రుతిలో వినబడు 'అన్న' శబ్దము యవాది

వాచకమా లేక పృథివీ వాచకమా? పూర్వపక్షి అన్న శబ్దము యవాది వాచకము ఎందులకనగా లోకములో యవాదులే అన్నత్వముగా ప్రసిద్ధములు అనిన సిద్ధాన్తి అన్న శబ్దము పృథివీ వాచకమనును ఏలనన మహాభూతముల ప్రకరణము చెప్పబడుచున్నది మరియు కృష్ణరూపముగూడ వినబడుచున్నది. "అద్భ్యః పృథివీ" 'జలమునుండి పృథివీ ఉత్పన్నమయినది' అను శ్రుతి వినబడుచున్నది మరియు పృథివీ అన్నమునకు హేతువు. కార్య-కారణముల అభేదవివక్షద్వారా అన్నము  పృథివీ అనునది యుక్తి సంగతము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

ఛాన్దోగ్య ఉపనిషత్తులో "తా అన్నమసృజన్త"  'ఆ జలము అన్నము సృజించెను'. ఈ శ్రుతి వాక్యముద్వారా జలమునుండి అన్నముత్పన్నమయినది అని వినబడు చున్నది. ఇచట అన్న శబ్దార్థము లోకప్రసిద్ధిననుసరించి యవలు, ధాన్యములని చెప్పవలయును. ఈపూర్వపక్షమునకు సిద్ధాన్తి సమాధానము. ఇచట అన్న శబ్దమునకు అర్థము పృథివీ ఏలనన మహాభూతముల సృష్టి ప్రసంగము గాన. ఇంకొకమాట, "యదగ్నే రోహితం రూపం తేజసస్తద్రూపమ్, యచ్ఛుక్లమ్ తదపామ్, యత్ కృష్ణం తదన్నస్య" 'అగ్నిలోని రక్తరూపము అది తేజస్సుది, తెలుపు రంగు జలముది, మరియు నలుపు రంగు అన్నముయొక్కరూపము' అను శ్రుతిద్వారా కృష్ణరూపము ఎక్కువగా పృథివీలో కనబడుచున్నది కాని ధాన్యదులలో కానరాదు. మరియు "అద్భ్యః పృథివీ" అనగా 'అనగా జలమునుండి పృథివీతత్త్వము జనించెను' అను తైత్తిరీయ శ్రుతితో ఏకవాక్యతను పొందుటవలన ఇచట అన్న శబ్దమునకు పృథివీ అని అర్థము.  అన్న శబ్దము పృథివీ అర్థములో ప్రవృత్తి లేదని చెప్పలేము ఎందులకనగా కార్య-కారణముల అభేద దృష్టితో చెప్పుట యుక్తి యుక్తము. దీని  ద్వారా 'అన్న' శబ్దము పృథివీ అర్థములోనే చెప్పబడినది.

228. పృథివ్యధికారరూపశబ్దాన్తరేభ్యః. (2.3.12.)

సూత్రార్థము:- అన్నశబ్దముద్వారా పృథివీ ఇచ్చట చెప్పబడినది, యవాదులను  ఇచట చెప్పుట ఉచితముకాదు, ఎందులకనగా "తత్తేజోఽసృజత" అనగా 'ఆ బ్రహ్మము అగ్నిని సృష్టిగావించెను' ఈ ప్రకారము మహాభూతముల ఉత్పత్తి ప్రకరణము చెప్పబడుచున్నది. "యత్కృష్ణం తదన్నస్య" అనగా 'ఏది నల్లరూపమో అది అన్నముయొక్క రూపము' అని ఈప్రకారము   పృథివీతత్త్వమును చెప్పు కృష్ణరూపము వినబడుచున్నది. "అద్భ్యః పృథివీ" 'జలమునుండి  పృథివి ఉత్పన్నమయినది'. ఈవిధముగా పృథివీ జలజన్యమని ప్రతిపాదించు వేరొక శ్రుతిగూడ గలదు.

"అద్భ్యః పృథివీ" అనగా 'జలమునుండి పృథివీ ఉత్పన్నమయినది'. అను శ్రుతిద్వారా "తాః అన్నమసృజన్త" 'జలము అన్నము ఉత్పన్నము గావించెను' ఈ ఛాన్దోగ్య శ్రుతికి విరోధము కలదా లేదా? అను సందేహము కలుగగా అన్నశబ్దము బియ్యము, యవాదులలో ప్రసిద్ధము, పృథివీ అర్థములో గాదు. ఒక శ్రుతిలో జలమును

పృథివీకి కారణము మరియొక శ్రుతిలో అన్నమునకు కారణమని వినగా శ్రుతులలో విరోధము గలదని తెలియుచున్నదని పూర్వపక్షి కథనము. సిద్ధాన్తి చెప్పునది. జలమునుండి ఉత్పన్నమగు పృథివీని అన్న శబ్దముతో చెప్పుట అభీష్టము గాన యవాదులను చెప్పుట ఇష్టముకాదు. అధికారము, రూపము, మరియు శబ్దాన్తరములతో చెప్పిన అర్థము సమర్థింపబడుచున్నది. వీనిని క్రమముముగా చెప్పెదము. “తత్తేజఽసృజత” అనగా ‘బ్రహ్మము తేజస్సును సృష్టి చేసెను’ ఈ మహాభూతముల ఉత్పత్తి ఛాన్దోగ్యములో చూడబడుచున్నది. ఈ అధికారములో అగ్ని మరియు జలము తరువాత పృథివీ యొక్క క్రమము వచ్చును దానిసే అన్న శబ్దముతో శ్రుతిలో చెప్పబడినది. మహాభూతముల ఉత్పత్తి అధికారములో పృథివీ క్రమము అతిక్రమించి అకస్మాత్తుగా వ్రీహియవాది రూపముగల అన్నమునుపరిగ్రహించుట ఉచితన్యాయము కాదు. మరియు “యత్కృష్ణం తదన్నస్య” అనగా ‘దీనిలో కనిపించు నలుపు అన్నముయొక్క రంగు’. ఈ వాక్యశేషములో పృథివీ చిహ్నము నలుపు రంగు వినబడుచున్నది. ఇంతేగాక ఛాన్దోగ్యములో “అద్భ్యః పృథివీ” అనగా జలమునుండి పృథివీ ఉత్పత్తిని ప్రతిపాదించు వాక్యము ఉపలబ్ధము. అందువల్ల పృథివీలో అన్నముయొక్క అర్థము నిశ్చితముకాగా చెప్పిన రెండు శ్రుతుల ఏకార్థమువల్ల ఏకవాక్యత్వము గలదు. విరోధము లేదనునది సిద్ధమయినది.

## 68. తదభిధ్యానాధికరణము.

సంగతి:- పూర్వాధికరణములో మహాభూతముల ఉత్పత్తి శ్రుతుల విరోధము తొలగించబడినది. ఇపుడు ఆ భూతముల ఆశ్రయమును స్వీకరించి అన్య విషయముయొక్క విచారము గావించవలయును. గాన పూర్వధికరణముతో ఈ అధికరణమునకు ఆశ్రయఆశ్రయీభావ సంగతి అని చెప్పవలయును.

విషయము:- మహాభూతముల ఉత్పత్తి మరల ఈ అధికరణమునకు విచారనీయ విషయము.

సంశయము:- వాయువు మొదలగు భూతముల ఉత్పత్తి వానికి ముందు ఉత్పన్నమయిన భూతఉపహిత బ్రహ్మ (అనగా భూతములోపల గల చైతన్యశక్తి బ్రహ్మముదే ఎందులకనగా భూతము జడముగాన) నుండి అయినదా లేక ముందు ఉత్పన్నమయిన భూతమునుండి అయినదా?

పూర్వపక్షము:- ‘ఆకాశాద్వాయుః’ ‘ఆకాశమునుండి వాయువు ఉత్పన్నమయినది’. ఇత్యాది శ్రుతులద్వారా పూర్వ-పూర్వము ఉత్పన్నమయిన భూతమునుండి ఉత్తరోత్తర భూతముత్పన్నమయినది చెప్పవలయును కాని బ్రహ్మనుండి కాదు.

సిద్ధాన్తము:- ‘ఈశ్వరుడు అందరి లోపలనుండీ శాసించుచున్నాడు’. ఈ శ్రుతి ఆధారమువలన ఆకాశాదులు ఉపాధిగాగల ఉపహిత బ్రహ్మచైతన్యము ద్వారా అన్య భూతములు ఉత్పన్నమగుచున్నవి. “తత్తేజ ఐక్షత” అనగా ‘ఆ తేజస్సు సంకల్పించెను’ ఈ విధముగా తేజస్సుయొక్క సంకల్పము వినబడుచున్నది అయితే అది తేజస్సుది కాదు కాని తేజఉపహితమైన బ్రహ్మ చైతన్యమునది.

వైయాసికన్యాయమాలా:-

149. వ్యోమాద్యాః కార్యకార్తారో బ్రహ్మ వా తదుపాధికమ్ |వ్యోమ్నో వాయుర్వాయుతోఽగ్నిరిత్యుక్తేః ఖాదికర్తృతా ||

150. ఈశ్వరోఽన్తర్యమయతీత్యుక్తేర్వ్యోమాద్యుపాధికమ్ | బ్రహ్మ వాయ్వాదిహేతుః స్యాత్తేజఆదీక్షణాదపి ||

ఆకాశాదులు స్వయముగా కార్యము ఉత్పత్తి చేయుచున్నవా లేక ఆకాశము ఉపాధిగాగల ఆకాశరూపమును పొందిన బ్రహ్మ కార్యము ఉత్పత్తిచేయుచున్నదా? శ్రుతిలో ఆకాశమునుండి వాయువు, వాయువునుండి అగ్ని ఉత్పన్నమయినవని చెప్పబడినది కనుక ఆకాశాదులే కార్యము ఉత్పత్తిచేయుచున్నవి. ఈ పూర్వపక్షమునకు సిద్ధాన్తి చెప్పునది. 'ఈశ్వరుడు అన్తర్యామీ' అనుచెప్పుటవలన మరియు తేజాదుల యొక్క సంకల్పపూర్వక స్రష్టృత్వము చెప్పుటవలన గూడా ఆకాశోపాధిక బ్రహ్మము వాయువాదులను ఉత్పన్నముగావించుచున్నది.

భారతి తీర్థులవారి వ్యాఖ్య:-

పూర్వపక్షి చెప్పినది. పూర్వధికరణములో పూర్వపూర్వము కార్యరూపమును దాల్చిన బ్రహ్మనుండి ఉత్తరోత్తర కార్యముత్పన్నమయినది. ఈ విధముగా చెప్పు సిద్ధాన్తి కథనము సరికాదు. ఎందులకనగా "ఆకాశాద్వాయుః" 'ఆకాశమునుండి వాయువు ఉత్పన్నమయినది' "వాయోరగ్నిః" వాయువునుండి అగ్ని ఉత్పన్నమయినది. ఈ శ్రుతులలో బ్రహ్మ నిరపేక్షము కేవలము ఆకాశాదులనుండి ఉత్తరోత్తర కార్యములయిన వాయువు మొదలగువాని ఉత్పత్తి ప్రతిపాదించబడినది. అపుడు సిద్ధాన్తి జవాబు. అన్తర్యామి బ్రాహ్మణములో "య ఆకాశమన్తరో యమయతి" అనగా ఆకాశము లోపలనుండి ఆకాశమును శాసించుచున్నాడు, వాయువు లోపనుండి వాయువును శాసించుచున్నాడు అని చెప్పుచు ఆకాశాదుల స్వతంత్రత ఖండించబడినది. "తథా తత్తేజ ఐక్షత" "తా ఆపః ఐక్షన్త" అనగా 'ఆ తేజస్సు ఈక్షణము (విచారము) గావించెను' 'ఆ జలము విచారముగావించెను' ఈ ప్రకారముగా గల శ్రుతులు తేజస్సు మొదలయిన వానికి విచారపూర్వకము స్రష్టృత్వమును ప్రతిపాదించుచున్నవి. ఆ ఈక్షణము చైతన్య బ్రహ్మయొక్క అపేక్షలేకుండ అచేతన ఆకాశాదులలో కాజాలదు. దీని ద్వారా ఆకాశోపాధికబ్రహ్మమే కారణమనునది సిద్ధమయినది.

229. తదభిధ్యానాదేవ తు తల్లింగాత్సః. (2.3.13.)

సూత్రార్థము:- పరమేశ్వరుడే ఆ-యా కార్యవిషయముల విచారరూపమైన ధ్యానముద్వారా ఈక్షణముగావించి భూతములకు అధిష్ఠానమై ఆ-యా కార్యములను ఉత్పత్తిగావించును. ఎందులకనగా "యః పృథివ్యాం తిష్ఠన్" అనగా 'ఏ తత్త్వము పృథవిలో ఉన్నదో' అని చెప్పుచూ పరమాత్మలో సర్వనియన్తృత్వరూపమైన చిహ్నము వినబడుచున్నది. అందువల్ల పరమేశ్వరునిద్వారా అధిష్ఠితమై భూతముల సృష్టి జరుగుచున్నది. ఇట్లు చెప్పిన శ్రుతులలో ఏకవాక్యత ఉండును.

ఇచట ఆకాశాదులు తమ-తమ ఉత్తరభూతముల ఉత్పత్తికి కారణమనును పూర్వపక్షి. సిద్ధాన్తి సంపూర్ణ సృష్టికి పరమేశ్వరుడే కారణమనును. తేజస్సు సంకల్పించెను, జలము విచారముగావించెను అని వినబడుటవలన శ్రుతులలో విరోధముగలదు అనిన సిద్ధాన్తి సమాధానము. ఆ పరమేశ్వరడే ఆకాశాది భూతముల రూపముదాల్చి కార్యముల ఈక్షణరూపమైన ధ్యానముద్వారా ఆ-యా వికారములను ఉత్పన్నము గావించును. అనగా ఆ పరమేశ్వరుడు ఆకాశరూపములో స్థితమై వాయువును ఉత్పత్తి చేయుటకు సంకల్పించి ధ్యానముచేసి వాయువును ఉత్పత్తిగావించును. ఎందులకనగా అటువంటి చిహ్నమే చూడబడు చున్నది. "యః పృథివ్యాం తిష్టన్ పృథివ్యా అన్తరో యం పృథివీ న వేద యస్య పృథివీ శరీరం యః పృథివీమన్తరోయమయతి" అనగా 'ఎవడు భూమిలోఉంటో భూమి లోపల నున్నాడో భూమికి ఎవని గురించి తెలియదో భూమి ఎవనికి శరీరమో లోపలఉండి భూమిని ఎవడు శాశించుచున్నాడో' (బృ.3.7.3.) ఇత్యాది అన్తర్యామి బ్రాహ్మణములో ఆ పరమేశ్వరుని సంపూర్ణ జగత్తు యొక్క శాశకుడని చెప్పు చిహ్నము కలదు. జలము మరియు అగ్నియొక్క సంకల్ప శ్రవణము పరమేశ్వరునితో తాదాత్మ్యమని తెలిసికొనవలయును, అనగా పృథివీ మరియు జలరూపములో నున్న పరమేశ్వరుడే వాని సృష్టికి సంకల్పము కావించును. అందువల్ల పరమేశ్వరునితో అధిష్ఠిత భూతములలో సృష్టికర్తృత్వమును శ్రుతులు చెప్పుటవలన శ్రుతులలో ఏకవాక్యతను చెప్పుటలో విరోధములేదు.

## 69. విపర్యయాధికరణము.

సంగతి:- ఇంతవరకు భూతముల ఉత్పత్తిక్రమము విచారించడమయినది. ఇపుడు బుద్ధిలోనున్న విలయ-క్రమము విచారము జరుగును. గాన పూర్వాధికరణముతోపాటు ఈ అధికరణమునకు ప్రసంగ సంగతి.

విషయము:- భూతముల లయ క్రమము ఈ అధికరణమునకు విచారణీయ విషయము.

సంశయము:- ఏ క్రమములో భూతముల ఉత్పత్తి జరిగినదో అదేక్రమములో వీని లయము జరుగునా లేక విపరీత క్రమములో జరుగునా.

పూర్వపక్షము:- నిర్వివాదముగా ఉభయవాది సిద్ధమైన కారణముగా ఉత్పత్తిక్రమములోనే భూతముల లయము స్వికరించవలయును. విపరీతక్రమము కల్పితమగుటవలన వివాదాస్పదము.

సిద్ధాన్తము:- ఉపదానకారణము లేనిచో కార్య స్థితి క్షణముగుడా నిలువజాలదు. దీనితోబాటు "హే! దేవర్షి నారద, సంపూర్ణ జగత్తుయొక్క ప్రతిష్ఠ ఈభూమి. ప్రలయకాలములో తన కారణమైన జలములో లీనమగుచున్నది. గాన ఉత్పత్తి క్రమమునకు విపరీతక్రమములో భూతముల లయము జరుగునని స్వీకరిచవలయును.

వైయాసికన్యాయమాలా:

151. సృష్టిక్రమో లయే జ్ఞేయో విపరీత క్రమోఽథ వా |క్ఌప్తం కల్ప్యాద్వరం తేన లయే సృష్టిక్రమో భవేత్ ||

152. హేతావసతి కార్యస్య న సత్త్వం యుజ్యతే యతః | పృథివ్యప్స్వితి చోక్తత్వాద్విపరీతక్రమో లయే ||

ఏది సృష్టిక్రమమో అదే క్రమము లయములోగూడ అని తెలిసికొనవలయునా లేక విపరీత క్రమము స్వీకరించవలయునా? కల్పింటోవు క్రమము కన్న కల్పించియున్న క్రమము శ్రేష్టము. అందువల్ల ప్రళయములో సృష్టిక్రమ అనుసారము ప్రళయక్రమము గూడ జరుగవచ్చును అను పూర్వపక్షమునకు సిద్ధాన్తి జవాబు కారణము యొక్క అభావములో కార్యము యొక్క అస్తిత్వము ఉండజాలదు. మరియు భూమి జలములో లీనమగుచున్నదని శ్రుతి ప్రతిపాదించుచున్నది. గాన ప్రళయములో సృష్టి క్రమమునకు విపరీతముగా లయ క్రమము జరుగును.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

సృష్టిలో ఆకాశాదుల క్రమము ప్రసిద్ధము అందువల్ల ప్రళయములో గూడ అదే క్రమము స్వీకరించవలయునను పూర్వపక్షమునకు సిద్ధాన్తి సమాధానము. కారణము ముందు లీనమయిన కార్యము కొంచెము కాలముండునని స్వీకరించవలయును. మరియు రెండవమాట.

జగత్ పతిష్ఠా దేవర్షే! పృథివ్యప్సు ప్రలీయతే | జ్యోతిష్యాపః ప్రలీయతే జ్యోతిర్వాయౌ ప్రలీయతే ||

వాయుః ప్రలీయతే వ్యోమ్ని తచ్చావ్యక్తే ప్రలీయతే | (మహాభారతము. శాన్తి.339-29నుండి31 వరకు.)

హే నారద, ఈ జగత్తుకు ఆధారభూతమైన భూమి జలములో లీనమగును, జలము అగ్నిలో లీనమగును, అగ్నివయువులో లీన మగును, వాయువు ఆకాశములో లీనమగును మరియు ఆకాశము అవ్యక్తములో లీనమగును. ఈ ప్రకారము పురాణములో విపరీత క్రమము చెప్పుటవలన ఈ క్రమమే సిద్ధమగుచున్నది. అందువల్ల సృష్టికి విపరీతక్రమములో భూమ్యాదులు లయమగుచున్నవి.

230. విపర్యయేణ తు క్రమోఽత ఉపపద్యతే చ. (2.3.14.)

సూత్రార్థము:- ఉత్పత్తి క్రమమునకు విపరీత క్రమములో ప్రలయ క్రమము జరుగును ఎందులకనగా తమ తమ కారణములలో కార్యముల లయము చూడబదుచున్నది మరియు విపరీత క్రమములోనే లయక్రమము సంభవము లేనిచో కార్యము యొక్క అస్తిత్వము కారణ నాశము తరువాత ఉండిన అనిష్ఠాపత్తి అగును అనగా ఇష్టముకాని దోషము కలుగును.

ఇచట పూర్వపక్షి లయక్రమ చిన్తనము నిష్ప్రయోజనమనును, సిద్ధాన్తి ప్రాసంగిక విచారము వలన బ్రహ్మధ్యానము ఫలమనును. సిద్ధాన్తి ఉత్పత్తిక్రమమునకు విపరీతక్రమములో లయక్రమమగును అనును ఎందులకనగా ఏవిధముగా మెట్లు ఎక్కుక్రమమునకు విపరీత క్రమములో దిగుట చూడబడుచున్నది. డబా పైకి ఎక్కునపుడు ఏమెట్టుమీద మొదట కాలు పెట్టెదమో దిగునపుడు ఆఖరిలో ఆ మెట్టుపై కాలు పెట్టుట చూడబడుచున్నది. ఇట్లే స్మృతి ప్రమాణమైన మహాభారతములో మరియు విష్ణు పురాణములోగూడ పైన ఈ అధికరణమునందు భారతీ తీర్థులవారి వ్యాఖ్యలో చూపినరీతిగా నారదునికి చెప్పబడినది. యుక్తి ద్వారాగూడ ఉత్పత్తినపేక్షించి విపరీతక్రమములో ప్రళయము స్వీకరించుటయే ఉచితము, ఎందులకనగా కార్యముండగా కారణముయొక్క

నాశనము స్వీకరించుట సరికాదు మరియు కారణము నాశనమైన తరువాత కార్యముండునని స్వీకరించుట అసంగతము. దీనికి విపరీతముగా కార్యము నష్టమయినను కారణముండుట మృదాదులలో చూడబడుచున్నది. అందువల్ల ఉత్పత్తి క్రమమునకు వీపరీత క్రమములో లయము జరుగును.

## 70. అన్తరావిజ్ఞానాధికరణము.

సంగతి:- భూతోత్పత్తి మరియు లయక్రమముయొక్క విచార ఫలితము చెప్పబడినది. అదే ఫలితము గల ఇంద్రియముల ఉత్పత్తి మరియు విలయక్రమము ఇప్పుడు విచారించబడును. అందువల్ల ఏకప్రయోజనకత్వ సంగతి కారణముగా ఈ అధికరణము ప్రారంభమగుచున్నది.

విషయము:- ఇంద్రియముల ఉత్పత్తిలో గల విరోధ శ్రుతులు ఈఅధికరణమునకు విచారణీయ విషయము.

సంశయము:- ముందు చెప్పిన భూతోత్పత్తి క్రమము ఇంద్రియముల ఉత్పత్తి క్రమమునకు విరయద్ధమా కాదా?

పూర్వపక్షము:- బ్రహ్మము మరియు ఆకాశమునకు మధ్యలో ప్రాణము, ఇంద్రియములు మరియు మనస్సు యొక్క ఉత్పత్తి కారణము వలన భూతోత్పత్తి క్రమమునకు విరోధము సుస్పష్టము.

సిద్ధాన్తము: మనస్సు మరియు బుద్ధి భౌతికములగుటవలన, ప్రాణదులుగూడ భౌతికములగుటవలన ఇవన్నియూ పంచభూతములలో అన్తర్గతములు. అందువల్ల భౌతిక ప్రాణాదుల ఉత్పత్తి క్రమము వేరుకాదు. ఆథర్వణ శ్రుతి సంపూర్ణ భూత-భౌతిక పదార్థముల ఉత్పత్తిని మాత్రము చెప్పనదేగాని వాని క్రమము చెప్పలేదు. అందువల్ల భూతోత్పత్తి క్రమ భంగ ప్రసంగము లేదు.

వైయాసికన్యాయమాలా:

153. కిముక్తక్రమభఙ్గోఽస్తి ప్రాణాద్యైర్నాస్తి వాఽస్తి హి | ప్రాణాక్షమనసాం బ్రహ్మవియతోర్మధ్య ఈరణాత్ ||

154. ప్రాణాద్యా భౌతికా భూతేష్వన్తర్భూతాః పృథక్క్రమమ్ | నేచ్ఛన్త్యతో న భంగోఽస్తి ప్రాణాదౌ న క్రమః శ్రుతః ||

ప్రాణాదుల సృష్టిక్రమము చెప్పు శ్రుతులద్వారా పూర్వము చెప్పిన భూతసృష్టి క్రమమునకు విచ్ఛిన్నము కలదా లేదా? ప్రాణము, ఇంద్రియములు మరియు మనస్సుల సృష్టి కథనము బ్రహ్మఆకాశమధ్యలో చెప్పుట వలన సృష్టిక్రమమునకు విచ్ఛిన్నము కలదనును పూర్వపక్షి. సిద్ధాన్తి చెప్పు జవాబు. ప్రాణాదులు భౌతికములగుటవలన భూతములలో అన్తర్గతము. గాన వాని ఉత్పత్తికి విడిగా క్రమముయొక్క ఆకాంక్ష లేదు. అందువల్ల చెప్పిన సృష్టిక్రమము విచ్ఛిన్నముగాదు. ప్రాణాదుల సృష్టి క్రమము శ్రుతిలో చెప్పలేదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

ముండక ఉపనిషత్తులో "ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేన్ద్రియాణి చ |ఖం వాయుర్జ్యోతిరాపః పృథివీ విశ్వస్య ధారిణీ ||" అనగా "ఆత్మనుండి ప్రాణము, మనస్సు, అన్ని ఇన్ద్రియములు మరియు ఆకాశము, వాయువు, అగ్ని, జలము మరియు భూతాధారము పృథివీ ఉత్పన్నమయినవి. ఇచట పూర్వపక్షి చెప్పునది ఈ మంత్రములో

ప్రాణాదుల ఉత్పత్తి ఆకాశమునకు ముందు వినబడుచున్నది. గాన ముందు ఆకాశాదులు ఉత్పన్నమగుచున్నవి అని చెప్పిన సృష్టిక్రమమునకు భంగము అనగా విచ్ఛిన్నము కలుగు చున్నది.

సిద్ధాన్తి జవాబు. "అన్నమయం హి సోమ్య మనః" అనగా 'హే సౌమ్యుడా, మనస్సు అన్నమయము' "అపోమయః ప్రాణః" అనగా 'ప్రాణము జలమయము' "తేజోమయీ వాక్" అనగా 'వాణీ తేజోమయము' ఈ శ్రుతులలో ప్రాణాదుల భౌతికత్వము యొక్క శ్రవణము భూతముల అన్తర్భావము చెప్పుటవలన విడిగా క్రమమునకు అపేక్ష లేదు. ముండకశ్రుతి క్రమమును చెప్పుటలేదు ఎందులకనగా "ఆకాశాద్వాయుః" అనగా 'ఆకాశమునుండి వాయువు ఉత్పన్నమయినది' "వాయోరగ్నిః" అనగా 'వాయువునుండి అగ్ని ఉత్పన్నమయినది' వీనికి సమానముగా ముండక శ్రుతిలో క్రమము కనబడుటలేదు. ఈ ముండక శ్రుతి కేవలము ఉత్పత్తిని మాత్రము చెప్పుచున్నది. దీలవల్ల సిద్ధమగుచున్నదేమనగా ముండకశ్రుతితో పూర్వోక్త క్రమమునకు భంగములేదు.

231. అంతరా విజ్ఞానమనసీ క్రమేణ తల్లింగాదితి చేన్నావిశేషాత్. (2.3.15.)

సూత్రార్థము:- ఆత్మా మరియు భూతముల మధ్యలో "ఏతస్మాత్" అను మంత్రముద్వారా 'ఆత్మనుండి ప్రాణము, మనస్సు, అన్ని ఇంద్రియములు మొదలగునవి ఉత్పన్నమగుచున్నవి'. ఈ విధమగు సృష్టిభోధక వాక్యముద్వారా బుద్ధి, ఇంద్రియములు మరియు సంశయరూపమైన అన్తఃకరణమునకు అనుక్రమము అగుచున్నది. ఈశ్రుతిద్వారా ఆత్మనుండి బుద్ధి, ఇంద్రియములు, మనస్సు ఉత్పన్నమగుచున్నవి వాని నుండి భూతములు ఉత్పన్న మగుచున్నవి చెప్పుచూ ఈక్రమముద్వారా సృష్టిక్రమమునకు విరోధముగలదని చెప్పరాదు. ఎందులకనగా ఇంద్రియములు, బుద్ధి, మనస్సు భౌతికమగుటవలన భూతోత్పత్తిక్రమముతో ఇంద్రియాదుల ఉత్పత్తిక్రమము సామ్యము అనగా ఏ క్రమములో భూతములు ఉత్పత్తిఅయినవో అదే క్రమములో భౌతిక ప్రాణము, మనాదుల ఉత్పత్తి అగును. అందువల్ల ఏ విరోధము లేదు. "ఏతస్మాజ్జాయతే" అను ముండక శ్రుతి ఆత్మనుండి అన్నీ ఉత్పత్తి అగుచున్నవని చెప్పుచున్నదే కాని క్రమము కాదు అందువల్ల ఏ వాక్యముతోను భూతసృష్టి వాక్యములకు విరోధము లేదు.

ఇంద్రియముల సహితము బుద్ధి మరియు సంకల్పాత్మక మనస్సుల సృష్టి, భూతములు మరియు ఆత్మసృష్టికి మధ్యలో వినబడుచున్నది. "ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేన్ద్రియాణి చ ఖం వాయుర్జ్యోతి ఆపః పృథివీ విశ్వస్య ధారిణీ" (ముం.2.1.3.) అనగా 'ఆ పరమాత్మ నుండి ప్రాణము, మనస్సు, అన్ని ఇంద్రియమయలు, ఆకాశము, వాయువు, జలము మరియు సంపూర్ణ విశ్వమును ధరించు భూమి ఉత్పన్నమగుచున్నవి'. ఈ శ్రుతి వాక్యముద్వారా ముందు చెప్పిన భూత సృష్టి మరియు లయ క్రమమునకు విచ్ఛిన్న ప్రసంగము వచ్చుటవలన విరోధము గలదు అనును పూర్వపక్షి. సిద్ధాన్తి సమాధానము. బుద్ధి మరియు మనస్సు బౌతికములు. అందువల్ల భూతముల ఉత్పత్తి-ప్రళయములు మరియు వాని కార్యము భౌతికమైన బుద్ధి-మనస్సుల ఉత్పత్తి ప్రళయములు

సమాన క్రమముములో జరుగును. భూతముల ఉత్పత్తితోనే భౌతిక బుద్ధ్యాదుల క్రమము జరుగుచున్నందువలన భౌతిక మనాదులకు వేరొక క్రమమునకు ఆవశ్యకము లేదు. అందువల్ల విరోధములేదు. చెప్పిన ముండకశ్రుతిలో భూత-భౌతిక పదార్థముల ఉత్పత్తి మాత్రమే చెప్పబడినది గాని క్రమము చెప్పలేదు. గాన బుద్ధి-మనస్సుల ఉత్పత్తి క్రమములో భూతోత్పత్తి భంగ-ప్రసంగము రాదు, కనుక ఈ పక్షము నిర్దోషము.

# 71. చరాచరవ్యపాశ్రయాధికరణము.

ఈపాదము అన్తమువరకు జీవవిషయములోగల శ్రుతులయొక్క విరోధ పరిహారము చెప్పెదరు. జీవోత్పత్తి శ్రుతులలో విరోధములేదు.

సంగతి:- పంచభూతములలో మరియు భౌతిక ప్రాణాదులలో కార్య-కారణ భావము ఉండుటవలన వాని ఉత్పత్తి శ్రుతి విరోధము పరిహరించ బడినది. కాని జీవుని ఉత్పత్తి క్రమములో భూతముల ఉత్పత్తిక్రమము విచ్ఛిన్నమగుట సునిశ్చితము. ఈ విధమైన ప్రత్యుదాహరణ సంగతి వలన ఈ అధికరణము మొదలైనది.

విషయము:- జీవోత్పత్తిని చెప్పు వాక్యములు ఈ అధికరణమునకు విచారణీయ విషయము.

సంశయము:- జీవునికి జన్మ-మరణములు కలవా లేక శరీరమునకా ఈ జన్మ మరణములు.

పూర్వపక్షము:- ' నా పుత్రుడు జన్మించెను' అను కథనముద్వారా మరియు జాతకర్మాది విధానమువలన జీవాత్మ యొక్క జన్మ-మరణములు స్వీకరించవలయును. అవి స్వీకరించిన జీవునిలో అనిత్యత్వము వాటిల్లును.

సిద్ధాన్తము:- “న జీవో మ్రియతే” అను శ్రుతి ప్రమాణముద్వారా జీవుని నిత్యత్వము సిద్ధము.

వైయాసికన్యాయమాలా:-

155. జీవస్య జన్మ మరణే వపుషో వాఽఽత్మనో హి తే | జాతో మే పుత్రః ఇత్యుక్తేర్జాతకర్మాదితస్తథాః ||

156. ముఖ్యే తే వపుషో భాక్తే జీవస్యైతే అపేక్ష్య హి | జాతకర్మ చ లోకోక్తిర్జీవాపేతేతి శాస్త్రతః ||

జన్మ-మరణములు జీవునికా లేక శరీరమునకా? 'నాకు పుత్రుడు జన్మించినాడు' అను వ్యవహారమువలన మరియు శాస్త్రములో జాతకర్మాదులు విధించుటవలన జీవునికి జన్మ-మరణములు కలవని ప్రతీతమగుచున్నది. ఈ పూర్వపక్షమునకు సిద్ధాన్తి జవాబు. చెప్పిన జన్మ-మరణములు శరీరమునకు ముఖ్యముగా వర్తించును కాని జీవునికి గౌణము. గౌణములయిన జన్మ-మరణముల అపేక్షననుసరించియే లోకవ్యవహారము మరియు కర్మశాస్త్రముయొక్క ప్రవృత్తి కలుగుచున్నది. ఎందులకనగా “జీవాపేతం వావ” జీవ శూన్యమైన శరీరము మరణించు చున్నది కాని చైతన్యమయిన జీవుడు కాదు” అను శ్రుతి ఉండుటవలన.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

ఇచట పూర్వపక్షి చెప్పునదేమనగా “పుత్రో మే జాతః” అనగా ' నాకు పుత్ర సంతానము కలిగెను' అను లోకవ్యవహారమువలన మరియు శాస్త్రములో జాతకర్మాది సంస్కారములు చెప్పుటవలననూ జీవునికి జన్మ-మరణములు కలవని చెప్పవలయును. దీనికి సిద్ధాన్తి సమాధానము. జీవుని ముఖ్య మరణము స్వీకరించిన, చేసిన కర్మముల నాశము మరియు చేయని కర్మలు వచ్చుట అను దోషమునకు నివారణము ఉండదు. అందువల్ల దేహమునకు కలుగు జన్మ-మరణములు చైతన్యమయిన జీవునిలో గౌణదృష్టితో చెప్పబడుచున్నవి. ఔపచారికము లేక గౌణముగా భావించిన జన్మ-మరణముల అపేక్షననుసరించియే లోకవ్యవహారము మరియు కర్మకాండములో ప్రవృత్తి జరుగుచున్నది. ఉపనిషత్తులలో “జీవాపేతం వావ కిలేదం మ్రియతే, న జీవో మ్రియతే” అనగా 'జీవచైతన్య శూన్య మయిన దేహమునకు మృత్యువు కలదు కాని చైతన్యమయమయిన జీవునికి మృత్యువు లేదు'. ఈ శ్రుతి

ద్వారా జీవరహితమయిన శరీరమునకు ముఖ్య మరణము కలదేగాని జీవునికి మృత్యువు లేదని చెప్పిరి. అందువల్ల శరీరమునకే జన్మ-మరణములు అనునది సిద్ధమయినది.

232. చరాచరవ్యపాశ్రయస్తు స్యాత్తద్వ్యపదేశో భాక్తస్తద్భావభావిత్వాత్. (2.3.16.)

సూత్రార్థము:- జన్మ-మరణములను ఈ లౌకిక పరంపర స్థావర-జంగమదేహములకు ముఖ్యము జీవునిలో గౌణము ఎందులకనగా జన్మ-మరణముల ఉపదేశము దేహముయొక్క ఉత్పత్తి నాశనములను అనుసరించి చెప్పెదరు. దేహము ఉత్పన్నమయిన జాతకర్మాది విధానము గలదు. అందువల్ల శాస్త్రములో జీవుని ఉత్పత్తిని చెప్పువాక్యములకు విరోధములేదు.

ఇచట పూర్వపక్షములో జాతకర్మాది సంస్కారముల విధానమువలన మరియు 'దేవదత్తుడు జన్మించెను, దేవదత్తుడు మరణించెను' అను లౌకిక వ్యవహారమువలన జీవునిలో అనిత్యత్వము సిద్ధమగుచున్నది. దీనికి సిద్ధాన్తి సమాధానము. "న జీవో మ్రియతే" అనగా 'చైతన్య స్వరూపుడయిన జీవుడు మరణించుటలేదు' ఈత్యాది శ్రుతి ప్రమాణములవలన జీవునిలో నిత్యత్వము సిద్ధమగుచున్నది. జీవుని నిత్యత్వ శ్రుతితో జీవునియొక్క ఉత్పత్తి నిమిత్తముననుసరించి చేయు జాతకర్మాదులకు విరోధములేదు. ఎందులకనగా లౌకిక జన్మ-మరణాదుల ఉపదేశము చైతన్యస్వరూపుడైన జీవునిలో గౌణముగా అనగా అముఖ్యముగా చెప్పిరి. జన్మ-మరణాదుల విషయము స్థావర-జంగములలో దేహమునకే ముఖ్యరూపముగా చెందును. జన్మ-మరణాదులు ఉత్పత్తి వినాశములు చెందు దేహములో అన్వయ-వ్యతిరేకముగా చూడబడుచున్నవి. జాతకర్మాది దేహము ఉత్పన్నమయిన ఆ దేహమునపేక్షించి చేసెదరు. గాన జీవోత్పత్తి అభావమువలన జీవుని నిత్యత్వము సిద్ధమయినది.

## 72.ఆత్మాధికరణము.

సంగతి:- ప్రతిదేహమునకు ఉత్పత్తి నాశనములు లేక పోయిననూ కల్పమునకు మొదలులో మరియు కల్పమునకు అన్తములో జీవునియొక్క ఉత్పత్తి నాశనములు ఎందుకు స్వీకరించరు? ఈ విధమైన ప్రత్యుదాహరణ సంగతివల్ల ఈ అధికరణము మొదలైనది.

విషయము:- ఆత్మయొక్క నిత్యానిత్యములు ఈ అధికరణమునకు విచారణీయ విషయములు.

సంశయము:- కల్పాదిలో ఆకాశమువలే జీవుడు బ్రహ్మనుండి ఉత్పన్నమగునా లేదా?

పూర్వపక్షము:- సృష్టికి పూర్వము అద్వయత్వము చెప్పుటవలన అగ్నినుండి అగ్నికణములు ఉత్పన్నమగు రీతిలో బ్రహ్మనుండి జీవుడు ఉత్పన్నమగును.

సిద్ధాన్తము:- అన్తఃకరణాదులు ఉత్పన్నమైన తరువాత అద్వయ బ్రహ్మము జీవరూపముతో దానిలో ప్రవేశించును. అందువల్ల జీవుని జన్మ ఔపాధికము. "అజో నిత్యః శాశ్వతోఽయం పురాణః" (కఠ. 2.18) అను శ్రుతి ద్వారా జీవుని నిత్యత్వము చెప్పబడినది.

వైయాసికన్యాయమాలా:-

157. కల్పాదౌ బ్రహ్మణో జీవో వియద్వజ్జాయతే న వా | సృష్టేః ప్రాగద్వయత్వోక్తేర్జాయతే విస్ఫులిఙ్గవత్ ||

158. బ్రహ్మాద్వయం జాతబుద్ధౌ జీవత్వేన విశత్యయమ్ | ఔపాధికం జీవజన్మ నిత్యత్వం వస్తుతః శ్రుతమ్ ||

కల్పమునకు ఆరంభములో బ్రహ్మనుండి ఆకాశమువలే జీవుడు ఉత్పన్నమగునా లేదా? సృష్టికి పూర్వము అద్వితీయత్వ కథనముద్వారా అగ్నినుండి అగ్నికణములు ఉత్పన్నమగునట్లు జీవుడు బ్రహ్మనుండి ఉత్పన్న మగునని పూర్వవాది కథనము. దానికి సిద్ధాన్తి జవాబు. బుద్ధి ఉత్పన్నమయిన తరువాత అద్వితీయ బ్రహ్మము జీవరూపములో దానిలో ప్రవేశించును గాన జీవుని జన్మ ఔపాధికము అంతేగాక జీవుని నిత్యత్వము వాస్తవికము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

పూర్వపక్షి చెప్పునది. "ఏకమేవాద్వితీయమ్" అనగా 'ఒకటే అద్వితీయ బ్రహ్మము' ఈ ప్రకారము సృష్టికి ముందు అద్వితీయత్వము శ్రుతిలో తెలియజేయబడినది. ఆ శ్రుతి వాక్యము బ్రహ్మకన్న భిన్నమయిన జీవుని ఉత్పత్తిని స్వీకరించినసే సిద్ధమగును. శ్రుతి అగ్నికణముల దృష్టాన్తముతో జీవుని ఉత్పత్తిని చెప్పుచున్నది.

"యథాఽగ్నేః క్షుద్రా విస్ఫులిఙ్గాః వ్యుచ్చరన్తి, ఎవమేతస్మాదాత్మనః సర్వే ప్రాణాః, సర్వే లోకాః, సర్వే దేవాః, సర్వాణి భూతాని, సర్వే ఎత ఆత్మనోః వ్యుచ్చరన్తి" అనగా 'ఏ విధముగా అగ్నినుండి అగ్నికణములు ఉత్పన్నమగునో అదే విదముగా ఈ ఆత్మనుండి అన్ని ప్రాణములు, అన్ని లోకములు, అందరు దేవతలు, అన్ని భూతములు మరియు అన్ని ఆత్మలు ఉత్పన్నమగుచున్నవి'. ఇందువల్ల కల్పారంభములో ఆకాశాదులవలే బ్రహ్మనుండి జీవుడు ఉత్పన్నమగుచున్నాడని ప్రతీత మగుచున్నది. సిద్ధాన్తి సమాధానము. ఏది అద్వితీయ బ్రహ్మమో అది బుద్ధి ఉత్పన్నమయిన తరువాత దానిలో జీవునిరూపములో ప్రవేశించుచున్నది. ఎందులకనగా "తత్ సృష్ట్వా తదేవాను-ప్రావిశత్" అనగా 'ఆ బ్రహ్మము సృష్టి చేయబడిన జీవునిరూపములో ప్రవేశించెను' బ్రహ్మమే జీవునిలో ప్రవేశించెనని చెప్పు శ్రుతి గలదు. అందువల్ల జీవుని ఉత్పత్తి అగుటలేదని చెప్పచూ సృష్టికి పూర్వము అద్వితీయ బ్రహ్మమే కలదని తెలియజెప్పు శ్రుతితో విరోధములేదు. అగ్నికణములవలే ఉత్పన్నమగునని చెప్పు శ్రుతి ఉపాధిసంబన్ధాభిప్రాయము చెప్పట వలన ప్రవృత్తి అగుచున్నది. వస్తుతత్వముయొక్క అబిప్రాయమును చెప్పు శ్రుతి జీవుని నిత్యత్వమును తెలియజెప్పుచున్నది, ఈ శ్రుతిద్వారా "నిత్యో నిత్యానాం చేతనశ్చేతనానాం" అనగా 'ఆత్మ నిత్యములకు నిత్యము మరియు చేతనములకు చేతనము' దీనివల్ల సిద్ధమగుచున్నది కల్పాదులలో జీవుని ఉత్పత్తి లేదు.

233. నాత్మాశ్రుతేర్నిత్యత్వాచ్చ తాభ్యః. (2.3.17.)

సూత్రార్థము:- జీవుడు ఉత్పన్నము కాడు, ఎందులకనగా జీవోత్పత్తి శ్రుతులలో వినబడుటలేదు. "స వా మహానజ ఆత్మాఽజరోఽమరోఽమృతోఽభయో బ్రహ్మ" అనగా 'ఆ మహానజ ఆత్మా పరిణామరహితము, మరణరాహిత్యము, అమృతస్వరూపము మరియు అభయస్వరుపమైన బ్రహ్మ' (బృ.4.4.25) "అజో నిత్యః" అనగా 'ఆ ఆత్మ జన్మ శూన్యము మరియు అవినాశీ' (కఠ.2.28) ఈ శ్రుతులలో జీవుడు నిత్యమని ప్రతీత మగుచున్నది.

ఇచట పూర్వపక్షములో జీవుడు బ్రహ్మ కార్యమగుటవలన ఒక విజ్ఞానముద్వారా సర్వవిజ్ఞానము ప్రతిజ్ఞ అసిద్ధమనును.
సిద్ధాన్తములో జీవుడు నిత్యమగుటవలన బ్రహ్మాత్మైక్యబోధయను ఫలము నిశ్చితము. శరీరమునకు అధిష్ఠానముగానుండి కర్మసంబన్ధము గల జీవుడు ఆకాశాదులవలే ఉత్పన్నమగుచున్నాడా లేక బ్రహ్మవలే ఉత్పన్నమగుటలేదా? "సర్వ ఎత ఆత్మనో వ్యుచ్చరన్తి" అనగా 'ఆ పరమేశ్వరునినుండి ఈ జీవులందరూ జనించుచున్నారు'. ఈలాగున భిన్నమైన జీవుల జన్మ వినబడుటవలననూ శ్రుతులలో విరోధముండుట వలననూ జీవుని జన్మ చెప్పవలయును. ఈ పూర్వపక్షమునకు సిద్ధాన్తి చెప్పునది. జీవుని ఉత్పత్తి లేదు ఎందులకనగా ఉత్పత్తి ప్రకరణములో అనేకచోట్ల జీవుని ఉత్పత్తి వినబడుటలేదు. అక్కడక్కడ జీవుని ఉత్పత్తి విబడుచున్నది కాదా అనిన అట్లు చెప్పుట సరికాదు. ఎందులకనగా జీవుడు నిత్యము గనుక వాని ఉత్పత్తి అసంభవము. "స వా ఏష మహానజ ఆత్మా" అనగా 'ఆ ఈ ఆత్మ నిశ్చయముగా దేశపరిచ్ఛేదము లేనిది మరియు పుట్టుక లేనిది' (బృ,4.4.25). "అజో నిత్యః శాశ్వతోఽయం పురణః" అనగా 'ఈ ఆత్మ జన్మరహితము, నిత్యము, శాశ్వతము మరియు పురాణము' (కఠ.2-18) ఈ శ్రుతులలో జీవుని నిత్యత్వమును స్వీకరించిరి. జీవుని ఉత్పత్తిని చెప్పు వాక్యములు ఘటాకాశముయొక్క ఉత్పత్తివలే ఔపాధికము గాన శరీరోత్పత్తిననుసరించి చెప్పిరి. అందువల్ల జీవుని చెప్పు శ్రుతులలో విరోధములేదు.

## 73. జ్ఞాధికరణము.

సంగతి:- దీనికి ముందు అధికరణములో జీవునియొక్క ఉత్పత్తి అగుటలేదని చెప్పిరి. ఆ జీవునిలో చేతనత్వ-అచేతనత్వముల విచారము చేయవలయును, అందువల్ల పూర్వాధికరణముతో ఈ అధికరణమునకు హేతుహేతుమద్భావ సంగతి.
విషయము:- జీవుని ఆశ్రయించి ఉన్న చేతనత్వాచేతనత్వముల విచారము ఈ అధికరణమునకు విషయము.
సంశయము:- జీవాత్మ చేతనమా లేక అచేతనమా?
పూర్వపక్షము:- సుషుప్త్యాదులలో చేతనత్వ అభావమువలన జీవాత్మ చిద్రూపము కాదు.
సిద్ధాన్తము:-సుషుప్త్యాది అవస్థలలో ఆత్మయొక్క చిద్రూపము లోపముకాదు. ద్వైత జగత్తు తన కారణములో విలయమగుటవలన కేవలము ద్వైతదృష్టి లోపమగుచున్నది."న హి ద్రష్టుర్దృష్టేర్విపరిలోపో విద్యతేఽవినాశిత్వాత్" అనగా 'వస్తువులున్నను లేకున్నను చూచువానిచూపునకు హాని ఎప్పటికీ ఉండదు. చూచువాడు చూడబడు పదార్థములవలే నశించువాడు కాగూడదు కదా'! ఈ విధముగా శ్రుతి ఉండుటవలన జీవాత్మను చిద్రూపముగా స్వీకరించిరి.
వైయాసికన్యాయమాలా:
159. అచిద్రూపోఽథ చిద్రూపో జీవోఽచిద్రూప ఇష్యతే |చిదభావాత్సుషుప్త్యాదౌ జాగ్రచ్చిన్మనసా కృతా ||
160. బ్రహ్మత్వాదేవ చిద్రూపశ్చిత్సుషుప్తౌ న లుప్యతే| ద్వైతాదృష్టిర్ద్వైతలోపాన్నహి ద్రష్టురితి శ్రుతేః||

జీవుడు చైతన్యస్వరూపుడా లేక అచేతనుడా? జీవుడు అచేతనుడు ఎందులకనగా సుషుప్త్యాది అవస్థలలో చైతన్యమునకు అభావముండుటవలన మరియు ఆ అవస్థలలో కనబడు చైతన్యము ఆత్మ మనస్సుల సంయోగమువలన ఉత్పన్నమగుచున్నది. ఈ పూర్వపక్షమునకు సిద్ధాన్తి సమాధానము. జీవుడు బ్రహ్మస్వరూపుడగుటవలన చైతన్యరూపమే. సుషుప్తిలో చైతన్యమునకు నాశనము కలుగదు కాని ప్రపంచము నాశనమగుటవలన ఆ ప్రపంచము కానరాదు. ఎందులకనగా 'చూచువాని చూపునకు హాని ఎప్పటకీ ఉండదు చూచువాడు నశించడు'. అను శ్రుతి ఉండుటవలన.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

ఇచట పూర్వపక్షి నైయ్యాయికుడు. వారిమతములో సుషుప్తి, మూర్ఛ మరియు సమాధి అవస్థలలో చైతన్యాభావమువలన జీవుడు చైతన్యరూపుడు కాదు. జాగ్రదవస్థలో ఆత్మ మరియు మనస్సుల సంయోగమువలన చైతన్యమను గుణము ఉత్పన్నమగును. సిద్ధాన్తి సమాధానము. ఈ పూర్వపక్షి కథనము అసంగతము, ఎందులకనగా చైతన్యస్వరూపమైన బ్రహ్మము జీవరూపముతో జీవినిలో ప్రవేశించునని శ్రుతి తెలియజేయుచున్నది. సుషుప్తిలో చైతన్యము లోపించుననుట సరికాదు కాని ఆ సుషుప్త్యాదుల సాక్షీరూపముగా చైతన్యముండును. అట్లుకానిచో సుషుప్త్యాదుల జ్ఞానము కలుగదు. మరి సుషుప్తిలో ప్రపంచాదుల జ్ఞానము ఎందుకు కలుగుటలేదనిన ప్రపంచము లుప్తమగుటవలన దాని జ్ఞానము కలుగుటలేదు. ఈ విషయమును చెప్పు శ్రుతిగూడ కలదు. "యద్వైతన్న పశ్యతి పశ్యన్ వై తన్న పశ్యతి న హి ద్రష్టుర్దృష్టేర్విపరిలోపో విద్యతేఽవినాశిత్వాత్ న తు తద్ ద్వితీయమస్తి తతోఽన్యత్ విభక్తం పశ్యేత్" అనగా 'సుషుప్తి మూర్ఛాద్యవస్థలయందు జీవుడు విషయములను గ్రహింపకున్నాడు అనునది జ్ఞానాభావముచే కలిగినదికాదు. వస్తువు ఉన్నను లేకున్నను చూచువాని చూపునకుహాని ఎప్పటకి లేదు, చూచువాడు చూడబడు పదార్థమువలే నశించువాడు కాదు. ఆ బ్రహ్మ కన్న భిన్నవస్తువు లేదు వేరుగా చూచుటకు' (బృ.4.3.23.) దీని అర్థము 'సుషుప్తిలో జీవుడు ఏదీ చూచుటలేదు' అని లోకములో చెప్పెదరు కాని ఆ యుక్తి సరికాదు. ఆ సమయములో జీవుడు చూచుచున్నప్పటికి చూచుటలేదు అని భ్రాన్తితో చెప్పెదరు. మరి దాని దర్శనము ఎట్లు కలుగును? అనిన దానికి సమాధానము ఆత్మయొక్క స్వరూపభూతమైన దృష్టికి వినాశనములేదు అది అవినాశీ స్వభావముగలది. ఆలాగున స్వీకరించనిచో లోపవాదిగూడ సాక్షిరహిత లోపము చెప్పలేడు. మరి లోకులకు చూచుటలేదను భ్రమ ఎట్లు కలుగుచున్నది. దీనికి కారణము చైతన్యరూపమైన బ్రహ్మకన్న భిన్నమైన క్రియా, సాధనము, ఫలరూపమైన విభాజనము గల రెండవ వస్తువు జగద్రూపము అచట లేదు. అది దాని కారణరూపములో లీనమగుచున్నది. గాన ఆ సమయములో జాగ్రత్తువలే ద్రష్టా, దృష్యము మరియు దర్శనరూపమైన వ్యవహారము లోపించుటవలన 'న పశ్యతి' 'చూచుటలేదు' అని లోకులకు భ్రాన్తి కలుగుచున్నది. అందువల్ల జీవుడు చైతన్య స్వరూపుడు.

234. జ్ఞోఽత ఎవ. (2.3.18.)

సూత్రార్థము:- జీవుడు స్వయంజ్యోతిస్స్వరూపుడు, ఎందులకనగా వానికి ఉత్పత్తిలేదు.

ఇచట పూర్వపక్షములో వైశేషికులవలే ఆత్మ ఆకస్మికముగా వచ్చిన చైతన్యము గలది. సిద్ధాన్తములో ఆత్మ నిత్య చైతన్య స్వరూపమని నిశ్చయము గావించబడినది. "పశ్యంశ్చక్షుః శృణ్వఞ శ్రోత్రమ్" అనగా 'చూచుటకు కన్నులు వినుటకు చెవులు' అని శ్రుతి ద్వారా ఆత్మ మనస్సుల సంయోగమువలన జ్ఞానగుణము ఆత్మలో ఉత్పన్నమగునని చెప్పు వైశేషికుల సిద్ధాన్తముతో ఆత్మ స్వయంప్రకాశమని చెప్పు శ్రుతితో విరోధము గలదా లేదా? విరోధముగలదని చెప్పు ప్రశ్నకు సమాధానము. ఆత్మ నిత్య చైతన్య స్వరూపము, ఎందులకనగా నిర్వికారచైతన్యము ఉపాధి సంపర్కమువల్ల జీవరూపముగా నున్నది, అంతేగాక బ్రహ్మరూపమైన జీవుని ఉత్పత్తి అసంభవము. జీవుని ప్రకరణములో ఈ క్రింద చెప్పు శ్రుతులు గలవు. "అసుప్తః సుప్తానభిచాకశీతి (బృ 4.3.11) "అత్రాయం పురుషః స్వయంజ్యోతిర్భవతి" (బృ 4.3.9.) "న హి విజ్ఞాతుర్విజ్ఞాతేర్విపరలోపో విద్యతే" (బృ.4.3.30.). ఈ శ్రుతులకు క్రమముగా అర్థము. 'జీవుడు స్వయముగా నిదురించకయే (జ్ఞానలోపమును పొందకయే) సర్వకారణములయందు లీనమైన ఇంద్రియాదులను చూచుచూండును'. 'ఈ అవస్థయందు పురుషుడు స్వయంప్రకాశ స్వరూపుడై యున్నడు' 'తెలిసికొనువాని తెలివికి లోపములేదు'. ఆత్మయొక్క చైతన్యము నిత్యమని స్వీకరించిన ఘ్రాణాది ఇంద్రియములు అనర్థకములని చెప్పిన అట్లనుట సరికాదు, ఎందులకనగా గన్ధమును గ్రహించుటకు ఘ్రాణము, శబ్ద శ్రవణమునకు చెవులు అను శ్రుతి వాక్యము గన్ధాది గుణములను విషయీకరించు అన్తఃకరణ వృత్తుల కొరకు వానిని స్వీకరించుట ఆవశ్యకమని చెప్పుచున్నది. వైశేషికుల తర్కము శ్రుతి విరుద్ధమగుటవలన తర్కాభాసము(వట్టి భ్రమ). చెప్పిన శ్రుతి వాక్యములద్వారా ఆత్మ స్వయంప్రకాశస్వరూపముగాన శ్రుతులలో విరోధములేదు.

## 74. ఉత్-క్రాన్తిగత్యధికరణము.

సంగతి: బ్రహ్మముతో అభేదము చెప్పుటకు జీవాత్మ స్వయంప్రకాశస్వరూపమనియు నిత్యమనియు క్రిందటి అధికరణములో చెప్పిరి. ఆలాగుననే ఈ అధికరణములో జీవాణుత్వమును ఖండించి ఆ జీవునిలో విభుత్వము సిద్ధికొరకు ఆన్తర బహిర్భావ సంగతి వల్ల ఈ అధికరణము ప్రారంభమయినది.

విషయము:- జీవపరిమాణము ఈ అధికరణములో విచారణీయ విషయము.

సంశయము:- జీవుని పరిమాణము అణుత్వమా లేక విభుత్వమా?

పూర్వపక్షము:- "ఏషోఽణురాత్మా" (ముం. 3.1.9.) ఈశ్రుతి ద్వారా జీవునిలో అణుత్వము సిద్ధమగుచున్నది. దీనితోబాటు జీవుని ఉత్-క్రాన్తి గమనాగమనముల శ్రవణమగుటవలన జీవునిలో అణుత్వము స్వీకరించుట ఉచితము.

సిద్ధాన్తము:- సాభాసబుద్ధి అణుపరిమాణముగలది. ఈ ప్రకారము ఉపాధివలన జీవాత్మలో అణుపరిమాణము శ్రుతిలో చెప్పిరి కాని జీవాత్మలో విభుత్వమే కలదు. ఎందులకనగా జీవుడు బ్రహ్మకన్న భిన్నముగాదు.

వైయాసికన్యాయమాలా:-

161. జీవోఽణుః సర్వగో వా స్యాదేషోఽణురితి వాక్యతః | ఉత్-క్రాన్తిగత్యాగమనశ్రవణాచ్చాణురేవ సః ||

162. సాభాసబుద్ధ్యాఽణుత్వేన తదుపాధిత్వతోఽణుతా | జీవస్య సర్వగత్వం తు స్వతో బ్రహ్మత్వతః శ్రుతమ్ ||

జీవుని ప్రమాణము అణువా లేక స్వర్వవ్యాపకమా? "ఏషోఽణురాత్మా చేతసా వేదితవ్యః" అనగా ' ఈ అణురూపముగల ఆత్మను అతిశుద్ధమైన చిత్తముతో తెలిసికొనుటకు యోగ్యము' ఈ శ్రుతి వాక్యముద్వారా ఇంకను గతి మరియు ఆగమనము వినబడుటవలన జీవుని స్వరూపము అణు పరిమాణమని పూర్వపక్షి కథనము. సిద్ధాన్తి చెప్పునది. చైతన్య ప్రతిబింబ సహితము బుద్ధి అణు పరిమాణముగలది. ఆ బుద్ధి-చైతన్యయొక్క ఉపాధి అగుటవలన జీవుని అణుపరిమాణము గలవాడనిరి. కాని జీవుడు స్వయముగా బ్రహ్మస్వరూపమగుట వలన సర్వగతుడు మరియు విభుడని శ్రుతి చెప్పుచున్నది.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

పూర్వపక్షి చెప్పునది. "ఏషోఽణురాత్మా చేతసా వేదితవ్యః" అనగా ' ఆ అణురూపముగల ఆత్మను శుద్ధచిత్తముతో తెలిసికొనుటకు యోగ్యము'. ఈ శ్రుతి ద్వారా జీవుని పరిమాణము అణువని చెప్పబడినది. "అస్మాచ్ఛరీరాదుత్-క్రామతి" అనగా 'ఈ శరిరమునుండి నిర్గమించును' ఈ శ్రుతిలో జీవుని ఉత్-క్రమణము వినబడుచున్నది. "చంద్రమసమేవ తే సర్వే గచ్ఛన్తి" అనగా 'అందరు చంద్రలోకమునకు పోవుచున్నారు'. ఈ శ్రుతి ద్వారా జీవుల గతి మరియు " తస్మాల్లోకాత్పునరేతి" అనగా ' చంద్రలోకమునుండి తిరిగి వచ్చెదరు' ఈ శ్రుతిద్వారా జీవుల ఆగమనము వినబడుచున్నది. సర్వగతము మరియు విభుపైన వానికి గమనాగమనములు ఉండవు. కాని మధ్యమపరిమాణముగలవానికి ఉత్-క్రమణము గమనాగమనములు ఉండవచ్చును. అయిననూ జీవుని అణువని చెప్పు శ్రుతులకు విరోధము వలన జీవునిలో అనిత్యత్వము నివారణకాజాలదు. ఈతర్కముల ద్వారా జీవుడు అణు పరిమాణముగలవాడని తెలియుచున్నది.

సిద్ధాన్తి చెప్పునది. చైతన్య ప్రతిబింబ సహితము బుద్ధి సర్వవ్యాపకముకాదు. ఆ బుద్ధి ఉపాధివలన జీవునిలో ఉత్-క్రమణము, గమనము మొదలగునవి యుక్తియుక్తములు. స్వయముగా జీవుడు బ్రహ్మస్వరూపమగుటవలన సర్వవ్యాపకుడు. "స వా ఏష మహానజ ఆత్మా" ( బృ,4.4.25.) 'ఈ సంసారిగా కనబడు ఆత్మనిశ్చయముగా దేశ-పరిచ్ఛేదరహితము, మరియు పుట్టుక లేనిది'. "సర్వవ్యాపి సర్వభుతాన్తరాత్మా" అనగా 'ఈ జీవుడు సర్వవ్యాపకుడు మరియు అన్ని ప్రాణుల అన్తరాత్మా'. ఈ శ్రుతులద్వారా జీవుని సర్వవ్యాపకతా బోధించిరి గాన జీవుడు సర్వవ్యాపకుడని సిద్ధమైనది.

## 235. ఉత్ క్రాన్తిగత్యాగతీనామ్. (2.3.19.)

సూత్రార్థము:- "అస్మాచ్ఛరీరాదుత్ క్రామతి" అనగా 'జీవుడు ఈ శరీరమునుండి ఉత్క్రమించును' "చంద్రమసమేవ తే సర్వే గచ్ఛన్తి" అనగా 'వారందరు చంద్రలోకమునకే పోవుదురు' "తస్మాల్లోకాత్పునరేతి" అనగా 'చంద్రలోకమునుండి తిరిగి వచ్చుదురు' ఈ ప్రకారము ఉత్ క్రమణము, గమనము మరల ఆగమనము

వినబడుటవలన జీవుడు అణుపరిమాణము గలవాడని తెలియుచున్నది. జీవుడు "సర్వవ్యాపి" అని సర్వవ్యాపకుడని చెప్పు శ్రుతితో "ఏషోఽణురాత్మా" అని అణు పరిమాణము చెప్పు శ్రుతికి విరోధము కలుగు చున్నది.

"సర్వవ్యాపి" అని సర్వవ్యాపకత్వము, నిత్యత్వము చెప్పు శ్వేతాశ్వతర శ్రుతితో "ఏషఽణురాత్మా" అని అణుత్వమునుచెప్పు ముండక శ్రుతితో విరోధము కలదా లేదా అను సంశయమునకు పూర్వపక్షి విరోధము కలదనును. ఎందులకనగా ఉత్-క్రాన్తి గతి మరియు ఆగతి వినబడుటవలన జీవునిలో అణుత్వము సిద్ధమగుచున్నది. విభుత్వము గల జీవునిలో ఉత్-క్రాన్తి గమనాగమనములు సంభవింపవు.

236. స్వాత్మనా చోత్తరయోః. (2.3.20.)

సూత్రార్థము:- ఉత్-క్రమణము తరువాత ఆ జీవుని గమనాగమనముల సంబన్ధము కలదు. గత్యాగతులు జీవుడు అణుపరిమాణము గలిగిననే సంభవము.

గ్రామ స్వామిత్వ అధికారము తొలగినచో వాని స్వామిత్వము గూడ తొలగిపోవును. అటులనే దేహ స్వామిత్వము తొలగినచో అచలమైన ఆత్మలో ఉత్-క్రమణము సంభవింపవచ్చును. కాని గత్యాగతులు జీవాత్మలోనే కలుగును. గాన జీవాత్మలో మధ్యమ పరుమాణము గాక అణుపరిమాణము స్వీకరించిననే గమనాగమనములు సంభవము. అందువల్ల జీవునిలో అణుత్వమే సిద్ధమగుచున్నది.

237. నాణురతచ్ఛ్రుతేరితిచేన్నేతరాధికారాత్. (1.3.21.)

సూత్రార్థము:- జీవుడు అణు పరిమాణము గలవాడు కాదు ఎందులకనగా "సర్వవ్యాపి" అను శ్రుతి జీవుని సర్వగతత్వమును చెప్పుచున్నది గదా అనిన అట్లనుట సరికాదు ఏలనన అన్ని వేదాన్త వాక్యములలో జీవునికన్న భిన్నమైన బ్రహ్మను ప్రధానముగా తెలిసికొనుటకు చెప్పుటవలన సర్వగతత్వము బ్రహ్మకు చెందునేగాని జీవునికిగాదు.

ఈ ఆత్మ అణుపరిమాణము కలది గాదు ఎందులకనగా అణుత్వమునకు విపరీతముగా మహత్వ పరిమాణము వినబడుచున్నది. "స వా ఏష మహానజ ఆత్మా యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు" అనగా 'ఈ జీవుడు ఉత్పత్తి శూన్యుడు, మహాపరిమాణము గలవాడు, ఇంద్రియములలో విజ్ఞానమయుడు" (బృ.4.4.22). "సత్యంజ్ఞానమనన్తం బ్రహ్మ" అనగా 'బ్రహ్మము సత్యస్వరూపుడు, జ్ఞానస్వరూపుడు ఆద్యంతములు లేనువాడు' (తై.2.1.1.) "సర్వవ్యాపి సర్వభూతాన్తరాత్మ" అనగా 'ఆత్మ సర్వవ్యాపకము మరియు సంపూర్ణ భూతములయొక్క అన్తరాత్మస్వరూపుడు' (శ్వే.6.11). ఈ పై వాక్యములలో ఆత్మయందు సర్వవ్యాకత్వము వినబడుచున్నది గాన ఆత్మ అణుపరిమాణము గాదు. అట్లనుట సరిగాదు ఎందులకనగా జీవభిన్నమైన పరబ్రహ్మమునే అన్ని వేదాన్త వాక్యములు జ్ఞేయమని స్వీకరించి ప్రసంగము ప్రారంభించిరి. అందువల్ల బ్రహ్మములో పరిమాణాన్తరము వినిపించిననూ ఔపాధిక జీవాణుత్వమునకు విరోధము కలుగదు.

238. స్వశబ్దోన్మానాభ్యాం చ. (2.3.22.)

సూత్రార్థము:- “ఏషోఽణురాత్మా” అనగా ‘ఈ ఆత్మా అణుపరిమాణము గలది’. (ము.3.1.9) ఈ అణుత్వవాచకమగు శ్రుతిద్వారా మరియు “బాలాగ్రశతభాగస్య శతధా కల్పితస్య చ| భాగో జీవః స విజ్ఞేయః” అనగా ‘వెంట్రుకకొనను నూరుభాగములుచేసి అందొక్కభాగమును మఱల నూరుభాగములు గావించిన జీవుడందలి ఒక్కభాగముతో సమానుడగును’ (శ్వే. 5.9). ఈ శ్రుతిలో జీవుని అత్యన్త సూక్ష్మ పరిమాణము గలవానిగా చెప్పుటవలన జీవుని పరిమాణము సూక్ష్మమే.

“ఏషోఽణురాత్మా చేతసా వేదితవ్యః” అనగా ‘ఈ అణు పరిమాణముగల ఆత్మ అన్తఃకరణముద్వారా తెలిసికొనుటకుటకు యోగ్యము’. ఇచట ఆత్మ యొక్క అణుపరిమాణ వాచక శబ్దము సాక్షాత్తుగా వినబడుచున్నది. మరియు “ బాలాగ్ర శతభాగస్య శతధా కల్పితస్య చ | భాగో జీవః స విజ్ఞేయః” అనగా ‘వెంట్రుకకొనభాగమును నూఱ-భాగములుచేసి దానిలో ఒకభాగమును మఱల నూఱుభాగములు చేసిన దానిలోని ఒకభాగము జీవుని పరిమాణమునకు సమానము’ ఇత్యాది ఉన్మానము (అన్ని స్థూల పరిమాణముల నపేక్షించి అత్యన్తము సూక్ష్మ పరిమాణమును ఉన్మాన మందురు) జీవుని అణుత్వమును బోధగావించు చున్నది. చెప్పిన రెండు కారణములవల్ల జీవునిలో అణుత్వ పరిమాణమే సిద్ధమగుచున్నది.

239. అవిరోధశ్చన్దనవత్. (2.3.23.)

సూత్రార్థము:- ఏవిధముగా శరీరములో ఒక అవయవమందు పూసిన చన్దనబిన్దువు సంపూర్ణ శరీరమునకు సుఖము కలుగజేయునో అదేవిధముగా అణు పరిమాణముగల జీవుడు దేహవ్యాపకమగు శీతాదుల అనుభవము కలుగజేయుననుటలో విరోధములేదు.

జీవుడు అణు పరిమాణము గలవాడనిన గంగానదిలో మునిగిన వానికి దేహవ్యాపకమగు చల్లదనము యొక్క అనుభవము మరియు ఎండాకాలములో సకలదేహవ్యాపక పరితాపము యొక్క అనుభవము ఎట్లు కలుగును? ఈ ప్రశ్నకు సమాధానము పూర్వపక్షి ఈ సూత్రములో చెప్పిరి. శరీర ఒక భాగమయిన లలాటములో అద్దిన మంచిగంధము యొక్క చల్లదనము శరీరవ్యాపకమగు సుఖము కలుగజేయును. అట్లే అణుపరిమాణముగల ఆత్మగూడ దేహమునందలి ఒకభాగములోనున్ననూ దేహవ్యాపక మగు శతోష్ణాదులను అనుభవింపజేయునని స్వీకరించిన విరోధము ఉండదు ఎందులకనగా శరీరవ్యాపకమయిున చర్మముతోబాటు ఆత్మకుగల సంబన్ధము చెప్పిన శీతోష్ణాదుల ఉపలబ్ధికి కారణము.

240. అవస్థితివైశేష్యాదితి చేన్నాఽభ్యుపగమాద్ధృదిహి. (2.3.24.)

సూత్రార్థము:- ప్రత్యక్షముగా చన్దనబిందువు శరీరములోని ఒకభాగములో ఉండుట కానబడుచున్నది ఈ ప్రకారము ఏకదేశములో జీవుని అవస్థితి లేదు. అందువల్ల సమానత లేనందువలన చన్దన దృష్టాన్తము యుక్తిసంగతము కాదని చెప్పుటకు వీలులేదు ఎందులకనగా జీవుని అణుత్వము స్వీకరించిరి. జీవుని అల్పపరిమాణము చెప్పు ఈ

శ్రుతి గలదు. “హృద్యన్తర్జ్యోతిః” (బృ.4.3.7) అనగా ‘హృదయ మధ్యభాగములో జ్యోతిస్వరూపముగా నున్నది’. ఈ ప్రకారము దృష్టాన్తములో విషమత లేక అసమానత లేదు.

పూర్వము చెప్పిన దృష్టాన్తము సరికాదు ఎందులకనగా చన్దనబిందువు విశేషముగా శరీరములోని ఒకస్థలములోనుండి శరీరమంతటికీ సుఖము కలిగించుచున్నదనునది ప్రత్యక్షముగా అనుభవించుచున్నారు. కాని ఈ విధముగా ప్రత్యక్ష ప్రమాణముద్వారా దేహమునందలి ఒకభాగములో ఆత్మస్థితి అనుభవ సిద్ధముకాదు. దానిని అనుమానముద్వారా తెలిసికొనుచున్నాము. కనుక దృష్టాన్త-దార్ష్టాన్తములలో విషమత కలదు అని చెప్పుట సరికాదు ఎందులకనగా చన్దనబిన్దువువలే ఆత్మనుగూడ శ్రుతిలో దేహమునందలి ఒకభాగములో నుండుటను స్వీకరించిరి. “హృది హ్యేషఆత్మా” (ప్ర.3.6.) “స వా ఏష ఆత్మా హృది” (ఛాం.8.3.3) “హృద్యన్తర్జ్యోతిః పురుషః” (బృ.4.3.7) అనగా ‘ఈఆత్మ హృదయములో నున్నది’, ‘నిశ్చయముగా ఈ ఆత్మ హృదయములోనే యున్నది’ ‘హృదయములో ఆ పురుషుడు జ్యోతిస్వరూపముగా నున్నాడు’. ఈ శ్రుతి వాక్యములలో అల్ప పరిమాణముగల హృదయములో జీవుని స్థితి చెప్పిరి. గాన జీవుని అణుపరిమాణముగా స్వీకరించిన దృష్టాన్తములో వైషమ్యము లేదు. చన్దనబిందువులో అవయవములు కలవు అది దేహవ్యాపకమగు శీతలతను ఉత్పత్తి గావించునని స్వీకరించిననూ నిరవయవ అణుపరిమాణముగల జీవుడు దేహవ్యాపక చైతన్యమును ఉత్పత్తి చేయుటకు యోగ్యత ఎట్లు కలిగి యుండును? ఈ ప్రశ్నకు జవాబు పూర్వపక్షి మరియొకవిధముగ సమర్థించుచున్నాడు.

241. గుణాద్వా లోకవత్. 2.3.25.

సూత్రార్థము:- ఏ విధముగా లోకములో గృహమధ్యములో నుంచిన దీపము చిన్నదైననూ దాని ప్రకాశమను గుణము గృహమన్తయూ వ్యాపించును. అట్లే ఆత్మ అణువైననూ దానిలోనున్న చైతన్యమను వ్యాపక గుణముద్వారా వ్యాపక కార్యము చేయగలదు.

ఆత్మయొక్క చైతన్యగుణము సంపూర్ణశరీరములో వ్యాప్తము అందువల్ల అణు పరిమాణముగల ఆత్మగూడ సకల దేహవ్యాపి కార్యము చేయునని స్వీకరించిన విరోధముండదు. ఏ విధముగా ఇంటిలో ఒకమూలనున్న మణి కాని దీపముగాని ప్రకాశమను గుణమువల్ల సంపూర్ణగృహమును ప్రకాశింపజేయునో , ఆవిధముగనే అణుపరిమాణము గల జీవుడు సకలదేహవ్యాపి కార్యము జేయ సమర్థుడు. గుణముగల వానిని విడిచి గుణము స్వతంత్రముగా భిన్న ప్రదేశమున ఉండదు. వస్త్రమునందున్న తెలుపు వస్త్రమును విడిచి మఱియొకస్థలములో నుండదు. కాన్తి అనునది ద్రవ్యమేగాని గుణముకాదు. తేజోభూతముయొక్క అవయవములు దట్టముగా నుండిన దీపమనియు పలుచగ నుండిన కాన్తియనియు చెప్పబడును. దీనికి సమాధానము అగ్రిమసూత్రముద్వారా చెప్పుచున్నారు పూర్వపక్షి.

242. వ్యతిరేకో గన్ధవత్. (2.3.26.)

సూత్రార్థము:- ఏవిధముగా గన్ధము గుణమయిననూ దాని స్వరూపము ద్రవ్యగుణముకన్న భిన్నముగా చూడబడుచున్నది. పుష్పములతోట సమీపమున తిరుగు పురుషునికి పుష్పముల సువాసన తెలియుచున్నది. ఆవిధముగనే ఆత్మయొక్క చైతన్యగుణము వ్యాపక కార్యము చేయగలదు.

సుగంధాదులు గుణములేయైననూ తమకాశ్రయభూతములగు ద్రవ్యములను విడిచి స్వతంత్రముగనే వ్యాపించియుండుట ప్రత్యక్షముగా చూచుచున్నాము. పుష్పాదులు దూరముగానున్ననూ వాని వాసన సమీపమునకు వచ్చుచున్నది యనుట అనుభవసిద్ధమే. అటులనే జీవుడు అణుమాత్రుడేయైననూ అతని గుణమగుచైతన్యము దేహమంతటనూ వ్యాపింపవచ్చును. అందువల్ల మీవస్త్రదృష్టాన్తము సరిగాదు.

243. తథాచ దర్శయతి. (2.3.27.)

సూత్రార్థము:- "ఆ లోమభ్య ఆ నఖాగ్రేభ్యః" (ఛాం.8.8.1) అనగా 'మేమిరువురము (ఇంద్ర వీరోచనులు) ఆత్మను తలవెంట్రుకలనుండి కాలిగోళ్ళవరకు చూచితిమి' ఈశ్రుతి ఆత్మయొక్క చైతన్యగుణము శరీరమంతయూ వ్యాపించియున్నదని ప్రతిపాదించు చున్నది.

ఆత్మయొక్కస్థానము హృదయమని చెప్పిన తరువాత ఆ ఆత్మయొక్క చైతన్యగుణము తలవెంట్రుకల నుండి కాలిగోళ్ళవరకు సంపూర్ణ దేహములో వ్యాప్తమని ఛాంన్దోగ్య శ్రుతి చెప్పుచున్నది.

244. పృథగుపదేశాద్. (2.3.28.)

సూత్రార్థము:- "ప్రజ్ఞయా శరీరం సమారుహ్య" (కౌ.3.6.) అనగా 'జీవుడు జ్ఞానముచే శరీరము నాక్రమించి' ఈశ్రుతిలో ఆత్మ మరియు జ్ఞానమును కర్తా మరియు సాధనముగా(కరణము) విడిగా ఉపదేశించిరి. అందువల్ల గుణముద్వారా జీవునిలో శరీరవ్యాపి జ్ఞానము కలుగుచున్నది.

'చైతన్య గుణముద్వారా శరీరమును బాగుగా ఆక్రమించి' ఈ శ్రుతి వాక్యములో ఆత్మను కర్తగాను జ్ఞానమును కరణముగాను విడిగా ఉపదేశించిరి. అందువల్ల ఆత్మ చైతన్యగుణముద్వారానే సర్వవ్యాపకమని స్వీకరించిరి. అందువల్ల ఆత్మయొక్క జ్ఞానగుణము వ్యాపకము కాని జీవాత్మ స్వయముగా అణుపరమాణము గలవాడు. ఇంతవరకు పూర్వపక్షము. ఇపుడు సిద్ధాన్తి సమాధానము చెప్పబడుచున్నది.

245. తద్గుణసారత్వాత్తు తద్వ్యపదేశః ప్రాజ్ఞవత్. (2.3.29.)

సూత్రార్థము:- కాని ముందుచెప్పిన దానికి విపరీతముగా అణుత్వము, ఉత్-క్రమణము, గమనము, ఆగమనము, సుఖము, దుఃఖము మొదలగునవి బుద్ధియొక్క గుణములు అందువల్ల వానిలో అణుత్వ ఉపదేశము గావించిరి. అది స్వాభావికముగాదు, ఏవిధముగా పరమాత్మయొక్క సగుణోపాసనములో దహరాది (హృదయ గుహాదులందు) ఉపాధులకారణముగా అణుత్వాదుల ఉపదేశము గావించిరి అలాగుననే ఇచటగూడ తెలిసికొనవలయును.

సూత్రములోనున్న 'తు' శబ్దము పూర్వపక్షమును నివారించుటకు. ఆత్మ అణుమాత్ర రూపుడు కాదు ఎందులకనగా జీవుని ఉత్పత్తి వినబడుటలేదు అంతేగాక పరబ్రహ్మమే జీవుని శరీరములోప్రవేశించుట వినబడుచున్నది మరియు జీవునితో పరబ్రహ్మయొక్క తాదాత్మ్య ఉపదేశము గూడ గలదు. అందువల్ల పరబ్రహ్మమే జీవుడు. ఈ చెప్పినరీతిగా జీవుని పరబ్రహ్మస్వరూపముగా స్వీకరించిన జీవునిలో అణుత్వ ఉపదేశము ఎందులకు చేసిరి అను ఆశంక వచ్చును అది సరికాదు. ఏలనన బుద్ధి గుణములు ఇచ్చా ద్వేష, సుఖదుఃఖాదులు ఆత్మయొక్క సంసారిత్వమునకు ప్రధాన కారణములు. అనగా అజ్ఞానమువలన అణుపరిమాణముగల బుద్ధితో చైతన్యము కల్పిత తాదాత్మ్యమగుటచే, బుద్ధియొక్క ఇచ్చాది ధర్మములకు సమముగా అణుపరిమాణత్వ ధర్మముగూడ భ్రమద్వారా, ఆత్మయందు కానవచ్చుచున్నది. అందువల్ల ఆత్మ అణుపరమాణము గలదని చెప్పిరి. బుద్ధి గుణములతో తాదాత్మ్యభ్రమ లేకుండ శుద్ధాత్మలో సంసారిత్వము కానరాదు. కాన తద్గుణసారత్వమును (బుద్ధి గుణములు ప్రధానముగాగల జీవుని) స్వీకరించి బుద్ధిపరిమాణమును ఆత్మపరిమాణముగా ఉపదేశించిరి. అందువల్ల బుద్ధియొక్క ఉత్-క్రాన్తి, గత్యాగతుల కారణమువలన ఆత్మలో ఉత్-క్రాన్త్యాదులను ఉపదేశించిరేగాని కేవలము ఆత్మయందు అణు పరిమాణముగాని గుణములుగాని లేవు. మరియు "బుద్ధేర్గుణేనాత్మగుణేన చైవ ఆరాగ్రమాత్రో హ్యవరోఽపి దృష్టః" (శ్వే.6.8) అనగా 'బుద్ధి మరియు శరీరముయొక్క గుణములద్వారానే పురుషునిలో (ఆత్మలో ఆరాగ్రమాత్ర) ముల్లుకోలుయొక్క కొనయంత చిన్నపరిమాణము కానవచ్చును'. ఈ శ్రుతి బుద్ధిగుణములను స్వీకరించి ఆరాగ్రమాత్రత్వము నుపదేశించుచున్నది కాని ఆత్మస్వరూపమును చెప్పుటకు కాదు. ఇది చైతన్యస్వరూపమైన పరమాత్మయొక్క గుణోపాసనలో దేహాదుల ఉపాధి కారణమువలన అణుపరిమాణత్వమును ఉపదేశించిరి. అందువల్ల ఉపాసన కొరకు జీవుని అణుపరిమాణత్వ ఉపదేశములో విరోధము లేదు.

బుద్ధి గుణములననుసరించి ఆత్మలో సంసారిత్వమును కల్పనగావించిన ఈ జీవబుద్ధులకు వియోగము కలిగినచో ఆత్మలో సంసారిత్వము ఉండదు మరియు ఆత్మను గ్రహించుటకు వీలులేకపోవుటచే అదిశూన్యత్వమును పొందును. ఈ ప్రశ్నకు జవాబు ముందు సూత్రములో చెప్పుచున్నారు.

246. యావదాత్మభావిత్వాచ్చ న దోషస్తద్దర్శనాత్. (2.3.30.)

సూత్రార్థము:- ఆత్మజ్ఞానముద్వారా ఎంతవరకు బుద్ధిసంయోగము పోదో అంతవరకు బుద్ధిసంయోగము ఉండును. అందువల్ల చెప్పిన దోషము కలుగదు. దేహవియోగము కలిగిననూ బుద్ధిసంయోగము ఉండునని శ్రుతిలోచెప్పిరి. ఆ శ్రుతి "స సమానః సన్నుభౌ లోకావనుసంచరతి" అనగా ' ఆ ఆత్మ బుద్ధితో తాదాత్మ్యమునుపొంది ఇహపర లోకములలో సంచరించును' (బృ.4.3.7).

బుద్ధి వియోగముద్వారా చెప్పిన దోషము మామతములో లేదు. ఆత్మానుభవము కలుగువరకు బుద్ధిసంయోగము ఉండును. అనగా ఈ జీవునిలో తత్త్వదర్శనముద్వారా ఎంతవరకు సంసారధర్మము పోదో అంతవరకు బుద్ధిసంయోగము ఉండును నష్టముకాదు. బుద్ధియను ఉపాధి సంబన్ధమున్నంతవరకే జీవునిలో జీవత్వము

మరియు సంసారిత్వము ఉండును. పరమార్థ దృష్టిద్వారా నిత్యశుద్ధబుద్ధముక్త స్వరూపమైన జీవుని అస్తిత్వము కాని జీవుడను పదార్థముకాని బ్రహ్మకన్న భిన్నముగా నుండదు. "నాన్యోఽతోఽస్తి ద్రష్టా" (బృ.1.4.7) అనగా 'ఆ బ్రహ్మ కన్నభిన్నముగ చూచువాడులేదు', "తత్త్వమసి" (ఛాం.6.1.6.) అనగా 'నీవేబ్రహ్మము', "అహం బ్రహ్మాస్మి" (బృ.1.4.7.) అనగా 'నేనే బ్రహ్మము' ఈ శ్రుతులద్వారా ఆత్మానుభవము కలుగునంతవరకు బుద్ధిసంయోగము కలదని ఎట్లు తెలిసికొన గలుగుదుము? ఈ విధమైన సంశయము కలుగుట సరికాదు. ఎందులకనగా శ్రుతి ఈ విషయమునే చెప్పుచున్నది. "యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు హృద్యన్తర్జ్యోతిః స సమానః సన్నుభౌ లోకావనుసంచరతి" (బృ.4.3.7.) అనగా 'ఇచట విజ్ఞానమయమనగా బుద్ధిమయమని అర్థము. శరీరము పోయిననూ బుద్ధిసంయోగము పోదు. ఇంద్రియములలో విజ్ఞామయుడు హృదయమధ్యమున ప్రకాశస్వరూపుడై బుధ్ధ్యుపాధియందు ఏ పురుషుడు కలడో అతడు ఆ బుద్ధితోకూడి ఇహపరలోకములందు సంచరించును'.

సుషుప్తి ప్రళయములలో ఆత్మతో బుద్ధికి సంబన్ధమును స్వీకరిచుటలేదు ఎందులకనగా శ్రుతిలో "స్వమపీతో భవతి" (ఛాం.6.8.1.) అనగా 'సుషుప్తిలో జీవుడు తనలో లీనమగుచున్నడు' అనిరి. మరియు ప్రళయములో సంపూర్ణ జగత్తుయొక్క ప్రళయమును స్వీకరించిరి. ఈ సుషుప్తి ప్రళయమను రెండు అవస్థలలో ప్రపంచమే ఉండదు మరి ఆత్మ-బుద్ధుల సంబన్ధము ఎట్లు ఉండును. కనుక బుద్ధిసంయోగము ఆత్మానుభవము వరకు అని ఎట్లు చెప్పగలరు? ఈ సంశయమునకు సమాధానము అగ్రిమ సూత్రములో చెప్పుచున్నారు.

247. పుంస్త్వాదివత్త్వస్య సతోఽభివ్యక్తియోగాచ్చ. (2.3.31.)

సూత్రార్థము:- ఏ విధముగా బాల్యమునందు కానరాని పురుష లక్షణములు యౌవనమునందు మాత్రమే తెలియవచ్చును. ఆ విధముగనే సుషుప్తి అవస్థలో సూక్ష్మరూపములో నున్న బుద్ధిసంయోగము మరల జాగ్రదవస్థలో అభివ్యక్త మగును. అందువల్ల ఎంతవరకు ఆత్మయుండునో అంతవరకు బుద్ధిసంయోగము ఉండుననది విరుద్ధముకాదు.

ఏ విధముగా బాల్యమునందు వీర్యాది పురుషశక్తి ధర్మము బీజరూపములో నుండునో అవే యౌవనములో అభివ్యక్త మగుచున్నవి. అదేవిధముగా సషుప్తి ప్రళయములలో సూక్ష్మరూపములో బుద్ధిసంయోగముండును. అది జాగ్రదవస్థలో వ్యక్తమగును. అందువల్ల బుద్ధిసంయోగము ఆత్మానుభవమువరకు ఉండుననునది విరుద్ధముకాదు.

248. నిత్యోపలబ్ధ్యనుపలబ్ధిప్రసంగోఽన్యతరనియమోవాఽన్యథా. (2.3.32.)

సూత్రార్థము:- మనస్సును తప్పక అంగీకరించవలయును, మనస్సును స్వీకరించిచో అన్ని ఇంద్రియములు వాని వాని విషయముల సన్నిధిలో ఉన్న అన్ని విషయముల జ్ఞానము ఒకే సమయములో కలుగును ఎందులకనగా మనస్సు కన్న వేరు పదార్థము జ్ఞానము గ్రహించుటకు లేదు కనుక. మనస్సు ఉన్ననూ జ్ఞానము కలుగలేదనిన విషయముల జ్ఞానము ఎన్నటికీ కలుగదు. ఒకవిషయ గ్రహణము మరుయొక విషయ అగ్రహణము కోరువారికి

జ్ఞానసామాగ్రిలో ఆత్మ లేక మనస్సు యొక్క శక్తి ప్రతిబన్ధమును స్వీకరించవలసి వచ్చును. అది సంభవము కాదు ఎందులకనగా ధర్మశూన్యమైన ఆత్మలో శక్తిలేదు, ఇంద్రియములకూ శక్తిలేదు శక్తి లోపల గుహ్యమగుటవలన ఇంద్రియముల ధర్మము కాదు. అందువల్ల ధ్యానాదులలో ఇఛ్చను నియమించునది కలదని ఒప్పుకొనవలయును. ఇఛ్చ మనోధర్మము. కామము, సంకల్పము, ఇఛ్చ, శ్రద్ధ, అశ్రద్ధ, ఇవియన్నియూ అన్తఃకరణ ధర్మములని శ్రుతి చెప్పుచున్నది. మనస్సుద్వారానే ఆత్మలో అణుత్వ వ్యవహారము కలుగుచున్నది. అందువల్ల మనోపాధివలన అణుత్వముచెప్పిరేగాని వాస్తవములో ఆత్మయొక్క సర్వగతత్వశ్రుతికి విరోధము లేదు.

ఆత్మయొక్క ఉపాధి అన్తఃకరణము దీనినే మనోబుద్ధులనిగూడ అందురు, ఈ అన్తఃకరణము ఉన్నదనుటకు ప్రమాణమేమి మరియు దీనిద్వారా ఆత్మలో సంసారము ఉన్నదని చెప్పుటకు ప్రమాణమేమి? ఈ ప్రశ్నకు సమాధానముగా ఈ సూత్రమును చెప్పిరి. మనస్సును తప్పక స్వీకరించవలయును. ఆ మనస్సు లేనిచో జ్ఞానమునకు సాధనములగు ఆత్మ, ఇంద్రియములు మరియు విషయముల సన్నధిలో ఎల్లప్పుడు అన్ని విషయముల జ్ఞానప్రాప్తి కలుగవలయును. కారణమున్ననూ కార్యాభావము కలిగినచో సదా అప్రాప్తి ప్రసంగము వచ్చును.

లేనిచో ఆత్మ ఇంద్రియముల శక్తికి విఘ్నమును స్వీకరించవలయును. అచట ఆత్మ శక్తి ప్రతిబన్ధము సంభవముకాదు ఏలనన అది నిర్వికారము. ఆలాగుననే ఇంద్రియముల శక్తికి ఆటంకము చెప్పుట సరికాదు ఎందులకనగా అవిగూడ నిర్వికారములే మరియు వాని శక్తి ఆన్తరము అనగా లోపలనుండి వచ్చును. అందువలన ఆత్మ, ఇంద్రియములు మరియు విషయములు ఉన్ననూ ఒకేసారి అన్ని విషయముల జ్ఞానము కలుగకుండుట మనస్సు యొక్క సిద్ధికి ప్రమాణము. మరియు "ఆన్యత్ర- మనా అభూవమ్ నాదర్శమన్యత్రమనా భూవమ్ నాశ్రౌషమ్" అనగా 'నా మనస్సు ఎక్కడో నున్నది అందువలన చూడలేదు మరియు వినలేదు' (బృ.1.5.3.), "మనసా హ్యేవ పశ్యతి మనసా శృణోతి" అనగా 'పురుషుడు మనస్సతోనే చూచుచున్నాడు మనస్సుతోనే వినుచున్నాడు' (బృ.1.5.3.). ఈ శ్రుతులు మనస్సు యొక్క అస్థిత్వమునకు ప్రమాణములు. అందువలన మనస్సు కలదనియు అదియే జీవునికి ఉపాధియనియు దాని నాశ్రయిచింయే జీవునికి సంసారిత్వము మరియు అణుపరిమాణత్వము గమనాగమనములు ఉత్-క్రాన్తి చెప్పబడినవి అని సిద్ధమగుచూన్నది. గాన ఔపాధిక అణుత్వశ్రుతిద్వారా ఆత్మయొక్క పారమార్థిక వ్యాపకత్వము చెప్పు శ్రుతికి విరోధములేదు.

## 75. కర్త్రధికరణము.

సంగతి:- ఏ విధముగా జీవాత్మలో అణుత్వము ఔపాధికము మరియు స్వయంజ్యోతిష్ట్వాదువలే సర్వవ్యాపకత్వము పారమార్థికము అని చెప్పబడినదో ఆలాగుననే కర్తృత్వాది బుద్ధి ఉపాధి కారణమువలన జీవాత్మలో కల్పితము అని చెప్పుటకు మరియు ఆన్తరబహిర్భావ సంగతివలన ఈ అధికరణము ఆరంభమయినది.

విషయము:- జీవునిలో కర్తృత్వాకర్తృత్వములు ఈ అధికరణములో విచారణీయ విషయములు.

సంశయము:- జీవాత్మ కర్తయా లేక అకర్తయా అని సంశయము.

పూర్వపక్షము:- వికారము కలిగిన జీవుని బుద్ధిలో కర్తృత్వము సంభవము. మరి నిర్వికార జీవునిలో కర్తృత్వమును ఏల స్వీకరించవలయును అని సాంఖ్యుల కథనము.

సిద్ధాన్తము:- కరణము లేక సాధనమగుటవలన బుద్ధిని కర్తయనుట సరికాదు మరియు కర్తృత్వము లేనిచో శాస్త్రీయ యాగాదులు లేక లౌకిక వ్యాపారములు చేయ సాధ్యముకాదు. అందువల్ల జీవాత్మలో కర్తృత్వమును స్వీకరించుటయే ఉచితము.

వైయాసికన్యాయమాలా:

163. జీవోఽకర్తాఽథవా కర్తా ధియః కర్తృత్వసంభవాత్ | జీవకర్తృతయా కిం స్యాదిత్యాహుః సాంఖ్యమానినః ||

164. కరణత్వాన్న ధీః కర్త్రీ యాగశ్రవణలౌకికాః | వ్యాపారా న వినా కర్త్రాః తస్మాజ్జీవస్యకర్తృతా ||

జీవుడు అకర్తయా లేక కర్తయా? సాంఖ్యసిద్ధాన్తి చెప్పునదేమనగా బుద్ధిలో కర్తృత్వమును స్వీకరించిన కార్యములు జరుగును, మరల జీవుని కర్తగా ఎందుకు స్వీకరించువలయునని పూర్వపక్షము. దానికి సిద్ధాన్తి జవాబు. బుద్ధి కరణమగుటవలన కర్తగానేరదు మరియు యాగాది కర్మకాండము, వేదముల శ్రవణము మరియు లౌకికవ్యాపారము కర్త లేనిచో జరుగవు అందువల్ల జీవుని కర్తగా స్వీకరించవలయును.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

బుద్ధి పరిణామము గలదికనుక దానిలో కర్తృత్వముండగలదు, ఆత్మ అసంగము అందువల్ల దానిలో కర్తృత్వ సంభావనలేదు.

ఈ ప్రకారము చెప్పు సాంఖ్యవాదుల కథనము సరిగాదు. ఎందులకనగా కరణరూపములో నున్న బుద్ధిలో కర్తృశక్తియొక్క కల్పన యుక్తి యుక్తముకాదు. కరణ సాధనములుగా నున్న గొడ్డలి మొదలగువానిలో కర్తృత్వము చూడబడుటలేదు. బుద్ధిని కరణముగా స్వీకరించిన దానికై వేరొక కరణముయొక్క కల్పన చేయవలయును. అంతమాత్రమున కర్తయే లేడని చెప్పలేము.

ఎందులకనగా పూర్వకాండములోనున్న యాగాది వ్యాపారములు, ఉత్తరకాండములో నున్న శ్రవణాదుల వ్యాపారము మరియు లౌకిక కృష్యాది వ్యాపారములకు కర్తయొక్క ఆవశ్యకము కలదు గాన జీవుడు కర్తయని స్వీకరించవలయును.

249. కర్తా శాస్త్రార్థవత్వాత్. (2.3.33.)

సూత్రార్థము:- ఆత్మయే కర్త బుద్ధి కాదు. ఎందులకనగా కర్తనపేక్షించి చెప్పు ఉపాయములను బోధించుచూ విధిశాస్త్రములు సార్థకములగుచున్నవి. బుద్ధి కర్త్రి (కర్తృ శబ్దమునకు స్త్రీలింగ వాచకము కర్త్రి శబ్దము) అయిన ఫలము ననుభవించువాడు ఆత్మయనిన విధి శాస్త్రము నిరర్థకమగును. విధిని మాత్రము బుద్ధిని గూర్చియు ఫలమును మాత్రము జీవుని గూర్చియు ఉపదేశించిన ఒకడు చేసినపనికి మరియొకడు ఫలము ననుభవించు ననుట యుక్తిశూన్యము కదా. అందువలన బుద్ధి కర్త్రి గాదు ఆత్మయే కర్త.

ఇచట జీవునిలో కర్తృత్వము పారమార్థికమని చెప్పుటవలన శ్రుతులలో విరోధము కలదనును పూర్వపక్షి. సిద్ధాన్తి జీవకర్తృత్వము అపారమార్థిక మగుటవలన శ్రుతులలో విరోధము లేదనును. బుద్ధి కర్త్రి (కార్యములను ఆచరించునది) లేక జీవుడు కర్తయా అని సంశయమునకు వికారి అగుటవలన బుద్ధియే కర్త్రి అనును పూర్వవాది. సిద్ధాన్తములో శాస్త్రములో చెప్పుటవలన జీవుడే కర్తయని అందురు. "యజేత" "జుహుయాత్" "దద్యాత్" అనగా 'యాగము చేయవలయును' 'హోమము చేయవలయును' 'దానమియ్యవలయును' ఈ శాస్త్ర వాక్యములు కర్తనపేక్షించి యాగాదుల విధానము చేయుచున్నది. ఈయాగాదులను విధించు శాస్త్రము యొక్క సార్థకత ఆత్మలో కర్తృత్వమును స్వీకరించిననే సిద్ధమగును. బుద్ధిలో కర్తృత్వమును మరియు జీవాత్మలో భోక్తృత్వమును స్వీకరించిన యాగాదులను విధించుశాస్త్రము అనర్థకమగును. కావున అచేతనమైన బుద్ధిలో కర్తృత్వము లేదు జీవునిలోనే కర్తృత్వమున్నది ఎందుకనగా "శాస్త్రఫలం ప్రయోక్తరి" అనగా 'విధిజన్య ఫలము అనుష్టానకర్తకే కలుగును' అని జైమిని వాక్యము.

### 250. విహారోపదేశాత్. (2.3.34.)

సూత్రార్థము:- "స్వే శరీరే యథాకామం పరివర్తతే" అనగా 'తన శరీరములో ఇచ్చానుసారము విహారము చేయును'. (బృ.2.1.18). ఈ ప్రకారము జీవుని ప్రకరణములో స్వప్నావస్థయందు ఆత్మయొక్క సంచారము ఉపదేశించిరి. కర్తగాని వానిలో సంచారముండజాలదు. అందువల్ల ఆత్మయే కర్త.

జీవుని ప్రకరణములో 'తన శరీరము లోపల నిద్రించుచూ స్వప్నములో ఇచ్చానుసారము పరిభ్రమణము చేయుచుండును' అని శ్రుతిలో విహారణరూపసంచరణము చెప్పుటవలన గూడ జీవుడే కర్త. కర్తగాని వానిలో సంచరణము చెప్పుట యుక్తిసంగతముకాదు.

### 251. ఉపాదానాత్. (2.3.35.)

సూత్రార్థము:- జీవుని ప్రకరణములో " తదేషాం ప్రాణానాం విజ్ఞానేన విజ్ఞానమాదాయ" అనగా ' స్వప్నావస్థలో వాగాది ఇంద్రియముల శక్తిని బుద్ధితో గ్రహించి' (బృ.2.1.17) అని శ్రుతిలో చెప్పిరి. ఈ విధముగా ఆత్మకు ఇంద్రియముల శక్తి గ్రహణము చెప్పిరి. కర్తగాని వాడు గ్రహించలేడు. అందువల్ల ఆత్మయే కర్తయని సిద్ధమగుచున్నది.

"స్వప్నావస్థలో వాగాది ఇంద్రియముల సామర్థ్యమును అతఃకరణముద్వారా గ్రహించి హృదయములోనున్న ఆత్మలో నిదురించును" ఈ జీవప్రకరణములోనున్న శ్రుతిద్వారా ఇంద్రియముల ఉపాదానము లేక ఆత్మయొక్క గ్రహణ శక్తి వినబడుచున్నది కావున జీవునిలోనే కర్తృత్వము సిద్ధము.

### 252. వ్యపదేశాచ్చ క్రియాయాం న చేన్నిర్దేశవిపర్యయః స్యాత్. (2.3.36.)

సూత్రార్థము:- "విజ్ఞానం యజ్ఞం తనుతే కర్మాణి తనుతేఽపి చ" (తై.2.5.1.) అనగా 'ఇచట విజ్ఞాన శబ్దముతో జీవాత్మని చెప్పు చున్నారు. ఆ జీవుడు వైదిక కర్మలను లౌకిక కర్మలను గూడ ఆచరించుచున్నాడు'. ఇచట

విజ్ఞానమనగా బుద్ధియనుట సరికాదు. విజ్ఞాన శబ్దముద్వారా బుద్ధిని చెప్పదలచిన "తదేషాం ప్రణానాం విజ్ఞానేన విజ్ఞానమాదాయ" (బృ. 2.1.17) అను మొదలగు వాక్యములందువలే కరణవాచకమగు తృతీయావిభక్తియే (విజ్ఞానేన) ప్రయోగించవలయును. పైన చెప్పిన తైత్తిరీయ వాక్యములో ఆ విభక్తి లేనందువలన జీవాత్మయే కర్తయని అర్థము.

"విజ్ఞానం యజ్ఞం తనుతే" అనగా 'జీవాత్మ వైదికయాగాదులను చేయుచున్నాడు' ఈ విధముగా వైదిక కర్మలన్నింటకీ మరియు లౌకిక కర్మలన్నింటికీ విజ్ఞానశబ్దవాచ్యమైన జీవాత్మను కర్తగా చెప్పిరి కాని బుద్ధిని కాదు. విజ్ఞానశబ్దమునకు అర్థము బుద్ధిని ఎందుకుచెప్పుచున్నారు జీవాత్మని ఎందుకు చెప్పుటలేదు అను ప్రశ్న సరికాదు. అట్లు చెప్పిన విపరీతమైన అర్థము వచ్చును. ఎటులనగా 'విజ్ఞానమ్' అను ప్రథమా విభక్తి స్థానములో 'విజ్ఞానేన' అని తృతీయా విభక్తి నిర్దేశము కావించి యుండవలయును. ఆవిధముగనే బృహదారణ్యకములో బుద్ధి అర్థము చెప్పదలచినచోట విజ్ఞాన శబ్దములో 'విజ్ఞానేన' అని (కరణవాచకమగు) తృతీయా విభక్తిని చెప్పిరి. "తదేషాం ప్రాణానాం విజ్ఞానేన విజ్ఞానమదాయ" (బృ.2.1.17) అనగా 'స్వప్నావస్థలో వాగాది ఇంద్రియముల శక్తిని బుద్ధితో గ్రహించి' బుద్ధితో అని తృతీయా విభక్తి చెప్పిరి. "విజ్ఞానం యజ్ఞం తనుతే" అనగా జీవాత్మ వైదిక కర్మలను చేయుచున్నాడు అని కర్తతో సమానాధికరణ లేక సమాన విభక్తి నిర్దేశము గావించిరి. అందువల్ల బుద్ధికన్న వ్యతిరిక్తమైన జీవాత్మలో కర్తృత్వమును చెప్పిరి. జీవుడు స్వతంత్ర కర్త యనిన తనకు అభీష్టమైనవి హితమైన కర్మలు మాత్రమే చేయును కాని విపరీతముగా గూడ ప్రవర్తించుట చూడబడుచున్నది. ఈవిధమైన విపరీత ప్రవర్తన జీవునిలో సరికాదు అనిన ప్రశ్నకు ముందు సూత్రముద్వారా జవాబు చెప్పుచున్నారు.

253. ఉపలబ్ధివదనియమః. (2.3.37.)

సూత్రార్థము:- ఏవిధముగా గ్రహించుటలో స్వతంత్రమైననూ జీవాత్మ ఇష్టానిష్టములను పొందును. ఇష్టానిష్టములను పొందుటలో నియమము లేదు.

ఈ జీవాత్మజ్ఞానమును పొందుటలో స్వతంత్రమయిననూ నియమము లేకయే భ్రాన్తివలన ఇష్టానిష్ట కర్మలు మరియు వాని ఫలములను పొందును. ఆలాగుననే నియమము లేకయే హితాహిత కర్మలను ఈ జీవుడు సంపాదించును. జీవాత్మ ఏ వస్తువునైననూ తెలిసికొనుటకు ఇంద్రియముల సహాయమును గైకొనును అనిన విషయమును గ్రహించుటలో ఇంద్రియముల అపేక్ష ఉండుటవలన జీవునిలో అస్వాతంత్రము లేక పరతంత్రము వచ్చునుగదా? అట్లనుట సరికాదు ఎందులకనగా వంటచెఱుకు, జలము, బియ్యము,పాత్రలు, పొయ్యి మొదలగువాని అపేక్ష ఉండినను వంటచేయుటలో వంటవాని స్వతంత్రత చూడబడుచున్నది. స్వతంత్రుడైనను జీవుడు ఇష్టసాధనమను భ్రాన్తితో అనిష్టసాధనమును అనుష్టించును. అందువల్ల అనియమ ప్రవృత్తి మరియు స్వాతంత్రము ఈ రెండు అవిరద్ధములు.

254. శక్తివిపర్యయాత్. (2.3.38.)

సూత్రార్థము:- బుద్ధిని కర్త్రి అని స్వీకరించిన దానిలో సాధనముగా నుండు సామర్థ్యము నష్టమగును అందువల్ల ఆత్మయే కర్తయని సిద్ధమగుచున్నది. కాని బుద్ధిని కర్త్రి అని స్వీకరించిన అన్య కరణమును స్వీకరించవలయును అపుడు నామమాత్రమునందే వివాదముగాని పదార్థమునందుకాదు అనగా కరణ సాధనములో కర్తృత్వ ప్రయేగము జరుగును.

జీవుడే కర్తగాని బుద్ధి కాదు. ఎందులకనగా బుద్ధిని కర్తగా స్వీకరించిన దానిలో కరణశక్తి పోయి కర్తృ శక్తి వచ్చును. అపుడు వేరొకకరణమును కల్పన చేయవలసివచ్చును. అటుల కల్పనగావించిన నామ మాత్రములో భేదమేగాని వస్తువులో భిన్నముండదు. పూర్వవాదివయిన నీవుగూడ కరణమునకన్న భిన్నముగనే కర్తను స్వీకరించవలసి వచ్చును. బుద్ధి అచేతనమగుటవలన జీవుడే కర్తయనునది సిద్ధము.
మరియు ఆత్మతత్వ సాక్షాత్కారమునకు నిదిధ్యాసన విధి జీవునిలో కర్తృత్వము లేనిచో సంభవించదు గాన జీవునిలో కర్తృత్వమును స్వీకరించవలయును. వేదాన్తవాక్యముద్వారా తదనుకూల యుక్తులద్వారా పరమేశ్వరుని సర్వాత్మకునిగా తెలిసికొని వానియందు చిత్తమునిలుపుటయే శ్రవణమననముల ప్రయోజనము ఇతర సంకల్పములను విడిచి పరమేశ్వరుని గూర్చియే భావించుట నిదిధ్యాసనమందురు. ఈ నిదిధ్యాసన ద్వారా కలుగు చిత్తలయమును సమాధి అందురు.

255. సమాధ్యభావాచ్చ. (2.3.36.)

సూత్రార్థము:- ఆత్మని కర్తగా స్వీకరించనిచో "ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యః మన్తవ్యో నిదిధ్యాసితవ్యః" (బృ.2.4.5.) దీని అర్థము 'ఆత్మస్వరూపమును గూర్చి వినవలయును, విచారము చేయవలయును తరువాత తత్పరుడై అన్య విషయములందు మనస్సును పోనీక ధ్యానించవలయును. పిదప ఆ పరమేశ్వరునియందే మనస్సు లయముచేసి స్వస్వరూపముతో నిలవవలయును'. ఇది జీవునిలో కర్తృత్వము లేనిచో సంభవించదు.

ఆత్మలో కర్తృత్వమును స్వీకరించనిచో ' ఓ మైత్రేయి !ఆత్మ దర్శన యోగ్యము దాని శ్రవణ మనన నిదిధ్యాసనములు చేయవలయును' అను శ్రుతి వాక్యములు ఎవరి ప్రయోజనమునకు విధించబడినవి? ఈ ఔపనిషదాత్మజ్ఞానమును చెప్పుచూ "ఓమిత్యేవం ధ్యాయత" (ముం. 2.2.6.) ' ఆ ఆత్మకు ఓంకారమును ఆలంబనముగా స్వీకరించి ధ్యానించవలయును' అని విధించిన వాక్యముల ఫలితము ఎవరికి చెందును? కనుక జీవునికి విధిజన్యఫలితము కలుగును గాన వానినే కర్తగా స్వీకరించవలయును. వానిని కర్తగా స్వీకరించనిచో సమాధి అభావ ప్రసంగము వచ్చును.

## 76. తక్షాధికరణము.

సంగతి:- పూర్వధికరణములో శాస్త్రార్థము యొక్క సిద్ధి కొరకు జీవునిలో కర్తృత్వమును చెప్పిరి. ఆ కర్తృత్వము ఆత్మలో కల్పితము. ఈవిషయమును చెప్పుటకు ఉపజీవ్య ఉపజీవక సంగతి ద్వారా ఈ అధికరణమును ప్రారంభించిరి.

విషయము:- జీవునిలో కర్తృత్వము స్వాభావికమా లేక ఔపాధికమా అను విషయమును ఇచట విచారించెదరు.
సంశయము:- జీవాత్మలో కర్తృత్వము పారమార్థకమా లేక కల్పితమా?
పూర్వపక్షము:- 'యజేత' అని చెప్పు శాస్త్రసిద్ధ కర్తత్వమునకు బాధ లేకుండుటవలన జీవునిలోకర్తృత్వము పారమార్థికము.
సిద్ధాన్తము:- జీవాత్మ అసంగుడని శ్రుతి చెప్పుచున్నది. ఈ శ్రుతి వాక్యముద్వారా జీవునిలో కర్తృత్వము భాధిత మగుచున్నది. స్పటకమణి సమీపమున ఎర్రపువ్వును ఉంచినచో స్పటికము ఎర్రగా కనిపించునటుల ఆత్మలో కర్తృత్వము కల్పితము. బుద్ధి ఇంద్రియములను ఉపాధుల సన్నధివలన జీవాత్మలో కర్తృత్వము ఔపాధికము.
వైయాసికన్యాయమాలా:-
165. కర్తృత్వం వాస్తవం కిం వాకల్పితమ్? వాస్తవం భవేత్ |యజేతేత్యాదిశాస్త్రేణ సిద్ధస్యాబాధితత్వతః ||
166. అసఙ్గో హీతి తద్బాధాత్స్పటికే రక్తతేవ తత్ |అధ్యస్తం ధీచక్షురాదికరణోపాధిసంనిధేః ||
ఆత్మలో చెప్పిన కర్తృత్వము సత్యమా లేక కల్పితమా? 'యజేత' అను శాస్త్రముద్వారా కర్తృత్వము సిద్ధమగుటవలన మరియు అబాధితమగుటవలనను వాస్తవికమనును పూర్వవాది. అపుడు సిద్ధాన్తి చెప్పునది. 'అసఙ్గో హి' అను శాస్త్రముద్వారా కర్తృత్వము బాధితమగుటవలన స్పటికములో కనిపించు ఎర్రరంగువలే బుద్ధి ఇంద్రియముల ఉపాధిసన్నిధివలన కర్తృత్వము ఆత్మలో అధ్యస్థమేగాని సత్యము కాదు.
భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-
పూర్వాధికరణములో సిద్ధమైన కర్తృత్వము ఆత్మలో వాస్తవికమేగాన కల్పితముగాదనును పూర్వపక్షి. దానికి సిద్ధాన్తి చెప్పునది. "అసఙ్గో హ్యయం పురుషః" (బృ.4.3.16) అనగా 'జీవుడు అసంగుడు' అని శ్రుతి చెప్పుటవలన ఆత్మలో కర్తృత్వ ధర్మము యొక్క సంబన్ధము బాధితమగుచున్నది. ఏ విధముగా ఎర్రమందారపువ్వు సన్నిధిలో స్పటికమణిలో ఎర్రదనము అధ్యసించబడినదో ఆలాగుననే అన్తఃకరణముయొక్క సన్నిధిలో ఆత్మలో కర్తృత్వము అధ్యస్తము వాస్తవికము కాదు.

## 256. యథా చ తక్షోభయథా. (2.3.40.)

సూత్రార్థము:- ఎవిధముగా లోకములో వడ్రంగి ఉలి మొదలగు సాధనములను గైకొని పనిచేయునపుడు కర్తగానుండి మిక్కిలి శ్రమ నొందుచున్నాడు. ఆ సాధనములను వదిలి గృహములో నున్నప్పుడు అకర్తగానుండి సుఖము ననుభవించుచున్నాడు. ఆ విధముగనే ఆత్మ బుధ్యాది సాధనములను గైకొని కర్త మరియు సంసారి అగుచున్నాడు. ఆసాధనముల అపేక్ష లేనపుడు స్వాభావికముగా అకర్తయై పరమానందమును అనుభవించుచున్నాడు. విధి శాస్త్రము కర్తృత్వము లేనిచో సిద్ధించదు గాన కర్తృత్వమును ప్రతిపాదించుచున్నదే గాని ఆకర్తృత్వము స్వాభావికమని నిరూపించుటలేదు. అందువల్ల ఆత్మలో కర్తృత్వము అజ్ఞానమువల్ల కల్పితమేగాని స్వాభావికము కాదు.

ఇచట జీవ-బ్రహ్మల అభేదము అసిద్ధము ఎందులకనగా కర్తృత్వము ఆరోపింపబడలేదనును పూర్వపక్షి. సిద్ధాన్తి కర్తృత్వము అధ్యస్తముగాన జీవ-బ్రహ్మల ఏకత్వమును చెప్పు శ్రుతులలో విరోధములేదనును. "ధ్యాయతీవ లేలాయతీవ" (బృ.4.3.7.) "అసఙ్గో హ్యయం పురుషః" (బృ.4.3.16.) అనగా 'జీవాత్మ ధ్యానము చేయుచున్నవానివలే నున్నాడు మరియు చలనక్రియ చేయువాని వలే నున్నాడు', 'ఈ పురుషుడు అసంగుడు' అని చెప్పు శ్రుతులలో పురుషుని అసంగత్వమును చెప్పిరి. ఈ శ్రుతులకు యాగాది కర్తృత్వమును చెప్పు శ్రుతులతో విరోధము కలదా లేదా? అని సంశయము.

సామాన్య శాస్త్రమును చెప్పు వాక్యములకు విశేషమును చెప్పు వాక్యములకు గల పరస్పర విరోధమును చాలసార్లు పరిహరించిరి. కాని ఇచట అపవాదమునకు కారణములేదు. పూర్వాధికరణములో శాస్త్రార్థవత్త్వాది హేతువులద్వారా కర్తృత్వము స్వాభావికమని చెప్పిరి. కనుక కర్తృత్వమును చెప్పు శాస్త్రవాక్యములకు అసంగత్వమును చెప్పు వాక్యములకు విరోధము కలదనును పూర్వవాది. సిద్ధాన్తి జవాబు. అగ్నిలో గల ఉష్ణత్వమువలే ఆత్మలో స్వాభావిక కర్తృత్వమును స్వీకరించిన మొక్షాభావ ప్రసంగము వచ్చును. అందువలన ఉపాధివలన వచ్చిన కల్పిత ఔపాధిక కర్తృత్వమును స్వీకరించుటయే ఉచితము. ఏ విధముగా వడ్రంగి ఉలి మొదలగు పనిముట్లు తీసుకొని కలపతో అనేక వస్తువులను చేయునపుడు మిక్కిలి దుఃఖము ననుభవించును. కాని అపనిముట్లను వదిలివేసి తన గృహమునకుపొయి వ్యాపార రహితుడై సుఖముననుభవించును. ఆవిధముగనే అవిద్యా కార్యములగు బుధ్యాది ఉపాధులతో సంబంన్ధమును కల్పించుకొని ఈ ఆత్మ స్వప్న-జాగ్రదవస్థలలో కార్యములను చేయుచూ దుఃఖముననుభవించు చున్నాడు. ఆతడే సుషుప్త్యవస్థలో ఉపాధులు లేకుండుటచే స్వాభావికముగా అకర్తయై సుఖముననుభవించుచున్నాడు. అందువల్ల కల్పిత వ్యావహారికమునుద్దేశించి చెప్పిన కర్తృత్వముద్వారా విధిశాస్త్రములో యాగ, హోమ, దానాదులు విశేష కర్తవ్యముగా ఉపదేశించిరి. విధి శాస్త్రము స్వాభావిక కర్తృత్వమును చెప్పుటలేదు. గనుక విధిశాస్త్రముతో అసంగత్వ శ్రుతికి విరోధములేదు.

## 77. పరాయత్తాధికరణము.

సంగతి:- పూర్వధికరణములో జీవాత్మలో ఔపాధిక కర్తృత్వమును చెప్పిరి. ఇపుడు ఆ జీవాత్మకర్తృత్వము ఈశ్వరాధీనమని చెప్పుటకు ఉపజీవ్య-ఉపజీవక సంగతి ద్వారా ఈ అధికరణమును చెప్పు చున్నారు.
విషయము:- జీవాత్మలో నున్న కర్తృత్వము వానిలో గల రాగాదులవలననా లేక ఈశ్వరాధీనమా అని విచారించెదరు.

సంశయము:- జీవునిలోగల కర్తృత్వము యొక్క పవృత్తి వానిలో గల రాగాదులవలననా లేక ఈశ్వర ప్రేరకమా?
పూర్వపక్షము:- వ్యవసాయాదులగు లౌకిక కర్మలలో వ్యవసాయదారుని ప్రవృత్తి రాగాదులవలన అని చూడబడుచున్నది. కాని ఈశ్వరుడు ప్రేరకుడనిన వానిలో వైషమ్య దోషము వచ్చును. కనుక జీవునిలో ప్రవృత్తి వాని మనసులోగల రాగాదులవలననే గాని ఈశ్వరునివలన గాదు.

సిద్ధాన్తము:- పంటల ఉత్పత్తిలో ఏ విధముగా వర్షము సామాన్య ప్రయోజకమో ఆలాగుననే కర్మలో జీవాత్మయొక్క సామాన్య ప్రేరకుడు ఈశ్వరుడు. అందువల్ల ఈశ్వరునిలో వైషమ్య దోషము రాదు. జీవుని విశేష ప్రేరకము రాగాదులైననూ అవి ఈశ్వరాధీనములే. అందువల్ల జీవాత్మప్రవృత్తి ఈశ్వరుని వలననే కలుగును.

వైయాసికన్యాయమాలా:-

167. ప్రవర్తకోఽస్య రాగాదిరీశో వా, రాగతః కృషౌ | దృష్టా ప్రవృత్తిర్వైషమ్యమీశస్య ప్రేరణే భవేత్ ||

168. సస్యేషు వృష్టివజ్జీవేష్వీశస్యావిషమతః |రాగోఽన్తర్యామ్యధీనోఽత ఈశ్వరోఽస్య ప్రవర్తకః ||

జీవుని ప్రవర్తకము రాగాదులా లేక ఈశ్వరుడా? వ్యవసాయాదులలో ప్రవృత్తి రాగాదులవలన అని చూడబడుచున్నది. ఈశ్వరుని ప్రవర్తకమనిన ఆ ఈశ్వరునిలో వైషమ్యదోషము వచ్చును. అందువల్ల జీవుని ప్రవర్తకములు రాగ ద్వేషాదులే కాని ఈశ్వరుడు కాదనును పూర్వపక్షి. సిద్ధాన్త జవాబు. ఏ విధముగా పంటలకు వర్షమువలే జీవులకు ఈశ్వరుడు ప్రేరకుడైననూ వానిలో విషమతలేదు. రాగాదులు అన్తర్యామి ఈశ్వరాధీనములు కనుక జీవుని ప్రవర్తకుడు ఈశ్వరుడే.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

లోకములో రాగ-ద్వేషాదులు వ్యవసాయదారుని ప్రేరకములని తెలియుచున్నది. ఆ రాగ-ద్వేషాదులే జీవుని ధర్మాధర్మముల ఆచరణకు ప్రేరకములని స్వీకరించవలయును. ఈశ్వరుని ప్రేరకమనిన ఆ ఈశ్వరుడు కొందరిని ధర్మమార్గములో ప్రవర్తింపజేయుచున్నాడు మరి కొంతమందిని అధర్మమార్గములో ప్రవర్తింపజేయుచున్నాడు కనుక ఆ ఈశ్వరునిలో విషమత నివారణముకాదు. కనుక ఈశ్వరుడు ప్రవర్తకుడు కాదని తెలియుచున్నది. ఈ విధముగా చెప్పిన పూర్వపక్షమునకు సిద్ధాన్తి సమాధానము. ఈశ్వరునిలో విషమతా దోషమురాదు ఎందులకనగా ఆతడు వర్షమువలే అందరికీ సాధారణ నిమిత్త కారకుడు.

అనగా ఏ విధముగా వర్షము అన్ని రకముల పంటలకు సాధారణ నిమిత్తమైనను ధాన్యాదులలో గల విషమత బీజములోగల నిమిత్తమే ఆలాగుననే అన్ని జీవుల ప్రవృత్తికి ఈశ్వరుడు సాధారణ నిమిత్తము. ఈశ్వరుడు ' యథా యోగ్యము జీవుని ప్రవృత్తి అగుగాక' అను అనుజ్ఞనిచ్చుటవలన సాధారణ ప్రవర్తకుడు. కాని ఈశ్వరుడు జీవప్రవృత్తికి అసాధారణ కారణమని స్వీకరించినను వానిలో విషమత ప్రాప్తముకాదు ఎందులకనగా జీవుడు పూర్వము చేసిన కర్మలు మరియు ఆర్జించిన వాసనలు విషమతకు కారణము. కర్మ ఫలమునకు కారణము అన్య కర్మలకు హేతువుకాదు అనిన అది సరికాదు. ఎందులకనగా సుఖ-దుఃఖాదుల ఫలమునిచ్చుటకు జీవుని ప్రేరేపించుచు కర్మ అన్యకర్మలను ఉత్పన్నము జేయును గాన అన్యకర్మలకు జీవుని కారణత్వము అనివార్యము. జీవునిలోగాల వాసనలు కర్మలకు కారణము గాన ఈశ్వరునిలో వైషమ్యము ఎట్లు కలుగును? రాగాదులను ప్రవృత్తికి కారణమని ఇచ్చిన దృష్టాన్తము అటులనే ఉండనిమ్ము. దానివల్ల ఈశ్వరును ప్రవృత్తికి హానిలేదు ఏలనన సర్వాన్తరయామీ ఈశ్వరునిద్వారా రాగమునకుగూడ నియమనము జరుగును. కనుక ఈశ్వరుడు జీవుని హేతుకర్తా అనగా ప్రవృత్తి చేయించువాడు.

257. పరాత్తు తచ్ఛ్రుతేః. (2.3.41.)

సూత్రార్ధము:- జీవునిలో కర్తృత్వాదులు స్వతంత్రములు కావు. కాని కర్మాధ్యక్షుడయిన పరమాత్మ ఆజ్ఞద్వారా అజ్ఞాని జీవునిలో కర్తృత్వాది సంసార సిద్ధి కలుగుచున్నది. పరమాత్మయొక్క అనుగ్రహము కలిగిన జ్ఞానముద్వారా మొక్షసిద్ధి కలుగుచున్నది. "ఏష హ్యేవ సాధు కర్మ కారయతి" (కౌ. 3.8.) అనగా 'ఏ జీవుని ఈలోకమునుండి ఊర్ధ్వగతిని పొందింపదలచునో వానిచేత ఈ పరమేశ్వరుడు మంచికార్యములు చేయించును'. ఇత్యాది శ్రుతులద్వారా జీవుని కర్తృత్వము ఈశ్వరాధీనమని చెప్పబడినది.

ఇచట జీవుని కర్తృత్వము రాగాదులవలన అని పూర్వపక్షిమతము. జీవకర్తృత్వము పరమేశ్వరాధీనమని సిద్ధాన్తి కథనము. "ఏష హ్యేవ సాధుకర్మ కారయతి తం, యమేభ్యో లోకేభ్యో ఉన్నినీషతే" (కౌ.3.8.) అనగా 'ఈలోకమునుండి పైలోకములకు పంపదలచిన వ్యక్తిద్వారా ఈశ్వరుడు మంచికర్మలు చేయించును, ఎవ్వని అధోలోకములకు పంపదలచునో వానిచే అశుభకర్మలు చేయించును'. ఈ శ్రుతిద్వారా విధి-ప్రతిషేధ శ్రుతికి విరోధము కలదా లేదా అను సంశయమునకు పూర్వావాది చెప్పునది. రాగద్వేషదులద్వారా ప్రేరేపించబడి సాధనములన్నియూ సంపాదించి జీవుడు స్వయముగనే కర్తృత్వమును అనుభవించును కాన ఈశ్వరుడు ఏమి చేయును? అందువల్ల కర్తృత్వమును చెప్పు విధి-ప్రతిషేదశ్రుతులతో ముందుచెప్పిన కౌ. 3.8.శ్రుతికి విరోధము స్పష్టము. దీనికి సిద్ధాన్త సమాధానము. సూత్రములో వచ్చిన 'తు' శబ్దము ద్వారా పూర్వవాది ప్రశ్నను నిరాకారించిరి. ఏ జీవునిలో కార్య-కరణ సంఘాతమును (శరీరమును) తన ఆత్మస్వరూపముకన్న భిన్నముగా చూచు వివేకము లేదో మరియు అజ్ఞానమువలన శరీరాదులనే ఆత్మయని భావించునో అటువంటి జీవునికి స్వతంత్ర కర్తృత్వము యొక్క సిద్ధిలేదు కాని సంపూర్ణ భూతములలో సర్వాత్మరూపముగా నున్న కర్మాధ్యక్షుడయిన సాక్షిరూపమయిన పరమేశ్వరుని ద్వారా కర్తృత్వలక్షణమయిన సంసార గతి కలుగుచున్నది. కాని ఆ పరమేశ్వరుని కృపవలన ఆత్మ సాక్షాత్కారముకలిగి మొక్షమును పొందును. 'ఈశ్వరుడు వానిచే మంచికర్మలు చేయించును' అను శ్రుతిలో పరమేశ్వరుడు హేతుకర్త (జీవునిద్వారా కర్మలు చేయించువాడు) రూపముగా వినబడు చున్నది. రాగాదులు ద్వారా మరియు సర్వసాధన సంపన్న జీవుని శుభాశుభకర్మల ప్రవృత్తికి పరమేశ్వరుడే ప్రేరకుడు.

ఈశ్వరుడు కర్మలప్రేరకుడనిన వానిలో వైషమ్యము మరియు నిష్ఠురతా అను దోషములు వచ్చును. మరియు కర్మలు చేయకనే వాని ఫలము ననుభ వించవలయుననెడి అకృతాభ్యగమమను దోషముగూడ వచ్చును. ఈప్రశ్నలకు జవాబు ముందు సూత్రముద్వారా చెప్పుచున్నారు.

258. కృతప్రయత్నాపేక్షస్తు విహితప్రతిషిద్ధావైయర్థ్యాదిభ్యః. (2.3.42.)

సూత్రార్ధము:- జీవుడు అనుష్టించు ధర్మాదర్మముల ననుసరించియే ఈశ్వరుడు అన్య జన్మలలో ధర్మములను అనిష్టింపజేయును తదనుసారము సుఖాది ఫలములనిచ్చును. అందువల్ల ఈశ్వరునిలో వైషమ్యము మరియు అకారుణ్యరూపదోషము రాదు. సంసారము అనాది అగుటవలన పూర్వజన్మలో చేసిన ధర్మాదర్మముల అపేక్ష ఉచితమే. ఈశ్వరునికి ధర్మాధర్మముల అపేక్ష ఎందుకు అనిన జీవుడు చేసినకర్మలనపేక్షించి ఈశ్వరుడు

ఫలమునిచ్చును. వేదములో "జ్యోతిష్టోమేన యజేత" "బ్రాహ్మణో న హన్తవ్యః" అనగా 'జ్యోతిష్టోమ యాగము చేయవలయును', 'బ్రాహ్మణుని చంపరాదు' ఇటువంటి విధి-నిషేధ కర్మలు సార్థకమగుటకు ఈశ్వరుడు కర్మలనపేక్షించును. ఈశ్వరుడు కర్మ లనపేక్షించనిచో విధి-నిషేధ శాస్త్రము అనర్థకమగును. ఈ విధముగా జీవుని కర్తృత్వము ఈశ్వరాధీనము అందులకే ఆ ఈశ్వరుడే జీవునిచే మంచి కర్మలు చేయుంచుననిరి.

సూత్రములో వచ్చిన 'తు' శబ్దము పూర్వపక్ష మతము నిరాకరించుటకు. జీవుని ద్వారా ఆచరించిన ధర్మాది ప్రయత్నములనపేక్షించి పరమేశ్వరుడు మరల వానిచే ధర్మాధర్మాది కర్మలను చేయించును తదనుసారము వానికి సుఖదుఃఖాది ఫలములను వర్షమువలేనిచ్చును. ఏవిధముగా భూమిలో అనేకరకముల వృక్షములు గలవు వాని ఉత్పత్తికి వర్షము కారణము అయినను వృక్షములలోగల ఫల రసాదుల భిన్నతకు కారణము వర్షము కాదు కాని వాని బీజములలో గల అసాధారణ ధర్మము రసాదుల వ్యత్యాసమునకు కారణము. ఈ విధముగనే పూర్వ పూర్వము ఆచరించిన ధర్మాధర్మముల వాసనలననుసరించి ఉత్తరోత్తర శుభాశుభ ప్రవృత్తిలో ఈశ్వరుడు మేఘమువలే సామాన్య కారణమయినను వారి వారి వాసనలే అసాధారణకారణములు కర్మల నాచరించుటకు. ఈ స్థితిలో ఈశ్వరునిలో రాగద్వేషములను విషమత మరియు నిర్దయత్వము (నిర్ఘృణతా) అను దోషముల ప్రసక్తియే లేదు. జీవుని కర్తృత్వమును ఈశ్వరాధీనమని చెప్పుచు ఆ ఈశ్వరుడు జీవుని శుభాశుభ కర్మల అపేక్షననుసరించి జీవునిద్వారా కర్మలను చేయించునని ఎట్లు చెప్పుచున్నావు? ఈశ్వరుడు జీవుని శుభాశుభకర్మల ప్రవృత్తికొరకు జీవుని ప్రయత్నములనపేక్షించిన ఆ ఈశ్వరుడు పరతంత్రుడగు చున్నాడుగదా? అపుడు జీవుని కర్మల నాచరింపజేయుటలో ఈశ్వరుడు స్వతంత్రుడు కాదు కాదా. అట్లనుట సరికాదు. జీవుని కర్మకర్తృత్వమును గూడ పరమేశ్వరుడే గావించుచున్నాడు అని స్వీకరించిన ఏ విధమైన దోషము ఉండదు. ఈ సమయములో జీవుని పూర్వమాచరించిన పయత్నానుసారము ఈశ్వరుడు జీవునిచే కర్మలను చేయించెను. ఈ విధముగా పరంపరగా సంసారమును అనాదిగా స్వీకరించిన ఏ విధమైన దోషముండదు. ఈశ్వరుడు జీవునిద్వారా చేయించుకర్మలకు వాని శుభాశుభకర్మల అపేక్షకలవాడని నీకు (సిద్ధాన్తికి) ఎట్లు తెలియును. దీనికి జవాబు సూత్రములోని రెండవ భాగముద్వారా చెప్పుచున్నారు "విహితప్రతిషిద్ధావైయర్థ్యాదిభ్యః". వేదములో చెప్పిన 'స్వర్గము కోరువాడు యాగము చేయవలయును' 'బ్రాహ్మణుని చంపరాదు' అను విహిత నిషిద్ధ కర్మల సార్థకత చెప్పిన రీతిగా సిద్ధమగును. కానిచో విధి-నిషిద్ధ కర్మలు అనర్థకమగును. ఆలాగుననే ఈశ్వరునుకి జీవకర్మల అపేక్ష పూర్తిగా లేదనిన లౌకిక పురుష ప్రయత్నము కొరకు దేశ-కాల-నిమిత్తములుగూడ వ్యర్థములగును. ఇచట అకృతాభ్యాగమము అనగా చేయని కర్మఫలముననుభవించుట అను దోషముగూడ సూత్రములోని ఆది పదముద్వారా గ్రహించవలయును. పరమేశ్వరాధీన కర్తృత్వ బోధక విధి-ప్రతిషేధ శాస్త్రముతోబాటు "ఏషహ్యేవ సాధు కర్మకారయతి" అనగా 'ఈశ్వరుడు వానిచే మంచి కర్మలు చేయించును' అను శ్రుతికి విరోధము లేదు.

## 78. అంశాధికరణము.

సంగతి: పూర్వాధికరణముద్వారా జీవాత్మలో నిత్యత్వము చెప్పిన తరువాత ఈ అధికరణములో జీవబ్రహ్మైక్యము చెప్పుటకు ఈఅధికరణము హేతుహేతుమత్భావ సంగతిద్వారా ప్రారంభము గావించిరి.

విషయము:- జీవ-ఈశ్వరుల భేదాభేదము ఈ అధికరణములో విచారించెదరు.

సంశయము:- జీవేశ్వరులకు సాంకర్యము కలదా లేక వ్యవస్థ కలదా?

పూర్వపక్షము:- జీవేశ్వరుల భేదాభేద బోధక శ్రుతులను చూచుచు మరియు ఈశ్వరునిలో సాంకర్యము నివారించుటకు సాధ్యము కాదు గనుక వ్యవస్థితము గావించుట సంభవముకాదు.

సిద్ధాన్తము:- జీవుడు బ్రహ్మ యొక్క అంశము. ఘటాకాశమువలే అవచ్ఛిన్నత్వము మరియు ఆభాసము. ఈ విధమైన ఔపాధిక కల్పనను స్వీకరించి జీవేశ్వరులలో మరియు అనేక జీవులలో పరస్పరము వ్యవస్థ సంభవము. అందువల్ల జీవేశ్వరులలో మరియు జీవులలో పరస్పర సాంకర్యము యొక్క ఆగ్రహము కేవలము దురాగ్రహమే.

వైయాసికన్యాయమాలా:

169. కిం జీవేశ్వరసాంకర్యం వ్యవస్థా వా శ్రుతిద్వయాత్ | అభేదభేదవిషయాత్సాంకర్యం న నివార్యతే ||

170. అంశోఽవచ్ఛిన్న ఆభాస ఇత్యౌపాధికకల్పనైః | జీవేశ్వరయోర్వ్యవస్థా స్యాజ్జీవానాం చ పరస్పరమ్ ||

జీవేశ్వరులకు పరస్పరము సాంకర్యము కలదా లేక భేదాభేద శ్రుతులద్వారా వ్యవస్థ కలదా? అని సంశయమునకు పూర్వవాది చెప్పునది. భేదాభేద శ్రుతులకు విడివిడిగా విషయములుండుటవలన జీవేశ్వరుల సాంకర్యము నివారించలేము అనును. సిద్ధాన్తి చెప్పునది. అంశము, అవచ్ఛిన్నము మరియు ఆభాసము అను ఔపాధిక కల్పనల వలన జీవేశ్వరులలో మరియు జీవులలో పరస్పర వ్యవస్థ కలదు కాని సాంకర్యము లేదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

పూర్వపక్షి చెప్పునది. 'తత్త్వమసి' అను శ్రుతిద్వారా జీవేశ్వరులకు అభేదము చెప్పిరి. 'య ఆత్మని తిష్ఠన్' అను శ్రుతిద్వారా ద్రష్టృ-ద్రష్టవ్యరూపముగా జీవేశ్వరుల భేధము తెలియుచున్నది. భేద శ్రుతులద్వారా జీవుడు లేడని చెప్పజాలము. దీనికి భిన్నముగా అభేదశ్రుతులు జీవుడు ఈశ్వరునికన్న భిన్నమని నిరూపించజాలవు. ఉన్న జీవునితో ఈశ్వరునికి సాంకర్యమును తొలగించలేము. ఇంతేగాక పరస్పరము జీవులలో ఈశ్వరునితో గల భేదముద్వారాగూడ సాంకర్యము వచ్చును. అందువల్ల బ్రహ్మవాదులు జగత్తుయొక్క వ్యవస్థ గావించలేరు.

లోకములో ఆవు గేదలకుగల భేదమువలే బ్రహ్మమరియు ఆత్మకు గల భేదము వాస్తవికముగాదు కాని వ్యవహారదశలో కల్పిత ఉపాధి భేదము స్వీకరించి శాస్త్రము మూడు రకముల జీవులను నిరూపించుచున్నది. "మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః" (గీత.15.7) అనుచోట జీవుడు ఈశ్వరుని అంశము అని తెలిసికొనవలయును. "స సమాన సన్నుభౌ లోకావనుసంచరతి" (బృ.4.3.7.) అనుచోట బుద్ధితో సమాన పరిమాణముగల జీవుని నిర్దేశించిరి ఘటాకాశమువలే సీమిత ప్రాదేశత్వము తెలియుచున్నది. "ఏక ఏవ తు భూతాత్మా భూతే భూతే వ్యవస్థితః | ఏకధా బహుధా చైవ దృష్యతే జలచన్ద్రవత్" (బ్రహ్మబిన్దూపనిషత్. 11) అను స్థలములో శాస్త్రములో ఆభాసత్వము తెలియుచున్నది. ఈ శ్రుతుల వల్ల బ్రహ్మవాదులకు జీవేశ్వరుల మరియు జగత్తు యొక్క వ్యవస్థ కావించుట సులభము. జీవులలో గల పరస్పర భేదమువలన కలిగిన అనేకత్వము అనేక

జలపాత్రలలో అనేక సూర్య ప్రతిబింబములవలే అని తెలిసికొనవలయును. దాని ద్వారా వ్యవహారముయొక్క వ్యవస్థ చేయుట సులభము. కాన ఏ విధమైన దోషములేదు.

259. అంశో నానావ్యపదేశాదన్యథా చాపి దాశకితవాదిత్వమధీయత ఏకే. 2.3.43.

సూత్రార్థము:- జీవుడు ఈశ్వరునిలో కల్పిత అంశము స్వాభావిక అంశముకాదు ఎందులకనగా 'నిష్కలమ్' అను శ్రుతి ద్వారా జీవుని నిరవయత్వము చెప్పిరి గనుకనే కల్పిత అంశమని సిద్ధమైనది. జీవేశ్వరుల అంశాంశిభావము ఎందులకు స్వీకరించవలయును? "య ఆత్మని తిష్టన్" అనగా 'ఆ ఈశ్వరుడు ఆత్మలో ఉండుచు' అనుచోట జీవబ్రహ్మల భేదము చెప్పుటవలన మరియు ఆథర్వణ సూక్తములో అభేదముగూడ చెప్పుటవలన. "బ్రహ్మదాశా, బ్రహ్మదాసా, బ్రహ్మైవేమే కితవాః" అనగా 'మత్స్యాదులను చంపి జీవించువారు, జీవితమును పూర్తిగా పరులకై వినియోగించు దాసులు, ద్యూతము ఆడుజూదరులు వారందరూ బ్రహ్మస్వరూపులే' సర్వమును బ్రహ్మమేనని శ్రుతి బోధించు చున్నది. ఇచట శ్రుతులు ప్రత్యక్ష భేదమును అనువదించుటద్వారా అభేదమునే చెప్పుచున్నవి. దీనిద్వారా జీవుడు ఈశ్వరుని కల్పితాంశమని నిర్ణయించడినది.

"తత్త్వమసి" అను అభేద శ్రుతులకు "య ఆత్మని తిష్ఠన్" అని భేద శ్రుతులకు విరోధము కలదనును పూర్వవాది. ఈశ్వరుని యొక్క అంశములు జీవులు అగ్ని కణములవలే అంశమువలే అంశములు. జీవేశ్వరులలో స్వామి-భృత్య సంబన్ధమువలే ఉపకార్య-ఉపకారక భావముంటవలన విరోధము స్పష్టమనును పూర్వవాది. సిద్ధాన్తి జవాబు. అగ్నికణములవలే జీవుడు ఈశ్వరుని అంశమయినను అది కల్పితమేగాని స్వాభావికముకాదు ఎందులకనగా నిరవయవ ఆత్మకు ముఖ్య అంశములు ఉండజాలవు. బ్రహ్మ యొక్క నిరంశత్వము "నిష్కలము" "నిష్క్రియమ్" అను శ్రుతులలో వినబడుచున్నది. అందువల్ల నిరంశ, నిరవయవ పరమేశ్వరుని ఉపాధిద్వారానే జీవును అంశము స్వీకరించిరి కాని వాస్తవికముగా కాదు. నిరంశ మగుటవలన జీవేశ్వరులలో అంశాంశిభావమే ఉండదనిన అట్లనుట సరికాదు. ఈ విషయమును చెప్పు అనేక శ్రుతులుగలవు. "సోఽన్వేష్టవ్యః స విజిజ్ఞాసితవ్యః" (ఛాం.8.7.1.) "య ఆత్మని తిష్టన్" అనగా 'పరమాత్మని వెతకవలయును, వానినే తెలిసికొనవలయును' 'ఏది ఆత్మలో గలదో' అను శ్రుతులద్వారా జీవేశ్వరులలో భేదమును చెప్పిరి. "తత్త్వమసి" అను శ్రుతిద్వారా జీవేశ్వరుల అభేదమును చెప్పిరి. ఒక శాఖవారు ఆథర్వణిక బ్రహ్మసూక్తములో "బ్రహ్మదాశా, బ్రహ్మ దాసా, బ్రహ్మైవేమే కితవాః" అనగా 'మత్స్యాదులను చంపి జీవించువారు, జీవితమును పూర్తిగా పరులకై వినియోగించు దాసులు, ద్యూతము ఆడుజూదరులు వారందరూ బ్రహ్మస్వరూపులే' గూడ జీవేసశ్వరుల అభేదమునే చెప్పిరి. అందువల్ల నానాత్వమును అభేదమునుగూడ శ్రుతులలో చెప్పుట వలన కల్పిత అంశాంశిభావము జీవేశ్వరులలో కలదని తెలిసికొనవలయును. భేదశ్రుతులు ప్రత్యక్షమును అనువదించి అభేదమును చెప్పుటవలన కల్పిత భేదమువలన జీవునిలో అంశము లేదు.

260. మంత్రవర్ణాచ్చ. (2.3.44)

సూత్రార్థము:- "పాదోఽస్య విశ్వా భూతాని" అనగా 'ఆ బ్రహ్మ యొక్క ఒక భాగములో అన్ని భూతములు మరియు అన్ని ప్రాణులు ఉన్నవి'. ఈ శ్రుతిద్వారా భూతశబ్దమునకు అర్థమైన జీవుడు పరమేశ్వరుని అవిద్యాకల్పిత అంశమని తెలియుచున్నది.

పరమేశ్వరుని ఒకభాగములో (ఒక అంశములో) సంపూర్ణ జీవులు నివసించుచున్నారు వాని మిగిలిన మూడు భాగములు స్వర్గములో శుద్ధముగానున్నవి. ఈ విషయము ప్రత్యక్షముగా మరియొక మంత్రములో చెప్పబడియున్నది. "ఏతావా నస్య మహిమా తతో జ్యాయాంశ్చ పురుషః పాదోఽస్య విశ్వా భూతాని త్రిపాదస్యాఽమృతం దివి" అనగా 'ఈ ప్రపంచ మంతయు ఏ పురుషుని యొక్క విభూతియో. ఆయనకు సర్వభూతములు స్థావరజంగముపదార్థములు ఒక్కభాగము వీనికంటె మీద గూడ ఆ పురుషుడు మూడూభాగములలో నున్నాడు' (ఛాం.3.12.6). ఈ మంత్రవర్ణముద్వారా బ్రహ్మలో అవిద్యద్వారా కల్పిత పాదము (అంశ-భాగము) భూతపదమునకు అర్థము జీడని తెలియుచున్నది.

261. అపి చ స్మర్యతే. (2.3.45.)

సూత్రార్థము:- మరియు "మమైవాంశో" అనగా 'జీవలోకములో అవినాశి జీవుడు నా యొక్క అంశమే' ఈ ప్రకారము భగవద్గీతలో పరమేశ్వరుడు అవిద్యా కల్పిత అంశము జీవుడని చెప్పెను.

"మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః" (గీత.15.7) దీని భావము 'జీవలోకములో సనాతన జీవుడు నాయొక్క అంశము'. ఈ గీతా వాక్యములో పరమేశ్వరుని అంశము జీవుడని చెప్పిరి. ఇది కల్పితమని తెలిసికొని జీవేశ్వరులలో శాశనకర్త-శాశించబడువాడు అను భావము నిశ్చయించుకొనవలయును. అనగా ఈశ్వరుడు ప్రేరేపించువాడు జీవుడు ప్రేరేపింపబడువాడు. ఇటుల స్వీకరించిన ఏ విధమైన దోషముండదు.
జీవుని ఈశ్వరునియొక్క అంశమని స్వీకరించిన జీవునిలోగల సంసారదుఃఖములవలన ఈశ్వరుడు గూడ దుఃఖితుడగును కదా? ఈ ప్రశ్నకు సమాధానము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

262. ప్రకాశాదివన్నైవం పరః. (2.3.46.)

సూత్రార్థము:- ఏవిధముగా జీవుడు అవిద్యవలన దేహభావమును పొంది దేహమువలన కలుగు దుఃఖములద్వారా 'నేను దుఃఖములో నున్నాను' అని భావించునో ఆ విధముగా పరమాత్మ దుఃఖితుడు గాడు. సూర్య-చంద్రుల ప్రకాశము ఆకాశమంతటను వ్యాపించియున్నది కాని ఒకస్థలములోనున్న వలయాకారముగాగాని వేరొక విధముగాగాని యున్న వస్తువుద్వారా ఆ సూర్యచంద్రుల ప్రకాశము వలయాకారముగాగని వేరొక ప్రకారముగాగాని కానవచ్చినను వాస్తవమునకు ఆవిధముగా కాదు. ఆ విధముగనే అవిద్య వలన జీవి దుఃఖితుడగుచున్నాడే గాని వాస్తవములో కాదు.

జీవుడు అవిద్యవలన దేహాదులలో ఆత్మభావమును పొందినవానివలే నుండి దానివలన దుఃఖమును అనుభవించుచున్నాను అనికొనుచు దుఃఖభోగములో అభిమానము కలిగియుండును. కాని పరమేశ్వరుడు

అసంగుటగుటవలన అటుల కాదు. సూర్యుని ప్రకాశము ఆకాశములో వ్యాప్తమైయుండును కాని చేతివేళ్ళు మొదలగువాని నీడ వంకరగా కనిపించును అంతమాత్రమున సూర్యాదుల ప్రకాశము వంకరగానున్నది తిన్నగానున్నది అని చెప్పలేము.ఆలాగుననే మనుష్యులు కుండ మొదలగు వానిని తీసుకొనిపోవునపుడు వానిలోపలగల ఆకాశముగూడ పోవుచున్నటుల భ్రమ కలిగినను వాస్తవములో ఆకాశము వ్యాపకమగుటవలన దానిలో గమనాది క్రియలు లేవు. ఈ విధముగనే అవిద్య ఉపాధివలన జీవుడను అంశములో దుఃఖము కలిగినను అంశి అయిన పరమేశ్వరుడు దుఃఖితుడూగాడు. జీవునిలో అవిద్యా కారణమువలననే దుఃఖము కలుగుచున్నది. నిమిత్తమైన అజ్ఞానము తొలగిన దాని వలన కలుగు శోక-దుఃఖములుగూడ తొలగిపోవును. అపుడు 'తత్త్వమసి' అను మహావాక్యములద్వారా జీవ-బ్రహ్మల ఏకత్వ జ్ఞానము అనుభవములోనికి వచ్చును. అందువల్ల జీవుని వలే ఈశ్వరుడు దుఃఖించు ప్రసంగమేలేదు.

263. స్మరన్తి చ. (2.3.47.)

సూత్రార్థము:- "తత్ర యః పరమాత్మా" అను స్మృతిలో 'ఈ జీవాత్మ-పరమాత్మలలో పరమాత్మయని చెప్పబడు పరమేశ్వరుడు నిత్యుడు, నిర్గుణుడు తామరయాకును నీఱు అంటనట్లు ఆపరమేశ్వరుని కర్మఫలములు అంటవు'. ఈ విధముగా వ్యాసాదులు ఈశ్వరునిలో సంసారిక దుఃఖముల స్పర్శ ఉండదని చెప్పిరి.

"తత్ర యః పరమాత్మా హి స నిత్యో నిర్గుణః స్మృతః | న లిప్యతే ఫలైశ్చాపి పద్మపత్రమివామ్భసా ||" అను స్మృతిలో మహర్షి వ్యాసాదులు చెప్పిరి. 'జీవ పరమాత్మలలో పరమాత్మ నిత్యుడు, నిర్గుణస్వరూపుడు అని స్వీకరించిరి. ఆతనిని కర్మఫలము అంటదు తామరాకును జలము అంటనటుల'. ఈ స్మృతి వాక్యములో వ్యాసాది మహర్షులు పరమేశ్వరుడు జీవుని దుఃఖము ద్వారా దుఃఖితుడు కాడని చెప్పిరి. సూత్రములోని 'చ' శబ్దముద్వారా శ్వేతాశ్వతర ఉపనిషత్తులోని వాక్యమును చెప్పిరి. ఆ వాక్యము "తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్యన-శ్నన్నన్యోఽభిచాకశీతి" అనగా 'జీవపరమాత్మలలో ఒకరు స్వాదిష్ట ఫలములను కర్మ ఫలముల భోక్త రెండవవారు (పరమేశ్వరుడు) వానిని ప్రకాశింపజేయువారు'. ఇంకను శ్రుతులలో "ఏకస్తథా సర్వభూతాన్తరాత్మా న లిప్యతే లోకదుఃఖేన బాహ్యః" (కఠ. 5.11) దీని భావము ' పరమేశ్వరుడు సర్వభూతములలోపల నున్నను వానితో సంబంధపడక వానికి విడిగా నుండువాడగుటచే వాని సుఖదుఃఖములతో సంబంధపడడు' ఇత్యాది శ్రుతులద్వారా జీవునిలోగల సంసార దుఃఖములు ఈశ్వరునికి అంటవు అని స్పష్టమగుచున్నది. సంపూర్ణ భూతములకు అన్తరాత్మ ఒకడే పరమేశ్వరుడైన వైదిక లౌకిక విధి-ప్రతిషేధకర్మల సార్థకత కలుగదు. ఈ ప్రశ్నకు సమాధానము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

264. అనుజ్ఞాపరిహారౌ దేహసమ్బన్ధాజ్జ్యోతిరాదివత్. (2.3.48)

సూత్రార్థము:- 'మిత్రులను సేవించవలయును' 'శత్రువులను దూరముగానుంచవలయును' ఈ విధమైన విధి-ప్రతిషేధములు ఆత్మ అఖణ్డైకరసమయునను అవిద్యకారణమువలన దేహముతో తాదాత్మ్య-సమ్బన్ధము

పొందుటవలన కలుగుచున్నవి. ఏ విధముగా అగ్ని ఒకటైనను శ్మశానాగ్ని అపవిత్రమని పరిత్యజింతురు అన్య అగ్నిని శ్రోత్రియును ఇంటిలోనున్నదానిని పవిత్రముగా భావింతురు. ఆ విధముగనే ఇచట తెలిసికొనవలయును.

"ఋతౌ భార్యాముపేయాత్" "అగ్నిషోమీయం పశుమాలభేత" అను శ్రుతులు విధిని చెప్పుచున్నవి. వీని అర్థము 'ఋతుకాలములో భార్యను చేరవలయును' 'అగ్ని దేవునికి చంద్రదేవునికి చేయు యాగములో పశువును బలినీయవలయును'. "గుర్వాఙ్గనాం నోపగచ్ఛేత్", "న హింస్యాత్ సర్వా భూతాని" అను శ్రుతులు నిషేధమును చెప్పుచున్నవి. వీని భావము 'గురువు యొక్క భార్యను చేరరాదు', 'ఏ భూతములను హింసించరాదు'. ఆ విధముగనే లోకములో 'మిత్రుని సేవించవలయును', 'శత్రువుని త్యజించవలయును' అను విధి-నిషేధములు కలవు. అఖణ్డము మరియు ఏకరసమైన ఆత్మలో అవిద్యవలన దేహముతో తాదాత్మ్యమును పొందిన కారణమువలన ఈ విధి-నిషేధములు యుక్తి సంగతములగుచున్నవి. ఏవిధముగా అగ్ని ఒకటైనను శ్మశానాగ్నిని అపవిత్రమని పరిత్యజింతురు అన్య అగ్నిని శ్రోత్రియుని ఇంటిలోనున్న దానిని పవిత్రముగా భావింతురు. ఒకే సూర్యుని ప్రకాశమును అపవిత్ర దేశముతో సంబద్ధమైన త్యజింతురు పవిత్రస్థానములోనున్న దానిని స్వీకరింతురు. ఆవును పవిత్రముగా భావించి దాని పేడను గోముత్రమును గ్రహింతురు కాని వేరు జీవుల మల-మూత్రములను త్యజింతురు. ఆ విధముగనే తత్త్వజ్ఞానికి, దేహాత్మ అజ్ఞానికి గల భిన్నత్వమువలన విధి-నిషేధములు చెప్పిరి. అయినను ఆత్మ ఒకటే అగుటవలన కర్మ సాంకర్యము కలుగును అను ప్రశ్నకు సమాధానము ముందు సూత్రములో చెప్పిరి.

265. అసంతతేశ్చావ్యతికరః. (2.3.49.)

సూత్రార్థము:-కర్మలలో సాంకర్యమురాదు ఎందులకనగా ఉపాధిద్వారా సీమితమైన అన్ని శరీరములతో ఆత్మకు సంబన్ధము లేదు.

ఆత్మ ఒకటే అయినను జీవుని కర్మ ఫలములకు సాంకర్యము రాదు ఎందులకనగా (ఔపాధిక) శరీరములోనున్న ఆత్మకుగూడ శరీరముతో సంబన్ధము ఉండదు. ఉపాధులలో సాంకర్యము లేనందువలన ఉపహిత అనగా ఉపాధిలోగల జీవులకుగూడ పరస్పరము సాంకార్యములేదు. మరి వారి వారి కర్మ ఫలములకు సాంకర్యము ఎటుల కలుగును అనిన కర్మలలో సాంకర్యము రాదు.

266. ఆభాస ఏవ చ. (2.3.50.)

సూత్రార్థము:- సూర్యుని ప్రతిబింబమువలే జీవుడు పరమాత్మయొక్క ప్రతిబింబమే. ఏవిధముగా ఒక కుండలోనున్న ప్రతిబింబము కదలిన వేరొక కుండలోనున్న ప్రతిబింబము కదలదో అటులనే ఒక జీవునితో వాని కర్మఫల సంబన్ధము కలుగగా వేరొక జీవునితో (కర్మఫలముతోబాటు) సంబన్ధముండదు. ఈ విధముగా సాంకర్యము యొక్క పరిహారము మిక్కిలి సులభము.

నీటిలో ప్రతిబింబించు సూర్యనికి సమానము పరమాత్మ యొక్క ప్రతిబింబము ఈ జీవుడు. ఏ విధముగా ఒక ప్రతిబింబము కదలిన వేరొక ప్రతిబింబము కదలదో ఆలాగుననే ఒక జీవునికి కర్మఫలముతోబాటు సంబన్ధము కలిగిన ఇంకొక జీవునితోబాటు ఆకర్మపలమునకు సంబన్ధముండదు. ఈ విధముగా జీవుల కర్మఫల సాంకర్యమును తొలగించుట అతి సులభము. సాంఖ్యమతములో అన్ని జీవులు వ్యాపకములు మరియు అన్ని దేహములతోబాటు సన్నిధానములో విశేషము లేదు. అందువల్ల ఒక జీవుని సుఖ దుఃఖములతో అన్ని జీవులకు సంబన్ధము కలుగును. వైశేషికుల మతములోగూడ ఆత్మ-మనస్సుల సంయోగమున్నంతవరకు ఆత్మ వ్యాపకమగుటవలన ఇతర ఆత్మలతోబాటు సంయోగము కలిగియుండుటను నివారించజాలరు అనగా ఆత్మ ఇతర మనస్సులతో సంయోగము కలిగియే ఉండును. వారి మతములలో ఒక ఆత్మయొక్క సుఖ-దుఃఖములతోబాటు అన్ని ఆత్మలలో సుఖిత్వ- దుఃఖిత్వ ప్రసంగము వచ్చును. కాన వారి మతములో సాంకర్యమును తొలగించుట కఠినము.

అనేక జీవవాది పక్షములో కర్మఫలముల నియామకము అదృష్టము కాగలదు ఎటులనిన జీవులు వ్యాపకమయినను ఏ ఏ జీవియొక్క అదృష్టముద్వారా కర్మఫలము ఉత్పన్నమగుచున్నదో దాని భోగము ఆ ఆ జీవునుకే కలుగును ఇతరులకు కాదు. ఈ ప్రశ్నకు సమాధానము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

267. అదృష్టానియమాత్. (2.3.51.)

సూత్రార్థము:- సాంఖ్యమతములో ప్రధానము సమవాయ ( నిత్య-సమ్బన్ధమగుటవలన) సమ్బన్ధముతో అదృష్టములో నుండుటవలన మరియు అన్ని ఆత్మలకు సాధారణమని స్వీకరించుటవలన వారి మతములో కర్మ సాంకర్య దోషమును నివారింపజాలము. న్యాయమతములో ఆత్మ-మనసంయొగమువలన ఉత్పన్నమగు అదృష్టము అన్ని ఆత్మలకు సాధారణ కారణమగుటవలన ఇది వీని అదృష్టము అది వాని అదృష్టము అని నియమము లేకుండుటవలన ఫలసమ్బన్ధమునకుగూడ నియమములేదు.

సాంఖ్యమతములో ప్రధానములో సమవాయ-సమ్బన్ధముద్వారా ఉన్న అదృష్టము అన్ని ఆత్మలకు సాధారణము అనగా అదృష్టము అసంగాత్మ ధర్మము కాదు అది సమవాయసమ్బన్ధముతో ప్రధానములో నుండును. ఆ ప్రధానము అన్ని ఆత్మలకు సాధారణకారణము. ఆ స్థితిలో ప్రత్యేకాత్మల సుఖాదిభోగములను ప్రధానములోనున్న అదృష్టము ఎటుల నియమించును? అనిన నియమించలేదు. వైశేషికుల మతములో అదృష్టము సమవాయసమ్బన్ధముతో ఆత్మలలో వేరు వేరుగా నుండును. కనుక సాంఖ్యుల దోషము వీరిలో రాదు అనిన అట్లనుట సరికాదు. ఎందులకనగా అనేక వ్యాపక ఆత్మలతో మనస్సు యొక్క సమ్బన్ధము సాధారణముగా నుండును. ఆ సాధారణ ఆత్మ-మనస్సుల సంయోగముద్వారా అదృష్టము ఉత్పన్నమగు చున్నది. ఆ అదృష్టము ఏ ఆత్మదని నిశ్చయించు నియామకము లేకుంటవలన వారి పక్షములోగూడ దోషము అటులనే యుండును. గాన సాంఖ్యమతములోవలే వైశేషికుల మతములోగూడ కర్మసాంకర్య దోషము ఉండనే ఉండును.

లోకములో ప్రతివాడును నేను ఈ ఫలమును పొందెదను దీనికై ఇటుల ప్రయత్నించెదను దీనిని పరిత్యజించెదను

అని తనను కర్తగను కర్మఫలభోక్తగను చెప్పుచు వ్యవహరించుచున్నాడు. ఈ వ్యవహారము నాశ్రయించి చూచిన జీవులకు కర్మఫలమగు అదృష్టమునకు గల సంబంధము స్వామి భృత్యరూపమైనదని తెలియుచున్నది. ఈసమ్బన్ధము వైశేషికుల మతములో అదృష్టమును నియామించుననిన అది సరికాదు అని ముందు సూత్రములో చెప్పుచున్నారు.

268. అభిసన్ధ్యాదిష్వపి చైవమ్. (2.3.52.)

సూత్రార్థము:- సాధారణమైన మనసంయోగమువలన కలుగు సంకల్పము మొదలగునవిగూడ అదృష్ట-నియమునకు కారణములుగావు కనుక చెప్పిన దోషము అటులనే ఉండును.

సాధారణ ఆత్మ-మనస్సుల సంయోగాముద్వారా ఉత్పన్నమగు అదృష్టము అన్ని ఆత్మలకు సన్నిహిత మగుటవలన ఫలోద్దేశ్యమయిన అదృష్టములో నియామకము లేదు. అందువల్ల చెప్పిన దోషము అటులనే ఉండును.

269. ప్రాదేశాదితి చేన్నాన్తర్భావాత్. (2.3.53.)

సూత్రార్థము:- విభువైన సాధారణమైన ఆత్మ-మనసుల సంయొగము, తమ తమ దేహములలో ఆత్మప్రదేశములో నున్న మనసుతో కలుగు సంయోగము గూడ విడిగా విడిగా నుండును. దానిద్వారానే ఫలోద్దేశ్యము, అదృష్టము సుఖ-దుఃఖాదుల వ్యవస్థ జరుగును. ఇట్లనుట సరికాదు. ఎందులకనగా ఆత్మలో సర్వవ్యాపకత్వమను సాధరణ ధర్మముండుటవలన అన్ని శరీరములు దానిలో అన్తర్భావములు. అపుడు 'నీ ఆత్మది ఈ శరీరమే అను' నియమము లేకుండుటవలన పూర్వోక్త దోషము అటలనే ఉండును.

వ్యాపక ఆత్మకు తన తన దేహప్రదేశములోనున్న మనసుతో సంయోగము విడి విడిగా నుండును. కనుక అదృష్టముద్వారా కలుగు సుఖ-దుఃఖాదుల వ్యవస్థ జరుగును అని (వైశేషికులు) చెప్పునది సరికాదు. ఏలనన వ్యాపకమగుటవలన ఆత్మ అన్ని శరీరములలో నుండును. 'ఈ ఆత్మకు ఈ శరీరము' అను నియమము లేకుండుటవలన వైశేషికుల మతము సరికాదు. కాన పూర్వము చెప్పిన అదృష్టాదుల సాంకర్యము ఆలాగుననే యుండును. మా వేదాన్త మతములో జీవుల అస్థిత్వము మరియు భేదము అవిద్య వలన. ఆ అవిద్యను బ్రహ్మవిద్యద్వారా నశింజేసిన జీవునిలో స్వాబావికముగా నున్న బ్రహ్మభావమును పొందును. ఈ భావమును చెప్పు తత్త్వమస్యాదిశ్రుతి వాక్యములు జీవునిలోనున్న అవిద్యను అనివాదించి మాత్రము చెప్పుటవలన మహావాక్యములద్వారా చెప్పు ఆత్మస్వభావమునకు విరోధములుకావు. అందువల్ల బ్రహ్మాత్మైకత్వ- పక్షములో అన్ని దోషములు తొలగిపోవును, భూత-భౌతిక విషయములను చెప్పు శ్రుతులలోగల పరస్పర విరోధ పరిహారము గావించుటవలన మరియు ప్రామాణికముగా నిర్ణయించుటవలన బ్రహ్మములోనే శ్రుతుల సమన్వయము నిర్దుష్టముగా సిద్ధమయునది.

**బ్రహ్మసూత్రహృదయములో రెండవ అధ్యాయములోని**

**మూడవ పాదము యొక్క సంకలనము సమాప్తము.**

# 10. ద్వితీయాధ్యాయస్య చతుర్థ పాదః

## 79. ప్రాణోత్పత్త్యధికరణము

భౌతిక ఇంద్రియముల ఉత్పత్తి, వాని సంఖ్య మరియు వాని స్వరూపవిషయముల శ్రుతుల పరస్పర విరోధము ఈ చతుర్థ పాదములో పరిహరించెదరు.

సంగతి:-పూర్వాధికరణములో కర్తృత్వస్వరూపమును చెప్పిరి. ఇపుడు జీవాత్మకున్న ఇంద్రియములు బుద్ధిస్థమగుటవలన వాని ఉత్పత్తిని చెప్పుటకు బుద్ధిస్థసంగతి కారణమువల్ల ఈ అధికరణము ప్రారంభించిరి.

విషయము:- ప్రాణము పేరుతో పిలవబడు ఇంద్రియముల ఉత్పత్తిని గురించి ఈ అధికరణములో విచారణ గావింతురు.

సంశయము:- వాగాది ఇంద్రియములు అనాదియా లేక పరమాత్మద్వారా సృష్టించబడినవా?

పూర్వపక్షి:- సృష్టికి పూర్వము ఋషి పేరుతో చెప్పబడు ఇంద్రియముల అస్థిత్వము వినబడుటవలన ఇంద్రియములు అనాది.

సిద్ధాన్తము:- ఒక జ్ఞానముద్వారా సర్వ జ్ఞానముయొక్క ప్రతిజ్ఞ వలన ఇంద్రియములు భౌతికములనియు అనగా భూతముల ద్వారా ఉత్పత్తి అయినవని చెప్పుటకు ప్రమాణము కలదు. మరియు ఇంద్రియముల ఉత్పత్తిని చెప్పు శ్రుతులు ఉండుటవలన ఇంద్రియముల ఉత్పత్తిని స్వీకరించుటయే ఉచితము. సృష్టికి ముందు ఇంద్రియములు ఉన్నవని చెప్పినది పూర్వ సృష్టిదృష్టితో చెప్పిరి.

వైయాసికన్యాయమాలా:-

171. కిమిన్ద్రియాణ్యనాదీని సృజ్యన్తే వా పరమా త్మనా | సృష్టేః ప్రాగృషినామ్నైషాం సద్భావోక్తేరనాదితా ||

172. ఏకబుద్ధ్యా సర్వబుద్ధేర్భౌతికత్వాజ్జనిశ్రుతేః |ఉత్పద్యన్తేఽథ సద్భావః ప్రాగవాన్తరసృష్టితః ||

ఇంద్రియములు అనాదియా లేక పరమాత్మనుండి ఉత్పన్నమయినవా? సృష్టికి పూర్వము ఋషుల పేరుతో ఇంద్రియములు ఉన్నవని చెప్పినందువలన అవి అనాది అని పూర్వపక్షి మతము. కాని సిద్ధాన్తి చెప్పునది ఏమనగా ఇంద్రియములు ఉత్పన్నములగును. ఎందులకనగా ఒకవిజ్ఞానముద్వారా సర్వ విజ్ఞానము శ్రుతులు చెప్పుచున్నవి మరియు ఆ ఇంద్రియములు భూతములనుండి ఉత్పన్నమయినవని శ్రుతిలో చెప్పిరి. సృష్టికి పూర్వము ఆ ఇంద్రియములు ఉన్నవని చెప్పినది అవాన్తరసృష్టి అభిప్రాయముతో చెప్పిరి.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

"ఋషయో వావ తేఽగ్రేఽసదాసీత్ (తదాహుః) కే తే ఋషయః—ఇతి, ప్రాణా వావ ఋషయః" అనగా 'సృష్టికి పూర్వము ఋషులు గలరు, ఎవరు వారు అనగా ప్రాణములను ఇంద్రియములు' అను శ్రుతి ఆధారమువలన ఇంద్రియములు గలవనును పూర్వపక్షి. సిద్ధాన్తి జవాబు. చెప్పిన శ్రుతి ద్వారా సృష్టికి పూర్వము ప్రాణములనగా ఇంద్రియముల సద్భావము తెలియుచున్నప్పటికిన్ను వాని ఉత్పత్తిని స్వీకరించనిచో ఒక విజ్ఞానముద్వారా సర్వ విజ్ఞానముయొక్క ప్రతిజ్ఞకు హాని కలుగును. అంతేగాక "అన్నమయం హి సోమ్య! మనః" "ఆపోమయః ప్రాణః" అనిన 'అన్నమనగా పృథివి దాని నుండి మనస్స జనించెను' మరియు 'జలమునుండి ప్రాణములు

ఉత్పన్నమలయునవి' అను శ్రుతులద్వారా ఇంద్రియములు భూతకార్యములని తెలియుచున్నది. "ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేన్ద్రియాణి చ" 'ఆ పరమాత్మనుండి మనస్సు అన్ని ఇంద్రియములు ఉత్పన్నమయినవి' ఈ శ్రుతి ఇంద్రియముల ఉత్పత్తి స్పష్టముగా చెప్పుచున్నది. సృష్టికి పూర్వము ఇంద్రియములున్నవని చెప్పు శాస్త్రము అవాన్తరసృష్టిననుసరించి చెప్పిరి. అందువల్ల పరమాత్మనుండి ఇంద్రియములు ఉత్పన్నమగుచున్నవనిన ఏ విరోధము లేదు.

ఈ పాదములో సూక్ష్మ శరీర విషయములైన శ్రుతులలోగల విరోధములను పరిహరించెదరు. ఆకాశాది భూతములయొక్క మరియు భోక్త విషయములైన పరస్పర శ్రుతుల విరోధమును మూడవపాదములో పరిహరించిరి.

### 271. తథా ప్రాణాః. (2.4.1.)

సూత్రార్థము:- ఒక విజ్ఞానముద్వారా సర్వవిజ్ఞానము చెప్పుటవలన, ఇంద్రియములు భూతములద్వారా ఉత్పన్నమగుటవలన మరియు వాని ఉత్పత్తిని చెప్పు శ్రుతులు ఉండుటవలన ఇంద్రియములు ఉత్పన్నమగు చున్నవి. సృష్టికి ముందు ఇంద్రియములున్నవని అవాన్తర సృష్టి అభిప్రాయముతో చెప్పిరి.

"ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః" (ముం.2.1.3.) అనగా 'ఈ పరమాత్మనుండి ప్రాణము, మనస్సు మరియు అన్ని ఇంద్రియములు ఉత్పన్నమగుచున్నవి'. ఈ శ్రుతిలో ఇంద్రియముల ఉత్పత్తిని చెప్పిరి. "తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సమ్భూతః". (తై.2.1.1.) అనిన 'ఆ ఆత్మనుండి ఆకాశము ఉత్పన్నమయినది' ఈ శ్రుతిలో ఇంద్రియముల ఉత్పత్తి చెప్పలేదు. "ఋషయో వావ తేఽగ్రేఽసదాసీత్" "ప్రాణా వావ ఋషయః" అనిన ' ఈ ఇంద్రియము-లన్నియూ ఉత్పత్తికి పూర్వము ఉండెను. వీనినే ఋషులు అందురు'. సృష్టికి పూర్వముండుట, ఉత్పత్తి చెప్పుట, ఉత్పత్తిని చెప్పకుండుట అను శ్రుతులలో విరోధము కలదని పూర్వపక్షి కథనము. దానిని సిద్ధాన్తి పరహరించుచున్నారు. ఏ విధముగా పూర్వ పాదములో ఆకాశాదులు పరబ్రహ్మ కార్యములని చెప్పిరో ఆలాగుననే ప్రాణదులుగూడ పరబ్రహ్మ కార్యములే. ఎందులకనగా కొన్ని ప్రదేశములలో ప్రాణాదుల ఉత్పత్తి చెప్పక పోయునను మరికొన్ని ప్రదేశములలో చెప్పిరి. అందువలన శ్రుతులలో సమానత లేక ఏకవాక్యత్వమును చెప్పుటకై ఆకాశాదులవలే ఇంద్రియముల ఉత్పత్తిని స్వీకరించవలయును.

ఉత్పత్తికి పూర్వము ఇంద్రియములు గలవని శ్రుతిలో చెప్పుటవలన ఆ ఇంద్రియముల ఉత్పత్తిని చెప్పునది గౌణిశ్రుతియా అను సందేహమునకు సమాధానము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

### 271. గౌణ్యసమ్భవాత్. 2.4.2.

సూత్రార్థము:- ఇంద్రియముల ఉత్పత్తిని చెప్పు శ్రుతి గౌణి కానేరదు ఎందులకనగా ఒకవిజ్ఞానముద్వారా సర్వవిజ్ఞానము చెప్పుశ్రుతి ప్రతిజ్ఞకు విరోధము వచ్చును కావున ఈ ప్రాణోత్పత్తి శ్రుతి గౌణి అగుటకు వీలులేదు. ఇంద్రియము లచేతనము లగుటచే బ్రహ్మరూపములుకానేరవు. సర్వవిజ్ఞాన శ్రుతిప్రతిజ్ఞకు హాని వచ్చుటవలన బ్రహ్మభిన్నములు కానేరవు.

ఇంద్రియముల ఉత్పత్తిని చెప్పు శ్రుతి గౌణమని చెప్పుట సరికాదు. అనగా ప్రాణముల ఉత్పత్తిని చెప్పుశ్రుతి గౌణి కానేరదు. ప్రాణాది సంపూర్ణ జగత్తును బ్రహ్మ వికారమని స్వీకరించిన, ఒకే కారణముకన్న భిన్నకార్యము లేదనిన ఒక విజ్ఞానముద్వారా సర్వవిజ్ఞాన ప్రతిజ్ఞ సిద్ధమగును లేనిచో ఆ ప్రతిజ్ఞకు హాని కలుగును. ఉత్పత్తికి పూర్వము ఇంద్రియములు గలవని శ్రుతి చెప్పుచున్నదనిన ఆశ్రుతిని గౌణమని చెప్పుట సరికాదు. “అప్రాణో హ్యమనాః శుభ్రో హ్యక్షరాత్పరతః పరః” (ముం. 2.1.2.) ‘ఆ పరమాత్మ ప్రాణము మరియు మనస్సు యొక్క సంభన్ద రహితుడు, శుద్ధుడు, అవినాశి మరియు ప్రకృతికన్న భిన్నము’ పరమాత్మ మూలప్రకృతి, మరియు సర్వప్రాణాదుల రహితుడు అనగా వీనికి అతీతుడు. ఇంద్రియముల ఉత్పత్తిని చెప్పు శ్రుతి హిరణ్యగర్భరూపమైన భిన్న ప్రకృతిని చెప్పుచున్నది అనిన ఈశ్వర, హిరణ్యగర్భములకు అతీతుడు పరమాత్మశుద్ధ బ్రహ్మము. ఈశ్రుతితో ప్రాణోత్పత్తి చెప్పు శ్రుతికి విరోధము లేదు.

272. తత్ప్రాక్శ్రుతేశ్చ. (2.4.3.)

సూత్రార్థము:- “జాయతే” ఈ ప్రకారము వినబడు జన్మవాచి పదమునకు ఆకాశాదులలో ముఖ్య అర్థము అనిన శ్రుతి పాఠమునననుసరించి ముందు చెప్పిన ప్రాణాదులలో “జాయతే” అని వినబడుటవలన ఇంద్రియముల ఉత్పత్తి ముఖ్యమని చెప్ప వలయును.

ఆకాశాదులవలే ప్రాణాదుల ఉత్పత్తి శ్రుతిలో చెప్పుటవలన ప్రాణాదుల ఉత్పత్తిని చెప్పు శ్రుతి ముఖ్యమని స్వీకరించవలయును ఎందులకనగా “ఏతస్మాజ్జాయతే” (ముం. 2.1.3.) అని శ్రుతి వాక్యములో జన్మవాచక “జాయతే” పదము ఒకటే కలదు. ఆ శబ్దము ఆకాశాదుల ముఖ్య జన్మను చెప్పిన అదే శ్రుతి వాక్యములో వాని ముందు చెప్పిన ప్రాణాదుల జన్మ గౌణమని ఎట్లు చెప్పగలదు. ఎందులకనగా ఆకాశాదులలో కొన్నింటి జన్మ ముఖ్యమని చెప్పుచు ప్రాణాదుల జన్మ అముఖ్యమని నిశ్చయించుట సరికాదు. ‘ఒకసారి ఉచ్చరించిన శబ్దము సమానార్థక బోధకమగును’. ఈ నియమము వలనను శ్రుతిలో నానావిధత్వ ప్రసంగము వచ్చుటవలనను ప్రాణాదుల జన్మ ముఖ్యమనియే చెప్పవలయును. “తత్తేజోఽసృజత” అనిన ‘ఆ బ్రహ్మము అగ్నిని సృజించెను’ ఈ ప్రకరణములో ప్రాణోత్పత్తి వినబడుటలేదు అంతేగాక అగ్ని, జలము మరియు పృథివీల ఉత్పత్తి యొక్క శ్రవణము మాత్రమే వినబడుటవలన ప్రాణాదుల ఉత్పత్తిని స్వీకరించుట సరికాదనిన దీనికి ఉత్తరము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

273. తత్పూర్వకత్వాద్వాచః. (2.4.4.)

సూత్రార్థము:- “అన్నమయం సౌమ్య! మన ఆపోమయః ప్రాణస్తేజోమయీ వాక్” (ఛాం. 6.5.4.) ‘హే సౌమ్యుడా! మనస్సు అన్నముయొక్క, ప్రాణము జలముయొక్క, వాగింద్రియము అగ్నియొక్కవికారము లేక కార్యము’ ఈ శ్రుతిలో మనస్సు మరియు ప్రాణసహితము వాగింద్రియము బ్రహ్మ వికారము లేక కార్యము అగ్ని,జలము మరియు పృథివీల వికారముగా చెప్పబడినది. అందువలన ఇంద్రియముల ఉత్పత్తి శ్రుతి ఉన్నది.

“అన్నమయం హి సోమ్య మనః” ‘హే సౌమ్యుడా! మనస్సు అన్నమునుండి జనించెను ప్రాణము జలము నుండి ఉత్పన్నమయ్యెను వాగింద్రియము అగ్నినుండి సంభవించెను’. ఈ శ్రుతిలో బ్రహ్మమునుండి అగ్ని, జలము మరియు పృథివీల ఉత్పత్తి చెప్పిన తరువాత వాగింద్రియము, ప్రాణము మరియు మనస్సుల సామాన్య ఉత్పత్తిని చెప్పిరి. ఈ సామాన్య ఉత్పత్తి నియమము ద్వారానే బ్రహ్మనుండి ఇంద్రియముల ఉత్పత్తి సిద్ధమగు చున్నది. కనుక ప్రాణాదులలో అన్నమయత్వము చెప్పుటద్వారా వానిలో బ్రహ్మ కార్యము సిద్ధమగు చున్నది.

## 80. సప్తగత్యధికరణము.

సంగతి:- పూర్వాధికరణములో ఇంద్రియముల ఉత్పత్తిని చెప్పు శ్రుతులలో గల విరోధములను పరిహరించిరి. ఇపుడు జీవాత్మ ఇంద్రియములకన్న భిన్నమని నిరూపించవలయును. దానికై ఇంద్రియముల సంఖ్య నిర్ణయించుటకు ఆశ్రయ-ఆశ్రయీ భావ సంగతి కారణము వలన ఈ అధికరణమును ప్రారంభించిరి.
విషయము:- వాగాది ఇంద్రియములయొక్క సంఖ్యనుగూర్చి ఈ అధికరణములో విచారించెదరు.
సంశయము:- ఇంద్రయములు ఏడా లేక పదునొకండా?
పూర్వపక్షము:- “సప్త ప్రాణాః” (ముం. 2.1.7.) ఈ శ్రుతి అనుసారము శిరస్సున గల ఇంద్రియములు ఏడు.
సిద్ధాన్తము:- శిరస్సులోగల ఛిద్రములకన్న భిన్నముగా హస్తాది ఇంద్రియముల వర్ణన వేదములో చెప్పిరి. అందువల్ల ఇంద్రియములు పదునొకండు వాని కార్యములు విడి విడిగా చూడబడుచున్నవి.
వైయాసికన్యాయమాలా:
173. సప్తైకాదశ వాఽక్షాణి సప్త ప్రాణా ఇతి శ్రుతేః | సప్త స్యుర్మూర్ధనిష్ఠేషు ఛిద్రేషు చ విశేషణాత్ ||
174. అశీర్షణ్యస్య హస్తాదేరపి వేదే సమీరణాత్ | జ్ఞేయాన్యేకదశాక్షాణి తత్తత్కార్యానుసారతః ||
ఇంద్రియములు పదునొకండా లేక ఏడా? అనిన పూర్వవాది ఇంద్రియములు ఏడు అనును. ఎందులకనగా “సప్త ప్రాణాః” అను శ్రుతి శిరస్సులో గల ఛిద్రముల ఆధారముపై విశేషముగా చెప్పుటవలన. సిద్ధాన్తి జవాబు. శిరస్సులోగల ఛిద్రములకన్న అధికముగా హస్తాది ఇంద్రియములను శ్రుతిలో చెప్పిరి. కాన ఆయా కార్యముల ఆలోచనానుసారము ఇంద్రియములు ఏకాదశములని నిర్ణయించబడినది.
భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-
పూర్వపక్షి ఇంద్రయములు ఏడు అనును. “సప్త ప్రాణాః ప్రభవన్తి తస్మాత్” (ముం.2.1.8.) అనిన ‘ఆ పరమాత్మనుండి ఏడు ప్రాణములు ఉత్పన్నమయినవి’. అను సామాన్య శ్రుతి వల్లను “సప్త వై శీర్షణ్యాః ప్రాణాః ద్వావవాఞ్చౌ” (తై. సం.5.1.7.1.) అనగా ‘నిశ్చయముగా ఏడు శిరస్సులో ఉన్న ప్రాణములు మరియు రెండు కిందభాగములో నున్నవి’ అను విశేష శ్రుతివల్లను ఇంద్రియములు ఏడు అని పూర్వపక్షి మతము. దీనికి సిద్ధాన్తి చెప్పునది. శిరస్సులోనున్న ఇంద్రియములకన్న అధికముగా చేతులు మొదలగు ఇంద్రియములను వేదములో చెప్పిరి. “హస్తౌ చాఽఽదాతవ్యమ్ చ ఉపస్థశ్చానన్దయితవ్యం చ” (ప్ర. 4.8.) అనిన ‘చేతులు గ్రహించవలసినదియును, ఉపస్థేన్ద్రియము ఆనందించవలసినదియును’. అందువల్ల వేదముద్వారా నిశ్చయించినందువల్ల దర్శనము, శ్రవణము, ఘ్రాణము, ఆస్వాదనము, స్పర్శనము, అభివదనము, ఆదానము, గమనము, ఆనన్దము, విసర్గము మరియు ధ్యానము అను కార్యములను చేయు ఇంద్రియములు పదునొకండు

అని నిర్ణయించిరి. అంతేగాక ఆయా వ్యాపారములు చూచుట, వినుట, వాసనచూచుట, రుచిచూచుట, ముట్టుకొనుట, మాటలాడుట, తీసికొనుట, నడచుట, ఆనందించుట, మలవిసర్జనము మరియు ధ్యానముచేయుట మొదలగునవి అనుభవించుటవలనను మరియు ఈ అనుభవములకు ఆ ఇంద్రియములు సాధనములగుటవలనను ఇంద్రియములు పదునొకండు అని స్వీకరించి తీరవలయును.

### 274. సప్తగతేర్విశేషితత్వాచ్చ. (2.4.5.)

సూత్రార్థము:- ఇంద్రియముల సంఖ్య ఏడు  ఎందులకనగా శ్రుతిలో ఇంద్రియముల సప్తత్వ జ్ఞానము కలుగుచున్నది మరియు "సప్త వై శీర్షణ్యాః ప్రాణాః" అనగా 'నిశ్చయముగా శిరస్సులో గల ప్రాణములు ఏడు'  అను శాస్త్రముద్వారా శిరస్సులోగల ఇంద్రియములు ఏడు అని విశేషముగా చెప్పిరి.

ఇంద్రియముల సంఖ్యను చెప్పు శ్రుతులలో విరోధముండుటవలన సమన్వయము అసిద్ధమనును పూర్వపక్షి. సిద్ధాన్తి అవిరోధమనును. "సప్త ప్రాణాః ప్రభవన్తి తస్మాత్" (ముం.2.1.8.) 'బ్రహ్మనుండి ఏడు ఇంద్రియములు ఉత్పన్నమగు చున్నవి'. "అష్టౌగ్రహా అష్టావతిగ్రహాః"  (బృ.3.2.1.) 'ఎనిమిది గ్రహములు అనగా ఇంద్రియములు ఎనిమిది అతిగ్రహములు అనగా విషయములు ఎనిమిది'. ఈప్రకారము ఇంద్రియవిషయములో సప్తత్వము, అష్టత్వాది సంఖ్యను చెప్పు శ్రుతులలో పరస్పరము విరోధము కలదా లేదా? ఈ సంశయమునకు పూర్వపక్షి విరోధము కలదనును. ఏకదేశి అనగా పూర్తిగా సిద్ధాన్తమును స్వీకరించని మతమువారు చెప్పు సమాధానము. ఇంద్రియములు ఏడు మాత్రమే ఎందులకనగా ముండక శ్రుతిలో బ్రహ్మనుండి ఏడు ఇంద్రియములు మాత్రమే ఉత్పన్నమయినవని చెప్పిరి. ఈ శ్రుతిద్వారా ఇంద్రియముల సంఖ్య ఏడు మాత్రమే అని తెలియుచున్నది. "సప్త వై శీర్షణ్యాః ప్రాణాః (తై.సం. 5.1.7.1). ఈ విధముగా తైత్తిరీయ సంహితలో గూడ ఇంద్రియములు ఏడు అని విశేషముగా చెప్పిరి. మరి బృహదారణ్యకములో ఇంద్రియములు ఎనిమిది అని చెప్పరి కదా? అనిన అది సరియే కావున ఈరెండింటిలో ఏదో ఒక సంఖ్య నిశ్చయము చేయవలయును, తక్కువ సంఖ్య అగుటవలన సప్తసంఖ్యను నిశ్చయము చేయుట శ్రేష్టము మరియు వ్యాపారముననుసరించి సంఖ్య భేదము కలిగిన ఆ అధికసంఖ్య ఈ తక్కువ సంఖ్యలో అన్తర్భావమగును. ఇంత వరకు ఏకదేశి మతము.

### 275. హస్తాదయస్తు స్థితేఽతో నైవమ్. (2.4.6.)

సూత్రార్థము:-"హస్తౌ వై గ్రహః" అని చేతులు  మొదలగు ఇంద్రియములు శ్రుతిలో ఎక్కువగా చెప్పుటవలన ప్రాణములు పదునొకండు మరియు ఏకాదశ సంఖ్య సప్త సంఖ్యలో అన్తర్భావము కాజాలదు కాని ఏకాదశ సంఖ్యలో సప్త సంఖ్య అన్తర్భావము కాగలదు. అందువల్ల ఇంద్రియములు ఏడే నని స్వీకరించుట సరికాదు.

సూత్రములో వచ్చిన 'తు' శబ్దము ముందు సూత్రములో చెప్పిన ఏకదేశి మతమును ఖండించుటకు. "హస్తౌ వై గ్రహః స కర్మణాఽతిగ్రహేణ గృహీతః"  (బృ.3.2.8.) అనగా 'నిశ్చయముగా హస్తములు ఇంద్రియములు అవి కర్మములను విషయములను గ్రహించునవి'. ఈ శ్రుతులద్వారా శిరస్సులో చెప్పిన ఏడు ఇంద్రియములకన్న వేరుగా హస్తాది భిన్న ఇంద్రియములు చెప్పిరి. ఏడు కన్న ఎక్కువ ఇంద్రియములు చెప్పగా ఆ ఎక్కువ సంఖ్యలో

ఈ ఏడు సంఖ్య అన్తర్భావమగును. “దశేమే పురుషే ప్రాణా ఆత్మైకాదశః” (బృ.3.9.4.) అనిన ‘దేహములో పది ఇంద్రియములు ఉన్నవి పదునొకండవది మనస్సు’. ఈ శ్రుతి చెప్పిన ఏకాదశ సంఖ్యలో సప్త సంఖ్య అన్తర్భావమగును. ‘స్తోకకల్పనానురోధాత్’ అనిన ‘తక్కువ సంఖ్యను స్వీకరించుట ఉచితమని’ చెప్పుట సరికాదు. కనుక ఇంద్రియములు ఏకాదశములే.

పైన చెప్పిన రెండు సూత్రములకు వేరొక అర్థము ఉన్నది. ఇంద్రియములు ఏడు మాత్రమే. “తముత్-క్రామన్తం ప్రాణోఽనుత్-క్రామతి, ప్రాణమనూత్-క్రామన్తం సర్వే అనూత్-క్రామన్తి” (బృ.4.4.2.) అనగా ‘ మరణించిన తరువాత శరీరమునుండి జీవాత్మ పోవునపుడు ప్రాణము శరీరమును వదిలివేయును మరియు ప్రాణము పోయిన తరువాత అన్ని ఇంద్రియములు నిష్క్రమించును’. ఈ శ్రుతిద్వారా ఇంద్రియముల ఏడు అని తెలియుచున్నది. ఈ శ్రుతిలో సర్వ శబ్దము ప్రయోగించిరి కాదా మరి ఇంద్రియములు ఏడు మాత్రమే అని ఎట్లు చెప్పగలరు? అనుట సరికాదు. ఎందులకనగా విశేషముగా చెప్పుటవలన. “స యత్రైష చాక్షుషః పురుషః పరాఙ్పర్యావర్తతేఽథారూపో భవతి” (బృ.4.4.1.) అనగా ‘ మరణకాలములో నేత్రములోనున్న అనుగ్రాహక సూర్యుని అంశము తన యొక్క అంశీ సూర్యునిలో ప్రవేశించును అపుడు ఈ మరణావస్థలోనున్న వ్యక్తి రూపజ్ఞాన రహితుడగును’. ఈ విధముగా మరణాసన్న వ్యక్తి చక్షురాది ఇంద్రియములు ఏడేనని విశేషప్రసంగమును చెప్పిరి. ఎవరైన ‘అందరు బ్రాహ్మణులకు విందు చేయుడనిన’ పిలిచిన బ్రహ్మణులనుద్దేశించ సర్వ శబ్దమును ప్రయోగించిరేగాని సంసారములో నున్న బ్రహ్మణులందరినుద్దేశించి కాదు అని స్వీకరించవలయును. ఆ విధముగనే ఇచట సర్వ శబ్దము ప్రకరణముద్వారా చెప్పిన ఏడు ఇంద్రియములలోనే సమాప్తమగును. ఇటుల చెప్పిన పూర్వపక్షమునకు సిద్ధాన్తి చెప్పినది. నిశ్చయముగా గ్రహములు, అతిగ్రహములు అనిన ఇంద్రియములు వాని విషయములు ఏడు అని చెప్పినను వాని కన్న విడిగా హస్తాదులనుగూడ ఇంద్రియములుగా శ్రుతిలో చెప్పిరి. “దశేమే పురుషే ప్రాణా ఆత్మైకాదశస్తే యదాఽస్మాచ్ఛరీరాదుత్-క్రామన్తి అథ రోదయన్తి” (బృ.3.9.4.) ‘శరీరములో పది ఇంద్రయములున్నవి మరియు పదునొకండవది మనస్సు(ఆత్మా). ఇవి మరణించు వ్యక్తి శరీరమును వదిలి పోవునపుడు బంధువులను ఏడిపించును, అందులకే ఏకాదశ రుద్రులందురు’. ఈ విధముగా ఇచట ఏకాదశ ఇంద్రియములు ఒకసారి మరణాసన్న వ్యక్తి శరీరమును వదిలి పోవుట వినిపించు చున్నది. ఇంద్రియముల ఉత్-క్రమణ ప్రసంగములో ఏకాదశ సంఖ్య స్థానములో సప్త సంఖ్య ప్రసంగమున్న సప్త ఇంద్రియములనే శ్రుతిలో చెప్పెడి వారు అంతేగాక ప్రకరణముకన్న శ్రుతి బలవత్తరముగాన ఇంద్రియములు పదునొకండె. అల్ప సంఖ్య అన్తర్భావ మగుటవలన శ్రుతులలో విరోధము లేదు.

## 81. ప్రాణాణుత్వాధికరణము.

సంగతి:- సర్వవ్యాపకమయిన అహంకారమునుండి ఉత్పన్నమగుటవలన ఇంద్రియములుగూడ వ్యాపకములు మరి వాని ఉత్-క్రమణము ఎట్లు జరుగును? ఈ విధమైన ఆక్షేప సంగతి వలన ఈ అధికరణము మొదలైనది.

విషయము:- ఇంద్రియముల పరిమాణము గురించి ఈ అధికరణములో విచారము చేయుదురు.

సంశయము:- ఇంద్రియములు అణు పరిమాణముగలవా లేక వ్యాపకములా?

పూర్వపక్షము:- సాంఖ్యులు ఇంద్రియములు వ్యాపకములని స్వీకరించిరి. ఆ యా దేహముల పూర్వకర్మానుసారము ఇంద్రియముల వ్యాపారము జరుగుచుండును. గాన ఇంద్రియములు వ్యాపకములు.

సిద్ధాన్తము:- శరీరములో ఇంద్రియములు సూక్ష్మములై యున్నవి కాన వ్యాపకములు కావు. మృత శరీరమునుండి ఇంద్రియములు నిర్గమించుట విను చున్నాము మరియు చూచుచున్నాము. అవి అతి సూక్ష్మమగుటవలన కంటికి కనబడవు. గాన ఇంద్రియములు సూక్ష్మములేగాని వ్యాపకములుగావు.
వైయాసిన్యాయమాలా:
175. వ్యాపీన్యణూని వాఽక్షాణి? సాంఖ్యా వ్యాపిత్వమూచిరే | వృత్తిలాభస్తత్ర తత్ర దేహే కర్మవశాద్భవేత్ ||
176. దేహస్థవృత్తిమద్భాగేష్వేవాక్షత్వం సమాప్యతామ్ |ఉత్-క్రాన్త్యాదిశ్రుతేస్తాని హ్యణూని స్యురదర్శనాత్ ||
ఇంద్రియములు సూక్ష్మములా లేక వ్యాపకములా? ఆ యా దేహములలో కర్మవలన ఇంద్రియముల ఉనికి సంభవము. అందువలన ఇంద్రియములు వ్యాపకములని సాంఖ్యులైన పూర్వపక్షి మతము. సిద్ధాన్తి జవాబు. ఇంద్రియములు వ్యాపకములుగావు. ఆ యా దేహభాగములలోనే ఇంద్రియములుండును కాని దేహమునకు బయట లేవు. శరీరమునుండి నిర్గమనము శ్రుతిలో చెప్పుటవలన కంటికి కనబడక పోవుట వలన ఇంద్రియములు సూక్ష్మములు.
భారతీ తీర్థులవారి వ్యాఖ్య:
ఇంద్రియములు వ్యాపకమగుటవలన ఆ యా శరీరములోగల ప్రదేశములలో ఆ యా జీవుల కర్మఫలముల ఉపభోగమునకు సమర్థములు అనును పూర్వవాది సాంఖ్యుడు. సిద్ధాన్తి చెప్పునది. ఇట్లు చెప్పుట సరికాదు. ఎందులకనగా అధికకల్పన అను(గౌరవదోషము) దోషము కలుగును. దేహము మధ్యమునందుగల ఇంద్రియములద్వారా సంపూర్ణవ్యవహారము జరుగగలిగిన సర్వవ్యాపక ఇంద్రియముల కల్పన వల్ల ప్రయోజనమేమి? ఆ ఇంద్రియములు స్వయముగా పరలోకమునకు పోవునను కల్పన యుక్తి యుక్తముకాదు. శ్రుతిలో జీవుని ఉత్-క్రాన్తి ఆగతుల కల్పన ముఖ్యముకాదు. గత్యాగతుల ముఖ్యత్వ సిద్ధికొరకు ఇంద్రియములను ఉపాధిగా స్వీకరించినది. ఆ ఇంద్రియములుగూడ సంపూర్ణ ఉపాధి వ్యాపకములైన గత్యాగతులు ముఖ్యము లెట్లగును అందువల్ల ఇంద్రియములు వ్యాపకములుగావు, అవి మధ్యమ పరిమాణముగలవి, ఆ మధ్యమ పరిమాణమునే అణుత్వముగా చెప్పుటకై సూత్రకారులు అణు శబ్దమును ప్రయోగించిరి.

### 276. అణవశ్చ. (2.4.7.)

సూత్రార్థము:- ప్రాణ శబ్దముద్వారా చెప్పబడిన ఇంద్రియములు అణు పరిమాణముగలవి అనగా సూక్ష్మములు మరియు పరిచ్ఛిన్నములు (సీమితములు) వ్యాపకములుగావు. ఆ ఇంద్రియములు నేత్రాదులద్వారా కలుగు ప్రత్యక్ష ప్రమాణమునకు గోచరములుగావు. ప్రత్యక్షమునకు అవిషయములు.

ఇంద్రియములు వ్యాపకమగుటవలన వాని ఉత్-క్రమణము అసంభవమనును పూర్వవాది. ఇంద్రయములు పరిచ్ఛిన్నములు సూక్ష్మములు గాన ఉత్-క్రమణము సంభవమనును సిద్ధాన్తి. ఉత్-క్రాన్తి శ్రుతి "ప్రాణాః స్వరేఽనన్తాః" అనిన 'అన్ని ఇంద్రియములు అనన్తములు'. అను ఉత్-క్రాన్తిని చెప్పు శ్రుతితో ఇంద్రియములు సర్వవ్యాపకములని చెప్పు శ్రుతికి విరోధముకలదా లేదా? ఈ సంశయమునకు పూర్వవాది విరోధము కలదనును. సిద్ధాన్తములో ఇంద్రియములలో ఉద్భూతరూపము మరియు స్పర్శ లేనందువలన అవి సూక్ష్మములు అనిరి. కాని ఆ ఇంద్రియములు పరమాణువువలే సూక్ష్మములుకావు అటుల సూక్ష్మములని స్వీకరించిన సంపూర్ణ

శరీరవ్యాపి కార్యము అసిద్ధమగును. ఇంద్రియములు వ్యాపకములని చెప్పు శ్రుతిని స్వీకరించిన వాని ఉత్-క్రాన్తి, గతి మరియు ఆగతి చెప్పు శ్రుతితో విరోధము కలుగును. గాన వ్యాపకత్వమును చెప్పు శ్రుతులను ఉపాసన చేయుట కొరకని స్వీకరించ వలయును. అపుడు ఉత-క్రాన్తి చెప్పు శ్రుతులతో విరోధముండదు.

## 82. ప్రాణశ్రైష్ఠ్యాధికరణము.

సంగతి:- క్రిందటి అధికరణములో ఇంద్రియముల సృష్టిని చెప్పిరి. ఈ అధికరణములో ప్రాణవాయువుగూడ ఇంద్రియములవలెనే పరబ్రహ్మమునుండి జనించినదియే అని చెప్పెదరు. ఇచట ప్రథమాధికరణన్యాయమును అతిదేశము చేయుటవలన పూర్వాధికరణముతో పాటు ఈ అధికరణమునకు అతిదేశ సంగతి.
విషయము:- ముఖ్య ప్రాణముయొక్క ఉత్పత్తిని గురించి ఈ అధికరణములో విచారించెదరు.
సంశయము:- ముఖ్య ప్రాణము అనాదియా లేక ఉత్పన్నమగుచున్నదా?
పూర్వపక్షము:- సృష్టికి పూర్వము ప్రాణచేష్ట శ్రుతిలో వినబడుచున్నది. “ఆనీదవాతం స్వధయా తదేకమ్” (ఋ.సం. 8.7.17) అనిన ‘ప్రళయకాలములో పితరుల నిమిత్తము చెప్పు స్వధాతోబాటు సంపూర్ణ వ్యాపారశూన్యమైన కేవలము ఏక ప్రాణము (బ్రహ్మము) మాత్రముండెను, దానికన్న భిన్నము ఏదియూ లేదు’. ఈ శ్రుతిలో ప్రాణచేష్ట వినబడుటవలన ప్రాణము అనాది.
సిద్ధాన్తము:- “ఏతస్మాజ్జాయతేప్రాణః” (ముం.2.1.3.) ‘ప్రాణవాయువుగూడ ఇంద్రియములవలే పరబ్రహ్మమునుండి ఉత్పన్నమయినది’. ఈ ముండక శ్రుతి ఆధారముపై ఇతర ఇంద్రియములవలే ముఖ్యప్రాణము యొక్క ఉత్పత్తి వినబడు చున్నది. అందువల్ల ‘ఆనీత’ శబ్దము ఉత్పత్తికి పూర్వము ప్రాణముయొక్క సద్భావ సూచకముకాదు. ఎందులకనగా ‘అవాతమ్’ అనగా ‘గాలి మొదలగు ప్రపంచముతో సంభన్ధములేనిది’ అను విశేషము ఉండుటవలన. “ఆనీదవాతం స్వధయా తదేకమ్” అను శ్రుతి మూల ప్రకృతిలో ప్రాణాది సమస్త విశేషముల అభావము చెప్పుటకు. అందువల్ల ఈ శ్రుతితో ప్రాణా ఉత్పత్తిని చెప్పు శ్రుతికి విరోధము లేదు.
వైయాసికన్యాయమాలా:-
177. ముఖ్యః ప్రాణః స్యాదనాదిర్జాయతే వా న జాయతే | ఆనీదితి ప్రాణచేష్టా ప్రాక్సృష్టేః శ్రూయతే యతః ||
178. ఆనీదితి బ్రహ్మసత్త్వం ప్రోక్తం వాతనిషేధనాత్ | ఏతస్మాజ్జాయతే ప్రాణ ఇత్యుక్తేరేష జాయతే ||
ముఖ్య ప్రాణము అనాదియా లేక ఉత్పన్నమయినదా? పూర్వపక్షి ప్రాణము అనాదియే ఉత్పన్నము కాలేదనును. ఎందులకనగా ‘ఆనీత్’ అను శబ్దము సృష్టికి పూర్వము ప్రాణచేష్ట చెప్పుచున్నది. సిద్ధాన్తి చెప్పుచున్నది. ‘ఆనీత్’ అను శబ్దము ద్వారా బ్రహ్మయొక్క అస్తిత్వమును చెప్పిరి మరియు ప్రాణముయొక్క వ్యాపారమును నిషేదించిరి. “ఏతస్మాదజ్జాయతే ప్రాణః” అనిన ఇంద్రియములవలే ప్రాణవాయువుగూడ పరమాత్మనుండి ఉత్పన్నమగుచున్నది. అందువల్ల ప్రాణము అనాదికాదు కాని ఉత్పన్నమయినది.
భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-
నోటి ద్వారా జరుగు శ్వాస ప్రశ్వాసలలో గల వాయువు ప్రాణము, అది ఉత్పన్నమగు చున్నదా లేదా అను సందేహమునకు పూర్వపక్షి ఈ ప్రాణము ఉత్పన్నమగుటలేదు ఎందులకనగా ఉత్పత్తికి పూర్వము ‘ఆనీదవాతమ్’ అనుచోట ‘ఆనీత్’ శబ్దముద్వారా సృష్టికి పూర్వము ప్రాణ వ్యాపారము వినబడుటవలన ప్రాణము నిత్యమనును.

సిద్ధాన్తి జవాబు. 'ఆనీత్' శబ్దము ప్రాణ వ్యాపారము చెప్పుటకుకాదు ఎందులకనగా 'అవాతమ్' అను శ్రుతి శబ్దముద్వారా ప్రాణములో వ్యాపారమును నిషేదించి బ్రహ్మ అస్తిత్వమును చెప్పిరి. ఏలనన "సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్" అనగా 'సృష్టికి పూర్వము చైతన్యరూపమైన బ్రహ్మము మాత్రమే ఉండెను' అను శ్రుతులతో సమానార్థమును చెప్పుటకు. "ఏతస్మాజ్జాయతే ప్రాణః" అనగా ' ఈ ప్రాణము పరమాత్మనుండి ఉత్పన్నమయినది'. ఇత్యాది శ్రుతులలో ప్రత్యక్షముగా ప్రాణము యొక్క ఉత్పత్తిని చెప్పిరి. అందువల్ల ఇంద్రియములవలే ప్రాణముగూడ పరమాత్మనుండి ఉత్పన్నమయినది.

277. శ్రేష్ఠశ్చ. (2.4.8.)

సూత్రార్థము:- ఇంద్రియములవలే ప్రాణముగూడ బ్రహ్మనుండి ఉత్పన్నమగును.

"ఏతస్మాజ్జాయతే ప్రాణః" అనిన 'ఈ ప్రాణము పరమాత్మనుండి ఉత్పన్నమయినది'. ఇచట ముఖ్య ప్రాణము యొక్క ఉత్పత్తి చెప్పిరి. "ఆనీదవాతం స్వధయా తదేకమ్" అనిన 'ప్రళయకాలములో పితరుల నిమిత్తము చెప్పు స్వధాతోబాటు సంపూర్ణ వ్యాపారశూన్యమైన కేవలము ఏక ప్రాణము (బ్రహ్మము) మాత్రముండెను, దానికన్న భిన్నము ఏదియూ లేదు'. సృష్టికి పూర్వము ప్రళయములో ప్రాణమున్నదని చెప్పు ఈ శ్రుతితో ముందు చెప్పిన ముండక శ్రుతి "ఏతస్మాజ్జాయతే ప్రాణః" అను శ్రుతితో విరోధము కలదా లేదా? విరోధము కలదనును పూర్వపక్షి. సిద్ధాన్తి ముఖ్య ప్రాణముగూడ ఇంద్రియములవలే ఉత్పన్న మగునని. 'ఆనీత్' శబ్దము ఉత్పత్తికి పూర్వము ప్రాణమున్నదని చెప్పుటకు కాదు. ఆ శ్రుతిలో 'అవాత' శబ్దమును విశేషముగా చెప్పిరి. 'అవాత' శబ్దార్థము 'పరమేశ్వరుడు ప్రాణము మరియు మనోవ్యాపార రహితము కేవలము శుద్ధస్వరూపము'. ఈ వాక్యము ద్వారా మూలపకృతిలో ప్రాణాది సమస్త విశేషముల అభావము బ్రహ్మలో చెప్పిరి. అందువల్ల ప్రాణమున్నదని చెప్పు శ్రుతితో ప్రాణోత్పత్తిని చెప్పు శ్రుతికి విరోధములేదు.

## 83. న వాయుక్రియాఽధికరణము.

సంగతి:- ఈ విధముగా ప్రాణముయొక్క ఉత్పత్తి విచారము చెప్పిన తరువాత ఆ ప్రాణముయొక్క స్వరూపము చెప్పుటకు ప్రసంగ సంగతిద్వారా ఈ అధికరణమును చెప్పుచున్నారు.
విషయము:- ముఖ్య ప్రాణముయొక్క స్వరూపమును చెప్పుట ఈ అధికరణమునకు విషయము.
సంశయము:- ముఖ్య ప్రాణము వాయువా, ఇంద్రియముల వ్యాపారమా లేక వాయు విశేషమా?
పూర్వపక్షము:- శ్రుతి ఆధారముపై వాయువే ప్రాణము లేక ఇంద్రియముల సామాన్య వ్యాపారమును ప్రాణమని స్వీకరించవలయును ఎందులకనగా సాంఖ్యులు ప్రాణమును ఆవిధముగనే స్వీకరించిరి.
సిద్ధాన్తము:- 'బాహ్య వాయువు ద్వారా ప్రాణము ప్రవృత్తియగు చున్నది'. ఈ శ్రుతిద్వారా ప్రాణము మరియు బాహ్యవాయువు భిన్నమని చెప్పిరి. ఏకత్వమును చెప్పు శ్రుతి తత్త్వదృష్టితో చెప్పెను. మనస్సు వలే ఇంద్రియములవలే ప్రాణముగూడ సామాన్యరూపముగా బ్రహ్మద్వారా ప్రేరకము కాని ఈ ప్రాణము ఇంద్రియములకన్న భిన్నము.
వైయాసికన్యాయమాలా:-

179. వాయుర్వాఽక్రియా వాఽన్యే వా ప్రాణః శ్రుతితోఽనిలః | సామాన్యేన్ద్రియవృత్తిర్వా సాంఖ్యైరేవముదీరణాత్ ||
180. భాతి ప్రాణో వాయునేతి భేదోక్తేరేకతాశ్రుతిః | వాయుజత్వేన సామాన్యవృత్తిర్నాక్షేష్వతోఽన్యతా ||
ప్రాణము వాయువా లేక ఇంద్రియముల సామాన్య వ్యాపారమా లేక ఈ రెండిటికన్న భిన్నమా? "య ప్రాణః స వాయుః" ఈ శ్రుతిలో ప్రాణమునే వాయువనిరి. లేక ఇంద్రియముల సామాన్య వ్యాపారము ప్రాణము ఎందులకనగా సాంఖ్యులు ఆ విధముగా స్వీకరించిరి అనును పూర్వవాది. సిద్ధాన్తము."ప్రాణో వాయునా భాతి" అనగా 'వాయువుద్వారా ప్రాణము అభివ్యక్తమగు చున్నది'. అను శ్రుతిలో వాయువు మరియు ప్రాణమును విడిగా చెప్పిరి. వీనిలో ఏకత్వము కార్యకారణముల అభేదముద్వారా సిద్ధమగును. ఇంద్రియముల సామాన్య వ్యాపారముతో ప్రాణమునకు సంబన్ధములేదు. కనుక వాయువు, ఇంద్రియముల సామాన్య వ్యాపారములకన్న ప్రాణము వేరు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

వాయువు వేణువు ఛిద్రములోవలే ముఖఛిద్రములో ప్రవేశించి ప్రాణ నామముతో ప్రసిద్ధ మైనది అంతేగాని ప్రాణము వేరొక పదార్థము కాదు. అందులకే శ్రుతిలో "యః ప్రాణః స వాయుః" అనగా 'ఏది ప్రాణమో అదే వాయువు' అనిరి. లేక పంజరములో నున్న అనేక పక్షులు వాని వాని వ్యాపారముద్వారా పంజరమును నడుపును అదేవిధముగా ఈ ఏకాదశ ఇంద్రియములు వాని వాని వ్యాపారముద్వారా దేహమును నడిపించుచున్నవి. ఆ ఇంద్రియములకు సామాన్య వ్యాపరము చేయించునదియే ప్రాణము. అందుకే సాంఖ్యులు చెప్పునది "సామాన్యకరణవృత్తిః ప్రాణాద్యా వాయవః పఞ్చ" అనగా 'ఇంద్రియముల సామాన్య వ్యాపారము ప్రాణ అపానాది ఐదు వృత్తులు'. ఇంతవరకు పూర్వపక్షి మతము. దీనికి సిద్ధాన్తి చెప్పు సమాధానము. "ప్రాణ ఏవ బ్రహ్మణశ్చతుర్థః పాదః స వాయునా జ్యోతిషా భాతి చ తపతి చ" (ఛాం. 3.18.4.) అనగా 'ప్రాణమే బ్రహ్మము యొక్క చతుర్థ పాదము అది వాయురూపమైన జ్యోతిద్వారా అభివ్యక్త మగును మరియు ప్రకాశము నిచ్చును'. ఈ ప్రకారము శ్రుతులలో నాలుగు పాదములుగల బ్రహ్మయొక్క ఉపాసన ప్రసంగములో శరీరములోనున్న ప్రాణము మరియు దేవతలలోనున్న వాయువునకు పరస్పరము ఉపకార్య-ఉపకారకభావరూపములో భేదము స్పష్టముగా చెప్పిరి. "యః ప్రాణః స వాయుః" ఈ అభేదము చెప్పు శ్రుతి కార్య-కారణములు అభిన్నమని బోధించుటకు చెప్పబడినదని తెలిసికొన వలయును. 'సామాన్యకరణవృత్తి' అని సాంఖ్యులు చెప్పునది అసంగతము ఎందులకనగా ఇంద్రియములకు సామాన్యవృత్తి ఉండజాలదు. పక్షులు పంజరమును నడుపుటకు ఒకరూపమైన వ్యాపరము ఉండవచ్చును, కాని ఇంద్రియములలో అట్టి వ్యాపారము లేదు ఏలనన చూచుట, వినుట మరియు నడచుట మొదలగు వ్యాపారములు వేరు వేరైనవి మరియు ఆ వ్యాపరములు పంజరమును నడుపుటకు అనుకూలముకావు. దీనివలన ప్రాణము భిన్న వస్తువని సిద్ధమైనది.

278. న వాయుక్రియే పృథగుపదేశాత్. (2.4.9.)

సూత్రార్థము:- ముఖ్య ప్రాణము వాయువు కాదు మరియు ఇంద్రియముల సామాన్య వ్యాపారముగూడ కాదు కాని వాయు విశేషము. ఎందులకనగా 'స వాయునా జ్యోతిషా' అనగా 'అది వాయురూపమైన జ్యోతిద్వారా అభివ్యక్తమగును' ఈ శ్రుతిద్వారా మరియు "ఏతస్మాజ్జాయతే ప్రాణః" అను శ్రుతిద్వారాగూడ వాయు ప్రాణములను విడి విడిగా ఉపదేశము గావించిరి. ఇంద్రియముల వ్యాపారము ఇంద్రియములకన్న భిన్నముకాజాలదు అందువల్ల శరీరభావమును పొంది పఞ్చవృత్తి రూపమైన వాయు విశేషమే ప్రాణము.

ఇచట పూర్వపక్షములో  ప్రాణ విషయములో శ్రుతి న్యాయయముల విరోధముండుటవలన సమన్వయము అసిద్ధమనును. సిద్ధాన్తములో విరోధము లేనందున సమన్వయము సిద్ధము. వాయుపే ముఖ్య ప్రాణమా లేక ప్రాణము ఇంద్రియముల సామాన్య వ్యాపారమా లేక వాయు విశేషము ప్రాణమా? ఈ సంశయమునకు పూర్వవాది చెప్పునది.  వాయుపే ముఖ్య ప్రాణము. "యః ప్రాణః స వాయుః స ఏష వాయుః పఞ్చవిధః" అనిన 'ఏది ప్రాణమో అదే వాయువు, ఆ వాయువు ఐదు భాగములై  ప్రాణ, అపాన, సమాన, వ్యాన, ఉదానరూపములుగా శరీరములో నున్నది. ఈ శ్రుతి వాయువునే ముఖ్య ప్రాణముగా చెప్పుచున్నది. కానిచో ఇంద్రియముల సామాన్య వ్యాపారము ఈ పఞ్చవృత్తులుగల ప్రాణము. సాంఖ్యుల మతానుసారము ధర్మి (ప్రాణములో) భేదముకన్న ధర్మ (ప్రాణవ్యాపారము) భేదము తక్కువ దోషము అను న్యాయానుసారము అన్ని ఇంద్రియముల వ్యాపరమునే ప్రాణమని స్వీకరించవలయును. ఈ పూర్వపక్షమునకు సిద్ధాన్తి జవాబు. ముఖ్య ప్రాణము వాయువు కాదు మరియు సంపూర్ణ ఇంద్రియముల వ్యాపారరూపముగూడ కాదు ఎందులకనగా "ప్రాణ ఏవ బ్రహ్మణః శ్చతుర్థః పాదః స వాయునా జ్యోతిషా భాతి చ తపతి చ" (ఛాం.3.18.4.)అనగా 'ప్రాణమే బ్రహ్మము యొక్క చతుర్థ పాదము అది వాయురూపమైన జ్యోతిద్వారా అభివ్యక్త మగును మరియు ప్రకాశము నిచ్చును' ఇచట వాయువు కన్న భిన్నముగా ప్రాణమునుపదేశించిరి. "ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేన్ద్రియాణి చ" (ముం. 2.1.3.) అనగా 'ఈ బ్రహ్మమునుండి ప్రాణము, మనస్సు మరియు అన్ని ఇంద్రియములు ఆకాశము, వాయువు గూడ ఉత్పన్నమయినవి'. ఈ శ్రుతిద్వారా వాయువు మరియు ఇంద్రియముల వ్యాపారము పేర పేరుగా చెప్పిరి. వాయువు లేక ఇంద్రియవ్యాపారము ప్రాణమయిన విడి విడిగా ఉపదేశము చేసియుండరు ఎందులకనగా వాయువు నుండి వాయువు, ఇంద్రియములనుండి ఇంద్రియముల వ్యాపారము పేరు చేయలేరు. అందువల్ల అధ్యాత్మభావమును పొందిన ప్రాణాది ఐదువృత్తులు వాయువిశేషములు. ఈ విధముగా ఒప్పుకొనిన పూర్వపక్షములతో విరోధముండదు.
ఇంద్రియవ్యాపారము ప్రాణముకాదు, ఇంద్రయములవలే ముఖ్య ప్రాణములో కరణత్వములేదు. కరణము కరణవ్యాపారముల కన్న భిన్నమైన ముఖ్యప్రాణము జీవునివలే స్వతంత్రమని చెప్పవలయును. అను సంశయమునకు  సమాధానముగా ముందు సూత్రమును చెప్పిరి.

279. చక్షురాదివత్తు తత్సహశిష్టాదిభ్యః. (2.4.10.)

సూత్రార్థము:- ప్రాణము జీవాత్మవలే స్వతంత్రము కాదు కాని చక్షురాది కరణమువలే పరాధీనము ఎందులకనగా ప్రాణ సంవాద ప్రకరణములో చక్షురింద్రియములతోపాటు ప్రాణమునుగూడ చెప్పిరి అంతేగాక ప్రాణములో అచేతనత్వమునుగూడ చెప్పిరి.

సూత్రములోనున్న 'తు' శబ్దము జీవునివలే ప్రాణములో స్వతంత్ర లేదని చెప్పుటకు అనగా ఈ శరీరములో జీవునితో  సమానముగా ప్రాణములోగూడ స్వాతంత్ర్యము లేదని తెలిసికొనవలయును. కాని రాజపురుషునివలే జీవుని కర్తృత్వములో చక్షురాది ఇంద్రియములు ఉపకరణములు. ఆలాగుననే ముఖ్య ప్రాణము అన్ని ప్రయోజనములను సాధించుటవలన రాజునకు మంత్రివలే జీవునికి  ఉపకరణము. ఎందులకనగా ప్రాణ సంవాదాది ప్రసంగములో చక్షురాది ఇంద్రియములతోపాటు ముఖ్య ప్రాణముయొక్క ఉపదేశము వినబడుచున్నది. సమాన

ధ్ధర్మములున్నవానినే జతగా (సహశిష్టాది) ఉపదేశించుట యుక్తియుక్తము. సూత్రములోనున్న ఆది శబ్దము ప్రాణములో స్వతంత్రము లేదని చెప్పుటకు, అచేతనత్వమును చెప్పుటకు మరియు భౌతికత్వాదులు చెప్పుటకు అని తెలిసికొనవలయును.

చక్షురాది ఇంద్రియములవలే ప్రాణముగూడ జీవునికి ఉపకరణమని స్వీకరించిన కన్నులకు రూపము విషయమైనటుల ప్రాణమునకు గూడ ఒక విషయముండవలెను. ఈ ప్రశ్నకు జవాబు ముందు సూత్రములో చెప్పిరి.

280. అకరణత్వాచ్చ న దోషస్తథా హి దర్శయతి. (2.4.11.)

సూత్రార్ధము:- ప్రాణము ఇంద్రియముల వంటిది కాదు ఏదో ఒకవిషయమును నిర్వహించుచు జీవునకు ఇంద్రియములవలే ఎదుట నున్న విషయములను జుచుట ఆఘ్రాణించుట మొదలగు సంసారభోగములయొక్క జ్ఞానమునందు సాధనము కాదు.

ప్రాణము విషయములను గ్రహించునదికాదు గాన ప్రాణమునకు విషముండవలయునను దోషమురాదు. మరి ప్రాణము ఏ కార్యమును నిర్వర్తించుటలేదనియు చెప్పజాలము ఎందులకనగా 'తాన్ వరిష్ఠ' అను శ్రుతిద్వారా శరీరము మరియు ఇంద్రియములను ధరించు కార్యము చేయుచున్నది. చక్షురాది ఇంద్రియములవలే ప్రాణమును జీవుని ఉపకరణమని చెప్పినను ఆ ప్రాణమునకు ఇంకొక విషముండవలయునను దోషమురాదు. ఇంద్రియములకు ఆ యా విషములుండుటవలన వానిలో కరణత్వమున్నటుల ప్రాణమునకు గల కరణత్వము అటులకాదు కాని అన్య ప్రకారము ఎటులనగా శరీరాదులను బ్రతికించుటకు మాత్రమేగాని ఇంద్రియములవలే విషయములను గ్రహించుటకుకాదు. ఈ విషయమునే ప్రశ్నోపనిషత్తులో ఇటుల చెప్పిరి. "తాన్వరిష్ఠః ప్రాణః ఉవాచ, మా మోహమాపద్యథాహమేవైతత్పఞ్చధాత్మానం ప్రవిభజ్యైతద్ బాణమవష్టభ్య విధారయామి" (ప్ర.2.3.) అనగా 'ఇంద్రియములారా మీరు మొహమును వొంది వ్యర్థమైన అభిమానమును వొందకుడు నేనే (వరిష్ట ప్రాణమును) ఐదు భాగములగా విభక్తమై ఈ శరీరమును ధరించుచున్నాను'. ప్రాణము శరీరమును వదిలివెళ్ళునపుడు ఇంద్రియములు పనిచేయవు, శరీరముగూడ పడిపోవును ఈ ప్రసఙ్గమును చూపుచు శ్రుతి శరీర స్థితి ప్రాణము యొక్క విశేష వ్యాపరమని చెప్పుచున్నది. అనగా ప్రాణమువలననే శరీరముండును లేనిచో కుళ్లి పోవును.

281. పఞ్చవృత్తిర్మనోవద్వ్యపదిశ్యతే. (2.4.12.)

సూత్రార్ధము:- ఏ విధముగా శ్రోత్రాది ఇంద్రయములద్వారా అన్తఃకరణమునకు శబ్దాది ఐదు వృత్తుల జ్ఞానము కలుగుచున్నదో ఆలాగుననే "ప్రాణోఽపానో" అను శ్రుతిలో ప్రాణమునకు గూడ ప్రాణాపానోదానసమానవ్యానాది భేదముద్వారా ఐదు వృత్తులు చెప్పిరి.

బృహదారణ్యకములో "ప్రాణోఽపానో వ్యాన ఉదానా. సమానః" (బృ.1.5.3.) అనగా 'ప్రాణము, అపానము, సమానము, ఉదానము, వ్యానము' అను ఐదువృత్తులుగల ప్రాణమును ఉపదేశించిరి. అందువల్ల ముఖ్య ప్రాణము యొక్క విశేష కార్యము దేహధారణము. ఏవిధముగా శ్రోత్రాదినిమిత్తము ద్వారా కలుగు శబ్దాదులను గ్రహించుటకు

మనస్సుయొక్క ఐదు మనోవృత్తులు ప్రసిద్ధమో అటులనే ఈ ప్రాణమునకు ఐదు వృత్తులు చెప్పబడినవి. ఆ ముఖ్యప్రాణము ఉచ్ఛ్వాసరూపముగా ప్రవర్తించునపుడు ప్రాణనామముతోను, ఆహారాదులను, మూత్రపురీషాదులను క్రిందికి తోయు అధోగమన వ్యాపరమువలన అపాననామముతోను, ఊర్ధ్వాభిముఖమై జీవనిర్గమనకారణ మగునపుడు ఉదాననామముతోను, పచనమైన ఆహారరసమును అన్ని అవయవములకు పంచి ఇచ్చునపుడు సమాననామముతోను, సర్వశరీరములోను సంధులలో వ్యాపించి బలవంతమైన కార్యములను ఆచరించునపుడు వ్యాననామముతోను ఈ ప్రాణము ఐదు నామములతో వ్యవరింపబడు చున్నది. ఈ అసాధారణ వ్యాపారములనపేక్షించియే మనస్సువలే ప్రాణమునుగూడ జీవుని ఉపకరణమని చెప్పిరి అంతేగాని విషయములను గ్రహించుట వలన కాదు.

## 84. శ్రేష్ఠాణుత్వాధికరణము.

సంగతి: ప్రాణము యొక్క ఉత్పత్తి మరియు దాని స్వరూపము వెనుకటి రెండు అధికరణములలో చెప్పిరి. ఇపుడు ఆ ప్రాణముయొక్క పరిమాణమును చెప్పుటకు అతిదేశ సంగతి ద్వారా ఈ అధికరణమును చెప్పు చున్నారు.
విషయము: ప్రాణముయొక్క పరిమాణము ఈ అధికరణములో విచారించెదరు.
సంశయము: ప్రాణము వ్యాపకమా లేక పరిచ్ఛిన్నమా?
పూర్వపక్షము: క్షుద్రజంతువులనుండి హిరణ్యగర్భపర్యన్తము అన్ని దేహములలో సమానరూపముగా నుండుటవలన ప్రాణము వ్యాపకమని చెప్పుటయే ఉచితము.
సిద్ధాన్తము: సమష్టిరూపములోనున్న ఆధిదైవిక వాయువు వ్యాపకము, వ్యష్టిరూపములోనున్న ఆధ్యాత్మిక వాయువు పరిచ్ఛిన్నము. ఇంద్రియములవలే ప్రాణముగూడ అతీన్ద్రియము.
వైయాసికన్యాయమాలా:
181. ప్రాణోఽయం విభురల్పో వా, విభుః స్యాత్ ప్లుష్యుపక్రమే | హిరణ్యగర్భపర్యన్తే సర్వదేహే సమోక్తితః ||
182. సమిష్టివ్యష్టిరూపేణ విభురేవాఽఽధిదైవికః | ఆధ్యాత్మికోఽల్పః ప్రాణః స్యాదదృశ్యశ్చ యథేన్ద్రియమ్ ||
ఈ ప్రాణము వ్యాపకమా లేక పరిచ్ఛిన్నమా? ప్రాణము వ్యాపకము ఎందులకనగా దోమకన్న సన్న జంతువుతోను, దోమతోను మొదలై హిరణ్యగర్భపర్యన్తము అన్ని దేహములలో సమానముగా నుండుటవలన అనును పూర్వపక్షి. సిద్ధాన్తి జవాబు. సమష్టిరూపములో నున్న ఆధిదైవిక వాయువు వ్యాపకము కాని ఆధ్యాత్మిక ప్రాణము ఇంద్రియమువలే పరిచ్ఛిన్నము మరియు అదృష్యము.
భారతీ తీర్థులవారి వ్యాఖ్య:
ప్లుషి అనగా దోమకన్న చిన్న జంతువు దాని పేరు పుత్తికా దానినుండి మొదలై హిరణ్యగర్భపర్యన్తము అన్ని శరీరములలో ఆ యా శరీరమంతటను వ్యాపించి యుండుటవలన ప్రాణము వ్యాపకము. శ్రుతిలో "సమః ప్లుషిణా సమో మశకేన" అను వాక్యముద్వారా ఈ విషయము వినబడుచున్నది అనును పూర్వపక్షి. సిద్ధాన్తి సమాధానము. ఆధిదైవిక హిరణ్యగర్భ ప్రాణము వ్యష్టి సమష్టిరూపములలో నున్నందున అది వ్యాపకము. ఎందులకనగా శ్రుతిలో "వాయురేవ వ్యష్టిః వాయురేవ సమష్టిః" అనిరి. ఆ విభుత్వమునే "సమః ప్లుషిణా" అని

శ్రుతిద్వారా విస్తారముగావించిరి. కాని ఆధ్యాత్మిక ప్రాణము ఇంద్రియములవలే పరిచ్ఛిన్నము మరియు అదృశ్యము.

282. అణుశ్చ. (2.4.13.)

సూత్రార్థము:- పూర్వధికరణములో చెప్పిన ముఖ్య ప్రాణము అణుపరిమాణము గలది మరియు పరిచ్ఛిన్నము, అదృష్యము.

ఉత్-క్రమణము చెప్పు శ్రుతితో విభుత్వమును చెప్పు శ్రుతికి విరోధముండుటవలన సమన్వయము అసిద్ధమనును పూర్వవాది. విరోధము లేనందున సమన్వయము సిద్ధమనును సిద్ధాన్తి. "తముత్-క్రామన్తం సర్వే ప్రాణాః ఉత్-క్రామన్తి" అనగా 'శరీరమువదిలి ముఖ్య ప్రాణము పోవునపుడు అన్ని ఇంద్రియములు దానితో పోవును' ఈ ఉత్-క్రాన్తిని చెప్పు శ్రుతితో వ్యాపకమునుచెప్పు ఈ శ్రుతికి (బృ.1.3.22.) విరోధముకలదా లేదా? వ్యాపకశ్రుతి " సమ ఏభిస్త్రిభిర్లోకైః సమోఽనేన సర్వేణ" అనగా 'ఈ మూడు లోకములతోను సర్వ బ్రహ్మాండముతోను ప్రాణము సమానము అన్నింటిలోను వ్యాపకము'. విరోధము కలదనును పూర్వవాది. సిద్ధాన్తి చెప్పునది. ముఖ్య ప్రాణము గూడ చక్షురాది ఇంద్రియములవలే అణు పరిమాణముగలది. ఇచట అణుత్వమనగా సూక్ష్మత్వము మరియు పరిచ్ఛిన్నత్వమని తెలిసికొనవలయును కాని పరమాణు తుల్యత్వముకాదు ఎందులకనగా ప్రాణము తన ఐదు వృత్తులతో విభిన్న వ్యాపారములు గావించుచు సర్వ శరీరము వ్యాపించి యున్నది. మరి ప్రాణమును పరిచ్ఛిన్నమని చెప్పిన దాని విభుత్వమును చెప్పు శ్రుతికి విరోధము కలుగుననిన అట్లనుట సరికాదు. విభుత్వ శ్రుతి సమష్టి వాయువును చెప్పుచున్నదే కాని శరీరములోనున్న ఆధ్యాత్మిక వాయువును గురించి కాదు. అందువల్ల చెప్పిన శ్రుతులలో విరోధము లేదు.

## 85. జ్యోతిరాద్యధికరణము.

ఈ విధముగా ముఖ్య ప్రాణముయొక్క అద్యాత్మ అధిదైవ భేదముద్వారా అణుత్వము మరియు విభుత్వమును చెప్పి ఈ ప్రాణ ప్రసంగమునుండి అధిదేవతాదులద్వారా అధిష్ఠితమైన ఇంద్రియముల వ్యాపారమును చెప్పుటకు ఈ అధికరణము ప్రారంభించు చున్నారు.

సంగతి:- (హిరణ్యగర్భుని ప్రాణములును ఇంద్రియములును వ్యష్టి జీవుల ప్రాణేంద్రియములకు అధిదేవతలని తెలిసి కొనవలయును.) అధిదేవతలద్వారా అధిష్ఠితములైన ఇంద్రియముల చేష్టలను చెప్పుటకు ప్రసంగ సంగతి ద్వారా ఈ అధికరణము ప్రారంభించిరి.

విషయము:- చక్షురాది ఇంద్రియముల ప్రవృత్తిని గురించి విచారించెదరు.

సంశయము:- చక్షురాది ఇంద్రియముల ప్రవ త్తి దైవాధీనమా లేక దైవనిరపేక్ష స్వతంత్రమా?

పూర్వవాది:- ఇంద్రియముల ప్రవృత్తి స్వతంత్రము, దైవాధీనముకాదు, దైవాధీనమనిన దేవతలకు గూడ జీవుని భోగములు అనుభవించవలయును.

సిద్ధాన్తము:- వాగాదుల ప్రవృత్తి దైవాధీనమని స్వీకరించినను ఆ యా భోగములు దేవతలకు కలుగునని చెప్పుట

అఉచితముకాదు, ఎందులకనగా దేవతల భోగము దేవశరీరములోనే సిద్ధమగును కాని అన్య శరీరములో తమ తమ కార్మానుసారము జీవుడే భోక్తగా స్వీకరించవలయును అదే ఉచితము.

వైయాసికన్యాయమాలా:

183. స్వతన్త్రా దేవతన్త్రా వా వాగాద్యాః స్యుః? స్వతన్త్రాతా | నోచేద్వాగాదిజో భోగో దేవానాం స్యాన్న చాఽఽత్మనః ||

184. శ్రుతమగ్న్యాదితన్త్రత్వం భోగోఽగ్న్యాదేస్తు నోచితః | దేవదేహేషు సిద్ధత్వాజ్జీవో భుఙ్క్తే స్వకర్మణా ||

వాగాది ఇంద్రియములు స్వతంత్రములా లేక దేవాధీనములా? స్వతంత్రములు, స్వతంత్రములు కానిచో వాగాదిజన్య భోగము దేవతలకు చెందును గాని జీవునికి కాదు అనును పూర్వవాది. సిద్ధాన్తి జవాబు. వాగాది ఇంద్రియములు పరతంత్రములు ఎందులకనగా శ్రుతిలో అగ్న్యాది దేవతల అధీనము ఇంద్రియముల భోగము అని చెప్పిరి. అయినను అగ్న్యాదిదేవతలకు ఈ జీవభోగ ప్రసంగము లేదు. దేవశరీరములో దివ్యభోగములు కలుగును అందువల్ల జీవుడు తన కర్మానుసారము కర్మఫలములు అనుభవించును.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

వాగాది ఇంద్రియములు వాని వాని విషయములలో స్వాతన్త్ర్యముగా ప్రవృత్త మగును పరతన్త్రములై దేవాధీనములుకావు కానిచో వాగాదిజన్య భోగము దేవతలు అనుభవించవలసిన ప్రసంగము వచ్చును అంతేగాక జీవాత్మలో భోక్తృత్వము ఉండదు అనును పూర్వవాది. సిద్ధాన్తి జవాబు. "అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్"(ఐ. 2.4.) అనగా 'అగ్ని వాక్ రూపముదాల్చి ముఖములో ప్రవేశించెను' మొదలుగాగల శ్రుతులలో వాగాది ఇంద్రియములు అగ్ని మొదలుగాగల దేవతల సహాయమువలన ప్రవర్తించును.

ఈ విధముగా శ్రుతిలో చెప్పుటవలన దేవతల సహాయముతో ఇంద్రియములు ప్రవృత్తమగు చున్నవి. దీనిద్వారా దేవతలలో భోక్తృత్వము వచ్చునుకదా అనిన అట్లనుట సరికాదు, ఎందులకనగా పూర్తి పుణ్యమువలన దేవత్వము పొందిన వారికి (అధమ భోగములలో) నీచమగు భోగములలో ప్రవృత్తి కలుగజాలదు ఏలనన దేవశరీరములో దివ్య భోగములు సిద్ధమగును. మనుష్యాది జీవులు దేవతలద్వారా ప్రేరితమైన ఇంద్రియములద్వారా తాము సంపాదించిన కర్మ ఫలములను అనుభవింతురు. అందువల్ల ఇంద్రియములు దేవప్రేరితములని సిద్ధమైనది.

### 283. జ్యోతిరాద్యధిష్ఠానం తు తదామననాత్. (2.4.14.)

సూత్రార్థము:- చక్షురాది ఇంద్రియములు ఆదిత్యాది దేవతల అధీనమై చేష్టలు గావించుచున్నవి ఏలనన "ఆదిత్యశ్చక్షుః" అను శ్రుతిలో ఈ విషయమునే చెప్పిరి.

"వాచా శబ్దాన్ వదతి" అనగా 'వాణిద్వారా శబ్దములు పలుకుచున్నాడు' మొదలుగాగల కొన్ని శ్రుతులు ఇంద్రియములు స్వతంత్రముగనే తమ తమ వ్యాపారములందు సామర్థ్యము కలవని చెప్పుచున్నవి. "అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్" అనగా 'అగ్నిదేవుడు వాణీరూపమై ముఖములో ప్రవేశించెను'. అను శ్రుతులు ఇంద్రియములకు దేవతాసహాయము లేకున్న ప్రవృత్తి సంభవింపనేరదని చెప్పుచున్నవి. ఇంద్రియములు దేవాధీనమని చెప్పు శ్రుతులకు దేవనిరపేక్ష స్వంతత్రములు ఇంద్రియములు అని చెప్పు శ్రుతులకు విరోధముండుటవలన సమన్వయము అసిద్ధమనును పూర్వవాది. విరోధము లేనందున సమన్వయము సిద్ధమనును సిద్ధాన్తి. విరోధ సంశయమునకు పూర్వవాది చెప్పునది. వాగాది ఇంద్రియముల ప్రవృత్తి

దేవాధీనమనిన దేవతలకు ఆ ఇంద్రియకర్మల భోక్తృత్వ ప్రసంగము వచ్చును అంతేగాక జీవుని భోక్తృత్వమే నష్టమగును. అందువల్ల వాగాది ఇంద్రియముల ప్రవృత్తి తమ తమ సామర్థ్యమువలననే జరుగును. సిద్ధాన్తి జవాబు. సూత్రములోనున్న 'తు' శబ్దము పూర్వవాదిని ఖండించుటకు చెప్పిరి. జ్యోతిరాది పదములకు అర్థమైన అగ్న్యాది దేవతలద్వారా ప్రేరేపించబడి వాగాది కరణ సమూహము తమ తమ వ్యాపారములలో ప్రవృత్తమగు చున్నవి. శ్రుతిలో ఆవిధముగనే చెప్పిరి. "అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్" అనగా 'అగ్నిదేవత వాగింద్రియమై ముఖములో ప్రవేశించెను'. ఈ శ్రుతిలో ఇంద్రియములు దేవతలద్వారా ప్రేరితములని చెప్పబడినది. స్మృతిలో " వాగధ్యాత్మమితి ప్రాహుర్బ్రాహ్మణాస్తత్త్వదర్శినః | వక్తవ్యమధిభూతం తు వహ్నిస్తత్రాధిదైవతం" అనగా 'వేదజ్ఞ తత్త్వదర్శీ బ్రాహ్మణులు వాగిద్రింయము అధ్యాత్మము (శరీరమునకు సంబంధించినది) మాట అధిభూతము (మాట శబ్దమగుటచే ఆకాశభూతమునకు సంబంధించినది) మరియు అగ్ని అధిదైవతము (అధిదేవత) మనిరి' స్మృతిలోగూడ వాగాది ఇంద్రియములు అగ్న్యాదిదేవతలద్వారా ప్రేరితములని చెప్పబడినది. భారము వహించుటకు రథాదులయందు సామర్థ్యమున్నను గుఱ్ఱముల సహాయము కావలసియే ఉన్నది. "చక్షుషా హి పశ్యతి" అనగా 'కన్నులతోనే చూచును' అని శ్రుతిలో గూడ దేవతల ప్రేరణ నిషేదించలేదు కనుక ప్రమాణికమే. వేదానుసారము ఇంద్రియములకు అబిమాన దేవతలు కలరు అనునది సిద్ధమైనది.
ఇంద్రియములకు అధిష్ఠాన దేవతలను స్వీకరించిన భోక్తృత్వము దేవతలకు చెందునను ప్రశ్నకు సమాధానము క్రింది సూత్రము.

284. ప్రాణవతా శబ్దాత్. (2.4.15.)

సూత్రార్థము:- ప్రాణముతోనున్న జీవునికి ఇంద్రియములతో స్వస్వామిభావ సమ్బన్ధము కలదు అందువల్ల ఇంద్రియములద్వారా కలుగు భోగములను అనుభవించువాడు జీవుడే కాని ఇంద్రయాభిమాన దేవతలుకారు ఎందులకనగా "స చాక్షుష పురుషో" అనగా 'ఆ కన్నుల అభిమాని జీవుడు. ఆతడు రూపములను గ్రహించుటకు నేత్రేంద్రియము పని చేయును'. అను శ్రుతి ప్రమాణము.

స్థూల-సూక్ష్మ శరీరసంఘాతము యొక్క స్వామి-ప్రాణధారి-జీవునితో ఇంద్రియములకు స్వస్వామిభావ సమ్బన్ధము కలదు. ఎందులకనగా 'శబ్దాత్' అనగా శ్రుతిలో చెప్పుటవలన. "స చాక్షుషః పురుషో దర్శనాయ చక్షురథ యో వేదేదం జిఘ్రాణీతి స ఆత్మా గన్ధాయ ఘ్రాణమ్" (ఛాం. 8.12.4) అనగా 'నేత్రేంద్రియము నేత్రగోళములో ప్రవేశించినపుడు దానిని అభిమానించువాడు జీవుడు. ఆయన విషయమును గ్రహించుటకు నేత్రేంద్రియము పనికి వచ్చును. 'నేను దీనిని ఆఘ్రాణించుచున్నాను' అని తెలిసికొనువాడు జీవుడు. ఆయనకు గంధమును చూపుటకై ఘ్రాణము పనికి వచ్చును'. ఇత్యాది శ్రుతులలో జీవునితో ఇంద్రియముల సమ్బన్ధము వినబడుచున్నది. కనుక ఇంద్రియములద్వారా కలుగు భోగము యొక్క సమ్బన్ధము జీవునితో నుండును కాని దేవతలతో కాదు.

285. తస్య చ నిత్యత్వాత్. (2.4.16.)

సూత్రార్థము:- జీవుడు తన ధర్మముద్వారా ఆర్జించిన ఫలము శరీరమున కర్తయై మరియు భోక్తయై పుణ్య పాపములతో సంబంధము స్థిరముగా ముక్తివరకు ఉండుటవలన ఆ శరీరములో దేవతల భోక్తృత్వముండజాలదు.

శరీరమును ధరించిన జీవుడు తన కర్మల ద్వారా సంపాదించిన శరీరములోనే భోక్తరూపముగా నిత్య సన్నిహితుడై యుండును. వాని పుణ్యపాపముల సుఖదుఃఖముల భోగసంబంధము ఆ శరీరముతోనే ఉండుటవలన దేవతల భోక్తృత్వముండదు. దేవతలు ఇంద్రియములకు అధిష్ఠాతలై కరణ పక్షములో నియామకులైనను శరీరముయొక్క భోక్తృత్వము వారిలో ఉండదు. అదృష్టముద్వారా జీవుడు ఇంద్రియములకు అధిష్ఠాత అందువలన రథస్వామివలే భోక్త, దేవతలు ప్రకాశమువలే ఇంద్రియములకు ఉపకారకులగుటవలన సారథి సమానము అధిష్ఠాతలు మాత్రమే.

## 86. ఇన్ద్రియాధికరణము.

సంగతి:- ముఖ్య ప్రాణమునకన్న భిన్నముగా ఇంద్రియముల అస్థిత్వము లేనందువలన వాని అధిష్ఠాత దేవతల చింతన ఎందుకు చేయవలయును? ఈ విధముగా ఆక్షేపము కలుగుటవలన పూర్వాధికరణముతో దీనికి ఆక్షేపసంగతి అని తెలిసికొనవలయును.

విషయము:- ఇంద్రియముల అస్థిత్వ విచారము ఈ అధికరణములో గావింతురు.

సంశయము:- ఇంద్రియములు ప్రాణవ్యాపర విశేషములా లేక ప్రాణముకన్న భిన్నమైన తత్త్వాన్తరములా ఇంద్రియములు?

పూర్వపక్షము:- వాగాది ఇంద్రియములలో ప్రాణరూపత్వము వినబడుటవలన ప్రాణ నామముతో ఇంద్రియములను చెప్పుదురు. గాన ప్రాణముయొక్క వ్యాపారవిశేషము వాగాది ఇంద్రియములు కాని స్వతంత్రములుకావు.

సిద్ధాన్తము:- వాగాది ఇంద్రియములు అలసిపోవునని చెప్పబడినది కాని ముఖ్య ప్రాణము అలసిపోదు. గనుక వాగాది ఇంద్రియముల ప్రాణనామము గౌణము. ఇంద్రియములన్నియు ప్రాణమున్ననే సర్వ కార్యములనాచరించును ప్రాణములేకున్న తమ తమ కార్యములు నిర్వహించలేవు అనగా విషయములను ప్రకాశింపజేయలేవు. కనుకనే అన్య ఇంద్రియములను ప్రాణ నామముతో చెప్పిరి. గాన ప్రాణము ఇంద్రియములకు నాయకుడు.

వైయాసికన్యాయమాలా:-

185. ప్రాణస్య వృత్తయోఽక్షాణి ప్రాణాత్తత్త్వాన్తరాణి వా |తద్రూపత్వశ్రుతేః ప్రాణనామ్నోక్తత్వాచ్చ వృత్తయః ||

186. శ్రమాశ్రమాదిభేదోక్తేర్గౌణే తద్రూపనామనీ |ఆలోచకత్వేనాన్యాని ప్రాణో నేతాఽక్షదేహయోః ||

ఇంద్రియములు ముఖ్య ప్రాణవృత్తులా లేక ప్రాణముకన్న భిన్న తత్వములా? ఇంద్రియములు ప్రాణవృత్తులే ఎందులకనగా ఈ ప్రాణమునకే రూపములయ్యెదము అని ఇంద్రియముల వాక్యమువలన ప్రాణేంద్రియములకు ఐక్యము కానవచ్చు చున్నది. అంతేగాక ప్రాణశబ్దముతో ఇంద్రియముల వ్యవహారము జరుగు చున్నది. అని పూర్వవాది మతము. అపుడు సిద్ధాన్తి జవాబు. ప్రాణముకన్న ఇంద్రియములు భిన్నము ఎందులకనగా ఇంద్రియములకు శ్రమాశ్రమములు అనగా అలసట అనలసటలు (సోమరితనము లేకుండుట) చెప్పబడినవి. ప్రాణమునకు అలసట లేదు. ఇంద్రియముల ప్రాణరూపము, ప్రాణనామము ఉపచారమాత్రము (గౌణమని) అని తెలిసికొనవలయును. ఇంద్రియములు విషయములను గ్రహించుటకు. కాని ప్రాణము దేహము మరియు

ఇంద్రియములకు నాయకుడు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

వాగాది ఇంద్రియములు ముఖ్య ప్రాణవృత్తులగును ఎందులకనగా అవి ప్రాణరూపములను శ్రుతికలదు. "హన్తాఽస్యైవ సర్వే రూపమసామ" (బృ.15.21.) అనగా 'మన మందరము ఈ ప్రాణరూపములయ్యేదము'. మరియు లోకములో ప్రాణ శబ్దముతో ఈ ఇంద్రియములనే చెప్పు వ్యవహారముకలదు. "మ్రియమాణస్య నాద్యాపి ప్రాణా నిర్గచ్ఛన్తి" అనగా 'చావుటకు సిద్ధమైన వాని ప్రాణములు ఇంతవరకు పోలేదు'. ఇంతేగాక శ్రుతిలో ఇంద్రియములను ప్రాణనామముతోనే చెప్పిరి. "న వై వాచః, న చక్షూంషి, న శ్రోత్రాణి, న మనాంసి ఇత్యాక్షతే ప్రాణా ఇత్యాచక్షతే" అనగా 'వాగింద్రియము కాదు, కన్నులు కాదు, చెవులుకాదు, మనస్సులు కాదు అని చెప్పచూ ఇంద్రియములను ప్రాణములనే చెప్పెదరు'. కనుక ప్రాణముకన్న వేరుగా ఇంద్రియములు లేవు. ఈ పూర్వపక్షమునకు సిద్ధాన్తి జవాబు. "తాని మృత్యుః శ్రమో భూత్వోపయేమే | తస్మాచ్ఛ్రామ్యత్యేవ వాక్"(బృ.1.5.21) అనగా 'శరీర-ధారణము తమ కార్యమేనని ఇంద్రియములు భావించుచుండగా మృత్యుదేవత శ్రమరూపములో ఆ ఇంద్రియములనేల్ల నిగ్రహించెను. అందువల్లనే అధికముగ మాటలాడిన వాగింద్రియము అలసిపోవును'. ఈ శ్రుతులద్వారా వాగాది ఇంద్రియముల అలసట వాని వాని విషయములలో చెప్పి ప్రాణమును గూర్చి ఈ విధముగా చెప్పిరి. "అథేమమేవ నాఽఽప్నోత్ యోఽయం మధ్యమః ప్రాణః యః సంచరంశ్చాసంచరంశ్చ న వ్యథతే" (బృ.1.5.21.) అనగా 'ఈ విధముగా మృత్యువు సర్వేంద్రియములను ఆక్రమించెను కాని ముఖ్యప్రాణమును మాత్రము ఆక్రమించలేదు'. ఈ శ్రుతి ప్రాణములో శ్రమాభావము చెప్పెను. ఇంద్రియములకు ప్రాణమునకు ఇది ఒక భేదము. ఇదే విధముగా ప్రాణసంవాదములో వాగాది ఇంద్రియముల నిర్గమన ప్రవేశములద్వారా దేహమును పైకిలేవనత్తుట మరణాభావములు చెప్పి ప్రాణ నిర్గమన ప్రవేశములద్వారా దేహోత్థాన మరణములను చెప్పుచు ఇంద్రియములకు ప్రాణమునకు రెండవ భేదము చెప్పిరి. ఈలాగున భేదములు చెప్పుటద్వారా వాగాది ఇంద్రియములలో ప్రాణరూపము మరియు ప్రాణశబ్ద వ్యావహారము గౌణమని తేలినది. ఇంద్రియములు సేవకులవలే ప్రాణమును అనుసరించును మరియు వ్యవహారములో ప్రాణమునకు ఇంద్రియములకు అనేక భేదములు కలవు. తమ తమ విషయగ్రహణశక్తి ద్వారా ఇంద్రియములు ఆ విషయములను ప్రకాశింపజేయును కాని ప్రాణము ఇంద్రియములకు దేహమునకు నాయకుడు. దీనివల్ల అత్యన్త విలక్షణముండుటవలన ప్రాణముకన్న ఇంద్రియములు భిన్నములు.

### 286. త ఇంద్రియాణి తద్వ్యపదేశాదన్యత్ర శ్రేష్ఠాత్. (2.4.17.)

సూత్రార్థము:- ముఖ్య ప్రాణముకన్న భిన్నమైన వాగాదులను ఇంద్రియ శబ్దముతో చెప్పెదరు కాని ప్రాణ శబ్దముతో కాదు ఎందులకనగా "ఏతస్మాజ్జాయతే ప్రాణః" అను శ్రుతిలో ప్రాణమును వేరుగా ఉపదేశించిరి.

ఇచట పూర్వపక్షములో ఇంద్రియములు ప్రాణములో అన్తర్భావమని చెప్పును సిద్ధాన్తి అన్తర్భాములు కావనును. "ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేన్ద్రియాణి చ" (ముం.2.1.3.) అనగా 'ఆ పరమాత్మనుండి ప్రాణము, మనస్సుమరియు అన్ని ఇంద్రియములు ఉత్పన్నమయినవి'. ఈ శ్రుతిలో ఇంద్రియములకు ప్రాణమునకు పరస్పర భేదమున్నట్లు వినవచ్చు చున్నది. "తే ఏతస్యైవ సర్వే రూపమభవన్" (బృ.1.5.2.) అనగా 'వాగాది

ఇంద్రియములు ముఖ్య ప్రాణరూపములయ్యెను'. ఈ శ్రుతిలో వాగాదులు ముఖ్య ప్రాణముతో తాదాత్మ్యమును పొందెనని చెప్పిరి. ఈ రెండు శ్రుతులకు విరోధముకలదను సంశయమునకు పూర్వవాది చెప్పునది. ఒకే ప్రాణము ప్రాణాపానాది ఐదు వ్యాపరములవలే వాగాది ఏకాదశ వ్యాపరములుగూడ కావించుచున్నది. గాన శ్రుతులలో విరోధము కలదు. దీనికి సిద్ధాన్తి జవాబు. ముఖ్య ప్రాణముకన్న వేరుగా వాగాది ఇంద్రియములను స్వీకరించిరి. ఏలనన "ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేన్ద్రియాణి చ" (ముం.2.1.3.) అనగా 'ఆ పరమాత్మనుండి ప్రాణము, మనస్సుమరియు అన్ని ఇంద్రియములు ఉత్పన్నమయినవి' ఈ శ్రుతిలో పైన చెప్పిన రీతిగా ప్రాణముకన్న ఇంద్రియములు వేరని చెప్పబడినది. "మనః సర్వేంన్ద్రియాణి చ" అను శ్రుతిలోగూడ ప్రాణమువలే మనస్సు గూడ ఇంద్రియములకన్న భిన్నమని చెప్పిరిగదా అనిన అట్లనుట సరికాదు. "ఇంద్రియాణి దశైకం చ పఞ్చచేన్ద్రియగోచరాః" (గీత.13.5) అనగా 'ఇంద్రియములు పది మరియు ఒకటి, ఆలాగున పదునొకండు ఇంద్రియములు మరియు ఆ ఇంద్రియములకు ఐదు విషయములు' ఈ స్మృతిలో మనస్సును ఏకాదశ ఇంద్రియములలో అన్తర్గతమని చెప్పిరి కాని ఎచ్చటనూ శ్రుతి స్మృతులలో ప్రాణములో ఇంద్రియత్వము ప్రసిద్ధముకాదు. కనుక ముఖ్య ప్రాణముకన్న ఇంద్రియములు భిన్నములు.

## 287. భేదశ్రుతేః. (2.4.18.)

సూత్రార్థము:- వాగాది ఇంద్రియముల ప్రకరణము ముగించుచు ఈ శ్రుతిని చెప్పిరి. "అథ హేమమాసన్యం ప్రాణమూచుః" (బృ,1.3.7.) అనగా 'తరువాత ముఖములోనున్న ప్రసిద్ధమైన ప్రాణముతో చెప్పిరి నీవు మాకొరకు ఉద్గానముచేయుము'. ఈ భిన్న ప్రకరణ శ్రుతిలో ఇంద్రియములకన్న ప్రాణము వేరుగా వినబడుటవలన ఇంద్రియములు ప్రాణముయొక్క వ్యాపారములు కాదు కాని భిన్నతత్వములు.

బృహదారణ్యకశ్రుతిలో వాగాది ఇంద్రియములకన్న ప్రాణము భిన్నమని వినబడుచున్నది. "తే హ వాచమూచుః" అనగా 'ఆ ఇంద్రియములు వాగింద్రియముతో చెప్పిరి' ఇత్యాది వాక్యములద్వారా వాగాది ఇంద్రియముల ప్రసంగము పూర్తిగావించి ఆ తరువాత ఈ శ్రుతిని చెప్పిరి. "అథ హేమమాసన్యం ప్రాణమూచుః" (బృ,1.3.7.) అనగా 'తరువాత ముఖములోనున్న ప్రసిద్ధమైన ప్రాణముతో ఇంద్రియములు చెప్పిరి నీవు మాకొరకు ఉద్గానము చేయుము'. ఇచట అసురులచే విధ్వంసము కాని ముఖ్య ప్రాణమును ఇంద్రియములకన్న భిన్నముగా చెప్పిరి. అందుచే ఇంద్రియములు ప్రాణము కన్న భిన్న తత్వములు.

## 288. వైలక్షణ్యాచ్చ. (2.4.19.)

సూత్రార్థము:- సుషుప్త్యవస్థలో ఇంద్రియములు నిదురించును ప్రాణము నిదురించక మేల్కొని ఉండును. ఈ విధమైన అత్యన్త వైలక్షణ్యముండుటవలన ఇంద్రియములు అన్య తత్త్వములు.

సుషుప్తావస్థలో వాగాది ఇంద్రియములు నిదురించినను ముఖ్యప్రాణము మేల్కొనియుండును. వాగాది ఇంద్రియములు లీనమైనను కేవలము ముఖ్య ప్రాణముమేల్కొని యుండును, కేవలము ఈ ముఖ్య ప్రాణము

మాత్రమే అలసిపోదు. ఇట్లు అనేకమైన వైలక్షణ్యములు ఉండుటవలన ముఖ్య ప్రాణముకన్న ఇంద్రియములు భిన్నతత్త్వములని స్వీకరించిరి. అందువలన శ్రుతులలో ఏ విధమైన విరోధము లేదు అనునది సిద్ధము.

## 87. సంజ్ఞామూర్తి క్లృప్త్యధికరణము.

సంగతి:- క్రిందటి అధికరణములో నామ-రూప భేదములద్వారా ప్రాణము మరియు ఇంద్రియముల భేదమును చెప్పిరి. ఆ ప్రస్తావమున నామ-రూపవ్యవహారము లోకమున ఎట్లు జరుగును అనగా వాని సృష్టిహేతువును చెప్పుటకు ఈ అధికరణము ప్రారంభించిరి. పూర్వాధికరణముతోపాటు దీనికి ప్రసంగ సంగతి.

విషయము:- నామ-రూపముల కర్తను గురించి ఈ అధికరణములో విచారించెదరు.

సంశయము:- నామ-రూపముల సృష్టి కర్త జీవుడా లేక ఈశ్వరుడా?

పూర్వపక్షము:- సృష్టి తరువాత జీవునిలో పరమేశ్వరుని ప్రవేశము చెప్పిరి. అందువల్ల నామ-రూపముల కర్త జీవుడే.

సిద్ధాన్తము:- నామ-రూపముల సృష్టి కర్త పరమేశ్వరుడనే స్వీకరించవలయును. ఆ పరమేశ్వరుడు సంపూర్ణ సృష్టిలో ప్రవేశించి తన సన్నిధి మాత్రముచే అందరితో తాదాత్మ్యమును పొంది యున్నాడు. సంపూర్ణ జగత్తును సృష్టిచేయుటకు జీవునిలో సామర్థ్యము లేదు. "నామ-రూపే వ్యాకరవాణి" అనగా 'నామ-రూపములను సృష్టి చేయుదును' (ఛాం.6.3.2.) అను శ్రుతిద్వారా ఉత్తమపురుష క్రియ (నేను మేము అనుపదములు ప్రయోగింపబడు క్రియ ఉత్తమపురుష క్రియ) చెప్పుటవలనను మరియు జీవేన అనుప్రవిశ్య వ్యాకరవాణి అని చెప్పుటవలన పరమాత్మయే నామ-రూపముల సృష్టి కర్త.

వైయాసికన్యాయమాలా:

187. నామరూపవ్యాకరణే జీవః కర్తాఽథవేశ్వరః | అనేన జీవేనేత్యుక్తేర్వ్యాకార్తా జీవ ఇష్యతే ||

188. జీవాన్వయః ప్రవేశేన, సన్నిధేః సర్వసర్జనే | జీవోఽశక్తః శక్త ఈశ ఉత్తమోక్తిస్తథేక్షితుః ||

నామ-రూపముల ఉత్పత్తికి జీవుడు కర్తయా లేక ఈశ్వరుడు కర్తయా? "అనేన జీవేన" అని చెప్పుటవలన జీవుడే కర్త యనును పూర్వవాది. సిద్ధాన్తి జవాబు. నామ-రూపముల సృష్టికర్త ఈశ్వరుడే ఎందులకనగా అన్ని వస్తువులు నిర్మించుటలో జీవునికి సామర్థ్యము ఉండజాలదు. "అనేన జీవేన" అను శ్రుతిలో ఉత్తమపురుష క్రియ కథనము ఈశ్వరుని కర్తృత్వముతోనే సంభవము. 'జీవేన' అనుపదమునకు సమీపమున ఉన్న 'అనుప్రవిశ్య' అనుక్రియతోనే సంబంధము కలదు కాని వాక్యమును ముగించు 'వ్యాకరవాణి' క్రియతో సంభందము లేదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

ఈశ్వరునిద్వారా పఞ్చభూతములు ఉత్పన్నమయిన తరువాత కనుపించు భౌతిక (మహీధరాది) కొండలు మొదలగువాని నామ-రూపముల సృష్టి జీవుడే కావించెను. ఎందులకనగా 'సేయం దేవతా అనేన జీవేనఽఽత్మనాఽనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి' అనగా 'ఆ దేవత ఈక్షణము గావించెను, ఈ జీవాత్మరూపములో దేహములో ప్రవేశించి నేను రూపములను సృష్టించెదను' (ఛాం.6.3.2) అను వాక్యములో సృష్టిలో జీవుని సంబంధము వినబడు చున్నదనును పూర్వవాది. సిద్ధాన్తి జవాబు. 'జీవేనాఽనుప్రవిశ్య' అని వాక్యములో ప్రవేశ పదముతో జీవుని సన్నిధి వలన అన్వయము కలదు. 'జీవేన వ్యాకరవాణి' అని చెప్పినచో

జీవునికి వ్యవధానముద్వారా అన్వయము కలుగును అపుడు జీవునికి నది కొండలాదులను నిర్మించు శక్తియుండదు. ఈశ్వరుడు సర్వశక్తిమంతుడు ఎదులకనగా శ్రుతిలో "పరాఽస్య శక్తిర్వివిధైవ శ్రూయతే" అనగా 'ఆ పరమేశ్వరుని శక్తి అనేకరూపములుగా వినబడచున్నది". కాని 'వ్యాకరవాణి' అని ఉత్తమపురుష క్రియ ప్రయోగము ఈశ్వరుని పక్షములో అన్వయమగును అందువల్ల నామ-రూపముల సృష్టి కర్త ఈశ్వరుడే, జీవుడు కాదు. మరి కుండ మొదలగునవి చేయుటలో ఈశ్వరుని ప్రేరణ వల్ల కుమ్మరిలో కర్తృత్వము కలుగును. గాన ఈశ్వరుడే సర్వ పదార్థములకు కర్త అనునది సిద్ధమైనది.

289. సంజ్ఞామూర్తిక్లప్తిస్తు త్రివృత్కుర్వత ఉపదేశాత్. (2.4.20.)

సూత్రార్థము: "తాసాం త్రివృతమ్" అనగా 'ఆ పృథివీ, జలము, అగ్నులను సృష్టించి వానిలో ప్రతి ఒక్క భూతమును త్రివృత్తకరణము గావింతును' ఈ శ్రుతిలో త్రివృత్తకరణము చేయువాడైన పరమేశ్వరుడే నామ-రూపములను సృజించువాడు, జీవుడు కాదు. ఎందులకనగా 'సేయం దేవతా' అనగా 'ఆదేవత' అని ఆరంభించి 'వ్యాకరవాణి' అనగా 'సృష్టిగావింతును' అని ఉపసంహారములో పరమేశ్వరునే సృష్టికర్తగా చెప్పిరి.

ఇచట త్రివృత్తకృతమైన భౌతిక సృష్టి జీవ కర్తృకము అందువల్ల సమన్వయమసిద్ధమనును పూర్వవాది. జీవ కర్తృకముకాదు పరమేశ్వర కర్తృకమగుటవలన సమన్వయము సిద్ధమనును సిద్ధాన్తి. పరమేశ్వరునుండి త్రివృత్కృతభూతముల సృష్టి చెప్పిన తరువాత ఈ శ్రుతి కలదు. 'సేయం దేవతా అనేన జీవేనఽఽత్మనాఽనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి' అనగా 'ఆ దేవత విచారము (ఈక్షణము) గావించెను, ఈ జీవాత్మరూపములో దేహములో ప్రవేశించి నేను నామ-రూపములను సృష్టించెదను' (ఛాం.6.3.2) అను వాక్యములో సృష్టిలో జీవుని సంబంధము వినబడు చున్నది. "ఆకాశో హ వై నామరూపయోర్నిర్వహితా" (ఛాం.8.14.1.) అనగా 'నామ-రూపముల నిర్మాత ఆకాశమే' అనుచోట సృష్టి పరమేశ్వర కర్తృకమని వినబడుచున్నది. ఈ శ్రుతులకు పరస్పర విరోధముకలదా లేదా అను సంశయమునకు 'అనేన జీవేనాత్మనా' అనగా 'జీవాత్మ రూపముగా ప్రవేశించి నేను నామ-రూపములను నిర్మించెదను' అను విశేషణము వలన నామ-రూప కర్తృకము జీవాత్మదని స్వీకరించవలయును. ఎట్లనిన 'నేను (చారురూపమున లేక దూతరూపమున) చారునిమూలమున శత్రుసైన్యమును ప్రవేశించి వారి మర్మములను తెలిసికొందును'. ఇచట చారులు కర్తలగుచున్నారు కాని రాజులు కర్తలని చెప్పబడుచున్నారు. ఆ విధముగనే జీవుడు ముఖ్య కర్త పరమేశ్వరుడు ప్రయోజకకర్త. (ఆచార్యుడు శిష్యునిచే పాఠమును చదివించెను అని చోట ఆచార్యడు హేతుకర్త శిష్యుడు ప్రయోజకకర్త) రాజు, దూత కార్యమును తనపై ఆరోపించుకొనును అట్లే జీవకర్తృక నామ-రూపముల రచన పరమేశ్వరుడు తనపై ఆరోపించుకొనెను. అందువల్ల ఉత్తమపురుష క్రియ ప్రయోగముగూడ విరోధముగాదు. ఈ విధముగా రెండు శ్రుతులకు విరోధము కలదనును పూర్వపక్షి. సూత్రములో గల 'తు' శబ్దము పూర్వపక్షమును ఖండించుటకు. "తాసాం త్రివృతం త్రివృతమేకైకాం కరవాణి" అనగా 'ఆ పృథివీ, జలము, అగ్నులను సృష్టించి వానిలో ప్రతి ఒక్క భూతమును త్రివృత్తకరణము గావింతును'. ఈ విధమైన త్రివృత్తకరణములో నిర్వివాదముగా పరమేశ్వరుని కర్తగా స్వీకరించిన తరువాత నామ-రూపముల రచనగూడ ఆ పరమేశ్వరుడే చేసెనని స్వీకరించవలయును.'సేయం దేవతైక్షత' అనగా 'ఆ దేవత సంల్పము చేసెను' అని మొదలిడి 'వ్యాకరవాణి' అనగా 'నేను నామ-రూపముల సృష్టి చేసెదను' అను

ఉత్తమ క్రియ ప్రయోగమువలన నామ-రూపముల సృష్టి కర్త పరమేశ్వరుడేనని చెప్పిరి. 'జీవేన' అని శ్రుతిలో ఉండుటవలన నామ-రూపముల సృష్టి కర్త జీవుడని చెప్పుట సరికాదు. నదీ సముద్రాది నానా ప్రకారముల సృష్టి అల్పజ్ఞుడు మరియు అల్పశక్తిగల జీవుడు చేయజాలడు. 'జీవేన' అను విశేషణము కేవలము అవ్యవహిత ఉత్తర పదమైన 'అనుప్రవిశ్య' అను క్రియకొరకు చెప్పిరి దానితోనే ఈ జీవ శబ్దమునకు సంబన్ధము స్వీకరించవలయును. అందువల్ల త్రివృత్తకరణము చేయు పరమేశ్వరుడే నామ-రూపముల సృష్టికారకుడు అని స్వీకరించిన ఏ విరోధము ఉండదు.

ఇంతవరకు బాహ్యమైన త్రివృత్తకరణమును చెప్పి ముందు ఆధ్యాత్మికమైన ఇంకొక త్రివృత్తకరణము చెప్పుచున్నారు.

### 290. మాంసాది భౌమం యథాశబ్దమితరయోశ్చ. (2.4.21.)

సూత్రార్థము:-మాంసము, పురీషము మొదలగు త్రివృత్తకరణమైన అన్నాత్మకమైనవి భూమియొక్క కార్యములు. ఈ ప్రకారమే మూత్ర, రక్తములు మొదలగునవి శ్రుతి అనుసారము జలముయొక్క కార్యములు.

త్రివృత్తకరణరూపములోనున్న అన్నాత్మకమగు భూమిని పురుషుడు ఉపయోగించినపుడు దాని కార్యము మాసాందులు తయారగును. మాసాందులు అన్న చోట ఆది శబ్దముద్వారా పరీష, మనస్సులు గ్రహించవలయును. "అన్నమశితం త్రేధావిధీయతే తస్య యః స్థవిష్ఠో ధాతుస్తత్పురీషం భవతి యో మధ్యమస్తన్మాంసం యోऽణిష్ఠస్తన్మనః" (ఛాం.6.5.1.) అనగా 'భుజించిన అన్నము మూడు భాగములలో విభక్తమగును. దానియందలి స్థూలతమ ధాతువు పురీషమగును, మధ్యమభాగము మాంసమగును, ఏది సూక్ష్మతమ భాగమో అది మనస్సుగా మారును'. ఈ శ్రుతిలో త్రివృత్తకరణమైన పృథివీ, యవాది రూపమై పురుషుని ద్వారా భుజించ బడుచున్నదని చెప్పిరి. ఆలాగుననే జలము మరియు అగ్ని భూతముల కార్యము గూడ శాస్త్రానుసారము తెలిసికొనవలయును. మూత్రము, రక్తము మరియు ప్రాణము జలముయొక్క కార్యము. ఎముకలు,మజ్జా మరియు వాక్కు అగ్ని కార్యములు.

భూత-భౌతిక కార్యవస్తువులన్నియు అవిశేషరూపముగా త్రివృత్తకరణములని వినునపుడు 'ఇది పృథివీ, ఇవి జలములు ఇది అగ్నిరూప' మను విభాగము ఎందులకు వినవచ్చున్నది అంతేగాక భుజించిన అన్నము మాసాందికములగుచున్నవని ఎట్లు స్వీకరించగలము? ఈ ప్రశ్నకు ఉత్తరము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

### 291. వైశేష్యాత్తు తద్వాదస్తద్వాదః. (2.4.22.)

సూత్రార్థము:- భూమ్యాదుల త్రివృత్తకరణము సామాన్యమయినను ఆ భూమ్యాదుల ఆధిక్యమువలన 'ఇది పృథివీ' 'ఇవి జలములు' అని వ్యవహారము జరుగును. సూత్రములోని రెండవ 'తద్వాద' శబ్దము అధ్యాయ సమాప్తిను సూచించు చున్నది.

సూత్రములోని 'తు' శబ్దము పూర్వపక్షి విచారమును నివారించుటకు. పృథివ్యాదులు అన్ని సామాన్యముగా త్రివృత్తకరణములైనను వానిలో ఆ యా భూతముల అంశము ఎక్కువగా నుండుటవలన 'ఇది అగ్ని, ఇవి జలములు మరియు ఇది పృథివీ' అను విశేష వాదము యుక్తి సంగతము. 'తద్వాదః' అను పదముయొక్క ఆవృత్తి అధ్యాయ సమాప్తి సూచకము. ఈ విధముగా అన్ని శ్రుతి వాక్యములు అద్వితీయ బ్రహ్మమునందే విరోధరహితముగా సమన్వయమగు చున్నవని సిద్ధ మయ్యెను.

## బ్రహ్మసూత్ర హృదములో రెండవ అధ్యయములోని నాలుగవ పాదము సంకలనము మరియు రెండవ అధ్యాయ సంకలనము సమాప్తము.

## అథ తృతీయాధ్యాయము ప్రథమపాదము.

ఈ సాధనాఖ్య తృతీయాధ్యాయములో అన్ని సాధనల విచారము గావింతురు. ప్రథమ పాదములో జీవుడు వైరాగ్యము పొందుటకు పరలోక గత్యాగతులవిచారము గావించిరి. ప్రథమాధ్యాయములో సంపూర్ణ శ్రుతుల సమన్వయము బ్రహ్మములోనే చెప్పిరి. ఆ సమన్వయమునకు విరోధములగు స్మృతులను, తర్కములను మరియు శ్రుతులలో గల విరోధాభాసమును రెండవ అధ్యాయములో తొలగించిరి. విరోధ పరిహారము గావించిన తరువాత సమన్వయములోకలిగిన అనిశ్చియరూపమును, అప్రామాణ్యమును గూడ నిషేధించిరి. అందువల్ల ఇపుడు పరమాత్మ ప్రాప్తికి సాధనములను నిశ్చయించవలయును. దానికై ఈ మూడవ అధ్యాయము ప్రారంభించిరి. పూర్వాధ్యాయముతో పాటు ఈ అధ్యాయమునకు హేతుహేతుమద్భావ సంబన్ధము. పూర్వాధికరణములో జీవుని ఉపకరణములగు ఇంద్రియములను, మరియు భౌతిక పదార్థముల ఉత్పత్తినిగూడ చెప్పిరి. దానిని ఉపజీవ్యముగావించి ఉపాధితో గల జీవునికి సంసారమునుండి వైరాగ్యము కలుగుటకు సంసార స్వరూప వర్ణన ఈ అధికరణములో ప్రారంభించిరి. ఈ శరీరమును వదిలి ఇంకొక శరీరమును ఆరంభించుటకు సూక్ష్మభూతములతో గూడిన జీవుడు పరలోకమునకు పోవును అను చెప్పుటకు ఈ అధికరణమును ప్రారంభించిరి.

### 88. తదంతర ప్రతిపత్త్యధికరణము.

సంగతి:- దీనికి ముందు అధికరణములో జీవుని ఉపాధులను గుఱించి విచారించిరి. దానిని ఆశ్రయించి ఉపాధితో నున్న జీవునికి వైరాగ్యము కలిగించుటకు ఈ అధికరణమును ప్రారంభించిరి. కనుక పూర్వాధికరణముతో దీనికి ఉపజీవ్య-ఉపజీవకభావ సంగతి.

విషయము:- సోపాధిక జీవుని పరలోక గత్యాగతుల విచారము ఈ అధికరణములో గావింతురు.

సంశయము:- ఈ జీవుడు శరీరమునుండి నిర్గమించునపుడు పంచీకృతభూతములయొక్క సూక్ష్మాంశములను గైకొని పోవునా లేదా అని సంశయము?

పూర్వపక్షము:- జీవాత్మ శరీరమునుండి నిర్గమించునపుడు ఇంద్రియములు పోవుట వినినటులే భూతములు పోవుట వినబడుటలేదు. అంతేగాక పఞ్చభూతములు సర్వత్ర సులభముగా దొరుకును గాన భూతములతో అపరివేష్టిత అనగా సూక్ష్మభూతములను గైకొనకనే జీవుడు పరలోకమునకు పోవును.

సిద్ధాన్తము:- జీవాత్మయొక్క శరీరమును ప్రారంభించు బీజములు దుర్లభమగుటవలన భుతసూక్ష్మాంములతోబాటే జీవాత్మ శరీరాన్తరమును గ్రహించుటకు పరలోక గమనము గావించును. భూతసూక్ష్మముల ఆధారము లేనిచో జీవాత్మ మరియు వాని ఇంద్రియముల గతి కలుగనేరదు. అంతేగాక ఐదవ ఆహుతి పూర్తి కొరకు జీవాత్మ భూతాంశములతో వేరొక శరీరమును గ్రహించుటకు ఈ శరీరమునుండి పోవుననియే గ్రహించవలయును.

వైయసికన్యాయమాలా:

189. అవేష్టితో వేష్టితో వా భూతసూక్ష్మైః పుమాన్ వ్రజేత్ | భూతానాం సులభత్వేన యాత్యవేష్టిత ఏవ సః ||

190. బీజానాం దుర్లభత్వేన నిరాధారేన్ద్రియాగతేః | పఞ్చమాహుతియుక్తేశ్చ జీవస్తైర్యాతి వేష్టితః ||

పూర్వపాదములో చెప్పిన ప్రాణము ఉపాధిగాగల జీవుడు అన్య శరీరము పొందు సమయములో పూర్వ శరీరమునుండి ముందు శరీరమునకై సూక్ష్మభూతములను గ్రహించడు ఎందులకనగా పఞ్చభూతములు అన్ని ప్రదేశములలో సులభముగా లభ్యమగును కనుక వానిని తీసికొనిపోవుట నిరర్థకము అనును పూర్వవాది. సిద్ధాన్తి జవాబు. సామాన్య భూతములు సర్వత్ర సులభముగా దొరుకును కాని దేహ కారణమునకు ఉపయోగబడు దేహబీజములగు భూతములు అన్ని ప్రదేశములలో దొరకవు అందువలన ఇచటనుండియే భూతములు వెంట పోవును. అంతేగాక జీవునికి ఉపాధి భూతములైన ఇంద్రియములకు ఇచట నున్న సూక్ష్మభూతముల ఆధారముగా లేనిచో వాని పరలోక గమనము అసంభవము ఎందులకనగా జీవించియున్నప్పుడు అట్లు కానవచ్చుటలేదు. శ్రుతిలో "పఞ్చమ్యామాహుతావాపః పురుషవచసో భవన్తి" (ఛాం.5.3.3.) అనగా 'జలము ఐదవయాహుతియందు పురుషనామము దాల్చును' అని చెప్పిరి. దీని తాత్పర్యము స్వర్గలోకము, మేఘము, పృథివీ, పురుషుడు మరియు స్త్రీ ఈ ఐదింటిని ఉపాసనలో అగ్నిరూపముగా స్వీకరించిరి. ఈ అగ్నులలో స్వర్గనకు పోవుజీవుని మరియు స్వర్గమునుండి వచ్చు జీవుని అహుతి రూపముగ కల్పన గావించిరి. ఇష్టాపూర్తికర్మలు చేయు జీవుడు స్వర్గమునకు పోయి అచట కర్మఫలమును అనుభవించి పుణ్యము క్షీణించిన స్వర్గమునుండి భూలోకమనకు వచ్చుచు మొదట మేఘముతోనుండి తరువాత వర్షరూపములో భూమిమీదకి వచ్చును. భూమిలో అన్నరూపమై పురుషునిపొంది పిమ్మట రేతస్సు ద్వారా స్త్రీలో ప్రవేశించి శరీరమును గ్రహించును. జలముద్వారా ఉపలక్షిత శరీరమునకు బీజభూతములైన పఞ్చభూతములు జీవునితో స్వర్గాది ఐదు స్థానములకు పోయి ఐదవస్థానమైన స్త్రీ గర్భములో శరీరభావమును పొంది పురుష నామముతో ఉచ్చరించ బడుచున్నది. భూతసూక్ష్మాంశములతోబాటే జీవుడు పరలోకమునకు పోవుచున్నాడనునది సిద్ధమైనది.

292. తదన్తరప్రతిపత్తౌ రంహతి సంపరిష్వక్తః ప్రశ్ననిరూపణాభ్యామ్. (3.1.1.)

సూత్రార్థము:- జీవుడు ఒకదేహమును విడిచి పరలోకాదులకు పోవునపుడు ప్రాణేంద్రియాదులతోపాటు వానికి ఆధారమగు పంచీకృతభూతములయొక్క సూక్ష్మాంశములనుగూడ గైకొని ధూమాది మార్గముద్వారా స్వర్గలోకము పోవును. "వేత్థ యథా" అను శ్రుతిలో 'పంచమ ఆహుతిలో గల జలము పురుషనామము పొందును, నీకు అది తెలియునా?' అను ప్రశ్నకు జవాబు "ఇతి తు పఞ్చమ్యామాహుతావాపః" అనగా 'ఈ ప్రకారము పంచమ

ఆహుతిలో జలము పురుషనామము పొందును'. ఈప్రశ్న ప్రతివచన నిరూపణద్వారా సూక్ష్మాంశములు గైకొని జీవుడు స్వర్గమునకు పోవును అనునది నిర్ణయించబడినది.

ప్రాణేంద్రియముల ఉపాధులతో స్వర్గలోకమునకు జీవుడు సూక్ష్మభూతములను తీసికొనిపోవుటలేదు, అపుడు వానికి పరలోక గమనము కలుగజాలదు అందువల్ల జీవునికి వైరాగ్యము ఎట్లు కలుగును? ఎందులకనగా సూక్ష్మ శరీరముతోపాటు సూక్ష్మభూతములు పొవుట శ్రుతిలో వినబడుటలేదు అనిపూర్వపక్షి ప్రశ్న. సిద్ధాన్తములో సూక్ష్మభూతములతో గూడి జీవులు పరలోకమునకు పొవుటచే వైరాగ్యము కలుగుట సునిశ్చితము అని చెప్పిరి. దేహాన్తరమును పొందుటకు ఆ నూతన శరీర నిర్మాణమునకు సూక్ష్మభూతములతోగూడి జీవుడు నిర్గమించును. ఎందులకనగా ప్రశ్నోత్తరములద్వారా పఞ్చాగ్నివిద్యా ప్రసంగములో అటులనే చెప్పిరి. (ప్రవాహణ జైబిలి ఆరుణేయ శ్వేతకేతువును పఞ్చాగ్నివిద్యను గురించి ఐదు ప్రశ్నలు అడుగగా వాని జవాబు తెలియకపోయినందున ఆశ్వేతకేతువు తండ్రి గౌతముడు ప్రవాహణుని ద్వారా పఞ్చాగ్నివిద్యను తెలిసికొనెను. స్వర్గము, మేఘము, పృథివీ, పురుషుడు మరియు స్త్రీ అను ఈ ఐదు కల్పిత అగ్నులలో క్రమముగా శ్రద్ధా, సోమరసము, వర్షము, అన్నము మరియు రేతస్సు అను ఆహుతుల చింతనయే పఞ్చాగ్నివిద్య అందురు) "వేత్థ యథా పఞ్చమ్యామాహుతావాపః పురుష-వచసో భవన్తి" (ఛాం.5.3.3.) అనగా 'పంచమ ఆహుతిలో గల జలము పురుషనామము పొందును, నీకు అది తెలియునా?' అను ప్రశ్నకు జవాబుగా ప్రవాహణ జైబిలి గౌతమునితో ఇట్లు చెప్పెను. (ఈ విద్య ఇంతవరకు క్షత్రియుల వద్దనే ఉండెను. సంపూర్ణలోకములో దీనివలననే క్షత్రియములు శాసించిరి. నీవు యోగ్యుడవని నీకు చెప్పుచున్నాను. విద్వాంసుడైన సాధకుడు తపస్సు మరియు నిరంతర ఉపాసనవలన ఈ విధముగా చింతన చేయవలయును.) 'జలప్రధానమైన ఆహుతిని మొదట స్వర్గమను అగ్నిలో ఆహుతి చేయవలయును. స్వరమునుండి ఉత్పన్నమైన మేఘములలో సోమరసమును ఆహుతి కావించవలయును. మేఘములనుండి భూమిపై జలరూపమైన ఆహుతి ఈయవలయును. భూమినుండి ఉత్పన్నమైన అన్నము పురుషరూపమైన అగ్నిలో వేయుదురు. ఆ పురుషుని ద్వారా రేతస్సు ఉత్పన్నమైన తరువాత స్త్రీరూపమైన అగ్నిలో ఆ రేతస్సును ఆహుతి చేసినప్పుడు జలము పురుషరూపమగును. దీనినే పఞ్చాగ్ని విద్య అందురు. ఈ ఐదు అగ్నులలో ఐదు ఆహుతులను చెప్పి ఆఖరిలో 'ప్రథమ ఆహుతి అయిన జలము ఐదవ ఆహుతిలో పురుషనామమును పొందును'. అనిరి. ఈ ప్రశ్న జవాబుల ద్వారా పరలోకము పోవు జీవుడు జలసహితుడై శరీరమునుండి శరీరాన్తరమునకు పోవును అని సిద్ధమైనది.

### 293. త్ర్యాత్మకత్వాత్తు భూయస్త్వాత్. (3.1.2.)

సూత్రార్థము:- త్రివృత్కరణశ్రుతి ద్వారా మిగిలిన రెండు భూతములు అగ్ని మరియు పృథివీ కలిసియుండుటవలన జలములో మూడు భూతములుగలవు. అందువల్ల జలములో ఇతర భూతములు కలిసివున్నవి. శ్రుతిలో జలము ఎక్కువగానున్నదని చెప్పిరి కదా అనిన అట్లనుట సరికాదు ఎందులకనగా తేజాదులకన్న శరీరములో జలముయొక్క ఆధిక్యము లోక విదితము.

ఈ సూత్రములో 'తు' శబ్దము పూర్వవాది శంకను తొలగించుటకు. ఛాందోగ్య శ్రుతిలో స్థూలభూతముల ఉత్పత్తికి త్రివృత్కరణము చెప్పిరి. ఈ ప్రక్రియ ద్వారా ప్రత్యేక భూతములో మిగిలిన రెండు భూతములు కలిసి యున్నవని స్వీకరించక తప్పదు. ఈ ప్రకారము జలము గూడ భూతత్రయాత్మకము మరియు మన శరీరముగూడ త్రయాత్మకము ఎందులకనగా ఈ మూడు భూతముల కార్యము చూడబడుచున్నది. కేవలము జలముద్వారా శరీరము నిర్మితముకాదు. జలాధిఖ్యము వలన అటుల చెప్పిరి. ఐదవ ఆహుతిలో ఈ జలము పురుష నామమును పొందుచున్నది. పై పశ్నోత్తరములలో వచ్చిన 'అప్' శబ్దము కేవలము జలవాచకముకాదు కాని భూతత్రయాత్మక జలము అని అర్థము చెప్పవలయును.

## 294. ప్రాణగతేశ్చ. (3.1.3.)

సూత్రార్థము:- "తముత్-క్రామంతం ప్రాణోఽనూత్-క్రామతి ప్రాణమనూత్-క్రామన్తం సర్వే ప్రాణా అనూత్-క్రామన్తి" అనగా 'జీవుడు వెడలిపోవునపుడు ముఖ్య ప్రాణము వెడలును. దానితో గూడ ఇంద్రియము లన్నియు వెడలును'. ఈ శ్రుతిలో ఇంద్రియములను జీవునితోబాటు ధూమాది మార్గము ద్వారా స్వర్గలోకమునకు వెళ్ళుట చెప్పిరి. కనుక పరలోకము పోవు జీవుడు జలసహితుడై శరీరమునుండి శరీరాన్తరమునకు పోవును అని సిద్ధమైనది.

బృహదారణ్యక శ్రుతి ఇటుల చెప్పుచున్నది. "తముత్-క్రామంతం ప్రాణోఽనూత్-క్రామతి ప్రాణమనూత్-క్రామన్తం సర్వే ప్రాణా అనూత్-క్రామన్తి" అనగా 'జీవుడు వెడలిపోవునపుడు ముఖ్య ప్రాణము వెడలును. దానితో గూడ ఇంద్రియము లన్నియు వెడలును'. ఈ శ్రుతిద్వారా దేహాన్తర ప్రాప్తిలో ప్రాణముల గతి చెప్పబడినది. ప్రాణములకు ఆశ్రయము జలము. అందువల్ల మిగిలిన అగ్ని పృథివీలతో బాటు ప్రాణమునకు ఆశ్రయమైన జలముగూడ శరీరాన్తర ప్రాప్తికి పోవునని స్వీకరించవలయును.

## 295. అగ్న్యాదిగతిశ్రుతేరితి చేన్న, భాక్తత్వాత్. (3.1.4.)

సూత్రార్థము:- "యత్రాస్య పురుషస్య మృతస్యాగ్నిం వాగప్యేతి వాతం ప్రాణః"(బృ.3.2.13.)అనగా 'మృతి జెందిన పురుషునియొక్క వాగింద్రియము తన కధిదేవత యగు అగ్నియందుజేరును. ప్రాణము తన కధిదేవత అయిన వాయువునందు జేరును' శ్రుతిలో మరణకాలములో ఇంద్రియములు అగ్న్యాదులలో జేరుట వినబడుటవలన జీవునితోబాటు ఇంద్రియములు స్వర్గమునకు పోవునని చెప్పుట సరికాదు. ఇట్లనుట యుక్తియుక్తము కాదు ఎందులకనగా "తముత్-క్రామన్తమ్" అను మొదలుగాగల అనేక శ్రుతులతో విరోధము కలుగుటవలన మరియు అగ్న్యాదులలో జేరుట చెప్పిన శ్రుతి గౌణము గాన.

"యత్రాస్య పురుషస్య మృతస్యాగ్నిం వాగప్యేతి వాతం ప్రాణః"(బృ.3.2.13.) అనగా 'మృతి జెందిన పురుషునియొక్క వాగింద్రియము తన కధిదేవత యగు అగ్నియందుజేరును. ప్రాణము తన కధిదేవత అయిన వాయువునందు జేరును' ఈ శ్రుతి వాక్యములో వాగాది ఇంద్రియములు అగ్న్యాది దేవతలలో లయమగుట వినబడుటవలన జీవుడు శరీరాన్తరమును పొందునపుడు ప్రాణములు జీవునితో పోవునని చెప్పుట యుక్తియుక్తము కాదనును పూర్వవాది. అట్లనుట సరికాదని సిద్ధాన్తి జవాబు. ఎందులకనగా బృహదారణ్యక శ్రుతిలో అన్ని స్థలములలో పైన జెప్పిన శ్రుతిని గౌణమనిరి. క్రింద చెప్పు శ్రుతిగూడ గౌణమే. "ఓషధీర్లోమాని వనస్పతీన్కేశాః" (బృ. 3.2.13.) అనగా

‘శరీరముపైనున్న వెంట్రుకలు మరణకాలమున ఓషధులను చిన్న వృక్షములను శిరస్సు పైనున్న వెంట్రుకలు మహావృక్షములను జేరును’. మిగిలిన స్థలములలో జీవునితోబాటు ప్రాణముల గమనము వినబడుటవలన ఇచటగూడ వాగాది ఇంద్రియములు అధిష్ఠాన దేవతలో లీనమనగా ఆ దేవతల ఉపకార నివృత్తి మాత్రమే. కనుక పూర్వవాది ఉదహరించిన శ్రుతి గౌణ దృష్టితో చెప్పిరి.

296. ప్రథమేఽశ్రవణాదితి చేన్న, తా ఏవ హ్యుపపత్తేః. (3.1.5.)

సూత్రార్థము:- స్వర్గాది ఐదు అగ్నులలో మొదట ద్యులోక నామక అగ్నిలో “తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవాః శ్రద్ధాం జుహ్వతి” అనగా ‘ఈ ద్యులోకాగ్నియందు దేవతలు శ్రద్ధను హోమము చేయుచున్నారు’ (ఛాం.5.4.2.) ఈ ఆహుతి శ్రుతిద్వారా శ్రద్ధ అనియే వినబడు చున్నది కాని జలముకాదు. అందువల్ల జలము ఐదవ ఆహుతిలో పురుషనామము పొందునని చెప్పుట యుక్తము కాదు. పుర్వావాది ఇట్లనుట సరికాదనును సిద్ధాన్తి. “ఆపో హాస్మై శ్రద్ధాం సంనమన్తే పురుషాయ కర్మణి” అనగా ‘యజమానునికు స్నానాది పవిత్రమగు కర్మను ముగించుటకై జలమే శ్రద్ధను ఉత్పత్తిగావించి శ్రద్ధారూపమును ధరించుచున్నది’. ఈ శ్రుతిద్వారా మరియు ప్రశ్న ప్రతివచనముల ద్వారా జలమే లక్షితమగుచున్నది.

స్వర్గాది ఐదు అగ్నులలో మొదట స్వర్గరూపమైన అగ్నిలో శ్రద్ధను ఆహుతి గావించుచున్నారని వినబడుచున్నది. “తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవాః శ్రద్ధాం జుహ్వతి” (ఛాం.5.4.2.) అనగా ‘ఆ స్వర్గరూపమైన అగ్నిలో విద్వాంసులైన ఉపాసకులు శ్రద్ధను ఆహుతి చేయుచున్నారు’. ఇచట శ్రద్ధయొక్క ఆహుతి విబడుచున్నది కాని జలము కాదు, మరి ఐదవ ఆహుతిలో జలము పురుషనామము పొందునని ఎట్లు చెప్పిరి. ఆహుతి సమయములో చెప్పిన శ్రద్ధ శబ్దము పురుషనామము పొందునపుడు జలశబ్దముతో ఎట్లు చెప్పగలరు? మొదటి ఆహుతిలో వినబడని జలశబ్దము ఐదవ ఆహుతిలో పురుషనామము పొందునని చెప్పుట అసంగతము లేక విరుద్ధమేకదా? ఈ పూర్వవాదమునకు సమాధానము. మొదటి ఆహుతిలోగూడ శ్రద్ధాపదముతో జలమునే గ్రహించవలయును. మొదటిలో మధ్యలో చివరిలో అటుల స్వీకరించిననే ఏకవాక్యత కలుగును. ఇంతేగాక క్రమముగా శ్రద్ధయొక్క కార్యములు సోమరసము, వర్షము, అన్నాదులు స్థూలమగుచు జల ప్రధానముగనే ఉపలక్షిత(గురుతుగలవి)మగుచున్నవి. ఇచటగూడ శ్రద్ధాశబ్దమును జలమని చెప్పుటకు తర్కము గలదు. “ఆపో హాస్మై శ్రద్ధాం సంనమన్తే పురుషాయ కర్మణి” అనగా ‘శాస్త్రవిహిత పుణ్య కర్మ చేయుటకు జలము శ్రద్ధా రూపమును ధరించుచున్నది’. ఈ శ్రుతిలో శ్రద్ధకు కారణమగుటవలన జలమును శ్రద్ధా శబ్దముతో చెప్పుట యుక్తి సంగతమే.

297. అశ్రుతత్వాదితి చేన్నేష్టాదికారిణాం ప్రతీతేః. (3.1.6.)

సూత్రార్థము:- శ్రద్ధా శబ్దముద్వారా చెప్పబడిన జలము పురుషనామము దాల్చునని చెప్పినను ఇప్పటికిని జీవుడు జలాదులతోగూడియే నిర్గమించునను విషయము స్థిరపడలేదు అంతేగాక జలమునకు సమానము పురుషుడని శ్రుతిలో ఎచ్చటను వినబడుటలేదు. అట్లనుట సరికాదు. దేనివలననిన “అథ య ఇమే” అను శ్రుతి ఆఖరిలో ఇష్టాపూర్తకర్మలు చేయువారు ధూమాది అభిమాన దేవతలను పొందుదురు అని చెప్పుటవలన.

శ్రద్ధా శబ్దముద్వారా చెప్పబడిన జలము పురుషనామము దాల్చునని చెప్పినను ఇప్పటికిని జీవుడు జలముతోగూడియే నిర్గమించునని చెప్పజాలము. ఎందులకనగా జలశబ్దముయొక్క అర్థము శ్రద్ధ అని చెప్పినను జీవార్థమును చెప్పు శబ్దము అచట లేదు. ఛాందోగ్యములో ఈ ప్రసంగములో ఇటుల చెప్పిరి. "అథ య ఇమే గ్రామ ఇష్టాపూర్తేదత్తమిత్యుపాసతే తే ధూమమభిసంభవన్తి" (ఛాం.5.10.6.) అనగా 'ఎవరు గ్రామములోనుండి ఇష్టాపూర్తదత్త కర్మల ఉపాసన చేయుదురో వారు శరీరమును వదిలిన తరువాత ధూమాభిమాన దేవతను పొందుదురు'. ఇత్యాది వాక్యములద్వారా ఇష్టాది కర్మలను ఆచరించువారు చంద్రలోకమును పొందుదురు. చంద్రలోకము తమయొక్క కర్మఫలభోగమునకై శ్రద్ధాపదముతోచెప్పిన జలమయ ఆహుతిద్వారా గూడియే పోవునని స్వీకరించవలయును.

ఇష్టాపూర్తదత్త కర్మల ఉపాసన చేయువారు వారి వారి కర్మభోగముల కొరకు పరలోకము పోవుదరను ప్రతిజ్ఞ సరికాదు ఎందులకనగా బృహదారణ్యకములో "తద్దేవానామన్నం" 'వారు దేవతలకు అన్నమగుదురని చెప్పిరి'. దేవలోకములో ఆ అన్నమును దేవతలు భుజించుదురు. ధూమాది మార్గముద్వారా చంద్రలోకముపోవు జీవులు దేవతలకు భక్ష్యమయినపుడు వారు కర్మఫలము అనుభవించుటకు పోయిరని ఎట్లు స్వీకరించగలము. దీనికి సమాధానము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

298. భాక్తం వానాత్మవిత్త్వాత్తథా హి దర్శయతి. (3.1.7.)

సూత్రార్థము:- ఇష్టాదికర్మలు చేయువారికి అన్నత్వ శబ్దము అప్రధానము ముఖ్యముకాదు ఎందులకనగా "స్వర్గకామో యజేత" అనగా 'యాగము చేసిన స్వర్గప్రాప్తి కలుగును' అనుశ్రుతికి విరోధము కలుగును. ఆత్మజ్ఞానము లేనందువలన స్వతస్సిద్ధులగు దేవతలకు అనుభవసాధనము లగుదురు, ఆ దేవతలు వీరివలన భోగములు అనుభవించుట ఎది కలదో అదియే శ్రుతిలో భక్షణ శబ్దముతో ఔపచారికముగ చెప్పబడినదని నిర్ణయించవలయును. ఎందులకనగా అనుభవింపబడు పదార్థములయందు అన్న శబ్దము ప్రయోగింపబడు చున్నది. అటులనే వేరొక శ్రుతిలో చెప్పిరి. ఆ శ్రుతి "అథ యోఽన్యాం దేవతాముపాస్తేఽన్యోఽసావన్యోఽహమస్మీతి న స వేద యథా పశురేవం స దేవానామ్" అనగా ' బ్రహ్మజ్ఞానము లేని వారు తన కన్న దేవత అన్యమని (నేను వేరు దేవతవేరు) ఉపాసింతురో వారు దేవతలకు ఉపభోగ్య పశువులగుదురు'.

సూత్రములో వచ్చిన 'వా' శబ్దము పూర్వపక్షమును నిరాకరించుటకు. ఇష్టాదికర్మలు చేయువారిని దేవతల అన్నత్వము గౌణరూపముగా చెప్పిరి. ముఖ్యరూపముగా దేవతలకి అన్నమని స్వీకరించిన "స్వర్గకామో యజేత" అనిన 'స్వర్గము కోరువారు యజ్ఞము చేయవలయును' అను ఫలశ్రుతికి విరోధము కలుగును. "విశోఽన్నం రాజ్ఞాం పశవోఽన్నం విశామ్" అనగా 'వైశ్యలు రాజులకు మరియు పశువులు వైశ్యలకు అన్నము' ఈ వాక్యములో దేవతలకి ఉపభోగసాధనములని చెప్పిరి. మరియు స్త్రీ పుత్రాదులు ఏవిధముగా లోకములో భోగ్య వస్తువులగుదురో అటులనే ఆత్మజ్ఞాన శూన్యులగుటవలన ఇష్టాదికర్మలు చేయువారు దేవతలకు ఉపభోగ సాధనములగుదురని స్వీకరించవలయును. ఎందులకనగా ఈ కర్మలు చేయువారితో దేవతలు సుఖముగా విహరింతురు. ఈ సుఖ విహారమునే అన్న శబ్దముతో చెప్పిరి కాని మోదకాదులవలె దేవతలకు అన్నము కారు. అందులకే బృహదారణ్యక శ్రుతిలో ఇటుల చెప్పిరి. ఆ శ్రుతి "అథ యోఽన్యాం దేవతాముపాస్తేఽన్యోఽసావన్యోఽహమస్మీతి న స వేద యథా

పశురేవం స దేవానామ్" అనగా (బృ.1.4.10.) ' బ్రహ్మజ్ఞానము లేని వారు తన కన్న దేవత అన్యమని (నేను వేరు దేవతవేరు) ఉపాసింతురో వారు దేవతలకు ఉపభోగ్య పశువులగుదురు'. దేవత వేరు నేను వేరు అని ఉపాసించువారు వాస్తవమునకు  దేవతను తెలిసికొనుటలేదు, వారు బరువును మోయు పశువులవలే దేవతల భారమును మోయుచున్నారు. ఈ వాక్యము ద్వారా బృహదారణ్యక శ్రుతిలో ఆత్మజ్ఞాన శూన్య పురుషుని దేవతలకు ఉపభోగ్యమని చెప్పిరి. అందువల్ల ఇష్టాది కర్మలు చేయువారిని గౌణభావముతో దేవతలకి అన్నమని చెప్పిరి. కనుక సూక్ష్మభూతములతోబాటే జీవుడు పరలోకమునకు భోగముకొరకు పోవుననియే స్వీకరించవలయును.

# 89.కృతాత్యయాధికరణము.

సంగతి:- యాగాది క్రియలతో సంబన్ధమున్న జలము ఐదవ ఆహుతిలో పురుషరూపముగా మారు చున్నది. ఈ హేతువును ఆశ్రయముగా తీసికొని జలాది భూతసూక్ష్మములతోగూడి జీవుడు చంద్రలోకము పోయి తిరిగి వచ్చుచున్నాడు అనునది యుక్తి సంగతముగాదు. ఎందులకనగా ఆ సమయములో జీవాత్మ కర్మ చేయలేడు. ఈ విధమైన ఆక్షేపమురాగా ఈ అధికరణము మొదలిడిరి. అందువల్ల పూర్వాధికరణముతోపాటు దీనికి ఆక్షేప సంగతి.
విషయము:- స్వర్గమునుండి తిరిగి వచ్చు జీవాత్మ గతి విచారము ఈ అధికరణములో గావింతురు.
సంశయము:- స్వర్గమునుండి తిరిగి వచ్చు జీవుడు సంపూర్ణ కర్మ ఫలములను అనుభవించి మృత్యులోకమునకు వచ్చునా లేక కర్మతోపాటు వచ్చునా అని సంశయము?
పూర్వపక్షము:- 'యావత్సంపాతమ్' అను శ్రుతివాక్యము యొక్క ఆధారమువలన ప్రారబ్ధకర్మము అనుభవించువరకు జీవాత్మ స్వర్గములోనుండునని స్వీకరించిరి. ఆతరువాత తిరిగి వచ్చునపుడు కర్మముండదు.
సిద్ధాన్తము:- ఏ కర్మలు అనుభవించుటకు స్వర్గమునకు పోవునో ఆ కర్మఫలములను మాత్రమే అచట అనుభవించును మిగిలిన కర్మలు అనుభవించుటకు మృత్యులోకమునకు వచ్చును. ఈమిగిలిన కర్మలను ఒకే జన్మలో అనుభవించలేడు. అంతేగాక శ్రుతిలో 'రమణీయచరణాః' అని చెప్పుటవలన మంచికర్మలఫలముగా మంచి జన్మలు పొందుటకు కర్మలతోగూడియే జీవుడు తిరిగి వచ్చును. కర్మశూన్యుడై తిరిగిరాడు ఎందులకనగా అన్నికర్మలను అనుభవించిన మరి జన్మ ఉండదు.
వైయాసికన్యాయమాలా:-
191. స్వర్గావరోహీ క్షీణానుశయ, సానుశయోఽథవా | యావత్సంపాతవచనాత్ క్షీణానుశయ ఇష్యతే ||
192. జాతమాత్రస్య భోగిత్వాదైకభవ్యే విరోధతః | చరణశ్రుతితః సానుశయః కర్మన్తరైరయమ్ ||
స్వర్గమునుండి వచ్చు జీవునికి కర్మశేషముండూనా ఉండదా? 'యావత్సంపాతమ్' అని వచనముద్వారా కర్మశేషముండదు అని పూర్వవాది చెప్పును. దానికి సిద్ధాన్తి చెప్పునది. కర్మశేషముతోనే జీవుడు స్వర్గమునుండి భూలోకమునకు వచ్చును ఎందులకనగా జన్మించిగనే బాలునుకి సుఖదుఃఖములు కలుగును. ఒకేజన్మలో అన్ని కర్మలు అనుభవించునను మతమునకు విరోధముకలదు.
భారతీ తీర్థులవారి వ్యాఖ్య:
స్వర్గమునకుపోయి తిరిగివచ్చు జీవుడు కర్మలులేకుండ వచ్చునా కర్మలతోబాటు తిరిగి వచ్చునా? శ్లోకములో వచ్చిన 'అనుశయ' శబ్దమునకు 'జీవమనుశేతే' అని ఉత్పత్తిని చెప్పిన శేషకర్మలద్వారా లేక మిగిలిన కర్మలద్వారా అని అర్థము. కాని 'నిరనుశయ' మును చెప్పు శ్రుతికలదు. 'యావత్సంపాతమ్' అనినందువల్ల జీవుడు కర్మశేషము లేకుండ తిరిగి వచ్చును అని సిద్ధమైనదని పూర్వవాది కథనము. దీనికి సిద్ధాన్తి జవాబు. స్వర్గముకొరకు అనుష్ఠించిన కర్మలు అనుభవించినప్పటికిన్నూ అనుభవించని సంచిత కర్మలు ఉండును వానిని అనుభవించుటకు కర్మలతో తిరిగి వచ్చును. కర్మల శేషము లేనిచో అప్పుడే పుట్టిన బాలునకు ఈ జన్మలో ధర్మాధర్మముల అనుష్ఠానము లేనందువలన సుఖ-దుఃఖముల అనుభవము కలుగనేరదు. కొందరి మతము ఏమనగా ఒకజన్మలో చేసినకర్మలు దాని తరువాత జన్మలో వాని ఫలము అనుభవించుటవలన కర్మలు నశించును. ఇట్లు చెప్పుట సరికాదు ఎందులకనగా ఇంద్రపదమును ఇచ్చు కర్మలు మరియు పంది జన్మనిచ్చు

పాపకర్మలు  ఒకే క్షణములో మరియు ఒకే జన్మలోఅనుభవించుట అసంభవము అందువల్ల 'ఏకభవికః కర్మానుశయః' అనగా 'ఒకే జన్మలో అన్ని కర్మలు అనుభవించును' అను పైన చెప్పిన మతమునకు విరోధము కలదు. "యావత్సమ్పాత" శబ్దము కేవలము స్వర్గమునిచ్చు  కర్మల వాచకమే గాని పేరు కాదు. శ్రుతిలో స్వర్గమునుండివచ్చిన తరువాత ఐదవ ఆహుతిలో శరీరమును గ్రహించు జీవునికి పుణ్య-పాపములుండునని చెప్పుచున్నది. "తద్య ఇహ రకనీయచరణా" (ఛాం 5.10.7.) అనగా 'ఈ లోకమునందు మంచి నడవడి గలవారు శీఘ్రముగనే ఉత్తమజన్మను పొందెదరు'.

299. కృతాత్యయేఽనుశాయవాన్ దృష్టస్మృతిభ్యాం యథేతమనేవం చ. (3.1.8.)

సూత్రార్థము:- స్వర్గము కొరకు చేసిన కర్మలు అనుభవించిన తరువాత ఆ కర్మలకన్న అతిరిక్త కర్మలతోగూడి జీవుడు ఈ లోకమునకు వచ్చును. ఎందులకనగా "తద్య ఇహ రకనీయచరణా" (ఛాం 5.10.7.) అనగా 'ఈ లోకమునందు మంచి నడవడి గలవారు శీఘ్రముగనే ఉత్తమజన్మను పొందెదరు'. మరియు "ప్రేత్య కర్మఫలమనుభూయ" అను శ్రుతి మరియు స్మృతి వాక్యములు ప్రమాణము. ఏ ధూమాది మార్గములద్వారా పోయిరో దానికి విపరీతమైన అభ్రాది మార్గములద్వారా ఈ లోకమునకు తిరగి వచ్చును.

కర్మఫల శేష లేకుండుటవలన స్వర్గమునుండి తిరిగివచ్చు జీవుడు కీటపతంగతిర్యగాది జన్మలు పొందడు. అందువల్ల కర్మఫలనుండి వైరాగ్యము గూడ రాదు అని పూర్వపక్షి కథనము. కర్మసంస్కారములు ఉండుటవలన శరీరమును తప్పక గ్రహించును గాన కర్మఫలమునుండి వైరాగ్యము తప్పక కలుగునని సిద్ధాన్తి చెప్పును. "తస్మిన్ యావత్సంపాతముషిత్వాథైతమేవాధ్వానం పునర్నివర్తన్తే యథేతమ్" (ఛాం 5.10.5 )అనగా 'స్వర్గలోకమునకు పోయిన జీవుడు తన ప్రారబ్ధము ముగుయు వరకు అచటనుండి మరల పోయినమార్గములోనే తిరిగివచ్చును'. ఇదే ప్రసంగములో "రమణీయచరణా రమణీయాం యోనిమాపద్యతే" అనగా 'మంచికర్మల ఫలితముగా మంచి జన్మలునపొందును'. ఇచట సంశయము కలుగును ఏమనగా స్వర్గమునుండి తిరిగి వచ్చు జీవుడు కర్మ సంస్కారరహితుడై వచ్చునా లేక కర్మ సంస్కారములతోవచ్చునా? పూర్వపక్షి కర్మసంస్కారముల రహితుడై వచ్చును ఎందులకనగా కర్మసంస్కారములు ఉన్నంతవరుకు స్వర్గములో వాని నివాసమని చెప్పిరి అనును. దానికి సిద్ధాన్తి చెప్పినది. ఏ కర్మ సముహముల భోగమునకు స్వర్గము పోవునో ఆ కర్మలు అనుభవించి మిగిలిన కర్మ సంస్కారములతో జీవుడు తిరిగి వచ్చును. ఏ విధముగా అగ్ని సంయోగమువలన నెయ్యి కరుగునో అటులనే స్వర్గ కర్మఫల భోగము సమాప్తమగుచున్నదను చింతాగ్నిద్వారా జీవుని యాతనామయ శరీరము సూర్యుని సంపర్కమువలన మంచుగడ్డ కరుగునటుల కరిగిపోవును. అందువల్ల జీవుడు కర్మ సంస్కారములతో తిరిగి వచ్చును. స్వర్గము ఫలమునిచ్చు కర్మకన్న భిన్నమైన కర్మను 'అనుశయ' శబ్దముతో చెప్పిరి. అనుశయ కర్మతో కూడిన జీవుడే స్వర్గమునుండి తిరిగి వచ్చును. ఎందులకనగా 'దృష్ట స్మృతిభ్యాం' అనగా 'శ్రుతిలో చూడబడు చున్నది మరియు స్మృతిలో చెప్పబడినది'. "తద్య ఇహ రమణీయచరణా అభ్యాశో హయత్తే రమణీయాం యోనిమాపద్యేరన్ బ్రాహ్మణయోనిం వా" అనగా 'స్వర్గమునుండి తిరిగి వచ్చు జీవులలో శోభనమైన ఆచరణమున్న జీవుడు ఈ లోకములో బ్రాహ్మణాది మంచి జన్మలను పొందును" (ఛాం.5.10.7 ) "వర్ణా ఆశ్రమాశ్చ  స్వకర్మనిష్ఠాః ప్రేత్య  కర్మఫలమనుభూయ తతః శేషేణ విశిష్టదేశకాలజాతికులరూపాయుఃశ్రుతవిత్తసుఖమేధసో జన్మప్రతిపద్యన్తే"

అనగా 'వర్ణాశ్రమధర్మములు బాగుగా ఆచరించినవారు చంద్రలోకమున సకలసుఖములు అనుభవించి తరువాత కర్మశేషముతో భూలోకమునకు వత్తురు. మంచిస్థలమునందు శ్రేష్టమగు జాతిలో ఉత్తమమగు కులముతో చక్కనిస్వభావంబును విద్యయుకలిగి ధనవంతులై సుఖవంతులై రూపవంతులై బుద్ధిమంతులై జన్మింతురు. బహుకాలము దీర్ఘాయుష్మంతులై జీవింతురు". పై శ్రుతిలో మరియు ఈ స్మృతిలో భూలోకము తిరిగి వచ్చు జీవునకు అనుశయము కలదను విషయము స్పష్టము. కర్మశేషమున్న ఆ జీవునికి మొక్షము కలగదు అనిన అది మాకు అభీష్టమే ఎందులకనగా శ్రుతిలో సంపూర్ణ కర్మలు నాశనమైన తరువాతనే తత్త్వజ్ఞానము కలుగునని చెప్పిరి. స్వర్గము పోవునపుడు జీవుడు ఏ క్రమములో ధూమాది మార్గములో పోవునో దానికి విపరీత క్రమములోఅభ్రాది మార్గముద్వారా తిరిగి వచ్చును.

### 300. చరణాదితి చేన్నోపలక్షణార్థేతి కార్ష్ణాజినిః. (3.1.9.)

సూత్రార్థము:- 'రమణీయచరణా' అను శ్రుతి వాక్యములో ఆచారము లేక చరిత్రననుసరించియే మరు జన్మ చెప్పబడినది కాని అనుశయ శబ్దముతోకాదు. 'అనుశయ' 'చరణ' శబ్దములు పరస్పరము విలక్షణములు అను ప్రశ్నగూడ సరికాదు. ఎందులకనగా కార్ష్ణాజినిః అను ఆచార్యులు చరణ శబ్దమును చెప్పు శ్రుతిని ఉపలక్షణమని (తద్గ్రాహకత్వే సతి తదితర గ్రాహకత్వముపలక్షణం) చెప్పుచు చరణ శబ్దముతో అనుశయ శబ్దమునుగూడ చెప్ప వచ్చు ననిరి.

శ్రుతిలో మంచి ఆచరణముద్వారా ఉత్తమజన్మ కలుగునని చెప్పబడినది కాని అనుశయశబ్దముద్వారా కాదు. చరణము, ఆచారణము, చరిత్ర, శీలము ఇవి పర్యాయ శబ్దములు. అనుశయ శబ్దము అనుభవించిన కర్మకు అతిరిక్త శేషకర్మమని అర్థము. "యాన్యనవద్యాని కర్మాణి.......యాన్యస్మాకం సుచరితాని" (తై. 1.11.2.) అనగా 'మాలోనున్న దోషరహితకర్మలు మరియు మాలోనున్న మంచి చరిత్రను మాత్రమే అనుసరించుడు'. ఈ శ్రుతి వాక్యముద్వారా కర్మ మరియు చరిత్రకు భేదము చెప్పబడినది. అపుడు అనుశయ శబ్దము సిద్ధికాదని చెప్పిన అట్లనుటగూడ సరికాదు. ఎందులకనగా కార్ష్ణాజినిః ఆచార్యులు అనుశయ శబ్దము యొక్క ఉపలక్షణార్థము చరణ శ్రుతిని చెప్పిరి అనిరి. అనగా శ్రుతిలో వచ్చిన 'చరణ' శ్బబ్దముద్వారా 'అనుశయము' మరియు 'ఆచరణము' ఈ రెండు అర్థములను గ్రహించవలయునని వారి అభిప్రాయము. అందువలన ఈ రెండు శబ్దముల అర్థములో భేదముకలదను శంక పనికిరాదు.

### 301. ఆనర్థక్యమితి చేన్న తదపేక్షత్వాత్. (3.1.10.)

సూత్రార్థము:- చరణశ్రుతి తన ముఖ్యార్థమును వదిలి అనుశయార్థమును బోధగావించిన చరణశ్రుతిలో ఆనర్థక్య ప్రసంగము వచ్చును. అది సరికాదు. ఎందులకనగా ఇష్టాది కర్మల అస్తిత్వము ఆచారణముయొక్క అధీనమగుటవలన ఆచరణ శబ్దముయొక్క ఆవశ్యకమున్నది. గాన ఆచరణ శబ్దము నిరర్థకముగాదు.

చరణ శబ్దము యొక్క అర్థము శ్రుతిలో శీలమని చెప్పిరి. దానిని వదిలి అనుశయమని అర్థమును చెప్పిన శ్రుతిలో చెప్పిన చరిత్రమను చరణశబ్దార్థము నిరర్థకమగును. అటుల చెప్పుట సరికాదు ఎందులకనగా ఇష్టాది

కర్మలసిద్ధి ఆచరణము ద్వారానే పొందుట శక్యము. సదాచార విహీనమైన ఏవ్యక్తియు శాస్త్రీయ కర్మలకు అధికారి కాజాలడు. అందువల్ల చరణశ్రుతి సార్థక మగుటవలన చరణశబ్దముద్వారా చెప్పిన కర్మమే మంచి-చెడు జన్మలకు కారణమగుచున్నది. ఇదియే పూర్వము కార్ష్ణజిని ఆచార్యులు చెప్పిన అర్థము.

302. సుకృతదుష్కృతే ఎవ తు బాదరిః. (3.1.11.)

సూత్రార్థము:- బాదరి అను ముఖ్య ఆచార్యులు చరణ శబ్దముద్వారా పుణ్య పాప కర్మలు గ్రహించబడుచున్నవను చున్నారు. ఎందులకనగా లోకములో 'ధర్మం చరతి' అని చెప్పిన కర్మము మరియు ఆచరణము ఈ రెండిటికి పరస్పరము భేదము లేదని తెలియుచున్నది. అందువల్ల చంద్రలోకము పోవు ఇష్టాది కర్మలు చేయు వారికి అనుశయమను కర్మశేషమున్నదని తెలియుచున్నది.

బాదరి ఆచార్యులు చరణ శబ్దముద్వారా పుణ్య-పాప కర్మలు చెప్పబడుచున్నవని చెప్పుచున్నారు ఎందులకనగా సామాన్యముగా అన్ని కర్మలలో చరణశబ్ద ప్రయోగము చూడబడు చున్నది. లోకములో ఇష్ట, పూర్త, దత్త కర్మలు చేయువారిని ధార్మిక పురుషులందురు. కర్మము మరియు ఆచరణము ఈ రెండు శబ్దములు అభిన్నమయినను వాని భేదమును బ్రాహ్మణ పరివ్రాజ న్యాయము ద్వారా చెప్పిరి. బ్రాహ్మణులకు పరివ్రాజకులకు విందు చేయునపుడు పరివ్రాజకులు బ్రాహ్మణులైనను బ్రాహ్మణ శబ్దము పరివ్రాజకులకన్న భిన్నమయిన ఇతర బ్రాహ్మణులను సూచించును. దీనినే బ్రాహ్మణ పరివ్రాజక న్యాయమందురు. గాన బ్రాహ్మణ పరివ్రాజకులలో భేద-వ్యవహారము చూడబడుచున్నది. అందువల్ల ఇష్టాది కర్మలు చేసి చంద్రలోకమునకు పోయి తిరిగి వచ్చు జీవుడు కర్మశేషముతో అనగా సానుశయముతోనే తిరిగి వచ్చును.

## 90. అనిష్టాదికార్యధికరణము.

సంగతి:- కేవలము ఇష్టాదికర్మలు చేయువారు మాత్రమే చంద్రలోకము పోవుదురని కాదు కాని వానికన్న భిన్నమైన కర్మ చేయువారికిగూడ చంద్రలోకగమనము సంభవము అను ఆక్షేపసంగతి వలన ఈ అధికరణము మొదలయినది.

విషయము:- ఈ అధికరణమునకు విచరణీయ విషయము ఇష్టాదికర్మలు చేయనివారి చంద్రలోక గమనము.

సంశయము:- పాపకర్మలు చేయువారు చంద్రలోకమునకు పోవుదురా లేక పోరా?

పూర్వపక్షము:- 'తే సర్వే గచ్ఛన్తి' ఈ వాక్యము ద్వారా అందరు చంద్రలోకమునకు పోవుదురు అని వినబడు చున్నది. తేడా ఏమనగా ఇష్టాదికర్మలు చేయువారు చంద్రలోకములో భోగములనుభవింతురు తక్కిన వారికి భోగములుండవు. భోగములు అనిభవించక పోయినను పఞ్చమ ఆహుతిని పూర్తిచేయుటకు పాపులుగూడ చంద్రలోకమునకు పోవుదరనుట యుక్తిసంగతము.

సిద్ధాన్తము:- చంద్రలోకగమనము భోగములనుభవించుటకే. శ్రుతిలో వచ్చిన సర్వ శబ్దము పుణ్యాత్ముల కొరకే చెప్పిరి. పాపాత్ములకు యమలోకములో యాతనములు చెప్పిరి.

వైయాసికన్యాయమాలా:

193. చన్ద్రం యాతి న వా పాపి? తే సర్వే ఇతి వాక్యతః | పఞ్చమాహుతిలాబార్థే భోగాభావేఽపి యాత్యసౌ ||

194. భోగార్థమేవ గమనమాహుతిర్వ్యభిచారిణీ | సర్వశ్రుతిః సుకృతినాం యామ్యే పాపిగతిః శ్రుతా ||

పాపకర్మలు చేయువారు చంద్రలోకమునకు పోవుదురా లేదా? పాపులు చంద్రలోకమునకు పోవుదురు. అచట వారికి భోగములేకపోయినను 'తే సర్వే' అను శ్రుతివలనను పఞ్చమ ఆహుతిరూప ప్రయోజనము కొరకును పాపులు పోవుదురని పూర్వపక్షి కథనము. దానికి సిద్ధాన్తి సమాధానము. భోగముకొరకే చంద్రలోకమునకు పుణ్యాత్ములు పోవుదురు మరియు పఞ్చమ ఆహుతిలో వ్యభిచారము కలదు. 'తే సర్వే' అను శ్రుతి పుణ్యాత్ములకు, అందువల్ల పాపులు యమలోకము పోవుదురు కాని స్వర్గమునకు కాదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

"యే వై కే చాస్మాల్లోకాత్ప్రయన్తి చంద్రలోకమేవ తే సర్వే గచ్ఛన్తి" అనగా 'ఈ లోకమునుండి ప్రయాణము చేయువారందరు చంద్రలోకమునకు పోవుదురు' (కౌషీతకి.1.2.) ఈ శ్రుతిద్వారా చంద్రలోకమును స్వర్గమునకు పాపత్ములుగూడ పోవుదురు. స్వర్గలోకములో పాపత్ములకు భోగము లేకపోయినను మరల శరీరమును పొందుటకు, పఞ్చమ ఆహుతి లాభార్థము స్వర్గమునకు పోవుట మిక్కిలి ఆవశ్యకము. ఈ విధముగా పుర్వపక్షి చెప్పిన దానికి సిద్ధాన్త సమాధానము. స్వర్గమునకు పోవు ముఖ్య ప్రయోజనము భోగమే కాని పఞ్చమ ఆహుతి లాభము కాదు ఎందులకనగా ద్రోణ ద్రౌపతి మొదలగు వారి జన్మలో పఞ్చమ ఆహితికి వ్యభిచారము కలదు. 'తే సర్వే' ఇత్యాది శ్రుతులు పుణ్యాత్ముల విషయములో చెప్పబడినది. మరియు పాపాత్ములకు యమలోక గతిని గురించి శ్రుతిలో వినబడు చున్నది. 'వైవస్వతం సంగమనమ్' అని. అందువల్ల పాపకర్మలు చేయువారికి స్వర్గలోక గతి లేదు.

### 303. అనిష్టాదికారిణామపి చ శ్రుతమ్. (3.1.12.)

సూత్రార్థము:- ఇది పూర్వపక్ష సూత్రము. "యే వై కే చాస్మాల్లోకాత్ప్రయన్తి చంద్రలోకమేవ తే సర్వే గచ్ఛన్తి" అనగా 'ఈ లోకమునుండి ప్రయాణము చేయువారందరు చంద్రలోకమునకు పోవుదురు' (కౌషీతకి.1.2.). ఈ శ్రుతిద్వారా ఇష్టాది కర్మలు చేయనివారు (అనిష్టాదికారి) గూడ చంద్రలోకమునకు పోవుదురని వినబడు చున్నది. కనుక ధర్మమును ఆచరించువారే సర్గమునకు పోవుదరనుట సరికాదు.

అనిష్టాదికారులుగూడ స్వర్గమునకు పోవుట సంభవము కనుక ఇష్టాదికర్మ అనుష్టానము వ్యర్థము అను పూర్వపక్షమునకు సిద్ధాన్తి చెప్పునది. పాపకర్మలు చేయువారు చంద్రలోకమునకు పోరు గనుక ఇష్టాది కర్మల అనుష్ఠానము సార్థకమునును. ఇష్టాది కర్మలకన్న భిన్న కర్మలు చేయువారు సర్గమునకు పోవుదారా పోరా? అను సంశయమునకు పూర్వవాది పాపులు గూడ చంద్రలోకమునకు పోవుదురనును ఎందులకనగా ఉపనుషత్తులో ఆవిధముగా చెప్పిరి. "యో వై కే చాస్మాల్లోకాత్ప్రయన్తి, చంద్రమసమేవ తే సర్వే గచ్ఛన్తి" (కౌషీతకి. 1.2.) అనగా 'ఎవరెవరు ఈ లోకమునుండి పోవుదురో వారందరు చంద్రలోకమునకు పోవుదురు' అని శ్రుతియందు సర్వసాధరణముగ అందరికి అనిన పాపులకు గూడ చంద్రలోకగమనము చెప్పబడినది. ఈ విధముగా పుణ్య-పాపులకిద్దరికి చంద్రలోకగమనము చెప్పినందువలన అనిష్టాదికారి పాపులకు భోగ అభావరూపమైన విశేషము చెప్పబడినది. పుణ్యాత్ములు స్వర్గములో పుణ్యకర్మల ఫలభోగము అనుభవించి తిరిగి వత్తురు కాని పాపాత్ములు

అచటికి పోయి అచట నున్న సుఖములను అనుభవించకనే తిరిగి వత్తురు. ఇదియే పుణ్య పాపాత్ములకు గల తేడా.

304. సంయమనే త్వనుభూయేతరేషామారోహావరోహౌ తద్గతిదర్శనాత్. (3.1.13.)

సూత్రార్థము:- పూర్వపక్షములో చెప్పిన విషయమును నిరాకరించుటయే సూత్రములో చెప్పిన 'తు' శబ్ద యొక్క ప్రయోజనము. యమునిద్వారా పెట్టు యాతనలు అనుభవించుటకే పాపులు యమాలయమునకు పోవుదురు. "న సాంపరాయః ప్రతిభాతి బాలం ప్రమాద్యంతం విత్తమోహేన మూఢం అయం లోకో నాస్తి పర ఇతి మానీ పునః పునర్వశ మాపద్యతేమే" (కఠ. 2.6.) అనగా 'వివేకశూన్యమై అజ్ఞానమువలన ధనమదముచే లౌకిక పదార్థముల మోహముచే మూఢుడై ప్రమాదమును చేయు పురుషునకు పూర్వాపరములు తెలియవు. ధర్మ మార్గము తోచదు. ఈ లోకమేకాని పరలోకమనునది లేదని వారి యందు ఒక దురభిమానము కలుగును. దానివలన వారు ధర్మము నాచరించరు. ధర్మమునాచరించకుండుటవలన మాటి మాటికి నాకు (యమునకు) వశులగుచుందురు'. ఈ శ్రుతిలో యమాధీనత్వరూపమను గతి చూపబడినది.

స్వర్గలోకములో అచటి సుఖభోగములు అనుభవించుటకే పుణ్యాత్ముడు స్వర్గమునకు పోవును కాని ప్రయోజనము లేకయే పోయి తిరిగివచ్చుటకు కాదు. లోకములో ఫలములనాశించియే వృక్షమును ఎక్కును గాని కేవలము ఎక్కి దిగుటకు కాదు మరియు అచనుండి పడుటకు కాదు. అందువల్ల పాపాత్ముడు యమలోకములో తన పాపకర్మలకనుగుణముగా యమయాతనలు అనుభవించి మరల ఈ లోకమునకు తిరిగి వచ్చును. ఆ పాపులు ఈ విధముగా యమలోకమునకు పోయి తిరిగి వచ్చుట చూడబడు చున్నది శ్రుతి ప్రమాణమువలన. . "న సాంపరాయః ప్రతిభాతి బాలం ప్రమాద్యంతం విత్తమోహేన మూఢం అయం లోకో నాస్తి పర ఇతి మానీ పునః పునర్వశ మాపద్యతేమే" (కఠ. 2.6.) అనగా 'వివేకశూన్యమై అజ్ఞానమువలన ధనమదముచే లౌకిక పదార్థముల మోహముచే మూఢుడై ప్రమాదమును చేయు పురుషునకు పూర్వాపరములు తెలియవు. ధర్మ మార్గము తోచదు. ఈ లోకమేకాని పరలోకమనునది లేదని వారి యందు ఒక దురభిమానము కలుగును. దానివలన వారు ధర్మము నాచరించరు. ధర్మమునాచరించకుండుటవలన మాటి మాటికి నాకు (యమునకు) వశులగుచుందురు'. ఈ శ్రుతిలో యమాధీనత్వరూపమను గతి చూపబడుచున్నది.

305. స్మరన్తి చ. (3.1.14.)

సూత్రార్థము:- మరియు మనువు వ్యాసాదులు మొదలగు శిష్ట పురుషులు తమతమస్మృతులలో దుష్టకర్మలు చేయువారికి నరకభోగము కలుగునని వారి వారి గ్రంథములద్వారా ప్రతిపాదించిరి. అందువల్ల ఇష్టాదికర్మలు చేయువారే చంద్రలోకమునకు పోవుదురు ఇతర పాపులు పోరు అని ఈ సూత్రాభిప్రాయము.

వ్యాసాది శిష్టపురుషులుగూడ యమలోకములో పాపకర్మలను అనిభవించుటకే యమలోకమునకు పోయి యమరాజు అధీనములోనుందురని చెప్పిరి. దీనిద్వారాగూడ పుణ్యాత్ములు మాత్రమే చంద్రలోకమునకు పోవుట కానవచ్చుచున్నది కాని పాపాత్ములకు కాదు.

306. అపి చ సప్త. (3.1.15.)

సూత్రార్థము:- మరియు పౌరాణికులుగూడ రౌరవాది ఏడు నరకములు పాపఫలములకు ఉపభోగస్థానమని చెప్పిరి. అందువల్ల పుణ్యాత్ములకే చంద్రలోకము పోవుటకు అధికారముకాని పాపాత్ములకు కాదు.

పౌరాణికులు రౌరవాది ఏడు నరకములు పాపకర్మల ఫల భోగమునకు స్థానములని స్వీకరించిరి. ఆ నరకములలోకే పాపులు పోవుదురు కాని చంద్రలోకమునకు కాదు. రౌరవాదిలో ఆది శబ్దముద్వారా మహారౌరవము, వహ్ని, వైతరణీ, కుమ్భీ, తామిశ్రము మరియు అన్ధతామిశ్రము గ్రహించవలయును. అనిష్టపాపకర్మలు చేయువారు ఈ ఏడు నరకములకు పోవుదురు, చంద్రలోకమునకు పోరు. అందువలననే మను ఆది స్మృతికారులు అనిష్టాదికర్మలు చేయువారు నరకమునకే పోవుదురని అచ్చటచ్చట ప్రతిపాదించిరి. మరియు పురాణములలో ఈ విధముగా చెప్పిరి. కూట సాక్ష్యము మరియు అనుచితపక్షపాతమును చెప్పువారు రౌరవనరకమునకు పోవుదురని చెప్పిరి. "యశ్చాన్యదనృతం వక్తి స నరో యాతి రౌరవమ్ | భ్రూణహా పురహర్తా చ గోఘ్నశ్చ మునిసత్తమాః | యాన్తి తే నరకే ఘోరే యశ్చోచ్ఛ్వాస నిరోధకః" || ఇత్యాది శ్లోకములద్వారా. రౌరవాది నరకములలో యమరాజు అధీనములో నున్న పాపులు యమ యాతనలు అనుభవింతురు. ఇట్లు చెప్పుట సరికాదు ఎందులకనగా ఆ యా నరకములలో చిత్రగుప్తునకు అధికారము కలదని స్మృతిలో చెప్పిరి. ఈ ప్రశ్నకు సమాధానము ముందు సూత్రములో చెప్పిరి.

307. తత్రాపి చ తద్వ్యాపారాదవిరోధః. (3.1.16.)

సుత్రార్థము:- పాపులు యముని అధ్యక్షతలో యమయాతనలు అనుభవింతురు అనుట సరికాదు ఎందులకనగా చిత్రగుప్తాదులకే రౌరవాది నరకములలో శాసనమున్నదని శాస్త్రములో ప్రసిద్ధము. అందువల్ల యమాధీనమని చెప్పుట సరికాదు. అను పూర్వపక్షమునకు సిద్ధాన్తి యమాధీనమే సరి అనును ఎందులకనగా అచట రౌరవాది నరకములలో యముని ద్వారానే చిత్రగుప్తాదుల శాశనము జరుగును కనుక ఏవిధమైన విరోధము లేదు.

రౌరవాది ఏడు నరకములలో యమరాజు యొక్క ఆధిపత్యము చెప్పబడినది. అనగా యమరాజు ప్రేరణద్వారా ఆ నరకములలో చిత్రగుప్తాదులు శాశన చేయుదురు యజమానాధీనములోనున్న సేవకుడివలే అందువల్ల ఏ విధమైన విరోధములేదు.

308. విద్యా కర్మణోరితి తు ప్రకృతత్వాత్. (3.1.17.)

సూత్రార్థము:- "అథైతయోః పథోర్న" అని శ్రుతిలో 'ఏతయోః' అను శబ్దముద్వారా విద్యా మరియు కర్మ ఈ రెండు గ్రహించిరి ఎందులకనగా వానినే దేవయానపితృయాణరూపములైన రెండు మార్గములను సాధనరూపముగా చెప్పిరి. సూత్రములో నున్న 'తు' శబ్దముద్వారా 'చంద్రమసమేవ' అను శాస్త్రముద్వారా కలిగిన ప్రశ్నను తొలగించిరి.

పఞ్చాగ్ని విద్యలో ప్రశ్నోత్తర సమయములో చెప్పినది. "అథైతయోః పథోర్న కతరేణచనతానీమాని క్షుద్రాణ్యసకృదావర్తీని భూతాని భవన్తి | జాయస్వ మ్రియస్వేత్యేతత్తృతీయ స్థానం, తేనాసౌ లోకో న పూర్యతే"

(ఛాం.5.10.8.) అనగా 'మాటిమాటికి జన్మమరణములు పొందుచు తిరుగుచున్న ఈ క్షుద్రజీవులు పై చెప్పిన విద్యాకర్మల మార్గములలో దేనినిగూడ అనిసరింపరు. దీనికి 'పుట్టుము చావుము' అను మూడవ మార్గము కలదు. ఇట్లు కేవలము యజ్ఞాదిపుణ్య కర్మకర్తలే తప్ప మఱి ఎవ్వరును పోకుండుటచే చంద్రలోకము పూరింపబడుటలేదు అనగా ఇఱుకు కాదు." ఇ శ్రుతిలో దేవయానము మరియు పితృయాణనములకు సాధనముగా ఉపాసన మరియు కర్మల ప్రసంగమగుటవలన గూడ అందరు జీవులు చంద్రలోకమునకు పోవుట సంభవముకాదు ఎందులకనగా ఉభయ మార్గములనుండి భ్రష్టజీవులకు మాటిమాటికి సంసారములో వచ్చుట వినబడుచున్నది. "చంద్రమసమేవ తే సర్వే గచ్ఛన్తి" అను శ్రుతిద్వారా ఉత్పన్నమైన శంకానివృత్తికి సూత్రములో 'తు' శబ్దము చెప్పబడినది. ఎందులకనగా "చంద్రమసమేవ తే సర్వే గచ్ఛన్తి" అను శ్రుతిలో చంద్రలోకమునకు పోవు అధికారముగల పురుషులకే సర్వ శబ్దము చెప్పిరి. అనగా ఇష్టాది కర్మలు చేసి అధికారము సంపాదించినవారందరు మాత్రమే ఈ లోకమునుండి స్వర్గలోకమునకు పోవుదురు. ఈ అధికారులకే సర్వశబ్దము శ్రుతిలోచెప్పిరి అని శ్రుతివాక్యాభిప్రాయము.
పఞ్చమ ఆహుతిలో జలము పురుషరూపము దాల్చును. ఈ సామాన్య ఐదవ సంఖ్య నియమానుసారము పాపులకు దేహ ప్రాప్తికి చంద్రలోకము పోవుట స్వీకరించవలయును. లేనిచో పఞ్చమ సంఖ్య నియమ నిర్వాహకము కాజాలదు. ఈ ప్రశ్నకు సమాధానము ముందు సూత్రముద్వారా ఇచ్చుచున్నారు.

### 309. న తృతీయే తథోపలబ్ధేః. (3.1.18.)

సూత్రార్థము:- తృతీయ మార్గములో ప్రవేశించిన పాపులకు దేహ ప్రాప్తికి ఆహుతులసంఖ్య నియమము లేదు. ఎందులకనగా 'జాయస్వ మ్రియస్వ' అని చెప్పు శ్రుతిద్వారా సంఖ్యానియమము లేకుండగనే దేహ ప్రాప్తి వారికి ఉపలబ్ధమగుచున్నది. అందులకే ఆహుతి నియమము ఇష్టాదికర్మలు చేయు వారికే అని భావము.

దేవయానము మరియు పితృయానముల కన్న భిన్నమైన తృతీయ స్థానములో దేహ ప్రాప్తికి పఞ్చమ ఆహుతి నియమము పాటించనవసరము లేదు ఎందులకనగా శ్రుతిలో అవిధముగనే చెప్పిరి. ఆపాపులకు "జాయస్వ మ్రియస్వేత్యేతత్తృతీయ స్థానమ్" (ఛాం.5.10.8.) అనగా 'జననమరణములు మాత్రమే ఆతృతీయ స్థానమునకు చెప్పిరి.' ఈ శ్రుతిద్వారా ఆహుతి సంఖ్య నియమము లేకయే తృతీయ స్థానదేహము పొందుదురని చెప్పిరి. అందువల్ల ఇష్టాది కర్మల ద్వారా అధికారము పొందిన పురుషులు, పురుష శబ్దవాచ్యమైన మనుష్య శరీరము పొందుటకు ఆహుతి సంఖ్యను పాటించవలయును కాని అందరికీ కాదు.

### 310. స్మర్యతేఽపి చ లోకే. (3.1.19.)

సూత్రార్థము:- మహాభారతాది గ్రంథములలో ద్రోణుడు, ధృష్టద్యుమ్నుడు మొదలగువారు అయోనిజులని ప్రసిద్ధము. వానిలో ద్రోణుని జన్మకు స్త్రీలో ఆహుతిలేదు. ధృష్టద్యుమ్నునికి స్త్రీపురుష విషయములైన రెండు ఆహుతులు లేవు. అందువల్ల ఆహుతు సంఖ్య నియమము లేదు. (ద్రోణుని ఉత్పత్తి యజ్ఞపాత్రవిశేషమైన కలశమునుండి అయినది. ధృష్టద్యుమ్నుడు అగ్ని నుండి పుట్టెను.)

ద్రోణాచార్య, ధృష్టద్యుమ్న, సీతా మరియు ద్రౌపతి మొదలగు వారికి లోకములో అయోనిజులని చెప్పిరి. వీరిలో ద్రోణునికి స్త్రీరూపమైన అగ్నిలో ఆహుతిలేదు. అనగా స్త్రీ గర్భములో ప్రవేశించకనే ద్రోణుని జన్మ అయినదని చెప్పిరి. ధృష్టద్యుమ్ననికి మరియు ద్రౌపతికి స్త్రీ మరియు పురుషరూపమైన ఆహుతులు లేవు. అనగా వారికి స్త్రీ పురుషుల సమ్బన్ధము లేకుండగనే జన్మ కలిగెను. సరిగ్గా ఈలాగుననే పాపులకు ఆహుతి సంఖ్య నియమము లేకయే జన్మ కలుగునని తెలిసికొనవలయును.

311. దర్శనాచ్చ. (3.1.20.)

సూత్రార్థము:- లోకములో జారాయుజ, అణ్డజ, స్వేదజ మరియు ఉద్భిజ్జ అని నాలుగువిధముల భూతములు గలవు. వానిలో స్వేదజ మరియు ఉద్భిజ్జములు స్త్రీ మరియు పురుష సంయోగము లేకయే ఉత్పన్నమగుట చూచుచున్నాము. అందువల్ల ఆహుతి సంఖ్య నియమము లేదు.

లోకములో జారాయుజ, అణ్డజ, స్వేదజ మరియు ఉద్భిజ్జ అని నాలుగువిధముల భూతములు గలవు. వానిలో స్వేదజ మరియు ఉద్భిజ్జములు స్త్రీ మరియు పురుష సంయోగము లేకయే ఉత్పన్నమగుచున్నవి. ఏవిధముగా ఈ స్థలములలో ఆహుతి సంఖ్య నియమములేదో ఆవిధముగనే దేహాన్తర ప్రాప్తికి పాపులకు పఞ్చసంఖ్య ఆహుతుల ఆవశ్యకములేదు. స్వేదజ మరియు ఉద్భిజ్జములు స్త్రీ మరియు పురుష సంయోగము లేకయే ఉత్పన్నమగుచున్నవి. ఇపుడు రెండు ఆహుతులు తగ్గి పోయినవి. ఇట్లే పాపత్ముల దేహముల ఉత్పత్తియు కలుగవచ్చును.

“తేషాం ఖల్వేషాం భూతానాం త్రీణ్యేవ బిజాని భవన్తి, అణ్డజం జీవజముద్భిజమ్” (ఛాం.6.3.1.) ‘ఈ సంపూర్ణ భూతములు అండజములు, జీవజములు, ఉద్భిజములు అని మూడు ప్రకారములే’ ఈ శ్రుతిలో భూతసముదాయము మూడు రకములని వినవచ్చుచుండగా మరి మీరు భూతములు నాలుగు రకములని ఎట్లు చెప్పిరి? దీనికి సమాధానము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

312. తృతీయశబ్దావరోధః సంశోకజస్య. (3.1.21.)

సూత్రార్థము:- స్వేదజ భూతములను (‘ఆండజం’ అని శ్రుతిలో చెప్పిన) ఉద్భిజ్జరూపమైన తృతీయ శబ్దముద్వారా గ్రహించబడుచున్నది. ఎందులకనగా ఉద్భిజ్జ శబ్దములోగల అవయవముల అర్థము ప్రకారము వృక్షాదులను గ్రహించినటులే స్వేదజములనుగూడ గ్రహించవచ్చును. కారణమేమనగా స్వేదజములుగూడ జలమును భేదించుకొని ఉత్పన్న మగు చున్నవి.

అణ్డజ, జీవజ మరియు ఉద్భిజ్జ అని శ్రుతివాక్యములో చెప్పిన తృతీయ ఉద్భిజ్జ శబ్దము ద్వారా స్వేదజములనుగూడ గ్రహించిరని తెలిసికొనవలయును. ఎందులకనగా స్వేదజ ఉద్భిజ్జములు ఈ రెండును జలము మరియు భూమిని భేదన గావించి సమాన రూపముగా జనించుచున్నవి. అందువల్ల ఈ స్వేదజములుగూడ గ్రహిచబడుటచే నాలుగు విధముల భూతముల సంఖ్యకు హాని రాదు. కాని స్థావర

జంగమరూపముగా వానికి భేదముగూడ అవిరుద్ధము. అందుకనే అనిష్టాది కర్మలు చేయు పాపులుస్వర్గమునకు పోరు, ఇష్టాదికర్మలు చేయు వారు మాత్రమే స్వర్గమునకు పోవుదురు.

## 91. సాభావ్యాపత్త్యధికరణము.

సంగతి:- పై అధికరణములో మార్గద్వయముయొక్క వర్ణన వలన 'తృతీయ స్థానమ్' అను శ్రుతిలో నున్న స్థాన శబ్దము మార్గమునకు ఉపలక్షణము( ఉపలక్షణమనగా తద్ గ్రాహకత్వే సతి తదితర గ్రాహకత్వము). అట్లే ఇచట శ్రుతిలో 'తద్య ఇహ' అని సాదృశ్యమునకు ఉపలక్షకము ఏదియూ లేదు. అంతేగాక ఈ సమ్బన్ధములో ఏ ప్రమాణము గూడ కాన వచ్చుటలేదు. ఈ విధమైన ప్రత్యుదాహరణ సంగతి వలన ఈ అధికరణము మొదలైనది.
విషయము:- శ్రుతియొక్క ముఖ్యార్థము మరియు గౌణార్థము ఇచట విచారించెదరు.
సంశయము:- స్వర్గమునుండి తిరిగి వచ్చు జీవాత్మకు ఆకాశాది స్వరూపత్వ ప్రాప్తి కలుగునా లేక కలుగదా?
పూర్వపక్షము:- స్వర్గమునుండి వచ్చు జీవాత్మకు 'వాయుర్భూత్వా' అను శ్రుతి వాక్యమువలన తత్తద్భావ ప్రాప్తి కలుగును.
సిద్ధాన్తము:- ఆకాశాదులవలే సూక్ష్మరూపమైన వాయువునకు వశీభూతులై ధూమాధులతో కలిసి జీవుడు ఉండును కాని ముఖ్యముగా వాయురూపమును పొందడు. ఒక పదార్థము మఱియొక పదార్థము కాజాలదు. ఎన్ని యుక్తులు చెప్పినను ఘటము పటము కానేరదు. కాన ఇచట శ్రుతి గౌణార్థమును చెప్పుచున్నది.
వైయాసిక న్యాయమాలా:
195. వియదాదిస్వరూపత్వం తత్సామ్యం వాఽవరోహిణః | వాయిర్భూత్వేత్యాదివాక్యాత్ తత్తద్భావం ప్రపద్యతే ||
196. ఖవత్సూక్ష్మే వాయువశో యుక్తో ధూమాదిభిర్భవేత్ | అన్యస్యాన్యస్వరూపత్వం న ముఖ్యముపపద్యతే ||
స్వర్గమునుండి అవరోహణము చేయుజీవులు ఆకాశాది స్వరూపమును పొందుదురా లేక ఆకాశాది సామ్యమును (సమాన భావమును) పొందుదురా? 'వాయుర్భూత్వా' అను శ్రుతివాక్యమువలన ఆకాశాది స్వరూపమును పొందుదురని పూర్వపక్షి కథనము. సిద్ధాన్తి సమాధానము. ఒక పదార్థము మఱియొక పదార్థము కాజాలదు. ఎన్ని యుక్తులు చెప్పినను ఘటము పటము కానేరదు. కాన ఇచట శ్రుతి గౌణార్థమును చెప్పుచున్నది. అనగా ఆకాశాదులవలే సూక్ష్మరూపమును పొంది వాయువశులై ధూమాదులతో సమ్బద్ధులైరి అని శ్రుతి అర్థము.
భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-
స్వర్గమునుండి భూలోకమునకువచ్చు జీవుల అవరోహణ క్రమము ఈ విధముగా చెప్పబడినది."అథైతమేవాధ్వానం పునర్నివర్తతే యథేతమాకాశమ్" అనగా ' స్వర్గమునుండి తిరిగి వచ్చు జీవుడు ఏ మార్గముద్వారా పోయేనో ఆమార్గముద్వారానే తిరిగి వచ్చును. అనగా ఆకాశమునుండి వాయువును పొందును. మరల వాయువునుండి ధూమమగును ఆ తరువాత ధూమమునుండి మేఘములను పొందును'. స్వర్గమునుండి తిరిగి వచ్చు జీవుడు ఆకాశాది రూపములగును ఎందులకనగా 'వాయుర్భూత్వా' అను శ్రుతివాక్యము వలన తద్భావము లేక తద్రూపమును పొందునను పూర్వపక్షి.
సిద్ధాన్తి సమాధానము. ఒక వస్తువు వేరొక వస్తువు కాజాలదు అందువల్ల ఆకాశమునకు సమానమగు

సూక్ష్మరూపము దాల్చునని అర్థము. వాయుభావమునుండి అనగా వాయుసమమగును తరువాత ధూమభావము అనగా ధూమ సంపర్కము కలుగునని నిర్ణయించిరి కనుక పూర్వపక్షము అసంగతము.

313. సాభావ్యాపత్తిరుపపత్తేః. (3.1.22.)

సూత్రార్థము:- జీవులకు ఆ ఆకాశాదులతో సాభావ్యాపత్తి అనగా సాదృశ్యము అనిరి ఎందులకనగా యుక్తి కలదు. చంద్రలోకమునకు పోయిన జీవుడు కర్మభోగములను అనుభవించిన తరువాత స్వర్గభోగ కర్మక్షయమువలన శోకాగ్నిద్వారా అచట నున్న శరీరము మంచుముక్కవలే కరిగిపోవుచు ఆకాశమునకు సమానమగును. ఒక వస్తు రూపము ముఖ్యముగా వేరోక వస్తురూపము కాజాలదు. శేషకర్మలనుభవించుటకు భూలోకమునకు తిరిగి వచ్చు జీవుడు ఆకాశాదుల సాదృశ్యము లేక సమానతను పొందుననునది సిద్ధమైనది.

ఇచట శ్రుతిని ముఖ్యార్థమనును పూర్వపక్షి సిద్ధాన్తి శ్రుతి గౌణార్థము చెప్పుచున్నదనును. చంద్రలోకమునకు పోయిన జీవుడు అచట నియతభోగములను అనుభవించి మరల ఈ లోకమునకు తిరిగి వచ్చును. ."అథైతమేవాధ్వానం పునర్నివర్తతే యథేతమాకాశమాకాసశాద్వాయుర్వాయుర్భూత్వా ధూమో భవతి ధూమోభుత్వాఽభ్రం భవత్యభ్రంభూత్వామేఘో భవతి మేఘోభూత్వాప్రవర్షతి" అనగా ' స్వర్గమునుండి తిరిగి వచ్చు జీవుడు ఏ మార్గముద్వారా పోయేనో ఆమార్గముద్వారానే తిరిగి వచ్చును. అనగా ఆకాశమునుండి వాయువును పొందును. మరల వాయువునుండి ధూమమగును ఆ తరువాత ధూమమునుండి మేఘములై వర్షించును'. స్వర్గమునుండి తిరిగి వచ్చు జీవుడు ఆకాశాది రూపములగునా లేక సామ్యమును పొందునా? ఈ సంశయమునకు పూర్వపక్షి శ్రుతిద్వారా ఆకాశాదుల సారూప్యము పొందును లేనిచో లక్ష్యార్థము చెప్పవలయుననును. సిద్ధాన్తి పక్షమునుండి చెప్పునది ఏమనగా స్వర్గమునుండి తిరిగి వచ్చు జీవుడు ఆకాశాదుల సాదృశ్యమును పొందును. ఇట్లు స్వీకరించిననే ప్రసంగము యుక్తియుక్తముగా నుండుననును. స్వర్గమునకు పోయిన జీవుల శరీరము జల ప్రధానమైయుండును. అచటి దేహము ప్రారబ్ధకర్మఫలక్షయము చూసి దానిద్వారా ఉత్పన్నమయిన దుఃఖమువలన కలుగు చిన్తాగ్నివలన మంచుగడ్డవలె కరిగిపోయి అత్యన్త సూక్ష్మమై ఆకాశాదుల సమానమగును. ఈ ప్రకారము ఆకాశమునుండి వాయువు, వాయువునుండి అగ్ని, అగ్నినుండి జలము మరియు భూమిని చేరును అని చెప్పిననే యుక్తి సంగతమగును. ఒక వస్తువు వేరోక వస్తువుగా మారుట ముఖ్యము గానేరదు. ఇంతేగాక ఆకాశస్వరూపమును పొందెనని చెప్పిన వాయువాది రూపములలో క్రమముగా క్రిందికి వచ్చునని చెప్పలేము. ఈవిధముగా శ్రుతియొక్క ముఖ్యార్థము అసంభవమగుట వలన లక్ష్యార్థమును స్వీకరించుటయే న్యాయ సంగతము. అందువల్ల ఆకాశాదుల సాదృశ్యమును పొందునని చెప్పి గౌణదృష్టితో తద్భావాపత్తిని చెప్పిరి.

## 92. నాతిచిరాధికరణము.

సంగతి:- ఈ పైన చెప్పిన ప్రకారము పూర్వాధికరణములో స్వర్గమునుండి వచ్చు జీవునికి ఆకాశాదిసాదృష్యము నొందుచు క్రిందికి వచ్చును. దానినే ఉపజీవ్యము గావించి అన్య విషయములు విచారించుటకు ఈ అధికరణము మొదలిడుటవలన పూర్వధికరణముతో పాటు దీనికి ఉపజీవ్య-ఉపజీవకభావ్యమను సంగతి.

విషయము:- ఆకాశసాదృశ్యకాలమును ఈ అధికరణములో విచారించెదరు.
సంశయము:- వ్రీహ్యాది భావప్రాప్తికి పూర్వము అవరోహణము త్వరగా జరుగునా లేక ఎక్కువకాలము పట్టునా?
పూర్వపక్షము:- నియామక శాస్త్రము లేనందువలన ఆకాశాది సాదృశ్యము పొందిన తరువాత ఆ స్థితిలో జీవునికి బహుకాలము పట్టునా లేక స్వల్ప కాలము పట్టునా అని నియమించలేము.
సిద్ధాన్తము:- వ్రీహ్యాదులలో ప్రవేశించిన తరువాత అచటనుండి బయటబడుట కష్టము అని విశేషమును చెప్పిరి. అందువల్ల ఆకాశాదుల సాదృశ్యాపత్తి శీఘ్రముగా జరుగును అని నిశ్చయించవలయును ఎందులకనగా వ్రీహ్యాదులరూపమును పొందిన తరువాత నిష్క్రమణమునకు బహుకాలము పట్టును.
వైయాశికన్యాయమాలా:
197. వ్రీహ్యాదేః ప్రాగ్విలమ్బేన త్వరయా వాఽవరోహతి | తత్రానియమ ఏవ స్యాన్నియామకవివర్జనాత్ ||
198. దుఃఖం వ్రీహ్యాదినిర్యాణమితి తత్ర విశేషితః | విలమ్బస్తేన పూర్వత్ర త్వరాఽర్థాదవసీయతే||
వ్రీహ్యాదిభావమునకు పూర్వము కర్మశేషమున్న జీవుడు ఆకాశాదులనుండి అవరోహమునకు బహుకాలము పట్టునా లేక స్వల్ప కాలము పట్టునా? నియామకము లేనందున ఏ నియమము లేదనును పూర్వపక్షి. సిద్ధాన్తి చెప్పునది. వ్రీహ్యాదిభావముల నుండి బయటబడుట కఠినము. ఎందులకనగా శ్రుతిలో బహుకాలము పట్టునని విశేషముగా చెప్పిరి గాన ఆకాశాదులనుండి శీఘ్రముగా భూమికి వత్తురు. అను అర్థమునే తెలిసికొన వలయును.
భారతీ తీర్థులవారి వ్యాఖ్య:
వర్షించిన తరువాత వ్రీహ్యాదిభావము శ్రుతిలో చెప్పిరి. "త ఇహ వ్రీహియవా ఓషధివనస్పతయస్తిలమాషా ఇతి జాయన్తే" అనగా ' వర్షించిన తరువాత ధాన్యము లేక యవల గింజగా, ఓషధివనస్పతుల రూపములలో, నువ్వులు మినువుల రూపములలోనో జన్మించును'. కనుక వ్రీహ్యాదిభావమునకు పూర్వము ఆకాశాది భావములో జీవుడు శీఘ్రముగా అవరోహణము చెందునా విలమ్బముగానా? దీనిలో నియామకాభావమువలన అనిర్ణయమనును పూర్వపక్షి.
సిద్ధాన్తి చెప్పునది. వ్రీహ్యాదిభావము పొందునని చెప్పిన తరువాత "అతో వై ఖలు దుర్నిష్ప్రపతరమ్" (ఛాం.5.10.6) అని ఆ తరువాతి ప్రయాణమును దుఃఖకరముగా చెప్పుచున్నది శ్రుతి. 'జీవులు ధాన్యరూపము పొందినపిదప ఎంతయో కష్టములతో కాని పురుషుని ప్రవేశింపరు'. ఈ విధముగా చెప్పుచు ధాన్యదులలో విలమ్బమని చెప్పుచు దీనికి విపరితముగా పూర్వము ఆకాశాదులలో అవరోహణము శీఘ్రమముగా జరుగుట చెప్పుచున్నదని గ్రహించవలయును.

314. నాతిచిరేణ విశేషాత్. (3.1.23.)

సూత్రార్థము:- జీవుడు స్వల్ప కాలమే ఆకాశాదుల సమానరూపముతోనుండి వర్షముయొక్క ధారలద్వారా భూమిలో ప్రవేశించును. ఎందులకనగా వ్రీహ్యాది భావమును పొందినపిదపనే "అతో వై ఖలు దుర్నిష్ప్రపతరమ్" (ఛాం.5.10.6) అను శ్రుతిద్వారా ప్రయాణము దుఃఖకరమని చెప్పిరి. దానికి పూర్వము అవరోహణము శీఘ్రముగా జరుగును.

ఆకాశాది పూర్వ పూర్వ సాదృశ్యమును పొందిన జీవుడు చిరకాలము వరకు ఆ యా స్థితిలోనుండి ఉత్తరోత్తర సాదృశ్యమును పొందునా లేక స్వల్పకాలమే ఆ యా స్థితులలో నుండునా? అని సంశయము. దీనికి పూర్వపక్షి

నియామక శాస్త్రము లేనందువలన నియమము లేదనును. సిద్ధాన్తి చెప్పునది. కొంచెము కొంచెము సమయము ఆకాశాది సాదృశ్యరూములో నుండి వర్షాధారముల ద్వారా భూమిలో ప్రవేశించును ఎందులకనగా వ్రిహి యవాది భావములు పొందినపిదప ఛాందోగ్య శ్రుతిలో జీవుని ప్రయాణము కష్టతరమని చెప్పబడినది. ఈ విశేష శ్రుతివలన ఆకాశాదుల సాదృశ్యరూపములో స్వల్ప కాలమే ఉండునని చెప్పు సిద్ధాన్తి ప్రతిజ్ఞ సిద్ధమగు చున్నది. దీనిద్వారా ఇదిగూడ సిద్ధమగుచున్నది అది ఏమనగా వ్రీహి యవాది భావ ప్రాప్తికి ముందు జీవుని అవరోహణ త్వరగా సరళముగా జరుగును. కాని ఆ మధ్యకాలములో స్థూలదేహము ఏర్పడకపోవుటవలన కేవలము సూక్ష్మదేహముద్వారా సుఖ-దుఃఖములు అనుభవించుట అసంభవము. అందువల్ల వ్రీహి యవాది ప్రాప్తికి పూర్వము స్వల్పకాలములోనే ఆ యా ఆకాశాదుల సాదృశ్యమును పొంది జీవుడు అవరోహణ మగునని స్వీకరించుటయే ఉచితము.

## 93. అన్యాధిష్ఠితాధికరణము.

సంగతి:- 'దుర్నిష్ప్రపతరమ్' అను శ్రుతి శబ్దముద్వారా వ్రీహ్యాదులలో చిరకాలము ఉండుట లక్షితమైనను ప్రకృతములో తిలమాషాది భావములో జన్మించు జీవాత్మయొక్క జన్మ ముఖ్యమని చెప్పట అసంభవము అను పత్యుదాహరణ సంగతి వలన ఈ అధికరణము మొదలైనది.

విషయము:-స్వర్గమునుండి తిరిగి వచ్చు జీవాత్మయొక్క వ్రీహ్యాదుల జన్మ ప్రాప్తి ఈ అధికరణమునకు విచారణీయ విషయము.

సంశయము:- స్వర్గావరోహీ జీవాత్మకు వ్రీహ్యాదులలో కలుగు జన్మ సంశ్లేషమాత్రమా లేక ముఖ్యరూపమా?

పూర్వపక్షము:-'జాయన్తే' అను శ్రుతియొక్క ప్రమాణమువలన స్వర్గావరోహీ జీవాత్మ వ్రీహ్యాది యోనులలో ముఖ్యముగా జన్మించును అని స్వీకరించవలయును, ఎందులకనగా స్వర్గప్రాప్తికి యాగాదులు అనిష్ఠించు సమయములో పశుహింసాది పాపము అయినందువలన వాని భోగములకు స్వర్గావరోహీ జీవునికి వ్రీహ్యాదులలో జన్మమెత్తుట ముఖ్యము.

సిద్ధాన్తము:- విహిత యాగాదుల కర్మ వలన పాపము కలుగదు మరియు వ్రీహ్యాది యోనులప్రాప్తి చెప్పునపుడు ఏ విధమైన కర్మ వ్యాపారము గుఱించి చెప్పలేదు చెప్పియున్నయెడల మీయొక్క ముఖ్య జన్మమను కల్పన ఉచితమని స్వీకరించ వచ్చును. దాని తరువాత కుక్క, బ్రాహ్మణాది యోనులలో జన్మ కలుగును, వానిలో చరిత్ర గుఱించి 'రమణియచరణాః' 'కపూయచరణాః' అను శ్రుతివాక్యములద్వారా చెప్పిరి. గాన బ్రహ్మణాది జన్మలు ముఖ్యమని స్వీకరించవచ్చునుగాని వ్రీహ్యాదులతో స్వర్గారోహీ యొక్క సంశ్లేషమాత్రమే అగును.

వైయాసికన్యాయమాలా:

199. వ్రిహ్యాదౌ జన్మ తేషాం స్యాత్ సంశ్లేషో వా జనిర్భవేత్ | 'జాయన్త' ఇతి ముఖ్యత్వాత్ పశుహింసాదిపాపతః ||

200. వైధాన్న పాపసంశ్లేషః కర్మవ్యాపృత్యనుక్తితః | శ్వవిప్రాదౌ ముఖ్యజనౌ చరణవ్యాపృతిః శ్రుతా ||

వ్రీహ్యాదులలో జీవులకు సంసర్గమాత్రమా లేక ముఖ్య జన్మమా అను సన్దేహమునకు పూర్వపక్షి జన్మము ముఖ్యమేనను. ఎందులకనగా 'జాయన్తే' అని శ్రుతిలో వినబడుచున్నది మరియు పశు హింసాది పాప యోగము యజ్ఞములలో కలదు. సిద్ధాన్తి జవాబు. వేదములలో విహిత మగుటవలన పశు హింసాదుల ద్వారా

యజ్ఞములో పాపము అంటదు. వ్రీహ్యాదులలో కర్మ వ్యాపారము లేదు. అందువల్ల వ్రీహ్యాదులలో సంసర్గము మాత్రమే ఉండును కాని వానిలో జన్మ ముఖ్యముకాదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

ఆకాశాదులవలే వ్రీహ్యాదులలో సంసర్గమాత్రమేకాదు కాని వ్రీహ్యాదిరూపములలో జీవుని ముఖ్య జన్మ కలుగును కారణమేమనగా 'జాయన్తే' అని శ్రుతి కలదు. 'స్వర్గములో పుణ్యఫలమును అనుభవించిన పిదప పాపఫలరూపమైన స్థావర జన్మ సంభవము' ఎట్లని సంశయించవలసిన పనిలేదు స్థావరజన్మకు కారణము యజ్ఞములో చేసిన పశుహింసాదులు. అందువల్ల వ్రీహ్యాదులలో జన్మ ముఖ్యమే అని పూర్వపక్షి చెప్పగా సిద్ధాన్తి సమాధానము. విధిశాస్త్రము లభ్యమగుటవలన యజ్ఞములో పశుహింసద్వారా పాపము రాదు. అందువల్ల 'జాయన్తే' అను శ్రుతి శబ్దముద్వారా సంశ్లేషమాత్రము చెప్పుట అభీష్టము ముఖ్య జన్మము కాదు. ఎందులకనగా కర్మవ్యాపారము చెప్పలేదు ఎచట ముఖ్య జన్మ చెప్పిరో అచటనే కర్మ వ్యాపారము గూడ చెప్పిరి. ఎట్లనగా శ్రుతిలో "రమణీయచరణాః" అను స్థలములలో కర్మవ్యాపారము గుఱించి పరామర్శ కలదు.

315. అన్యాధిష్ఠితేషు పూర్వవదభిలాపాత్. (3.1.24.)

సూత్రార్థము:- వ్రీహ్యాదులలో నున్న జీవులలో కర్మశేషమును అనుభవించుటకు పృథ్వికి తిరిగి వచ్చు జీవులకు ఆ వ్రీహ్యాదులతో కేవలము సంసర్గముమాత్రమే ఉండును. ఎందులకనగా ఆకాశాదులనుండి వర్షము పర్యన్తము కర్మములేకనే జీవుని ప్రవేశము చెప్పబడినది. అటులనే వ్రీహ్యాదులలోగూడ కర్మ సంబంధము లేకుండగనే ప్రవేశము చెప్పబడినది. కర్మ సంబంధము లేకుండుటవలన వ్రీహ్యాదులలో కర్మశేషమును అనుభవించుటకు వచ్చు జీవులకు సుఖాదుల సాక్షాత్కరము కలుగదు. ఎచట జన్మ చెప్పుట అభీష్టమో అచటనే కర్మ వ్యాపారముయొక్క అభిమానము కలుగును. ఎట్లనగా "రమణీయచరణాః" అనుచోట. అందువల్ల స్వర్గనుండి అవరోహణము చేయువారు వ్రీహ్యాదులలో సంశ్లేషమును మాత్రమే పొందుదురు.

కర్మశేషముగల జీవుడు వ్రీహ్యాది భావములో ముఖ్యజన్మలేనందున వానికి అధిక ప్రయత్నము చేయవలయుననును పూర్వపక్షి. ఆ యా స్థానములలో జీవునికి సంశ్లేషమాత్రముండుటవలన వానిని నిరాకరించుటకు అధిక ప్రయత్నాపేక్ష లేదనును సిద్ధాన్తి. అవరోహణ క్రమములో వర్షమునకు పిదప "తే ఇహ వ్రీహియవా ఓషధివనస్పతయస్తిలమాషా ఇతిజాయన్తే" (ఛాం.5.10.6.) అనగా 'స్వర్గమునుండి తిరిగి వచ్చు జీవులు ఈ భూమిలో ధాన్యములు, యవలు, ఓషధులు, వనస్పతులు నువ్వులు, మినువులు, మొదలగురూపములలో ఉత్పన్నమగుదురు'. ఈ శ్రుతిలో జీవులు వ్రీహ్యాది రూపములలో ముఖ్యముగా జన్మనెత్తుదురా లేక వానితో సంశ్లేషమాత్రమేనా? అను సంశయమునకు పూర్వవాది వ్రీహ్యాది స్థావరభావములు గూడ ఉపభోగస్థానములని శ్రుతి స్మృతులలో ప్రసిద్ధమనును. పంది జన్మవలే వ్రిహ్యాది జన్మలు జీవునకు ముఖ్యమనును పూర్వవాది. సిద్ధాన్తి చెప్పునది. వ్రీహి యవాదులలో స్వర్గమునుండి తిరిగి వచ్చు జీవుని శేషకర్మము ననుభవించుటకు సంశ్లేషమాత్రమే అందువలననే అచటవారికి సుఖ-దుఃఖములు కలుగవు. అటులనే శ్రుతిలో చెప్పిరి. ఏ విధముగా ఆకాశమునుండి వర్షము వరకు స్వర్గమునుండి తిరిగి వచ్చు జీవునికి కర్మవ్యాపార

చూడబడుటలేదు అటలనే వ్రీహి యవాదులలోగూడ ఏ విధమైన క్రియా వ్యాపారము లేకయే ఆ జీవుల ప్రవేశము శ్రుతిలో వినబడుచున్నది. అందువలన స్వర్గమునుండి తిరిగి వచ్చు కర్మశేషమును అనుభవించవలసిన జీవులు వ్రీహియవాది శరీరములలో సుఖదుఃఖాదులు అనిభవించరు. సుఖదుఃఖముల భోక్తగా చెప్పిన చోట ఆ జీవుల కొరకు "రమణీయ ఆచరణ, కపూయ ఆచరణ" అనగా 'మంచి చరిత్ర కలవారు, చెడ్డ చరిత్ర కలవారు' అని శ్రుతిద్వారా కర్మ వ్యాపారముయొక్క పరామర్శ చూడబడుచున్నది. కాని పాపమునాచరించిన జీవులు స్థావర యోనులలోకి పోయినను అచట వారు సుఖదుఃఖభోగములను అనుభవింతురు. అయినప్పటికిన్నీ స్వర్గమునుండి తిరిగి వచ్చు పుణ్యాత్ములకు శేషకర్మము అనుభవించవలసినను వ్రీహి యవాది స్థావర భావములో సుఖదుఃఖ భోగములు లేవు. గాన 'జాయన్తే' అను ఈ శ్రుతివాక్యములో జీవుల సంశ్లేషమాత్రమే చెప్పిరి కాని ముఖ్య జన్మ కాదు.

316. అశుద్ధమితి చేన్న శబ్దాత్. (3.1.25.)

సూత్రార్థము:- అగ్నిష్టోమాది యాగములలో పశుహింసాది అశుద్ధము గుఱించి చెప్పిరి. వానిని ఆచరించిన అనుశయీ (కర్మశేషముగల జీవుడు) వ్రీహ్యాది స్థావరమను ముఖ్యజన్మలనెత్తి దుఃఖములు అనుభవించును. ఈ విధముగా చెప్పుట యుక్తి సంగతముకాదు ఎందులకనగా విధిశాస్త్రములో చెప్పిన అగ్నిష్టోమాది కర్మలు ధర్మరూపములగనే జ్ఞానము కలిగించుచున్నవి. గాన అవి దుఃఖకారణములు కాజాలవు.

జ్యోతిష్టోమాది యాగములలో పశుహింసాది సంబన్ధముండుటవలన అది అశుద్ధకర్మము మరియు దాని ఫలము అనిష్టమని కల్పన చేయవలయును. అందువల్ల అనిష్టలకర్మఫల స్వరూపమైన వ్రీహి యవాది స్థావరభావములు పొందు జీవుడు కర్మఫలము అనుభవించుటకు అవి ముఖ్య జన్మలని చెప్పవలయును అనిన అట్లనుట సరికాదు. ధర్మాధర్మ స్వరూప జ్ఞానములో శాస్త్రమే ప్రాణము. జ్యోతిష్టోమాది వైదిక యాగములలో జరుగు పశుహింసాదులను శాస్త్రము ధర్మమని నిశ్చయము చేసినది. అటువంటప్పుడు అశుద్ధమని కల్పనగావించి దాని ద్వారా దుఃఖముకలుగునని చెప్పుట ఎట్లు సంభవము. "న హింస్యాత్ సర్వా భూతాని" అను సామాన్య నియమమునకు అపవాదము "అగ్నిషోమీయం పశుమాలభేత". ఏ భూతమును చంపరాదు అను సామాన్య సూత్రమునకు అపవాద శాస్త్రముద్వారా అగ్నిషోమీయ యాగములో పశుబలి చేయవచ్చునని చెప్పబడినది. ఆ సామాన్య శాస్త్రమునకు ఈ అపవాద శాస్త్రము బాధకమగు చున్నది. గాన ఈ ఉత్సర్గ, అపవాద శాస్త్రములు వాని వాని విషయములలో వ్యవస్థితములు. అనగా అగ్నిష్టోమీయ పశువును వదిలి మరి ఏ పశువును హింసించరాదు. ఈ విధమైన వ్యవస్థవలన అ రెండు శాస్త్రములలో కానవచ్చు విరోధమునకు పరిహారమగును. అందువల్ల శుద్ధవైదిక కర్మద్వారా వ్రీహి యవాది స్థావర యోని జన్మ కలుగదు.

317. రేతః సిగ్యోగోఽథ. (3.1.26.)

సూత్రార్థము:- వ్రీహ్యాదిభావము తరువాత శేషకర్మము అనుభవించవలసిన జీవులకు రేతస్సేకము నాచరించు పురుషునితో కేవలసంబంధము కలదుకాని తద్రూపప్రాప్తి లేదు ఎందులకనగా శ్రుతిలో ఆవిధముగనే

వినవచ్చుచున్నది "యో రేతః సిఞ్చతి". వ్రిహ్యాదులలో పోవు జీవులకు సంశ్లేశ మాత్రమే స్వీకరించిరి ఎందులకనగా స్వర్గమునుండి తిరిగివచ్చు కర్మశేషమున్న జీవులకు వ్రీహి యవాది అన్నకణములతో సమ్బన్ధమయిన పిదప రేతస్సేకము నాచరించు పురుషునితో సమ్బన్ధమును చెప్పిరి.

అనగా కర్మశేషమున్న జీవుడు అన్నకణముద్వారా పురుషుని శరీరములో ప్రవేశించును అని ఛాన్ద్యోగ్య శ్రుతిలోగలదు. "యో యోఽన్నమత్తి యో రేతః సిఞ్చతి తద్భూయ ఏవ భవతి" (ఛాం.5.10.6.) అనగా 'చంద్రలోకమునుండి వచ్చిన జీవులచే ఆక్రమించబడిన ఆహారపాదార్ధములు భుజించి వాని వలన ఏర్పడిన రేతస్సును స్త్రీరూపగ్నియందు హోమము గావించగనే అప్పుడు ఆ జీవుడు స్థూలదేహ యుక్తుడై జనించును.' ఇచట అన్నముద్వార పురుష శరీరములో ప్రవేశించిన కర్మశేషముగల జీవుని ముఖ్యరూపముగా రేతస్సేకము చేయు పురుషుడని చెప్పజాలము ఎందులకనగా యౌవనము వచ్చిన పిదపనే రేతస్సేకము జేయగలడు. అందువల్ల అచట కర్మ శేషముగల జీవునికి పురుషసమ్బన్ధమాత్రము స్వీకరించిరి. అటులనే దీనికి పూర్వము ఆకాశాదులలో సంశ్లేశమాత్రమే స్వీకరించవలయును కాని ముఖ్య జన్మ కాదు. ఈ విధముగా అన్ని స్థలములలో చంద్రలోకమునుండి తిరిగి వచ్చు కర్మశేషముగల జీవునికి సంశ్లేశమాత్రమని చెప్పిన వాని ముఖ్య జన్మ అసంభవమగును. ఈ ప్రశ్నకు సమాధానము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

318. యోనేః శరీరమ్. (3.1.27.)

సూత్రార్థము:- యోనిలో వీర్యమును సేచనము చేసిన తరువాత ఆ యోనినుండి సుఖ-దుఃఖరూ ములగు ఫలములను అనుభవించుటకు యోగ్య శరీరము ఉత్పన్నమగును. ఎందులకనగా 'రమణీయచరణాః' అను శ్రుతులలో ఆ విధముగా చెప్పిరి. అందువల్ల బ్రాహ్మణాది యోనులలో కర్మశేషముగల జీవుని ముఖ్య జన్మ కలుగును కాని పేరుచోట్లగాదు అని ఈ సూత్ర తాత్పర్యము.

యోనిలో వీర్యమును సేచనము చేసిన తరువాత ఆ యోనినుండి సుఖ-దుఃఖరూ ములగు ఫలములను అనుభవించుటకు యోగ్య శరీరము ఉత్పన్నమగును. వీర్య సేచనయోగ్యత కలిగిన తరువాత స్త్రీయోనిలో రేతస్సును ప్రవేశపెట్టిన పిదప ఆ యోనినుండి ఉత్పన్నమగు శరీరము సుఖ-దుఃఖాదులు అనిభవించుటకు యోగ్యమగునని శాస్త్రములో చెప్పిరి. "తద్య ఇహ రమణీయచరణాః" అనగా 'కర్మ శేషముగలవారిలో మంచి చరిత్ర గలవారు బ్రాహ్మణాది జన్మలెత్తుదురు' అని. అందువల్ల స్వర్గమునుండి తిరిగి వచ్చు జీవులకు వ్రీహి యవాదులలో సంశ్లేశ మాత్రము కలుగును మరియు వాని బ్రాహ్మణాది జన్మలు ముఖ్యము.

## బ్రహ్మసూత్ర హృదములో మూడవ అధ్యయములోని

## మొదటి పాదము సంకలనము సమాప్తము.

## తీయాధ్యాయము రెండవపాదము.

# 94. సన్ధ్యాధికరణము.

ఈ పాదములో పూర్వభాగములో 'త్వం' పదార్థ విచారము మరియు ఉత్తర భాగములో 'తత్' పదార్థ విచారము గావింపబడును. పూర్వపాదములో పంచాగ్ని విద్య నుదాహరించి ఆవిచారముద్వారా జీవులగమనాగమనములు నిరూపింపబడెను. ఇపుడు ఈ ద్వితీయ పాదములో కర్మఫలమునుండి విరక్తులైన ముముక్షువులకు మహావాక్యర్థజ్ఞానము కలిగించుటకు 'తత్త్వమ్' పదార్థముల విచారము చెప్పెదరు. అందువల్ల పూర్వపాదముతో ఈ పాదమునకు హేతుహేతుమద్భావ సంగతి కలదు.

సంగతి:- భిన్నపాదమగుటవలన పూర్వాధికరణముతో ఈ అధికరణమునకు సంగతి చెప్పు ఆవశ్యకము లేదు.

విషయము:- జీవునియొక్క స్వరూపము ఈ అధికరణముయొక్క విచారణీయ విషయము.

సంశయము:- స్వప్న సృష్టి సత్యమా లేక మిథ్యయా?

పూర్వపక్షము:- 'అథ రథాన్ రథయోగాన్ పథః సృజతే' ఈ శ్రుతిప్రమాణమువలన స్వప్న సృష్టిని సత్యమనియే స్వీకరించవలయును. జాగ్రద్ దేశమువలే స్వప్నముగూడ ఈశ్వరునిద్వారా నిర్మించబడుటవలన సత్యమే.

సిద్ధాన్తము:- శరీరములోపల సూక్ష్మ నాడులలో కనబడుట స్వప్నదృశ్యము ఉచితము కాదనిపించుచున్నది ఎందులకనగా నిదురనుండి లేవగనే స్వప్నదృశ్యము బాధితమగుచున్నది. అంతేగాక 'న తత్ర రథాః' అను శ్రుతి స్వప్నములో రథాదులు లేవని చెప్పుచున్నది. జాగ్రత్తలో మరియు స్వప్నములోగల ద్వైతత్వ సమానతను తీసికొని జీవుని అనువాదము చేయుచున్నారు. అందువల్ల స్వప్నస్రష్ట ఈశ్వరుడు కాదు కాని వాసనలతోకూడిన జీవునిద్వారా కల్పితము.

వైయాసికన్యాయమాలా:

201. సత్యా మిథ్యాఽథవా స్వప్నసృష్టిః సత్యా శ్రుతీరణాత్ | జాగ్రద్దేశావిశిష్టత్వాదీశ్వరేణైవ నిర్మితా ||

202. దేశకాలాద్యనౌచిత్యాద్బాధితత్వాచ్చ సా మృషా | అభావోక్తేర్ద్వైతమాత్రసామ్యాజ్జీవానువాదతః ||

స్వప్న సృష్టి సత్యమా లేక మిథ్యయా? పూర్వపక్షి చెప్పునది. స్వప్న ప్రపంచము సత్యమే ఎందులకనగా శ్రుతిలో అవిధముగా చెప్పిరి అంతేగాక జాగ్రత సృష్ఠివలే స్వప్న సృష్టి ఈశ్వరునిద్వారా నిర్మితమైనది. దీనికి సిద్ధాన్తి సమాధానము. స్వప్న ప్రపంచము మిథ్యా ఎందులకనగా దేశ కాలముల ఔచిత్యము అచట లేదు మరియు బాధితమగు చున్నది అంతేగాక దీని అభావము చెప్పిరి. ద్వైత సమానత వలన జీవుని అనువాదము మాత్రమే కావించిరి.

భారతీ తీర్థుల వారి వ్యాఖ్య:

"అథ రథాన్ రథయోగాన్ పథః సృజతే" (బృ.4.3.10) 'స్వప్న ద్రష్ట రథములను గుఱ్ఱములను మరియు మార్గమును ఉత్పన్నము గావించును'. ఈ శ్రుతిలో రథాదుల సృష్టిని ప్రతిపాదించిరి. ఆ సృష్టి ఆకాశాదుల సృష్టివలే వ్యావహారికము ఎందులకనగా స్వప్నదేశములో మరియు జాగ్రద్దేశములో ఏ విశేషము కానవచ్చుటలేదు. ఈశ్వర సృష్టి అగుటవలన స్వప్నసృష్టి సత్యము అనును పూర్వపక్షి. దానికి సిద్ధాన్తపక్షమునుండి సమాధానము. స్వప్న ప్రపంచము మిథ్యయే ఏలనన దానికి ఉచిత దేశకాలములు సంభవముకాదు. అతిసూక్ష్మ నాడులలో కొండలు

నదులు మొదలగునవి ఉండుటకు ఉచిత దేశము లేదు అంతేగాక స్వప్నములో కనబడు వస్తువులు స్వప్నములోనే బాధితమగుచున్నవి. ఎందులకనగా దేనిని చెట్టు అని చూచితిమో అదే కొండవలే కనబడును. స్వప్నసృష్టి అభావమని శ్రుతి చెప్పుచున్నది. "న తత్ర రథాః" అనగా 'అచట రథములు లేవు'. వాస్తవమునకు రథాదులు లేకపోయినను ఆలచిప్పలో వెండివలే (శుక్తిరజతమువలే) కనబడుచున్నవని శ్రుతి చెప్పుచున్నది. జాగ్రదావస్థ సమానతకూడ లేదు ఎందులకనగా అనుచిత దేశము ప్రతీతి అగుచున్నది. స్వప్నసృష్టి ఈశ్వర నిర్మితమని చెప్పినదిగూడ అసత్యమే "య ఏష సుప్తో జాగర్తి" అనగా 'ఎవడు ఈ ఇంద్రియములు నిర్వ్యాపారములైనను మేళుకువుగా నుండూనో' అను శ్రుతిద్వారా జీవుడే స్వప్నయొక్క నిర్మాతయని అనువదించిరి. అందువలన స్వప్నసృష్టి మిథ్యయే.

### 319. సంధ్యే సృష్టిరాహ హి. (3.2.1.)

సూత్రార్థము:- జాగ్రదవస్థా మరియు సుషుప్తి అవస్థా వీని మధ్యలో కలుగు స్వప్నావస్థా వ్యావహారికము ఎందులకనగా 'అథ రాథన్ ఇత్యాది శ్రుతి ద్వారా అదే అర్థము ప్రతిపాదింబడినది.

ఇచట పూర్వపక్షములో స్వప్నావస్థనుండి జీవుని వేరుచేయలేముగనుక జీవునిలో స్వప్రకాశత్వము సిద్ధమనును. కాని సిద్ధాన్తములో స్వప్రకాశత్వము జీవునిలో సంభవమనును. "న తత్ర రథా న రథయోగా న పంథానో భవంత్యథ రథాన్రథయోగా న్పథః సృజతే" అనగా 'ఆ స్వప్నావస్థయందు రథములుగాని మార్గములుగాని వీనికి రెంటికిని గలసంబంధముగాని లేక రథములకు కట్టబడు గుఱ్ఱములు మొదలగునవి లేవు. అయినను ఈ జీవుడు స్వయముగా ఈ రథాదులను సృజించును' అని స్వప్నావస్థను గూర్చి శ్రుతి చెప్పుచున్నది. ఈ శ్రుతిద్వారా ప్రతిపాదితమైన సృష్టి వ్యావహారికమా లేక మాయామయమా? అను సంశయమునకు పూర్వపక్షి చెప్పునది ఏమనగా జాగ్రదవస్థా మరియు సుషుప్తికి మధ్యలో కలుగు ఈ స్వప్నసృష్టి వ్యావహారికమనును ఎందులకనగా అచట జీవుడు స్వయముగా రథములు, గుఱ్ఱములు మరియు మార్గములు సృజించుచున్నాడు. ఈ విధమైన ప్రమాణము శ్రుతిద్వారా స్వయముగా చెప్పబడినది. "స హి కర్తా" అనగా 'స్వప్నసృష్టికి కర్త స్వయముగా జీవడే' ఈ విధమైన ఉపసంహార వాక్యముద్వారా గూడ స్వప్నమునందు వ్యావహారికత సిద్ధమగుచున్నది.

### 320. నిర్మాతారం చైకే పుత్రాదయశ్చ. (3.2.2.)

సూత్రార్థము:- కొన్నిశాఖల వారు స్వప్నములో కోరికలు నిర్మించువాడు ఈశ్వరుడు అందురు. మరియు కోరిక లేక కామము అను శబ్దముద్వారా పుత్రాదులని స్వీకరింతురు. అందువల్ల స్వప్నసృష్టి ఈశ్వరకర్తృకమగుటవలన భూమ్యాదులవలే స్వప్నము వ్యావహారికమందురు. ఇది తర్కము కావచ్చును. గాన పూర్వము చెప్పిన 'స హి కర్త'అను శ్రుతి మరియు ఈ తర్కముద్వారా స్వప్న ప్రపంచములో వ్యావహారికత్వము సిద్ధమగుచున్నది.

కొన్ని శాఖలవారు స్వప్నభోగముల నిర్మాత ఆత్మయే అందురు. "య ఏష సుప్తేషు జాగర్తి కామం కామం పురుషో నిర్మిమాణః" (క.5.8.) 'పుత్ర మిత్రాది రూపములగు అనేక కామ్యపదార్థములను నిర్మించుచు సర్వేంద్రియములు నిదురించు చున్నను ఆత్మ మేల్కొని యుండును' ఇచట శ్రుతిలో వచ్చిన కామ శబ్దముద్వారా పుత్రాదులను

స్వీకరించిరి. ఎందులకనగా శ్రుతిలో ఈ విధముగా చెప్పిరిగాన. "అన్యత్ర ధర్మాత్ అన్యత్రాధర్మాత్" (క.2.14) 'ధర్మాధర్మములకంటె అతీతుడైన' అని ప్రకరణారంభమున పరామేశ్వరుని విషయమగు ప్రశ్న వర్ణింపబడినది. వాక్య శేషమునందు "తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే" (క.5.8.) 'అదియే శుభ్రమైనది అదియే బ్రహ్మము అదియే మొక్షము" అని పరమేశ్వరుడే పరామర్శింపబడినాడు కావున స్వప్న సృష్టి నిర్మాత ప్రజ్ఞారూపమైన పారమేశ్వరుడేనని స్వీకరించవలయును. ఇచట అనుమానము చెప్పవచ్చును. స్వప్న సృష్టి సత్యము లేక వాస్తవము ఎందులకనగా జీవుడు దాని కర్త, ఏ విధముగా జాగ్రదవస్థలో జీవుడు సృష్టించు వస్తువులు సత్యములో అటులనే స్వప్నసృష్టి విషయములు వాస్తవములు గాన వానిలో వ్యావహారికత్వము సిద్ధమగుచున్నది. అందువల్ల శ్రుతి అనుమానములద్వారా స్వప్న సృష్టి వ్యావహారిక సత్యమనునది సిద్ధమని పూర్వపక్షి చెప్పుచున్నాడు. ఈ విధమైన పూర్వపక్షమునకు సిద్ధాన్తి సమాధానము ముందు సూత్రములో చెప్పబడుచున్నది.

321. మాయామాత్రం తు కార్త్స్న్యేనానభివ్యక్తస్వరూపత్వాత్. (3.2.3.)

సూత్రార్థము: సూత్రములో వచ్చిన 'తు' శబ్దము పూర్వపక్షమును నిరాకరించుటకు చెప్పిరి. స్వప్న సృష్టి ముత్యపుచిప్పలో కనిపించు వెండి వలే మాయా మాత్రము. ఎందులకనగా దేశ కాలాది సంపూర్ణ ధర్మములతో కనిపించు స్వరూపముకాదు. అందువల్ల స్వప్న ప్రపంచము ప్రాతిభాసికము అనగా మాయామాత్రము.

స్వప్న సృష్టి మిథ్యారూపమయినది ఎందులకనగా ఏ వస్తువుగూడ అచట సంపూర్ణముగా అభివ్యక్తముకాదు. ఈ స్వప్న పదార్థములలో సత్యపదార్థమునకు ఉండవలసిన ధర్మములన్నియు లేవు. సత్యపదార్థములు దేశకాలభేదము లేక కనుబడుచుండును. ఎల్లపుడు ఆ విధముగనే కనబడుచు మఱియొకజ్ఞానముచే భాధింపబడవు. సర్వకాలములందును అవి కానవచ్చుటకు చక్కని కారణములుండును. ఈ స్వప్న పదార్థములు కానవచ్చునపుడు వానిలో ఈ ధర్మములు ఉండవు. కొంచెము విచారించి చూచిన అతి చిన్న సూక్ష్మ(దేహములోగల) నాడులలో రథాదులకు కావలసిన స్థానము లేదు. అటులనే స్వప్నమును చూచువాడు దేహమును వదలి బయటకు పోవుటలేదు ఎందులకనగా స్వప్నమునుండి మేల్కొనినపుడు ఎచట నిదురించెనో అదేశములోనే లేక అదే స్థలములో తనను చూచుకొనును. మరియు కాలమునకు గూడ విరోధము కలదు. రాత్రి నిదురించిన వ్యక్తి కలలో పగలు చూచును. అన్ని ఇంద్రియముల ఉపసంహారము కలలో కలుగును. ఇంద్రియములు పని చేయవు. ఈ స్వప్నము చూచువాడు స్వప్నములోగల రథాదులను చూచుటకు చక్షురాది సాధనములుగూడ లేవు. స్వప్నమునుండి మేల్కొనగనే స్వప్నములోచూచిన రథాదులు బాధితమగుచున్నవి. స్వప్నము గుఱించి శ్రుతిచెప్పినది. "న తత్ర రథాః" అనగా 'స్వప్నములో రథములు లేవు, గుఱ్ఱములు లేవు మరియు మార్గము గూడ లేదు'. ఈ శ్రుతిద్వారా స్వప్నసృష్టి సత్యముకాదని చెప్పుచు దానిలో పూర్వపక్షి చెప్పిన వ్యావహారిక సత్యతను పరిహరించుచున్నది. మరియు "స్వయం విహత్య స్వయం నిర్మిమాయ స్వేనభాసా స్వేనజ్యోతిషా ప్రస్వపితి" అనగా 'స్వప్నము చూచువాడు స్వయముగా జాగ్రత పదార్థములను తనలో విలయము గావించుకొని స్వప్న పదార్థములను స్వయముగా నిర్మించుకొని తనయందుగల ప్రకాశమయమగు జ్యోతిద్వారా ఆ పదార్థములు ప్రకాశించబడుచున్నవని చూచుచు నిద్రించును' (బృ.4.3.9.). ఈ శ్రుతిద్వారా పూర్వపక్షి

అనుమానముద్వారా చెప్పిన స్వప్న స్రష్ట ప్రజ్ఞారూపమైన ఈశ్వరుడనునది నిరాకరించి జీవుడే స్వప్న స్రష్ట అనునది నిరూపింపబడినది. ఇచట స్వప్నము ప్రజ్ఞారూపమైన ఈశ్వరుని సృష్టి అను కారణము నిరాకరించిరి. పూర్వపక్షి చెప్పిన హేతువు లేక కారణము అసిద్ధము. స్వప్నము జీవ సృష్టిగావున మిథ్యారూపము వ్యావహారిక సత్యము కాదు.

ఈప్రకారము స్వప్న సృష్టి అనిత్యమని స్వీకరించిన స్వప్నము ద్వారా సూచించబడిన అర్థము సత్యమెట్లు కాగలదు? ఈ ప్రశ్నకు సమాధానము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

322. సూచకశ్చ హి శ్రుతేరాచక్షతే చ తద్విదః. (3.2.4.)

సూత్రార్థము:- శుభాశుభ ఫలముల సూచకములు గాన కలలో కనిపించు స్త్రీ దర్శనాదులు సత్యములు. స్వప్నావస్థగురించి తెలిసినవారు గూడ స్వప్నములు శుభాశుభ సూచకములని చెప్పుచున్నారు. కలలో కనిపించు స్త్రీ దర్శనము ముత్యపుచిప్పలో వెండివలే అసత్యమయిననూ వెండి చూడగనే సంతోషము కలిగినటుల స్వప్న స్త్రీ దర్శనము యజ్ఞానుష్ఠానము చేసినవారికి శుభ సూచకము. స్వప్న దర్శనము శుభము మరియు అశుభమును సూచించునని చెప్పుటలో దోషములేదు. స్వప్న సృష్టి అసత్యమగుటవలన స్వప్నముద్వారా సూచించబడిన విషయములుగూడ అసత్యములనియే చెప్పవలయును.

ఈ ప్రశ్నకు సమాధానము ఈ నాలుగవ సూత్రముద్వారా చెప్పుచున్నారు. స్వప్నములు భవిష్యత్తులో వచ్చు మంచి చెడు విషయములను మాత్రమే సూచించును గాన ఆవిషయములు సత్యములగును. ఎట్లనిన "పురుషం కృష్ణం కృష్ణదన్తం పశ్యతి స ఏనం హన్తి" అనగా 'స్వప్నములో నల్ల దంతములు గల నల్లని మనిషిని చూచిన ఆ స్వప్నములో చూచిన వ్యక్తి ఆ స్వప్న ద్రష్టను చంపును'. "యథా కర్మసు కామ్యేషు స్త్రియం స్వప్నేషు పశ్యతి సమృద్ధిం తత్ర జానీయాత్" ( ఛాం.5.2.9.) అనగా 'ఏదియో ఒకకర్మ ఆచరించినపుడు స్వప్నమునందు స్త్రీని జూచిన ఆకర్మ సమృద్ధి నొందునని తెలిసికొనవలయును' ఈ శ్రుతులద్వారా స్వప్నములో సూచకత్వము గలదని తెలియుచున్నది. ఈ ప్రకారముగనే వేదముల జ్ఞానమున్నబ్రాహ్మణులు స్వప్నములను మంచి-చెడు విషయములను తెలుపు సూచకములని స్వీకరింతురు. మంత్ర ప్రభావమువలన, దేవతయొక్క దయవలన, ద్రవ్యనిమిత్తముద్వారా కలుగు కొన్ని కలలు సత్యమును తెలియజేయును గాన అన్ని కలలు అసత్యములుగావు కొన్న కలలు వ్యావహారి సత్యములు అనిన అట్లనుట సరికాదు. ఎందులకనగా స్వప్నములు సూచించు విషయములు సత్యములయినను స్వప్నములో స్త్రీని చూచుట మొదలగునవి అసత్యములే. స్వప్నములో చూచిన స్త్రీ మొదలగు వాని దర్శనము మిథ్య లేక అసత్యములని స్వీకరించుటవలన దోషముగాని విరోధముగాని లేదు ఏలనన నిద్రనుండి లేవగనే అవి భాధితములగుచున్నవి. మీ వేదాన్తుల మతములో సంపూర్ణముగా ఆకాశాది ప్రపంచమంతయూ మిథ్య అని బ్రహ్మసూత్రములోని స్మృతిపాదములో చెప్పిరి. అటలనుట సరికాదు ఎందులకనగా బ్రహ్మస్వరూపమైన ఆత్మసాక్షాత్కారమునకు పూర్వము ఆకాశాది ప్రపంచము జాగ్రదవస్థలో సత్యరూపములో చూడబడినది మరియు స్వప్న ప్రపంచము మేల్కొనిన తరువాత ప్రతిదినము బాధితమగుచున్నదని చూడబడినది. గాన ఆకాశాది ప్రపంచము మరియు స్వప్నమునకు భేదము కలదు.

అందులకే స్వప్న సూచకములు సత్యములయినను స్వప్నములు మాయామాత్రములు.

జీవుడు పరమేశ్వరుని అంశము. జీవేశ్వరులకు సంబధముకలదు. ఈశ్వరునివలే జీవునికి జ్ఞానైశ్వర్యములు మొదలగునవి కలవు. గాన జీవుడుగూడ స్వప్నమునందు సంకల్పముద్వారా సత్యమయిన సృష్టి చేయకలడుగదా? మరి సముచిత దేశాది నిమిత్తములేని కారణమాత్రముచే స్వప్నము మిథ్య అని ఎట్లనెదరు? అనిన సమాధానము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

323. పరాభిధ్యానాత్తు తిరోహితం తతోహ్యస్య బన్ధవిపర్యయౌ. (3.2.5.)

సూత్రార్థము:- అవిద్యద్వారా కప్పబడిన జీవును ఐశ్వర్యము పరమాత్మ ధ్యానముద్వారా ప్రకటమగును, ఎందులకనగా ఈశ్వరుని యొక్క జ్ఞానములేనిచో జీవుడు బంధనములో నుండును ఈశ్వరుని జ్ఞానముచే మొక్షము కలుగును. “జ్ఞాత్వా దేవం” అనగా ‘ఈశ్వరును జ్ఞానముద్వారా జీవును అన్ని బంధనములు నశించును’. ఈ విధముగా జీవేశ్వరులు ఒకటైనను ఐశ్వర్య వ్యవధానమువలన జీవుడు సంకల్పమాత్రముచే సృష్టించువాడు కాజాలడు అనగా సృష్టి చేయజాలడు.

సూత్రములో వచ్చిన ‘తు’ శబ్దము పూర్వపక్షమును నిరాకరించుటకు. అగ్నితో సమానమైన అగ్నికణమువలే పరమాత్మ అంశమే జీవుడు. అయినను అవిద్య వ్యవధానముండుటవలన జీవుని ఐశ్వర్యము అదృశ్యమయినది. ఆ ఐశ్వర్యాదులు పరమేశ్వరునియొక్క తీవ్రమయిన ఉపాసనవలన ఎవరికో ఒకరికి ప్రకటమగును. జీవుడు ఈశ్వరుని అంశమయినను జీవునిలో స్వభావికముగా ఐశ్వర్యాదులు ప్రకటముగావు. అందువల్ల ఈశ్వరుని స్వరూపము బాగుగా తెలిసికొని అనుభవములోనికి తెచ్చుకోనందువలన జీవునిలో బంధనము కలుగుచున్నది. పరమేశ్వరుని స్వరూపమును అనుభవించిన మొక్షముకలుగుచున్నది. “జ్ఞాత్వా దేవం సర్వపాశాపహానిః క్షీణైః క్లేశైర్జన్మమృత్యుప్రహాణిః| తస్యాభిధానాత్తృతీయం దేహభేదే విశ్వైశ్వర్యం కేవల ఆత్మకామః” (శ్వే.1.11.) అనగా ‘అపరమేశ్వరుని ఎఱింగిన సంసారబంధనమునకు పాశములగు రాగద్వేశాదులు అవిద్యవలన కలిగినవి తొలగిపోవును. అవి తోలగిన దుఃఖములకు కారణమైన జన్మమరణములుండవు. స్వతస్సిద్ధమగు పరమేశ్వరూపము గోచరమగును. మరియు ఆపరమేశ్వరుని ఉపాసించిన ఆత్మ శరీరముల వివేకము కలిగిన ఆతత్వదర్శీ శరీరపరిత్యాగము కాగానే బంధమోక్షములకు భిన్నమైన మూడవ అవస్థను సర్వలోకేశ్వరత్వమును పరిపూర్ణ కాముడై పొందును మరియు కేవలము ఆత్మకాముడై యుండును’. ఈ విధముగా శ్రుతి చెప్పుచున్నది. అందువలన జీవులు బ్రహ్మకైన అభిన్నమైనను అవిద్యద్వారా తిరోహితమైన ఐశ్వర్యముగల జీవులకు సంకల్పమాత్రముచే సృష్టిసామర్థ్యము లేదు.

పరమాత్మ అంశమయిన జీవునికి జ్ఞానైశ్వర్యాదులు తిరోహిమగుటకు కారణమేమి? అను ప్రశ్నకు సమాధానము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

324. దేహయేగాద్వా సోఽపి. (3.2.6.)

సూత్రార్థము:- జీవుని ఐశ్వర్యము అంతర్ధానమగుటకు కారణము దేహాదులలోగల ఆత్మత్వాభిమానరూపమైన అవిద్య.

అవిద్యావశమున దేహము, ఇంద్రియములు, మనస్సు మరియు బుద్ధిరూపమైన ఉపాధుల సంబన్ధముచే జీవుని జ్ఞానాదులు అంతర్ధానములయినవి. ఏవిధముగా బూడిదతో కప్పబడిన కారణముచే అగ్నియొక్క దహన ప్రకాశన సామర్థ్యములు అంతర్ధానములయినవో అటులనే ఇచటగూడ తెలిసికొనవలయును. సూత్రములో నున్న 'వా' శబ్దము జీవేశ్వరులు భిన్నమను సంశయమును నివారించుటకు. ఛాందోగ్యములో "అనేన జీవేనాత్మనానుప్రవిశ్య" (ఛాం.6.3.2.) "తత్సత్యం స ఆత్మా తత్త్వమసి" (ఛాం. 6.9.4.) అనగా 'జీవాత్మరూపములో పరమాత్మ శరీరములో ప్రవేశించెను' మరియు 'అది సత్యము అదే ఆత్మ అదే నువ్వు' అని ఈ విధమైన వందలాది శ్రుతులలో జీవాత్మ పరమాత్మల అభేధము చెప్పబడినది. అందువలన కలలో కనబడునది మయామయమని స్వీకరించుటవలన వానినుండి ముక్తి పొందిన జీవుడు స్వయంజ్యోతిస్వరూపుడనునది సిద్ధమగుచున్నది.

# 95. తదభావాధికరణము.

సంగతి:- జీవుడు స్వయంప్రకాశ స్వరూపుడని చెప్పుటకు స్వప్నావస్థ మిథ్య అని అనిరి. ఇపుడు బ్రహ్మకైన అభిన్నమైన జీవుడు సుషుప్తావస్థలో ఎచట నుండును అను విషయవిచారము ఈ అధికరణములో గావించెదరు. గాన పూర్వాధికరణముతో పాటు ఈ అధికరణమునకు ఏకాధికారత్వ సంగతి.

విషయము:- ఛాందోగ్యోపనిషత్తులో మరియు బృహదారణ్యకోపనుషత్తులో జీవుని సుషుప్తి స్థానము భిన్న -భిన్నముగా చెప్పిరి. ఈ అధికరణములో ఇదియే విచారణీయ విషయము.

సంశయము:- నాడులలో, పురీతత్ నాడిలో లేక బ్రహ్మములో జీవుని సుషుప్తి వికల్పముగా నగునా లేక ఈ స్థానములకు సముచ్చయము గలదా.

పూర్వపక్షము:- చెప్పబడిన అనేక శ్రుతి ప్రమాణముల ఆధారమువలన జీవుని సుషుప్తి ఆ యా స్థానములలో వికల్పముగా నగునని స్వీకరించవలయును. ఏలాగున "వ్రీహిభిర్యజేత" "యవైర్వా యజేత" అనగా 'ధాన్యముల ద్వారా యాగము చేయవలెను' లేక 'యవలద్వారా యాగము చేయవలెను' ఈ రెండు శ్రుతుల ఆధారముపై యాగానుష్ఠానము ధాన్యములద్వారా లేక యవలద్వారా వికల్పముగా చేయవచ్చును. ఆలాగుననే అనేక స్థానములలో జీవుడు స్వేచ్ఛగా నిదురించగలడు.

సిద్ధాన్తము:- నాడులలోనుండి బయటకు వచ్చి పురీతత్ నాడిలో ప్రవేశించును. అచటనుండి బయటకు వచ్చి హృదయములో నున్న బ్రహ్మములో జీవుడు నిదురించును గాన జీవుని నిదుర సముచ్చయ పూర్వకముగా జరుగును. బ్రహ్మములో ప్రవేశించుటకు నాడులు మరియు పురీతత్ నాడి ద్వారములు మాత్రమే కాని సుషుప్తి స్థానము ఒకే బ్రహ్మము. వికల్పమును స్వీకరించిన ఎనిమిది దోషములు వచ్చును.

వైయాసిక న్యాయమాలా:-

203. నాడీపురీతద్బ్రహ్మణి వికల్ప్యన్తే సుషుప్తయే | సముచ్చితాని వైకార్థ్యాద్వికల్ప్యన్తే యావాదివత్ |

204. సముచ్చితాని నాడీభిరుపసృప్య పురీతతి | హృత్స్థే బ్రహ్మణి యాత్యైక్యం వికల్పే త్వష్టదోషతా ||

నాడులు, పురీతత్ నాడి మరియు బ్రహ్మ ఈ మూడు స్థానములు సుషుప్తికి వికల్పములా లేక పరస్పరసంబంధమువలన ప్రధాన మగుస్థానము ఒక్కటే అగునా? అను సందేహమునకు పూర్వవాది యవాదులవలే వికల్పితములు ఎందులకనగా నాడి మొదలగునవి ఒకే ప్రయోజనము అనును. సిద్ధాన్తి సమాధానము. నాడి మొదలగునవి సుషుప్తికి పరస్పరసంబంధములు గలవి ఎందులకనగా నాడిద్వారా జీవుని గమనము పురీతన్నాడిలోకి అచట ఆ పురీతన్నాడితో చుట్టుకొనబడి హృదయములోగల బ్రహ్మముతో ఐక్యము పొందుట వలన. మరియు వికల్పమును స్వీకరించిన ఎనిమిది దోషములు వచ్చును.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

ఈ అధికరణ సారాంశము ఈ విధముగా నున్నది. పూర్వపక్షి చెప్పునది. "ఆసు తదా నాడీషు సృప్తో భవతి". ఈ శ్రుతిలో

జీవుని సుషుప్తి కాలములో నాడులలో ప్రవేశమని తెలియుచున్నది. మరియు "తాభిః ప్రత్యవసృప్య పురీతతి శేతే" ఈ శ్రుతిలో జీవునియొక్క ప్రవేశము పురీతత్నాడిలోనని ప్రతీతమగుచున్నది. "య ఏషోఽన్తర్హృదయే" అను శ్రుతులద్వారా ఆకాశమునకు అర్థమైన బ్రహ్మాశ్రితత్వము అవగతమగుచున్నది. ఈ నాడీ మొదలగు వాని యొక్క ప్రయోజనము ఒకటే అగుటవలన ఇవి వికల్ప స్థానములగును, ఎందులకనగా ఏ విధముగా "వ్రీహిభిర్యజేత" "యవైర్వా యజేత" 'ధాన్యములద్వారా యాగము చేయవలయును' లేక 'యవలద్వారా యాగము చేయవలయును' అను స్థలములలో పురోడాశము (అనగా హోమమునందు వాడబడు పిండి) అను హవిస్సును చేయుటకు ధాన్యములుగాని యవలు గాని (వికల్పముగా) తీసికొనవచ్చును. అటులనే ఈ జీవుని సుషుప్తిరూపమైన ప్రయోజనము ఒకటేగాన కొన్ని వేళలో నాడులలో కొన్ని సమయములలో పురీతత్నాడిలో కొన్నిసార్లు బ్రహ్మములో నిదురించును. ఈ ప్రకారము నాడీ ఆదుల వికల్పము అగును.

ఈ పూర్వపక్షమునకు సిద్ధాన్తి సమాధానము. ఒకే ప్రయోజనమయిన పూర్వపక్షము సిద్ధమగును కాని పూర్వపక్షము అసిద్ధము, ఎందులకనగా వేరు వేరు ప్రయోజనములు తేలికగా చెప్పవచ్చును. కన్నులు మొదలగువానిలో తిరుగు నాడులు జీవునికి హృదయములోనున్న బ్రహ్మములోనికి ప్రవేశించుటకు మార్గములు మాత్రమే అందులకే "తాభిః ప్రత్యవసృప్య" అని శ్రుతిలో తృతీయ విభక్తిద్వారా నాడులలో సాధనత్వము చెప్పబడెను. హృదయమునకు చుట్టకొనబడిన పురీతత్నాడి రాజగృహమువలే ఆవరకముగా పనిచేయును. బ్రహ్మము మంచమువలే ఆధారము. దీనిద్వారా ఎటుల ద్వారముద్వారా రాజప్రాసాదములో ప్రవేశించి ప్రాసాదములో నున్న మంచముపై నిదురించునో (ఆ పురుషుడు మేడపై శయనగృహములో మంచముపై పరుండి యున్నాడు) అటులనే జీవుడు నాడులద్వారా ప్రవేశించి పురీతత్నాడితో బ్రహ్మములో నిదురించును. ఈ విధమైన సహాయభేదములన నాడీ మొదలైనవాని సముచ్చయము కలదు. సుషుప్తిలో జీవుని నివాసము బ్రహ్మములోనైన ఆధార-ఆధేయభావము ఎందులకు కానవచ్చుటలేదు. ఈ ప్రశ్న సరికాదు. ఏలనన ఆ సమయములో ఏకీభావము ఉండునని చెప్పెదము. ఏవిధముగా నీళ్ళతో నిండిన కుండను చెరువులో ముంచిన అది విడిగా కానరాదు అటులనే అన్తఃకరణముతో కూడిన జీవుడు అజ్ఞానరూపమైన ఆవరణముతోబాటు బ్రహ్మములో మగ్నమయినపుడు విడిగా కానరాడు. అందువలననే ఇతర శ్రుతులలో సుషుప్తికాలములో జీవుడు బ్రహ్మముతో తాదాత్మ్యము పొందునని చెప్పిరి. ఆ శ్రుతి- "సతా సోమ్య తదా సమ్పన్నో భవతి". ఈ శ్రుతిలో ప్రసిద్ధ బ్రహ్మవాచకమగు 'సత్' శబ్దమే ఉన్నది.

పూర్వపక్షిద్వారా చెప్పిన వికల్పము ఎనిమిది దోషములతో దూషితమై యున్నది గాన పూర్తిగా వదిలి వేయ వలయును. ఆ ఎనిమిది రకముల దోషములు ఈవిధముగా నగును. జీవుడు నాడులలో నిదురించునని చెప్పిన పురీతత్నాడి మరియి బ్రహ్మ వాక్యములద్వారా పొందిన ప్రామాణ్యము వదిలిపేవలయును మరియు అప్రాప్తమయిన అప్రామాణ్యమును స్వీకరించవలసి వచ్చును మరియు పురీతత్ నాడిలో మరియు బ్రహ్మములో నిదురించుననిన, పురీతత్ నాడి ఏవం బ్రహ్మవాక్యములో పూర్వము వదిలివేసిన ప్రామాణ్యమును స్వీకరించవలయును. ముందు స్వీకరించిన అప్రామాణ్యత పరిత్యజించవలయును. ఈ విధముగా ప్రాప్తమయినదానిని పరిత్యజించుట, అప్రాప్తమయునది స్వీకరించుట,

త్యజించినదానిని స్వీకరించుట, స్వీకృతమును పరిత్యజించుట అను నాలుగు దోషములు పురీతత్ నాడి మరియు బ్రహ్మవాక్యమునకు చెందిన దోషములు. ఆలాగుననే నాడి వాక్యమునకు చెందిన దోషములనుగూడ చెప్పిన ఎనిమిది దోషములగును. కనుక సముచ్చయమే గ్రాహ్యము వికల్పముకాదు.

325. తదభావో నాడీషు తచ్ఛ్రుతేరాత్మని చ. 3.2.7.

సూత్రార్థము:- నాడులలో మరియు ఆత్మలో సుషుప్తి అగును అనగా నాడులు మొదలైనవన్నియు సముచ్చయముగా సుషుప్తికి స్థానములు కాని వికల్పముగా కాదు. అంతేగాక ఆ సముచ్చయము ప్రధానముగా పరమాత్మలోనేగాని ఇతర నాడులలోగాని పురీతత్ నాడిలోగాని కాదు అచట నాడులలో పురీతత్నాడిలో గౌణముగా చెప్పబడినది. ఎందులకనగా ఆయా శ్రుతులలో నాడులు మొదలైనవి సముచ్చయముగనే సుషుప్తి స్థానమని వినబడుచున్నది.

ఇచట సుషుప్తిస్థానము వికల్పముగా చెప్పుటవలన జీవుడు బ్రహ్మ భిన్నమని సిద్ధమగుచున్నదనును పూర్వపక్షి. సిద్ధాన్తములో స్థానములు సముచ్చయములగుట వలన జీవుడు బ్రహ్మ అభిన్నమనునది సిద్ధమగుచున్న దనును. "తద్యత్రైతత్సుప్తః సమస్తః సమ్ప్రసన్నః స్వప్నం న విజానాత్యాసు నాడీషు సృప్తో భవతి" అనగా 'ఏ సమయములో ఈ నిదురించు పురుషుడు పూర్తిగా ప్రసన్నుడగునో ఆ సమయములో కలలు చూడడు మరియు శరీరములోగల నాడులలో ప్రవేశించును' (ఛాం.8.6.3) అని ఛాన్దోగ్యోపనిషత్తులో చెప్పిరి. మరియు "తాభిః ప్రత్యవసృప్య పురీతతి శేతే" అనగా 'నాడుల ద్వారా ప్రవేశించి పురీతత్నాడిలో నిదిరించును, ఆలాగుననే హృదయములో ఆకాశము గలదు దానిలో నిదురించును' (బృ.2.1.19) అని బృహదారణ్యక శ్రుతిలో చెప్పిరి. ఈ విధమైన పరస్పర విరుద్ధములైన శ్రుతివాక్యముల వలన సంశయము కలుగు చున్నది. నాడులు మొదలైనవి సుషుప్తి స్థానమునకు పరస్పరము భిన్నములా లేక నాడులు హృదయాకాశము పరమాత్మ అను ఈ మూడుస్థానముల యందును కలసియే సుషుప్తి కలుగుచున్నదా? ఈ సంశయమునకు పూర్వపక్షి చెప్పునది ఏమనగా ఏవిధముగా "వ్రీహిభిర్యజేత" "యవైర్వా యజేత" అనగా 'ధాన్యముల ద్వారా యాగము చేయవలెను' లేక 'యవలద్వారా యాగము చేయవలెను' ఈ రెండు శ్రుతుల ఆధారముపై యాగానుష్ఠానము ధాన్యములద్వారా లేక యవలద్వారా వికల్పముగా ఏలాగున చేయవచ్చునో ఆవిధముగనే నాడి మొదలగువానిలో వికల్పముగా పైన చెప్పిన మూడు స్థానములలో ఏదో ఒకదానిలో సుషుప్తి చెప్పవచ్చును అనును. ఈ పూర్వపక్షమునకు సిద్ధాన్తి చెప్పు సమాధానము. సుషుప్తి అనగా స్వప్నము లేని స్థితి లేక స్వప్నాభావరూపము దానికై నాడులలో మరియు ఆత్మలో సముచ్చయ రూపముగనే సుషుప్తిలోకి జీవుడు ప్రవేశించును గాని వికల్పముగా కాదు అదియే శ్రుతి తాత్పర్యము. అన్ని నాడులను ఆ యా శ్రుతులలో సుషుప్తి స్థానమని చెప్పిరి. ముందు చెప్పిన శ్రుతులలో నాడులు, పరీతత్నాడి మరియు బ్రహ్మము అని కేవలము మూడు సుషుప్తికి స్థానము లనిరి. ఆ శ్రుతులలో గూడ నాడులు మరియు పురీతత్నాడి బ్రహ్మములో ప్రవేశించుటకు ద్వారములు మాత్రమే, కేవలము బ్రహ్మము ఒకటే సుషుప్తికి స్థానమని స్వీకరించిరి. అనగా వాని అర్థము నాడులు మరియు పురీతత్నాడిలో ప్రవేశించి

హృదయాకాశములోగల బ్రహ్మములో జీవుడు నిదురించును. దీనిద్వారా నాడులు మరియు పురీతత్నాడి యొక్క అప్రధానత లేక గౌణత్వము సిద్ధమై బ్రహ్మమే ప్రధానమను జ్ఞానము కలుగు చున్నది. కనుక అన్ని శ్రుతుల సంగ్రహార్ధము సుషుప్తి విషయములో సముచ్చయమనియే స్వీకరించవలయును.

326. అతః ప్రబోధోఽస్మాత్. 3.2.8.

సూత్రార్ధము:- ప్రధానముగా పరమాత్మయే సుషుప్తికి స్థానము, ఈ కారణమువల్లనే జీవుని 'ప్రబోధము' యొక్క ఉపదేశము (అనగా నిదురనుంచి మెలకువ పరమాత్మనుండియే అని చెప్పు ఉపదేశము) నిదురను గుఱించి చెప్పు ప్రకరణములో కలదు. "సత ఆగత్య న విదుః సత ఆగచ్ఛామహే" అనగా 'సత్ బ్రహ్మమునుండి వచ్చిననూ ఆ జీవులకు సత్బ్రహ్మనుండి వచ్చినామని తెలియదు' ( ఛాం.6.10.2) అను శ్రుతిద్వారా చెప్పిరి.

ఆత్మయే సుషుప్తిస్థానము గనుక పరమాత్మనుండియే జీవుని మెళుకువను సుషుప్తియొక్క అధికారములో చెప్పిరి. "కుతః ఏతదగాత్" అనగా 'ఈ జీవుడు ఎచ్చటనుండి వచ్చెను' (బృ.2.1.16). ఈ ప్రశ్నకు జవాబు చెప్పుచు బృహదారణ్యకములో చెప్పినదేమనగా "యథాగ్నేః క్షుద్రా విస్ఫులిఙ్గా వ్యుచ్చరన్త్యేవమేవైతస్మాదాత్మనః సర్వే ప్రాణాః" అనగా 'ఏవిధముగా అగ్నినుండి చిన్న చిన్న అగ్నికణములు ఉత్పన్నమగునో ఆరీతిగనే పరమాత్మనుండి ఈ ఇంద్రియములు (ప్రాణములన్నియూ), లోకములు, మరియు వేదములు ఉత్పన్నమగును' (బృ.2.1.20) అని బృహదారణ్యకములో చెప్పిరి. ఆలగుననే ఛాందోగ్యములో గూడ సుషుప్తి అధికారములో చెప్పిరి. "సత ఆగత్య న విదుః సత ఆగచ్ఛామహే" అనగా 'ప్రతిదినము సద్బ్రహ్మమునుండి వచ్చుచున్నను వీరికి సద్బ్రహ్మమునుండి వచ్చుచున్నామని బొత్తిగా తెలియదు' ( ఛాం.6.10.2). పరమాత్మనుండే జీవుడు వచ్చుచున్నాడని వినుటవలన ఆ పరమాత్మములోనే జీవుని సుషుప్తి అని నిశ్చయమగుచున్నది. కానిచో జీవుని మెళుకువ ఒకసారి నాడులనుండి వేరొకసారి పురీతత్నాడి నుండి మరోకసారి పరమాత్మనుండీ అని చెప్పి యుండవలయును. అటుల చెప్పకుండ కేవలము పరమాత్మ నుండియే జీవుని మెళుకువ చెప్పుటవలన సుషుప్తి స్థానముల సముచ్చయము సమంజసము. అనగా నాడులనుండి పురీతత్నాడిద్వారా ప్రవేశించి జీవుడు పారమాత్మలో సుషుప్తిని పొందును. ఆ అవస్థలో సంసారములోగాల మిథ్యా వస్తువుల జ్ఞానము జీవునికి బొత్తిగా ఉండదు. గాన ఆ సమయములో వానికి బ్రహ్మతో అభేద సిద్ధి కలుగుచున్నది.

# 96. కర్మానుస్మృతిశబ్దవిధ్యధికరణము.

సంగతి:- పూర్వాధికరణములో జీవుని సుషుప్తి స్థానము బ్రహ్మమని చెప్పిరి కాని అది సరికాదు. ఆ విధముగా చెప్పిన నిదురించు జీవుడు వేరు మెళుకువ చెందు జీవుడు మరియొకడు అని స్వీకరించవలయును. అందువలన బ్రహ్మకన్న భిన్నస్థానముగూడ జీవుని సుషుప్తికి సంభవము. ఈ విధమైన ఆక్షేపసంగతి పూర్వాధికరణముతో ఈ అధికరణమునకు కలుగును.

విషయము:- నిదురించు మరియు మెళుకువ చెందు జీవుని విచారము ఈ అధికరణములో గావించెదరు.

సంశయము:- ముందురోజున నిదురించు జీవుడు నియమముగా మఱుసటి రోజు మేల్కొనునా లేక వేరొక జీవుడా నిదురనుంచి మెళుకువ పొందునా అనునది సంశయము.

పూర్వపక్షము:- జలాశయములో కుండలోని నీరును పోసిన అదే నీరు కుండలోకి తిరిగి రాదు. ఆలాగుననే సుషుప్తిలో బ్రహ్మను పొందిన జీవుడే తిరిగి మెళుకువ చెందునను నియమము లేదు.

సిద్ధాన్తము:- నిదురించు జీవుడే మరల జాగ్రదవస్థకు వచ్చును. ఈ విషయము కర్మ, ప్రత్యభిజ్ఞా, స్మృతి, శబ్దము, మరియు విధిశాస్త్రముద్వారా సిద్ధమగు చున్నది. ఏవిధముగా జలముతో పూర్తిగా నిండిన కుండను జలాశయములో నుంచి తలక్రిందులు చేయకున్న ముందు ఉంచిన నీరే ఆ కుండలోకి వచ్చును. ఆవిధముగనే అవిద్యా మొదలగు ఉపాధులద్వారా జీవుడు సుషుప్తిలో బ్రహ్మతో తాదాత్మ్యము పొందును. అందువల్లనే మెళుకువ చెందిన తరువాత తన స్వభావముతోనే ఏకీభవించి నిదురనుండి లేచును.

205. యః కోఽప్యనియమేనాత్ర బుధ్యతే సుప్త ఏవ వా | ఉదబిన్దురివాశక్తేర్నియన్తుం కోఽపి బుధ్యతే||

206. కర్మవిద్యాపరిచ్ఛేదాదుదబిన్దువిలక్షణః | స ఏవ బుధ్యతే శాస్త్రాత్తదుపాధేః పునర్భవాత్ ||

సుషుప్తి తరువాత వేఱొకజీవుడు నిదురనుంచు లేచునా లేక ఆజీవుడే మేల్కొనునా? అని సంశయమునకు పూర్వపక్షి చెప్పినది. ఏ విధముగా సముద్రములో వేశిన జలబిన్దువును మరల దానినే నియముగా తీయుటకు కుదరదు ఆలాగుననే బ్రహ్మములో లీనమైన జీవుడు మరల బయటకు వచ్చుట సంభవముకాదు. అందులకే వేరొక జీవుడు నిదురనుండి బయటకు వచ్చును. ఈ పూర్వపక్షమునకు సమాధానము.

జీవుడు కర్మ మరియు అజ్ఞానమునకు వశమయినందున నీవు చెప్పిన దృష్టాన్తము సరికాదు. అందువల్ల ఆ జీవుడే మేల్కొనును ఎందులకనగా “తే ఇహ వ్యాఘ్రో వా” ఈ శ్రుతికి అర్థము ‘పులి మొదలగు జీవులు సుషుప్తికి ముందు ఏ శరీరమును కలిగియున్నవో అదే జీవుడు సుషుప్తికి తరువాత నిదురలేచి ఆ పులి మొదలగు శరీరరములనే పొందును’. ఈ మొదలగు శాస్త్రములవలన ఏ ఉపాధితో జీవుడు నిదురలో ప్రవేశించునో ఆ ఉపాధితో కూడియే మరల నిదురనుండి మేల్కొనును అని సిద్ధమైనది.

ఏ విధముగా సముద్రములో వేశిన జలబిన్దువును మరల దానినే నియముగా తీయుటకు కుదరదో ఆలాగుననే సుషుప్తిలో బ్రహ్మమును పొందిన జీవుడు మరల బయటకు వచ్చునని చెప్పుట మిక్కిలి అసంభవము. అందులకే వేరొక కొత్త జీవుడు నిదురనుండి బయటకు వచ్చును అను పూర్వపక్షమునకు సిద్ధాన్తి సమాధానము.

పూర్వపక్షి చెప్పు ఉదాహరణము సరికాదు అనగా దృష్టాన్త దార్ష్టాన్తికములలో మిక్కిలి భేదము కలదు ఎందులకనగా కర్మ మరియు అజ్ఞానముతో చుట్టుకొన్న చిద్రూపమైన జీవుడు బ్రహ్మములో లీనమగును కాని జలబిన్దువు దేనితోను చుట్టుకొనబడి సముద్రములో లీనముకాదు ఇదియే అసమానత. ఇంకను ఏ విధముగా గంగాజలముతో నింపి మూతబించిన బంగారు పాత్ర సముద్రములో వేసి మరల బయటకు తీసిన ఆపాత్రలోని నీరు సముద్రజలముకన్న

భిన్నముగానే యుండును మరియు అదే గంగా జలము వచ్చును. అటులనే అవిద్యతో చుట్టుకొనబడిన జీవుడు నిదురనుంచి బయటకు వచ్చునని చెప్పిన ఏమి హాని కలుగును? అనిన ఏ హానియు లేదు ఏ మార్పు ఉండదు. అందువల్ల శ్రుతి మాత గూడ అటులనే చెప్పు చున్నది. "తే ఇహ వ్యాఘ్రో వా సింహోవా వృకో వా వరాహో వా కీటో వా పతంగో వా దంసో వా మశకో వా యద్యద్భవన్తి తత్తదా భవన్తి" (ఛాం.6.9.3.) ఈ శ్రుతికి అర్థము 'పులి లేక సింహము, తోడేలు లేక పంది, కీటకము లేక పతంగము, దోమ కైన చిన్నదైన దంశము లేక దోమ మొదలగు జీవులు సుషుప్తికి ముందు ఏ శరీరమును కలిగియున్నవో అదే జీవుడు సుషుప్తికి తరువాత నిదురలేచి ఆ పులి మొదలగు శరీరములనే పొందును'. ఇచట సుషుప్తిలో బ్రహ్మముతో ఏకీభవించిన జీవుడు ముక్తునివలే మరల జనించడు కదా అనిన అది అసంగతము ఎందులకనగా ఉపాధి పరిమితితో గూడిన జీవునికి ఏ విధమైన హాని కలుగదు. గాన ఎవరు నిదురింతురో వారే మేల్కొనెదరు అని సిద్ధమైనది.

327. స ఏవ తు కర్మానుస్మృతిశబ్దవిధిభ్యః. 3.2.9.

సూత్రార్థము:- ఏ జీవుడు నిదిరించునో ఆ జీవుడే మేల్కొనును వేరొకడు కాదు ఎందులకనగా కర్మానుస్మృతిశబ్దవిధిభ్యః. సూత్రములో వచ్చిన కర్మ శబ్దార్థము. రెండు రోజులలో చేయు కర్మలో ముందు రోజు సగము చేసి మరసటి రోజు మిగిలిన కర్మ చేయును. అను శబ్దము ప్రత్యభిజ్ఞను సూచించును. 'నేను నిన్న చూసిన కుండనే ఈ రోజు చూచుచున్నాను'. అనుభవము తరువాత ఉత్పన్నమైన సంస్కారము ద్వారా కలుగు 'ఇది కుండ' అను స్మరణరూపమును సూత్రములో స్మృతి అనిరి. "నిన్న చూసిన కుండ ఇదే" అను "పునః ప్రతి న్యాయము" సూత్రములో శబ్ద మనిరి. సూత్రములోనున్న విధి శబ్దముద్వారా వేదములో చెప్పిన కర్మ ఉపాసనలను చెప్పిరి. నిదురించిన జీవుడే మరల జాగ్రదవస్థకు రాని యెడల పైన చెప్పిన హేతువులు అసంగతము లగును కాన ఆ జీవుడే మేల్కొనును.

ఇచట పూర్వపక్షి సుషుప్తి మాత్రముచే మొక్ష మనుచు జ్ఞానము వ్యర్థము లేక నిరర్థకము అనును. సిద్ధాన్తములో అజ్ఞానముతో కప్పబడ్డ జీవుడు సుషుప్తిలో సత్పరమాత్మతో ఏకీభవించునని స్వీకరించినను ఆతడే మరల మేల్కొనును. అందువల్ల అజ్ఞానమును తొలగించుటకు జ్ఞానముయొక్క ఆవశ్యకత కలదు. నీదురించు జీవుడే మరల మేల్కొనునని చెప్పుటకు సూత్రములో 'కర్మానుస్మృతిశబ్దవిధిభ్యః' అను పదముద్వారా ఐదు కారణములు చెప్పిరి. ఏ పనినైనను జీవుడు సగము చేసి మొదటి రోజు నిదురించిన మరల రెండవరోజు మేల్కొని మిగిలిన పనిని చేయును. అందువల్ల రెండు రోజులలో పూర్తిచేయు పనికి కర్త ఒకడైన కారణమువల్లనే నిదురించి మెళుకువ పొందు జీవుడు ఒకడేనని స్వీకరించవలయును. నేను మొదటి రోజున చూసిన కుండనే ఈ రోజు ముట్టుకొను చున్నా ను అను ఒకే వస్తువుయొక్క అతీత వర్తమాన కాలద్వయ సంబన్ధ విషయ ప్రత్యక్ష జ్ఞానమును ప్రత్యభిజ్ఞ అందురు. అటువంటి ప్రత్యభిజ్ఞ కలుగుటవలన 'ఇది అదే కుండ' అను స్మృతివల్లగూడ నిదురించి మేల్కొనువాడు ఒకే జీవుడు అని సిద్ధమైనది. బృహదారణ్యకోపనిషత్తులో "పునః ప్రతిన్యాయం ప్రతియోన్యాద్రవతి బుద్ధాన్తాయైవ" (బృ.4.3.16) అనగా 'సుషుప్తి ముగిసినపిదప ప్రతి జీవుడును నియమముగా వాని వాని శరీరములందే మెలకువ నొందును. ఆలాగుననే ఛాందోగ్యోపనుషత్తులో "సర్వాః ప్రజా అహరహర్గచ్ఛన్త్య ఏతం బ్రహ్మలోకం న విన్దన్తి"( ఛాం.8.3.12) అనగా 'అందఱు జీవులును సుషుప్త్యవస్థయందు

పరమేశ్వరును చెందియు ఆవిషయమును అవిద్యా శేషమువలన తెలిసికొనలేరు'. ఈ విధమైన శ్రుతుల సముదాయమును సూత్రములో 'శబ్ద' మను పదముతో చెప్పిరి. కర్మ మరియు ఉపాసన ఫలము కాలాన్తరమున పొందును అను కర్మ ఉపాసనల విధానము వలనగూడ ఇదే సిద్ధమగుచున్నది. అది ఏమనగా కర్మ చేసిన జీవుడే కాలాన్తరమున ఆ కర్మఫలమును అనుభవించును కనుక కర్మ చేయువాడు అనిభవించువాడు ఒకడే. అందువల్ల నిదురించువాడే మేలుకువ చెందును.

జలాశయములో వేసిన జలబిందువు మరల పైకి తీయలేము అనునది స్వీకరించవలసిన పనిలేదు. జలాశయములో వేసిన జలబిందువు మరల తీయవచ్చునని చెప్పుటకు ఏ ప్రమాణము లేదు దాని వివేకము విచారముగూడ చేయలేము. కాని జీవుని సుషుప్తి విషయములో కర్మ మరియు అవిద్యా ఈ రెండు వివేకమునకు కారణములు ఉండగా నిదిరించు వ్యక్తియే మేల్కొనును అని స్వీకరించుటలో ఏ విరోధము లేదు.

# . 97. ముగ్ధేఽర్ధసమ్పత్త్యధికరణము

సంగతి:- పూర్వాధికరణములో కర్మాది ఐదు హేతువులద్వారా సుషుప్తిలో నిదురించి మరల మెలుకువ పొందు జీవుని ఐక్యమును చెప్పిరి. అటులనే సుషుప్తి మరియు మూర్చావస్థలయొక్క ప్రత్యభిజ్ఞ వలన ఈ రెండు అవస్థలను పొందు జీవుడు ఒకడేనని భావించవలయును.

విషయము:- సుషుప్తి మరియు మూర్చను పొందు జీవుడు ఒకడే అనునది ఈ అధికరణ విషయము.

సంశయము:- సుషుప్తి మరియు మూర్చలు ఒకే అవస్థయా లేక వేరు వేరు అవస్థలా?

పూర్వపక్షము:- మూర్చను సుషుప్తితో చేరిన ఒకే అవస్థగా స్వీకరించవలయును ఎందులకనగా బాహ్య విషయముల స్మృతి లేకుండుట అనునది ఈ రెండు అవస్థలకు సమాన లక్షణము.

సిద్ధాన్తము:- జాగ్రదాదిగాగల నాలుగు అవస్థలలో స్వప్నావస్థ మరియు జాగ్రదవస్థలో మూర్చావస్థ యొక్క అన్తర్భావము చెప్పజాలము ఎందులకనగా మూర్చావస్థలో బహ్యస్మృతి లేదు. మూర్చలో నున్న వ్యక్తిని మరణించనాడని చెప్పజాలము ఎందులకనగా వాని శరీరములో ప్రాణము మరియు ఉష్ణత గలవు. సుషుప్తిలో గూడ మూర్చావస్థను అన్తర్భావము చేయజాలము ఎందుకనగా మూర్చిత వ్యక్తియొక్క శరీరములో కమ్పనము, వాని మూఖాకృతి భయానకముగాను మరియు కన్నులు ఎక్కువగా తెరుచుకున్నటుల (విస్ఫారిత) కనబడును. అందువల్ల పరిశేషన్యాయము (అవశిష్టము) ద్వారా మూర్చను అర్ధ సుషుప్తి అని స్వీకరించవలయును.

వైయాసికన్యాయమాలా:-

207. కిం మూర్ఛికా జాగ్రదాదౌ కింఽవస్థాన్తరం భవేత్ | అన్యాఽవస్థా న ప్రసిద్ధా తేనైకా జాగ్రదాదిషు ||

208. న జాగ్రత్స్వప్నయోరేకా ద్వైతాభానాన్న సుప్తతా | ముఖాదివికృతేస్తేనావస్థాఽన్యా లోకసంమతా ||

మూర్ఛావస్థ జాగ్రాదాది అవస్థలలో అన్తర్భూతమా లేక వాని కన్న భిన్నమా? సంసారములో జాగ్రదాదులకన్న వేరొక ఏ అవస్థా ప్రసిద్ధముకాదు. కాన వానిలోనే మూర్ఛావస్థను చేర్చ వలయును. ఈ పూర్వపక్షమునకు సిద్ధాన్తి సమాధానము. మూర్ఛ జాగ్రత్ లేక స్వప్నరూపము కానేరదు ఎందులకనగా ఆ మూర్ఛావస్థలో ద్వైతము లేదు. సుషుప్తావస్థగూడ కానేరదు ఎందులకనగా ముఖాదులలో వికారము కనిపించును. అందువల్ల మూర్ఛపేరుతో లోకప్రసిద్ధావస్థ వేరనియే చెప్పవలయును.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

పూర్వపక్షి భావమేనగా జాగ్రత్, స్వప్నము మరియు సుషుప్తుల కంటె భిన్నమైన అవస్థ లోకములో ప్రసిద్ధము కాదు. అందువల్ల మూర్ఛ ఈ మూడింటిలో ఏదో ఒకదానిలో అన్తర్భూతము కావలయును కాని విడిగా వేరొక అవస్థ కాదు. అపుడు సిద్ధాన్తి చెప్పు సమాధానము. చూడగానే పూర్వపక్షి మతము సంగతమని ప్రతీతి అయిననూ విచారము చేసి చూచిన ఇసుకతో కట్టిన బావివలె వాని మతము కూలిపోవును. ఎందులకనగా సాధారణ బుద్ధికలవారుగూడ ఈ విషయము తెలిసికొనగలరు. జాగ్రత్, స్వప్నములలో ద్వైతప్రతీతి కలుగుచున్నది కాని మూర్ఛావస్థలో ద్వైతప్రతీతి లేదు ఎందులకనగా మూర్ఛ వీనికన్న విలక్షణము. నిదురించు వ్యక్తి ప్రసన్నవదనుడు, శ్వాస సమముగానుండును మరియు వాని శరీరములో కంపనము లేక వణుకుట ఉండదు. కాని దీనికి వ్యతిరేకముగా మూర్ఛిత వ్యక్తి వికృత ముఖముకలవాడు, విషమశ్వాసకలవాడు మరియు వాని శరీరము వణుకుచుండును. కాన మూర్ఛావస్థ జాగ్రత్ స్వప్నసుషుప్తులకన్న భిన్నమని పరిశేషమువలన బలవంతముగా పూర్వపక్షి స్వీకరించవలయును. ప్రతిదినము లోకవ్యవహారములో ఈ అవస్థ ప్రసిద్ధము కాకపోయినను ఆయుర్వేదములో మరియు కొద్దిమందిలో అప్పుడప్పుడు ఈ అవస్థ ప్రసిద్ధమడుటవలన వృద్ధులు దీనికి చికిత్స చేయుదురు. ఈ కారణమువలననే నిత్యవ్యవహారములో దీని గణన లేదు కాని జ్ఞానవృద్ధులైన వ్యాసాది అచార్యులు దీని విచారమును ఉపేక్షగావించలేదు అందుకనే వారు దీనిని అర్ధ సుషుప్తావస్థ అనిరి.

ఈ విధముగ పైనాలుగు అధికరణములలో జీవస్వరూపమును విమర్శించి ఆతని స్వప్రకాశత్వమును సాక్షిత్వమును భోదించిరి. అచట స్వప్నసృష్టి మిధ్య అనియు సుఖదుఃఖాదులు కర్తృత్వాదులు కనిపించినను అవి అవభాసకములనియు లేక కాల్పనికములని చెప్పి జీవుడు అసంగుడనియేనని చెప్పి “త్వం” పదార్థ శోధనము గావించిరి. సుషుప్తిలో బ్రహ్మైక్యముద్వారా ఆజీవుని అసంగత్వమును అనుభవములో చూపించిరి. దానినే మరల మరల చెప్పి ఆత్మ యొక్క అనిత్యత్వ శంకను నిరాకరించిరి. మూర్ఛ విచారమువలన శ్వాసాది సర్వలోక వ్యవహారము మరణములో లోపించినను జీవునికి నాశనములేదని చెప్పుచు జీవుని అనిత్యత్వ సంశయమును తొలగించిరి. యికమీద పాదాన్తరమువరకు జీవబ్రహ్మైక్యమును భోధించిటకు విచారము గావించెదరు.

328. ముగ్ధేఽర్ధసమ్పత్తిః పరిశేషాత్. 3.2.10.

సూత్రార్థము:- స్వప్నము మరియు జాగరిత అవస్థలను మూర్ఛ అని చెప్పలేము ఎందులకనగా మూర్ఛలో విశేష జ్ఞానముండదు ఆలాగుననే ఈ మూర్ఛను మరణమని చెప్పజాలము ఎందులకనగా ఈ అవస్థలో ప్రాణము మరియు ఉష్ణతలు ఉండును. భయానకమగు ముఖము మొదలగునవి ఉండుటవలన దీనిని సుషుప్తి అనజాలము. కాని మూర్ఛఅవస్థలో హృదయపుండరీకమునందుగల బ్రహ్మలో దేహాది అభిమానముగల విశేష జీవిని యొక్క అర్ధలయము అగును అందువల్ల చెప్పిన మూడు అవస్థలకన్న భిన్నమగుటవలన మూర్ఛావస్థను అర్ధసుషుప్తి మరియు అర్ధము అన్య అవస్థ అని చెప్పుదుము.

పూర్వపక్షములో సుషుప్తిమూర్ఛలు ఒకటే అనియూ సిద్ధాన్తములో వానికి భేదము కలదనియూ విశేష నిర్ణయము. పూర్వపక్షి ఈ మూర్ఛ సుషుప్తావస్థలో అన్తర్గతమనును కాని సిద్ధాన్తి జాగ్రత్, స్వప్న, సుషుప్తి, మరణములను నాల్గు అవస్థలలో మూర్ఛను చేర్చ లేమనును. జాగ్రత్ స్వప్నములలో మూర్ఛను అన్తర్భావము చేయలేము. ఎందులకనగా పై రెండు అవస్థలలో జ్ఞానముకలదు మూర్చిత వ్యక్తిలో జ్ఞానము లేదు. ఈ మూర్ఛను మరణావస్థయని చెప్పలేము ఎందులకనగా మూర్ఛావస్థలో ప్రాణము మరియు ఉష్ణతలు కలిగి యుండును. ఈ ప్రాణ ఉష్ణతలు లేకున్ననే లోకములో మరణ శబ్దమును ఉపయోగింతురు.  సుషుప్తిలోగూడ మూర్ఛను చేర్చలేము ఎందులకనగా ఈ రెండిటిలో పూర్తిగా వైలక్షణ్యము కానవచ్చున్నది. మూర్చిత వ్యక్తిలో చాలసేపటివరకు ఉచ్ఛ్వాసము కానరాదు మరియు వాని దేహమునందు వణుకు, ముఖము భయానకముగాను విశాలముగా తెరిచిన కళ్ళు వానిలో కనిపించును. ఈ లక్షణములు సుషుప్తిలో కానరావు అందువల్ల మూర్ఛకు సుషుప్తికి భేదమున్నదని సిద్ధమైనది కాన మూర్ఛను అర్ధసుషుప్తి అని స్వీకరించిరి. “పరిశేషో నామ ప్రసక్తస్య ప్రతిషేధేఽన్యత్రాప్రసఙ్గాచ్ఛిష్యమాణో వస్తుని సమ్ప్రత్యయః” అనగా చెప్పినదానిని లేక ప్రాప్తమైనదానిని తొలగించిన తరువాత ఇంకొకచోట ప్రసంగము రానిచో మిగిలిన వస్తువుయొక్క యతార్థ భోధను పరిశేష మందురు. ఈ  పరిశేష న్యాయముద్వారా మూర్చిత వ్యక్తిలో జ్ఞానములేనందున సగముభాగములో సుషుప్తి సమానమని స్వీకరించిరి. మిగిలిన సగభాగము సుషుప్తికి విలక్షణముగా నుండుటవలన నిదుర అని చెప్పజాలము. అర్ధ సుషుప్తి వలన దీనిని పఞ్చమ అవస్థ అని చెప్పలేము.

# 98. ఉభయలిఙ్గాధికారణము.

సంగతి:- ఈ ప్రకారము ‘తత్’ ‘త్వం’ పదార్థములలో ఉద్దేశ్యమైన  ‘త్వం’ పదార్ధ విచారము చెప్పడమైనది.  అది స్వప్రకాశము, చిద్రూపము మరియు అన్ని అవస్థలకు అతీతమైనది. ఈ విధముగా చెప్పిన తరువాత విధేయమైన  ‘తత్’ పదార్థ ప్రతిపాదన ప్రసంగము వచ్చినది గాన పూర్వాధికరణముతోటాటు దీనికి అవసర సంగతి.

విషయము:- బ్రహ్మయొక్క స్వరూపావధారణము ఈ అధికరణమునకు విచారణీయ విషయము.

సంశయము:- బ్రహ్మమునకు రూపము కలదా లేదా అను సంశయము రెండు రకముల శ్రుతుల కారణముగా కలుగుచున్నది.

పూర్వపక్షము:- 'తదేతచ్చతుష్పాద్ బ్రహ్మ' ఈ శ్రుతిలో బ్రహ్మమునకు రూపమున్నదని చెప్పిరి. 'అస్థూలమనణు' అను శ్రుతిలో బ్రహ్మమునకు రూపము లేదని చెప్పిరి. ఈ విధమైన ప్రమాణమైన రెండు రకముల శ్రుతుల కారణముగా బ్రహ్మము ఉభయాత్మకమని స్వీకరించవలయును.

సిద్ధాన్తము:- వేదాన్తశాస్త్రప్రతిపాద్య బ్రహ్మము నిరాకారము ఈ విషయము అపూర్వము ఏలనన ప్రమాణాన్తరములద్వారా సిద్ధముకాదు కనుక . జగత్తుయొక్క కర్తృత్వాది ధర్మములుగల బ్రహ్మమును 'క్షిత్యాదికం సకర్తృకం కార్యత్వాద్ ఘటవత్' అనగా 'భ్యూమాదులకు కర్తగలడు అవి కార్యములగుటవలన కుండవలే' అను అనుమానద్వారా గూడ తెలిసికొనగలము. రూపముగల బ్రహ్మమును ఉపాసన కొరకు అనువాదము గావించిరి గాని శ్రుతులకు వానిలో తాత్పర్యములేదు. బ్రహ్మము ఉభయరూపమని చెప్పుట పరస్పర విరుద్ధము. వస్తుతః బ్రహ్మము నిరాకారము.

వైయాసికన్యాయమాలా:-

209. బ్రహ్మ కిం రూపి చారూపం భవేన్నీరూపమేవ వా | ద్వివిధశ్రుతిసద్భావాద్బ్రహ్మ స్యాదుభయాత్మకమ్ ||

210. నీరూపమేవ వేదాన్తైః ప్రతిపాద్యమపూర్వతః | రూపం త్వనూద్యతే భ్రాన్తముభయత్వం విరుధ్యతే ||

బ్రహ్మము సాకారమా, నిరాకారమా లేక ఉబయరూపమా? రెండు రకముల శ్రుతులు ఉండుటవలన బ్రహ్మము సాకారము మరియు నిరాకారమనును పూర్వవాది. దానికి సిద్ధాన్తి సమాధానము. వేదాన్తములో బ్రహ్మము రూపరహిమనియే చెప్పిరి. ప్రమాణాన్తరములద్వారా తెలిసికొనలేము అనునది అపూర్వత. బ్రహ్మము ఉభయరూపమని చెప్పజాలము విరోధముగాన. బ్రహ్మము రూపముగలదని కొన్ని శ్రుతులలో చెప్పినదానిలో తాత్పర్యములేదు అది కేవలము అనువాదమే. అందువల్ల బ్రహ్మమునకు రూపముకలదనుట భ్రమయే కాన బ్రహ్మముకు రూపములేదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

"తదేతచ్చతుష్పాత్ బ్రహ్మ" అనిచోట శ్రుతిలో ఉపాసన కొరకు బ్రహ్మమునకు రూపమున్నదని చెప్పిరి. "అస్థూలమనణు" అని శ్రుతిలో రూపరహితమైన బ్రహ్మమును చెప్పిరి, ఈ పరస్పర శ్రుతులద్వారా బ్రహ్మము ఉభయాత్మకమనును పూర్వవాది. సిద్ధాన్తి చెప్పునది. గుణాభావము మరియు రూపరహిమనియే వేదాన్త శాస్త్రములో బ్రహ్మమును ప్రతిపాదించిరి. ఎందులకనగా ఆ బ్రహ్మము ప్రత్యక్షాది ప్రమాణములద్వారా తెలిసికొనబడదు. 'క్షిత్యాదికం సకర్తృకం కార్యత్వాద్ ఘటవత్' అనగా 'భ్యూమాదులకు కర్తగలడు అవి కార్యములగుటవలన కుండవలే' అను అనుమానద్వారా గూడ బ్రహ్మమును రూపముగలవానిగా తెలిసికొనగలము. రూపముగల బ్రహ్మమును ఉపాసన కొరకు అనువాదము గావించిరి గాని బ్రహ్మములో రూపమున్నదని చెప్పుటలో తాత్పర్యము లేదు. అనుమానముద్వారా చెప్పిన సరూపత్వము

శాస్త్రములో చెప్పిన నిరూపత్వము ఈ రెండును పరస్పరము అత్యన్త విరుద్ధములు. దీనిద్వారా తాత్పర్య నిర్ణయము కాజాలదు గాన సరూపత్వము భ్రాన్తమనియు వాస్తవమున బ్రహ్మము నిరూపత్వ మనునది సిద్ధమైనది.

329. న స్థానతోఽపి పరస్యోభయలిఙ్గం సర్వత్రహి. 3.2.11.

సూత్రార్థము:- పరబ్రహ్మ పరమాత్మకు సగుణత్వంబును నిర్గుణత్వంబును అను రెండు స్వభావములు గలవనుట యుక్తియుక్తము కాదు ఎందులకనగా ఏది సత్యమైన వస్తువో దానిలో విరుద్ధ ధర్మములు ఉండజాలవు. ఒకవేళ ఉపాధి ధర్మముద్వారా ఈ రెండు రూపములు స్వభావమనియు సత్యమనియుగూడ స్వీకరించజాలము కారణమేమనగా అగ్నిసమ్బన్ధముద్వారా నీటిలో వచ్చిన ఉష్ణమును జలస్వభావమని చెప్పలేముగదా? గాన "అశబ్దమస్పర్శమరూపమ్" అను మొదలుగాగల బ్రహ్మనుచెప్పు శ్రుతివాక్యములు వేదాన్తములో అనేకములు గలవు వానిలో ఏకరూపమైన నిర్విశేష బ్రహ్మమునే ఉపదేశించిరి.

పూర్వపక్షములో ధ్యేయ బ్రహ్మము నిర్విశేషమనియు మరియు సవిశేషమనియు, సిద్ధాన్తములో కేవలము నిర్విశేషబ్రహ్మమే ధ్యేయమని చెప్పిరి కాని సవిశేబ్రహ్మము కాదు, ఈ విధమైన ఫలభేదము రెండుపక్షములలో గలదు. అచట ఛాందోగ్యోపనిషత్తులో "సర్వకర్మా సర్వకామః, సర్వగన్ధః, సర్వరసః" (ఛాం.3.14.2.) అనగా 'సంపూర్ణ విశ్వము ఎవనికి యొక్క కర్మయో, సర్వ దోషరహితమయలైన కామమెవరిదో, సంపూర్ణ సుఖమునిచ్చు గంధమెవనిదో, అన్ని సుఖములనిచ్చు రసమెవరిదో' అనుచు సవిశేషబ్రహ్మమును చెప్పిరి. బృహదారణ్యక శ్రుతిలో " అస్థూలమనణ్వహ్రస్వమదీర్ఘమ్" అనగా 'ఆ బ్రహ్మము స్థూలముకాదు, అణువుకాదు, హ్రస్వముకాదు మరియు దీర్ఘము కాదు' అనుచు నిర్విశేష బ్రహ్మమును చెప్పిరి. రెండు రూపములను చెప్పు శ్రుతులు ఉన్నందువలన బ్రహ్మమునకు సవిశేష నిర్విశేషమను రెండు రూపములు ఉన్నవని స్వీకరించవలయును లేనిచో ఈ రెండంటిలో ఏదో ఒకరూపమును బ్రహ్మమునకు చెప్పవలయును. ఈ రెండూ రూపములలో ఏదో ఒకటి అనిన సవిశేషమా లేక నిర్విశేషమా బ్రహ్మ రూపమను సందేహము వచ్చును. రెండు రకముల శ్రుతులుండుటవలన బ్రహ్మమును ఉభయరూపములు గలవాడని స్వీకరించవలయునినను పూర్వవాది. అపుడు సిద్ధాన్తి పరబ్రహ్మలో స్వభావికముగా ఉభయరూపములు లేవు. ఒకే వస్తువులో విభిన్న సమయములలో రూపరహితము మరియు రూపసహితము స్వీకరించలేము అలాగున స్వీకరించిన విరోధము వచ్చును. కాని ఉపాధులవలన ఉభయరూపములు గలవాడైననూ దానిని తాత్వికమని చెప్పజాలము. స్వాభావికముగనే స్వచ్ఛముగానున్న స్ఫటికమణి ఎఱ్ఱమందార పువ్వు సమ్బన్ధమువలన మలినము కాజాలదు. కాని పరిస్థితులవలన అస్వచ్ఛముగా లేక మలినముగా కనబడుటను భ్రమమందురు. రెండు రూపములలో ఏదో ఒకరూపమును స్వీకరించవలయు- ననిన బ్రహ్మమును నిర్విశేషమనియే స్వీకరించుట ఉచితము. ఎందులకనగా కఠోపనిషత్తులో మరియు ముక్తికోపనిషత్తులో బ్రహ్మము శబ్దాది విషయరహితమనియే చెప్పిరి. "అశబ్దమస్పర్శమరూపమవ్యయమ్" అనగా 'ఆ బ్రహ్మము శబ్దరహితము, స్పర్శరహితము, మరియు రూపరహితము,

అవ్యయమయ, నిత్యము' అను మొదలగుగాగల బ్రహ్మను ప్రతిపాదించు వేదాన్తవాక్యములలో సవిశేషత్వమును నిరాకరించి నిర్విశేషత్వ బ్రహ్మను ప్రతిపాదించిరి. అందువలన నిర్విశేషబ్రహ్మమే ధ్యేయము.

330. న, భేదాదితిచేన్న; ప్రత్యేకమతద్వచనాత్. 3.2.12.

సూత్రార్థము:- అన్ని వేదాన్త వాక్యములలో నిర్విశేష బ్రహ్మమునే చెప్పిరనిన అటులనుట సరికాదు ఎందులకనగా ప్రత్యేకమైన విద్యలలో బ్రహ్మమునకు నాలుగుపాదములు గలవని చెప్పుచు బ్రహ్మములో భేదమును చెప్పిరి. ఆ విధముగా చెప్పినది యుక్తియుక్తముకాదు ప్రత్యేకమైన ఉపాధులలో "యశ్చాయం పృథివ్యాం" అను శ్రుతులలో మరియు జలాదిరూపములైన అన్ని ఉపాధులలో బ్రహ్మయొక్క అభేదమే వినబడుచున్నందువలన.

అన్ని స్థలములలో నిర్విశేష బ్రహ్మము ధ్యేయమని చెప్పలేదు ఎందులకనగా ప్రత్యేక ఉపాసనలో ఆకార భేదమువలన బ్రహ్మములో భేదము చూడబడుచున్నది. కొన్ని స్థలములలో చతుష్పాద బ్రహ్మమును, కొన్ని స్థలములలో షోడశ కళ బ్రహ్మమును మరికొన్ని స్థలములలో వామనీత్వగుణముగల బ్రహ్మను ఇంకా కొన్ని స్థలములలో ఆ బ్రహ్మమును త్రైలోక్య శరీరము  గల వైశ్వానరునిగాను చెప్పుట చూడబడుచున్నది. ఈ శ్రుతుల సామర్థ్యమువలన బ్రహ్మము సవిశేషరూపమనియే స్వీకరించవలయును. ఈ విధముగా చెప్పుట సరికాదు ఎందులకనగా ప్రత్యేకమైన ఉపాధులలోగల బ్రహ్మము అభిన్నమని చెప్పిరిగాన. "యశ్చాయమస్యాంపృథివ్యాం తేజోమయోఽమృతమయః పురుషో యశ్చాయమధ్యాత్మం శారీరస్తేజోమయోఽమృతమయః పురుషోఽయమేవ స యోఽయమాత్మా" (బృ.2.5.1.) అనగా 'తేజోరూపుడు ఆనందరూపుడు అగు ఏ పురుషుడు భూమ్యాద్యుపాధులలో కలడో, తేజోరూపుడు ఆనందరూపుడు అగునట్టి ఏ పురుషుడు జీవరూపమున దేహమునందు ఉన్నాడో వారిరువురు ఒక్కటియే. ఆత్మయే పృథివ్యాదులందు తత్తదాకారములతో నున్నాడు. బృహదారణ్యక శ్రుతిలో అన్ని ఉపాధులలోపలగల బ్రహ్మమునకు భేదము లేదని చెప్పిరి. మరి కొన్నస్థలములలో వినిపించు భేదశ్రుతులు ఉపాసన కొరకు చెప్పబడినవి. కనుక శ్రుతి తాత్పర్యము అభేద ప్రతిపాదనయందే అనునది సిద్ధమైనది.

331. అపి చైవమేకే. 3.2.13.

సూత్రార్థము:- కొన్న శాఖలవారు "మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి" అనగా 'బ్రహ్మకన్న భిన్నము లేదు, ఎవరు భిన్నత్వమును చూచుచున్నారో వారు మృత్యుపరంపరను పొందుచున్నారు' (క.4.11) ."నేహ నానాస్తి కిఞ్చన" అనగా 'ఈ ప్రపంచములో రెండవ పదార్థమనినదియే లేదు'(క.4.12).  ఎందులకనగా చూడబడు నామరూపములు కల్పితమగుటవలన బాధితములగుచున్నవి, తత్వము కేవలము చిన్మాత్రమే. మొదలగు శ్రుతివాక్యములద్వారా భేద నిందనుగావించి పరమాత్మయొక్క అభేదమునే ప్రతిపాదించిరి.

నిర్విశేష, సవిశేష బ్రహ్మమును ప్రతిపాదించు రెండు రకముల శ్రుతులు ఉండగా కేవలము నిర్విశేష బ్రహ్మమునే శ్రుతులు ప్రతిపాదించుచున్నవని ఎట్లు నిశ్చయము చేసెదరు. ముందు సూత్రమునుండి ఈ ప్రశ్నకు సమాధానము ప్రారంభించుచున్నారు.

332. అరూపవదేవ హి తత్ప్రధానవత్వాత్. 3.2.14.

సూత్రార్థము:- "అస్థూలమనణ్వహ్రస్వమదీర్ఘమ్" అనగా 'స్థూలము గాదు, అణువు కాదు, హ్రస్వము కాదు, దీర్ఘము కాదు' (బృ.3.8.8) మొదలగు నిషేద శాస్త్రములు నిర్గుణబ్రహ్మమును ప్రధానమని చెప్పుచున్నవి అందువలన బ్రహ్మయొక్క నిర్ధారణము నిర్విశేషరూపముగనే చేయవలయును. సవిషేశరూపముగా చేయరాదు అని సూత్రార్థము.

రూపాదిహీనమైన నిర్విశేష బ్రహ్మమునే అవధారణము (స్వీకరించవలయును) గావించవలయును కాని విపరీతమునుగాదు. ఎందులకనిన అదియే ప్రధానము గాన. "అస్థూలమనణ్వహ్రస్వమదీర్ఘమ్" అనగా 'స్థూలము గాదు, అణువు కాదు, హ్రస్వము కాదు'. "అశబ్దమస్పర్శమరూమవ్యయమ్" అనగా 'ఆ బ్రహ్మము శబ్దరహితము, స్పర్శరహితము, రూపరహితము మరియు అవినాశి తత్వము' (క.3.15). "దివ్యో హ్యమూర్తః పురుషః సబాహ్యాభ్యన్తరో హ్యజః" అనిన 'ఆ బ్రహ్మము స్వయంప్రకాశరూపము, సర్వమూర్తి వర్జితము,  బయట లోపల అను భేద రహితము మరియు జన్మరహిత పురుషుడు' (ముం. 2.1.2). ఈ విధమైన నిషేధ శ్రుతులు ప్రపంచరహితమైన నిర్విశేష బ్రహ్మమునే ప్రధానముగా బోధగావించుచున్నవి. భేదమును చెప్పు శ్రుతులు ఉపాసన కొరకే గాని సవిశేష బ్రహ్మమును ప్రతిపాదించుచున్నవని స్వీకరించిన వాక్య భేదము కలుగును. అందువల్ల ఉపాసనను చెప్పు శ్రుతులు  ప్రత్యక్షాది ప్రమాణములద్వారా ప్రసిద్ధమైన ప్రపంచముయొక్క అనువాదములని చెప్పి నిర్విశేష బ్రహ్మ పరకములనియే స్వీకరించుట ఉచితము. అందువలన ఆ  ఉపాసన శ్రుతులకు  సవిశేష బ్రహ్మమును చెప్పుటలో తాత్పర్యము లేదు.

అటులనిన సవిశేష శ్రుతుల గతి ఏమి?   అనిన  ముందు సూత్రముద్వారా  సమాధాన మిచ్చుచున్నారు.

333. ప్రకాశవచ్చావైయర్థ్యమ్. 3.2.15.

సూత్రార్థము:- సూర్యాదుల ప్రకాశము  వక్రముగానున్న తిన్నగానున్న వెదురు మొదలగువానిలో పడి ఆ యా ఉపాధులవలన వక్రాకారముగాను, ఋజువుగాను నీడలు కనిపించును, అలాగుననే బ్రహ్మముగూడ ఆ యా పృథివీ ఆది ఉపాధులలో ఆ పృథివ్యాదిరూపమునే దాల్చు చున్నది. ఉపాసనా ప్రకరణములో చెప్పిన శ్రుతులు ఆ సోపాధిక బ్రహ్మమునే విషయములు గావించుచున్నవి గాన ఆ శ్రుతులు వ్యర్థములుగావు.

సూర్యుని లేక చంద్రుని ప్రకాశము చేతివ్రేళ్ళద్వారా ఏర్పడిన ఉపాధులవలన వక్రముగాను తిన్నగాను కానవచ్చుచున్నవి. ఆ ప్రకారముగనే బ్రహ్మము పృథివ్యాది ఉపాధి సంబన్ధముద్వారా ఆ యా ఆకారములను పొందుచున్నది. ఉపాధి ఆకారములోనున్న విశిష్ట బ్రహ్మమును ఉపాసన కొరకు ఉపదేశము గావించిరి గాన సవిశేష బ్రహ్మను చెప్పు శ్రుతులు వ్యర్థములుగావు. అన్ని శ్రుతులు సమానముగా ప్రమాణములుగాన కొన్ని శ్రుతులను వ్యర్థమని చెప్పుట సరికాదు. ఉపాధి సంబన్ధమువలన బ్రహ్మములో రెండురూపములు కలుగవు ఎందులకనగా ఉపాధిజన్యమైన రూపముయొక్క వస్తుత్వము కల్పితముగాన సిద్ధికాజాలదు.

334. ఆహ చ తన్మాత్రమ్. 3.2.16.

సూత్రార్థము:- అందువల్ల శ్రుతి మాత 'స యథా సైన్ధవఘనః' 'ఉప్పుకల్లు లోపలను వెలుపలనుగూడ ఇతర పదార్థములు లేక లవణరసము మాత్రమే ఎటులనుండునో అటులనే ఈ పరమేశ్వరుడును పరిపూర్ణ జ్ఞానమే అయి ఉన్నాడు, లోపలగాని వెలుపలగాని లేశ మైనను మఱి యొకపదార్థము లేదు' ఇటువంటి శ్రుతులద్వారా నిర్విశేష చైతన్యమాత్రమునే చెప్పుచున్నారు.

"స యథా సైన్ధవఘనోఽనన్తరోఽబాహ్యః కృత్స్నో రసఘన ఎవైవం వా అరేఽయమాత్మాఽనన్తరోఽబాహ్యః కృత్స్నః ప్రజ్ఞానఘన ఎవ" (బృ.4.5.13) అనిన 'ఉప్పుకల్లు లోపలను వెలుపలనుగూడ ఇతర పదార్థములు లేక లవణరసము మాత్రమే ఎటులనుండునో అటులనే ఈ పరమేశ్వరుడును పరిపూర్ణ జ్ఞానమే అయి ఉన్నాడు, లోపలగాని వెలుపలగాని లేశ మైనను మఱి యొకపదార్థము లేదు'. ఈలాగుననే ఆత్మ లోపల మరియు బైట పూర్తిగా చైతన్యఘనమై యున్నది. శ్రుతి మాత లవణ పిండమువలే బైట లోపల భేదరహితమైన నిర్విశేష చైతన్యమైన బ్రహ్మమును చెప్పుచున్నది.

335. దర్శయతి చాథో అపి స్మర్యతే. 3.2.17.

సూత్రార్థము:- "అథాత ఆదేశో నేతి నేతి" అను శ్రుతి వాక్యమునకు అర్థము 'రెండు రూపములను వ్యాఖ్యానము చేసిన తరువాత అది బ్రహ్మ జ్ఞానమునకు కారణమగుటవలన బ్రహ్మము మూర్తరూపముకాదు మరియు అమూర్తరూపముకాదు అని ఉపదేశము'. ఈ శ్రుతులు నిషేధార్థముద్వారానే బ్రహ్మను చెప్పుచున్నవి. మరియు భగవద్గీతలోగూడ "అనాది మత్పరం బ్రహ్మ" అనిన ' ఆ బ్రహ్మము అనాది అనగా ఇంద్రియగోచరము కాదు అందువల్ల కలదని కాని లేదని కాని దానిని గూర్చి చెప్పుటకు వీలులేదు'. మొదలగు వాక్యములద్వారా నిషేధముఖముగానే బ్రహ్మమును చెప్పిరి.

గాన నిర్విశేష బ్రహ్మమే ద్యేయము ఎందులకనగా శ్రుతులలో ప్రపంచమును నిషేధముగావించి నిర్విశేష బ్రహ్మమునే ఉపదేశము గావించిరి. కానిచో సవిశేష బ్రహ్మమును చెప్పు బ్రహ్మబోధక శ్రుతులద్వారా సాకారబ్రహ్మయొక్క నిరూపణమగుచుండగా ప్రపంచ నిషేధమును చెప్పు శ్రుతులు అనర్ధకములగును.

"అథాత ఆదేశో నేతి నేతి" (బృ.2.3.6) అను శ్రుతి వాక్యమునకు అర్థము 'రెండు రూపములను వ్యాఖ్యానము చేసిన తరువాత అది బ్రహ్మ జ్ఞానమునకు కారణమగుటవలన బ్రహ్మము మూర్తరూపముకాదు మరియు అమూర్తరూపముకాదు అని ఉపదేశము'. బ్రహ్మము స్థూలము కాదు సూక్ష్మము కాదు అని బృహదారణ్యక శ్రుతిలో నిషేధముద్వారా బ్రహ్మోపదేశము గావించిరి. "అన్యదేవ తద్విదితాదథోఽవిదితాదధి" అనిన కేనోపనిషత్వాక్యమునకు అర్థము 'ఆ పరబ్రహ్మము బుద్ధిగోచరములగువాని కంటెను, బుద్ధిగోచరముకాని వానికంటెను గూడ పరము' మరియు "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ"(తై.2.4.1.) ఈ శ్రుతి అర్థము 'ఎచటనుండి మనస్సు వాక్కుతోబాటు పరమాత్మను పొందలేక తిరిగి వచ్చునో అదే బ్రహ్మము'. ఈ పై శ్రుతులు నిర్విశేష బ్రహ్మయొక్క రూపమునే చెప్పుచున్నవి. సూత్రములోనున్న 'అథ' శబ్దము మరియు అను అర్థములో చెప్పిరి. అనగా శ్రుతులలో చెప్పిన రీతిగనే స్మృతిలోగూడ చెప్పిరి. "అనాది మతపరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే" (గీ.13.12) దీని అర్థము 'బ్రహ్మము అనాది ఇంద్రియగోచరము

కాకపోవుటవలన కలదనిగాని లేదనిగాని దానిని గూర్చి చెప్పుటకు వీలులేదు'. ఈ స్మృతిలోగూడ బ్రహ్మము నిర్విశేషమనియే చెప్పబడినది.

336. అత ఏవ చ ఉపమా సూర్యకాది వత్. 3.2.18.

సూత్రార్థము:- ఏ కారణమువలన ఈ ఆత్మ చైతన్యైకరసమగుటవలన అనాత్మరూపమైన జగత్తు నిషేధముద్వారానే దీని ఉపదేశము కావించిరి. " యథా హ్యయం జ్యోతిరాత్మా" అను శాస్త్రములో ఈవిధముగా చెప్పిరి. 'ఈ జ్యోతి స్వరూపమైన సూర్యుడు ఒకడైనను భిన్న భిన్న జలములలో ప్రతిబింబించుటవలన అనేకరూపములుగా చూడబడుచున్నాడు. ఆలాగుననే ఈ జన్మరహిత ఆత్మ ఉపాధుల భిన్నత్వములద్వారా క్షేత్రములలో అనుగతమగుటవలన అనేకరూపములుగా చూడబడుచున్నది. ఉపాధులద్వారా సవిశేషత్వమును స్వీకరించుటవలన ఈ జీవుడు జలములోగల ప్రతిబింబమునకు సమానమని దృష్టాన్తము పరిగ్రహింపబడినది. వాస్తవమునకు బ్రహ్మ సవిశేషముకాదు అని సూత్రార్థము.

ఈ ఆత్మ చైతన్యస్వరూపము, నిర్విశేషము, మనోవాక్కులకు అతీతము అగుటవలన ప్రపంచనిషేధముద్వారానే ఉపదేశించుట యుక్తియుక్తము. అందువల్ల ఆ ఆత్మయొక్క ఔపాధికమయిన అపరమార్థిక సవిశేషరూమును చెప్పు ఉద్దేశ్యముతో జలములలోగల సూర్యప్రతిబింబ దృష్టాన్తము మొక్షశాస్త్రములో చెప్పబడినది. " యథా హ్యయం జ్యోతిరాత్మా వివస్వానపో భిన్నా బహుధైకోఽనుగచ్ఛన్ | ఉపాధినా క్రియతే భేదరూపో దేవః క్షేత్రేష్వేవమజోఽయమాత్మా" అను శాస్త్రములో ఈవిధముగా చెప్పిరి. 'ఈ జ్యోతి స్వరూపమైన సూర్యుడు ఒకడైనను భిన్న భిన్న జలములలో ప్రతిబింబించుటవలన అనేకరూపములుగా చూడబడుచున్నాడు. ఆలాగుననే ఈ జన్మరహిత ఆత్మ ఉపాధుల భిన్నత్వములద్వారా క్షేత్రములలో అనుగతమగుటవలన భిన్న భిన్నములుగా చూడబడుచున్నది. మరియు "ఏకధా బహుధాచైవ దృశ్యతే జలచన్ద్రవత్'(బ్ర.బిం.12) అనిన 'జన్మరహితమైన ఈ ఆత్మ ఉపాధులవలన జలములలో ప్రతిబింబించు చంద్రునివలే అనేకరూపములుగా చూడబడుచున్నది'. మొక్ష శాస్త్రములలో చెప్పిన ఈ దృష్టన్తములద్వారా బ్రహ్మము నిర్విశేషమనియే చెప్పబడినది.

337. అమ్బువదగ్రహణాత్తు న తథాత్వమ్. 3.2.19.

సూత్రార్థము:- ఏ విధముగా సాకార సూర్యునిరూపము వేరుగానున్న మరియు దూరముగానున్న సాకారజలములలో అందరికి ప్రత్యక్షముగా అనుభవమగుచున్నదో ఆవిధముగా నిర్గుణము సర్వాత్మకమగు అందరి ఆత్మరూపముగానున్న బ్రహ్మము వేరుగా మరియు దూరదేశములో గ్రహింపబడుటలేదు. అందువల్ల సూర్యునియొక్క ప్రతిబింబ సాదృశ్యమని చెప్పనలవి కాదని ప్రశ్న తాత్పర్యము.

బ్రహ్మమును జలగత సూర్యాదుల ప్రతిబింబ సమమని చెప్పజాలము ఎందులకనగా జలములవలే బ్రహ్మము గ్రహణయోగ్యముకాదు. రూపముగల సూర్యాదులనుండి భిన్నము మరియు దూరదేశములోగల రూపముగల జలములు గ్రహింపబడుచున్నవి అనగా రూపముగల సూర్యాదుల ప్రతిబింబము రూపముగల జలములలో

దూరస్థదేశములో  గ్రహింపబడుచున్నవి. ఈ ప్రకారము బ్రహ్మమునకు ప్రతిబింబముయొక్క ఆధారముగాని దాని బుద్ధిగాని గ్రహింపబడుటలేదు ఎందులకనగా బ్రహ్మము మరియు దాని ప్రతిబింబము రెండును రూపరహితములు. అంతేగాక బ్రహ్మము సర్వవ్యాపకము, అందరి ఆత్మస్వరూపము, అనన్త మగుటవలన బ్రహ్మకన్న భిన్నము దూరదేశములోగల ఏ ఉపాధులులేవు. కాన బ్రహ్మమెట్లు ప్రతిబింబించును? అందుచే జలములలో ప్రతిబింబించు సూర్యాదుల దృష్టాన్తము సరికాదు.

338. వృద్ధిహ్రాసభాక్త్వమన్తర్భావాదుభయసామఞ్జస్యాదేవమ్. 3.2.20.

సూత్రార్థము:- జలములలో ప్రతిబింబించు సూర్యబింబము జలముల హెచ్చు-తగ్గువులవలన వృద్ధి హ్రాసములకు లోనగునటుల కానవచ్చుట జలముల ధర్మమును అనుసరించుటవలన కాని పారమార్థికముగా సూర్యునిలో మార్పులు లేవు. ఆలాగుననే నిర్విశేష పరమాత్మ దేహాది ఉపాధులలోనున్నను ఆ దేహాదుల అభివృద్ధివలన అభివృద్ధి, క్షీణతవలన క్షీణమును పొందునట్లు కానవచ్చుట వాస్తవికముకాదు. ఈ అంశమును గైకొని దృష్టాన్త-దార్ష్టాన్తికముల పరస్పర సాదృశ్యమును చెప్పుట యుక్తియుక్తమే. అందువలన సూర్యదుల దృష్టాన్తము యుక్తమైనదియే. దృష్టాన్త-దార్ష్టాన్తికములకు సర్వాంశములలో సాదృశ్యము బ్రహ్మదేవుడుగూడ చెప్పజాలడు. ఒకవేల సర్వాంశములలో సాదృశ్యమున్న దృష్టాన్త-దార్ష్టాన్తికముల భావమే ఉండదు అది ఖండించబడును.

జలములలో ప్రతిబింబించు సూర్యబింబము జలముల హెచ్చు-తగ్గువుల ధర్మమునకు  లోనగుచున్నది, ఈ హెచ్చు-తగ్గువులు ఔపాధికములు, పారామార్థికములు గావు. అలాగుననే నిర్విశేష బ్రహ్మము దేహాది ఉపాధులలో నుండుటవలన దేహాదుల హెచ్చు-తగ్గుల ధర్మము దానిలో ఉపాధివలన చూడబడు చున్నదే కాని అది పారామార్థికము కాదు. ఈ ప్రకారము చెప్పదలచిన అంశముయొక్క సమానత సంభవమగుటవలన చెప్పిన రెండు దృష్టాన్త-దార్ష్టాన్తికముల సామఞ్జస్యముండుటవలన ఏ విధమైన విరోధము లేదు. దృష్టాన్త-దార్ష్టాన్తికముల సంపూర్ణ సారూప్యము ఎవరుగూడ చూపించలేరు ఒకవేళ దృష్టాన్త-దార్ష్టాన్తికముల సారూప్యము కలిగిన వాని భావమే సమాప్తమయిపోవును.

339. దర్శనాచ్చ. 3.2.21.

సూత్రార్థము:-  శ్రుతులలో పరబ్రహ్మమే దేహాది ఉపాధులలో ప్రతిబింబరూపములో ప్రవేశించినటుల చెప్పబడినది. అందువల్ల బ్రహ్మము నిర్విశేషరూపమనునది సిద్ధమగుచున్నది.

శాస్త్రముద్వారానే తెలిసికొనుటకు యోగ్యమైన పరమేశ్వరుని విషయములో ఇటువంటి ప్రశ్నలు వేయరాదు. శ్రుతులలో "పురశ్చక్రే ద్విపదః పురశ్చక్రే చతుష్పదః | పురః స పక్షీభూత్వా పురః పురుష ఆవిశదితి" (బృ.2.5.18) అనిన  ' ఆ పరమేశ్వరుడు మొట్టమొదట రెండుకాళ్ళ జంతువుల దేహములను ప్రవేశించెను. నాలుగు కాళ్ళ జంతువుల దేహములలో గూడ ప్రవేశించెను. పక్షిరూపమైన లింగశరీరముద్వారా  పురుషునిలో ప్రవేశించెను. "అనేన జీవేనాత్మనాఽనుప్రవిశ్య" (ఛాం.6.3.2) అనగా 'జీవాత్మరూపములో ప్రవేశించి ఆ పరమేశ్వరుడు నామరూపములను ప్రకటించెను'. ఛాన్దోగ్యశ్రుతిలో గూడ పరబ్రహ్మమే శరీరాది ఉపాధులలో ప్రతిబింబభావముతో ప్రవేశించెనని

వినబడుచున్నది. అందువల్ల జలములలో  సూర్యాదుల ప్రతిబింబ దృష్టాన్తము యుక్తియుక్తమే. కనుక నిర్విశేష బ్రహ్మమే ఉపాసనా యోగ్యము ఉభయరూపములు కావు మరియు సవిశేషరూపముగూడ కాదు అని నిసన్దిగ్ధముగా సిద్ధమగుచున్నది.

# 99. ప్రకృతైతావత్త్వాధికరణము.

సంగతి:- నిషేధమును చెప్పు శ్రుతిద్వారా బ్రహ్మములో నిర్విశేషత్వము చెప్పబడినది. అటులనే నిషేధశ్రుతిద్వారానే బ్రహ్మమునగూడ నిషేధించిరని ఎందులకి స్వీకరించరాదు? అను ఈ ఆక్షేపసంగతివలన ఈ అధికరణము ప్రారంభమయినది.

విషయము:- ఈ అధికరణముయొక్క విచారణీయ విషయము బ్రహ్మయొక్క అస్తిత్వమును గ్రహించుటకు.

సంశయము:- "ద్వే వావ బ్రహ్మణో రూపే మూర్తం చైవామూర్తం చ" (బృ.2.3.1) అనిన 'పరమేశ్వరునికి ఆకారముగల మూర్తములనియు  వానికి వ్యతిరేకలైన అమూర్తములనియు  రెండురూపములు కలవు'. ఇచటనుండి ప్రసంగమును ఆరంభించి "అథాత ఆదేశో నేతి నేతి" (బృ.2.3.6) అనగా 'ఆతరువాత ఆదేశము ఇదు లేదు ఇది లేదు' అను ఈ శ్రుతిద్వారా ప్రపంచము మరియు బ్రహ్మమును ఈ రెండింటిని నిషేధము గావించిరా లేక ఒకదానినేన అని సంశయము.

పూర్వపక్షము:- నిషేధము ఒకపదార్థమును మాత్రమే అని నిరూపించుటకు తగిన సాధనలేదు. అందువల్ల ఒక 'నేతి' పదముద్వారా ప్రపంచముయొక్క నిషేధమును చెప్పి రెండవ 'నేతి' పదముద్వారా బ్రహ్మయొక్క నిషేధమును చెప్పిరనవలయును.

సిద్ధాన్తము:- బ్రహ్మము మరియు ప్రపంచము ఈ రెండు పదార్థముల నిషేధము చెప్పుట సరికాదు ఎందులకనగా అటుల స్వీకరించిన శూన్యవాద ప్రసంగము వచ్చును. త్రాడులో కనిపించు పాముయొక్క  నిషేధము వ్యర్థముకాదని లోకములో అందరి అనుభవము. 'ఇతి' శబ్దముతో చెప్పిన నిషేధవాచకమైన 'న' కారము కనిపించు సర్వ ప్రపంచముయొక్క నిషేధమునకై వ్యాపక అర్థములో ప్రయోగించిరి. సత్యమునకు సత్యమయిన బ్రహ్మవస్తు నిర్దేశము 'ఇదమ్' శబ్దముద్వారా కానేకాదు గాన ఆ బ్రహ్మయొక్క నిషేధముగూడ సంభవముకాదు. కాన నిషేధముయొక్క అవధిలో  మిగులునది మూర్తామూర్త రూపములో నున్న ప్రపంచమే దానినే 'నేతి నేతి' శబ్దముద్వారా నిషేధముగావించిరి.

వైయాసికన్యాయమాలా.

211. బ్రహ్మాపి నేతి నేతీతి నిషిద్ధమథవా న హి |ద్విరుక్త్యా బ్రహ్మ జగతీ నిషేధ్యేతే ఉభే అపి ||

212. వీప్సేయమితిశబ్దోక్తా సర్వదృష్యనిషిద్ధయే | అనిదం సత్యసత్యం చ బ్రహ్మైకం శిష్యతేఽవధిః ||

'నేతి నేతి' అను వాక్యముద్వారా బ్రహ్మగూడ నిషేధము చేయబడినదా లేదా?  అను సంశయమునకు పూర్వవాది చెప్పునది ఏమనగా నేతి నేతి అని రెండు మారులు చెప్పుటవలన బ్రహ్మము  మరియు జగత్తు రెండింటిని నిషేదించిరి.

అనిన సిద్ధాన్తి జవాబు. 'ఇతి' శబ్దము ద్వారా చెప్పిన ద్విరుక్తి అర్థము సంపూర్ణ దృశ్యజగత్తును నిషేదించుటకు. 'ఇదం' అనిన ఇది అను శబ్దముద్వారా చెప్పుటకు అయోగ్యమగుటవలన బ్రహ్మమును సత్యమునకు సత్యమని చెప్పిన (నిషేధము యొక్క అవధి ప్రపంచరూమగుటవలన) బ్రహ్మముమాత్రమే మిగులును. దానిని నేతి మొదలగు శబ్దములద్వారా నిషేదించలేము.

భారతీ తీర్థుల వారి వ్యాఖ్య:

"ద్వే వావ బ్రహ్మణో రూపే మూర్తం చైవామూర్తం చ" (బృ.2.3.1.) అనిన 'బ్రహ్మమునకు రెండురూపములు గలవు మూర్తము రూపముగలది, అమూర్తము రూపములేనిది'. ఈ మూర్తామూర్త బ్రాహ్మణములో విస్తారముగా పృథివ్యాదుల మూర్తస్వరూపము మరియు ఆకాశవాయువుల అమూర్తస్వరూపము విచారముగావించి తరువాత బ్రహ్మోపదేశమునకై "అథాత ఆదేశో నేతి నేతి" అని చెప్పిరి. ఈ శ్రుతికి అర్థము- రెండురూపములను చెప్పిన తరువాత రూరహితమైన బ్రహ్మమును చెప్పుటకై 'నేతి నేతి' అను బ్రహ్మోపదేశము వినబడుచున్నది. దీనిపై పూర్వపక్షి చెప్పునది ఏమనగా 'ప్రథమ నేతి శబ్దముద్వారా జగత్తునొకదానినే నిషేదించిన రెండవ నేతి శబ్దము వ్యర్థమగును అందువల్ల రెండవనేతి శబ్దముద్వారా బ్రహ్మము నిషేదించబడుచున్నది' అనును.

సిద్ధాన్తి చెప్పునది. ఉపయుక్తము గాన ద్వితీయ నిషేధము వ్యర్థముకాదు. వీప్స (మళ్ళీ మళ్ళీ అని) చెప్పుటచే దృశ్య ప్రపంచము మరియు ఇతి శబ్దముద్వారా నిర్దేశార్హమైనదంతయు బ్రహ్మము కాదు అని చెప్పుటవలన బ్రహ్మము తప్ప మిగిలినదంతయూ నిషేధించబడు చున్నది. వీప్సను చెప్పనియెడల ఒక నకారముద్వారా ప్రకృతినుండి వచ్చిన ఇతి శబ్దముద్వారా చెప్పిన మూర్తము మరియు అమూర్తము నిషేధించబడును. మరియు మూర్తామూర్తాదుల అభావము మరియు మూలావిద్యా నిషేధించబడదు అంతేగాక మూర్తామూర్తాదుల అభావము మరియు మూలావిద్యలో బ్రహ్మత్వ ప్రసక్తి వచ్చును. వీప్స నిరంకుశమగుటవలన బ్రహ్మమును ఏల నిషేదించదు? అని ఈ ప్రకారము ఎవరైనను దోషమును ఎత్తి చూపిన దానికి సమాధానమేమనగా ఆ దోషము నిషేధించలేనిది ఎందులకనగా బ్రహ్మమును ఇతి శబ్దముద్వారా చెప్పుటకు శక్యముగాదు. మరియు "అథాత ఆదేశో" అని బహుప్రయత్నపూర్వకముగా బ్రహ్మోపదేశముయొక్క ప్రతిజ్ఞ గావించి శ్రుతి ఆ బ్రహ్మమునే నిషేదము గావించిన తను చెప్పిన అర్థమునే వినాశము గావించుకొనును, ఇదే ప్రకారము బ్రహ్మమును నిషేదించిన వాక్యశేషముగూడా అసంగతమగును, కారణమేమనగా వాక్యశేషములో అథ నామధేయం "సత్యస్య సత్యం" అనిన 'ఆ బ్రహ్మము సత్యమునకు సత్యము' (అనగా స్థూల శరీరముకంటె చిరకాలము ఉండునదగుటచే సూక్ష్మశరీరము సత్యము, శాశ్వతమగుటచే బ్రహ్మము అంతకంటెను సత్యము) అని శ్రుతి కథనము. ఈ కథనము ద్వారా చెప్పదలచినదేమనగా కొండలు మరియు నదులు మొదలగు లౌకిక పదార్థముల సత్యత్వముకన్న బ్రహ్మము అత్యధిక సత్యమని సూచించుటకొరకే బ్రహ్మయొక్క నామ నిర్దేశము గావించబడెను. అన్నింటి నిషేదము స్వీకరించిన ఈ పై చెప్పిన తర్కమంతయు ఖండితమగును గాన 'నేతి' శబ్దముద్వారా బ్రహ్మము నిషేదించబడదు.

## 340. ప్రకృతైతావత్త్వం హి ప్రతిషేధతి తతో బ్రవీతి చ భూయః. 3.2.22.

సూత్రార్థము:- "నేతి నేతి" అని శ్రుతి పకృత ప్రసంగములో ముఖ్యముగా ముందు చెప్పిన బ్రహ్మయొక్క మూర్తము మరియు అమూర్తము అను రెండు రూపములను మాత్రమే నిషేధించుచున్నది ఎందులకనగా 'ఇతి' శబ్దము ప్రధానముగా ప్రకృతమును పరామర్శించును. ఆ రెండు రూపములే ప్రకృతములో ముఖ్యములు గాని బ్రహ్మము కాదు అయినను రూపద్వయములుగల జగత్తు అముఖ్యముగా నిర్దేశింపబడినది అందువల్ల బ్రహ్మము నిషేధింపబడదు. ప్రపంచమును నిషేధించిన తరవాత వచ్చు వాక్యము బ్రహ్మమునే చెప్పుచున్నది, లేక 'అథ నామధేయమ్' అను వాక్యము బ్రహ్మమునే చేప్పుటవలన దాని నిషేధము అశక్యమనుట నిర్వివాదము. ప్రత్యక్షమునకు విరోధము కలుగుటవలన ప్రపంచము నిషేధింపబడదు అని చెప్పుట సరికాదు ఎందులకనగా దానిలో వ్యావహారికప్రమాణము ఉండుటవలన దోషము లేదు.

ఈ సూత్రములో పుర్వపక్షి బ్రహ్మము అసిద్ధమనును సిద్ధాన్తి బ్రహ్మము సిద్ధరూపమనును. బృహదారణ్యకములో "ద్వేవావ బ్రహ్మణో రూపే మూర్తం చైవామూర్తం చ" (బృ.2.3.1) అనగా 'బ్రహ్మమునకు రెండు రూపములు మూర్తము మరియు అమూర్తము' అని ప్రసంగమును ప్రారంభించి "అథాత ఆదేశో నేతి నేతి" (బృ.2.3.6) అనిన ' ఇది లేదు ఇదిలేదు' అని చెప్పిరి. ఈ శ్రుతి వాక్యముద్వారా ప్రపంచము మరియు బ్రహ్మము ఈ రెండింటిని నిషేధించిరా లేక ఒకదానినా? ఒకదానిని నిషేధించిన ఈ రెండింటిలో దేనిని నిషేధించిరి. ఈ సంశయమునకు పూర్వవాది రెండింటి నిషేధము చెప్పును ఎందులకనగా శ్రుతిలో నేతి శబ్దము రెండు సార్లు ప్రయోగించిరి గాన, లేక కేవలము బ్రహ్మ నిషేధమని చెప్పవలయును, ఎందులకనగా మనో-వాక్కులకు అవిషయమైన వస్తువుయొక్క అస్తిత్వము అసంభవము కనుక. ప్రపంచము ప్రత్యక్షమునకు విషయమగుటవలన నిషేధ అయోగ్యము. అందువలన చెప్పిన శ్రుతిలో కేవల బ్రహ్మయొక్క నిషేధము స్వీకరించుటయే ఉచితము అను పూర్వపక్షమునకు సిద్ధాన్తి చెప్పు సమాధానము. ప్రపంచము మరియు బ్రహ్మము ఈ రెండు రూపముల నిషేధము స్వీకరించుట సరికాదు ఎందులకనగా అటుల స్వీకరించిన శూన్యవాద ప్రసంగము వచ్చును. లోకములో "నాఽయం సర్పః, నేదం రజతమ్" అను స్థలములలో రజ్జు సర్పాదులను వెండిని నిషేధించినను వాని అధిష్ఠానములో తాడు మరియు ఆలచిప్పల యొక్క నిషేధమును స్వీకరించరు. అన్ని వేళల రజ్జు సర్పాదుల నిషేధము నిరవధికముగా చూడబడుటలేదు, ఎందులకనగా నీవు చెప్పిన నిషేధము శాస్త్రములో చెప్పిన బ్రహ్మయొక్క పరిమాణము పరిచ్ఛిన్నమైన మూర్తము మరియు అమూర్తరూపములనే నిషేధించుచున్నది. అనగా ఆ రెండు రూపములనే 'నేతి నేతి' అను శ్రుతి వాక్యము నిషేధించుచున్నది. ఇతి శబ్దము దగ్గరలో నున్నదానినే అవలంబించును. అటుల సన్నిహితమును అవలంబించు ఇతి శబ్దము ద్వారా మొదట చెప్పిన బ్రహ్మయొక్క రెండు ప్రధానరూపముల యొక్క పరామర్శ సంభవము. షష్ఠీ విభక్తి ద్వారా చెప్పిన 'బ్రహ్మణః' అను శబ్దముద్వారా రెండురూపములకు మధ్యవర్తి అయిన బ్రహ్మ సంపూర్ణ (ప్రపంచముయొక్క) జగత్తుయొక్క విశేషణమగుటవలన నిషేధ యోగ్యముకాదు. అందువల్ల బ్రహ్మములో కల్పించిన ప్రపంచమునే నేతి శబ్దముద్వారా నిషేధము గావించిరి మరియు బ్రహ్మమును పరిశేషరూపముగా నుంచిరి అనునది సిద్ధమైనది.

ఎందులకనగా ఆ నిషేధము తరువాత "న హ్యేతస్మాదితి నేత్యన్యత్పరమస్తి" (బృ.2.3.6.) 'దీనికన్న భిన్నమైనది ఏదీ లేదు మరియు దీని కన్న అన్య ద్రష్ట ఎవడు లేడు' అని చెప్పుటవలనగూడ ఈ నిర్ణయము ఉచితము. ఈ వాక్యముద్వారా బ్రహ్మకైన భిన్న వస్తువును నేతి నేతి శబ్దముద్వారా నిషేధము గావించిరి. అనగా బ్రహ్మకన్న భిన్నమైన వస్తువు ఏది లేదు అనగా కేవలము ఇందువల్లగూడ ఈ నిర్ణయము ఉచితము బ్రహ్మము మాత్రమే యున్నది అనునది. పై శ్రుతి ఈ విధముగా చెప్పుచున్నది లేక ప్రపంచమును నిషేధము గావించిన తరువాత "అథ నామధేయం సత్యస్య సత్యమితి" (బృ.2.1.20) 'బ్రహ్మమునకు నామమిదియే, సత్యమునకు గూడ సత్యము'. ప్రథమా విభక్తి ద్వారా చెప్పిన సత్యమను శబ్దము బ్రహ్మమునే చెప్పుచున్నది, షష్ఠ్యన్తపదము ప్రపంచమును చెప్పుచున్నది. గాన ప్రపంచమును నిషేధించిన పారమార్థిక బ్రహ్మము మాత్రమే మిగులును కాని అభావము కాదు. ప్రపంచము వ్యావహారికమగుటవలన దానిని నిషేధించినను ప్రత్యక్ష ప్రమాణమునకు విరోధములేదు అని సిద్ధమైనది.

ప్రపంచమునకన్న భిన్నమైన బ్రహ్మమున్నదనిన ఎందులకు కనబడుటలేదు. అను ప్రశ్నకు సమాధానము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

341. తదవ్యక్తమాహ హి. 3.2.23.

సూత్రార్థము:- బ్రహ్మము ఇంద్రియగ్రాహ్యము కాదు, ఎందులకనగా "న చక్షుషా గృహ్యతే" 'బ్రహ్మమును నేత్రములద్వారా గ్రహించలేము'. (ముం.3.1.8) అను శ్రుతులద్వారా బ్రహ్మము అవ్యక్తరూపమని చెప్పిరి.

మనస్సు మరియు ఇంద్రియములకు అభివ్యక్తము లేక అగ్రాహ్యమగు దానిని అవ్యక్త మందురు. అన్నింటికీ సాక్షి అగుటవలనను, ప్రత్యక్షాది ప్రమాణములకు అవిషయమగుటవలనగూడ ఆ బ్రహ్మమును అవ్యక్త మందురు. "న చక్షుషా గృహ్యతే నాపి వాచా నాన్యైర్దేవైస్తపసా కర్మణా వా" అనిన 'బ్రహ్మము నేత్రములకు అగ్రాహ్యము వాణిద్వారా తెలిసికొనలేము, మిగిలిన ఇంద్రియముల కూడ తెలిసికొనలేవు తపస్సు మరియు కర్మముగూడ దానిని గ్రహించలేదు'. (ముం.3.1.8.) మరియు "స ఏష నేతి నేత్యాత్మాఽగృహ్యో నహి గృహ్యతే" దీని అర్థము 'ఇది కాదు ఇది కాదు అని మధుకాణ్డములో నిర్దేశించిన ఆత్మ అగ్రాహ్యము ఎందులకనగా దానిని తెలిసికొనలేము' (బృ.3.9.26). ఈ ఆత్మ స్థూలాది ప్రపంచరూపము కాదు అందువలన గ్రహణయోగ్యముకాదు.

ఇటులయిన బ్రహ్మము ఎవ్వరికిని గోచరముగాని వస్తువుగాన మోక్షాభావ ప్రసంగము వచ్చును అను ప్రశ్నకు ముందు సూత్రములో సమాధానము చెప్పుచున్నారు.

342. అపి చ సంరాధనే ప్రత్యక్షానుమానాభ్యామ్. 3.2.24.

సూత్రార్థము:- చెప్పిన అవ్యక్త పరమాత్మ స్వరూపమును యోగులైన ధీర పురుషులు సమాధి దశలో తెలిసికొందురు. దీనినే 'కశ్చిద్ధీరః' అని శ్రుతిలో మరియు 'యం వినిద్రా జితశ్వాసాః' అను స్మృతిలో చెప్పిరి.

భక్తి, ధ్యానము, వ్యాకులతతోగూడిన దీర్ఘకాల ప్రయత్నానుష్ఠానముద్వారా (ప్రణిధాన) యోగులు ఈ అవ్యక్తాత్మను అనుభవింతురు లేక తెలిసికొందురని శ్రుతిలో మరియు స్మృతిలో చెప్పిరి. "పరాంచి ఖాని వ్యతృణత్స్వయంభూ-స్తస్మత్పరాఙ్పశ్యతి నాన్తతాత్మన్ | కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైచ్ఛదావృత్తచక్షురమృతత్వమిచ్ఛన్ ||" (కఠ.4.1) అనగా

"పరమేశ్వరుడు ఇంద్రియములను బాహ్యపదార్థములను చూచూవానినిగాచేసి హింసించెను. అందువలననే ఈ జీవుడు అన్తరాత్మను చూడలేకున్నాడు. ఒకానొకమహాత్ముడు జ్ఞాన-సంపన్నుడై అమరత్వమును పొందు అభీలాషచే ఇంద్రియములను జయించి అన్తరాత్మను చూడగలుగును" అని అర్థము. "జ్ఞానప్రసాదేన విశుద్ధసత్వస్తతస్తు తం పశ్యతే నిష్కలం ధ్యాయమానః" ( ముం. 3.1.8.) అనిన " జ్ఞానము వలన నిర్మలమై శుద్ధాన్తఃకరణముగలవారు ధ్యానపరాయణులై అవయవరహితమైన ఆత్మను దర్శించెదరు" అని అర్థము. యోగులు అవ్యక్తాత్మను తెలిచికొందురనుటకు పై శ్రుతులు ఉదహరించిరి. "యం వినిద్రా జితశ్వాసాః సంతుష్టా సంయతేన్ద్రియాః | జ్యోతిః పశ్యన్తి యుంజానాస్తస్మై యోగాత్మనే నమః || అనిన "నిద్రారహితులై శ్వాసను నిరోధించిన వ్యక్తులు ఇంద్రియములను జయించి సంతోషము గలవారై యే జ్యోతిని చూచునో ఆ యోగలభ్య ఆత్మకు నమస్కారము, ఆ సనాతన భగవంతుని సమస్త రూపమును యోగి దర్శించును" అని స్మృతులలోగూడ చెప్పిరి.

జీవబ్రహ్మలలో ఆరాధ్య ఆరాధకభావమును స్వీకరించిన లేక ధ్యేయ ధ్యాతభావముండిన బ్రహ్మమునందు భిన్నత్వము కలుగును? అను ప్రశ్నకు సమాధానము ముందు సూత్రములో చెప్పుచున్నారు.

343. ప్రకాశాదివచ్చావైశేష్యం ప్రకాశశ్చ కర్మణ్యభ్యాసాత్. 3.2.25.

సూత్రార్థము:- ఏవిధముగా సూర్యుని ప్రకాశము చేతివ్రేళ్ళఉపాధివలన కలుగు కర్మవలన భిన్నముగా కనుపించును కాని నిజమునకు సూర్య ప్రకాశము ఒకటే. ఆవిధముగనే ప్రకాశము అనగా పరమాత్మ ధ్యానాది ఉపాధులవలన కలుగు కర్మద్వారా భిన్నముగా తోచినను వాస్తవమునకు ఒకేరూపత్వము. ఏందులకనగా 'తత్త్వమసి' అను మహావాక్య అబ్యాసమువలన.

ఏలాగున సూర్యప్రకాశము మరియు ఆకాశము చేతివ్రేళ్ళఉపాధివలన కలుగు కర్మవలన భిన్నముగా కనిపించును. వాస్తవమునకు ప్రకాశము ఒకటే. ఆలాగుననే ధ్యానాది ఉపాధులవలన పరమాత్మ బేధముగా కనిపించును కాని వాస్తవమునకు సర్వత్ర బ్రహ్మయొక్క స్వరూపము ఒకటే. ఏందులకనగా మరల మరల జీవ-బ్రహ్మల అభేధము 'తత్త్వమసి' అను శ్రుతియొక్క మహావాక్యము చాటుచున్నది గాన

344. అతోఽనన్తేన తథా హి లిఙ్గమ్. 3.2.26.

సూత్రార్థము:- భేధము ఉపాధివలన కలుగుచున్నది ఈ భేధజ్ఞానమును జ్ఞానము ద్వారా నాశనముచేసి జీవుడు పరమాత్మతో ఏకరూపతను పొందును ఎందులకనగా ఈ అర్థమును చెప్పు ప్రమాణము "యో హ వై తత్ పరమం బ్రహ్మ వెద" అను శ్రుతిలో గలదు.

భేధము అవిద్యాకారణమువలన కాన వచ్చు చున్నది. గాన బ్రహ్మవిద్యద్వారా అవిద్యను మరియు దానివలన కలుగు భేదమును నాశనము గావించి జీవుడు దేశ-కాల-వస్తు పరిచ్ఛేద శూన్యమయిన నిర్విశేషబ్రహ్మతో ఏకత్వమును పొందును. ఎందులకనగా "బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి" (ముం.3.2.9.) అనగా "బ్రహ్మమును తెలిసికొనినవాడు బ్రహ్మస్వరూపమునే పొందును" మరియు "బ్రహ్మైవసన్బ్రహ్మాప్యేతి" (బృ.4.4.6.) అనగా "బ్రహ్మమైయుండి బ్రహ్మమునే పొందును" అను శ్రుతులు పైనుదహరించిన విషయమును సూచించుచున్నవి.

ఈ ప్రకారము జీవ-బ్రహ్మముల పారమార్థిక అభేధమును చెప్పి సూత్రకారులు తమ సిద్ధాన్తము యొక్క విశుద్ధత కొరకు ఇతర మతముల ఉపన్యాసము గావించుచున్నారు.

345. ఉభయవ్యపదేశాత్త్వహికుణ్డలవత్. 3.2.27.

సూత్రార్థము:- ఏవిధముగా ఒకే సర్పము వాస్తవ స్థితిలో ఒకటే అయినను "ఇది పడగ, ఇది చుట్ట, ఇది దేహము" అను భేదవ్యవహారము అవయవములను ఆశ్రయించి ఎట్లు ప్రవర్తించుచున్నవో ఆలాగుననే జీవుడు మరియు ఈశ్వరుని ధ్యానము చేయువాడు ధ్యానమునకువిషయమైన ధ్యేయము అను భేదాభేదము ఉండవచ్చును. ఎందులకనగా శ్రుతిలో ఆవిధమైన ఉపన్యాసము గలదు. సూత్రములోనున్న "తు" శబ్దము సిద్ధాన్తియొక్క విలక్షణతము సూచించుచున్నది.

"తతస్తు తం పశ్యతే ధ్యాయమానః" (ముం.3.1.8.) అనిన " మనస్సు శుద్ధమైన తరువాత నిష్కలమైన బ్రహ్మమును ధ్యానము చేయుచు సాధకుడు ఆ ఆత్మను చూచును అనిన దాని స్వరూపమును అనుభవిమంచును". ఇచట ధ్యాతా-ధ్యానము, ద్రష్టా-దృశ్యము మొదలగు రూపములలో జీవబ్రహ్మముల భేదము వినబడు చున్నది మరియు "తత్త్వమసి" "అహం బ్రహ్మాస్మి" అను వాక్యములలో అభేదము వినవచ్చుచున్నది. ఈ రెండింటిలో ఒకదానిని అపరమార్థికమని చెప్పుట సరికాదు. అందువల్ల జీవ బ్రహ్మముల భేదము మరియు అభేదము శాస్త్రసమ్మతమని ఒప్పుకొనవలయును. సూత్రములోనున్న "తు" శబ్దము సిద్ధాన్తముయొక్క విలక్షణతను చెప్పుటకు. ఏవిధముగా ఒకే సర్పము వాస్తవ స్థితిలో ఒకటే అయినను "ఇది పడగ, ఇది చుట్ట, ఇది దేహము" అను భేదవ్యవహారము అవయవములను ఆశ్రయించి ఎట్లు ప్రవర్తించుచున్నవో ఆలాగుననే ఉపాధి వలన జీవ-బ్రహ్మముల భేద దృష్టి మరియు పారమార్థిక దృష్టిలో అభేదమును స్వీకరించవలయునున ఎందులకనగా ఆ విధమైన శ్రుతులు ఉపలబ్ధ మగుచున్నవి.

కేవలము ధర్మములు భిన్నమగుటవలన జీవ-బ్రహ్మల భేదాభేదము చెప్పుట సరికాదు కాని ఒకే ధర్మముతో ఉన్నను జీవ-బ్రహ్మల భేదాభేదము సంభవము అను చెప్పుటకు వేరొక పక్షమును చెప్పుచున్నారు.

346. ప్రకాశాశ్రయవద్వా తేజస్త్వాత్. 3.2.28.

సూత్రార్థము:- ఏవిధముగా ప్రకాశము మరియు దానిని ఆశ్రయించిన తేజోరూపత్వములో సామాన్యముగా భేదము లేకపోయినను వ్యాపకత్వము మరియు పరిచ్ఛిన్నత్వముద్వారా భేదాభేద ఉపదేశము సంభవము ఆలాగుననే జీవేశ్వరులయొక్క భేదాభేదము ఉపదేశించ బడినది.

ఏవిధముగా ప్రకాశము మరియు దానిని ఆశ్రయించిన తేజోరూపత్వ ధర్మము సమానమైనను అత్యన్తము భిన్నము గాకపోయునను భేద ఉపదేశము సంభవమొ ఆవిధముగనే జీవేశ్వరుల భేదాభేదము స్వీకరించవచలయును.

భేదరూపమైన బన్ధనమును పారామార్థకమని స్వీకరించిన అది జ్ఞానము ద్వారా నాశనము కాదు. ఆ స్థితిలో మొక్షమును ప్రతిపాదించు శాస్త్రము వ్యర్థమగును. మరియు భేదాభేదను ప్రతిపాదించు శ్రుతులు సమానమగుటవలన జీవ-బ్రహ్మముల భేదాభేద ఉపదేశముగూడ సరికాదు, ఎందులకనగా భేదమును చెప్పు శ్రుతులు లోకములో ప్రసిద్ధమైన భేదమును అనువాదము మాత్రము కావించుచున్నవి. శ్రుతుల ముఖ్య ప్రతిపాద్య విషయము జీవేశ్వరుల అభేదమే. ఈ విషయమునే అగ్రిమ సూత్రములో చెప్పుచున్నారు.

347. పూర్వవద్వా. 3.2.29.

సూత్రార్థము:- లేనిచో "ప్రకాశవచ్చావైశేష్యాత్" అను సూత్రములో ముందు భేదము కాల్పనికమని చెప్పి తరువాత అభేదము పారమార్థికమని చెప్పిరి. ఏవిధముగా అచట చెప్పిరో ఆలాగుననే ఇచటగూడ ఆ సిద్ధాన్తమునే స్వీకరించవలయును.

"ప్రకాశవచ్చావైశేష్యాత్" అను సూత్రములో ప్రకాశాదులవలే జీవేశ్వరులయొక్క అభేదరూపము చెప్పిరి. కాల్పనిక భేదము మరియు అభేదము పారమార్థికమని చెప్పరి దానినే శ్రుతియొక్క సిద్ధాన్తముగా స్వీకరించవలయును.

348. ప్రతిషేధాచ్చ. 3.2.30.

సూత్రార్థము:- "నాన్యోఽతోఽస్తి ద్రష్టా" అను శ్రుతిద్వారా మరియు "నేతి నేతి" అను శ్రుతిద్వారాను బ్రహ్మచైతన్యమునకు అతిరిక్తమైన ఈ కనుపించు ప్రపంచమును నిషేదించిరిగాన "బ్రహ్మము అద్వితీయము" అనునదే సిద్ధాన్తము.

"నాన్యోఽతోఽస్తి ద్రష్టా" (బృ.3.7.2.) అనిన. "ఆ చైతన్య బ్రహ్మకన్న భిన్నమైన దష్ట లేడు" అను శ్రుతి వాక్యము ద్వారా బ్రహ్మకన్న భిన్నమును నిషేదించి "నేతి నేతి" అని శ్రుతి వాక్యముతో సంపూర్ణ ప్రపంచమును నిషేదించిరి కనుకనే అద్వితీయ బ్రహ్మమే మిగిలినది. ఇదియే వేదాన్త సిద్ధాన్తము. అందువల్ల శ్రుతివాక్యముల శక్తివల్ల నిర్విశేషబ్రహ్మమే సిద్ధమగుచున్నది.

13 Continuation of File Number

# 100. పరాధికరణము.

సంగతి:- పై అధికరణములో 'నేతి నేతి' శబ్దముద్వారా ప్రపంచమును నిషేధముగావించి బ్రహ్మము మాత్రమే మిగులునని చెప్పిరి అటుల చెప్పుట సరికాదు ఎందులకనగా సేతుత్వము, ఉన్మానముల (కొలత పరిమాణము) ఉపదేశము గావించుటవలన. అంతేగాక వేరొక వస్తువుయొక్క అస్తిత్వముగూడ వినబడుచున్నది. ఈ విధమైన ఆక్షేపముద్వారా ఈ అధికరణము మొదలగుటవలన పూర్వాధికరణముతో ఈ అధికరణమునకు ఆక్షేప సంగతి అనవలయును.

విషయము:- బ్రహ్మభిన్నమైన ప్రపంచమును నిషేధముగావించి బ్రహ్మమే అద్వితీయ తత్త్వమని నిర్ణయించుట ఈ అధికరణమునకు విషయము.

సంశయము:- సేతుత్వము, ఉన్మానము (కొలత పరిమాణము) యొక్క ఉపదేశ శ్రుతులవలనను మరియు అద్వైత శ్రుతులవలనను బ్రహ్మభిన్నమైన తాత్త్విక వస్తువు కలదా లేదా అను సంశయము కలుగుచున్నది.

పూర్వపక్షము:- బ్రహ్మభిన్నమైన తాత్త్విక వస్తువు కలదు ఏలనన సేతుత్వ ఉన్మానాదిగాగల ఉపదేశములు కానవచ్చు చున్నవి. సంబన్ధము భిన్నవస్తువులలోనే కానవచ్చును. కాన బ్రహ్మము ద్వితీయముతో కూడినది (సద్వితీయము) కాని అద్వితీయముకాదు.

సిద్ధాన్తము:-బ్రహ్మములో సేతుత్వము ముఖ్యము కాదు. బ్రహ్మములో సేతుత్వమును స్వీకరించిన దానిలో మృత్-దారుమయత్వము అనగా (ఈ బ్రహ్మ సేతువుగూడ మట్టతోగాని కొయ్యతోగాని నిర్మింపబడినది) వంతెన కట్టుటకు కావసిన మట్టి మరియు కలప మొదలగునవి దానిలో నున్నవని ఒప్పుకొనవలయును. ఇచట విధారకత్వము అనగా ధరించుట అని చెప్పుట అభీష్టము. సద్వితీయత్వము ఉపాసన కొరకు చెప్పిరి. భేదవ్యపదేశము ఔపాధికము కాని పారమార్థికము కాదు. బ్రహ్మభిన్నమైన వస్తువులన్నియు ఉత్పత్తి-వినాశములు కలవి గాన పారమార్థికములు గావు. వానినన్నింటిని నిషేధము గావించి అద్వైతబ్రహ్మమును చెప్పుటలోనే శ్రుతి తాత్పర్యము.

213. వస్త్వన్యద్బ్రహ్మణో నో వా విద్యతే బ్రహ్మణోఽధికమ్ | సేతుత్వోన్మానవత్త్వాచ్చ సంబన్ధాద్భేదవత్త్వతః ||

214. ధారణాత్సేతుతోన్మానముపాస్త్యై భేదసంగతిః | ఉపాధ్యుద్భవనాశాభ్యాం నాన్యదన్య నిషేధతః ||

బ్రహ్మకన్న భిన్న వస్తువు కలదా లేదా? అను సందేహమునకు పూర్వపక్షి చెప్పినది. బ్రహ్మకన్న భిన్న వస్తువు కలదు ఎందులకనగా బ్రహ్మములో సేతుత్వము, ఉన్మానము (పరిమాణము), సంబన్ధము మరియు భిన్నత్వముల ఉపన్యాసము

కలదు గాన. దీనికి సిద్ధాన్తి జవాబు. జగత్తును ధరించుటవలన సేతుత్వము, ఉపాసన కొరకు పరిమాణమును చెప్పిరి. అటులనే ఉపాధియొక్క ఉత్పత్తివలన భేదము మరియు ఉపాధి నాశనము వలన సంబన్ధము చెప్పిరి.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

"నేతి నేతి" అను శ్రుతిద్వారా దృశ్య ప్రపంచమును నిషేదించి బ్రహ్మయొక్క వ్యవస్థ గావించినను బ్రహ్మకన్న భిన్న వస్తువు కలదు ఎందులకనగా సేతుత్వాది ఉపదేశము చెప్పుటవలన. "అథ య ఆత్మా స సేతుః" (ఛాం.8.4.1.) అనగా ' చెప్పిన లక్షణములు గల ఆత్మ సేతువు' అను శ్రుతిద్వారా ఆత్మలో సేతుత్వము ఉపదేశము గావించిరి. ఏవిధముగా లోకములో నదులు మొదలగునవి దాటుటకు వంతెన నిర్మింతురు దానిని దాటి ఆవలి గట్టు చేరుదురు అటులనే బ్రహ్మమును సేతువనిన దానిద్వారా జగత్తును దాటి వేరొక దేశమును జేరవలయును. ఆవిధముగనే ఉన్మానముయొక్క ఉపదేశముగూడ గలదు. "చతుష్పాద్ బ్రహ్మ". ఈ ఉన్మానము దిత్వీయత్వముగల ఆవు మొదలగు జన్తువులలో కనబడును గాని అద్వితీయ వస్తువులో కానరాదు, ఆ విధముగనే సమ్బన్ధ ఉపదేశము 'సతా సోమ్య' అను శ్రుతులలో నున్నది. సద్రూపమైన బ్రహ్మముకన్న భిన్న వస్తువు ఉన్నయెడల సమ్బన్ధము ఉత్పన్నమగును, ఆ విధముగనే 'ఆత్మా వా ఆరె ద్రష్టవ్యః' అను శ్రుతిద్వారా ద్రష్టృ-ద్రష్టవ్యరూపములో భేద ఉపదేశము చేసిరి. అందువల్ల బ్రహ్మ కన్న భిన్న వస్తువు సిద్ధమగు చున్నది.

ఈ ప్రకారముగా చెప్పిన పూర్వపక్షమునకు సిద్ధాన్తి చెప్పు సమాధానము. బ్రహ్మములో వినబడు సేతుత్వము ముఖ్యము కాదు ఎందులకనిన ఆవిధముగా స్వీకరించిన బ్రహ్మములో కలప-మన్ను మొదలగువాని ప్రసంగము వచ్చును. బ్రహ్మకన్న అభిన్నమైన మన ఆత్మలో కలప మన్ను మొదలగనవి లేవు కాదా? అందువల్ల ఈ సేతుత్వము దేనితో సాదృశ్యమనునది చెప్పవలయును. కాన ఇచట సేతుత్వమనగా విధారకత్వముతో సాదృశ్యమని స్వీకరించవలయును కాని సద్వితీయముతో కాదు ఏలనన "సేతుర్విధృతిః" అనిన 'ఈ బ్రహ్మము సేతువువలే ధరించునది' అని వినవచ్చుచున్నది. ఉపాసనా కాణ్డములో పఠిచుటవలన ఉన్మానము లేక పరిమాణము బ్రహ్మములో ఉపాసన గురించి చెప్పిరి కాని తత్త్వబోధ కొరకు కాదు. భేద ఉపదేశము ఉపాధితో కూడిన దగును ఎటులనిన ఘటాకాశము (కుండలోను ఆకాశము) మహాకాశములకు భిన్నత్వమును చెప్పినటుల. మరి సమ్బన్ధము యొక్క ఉపదేశము ఉపాధి నష్టమగుటవలన చెప్పబడును. ఏ విధముగా ననిన ఘటము నశించిన ఘటాకాశము మహాకాశముతో కలిసినదని గౌణప్రయోగము గావించెదరు. బ్రహ్మ భిన్న వస్తువును చెప్పు కారణములు సరికావు గాన 'ఏకమేవాద్వితీయమ్ బ్రహ్మ' అనుశ్రుతులద్వారా బ్రహ్మ భిన్న వస్తువు నిషేదించుటవలన ఒకే అద్వైతబ్రహ్మము సిద్ధము మరియు పూర్వపక్షి మతము అసంగతము.

349. పరమతః, సేతూన్మాన సమ్బన్ధభేదవ్యపదేశేభ్యః. 3.2.31.

సేతుత్వోన్మానాదుల ఉపదేశములద్వారా బ్రహ్మకన్న భిన్న వస్తువు కలదని తెలియుచున్నందువలన 'నేతి నేతి ' ఉపదేశముద్వారా ప్రపంచమును నిషేధించి బ్రహ్మమే మిగులునని చెప్పుట సరికాదు. ద్యుభ్వాద్యధికరణములో

సేతుత్వము  గౌణమని నిర్ణయించితి మని చెప్పుటగూడ సరికాదు ఎందులకనిన ఉన్మానాదుల ఉపదేశము ముఖ్యమగుటవలన దోషము ఉండనే ఉన్నది కాదా? అని ఇచట పూర్వ పక్షి సూత్రము మొదలగుచున్నది.

సూత్రార్థము:-  బ్రహ్మ కన్న భిన్న వస్తువు కలదు ఏలనన సేతుత్వము, ఉన్మానత్వము, పరిచ్ఛిన్నత్వము, సంస్పృష్టత్వము (లేక చుట్టుకొన బడి యుండుట) మరియు భేదము చెప్పుటవలన. "అథ య ఆత్మా సేతుః" అని సేతుత్వమును, "బ్రహ్మ చతుష్పాద్" అని ఉన్మానత్వమును, "ప్రాజ్ఞేన ఆత్మనా సంపరిష్వక్తః" అని జీవుని సంబన్ధము బ్రహ్మముతో చెప్పిరి, " య ఏషోఽన్తరక్షిణి" అని శ్రుతులలో భేద వ్యపదేశము కానవచ్చుటవలన బ్రహ్మ కన్న భిన్న వస్తువు కలదని సిద్ధమగు చున్నది.

ఉన్మానాది శ్రుతులవలన బ్రహ్మము  సవిశేషమనునది పూర్వపక్షము  సిద్ధాన్తములో అద్వైత శ్రుతులద్వారా బ్రహ్మ నిర్విశేష మని నిర్ణయము. బ్రహ్మ కన్న భిన్నమైన తాత్విక వస్తువు కలదా లేదా అను సందేహమునకు సూత్రములో 'పరమతః'  అను  శబ్దముద్వారా అన్య తాత్విక వస్తువు కాలదనును పూర్వవాది. ఎందులకనగా "అథ య ఆత్మా స సేతుః" (ఛాం.8.4.1.)  అనిన "ఎవడు ఆత్మతూపములో ఉన్నాడో వాడే సేతువు. సర్వమర్యాదలను ధరించువాడు". అను శ్రుతిద్వార సేతుత్వ ఉపదేశము కలదు. "తదేతద్బ్రహ్మ చతుష్పాద్"  అను శ్రుతిద్వారా పరిమాణము చెప్పబడుటచే బ్రహ్మ భిన్న తాత్విక వస్తువు  కలదని తెలియుచున్నది. "సతా సోమ్య! తదా సమ్పన్నో భవతి"  (ఛాం.6.8.1.)  ఈ శ్రుతిలో "హే సౌమ్యుడా! సుషుప్తి సమయములో జీవుడు సద్ బ్రహ్మముతో ఏకీభవించును" అనుచు శ్రుతి సద్ బ్రహ్మముతో జీవుని సమ్బన్ధము చెప్పుచున్నది. "అథ య ఏషోఽన్తరాదిత్యే హిరణ్మయః పురుషో దృష్యతే" (ఛాం. 1.6.6.) చెప్పిన ఛాందోగ్య శ్రుతిలో "నేత్రమునకు పరమేశ్వర రూపములో నున్న సూర్యుడు ఆధారము అని చెప్పిరి"  ఆధారము భిన్నమగుటవలన ఆధేయము భిన్నమగుచున్నది. గాన సేతుత్వాది ఉపదేశముల వలన బ్రహ్మభిన్న వస్తువుయొక్క అస్థిత్వము సిద్ధమగుచున్నది. అందువలన బ్రహ్మము సద్వితీయము కాని అద్వితీయముకాదు. ఇది పూర్వపక్షి మతము.

## 350. సామాన్యాత్తు.3.2.32.

సూత్రార్థము:- సూత్రములోనున్న 'తు' శబ్దముద్వారా పూర్వపక్షమును ఖండించు చున్నారు. ఏవిధముగా మట్టి కలపతో చేసిన వంతెనలో సేతు శబ్దము రూఢమో బ్రహ్మములో ఈ సేతు శబ్దము రూఢము కాదు కాని లౌకిక సేతువు జలవ్యవస్థ కావించును అటులనే పరబ్రహ్మము జగత్తుయొక్క మర్యాద వ్యవస్థ కావించును. ఈ విధమైన సాదృశ్యమువలన బ్రహ్మములో సేతుత్వ ఉపదేశము కావించిరి వాస్తవముగా కాదు అందువలన పూర్వపక్షమునకు అవకాశము లేదు.

సూత్రములోనున్న 'తు' శబ్దముద్వారా పూర్వపక్షమును నిరాకరించు చున్నారు. బ్రహ్మకన్న భిన్నవస్తువుయొక్క అస్తిత్వము లేదు  ఆ భిన్నవస్తువులయొక్క అస్తిత్వములో ఏ ప్రమాణము లేదు. సంపూర్ణ సంసార జన్మ-స్తితి-సంహారములకు కారణము బ్రహ్మమనియో శ్రుతులలో చెప్పిరి. మరియు కార్యము కారణముతో ఎల్లప్పుడు అభిన్నముగనే యుండును. ఒకవేళ బ్రహ్మ భిన్న వస్తువుల సిద్ధికై సేతుత్వాదుల ఉపదేశము గావించిరనిన  అటుల నిర్ణయించుట సరికాదు ఎందులకనగా సామాన్య సేతుత్వ సాదృశ్యమును గ్రహించి బ్రహ్మములో సేతు శబ్దమును

ప్రయోగించుటవలన ఏ విధమైన విరోధము లేదు. లోకములో మన్ను కలప మొదలగువాని కార్యము సేతురూపములో కాన వచ్చుచున్నది. ఇంతమాత్రముచే బ్రహ్మము మృదాదుల వికారరూముతో గూడిన సేతువని కల్పన గావించుట సరికాదు. కాని ఏవిధముగా నీటియొక్క మర్యాదవ్యవస్థ లౌకిక సేతువు గావించుచున్నదో ఆవిధముగనే సంసారముయొక్క మర్యాదలను నిర్ణయించునది కావున లోకప్రసిద్ధమైన సేతుత్వసమానతను తీసుకొని బ్రహ్మములో సేతుత్వ శబ్దమును ప్రయోగించిరి.

351. బుద్ధ్యర్థః పాదవత్.3.2.33.

సూత్రార్థము:- నిర్విశేష బ్రహ్మము బుద్ధిస్థమగుట కఠినముగాన మనస్సుతో ఉపాసన గావించుటకు వాగాదులలో పాదత్వ కల్పన గావించబడినది. ఏవిధముగాననిన 'చతుష్పాద్ బ్రహ్మ' అను మొదలగాగల శ్రుతులలో ఉన్మానము అనగా పరిచ్ఛిన్నత్వ కల్పన బ్రహ్మయొక్క ఉపాసనకొరకు గావించ బడినది కాని వాస్తవముగా కాదు. ఎందులకనగా నిర్విశేష బ్రహ్మము ఉపాధిలేకున్న మనస్సుతో సంబన్ధము కుదరదు, కాకున్న బుద్ధిస్థమగుట సంభవము కాదు. అందువలన ఉన్మానమనగా పరిచ్ఛిన్నత్వ కల్పన ముఖ్యముకాదు.

'చతుష్పాద్ బ్రహ్మ' ఈ శ్రుతిలో బ్రహ్మయొక్క ఉన్మాన ఉపదేశముగూడ బ్రహ్మభిన్న వస్తువు తాత్త్వికమని చెప్పుటకు కాదు. మరి ఎందులకనిన దీనికి సమాధానము సూత్రములోగల 'బుద్ధ్యర్థ' శబ్దముతో చెప్పిరి. అనగా బ్రహ్మములో నాలుగుపాదముల ఉన్మాన ఉపాదేశము ఉపాసన కొరకు చెప్పిరి. లేనిచో నిర్గుణ నిరాకారము లేక నిర్విశేష బ్రహ్మమును బుద్ధితో గ్రహించుట అత్యన్త కఠినమగును. ఉపాసన కొరకు వికారమును ఆధారముగావించి బ్రహ్మములో ఉన్మాన ఉపాదేశమే గాని ఉన్మాన ఉపదేశము ముఖ్యము కాదు. ఏ విధముగా బ్రహ్మ ప్రతీకమైన ఆకాశమును ధ్యానము గావించుటకు అగ్ని, వాయువు, ఆదిత్యుడు మరియు దిశలు అను నాలుగు పాదములు ఇంకను బ్రహ్మ ప్రతీకమైన మనస్సును చింతన చేయుటకు వాణి, ఘ్రాణము, చక్షువులు మరియు శ్రోత్రము అను నాలుగు పాదముల కల్పన గావించిరి. ఆలాగుననే ధ్యానము చేయుటకు ఉన్మాన ఉపదేశము గావించ బడినది.

352. స్థానవిశేషాత్ప్రకాశాదివత్. 3.2.34.

సూత్రార్థము:- ఉపాధులవలన కలిగిన బుధ్యాది భేదములు, ఉపాధుల పరహారమువలన ఉపశమించును. అదే ప్రాజ్ఞాభిమాని అయిన జీవునికి సుషుప్తిలో సమ్బన్ధము అందువలననే ఉపాధియొక్క అపేక్షద్వారా సమ్బన్ధ ఉపదేశము గౌణప్రయోగము. కన్నులు మరియు సూర్యునిలోగల పురుషునియొక్క భేద ఉపదేశము ఉపాధి విశేషమువలన కలుగుటచే గౌణోపదేశమే. ఏ విధముగా ఉపాధి సమ్బన్ధమువలన కలిగిన సూర్యుని ప్రకాశములు విడి-విడిగా కనిపించినను ఉపాధులు లేనచో సమ్బన్ధము విచ్ఛిన్నమగుచున్నవని ఉపదేశించిరి. ఆలాగుననే ప్రాజ్ఞాభిమాని అయిన జీవునికి సుషుప్తిలో సమ్బన్ధము కలదని చెప్పుట గౌణప్రయోగము.

సమ్బన్ధము మరియు భిన్నత్వముల ఉపదేశము బ్రహ్మములో పారమార్థిక భిన్న వస్తువు కలదని చెప్పుటకు సాధనమని భావించవలయును. అను పూర్వపక్షమును సరికాదనును సిద్ధాన్తి ఎందులకనగా స్వప్న -సుషుప్తాదుల

స్థానవిశేషమువలన జీవేశ్వరుల భేద ఉపదేశము చెప్పిరి. బుధ్యాది ఉపాధులను స్థానవిశేషము లందురు. ఈ స్థాన విశేషముద్వారా ఉత్పన్నమైన భిన్నత్వము ఉపాధుల పరిహారమువలన ఉపశమించును. ఉపాధులున్న సమయములో జీవుని సమ్బన్ధము పరమేశ్వరునితో ఔపచారికము లేక గౌణమే కాని ముఖ్యము కాదు. ఆవిధముగనే కన్నులలో మరియు ఆదిత్యునిలో చెప్పిన భేదవ్యవహారము ఆ యా స్థాన విశేషములద్వారా చెప్పబడినందువలన ఔపచారికము గాని ఆత్మ స్వరూపాపేక్షద్వారా కాదు. ఏవిధముగా సూర్యాదుల ప్రకాశములో కానవచ్చు భిన్నత్వము ఉపాధుల నాశనముద్వారా నశించును అందువలన ఉపాధులవలననే భేదవ్యవహారము కలుగుచున్నది. అటలనే జీవేశ్వరుల భేధము ఉపాధివలన. ఉపాధులు శాన్తించిన భిన్నత్వము దానంతట అదే శాన్తించును.

353. ఉపపత్తేశ్చ. 3.2.35.

సూత్రార్థము:- సుషుప్తిలో జీవ-బ్రహ్మల సమ్బన్ధము ముఖ్యమని స్వీకరించ జాలము, ఎందులకనగా 'స్వమపీతో భవతి' అను శ్రుతివాక్యముద్వారా తనస్వరూపముతోనే సమ్బన్ధముకలదని లేక సుషుప్తి కాలములో సస్వరూపమును పొందునని చెప్పబడెను. ఈ విధముగనే వందలకొలది శ్రుతులతో విరోధము కలుగుటవలన భేధము ముఖ్యము కాదు.

యుక్తులవలన జీవ-బ్రహ్మముల సమబన్ధము సుషుప్తిలో ముఖ్యమనుట సంభవముకాదు ఎందులకనగా 'స్వమపీతో భవతి' అనగా 'సుషుప్తి కాలములో సస్వరూపమును పొందునని' ఛాందోగ్య శ్రుతిలో చెప్పుటవలన. ఈ శ్రుతిలో జీవునియొక్క నిత్య స్వరూప ప్రాప్తినే సమ్బన్ధ శబ్దముతో ఉపదేశము గావించిరి. ఏ విధముగా మనిషికి పట్టణమునకుగల సమబన్ధమువలె జీవునికి బ్రహ్మమునకు సుషుప్తిలో సమ్బన్ధము కలుగునని చెప్పుట సరికాదు మరియు సంభవము కాదు. ఆలాగుననే జీవేశ్వరుల భేదము ముఖ్యము కాదు ఎందులకనగా అనేక శ్రుతులలో చెప్పిన ఒకే చైతన్యత్వముతో విరోధము కలుగును లేక పరమేశ్వరుడొక్కడేనని చెప్పు శ్రుతి "ఏకమేవాద్వితీయమ్" వాక్యముతో విరోధము కలుగును. చెప్పినరీతిగా శ్రుతి యుక్తులద్వారా వ్యవస్థ ఉండుటవలన జీవేశ్వరుల భేధము మరియు సమ్బన్ధముల ఉపదేశము ముఖ్యము కాదు.

ఈ విధముగా సేతుత్వాదుల ద్వారా చెప్పిన భేద హేతువులను నిరాకరించి బ్రహ్మములో అద్వితీయత్వమును సాధించుటకు ముందు సూత్రము చెప్పు చున్నారు.

354. తథాన్యప్రతిషేధాత్. 3.2.36.

సూత్రార్థము:- ఏ విధముగా సేతుత్వాది ఉపదేశముల పూర్వపరములను విమర్శించిన పూర్వపక్ష హేతువు లేవియు నిలువవు అనగా వాని ప్రతిపత్తి (లాభము) లేదు. ఆవిధముగనే" "ఆత్మైవాధస్తాత్" అను శ్రుతి వాక్యములద్వారా అన్య వస్తువు నిషేధించుటవలన బ్రహ్మము అద్వితీయమేనను అర్థము తేటతెల్ల మగు చున్నది.

మరియు "ఆత్మైవాధస్తాత్" (ఛాం.7.25.1.) అనగా 'ఆ ఈశ్వరుడే క్రింద పైన అన్ని వేపులలో నున్నాడు', "అహమేవాధస్తాద్" (ఛాం.7.25.1.) అనగా 'నేనే క్రింద పైన అన్ని వేపులలో నున్నాను', "ఆత్మైవాధ్ధస్తాత్" (ఛాం.7.25.2.)

అనగా 'ఆత్మయే క్రింద పైన అన్ని వేపులలో నున్నది' అని ఈ ఛాందోగ్య శ్రుతులవలన బ్రహ్మకన్న భిన్న వస్తువుని నిషేదించుటవలన దాని కన్న భిన్న వస్తువులలో తాత్వికత్వము ఉండజాలదు అని తెలియు చున్నది. కాన బ్రహ్మము అద్వితీయ మనునది సిద్ధమగు చున్నది.

ఈ ప్రకారము సేతుత్వాది శ్రుతులను ఔపచారికాముగా అన్వయించుటచేతను ఇతర పదార్థ నిషేధమును చూపుట మాత్రముచే బ్రహ్మము అద్వితీయమనునది సిద్ధమైనను బ్రహ్మములో సర్వవ్యాపకత్వము సంభవింపదు అను ప్రశ్నకు సమాధానము ముందు సూత్రములో చెప్పిరి.

355. అనేన సర్వగతత్వమాయామశబ్దాదిభ్యః. 3.2.37.

సూత్రార్థము:- బ్రహ్మములో సర్వవ్యాపకత్వ విషయమున కొంచమైనను సంశయించుటకు అవకాశము లేదు. సేతుత్వాది శ్రుతులను ఔపచారికాముగా అన్వయించుటచేతను ఇతర పదార్థనిషేధమును చూపుటమాత్రముచే బ్రహ్మము అద్వితీయమనునది సిద్ధమైనది. అంతేగాక "ఆకాశవత్ సర్వగతశ్చ నిత్యః" (ఛాం.3.14.3.) అనిన 'ఆకాశము వలే సర్వవ్యాపకుడు మరియు నాశరహితుడు' అను వ్యాపకత్వవాచక శబ్దాది హేతువులద్వారా బ్రహ్మము సర్వగతమనునది సిద్ధమగుచున్నది. శబ్దాది అనుచోట గల ఆది శబ్దముద్వారా "నిత్యః సర్వగతః స్థాణుః" (భ.గీ.2.24.) అనిన 'బ్రహ్మము నిత్యము సర్వవ్యాపకము స్థిరము' మొదలగు వాక్యములు గ్రహించవలయును.

సేతుత్వాది ఉపదేశమువలన మరియు వేరోక వస్తువు లేదని చెప్పుటద్వారానే బ్రహ్మములో సర్వవ్యాపకత్వము సిద్ధమగును. లేనిచో సేతుత్వ ఉపదేశము ముఖ్యమని స్వీకరించి వేరోక వస్తువు ఉన్నదనిన బ్రహ్మములో పరిచ్ఛిన్నత్వము వచ్చును. 'ఆయామ' మనగా వ్యాపకత్వము చెప్పు శ్రుతులద్వారా బ్రహ్మములో సర్వవ్యాపకత్వము సిద్ధమగును. "యావాన్వా అయమాకాశస్తావానేషోఽన్తర్-హృదయ ఆకాశః" (ఛాం.8.1.3.) అనగా ' ఈ వెలుపల నుండు ఆకాశమునకు ఎంత ప్రమాణము గలదో హృదయాకాశము కూడ అంత పరిమాణము కలదియే', "జ్యాయాన్దివః" (ఛాం.3.14.3) అనిన 'అది సర్గముకన్నను పెద్దది', అని ఛాందోగ్యోపనిషత్తులో చెప్పిరి మరియు "నిత్యః సర్వగతః" అనిన 'పరమాత్మ నిత్యము మరియు సర్వగతము' (గీత.2.24) అని గీతలో చెప్పిన వ్యాపకత్వ వాచకమైన ఈ 'ఆయామ' శబ్దాదులద్వారా బ్రహ్మములో సర్వవ్యాపకత్వము మరియు అద్వితీయత్వము సిద్ధమగుచున్నది. ఇంతేగాక బ్రహ్మము కన్న భిన్న వస్తువు కల్పితమనిగూడ నిశ్చయ మయినది.

# 101. ఫలాధికరణము.

సంగతి:- బ్రహ్మభిన్న మైన సంపూర్ణ జగత్తును నిషేధము గావించి నిర్విశేష బ్రహ్మముయొక్క బోధ క్రిందటి అధికరణములో కావించిరి. ఈ స్థితిలో ఆ బ్రహ్మములో ఫలదాతృత్వము ఉండదు అను ఆక్షేప సంగతి ద్వారా ఈ అధికరణము మొదలైనది.

విషయము:- బ్రహ్మములో ఫలదాతృత్వమును నిశ్చయించుట ఈ అధికరణముయొక్క విచారణీయ విషయము.

సంశయము:- మూడు రకముల కర్మ ఫలములు జీవుడు  సంసారములో అనుభవించుట చూడబడు చున్నది. ఈ ఫలములను కర్మ స్వతంత్రముగా  ఇచ్చుచున్నదా లేక ఈశ్వరునిద్వారా ఫలము లభించుచున్నదా. అనునది సంశయము.

పూర్వపక్షము:- శుభాశుభ కర్మలు అదృష్టముద్వారా స్వతంత్రముగానే  ఫలితము నిచ్చుటలో సమర్ధములు ఇట్టి స్థితిలో ఈశ్వరుని కార్మఫలదాత అని స్వీకరించుట యుక్మియుక్తము కాదు.

సిద్ధాన్తి:- అచేతనమైన కర్మ లేక దానినుండి  ఉత్పన్నమగు అపూర్వము ఫలితములు ఇవ్వ జాలదు. సేవాదుల కర్మఫలము లోకములో అచేతనముద్వారా పొందుట చూడబడుటలేదు కాని సేవాదులద్వారా పూజించబడిన రాజాది పురుషులు ఫలితములను ఇచ్చుచున్నారని స్వీకరించిరి. శాస్త్రముద్వారా సిద్ధమగు ఈశ్వరుని కల్పితమని చెప్పుటగూడ సరికాదు. కనుక మంచికర్మల ఫలితములు మరియు చెడ్డకర్మల ఫలితములు ఈశ్వరుడే ఇచ్చుచున్నాడు. కర్మను అపేక్షించి ఈశ్వరుడు ఫలితములిచ్చు చున్నాడనుటవలన వానిలో వైషమ్యాది దోషముల కల్పనము చేయలేము.

ఈ విధముగా ముందు చెప్పిన నాలుగు అధికరణములద్వారా 'త్వం' పదార్ధ పరిశీలనము గావించిరి. ఆ తరువాత నాలుగు అధికరణములద్వారా బ్రహ్మముయొక్క నిరూపణము, దాని యందు నిషేధవిషయత్వము, అద్వితీయత్వము మరియు వ్యవహారములో ఫలదాతృత్వము మొదలగునవి చెప్పి 'తత్' పదార్ధ పరిశోధనము గావించిరి.

215. కర్మైవ ఫలదం యద్వా కర్మారాధిత ఈశ్వరః | అపూర్వాన్తరద్వారా కర్మణః ఫలదాతృతా||

216. అచేతనాత్ ఫలాసూతే శాస్త్రీయాత్పూజితేశ్వరాత్ | కాలాన్తరే ఫలోత్పత్తేర్నా ఽపూర్వకాల్పనా ||

ఫలములనిచ్చువాడు ఈశ్వరుడా లేక అపూర్వమా అను సందేహమునకు పూర్వపక్షి అపూర్వమే ఫలితముల నిచ్చును కాని ఈశ్వరడు కాదనును. సిద్ధాన్తి చెప్పునదేమనగా లోకములో అచేతనము కర్మ ఫలితముల నిచ్చుట చూడబడుటలేదు.  అందువల్ల కర్మలద్వారా అరాధించబడి, శాస్త్రప్రమాణసిద్ధమైన ఈశ్వరుడే కాలాన్తరములో ఫలదాత అగును అందువల్లనే అపూర్వ కల్పన అయుక్తము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

కర్మ క్షణికమైనను అపూర్వముద్వారా కాలాన్తరములో ఫలము నిచ్చును కాన ఈశ్వర కల్పన వ్యర్థము అనును పూర్వపక్షి. సిద్ధాన్తి జవాబు.  అచేతనమైన కర్మ మరియు అపూర్వముల భిన్నత్వమువలన నియమితరూపములో ఫలముల నిచ్చుటకు వానిలో శక్తి లేదు ఎందులకనగా లోకములో సేవాది కర్మలఫలము చైతన్య పురుషుని ద్వారా లభించుచున్నది కాని జడమువలన కాదు. రాజును సేవించిన పురుషునికి రాజుద్వారా ఫలితము అందుచున్నటుల ఆరాధించిబడిన ఈశ్వరునిద్వారా ఫలితములు దక్కునని స్వీకరించవలయును. మరియు ఈశ్వరుని కల్పన వ్యర్థమనునది శాస్త్రసిద్ధమగుటవలన ఈశ్వర కల్పనలో గౌరవ దోషముగూడ లేదు. కారణమేమనగా "ఏష హ్యేవ సాధు కర్మ కారయతి తం యమేభ్యో లోకేభ్య ఉన్నినీషతే, ఏష ఉ ఏవాసాధుకర్మ కారయతి తం యమధో నినీషతే" అను శ్రుతులద్వారా

పరమేశ్వరుడే కర్మలను చేయించువాడు మరియు కర్మ ఫలములను ఇచ్చువాడనియు కూడ చెప్పబడినందువలన. ఈశ్వరునిలోనే ధర్మాధర్మముల ఫలదాతృత్వము మరియు కర్మకారయితృత్వము శ్రుతి చెప్పుచున్నది. జీవునిద్వారా చేయబడిన కర్మల నపేక్షించి ఈశ్వరుడే ఫలితముల నిచ్చును. ఈశ్వరుని ప్రమాణికత శ్రుతులద్వారా సిద్ధమైనదనిన శ్రుతులలో వినబడని అపూర్వముయొక్క కల్పనలో గౌరవ దోషమున్నది. అందువల్ల ఈశ్వరుడే ఫలదాత అనునది సిద్ధమైనది.

బ్రహ్మకన్న భిన్న వస్తువును నిషేదించి, నిర్గుణ, నిరాకార, నిర్విశేష బ్రహ్మమును ప్రతిపాదించిరి. ఆ ఈశ్వరునిలో ఫలదాతృత్వము లేదను ఆక్షేపమువలన ఈ అధికరణము ప్రారంభించిరి అను సంగతి పూర్వమే చెప్పబడినది.

356. ఫలమత ఉపపత్తేః. 3.2.38.

సూత్రార్థము:- ఈశ్వరునిద్వారానే అన్ని ప్రాణులకు ఫలితములు లభించుచున్నవి ఏలనన కర్మము క్షణికమగుటవలన దానిద్వారా ఫలితములు కలుగుట అసమ్భవము. అందువల్ల ఈశ్వరునియందే కర్మఫలదాతృము కలదని చెప్పుట ఉచితము.

తత్ పద వాచ్యార్థమైన ఈశ్వరునిలో ఫలదాతృత్వాభావము పూర్వపక్షి మతము. కాని సిద్ధాన్తి ఈశ్వరునిలో ఫలదాతృత్వము కలదనును. సుఖము, దుఃఖము మరియు సుఖ-దుఃఖములు కలిసిన కర్మఫలములు జీవుడు సంసారములో అనుభవించును. ఈ ఫలితములు కర్మముద్వారానే కలుగుచున్నవా లేక ఈశ్వరుని ద్వారా కలుగుచున్నవా అని సంశయము కలుగగా పూర్వపక్షి పైనుదరించున మూడు రకముల ఫలితములు కర్మద్వారానే కలుగుచున్న వనును. ఈ మూడు రకముల ఫలితములు ఈశ్వరునిద్వారా జీవునకు లభ్యమగుచున్నవనును సిద్ధాన్తి. ఎందులకనగా ప్రతిక్షణము నశించు కర్మ కాలాన్తరములో ఫలితములివ్వ జాలదు. గాన ఈశ్వరునిలోనే ఫలదాతృత్వము సిద్ధమగు చున్నది.

357. శ్రుతత్వాచ్చ. 3.2.39.

సూత్రార్థము:- ఇంకను "స వా ఏష మహానజ ఆత్మాఽన్నాదో వసుదానః" (బృ.4.4.24.) అనగా 'సర్వవ్యాపకుడును ఉత్పత్తి-వినాశశూన్యుడును అగునాత్మయే అందరికి అన్నము ఒసంగువాడు; మరియు ధనమునిచ్చువాడు'. మొదలగు శ్రుతులద్వారా ఈశ్వరునిలోనే ఫలదాతృత్వము వినబడుచున్నది. ఈశ్వరుడే ఫలదాత అని అర్థము.

కేవలము యుక్తులద్వారానే ఈశ్వరునిలో ఫలదాతృత్వము కల్పన గావించవలయునని కాదు గాని బృహదారణ్యక శ్రుతిలోగూడ ఈశ్వరుడే ఫలదాత అని ఈ క్రింద చెప్పుచున్నారు. "స వా ఏష మహానజ ఆత్మాఽన్నాదో వసుదానః" (బృ.4.4.24.) అనగా 'సర్వవ్యాపకుడును ఉత్పత్తి-వినాశశూన్యుడును అగునాత్మయే అందరికి అన్నము ఒసంగువాడు; మరియు ధనమునిచ్చువాడు'.

358. ధర్మం జైమినిరత ఏవ. 3.2.40.

సూత్రార్థము:- ఏ శ్రుతి మరియు యుక్తిద్వారా సిద్ధాంస్తి ఈశ్వరుడు ఫలదాత అని స్వీకరించుచున్నడో ఆ శ్రుతి యుక్తిద్వారానే జైమిని ఆచార్యలు ధర్మమును యాగాదుల ఫలదాతయని స్వీకరించు చున్నాడు.

సిద్ధాంస్తి వలనే జైమిని ఆచార్యులు శ్రుతులు మరియు యుక్తుద్వారా కర్మఫలదాత ధర్మమని స్వీకరించును. ఎందులకనగా "జ్యోతిష్టోమెన స్వర్గకామో యజేత" అనిన 'స్వర్గము కోరువాడు జ్యోతిష్టోమయాగము నాచరించి స్వర్గమును భావించవలయును' ఈ విధి శ్రుతి విషయమైన యాగములో స్వర్గోత్పాదకత్వమును స్వీకరించును. లేనిచో ఈ వేదోపదేశము వ్యర్థమగును. మీరు ప్రతిక్షణము నశించు యాగాదులను ఫలదాతయని ఎట్లు స్వీకరించిరి? అనిన అటుల అడుగుట సరికాదనును, ఎందులకనగా శ్రుతి ప్రమాణముద్వారా యాగాదుల ఉత్తరావస్థలో అపూర్వ రూపమైన వ్యాపారము సిద్ధమగుటవలన యాగాది ధర్మములకు అపూర్వమే ఫలదాతయని కల్పన చేయవలయును. ఏలనన అవిచిత్రమైన కారణమునకు విచిత్రమైన కార్యమగుట సరికాదు. అందువలన విచిత్రమైన ఫలితములకు ఈశ్వరుడు స్వతంత్రముగా పలదాతయని స్వీకరించిన వానిలో (వైషమ్య నైర్ఘృణ్య) విషమత్వంబును దయాహీనత్వమను దోషములు వచ్చును. ఈశ్వరుడు కర్మసహితుడై ఫలదాత అనిన పుణ్యాత్ములపై ప్రీతియు పాపాత్ములపై ద్వేషంబును కలిగియుండునని చెప్పవలయును. ఈశ్వరునిలో విషమత్వంబును దయాహీనత్వమను ప్రసంగము వచ్చుట వలన ధర్మాది అనుష్ఠానములు వ్యర్థమగును. గాన ధర్మమువలననే జీవునికి కర్మ ఫలితము కలుగునని జైమిని ఆచార్యలు స్వీకరించిరి.

356. పూర్వం తు బాదరాయణో హేతువ్యపదేశాత్. 3.2.41.

సూత్రార్థము:- సూత్రములోనున్న 'తు' శబ్దము జైమిని మతమును నిరాకరించుటకు. బాదరాయణుడను పేరుగల ఆచార్యులు పూర్వము అనగా 3.2.39 సూత్రములో చెప్పిన ఈశ్వరునే ఫలదాతయని స్వీకరించును. ఎందులకనగా "ఏష హ్యేవ సాధు కర్మ కారయతి" అనిన 'ఎవరి ఉన్నతి కోరునో వారిచే ఈశ్వరుడు మంచి కర్మలు చేయించును' "అన్నాదో వసుదానః" 'అందరికి అన్నము ఒసంగువాడు; మరియు ధనమునిచ్చువాడు' మరియు "లభతే చ తతః కామాన్" అనిన 'శ్రద్ధతో చేసిన దేవతల పూజానంతరము వాని ఫలితములను గూడ ఒసంగు వాడను నేనే'. ఈ శ్రుతులు మరియు స్మృతి-ద్వారా ఈశ్వరుడు ధర్మాధర్మముల ఫలదాతయనునది నిశ్చయమగుచున్నది.

సూత్రములోనున్న 'తు' శబ్దము పూర్వము చెప్పిన సంశయమును నిరాకరించుటకు చెప్పిరి. బాదరాయణుడను పేరుగల ఆచార్యులు పూర్వము అనగా 3.2.39 సూత్రములో చెప్పిన ఈశ్వరుని ఫలదాతయని స్వీకరించును మరియు ఆతడు జీవుల కర్మముల నపేక్షించి ఫలితముల నొసంగును కాని స్వతంత్రముగా కర్మగాని అపూర్వముగాని కర్మ ఫలదాత కాదు అనును. "ఏష హ్యేవ సాధు కర్మ కారయతి తం యమేభ్యో లోకేభ్య ఉన్నినీషతే, ఏష ఉ ఏవాసాధుకర్మ కారయతి తం యమధో నినీషతే" అనిన 'ఆ ఈశ్వరుడే ఈ లోకములో ఉన్నతిని కలుగజేయు వ్యక్తి ద్వారా మంచి కర్మలను చేయించును మరియు ఆతడే ఎవరిని అధోగతికి పంపించదలచనో వానిచే చెడు కర్మలు చేయించును'. "అన్నాదో

వసుదానః” అనిన ‘అందరికి అన్నము ఒసంగువాడు; మరియు ధనమునిచ్చువాడు’ అను శ్రుతులు మరియు చెప్పబోవు స్మృతియు ఈశ్వరుని ఫలదాత అని చెప్పుచున్నవి. స్మృతి “తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహం” అనగా ‘ ఏ దేవతను పూజించునో వాని వానికి ఆదేవతయందే స్థిరమైన శ్రద్ధను నేనే ఇచ్చుచున్నాను.’ ధర్మాధర్మములకు కారణమగుటచే మరియు వాని ఫలదాతగాన ఈశ్వరునే కర్మ ఫలదాత అనిరి.

ఈ విధముగా ఈ పాదములో పూర్వార్ధముద్వారా ‘త్వం’ పదార్థ శోధన గావించి ఉత్తరార్థముద్వారా నిర్విశేష, స్వయం-ప్రకాశము, నిషేదించుటకు యోగ్యముకానిది, అద్వైత పరమేశ్వరుని శాఖాచంద్ర న్యాయముద్వారా కర్మలు చేయించువాడు మరియు కర్మఫలదాతరూపములో ఉపలక్షితమైన ‘తత్’ పదార్థ బ్రహ్మమును సంశోధన గావించిరి.

**బ్రహ్మసూత్రహృదయములో మూడవ అధ్యాయములోని**

**ద్వితీయ పాదము యొక్క సంకలనము సమాప్తము.**

**తృతీయాధ్యాయము లోని తృతీయ పాదము**

# 102. సర్వవేదాన్తప్రత్యయాధికరణము.

**క్రిందటి పాదములో మహావాక్యార్థజ్ఞానము కొరకు తత్-త్వం పదములయొక్క అర్థము నిర్ణయించబడినది. ఇపుడు వాక్యర్థమును నిర్ణయించుటకు హేతు-హేతుమద్భావ సంగతి వలన తృతీయ పాదము ప్రారంభమయినది. ఈ పాదములో నిర్గుణబ్రహ్మను గురించి అనేకశాఖలలో చెప్పిన వాక్యముల పునరుక్తిని ఉపసంహారము గావించెదరు. ప్రసంగవశమున వచ్చిన సగుణ ఉపాసనగురించి చెప్పిన అనేక గుణముల ఉపసంహారము మరియు కొన్నిచోట్ల అనుపసంహారముగూడ చెప్పెదరు. దాని వల్ల పొందిన చిత్తఏకాగ్రతవల్ల నిర్గుబ్రహ్మముయొక్క వాక్యర్థ జ్ఞానమునకు అవసరమైన సామర్థ్యము ఉత్పన్నమగును.**

**సంగతి:- పాదము భిన్నమగుటవలన పూర్వ అధికరణముతో ఈ అధికరణమునకు సంగతి అవసరములేదు.**

**విషయ:- బృహదారణ్యకములో మరియు ఛాందోగ్యములో చెప్పిన రీతిగా పంచాగ్నివిద్యను గురించి విచారము ఈ అధికరణములో గావించెదరు. ఛాందోగ్యములో వచ్చిన ఉపాసనలకు కౌథుమము మరియు బృహదారణ్యకములో చెప్పిన ఉపాసనలకు వాజసనేయకము అందురు. పంచాగ్నివిద్యకన్న భిన్నమైన ఉపాసనలకు గూడ ఇదే నామధేయము.**

**సంశయము:- అన్న ఉపనిషత్తులలో చెప్పబడిన పంచాగ్నివిద్య భిన్నములా లేక ఒకటియేనా?**

**పూర్వపక్షము:- కౌథుమము అను నామము మరియు శిరోవ్రతాది ధర్మములు భిన్నమగుటవలన ఉపాసనలు భిన్నములు.**

సిద్ధాన్తము:- శాఖలు భిన్నమైనను విద్యారూపము మరియు ఫలము అభిన్నమగుటవలన ఈ విధమైన ఉపాసనలు అభిన్నమని స్వీకరించవలయును. ఛాందోగ్యములో మరియు బృహదారణ్యకములో "యో హ వై జ్యేష్ఠం చ శ్రేష్ఠం చ వేద" ఈ విధముగా విధి ఒకటిగా కానవచ్చు చున్నది పంచాగ్ని రూపముగూడ సమానమే మరియు జ్యేష్ఠత్వము, శ్రేష్ఠత్వములగు పొందు ఫలముల యొక్క రూపముగూడ ఒకటిగనే యున్నది. అందువలన వాని ఉపాసనలు అభిన్నము. శిరోవ్రతాది ధర్మము స్వాధ్యాయమునకు అంగము కాని ఉపాసనాంగము కాదు. అభేదమువలన మరియు భేదము సిద్ధముకానందువలన శాఖాభేదమువలన ఈ విధమైన ఉపాసనలు భిన్న-భిన్నములు కావు.

217. సర్వవేదేష్వనేకత్వముపాస్తేరథవైకతా | అనేకత్వం కౌథుమాదినామద్ధర్మవిభేదతః ||

218. విధిరూపఫలైకత్వాదేకత్వం నామ న శ్రుతం | శిరోవ్రతాఖ్యధర్మస్తు స్వాధ్యాయే స్యాన్న వేదనే ||

అన్నివేదాన్త వాక్యములలో ఉపాసనలు అనేకములా లేక ఒకే ఉపాసనయా. దీనికి పూర్వపక్షి చెప్పు సమాధానము.

వేదాన్తములో ఉపాసనలు అనేకములు ఎందులకనగా కౌథుమమాది నామధేయములు మరియు శిరోవ్రతాది ధర్మములు భిన్న-భిన్నముగా నున్నవి. సిద్ధాన్తి చెప్పునది ఏమనగా అన్ని వేదాన్తములలో ఉపాసన ఒకటేనని ఎందులకనగా విధి, రూపము మరియు ఫలము ఒకటే అగుటవలన ఇంకను నామము శ్రుతిప్రతిపాదితముకాదు. శిరోవ్రతాది ధర్మములు స్వాధ్యాయమునకు అంగములే కాని ఉపసానంగములు కావు. అందువలననే ఉపాసన అనేకవిధములుకాదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య :

ఛాందోగ్యములో మరియు బృహదారణ్యకములో పంచాగ్ని విద్య వినవచ్చుచున్నది. కౌథుమమని ఛాన్దోగ్యములో ఉపాసన నామధేయమయ మరియు వాజసేయకమని బృహదారణ్యకములో నామధేయమగుటవలన ఉపాసనము ఒకటికాదు. ఈ రీతినే అన్య ఉపాసనములకు జోడించవలయును. ధర్మ భిన్నముగూడ ఉపాసన భిన్నమని చెప్పుటకు కారణము. మరియు "శిరోవ్రతము" అను పేరుతో "తేషామేవైతాం బ్రహ్మవిద్యా వదేత్" అనగా శిరోవ్రతము ఆచరించువారికే బ్రహ్మ విద్య చెప్పవలయును అను వ్రతముగూడ వినబడుచున్నది. శిరోవ్రతమనగా వేదవ్రతవిశేషమని అర్థము. దానిని అథర్వణశాఖాధ్యయనము చేయువారికై విధించబడినది కాని ఇతర శాఖాధ్యయనము చేయువారికి విధి కాదు. గాన శాఖాభేధమువలన ఉపాసన భిన్నమని తప్పక స్వీకరించవలయును.

సిద్ధాన్తి సమాధానము. శాఖాభేదమున్నను విధి మొదలగు వానిలో భేదములేనందున ఉపాసనము భిన్నముకాదు, ఎందులకనగా 'యో హ వై జ్యేష్ఠం చ' అను మొదలుగాగల వాక్యములు ఛాన్దోగ్యములో ఏవిధముగా ప్రాణవిధిని గురించి చెప్పిరో ఆ ప్రకారమే బృహదారణ్యకములోగూడ చెప్పిరి. ఆలాగుననే ఆకాశము, మేఘముల ఉపాసన మరియు పంచాగ్ని విద్య మొదలగువాని స్వరూపము ఈ రెండు శాఖలలో సమానముగా చెప్పబడినవి. "జ్యేష్ఠశ్చ హ వై శ్రేష్ఠశ్చ" అని ప్రాణోపాసన ఫలము ఈ రెండు శాఖలలో సమానముగా చెప్పబడినవి. కౌథుమమని ఛాన్దోగ్యములో ఉపాసన నామధేయమయ మరియు వాజసేయకమని బృహదారణ్యకములో నామధేయమని పూర్వపక్షి చెప్పిన ఉదాహరణ శ్రుతి

అభిమతము గాదు కాని అధ్యయనము చేయువారు ఆ యా శాఖలను నిర్మించిన వారి పేరుతో వ్యవహరించుచున్నారు. శిరోవ్రతలక్షణమను ధర్మభేదమును చెప్పితిరి అదిగూడ అధ్యయన విషయమేగాని ఉపాసన విషయముగాదు ఎందులకనగా "నైతదచీర్ణవ్రతోఽధీతే" అను వాక్యములు అధ్యయన ధర్మములని స్వీకరించిరి. ఈ వాక్యములద్వారా ఐక్యహేతువులుండుట వలనను భేదహేతువులు లేకుండవలనను శాఖాభేదములలోగల ఉపాసనల భేదము లేదు.

360. సర్వవేదాన్తప్రత్యయం చోదనాద్యవిశేషాత్. 3.3.1.

సూత్రార్థము:- విధింపబడిన శాండిల్యాది ఉపాసనలు భిన్నములుగావు. విధులు సమానమగుటవలన. సూత్రములోనున్న ఆది పదముద్వారా సంయోగము, రూపము మరియు నామముగూడ గ్రహించవలయును. ఏ విధముగా అన్ని శాఖలలో "అగ్నిహోత్రం జుహుయాత్" అను విధి సామాన్య అగ్నిహోత్రము ఒకేకర్మ, ఆలాగుననే బృహదారణ్యకములో మరియు ఛాందోగ్యములో చెప్పిన "యో హ వై జ్యేష్ఠశ్చ" అను మొదలుగాగల విధి వాక్యములలో విశేషము లేనందున ఒకే ప్రాణవిద్య అన్ని శాఖలలో చెప్పిరి.

శాఖాభేదమున్నను ఒకే అగ్నిహోత్రమునకు 'జుహుయాత్' అను క్రియద్వారా పురుష వ్యాపారము హోమము చేయవలయునని సమానముగా అన్ని శాఖలలో విధించబడినది మరియు ఫలసంయోగముగూడ సమానమే. అందువలన శాఖాభేదమున్నను విధి ఫలముల భేదము లేనందువలన నిత్యాగ్నిహోత్రము అన్ని శాఖలలో ఒకటే భిన్నము కాదు. అటులనే "యో హ వై జ్యేష్ఠం చ శ్రేష్ఠం చ వేద" అనగా " ఏ ఉపాసకుడు ప్రాణమును జ్యేష్ఠము మరియు శ్రేష్ఠమని ఉపాసించునో ఆతడు తన జాతిలో జ్యేష్ఠుడు మరియు శ్రేష్ఠుడు అగును" (బృ 6.1.1. ఛాం.5.1.1.) ఈ విధమైన బృహదారణ్యక ఛాందోగ్య ఉపనిషత్తులలో పురుషునియొక్క వ్యాపారము మరియు ఫలసంబన్ధము సమానమగుటవలన ఈ రెండు స్థలములలో ప్రాణము యొక్క ఉపాసన ఒకటే గాని వేరుకాదు. ఆలాగుననే యాగద్రవ్యము మరియు దేవత సమానమగు జ్యేష్ఠాది గుణములతో నుండుటవలన ఉపాసనరూపము రెండు స్థలములలో ఒకటే. ప్రాణోపాసనము అను నామధేయము సమానమే. అటులనే పంచాగ్నివిద్యా, వైశ్వానరవిద్యా, శాణ్డిల్యవిద్యా అను ఉపాసనలలోగూడ విధి మొదలగునవి సమానమగుటవలన శాఖలు భిన్నమైనను ఉపాసన ఒకటేనని తెలిసికొనవలయును. నామరూపములు వేరగుటవలన ఉపాసనభిన్నమని ప్రశ్నించెదవేమో అటులనుట సరికాదు. ఎందులకనగా ప్రథమ కాండములో "న నామ్నా స్యాదచోదనాభిధానత్వాద్" అనగా ' నామము భిన్నమైన క్రియలో భేదముకలుగదు కాని విధి భిన్నమైన భేదముకలుగును'. అని సమాధానము చెప్పి నీ ప్రశ్నకు పరిహారము గావించిరి.

361. భేదాన్నేతి చేన్నైకస్యామపి. 3.3.2.

సూత్రార్థము:- రూపభేదమువలన ఆమీక్షాయాగము మరియు వాజినయాగము భిన్నములు. (వేడి పాలలో పెరుగువేసిన ఆ పాలు విరిగి రెండు భాగములగును. వానిలో గట్టి భాగమును ఆమీక్ష అందురు. దానితో చేయు యాగము ఆమీక్షాయాగము. మిగిలిన నీటిని వాజినమందురు దానితో చేయు యాగమును వాజినయాగ మందురు.) ఆవిధముగనే రెండుశాఖలలో రూపభేదముండుటవలన పంచాగ్ని విద్య భిన్నము ఒకటికాదు. ఇటుల ప్రశ్నించుట సరికాదు ఎందులకనగా ఒకే విద్యలో

రూపభేదముండవచ్చును. ఎటులననగా అతిరాత్రమను యాగములో షోడశి పాత్ర గ్రహణము అగ్రహణము ఉన్నను అతిరాత్రయాగము భిన్నముకాదు. అటులనే ఆరవ అగ్నియొక్క అస్థిత్వము దాని అభావమువలన పంచాగ్ని విద్యలో భేదములేదు.

బృహదరణ్యకములో పంచాగ్ని విద్యా ప్రసంగములో "తస్యాగ్నిరేవాగ్నిర్భవతి" అనగా 'ఆ మరణించిన పురషుని దహించుటకు లోకములో ప్రసిద్ధమైన అగ్నియో అగ్ని' అను వాక్యముద్వారా లోకములో ప్రసిద్ధమైన అగ్నినిగూడ ఉపాస్యముగా చెప్పిరి. కాని ఛాందోగ్యములో "అథ హ య ఏతానేవం పంచాగ్నీన్ వేద" అనగా ' ఏ ఉపాసకుడైన ఈ ఐదు అగ్నులను ఈ విధముగా ఉపాసన చేయునో' అను వాక్యముద్వారా ఐదు అగ్నులద్వారానే పంచాగ్ని విద్యను ఉపసంహారము గావించిరి. అందువలన ఒకచోట పంచాగ్ని ఉపాస్యమని వేరొకచోట లోకమలో ప్రసిద్ధమైన ఆరవ అగ్నిగూడ ఉపాస్యమని చెప్పిరి. ఈ విధముగా ఉపాస్య భేదమువలన విద్యగూడ భిన్నము. ఏ విధముగా హోమద్రవ్యములు దేవత భిన్నమైన యాగాదిక్రియలలో భేదమును స్వీకరించిరి ఆవిధముగనే ఉపాస్య స్వరూపము భిన్నమైన ఉపాసనగూడ భిన్నమని స్వీకరించవలయునని పూర్వపక్షి మతము. సిద్ధాన్తి అది సరికాదనును ఎందులకనగా ఉపాసనలో ఈవిధమైన గుణములలో భిన్నత్వము సంభవము. ఇంతమాత్రముచే ఉపాసనలో భిన్నత్వమును అనుమానించరాదు ఎందులకనగా ద్యులోకము మొదలగు ఐదు అగ్నులయొక్క ప్రత్యభిజ్ఞ (అదే ఇది అని జ్ఞానము) రెండు స్థలములలో కలుగుచున్నది. ఒకచొట షష్ట అగ్నిహోత్రము- యొక్క పాఠము గలదు వేరొకచోట దాని పాఠము లేదుకదా అందువలన ఆరవ అగ్ని భావాబావములవలన ఉపాసన భిన్నమని స్వీకరించవలయును కదా అందువేమో అటులనుట సరికాదు. అతిరాత్రి యాగములో షోడశీపాత్రయొక్క గ్రహణాగ్రహణములు చెప్పినను యాగము భిన్నముకాదు. ఆధ్యాత్మిక పంచాగ్నివిద్య రెండుశాఖలలోను ఒకటిగనే కానవచ్చుచున్నది. కేవలము బృహదారణ్యకములో ఆరవ అగ్నికి అనువాదము కలదు కాని విధికాదు అందువల్ల కొంచెముగూడ దోషములేదు. ఈవిధముగనే అన్యత్ర ప్రాణ సంవాదములో అధిక గుణములను ఉపసంహారము గావించిరి అయినను విరోధము లేదు. అందువల్ల వేద్యరాశిలో ఎక్కువ అభిన్నత ఉండుటవలన విద్య ఒకటియే.

అథర్వవేదములోనున్న ముండకోపనిషత్తులో బ్రహ్మవిద్యకు శిరోవ్రతాదులు చెప్పిరి మిగిలిన స్థలములలో ఆ వ్రతమును చెప్పలేదు అందువలన ధర్మము భిన్నమగుటవలన విద్య భిన్నమనిన ఈ ప్రశ్నకు క్రింది సూత్రముద్వారా సమాధానమును చెప్పుచున్నారు.

362. స్వాధ్యాయస్య తథాత్వేన హి సమాచారేఽధికారాచ్చ సవవచ్చ తన్నియమః . 3.3.3.

సూత్రార్థము:- శిరోవ్రతాది ధర్మములు స్వాధ్యాయమునకు అంగము ఎందులకనగా వేదవ్రతములను ఉపదేశించు గ్రంథములో ఆథర్వణశాఖను అవలంబించువారికి శిరోవ్రతమునుగూడ స్వాధ్యాయమునకు అంగముగా స్వీకరించిరి. మరియు అధికారముద్వారా శిరోవ్రతము స్వాధ్యాయమునకు అంగముగనే కానవచ్చుచున్నది. ఎందులకనగా "నైతదచీర్ణవ్రతోఽధీతే" అనగా 'ఎవరు శిరోవ్రతమును అవలంబించరో వారు ఈ గ్రంథమును అధ్యయనము చేయరాదు' ఈ

సూత్రములో నున్న (న ఏతద్-నైతద్) 'ఏతద్' శబ్దము అధికారవిషయము. 'స్వాధికారాచ్చ' అనుచోట చెప్పిన చకారముద్వారా 'అధీత' శబ్దమును గ్రహించుటవలన శిరోవ్రతము అధ్యయనముయొక్క అంగమని తెలియుచున్నది. పై సూత్రములో చెప్పిన 'సవవచ్చ' అనునది ఉదాహరణము. ఏవిధముగా శతౌదన పర్యంన్తము సౌర్యాది ఏడు హోమములలో ఇతరవేదములలో చెప్పిన త్రేతాగ్ని సంబన్ధముండదు కాని అథర్వణములో చెప్పిన ఏకాగ్ని సంబన్ధముండుటవలన ఆథర్వణశాఖను అవలంబించువారికి మాత్రమే శిరోవ్రత నియమమును చెప్పిరి. అందువలన అన్నిప్రదేశములలో విద్య ఒకేరూపము.

శిరోవ్రతాది స్వాధ్యాయమునకు అంగమేగాని బ్రహ్మవిద్యాంగముకాదు ఎందులకనగా వేదవ్రతములను ఉపదేశించు సూత్ర-గ్రంథములో ఆథర్వణశాఖను అవలంబించువారికి శిరోవ్రతమునుగూడ స్వాధ్యాయమునకు అంగముగా స్వీకరించిరి

"నైతదచీర్ణవ్రతోఽధీతే" అనగా 'ఎవరు శిరోవ్రతమును అవలంబించరో వారు ఈ గ్రంథమును అధ్యయనము చేయరాదు' ఈ ప్రకారము అధికారి విషయమగుటవలన స్వశాఖీయ ఉపనిషదధ్యయనమునకు శిరోవ్రతాది అంగరూపమని నిశ్చయించడమయినది. సూత్రములో "సవవచ్చతన్నియమః" అను శబ్దము ఉదాహరణమునకు చెప్పిరి. శతౌదనము వరకు సౌర్యాది ఏడు యాగముల పాఠము రెండు ఆథర్వణిక శాఖలలో కలదు. ఈ పాఠముల సమ్బన్ధము రెండు శాఖలలో ఉండుటవలన ఏకర్షి అను పేరుగల ఆథర్వణికాగ్నిలోగూడ పఠించెదరు. శఖాన్తరములో చెప్పిన త్రేతాగ్నితో (దక్షిణాగ్ని, గార్హపత్యాగ్ని మరియు ఆహవనీయాగ్నులను త్రేతాగ్ని అందురు) సమ్బన్ధము లేనందువలన పఠించరు అనిన ఆథర్వణికశాఖ వారికే ఈ నియమము. ఆ విధముగనే శిరోవ్రతాది ధర్మముగూడ ముణ్డక అధ్యయనములోనే నియమించిరి ఇతర శా ఖాధ్యయనములో కాదు. అందువలన శిరోవ్రతాది ధర్మ భేదమువలన విద్యలో భేదములేదు అన్ని స్థలములలో విద్యైకత్వము సిద్ధమైనది.

## 363. దర్శయతి చ. 3.3.4.

సూత్రార్థము:- "సర్వే వేదా యత్పదమామనన్తి" (కఠ.2.15 ) అనగా 'అన్ని వేదాన్తవాక్యములు ఏ బ్రహ్మ పదమును ప్రశంసించుచున్నవో" మొదలగు వాక్యములు తెలిసికొనవలసిన నిర్గుణబ్రహ్మమును గురించి ఒకేవిధముగా చెప్పుచున్నవి. ఆలాగుననే వాజసనేయక బృహదారణ్యకములో వైశ్వానర సగుణ బ్రహ్మవిద్యయందు ప్రాదేశమాత్రముద్వారా చెప్పిన బ్రహ్మ విషయములో " ఆ పరమేశ్వరునే నేనని ఉపాసన చేయుదురో" అని చెప్పిరి. ఆ బ్రహ్మమునే ఛాన్దోగ్యములో "యస్త్వేతమేవ ప్రాదేశమాత్రమభివిమానమాత్మానం వైశ్వానరమ్" ( ఛాం.5.18.1 ) అనగా "ఎవరు ప్రాదేశమాత్ర వైశ్వానర బ్రహ్మను నేనని ఉపాసన చేయుదురో" అని పరామర్శించిరి. వైశ్వానరోపాసనము అన్ని ప్రదేశములలో ఒకేవిధముగా చెప్పిరి. ఏ విధముగా సగుణ బ్రహ్మము మరియు నిర్గుణ బ్రహ్మము ఒకటియే అటులనే అన్ని ప్రదేశములలో శ్రుతిద్వారా చెప్పుటవలన విద్యలలో ఏకత్వమే కలదు. అలాగుననే శస్త్రవిశేషరూపమగు ఉక్థాదులు ఒకటియే గనుక వాని ఉపాసనలుగూడ ఒకటియే. ఉక్థాదుల సమభివ్యాహారము (శేషశేషివాచకపదములను ఒకచోటచెప్పుట. ఒక చోట చెప్పిన గుణములను ఉపాసన కొరకు వేరొక చోట చెప్పుట. ) వలన మిగిలిన ఉపాసనలతో పరస్పరము అభిన్నము.

“సర్వే వేదా యత్పదమామనన్తి” (కఠ.2.15 ) అనగా ‘అన్ని వేదాన్తవాక్యములు ఏ బ్రహ్మ పదమును ప్రశంసించుచున్నవో’ మొదలగాగల వేదవాక్యము అన్ని ఉపనిషత్తులలో తెలిసికొనదగిన నిర్గుణ బ్రహ్మయొక్క ఏకత్వమును ఉపదేశించుచు ఉపాసనల ఏకత్వమును ఉపదేశించుచున్నది. ఆలాగుననే వాజసనేయక బృహదారణ్యకములో వైశ్వానర సగుణ బ్రహ్మవిద్యయందు ప్రాదేశమాత్రముద్వారా చెప్పిన బ్రహ్మ విషయములో “ ఆ పరమేశ్వరునే నేనని ఉపాసన చేయుదురో” అని చెప్పిరి. దానినే ఛాందోగ్యములో ప్రతిష్ఠితమైనదిగా భావించి చెప్పిరి. “యస్త్వేతమేవ ప్రదేశమాత్రమభివిమానమాత్మానం వైశ్వానరమ్” ( 5.18.1) అని పరామర్శించిరి. అందువల్ల వైశ్వానర విద్య అభిన్నమని సిద్ధమగుచున్నది. ఈవిధముగా అన్ని వేదాన్తములలో ఉపాసనలయందు చెప్పిన స్తోత్రవిశేషములైన ఉక్థాదులను ( అనగా ఋగ్వేద ప్రసిద్ధమగు పూజార్థమైన ఒకానొక శాస్త్రము) ఇతర స్థలములలో విధానమునకు గ్రహించినను ఉపాసనలన్నిటియందు ఏకత్వము కలదు.

# 103. ఉపసంహారాధికరణము.

సంగతి:- అన్ని శాఖలలోఉపాసన అభిన్నమగుటవలన ఫలముగూడ అభిన్నమే అగును, ఈ విషయమును చెప్పుటకు ఫలఫలీభావము సంగతి వలన ఈ అధికరణము ఆరంభించిరి.

విషయము:- ఉపాసనలలోగల భేదాభేదముల విచారము ఈ అధికరణమునకు విషయము.

సంశయము:- అన్ని స్థలములలో ఉపాసన ఏకత్వము సిద్ధమగుటవలన ఒకశాఖలో చెప్పిన ఉపాసన గుణములు వేరొక శాఖలో చెప్పిన ఉపాసనలో ఉపసంహారము చేయవచ్చునా చేయరాదా? అనునది సంశయము.

పూర్వపక్షము:- వాజసనేయశాఖ బృహదారణ్యకములోని ప్రాణోపసనలో “రేతో హోచ్చక్రామ” అని రేత గుణమును అధికముగా చెప్పిరి. ఛాందోగ్యములోగల ప్రణోపాసనలో ఈ రెతోగుణము చెప్పకపోవుటవలన అచట ఉపసంహార యోగ్యముకాదు ఎందులకనగా ఉపాసనకు ఉపకారము స్వశాఖాలో చెప్పిన గుణములద్వారానే కలుగునుకదా.

సిద్ధాన్తము:- ఒక శాఖలో చెప్పిన గుణములు వేరొక శాఖలో వినబడకపోయినను పరస్పరము గుణముల ఉపసంహారము చేయవలయును. ఏ విధముగా అగ్నిహోత్రాది అనుష్ఠానములో శాఖాన్తరములో చెప్పిన గుణముల ఉపసంహారము చేయుదురో ఆలాగుననే ఉపాసనలోగూడ చేయవలయును. స్వ-స్వశాఖలో చెప్పిన గుణములద్వారా ఎట్లు ఉపాసనకు ఉపకారమగునో ఆలాగుననే శాఖాన్తరీయ గుణముల చింతనద్వారా ఉపాసనకు ఉపకారము కలుగును.

వైయాసికన్యాయమాలా:-

219. ఏకోపాస్తావనాహార్యా ఆహార్యా వా గుణాః శ్రుతౌ | అనుక్తత్వాదనాహార్యా ఉపకారః శ్రుతైర్గుణైః ||

220. శ్రుతత్వాదన్యశాఖాయామాహార్యా అగ్నిహోత్రవత్ | విశిష్టావిద్యోపకారః స్వశాఖోక్తగుణైః సమః ||

ఒక ఉపాసనలో వినబడు గుణములను అన్యత్ర ఉపసంహారము చేయవలయునా లేదా అను సందేహము కలుగగా పూర్వపక్షిచెప్పినది. గుణముల ఉపసంహారము చేయరాదు ఎందులకనగా వానిని శ్రుతిలో చెప్పలేదు అంతేగాక వినబడు

గుణములచేతనే ఉపాసనకు ఉపకారము కలుగును. దానికి సిద్ధాన్తి ఇచ్చిన సమాధానము. అన్య శాఖలో చెప్పిన గుణములను అగ్నిహోత్ర ఉపాసనలో ఉపసంహారము చేయవలయును. ఇతర విశిష్ట ఉపాసనలలో చెప్పిన గుణముల ఉపకారము స్వశాఖలో చెప్పిన గుణములకు సమానము అందువలన అన్యత్ర వినబడు గుణముల ఉపసంహారము చేయవలయును.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

వాజసనేయశాఖ బృహదారణ్యకములోని ప్రాణోపసనలో “రేతో హోచ్చక్రామ” అని రేత గుణమును అధికముగా చెప్పిరి. ఛాందోగ్యములోగల ప్రణోపాసనలో ఈ రెతోగుణము చెప్పకపోవుటవలన అచట ఉపసంహార యోగ్యముకాదు ఎందులకనగా ఉపాసనకు ఉపకారము ఇచట వినబడు ప్రాణ, వాగాదుల గుణములద్వారానే కలుగును అని పూర్వపక్షి మతము.

సిద్ధాన్తి మతము. ఈ శాఖలలో ఆ గుణములు చెప్పకపోయినను ఇతర శాఖలలో వినబడుటవలన వాని ఉపసంహారము చేయవలయును ఎందులకనగా అగ్నిహోత్ర ఉపాసనలో ఉపసంహారము చూడబడు చున్నది. తన తన శాఖలో చెప్పిన గుణముల వలననే ఉపాకారము కలుగును గాన అన్య శాఖగుణములను ఉపసంహారము చేయుట నిరర్థకమని ఆలోచించుట సరికాదు. ‘కార్మాధిక్యమువలన ఫలము అధికమగునను’ న్యాయమువలన తన శాఖలో చెప్పిన గుణములకు సమానముగా అన్య శాఖలో చెప్పిన గుణములు ఉపకారము కలిగించును. గాన గుణములను ఉపసంహారము కావించవలయును.

### 364. ఉపసంహారోఽర్థాభేదాద్విధిశేషవత్సమానే చ. 3.3.5.

సూత్రార్థము:- ఏ విధముగా అన్ని ప్రదేశములలో అగ్నిహోత్ర ఏకత్వమును చెప్పిరి అందువలన మిగిలిన గుణముల ఉపసంహారము కలుగును ఆ విధముగనే ఉపాసనలలోగూడ గుణముల ఉపసంహారము చేయవలయును ఎందులకనగా ఉపాస్య గుణములద్వారా పొందు ఫలము ఒకటియే గాన.

ఒకచోట పఠించిన ఉపాసనా గుణములను మరియొకచోట ఉపసంహారము చేయవలయునని స్వీకరించుటయే యుక్తము ఎందులకనగా అన్ని స్థలములలో ప్రయోజనము ఒకటియే. ఉపాస్య గుణములద్వారా పొందబడు ఉపాసనా ఫలము అన్ని స్థలములలో అభిన్నము. సూత్రములోనున్న విధిశేషత్వమను పదము ఉదాహరణకు చెప్పిరి. అగ్నిహోత్రము ఒకటేనని ఏకత్వము నిశ్చమయిన తరువాత దాని ధర్మ విశేషములను సమానముగా అన్ని స్థలములలో ఉపసంహారము గావింతురు. ఆలాగుననే వేదాన్తములో చెప్పిన ఉపాసలు ఒకటేనని నిశ్చయమయిన తరువాత ఉపాస్య గుణముల ఉపసంహారము చేయవలయునని స్వీకరించుటయే ఉచితము. ఈ ప్రయోజన సూత్రము యొక్క విస్తారము “సర్వాభేదాత్” అను అధికరణము నుండి మొదలిడి ముందు అధికరణములలో చేయబడెను.

# 104. అన్యథాత్వాధికరణము.

సంగతి:- విద్యాదుల సమానత వలన ఉపాసనలలో ఏకత్వము మొదట చెప్పిరి. అటులనే "ఉద్గీథవిద్యా" అను పేరు సమానముగా నుండుటవలనగూడ ఉపాసనలో అభేదము సిద్ధమగును. అందువలన పూర్వాధికరణముతోపాటు ఈ అధికరణమునకు దృష్టాన్త సంగతి కారణమగుటవలన ఈ అధికరణము మొదలిడిరి.

విషయము:- ఉద్గీథవిద్యయొక్క భేదాభేదముల విచారము ఈ అధికరణమునకు విచారణీయ విషయము.

సంశయము:- ఛాందోగ్యములో మరియు బృహదారణ్యకములో చెప్పబడిన ఉద్గీథవిద్య భిన్నమా లేక అభిన్నమా అని సంశయము.

పూర్వపక్షము:- ఉద్గీథనామము మరియు దేవాసుర సంగ్రామము మొదలగు ఆఖ్యానముల సమానతను చూచి ఈ రెండు స్థలములలో ఉద్గీథవిద్య ఒకటేనని స్వీకరించవలయును.

సిద్ధాన్తము:- ఛాందోగ్యములో ఉద్గీథ అవయవమగు ఓంకారమును ప్రాణదృష్టితో ఉపాసనచేయుటకు చెప్పిరి. కాని బృహదారణ్యకములో సంపూర్ణ ఉద్గీథ భక్తి యొక్క ఉపాసనను చెప్పిరి. అందువల్ల వేద్యతత్వము వేరగుటవలన ఉపాసన భిన్నము. సంగ్రామాదుల అభిన్నత ఉపాసనల అభేదము చెప్పుటకు ఉపయొగమగు కారణముకాదు ఎందులకనగా అది స్తుతి మాత్రమే. అందువలన రెండు స్థానములలో ఉద్గీథ విద్య భిన్నము ఒకటికాదు.

221. ఏకా భిన్నాఽథవోద్గీథవిద్యా ఛాన్దోగ్యకాణ్వయోః | ఏకాస్యాన్నామసామాన్యాత్సంగ్రామాదిసమత్వతః ||

222. ఉద్గీథావయవోంకార ఉద్గాతేత్యుభయోర్భిదా | వేద్యభేదేఽర్థవాదాదిసామ్యమత్రాఽప్రయోజకమ్ ||

ఛాందోగ్యములో మరియు బృహదారణ్యకములో చెప్పిన ఉద్గీథవిద్య భిన్నమా లేక అభిన్నమా అను సందేహమునకు పూర్వపక్షి చెప్పినది. ఉద్గీథవిద్య రెండు స్థానములలో ఒకటే ఎందులకనగా సమాన నామము కలదు మరియు సంగ్రామాదుల వర్ణనగూడ సమానమే. సిద్ధాన్తి సమాధానము. ఉద్గీథవిద్య రెండు స్థానములలో భిన్నము ఎందులకనగా. ఉద్గీథావయవోంకార ఉపాసన ఛాందోగ్యములో మరియు సంపూర్ణ ఉద్గీత భక్తికి ఉద్గాతయొక్క వాగాదుల ప్రేరకము ప్రాణమని బృహదారణ్యకములో ఉపాసనల వేద్యము భిన్నమగుటవలన. సంగ్రామాదుల అర్థవాద సమానత విద్యల ఏకత్వము చెప్పుటకు అప్రయోజక కారణము.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

ఉద్గీథవిద్య అని ఛాందోగ్యములో మరియు బృహదారణ్యకములో నామము ఒకటగుటవలన రెండు స్థానములలో ఉపాసన ఒకటే. నామము శ్రుతి సమ్మతము కాకపోయినను సంగ్రామాదులు శ్రుతిలో చెప్పబడినవి అవి ఛాందోగ్యములో మరియు బృహదారణ్యకములో సమానము. ఎందులకనగా ఛాందోగ్యములో సాత్విక ఇంద్రియవృత్తులకు మరియు తామసిక ఇంద్రియవృత్తులకు క్రమముగా దేవాసురభావమును స్వీకరించి వాని సంగ్రామమును చెప్పి వాగాదులకు అధిష్ఠానములైన

దేవతల ఓటమి చెప్పి ప్రాణదేవత విజయమును చెప్పిరి. ఇదంతయు బృహదారణ్యకములోగూడ ఆలాగుననే చెప్పిరి. అందువల్ల విద్య రెండు స్థలములో ఒకటే. ఈవిధముగా చెప్పిన పూర్వపక్షమునకు సిద్ధాన్తి ఉద్గీథవిద్య భిన్నమని చెప్పెను ఎందులకనగా తెలిసికోవలసిన వేద్యస్వరూపము భిన్న భిన్నమగుటవలన. ఛాందోగ్యములో సామభాగవిశేషమయిన ఉద్గీథ-అవయవమయిన ఓంకారమును ప్రాణదృష్టితో ఉపాసనా విధానమును చెప్పిరి. కాణ్వశాఖ బృహదారణ్యకములో సంపూర్ణ ఉద్గీథభక్తికి ఉద్గాతయొక్క వాగాదుల ప్రేరకము ప్రాణమని చెప్పి దానిని ఉద్గాతృదృష్టితో ఉపాసనమును విధించిరి. అందువల్ల తెలిసికోవలసిన వేద్యస్వరూపము భిన్న భిన్నమగుటవలన ఉపాసన భిన్నము. సంగ్రామాదుల సమానత్వము ఉపాసన ఏకత్వమును చెప్పుటకు సాధకము కాదు. ఈవిషయము ఇంతకు పూర్వములోగూడ అర్థవాదమాత్రమేనని చెప్పబడినది. కాన పై రెండుస్థానములలో ఉద్గీథ విద్య భిన్నమనునది సిద్ధమైనది.

### 365. అన్యథాత్వం శబ్దాదితి చేన్నావిశేషాత్. 3.3.6.

సూత్రార్థము:- "త్వం న ఉద్గాయ" అనగా "ప్రాణమును నీవు మా ఉద్గాత సమ్బన్ధమయిన కర్మ చేయుము", "తముద్గీత-ముపాసాంచక్రిరే" అనగా "ప్రాణమును ఉద్గీథరూపములో ఉపాసన గావించిరి". ఈ వాక్యములలో ఉద్గీథను కర్త రూపములో మరియు ఉద్గీథను కర్మరూపములో ఉపాసనమును చెప్పిరి. ఉపాసనను ప్రతిపాదించు శబ్దములద్వారా భిన్నశాఖలలో చెప్పుటవలన సజాతీయ ఉపాసనలలో భేదమేఉన్నదని శంకించుట సరికాదు. ఎందులకనగా దేవాసురుల సంగ్రామమును ఉపక్రమము గావించి అసురుల పరాజయముతో ఉపసంహారము గావించిరి అనునది రెండు శాఖలలో సమానమే అందువల్ల విద్యలో భేదములేదు కాని ఒకేవిద్యయని భావము.

ఈ సూత్రములో గుణముల ఉపసంహారమని పూర్వపక్షి చెప్పిన విద్య భిన్నమగుటవలన గుణముల ఉపసంహారము సరికాదనును సిద్ధాన్తి. "అథ హేమమాసన్యం ప్రాణమూచుస్త్వం న ఉద్గాయేతి తథేతి తేభ్య ఏష ప్రాణ ఉద్గాయత్" అనగా "ఆ తరువాత ముఖములోనున్న ఈ ప్రాణముతో ఇంద్రియములు చెప్పినదేమనగా నీవు మా కొరకు ఉద్గానము చేయుము. అపుడు ముఖ్య ప్రాణము సరేనని ఇంద్రియముల కొరకు ఉద్గానము చేసెను". ( బృ. 1.3.7. ) అని వాజసనేయక శాఖలో వినవచ్చుచున్నది. "అథ హ య ముఖ్యః ప్రాణస్తముద్గీథముపాసాంచక్రిరే" అనగా "ఆ తరువాత ఏది ముఖ్యప్రణమైయున్నదో దానినే ఉద్గీతముగా స్వీకరించి ఇంద్రియములు ఉపాసన చేసెను" (ఛాం.1.2.7.) అని ఛాందోగ్యములో గూడ ఫలము విబడుచున్నది. ఈ రెండు స్థలములలో ముఖ్య ప్రాణముయొక్క స్తుతిద్వారా దాని ఉపాసనా విధానము నిశ్చయమగు చున్నది. ఈ రెండు ఉపాసనలు భిన్నమా కాదా అనుసంశయము రాగా పూర్వవాది ఉపాసనలు భిన్నమనును. ఒకవేళ వాజసనేయకములో "త్వం న ఉద్గాయ" అని ప్రాణమును ఉద్గీత కర్తగా చెప్పిరి మరి "తముద్గీథముపాసాంచక్రిరే" అనగా ఇంద్రియములు ప్రాణమును ఉద్గీథ మని భావించి ఉపాసన చేసెను. ఈ ఛాందోగ్య శ్రుతిలో ఉద్గీథరూపములో నున్న ప్రాణమును ఉపాసన కర్మగా చెప్పిరి అందువల్ల శబ్ద భేదముండుట వలన ఉపాసన ఒకటి కాదు అనెదవేమో అటులనుట సరికాదు. ఎందులకనగా శబ్ద భేదమున్నను ఎక్కువగా అభిన్నత ప్రతీతమగుచున్నది. ఎటులనిన దేవాసురుల యుద్ధమును ఉపక్రమించి అసురుల ఓటమి దేవతల గెలుపు ప్రాణసంవాద వర్ణన, అసురుల విధ్వంసము మొదలగు ప్రసంగములో రెండు స్థానములలో సమానము. గాన ఛాందోగ్యములోగూడ ప్రాణ కర్తృత్వము లక్షితమగుటవలన

ఉపాసనములో ఏకత్వమే గలదు. ఈవిధముగా పూర్వవాది చెప్పినదానికి ముందు సూత్రములో సిద్ధాన్తి సమాధాన మిచ్చుచున్నాడు.

366. న వా ప్రకరణభేదాత్పరోవరీయస్త్వాదివత్. 3.3.7.

సూత్రార్థము:- విద్య ఒకటికాదు ఎందులకనగా "ఓమిత్యేదక్షరమ్" ఈ మంత్రముద్వారా ఉగ్గీథావయవ ఓంకారములో ప్రాణదృష్టిని సామవేదములో ఉపదేశించిరి. బృహదారణ్యకములో "త్వం న ఉద్గాయ" అను మంత్రముద్వారా సంపూర్ణ సామభక్తి ప్రాణరూపములో చెప్పిరి. అందువల్ల ఉపక్రమములో భేదమున్నది. ఏ విధముగా కన్నులు, ఆదిత్యునిలోగల హిరణ్యశ్మశ్రుత్వాది (బంగారు వర్ణముగల మీసములున్న) మొదలగుగాగల విశిష్ట గుణములుగల ఉద్గీథ ఉపాసనకన్న,"ఏష పరోవరీయానుద్గీథ" అను శ్రుతిలో పరోవరీయస్త్వగుణవిశేషములుగల ఉద్గీథయొక్క ఉపాసన భిన్నము. ఆలాగుననే ప్రకృతములో విద్య భిన్నమని తెలిసికొనవలయును.

ఆ రెండు శ్రుతులలో ఉపాసన ఒకటికాదు ఎందులకనగా ఈ రెండు శ్రుతుల ప్రారమ్భము భిన్న భిన్న ప్రకారములుగా చేయబడెను. "ఓమిత్యేతదక్షరముద్గీథముపాసీత" అనగా "ఓమ్ అను ఈ వర్ణాత్మక ఉద్గీథయొక్క ఉపాసన చేయవలయును" (ఛాం.1.1.1.) అని ఉపక్రమించి "ప్రాణముద్గీథముపాసాంచక్రిరే" అనగా "ఆ దేవతలు నాసికలో నున్న ప్రాణరూపముగా ఉద్గీథని ఉపాసన చేసిరి". (1.2.2.) ఈ వాక్యముద్వారా ఛాందోగ్యములో ఉద్గీథయొక్క అవయవమయిన ఓం కారములో ప్రాణదృష్టి ఉపాసన ఉపదేశము గావించిరి. బృహదారణ్యకములో ఉద్గీథ శబ్దముద్వారా దాని అవయవమయిన ఓం కారమును స్వీకరించుటకు కారణములేనందున సంపూర్ణ సామభక్తిని ఉద్గీథ శబ్దముతో చెప్పిరి. మరియు "త్వం న ఉద్గాయ" అనగా "నీవు మా గురించి ఉద్గానము చేయుము". ఈ వాక్యమయద్వారా ఆ సామభక్తికి కర్త ఉద్గాతా ఋుత్విక్కును ప్రాణరూపముగా చెప్పిరి. ఈ విధముగా పై రెండు శ్రుతులలో ఉపక్రమ భేదమున్నది. ప్రాణములో ఉద్గాన కర్తృత్వము అసమ్భవమని చెప్పాదవేమో అటుల చెప్పుట సరికాదు. ఎందులకనగా ఉద్గీథభావమునకు సమానముగా ఉద్గాన కర్తృత్వముగూడ ఉపాసనకొరకు ఉపదేశించబడినది మరియు ప్రాణముయొక్క సామర్థ్యము తెలియుచున్నది. ఈ విషయములో "పరోవరీయస్త్వాదివత్" అను వాక్యము ద్వారా దృష్టాన్తము ఇయ్యబడినది. ఏ విధముగా పరమాత్మదృష్టి అన్ని స్థలములలో సమానమైనను "ఆకాశో హ్యేవైభ్యో జ్యాయానాకాశః పరాయణమ్" అనగా "పృథివీ మొదలగువానికన్న ఆకాశము పెద్దది. అందువల్ల ఆకాశమే వీనికి శ్రేష్ఠమైన ఆశ్రయము" (ఛాం.1.9.1) "స ఏష పరోవరీయా-నుద్గీథః" అనగా "ఆ ఈ ఉద్గీథ సర్వశేష్ఠము" (ఛాం.1.9.12) ఈ విధముగా పరోవరీయస్త్వాది విశేష గుణములుగల ఉద్గీథ ఉపాసనకన్న భిన్నము ఆదిత్యునిలోగల హిరణ్యశ్మశ్రుత్వాది (బంగారు వర్ణముగల మీసములున్న) మొదలగుగాగల విశిష్ట గుణములుగల ఉద్గీథ ఉపాసన. ఉపక్రమము భిన్నమగుటవలన ఉపాసనగూడ భిన్నము ఈ రెండు ఉపాసనలలో చెప్పిన అన్యోన్య గుణముల ఉపసంహారము సరికాదు. అ విధముగానే అన్ని స్థలములలో స్వీకరించవలయును.

367. సంజ్ఞాతశ్చేత్తదుక్తమస్తి తు తదపి. 3.3.8.

సూత్రార్థము:- రెండు స్థలములలో 'ఉద్గీథవిద్య' అను ఒకే పేరుండుటవలన ఉపాసన భిన్నము కాదను శంక సరికాదు ఎందులకనగా విద్య భిన్నమా లేక అభిన్నమా అను విషయములో 'న వా ప్రకరణభేదాత్' అను పై సూత్రములో సిద్ధాన్త మతము చెప్పడమైనది. భిన్నరూపముగా అగ్నిహోత్రము, దర్శము, పూర్ణిమ అని ప్రసిద్ధమైనను అవి అన్నియు ఒకే కాఠక గ్రంథములోనివి. కాన వానికి 'కాఠక' మని ఒకేరకమైన నామము కలదు.

'ఉద్గీథవిద్య' అను ఒకే సంజ్ఞవలన రెండు ఉపాసనలు ఒకటేననిన అటులనుట సరికాదు ఎందులకనగా "న వా ప్రకరణభేదాత్పరోవరీయస్త్వాదివత్" అను సూత్రములో సమాధానము ఇవ్వబడెను. అందువలన ప్రసిద్ధమైన భేదమున్నను వాని సంజ్ఞ ఒకటిగనే ఉండవచ్చును. ఏ విధముగా కాఠక గ్రంథములో ప్రసిద్ధభేదమున్న అగ్నిహోత్రాది కర్మలకు 'కావ్య' మను ఒకే సంజ్ఞ చూడబడుచున్నది. అటలనే ఇచటగూడ తెలిసికొనవలయును. కేవలము నామము అభిన్నమైనంత మాత్రమున ఉపాసనలో ఏకత్వ కల్పను చేయరాదు.

# 105. వ్యాప్త్యధికరణము.

సంగతి:- "ఓమిత్యేదక్షరముద్గీథమ్" (ఛాం.1.1.1) ఈ వాక్యములో ఓం కారము మరియు ఉద్గీథలో విశేషణవిశేష్యభావమును స్వీకరించి ఉపక్రమ భేదమువలన ఉపాసన భిన్నమని చెప్పబడినది. అటుల చెప్పుట సరికాదు అని ఆక్షేపసంగతి వలన ఈ అధికరణము మొదలైనది.

విషయము:- ఈ అధికరణములో ఓంకారము మరియు ఉద్గీథలలోగల సమానాధికరణ్యమును గురించిన విషయము విచారణీయము.

సంశయము:- నామము బ్రహ్మమని చెప్పినటుల ఓంకారము మరియు ఉద్గీథలలోగల సమానాధికరణము అధ్యాసరూపమా లేక అపవాదరూపమా లేక ద్విజోత్తముడైన బ్రాహ్మణుడు భూసురుడు అనునటుల ముఖ్యార్థమా కాక నీలముత్పలము అనునటుల విశేషణ-విశేష్యరూపమా.

పూర్వపక్షము:- ఓంకారము మరియు ఉద్గీథలలోగల అభేదము నియతము కాదు ఎందులకనగా అటుల నియమించుటకు కారణము లేదు కనుక చెప్పిన నాలుగు పక్షములలో ఏ ఒక పక్షమును నిర్ణయించలేము.

సిద్ధాన్తము:- సంపూర్ణ వేదములో ఓంకారము వ్యాప్తము దానిలో ఉద్గీథ విశేషణ-విశేష్యభావరూపమైన సామానాధికరణమని స్వీకరించుటయే ఉచితము. అధ్యాస పక్షములో విలక్షణము భేదము చెప్పవలయును. అపవాద పక్షములో అన్యఫల కల్పనా ప్రసంగము వచ్చును. అభేద పక్షములో రెండు శబ్దముల ఉచ్చారణ వ్యర్థమగును. పరిశేష న్యాయముద్వారా విశేషణ-విశేష్యభావ పక్షమే శ్రేష్ఠము. అన్ని వేదములలో ఓంకారము వ్యాప్తము అయిన ఏ ఓంకారమును ఉపాసన చేసెదము అని సంశయము కలిగిన "ఓమిత్యేదక్షరముద్గీథముపాసీత" అను శ్రుతివాక్యముద్వారా సామభక్తి ఉద్గీథయొక్క అవయవరూపముగా ఓంకారమును విశేష్యముగా చెప్పిరి. అందువలన ఓంకారము విశేష్యము మరియు ఉద్గీథ విశేషణము

అనిన ఉద్గీథ అవయవమైన ఓంకారమునే ఉపాసన చేయవలయును ఆ విధముగా విశేష్య విశేషణ భావమును ఓంకారము మరియు ఉద్గీథలో స్వీకరించవలయును.

223. కిమధ్యాసఽథవా బాధ ఐక్యం వాఽథ విశేష్యతా | అక్షరస్యాత్ర నాస్త్యైక్యం నియతం హేత్వభావతః ||

224. వేదేషువ్యాప్త ఓంకార ఉద్గీథేన విశేష్యతే | అధ్యాసాదౌ ఫల కల్ప్యం సంనికృష్టాంశలక్షణా ||

"ఓమిత్యేదక్షరముద్గీథముపాసీత" ఈ శ్రుతిలో అక్షరమునకు మరియు ఉద్గీథకు సామానాధికరణ్యము తెలియుచున్నది. ఆ సామానాధికరణము అధ్యాసరూపమా లేక బాధయా లేక ఐక్యమా లేక విశేషణమా. ఈ సందేహమునకు ఏ పక్షముగూడ నిర్ణయమగుట లేదు ఎందులకనగా నియమించు కారణము లేకపోవువలన అని పూర్వపక్షవాదము. సిద్ధాన్తి సమాధానము. పైన చెప్పిన విషయములో విశేషణ-విశేష్యభావ సామానాధికరణమనునది నిర్దిష్టము ఎందులకనగా ఋగాది వేదమంత్రములలో ఓంకారాక్షరము వ్యాప్తము. అధ్యాసాది మిగిలిన మూడింటిలో ఫలము మరియు సన్నిహితాంశములో లక్షణ ప్రసంగముగూడ వచ్చును.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

"ఓమిత్యేదక్షరముద్గీథముపాసీత" ఈ శ్రుతిలో ఓంకారాక్షరమునకు ఉద్గీథకు సామానాధికరణము వినబడు చున్నది. ఇచట నాలుగు రకముల సంశయము కలుగుచున్నది. "నామ బ్రహ్మేత్యుపాసీత" అను స్థలములో బ్రహ్మదృష్టిని అధ్యసించుట కొరకు సామానాధికరణము వినబడుచున్నది. "యశ్చోరః స స్థాణుః" అనుచోట చౌరత్వమునకు బాధ చూడబడుచున్నది. "యో జీవస్తద్ బ్రహ్మ" అను చోట ఏకత్వము శ్రుతిలో చెప్పిరి. "యన్నీలం తదుత్పలం" అనిన విశేషణ-విశేష్యభావమున్నది. వీనిలో ప్రకృతములో నాలుగర్థములు సమానబలములై ప్రసక్తించుచుండ ఏ పక్షమును నిర్ణయించవలయును? నిర్ణాయక ప్రమాణముగూడ లేదు అనునది పూర్వపక్షము. దీనికి సిద్ధాన్తి సమాధానము. ఓంకారాక్షరమునకు మరియు ఉద్గీథకు పరస్పరము విశేష్య-విశేషణభావమని నియమించ వచ్చును. ఎందులకనగా ఓంకారము ఋక్, యజు, సామ మంత్రములుగల మూడు వేదములలో పఠించబడినది. వీనిలో ఏది ఉపాస్యము? ఈ విధమైన అపేక్ష కలుగగగా 'ఉద్గీథ భాగ మైన ఓంకారమునకే అపేక్ష కాని ఇతరములకు కాదు'. ఈ ప్రకారము సామవేదములో చెప్పబడిన ఓంకారమును విశేషణముగా చేయవచ్చును. అధ్యాస పక్షములో ఫలమును కల్పన గావించవలయును ఎందులకనగా స్వతంత్ర ఉపాసనలో ఫలముయొక్క ఆకాంక్ష యుండును. కాని విశేషణ పక్షములో చెప్పబోవు రసతమత్వాది గుణముల ఉపాసనకు ప్రతీకముగా ఓంకారము ఉద్గీథద్వారా విశేషిత మగును గాన స్వతంత్ర ఉపాసన గాదు. కావున విడిగా ఫలమును కల్పనచేయవలసిన ఆవశ్యకము లేదు. కాని ఉద్గీథశబ్దము సంపూర్ణ సామ భక్తికి వాచకము మరియు ఓంకారము దాని అవయవము అందువల్ల ఉద్గీథశబ్దముతో ఓంకారముయొక్క సమ్బన్ధము కొరకు దాని అంశములో అవశ్యము లక్షణమును స్వీకరించవలయును గాదా? సత్యము, అయినను అధ్యాసపక్షముకన్న విశేషణ పక్షము యుక్తతరము. ఎందులకనగా అధ్యాసములో ఏ విధముగా విష్ణుశబ్దము సంపూర్ణ స్వార్థమును వదిలి అన్య అర్థమయిన శిల లేక శిలాప్రతిమను

లక్షణద్వారా బోధగావించును. ఆవిధముగనే ఉద్గీథశబ్దములోగూడ జరుగును. అందువలన దూరముగానున్న లక్షణా ప్రసంగము వచ్చును. అంశ లక్షణములో స్వార్థముయొక్క ఒక భాగము మాత్రమే త్యజించుటవలన విప్రకర్షము (దూరము) కాదు కాని సంనికర్షమగును (దగ్గర). దీనిద్వారా అన్య వేదభాగములలో నున్న ఓంకారము వదిలివేయుట మరియు ఉద్గీథ అవయవత్వముగా నున్న ఓంకారాక్షరము విశేషితముగా స్వీకరించుట అగుచున్నది.

368. వ్యాప్తేశ్చ సమఞ్జసమ్. 3.3.9.

సూత్రార్థము:- ఋగ్, యజు, సామ మంత్రములలో ఓంకారము వ్యాప్తము అందువలన ఏ ఓంకారమును ఉపాసన చేయవలయును అను జిజ్ఞాస కలుగగా "ఉద్గీథావయవ ఓంకారమును" ఉపాసన చేయవలయును అనిరి. అనగా ఓంకారము ఉద్గీథకు విశేషితము అందువల్లనే ఉద్గీథము ఓంకారమునకు విశేషణము. ఈ పక్షములో దోషములేదు. సూత్రములో నున్న 'చ' శబ్దము తు అను శబ్దార్థములో చెప్పిరి కాన అధ్యాసము, అపవాదము మరియు ఐక్య పక్షములు బొత్తిగా యుక్తి యుక్తములు కావు.

"ఓమిత్యేదక్షరముద్గీథముపాసీత" అనుచోట వినబడు సామానాధికరణము "నామము బ్రహ్మము" అనునటుల అధ్యాసమా. అధ్యాసమనగా ఒక వస్తువులో వేరొక వస్తువును ఆరోపించుట. లేక తత్త్వమసి అను మహావాక్యముద్వారా ఉత్పన్నమయిన బుద్ధితో నిరాకరింపబడిన దేహములోగల తాదాత్మ్యబుద్ధియొక్క అపవాదరూపమా. కానిచో ద్విజోత్తముడు, బ్రాహ్మణుడు, భూసురుడు అనునటుల సమానార్థకములా కాకపోయిన "నీల కమలము" నకు సమముగా విశేష్య-విశేషణ భావమువలే ఓంకారములో ఉద్గీథలో సమానాధికరణమును చెప్పవలయునా? అను సంశయము కలుగగా ఏ ఒక పక్షము నిశ్చయము కానందువలన నిర్ణయము కాలేదనును పూర్వపక్షము. సిద్ధాన్త జవాబు. సూత్రములో వచ్చిన 'చ' శబ్దము 'తు' శబ్ద స్థానములో వచ్చినది. ఆ 'తు' శబ్దముద్వారా మొదటి మూడు పక్షములు నిరాకరించబడినవి అనగా విశేషణ పక్షమే యుక్తము ఎందులకనగా అధ్యాస పక్షములో లక్షణము యొక్క ప్రసంగము వచ్చును. "ఆపయితా వై కామానాం భవతి" అనగా "నిశ్చయముగా యజమానుని ఇచ్ఛలను పూర్తిగా పొందింపజేయును". (ఛాం.1.1.7). అను మొదలగు ఫలితమును చెప్పు శ్రుతులు ఆప్తిగుణ (పొందజేయు) విశిష్ట గుణమును విషయము గావించునవి కావున బుద్ధితో గావించిన అధ్యాసముద్వారా భిన్నఫలమును కల్పనజేయు ప్రసంగము వచ్చును. అపవాద ఉపాసనపరమైనది ఈ వాక్యమని భావించిన వస్తుపరత్వము కానందువలన మిథ్యాబుద్ధినివృత్తిరూపమైన ఫలితమునిచ్చునని చెప్పజాలము. కాన అన్య ఫలకల్పనా ప్రసంగము ఈ పక్షములోను వచ్చును. ఏకత్వాధ్యాస పక్షములో "బ్రాహ్మణో భూసురః" అను సమానార్థములుగల రెండు శబ్దముల ఉచ్చారణ వ్యర్థమగును. ఈ ప్రకారము మూడు పక్షములలో దోషముండుటవలన మిగిలిన "నీలోత్పలము వలె" విశేష్య-విశేషణభావ పక్షము శ్రేష్ఠమని "వ్యాప్తేశ్చ సమఞ్జసమ్" అను సూత్రముద్వారా సూత్రకారులు చెప్పిరి. ఓంకారము ఋక్, యజుః మరియు సామమను మూడు వేదములలో వ్యాప్తమైనందువలన ఏ ఓంకారమును ఉపాసన చేయవలయును, అను జిజ్ఞాస కలుగగా "ఓమిత్యేదక్షరముద్గీథముపాసీత" అనగా "ఓమను అక్షరముగల ఉద్గీథను ఉపాసనచేయుము" (ఛాం.1.1.1). ఈ శ్రుతిద్వారా ఉద్గీథావయవరూపముగా ఓంకారమును విశేషితము గావించి ఉపాసన చేయవలయును. అందువలన వ్యాప్తమయినందువలన ఉద్గీథ అవయవరూపమైన ఓంకారమే

ఉపాస్య యోగ్యమని అదియే శ్రుతి తాత్పర్యమని గ్రహించవలయును. ఈ అక్షరము విశేష్యము మరియు ఉద్గీథ దానికి విశేషణము. ఈ విధముగా స్వీకరించుటవలన ఏ దోషము లేదు.

# 106. సర్వాభేదాధికరణము.

సంగతి:- ఈ విధముగా సర్వవేదవ్యాప్త మయినను ఓంకారమును ఉద్గీథ అవయవముగా గ్రహించవలయునని చెప్పబడినది. ఆలాగుననే "ఏవం విద్వాన్" అనగా "ఈ విధముగా తెలిసిన విద్వాంసుడు" అను వాక్యములో "ఏవం = ఈప్రకారముగా" అని ప్రయోగింపబడుటచే ఆ ఏవం శబ్ద సమీపమున ఉన్న గుణములను మాత్రమే పరామర్శించినది అగుటచే ఇతర శాఖలకన్న భిన్న మను దృష్టాన్త సంగతివలన ఈ అధికరణము ఆరంభమయినది.

విషయము:- వాజసనేయశాఖ బృహదారణ్యకము మరియు ఛాందోగ్యములో నున్న ప్రణోపాసనల భేదాభేదమును ఇచట విచారించెదరు.

సంశయము:- ప్రాణ ఉపాసనలో చెప్పిన వసిష్ఠత్వాది గుణములను రెండు శాఖలలోనున్న ప్రణోపాసనలో ఉపసంహారము (చేర్చుట) చేయవలయునా లేదా?

పూర్వపక్షము:- "య ఏవం వేద" ఈ వాక్యములోనున్న 'ఏవం' అను శబ్దముద్వారా ఆ యా శాఖలలో నున్న గుణములను మాత్రమే విచారించవలయును గాని వేరు శాఖలోనున్న గుణములను కాదు.

సిద్ధాన్తము:- ప్రాణ శబ్దము ద్వారా బుద్ధిలోనున్న 'వసిష్ఠత్వాది' గుణములు 'ఏవం' అను శబ్దమువలన పరామర్శింపబడు చున్నవి ఎందులకనగా 'ఏవం' అను శబ్దములోనే ఆ శక్తి కలదు. అందువలన 'ఏవం' అను శబ్దముద్వారా పరామర్శ యోగ్యమయిన సమస్త గుణముల ఉపాసంహారము ప్రణోపాసనలో రెండు శాఖలలో చేయవలయును.

225. వసిష్ఠత్వాద్యనాహార్యమాహార్యం నైవమిత్యతతః | ఉక్తస్యైవ పరామర్శాదనాహార్యమనుక్తితః||

226. ప్రాణద్వారేణ బుద్ధిస్థం వసిష్ఠత్వాది తేన తత్ | ఏవం శబ్దపరామర్శయోగ్యమాహార్యమిష్యతే ||

వసిష్టత్వాది గుణములను ఉపసంహారము చేయవలయునా లేదా? అను సంశయమునకు పూర్వావాది 'ఏవం' శబ్దముద్వారా చెప్పిన గుణములు మాత్రమే పరామర్శింపబడుటవలన వసిష్టత్వాది గుణముల చెప్పబడలేదు కనుక వాని పరామర్శ లేదనును. దానికి సిద్ధాన్తి ఇచ్చిన జవాబు. వసిష్టత్వాది గుణములు ప్రాణముద్వారా బుద్ధిస్థమగు చున్నవి కాని ఇతర గుణములగుటలేదు. అందువలన ఆ వసిష్టత్వాది గుణములు 'ఏవం' శబ్దముద్వారా పరామర్శయోగ్యములు గాన వాని ఉపసంహారము చేయవలయును.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:

ఛాందోగ్యము మరియు బృహదారణ్యక కాణ్వ శాఖలోగల ప్రాణోపాసనలో ప్రతిష్ఠా మరయు వసిష్ఠత్వాది గుణముల ఉపన్యాసము గలదు కాని ఐతరేయకము మరియు కౌషీతకి మొదలగు వానిలో వీని ప్రసంగములేదు. ఈ పరిస్థితిలో వసిష్ఠత్వాది గుణములను ఐతరేయాదుల ప్రాణఉపాసనలో ఉపసంహారము చేయవలయునా లేదా? ఈ ప్రకారముగా కలిగిన సందేహమునకు పూర్వపక్షి ఉపసంహారము చేయరాదనును ఎందులకనగా "య ఏవం వేద" దీనిలో చెప్పిన 'ఏవం' శబ్దముద్వారా ఆ యా శాఖలలో చెప్పిన గుణములు ఆ శాఖకే చెందును కనుక. ఈ విధమైన పూర్వపక్షమునకు సిద్ధాన్తి చెప్పు సమాధానము. ఆ యా శాఖలలో చెప్పిన గుణములేగాక చెప్పని గుణములుగూడ 'ఏవం' శబ్దముద్వారా పరామర్శింపబడు చున్నవి ఎందులకనగా ప్రాణసంవాదమనగనే దానిని గూర్చి యే యే స్థలములలో ఏ ఏ అంశములు చెప్పబడినవో అవి అన్నియు బుద్ధియందు నిలిచినవి గాన వాని స్మరణగూడ కలుగును. ఎటులనిన చదువు చెప్పు దేవదత్తుని మథురలో చూచి పాటలీపుత్రములో చదువు చెప్పక పోయినను ఉపాధ్యాయుని రూపములో ప్రత్యభిజ్ఞానము కలుగును. "తత్తా ఇదన్తా అవగాహి జ్ఞానమును" ప్రత్యభిజ్ఞ అందురు. అటులనే ఛాందోగ్యాదులలో వసిష్టత్వాది గుణములతో కూడిన ప్రాణమును, ఐతరేయాదులలో కేవలము చెప్పినంత మాత్రముచే వసిష్టత్వాది గుణములు గల ప్రాణము బుద్ధిస్థమగును. అందువలన 'ఏవం' శబ్దముద్వారా పరామర్శ యోగ్యము. కనుక వసిష్టత్వాది గుణములను ఐతరేయాదులలో ఉపసంహారము చేయవలయును.

369. సర్వాభేదాదన్యత్రేమే. 3.3.10.

సూత్రార్థము:- బృహదారణ్యకోపనిషత్తులో మరియు ఛాందోగ్యపనిషత్తులో ప్రాణవిద్యలో వాణి మరియు వసిష్టత్వాది గుణములతో కూడిన ప్రాణోపాసన వినవచ్చుచున్నది. కౌషీతకీ ఆది ఉపనిషత్తులలో ఆ ప్రకారముగా వినబడుటలేదు అయినను అచటగూడ వసిష్టత్వాది గుణముల ఉపసంహారము చేయవలయును ఎందులకనగా అన్ని శాఖలలో వినబడు ప్రాణసంవాదములోనున్న ప్రణోపాసన ఏకత్వమగుటవలన. అందువలన 'ఏవం' శబ్దముద్వారా బుద్ధిస్థ మగుటవలన చెప్పిన గుణములతో పాటు చెప్పని గుణములు గూడ గ్రాహ్యములు. గాన అన్ని గుణములను అన్నిప్రదేశములలో ఉపసంహారము చేయవలయును.

బృహదారణ్యకోపనిషత్తులో మరియు ఛాందోగ్యపనిషత్తులో ప్రాణ సంవాదములో ప్రాణమునకు జ్యేష్ఠత్వ శ్రేష్ఠత్వాది విశిష్ట గుణములగల ఉపాసనలో "యద్వా అహం వశిష్ఠోస్మి త్వం తద్వశిష్ఠోఽసి" అనగా "నేను వశిష్ఠరూపముతో ఉన్నాననుట యేది కలదో అది నీస్వరూపమే. వాస్తవమునకు నీవే వశిష్ఠత్వగుణము కల వాడవు" (ఛాం. 6.1.14) ఈ వాక్యము ద్వారా వశిష్ఠత్వాది గుణములుగూడ వినిపించుచున్నవి. ఆ విధముగా కౌషీతక్యాది శాఖలలో వినబడటలేదు. ఈ స్థితిలో వేరు స్థలములలో చెప్పిన వశిష్ఠత్వాది గుణములను అవి చెప్పని స్థలములలో ఉపసంహారము చేయవలయునా లేదా? అని సందేహము రాగా "య ఏవం విద్వాన్" అనగా "ఈ ప్రకారము తెలిసిన విద్వాంసుడు" అను శబ్దముద్వారా పరామర్శించిన శ్రేష్ఠత్వాది గుణములను మాత్రమే పరామర్శించవలయుననును కాని అన్యస్థలములలో చెప్పిన వశిష్ఠత్వాది గుణములను

పరామర్శ చేయరాదనును పూర్వవాది. దీనికి సిద్ధాన్తములో చెప్పినదేమనగా ఏ స్థలములలో చెప్పినవైనను వశిష్ఠత్వాది గుణములను చెప్పని స్థలములలో ఉపసంహారము చేయవలయును అనిరి ఎందులకనగా అన్ని స్థలములలో ప్రాణసంవాదము (సారూప్యము) ఒకటిగనే ఉన్నది. కనుక ప్రాణసంవాదములలో విధించబడిన ప్రణోపాసనము అభిన్నము. అదే ఇది అను ప్రత్యభిజ్ఞ జ్ఞానము కలిగిన తరువాత ప్రాణవిద్యలో అభిన్నము సిద్ధమగును కాన కౌషీతకీ ఉపనిషత్తులో చెప్పిన ప్రాణవిద్యలోగూడ వశిష్ఠత్వాది గుణసమూహము ఉపసంహారము చేయుట ఉచితము. ఈ విధముగా అన్ని స్థలములలో ఉపాసన ఐక్యమని సిద్ధమగుటవలన అన్ని స్థలములలో అన్ని గుణముల ఉపసంహారము చేయవలయును.

## 107. ఆనందాద్యధికరణము.

సంగతి:- విశేషముతో కూడిన ప్రాణోపాసనములో శాఖాన్తరములో చెప్పిన వసిష్ఠత్వాది గుణముల ఉపసంహారము చేసినను నిర్విశేష బ్రహ్మముయొక్క ప్రమాజ్ఞానము స్వశాఖలో చెప్పిన ధర్మములద్వారా కలుగుటవలన అన్యశాఖలలో చెప్పిన ఆనందాది గుణముల ఉపసంహారము ఉచితము కాదు అను ప్రత్యుదారణ సంగతి వలన ఈ అధికరణము ఆరంభమయినది.

విషయమయ:- నిర్విశేష బ్రహ్మముయొక్క ఆనందాది గుణముల ఉపసంహారమా లేక అనుపసంహారమా అను విచారము ఈ అధికరణములో గావించిరి.

సంశయము:- నిర్గుణబ్రహ్మమును ప్రతిపాదించు శ్రుతులలో చెప్పబడిన ఆనందరూపత్వము, కొన్ని స్థలములలో విజ్ఞానఘనత్వము, మరి కొన్నిస్థలములలో సర్వ వ్యాపకత్వము మరియు ఇంకొన్ని స్థలములలో స్రర్వాత్మకత్వము మొదలగు ధర్మములు వినవచ్చు చున్నవి. ఆ ధర్మములు ఎచట ఎన్ని వినబడుచున్నవో వానినే చింతన చేయవలయునా ఆ శాఖలోగల నిర్గుణ ఉపాసనయందు లేక శాఖాన్తరములలో చెప్పిన గుణములనుగూడ చింతన చేయవలయునా

పూర్వపక్షము:- వామనీత్వము, సత్యకామత్వాది గుణములవలే స్వశాఖలో చెప్పిన ఆనందరూపత్వాది గుణముల చింతన వలననే నిర్గుణ ఉపాసన పూర్తియగుచున్నది. అందువలన శాఖాన్తరీయ ధర్మముల చింతన అనావశ్యకము.

సిద్ధాన్తము:- వామనీత్వాది ధర్మములు ధ్యేయరూపముగా విధించబడినవి. వాని చింతన స్వశాఖలో చెప్పిన గుణముల ద్వారా పూర్తి అయినను ఆనందత్వాది ధర్మములు బ్రహ్మబోధ కొరకు చెప్పబడినవి కాని ఉపాసనకొరకు కాదు. అందువల్ల వ్యవస్థాపక విధి అభావమువల్ల అన్ని స్థలములలో నిర్గుణ ఉపాసనలలో శాఖాన్తరీయ ఆనందరూపత్వాది అన్ని గుణములను చింతన చేయవలయును.

వైయాసికన్యాయమాలా:-

227. నాऽऽహార్యా ఉత వాऽऽహార్యా ఆనన్దాద్యా అనాహృతిః| వామనీసత్యకామాదేరివైతేషాం వ్యవస్థితేః||

228. విధీయమాన ధర్మాణాం వ్యవస్థా స్యాద్యథావిధి | ప్రతిపత్తిఫలానాం తు సర్వశాఖాసు సంహృతిః ||

తైత్తిరీయములోని  పరబ్రహ్మవిద్యలో చెప్పిన ఆనన్దాది గుణములు ఐతరేయకములో చెప్పిన పరబ్రహ్మవిద్యలో ఉపసంహారము చేయవలయునా లేదా అను సంశయమునకు  పూర్వావాది  ఉపసంహారము చేయరాదనును ఎందులకనగా వాని వ్యవస్థ వామనీ సత్యకామాది గుణములకు సమానముగా చేయవచ్చును. దానికి సిద్ధాన్తి సమాధానము. విధించిన ధర్మముల వ్యవస్థ సగుణబ్రహ్మములో విధికి అనుగుణముగా నుండును కాని దేనికి జ్ఞానము ఫలమో అటువంటి ఆనన్దాది గుణములను అన్ని శాఖలలో ఉపసంహారము చేయవలయును.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య :-

ఆనన్దో బ్రహ్మ"  "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ" అను శ్రుతులద్వారా ఆనన్దాది గుణములు తైత్తిరీయములోని  పరబ్రహ్మవిద్యలో చెప్పిరి. "ప్రజ్ఞానం బ్రహ్మ" అను శ్రుతి ఐతరేయకములో చెప్పిన పరబ్రహ్మవిద్యలో చెప్పిరి కాని ఆనన్దాది గుణములు చెప్పలేదు. అందువల్ల ఐతరేయకాదులలో  ఈ గుణములను ఉపసంహారము చేయరాదు. వాని వ్యవస్థ వామనీత్వము మొదలగు ధర్మములకు సమానముగా అగును. ఏ విధముగా "ఏష ఉ వామనీః", "ఏష ఉ భామనీః"  వామనీత్వము, కామయితృత్వము,  భాసకత్వము మొదలగు గుణములు ఉపకోశల-విద్యలో చెప్పబడినవి. మరియు దహర-విద్యలో "సత్యకామః" అని సత్యకామాది గుణములను చెప్పిరి. ఆ స్థలములలో పరస్పరము గుణముల ఉపసంహారము అగుటలేదు. అటులనే ఆనందాదులకుగూడ వ్యవస్థ కలుగు చున్నది అనిన వానికి గూడ పరస్పరము తైత్తిరీయకము  మరియు ఐతరేయకములో చెప్పిన పరబ్రహ్మ-విద్యలో ఉపసంహారమగుటలేదు.

ఈ విధముగా పూర్వపక్షము కాగా సిద్ధాన్తి చెప్పినది. చెప్పిన దృష్టాన్తము సరికాదు. ఎందులకనగా వామనీత్వాది గుణములు ధ్యేయరూపముగా విధించిరి కాన వాని వ్యవస్థ విధికి అనుసారముగా నుండుట యుక్తము.  ఆనందాది గుణములకు జ్ఞానమే ఫలమగుటవలన విధించిరనుట సరికాదు. అందువలన వ్యవస్థకావించు విధి లేనందున మరియు జ్ఞానరూప ఫలమగుటవలన అన్ని స్థలములలో సామాన్యమగుటవలనను  ఆనందాదుల ఉపసంహారము చేయవలయును.

### 370. ఆనందాదయః ప్రధానస్య. 3.3.11.

సూత్రార్థము:- బ్రహ్మ యొక్క ఆనన్దస్వరూపత్వము మొదలగు ధర్మములు అన్ని స్థలములలో ఉపసంహారము చేయవలయును అనిన ఏ స్థలములలో ఈ ధర్మములు చెప్పకపోయినను అచటగూడ ఉపసంహారము చేయవలయును ఎందులకనగా అన్ని శాఖలలో జ్ఞేయబ్రహ్మము ఒకటేగాన విద్యగూడ ఒకటియే.

నిర్గుణ బ్రహ్మమును ప్రతిపాదించు శ్రుతులలో ఆనందరూపత్వము, విజ్ఞానఘనత్వము, సర్వవ్యాపకత్వము, సర్వాత్మత్వము మొదలగు ధర్మములు వినబడుచున్నవి. ఎచట ఏగుణములు వినబడుచున్నవో వానినే అచట చింతన చేయవలయునా లేక అన్ని స్థలములలో అన్ని గుణములను ఉపసంహారము (చిన్తన) చేయవలయునా? ఈ సంశయమునకు పూర్వవాది ఎచట ఏగుణములు వినబడుచున్నవో వానినే అచట చింతనచేయవలయును కాని అన్ని స్థలములలో అన్ని గుణములను  చింతన చేయరాదనును. దీనికి సిద్ధాన్తి చెప్పిన సమాధానము. ప్రధానమైన బ్రహ్మము యొక్క ఆనన్దాది అన్ని ధర్మములు అన్ని శాఖలలో ఉపసంహారము చేయవలయును ఎందులకనగా వేద్య బ్రహ్మము ఒకటే

కనుక దాని ఉపాసనలో అభిన్నమును స్వీకరించుటయే ఉచితము. తన దేశములో శౌరత్వాది గుణములు కలిగిన దేవదత్తుడు దేశాన్తరము పోయిన మాత్రముచే ఆ శూరత్వాది గుణరహితుడు కాడు కాదా? అందువల్ల నిర్విశేష బ్రహ్మయొక్క అన్ని ధర్మములు అన్ని స్థలములలో చిన్తన చేయవలయును.

అటుల స్వీకరించిన "తస్య ప్రియమేవ శిరః" అనగా "దానికి ప్రియమగు వృత్తిరూపము తల" అను వాక్యముల ద్వారా చెప్పబడిన ప్రియశిరస్త్వాది ధర్మములు అన్ని స్థలములలో ఉపసంహారము ప్రసంగము వచ్చును. అను ప్రశ్నకు ముందు సూత్రములో సమాధానము చెప్పుచున్నారు.

371. ప్రియశిరస్త్వాద్యప్రాప్తిరుపచయాపచయౌ హి భేదే. 3.3.12.

సూత్రార్థము:- ఒకచోట వినబడు ప్రియశిరస్త్వాది ధర్మములు అన్ని స్థలములలో ప్రాప్తము కావు ఎందులకనగా ప్రియము, మొదము, ప్రమొదము, ఆనన్దము మొదలగు ధర్మములలో పరస్పరము ఒకదానికి మరియొకదాని అపేక్షవలన వృద్ధి మరియు క్షయము కనబడును. ఆ ధర్మములు బ్రహ్మ భిన్నమయిననే స్వాభావికములగును కాని బ్రహ్మము అభిన్నము ఏకరసము అద్వైతము అందువలన అవి బ్రహ్మయొక్క స్వాభావిక గుణములు కావు. అందువలన వాని చిన్తన ప్రసక్తి లేదు.

ప్రియశిరస్త్వాది ధర్మములు అన్ని స్థలములలో ప్రాప్తము కావు. ఎందులకనగా ప్రియము, మొదము, ప్రమొదము, ఆనన్దము మొదలగు ధర్మములు పరస్పరాపేక్షవలనను వేరొక భోక్తాపేక్షవలనను వృద్ధి క్షయములు కలవి. ధర్మీ (అనగా ధర్మము కలది) దానిలో భిన్నత్వము లేకపోయిన భేదశూన్య బ్రహ్మములో వృద్ధి క్షయములు కానేరవు అంతేగాక ప్రియశిరస్త్వాది బ్రహ్మ ధర్మములు కావు. ఇవి ఆనన్దమయకోశము యొక్క ధర్మములు. ఈ విషయము ఆనన్దమయాధికరణములో చెప్పితిమి. అందువలన అచట అచట వినబడు సంయద్వామత్వము మరియు సత్యకామత్వాది ధర్మములు అన్ని స్థలములలో ప్రాప్తి కావు. అచట ఉపాస్యములో భేదము లేకపోయినను ఉపక్రమ భేదమువలన ఉపాసనము భిన్నమని స్వీకరించిరి.

ఆనన్దాది ధర్మములు జ్ఞానమునకు ఉపయోగములగుటవలన సంయద్వామత్వాది ధర్మములనపేక్షించి ఈ ఆనన్దాది ధర్మములు విలక్షణములు అని ముందు సూత్రములో చెప్పెదరు.

372. ఇతరే త్వర్థసామాన్యాత్. 3.3.13.

సూత్రార్థము:- ఉపాస్య ధర్మములకన్న భిన్నమగు ఆనన్దాది ధ్దర్మములు జ్ఞానమునకు ఉపయోగ బడుటవలన అన్ని స్థలములలో ఉపసంహారములగును ఎందులకనగా ఉపాస్య బ్రహ్మములో ఏకత్వముండుటవలన.

ఆనన్దాది ధ్దర్మములు జ్ఞానమునకు ఉపయోగ బడుటవలన అనగా బ్రహ్మ తత్వము సరిగ్గా బోధపడుటకు. కాని సంయద్వామాత్వాది ధర్మములు ఉపాస్య బ్రహ్మయొక్క ధ్దర్మములు. ఆనన్దాది ధ్దర్మములు వ్యాఖ్యానము చేయు బ్రహ్మతో అభిన్నములు అందువలన వానిని అన్ని స్థలములలో ఉపసంహారము చేయవలయును. దేనికి బ్రహ్మజ్ఞానమే ఫలమో

అటువంటి ఆనన్దాది ధర్మములను అవిద్యను తొలగించి బ్రహ్మానందప్రాప్తి పర్యన్తము అన్ని స్థలములలో చింతన చేయవలయును.

## 108. ఆధ్యానాధికరణము.

సంగతి:- ఆనన్దాది ధర్మములు బ్రహ్మరూపమగుటవలన ఉపసంహారయోగ్య మనిరి ఎందులకనగా ఆ గుణములు బ్రహ్మ జ్ఞానమునకు ఉపయోగములు కాని బ్రహ్మస్వరూపము కాని విషయములు ఉపసంహార యోగ్యములు కావు. ఇంద్రియాదుల కన్న ఆధిక్యతను చెప్పుచు సర్వాధిక్యముగల పరమేశ్వరుని బోధించు శ్రుతిగూడ (కఠ.3.10.) బ్రహ్మజ్ఞానమునకు ఉపయోగము. అందువల్ల పూర్వాధికరణముతో ఈ అధికరణమునకు ఏకఫలత్వ సంగతి.

విషయము:- కాఠకోపనిషత్తులోని "ఇన్ద్రియేభ్యః పరా హ్యర్థా" అను వాక్యములో చెప్పిన పరత్వము యొక్క విచారము ఈ అధికరణములో చేసిరి.

సంశయము:- ఈ శ్రుతి వాక్యము బిన్న-భిన్నమా లేక ఆత్మపరకమగుటవలన ఏక వాక్యమా?

పూర్వపక్షము:- ప్రత్యేక వాక్యములో పరత్వము ప్రతిపాదించుటవలన వాక్యములు భిన్న-భిన్నములు.

సిద్ధాన్తము:- సమ్యగ్-జ్ఞానము కొరకు విషయములకన్నింటికన్నను ఆత్మ పరము అని ప్రతిపాదించిరి. అచట ప్రతిఒకటి అర్థాదుల పరమని ప్రతిపాదించలేదు దాని వలన ఫలితము లేదు. "నిచాయ్య తన్మృత్యుముఖాత్-ప్రముచ్యతే" అనిన "ఆ పరమేశ్వరుని వెతికి తెలిసి కొనిన సంసారభాధనుండి విముక్తు డగును". అను వాక్యముద్వారా ఇంద్రియములకన్న పరమైన ఆత్మజ్ఞానము కలిగిన మాత్రమే మొక్షసిద్ధి ప్రయోజనమని వినబడుచున్నది. అందువలన ప్రతిపాద్యముతో ఐక్యము చెప్పుటవలన ఈ వాక్యములు అభిన్నమని స్వీకరించుటయే ఉచితము.

వైయాసికన్యాయమాలా:-

229. సర్వా పరంపరాఽక్షాదేర్-జ్ఞేయా పురుష ఏవ వా | జ్ఞేయా సర్వా శ్రుతత్వేన వాక్యాని స్యుర్బహూని హి||

230. పుమర్థః పురుషజ్ఞానం తత్ర యత్నః శ్రుతో మహాన్ | తద్బోధాయ శ్రుతోఽక్షాదిర్వేద్య ఏకః పుమాంస్తతః ||

ఇంద్రియాదుల పరంపరను జ్ఞేయరూపముగా శ్రుతి ప్రతిపాదించుచున్నదా లేక కేవలము పురుషుని ప్రతిపాదించుచున్నదా? అను సంశయమునకు ఇంద్రియాదుల పరంపరయే జ్ఞేయరూపముగా శ్రుతి ప్రతిపాదించుచున్నది ఎందులకనగా అది వినిపించుచున్నది మరియు అనేక వాక్యరూపమే ఇష్టము మరియు శ్రుతి ప్రతిపాదకము. అనిన సిద్ధాన్తి సమాధానము. ఆత్మ జ్ఞానమే పురుషార్థము దాని కొరకు ప్రయత్నాధిక్యము శ్రుతిలో వర్ణితము అదే అభీష్టము. అందువలన అక్షాది పరంపరగూడ ఆ పురుషుని జ్ఞానమునకే శ్రుతులలో చెప్పిరి. గాన కేవలము జ్ఞేయరూపముగా పురుషునే శ్రుతులు ప్రతిపాదించుచున్నవి కాని ఇంద్రియాదుల పరంపరకాదు.

భారతీ తీర్థులవారి వ్యాఖ్య:-

కఠోపనిషత్తులో  ఈ క్రింది శ్లోకములు వినబడుచున్నవి.

ఇన్ద్రియేభ్యః పరా హ్యర్థాః అర్థేభ్యశ్చ పరం మనః | మనసస్తు పరా బుద్ధిః బుద్ధేరాత్మా మహాన్ పరః||

మహతః పరమవ్యక్తమవ్యక్తాత్ పురుషః పరః | పురుషాన్న పరం కిఙ్చిత్-సా కాష్ఠా సా పరా గతిః ||

అనగా "మనిషి మనస్సుతో విషయాలను కోరుకొనును తరువాత ఇంద్రియములద్వారా బహ్యావిషయములతో సమ్బన్ధము ఏర్పరుచుకొనును అచట బాహ్యావిషములనపేక్షించి ఇంద్రియములు పరములు ఇంద్రియాదులకంటె విషయాదులధికము ఇది లోకప్రసిద్ధము. వానికన్నను  అభిలషిత మానసిక వృత్తి పరమనగా అధికము, మనోవృత్తికన్నను బుద్ధి ఆభ్యన్తరము అనగా శ్రేష్టము బలవతీ మరియు సూక్ష్మము, బుద్ధికన్నను  దానికి ఉపాదానకారమైన సమష్టి బుద్ధి మహత్-శబ్దవాచ్యము హిణ్యగర్భనామముగలాత్మ సూక్ష్మము, మహతత్వముకన్న దానికి ఉపాదానకారణమైన అవ్యక్తతత్త్వము అనగా మూలాజ్ఞానము  సూక్ష్మము, అవ్యక్తముకన్న దానికి అధిష్టానభూతమైన  చైతన్యరూపమైన ఆత్మ శ్రేష్టము. అన్నిటికంటె ఆత్మరూపుడైన పరమేశ్వరుడు అధికుడు అంతకంటె అధికమగునది మఱియొక్కటి లేదు. ఎందులకనగా ఆ పురుషుడే అవాన్తర తారతమ్యములకు విశ్రామభూమి. అందుకనే "పురుషార్థకామైః పరమో గన్తవ్యశ్చ" అను శ్రుతిగూడ కలదు.  ఈ ప్రసంగములో పూర్వపక్షి చెప్పునది. పరమేశ్వరుడు (పురుషుడు) ఈ శ్రుతిలో ఏలాగున ప్రతిపాదితమో ఆలాగుననే ఇంద్రియాదుల పరమ్పరగూడ తాత్పర్యవృత్తితో  శ్రుతి ప్రతిపాదితము లేనిచో ఇంద్రియాదుల పరమ్పరోపన్యాసము వ్యర్థమగును. అనేకార్థముల ప్రతిపాదనలో వ్యాక్యభేదముయొక్క ప్రసంగముచెప్పుట సరికాదు. అనేకార్థములను ప్రతిపాదించుటలో ఏకవాక్యతను చెప్పలేము కాదా.

సిద్ధాన్తి జవాబు. పురుషుని జ్ఞానము సంపూర్ణ అనర్థములకు కారణమైన అజ్ఞానమును తొలగించునదికావున అదే వాస్తవమునకు శ్రుతి ప్రతిపాద్యము. అందువలన వాక్య శేషములో పురుష-జ్ఞానము  ప్రతిపాదించుటకు ఎక్కువ ప్రయత్నము గావించబడినది. "ఏష  సర్వేషు భూతేషు" అను వాక్యమును ఆధారము గావించుకొని కేవలము పురుషుని ప్రతిపాదించుటకే ఈవాక్యము గాన ఇంద్రియ పరంపర కథనము వ్యర్థమగును కదా అనిన ఈ శంక సరికాదు ఎందులకనగా బహిర్ముఖమైన చిత్తమును బ్రహ్మములో ప్రవేశపెట్టుటకు సాధనము ఈవాక్యము కాని ప్రతిపాద్య విషయము పురుషుడే అని సిద్ధమైనది.

### 373. ఆధ్యానాయ ప్రయోజనాభావాత్. 3.3.14.

సూత్రార్థము:- "ఇన్ద్రియేభ్యః పరా హ్యర్థాః" ఈ కాఠక వాక్యమునకు ఆఖరిలో ధ్యానజన్య సాక్షాత్కరమునకు పురుషుడే సాధ్యమని చెప్పుచు ఆ పురుషుడు అన్నింటికంటెను పరమని (అధికమని) ప్రతిపాదన గావించిరి. ఇంద్రియములకన్న విషయములు అధికమని మొదలగు వాక్యములద్వారా ప్రతిపాదించుట సరికాదు ఎందులకనగా  ఇంద్రియములకన్న విషయములు అధికమని చెప్పుటవలన ఏవిధమైన ఫలితము కలుగదు. దీని వలన సిద్ధమగునదేమనగా పై కాఠక వాక్యము ఒకటే ప్రతిపాద్య భేదము లేనందువలన వాక్య భేదము లేదు.

ఇన్ద్రియేభ్యః పరా హ్యర్థాః అర్థేభ్యశ్చ పరం మనః | మనసస్తు పరా బుద్ధిః బుద్ధేరాత్మా మహాన్ పరః||

మహతః పరమవ్యక్తమవ్యక్తాత్ పురుషః పరః | పురుషాన్న పరం కిఙ్చిత్-సా కాష్ఠా సా పరా గతిః || (కఠ.3.10-11)

ఇంద్రయములు, విషయములు, మనస్సు, బుద్ధి, సమిష్టి బుద్ధి, అవ్యక్తము, పురుషుడు ఇవి క్రమముగా ఒకదానికన్న ఒకటి పరము అనగా అధికము సూక్ష్మము అని చెప్పిరి. ఈ శ్రుతిలో చెప్పిన వాక్యములు భిన్నములా లేక ఆత్మపరమగుటవలన ఒకే వాక్యమా అని సంశయము కలుగగా చెప్పిన శ్రుతిలో ప్రతి ఒక్క దానిలో పరత్వము చెప్పుటవలన భిన్నవాక్యములనును పూర్వపక్షి. సిద్ధాన్తి చెప్పినది. చిన్తనద్వారా యథార్థ భోధ కొఱకు విషయములు మొదలగువాని అన్నింటికన్నను పురుషుడు పరము, అధికము, సూక్షమని ప్రతిపాదించిరి అదియే యుక్తి సంగతము. విషయములు మొదలగునవి పరమని ప్రతిపాద్యములు కావు. ఈ అర్థాదులను పరమని చెప్పుటవలన ఏ ప్రయోజనము లేదు అంతేగాక ప్రయోజనము వినబడుటలేదు. “నిచాయ్య తన్మృత్యుముఖాత్-ప్రముచ్యతే” అనిన “ఆ పరమేశ్వరు వెతికి తెలిసి కొనిన మృత్యువు నుండి ముక్తి పొందును”. ఈ శ్రుతిలో ఇంద్రియాదులకు పరమైన పురుషుని తెలిసికొనుటవలన మొక్షసిద్ధి అను ప్రయోజనము వినబడుచున్నది. అందువలన ప్రతిపాద్య విషయము అభిన్నమగుటవలన విద్యలో భేదములేదు అని సిద్ధమైనది.

374. ఆత్మశబ్దాచ్చ. 3.3.15.

సూత్రార్థము:- “ఏషు సర్వేషు భూతేషు గూఢోత్మా న ప్రకాశతే” అనిన “ ఈ పురుషుడు అన్ని భూతములలో ప్రచ్ఛన్నుడై దాగి యున్నాడు” ( కఠ.3.12) ఈ శ్రుతిలో ప్రకృత పురుషునిలో ఆత్మ శబ్దము వినిపించుచున్నది కాన ఈ వాక్యము ఆత్మపరకము ఎందులకనగా శ్రుతిలో ప్రమానాన్తరముద్వారా ఈ ఆత్మ తెలియదని అపూర్వతను చెప్పిరి.

ఇందువలనగూడ ఇంద్రియాదుల పరత్వ వాక్యము ఆత్వబోధ కొరకే ఎందులకనగా “ఏషు సర్వేషు భూతేషు గూఢోత్మా న ప్రకాశతే” అనిన “సంపూర్ణ భూతములలో దాగియున్న ఈ ఆత్మ అశుద్ధ బుద్ధిగలవారికి మరియు స్థూల బుద్ధిగలవారికి అనుభవములోనికి రాదు”. ఈ ప్రకృత శ్రుతిలో గల పురుష శబ్దమునందు ఆత్మశబ్ద ప్రయోగమువలన ఆత్మకన్నభిన్నము పరత్వముగా చెప్పుట అబీష్టము కాదు. మరియు ఆ ఆత్మ దుర్విజ్ఞేయము మరియు శుద్ధబుద్ధిగమ్యము అని చూపించి శ్రుతి అలౌకికతనుగూడ చెప్పినదని భావము.

# 109. ఆత్మగృహీత్యధికరణము.

(ప్రథమ వర్ణకము)

సంగతి:- క్రిందటి అధికరణములో వాక్యభేదము కలుగునను భయముతో ప్రత్యేకము విషయాదులలో ప్రతిపాద్యత్వము లేదని చెప్పిరి. ఆలాగుననే “అథాతో రేతసః సృష్టిః ప్రజాపతే రేతో దేవతా” అనగా ‘ఇప్పుడు రేతస్సునుండి సృష్టి చెప్పెదరు. దేవతలు ప్రజాపతి వీర్యమునుండి జనించిరి’ అను ఐతరేయకములో పూర్వ వాక్యములో హిరణ్యగర్భ ప్రసంగముండుటవలన

వాక్యభేద భయముచే దానినే ఆత్మ శబ్దముతో చెప్పిరని స్వీకరించుట ఉచితము. ఈ దృష్టాన్త సంగతి వలన ఈ అధికరణమును ఆరంభించిరి.

విషయము:- " ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీన్నాన్యత్కిఞ్చనమిషత్" (ఐత.1.1.) అనిన " నిశ్చయముగా సృష్టికి పూర్వము ఈ నామరూపాత్మక జగత్తు అద్వితీయ ఆత్మరూపముగనే ఉండెను, దాని కన్న భిన్నము ఏదియూ లేదు". ఈ వాక్యములో వచ్చిన ఆత్మ శబ్దముయొక్క విచారము ఈ అధికరణములో చేసెదరు.

సంశయము:- ఇచట ఆత్మ శబ్దముతో హిరణ్యగర్భమును చెప్పుచున్నారా లేక పరమాత్మనా?

పూర్వపక్షము:- " ఆత్మైవేదమగ్ర ఆసీత్పురుషవిధః" (బృ.1.4.1.) అనిన "సృష్టికి పూర్వమున ఉన్న ఆత్మ(హిరణ్యగర్భుడు) మనుష్యాకారుడై ఉండెను" ఈ శ్రుతి మరియు "స వై శరీరీ ప్రథమః" అనగా "ఆ హిరణ్యగర్భుడే శరీరధారులలో మొదటివాడు" అను స్మృతి అనుసారము పారమేశ్వరాధీనమైన ఇంకొక పురుషుని ద్వారా లోకసృష్టి జరుగును. "స ఈక్షత లోకాన్ను సృజా ఇతి" (ఐత.1.1). ఈ వాక్యములో లోకములను సృష్టించువాడు హిరణ్యగర్భుడని వినిపించుచున్నది. భూతముల సృష్టి వినిపించుటలేదు. ఆవు మొదలగువాని సృష్టిగూడ వినిపించుచున్నది. అందువలన హిరణ్యగర్భుడే ఆత్మ శబ్దార్థము.

సిద్ధాన్తము:- ఈ సృష్టి వాక్యములో ఆత్మశబ్దముతో పరమాత్మనే చెప్పిరి. ఏ విధముగా "తస్మాద్వా ఏతస్మాదాత్మనః ఆకాశ సమ్భూతః" ( తై,2.1.2). అన్య సృష్టి వాక్యములలోగూడ ఆత్మ శబ్దముతో పరమాత్మనే గ్రహించెదరు. అటులనే ఇచటగూడ స్వీకరించవలయును. భూతముల సృష్టి ఇచట ఉపసంహారము గావించిన పరమాత్మ గ్రహణమే ఉచితమగును. ఆవులను దేవతల ప్రవేశమును చూపించుట అర్థవాదము అనగా స్తుతి. ఆత్మతత్వమును ప్రతిపాదించుటయే శాస్త్రముయొక్క అభీష్టము.

వైయాసికన్యాయమాలా:-

231. ఆత్మా వా ఇదమిత్యత్ర విరాట్-స్యాదథవేశ్వరః |భూతాసృష్టేర్న్వ శ్వరః స్యాద్గవాద్యానయనాద్విరాట్ ||

232. భూతోపసంహృతేరీశః స్యాదద్వైతావధారణాత్ | అర్థవాదో గవాద్యుక్తిర్బ్రహ్మాత్మత్వం వివక్షితమ్ ||

" ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్" ఈ శ్రుతిలో ఆత్మశబ్దముద్వారా విరాట్ పురుషుని గ్రహణమగుచున్నదా లేక ఈశ్వరుని గ్రహణమగుచున్నదా? అను సంశయమునకు విరాట్ పురుషుని గ్రహణమగుచున్నది కాని ఈశ్వరుని గ్రహణమగుట లేదనును పూర్వవాది ఎందులకనగా ఆవును తెచ్చుట మొదలగునవి శరీరముతోనే జరుగుట సంభవము అంతేగాక భూతముల సృష్టి నిరూపణము లేదు. సిద్ధాన్తి సమాధానము. విరాట్-పురుషుని గ్రహణమగుటలేదు కాని ఈశ్వరుని గ్రహణమే అగుచున్నది ఎందులకనగా అద్వైతముయొక్క అవధారణము అనగా నిశ్చయము కావలయును మరియు భూతముల ఉపసంహారము చేసిన ఈశ్వరునే శాస్త్రము చెప్పదలచినదని తెలియును, ఇంక ఆవుని తెచ్చుట అనునది స్తుతిమాత్రము.

భారతీ తీర్థుల వారి వ్యాఖ్య:-

" ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్" అను శ్రుతి వాక్యములో గల ఆత్మశబ్దముద్వారా విరాత్-పురుషుని గ్రహించవలయును కాని ఈశ్వరుని గ్రహించరాదు ఎందులకనగా . "స ఈక్షత లోకాన్ను సృజా ఇతి" (ఐత.1.1). అను వాక్యముద్వారా ఐదు భూతముల సృష్టి చెప్పక కేవలము లోకముల సృష్టిని చెప్పిరి కనుక. తైత్తిరీయోపనిషత్తు, ఛాందోగ్యోపనిషత్తు మొదలగువానిలో ఈశ్వరుని ప్రకరణములో భూతసృష్టిని గుఱించి చెప్పిరి. మరియు ఆ దేవతల కొరకు ఆవుని తీసుకొని వచ్చెను అను వాక్యము శరీరముగల విరాట్-పురుషుని ద్వారానే సంభవము, అశరీరీ అయిన పరమాత్మలో యుక్తి సంగతము కాదు. అందువలన శ్రుతిలో ఆత్మ శబ్దముద్వారా విరాట్-పురుషుడే వివక్షితార్థము. దీనికి సిద్ధాన్తి సమాధానము " ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్". ఈవాక్యములోని 'ఏక ఏవ' అను అవధారణమువలన ఇచట ఆత్మ శబ్దముతో ఈశ్వరునే చెప్పుచున్నారు. కాన అన్య శాఖలలో చెప్పిన భూతముల సృష్టిని ఇచట ఉపసంహారము చేసికొనవలయును. మరి ఆ దేవతల కొరకు ఆవుని తీసుకొని వచ్చెను అనునది కేవలము అర్థవాదము దానిజ్ఞానము స్వతంత్రముగా పురుషార్థము కాదు. ఒకవేళ భూతార్థవాదమని స్వీకరించినను విరాట్-పురుషునిద్వారా ఈశ్వరుడే ఆవుని తీసుకొని వచ్చును. ఆ దేవతల కొరకు ఆవుని తీసుకొని వచ్చెను అని వినిపించుచున్న వాక్యము అర్థవాదమని స్వీకరించిన, ఆ అర్థమును చెప్పు శ్రుతి అర్థము అవివక్షితమని ఎవరైన ప్రశ్నించిన అటులనుట సరికాదు. ఎందులకనగా జీవ-బ్రహ్మల ఐక్యము వివక్షితము. " ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్" అని ఉపక్రమము చేసి "స ఏతమేవ పురుషం బ్రహ్మ తతమమపశ్యత్" "ప్రజ్ఞానం బ్రహ్మ" అను వాక్యములద్వారా ఈశ్వరునితోనే ఉపసంహారము చేసిరి. అందువలన ఆత్మ శబ్దముతో ఈశ్వరునే గ్రహించవలయును.

### 375. ఆత్మగృహీతిరిరవదుత్తరాత్. 3.3.16.

సూత్రార్థము:- " ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్" అనగా 'సృష్టకి పూర్వము ఈ జగత్తు అద్వితీయ ఆత్మరూపముగనే ఉండెను' అను సృష్టి వాక్యములలో ఆత్మశబ్దముతో పరమాత్మనే గ్రహించుచున్నారు గాని హిరణ్యగర్భాదులను కాదు. ఏ విధముగా "ఆత్మన ఆకాశః" అనగా 'ఆత్మనుండి ఆకాశము ఉత్పన్నమయినది' ఇత్యాది శ్రుతులలోగూడ ఆత్మశబ్దముతో పరమాత్మనే గ్రహించుచున్నారని అగుననే ఇచట తెలిసికొనవలయును. ఎందులకనగా "స ఈక్షత లోకాన్నుసృజా ఇతి", "స ఇమాంల్లోకానసృజత" అనగా 'ఆ పరమాత్మ లోకములను సృష్టంచెదనని విచారము చేసెను' మరియు 'ఆతడు ఈ లోకములను సృష్టించెను' ఈ శ్రుతులలో ఆ పరమాత్మ సంకల్పపూర్వకముగ సృష్టించెనని సృష్టికర్తరూపముగా విశేషణము కలదు. మరియు ఆ విశేషణము అన్య శ్రుతులలో ముఖ్యరూపముగా పారమాత్మలోనేనని తెలిసికోనవలయును.

ఆత్మ శబ్దము జీవాత్మపరకమగుటవలన దాని యథార్థ భోధకొరకు ఆనందాది ధర్మములన ఉపసంహారము అవసరములేదు అని పూర్వపక్షి మతము. సిద్ధాంన్తి ఇచట ఆత్మ శబ్దముతో పరమాత్మనే స్వీకరించవలయును అందువలన

యథార్థ భోధకు ఆనందాది ధర్మములను ఉపసంహారము చేయవలయునునును. " ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్ నాన్యత్కించనమిషత్" (ఐత.1.1.)అనగా 'నిశ్చయముగా సృష్టికి ముందు ఈ నామారూపాత్మక జగత్తు అద్వితీయ ఆత్మస్వరూపగనే ఉండెను దానికన్న భిన్నమైనది కొంచముగూడ ఏదియూ లేదు'. ఈవాక్యములోని ఆత్మశబ్దము యొక్క అర్థము హిరణ్యగర్భమా లేక పరమాత్మయా అను సంశయమునకు పూర్వపక్షి చెప్పునది. "ఆత్మైవేదమగ్ర ఆసీత్పురుషవిధః" (బృ.1.4.1.) అనగా 'సృష్టికి ముందు ఈ నామరూపాత్మక జగత్తు పురుషాకారమైన ఆత్మరూపమే'. ఈ శ్రుతి మరియు "స వై శరీరి ప్రథమః" అనగా 'నిశ్చయముగా ఆ హిరణ్యగర్భుడే మొదటి శరీరధారయై ఉండెను'. ఈ స్మృతి ద్వారా పరమేశ్వరాధీన అపర పురుషుని వలననే లోకసృష్టి జరిగినదని నిశ్చయమగుచున్నది. "స ఈక్షత లోకాన్నుసృజా ఇతి" , (ఐతరేయ.1.1.) 'ఆతడు విచారము చేసి నేను లోకములను సృష్టి చేసెదను' ఈ శ్రుతిలో లోకములను సృష్టించునది హిరణ్యగర్భుడేనని నిశ్చయమగుచున్నది. సిద్ధాంన్త పక్షమునుండి చెప్పినది. సృష్టి వాక్యములో ఆత్మ శబ్దముద్వారా పరమాత్మనే గ్రహించవలయును మరి ఎవరిని కాదు. "తస్మాద్వా ఎతస్మాదాత్మన ఆకాశః సమ్భూతః" ( తై.2.1.1.) 'ఆ పరమాత్మనుండి ఆకాశము ఉత్పన్నమయినది'. మొదలగు ఇతర సృష్టివాక్యములలో ఆత్మశబ్దముద్వారా పరమాత్మనే గ్రహించిరి. ఆలాగుననే ఇచటగూడ తెలిసికొనవలయును. చెప్పిన శ్రుతులలో మరియు స్మృతులలో హిరణ్యగర్భుని గ్రహించుట సంభవముకాదా అనెదవేమో అట్లనుట సరికాదు ఎందులకనగా పురుషవిధమను విశేషణముల కారణముగా హిరణ్యగర్భుని గ్రహించుట సంభవమయినను మిగిలిన విశేషణముల కారణముగా హిరణ్యగర్భుని గ్రహించుట సంభవముకాదు. ఇచట లోకసృష్టి మొదలగు విశేషణములు పరమాత్మను చెప్పుటకు అనుకూలములు అందువలన పరమాత్మను గ్రహించుటయే ఉచితము.

### 375. అన్వయాదితి చేత్స్యాదవధారణాత్. 3.3.17.

సూత్రార్థము:- లోకసృష్టివాక్యమును విచారించిన హిరణ్యగర్భునిలోనే ఈ సృష్టి వాక్యము అన్వయమగుచున్నటుల కానవచ్చుచున్నది అందువలన ఇచట పరమాత్మ గ్రహణము సరికాదు అని ఎవరైనను సంశయము వెల్లడిచేసిన అచట సిద్ధాన్తి చెప్పు సమాధానము. "ఆత్మా వా" అను శ్రుతిలో ఏకత్వముయొక్క అవధారణము లేక నిశ్చయము కలదు మరియు ఆ అవధారణము పరమాత్మలోనే సామంజసము, అందువలన ఇచట పరమాత్మ గ్రహణమే చేయుటయో యుక్తిసంగతము.

లోకసృష్టివాక్యముల పర్యాలోచనముద్వారా హిరణ్యగర్భునిలోనే ఈ సృష్టి వాక్యము అన్వయమగుచున్నటుల కానబడుచున్నది. అందువలన ఆత్మ శబ్దముద్వారా పరమాత్మను గ్రహించుట ఉచితముకాదు. అనిన సిద్ధాన్తి చెప్పినది. ఆత్మ శబ్దముద్వారా పరమాత్మ గ్రహణమే యుక్తిసంగత" ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్" . అనిన 'నిశ్చయముగా సృష్టికి ముందు ఈ నామారూపాత్మక జగత్తు అద్వితీయ ఆత్మస్వరూపగనే ఉండెను' ఈ శ్రుతి వాక్యములో పరమాత్మఅర్థగ్రహణము సృష్టికి పూర్వము ఉచితము ఎందులకనగా ఆత్మయొక్క ఏకత్వ నిశ్చయము యుక్తిసంగతమని ప్రతీతమగు చున్నది. లోకసృష్టి వాక్యము అన్య శాఖలలో ప్రసిద్ధమైన మహాభుతముల సృష్టి తరువాత లోకసృష్టిని గుఱించి చెప్పరని యోజన కావించవలయును. అందువలన ఆత్మశబ్దముద్వారా పరమాత్మ గ్రహణమే ఉచితము. (ప్రథమ వర్ణకము సమాప్తము.)

# 109. ఆత్మగృహీత్యధికరణము.

(ద్వితీయ వర్ణకము)